,

SOME OF THE PAGES ARE MISSING FROM 18AND 19 22 AND 23

రామదాసు

దాసబోధ

నందిగామ, 1929

Record no. 81

Rāmadāsu

Dāsabōdha

Nandigāma, 1929

Record no. 81

Bibliographic Record Target

రామదాసు.
దాసబోధ / సమర్థ రామదాసస్వామి ; సంపాదకులు శేషాద్రిరమణకవులు ; అనువాదకుడు కొణకంచి చక్రధరరావు. - 1. కూర్పు. - నందిగామ, కృష్ణా జిల్లా : శేషాద్రిరమణకవులు, 1929.
Multiple Pagenation. ;22 cm.
Record no. 81

Rāmadāsu.
Dāsabōdha / Samardha Rāmadāsasvāmi ; sampādakulu Śēṣādriramaṇakavulu ; anuvādakuḍu Koṇakañci Cakradhararāvu. - 1. kūrpu. - Nandigāma, Kṛṣṇā jillā : Śēṣādriramaṇakavulu, 1929.
Multiple Pagenation. ;22 cm.
Record no. 81

శ్రీ కాకతీయగ్రంథమాలలో నాలుగవకుసుమము.

సంపాదకులు: శేషాద్రిరమణకవులు, శతావధానులు.

దాసబోధ

శ్రీ ఛత్రపతి శివాజీమహారాజులకు గురువగు
శ్రీ సమర్థ రామదాసస్వామి రచించినది.

అనువాదకుడు: కొణకంచి చక్రధరరావు.

ప్రకాశకులు, పరిష్కర్తలు:
శేషాద్రిరమణకవులు, శతావధానులు,

1929

మొదటికూర్పు 1100 ప్రతులు.

గ్రంథారంభమునుండి మొదటి 28 ఫారములు భవాని ప్రెస్సునందును
మిగిలినగ్రంథమంతయు బెజవాడ [illegible] ప్రెస్సునందును ముద్రితము.

ప్రతి 1 కి రు 5-0-0. పోస్టేజి ప్రత్యేకము.

వలయువారు:—

శేషాద్రిరమణకవులు, శతావధానులు,

నందిగ్రామము, కృష్ణాజిల్లా.

అని వ్రాయవలెను.

అంకితము

ధర్మసంస్థాపకుఁడును అవతారపురుషుఁడును, లోకోద్ధారకుఁడును
శ్రీ శివాజిచక్రవర్తికి గురువరేణ్యుఁడును
గ్రంథకర్తయునగు
శ్రీ సమర్థ రామదాసస్వామి
చరణకమలములయందీ యాంధ్రానువాదము సమర్పించి
కృతార్థుఁడ నగుచున్నాఁడను.

భక్తజనవిధేయుఁడు,

అనువాదకుఁడు.

అనువాదక విజ్ఞప్తి

ఆర్యులారా!

దాసబోధయను నీ యుత్కృష్టగ్రంథము మహారాష్ట్రభాషలో రచించిన మహాత్ముఁడగు శ్రీ సమర్థ రామదాసస్వామి జీవితము దాసబోధ ప్రశస్తితెలుపు అనుబంధము లిందుఁ గలవు. విశేషాంశములను విఖ్యాతపండితకవులును వాఙ్మయసేవకులు నగు మా శేషాద్రిరమణకవుల పీఠికవలన నింకను విశదమగునని నే నాప్రశంస మానుకొంటిని.

ఈగ్రంథమును దెనుఁగులోనికి ననువదించుమని మిత్రులు మిగులఁ బ్రోత్సహించిరి. క్లిష్టభావములుగల యీ యుత్తమగ్రంథమును దాదాపు సంవత్సరము శ్రమపడి యాంధ్రీకరించితిని. ఈ యాంధ్రీకరణమునకుఁ దాత్కాలికముగఁ గలిగిన భక్త్యుద్రేకమే కారణముగాని నా శక్తిసామర్థ్యములు కారణములుగావు. గ్రంథము పూర్తియైనపిమ్మట లోపములను సంస్కరించి పలుమాఱు పఠించి గుణములనలరించి ముద్రణాధికారము గ్రంథస్వాతంత్ర్యము [illegible] సర్వాంగసుందరముగ వ్యయప్రయాసల కోర్చి ప్రచురించి పల్లెటూరువాసినగు నన్నుఁ గృతార్థుని గావించిన శ్రీ శేషాద్రిరమణకవులకు వందనముల నర్పించెదను.

ఇట్లు అనువాదకుఁడు,

కోణకంచి చక్రధరరావు.

సంపాదకీయ భూమిక

ఈదాసబోధ శ్రీసమర్థ రామదాసస్వామి రచించిన మహారాష్ట్రగ్రంథమున కనువాదము. దాసబోధ ప్రశస్తియు శ్రీసమర్థునిజీవితము నుదెలుపు ప్రత్యేకవ్యాసము లీగ్రంథమునఁ జేర్చితిమి గాన నాయాభాగములు వదలి గ్రంథప్రచురణమునుగూర్చి యించుక వ్రాసెదము.

దాసబోధ మహారాష్ట్రులు మిగులనభిమానముతో గౌరవించు పవిత్రగ్రంథము. ఎందఱో మహారాష్ట్రభాషలో నీగ్రంథమును ముద్రించిరి. అందు ధులియాలోని సత్కార్యోత్తేజకసమితివారు ప్రచురించిన ప్రతి శుద్ధముగను సుపరిశోధితముగను నున్నది. దీని ననుసరించియే హిందీయనువాదము ప్రచురింపఁబడెను. ఈయాంధ్రానువాదము చాలవఱకు హిందీయనువాదము ననుసరించి చేయఁబడినను గొన్నితావుల మూలగ్రంథమునుండియు గుజరాతీఅనువాదమునుండియు విషయసమన్వయమునకు భావములఁ గైకొనవలసివచ్చినది. హిందీదాసబోధలో మొదటికూర్పునఁగలయంశములకు రెండుమూఁడు కూర్పులలోఁగలయంశములకు భేదముగలదు. ఇన్నిటిని సమన్వయించుటచే నీదాసబోధ యించుకగ హిందీప్రతి కందేని భిన్నముగనున్నను జాలవఱకుఁ జేరువలో నుండును. ఈగ్రంథమును మూలానుసారముగ మామిత్రులగు శ్రీయుత కోణకంచి చక్రధరరావుగారు ది 10-2-26 తేది నాంధ్రింపనారంభించి 4-11-27 తేది పూర్తిచేసిరి. ప్రచురణవిషయమున నవకాశములున్నచో విచారింపుఁడని లిఖితప్రతిని అనువాదకులు మాకొసంగిరి. తదాదిగ గ్రంథమండలులకు, గ్రంథప్రకాశకులకు నీగ్రంథమును బ్రచురించుకొండని పలుమాఱు వ్రాసితిమి. పెద్దగ్రంథమనియుఁ, దీరికలేదనియు, గ్రంథము పంపిన వీలువెంట యోచింతుమనియుఁ బ్రత్యుత్తరమొసంగిరి. ఈయవకాశములో భాషాంతరీకరణమును మేము పలుమాఱు జదివితిమి. హిందీప్రతితోఁ బోల్చిచూచితిమి. మహారాష్ట్రపద్యములతోఁగూడఁ బోల్చిచూచితిమి. ఆంధ్రీకరణము సమంజసముగ నుండెను. ఈగ్రంథరత్న మాంధ్రవాఙ్మయమున కపూర్వాలంకారమని తోఁచెను. కాని

ప్రచురించుమార్గ మెద్ది? ముద్రణశాలకేగి విచారింప రు 2000 లు వెచ్చించినఁగాని ప్రతులు 1000 ముద్రింప వీలుకాదనిరి. మేమా నిర్ధనులము. ఆంధ్రుల కీసమర్థరామదాసస్వామి సందేశము వినిపింపవలసిన శుభావసరము వచ్చినది. ఎట్లు నిర్వహింపవగునని తికమకపడితిమి. మాపరిస్థితులు మున్నొకమాఱు భారతిలో నివేదించుకొంటిమి.

"నాకే భాగ్యముకల్గెనేని కవితానందానుసంధాన భా
షాకావ్యంబులతోడ రేయిపవల్ సాఫల్యముం జేసి వి
ద్యాకాంతన్ జరియింపకుందునె? దరిద్రత్వుణ్ణనిర్మాంసశ
ల్యాకారంబుగనుంటి నెట్టులిఁక నీయాంధ్రాశ చల్లారునో".

ఈతృష్ణయే గ్రంథప్రచురణమునకు మమ్ము తొందరించెను. ఉదారభావమును సర్వస్వామ్యములతో అనువాదకులు మాకీ గ్రంథ మొసంగిరి. కర్తవ్యము తోఁచక త్రొక్కులాడుతటి నంది గ్రామములో నుద్యోగవశమున వసించియున్న మామిత్రులును ధర్మస్వభావులునగు శ్రీ దేవరకొండ రామమూర్తిగారు ప్రోత్సహించి మీకు జయము చేకూరును. గ్రంథప్రచురణమునకు సాహసింపుఁడనియు శక్తికొలఁది తోడ్పడుదుమనియు సెలవిచ్చిరి. పలువురుమిత్రులు శక్తికొలఁది గ్రంథవ్యాప్తికిఁ బ్రయత్నింతుమనిరి. దాసబోధ ప్రశస్తితెలుపు కరపత్రము నొకటిప్రచురించి ముందు సొమ్మొసంగినచో ఆంధ్రదాసబోధ రు 4 లకు ఒసంగుదుమని ప్రకటించితిమి. ఎందఱో భాషాభిమానులభిమానించి తోడ్పడిరిగాని కావలసిన ధనములోఁ గొంతమాత్రమే సమకూరెను. మా శక్తి కతీతమగు పనియని నిరుత్సాహపడితిమి. ముద్రణశాలాధికారులు అనువాదమునకు శుద్ధప్రతివ్రాయకున్నచో ముద్రింప నవకాశము చిక్కదనిరి. ఆధునిక సంప్రదాయానుసారముగ భాషాసంస్కరణము లుచితపదప్రయోగము నెలకొల్పి విస్తృతములుగనున్న మకుటములుతగ్గించి రచనమును స్వతంత్రభాషవలె సంస్కరింపవలెననుకోర్కి జనించెను. అనువాదకులు మాతలంపున కామోదించిరి. మూలగ్రంథము మహారాష్ట్రగ్రంథము చెంతనుంచుకొని ది 20-6-28 తేదిని శుద్ధ

ప్రతివ్రాయ నారంభించి యెనిమిదిమాసములకుఁ బూర్తిచేసితిమి. మామిత్రులీమార్పుల కామోదించిరి. ముద్రణమునకుయత్నించుసరికిఁ జేతరొక్కము చాలతక్కువగనున్నను సాహసించితిమి. సిద్ధసంకల్పుఁడు, అమోఘవ్రతుఁడు, మృతజీవుఁడు నగు శ్రీసమర్థరామస్వామి మాహృదయముల నావరించి యెన్నియంతరాయములుకలిగినను ఎన్నివిషమపరిస్థితు లేర్పడినను ప్రోత్సహించినకతన నేఁటి కీ యాంధ్రానువాదమును బ్రచురింపఁ గలిగితిమి. ఆంధ్రసోదరు లీగ్రంథప్రశస్తిని గమనించి యాదరింతురేని మేము ధన్యులము.

సమర్థరామదాసస్వామి దేశపర్యటనము గావించుతఱి ఆంధ్రదేశమునఁ జిరకాలము నివసించి తన సంప్రదాయమును వ్యాప్తిగావించెననియు శివరామదేశికుఁడను నొక విద్వాంసుని ఆంధ్రదేశమునందలి మఠమున కధిపతిని గావించెననియు ఆంధ్రమున సమర్థుఁ డనేకగ్రంథములు రచించెననియు మహారాష్ట్రగ్రంథములలోఁ గలదు. మన దురదృష్టవశమున నింతవరకు శ్రీ సమర్థుని యాంధ్రకవితారసము గ్రోలుటగాని యతనిచే స్థాపితమైన మఠమును దర్శించుటగాని తటస్థింపదయ్యె. పరిశోధకు లిందులకెంతేని కృషిచేయవలసి యున్నది.

సమర్థ రామదాసస్వామి కేవల వేదాంతిగాదు. ప్రవక్త. ధర్మస్థాపకుఁడు. శాంతిదూత. శివాజిచక్రవర్తి నాధారముగఁ జేసికొని ఆర్యావర్తమున నీయన ధర్మసంస్థాపనము గావించి యవతార పురుషుఁడని పేరొందెను. ఆయన యాదర్శములకెల్ల నెలవగు దాసబోధ నెంతేని ప్రశంసింపవలసియున్నది. ఆత్మ, వ్యక్తి, సమాజము; దేశముల కుపకరించు హితోపదేశ మెంతేని యీ గ్రంథరాజమునఁగలదు. ఇందలి పూర్వార్థము పరమార్థాభ్యుదయమునకు ఉత్తరార్థము సాంసారికాభ్యుదయమునకు నుపకరించునుగాన మానవజాతి కీగ్రంథరాజము సర్వకాల సర్వావస్థలందును సరిపడును. వేదవేదాంతాదులలోఁ బ్రతిపాదితములగు తత్త్వసారముల నెఱింగించునదిగాన యీగ్రంథ మాస్తికుల కందఱకును బఠనయోగ్యము. స్వాతంత్ర్యబీజములు సమకాలికుల హృదయములలో నంకురింపఁజేసిన శివాజియంతటి త్యాగమూర్తిచేఁ జిరపత

నీయమగుటచే నీ గ్రంథము సందిగ్ధావస్థలోనున్న మాతృదేశమునకు విజ్ఞానమును బ్రసాదించుననుటకు సంశయింపఁ బనిలేదు. దాసబోధను రామదాసస్వామినిగూర్చి శ్రీ. కె. వి. లక్ష్మణరావుపంతులవారిటుల వ్రాసియున్నారు.

“ మనోజిజ్ఞాసయు మతోపదేశంబును మానవులకు సంసారమునందువిరక్తి గలుగునటులఁ జేయుననియు జ్ఞానోపదేశముయొక్క పరమోద్దేశము సర్వసంగ పరిత్యాగమే యనియు జనసామాన్యము దలంచుచుండ గురూపదేశమువలన శివాజీ మహాంత శూరుఁడయ్యెననియు నైహికరాజ్యము సంపాదించుటయందధికోత్సాహియయ్యెననియు నేను వ్రాయుట చదువరులకు వింతగా నుండును. కాని వివిధదేశచరిత్రములను జక్కఁగ నభ్యసించినవారికి స్వమతాభిమానము స్వదేశాభిమానముగాఁ బరిణమించు ననుసంగతి వింతగా నుండఁజాలదు. మతాభిమానమును మతశ్రద్ధయుఁ బూర్వము దేశాభిమానమునకుఁ బ్రబలపోషకములుగ నుండెను. క్రీ. శ. 1649 నుండి 1660 వఱకు ఇంగ్లండుదేశరక్షకుఁడు (Protector) గానుండిన క్రాంవేలు గెలిచినయుద్ధములన్నియు మతశ్రేష్ఠులగు శూరులసైన్యంబులవలననే యని తద్దేశచరిత్ర చదివిన వారికి విశదమే. ఏవానినైనను సైన్యములోఁ జేర్చుకొనుటకుఁ బూర్వమాతఁడు అమితదేశాభిమానముకలవాఁడా కాఁడాయని క్రాంవేలు ఆలోచించుచుండెను. మతాభిమానులు కానివారల నతఁడు సైన్యములోఁ జేర్ప నేరఁడు. కనుకనే సార్థకనామధేయులగు నతనిలోహకాయు లెచ్చటను బరాభూతులైనవారు కారు. ఇఁక రెండవ యుదాహరణము: హాలండుదేశములో స్థాపింపఁబడిన ప్రజాసత్తాత్మకరాజ్యమంతయుఁ బ్రొటెస్టంటు మతాభిమానముయొక్క ఫలమేయని డచ్ ప్రజాసత్తాత్మకరాజ్యముయొక్కయభ్యుదయము (Rise of the Dutch Republic) అనుచరిత్రరాజము చదివినవారికిఁ దెలిసినవిషయమే. అంతదూరము పోనేల ? సాంఖ్యంబును యోగంబును సమన్వయించి సాంఖ్యయోగంబను శాస్త్రంబునునిర్మించి కర్మబ్రహ్మమీమాంసాప్రతిపాదితంబులగు కర్మజ్ఞానయోగముల నన్వయించి అర్జునునకుఁ గృష్ణునిచే నుపదేశింపఁబడిన గీతాశాస్త్రంబె గొప్పవేదాంతగ్రంథంబని హిందువులందఱును బఠించుచున్నారు. కాని యావేదాంతశాస్త్రంబు అర్జునుని గర్తవ్యాచరణమునకుఁ బ్రేరేపించి యతనిచే స్వధర్మము ననుష్ఠింపఁజేయలేదా ! ఇట్లు నిజమైనమతంబు మనుజుని సంసారపరాఙ్ముఖుని జేయుటలేదు. కర్తవ్యనిష్ఠునే చేయును. కాన శివాజీరామదాసుల చరిత్రము సాంసారికులకును సన్న్యాసులకును ననుకరణీయమే!......

రామదాసు రాజ్యధర్మముల సంపూర్ణముగా నెఱింగినవాఁడు గావునఁ దనదాసబోధయందు రాజ్యప్రకరణములో రాజ్యమును నడుపువిధము, రాజధర్మములు, ప్రజలు సుఖులై రాజభక్తిగలవారుగ నుండునటులఁ జేయు నుపాయములు, సామదానభేద దండములచే అరిని గెలువవలసినవిధము, జితశత్రువుల నాదరించి ప్రేమభావముతో వశపఱచుకొనుమార్గములు మొదలయిన శాసకర్తలకుఁ గావలసినధర్మములను కడు నేర్పుతో నాతఁడు వర్ణించియున్నాఁడు. ఈగ్రంథముయొక్క యీభాగమే కాదు. కడమ గ్రంథమంతయు ననుభవపూర్ణముగను అమృతము చిప్పిలునట్లుగను నుండును.

శివాజీచరిత్రము (6 వ ప్ర)

వేదాంత విషయమునం దీగ్రంథమున నమూల్యములగు ఘట్టములు గలవు. వేదాంతవేత్తలెవ్వరును సమన్వయింపఁజాలని యపూర్వాంశముల నీయన సమంజసముగఁ దెలిపెను. సత్యాద్వైతనిరూపణము, పరమాత్మనిశ్చయము, మోక్షలక్షణము, బ్రహ్మనిరూపణము, ఆత్మజ్ఞానము, జ్ఞానోపదేశము, లఘుబోధ మున్నగు సమాసములు వేదాంతరహస్యముల వెల్లడించుచున్నవి. ఈగ్రంథరాజము సన్న్యాసమును బోధింపక గృహస్థాశ్రమముననుండి భజనసహాయమున సంఘము కడతేరువిధముల నెఱింగించుచున్నది. యోగమును వలదనుచున్నది. సంఘమునందలి లోపములను జ్ఞానచక్షుస్సుతో విమర్శించుచున్నది. జాతిలోఁ బాదుకొని జీర్ణించిన దురాచారములను వ్రేలెత్తిచూపి సంఘమునంతయు నూపివేయుచున్నది. వైదికధర్మము నుద్ధరించుచున్నది. ఇంతయేల ! శ్రీసమర్థ రామదాసస్వామి పవిత్రజీవితమున కన్నిటెఱంగుల నీగ్రంథము దార్కాణముగా నున్నది.

అద్వైతదృష్టితోఁ జూచినను వ్యవహారదృష్టితోఁ జూచినను దాసబోధ మిగుల మహత్త్వముగల గ్రంథరాజము. ఈగ్రంథప్రశస్తికి విషయకల్పన మనుకూలముగనున్నది. మొదట మూఁడుదశకములలో ఐహిక జీవితమున మానవుఁడెఱుంగఁదగిన నీతులెన్నేని గలవు. భాగవతమునందుఁ బేర్కొనిన నవవిధభక్తులపై వ్రాయఁబడిన వ్యాఖ్యానమనఁదగు నాలుగవ దశకము ప్రశంసనీయము. సమర్థుఁ డైదవ దశకమునుండి వేదాంతచర్చకుఁ గడంగెను. గురునిశ్చయమునఁ జెప్పఁబడిన యంశ

ములును సద్గురులక్షణమునఁ జెప్పఁబడిన యంశములును సంపూర్ణముగ సమర్థ రామదాసస్వామి కన్వయించును. శిష్యలక్షణము లటులె శివాజి చక్రవర్తి కన్వయించును. ఐదవదశకమంతయు నిటులె సద్గురుసచ్ఛిష్య లక్షణముల కుదాహరణముగ నున్నది. వేదాంతభావము లిటనుండియె సూచింపఁబడెను. ఆఱవదశకము దుర్గమమగు నద్వైత నిరూపణము. సమర్థుఁడు శ్రీ రామానుగ్రహమునను ఆత్మ ప్రతీతివలనను గ్రహించిన యపూర్వ విజ్ఞానమున కీదశకమునుండి యాధారములు లభించును. సమర్థుఁడు సంస్కృతమునను మహారాష్ట్రభాషయందునుగల వేదాంతగ్రంథముల నన్నింటిని గాలించెను. ఎంతటి దుర్ఘటవిషయము నేని సమన్వయించుటలో ఆతని కపూర్వమగు నైపుణ్యముగలదు. వక్తృత్వ మనన్యసాధారణమైనది. ఆచరణమునఁ గళంకమే లేదు. ఆయన యాశయము ప్రపంచోద్ధరణము. కావుననే శివాజియంతటి మహారాజు సమర్థునికడ ముగ్ధుఁడై పాదాక్రాంతుఁడై కనుసన్నలలో మెలంగెను. నిస్సంగుఁడగు తుకారామ్ సమర్థుని మహాత్త్వము దెలుపు సద్గురు నిశ్చయమును బలికెను. దాసబోధయందలి లఘుబోధ శివాజికై ప్రత్యేకముగ రచింపఁబడినది. సృష్టిని గూర్చినకథ సమర్థుని యపూర్వకల్పనాశక్తికిఁ దార్కాణము. ఉపనిషత్తులు, ప్రస్థానత్రయము మున్నగు వేదాంతగ్రంథముల భావము కర్మయోగమని శ్రీలోకమాన్యతిలకుగారు తనకర్మయోగమునందు నుడివియున్నారు. సమర్థుఁడు ఈనిరూపణమునందు లోకమాన్యునకు మార్గదర్శకుఁడుగాననే పలుతావుల దాసబోధనుండి తనవాదమున కాధారములు లోకమాన్యుఁడు గైకొనెను. ఆదర్శపురుషుఁడును సర్వజ్ఞచూడామణియు నగు శ్రీసమర్థ రామదాసస్వామి తనవృత్తాంతము నిట్లు చెప్పుకొనుచున్నాఁడు.

“ఆత్మజ్ఞానము పురాణములను జదువుటచే నెఱుంగఁబడదు. దానిని వర్ణించివర్ణించి వేదములు విసిగిపోయెను. కాని శ్రీసద్గురుమూర్తి యనుగ్రహమువలన నేనిప్పుడు మీకందఱకు దానినే చెప్పుచున్నాఁడను. సంస్కృతము, మహారాష్ట్రము మున్నగుభాషాగ్రంథములందు నాకేమియుఁ బ్రవేశము లేదు. కాని నాహృదయము

నందు కృపామూర్తి యగు సద్గురుస్వామి నివసించి విరాజిల్లుచున్నాఁడు. కావున నిపుడు ప్రస్తుతాంశమును దెలుపుటకు నాకు సంస్కృతప్రాకృత గ్రంథములతో నెట్టియావశ్యకమును లేదు. దాస-౫-౬.”

సమర్థుని నిరాడంబరజీవితమునకును సహజవిజ్ఞానమునకును నుదాహృతభాగములు చాలును. వేమనవలె సమర్థుఁడు తోఁచినయంశము నెల్ల విమర్శించుచుఁ దనకు వెగటుగఁదోఁచిన వెల్ల దూషించుచుఁ బోవ లేదు. చెప్పఁదలఁచినయంశము విస్పష్టముగను సుబోధముగను శాస్త్రానుకూలముగను జెప్పెను. అంతతోఁ దృప్తిజెందక శిష్యులడుగు సందేహములఁ బురస్కరించుకొని సోదాహరణముగ మఱలఁ జర్చించెను. సుబోధార్థమై చెప్పినయంశమును మఱలఁ జెప్పెను. కడకు విసిఁగి యెంతజెప్పినను దెలిసికొనఁజాలరేమియని శిష్యుల నొత్తిపొడిచెను. తత్త్వగ్రహణమున యోగ్యులెవరో తొలుత నిర్ణయించి యేరుకొనిన శిష్యులు విషయగ్రహణమునఁ బరాకువహించినందులకుఁ గినియుట గురుధర్మమే గదా! బ్రహ్మనిరూపణము, మాయానిరూపణము, కేవలబ్రహ్మము, కల్పనానిరసనము మున్నగునంశములలో సమర్థుఁడు తెలిపినయంశము లాతని సర్వతోముఖవిజ్ఞానమునకుఁ దార్కాణముగా నున్నవి. అలౌకికమూర్తియగు శ్రీసమర్థుని యుపదేశరహస్యములు మానవునిఁ గర్తవ్యోన్ముఖుని గావించుటకుఁ దత్త్వరహస్యముల నెఱింగించి వైదికమతాభిమానిని జేయుటకుఁ దగియున్నవి.

ఆర్యావర్తమున ఋషులుసైతము లోకకళ్యాణమునకై శ్రుతిస్మృతీతిహాసముల రచించిరి. వాత్స్యాయనకామందకశుక్రాదులు రాజనీతుల నెఱింగించిరి. బౌద్ధులు తమమతమును గేవలనైతికముగ సంస్కరించిరి. జైనులు ప్రజలకు నిరాడంబరము భక్తిభావము అహింస బోధించిరి. భర్తృహరి ప్రముఖులు సర్వకాలసర్వావస్థలందు మానవజీవితమున కుపకరించు నీతివైరాగ్యబోధకములగు గ్రంథముల రచించిరి. శంకరుఁడు, రామానుజుఁడు, మధ్వస్వామియు, భాష్యముల రచించి వేదాంతచర్చలలోఁ బాల్గొనిరి. అంతియగాని సంక్షుభితమైయున్న

ఆర్యావర్తమును మేల్కొల్పి స్వాతంత్ర్యసంపాదనమునకు హితవెఱింగింపరైరి. మాధవవిద్యారణ్యులు ఆంధ్రసామ్రాజ్యము విచ్ఛిన్నమైనపిదప విద్యానగరసామ్రాజ్యమును స్థాపించుటకుఁ బ్రోత్సహించి హరిహరరాయలను బుక్కరాయలను ముందునకుఁ ద్రోచెను. అనంతర మాయన సన్న్యాసము స్వీకరించి పీఠాధిపతియయ్యెనేగాని పరాధీనమగుజాతి నుద్ధరింపఁ దలంపలేదు. తిక్కనసోమయాజి, తిమ్మరుసుమంత్రి, కార్యఖడ్గప్రవీణులు బ్రహ్మజ్ఞులైయయ్యు ఏకదేశీయమగు గ్రంథరచనమునకుఁ దమసంస్థానపాలనమునకు నుసురులొడ్డిరిగాని ప్రపంచకళ్యాణమునకుఁ బాటుపడరైరి. వేమన లోకమంతయు నజ్ఞానభూయిష్ఠముగనున్నదని కానవచ్చిన దురాచారమును ఖండించెను. నీతిబోధించెను. లోకోద్ధరణమునకు మాత్ర మించుకేనియుఁ ద్రోవఁ జూపలేదు. తులసీదాసు, జ్ఞానదేవు, బమ్మెరపోతరాజు, తుకారాము కేవల భగవద్భక్తులు. ప్రపంచాతీతులు.

సమర్థుఁ డీకవులతెగలోనివాఁడు కాఁడు. కవితాకల్పనమునఁ దిక్కనసోమయాజి, బ్రహ్మచర్యాశ్రమమున భీష్ముఁడు, తత్త్వబోధనమున వేమన, శ్రీరామభక్తిలో లక్ష్మణుఁడు, లోకోద్ధారణమునఁ జాణక్యుఁడు, లోకవిమర్శమునఁ బ్రపంచజ్ఞానమున క్షేమేంద్రుఁడు, ధర్మసంస్థాపమున బోధనాపాటవమున శాంతజీవనమున బుద్ధుఁడు, యుక్తిప్రయుక్తులలో యుగంధరుఁడు, రాజనీతిలో బృహస్పతి. సమర్థరామదాసస్వామి నెలకొల్పిన పీఠములు కావించినలోకోద్ధరణము దెలుపుపీఠిక ప్రత్యేకించి యిందుఁగలదు. సమర్థుని నవతారపురుషునిగా మహారాష్ట్రులు పరిగణించుచున్నారు. శివాజిని సమర్థుని నరనారాయణావతారములుగఁ బలువురు తలంచుచున్నారు. సమర్థుఁడు శివాజిమూర్ధాభిషిక్తుఁడగువఱకుఁ దదేకదీక్షతో మహారాష్ట్రరాజ్యమును వృద్ధికిఁ దెచ్చెను. అనేక క్లిష్టపరిస్థితులలో శివాజికిఁ గర్తవ్య ముపదేశించెను. తనతపస్సు జీవితము శివాజికొఱకు వినియోగించెను. మహాత్ముఁడగు శ్రీసమర్థరామదాసస్వామి నెంతని ప్రశంసింపఁగలము. సన్న్యాసియయ్యు లోకాభ్యుదయమునకు ధర్మసంస్థాపనమునకు జీవితమును ధారపోసి తనశిష్యపరంపరను మఠాధి

పతులను గనుసన్నలలో సంచరింపఁజేసి ఆర్యావర్తమునకు గర్మయోగమును బ్రబోధించి యిహపరలోకములకుఁ ద్రోవఁజూపిన శ్రీసమర్థరామదాసస్వామి జన్మము లోకోత్తరము. అనన్యసామాన్యము.

దాసబోధ బహుభాషలలో ననువదింపఁబడెను. సుప్రసిద్ధుఁడగు రామదాసస్వామిచరిత్ర మితిహాసములందును బురాణములందును భక్తజీవితములందును బ్రచురింపఁబడెను. మహారాష్ట్రదేశమున శివాజిసామ్రాజ్యమును రామదాసస్వామిరాజ్య మందురు. మహారాష్ట్రదేశమున రామదాసస్వామి చిత్రపటములేని భవనములేదనుట యతిశయోక్తి గాదు. సమర్థుఁడు స్థాపించిన మఠములలోఁ బెక్కులిప్పటికిని మహారాష్ట్రదేశమునఁ బలుతావులలోఁ గలవు. సమర్థుని సమాధిచెంత నేటికిఁ బూజాపురస్కారములు జరుగుచున్నవి. శివాజిఛత్రపతి యొసంగిన గ్రామములపైవచ్చు నాదాయముతో సమర్థునివర్థంతి మహావైభవముగా మహారాష్ట్రులు జరుపుచున్నారు. రామదాసస్వామి కృతమగు దాసబోధను యథారూపముగ భావము, ఉద్రేకము, శైలి తగ్గనీక మాధవరావు సప్రేమహాశయుఁడు హిందీభాషలోనికి మార్చెను. ఈయనను హనుమాన్ గఢవర్ధానివాసియు రామదాస మఠాధీశ్వరుఁడునునగు శ్రీధరవిష్ణురామజపే బి. యే. గారు పదమూఁడుమాఱులు పఠించినపిదప హిందీలోఁ బరివర్తనము జేయుమని యాజ్ఞాపించిరి. గురునాజ్ఞ శిరసావహించి గ్రంథరచనమును రాష్ట్రభాషలో మాధవరావు సప్రేగా రనువదించుటచే సమర్థుని బోధనామృతము జనులెల్లరుగ్రోల నవకాశము లభించెను.

హిందీదాసబోధ మహారాష్ట్రగ్రంథమునకు సరిగనున్నదో లేదో చూచి లోపములుసవరింప మహామహులగు హిందీమహారాష్ట్ర విద్వాంసులైదుగు రొకసంవత్సరము శ్రమపడి పరిశోధించి యన్నిరీతుల మెఱుఁగుబెట్టి అమూల్యమగు గ్రంథవిమర్శమును బ్రసాదించి గ్రంథప్రశస్తి నతిశయింపఁజేసిరి. మహారాష్ట్రులు సమస్తవిధముల హిందీభాషాంతరీకరణమునకుఁ దోడ్పడి 1912 లోఁ బ్రచురించినపిదప వేలకొలఁదిప్రతులు వ్యయ

మయ్యెను. లోకమాన్యుఁడు హిందీగ్రంథమునుగూడఁ దానుదాహరణముగఁ గైకొంటినని కర్మయోగమున బ్రచురించెను. ఇందుచే హిందీ దాసబోధ మూలగ్రంథమునకు సరియగు ననువాదముగానఁ జాలవఱకు హిందీననుకరించియే యీయాంధ్రానువాదము రచింపఁబడెను. ఆంధ్రానువాదము ప్రచురించుటలో శ్రీ సమర్థుని దివ్యాశీర్వాదమే తోడైనది. అనువాదమును బరిశోధింప నుపసంఘమును నెలకొల్పయత్నించితిమిగాని అదియు నసాధ్యమయ్యెను. యథాశక్తి గ్రంథ సంస్కరణము గావించి యాంధ్రమాతృచరణసన్నిధి నీ గ్రంథమిప్పటికి సమర్పింపఁగలిగితిమి. విజ్ఞులు లోపములను దెలిపిన రెండవకూర్పున సవరింతుము.

సమర్థుఁడు భద్రాచల రామదాసునకును వేమనకును కర్ణాటకవియగు సర్వజ్ఞునకును సమకాలికుఁడు. సమకాలికగ్రంథములందులేని రాజకీయపరిస్థితులు ప్రజాభావములు, స్వతంత్రోద్యమధర్మములు విశేషించి చర్చింపఁబడిన కతన దాసబోధ లోకోత్తర గ్రంథముగఁ బరిగణింపఁబడెను. కావున గ్రంథసమాలోచకులచే ననుభవపూర్వకముగ విమర్శమున వ్రాయఁబడిన "ఏపని నీగ్రంథము ప్రప్రథమమునఁ జేసిచూపెనో యాపనినే యదిభవిష్యత్కాలమునందుఁగూడఁ జేసిచూపఁదగియున్నద" నువాక్యము పైఁ గలవిశ్వాసమే గ్రంథప్రచురణమునకు మమ్మన్నివిధములఁ బ్రోత్సహించి సిద్ధసంకల్పులఁ గావించెను.

గ్రంథముద్రణమునకు బెజవాడ భవాని ముద్రణాలయమువారు తొలుతకట్టుబాటులుచేసికొని 28 ఫారములు మాత్రము ముద్రించి తమకుఁ దూఁగదని చెప్పిరి. అవలిభాగమంతయు బెజవాడ వాణీముద్రణాలయములో ముద్రింపఁబడెను. కొంతకాల మాంధ్ర విశ్వవిద్యాలయపక్షమున [ఈగ్రంథప్రచురణమునఁ బ్రత్యేకించి కృషిచేయు వేంకటరమణా

చార్యులు అనునేను] మాలోనొకరము మూఁడుమాసములు నిజాము రాష్ట్రమునఁ బర్యటనము గావించుచున్నందునను ఉద్యోగవశమున దూరస్థములలో నున్నందునను ముద్రణలోపములు సంస్కరింప నవకాశము లేకపోయెను. ఈకార్యభారము మామిత్రులును వాణీప్రెస్సులోఁ బండితులునగు బ్రహ్మశ్రీ ప్రతాప వేంకటేశ్వరకవిగారు వహించి మమ్ముఁ గృతార్థులఁ గావించిరి.

ఏకదీక్షగా గ్రంథపఠనము భాషాంతరీకరణపరిశీలనము శుద్ధప్రతిలేఖనము మున్నగు పనిపాటలచే మాకు దాసబోధతో నొకసంవత్సరము ఎడతెగని పరిచయము గలిగెను. సమస్తవిధముల మాజీవితమును సంస్కరించుకొన నీగ్రంథరాజము తోడయ్యెను. చిరకాల సహవాసము చేసిన మిత్రుని యెడబాటువలె నొకగడియయేని దాసబోధ జదువకున్న దోఁచుటలేదు. లోకోత్తరమగు నీపవిత్రగ్రంథము లోకమునకుసైతము ఇటులె యుపకరించెనేని సర్వశక్తులు ధారపోసి గ్రంథము నాంధ్రలోకమునకు సమర్పించిన మేముధన్యులము.

రామదాసస్వామి జీవిత మాకర్షణముగ నుండుటకై యందుఁ దెనుఁగుపద్యములను మేమె వ్రాసితిమి. ఆంధ్రీకరణమున అనువాదకుల యనుమతినొంది కొన్నితావుల విషయము సుబోధమగుటకుఁ బెంచితిమి. మూర్ఖలక్షణమునను దాపత్రయలక్షణములందును ఇతరస్థలములందునుగల మకుటములు తగ్గించి గ్రంథమునఁ జవులూరు తెలుఁగురచనల నలరించితిమి. సాధ్యమగునంతవఱకు గ్రంథము శుద్ధమగు గ్రాంథికభాషలో ననువాదకులు నిర్దుష్టముగనే వ్రాసిరి. కొన్నితావుల ముద్రణస్ఖాలిత్యములు దొరలినవి. ఏయేపద్యమున కేదియనువాదమో తెలియుటకై హిందీగ్రంథమునందువలె నిందును బద్యసంఖ్య యుల్లేఖించితిమి.

అందందుఁ జ్ఞాతసంస్కార దోషములు ఆంధ్రీకరణ ప్రమాదములు నున్నచో ద్వితీయ ముద్రణమున సవరింతుము. గ్రంథప్రచురణమునకు అవకాశము గలుగఁజేసిన అనువాదకులకును క్రయధనము ముందుగ నొసంగి గ్రంథముకొఱకు నిరీక్షించిన పాఠకసోదరులకును మా గ్రంథమాలా పాఠకవర్గమునకును కృతజ్ఞులము.

ఇట్లు భాషాసేవకులు,
శేషాద్రిరమణకవులు, శతావధానులు,
కాకతీయ గ్రంథమాలా
సంపాదకులు.

నందిగామ,
1—4—29.

దాసబోధ గ్రంథ సమాలోచనము.

౧ ప్రస్తావన.

భారతవర్షమునందు గొప్ప తత్త్వవేత్తయను ఖ్యాతిగొన్న శ్రీసమర్థ రామదాసస్వామి సంక్షిప్త జీవితచారిత్రము పాఠకులకు విశదముగఁ దెలిసియేయుండును. ఆతఁడీగ్రంథమునకు "దాసబోధ" యను నామము నిడెను. దాసుఅన రామదాసు. (రాముని సేవకుఁడు) బోధయన ఉపదేశము. అర్థము స్పష్టముగనే యున్నది. సమర్థుఁడు. ఈ గ్రంథముయొక్క ప్రథమసమాసమునందే గ్రంథారంభనిరూపణ మను విషయమును వ్రాసియున్నాఁడు. అందాతఁడు స్వయముగనే సాధారణరీతిగఁ దన గ్రంథమును గూర్చి యాలోచనమును గావించెను. దానిలో నాతఁడు, ఈగ్రంథమును ఆదినుండి యంత్యముదనుక చదివి యాపిమ్మట విషయమునందు మీమతమును ప్రకటింపవలయునని యును, అట్లుగావింపక యొకటిరెండు సమాసములను మాత్రమే చదివి దానివిషయమున మీమతమును స్థిరపఱచుకొనుట యుచితముగాదనియును, పాఠకులకు సూచించియున్నాఁడు. ఈకథనముపై పూర్ణధ్యానమునుంచుకొనియే మేమీ గ్రంథమునుగూర్చి సమాలోచనమును వ్రాయుటకు కూర్చుంటిమి. అనఁగా ఈసమాలోచనమునందు ప్రకటింపబడిన మతముల విచారమును, పాఠకులు సమస్తగ్రంథమును చదివియే గావింపవలయునని వేఱుగ చెప్పవలసిన యావశ్యకత లేదు. ప్రసిద్ధ మహారాష్ట్ర ఇతిహాసాన్వేషకుడగు ప్రొఫెసర్ రాజవాడేచే, వ్రాయబడిన యొక నిబంధమునుండి ఈసమాలోచనమును వ్రాయుటయందు మాకు గొప్ప సాయము లభించినది. కావున రాజవాడే మహాశయున కిచ్చుట ధన్యవాదముల నర్పించుట మేము మాకర్తవ్యముగ భావించుచున్నారము.

౨ గ్రంథరచనము.

శ్రీసమర్థ రామదాసస్వామి రచించిన సమస్తోపదేశ గ్రంథములలో దాసబోధమే గొప్పగ్రంథము. దీనిలో ౨౦ దశకములును ప్రతిదశకమున ౧౦ సమాసములు (అధ్యాయములు)ను గలవు. మొత్తము గ్రంథములో ౨౦౦ సమాసములున్నవి. పద్యసంఖ్య ౭౭౫౧. ఈగ్రంథము పూర్తియగుటకు మెల్లమెల్లగ పది పండ్రెండు వత్సరములు పట్టియుండునని సమాలోచకుల మతము. ఈగ్రంథములోని ఆఱవదశకము నాలుగవసమాసమునందు గతకలియుగమానము ౪౭౬౦ అని వ్రాయబడినది. ఇందువలన నిది శా. శ. ౧౫౮౧ వ సరియగు ౧౬౬౦ క్రీ.శ. నందు వ్రాయబడియుండవచ్చు

సు. శా. శ. ౧౫౬౬ లో శ్రీరామదాసస్వామి తీర్థయాత్రనుండి మరలివచ్చి కృష్ణానదీతీరమున కరిగి వసియించెను. ఈసమయముననే యాతను గ్రంథలేఖనకార్యము నారంభించియుండును. శా. శ ౧౫౭౦-౧౫౭౧ రెండువత్సరములలోననే ఈగ్రంథము పూర్తియయ్యెనని కొందఱు నుడువుచున్నారు. ఒక్కదినముననే ఈగ్రంథము పూర్తిగావింపబడియెనని "మహీపతి" యభిప్రాయము. తాత్పర్యమేమన, దాసబోధను నిర్మించుటయందెంత సమయము పట్టెనో యావిషయము నిప్పుడు నిశ్చయపఱుపజాలము. ఈగ్రంథరచనమంతయును నేదేని నిశ్చితప్రకారమగు క్రమములో లేదు. మొదటి యొనిమిది దశకములదనుక చక్కని కట్టుబాటుతోగూడిన క్రమము గాన్పించును. అపిమ్మట విషయక్రమము సరిగ కలియదు. మొదట కొన్ని యధ్యాత్మవిషయిక సమాసములున్నచో పిమ్మట మరల కొన్ని సమాసములు ఉపదేశవిషయికములు కొన్ని వర్ణనాత్మకములగు సమాసములు వచ్చియున్నవి. దీనికికారణము ప్రచారమునందున్న యొక కథవలన తెలియగలదు. ఆకథయొక్క సారాంశమేమన! శ్రీరామదాసస్వామి తన చంక సంచి (పడిడీ) లో నెప్పుడును సిరా, కలము, కాగితమును, ఉంచుకొనుచుండెను. అతఁడరణ్యమునందెచ్చటెచ్చట తిరుగుచుండెనో అచ్చట, నేదేని వృక్షముక్రింద కూర్చుండి వ్రాయుచుండెడివాఁడు. సమర్థుఁడు. చాలకాలము దనుక నొకే స్థానమునందు నివసించియుండక సంచారముననే జేయుచుండెననుట సత్యము. దాసబోధవంటి గొప్పగ్రంథమును వ్రాయుటకు చాలకాలము దనుక నొకస్థానమునందుండుట యావశ్యకమై యుండెను. కాని యాతఁడెన్నియో స్థానములయందుండెడివాఁడు. మరియు నెప్పుడాతని కిచ్ఛకల్గుచుండెనో అప్పుడే ఏదేని కొంత వ్రాయుచుండెడివాఁడు.

ఈప్రకారముగ వ్రాయబడుచున్నదాని నొకసమాసముగజేయుచు, పదిసమాసములైనపిమ్మట నొకదశకమునుగావించుచు, నీవిధమునగ్రంథము చాలకాలమునకు సిద్ధపరుపబడెను. మొదటిసమాసములయందేమివ్రాయబడియెనో యది కొన్నిదినములయనంతరము రెండవసమాసము వ్రాయుచున్నప్పుడు స్మరణలో లేకుండనోవును. మరియు నొకానొకప్పుడు వ్రాయబడినప్రతిగూడ నేదేనిరెండవస్థానమున నిలిచియుండనోవును. ఈకారణమువలననే విషయక్రమమునందు విసంగత్వము గాన్పించుచున్నది. ఇట్లగుట స్వాభావికమేయగును. మొదటి యొనిమిది దశకములవిషయక్రమము సరిగనుండుటకు శ్రీసమర్థుఁడాయొనిమిదిదశకములదనుకగల విషయములమర్యాదను (వరుసను) మొదటనే నిశ్చితపరచుకొనియుండుటయే కారణమని తోఁచుచున్నది. ఈవిషయము గ్రంథముయొక్క అంతఃప్రమాణమువలన సిద్ధాంతమగుచున్నది. ఈయొనిమిదిదశకముల విషయమర్యాదలను నిశ్చయపరుచుకొనినకారణమువలననే వానిలో

పునరుక్తిలేదు. కాని వానిపిమ్మటగల పండ్రెండుదశకములలో పునరుక్తి చాలగలదు. ఉదాహరణార్థముగచూడుడు. పంచమహాభూతములయుత్పత్తినిగూర్చిన తాత్త్విక విషయము తెన్నియో దశకములలో మాటిమాటికిని గాన్పించుచున్నవి. కొన్నిసమాసములపేళ్లుగూడ నొకటిగనున్నవి. ఈపునరుక్తి కాపైననుడువబడిన కాలాంతరస్థలాంతరములే కారణము. దాసబోధ రచనాసంబంధమగు మఱియొకవిషయము జ్ఞప్తియందుంచుకొనుటకు యోగ్యమైనది గలదు. మహారాష్ట్రీయసాధుచరిత్రకారుఁడగు మహీపతికవి తనసంతువిజయమను గ్రంథమునందిట్లు వ్రాయుచున్నాడు.

స్వామీ ప్రసాదవచనే బోలత్ । కల్యాణ లిఖితె నిజహస్తే ।
పాఠాంతరప్రమాణే సురస్ । ఓవ్యాబోలతీ రామదాస్ ।
తేతోస్వ్యర్ లిహీతసే । ఉత్తర్ నపుసే పరతోని॥

"శ్రీరామదాసస్వామి తనప్రాసాదికవచనములను రసయుక్తములగు ఓవీఛందోరూపములో (అవియన్నియును కంఠాగ్రమునందున్నవోయనునట్లుగ) చెప్పుచుపోయెడివాఁడు. కల్యాణస్వామి (అతనిప్రియశిష్యుఁడు) తనచేతితో నతిశీఘ్రముగ వ్రాయుచుండెడివాఁడు. కల్యాణస్వామి చెప్పినదానిని మరలనడిగెడివాఁడుకాఁడు. (అతనిధారణాశక్తి లేఖనానైపుణ్యము వర్ణనీయమైనది)".

3 గ్రంథమహత్త్వము, దానిసర్వప్రియత్వము.

అన్నివిధములచేతను నికృష్ట (అవనత) దశను పొందియున్న హిందూసమాజమునకు ఐహిక, పారమార్థికమార్గమునుచూపి శాశ్వతసుఖప్రాప్తిని గలిగించుటయే ఈగ్రంథముయొక్క ముఖ్యోద్దేశము. ఐహికపారమార్థిక కర్తవ్యములసంగతిని ఈగ్రంథమునందేవిధముగ నైక్యపరుపబడినదో ఆవిధముగ నింకవేగ్రంథమునందైనను మిగులనరుదుగ నుండనోవును. కేవలము ఏదేని యొకవ్యక్తికి తనఇల్లు వాకిలి కామ్యవ్యాసంగము పిల్లలనిచ్చిపుచ్చుకొనుటయందుగలకర్తవ్యము మాత్రమే ఐహికకర్తవ్యము గాదనియును సమస్తజనసముదాయముయొక్క ఐహికసుఖమును, తనదేశీయసోదరుల సాంసారికసుఖములనుగూర్చి యత్నించుటయందే (పరోపకారమునందే) మనుష్యజన్మముయొక్క సార్థకత్వమిమిడియున్నదనియును, ఈగ్రంథమునందు స్పష్టమగు రీతితో చెప్పబడినవి. గ్రంథనిర్మాణమగుచుండినప్పుడు భావయుక్తులగు ననేకస్త్రీపురుషులు దీనిని వినిరి. ఇది సంపూర్ణమగుటతోడనే యనేకహస్తలిఖితములగు ప్రతులు సమస్తమహారాష్ట్రమునందు వ్యాపించెను. అప్పుడే! జనులదృష్టియెనుటికి గ్రంథము చేరుటతోడనే! యనేకులు దీనినిగూర్చి నానాప్రకారములగు తర్కములను గావింపసాగిరి. దీనిలో త్రికాండధర్మనిరూపణము గలదని కొందరునుడివిరి. ఇది కేవలము వ్యావహారికనీతినిబోధించెడి గ్రంథమని కొందరు చెప్పసాగిరి. పృథక్పృథగ్రూపములో

నీకథనము (పైయూహాలు) సత్యముగాకపోయినను వాస్తవములో సమష్టిరూపముగ (సన్నియనుకలిసి) అవశ్యముగ సత్యమేయని చెప్పవచ్చును. ఈగ్రంథములో జ్ఞాన, కర్మ, భక్తి, వ్యవహారములనుగూర్చిన నిరూపణములుగలవు. ఆకాలముననుండిన వేదాంతులకు దీనిలో కేవల జ్ఞానవివేకములే గాన్పించెను. కర్మయోగులకు కేవలకర్మమార్గప్రతిపాదనమే లభించెను. భక్తులగువారలకు భక్తినిరూపణమే ప్రాప్తియయ్యెను. మరియు కేవలవ్యవహారమునందే దృష్టిగలవారలు వ్యవహారనీతినిమాత్రమేపొందిరి. ఈప్రకారముగ నెవ్వరిదృష్టిఎట్లుండెనో ఎవ్వరిభావమెంట్లుండెనో అట్లే వారలకీగ్రంథము అనుభవమునకువచ్చెను. సరిగ నీస్థితియే ఇప్పటికాలమునకూడ శ్రీసమర్థునిపట్లను అతని గ్రంథములవిషయమునందును జరుగుచున్నవి. ప్రాచీనపద్ధతిని ప్రేమించెడివారలకు (సనాతనధర్మావలంబులకు) సమర్థుండు పూజనీయుండుగానున్నాడు. మరియు నాతనిదాసబోధ ప్రియకరమైనదిగనున్నది. అటులే యాధునికవిద్వాంసులదృష్టిలోగూడ శ్రీరామదాసస్వామి యొకయలౌకికపురుషుడుగ నున్నాడు. మరియు నాతనిగ్రంథములు మిగుల నాదరణీయములైయున్నవి. కాని ఇప్పుడుకొందరు మనుష్యులు తమతమస్వభావములను విచారములను అనుసరించి శ్రీసమర్థుండొకవ్యవహారియనియును అతనిగ్రంథములు రాజనైతికబోధకములనియును సిద్ధాంతపరుపవలయునను యత్నములను గావించుచున్నారు. ఇది వారలభ్రమ. దాసబోధ ఏకదేశీయమగు గ్రంథముకాదు. ఈగ్రంథమేదేని విశిష్టకాలము కొఱకుగాని, దేశముకొఱకుగాని నిర్మింపబడలేదు. దీనితాత్త్విక సిద్ధాంతములు అన్నికాలములయందును అన్నిస్థానములయందును నొకేవిధముగ సంబంధించియున్నవి. ఈగ్రంథము నిర్మింపబడినకాలమున మహారాష్ట్రీయసమాజము విపన్నావస్థయందుండెననుట సత్యము. కాబట్టి యాదేశస్థితినిలక్షించి మహారాష్ట్రుల కుపదేశమొసగబడియెను. కాని యథార్థము నందీగ్రంథము సర్వదేశీయమును, సర్వకాలికమును, మహత్త్వయుతమును నైయున్నది. ఏపనిని ఈగ్రంథము ప్రప్రథమమున చేసిచూపెనో యాపనినేయది భవిష్యత్కాలమునందుగూడ చేసిచూపగలిగియున్నది. ధర్మమునకు గ్లాని (హాని) కలిగినప్పుడు ఈశ్వరావతారముకలుగుచున్నటుల సమాజమును నికృష్టదశయే తెంచినప్పుడు సమాజమునుద్ధరించెడిపని ఈగ్రంథగ్రథితములగు సిద్ధాంతములకే గలదు. ఈగ్రంథ మట్టిసమయములయందు మార్గప్రదర్శకము కాగలిగియున్నది. ఈగ్రంథ మహిమ నెంతదనుక వ్రాయనగును? ఈగ్రంథము మరాఠీభాషయందొక యపూర్వమగు రత్నము. మోరోపంత్, వామనపండిత్ వంటి గొప్పగొప్పకవివరేణ్యులు దీనినిగూర్చి ప్రశంసచేసిచేసి విసిగిపోయిరి. మే మేలెక్కయందున్నారము!

సంక్షిప్తవిషయవర్ణనము.

శ్రీరామదాసస్వామి ఈగ్రంథములోని ౭ వ దశకము ౯ వ సమాసమునందు

గ్రంథలక్షణమునుగూర్చి వివరించియున్నాడు. ఈలక్షణములను గాంచినచో గ్రంథములయం దేముండవలయును? సత్యములగు గ్రంథములెయ్యవి? వానిలో నేయేవిషయములుండును? అనునవి చక్కగ విశదమగును. ఉదాహరణార్థముగ నొకటిరెండుపద్యములను జూపుదుము.

జేణే పరమార్థ వాఢే । అంగీ అనుతాపచఢే ।
భక్తి సాధన ఆవడే । త్యా నావ్ గ్రంథ్ ॥ ౩౦ ॥
జేణే హోయ్ ఉపరతీ । అవగుణ పాలటతీ ।
జేణే చుకే అధోగతీ । త్యా నావ్ గ్రంథ్ ॥ ౩౧ ॥

"పరమార్థమును వృద్ధినొందించునదియు, మనసునం దనుతాపమును బెంపొందఁ జేయునదియు, భక్తియెడఁ బ్రియముగలిగించునదియు, అవగుణములను దొలఁగద్రోయునదియు, అధోగతిని విముక్తిచేయునదియు నగుదానినే గ్రంథమని చెప్పవలెను.

సమర్థుని దాసబోధగ్రంథము సరిగ నీలక్షణములతోడనే కూడియున్నది. ఈప్రపంచమునందు మనుష్యమాత్రులు జన్మించినదిమొదలు మృతినొందుదనుక తనసుఖముకొఱకే యత్నించుచుందురు. కొందరు తమప్రపంచమునందే (గార్హస్థ్యదశయందే) సుఖమున్నటుల భావించెదరు. కొందరు పరమార్థమునందు. ఉభయులును "సుఖ" ప్రాప్తినిగూర్చియే తమయుద్దేశముల నంగీకరించుచున్నను ఇరువురిప్రయత్నములయందును ఫలములయందును భేదముగలదు. ప్రతిమానవుడును తనమార్గమే సత్యమనియును అన్యమార్గము మిథ్యయనియును నుడువును. పరమార్థప్రాప్తిమార్గమున పోయెడివారలసంఖ్య మిక్కిలితక్కువగనుండును. ఏలయన నీమార్గము కఠినతరమైనది. మరియు దీనిలోవిఘ్నములు పెక్కులుగలవు. ధైర్యశాలురగుపురుషులే దానిని దాటిపోగలరు. అధికసంఖ్యాకులగు జనులు స్వార్థమునందే చిక్కియుందురు. కావుననే ఇట్టివారలను, పరమార్థమార్గమునందన్వయింపజేయుటకు సాధుసజ్జనులబోధ పరమావశ్యకమైయున్నది. ఇట్టి స్వార్థపరాయణులగు (సాంసారికులగు) జనులకు వలయు హితబోధనము ఈ "దాసబోధ" గ్రంథమున గావింపబడినది. శ్రీరామదాసస్వామి పరమార్థమునం దెంతపారంగతుడుగనుండెనో వ్యవహారమునందుగూడ నంతే కుశలుడును దక్షుడును నైయుండెను. "ప్రాపంచికకార్యములను యథోచితరీతిగ నెరవేర్చుచు పరమార్థసాధనము గావించుచుండవలయునను నుపదేశమునే యాతం డీగ్రంథమున గావించెను. గృహస్థధర్మముతో నింటియందుండి సాంసారికసంబంధములగు కృత్యములనన్నిటిని నీతిపూర్వకముగ జేయుచు శుద్ధాంతఃకరణముతో నీశ్వరుని భజియించుచున్నచో, నిస్సందేహముగ

పరమార్థసుఖప్రాప్తి కాగలదు." ఉచితమును, యథార్థమును నగు నీయుపదేశమే ఈగ్రంథమునం దొసగబడినది. శూరులకు రణభూమి ఎట్లుపరీక్షస్థానమో అట్లే సత్యమగుజ్ఞానమునకు పరీక్షస్థానము ఈయసారమగుసంసారమే. జనసముదాయమునుండి వేరై పరమార్థప్రాప్తి కెవ్వఁడు ప్రయత్నించుచున్నాడో వానికంటె సంసారమునందుండి పరమార్థప్రాప్తిగావించెడిపురుషుఁడు అధికశ్రేష్ఠుఁడును, ధన్యుఁడును, నైయున్నాడు. ఈభవసాగరమునకు భయపడి దూరముగపారిపోగోరెడివాడు పిరికిపంద. సమర్థుడు తనమనోబోధయం దిట్లు నుడువుచున్నాడు.

భవాచ్యాభయేకాయభీతోవిలండీ।
ధరీరేమనాధీరధాకానిసాండీ॥

"ఓపిరికిపందా! నీవు ఈభవభయమువలన నేలభీతి నొందుచున్నాడవు? ఓరీ! ధైర్యమునవస్కుఁడవు గమ్ము. మరియు భయమును త్యజించివేయుము."

ఈగ్రంథము గురుశిష్యసంవాదరూపముగ వ్రాయబడినది. మొదటిదశకప్రారంభమునందు గ్రంథనామమునువివరించి దానిలో నేయేవిషయములుగలవో, యావిషయముల ప్రతిపాదనమే యేప్రాచీనగ్రంథప్రామాణ్యములపై గావింపబడియెనో వానిపాఠకాధికారులెవ్వరో, వానిని చదువుటవలన లాభమెద్దియో యను విషయములు తెల్పబడినవి. దీనితర్వాత ప్రాచీనమగు శిష్టాచారపద్ధతిననుసరించి మంగళాచరణమును నుడివి సద్గురువును, (సంతు) సజ్జనులను వందనము గావింపబడినది. శ్రోతలను ప్రార్థించి కవులను ప్రశంసింపబడినది. సభనువర్ణించి పరమార్థముయొక్క శ్రేష్ఠత తెల్పబడినది. ఈదశకాంతమున నరదేహయోగ్యతనుదెల్పి దానిని గొప్పపరుపబడినది. ఇచ్చటనుండియే బోధయొక్క అరంభము. రెండవదశకములో మూర్ఖులు నరదేహాధిక్యభావముచే భ్రమాన్వితులై దానిని దురుపయోగముగావించెదరని యోచించి దానిన్యూనతనుగూర్చి చెప్పబడినది. మరియు దేహాభిమానత్యాగమునుగూర్చి యుపదేశ మొసగబడినది. "నేను" "నాది" ఈసంసారము, అనువానియశాశ్వతత్వమును దెల్పి వవిద్వయనుత్యజించుటకు మూర్ఖలక్షణములు వివరింపబడినవి. అనంతరము భక్తినిగూర్చి కొంతవర్ణించి సత్త్వ, రజ, స్తమోగుణములను క్రమశఃవర్ణింపక మొదట రజోగుణమును తరువాత తమోగుణమును అంతమున సత్త్వగుణమును వర్ణింపబడినది. మొట్టమొదట రజోగుణమును వర్ణించుటకుగల కారణమేమని యోచించినచో రజోగుణమే సాంసారికసుఖాదిభోగములకు ముఖ్యప్రవర్తకమైయున్నది. ఫలాశనుపెట్టుకొని కర్మలొనర్చుట లేక పూర్వకర్మ ననుభోగించుట, రజోగుణధర్మమే. సాంసారికజనులయొక్క అధికాంశవ్యవహార మీరజోగుణమువలననే జరుగుచున్నది. కావుననే మొట్టమొదట దీనినిగూర్చి వర్ణింపబడునట్లు తోచుచున్నది. మరియు "ఈరజోగుణమునే పారమార్థిక

కార్యములయం దుపయోగింపజేసినచో సత్త్వగుణవృద్ధియును తమోగుణనాశనమును తనంతటనదియే యగునని బోధింపబడినది. ఇంతవనుక వివరించి యాముందు సువిద్యావర్ణనము గావింపబడినది. ఇదియంతయును వ్యావహారికోపదేశము. మూడవసమాసమందు గర్భవాసమునుండి మృత్యుపర్యంతము ఒకవ్యక్తియొక్క జీవితచారిత్రమును దెల్పి "స్వగుణపరీక్ష"నుగూర్చి యుపదేశింపబడినది. దీనిలో మానవుని సంసారయాత్ర అత్యుత్తమముగ చిత్రింపబడినది. దీనిని చదివినచో లేక వినినచో మానసముపై మిగుల తీవ్రప్రభావము కలుగును. నాలుగవదశకమునందు శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము ఆత్మనివేదనము అను నవవిధభక్తులనుగూర్చి వేర్వేరుగ వర్ణించి చతుర్విధముక్తులు తెల్పబడినవి. ఆత్మనివేదనమే సాయుజ్యముక్తిదాయకమగు ముఖ్యభక్తియైయున్నదను శ్రీసమర్థుని సిద్ధాంతము సర్వమాన్యముగ నున్నది.

నవమీభక్తి ఆత్మనివేదన
నహోతానచుకే జన్మమరణ॥
హేవచన సత్యప్రమాణ॥
అన్యథానవ్హే॥ ౪-౨౫

ఐదవదశకమునకు మొదట సద్గురు, సచ్ఛిష్యులలక్షణము లెఱింగించి సత్యోపదేశ మొసగబడినది. "సద్గురువిణజ్ఞానకాహీ, సర్వథాహోణార నాహీ" సద్గురుఁడు లేనిచో జ్ఞానప్రాప్తి ఎప్పుడును కలుగజాలదు. అను నార్యుల ధర్మమునందలి సనాతన సిద్ధాంతమునకు శ్రీసమర్థుఁడు మిక్కిలిబలము నొసఁగెను. కాని దీని వెనువెంటనే శిష్యునికి పరమార్థసాధనములనుగూర్చి శిక్షనొసగువాఁడును, మరియు నింద్రియదమనమును గావించి విషయములనుండి నివృత్తునిగజేయువాఁడును, నగు గురువె కావలయునని యును ఈప్రకారముగ శిక్షనొసగజాలని గురువులు గవ్వకు ముగ్గురెసి లభించినను త్యాజ్యులేయనియును బోధింపబడియెను.

శిష్యాస న లవితీసాధన । న కరవితీ ఇంద్రియదమన।
ఐసెగురూ అడక్యాచే తీన । మిళాలే తరీ త్యజావే॥

ఇట్లునుడివి యనేకవిధముల సమాజమునందు గురువులుగనేర్పడి జనులనుమోసగించుచు భ్రష్టులనుగావింపుచుండెడియసద్గురువులనుగూర్చి వర్ణింపబడినది. దీనికి పిమ్మట బహువిధజ్ఞాననిరూపణమొనర్చి శుద్ధజ్ఞానము వర్ణింపఁబడియెను. తదనంతరము క్రమశః బద్ధులు, ముముక్షులు, సాధకులు, సిద్ధులు, నగువారలలక్షణములనుగూర్చియును వారల కర్తవ్యములనుగూర్చియును ప్రభావయుతముగ వర్ణింపబడినది. బద్ధుల

యొక్కయు ముముక్షులయొక్కయు లక్షణములను చదువునట్టి పాషాణహృదయుడగు మనుష్యుడైనను వానియంతఃకరణము పశ్చాత్తాపముతో విదీర్ణమైపోవును. ఈ రెండుసమాసములోని ప్రతివాక్యము పాతకునిహృదయము సుజ్ఞాంతలాపి యాతం డొనరించిన కర్మములను దలంపునకుదెచ్చి కొంతసేపు చిత్తవృత్తి ననుతాపముతో శిథిలపరచి ఈశ్వరస్మరణమునందు లీనమొనర్చును. ఆఱవదశకమునుండి అధ్యాత్మనిరూపణము ఆరంభింపబడినది. దీనిమొదటిరెండు సమాసములతో మాయనుగురించియును బ్రహ్మమునుగురించియును చక్కగవివరించి సగుణభజనప్రతిపాదన మొనర్పబడినది. దీనికిపిమ్మట నన్నిటియందును నేసారముగలదో దాని నన్వేషింపవలయుననియును, అసారవస్తువును త్యజియింపవలయుననియును ఉపదేశింపబడినది. ఏడవ ప్రకరణమునందు చతుర్దశబ్రహ్మలను శాస్త్రప్రమాణమునొసగి వర్ణింపబడినది. మరియు నామములెన్నిగలవో, వాగ్రూపముగ చెప్పగలిగినదెంతగలదో, అవియన్నియును అశాశ్వతబ్రహ్మములనియును, శాశ్వతబ్రహ్మము వాక్కుకంటె వేరుగనున్నదనియును అది యనిర్వాచ్యమనియును, చెప్పబడినది.

ఎనిమిదవదశకము అధ్యాత్మజ్ఞానసారము. దీనినే జ్ఞానదశకమని యందురు. దీనిలో మొదట ఈశ్వరమహిమ వర్ణింపబడి రెండుసమాసములలో అనేక సూక్ష్మములగు సందేహములు వివరింపబడినవి. తరువాత స్థూలసూక్ష్మ పంచమహాభూతములనుగూర్చి విస్తృతపూర్వకముగ వివరించి మోక్షము, ఆత్మ, సిద్ధపురుషులు, శూన్యత్వముల నిరూపణము గావింపబడినది. ఎనిమిదవదశకమునకు పిమ్మట విషయముల కేదేని క్రమము సరిగ కన్పట్టదు. అయినను నీభాగమునందే సాంసారికజనుల కుపయుక్తములగు ననేక వ్యావహారికోపదేశరత్నములు నిండియున్నవి. తొమ్మిదవ దశకమున బ్రహ్మనిరూపణము నొనర్చి అనేకశంకలకు సమాధానమునొసగుచు నిస్సందేహత్వమును స్థాపింపబడినది. పదియవదశకమున మొదట అందరియంతరాత్మ యొక్కటియే యను విషయ యుక్తియుక్తముగ ప్రతిపాదింపబడినది. దీనిపిమ్మట బీజలక్షణము, పంచప్రళయము, ప్రకృతిపురుషులు మున్నగు ననేక మహత్త్వపూర్ణవిషయములను నిర్ధారణము గావించి భీమదశకము (పదునొకండవ దశకము) ప్రారంభింపబడినది. ఈదశకము గొప్పమహత్త్వయుక్తమైనది. దీని పేరువలననే దీనిమహాత్మ్యము నెరుంగవలయును. శ్రీ యాంజనేయస్వామిని శాస్త్రములయందు పదునొకండవ భీముడని (రుద్రుడని) యంగీకరింపబడినది. అందువలననే ఈదశకనామము భీమదశకమనబడినది. దీనిలో మొదట నధ్యాత్మవిద్యాసిద్ధాంతమును తెల్పి సాంసారికులకు చక్కనిశిక్ష యొసంగబడినది.

దీనిలోననే రాజనీతికిసంబంధించినతత్త్వములనిరూపణము గలదు. దీనితరువాత మహాంతులక్షణములు తెల్పబడినవి. మహాంతు ఏయేవిషయముల నెఱుంగవలయునో, ఏ

విధమగుచతురత్వముతో జనుల యంతఃకరణస్థితిని కనుగొని వారలను తనపక్షముద్రాయమునందు చేసుకొనవలయునో, మరియు కఠినప్రసంగ మేదేనివచ్చిపడినప్పుడు దానినే ప్రకారముగ నిర్వహించుకొనవలయునో ఈమొదలుగాగల మహత్వయుతములగు విషయము లనేకములు తెల్పబడినవి. ఈదశకాంతమునందే సాధారణోపదేశమును తెల్పి నిస్పృహులగువారలప్రవర్తనము జనసమాజముపట్ల నెట్లుండవలయునను విషయమును గూర్చి విశేషముగ నుడువబడినవి. ఈశిక్షాసారము క్రిందవ్రాయబడిన రెండుపద్యములలో నిండియున్నది.

ఉత్తమగుణతితుకేఘ్యావే । ఘేవూన జనావ్ సికవావే।
మహంతేమహంత్ కరావే । యుక్తిబుద్ధినేభరావే
జాణతేకరూన్ విఖరావే । నానాదేసీ॥ ౨౧॥

“సమస్తమగు నుత్తమగుణములను మొదట స్వయముగ గ్రహణమునొనర్చుకొని యాపిమ్మట జనులకు నేర్పవలయును. మహాంతులగువారికి తమతోసమానులగు ననేక మహాంతుల (నిస్పృహపురుషుల) ను సిద్ధపరచుటయును, వారినియుక్తికిని సద్బుద్ధికిని నిధానముగనొనర్చి నానాదేశములలోనికిని నానాప్రాంతములలోనికిని పంపుటయును, కర్తవ్యధర్మము” పంపుటెందులకు? వారుగూడ నీకార్యమునే చేయుటకు. ఈప్రకారముగ జగదుద్ధరణము కాగలదు. ఒకదృష్టితో నీసమాసమింకను గొప్పమహత్త్వముగలదిగ నున్నది. దీనిలో శ్రీసమర్థుడు వచియించినదానినంతను స్వయముగ తానుముందుగ నొనర్చి యాపిమ్మట వానిననుకరణమునొనర్చుటకై జనులకు ఉపదేశింపబడినవి. కావున దీనిలోనిసిద్ధాంతములు కేవలము పక్వమునొందినవి. పండ్రెండవదశకమునందు వివేకవైరాగ్యములనుగూర్చి మిక్కిలియుత్తమమగు వివేచనము గావింపబడినది. శ్రీసమర్థుడు వివేకమాహాత్మ్యమును విశేషముగ నుడివినాడు. ఐహికమునకైనను పారమార్థికమునకైనను ఏవిధమగు సుఖప్రాప్తికొరకైనను వివేకముతప్ప నితరోపాయము లన్నియును నిష్ఫలములగుచుండును.

వివేకమాహాల్యాచీ । [illegible] పావతోతోసీ॥

ఎంతదనుక విషయసంబంధములయందు వైరాగ్యముకల్గునో కాదో అంతదను కేవలజ్ఞానమువలన లాభముగలుగజాలదనుట నిశ్చయము. కానియీవైరాగ్యము వివేయుక్తమైనదిగ నుండవలయును. వైరాగ్యముతోపాటుగ వివేకములేకున్నచో అనర్థము తప్ప లాభమేమియు నుండదు. ప్రాపంచికసుఖము కలుగదు. పారమార్థికసుఖమును కలుగదు.

వివేకవిణ వైరాగ్యకేలే । తరీ అవివేకే అనర్థిఘాతలే।
అవఘేంచివ్యర్థచిగేలే । దోహీకడే॥ ౧-౮-

పదమూడవప్రకరణమునందు ఆత్మానాత్మవివేకము, సారాసారనిరూపణము ఉత్పత్తిప్రయత్నము లనుగూర్చి వర్ణనముగావింపబడినది. ఈదశకములోని యారవ సమాసమునందే లఘుబోధ గలదు. దీనిలో సమర్థుని శిక్షయొక్క సారాంశమున్నది. శ్రీరామదాసస్వామి ఈలఘుబోధనే శివాజికి బోధించియుండెనని ఇతిహాసజ్ఞుల యనుమానము. పదునాలుగవదశకములో మరల నిస్పృహలక్షణములను వివరించి భిక్షావిధి, కవిత్వకళ, కీర్తనలక్షణము, హరికథానిరూపణము, చాతుర్యలక్షణములు తెలుపబడినవి. దీనియనంతరము యుగధర్మనామకసమాసమునందు తత్కాలీనమగు ధార్మిక సామాజికదశ చక్కగ విశదమగును. పదునేనవదశకమున మరల చాతుర్యలక్షణములు నిస్పృహ వ్యాప్తలక్షణములు తెలుపబడినవి. శ్రీసమర్థుడు ఈగ్రంథమున మహంతులను నిస్పృహులనుగూర్చినవర్ణనమును మాటిమాటికిని గావించియున్నాడనుసంగతి ధ్యానమునం దుంచుకొనుట కర్తవ్యమైనది. నిస్పృహసాధుత్వమే యాతనివ్యావహారికశిక్షయొక్క సారము. ఏలయన! నిస్పృహులగుమహంతులు లేనిచో జగదుద్ధరణము, లేక లోకకళ్యాణము ఎప్పుడును కాజాలదు. పదునారవదశకమునందు మొదట వాల్మీకి, సూర్యనారాయణ, భూమాత, పవనదేవుల స్తవనమొనర్చి జలాగ్నులమున్నుగాగల మహాభూతములు వర్ణింపబడినవి. ఈవ్యాఖ్యానములన్నిటిలో అధునికవైజ్ఞానికము, శాస్త్రీయసిద్ధాంతపరిచయము లభియించుచున్నది. దీనితరువాత ఉపాసనయొక్క వ్యాపకత్వమునుగూర్చి వివరించుచు ఈక్రిందిసిద్ధాంతమును రామదాసుస్వామి స్థాపితమొనర్చెను.

ఉపాసనేచా మోఠా ఆశ్రయో । ఉపాసనే వీణ నిరాశ్రయో ।
ఉదండ కేలేసరీతో జయో । ప్రాప్తినాహీ॥

"మనుష్యునికి ఈశ్వరోపాసనము మిక్కిలి గొప్పయాశ్రయమైయున్నది. అశ్రయము లేనిచో నిరాశ్రితుండై యుండవలసివచ్చును. నిరాశ్రయావస్థయం దెంతప్రయత్నము నొనర్చినను జయలాభము కలుగదు."

పదునేడవదశకమునందు శివశక్తి, అజపామంత్రము, జగజ్జీవనము [illegible] గుణ సాసా విషయములనుగూర్చి వర్ణింపబడినది. దీని తరువాత అభాగ్య [illegible] లక్షణము, జనస్వభావము, వివరించి నిద్రనుగూర్చి [illegible] వర్ణనము గావింపబడినది. పందొమ్మిదవదశకప్రారంభమున లేఖనక్రియ, భాగ్యులు, అభాగ్యులనగు పురుషలక్షణములు, బుద్ధివాదము, యత్నములనుగూర్చి నిరూపింపబడి అంత్యమున ఉపాధిలక్షణములను వివరించి రాజనీతినిగూర్చి మరల నిరూపింపబడినది. ఇరువదియవదశకమునందు ఆత్మ, దేహ, క్షేత్రములు, సూక్ష్మనామములు, పూర్ణాపూర్ణములు మున్నగు ఆధ్యాత్మిక విషయముల చర్చయు గావింపబడినది. అంత్యమున విమలబ్రహ్మనిరూపణము

నొనర్చి యద్వైతసిద్ధాంతము స్థాపింపబడినది. గ్రంథసమాప్తిసమయమున శ్రీసమర్థుడిట్లు నుడువుచున్నాడు.

భక్తాచేని సాభిమానే । కృపాకేలీ దాశరథినే
సమర్థకృపేచీ వచనే । తో హా దాసబోధ॥

"భక్తుడని యభిమానించి దాశరథియగు శ్రీరామచంద్రుడు నామీద కృపను జూపెను. ఈ గ్రంథమున నేనేమియును రచింపలేదు. దీనిలో సమర్థునిపై శ్రీరామచంద్రుడుచూపిన కృపావచనములు గలవు. ఆవచనములే ఏకత్రమై ఈ (దాసబోధ) గ్రంథరూపమున గాన్పించుచున్నవి."

ఇంతదనుక నీగ్రంథమునందు వర్ణింపబడిన విషయములు సంక్షేపముగ లిఖియింపబడియెను. ఇక నీగ్రంథములోని ముఖ్యముఖ్య సిద్ధాంతములనుగూర్చి కొంత విస్తృతాలోచన గావింపబడును. వానివలన శ్రీసమర్థరామదాసస్వామి లోకోద్ధారణము కొరకు ఏవిధమగు శిక్షనొసగెనో యావిషయము పాఠకులకు వివరముగ విశదము కాగలదు.

౫. జ్ఞానము, విజ్ఞానము, బహుధాజ్ఞానము.

మోక్షముకొరకు జ్ఞానము కావలయును. ఇకనిప్పుడు జ్ఞానమన నెద్దియో చూడవలసియున్నది. ఈ యఖిలప్రపంచమునందు నిత్యమును, శాశ్వతమును నగు, "వస్తు" వొకటిగలదు. అది శుద్ధము, లేక విమలజ్ఞానము. ఈగ్రంథముయొక్క ౫ దవ దశకము ౬ వ సమాసమునందు ఈ జ్ఞానమునుగూర్చియే వివరింపబడినది. శుద్ధమగు విమలజ్ఞానమునే స్వరూపజ్ఞానమని (అనుభవము లేక విజ్ఞానమని) చెప్పుదురు. ఈ జ్ఞానము, పదార్థవిజ్ఞానముకంటె భిన్నమైనదిగ నున్నది. పదార్థవిజ్ఞానమును సమర్థుడు బహుధా (బహువిధ) జ్ఞానమని నుడివియున్నాడు. దీని వర్ణనము ద ౫ స ౬ లో చేయబడినది. దీనిని మనమిప్పుడు శాస్త్రము, లేక విజ్ఞానము (Science) చెప్పుచున్నారము. దాని సమావేశ [illegible]మునందే కలుగుచున్నది. పశుజ్ఞానము, రోగజ్ఞానము, ఓషధిజ్ఞానము, మంత్రజ్ఞానము, [illegible]జ్ఞానము, శాస్త్రజ్ఞానము, గతిజ్ఞానము, తర్కజ్ఞానము, శబ్దజ్ఞానము, అంతరజ్ఞానము మున్నగు సమస్తవిధములగు పదార్థజ్ఞానములు ఈబహుధాజ్ఞానమునందే సమావేశమగుచున్నవి. ఈ జ్ఞానమంతయును మాయోత్పాదితదృశ్య (జడమును, అశాశ్వతమునునగు) పదార్థములయొక్క వర్గీకరణము. ఇది శుద్ధమగు విమలజ్ఞానము కాదు, ఇది తత్త్వజ్ఞానము కాదు. ఇది యవిద్యమైయున్నది. మాయమైయున్నది. సమర్థుడు ఈ బహుధాజ్ఞానమును గురించియే వర్ణించుచు ఇట్లు నుడువుచున్నాడు.

బహుత్ ప్రకారాచీ జ్ఞానే । సాంగో జాతా అసాధారణే ।
సాయోజ్యప్రాప్తిహోయ్ జేణే । తేజ్ఞాన్ వేగళే ॥ ౩౭ ॥

"ఈబహుప్రకారములగు జ్ఞానముల నెంతదనుక చెప్పనగును! కాని ఏజ్ఞానము వలన సాయుజ్యముక్తి లభియించునో (పూర్ణస్వాతంత్ర్యతలభియించునో) అజ్ఞానము వేరుగనున్నది" ఈయనిత్యమగుదృశ్యమున శవ్వ తనే జ్ఞానముగలదో దానినే యాత్మ జ్ఞానమని చెప్పుదురు. ఆత్మ (బ్రహ్మాంశము) నిత్యమును, ఏకమును, నైయున్నది. దాని విషయమగుజ్ఞాన పద్దిగలదో యదియే జ్ఞానము. దృశ్యపదార్థములు (మాయయొక్క వ్యాపకత్వము) అనిత్యములును నైయున్నది. వానికిసంబంధించినజ్ఞానమే బహుధా జ్ఞానము. క్షేత్రీ క్షేత్రము, ద్రష్టదృశ్యము, నిత్యము, అనిత్యము, వీనియన్నిటికిసంబంధించిన వివేకమే జ్ఞానసారము.

౬ ఆత్మ, దేహము.

క్షేత్రి, ద్రష్ట, (ఆత్మ) సత్తును. శాశ్వతమును, నిరుపాధియును, నిర్వికారమును నైయున్నది. క్షేత్రము, దృశ్యము, (దేహము) అసత్తును, అశాశ్వతమును, సోపాధియును, సవికారమును నైయున్నది. ఆత్మసూక్ష్మము దేహముస్థూలము, ఆత్మస్వయంభువును దేహముపరభువును నైయున్నది. ఆత్మ బ్రహ్మాంశము, దేహము మాయాంశము. మాయ నాశవంతమును, బ్రహ్మము అవినాశియును, నైయున్న విధముగ దేహము నశ్వరమును ఆత్మ అమరమును నైయున్నది. ఈప్రకారముగ ఆత్మను దేహమునకును, బ్రహ్మమునమాయకును, నిత్యమునకు అనిత్యమునకును, అఖండమగు భేదము గలదు. సారాంశమేమన! ఆత్మలేక బ్రహ్మము స్వతంత్రమును స్వాధీనమును నైయున్నది. మాయ లేక దేహము పరతంత్రమును మాయాసంయోగమును నైయున్నది. ఎప్పుడు ఆత్మపైని మాయాలేపనమెప్పుడో లేక యెప్పుడు ఆత్మకు ఈదేహములోసంబంధము కలుగునో, అప్పుడదియే "దేహి" లేక జీవు డనిగూడ పిలువబడును. ఆత్మ, జీవుడై సుఖదుఃఖములు లాభనష్టములు మున్నగుగల ద్వంద్వములకు భోక్తయగుచున్నది. తాత్పర్యమేమన' స్వతంత్రమగు ఆత్మ దేహము, లేక మాయయొక్క [illegible] మువలన పరతంత్రమును, లేకబద్ధమును, నైపోవుచున్నది. శ్రీసమర్థుడు [illegible] గారి సమాసము ౯ లో దీనినే వివేచించి ఇట్లునుడువుచున్నాడు.

అత్మయాన్ శరీరయోగే । ఉద్వేగ్ చింతా కరణే లాగే ।
శరీరయోగే ఆత్మాజగే । హేతో ప్రకటచి అహే ॥ ౩౮ ॥
దేహీ సుఖ్ దుఃఖ్ భోక్తా । తో ఏక్ ఆత్మాచీపాహాతా ।
ఆత్మావిణదేహెవ్యృథా । మ దేవోస్యే ॥ ౩౯ ॥

"ఆత్మకు శరీర (సం) యోగమువలన ఉద్వేగచింతాదులను పొందవలసివచ్చుచున్నది. శరీరయోగముతో ఆత్మయున్నదనునది ప్రకటమైనదియేగదా! శరీరములేనిచో ఆత్మగూడ లేచిపోవును. దేహమునందు సుఖదుఃఖములనుభోగించునది ఆత్మయే. ఆత్మ లేకున్న శరీరముగూడ శవమే. ఈప్రకారముగ రెండును ఒకటిరెండవదానియాధారమున నున్నవి. ఒకటిరెండవదానితో బద్ధమైయున్నది.

౭ నరదేహియగుజీవుడు, లేక బద్ధప్రాణి

ఆత్మకు మాయాబంధనము కలుగుటయే నరదేహముయొక్కజన్మము. ఎప్పుడు స్వతంత్రమగునాత్మ నరదేహమున్ప్రాప్తించునో అప్పుడే దానికి సాంసారికసుఖ దుఃఖము తాపత్రయములు ఆరంభమగుచున్నది. తాపత్రయములకు మూలకారణము త్రిగుణాత్మకమగుమాయయే. స్వతంత్రమగుఆత్మ నరదేహములోకే తెంచి సత్త్వ, రజ, స్తమో, గుణముల న్యూనాధిక మిశ్రణమువలన భ్రాంతమై అహంకారవశమై పోవుచున్నది. నేనుఇట్టివాడను, నేనుఅట్టివాడను, నేను దీనినొవర్చితిని, నేనుచతురుడను, పండితుడను, కార్యకర్తను, నాయిల్లు, నాకుటుంబము, నాధనము, అనుప్రకారములగు నహంకారకల్పనములయందు జిక్కుకొని సాంసారికసుఖదుఃఖములలో ప్రాణి మగ్నమైపోవుచున్నది. మాయామోహమునందు బంధింపబడియుండుటకతన దానిజ్ఞాన దృష్టికి మసకలు గ్రమ్మిపోవును. అదితన్ను దాను మఱచును. అజ్ఞానవశమున నేనెవ్వడ" నని నుడువసాగును. ఈవిధముగ నరజన్మమునొంది ఎప్పుడు స్వతంత్రమగుఆత్మ తన్ను దానుమరచిపోవునో (తననిజస్వరూపమును మరచిపోవునో) అప్పుడది ప్రపంచమునందు మూర్ఖియును చదివిన (తెలసిన) మూర్ఖియును, కులక్షిణియును నైపోవును. ఎప్పుడొకసారి యజ్ఞానమును, మూర్ఖతయును, రోమరోమమునపాదుకొనునో అప్పుడు దానిదుఃఖములగణనము నెవ్వడు గావింపగలడు! అది ఇతరులనుబాధించును. నిర్బంధించును. దుఃఖింపజేయును. మరియు తానుగూడ నదేవిధముగ పీడితమునొందును. ఇతరునిపై దౌర్జన్యమునొనరించును. ఇతరులధనమును [illegible] రముగ లాగికొనును. జనులస్వాతంత్ర్యమును హరియించును. తానుగూడ దరిద్రియును, పరతంత్రియును, నగును. ఇంతజరుగుచుండినను గూడ ఇట్లేలయగుచున్నది! దుఃఖమునకుకారణమేయ్యది ? దుఃఖవిమోచన మేలకాదు! దుఃఖమే సుఖముగ తెలగనబట్టుచున్నది! యనువిషయములు, తెలియబడవు. కఠినములగు నురులలోబడి పాపము ప్రాణిభయపడిపోవును. దానిధైర్యము విచ్ఛిన్నమైపోవును. ఇట్టివేళయందు కొందరీనరదేహమునే నిందాతిరస్కారముల గావింపసాగుదురు. "ఛీ" ఈనరదేహము వ్యర్థమైనది. దీనివలననే మనమిట్లు

దుఃఖితులము గావలసివచ్చినదని నుడువుదురు. సత్వరజస్తమము లనుమూడుగుణములలోనుండి కేవలరజస్తమోగుణముల యతిశయ సంసర్గమువలననే ఈదుర్దశ కలుగుచున్నదనునంశమును వారలు మఱచిపోయెదరు. నరదేహము ఒకవిలక్షణమగు శక్తియైయున్నది. దానిని యోగ్యముగనైన నుపయోగింపుము. చెడుగుగనైన నుపయోగింపుము. దురుపయోగమునుగావించెడివానికి దుర్గతియును, సదుపయోగమునుగావించెడివానికి సద్గతియును కలుగును. "జోనర్ కరనీకరే, తోనర్ కానారాయణ హోయ్" (తనవిధ్యుక్తధర్మమును నెఱవేర్చుమానవుఁడు నారాయణుఁ డగును) అను నిసామెత యెంతయు సత్యము. మనజా తీసిద్ధాంతమును సర్వవిధముల మఱచిపోవుదురు. అంతతోఁబోక వ్యర్థముగా నీనరదేహమును నిందింతురు. "నాచ్‌నఆవే ఆంగణ్ టేఢా" ఆటరాక మంగిలి సరిగాలేదన్నటుల జను లున్నతికిబదు లవనతి నొందుచున్నారు.

ముముక్షువు - సద్గురువు.

బద్ధప్రాణికి సాంసారికతాపత్రయములవలన ఖేదమును పశ్చాత్తాపమునుకల్గగానే ఈదుఃఖమునుండి విముక్తినొందుటెట్లు"న్న ప్రశ్న యాతనిసమ్ముఖమునకేతెంచును. అప్పుడాతఁడు వృద్ధావస్థనుండి ముక్తినొందుట కుపాయము నన్వేషించును. ఈనిరూపణము అన్యోన్యగ్రంథములయం దెట్లుగలదో దాసబోధయందును నట్లేగలదుగాని దాసబోధయందలివిశేషమేమన, మహారాష్ట్రీయ తత్కాలీనావస్థయం దెయ్యది యుచితముగనుండెనో యదియే ఈగ్రంథమున నిరూపింపబడినది. పూర్వపుణ్యకారణమున నాబద్ధప్రాణికి సద్గురునిసమాగమ మెప్పుడగునో (ఎప్పుడాతఁడు సద్గురునిశరణము కరుగునో) అప్పుడు గురూపదేశమువలన నాతఁడు తామసవృత్తిని త్యజియించును. అపిమ్మట నాతఁడు నేనుబద్ధుడనుగాను, స్వతంత్రుఁడను, భ్రమకారణమున నేను నన్ను బద్ధునిగ తలంచుచుంటిని, అని తెలిసికొనును.

కోణాసీచ్ నాహీబద్ధన్ । భ్రాంతి స్తవ[illegible] లేజన్
ధృఢేఘేతలాదేహాభిమాన్ । మ[illegible] ద ౫ స ౬

వాస్తవములో బంధన మెవ్వనికినిలేదు. బద్ధుఁడెవ్వఁడును కాఁడు. సమస్తప్రాణులు భ్రాంతివలన మఱచియున్నవి. ఏలయన! వారలు దేహాభిమానమును (అహంకర్తృత్వభావయుతమగుగర్వమును) దృఢముగా పట్టుకొనియున్నారు. ఈభ్రమనివారణయగుటతోడనే ముముక్షుత్వము (మోక్షేచ్ఛలేక స్వాతంత్ర్యేచ్ఛ) ఉదయించును. ఈయిచ్ఛ ప్రబలమైనప్పుడు ప్రాణి సాత్త్వికవృత్తి నభ్యసింపసాగును. మరియు నెవ్వనికృపవలన నీయిచ్ఛయుత్పన్నమయ్యెనో అట్టి సద్గురునిసేవను గావింప

నారంభించును. సద్గురుని, యుపదేశ, సహవాస, కృపలవలన గొప్పలాభము కలుగును. మొట్టమొదట నింద్యముగను తిరస్కరణీయముగను, గన్పట్టు నరదేహమప్పుడు వందనీయముగను ఉపయోగిగను ప్రతీతి కాసాగును. గురూపదేశమువలన మనుష్యుని వివేకదృష్టి శుద్ధమును, నిర్మలమును నైపోవును. అప్పుడు వానికి భూలోకమున "నాకు కొంతకర్తవ్యముగలదు. ఏద్దియో యుద్దేశముగలదు. ధ్యేయము గలదు. సాధ్యముగలదు. ఆసాధ్యమును ప్రాప్తించుటకు ఈనరదేహము అత్యంతయావశ్యకమును, ఉపయోగియును, నైయున్నది." అను నిశ్చయమేర్పడును. వాస్తవములో నీనరదేహములభియింపక యేదేని యన్యదేహము (పశు, పక్షి, కీటాదికము) లభియించినదో నీసాధ్యమును ప్రాప్తించుట యసంభవముగ నుండెడిది. శ్రీసమర్థుఁ డిట్లు నుడువుచున్నాఁడు.

పశుదేహీ నాహీగతీ । ఐసే సర్వత్రబోలతీ।
మ్హణోని నరదేహీచ ప్రాప్తీ । పరలోకాచీ ॥ ౨౧ ॥
నరదేహ హాస్వాధీన । సహసా నవ్హే పరాధీన।
పరన్తుహా పరోపకారీ ఝిజవూన । కీర్తిరూపే ఉరవావా॥ద ౧ స ౧-౨౫

"పశుదేహమునందు గతిలేదనియే యెల్లరును నుడివెదరు. పరలోకము నరదేహమునందే లభియించును. నరదేహము స్వాధీనము గలది. ఇది స్వభావసిద్ధముగ పరాధీనము[illegible]కాదు. దీనిని పరోపకారమునం దన్వయింపఁజేసి కీర్తిరూపములో నమరమగున[illegible]గావింపవలయును" కాని ఈశుద్ధమును విమలమును నగు వివేకదృష్టి, గురుకృపాంజనములేనిచో నెప్పుడును కలుగజాలదు. ఈలాభము క్షుద్రలాభముగ భావింపజనదు. ఈవిధముగు నరదేహపుయోగ్యతను ప్రాముగావించెడి గురువులనుగూర్చి, "ఇట్టిగురువులు గవ్వకు ముగ్గురేని దొరకినను తీసుకగూడదని సమర్థుఁడు నుడువుచున్నాఁడు. ఎవఁడు, అవిద్య(మాయ) యొక్కమూలచ్ఛేదనము నొనర్చునో, అంతర్బాహ్యేంద్రియముల దమనమునుగూర్చియును, నిగ్రహమునుగూర్చియును, శిక్షనొసగునో, మరియు భవసాగరమును తరియింపజేయునో, అతఁడే సద్గురుఁడు. ఇట్టి గురువులు మిగులనరుదుగ దొరకుదురు. ఈగురువులు ద్రవ్యమువలన లభియింపరు. పూర్వపుణ్యవశముననే లభియింతురు. పూర్వపుణ్యమును సఫలమొనర్చెడివని గురువులైయున్నది. సమాజమునందుగాన్పించెడి యసద్విద్యాప్రచారదోషము కేవలము శిష్యుల తలమీదనే మోపరాదనియును, ఆదోషము గురువులకుగూడ సంబంధించియుండుననియును, సమర్థుడు చెప్పుచున్నాఁడు. అనగా అసద్గురుని కారణముననే సమాజమునందు అనీతి అధర్మము అనాచారము ప్రచారమగుచున్నది. శిష్యులు (సమాజమునందలి సర్వసా

ధారణులగు జనులు) అజ్ఞానులు, మూఢులు, అని తెలిసియుండియునుగూడ కేవలము వారల తలలమీదనే దోషమును రుద్దివేయుటవలన నేమిలాభమొనగూడును? సమాజమును సన్మార్గముపైని నడిపించెడి బాధ్యతయంతయును, మరియు దాని యుత్తరవాదమునుగూర్చిన భారమంతయును. సమర్థుని మతానుసారముగ సద్గురుని మీదనే యున్నది.

ఏ తే శబ్ద నాహీ శిష్యాసీ।
హే అవఘే సద్గురూపాసీ
సద్గురూ పాలటీ అవగుణాసీ।
నానా యత్నే కరూని॥౧౫॥ ద ౫ స ౩

ఇందు శిష్యునిదోష మిద్దియును లేదు. ఇదియంతయు సద్గురుని పనియైయున్నది. సద్గురుఁడు సర్వవిధములఁ బ్రయత్నించి సమాజమునందలి లోటుపాటులను తొలంగింపఁగలఁడు. అట్టివాఁడొకవేళ సమాజమున కధిపతియై లోకుల ననుచితమార్గమున నడుపుచున్నచో నీకార్యమున కింకసమర్థులెవరు? సద్గురూత్తముఁడు హిమాలయ కందరములలోఁ గూర్చుండి యేకాంతమున ననుభవించు బ్రహ్మానందము నొకక్షణము విడిచి సమాజము నుద్ధరించుటయను బరోపకారము గావించుటకు జనసంఘములోనికి రావలయును. అపుడా దేశికుని తేజమునకు, ప్రభావమునకు, ప్రతిభకు, ముగ్ధులై ముముక్షువులగు సచ్ఛిష్యులు శరణ్యములోనికి వత్తురు. సద్గురునియొక్కయు సచ్ఛిష్యునియొక్కయు సమావేశము మేఘచాతకముల కలయికవంటిది. అంతియగాక శ్రీకృష్ణార్జునుల సమావేశమువంటిదనియు, రామదాసశివాజిచక్రవర్తుల సమ్మేళనమువంటిదనియుఁ, గూడ భావింపనగును. ఉత్తముఁడును లోకోద్ధారకుఁడును నగుగురూత్తముని సాయమున సహృదయుఁడును ముముక్షువునగు శిష్యుఁడు పరమార్థమునందును జనోద్ధరణ సాధనమునందును మగ్నతనొందును.

౯ పరమార్థమార్గమునందు సాధకము, సిద్ధి.

పరమార్థసాధనములయెడ నాసక్తుఁడైనంతన పరోపకారము జనోద్ధరణము నిచ్చగించు నిరహంకారియగు ముముక్షువు సాధకావస్థ నొందును. ఆయవస్థయందతఁడు పరమార్థమున నెద్దియో గ్రహించును. సమర్థుఁడిట్లు నుడివియున్నాఁడు.

"పరమార్థము తపస్వులకును, సాధకులకును ఆధారము. పరమార్థము భవసాగరమును తరింపఁజేయును. అనంతములను జన్మములఫలము ప్రాప్తమైయున్నప్పుడే పరమార్థములవడజాలును. పరమార్థమువలన ముఖ్యపరమాత్మతత్త్వము అనుభవములోనికి వచ్చును." మరియు నాత్మానుభవమగుటయే మాయాబంధములనుండి విముక్తినొం

దుట. దీనిపేరె మోక్షము లేక స్వాతంత్ర్యము. ఇదియే పరమార్థము. దీనిని ప్రాప్తించుటకు మార్గము ఎయ్యది? జ్ఞానమార్గమా, యోగమార్గమా, కర్మమార్గమా లేక భక్తిమార్గమా? ఈప్రకారముగ ననేకప్రశ్నముల వివేచనమును సమర్థుఁడు అయిదవదశకములోని ఏడవసమాసము మొదలుకొని ఇరువదియవ దశకముదనుక గావించెను. ఈవిధముగా ననేకమార్గములతోడనే సాధకుఁడు పరమార్థముకొఱకు దృఢపూర్వకముగ సాధనము జేయుచున్నాఁడు. సాధుసమాగమ మొనర్చుచున్నాఁడు. అద్వైతనిరూపణ శ్రవణమననములను గావించుచున్నాఁడు. సారాసారవిచారమువలన సందేహములను సాంసారిక వికల్పములను నశింపఁజేసి ఆత్మజ్ఞానమును వివేకించుచున్నాఁడు. వివేకమువలన దేహబుద్ధిని (నేను, నీవుఅనుదానిని) అపివేయుచున్నాఁడు...

మాయోపాధిని విడచి అసాధ్యవస్తువును (ఆత్మను=పరబ్రహ్మమును) సాధనమువలన సాధించుచున్నాఁడు. మఱియు సత్స్వరూపమునందు తనబుద్ధిని దృఢముగనుంచుచున్నాఁడు. ఈప్రకారముగ సాధనమును జేయుచు, జేయుచు గురూపదేశమువలన నరదేహమును సార్థకపఱచి యాతఁడీ భవసాగరమును దాటిపోవుచున్నాఁడు. మాయాపటలమును జించివేయుచున్నాఁడు. అజ్ఞానమును నశియింపఁజేయుచున్నాఁడు. తన్నుదా (ఆత్మను) నెఱుఁగుచున్నాఁడు. స్వస్వరూపమునందు లీనమైపోవుచున్నాఁడు. ఇట్టిదశయేతెంచినపిమ్మట, బద్ధదశనుండి ముముక్షువును, ముముక్షువునుండి సాధకుఁడును నైనయాసాధకుఁడే, సిద్ధుఁడనిపించుకొనుచున్నాఁడు. సమర్థుని మతానుసారము సాధకుని (అంతిమ) నిస్సందేహావస్థనే సిద్ధావస్థయని నుడువుదురు. సిద్ధపురుషుఁడు సిద్ధుఁడైయుండియును సాధకుఁడుగనే యుండును. అతఁడు సాధనము నెప్పుడును విడువఁడు. సిద్ధుని లక్షణములను నుడువుచు సమర్థుఁడేమిచెప్పుచున్నాఁడో చూతుము.

"సిద్ధలక్షణములను సాధకములేనిచోఁ జెప్ప వీలుగాదు. సిద్ధలక్షణములయందు సాధకత్వము వచ్చితీరవలయును. వెలుపలినుండి సాధకునివలె గాన్పించుచు సాధనకృతిని గావించుచు నంతరమునందు స్వరూపాకారుఁడై యుండువానినే చతురపురుషులు సిద్ధుఁడని తలంతురు." సాధనమును జేయుచుండు నాతఁడు సిద్ధుఁడెట్లగుననుదానికి సమర్థుఁడిట్లు ప్రత్యుత్తరము నిచ్చుచున్నాఁడు. "సందేహరహితమగు సాధనము నొనర్చుటయే సిద్ధునిలక్షణము. సిద్ధునిసాధనములయందు లోపలను వెలుపలను అచలమగు సమాధాన ముండును. ఈసిద్ధునకే సమర్థుఁడు దాసబోధయందు 'మహంతు' 'సాధు' 'విరక్తుఁడు' 'నిస్పృహుఁడు' మున్నగునామముల నిచ్చియున్నాఁ"డను విషయమును స్మరణయందుంచుకొనవలయును.

కారణులగు జనులు) అజ్ఞానులు, మూర్ఖులు, అని తెలిసియుండియునుగూడ కేవలము వారల తలలమీదనే దోషమును రుద్దివేయుటవలన నేమిలాభ మొనగూడును? సమాజమును సన్మార్గముపైని నడిపించెడి బాధ్యతయంతయును, మఱియు దాని యుత్తరవాదమునుగూర్చిన భారమంతయును, సమర్థుని మతానుసారముగ సద్గురుని మీదనే యున్నది.

జే తే శబ్ద నాహీ శిష్యాసీ।
హే అవఘే సద్గురూపాసీ
సద్గురూ పాలటీ అవగుణాసీ।
నానా యత్నే కరూని॥౧౫॥ ద ౫ స ౩

ఇందు శిష్యునిదోష మిద్దియును లేదు. ఇదియంతయు సద్గురుని పనియైయున్నది. సద్గురుడు సర్వవిధముల ప్రయత్నించి సమాజమునందలి లోటుపాటులను దొలగింపగలడు. అట్టివాడే లోకవేళ సమాజమున కధిపతియై లోకుల నుచితమార్గమున నడుపుచున్నచో నీకార్యమున కింకసమర్థులెవరు? సద్గురూత్తముడు హిమాలయ కందరములలో గూర్చుండి యేకాంతమున ననుభవించు బ్రహ్మానందము నొకక్షణము విడిచి సమాజము నుద్ధరించుటకును పరోపకారము గావించుటకును జనసంఘములోనికి రావలయును. అపుడాదేశము తేజమునను, ప్రభావమునను, ప్రతిభను, ముక్తులై ముముక్షువులగు సచ్ఛిష్యులు శరణ్యములోనికి వత్తురు. సద్గురునియొక్కయు సచ్ఛిష్యునియొక్కయు సమావేశము మేఘచాతకముల కలయికవంటిది. అంతియగాక శ్రీకృష్ణార్జునుల సమావేశమువంటిదనియు, రామదాసశివాజిచక్రవర్తుల సమ్మేళనమువంటిదనియు, గూడ భావింపనగును. ఉత్తముడును లోకోద్ధారకుడును నగు గురూత్తముని సాయమున సహృదయుడును ముముక్షువునగు శిష్యుడు పరమార్థమునందును జనోద్ధరణ సాధనమునందును మగ్నతనొందును.

౮ పరమార్థమార్గమునందు సాధకము, సిద్ధి.

పరమార్థసాధనములయెడ నాసక్తుడైనంతన పరోపకారము జనోద్ధారణము నిచ్ఛగించు నిరహంకారియగు ముముక్షువు సాధకావస్థ నొందును. ఆయవస్థయం దతడు పరమార్థమున నెద్దియో గ్రహించును. సమర్థు డిట్లు నుడివియున్నాడు.

"పరమార్థము తపస్వులకును, సాధకులకును ఆధారము. పరమార్థము భవసాగరమును తరింపజేయును. అనంతములను జన్మములకులము ప్రాప్తియున్నప్పుడే పరమార్థమలవడజాలును. పరమార్థమువలన ముఖ్యపరమాత్మతత్త్వము అనుభవములోనికి వచ్చును." మరియు నాత్మానుభవమగుటయే మాయాబంధములనుండి విముక్తినొం

దుట. దీనిపేరే మోక్షము లేక స్వాతంత్ర్యము. ఇదియే పరమార్థము. దీనిని ప్రాప్తించుటకు మార్గము ఎయ్యది? జ్ఞానమార్గమా, యోగమార్గమా, కర్మమార్గమా లేక భక్తిమార్గమా! ఈప్రకారముగ ననేకప్రశ్నముల వివేచనమును సమర్థుడు అయిదవదశకము లోని ఏడవసమాసము మొదలుకొని ఇరువదియవ దశకముదనుక గావించెను. ఈవిధముగా ననేకమార్గములతోడనే సాధకుడు పరమార్థముకొఱకు దృఢపూర్వకముగ సాధనము జేయుచున్నాడు. సాధుసమాగమ మొనర్చుచున్నాడు. అద్వైతనిరూపణ శ్రవణ మననములను గావించుచున్నాడు. సారాసారవిచారమువలన సందేహములను సాంసారిక వికల్పములను నశింపజేసి ఆత్మజ్ఞానమును వివేకించుచున్నాడు. వివేకమువలన దేహబుద్ధిని (నేను, నీవుఅనుదానిని) అపివేయుచున్నాడు...

మాయోపాధిని విడచి అసాధ్యవస్తువును (ఆత్మను=పరబ్రహ్మమును) సాధనమువలన సాధించుచున్నాడు. మఱియు సత్స్వరూపమునందు తనబుద్ధిని దృఢముగనుంచుచున్నాడు. ఈప్రకారముగ సాధనమును జేయుచు, జేయుచు గురూపదేశమువలన నరదేహమును సార్థకపఱచి యాతడీ భవసాగరమును దాటిపోవుచున్నాడు. మాయాపటలమును జించివేయుచున్నాడు. అజ్ఞానమును నశియింపజేయుచున్నాడు. తన్నుదా (ఆత్మను) నెఱుంగుచున్నాడు. సత్స్వరూపమునందు లీనమైపోవుచున్నాడు. ఇట్టిదశయే తెంచినపిమ్మట, బద్ధదశనుండి ముముక్షువును, ముముక్షువునుండి సాధకుడను నైనయా సాధకుడే, సిద్ధుడనిపించుకొనుచున్నాడు. సమర్థుని మతానుసారము సాధకుని (అంతిమ) నిస్సందేహావస్థనే సిద్ధావస్థయని నుడువుదురు. సిద్ధపురుషుడు సిద్ధుడై యుండియును సాధకుడుగనే యుండును. అతడు సాధనము నెప్పుడును విడువడు. సిద్ధుని లక్షణములను నుడువుచు సమర్థుడేమిచెప్పుచున్నాడో చూడుడు.

"సిద్ధలక్షణములను సాధకములేనిచో జెప్ప వీలుగాదు. సిద్ధలక్షణములయందు సాధకత్వము వచ్చితీరవలయును. వెలుపలినుండి సాధకునివలె గాన్పించుచు సాధనకృతిని గావించుచు నంతరమునందు స్వరూపాకారుడై యుండువానినే చతురపురుషులు సిద్ధుడని తలంతురు." సాధనమును జేయుచుండు నాతడు సిద్ధుడెట్లగుననుదానికి సమర్థుడిట్లు ప్రత్యుత్తరము నిచ్చుచున్నాడు. "సందేహరహితమగు సాధనము నొనర్చుటయే సిద్ధునిలక్షణము. సిద్ధునిసాధనములయందు లోపలను వెలుపలను అచలమగు సమాధాన ముండును. ఈసిద్ధునకే సమర్థుడు తనదాసబోధయందు 'మహంతు' 'సాధు' 'విరక్తుడు' 'నిస్పృహుడు' మున్నగునామముల నిచ్చియున్నా"డను విషయమును స్మరణయందుంచుకొనవలయును.

యుండుట యటుండ నింద, ద్వేషము, అనీతి, అనాచారము, అలసత్వము, కపటము, కలహము, క్రూరత, పిఱికితనము, పాషండగుణము, పాపము, దురాశ మున్నగు దుర్గుణములతోఁగూడిన వికటావరణము వారిపైని ఆవరించుకొని యుండును. ఈయావరణమును తీసివైచుట (ఈదుర్గుణములను దూరపరచుట) నీతియొక్క పని. నీతిస్థాపనవలన మలినవృత్తులు విమలములగును. మఱియు, మనుష్యుఁ డాత్మసంస్కరణ (తనయుద్ధరణ) మార్గమునందుఁ దన్మయుఁడగును. సిద్ధపురుషుల (సద్గురుని) యుపదేశమువలన మాయాజన్యములగు సత్త్వరజస్తమోగుణములలో నేది గ్రాహ్యమో యేది త్యాజ్యమో విశదమగును. అనంతరము ఉద్ధారణకార్యము చాలవఱకుఁ బూర్తియైనట్లు గ్రహింపవచ్చును. మనుష్యుఁ డెట్లువంచిన నట్లువంగును. నీతివైపాతని ద్రిప్పినచో నందే మగ్నుఁడగును. అవినీతియందుఁ బ్రవేశపెట్టిన నందే మగ్నుఁ డగును. ఈవిధముగా సమర్థుఁడు చతురులు, మూర్ఖులు, దువిద్య, సువిద్య; సత్త్వగుణము, తమోగుణము లనుగూర్చిన నిరూపణము ద. ౨. స. ౨. లో నొనరించెను. అజ్ఞులకు నీతియననేమియో తెలియదు. కావున అజ్ఞు లవలక్షణులుగ నుందురనుటలో నాశ్చర్యము లేదు. అజ్ఞుల నుపదేశముచే సంస్కరింపవలెను. జ్ఞానలవదుర్విదగ్ధులగు అహంమన్య పండితవర్గ మింకొకటిగలదు. వారలను శ్రీ సమర్థస్వామి చదివిన మూర్ఖులని పేరిడెను. వారలెన్నఁటికిని నీతిచే సంస్కరింపఁబడరు. భర్తృహరియు "జ్ఞానలవదుర్విదగ్ధం బ్రహ్మాపి నరం జయతి" అనెను. (జ్ఞానలవదుర్విదగ్ధుఁడగు నరుని బ్రహ్మయైనను రంజింపఁజాలఁడు.) వాస్తవమునం దిట్టి తెలిసిన మూర్ఖులను సంస్కరించుట గొప్పకఠినకార్యము. ఈమనుష్యులు బహుశ్రుతులును, వ్యుత్పన్నులును, నైయుందురు. బ్రహ్మజ్ఞానమునుగూర్చి గొప్పగొప్పవిషయములను జెప్పుదురు. కాని కామ, క్రోధ, మద, మోహ, మత్సర, దంభ, దురాశ, అహంకారముల త్రిప్పులలోఁ బడియుండి తమధర్మమునే నిందగావించుచుందురు. భక్తిమార్గమును విచ్ఛేదము నొనర్తురు. భూతదయను మఱచిపోవుదురు. వారలు స్వయముగ నిట్లు జేయుటయే గాక అజ్ఞులచేగూడ చేయించుచుందురు. ఇట్టి తెలిసిన (చదివిన) మూర్ఖులకు సైతము నైతికశిక్షనొసఁగుట సకల సమాజోద్ధరణదృష్టితో అత్యంతావశ్యకమై యున్నది. ఈప్రకారముగ మూర్ఖులకు, తెలిసిన మూర్ఖులకు, నైతికశిక్షనొసఁగుట, మఱియు నాశిక్షకొఱకు సంస్థలను స్థాపించుట పరమార్థప్రాప్తికి లేక సమాజోద్ధరణమునకు ప్రథమోపాయము.

(౨) ధర్మస్థాపనము—ధర్మమన నిచ్చట పరమేశ్వరుని యుపాసనము లేక భక్తి యని తాత్పర్యము. భక్తి [illegible] విధములుగలది. వీనిలో తొమ్మిదవదగు ఆత్మనివేదన భక్తి శ్రేష్ఠమై [illegible] శ్రేష్ఠమగు ధర్మము. తక్కిన యెనిమిదివిధములగు భక్తులలో [illegible] లయెందు [illegible] శేషించియుండెడి సంభావన గల

ను. అనఁగా భక్తుఁడు ఈశ్వరునితో ద్వైతకల్పన మొకప్పుడుండుట తటస్థించుచున్నది. కాని యాత్మనివేదనమువలన భక్తునిహృదయమునందు విభక్తభావముండదు. దీనివలన అభిన్నత్వము, అనన్యత్వము (ఐక్యవృత్తి) కలుగును. ఈ యుపాసనము ప్రత్యక్షమగు నాత్మజ్ఞానమే యైయున్నది. సమర్థుఁడు ఈ గ్రంథమునందనేకస్థలములలో ఉపాసనామాహాత్మ్యమును గానమొనరించియున్నాఁడు. అభిమానయుక్తముగను, విశ్వాసపూర్వకముగను సమర్థుఁడిట్లు నుడువుచున్నాఁడు.

"ఉపాసన సర్వవ్యాపకత్వముగలది. ఆత్మారాముఁ డెచ్చటలేఁడు? అన్నితావులను రాముఁడు నిండియున్నాఁడు. నాయుపాసన యిట్టిది. అది కల్పనాతీతము. అది నిరంజనునికడకు (పరబ్రహ్మముకడకు) చేర్చివైచును." అధ్యాత్మవిద్యాశ్రవణము, దేవపూజనము, భజనము, కీర్తనము, సన్న్యాదిబ్రహ్మకర్మము. వీనియన్నిఁటిసమావేశము ఉపాసనమునఁగలుగును. సారాంశమేమన? కర్మజ్ఞానముల సమావేశము, ఉపాసనామార్గమునందే (భక్తిమార్గమునందే) కలుగఁదగియున్నది. భక్తిమార్గమునందు ప్రతీకపూజనము (మూర్తిపూజనము) చెప్పఁబడియున్నది. కాని ప్రతిమ (మూర్తి) పరమేశ్వరుని ప్రతినిధిరూపమనియును, స్వయముగ దాని (ప్రతిమయొక్క) రూపము లేక నామము పరమేశ్వరుఁడు కాఁడనియు స్మరణయందుంచుకొనవలయును. ఈవిషయమునకు సంబంధించిన చర్చను సమర్థుఁడు అన్నితావులను గావించియున్నాఁడు. ఏపరమేశ్వరుని ప్రతిమను మనము పూజించుచున్నామో, ఆతనిని గుర్తెఱుంగవలయును.

"నానాదేవతాప్రతిమలను జనులు ప్రేమపూర్వకముగఁ బూజించుచున్నారు. కాని వాస్తవములో నదియెద్దాని ప్రతిమయో ఆపరమాత్మ యిట్టిదని తెలిసికొనవలయును. తెలిసికొని భజియింపవలయును. ఎటుకయైనపిమ్మట అధికారికి వినయపూర్వకమగు వందనముల నెట్లు జేయుచున్నారో, అట్లే మూలపరమాత్మ నెఱింగి మూర్తిపూజనము నొనర్పవలయును" తనకల్పనానుసారముగ నిర్మింపఁబడిన పరమేశ్వరుని ప్రతిమయందు పరమేశ్వరుని ధ్యానించుటయే ఉపాసనము. ప్రతిమ (రూపము) ఎటులైన నుండనిమ్ము. మఱియు దానికేనామమైన పెట్టియుండనిమ్ము, కాని ముఖ్యవిషయమేమన్న! నది యొకేపరమాత్మ (వస్తువు) యొక్క భిన్నభిన్నప్రతిమలును నామములును నైయున్నవి. ఖండోబా, విఠోబా, నారాయణ, రామ, కృష్ణ, లక్ష్మి, శివ, విష్ణు, సరస్వతి, మున్నగు ననేక ప్రకారములగు నామములు ఆయనిర్వాచ్యమగు వస్తువునకొసంగబడినవియై యున్నవి. ఆయనిర్వాచ్యవస్తు [illegible] పరమాత్మయొక్క ఏకత్వమును ఉపాసన గావించుస [illegible] దివి [illegible] డదు. స్వధర్మ [illegible], కులధర్మము, వర్ణాశ్రమధర [illegible] యను ఒక యుపా [illegible] సాధ [illegible] మార్గము

ఎత్తైన సింహాసనముపై విరాజమానుఁడైయుండి తన విశేషాధికారముతో నెల్లరకును ఆజ్ఞనిచ్చుచుండును. ఇదేవిధముగ లక్షలు, కోట్లుసంఖ్యగల జనసమాజముమీఁద విశేషజ్ఞానకారణమునఁ బరమేశ్వరరూపమగు రాజ్యసంస్థ శాసనము గావించుచుండును.

వివేకే బహుత్ సైసావలే । ప్రాణీ అవతారీ బోలిలే ।
సును చక్రవర్తీ జాలే, యేణేచీ న్యాయే ॥ ౫ ॥ ద ౧౫ స ౩

నేటిదనుక నేయేయవతారరూపులగు రాజులు రాజ్యస్థాపనము నొనర్చిరో వారందఱును వివేకులై (జ్ఞానస్వరూపులై) యుండిరి. భగవంతుఁడగు శ్రీకృష్ణుఁడు గీతయందు "నరాణాంచ నరాధిపమ్" మనుష్యసమాజమునందు రాజును నేనై యున్నాఁడనని నుడువుచున్నాఁడు. ఈప్రకారముగ రాజు పరమేశ్వరరూపుఁడు. రాజ్యసంస్థ పరమేశ్వరుని యధిష్ఠానము. ధర్మమునకును, నీతికిని, సహాయము నొనరించుటయును స్వయముగ నదిగూడ ధర్మముయొక్కయు,నీతియొక్కయుఁ దోడ్పాటు (సహాయము)తో నడచుటయును నీరాజ్యసంస్థయొక్క ముఖ్యకార్యములు. ధర్మనీతుల యుద్దేశము పరమార్థప్రాప్తియని మొదట నుడివియున్నారము. కావున రాజ్యసంస్థయొక్క ముఖ్యహేతువుగూడ పరమార్థప్రాప్తియే కావలయును. పరమార్థము ముక్తి, మోక్షము (స్వాతంత్ర్యము) అనునవి మనుష్యజాతియొక్క ఉద్ధారమునుగూర్చి చెప్పఁబడునవి యనువిషయమును ధ్యానమునం దుంచుకొనవలయును. తాత్పర్యమేమన, ఎప్పుడు మానవసమాజము పరమార్థలాభము కొఱకు యత్నింపసాగునో, ఎప్పుడది పారతంత్ర్య మనుజాలము (వల) నుండి విముక్తినొందుటకు ఉపాయమును గావింప నారంభించునో, అప్పుడు దానికి నీతి, ధర్మము, రాజ్యము అను నీమూఁడు సంస్థల ఆశ్రయమును గైకొనవలసి వచ్చును. ఈసంస్థల యాధారముమీఁదనే మనుష్యసమాజము, నైతిక, ధార్మిక, రాజకీయ స్వాతంత్ర్యములను (పూర్ణ స్వాతంత్ర్యమును లేక మోక్షమును) ప్రాప్తిగావించుకొనును.

౧౨ పూర్వోక్త సంస్థల నెట్లు స్థాపింపవలయును ?

సమర్థుఁడు, పరమార్థప్రాప్తికి నీతి, ధర్మ, రాజ్యసంస్థ లావశ్యకమని మాత్రము నుడివి యంతటితో నూఱుకొని యుండలేదు. అతఁడు పరోపకారబుద్ధితో సమాజోద్ధరణము నొనర్చుటకు ఈసంస్థల నెట్లు స్థాపింపవలయునో దానినిగూర్చి గూడ విస్తారపూర్వకముగ వివరించెను. ౧ నీతిసంస్థ:—సిద్ధులగువారలు ఏకాంతవాసపూర్వకముగ లోకసముదాయమును ప్రోవుపఱచి యనుభవముతో తమకాలముయొక్క వాస్తవికమగు నైతికదశనుగూర్చి విచారము గావింపవలయును. ఉత్తమగుణములను

సంపాదించి లోకులకు నేర్పవలయును. మఱియు తమసముదాయమును ఉత్తరోత్తరముగ వృద్ధి నొందింపవలయును. సముదాయములోని మనుష్యులకు యోగ్యతానుసారముగఁ బనుల నప్పగింపవలయును. మఱియు వారలలో నేపురుషుఁడు సన్నిధియందుంచుకొనుటకు యోగ్యుఁడుగ నుండునో వానిని సన్నిధియం దుంచుకొనవలయును. ఎవఁడు దూరముగనుంచుట కర్హుఁడో వానిని దూరపుఁబనిపై నంపవలయును. జనమండలులను (సభాసమాజములను) నిర్మించి వానిలో భూతదయకు సంబంధించిన బీజారోపణమును గావించినచో నీతిస్థాపనము కాఁగలదు. కారణమేమన! జ్ఞానరూపముతో నెల్లర యంతఃకరణములు సమానముగా నుండునుగదా !

ఈజ్ఞానము సమస్త భూతములయందును (జీవులయందును) ఏకరూపముగ నుండుటకతన సమస్తజనులను ఆత్మతుల్యులుగ భావించుట మనుజుని సహజధర్మమై యున్నది. నీతిస్థాపనమును గూర్చిన యత్యంత సూక్ష్మమగు నీవిధిని ఇచ్చట మేము వివరించితిమి. దాసబోధయందు అత్యంత విస్తృతమగు వర్ణనము విశేషముగాఁ గావింపఁబడినది. అన్నివిషయములు మూలగ్రంథమును చదువుట వలననే విదితము కాఁగలిగి యున్నవి. ౨ ధర్మభజనసంస్థ- భక్తిమార్గము కొఱకు బ్రాహ్మణ మండలులను సంతుమండలులను భక్తమండలులను స్థాపిత మొనర్పవలయును.

బ్రాహ్మణ మండళ్యా మేళవావ్యా । భక్తమండళ్యా మానావ్యా
సంతమండళ్యా శోధావ్యా । భూమండళీ ॥ ౧౪ ॥ ద ౧౯ స ౬.

పరమాత్మని జ్ఞానపూర్వకముగ భజనమొనర్చుటతో దశదిశలు ప్రతిధ్వనింపవలయును. ఈయుపాయమువలన కర్మమార్గీయులును కర్మఠులును నగు బ్రాహ్మణులును జ్ఞానమార్గీయులును, సాధువులును నగు సంతులును మఱియు కేవల భజనప్రియులును, అన్నిజాతులకు అన్నివర్ణములకుఁ జెందిన భక్తులును, ఏకహృదయముతో ప్రేమపూర్వకముగ నొకచో సమావేశము కాఁగలరు. ధర్మస్థాపనము నొనర్చుట సిద్ధుల (సాధువుల) కు ముఖ్యకర్తవ్యమైయున్నది.

ఐసా జో మహానుభావ్ । తేణే కరావా సముదావ్
భక్తియోగే దేవాధిదేవ్ । అపులా కరావా ॥ ౩౨ ॥ ద ౧౨ స ౧౦
శాహాణే కరావే జన్ । పతిత కరావే పావన్
సృష్టీమధే భగవద్భజన్ । వాఢవావే ॥ ౩౩ ॥ ద ౧౮ స ౬

ఇట్టి మహానుభావులు సముదాయమును సమకూర్పవలయును. మఱియు భక్తిమార్గముతో నాదేవాధిదేవుఁడగు పరమాత్ముని సంతసింపఁ జేయవలయును. జనులయందు నానావిధములగు చతురత్వమును వ్యాపింపఁజేయవలయును. పతితులను పావనులుగ

జేయవలయును. మఱియుఁ బ్రపంచమునందంతటను భగవద్భజనమును వృద్ధినొందింపవలయును. ఈధర్మస్థాపనాప్రబంధమును సిద్ధులగువారలు తమ జీవితాంతమువరకు మాత్రమే జరుగునట్టిదిగ గావింపఁజనదు. ఏలయన!

ఆపణ అవచితే మరోఁజావే । మగ్ భజన్ కోణే కరావే ।

యాకారణే భజనాచ్ లావావే । బహుత్ లోక్ ॥ ౩౩ ॥ ద ౧౨ స ౧౦

అకస్మికముగ నొకదినమున మృతినొందినపిదప మరల భజనము నెవరుచేయుదురు? కావున పెక్కుమందితోఁగూడిన సముదాయముల నేకత్రపరచి భజనమునం దన్వయింపఁజేయవలయును. ఏదేని మతమును పూర్ణప్రసారము గావించుటకు ఒంటరియగు నొకమనుష్యునికంటె జనఘటితసమాజము (సభ్యసముదాయము) అధికోపయోగకరముగ నుండును. కొంద ఱాధునికు లీసమాజస్థాపనము విదేశీయులకడ మనము నేర్చుకొంటి మనుచున్నారు. శ్రీసమర్థుఁ డీమండలులను నిర్మించిన సంగతియు మండలులఁగూర్చి దాసబోధలోఁ బలుతావులఁ జేర్కొనినసంగతియు వారెఱుంగరు. ఇపుడిపుడు దేశీయులు సభలు, సమాజములు, మండలులు మున్నగువానివలని యుపయోగములను దెలిసికొనుచున్నారు. కాని యింకను నీవిషయమునఁ బెక్కుసంగతులను దాసబోధనుండి తెలిసికొని యనుష్ఠింపవలసియున్నది. బాధ్యత యంతగాలేని రేయుగ్గురునల్గురు వ్యక్తుల మనస్సులనో చేతిక్రిందికిఁదీసికొని నందువలన లాభమెద్దియును లేదు. మహాత్కార్యములసిద్ధి నిమిత్తము పెక్కుమంది మనోగతముల నెఱుంగవలయును.

జేణే బహుతా సఘడే భక్తీ । తేహేరోకిడీ ప్రబోధశక్తీ ।

బహుతాచే మనోగత హాతీ । ఘేతలే పాహిజే ॥ ౩౪ ॥ ద ౧౨ స ౧

సిద్ధులయందు ప్రబోధశక్తి (ఇతరులకు బోధగావించెడిశక్తి) యును, వక్తృత్వశక్తియును నుండుట అత్యంతావశ్యకము. ఎంతవరకు నీశక్తికలుగదో అంతవరకు పెక్కుమంది యొక్క మనస్సు లాతనిచేతికివచ్చుట కఠినతరము. కాదుకాదు. అసంభవము. మఱియు వారలమనోగతము నెఱుంగఁజాలకపోయినచో సముదాయములోఁ గలిపి వారిని భక్తులలో నెట్లు అన్వయింపఁజేయగలరు? ఈకార్యమునందు మిగుల ఆతురత (తొందర) గూడ కెందఁజనదు. తొందరపడినచో అనీతిమంతులును, అధార్మికులును, స్వార్థులును, బద్ధులును, నగువారలవలన విఘ్నముపాటిల్లుట కవకాశము గలదు. ఈవిషయమును మేము పైనసైతము నుడివియున్నారము. దాసబోధయం దీవిషయమును గూర్చి యన్నిటికంటె నధికమగు వివేచనము గావింపఁబడియున్నది. ఈ ధర్మమే ఈ గ్రంథమురొయొక్క ఆలోచ్యవిషయము. మేమిచ్చట సంక్షేపముగ వివరించితిమి. అధికముగ నెఱుంగవలయునను నుత్కంఠగలవారలు మూలగ్రంథమునే మననము గావింప

వలయును. ౩ రాజ్యసంస్థ:- ఈ సంస్థనుస్థాపించుటయందుఁగూడ సిద్ధులకును, సాధులు, నిస్పృహులు, మహాపురుషులకును, నీతి, ధర్మ, సంస్థలను స్థాపించెడివిషయమునందు వారికెంత బాధ్యతగలదో అంత కర్తవ్య బాధ్యతలుగలవు. ఈకార్యముకొఱకు సాధువులు మిక్కిలి గొప్పసముదాయ మేర్పరుపవలసియున్నది. మఱియు దానిని దృఢపూర్వకముగ తమ యాధీనమున నుంచుకొని యెల్లపుడు కర్తవ్యమునందు తత్పరత్వము నుంచవలసియున్నది. శ్రీసమర్థుఁ డీవిషయమునం దిట్లు నుడువుచున్నాఁడు.

సముదావ పాహిజే మోఠా । తరీ తనావా అసావ్యా బళకటా ।

మగ కరూఁ తాఠా । ధరూచ్ నయే ॥ ౨౨ ॥

గొప్ప సముదాయమును దృఢపూర్వకముగఁ దనయధికారమునం దుంచుకొనవలయును గాని మిక్కిలి నమ్మకమును, విశ్వాసమును, విశ్రామమును, గలిగించి సముదాయముతోఁ పనిగొనుచుండవలయును. ఏలయన! సముదాయము నేర్పఱచి దానిపట్ల ద్రోహచింతనగలిగి యుండఁజనదు. అట్లుగావించినచో పరస్పరవిద్వేషముదయించును. పూర్వోక్తవిధముగ దోషరహితమగు సముదాయ మేర్పడఁగనే పరమార్థబుద్ధి (మోక్షబుద్ధి) తత్క్షణమే జనులలోఁ జాగ్రత్త నొందసాగును.

తాయీ తాయీ ఉదండ్ తాబే । మనుష్యమాత్ తితుకే ఝోబే ।

చహుకడే ఉదండ్ లాబే । పరమార్థబుద్ధీ ॥ ౨౪ ॥ ద ౧౫ స ౨

"ఆత్మవత్సర్వభూతేషు" యను సూక్త్యనుసారముగ సమస్తజనులను, సమస్తసమాజములను, సకలరాష్ట్రములను ఆత్మవలె భావించుటయే, రాజకీయదృష్టిలో "పరమార్థబుద్ధి" యైయున్నది. ఈబుద్ధి సముదాయమునందు బద్ధజనసమాజమునందు సంపూర్ణరాష్ట్రమునందు ప్రకాశితమై దృఢమై నంతన నీతియొక్కయు, ధర్మముయొక్కయు సంస్థలు రక్షింపఁబడును. ఈప్రకారముగ సముదాయవ్యాప్తిని గావించుచు కష్టనిష్ఠురములను(దక్కాముక్కీలను)సహించుచుండువాఁడు చూచుచు చూచుచుండగనే భాగ్యశిఖరముమీది కెక్కిపోవుచున్నాఁడు (పరమార్థమునకు చేరిపోవుచున్నాఁడు).

వ్యాప ఆటోప కరితీ । ధకే చపేటే సోసితీ ।

తేణే ప్రాణీ సదేవ్ హోతీ । దేఖత దేఖతా ॥ ౪ ద ౧౫ స ౩

"టాకీ సహేనా దేవతా హోయ్" అనుసామెతగూడ నీయర్థమునఁగలదు. సుత్తెదెబ్బలవలన తరిగితరిగి విగ్రహము సిద్ధమగుచున్నది. అప్పుడే దానియందు దేవతాత్వమేతెంచును.

కష్టపడనిచో ఫలములేదు. చేయకున్న నేదియునుగాదు. రాజ్యము స్థాపింపకున్నచో నీతికిని, ధర్మమునకును రక్షణము లభింపదు. సిద్ధులును, సాధకులునగు వారలు

స్వాతంత్ర్యేచ్ఛగల (ముముక్షువులగు) జనుల సహాయముతో రాజకీయ సముదాయము నిర్మింపవలయునని శ్రీసమర్థుఁ డిట్లు దాసబోధలోఁ జెప్పియున్నాఁడు. "మానవుఁడు తనదేశమునకు రాజుగఁగాని, రాజప్రతినిధిగఁగాని యున్నవాని యాశ్రయమును బడయవలయును. ఆశ్రయరహితముగను ఏకాంగిగను నుంటమేలుగాదు.

సమర్థాచి నాహీ పాఠీ । తయాస్ భలతాచ కుటీ॥ ౩౦॥ ద ౧౬ స ౧౦

"సమర్థుఁడగు పురుషుని యాశ్రయముతో నుండనివానిని సాధారణుఁడగు మనుజుఁడుగూడ నులిమివేయును." ఈప్రకారముగ రాజ్యసంస్థను స్థాపించుట నీతిమంతులకును ధార్మికులగు నేతలకును అనుయాయులకును హితదాయకమైయున్నది. ఈ సంస్థయొక్క సహాయమువలన, జీవాత్మకు పరమాత్మతో సాయుజ్యత (పరమార్థము, మోక్షము, ముక్తి, లేక స్వాతంత్ర్యత) లభియించును.

పరమార్థీతో రాజ్యధారీ । పరమార్థ నాహీ తో భికారీ ।
యా పరమార్థాచీ సరీ । కోణాస్ ద్యావీ॥ ౨౩॥ ద ౧ స ౯

ఎవ్వఁడు పరమార్థియో అతఁడే రాజు. మఱియు నెవ్వనియొద్ద పరమార్థము లేదో యాతఁడే భికారి (భిక్షుకుఁడు-వ్యర్థజీవి). ఇట్టి పరమార్థమును దేనితో నుపమింపనగును?

౧౩ దాసబోధయొక్క విశేషత్వము.

దాసబోధయందొక విశేషముగలదని మేమిదివరకు నుడివియున్నాము. ఈగ్రంథములోని వేదాంతసిద్ధాంత నిరూపణము, సమర్థునికాలపు మహారాష్ట్రపరిస్థితి కనుకూలముగఁ జేయబడినది. మహారాష్ట్రముయొక్క యాసమయపుటవస్థయందు ఏవిధమగు నిరూపణము ఉచితముగను, ఆవశ్యకముగను ఉపయోగకరముగను నుండెనో, ఆదేవిధముగ నీ గ్రంథమునందు సమర్థుఁడు స్వతంత్రరీతితోఁ గావించెను. భగవద్గీతయందుగల వేదాంతనిరూపణతత్త్వము, సర్వదా యొకేవిధముగ సంబంధించియున్నను నాగీతాకాలీన సమాజపుటవస్థకధికముగ ననుకూలించుచున్నది. అట్టి నిరూపణము పదునేడవశతాబ్దమునందు సమర్థునికి అనావశ్యకముగఁ గాన్పించెను. కావున, నీగ్రంథమునందు ఉపనిషత్తులు, గీత, భాగవతము మున్నగుగ్రంథములలోని సిద్ధాంతములనే ప్రతిపాదించినను ప్రబంధరచనము, నిరూపణశైలి, దృష్టాంతములు మొదలగునవి యన్నియును కేవలము నూతనఫక్కిగలవిగను తత్కాలీన మహారాష్ట్ర పరిస్థితులకు సంబంధించినవిగను నున్నవి. దాసబోధ ఏదేని యన్యగ్రంథమున కనువాదముగాఁ గాని టిప్పణముగాఁగాని వ్రాయఁబడిన గ్రంథముకాదు. తనకాలపు సమాజము (దేశము)యొక్క నైతిక ధార్మిక రాజకీయదశలను పూర్ణముగ ధ్యానములోనికి తెచ్చుకొని సమర్థుఁడీగ్రంథమును స్వతంత్రబుద్ధితో నిర్మించెను. ఉపనిషత్తులు, గీత, భాగవతము

మున్నగు సంస్కృత గ్రంథములలోని వేదాంత విషయక సిద్ధాంతములను సమర్థుఁడు ప్రమాణభూతములుగ అవశ్యములుగ భావించినను ప్రాచీన సిద్ధాంతములపట్ల సమాజముయొక్క హృదయములయందు నిండియుండిన విపరీతార్థమును (భావనమును) ఈగ్రంథమునందు మారపరచెను. ఈగ్రంథమునగల రెండవ విశేషత యేమన్న! మనవేదాంతము నిరాశావాదియు లేక ఆలస్యవాదియుఁ గాదనువిషయ మీగ్రంథమునందు స్పష్టపరుపఁబడినది. ఇందు పైనిగూడ సన్న్యాసి, బైరాగి, సాధువేషములనుదాల్చి సమస్త లౌకిక కార్యములను పరిత్యజించి ఇతరుల యాధారముతో పొట్టనించుకొనుచుండెడి మనుజులు పెక్కుమంది సమాజమునందు కాన్పించుచున్నారు. వీరలులోకోద్ధరణమునకు సంబంధించిన మహత్కార్యమేదేని జేయుచున్నట్లు గోచరింపకపోయినను బహుజన సమాజమునందు గొప్ప జ్ఞానులుగను పరమార్థవేత్తలుగను సిద్ధపురుషులుగను విశ్వసింపఁబడుచుందురు. "ఓయన్నా (భాయీ)! కర్మత్యాగమును సన్న్యాసమని (విరక్తి లేక జ్ఞానమని) శాస్త్రము చెప్పుటలేదు. లోకులవలె వేయేల! అన్యజనులకంటె మిక్కిలియోగ్యతరముగ సంసార విషయక కృత్యములనన్నిఁటిని నెరవేర్చుచు ఆకర్మములయొక్క ఫలాశ (భోగములయందాసక్తి) నుంచుకొనకుండుటయే సత్యమగు జ్ఞానము. అదియే సత్యమగు సన్న్యాసము. అదియే సత్యమగు వైరాగ్య"మని మనవేదాంతగ్రంథములు మిక్కిలి బలముగ నెలుగెత్తి యఱచి శిక్షనొసఁగుచున్నవి.

అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః॥ ౧॥ భ. గీ. అధ్యాయము ౬.

"కర్మఫలముల యాధారము (సహాయము) నుంచుకొనక స్వవర్ణాశ్రమోచితమగు కర్మను జేయుచుండు నాతఁడే సన్న్యాసి. అతఁడే యోగి. అగ్నిహోత్రాది సత్కర్మలను త్యజించినవాఁడు, లేక కర్తవ్యకర్మములనువిడచినవాఁడు సన్న్యాసి, యోగి కాఁడు" కాని ఈసిద్ధాంతమును త్యజియించి జనులు పరోపజీవులును, అలసులును, మఱియు స్థాణువువలె (జడము లేక అచలమువలె) ను మారిపోయిరి. ఈజీవితక్రమము సిద్ధులయొక్కయు సన్న్యాసులయొక్కయు స్వభావములకు విరుద్ధమైయున్నది. ఈవిషయము సమర్థుఁడు భిక్షానిరూపణ నామక సమాసమునందు వివరించియున్నాఁడు. పరమార్థజ్ఞానులగు సిద్ధపురుషులు సాధారణ జనులకు (అజ్ఞులకు) పరమార్థమార్గమును చూపవలయును. అదివారికి కర్తవ్యధర్మము. ఈసిద్ధాంతము దాసబోధయందు అన్నితావులను ప్రతిపాదింపఁబడినది. మహంతులక్షణము, నిస్పృహుని ప్రవర్తనము, నిస్పృహుని లక్షణము, నిస్పృహ వ్యాప్తలక్షణము, మఱియు నిస్పృహశిక్షణము మున్నగు సంపూర్ణ సమాసములయందుగూడ నిదియే వర్ణనము గలదు. దాసబోధయొక్క

ఈవిశేషత్వము సదా ధ్యానమునం దుంచుకొనుటకు యోగ్యమైనది. సిద్ధులు, జ్ఞానులు, నగు వారల లౌకిక కర్తవ్య మెంత విస్పష్టముగను విస్తారపూర్వకముగను ఈగ్రంథమునందు వివరింపబడియెనో అంతగ నింకెచ్చటను గాన్పింపదు. మూఁడవవిశేషమేమన్న, దాసబోధయందు సముదాయము వలన పరమార్థ ప్రాప్తిమార్గము చూపఁబడినది. కాని ప్రాచీన వేదాంత గ్రంథములలో "వ్యక్తిమాత్రుఁడు నీతిధర్మములను లేక భక్తిని ఎట్లు ప్రాప్తి గావించుకొనవలయును!" అను దానినిగూర్చి మాత్రమే చెప్పఁబడినది. వానియందు సముదాయములను నిర్మించి సమాజమును నీతి ధర్మమార్గమునం దెట్లన్వయింపఁజేయవలయునో యావిషయవిచారము గావింపఁబడలేదు. ఈవిషయమునుగూర్చిన నిరూపణమే దాసబోధయొక్క ముఖ్యరహస్యము.

౧౪ తత్కాలీన పరిస్థితి.

ఈవిశేషత్వములకు గల కారణము ఆకాలపు మహారాష్ట్రముయొక్క పరిస్థితియైయున్నది. ఒకవేళ పరమార్థమునుగూర్చియును, దానిప్రాప్తికివలయు సాధనములనుగూర్చియును నీప్రకారముగ స్పష్టమును విస్తృతమును నగు వివేచనము గావింపబడకపోయినచో నాకాలపు పరతంత్రసమాజమున కేదేనిలాభము కలుగకపోయెడిది. ఆకాలపు సామాజికదశావర్ణమును స్వయముగ సమర్థుఁడు దాసబోధయం దొనర్చియే యున్నాఁడు. రాజ్యసంస్థ, పరకీయులును, విధర్ములును నగు జనులయాధీనమునం దుండెను. నీతికి, ధర్మమునకు ఉచ్ఛేదన మగుచుండెను. పరకీయజనులు హైందవప్రజను అన్నివిధములచేతను దుర్దశను గావించుచుండిరి. హిందూసమాజము బొత్తిగ తనాతునియలైపోయెను. దాసబోధలోని కలిధర్మనిరూపణమునందు ప్రాయికముగ నీపరిస్థితినిగూర్చిన వర్ణనముగలదు. మహమ్మదీయుల వైభవమునుగాంచి జనులు తమ యాచారవిచారములను, శాస్త్రసిద్ధాంతములను, రీతి, పద్ధతులను, దేవధర్మములను మ యు నడవడిని వదలివేయసాగిరి. తమ దేవస్థానములను త్యజియించి దావూదుల్ముల్కు అనుపేరుగల పీరు (పెద్ద) ను భజియింప నారంభించిరి. ఎందఱో హిందూజనులు ముసల్మానులైపోయిరి. బ్రాహ్మణులబుద్ధి తుడిచిపెట్టుకొనిపోయెను. హీనజాతులు బ్రాహ్మణులకు గురువులై కూర్చుండిరి. మానసిక దుర్బలత్వకారణమున బ్రాహ్మణులు గూడ హీనజాతుల యుపదేశములను వినఁజొచ్చిరి. శూద్రులు స్వధర్మముమాని బ్రాహ్మణాచారముల ననుష్ఠింపసాగిరి. మరియు బ్రాహ్మణులు వ్యభిచారమునందు దగుల్కొని తమలోఁదాము కలహింపఁదొడంగిరి. వర్ణవ్యవస్థయంతయును భ్రష్టమయ్యెను. ఒకరు ఇంకొకరిమాటను వినుటయును, తెలిసికొనుటయును మానిరి. ఈప్రకారముగ నీతిధర్మములయొత్తిడి సన్నగిలెను. తీర్థక్షేత్రములు భ్రష్టమయ్యెను. విగ్రహ

ములు ఖండింపఁబడియెను. స్త్రీలసతీత్వము హరణమొనరింపఁబడియెను. ఈవ్యవస్థను గాంచియే సమర్థుఁడు ౧౫౫౪ శకమున (౧౬౩౭ క్రీ. శ.) లోకోద్ధరణమునకు సంకల్పించెను. నీతిని, ధర్మమును, రాజ్యమునుస్థాపించి సమాజమును పరమార్థమార్గమునందన్వయింపజేయుటకు నిశ్చయించుకొనియెను. ఈనిశ్చయమునకు మూర్తిమంతమగు ఫలమే ఈదాసబోధగ్రంథము......

౧౫ సాధారణరీతిగ వివేచనపద్ధతులు నాలుగు.

మానవసమాజము వేలకొలఁది సంవత్సరములనుండి విడువక యొనరించు నభ్యుదయయత్నము ఏదియో బహువిధముల నిర్ణయింపవచ్చును. ౧ పలువురుశాస్త్రజ్ఞులు సమాజమునకుఁ గల ప్రాచీనాధునములగు నితిహాసములను విచారించి సమాజచరిత్రమీవిధముగ నుండియుండునని నిర్ణయించుచున్నారు. ముందీసమాజము పొందఁగల మార్పులకు భవిష్యచ్చరిత్రమువలన నెఱుంగనగును. భవిష్యత్తును దొలుతనుపవుట ఇతిహాసముల పనిగాదు. ఈపద్ధతినే యితిహాసపద్ధతి (Historical) యందురు ౨ శాస్త్రజ్ఞులు పలువురుయత్నించి సమాజ మేరూపమును దాల్చుచున్నదో నిర్ణయింతురు. అంతియగాక యీసమాజము ఏకసత్తాకముగనుండెనో బహుజనసత్తాకముగనుండెనో చాతుర్వర్ణ్య నియమానుసారముగ నడచెనో జాతియందెఉండెనో విమర్శించుచున్నారు. ఇదియె శారీరక పద్ధతి (Morphological) అందురు. ౩ కొందఱు తత్త్వజ్ఞులు సమాజ మేరూపముదాల్చినను పాటింపక దానిచరిత్రలక్షణములనే నిర్ణయించుచున్నారు. దీనిని లాక్షణికపద్ధతి (Physiological) అందురు. ౪ సమాజచరిత్రము శరీరలక్షణములవైపు ధ్యానముంచవలయునను నియతిలేనిది నాల్గవపద్ధతి. సమాజ దృశ్యధము గమనించుటయే యీపద్ధతికి లక్షణము. ఇందు సమాజమునడుపు ఆత్మచాలక మున్నే ముఖ్యముగా గమనింతురుగాన మొదట ఆత్మస్వభావము, రూపము, కార్యము, అంతిమహేతువులఁ జర్చించి సమాజలక్ష్యమును గ్రహింతురు. ఇదియె ఆత్మిక (తాత్త్విక లేక వైవేకిక) పద్ధతి (Psychological or Philosophical or Rational) యందురు. ఈ నాల్గు పద్ధతులలో సమర్థుఁడు దేనిని స్వీకరించెనో విచారింతము.

౧౬ దాసబోధలోఁ బాటించినపద్ధతి.

ఈనాలుగు పద్ధతులలో సమర్థుఁడు నాల్గవదియగు ఆత్మికపద్ధతిని సమర్థుఁడు తన దాసబోధలో స్వీకరించెను. యూరపులో శ్లేగల్, హేగల్ మున్నగు తత్త్వవేత్తలీపద్ధతినే యనుసరించిరి. తత్త్వవేత్తలందఱీపద్ధతి నామోదింతురనుట సత్యము. మానవజాతి ఆత్మపై సర్వవిధముల నాధారపడియున్నప్పుడు ఏవిధమైన సంచలనమునేని ఆత్మదృష్టితోఁ గావించుటయే యుచితము. ఇతరవిధములఁగూడ యోచింపవచ్చును గాని మానవజాతియొక్క అంతిమహేతువును గమనించినచో తాత్త్వికపద్ధతియె

పరిగ్రహింపదగినది. మొదటి మూఁడుపద్ధతుల నామోదించిన శాస్త్రిజ్ఞులు సమాజముయొక్క యత్నము, సుఖవృద్ధి, రాజపురుషుల సుఖసాధనమునైయున్నదనిరి. బ్లన్ట్లీ వంటి యితిహాసజ్ఞులు, రాజనీతిజ్ఞులు రాష్ట్రీయుల గుణములను వృద్ధినొందించుటయే రాజ్యస్థాపనయొక్క ముఖ్యోద్దేశమని వాకొనిరి. పాశ్చాత్యశోధకులు మహత్తరము అవ్యాహతమునగు మానవయత్నమునకు అంతిమహేతువేదియో పరీక్షింపలేకున్నారు. వారలు అంతరంగికముగా బాహిరముగ సమాజోపాధుల గమనింతురుగాన వారికి నిర్ణయశక్తి యలవడలేదు. ఉపాధుల వెలుపలఁచి శుద్ధము, విమలము, నిరుపాధియునగు ఆత్మస్వరూపముపైఁ బాశ్చాత్యులు ధ్యానముంచరు. అట్లుధ్యానముంచిన పాశ్చాత్యులలో హేగలు గావించిన నిర్ణయము శ్రీసమర్థుని నిర్ణయముతోఁ జాలవఱకు కేకీభవించుచున్నది. తత్త్వజ్ఞుఁడు వేదాంతియునగు హేగలుపండితుఁడు ఆధ్యాత్మికదృష్టితో మానవసమాజపు టంతిమోద్దేశము Philosophy of History అను గ్రంథమున నెట్లువ్రాసెనో తెలిసి సమర్థుని దాసబోధమతముతో నాతనిమత మెంతవఱ కేకీభవించునో నిర్ణయించుట ప్రకృతమైయున్నది.

౧౨ హేగల్ పండితునియు సమర్థునియు మతమునందుఁగల సమానత్వము.

"ఈజగము ఆత్మమాయల సంఘటనముతో నిర్మింపఁబడెనని తోఁచుచున్నది. చిత్స్వరూపముగ నున్నదంతయు నాత్మ. పంచభూతాత్మకముగ నున్నదంతయును మాయ. మానవేతిహాసమున మాయావులగు పంచభూతములకంటె ఆత్మకు వేయిరెట్లు మహత్త్వముగలదు. కావునఁ బ్రధానమగు నీయాత్మగమనమునకును దాని మూర్త్యవతారములకు సంబంధించిన యితిహాసమునకు మానవజాతీయేతిహాసమను పేరిడవచ్చును. మాయయొక్క ముఖ్యలక్షణము జడము. అది పరతంత్రతగ నున్నది. ఆత్మయొక్క ముఖ్యలక్షణము సూక్ష్మత లేక మోక్షము. ఆత్మ స్వయంభువు. స్వతంత్రము, స్వసంవేద్యము. (తన్నుఁదానెఱుంగునది) ఆత్మ తనముఖ్యరూపమును (మోక్షమును లేక స్వతంత్రమును) అన్వేషించుచుండును. ఈయన్వేషణ ప్రయత్నమునే మానవేతిహాసమందురు. ఈయితిహాసమును సూక్ష్మదృష్టితో విచారించినచో యూరపియన్ జర్మను సమాజములకు మనకుందఱము ముక్తులమేయని విదితమగునట్లు తోఁచును. గ్రీకు, రోమన్ దేశీయులకుఁ గొందఱు మనుజులుమాత్రమే ముక్తులగుటకు యోగ్యులని తెలిసియుండెను. హిందువులు, చైనీయులు మున్నగువారికి ముక్తుఁడొక్కఁడేయని తెలిసియుండెను. ఆత్మయొక్క ముక్తస్వరూపమున నీవిధముగా నీమూఁడుసమాజములకును భిన్నభావములున్నందుననే యూరపియనులు స్వతంత్రులుగను గ్రీకులు రోమనులు అంశమాత్ర స్వతంత్రులుగను, హిందువులు, చైనీయులుపూర్ణపరతంత్రులుగను నున్నారు. ఈవిధముగ బద్ధత్వము, ముముక్షుత్వము, ముక్తత్వములే ఆత్మేతిహాస విధములు. కాని మానవసమాజమున కంతిమోద్దేశము ముక్తి (మోక్షము లేక స్వతంత్రము)యైయున్నది. ఈస్వాతంత్ర్యతయే, ఈమోక్షమే, ఈస్వసంవేద్యమే, ఆత్మతత్త్వము. ఈతత్త్వములోని కరిగి కలియనెంచువాఁడు (ముముక్షుఁడగు ఆత్ముఁడు) ధర్మము, నీతి, రాజ్యములను నీమూఁడురూపము లొందుచున్నాఁడు, ఇందు మూఁడవరూపమగు రాజ్యచరిత్రమునే

రాజకీయేతిహాస మందురు. ఆత్మరాజ్యరూపముతో మూర్తీభవించి యవతీర్ణమైనంతన స్వతంత్రసిద్ధికి మార్గము తెలుపఁబడినదని తెలిసికొనవలయును. ఈమార్గములఁదెలుచు సీజరు, నెపోలియన్లవంటి వీరపురుషులందు రాజసతామసపసాత్త్వికగుణములుండును. వారల ప్రభావముననే జగదుద్ధరణము జరుగుచున్నది. అనఁగా ఆత్మ తనతత్త్వమువైపు (పూర్ణస్వాతంత్ర్యమువైపు) పోవుచున్నదని భావము. ఇట్టి పురుషులను అవతారమూర్తులని వీరపురుషులని యందురు. రాజ్యము అపరమాత్మ (జీవాత్మ) యొక్క తత్త్వాధిష్ఠము (మూర్తిస్వరూపము) ఐయున్నయెడల దానియందలి రాజ్యహితదృష్టి రాజ్యస్థాపకులయొక్కయు, సంబంధులయొక్కయు హితదృష్టితో నన్నివిధములచేతను లగ్నమగుచున్నచో నదియే యుత్తమమైనది. ఈవిధమగు కలయికకై ప్రతిమనుజుని కాత్మతత్త్వము తెలియవలసి యున్నది. ఈ సంస్థలవలన రాజ్యస్థాపకులగు వ్యక్తుల హృదయములయందు ఆధ్యాత్మికజ్ఞానము నార్జించు సాత్త్విక రాజసగుణములు ప్రాదుర్భావమగును." హేగల్ పండితుఁడు తనఫిలాసఫి అఫ్ హిష్టరీ (Philosophy of History) యందు ఇట్టి సంస్థలనన్నింటిని విచారింపలేదు. సమర్థుఁడు తనదాసబోధలో విపులముగాఁ జర్చగావించి యున్నాఁడు.

౧౩ తత్త్వజ్ఞానమున హేగల్‌కు సమర్థునకుఁగల మతభేదములు, హేగల్ భ్రమ.

సంక్షేపముగ నుదాహరించిన పై యుదాహరణమువలన దాసబోధయొక్కయు హేగల్‌యొక్కయుఁ దత్త్వజ్ఞానములందుగల సమత్వము పాఠకులు గ్రహించియుందురు. హేగల్‌యొక్కయు శ్రీసమర్థ రామదాసస్వామి యొక్కయుఁ దత్త్వజ్ఞానమునందు శ్రద్ధతో గమనింపఁదగిన యొక ముఖ్యభేదముగలదు. హేగల్ పండితుఁడు భ్రమపడి హిందూదేశమునుబట్టి యొక్కఁడె ముక్తుఁడనియుఁ దక్కినవారలందఱు బద్ధులనియుఁ దలంచెను. హేగల్ పండితుఁడు తన యితిహాసము క్రీ. శ. 1822 లోనుండి 1831 దనుక రచించెను. ఆకాలమున హేగలుమొదలగు పాశ్చాత్యులకు పదునేడవశతాబ్దమున ఆత్మతత్త్వశోధనమునందు మహారాష్ట్రులొనరించిన ప్రచండ క్రాంతిస్థితి తెలిసియుండదు. ఉపనిషత్తులును శ్రీసమర్థుని గ్రంథములును హేగలు తత్త్వజ్ఞుఁడెఱింగియున్నచో హిందువు లాత్మతత్త్వమును శోధించినవిధము ఆత్మతత్త్వమునకు శ్రీరామదాసస్వామి శివాజిచక్రవర్తి మూర్తిస్వరూపము నొసంగిన రీతి చక్కఁగఁ దెలిసియుండెడిది. శ్రీసమర్థ రామదాసస్వామి అందఱును ముక్తులని కంఠోక్తిగఁ జెప్పినాఁడు. (దాసబోధ ద ౫ స ౬ చూ.)

మహారాష్ట్రేతిహాసము మహారాష్ట్రసాహిత్యము నెఱుంగని కారణమునే హేగలు విద్వాంసుఁ డిట్లు అసత్యకల్పనము గావించెను. హేగలువిద్వాంసుఁ డితిహాసము రచించుకాలమున హిందూదేశ రాజకీయస్థితి భిన్నభిన్నముగా నుండెను. ఆ విపరీత పరిస్థితులు మిల్లు మొదలగువారలు విపరీతముగ వర్ణించిరి. హేగల్ పండితుఁడు తన యనుమానము నావిపరీతవర్ణనమువలన స్థిరపఱచుకొనెను. ఈ యార్యభూమియందుఁ బదొమ్మిదవ శతాబ్దమున మహారాష్ట్రులు సాత్త్వికసంపద కోల్పోయిరని దోషమా

సాధించినచో వినవచ్చును గాని పను నేఁడవశ్యకము నాఁటి సుగుణములను యూరోపియను తెలిసికొనియు మఱుఁగుపఱచుట పక్షపాతలక్షణమనక తప్పదు. ఈ పక్షపాతముచనే హేగల్ మహాశయుఁడు హిందువులలో నొక్కఁడె ముక్తుఁడను నసత్యకల్పనము గావించినాఁడు. సద్గుణములవలన హిందువులెల్లరు స్వతంత్రులగుటకు యోగ్యులని వేదాంతము, గీత, రామదాసస్వామి పదేపదే నుడువుట పక్షపాతియగుటచే హేగల్ గ్రహింపకపోయెను. నేఁటికి మూఁడువందల సంవత్సరములనుండి యేహేతువుచేఁ బాశ్చాత్యులు పరమార్థము వైపునకేగుచుండిరో ఆహేతువు మహారాష్ట్రులకుఁగూడ నుండెనని రానడేమహాశయుఁడు మహారాష్ట్రేతిహాసమునందు వ్రాసియున్నాఁడు. ఈమహారాష్ట్రేతిహాసము నూఱు సంవత్సరములకుముందె వ్రాయఁబడియున్నయెడల హేగల్ వంటివారలు ప్రపంచేతిహాసమునందుఁ గొంతమార్పుచేయవలసివచ్చెడిదె. మహారాష్ట్రేతిహాసము ప్రపంచేతిహాసమునందొక ముఖ్యాధ్యాయమనుసంగతి సర్వజనసమ్మతమైయున్నది. ఇంతవఱకొనర్చిన చర్చవలన దాసబోధగ్రంథస్వరూపము పాఠకులకువిశదమైయుండును. ఈగ్రంథము వాస్తవికమగునితిహాసతత్త్వజ్ఞానముతోఁ బూర్ణమైయున్నది. కాని యిందలివివేచనాపద్ధతిమాత్ర మైతిహాసికము గాదు. అది యాధ్యాత్మికము.

౧౯ దాసబోధయందు యోగమేల చెప్పఁబడలేదు?

గ్రంథసిద్ధాంతములను చర్చగావించినమీఁదట శ్రీసమర్థుఁడు భక్తి, జ్ఞాన, కర్మ మార్గములనుజెప్పి యోగమార్గము నేలవిడిచియుండెనని పాఠకులు సందేహింపకపోరు. ఇందులకుఁ గారణము వినుండు. వేదాంతమునందు యోగమార్గమునకు మహత్త్వము లేదు. సమర్థుఁడు బట్టుదలగల యద్వైతవాదిగావున యోగసంబంధములగు పటాటోపములను వర్ణింపలేదు. యోగశిక్ష సామాన్యజనుల కసాధ్యమనియే సమర్థుఁడు తన గ్రంథములలో వానిని బేర్కొనలేదు. యోగమునకు నిర్వ్యాగము, శాంతము నగుప్రదేశము కావలయును. మితము సాత్త్వికమునగు భోజనము కావలయును. మౌనము శాంతవృత్తి యుండవలెను. ఇట్టివె యింకఁగొన్నియున్నగాని యోగము కుదురదు. ఈవిషయముల యోజించితిమేని గృహస్థులగు సంసారులకు యోగమార్గ మసాధ్యమని సైతముతోఁచును. కావననే సమర్థుఁడు యోగము నుపదేశింపలేదు. వాస్తవమున కతఁడట్లుచేయుటయే యుచితముగనున్నది. దాసబోధలో శ్రీసమర్థుఁడు గావించిన కర్మమార్గ, భక్తిమార్గ, జ్ఞానమార్గోపదేశములు అత్యంతసులభములు అమూల్యములు నైయున్నవి.

౨౦ ఉపసంహారము.

దాసబోధలోని రహస్యములనెఱింగి దానినిగ్రహించుటకుఁ జలుమాఱు గ్రంథమును జదువుటయు అందలిసిద్ధాంతములను మననపూర్వకముగా విచారించుటయు నత్యంతావశ్యకము. ఈగ్రంథములోని సిద్ధాంతముల కనుకూలముగా నాచరణమొనరించినచో మనరాష్ట్రము అభ్యుదయమునకు రాఁగలదు.

*

ఓం

శ్రీ సమర్థరామదాస జీవితము.

* "యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"

భగవద్గీత ౪-౭

ధర్మమునకు హానిగలిగినపుడు సాధుజనులను రక్షించుటకును, దుష్టులను వినాశము గావించుటకును, ధర్మమును స్థాపించుటకును బరమాత్ముఁ డవతరించునను సిద్ధాంతముపై సనాతన ధర్మావలంబులందఱకు సంపూర్ణమగు విశ్వాసము గలదు. ఈవిశ్వాసము ననుసరించియే మనము శ్రీరాముని, కృష్ణుని, విష్ణుమూర్తిని అవతారపురుషులుగా భావించుచున్నారము. ఇట్లె మహారాష్ట్రదేశమునందు మహానుభావుఁడును ధర్మసంస్థాపకుఁడును జితేంద్రియుఁడునగు శ్రీ సమర్థ రామదాసస్వామిని హనుమంతుని యవతారముగా నమ్మెదరు. దీని కనుగుణముగా నచటికి విద్వాంసులు భవిష్యత్పురాణమునందున్న యీ క్రింది శ్లోకమును ఉదాహరణముగాఁ గూడ జూపుచున్నారు.

"శ్లో॥ కృతేతు మారుతాఖ్యాశ్చ త్రేతాయాం పవనాత్మజః
ద్వాపరే భీష్మసంజ్ఞశ్చ రామదాసః కలౌయుగే॥"

ఆంజనేయునకు ఏయేయుగములం దేయే యవతారములుండెనో యీశ్లోకమునఁ జెప్పఁబడెను. సత్యయుగమగు కృతయుగమునందలి హనుమానునియవతారమును మారుతియందురు. త్రేతాయుగమునందుఁ బవనాత్మజుఁ డందురు. ద్వాపరయుగమునందు భీష్ముఁడందురు. కలియుగమునందు రామదాసుఅని నుడివెదరు. శ్రీరామదాసస్వామిగూడఁ దనను గూర్చి చెప్పుకొను తావులయందుఁగూడ నీ భావము కొలఁదిగనో గొప్పగనో ధ్వనించుచున్నది. శ్రీరామదాసస్వామి సామాన్యమానవుఁడు

* అర్జునా! ధర్మమునకు హానికలిగి అధర్మమునకు వృద్ధియేర్పడుచున్న కాలమునందు నేను భూలోకమునందు మాయచేత జనించి వచ్చుచున్నాఁడను.

గాఁడు. గొప్పభగవద్భక్తుఁడు. యోగ్యతరుఁడగు సాధువు. రాచికుఁడగుకవి. ఇంతియగాదు విశేషించి రాజనీతికోవిదుఁడుగూడ నైయుండె ననుటకు సందియము లేదు. ఆయన చరిత్రము, లీలలు అనుపమానములు. ఆతఁడు యవనపద దళితమై పరాధీనదశయందుండి తొల్లింటిసత్త్వమును గోల్పోవనున్న మహారాష్ట్రదేశమునందు జనించి తన యప్రతిమమగు నిస్పృహత్వము, పారమార్థికము, శిక్షణము వెల్లడించి స్వధర్మస్వరాజ్యస్థాపనములలోఁ బాటుపడి "సమర్థ" పదవిని గడించెను. మహానుభావుఁడగు శ్రీసమర్థ రామదాసస్వామి జీవితము పూర్తిగా నీచిన్నిపొత్తమునఁ జెప్పుట యసంభవము. ఐనను శక్తికొలందిగఁ జరిత్రమును విశదీకరింపఁ బ్రయత్నించెదము.

—* వంశపరంపర జన్మము *—

దక్షిణదేశమునందు హిందూరాజులు రాజ్యస్థాపనము గావించు కాలమునందు, అరణ్యప్రాంతములను నగరములుగా మార్చుటకును పాడుబడిన గ్రామములను బునరుద్ధరించుటకును అన్యప్రాంతములయం దున్న జనులను దమరాజ్యములో నివసించుటకై ధనమును భూమిని నొసంగి కొనివచ్చుచుండిరి. ఆకాలమున నిజాముషాహిపాలనమునందున్న బీదరుప్రాంతమునఁగల ప్రజలు పలువురు గోదావరీనదీతీరమునకు వలస బోయి యచట స్థిరవాసము లేర్పఱచికొనిరి. అటులేగినవారిలో మన కథాంశమునకు మూలపురుషుఁడగు కృష్ణాజిపంతుతోసరు అను నొకమహారాష్ట్రబ్రాహ్మణుఁ డుండెను. ఆతఁడు శా. శ. 884 (క్రీ. శ. 962) లో ఉత్తరగోదావరీతీరమునందున్న బీదుప్రాంతమునందలి హిబరాయను గ్రామమునకుఁ జనుదెంచి యందుఁ గుటుంబసహితముగా నివసించెను. ఆతఁడు బీదుప్రాంతమునఁ బెక్కుగ్రామములను స్థాపించెను. ఆయనకు నలువురు పుత్రులుగలరు. పెద్దకొడుకుపేరు దశరథపంతు. ఈదశరథపంతు తన తండ్రిసంపాదించినయాస్తిలో భాగమునుగైకొనుట యుచితముగాదనియు స్వార్జితజీవనము ప్రశస్తమని తలంచి హిబరాకుఁ గొంచెముదూరమునఁగల బడగాపునకుఁ బోయెను. ఆగ్రామమునందు జనావాసము లేకపోవుటచేఁ బాడువడియుండెను. అచ్చటి యరణ్యములలోఁ బశులగాపరి జాతివాండ్రు గోవులను మేపుకొనుచుఁ గుటుంబములతో నివసించుచుం

డిరి. ఆగోపాలకులలో ముఖ్యుఁడగు "లఖుమాజి" యనువానిని జమీందారునిగఁ జేసి దశరథపంతు అచట కుల్కర్ణి (కరణము) గను బురోహితుఁడుగను బనిచేయుచుండెను. వారలాగ్రామమునకు జాబ్ అని పేరిడిరి. ఈగ్రామమే శ్రీరామదాసస్వామికి జన్మభూమిగాన నీకాలమున అత్యంతపవిత్రక్షేత్రముగా భావింపఁబడుచున్నది. అనంతరము జాబు నగరమునకుఁ జుట్టుపట్టుల నెన్నియో గ్రామములు గట్టిరి. ఈగ్రామములన్నింటికిని గరణికము, పురోహితత్వము దశరథపంతునకే సంక్రమించెను. దశరథపంతు శ్రీరామభక్తుఁడు. అంతియగాక రామమంత్రోపాసకుఁడు. అతనికి ఆఱుగురుతనయు లుదయించిరి. పెద్దవానిపేరు రామాజీపంతు. తండ్రిమరణించినతరువాత రామాజీపంతు జాబుయొక్కయుఁ బరిసరగ్రామములయొక్కయు వృత్తుల కధికారియయ్యెను. పైనిఁ బేర్కొన్న కృష్ణాజీపంతు, దశరథపంతు, రామాజీపంతు అనువారలు మనకథానాయకుఁడగు శ్రీసమర్థరామదాసవంశమునకు మూలపురుషులు. రామాజిపంతునకుఁ బిదపఁ బందొమ్మిదవ తరమునందు సూర్యాజీపంతు అను ప్రసిద్ధభగవద్భక్తుఁడును, బ్రహ్మజ్ఞానియునగు నొకపురుషుఁడు జనించెను. ఆతని భార్యపేరు రాణుబాయి. ఈదంపతులే రామదాసస్వామికిఁ దలిదండ్రులు.

మన యార్యావర్తమునందలి భగవద్భక్తుల వంశములలో నొక విచిత్రమగు పరిస్థితి కనిపించుచున్నది. ఈవంశములలో జనించిన బాలురకు నాలుగైదుసంవత్సరముల యీడుననే విరక్తియు, భక్తిలక్షణములును బ్రకటనమగుచుండును. ఈలోకమున నాలుగైదు వత్సరముల సంస్కారమువలననే యింతటి పరిణామము బాలకులలోఁ గలుగుట యసంభవము. ఈసంస్కారము పూర్వజన్మసంచితమని తోఁచుచున్నది. సూర్యాజీపంతుస్థితిగూడ నిట్టిదే. బాల్యావస్థనుండియే యాతఁడు భగవద్భక్తుఁడును విరక్తుఁడునై సద్గుణశాలియని పేరొందెను. పండ్రెండు వత్సరములప్రాయమునందె యాతనిభక్తి సూర్యనారాయణమూర్తిపైఁ గుదురుకొనెను. సూర్యాజీపంతు తనకరణికపుఁబనులు జేయుచు మిగిలిన విశ్రాంతికాలమునందెల్ల సూర్యనారాయణోపాసనమునందే గడుపుచుండెను. ఇట్లు సూర్యాజీపంతు ముప్పదియాఱుసంవత్సరముల వయస్సు

వచ్చువఱకు సూర్యదేవునియనుష్ఠానము సలిపెను. చివర కొకదినమున కీసూర్యనారాయణుఁడు ప్రత్యక్షమై సూర్యాజీపంతున కభిమతమునెఱింగి యిరువురుకుమారులు జనించునటుల వరమునొసంగెనని చెప్పుదురు. శా. శ. ౧౫౨౭(క్రీ.శ.1605)లో సూర్యాజీపంతునకుఁ బ్రథమకుమారుఁడు జనించెను. ఆ బాలునకు గంగాధరుఁడని నామకరణ మొనరించిరి. బాలుఁడనంతరము దినదినాభివృద్ధినొంది "శ్రేష్ఠ" "రామి రామదాసు" అను నామములతోఁ బ్రసిద్ధుఁడయ్యెను. శా. శ. ౧౫౩౦(క్రీ.శ. 1608 ఏప్రియలు నెలలో) కీలకనామ సంవత్సర చైత్రశుద్ధ నవమీదినమునఁ బట్టపగలు రెండుయామముల సమయమున (సరిగా శ్రీరామజన్మ సమయమున) సాధ్వీమతల్లియగు రాణుబాయికిని సూర్యాజీపంతునకును ద్వితీయపుత్రుఁ డవతరించెను. ఆశిశువునకు నారాయణుఁడని నామకరణమొనరించిరి. ఈనారాయణుఁడే శ్రీసమర్థ రామదాసస్వామియను పేరునఁ బ్రసిద్ధినొందినమహాపురుషుఁడు. ఈతఁడే మన యీచరిత్రమునకుఁ గథానాయకుఁడు. సూర్యాజిపంతుగృహమున నీతఁడు జనించిననాఁటనుండి సుఖసమృద్ధికిని, శాంతికిని గొఱంతలేకుండెను. ఆకాలమున మహారాష్ట్రప్రాంతమునందు "ఏకనాథ మహారాజ" అను సుప్రసిద్ధుఁడగు బ్రహ్మజ్ఞాని యుండెను. సూర్యాజీపంతు ప్రతిసంవత్సరమును దనభార్యతోఁగూడ నాతనినిసందర్శించుటకు నేగుచుండెను. వారు సూర్యాజీవంతు దర్శన మొనరించి సెలవునొంది వచ్చునపుడెల్ల ఏకనాథస్వామి రాణుబాయిని జూచి "నీగర్భమునందు ఇరువురుమహానుభావులగు తనయులు జనింతురు." అని యాశీర్వదించి పంపుచుండెను. సమర్థరామదాసస్వామి జనించిన పిదప సూర్యాజిపంతు తనభార్యాశిశువులతో నెప్పటివలె ఏకనాథస్వామిని సందర్శింపనరిగెను. ఏకనాథమహారాజు వారలను దనచెంతఁ గొన్నిదినము లుంచికొని అతిథిసత్కారము లొనరించి వారు సెలవునొంది పోవునపుడు ఈ భవిష్యద్వాణి నాపుణ్యదంపతులను సంబోధించి నుడివెను.

"ఓపూజ్యదంపతులారా! మీరు మిగుల ధన్యులరు. మీగర్భములు ధన్యములు. మీవంశముగూడ ధన్యమైనది. మీయుపాసనయు మీభక్తియు నిరుపమానములు. కావుననే ఆంజనేయుని యంశముతో నీబాలకుఁడు మీయొద్ద నుత్పన్నమయ్యెను. శివాంశముతోఁ బ్రసిద్ధచ్ఛత్రపతియగు రాజొకఁడు మహారాష్ట్రదేశమునందు జనింపనున్నాఁడు. ఆతనివలన మీకుమారుఁడు భూభారహరణము జేయించును. అంతియగాక జనోద్ధారణముగూడ నొనరించును. నేనారంభించిన ధర్మకార్యములన్నియు నీతఁడె సంపూర్ణ మొనరింపఁగలఁడు. ఇఁక నేను నాయవతారము సమాప్తిగావింపనున్నాఁడను."

ఈ భవిష్యద్వాణిని నుడివిన కొలఁదిదినములకే ఏకనాథస్వామి నిర్యాణమునొందెను.

— * బాల్యావస్థ - విద్యాభ్యాసము * —

సమర్థుఁడు బాల్యమున నిరంతరము ప్రసన్నహృదయుఁడుగను, హాస్యవదనుఁడుగను నుండువాఁడు. ఏడువ నెట్టిదియో యాతఁ డించుకేని యెఱుంగఁడు. శీఘ్రకాలముననే యాతఁడు మాటలాడుటకును నడచుటకును నేర్చుకొనెను. శరీరము దృఢతరముగను దేజోయుక్తముగను నుండెను. అతఁడు చిన్నతనమున మిగులఁ గొంటెవాఁడుగను ఉపద్రవకారుఁడుగనుండి యెల్లప్పుడును గ్రీడాలోలుఁడై గంతులు వేయుచు నిముసమేని నిలిచినచోట నిలువకఁ దిరుగుచుండెను. చపలత్వ మాతనికి రోమరోమమున నిండియుండెను. వానరునివలె నిచటినుండి యచటికిని అచటనుండి యిచటికిని దిరుగుచుండుటయుఁ దనవెంటనుండు బాలురఁజూచి మూతివికారముగాఁబెట్టి యుఱుకుటయు వెక్కిరించుటకూడయు నాతనికొకయాటగా నుండెను. ఈబాలుఁడు హద్దుపద్దులులేకుంట చేనపాయకరముగు దండగము లొనరించుచున్నాఁడని తల్లిదండ్రులు గమనించి యొకయుపాధ్యాయునికడ నప్పగించి చదువవేసిరి. ఉపాధ్యాయుఁ డాకాలమునఁ జెప్పువిద్యను జ్ఞానమును నీబాలుఁడు కొలఁదికాలముననే పూర్తిగా నేర్చుకొని మరల నిటునటు ఆడుటకును గంతులువేయుటకును మొదలుపెట్టెను. గ్రామములోని బాలురను వెంటనుంచుకొని గోదావరీతీరమునకరిగి యచ్చటివృక్షములమీఁదికి వానరమువలె నెక్కుచుండెను. ఒకచిన్న వ్రేలాడుకొమ్మమీఁదికిగూడ నాతఁ డత్యంత సులభముగా నెక్కుచుఁ దిరుగుచు నుండెను. ఒక్కొక్కప్పుడు గొప్పగొప్పవృక్షముల కొనకొమ్మలకు నెగఁబ్రాఁకి వానినూపుచుండును. ఒక్కొక్కప్పుడు వృక్షాగ్రమునుండి క్రిందనున్న బాలు

రకుఁ దగులునటులఁ బండ్లగుత్తులఁ ద్రెంపి విసరివైచుచుండెను. చెట్లనెక్కుటలో నాబాలునకుఁగల సామర్థ్యమునుగాంచి జనులెల్ల రాశ్చర్యపడుచుండిరి. ఆతని వెంటనుండు బాలురు చెట్టులెక్కి కొమ్మల నూపుచుండఁ జూచి "అయ్యయ్యో! నారాయణుఁడు పడఁబడె"నని తలఁచుచుగా నఱచు వాడుకగలదు. నీటిలోనికిఁ జెట్లమీఁదినుండి దుముకుటయు, ఈఁదుటయుఁ గూడ నాబాలునకు మిగుల ప్రియముగానుండెడిది. ఇల్లు గ్రామబాహ్యప్రదేశమున నాబాలుఁ డాటలాడుచుండువాఁడు. ఇంతియగాక గ్రామములో నున్నంతసేపుగూడ నిటులే చేయువాఁడు. ఒకానొకప్పు డొకయింటికప్పుమీఁదినుండి గోడమీఁదికిని, మఱియొకప్పు డొకవృక్షాగ్రము నుండి యొకయింటిమీఁదికిని దుముకువాఁడు. ఆబాలకుఁడు చేయు బాల్యలీలలనన్నింటినిగాంచి జనులందఱు వీఁడు హనుమదవతారముగఁ దలంచిరనుటలో నాశ్చర్యమేమియును లేదు. ఆటలయం దత్యాసక్తిగలవారై చాపల్యముగఁ దిరుగుబాలురు ప్రౌఢావస్థకువచ్చినపిదప గొప్పప్రతిభాశాలురగుదురని కొందఱు విశ్వసింతురు. ఈవిశ్వాసము సమర్థుని విషయమునఁ జాలదనుక సరిపోవుచున్నది. ఐదవసంవత్సరము సమర్థునకువచ్చియు రాకముందె సూర్యాజీపంతు ఉపనయనము మిగుల వైభవముతో జరిపెను.

ఉపనయనానంతరము సూర్యాజీపంతు సమర్థునకు సంధ్యావందనాదికములను నేర్పుటకై యొకవైదికబ్రాహ్మణుని నియోగించెను. సమర్థుఁ డాబ్రాహ్మణునికడ అక్షరములను మనోహరముగా వ్రాయుటయు, నిత్యనైమిత్తిక కర్మము లొనరించుటయు నభ్యసించెను. సంస్కృతముగూడఁ గొంతవరకు నేర్చెను. సూర్యాజీపంతు అంతలోఁ బరలోకగతుఁడయ్యెను. సోదరు లిరువురును దండ్రికి ఉత్తరక్రియలు గావించిరి. తండ్రి గతించినపిమ్మట గంగాధరుఁడు తనసోదరుఁడగు సమర్థుని విద్యాభ్యాసమునెడదృష్టినుంచి శ్రద్ధతోఁ జదివించుచుండెను. సమర్థునిగ్రంథములను గాంచితిమేని యాతఁడు సంస్కృతమునందు మంచిపండితుఁడని గోచరించును. పాండిత్యమునందెగాక ఉపనిషత్తులు, భగవద్గీతలుమున్నగునాధ్యాత్మిక గ్రంథములందుఁగూడఁ జక్కనిపరిచయము సమర్థుఁడు సంపాదించెను. తనకుఁగలవేదాంతగ్రంథానుభవమును దాసబోధలోని మొట్టమొదటిసమాసములో విపులముగాఁ జెప్పియున్నాఁడు. సమర్థుఁడు వేదమున కర్థము

స్వయముగ గ్రహించునంతటి పాండిత్యముగలవాఁడనియు బహుశ్రుతత్వముచే వేదాంతవిషయమున అగాధమగు పరిజ్ఞానము గడించెననియుఁ జెప్పవచ్చును.

మంత్రోపదేశము.

సమర్థరామదాసస్వామి సహజముగా బాల్యమునుండియే భగవద్భక్తియుక్తుఁడై యుండెను. భగవానుని దివ్యనామము నాతఁడు నిరంతరమును స్మరించుచుండును. తండ్రిగతించినపిమ్మట నాతనికి విరక్తిభావ ముదయించెను. క్రమముగా నావిరక్తిభావ మతిశయించి వృద్ధిగాంచఁదొడంగెను. సమర్థుని యన్నయగు శ్రేష్ఠునిగూర్చి కొంతవఱకు మన మెఱింగియున్నారము. మహారాష్ట్రదేశస్థులు రామదాసును హనుమదవతారముగా భావించునటులె * శ్రేష్ఠుని సూర్యనారాయణావతారముగా భావించుచుండిరి. శ్రేష్ఠుఁడు సదాచారుఁడు. బుద్ధిమంతుఁడు. ఆతఁడు వంశపరంపరాగతమగు శ్రీరామమంత్రము చిరకాలము జపించి సిద్ధినొందెను. అందుచే నాతని శ్రీరామభక్తుఁడనియు రామోపాసకుఁడనియుఁ బ్రజలుతలంచి యుపదేశార్థము తీర్థప్రజలవలె వచ్చుచుండిరి. శ్రేష్ఠుఁడు వారలనందఱ నాదరించి మంత్రోపదేశము గావించి భక్తిమార్గమునందుఁ బ్రవృత్తులఁ గావించుచుండెను. ఒకదినమున భక్తుఁడొకఁడు శ్రేష్ఠునిసన్నిధికి ఉపదేశార్థ మేతెంచెను. శ్రేష్ఠుఁ డనుగ్రహపూర్వకముగా నాతని నాదరించి మంత్రదీక్ష నొసంగి భక్తిమార్గము నుపదేశించెను. ఇదియంతయుఁ జూచుచున్న సమర్థుఁడు ఏకాంతమునఁ దన యన్నను సమీపించి అగ్రజా! నాకును మంత్రోపదేశము గావింపుము. అని పలుతెఱంగులఁ బ్రార్థించెను. శ్రేష్ఠుఁడు తమ్మునిబుజ్జగించి సోదరా! నీవు మిగులఁ జిఱుతవాఁడవు. మంత్రోపదేశమునకుఁ దగినపాత్రత నీకింకను సమకూరలేదు. కొంతకాల మాగినపిదప నుపదేశించెదను అని చెప్పెను. సహజభక్తిభావుఁడగు సమర్థున కామాటలు వెగటుగాఁ దోఁచెను. హృదయము మంత్రోపదేశమునకై తొందరించుచుండెను. అన్నతోఁ దర్కించిన లాభములేదని సమర్థుఁ డొంటరిగా నిల్లువిడిచి

* ఈయనకు శ్రేష్ఠుఁడు, శ్రేష్ఠరాముఁడు, గంగాధరుఁడు మున్నగునవి వ్యవహార నామములు.

బయలుదేరి తమగ్రామమునకు వెలుపల గోదావరీతీరముననున్న ఆంజనేయాలయమున కరిగి మారుతిని ప్రార్థించుచుండెను. ఈబాలుని నిష్ఠయు భక్తిపారవశ్యము ఆంజనేయుని హృదయమును గరగించెను. ఆంజనేయుఁడా బాలుని యెడఁ గనికరించి నిజరూపముతోఁ బ్రత్యక్షమై కుమారా! మంత్రోపదేశమునకు నీవేల యింత తొందరపడెదవు? ఇంకను గొంత కాల మాగుమనెను. సమర్థుఁడు మారుపలుకఁజాలక తనహృదయము నందుఁగల యుపదేశాతురత బహిరంగపఱచెను. హనుమంతుఁ డా బాలుని యచంచలభక్తికి నిర్మల హృదయమునకు నానందించి శ్రీరామచంద్రమూర్తిచే దర్శనము నిప్పించెను. శ్రీరామచంద్రుఁ డా బాలుని ననుగ్రహదృష్టితోఁ జూచి మేను నిమిరి "శ్రీరామజయరామ జయజయరామ" యను త్రయోదశాక్షరీ మంత్రరాజము నుపదేశించి "కుమారా! భూమండలమునం దంతటను మతాంతరులు వ్యాపించియున్నారు. దుర్నీతి రాజ్య మొనరించుచున్నది. దుష్టు లధికారములలో నున్మదులై యుండి భగవద్భక్తులు శాంతవ్రతులునగు సాధువులను బీడించుచున్నారు. ధర్మము తగ్గిపోవుచున్నది. కావున నీవు వైరాగ్యవృత్తితోఁ గృష్ణాతీరమునందు నివసించి ఉపాసనా జ్ఞానమార్గములను వృద్ధిగావించి లోకోద్ధరణ మొనరింపుము" అని యాజ్ఞాపించెను. ఇట్లు శ్రీరామచంద్రమూర్తి వలన నుపదేశము ననుజ్ఞనొంది బాలసమర్థుఁడు పరమసంతోషమునందెను. ఈవృత్తాంతము నాలకించి యాతని మాతయగు రాణుబాయియు నితరబంధువులును పరమానంద భరితులైరి. అదిమొదలు యుక్తవయస్సు వచ్చువఱకును సమర్థుఁడు భగవద్భజనముతోఁ గాలము గడుపుచుండెను.

—* వివాహ ప్రసంగము *—

తల్లి దనకుమారునిపయి నెన్నియో ఉత్సాహపూరితములగు కోరికలను బెట్టుకొనియుండును. ఆకోర్కులలోఁ "కుమారునకుఁ ద్వరగాఁ బెండ్లి కావలయును. కొడుకు కోడండ్రు కలిసి కాపురము జేయుట జూడవలయును" అనుకోరిక ప్రబలమైనది. సమర్థుని మాతయగు రాణుబాయిగూడ నటులె తనపుత్రుఁడగు బాలసమర్థునకుఁ జిన్నతనముననే వివాహము జరుపఁదలంచెను. వివాహ సంబంధములగు మాటలను విని

నంతనె సమర్థుఁడు మిగుల నసహ్యించుకొనుచు నానావిధముల విరక్తిని వ్యక్తము చేయుచుండెను, ఒకమారిటులె వివాహప్రసంగము తల్లితీసికొని వచ్చుసరికి సమర్థుఁడు గృహమును విడిచియడవులకు వెళ్ళిపోయెను. అన్నయగు శ్రేష్ఠుఁ డెన్నియో నీతులు తమ్మునకు బోధించి బుజ్జగించి యెంతయో శ్రమపడి యింటికిఁ గొనివచ్చెను. కుమారుఁ డిటుల వివాహమునకు విముఖుఁడై విరక్తిగానుంటఁ జూచి రాణుబాయి మిగుల వగచుచుండెను. శ్రేష్ఠుఁడు తమ్ముఁడగు నారాయణుని విరక్తిభావము గమనించి "ఇఁకనీతఁడువివాహమాడఁడు. వీనితో వివాదించి లాభము లేదని తెలిసికొని" పెండ్లిప్రయత్నము మానివేసెను. అంతియగాక తల్లితో నారాయణుఁడు కారణజన్ముఁడనియు వివాహమున కియ్యకొనఁడనియు నీప్రయత్నము మానుటయే యుక్తమనియుఁ బలుతెఱంగుల విన్నవించెను. రాణుబాయి తనపట్టుదలను వదలక నారాయణున కెటులైన వివాహము జేసిదీరవలయునని యనుచుండును. ఒకదినమున రాణుబాయి యవకాశము గల్పించుకొని నారాయణుని నేకాంత ప్రదేశమునకుఁ గొనిపోయి ముఖము నిమురుచుఁ బ్రేమసూచకములగు మృదుమధురవాక్యములతో నిటులఁ జెప్పెను:

"పుత్రా! నామాట నంగీకరించెదవా లేదా?"

"మాతృదేవీ? ఈవిషయమై నన్నడుగవలయునా? ప్రత్యక్షదైవతమగు కన్నతల్లిమాట నంగీకరింపకున్న నింక నెవరిమాట నంగీకరించెదను? "నమాతుః పరదైవతమ్" అని శాస్త్రములు సైతము జెప్పుచున్నవిగదా"

"మంచిది! అటులైనచో నేనువివాహప్రసంగము దెచ్చినప్పుడెల్ల నీవు వెఱ్ఱిచేష్టలను జేయుచుందువేల? ఇఁకముందు అట్లుగావించెదవేని "సావధాన" అని యొట్టుపెట్టుచున్నదానను కళ్యాణ మండపము నందం తెరపటము (తెఱ) పట్టుకొనునంతవఱకు వివాహ విషయమై యాటంకము నించుకేని చెప్పఁబోకుము."

(ఆమాటలువిని సమర్థుఁడు చకితుఁడయ్యెను. కొంతదనుక యోచించి యిట్లు ప్రత్యుత్తరము జెప్పెను.) "తల్లీ! నీయాజ్ఞప్రకారము నేను కాం[illegible]పటము బట్టునంతవఱకును అనంగీకారమును బ్రకటింపను."

ఆమాయికురాలగు రాణుబాయి కుమారుఁడు తనమనోరథము చెల్లింపగలఁడని మిగుల నానందించెను. సమర్థునివాక్కులం దిమిడియున్న భావార్థ మామె కొంచెమేని గ్రహింపలేదు. తనకుమారుఁడు వివాహమున కంగీకరించెనని యామె విశ్వసించి వెంటనే యావిషయము తన జ్యేష్ఠకుమారుఁడగు శ్రేష్ఠునకు దెలిపెను. తల్లియొక్క యమాయికవృత్తియు సోదరుని యచంచలదీక్షయు నెఱింగిన శ్రేష్ఠుఁడు తల్లినిప్పుడే నొప్పింపనేల యని తనలోఁ దానించుక నవ్వుకొని "ఎందుల కొప్పుకొనఁడు? అని మాత్రము నుడివి యూరకుండెను.

సమర్థుఁడు వివాహమున కంగీకరించినయంశము రాణుబాయి తన బంధు సముదాయమునకుఁ దెలిపెను. పదుగురి సమ్మతినిబడసి ప్రాచీనసంబంధించియు సంపన్నుఁడునగు నొక గృహస్థుఁడు తనకుమారిని నారాయణునకీయ నిశ్చయించెను. వివాహప్రయత్నములు మహత్తరముగా జరుగుచుండెను. లగ్నతిథినాఁడు శ్రేష్ఠుఁడు సమస్తబంధువర్గమును వెంటనిడుకొని మహావైభవముతోఁ దరలిపోయి కన్యాదాత గృహమున ప్రవేశించెను. సమర్థుఁ డందఱితోఁబాటు సంతోషముగా బయలువెడలెను. ఆతనిముఖమున విరక్తిచిహ్నములు గోచరించుటలేదు. సీమంతపూజనము, పుణ్యాహవాచనము మున్నగు శుభవిధులు జరుగుసమయమున శ్రేష్ఠసమర్థులిరువురును నొకరినొకరు జూచికొని మందమందముగ నవ్వుకొనిరి. ఆమందహాసమునందలి భావము నెవ్వరు నెఱుంగరైరి. కొంతసేపటికిఁ గాండపటమును బట్టుకొను తరుణమేతెంచెను. బ్రాహ్మణులు మంగళాష్టకములు జదువుట కారంభించి అందఱు నొక్కమాఱుగా "సావధానమ్‌సావధానమ్" అని నుడివిరి. ఆమాటవిని సమర్థుఁడు తనలోఁ దానిట్లు యోచించుకొనెను. "నేనునిరంతరమును సావధానుఁడుగనున్నాఁడను. అట్లున్నను మఱల నీబ్రాహ్మణులు సావధానుఁడవు గమ్మని నుడువుచున్నారు. కావునీశబ్దమునం దేదియో భేదము తప్పకయుండితీరవలెను. మాతృదేవికూడఁ గళ్యాణమండపమునందుఁ గాండపటము బట్టుకొనునంతవఱకు మాత్రమె తనయాజ్ఞఁ బాలింపుమని యాజ్ఞాపించినది. ఆమెయాజ్ఞ పూర్తియైనది. నావాగ్దానమును నేను సంపూర్ణముగా నెరవేర్చితిని. ఇఁక నేనిచట నేలకూర్చుండి యుండవలెను? నిజముగా నేనిపుడు సావధానుఁడఁ

గావలయును." ఈ విధముగా యోచించి సమర్థుఁడు కళ్యాణమండపము విడిచి వెడలిపోయెను. ఆతనిఁ గొనివచ్చుటకై యెందఱో జనులు వెన్నంటిరి. ఎందఱు వెంటఁబడినను సమర్థుఁడు చిక్కలేదు. వివాహమండపమునఁ గోలాహల ముదయించెను. కొంతవడి కాయుద్వేగమంతయు శాంతించినపిదప బ్రాహ్మణులా బాలికను మఱియొకనికిచ్చి వివాహము చేయవచ్చునని శాస్త్రాధారములతో సమ్మతుల నొసంగిరి. సమర్థుఁడు వివాహవేదికనుండి యెచటికో వెడలిపోయెనని విని రాణుబాయి మిగుల విచారపడెను. శ్రేష్ఠుఁ డాయమనూఱడించి "తల్లీ! నీవించుకేని విచారింపకుము నారాయణుఁ డెచ్చటనైన నానందముగా నుండఁగలఁడు. వానిని వివాహప్రయత్నములోఁ బడవేయకుమని నేను మొదటినుండియుఁ జెప్పుచుంటిని. కానిమ్ము జరుగవలసిన దేద్దియో యది జరిగినది" అని తెల్పెను.

—✱ టాకలియందుఁ దపశ్చర్య. ✱—

వివాహసమయమునందు సమర్థుఁడు సావధానుఁడై బయలుదేరి రెండుమూఁడుదినములు తననివాస గ్రామమగు జాబ్ నగరము చెంతనున్న పంచవటిలో దాఁగియుండెను. అచటనుండి యనంతర మాతఁడు నాసిక పంచవటి కరిగెను. ప్రకృతకాలమున ధూమశకటములపై సులభముగాఁ బ్రయాణము జేయువారలా కాలపుఁ బ్రయాణశ్రమల నూహింపఁజాలరు. పన్నెండు సంవత్సరముల బాలుఁడు శా. శ 1542 (క్రీ. శ 1620) ప్రాంతమున జాబునుండి నాసిక పంచవటిదనుక వందలకొలఁదిమైళ్లు పాదచారిగాఁ దిరుగుటలో నెన్నెన్ని శ్రమలొందెనో యెట్లు చెప్పగలము? ఈయంశమున కనుకూలించునట్లు భర్తృహరి చక్కగా నుడివెను.

"మనస్వీ, కార్యార్థీ గణయతి నదుఃఖం నచసుఖమ్॥"

కార్యమొనరించు పురుషార్థియు సాహసియు నగు మహాత్ముఁడు సుఖదుఃఖములను లక్ష్యముజేయఁడు. ఇట్టి మహాత్ముల లక్షణములు చిన్నతనమునుండియే ప్రకాశింప నారంభించును. సమర్థుఁడు నాసికకుఁ జేరి పంచవటియందు శ్రీరామచంద్రమూర్తిని దర్శించి యచటికిఁ దూర్పున రెండుమూడు మైళ్ళ దూరమునందున్న టాకలియను గ్రామమునకు కరిగెను. అనంతరమాగ్రామమునకు వెలుపలనున్న పురాతనము విస్తృతమునగు మహావృక్షముయొక్క నీడలో నొక కుటీర

—* తీర్థయాత్ర - దేశపర్యటనము. *—

ఇంద్రియ నిగ్రహము గావింపవలయునన్నచోఁ దీవ్రతపము గావించి మనోజయము ప్రాపించుట యెట్లవశ్యమో యట్లే లోకోద్ధారణము ధర్మస్థాపనము గావింపవలయునన్న దేశపర్యటన మొనరించి దేశస్థితియుఁ దీర్థయాత్రలొనరించి ధర్మస్వరూపమును గ్రహించుట యవశ్యము. సమస్తదేశములు తిరిగి జనసమాజ మేదశలోనున్నదో యెఱుంగట దేశోద్ధారకులకుఁ గర్తవ్యము. తీర్థక్షేత్రములకరిగి స్వధర్మమునకు హానికరములును ధర్మప్రచారమునకు విఘ్నకరములును నగు కారణము లేమేనియున్నచోఁ బరీక్షించుటయు ఉద్ధారకుల ముఖ్యధర్మము. సమర్థుఁడు సమస్తమగు భారతఖండమున ఉత్తరమునుండి దక్షిణమువఱకును దూర్పునుండి పశ్చిమమువఱకును బాదచారిగాఁ దిరిగి సమగ్రముగ దేశకాలపరిస్థితులు గమనించెను. అతనికిఁ జేతిలో నొకపగిలిపోయిన గవ్వయైన లేకుండెను. ఉదరనిర్వాహణార్థమాతఁడు భిక్షావృత్తి నాశ్రయించెను. భిక్షావృత్తిని సమర్థుఁడు కేవలము దరపోషణార్థమై స్వీకరించెనని మనము భ్రాంతిపడరాదు. అందులకుఁ బ్రత్యేక కారణముండెనని మనము గమనింపవలయును. భిక్షావృత్తినిగూర్చి సమర్థుఁడు తన దాసబోధయం దిట్లు నుడివియున్నాఁడు.

కం॥ భయరహితము భిక్షావృత్తియ, దానమహత్త్వమబ్బు దేవుఁడు చిక్కున్

[illegible]యము స్వాతంత్ర్యశుభో। దయమబ్బును భిక్షకునఁ దత్త్వజ్ఞులకున్॥ *

భిక్షాటనము గావించుటకు హేతువు కేవలము పొట్టనించుకొనుటయే గాక స్వదేశదశను దెలిసికొనుటకే యైనచో దేశోద్ధారకునకు నిస్సందేహముగా భిక్షావృత్తినిమించిన సాధన మింకొకటి లేదు. శ్రీరామదాసస్వామి స్వానుభవముతో నీయంశమునుగూర్చి పలుతావులఁ జెప్పినాఁడు. తాను భిక్షాటన మేయుద్దేశముతోఁ గావించుచుండెనో యది యొకతావున నిట్లు స్పష్టముగాఁ జెప్పియున్నాఁడు.

---

* భిక్షామ్హనిజే నిర్భయస్థితీ। భిక్షేనేం ప్రగటే మహంతీ

స్వతంత్రతా ఈశ్వరప్రాప్తి। భిక్షాగుణేం॥

భిక్ష నిర్భయస్థితిగలది. భిక్షవలన మహత్త్వము వెల్లడియగును. భిక్షవలన ఈశ్వరుఁడు లభించును. స్వాతంత్ర్యముగూడ లభించుచున్నది.

కం॥ పల్లెయును నగరమును నిల్లిల్లును విడనాడకుండ నీక్షింపఁదగున్।

పిల్లలను బెద్దలను మఱి యెల్లర భిక్షామిషఁ బరీక్షింపనగున్॥ *

ఇటులఁ జేయుటవలనఁ బ్రజలసుఖదుఃఖములను లోకోద్ధారకులు గ్రహింప వీలుచిక్కును. ప్రజలవలన నుద్ధారకు లేవేని క్రొత్తసంగతులు గ్రహింప వీలుకలుగును. తమ భావములు ప్రజలకు బోధింప నవకాశము చేకూరును. ప్రకృతకాలమున మన భరతవర్షమున బిచ్చగాండ్రకుఁ గఱవు లేదు. సమర్థుని మతానుసారముగా లోకోద్ధరణమును దృష్టియందుంచుకొని భిక్షాటనముగావించు భిక్షుకుఁ డొకఁడేని లభించుట కష్టతరమనుట కెంతయో విచారమగుచున్నది.

రామదాసస్వామి భిక్షావృత్తితో జీవయాత్ర గడుపుచు గ్రామములు, నగరములు, అరణ్యములు, కొండలు దిరుగుచుఁ దొలుదొలుత తీర్థరాజమగు కాశీక్షేత్రము ప్రవేశించెను.

సమర్థుఁడచట గంగాస్నాన మొనరించి విశ్వనాథుని సందర్శించుటకై యాలయమున కరిగెను. అక్కడఁ గొందఱు బ్రాహ్మణులు రుద్రాభిషేకము గావించుచుండిరి. కాషాయవర్ణలిప్తమగు నిడుపాటిచొక్కాయు, జడలు గట్టిన వెండ్రుకలనాచ్ఛాదించియున్న టోపీయుఁ జూచి యచటనున్న బ్రాహ్మణులందఱును వీఁడెవరో బ్రాహ్మణేతరజాతికిఁ జెందిన బైరాగి యనితలంచి సమర్థుని లింగమునకడకుఁ బోనీయకపోయిరి. సమర్థుఁడు గొంచెమేని కోపమందక "ఇది శ్రీరామచంద్రప్రభుని సంకల్పము కాఁబోలును," అనిపలికి తానున్నచోటుననేయుండి బ్రాహ్మణులకును విశ్వేశ్వరునకును సాష్టాంగదండప్రణామ మాచరించి యచటినుండి మఱలెను. అతఁడు మఱలిపోవుటయే తడవుగా సమర్థునివారించి రుద్రాభిషేకము గావించుచున్న బ్రాహ్మణులందఱకును లింగము కాన్పింపకపోయెను. బ్రాహ్మణులందఱును మిగుల భయపడిరి. చివరకు వారలందఱు నిది మనచేవంచితుఁడైన బైరాగిగావించిన చమత్కారమేగాని మఱియొకటిగాదని నిశ్చయిం

గ్రామేం అథవా నగరేం। పాహావీం ఘరాంచీం ఘరేం

భిక్షామిసేం లహాన థోరే। పరీక్షూన సోడావీం

గ్రామమైనఁ గానిమ్ము, నగరమైనఁ గానిమ్ము. ఇంటింటిని వదలక చూడవలయును. భిక్షామిషతోఁ జిన్నలను బెద్దలను సమస్తవిధ మానవులను బరీక్షింపవలయును.

చుకొనిరి. వారిలోఁగొందఱు బ్రాహ్మణులు పరుగు పరుగునఁబోయి సమర్థునిగాంచి ప్రార్థించి సవినయముగా నాలయమునకుఁ గొనివచ్చిరి. అందఱు బ్రాహ్మణులును దామొనరించిన సాహసమునకు క్షమింపుమని విశ్వేశ్వరుని బశ్చాత్తాపబుద్ధితోఁ బ్రార్థించి రామదాసస్వామిని దమఁగోపములను క్షమింపుమని వేఁడుకొనిరి. కొంతసేపటికి లింగము యథావిధిగా బ్రాహ్మణులందఱకును గోచరించెను. అనంతరము సమర్థుఁడు విశ్వేశ్వరుని బ్రార్థించి కొన్నిదినములు కాశీనగరమున వసించెను. అప్పు డాయన కాపట్టణమున నున్న మహాత్ములతోఁ బరిచయమయ్యెను. వారలవద్ద సమర్థుఁడు శ్రద్ధాభక్తులతో వివిధానుభవముల గుర్తెఱింగెను. కొంతకాలమున కాతఁడు కాశీనగరమును విడిచి గయా ప్రయాగ క్షేత్రములకుఁ బోయివచ్చెను. కాశీనగరమునందలి యొకభాగమునకు హనుమాన్ ఘట్టమని పేరు. కాని యందు ఆంజనేయాలయము లేదు. సమర్థుఁ డాలోపము దీరుటకై యచట ఆంజనేయుని బ్రతిష్ఠ జేసెను.

కాశీనుండి సమర్థుఁడు బయలుదేరి తనకుఁ బరమప్రియమును ఇష్టదైవమునగు శ్రీరామ జన్మభూమియైన అయోధ్యకుఁ బోయెను. అచ్చట సరయూనదిలో స్నానమాడి ఆలయములకరిగి శ్రీరాముని ఆంజనేయుని సందర్శించి కొన్నిదినము లందు నివసించెను. అయోధ్యామాహాత్మ్యము నాలించెను. తరువాత మధుర, బృందావనము, గోకుల మున్నగుతీర్థక్షేత్రములలోఁ గొన్నిదినములుండి స్నానములు, దేవదర్శనములు గావించుకొని యచటనున్న సాధు సత్పురుష బృందముతోఁ బరిచయముజేసికొని యటనుండి ద్వారకకు మఱలెను. ద్వారకకుఁజేరి శ్రీనాథుని సందర్శించెను. తీర్థవిధులను విధివిధానము ననుసరించి నెరవేర్చెను. పండార్కము - ప్రభాసము మున్నగు క్షేత్రముల కేగి యచ్చటగూడఁ దీర్థవిధు లాచరించెను. తీర్థాటన మన్నను ఆచారరక్షణమన్నను సమర్థున కెంతయో యభిమానము. ఈభావములు వచ్చునటుల దాసబోధలో సమర్థుఁ డిట్లు చెప్పెను.

చ॥ సారవిచార చిత్తుఁడగు సాధువు శక్తికొలందిగాఁగ నా
చార విధానరక్షణము సల్పుట ధర్మము; యాతఁడే సదా

చార విహారుఁడైనయెడ జాతికి ధర్మమెఱుంగఁజేయు న
ద్ధారుఁ డెట్టులౌ , నెటుల తత్త్వమతండు గ్రహింపఁజాలెడిన్॥
చ॥ అనిశము తీర్థయాత్రలకునై తిరుగాడుజనుండు దైవతం
బును గురితింపఁగావలయుఁ, బూనికతోఁ దన నంతరాత్మనుం
గనవలె శ్రద్ధగల్గి మనఁగావలె నట్లొనరింపకున్నచోఁ
జని ఫలమేమి తీర్థములఁజాయను ? లేవె శిలాదు లంతటన్" ॥

ప్రభాసక్షేత్రమునుండి సమర్థుఁడు బయలుదేరి కొన్నిదినములకుఁ బాంచాలదేశము (పంజాబు) చేరెను. ఆదేశమునఁ బ్రసిద్ధములగు గ్రామములు నగరములుజూచుచు సమర్థుఁడుకొన్నిదినములకు శ్రీనగరము జేరెను. అచటనున్న నానకుమతాభిమానులగుసాధువులతో శ్రీరామదాసస్వామికిఁ బరిచయముగలిగెను. ఆసాధువులు సమర్థస్వామి పరిచయమునఁ గొలది కాలమున కాత్మజ్ఞానమునందు నిపుణులైరి. శ్రీనగరమున కెవరేని మహాత్ములు వచ్చినచో నచటి సాధువులందఱు వారికడ కేతెంచి వేదాంతవిషయిక ప్రశ్నలనడిగి సందేహములఁ దీర్చుకొనుచుందురు. వారిసందేహములకు సమాధానము నొసంగఁజాలని సాధువుల నెన్నఁడును బరిహాసము లాడరు. సమర్థుని యాగమనము నాలకించి యాప్రాంతమునందున్న ప్రసిద్ధులగుసాధువు లందఱును దర్శనమునకరిగిరి. వారిలో గొందఱు సమర్థుని భక్తిపూర్వకముగాఁ గొన్నిప్రశ్నలడిగిరి. గొప్ప యనుభవముగల మహాత్ములుసైతము సమన్వయించి చెప్పఁజాలని నానకుమతస్థులసందియములన్నిఁటిని సమర్థుఁడుమాటమాటలో నేనివారించెను. సాధువులందఱీతనియాధ్యాత్మికనిరూపణమునకు విస్మయము నొందిరి. వారలందఱును బ్రార్థనపూర్వకముగాఁగోరి శ్రీరామదాసస్వామి నొక మాసమువఱకుఁ దమయొద్ద నుంచుకొనిరి. సమర్థుఁడు సాధువులవద్దనుండి సెలవుగైకొనునప్పుడు ఆసిక్కులగురువులందఱును వచ్చి మంత్రదానమునకై చేతులుమోడ్చి ప్రార్థించిరి. సమర్థుఁడు వారల కిట్లుచెప్పెను.

"మీగురువును మహానుభావుఁడు నగునానకస్వామి ముసలమానులచేఁగూడ రామ,రామయని పలికించిన ధన్యుఁడు. మీసంప్రదాయమున కాతఁడు అనుగ్రహించిన యుపదేశము తక్కువదిగాదు. మీరలు నానకస్వామియేర్పఱచిన మార్గమును సార్థకము గావింపుఁడు. ఇదియ

నేనొసంగు మంత్రదానము"

శ్రీనగరమునువిడిచి సమర్థుఁడు హిమాలయమున కరిగెను. హిమాలయమునం దాతఁడు బదరీనాథము, కేదారఖండము, ఉత్తర మానసములు సందర్శించెను. హిమాలయమునఁగల యొకమహోన్నత శృంగముపై "శ్వేతమారుతి" స్థానము గలదు. అచటి శీతాధిక్యము నకు వెఱచి యెవ్వఁడును బోఁడు. పూర్వము అద్వైతమతస్థాపకులగు ఆది శంకరులవారలొక్కరుమాత్రమె యంతదనుకఁ బోయిరి. శ్రీసమర్థుఁ డాశిఖరమునెక్కి హనుమానునిదర్శించి కొలఁది కాలమునకుఁ దిరిగివచ్చెను. సమర్థుఁ డీవిధముగా నుత్తరపశ్చిమయాత్రలు పూర్తిగావించి పూర్వభాగమునందున్న జగన్నాథమునకు బయలుదేరెను.

జగన్నాథము (పూరీ) లోఁ బ్రవేశించినపిమ్మట పద్మనాభుఁడను పేరుగల బ్రాహ్మణుఁడొకఁడు సమర్థునిశరణమునకేతెంచెను. అతనికి మంత్రోపదేశముగావించి రామదాసీయసంప్రదాయము నెఱిఁగించెను. పూరిలో సమర్థుఁడు శ్రీరామచంద్రమూర్తిని స్థాపించి మఠవ్యవస్థ పద్మనాభునకె యప్పగించెను. జగన్నాథస్వామిదర్శనానంతరము సమర్థుఁడు పూర్వసముద్రతీరమునఁ బ్రవాసముగావించుచు దక్షిణమునఁగల రామేశ్వరునకుఁ బోయెను. అచట దేవదర్శనము అర్చనపూజనములు గావించి లంకకుఁ బోయెను. లంకకేగినపు డాతనికి శ్రీరామునిసేవకులగు విభీషణుఁడు ఆంజనేయుఁడు జ్ఞాపకమునకు వచ్చిరి. అచ్చోట సమర్థుఁడు కొన్ని దినములు నివసించి విభీషణసంప్రార్థనరూపముగఁ గొన్నిపద్యములు రచించెను. లంకనుండిమఱలి సమర్థుఁడు ఆదిరంగము, మధ్యరంగముఅంతరంగము శ్రీజనార్దనము, దర్భసేనము మున్నగుక్షేత్రములకరిగి దేవదర్శనము గావించుచు గోకర్ణమహాబలేశ్వరమునకుఁ జేరెను. అచటఁ గొన్నిదినములుండి శేషాద్రి కేగెను. అనంతరము శ్రీవెంకటేశము (తిరుపతి) శ్రీశైలమల్లికార్జునము, బాలనరసింహము, పాలకనరసింహము, కచోటి, వీరభద్రము, అను పురాణప్రసిద్ధములగు పంచలింగములను సందర్శించి కిష్కింధానగరము జేరెను. అచటి పంపాసరోవరము ఋష్యమూకపర్వతము మున్నగు రామాయణ ప్రసిద్ధస్థానములు దర్శించి

శ్రీకార్తికస్వామిసేవింప దేవగిరిమీఁది కేగెను. అచటినుంచి దక్షిణకాశియని ప్రసిద్ధినొందిన కరవీరక్షేత్రమునకు మరలివచ్చెను. ఆపిమ్మట కర్ణాట (కొంకణ) మార్గము ననుసరించి సముద్రతీరములను గాంచుచు మహాబలేశ్వరమునకువచ్చి శ్రీపండరినాథుని, భీమశంకరుని సందర్శించెను. తరువాత త్ర్యంబకేశ్వరమున కరిగి నాసిక పంచవటికిఁ జేరెను.

సమర్థుఁ డీవిధముగాఁ బండ్రెండుసంవత్సరములు పాదచారియై భరతఖండమునం దంతటను ప్రవాసమునల్పి వివిధప్రకారములగు ఆధిభౌతిక తాపముల యనుభవము గడించెను. ఈప్రవాసములలో సమర్థునకు బహువిధమానవులతోఁ బరిచయము కలిగెను. భిన్నభిన్నములగు మానవస్వభావములను బరీక్షించెను. పలుతెఱంగులనున్న సామాజిక, ధార్మిక, రాజకీయ, వ్యవహారములను ఆచారములను శోధించెను. భిన్నభిన్నప్రాంతములందున్న రాజ్యరీతుల నవలోకించెను. సాధుజనులను సందర్శించి యభేద్యములగు అధ్యాత్మరహస్యముల నెన్నింటినో గ్రహించెను. ప్రకృతియందుఁగల చమత్కారములు రమణీయములు నగుదృశ్యముల నన్నింటి నానందముగాఁ దిలకించెను. పర్యటనము ముగించునప్పటికి సమర్థునకు స్వదేశసంబంధములగు నవశ్యవిషయము లన్నింటియందును జ్ఞానమేర్పడెను. దేశపర్యటనము తీర్థయాత్రవలన లోకజ్ఞాన మెక్కువయయ్యెను. ఈసంపూర్ణజ్ఞాన పరిపక్వమంతయు నతనిగ్రంథములందు వ్యక్తము గావించెను. సమర్థునిగ్రంథము లన్నింటిలో దాసబోధ అను భవజన్యజ్ఞానమునకు సముద్రము. అందు లేనివిషయమే లేదు. ప్రతి భాగము నందును ప్రకృతిలోని మనోహరములు అపరూపములు నగు దృశ్యముల ప్రతిబింబ మీదాసబోధలో గోచరించును. ఆమనోహర దృశ్యముల కెంతయని దృష్టాంత మొసంగఁగలము!

పంచవటికేతెంచి సమర్థుఁడు పంచగంగాస్నాన మొనరించి శ్రీరామచంద్రమూర్తి నీవిధముగాఁ బ్రార్థించెను.

రఘుకులదీపా! శ్రీరామా! నేను మీకృపవలనఁ బండ్రెండు సంవత్సరములు తీర్థయాత్రగావించి దివ్యక్షేత్రములందున్న దేవతలనందఱను దర్శించితిని. పుణ్యతీర్థములలోఁ గ్రుంకితిని. నానావిధములగు విధివిధాన

ముల నిర్వహించితిని. ఈకర్మముల ఫలస్వరూపమగు పుణ్యమును నేడు మీచరణారవిందములకు సమర్పించుచున్నాఁడను. ,,

ఈప్రార్థనమువలన సమర్థుఁ డెంతనిష్కాముఁడగు మహాపురుషుఁడో యెట్టికర్మయోగియో తేటపడును. సమర్థుఁడు నిష్కామకర్మ మాచరించు మహాత్ముఁడనుట కింతకంటె యోగ్యమగు నుదాహరణము లభింపఁజాలదు. ఆతఁడు తనకొఱకై యెద్దియును గోరకుండెను. మనము గావించు మంచిపనులు గాని చెడ్డపనులుగాని మనకొఱకుఁ గాదనియు ఆయీశ్వరునికొఱకే చేయుచుంటిమనియు, ఆత్మారామునికొఱకే చేయుచున్నారమనియు సమర్థుఁడు దృఢముగా నెఱింగియుండెను. అందువలననే యాతఁడు తనసంపూర్ణధర్మకర్మముల పుణ్యఫలమంతయు శ్రీరామచంద్రుని పాదారవిందముల కర్పించెను.

పంచవటినుండి సమర్థుఁడు పైఠణ్ గ్రామమునకుఁబోయి తమతల్లిదండ్రులకుఁ బరమపూజ్యుఁడును మహానుభావుఁడును నగు శ్రీ యేకనాథస్వామివారి సమాధిని దర్శించి గోదావరీ ప్రదక్షిణమునకు బయలుదేరెను. మార్గమధ్యమున గోదావరీతీరమునందున్న తనజన్మభూమియగు జాంబుగ్రామనికటము సమీపించెను. చిరపరిచితములును బాల్యవిహారరంగములు నగు నాప్రదేశములఁ జూడఁగనే సమర్థునకుఁ దనతల్లియు నన్నయు జ్ఞాపకమునకువచ్చిరి. వారల సందర్శించి పోవలయునని బుద్ధి పుట్టెను. వెంటనే గ్రామాభిముఖుఁడై బయలుదేరెను.

సమర్థునితల్లి తనప్రియపుత్రుని వియోగమునకు సహింపఁజాలక అత్యంతవ్యాకులచిత్తయైయుండెను. ఆతనిజాడయే తెలియదాయెను. దుఃఖకారణమున నాయమకు దృష్టిగూడఁ దగ్గిపోయెను. ఈయవస్థయం దామె యితరవ్యవహారములుమాని తనకనిష్ఠకుమారుఁడగు నారాయణునిదదేకనిష్ఠతో స్మరించుచుండెను. ఇరువదినాలుగుసంవత్స

శ్లో॥ యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్॥ ౨౭ భ. గీ. అ. ౯

అర్జునా! నీవెద్దానిని భుజింతువో యేహవనము గావింతువో ఏదాన మొసఁగుదువో ఏ[illegible]జేయుదువో ఏమేమి చేసెదవో దానినంతయు నాకర్పింపుము—సరిగ నీవిషయము సమర్థుని యాచరణమునందుఁ బ్రతిపదమునను గోచరించుచున్నది.

రములకుఁ బిమ్మట సమర్థుఁడు దేశభ్రమణ మొనరించుచుఁ దనజన్మభూమి కేతెంచెను. గ్రామమునకుఁ జేరువలోనున్న హనుమదాలయమునకుఁబోయి వందనములొనరించి సమర్థుఁడు తనయింటికిఁబోయి సింహద్వారమునందు నిలుచుండి యుచ్చైస్స్వరముతో ,,జయజయ శ్రీరఘువీర సమర్థ,, అనినుడివి బిచ్చ మడిగెను. ఎదురుగానున్న గృహాంగణమున గూర్చుండియున్న యాతనితల్లియగు రాణుబాయి తనకోడలినిబిలిచి అమ్మా! ఆబైరాగికి బిచ్చముదెచ్చిపెట్టుమని చెప్పెను. సమర్థుఁడు కొంచెము ముందునకరిగి తనతల్లితో "అందఱు బైరాగులవలె బిచ్చము గైకొని పోవుటకు వచ్చినవాఁడుకాఁడుసుమా! ఈబైరాగి'' అని పలికెను. రెండవసారి సమీపించి స్పష్టముగాఁ బలికినమీఁదట తల్లి యాతనికంఠస్వరమును గుర్తించి తత్క్షణమే "ఏమీ! నాతండ్రి నారాయణుఁడు వచ్చినాఁడా? ,, అని పలుకుచు లేవఁబోవుచుండ రామదాసస్వామి మాతృచరణములపై వ్రాలెను. మాతాపుత్రుల నేత్రములనుండి ప్రేమాశ్రుధారలు పొంగి ప్రవహించెను. అప్పుడు రాణుబాయి కుమారుని మస్తకముమీఁదను ముఖముమీఁదను ప్రేమాన్వితమగు తనహస్తములతో సవురుచుండ నామెచేతికి నిడుపుగఁబెరిగి వ్రేలాడుచున్న జటాజూటము గడ్డము సోఁకెను. అప్పు డాయమ మిగులఆశ్చర్యముతో నిట్లునుడివెను. "ఓరీ నారాయణా! నీ వెంతపెద్దవాఁడవైనాఁడవురా! అయ్యో కన్నులుగాన్పింపవు గదా నానారాయణు నెట్లుజూడఁగలను?'' తనతల్లి నుడివిన దీనవాక్కులు సమర్థుని హృదయమునుఁ గలంచెను. వెంటనే యాతఁడు తన పవిత్రహస్తములతోఁ దల్లికనులపై నిమిరెను. తోడనే యామెకుఁబూర్వదృష్టి గలిగి సమస్తము గనిపించెను. ఆసమయమున రాణుబాయి యెదుట నానందతరంగములు ప్రసరించుచుండెను. ఆయమ కుమారునిముఖము తేరిపారఁజూచి తండ్రీ! ఈభూతవిద్య నెచ్చటనేర్చుకొంటివిరా? యనెను. సమర్థుఁడు వెంటనే యొకపద్యమునురచించి మాతృదేవికిఁ బ్రత్యుత్తరము నొసంగెను. ఆపద్యభావ మిది.

సీ॥ శ్రీమదయోధ్యాపురీమందిరంబుల [illegible]
సమధికప్రీతిఁ గౌసల్యాదు[illegible]డు

పాదసంస్పర్శచే బండను జెలువఁగా నేభూత మెలమిమై యేర్పరించె
ప్రజల నమానుషప్రజ్ఞాబలంబుచే నేభూత మరని సంతృప్తిపఱచె
తే॥గీ॥ బహువిధచమత్క్రియాజాలపాటవమున । భూతజాలంబులను నాదిభూతమైన
రామభూతంబు చిత్తాంతరంబునందు । నున్న నివి దానిచర్యలో కన్నతల్లి॥

మాతాపుత్రు లీవిధముగాఁ బ్రసంగించుచుండిరి. ఎన్నఁడో యిరువదినాలుగుసంవత్సరములక్రిందట విడచినకుమారుఁ డప్రయత్నముగ నరుదెంచినకతన రాణుబాయి యానందపారవశ్యమున మైమఱచెను. విరక్తుఁడగు సమర్థుఁడుగూడ ముగ్ధుఁడై నెలలబిడ్డవలె మాతృదేవిచరణ సమీపమున నుండెను. అంతలో గ్రామములోనికరిగిన శ్రేష్ఠుఁ డింటికి వచ్చెను. సమర్థుఁ డతనినిగాంచినంతన భక్తిసూచకముగాఁ జరణములపై వ్రాలెను. సోదరులిరువురును ప్రేమపూర్వకముగా నాలింగనము గావించుకొనిరి. వారిహృదయము లానందమగ్నములయ్యెను. శ్రీరామదాసస్వామి కొన్నిదినములదనుకఁ దనయింటియం దానందముగా నుండెను. ప్రతిదినమును సోదరులిరువురు భోజనానంతరమునఁ జాలసేపు ఒకతావునఁగూర్చుండి అధ్యాత్మజ్ఞానవిషయికముగా సల్లాపములు జరుపుచుండువారు. సమర్థుని బుద్ధికుశలతయు విజ్ఞానము శ్రేష్ఠునకుఁ బరమాశ్చర్యకరమయ్యెను. గృహమున సుఖముగాఁ గాలయాపనము గావించుచుఁ గర్తవ్యము మఱచుచుంటినని సమర్థున కొకదినమున దోచెను. ఇఁక నిట నిముసమేని నిలువఁదగదని తలంచి సమర్థుఁడు తనతల్లిసన్నిధికిఁబోయి ప్రయాణమున కనుజ్ఞఁగోరెను. పుత్రవియోగమున కాయమసహింపలేక నలవలయేడ్చెను. ఆమె విచారము జూడఁగనే సమర్థునకుఁగూడ హృదయము చరించెను. లోకాతీతుండగు నాతఁడు రాణుబాయి భాగవతమునఁ గపిలుఁడు తనతల్లియగు దేవహూతికిబోధించిన బోధమునంతయు నివేదించెను. వివేకవతియగు రాణుబాయిహృదయమున కాబోధవలన శాంతిలభించెను. అనంతరము రామదాసస్వామి అన్నచెంతను మాతృదేవిచెంతను దదితర బంధువర్గము చెంతనను ననుజ్ఞఁబడసి తాను సంకల్పించికొనిన గోదావరీప్రదక్షిణ[illegible] పూర్తిగావింప[illegible]లు వెడలెను. సాగరసంగమస్థలమున గోదావ[illegible]యాలుగా[illegible]. దీనికే సప్తగోదావరియం

దురు. సమర్థు డీపాయలన్నింటిని కుడిప్రక్కనుండి దాటి దక్షిణతీరమున కేగెను. అచటనుండి త్ర్యంబకేశ్వరమునందలి గోదావరీజన్మస్థానమునకుఁ బోయి పంచవటి దక్షిణపుఁబ్రక్కకుఁ బ్రవేశించెను. సమర్థుఁ డచట శ్రీరామచంద్రమూర్తిని సందర్శించి గోదావరిప్రదక్షిణము పూర్తిజేసెను. ఈవిధముగాఁ బండ్రెండుసంవత్సరములు తపస్సు, పండ్రెండు సంవత్సరములుతీర్థయాత్రలు దేశపర్యటనము గావించి యాతఁడు జనోద్ధారణము గావించుటకు వలయుశక్తిసామర్థ్యములు యోగ్యత గడించెను. ఈ కాలమున శ్రీసమర్థ రామదాసస్వామికి ముప్పదియాఱు సంవత్సరముల వయస్సు.

—* ధర్మప్రచారము - జనోద్ధారణము. *—

శ్రీ సమర్థుఁడు మొట్టమొదట పంచవటినుండి తనతపస్స్థానమగు టాకలి కేతెంచెను. అచ్చట ఉద్ధవస్వామిని గలిసికొని శ్రీ రామచంద్రస్వామి యాదేశానుసారముగాఁ గృష్ణాతీరమునందు ధర్మప్రచారము, లోకోద్ధారణకార్యములు ప్రారంభించుటకు సమర్థుఁడు దక్షిణదేశమునకు బయలుదేరెను. ప్రప్రథమమునం దాతఁడు మహాబలేశ్వరమున కరిగెను. అచట వర్షర్తులలోని నాలుగుమాసములు గడిపెను. ఆసమయమునం దచట నొక యాంజనేయమఠమును స్థాపించి తనసంప్రదాయమును వృద్ధినొందించి యచటిజనులనందఱను భక్తిమార్గమునఁ బ్రవేశపెట్టెను. అనంతభట్టు, దివాకరభట్టు మున్నగాఁగల సుప్రసిద్ధవిద్వాంసులు పలువురు అచట సమర్థునకు శిష్యులైరి. మహాబలేశ్వరమునుండి వెడలి సీతారామండలమునందు సమర్థుఁడు రామదాసీయ సంప్రదాయమునుగూర్చి ప్రచారమునరించుచుఁ గొంతకాలమునకు వాయీక్షేత్రమునకుఁ బోయెను. అచటఁ గృష్ణానదీతీరమునఁగల యొక యశ్వత్థవృక్షముక్రింద నివసించెను. వాయీక్షేత్రమునందున్న శాస్త్రజ్ఞులు, పండితులు సమర్థుని యాధ్యాత్మికజ్ఞానమును గాంచి ముగ్ధులై శరణ్యమున కేతెంచి దీక్షనుగైకొని భజనవర్గమునందుఁ బ్రవేశించిరి. అచటఁ గూడ సమర్థుఁడు హనుమానుని బ్రతిష్ఠజేసి మఠనిర్వాహకధర్మము నొక శిష్యున కప్పగించెను. వాయీక్షేత్రమునుండి బయలుదేరి యాతఁడు "మాహులికిఁ జేరెను. అచట గ్రామమునకు వెలుపలనున్న యొక పర్వ

తముమీఁది హనుమదాలయమునందు వసించెను. ప్రాతఃకాలమున లేచి కృష్ణాతరంగిణిలో స్నానమొనరించి సంధ్యావందనాది నిత్యకృత్యములను నిర్వర్తించుకొని రెండుజాములైనపిదప గ్రామములోనికేగి మధూకరము నడిగి భుజించుచుండెను. అనంతరము మఱల నాపర్వతముమీఁదికరిగి భజనము, జపము, ధ్యానములలో మగ్నుఁడై యుండును. అచ్చట కప్పుడప్పుడాతని సమకాలికులగు సాధుజనులువచ్చి ధర్మచర్చలు గావించుచుండిరి. ప్రతిసాధువు తన యనుభవమునకు సంబంధించిన విషయములను వివరించుచు నుండును. అందఱునుగలిసి హరిభజనము హరికీర్తనము గావించుదురు. శ్రీరామదాసస్వామికిఁగల యనుపమానసామర్థ్యము నెఱింగి సాధుజను లాయనకు సమర్థబిరుదము నొసంగి వ్యవహరింపసాగిరి. కొన్నిదినములు సమర్థుఁడు మాహులీయందుండి యనంతరము క్రహాఁడు(కర్హాడు)నకుఁ బోయెను. క్రహాఁడుప్రాంతమునం దీతని యలౌకిక ప్రజ్ఞాతిశయమునుగాంచి యసంఖ్యాకులగుజను లాతనిశరణ్యమున కేతెంచిరి. ఆప్రాంతములోని శాహపురమనుపేరుగల గ్రామమునం దాతఁడు ఆలయమును నిర్మించి యందుఁ బ్రతాపమారుతిని బ్రతిష్ఠించి దానిని నిర్వహించుభారమంతయుఁ దన శిష్యుఁడును మిత్రుఁడునగు "బాజీపంతు" అనువాని కప్పగించెను.* బాజీపంతు సమర్థునిసన్నిధిలో సకుటుంబముగా మంత్రోపదేశమునుగైకొనెను. ఆతనిభార్యపేరు సతీబాయి. ఈమె సమర్థునిపట్ల మిగుల భక్తిప్రపత్తులు గలది. సమర్థుఁ డనేకభయానకప్రయోగములచే సతీబాయి హృదయమును బరీక్షించెను. ఆమెభక్తి యచంచలముగా దృఢతరముగా నుండెను. సమర్థుఁడు ఆమె నిశ్చలచిత్తవృత్తినారసి మిగులఁ బ్రసన్నుఁడయ్యెను. ఆయమకు సమర్థుఁడు శ్రీయాంజనేయునిచేఁ బ్రత్యక్షదర్శనము నిప్పించెనని ప్రజలు చెప్పుకొనుచున్నారు.

ఇట్లు సమర్థుఁడు ధర్మప్రచారము గావించుచు చాఫళ్ అను గ్రామమున కరిగెను. అచట నాతఁడు మొదటఁ గొన్నిసంవత్సరములవఱకు అర

* ఈ బాజీపంతు కుమారుఁడే భికాజిగోస్వామి. గోస్వామి సమర్థుని ముఖ్యశిష్యులలో నొకఁడు. ఈయన తంజావూరు మఠములో నుండువాఁడు. సమర్థుని నిర్యాణానంతర మీయన (వి. శ 1604) సమర్థుని మూలచరిత్ర గ్రంథమును ఓవీఛందములో రచించెను.

ణ్యములయందును పర్వతములందును గుహలందును జరించుచుండెను. అప్పు డాతఁడెన్నఁడో గ్రామములోనికివచ్చి పోవుచుండువాఁడు. ఎప్పుడేని యాతఁడు జనసముదాయములోనికి వచ్చినచో అవధూతదశయందున్న కారణమునఁ బిచ్చివాఁడని తలంచుచుండిరి. వాస్తవమున కాతఁడు పిచ్చివాఁడు కాఁడు. ఆతనిచిత్తమఖండరూపముగాఁ బరమాత్మునియందు మగ్నమైయుండెను. శ్రీసమర్థుఁడు దాసబోధలోఁ దనస్వీయచరిత్రమును బలుతావులఁ జేర్కొనియున్నాఁడు. ఒకసమాసమునం దాతఁడు నిస్పృహులగు సాధువుల ప్రవర్తనమును వర్ణనము గావించెను. అందే యాతఁడు 'నేనీ దీనినంతయు మొదటఁ జేసితిని. తరువాతఁ బ్రజలకుఁ బోధించితిని' అని నుడివెను. ఈయంశముగల సమాసము మిగుల మహత్త్వముగలది, భాషలలో నుండి మొట్టమొదట సమర్థుఁడు బహుదినములఁదనుక నెట్లు ధర్మప్రచారము, లోకోద్ధరణము గావించెనో యది ప్రకృతసమాసమును జదివినచో బాగుగా దెలియును. ఈసమాసములోనివగు రెండు పద్యములను మేమిచట నుదాహరించుచున్నారము. ఆపద్యములను జూచినచో సమర్థుఁడు లోకోద్ధరణమునం దెంత చతురుఁడో పాఠకులు సులభముగా గ్రహింపఁగలుగుదురు.

కం॥ ఉత్తమగుణములఁ దాలిస్వా యత్తముగావించి తెలుపనగు నొరులకు
సర్వోత్తముగల జనసంఘము నెత్తెఱుగునదైనఁ గూర్పు మెఱుదాపముమా॥
కం॥ జనసంఘుంబునకు నుపాసన పుం దాసక్తి గూర్పుజను, నట్టులొన
ర్చినయెడ జనములు బోధప కనుసన్నల మెలఁగుచుండ్రు కార్యగతులలోఁ॥ *

సమర్థుఁడు ఛాపలులో నివసించియుండి ప్రజల దన బోధనామృతముచేఁ బరవశుల నొనరించి వేలకొలఁది శిష్యులను వందలకొలఁది విరాగులను సాధువులను సిద్ధపఱచెను. మహారాష్ట్రదేశమునం దనేకస్థలములలో స్థాపింపఁబడిన మఠములయందు వారలనందఱ నియతపఱచెను.

* ఉత్తమగుణాతి తుకే ఘ్యావే, ఘేఊన్ జనాప్ సికవావే
ఉదండ సముదాయ కరావే, పరీగుప్త రూపేం॥ ౧౮
అఖండకామాచీ లగ్‌బగ్ । ఉపాసనేస్ లవావేంజగ్
లోకసముదాయ్ మగ్ । అజ్ఞా ఇచ్ఛితి॥ ౧౯ దాసబోధ ద౧౧ స౧౦

ఈవిధముగా భజనమును ఉపాసనామార్గమును బాగుగా వృద్ధిగావించి సమర్థుఁడు జనులను స్వధర్మమునందుఁ బ్రవృత్తుల గావించెను. స్వధర్మమునందభిమానముగలిగిన తోడనే జనులయందు స్వాభిమానమునం దైశ్వర్యాంకురము లుదయించెను. ఆకాలమున మహారాష్ట్రదేశమునందు (భరతఖండమునందంతటను) అధికారులైయుండిన యవనులనుండి తమ స్వాతంత్ర్యమును ధర్మమును గాపాడుకొనవలయునను ప్రచండము తీవ్రమునగు భావము జనులమానసముల యందు వృద్ధినొంద నారంభించెను.

ఇట్లు సమర్థరామదాసస్వామి ధర్మస్వాతంత్ర్యవిషయములయందా కాలమున నాందోళనమును గలుగఁజేసెను. ఈస్థితియంతయు ఛత్రపతియగు శివాజీమహారాజాకర్ణించి వెంటనే సమర్థునిదర్శింప మిగుల నుత్సాహియయ్యెను. కాని సమర్థునిదర్శనము శివాజిచక్రవర్తి కెట్లు కాఁగలదు? స్వయముగా సమర్థుఁడు చక్రవర్తియొద్దకుఁ బోవువాఁడు కాఁడు. ఛత్రపతిమహారాజు వచ్చిదర్శింతమనుకొన్నచో సమర్థుఁడొకస్థానమున నిలుకడగా నుండువాఁడుగాఁడు. చివరకు శివాజీప్రభునకు సమర్థునిదర్శనము గావించు నుత్సాహ మనివార్యమయ్యెను. ఒకానొకదినమున శివాజి సమర్థునిసందర్శింప రాజహర్మ్యమునుండి బయలుదేరి అరణ్యములు, గుట్టలు-పర్వతములు తిరుగుచుండెను ఎన్నియో శ్రమలొందినపిదప నొకయౌదుంబరవృక్షముక్రింద శివాజిచక్రవర్తికి సమర్థుని సందర్శనభాగ్యము లభించెను. అప్పటనే శివాజీప్రభుఁడు మంత్రోపదేశము నొందెను. ఆదినమునుండియే సద్గురుఁడును ముముక్షువును శుద్ధస్వాతంత్ర్యప్రియుఁడును నగు శిష్యుఁడును గలిసి ధర్మప్రచారము లోకోద్ధరణము జేయసంకల్పించిరి. సమర్థునియొక్కయు శివాజియొక్కయు సంబంధము నైసర్గికమును మిగుల గహనమును విస్తృతమును విచారణయోగ్యము నై యున్నది. ఈవిషయమునుగూర్చి విపులముగా విమర్శింపఁబూనినచో నొకస్వతంత్రగ్రంథము గావలసియుండును. కావున సంగ్రహముగా నింకొకతావున వర్ణింపనెంచితిమి.

ఈప్రకారముగ సమర్థుఁడు ఛాపల్‌గ్రామసమీపమున వసించియుండి ప్రచండముగా శిష్యసముదాయమును సమకూర్చెను. కొంతకాలమున కచట (శా. శ. 1570 క్రీ. శ. 1648) నాతఁడు శివాజిచక్రవర్తి

సహాయమున నొకమందిరనిర్మాణమునుగావించి యందు శ్రీరామచంద్రమూర్తిని బ్రతిష్ఠాపించెను. ఆమందిరము ననుసరించి గొప్పమఠముగూడఁ గట్టించెను. సమర్థుని శిష్యసముదాయము సాధువులు ఆమఠమునందే వసియింపుచుండిరి. వారలు నానావిధములగు శ్రీరామోత్సవములొనరించుచు భాగవతధర్మమును దేశమునందంతటను విరివిగా వ్యాపింపఁజేయుచుండిరి. సమస్తకార్యము లొనరించుచున్నను సమర్థుని మానస మఖండరూపముగా ఆత్మారామునియందు లీనమైయుండెడిది. ఒకస్థలమునం దాతఁ డిట్లనుడివెను.

కం॥ గిరులందునుండి గ్రామాం । తరముల కేఁగను రాము దర్శింతునొగిఁ
మఱి ధ్యానరూపమున సా । దరమున భక్తులను జేరదను వేడుకలన్ ॥

ఒకసారి సమర్థుఁడు కొందఱు శిష్యులను వెంటనిడుకొని కరవీరపురప్రాంతమున ధర్మప్రచారము గావించుట కేఁగెను. అచటి ప్రజ లనేకు లితని భజనకీర్తనముల నాలకించి శరణ్యమునకే తెంచిరి. ఆప్రాంతమున ముఖ్యుఁడును శివాజీపక్షమున నాప్రాంతమున కధికారియు నగుబారాజీపంతు సమర్థునిచెంత దీక్షగైకొనెను. ఆతని తోఁబుట్టువు సమర్థునిభక్తిభావమునకు విస్మయమొంది తనయిరువురుపుత్రులతో సమర్థుని సేవయందు వర్తించుచుండెను. ఆయమ జ్యేష్ఠపుత్రునిపేరు అంబాదాసు. ఈతఁడు వ్రాయుటయందును జదువుటయందును మిగులఁజాతుర్యముఁ గలవాఁడు. కావున సమర్థుఁ డీతని లేఖకునిగా నియమించుకొనెను. ఈయంబాదాసే క్రమక్రమముగా సమర్థుని ముఖ్యశిష్యులలో నొకఁడై సాధుపదవిబడసి కళ్యాణస్వామియనుపేరఁ బ్రసిద్ధుఁడయ్యెను. సమర్థుఁడు రచించిన గ్రంథములన్నింటికిని కళ్యాణస్వామియే లేఖకుఁడు. సమర్థుఁడు పద్యములను నుడువుచుండఁ గళ్యాణస్వామి వ్రాయుచుండువాఁడు. చాఫల్‌గ్రామమునకు సమీపమునఁగల వనపర్వతములందుఁ గూర్చుండి వారలు గ్రంథరచనము గావించుచుండిరి.

దాస్ డోంగరీంరాహతో । యాత్రాదేవాచీపాహాతో
దేవభక్తాసవేంజాతో । ధ్యానరూపేఁ॥

రామదాసస్వామి పర్వతములందుండును. అచటనుండియే గ్రామములలో నేఁగు శ్రీరాముని యుత్సవము దర్శించును. ఇంతియగాదు. ఆతఁడు ధ్యానరూపముతో దైవభక్తులతోఁబాటుగా నాయుత్సవమునఁ జేరియుండును.

చాఫల్‌గ్రామవాసులు మిగుల నిర్బంధించుటచే నొకసారి సమర్థుఁడు పండరిపురయాత్ర కరిగెను. అచ్చట విఠలస్వామిని (శ్రీకృష్ణుని) దర్శించెను. సమర్థుని యుపాస్యదైవము శ్రీరాముఁడగుటచేఁ బండరిపురము నాతఁడయోధ్యగాఁ భావించెను. విఠలస్వామిమూర్తి రామమూర్తిగ గాన్పించెను. యాత్రనుండి మరలివచ్చి నపిదపఁ గొన్నాళ్ళకు శ్రీశివాజీప్రభువు మిగుల బలవంతపెట్టుటవలన సమర్థుఁడు సతారాసమీపమునందున్న "సజ్జనగడము" నందు నివసించెను. శ్రీశివాజీమహారాజచటికి నిత్యమును సమర్థుని దర్శనార్థము వచ్చుచుండెను. ఒకదినమున సమర్థునితల్లి శ్రేష్ఠునితో రామదాసస్వామి- కిట్లొక వర్తమాన మంపెను "కుమారా? నిన్నుఁజూచి చాలదినములైనది. ఒకమారువచ్చి నన్నుఁ జూచిపోవఁ గోరుచున్నదానను" (శా. శ 1574 క్రీ. శ 1652) లో శ్రీరామనవమి ఉత్సవసందర్భమున సమర్థుఁడు మరల దన జన్మభూమికేగి తనరక్తసంబంధులతోఁ గొన్నిదినములుగడిపి పిమ్మట సజ్జనగడమునకుఁ దిరిగివచ్చెను.

శా. శ 1575 క్రీ. శ 1653 ప్రాంతమున సమర్థుఁడు త్రిలింగ (ఆంధ్ర) దేశమునఁ బర్యటనముగావించుచు రామేశ్వరముదనుక నరిగెను. ఆంధ్రదేశమున నీసందర్భమున గొన్నిమాసములువసించి తనసంప్రదాయమును మిగుల వృద్ధినొందించెను. ఆంధ్రభాషనునేర్చుకొని యనేకకవితాగ్రంథములను రచించెను. ఆగ్రంథములనన్నింటి నాంధ్రదేశమునందుఁ బ్రచారములోనికిఁ దెచ్చెను. బహువిధముల ననేకాపూర్వచమత్కారములనుజూపి సమర్థుఁడు మాన్యులయొక్కయుఁ బండితులయొక్కయు నభిమానమునకుఁ బాత్రుఁడయ్యెను. ఎందఱోపండితులాతని శరణ్యమునకేతెంచి భజనమార్గమునందుఁ బ్రవేశించిరి. తంజావూరును బాలించు వెంకోజి (శివాజిసోదరుఁడు) సమర్థునినొకమాసముదనుక మిగులనాదరముతోనుంచుకొని మంత్రదీక్షగైకొనెను. సమర్థుడు తంజావూరిలో నొకమఠమును స్థాపించి యందు సతీబాయి పుత్రుఁడగు భికాజీబాబాను ధర్మకర్తగానియమించెను. తంజావూరినుండి బయలుదేరి సమర్థుఁడు రామేశ్వరమున కరిగెను. మంచలక్షేత్రమునందు రాఘవేంద్రస్వామియను జ్ఞానితో సమర్థుఁడు కలిసికొనెను. ఈయుభ

యులును జాలదినములు వేదాంతవిషయిక గోష్ఠులతోఁ గాలము గడిపిరి. సమర్థుఁ డీవిధముగాఁ దేశపర్యటనము గావించుచు మఠములను స్థాపించి తన యలౌకికప్రజ్ఞాతిశయమువలన జనులను స్వధర్మమునకు నభిముఖులఁ గావించుచుఁ గొన్నిదినములకుఁ దనపూర్వస్థానమగు చాఫలుకు మరలి వచ్చెను. సమర్థునిరాకవినఁగనే శివాజీమహారాజు సందర్శింప వచ్చెను. దర్శనానంతరము శివాజి సమర్థునిఁ దనవెంట సజ్జనగడమునకుఁ గొంపోయెను. రాజకీయములు, ధార్మికములునగు వివిధోపదేశములతో సమర్థుఁడు శివాజికి మిగుల నానందమును కూర్చుచుఁ గొన్నిదినములుమాత్రమె సజ్జనగడమునందు వసించెను.

వివిధవిషయములు.

సమర్థునితల్లియగు రాణుబాయికి అంత్యకాల మేతెంచెను. సమర్థుఁ డీయంశమును దనయంతర్జ్ఞానమువలనఁ బదునైదు దినములకు ముందే గ్రహించెను. రోగశయ్యయందుండి రాణుబాయి నిరాశతో "నాతండ్రి నానారాయణుకు అంత్యకాలమునం దిచట లేఁడయ్యెఁగదా" యని జ్యేష్ఠపుత్రుఁడగు గంగాధరశ్రేష్ఠునితో నుడువుచుండెను. అంతలో సమర్థుఁడు వచ్చి తనతల్లిచరణాంబుజములపై శిరమునిడి, అమ్మా! నేను నీసన్నిధిలోనున్నాఁడను. ఇఁకనీవుసుఖముగను శాంతముగను జీవయాత్రముగింపుముఅనిపలికెను. (శా. శ1577 (క్రీ. శ 1655)లో రాణుబాయి స్వర్గవాసిని యయ్యెను. ఆయమ కూర్ధ్వలోకక్రియలుముగించి శ్రేష్ఠునియొద్ద సెలవొంది సమర్థుఁడు సజ్జనగడమునకు మరలివచ్చెను. కొన్నిదినములాప్రాంతమున సమర్థుఁడు మతప్రచారముగావించి తీర్థయాత్రకు బయలుదేరెను.

(శా. శ 1580 (క్రీ. శ 1658) లో శ్రీసమర్థుఁడు నిజానందస్వామి మహోత్సవము సేవించుటకు కప్రాడునకుఁబోయి కొన్నిదినములట వసించెను. ఉత్సవసమాప్తియైనపిదప మరలి యాతఁడు సజ్జనగడమునకు వచ్చుచుండెను. ఆతనివెంట దాదాపుగానిరువదిముప్పదిమంది శిష్యులుగూడ నుండిరి. అప్పటికి దాదాపుగా రెండుజాముల ప్రొద్దెక్కెను. ఆహారసౌకర్య మెచ్చటను గలుగకపోవుటచే శిష్యులాఁకలిగొని యలసిపోయిరి. వారికిఁ ద్రోవలోఁ గంకులబరువుచే వంగియున్న ఊచబియ్యపుఁ బరువములోనున్న యొకజొన్నచేను గనిపించెను. శిష్యులు సమర్థుని

యాజ్ఞనొంది కొన్నికంకులను ద్రెంచి కాల్చుకొని తినసాగిరి. సమర్థుఁడు శిష్యులచెంత నొకయాసనముపైఁ గూర్చుండి యుండెను. ఇంతలో నా చేనియజమానుఁడు పరుగెత్తుకొని వచ్చి ఈ యాసనముపైఁ గూర్చున్నవాఁడే వీండ్రకు నాయకుఁడని తలంచి జొన్న దంట్లుపెరికి సమర్థుని జేతికాలఁది కొట్టనారంభించెను. శిష్యులీదురంతమును గాంచి కోపావేశముతో క్షేత్రస్వామిని బట్టుకొని కొట్టఁబోవ సమర్థుఁ డది చూచి, వలదువలదు, కొట్టవలదు. విడిచివేయుఁడని చెప్పి విడిపించెను. అనంతరము క్షేత్రస్వామి తనయింటికిఁ బోయెను. సమర్థుఁడు శిష్యసమేతముగా సితారాలోనున్న శివాజీచక్రవర్తికడకుఁ బోయెను.

రెండవదినమున శివాజిచక్రవర్తి సమర్థునకు మంగళస్నానము జేయించుచుండెను. అపుడు దేహముపైనున్న దెబ్బలు కాన్పించెను. శివాజి చాల విచారపడి ఎవరుగొట్టిరి? తెలుపుమని పలుతెఱంగులఁ బ్రార్థించెను. ఎంతకును సమర్థుఁడు ప్రత్యుత్తర మీయఁడయ్యెను. భోజనానంతరము సమర్థుఁడు శయనగృహమున విశ్రాంతి గైకొనుచుండెను. అపుడు శివాజీ యేకాంతమున నొక శిష్యుని బిలిపించుకొని యెంతయో ప్రయత్నించి మార్గమధ్యమున జరిగినవృత్తాంతమంతయుఁ దెలిసికొనెను. మూర్ఖుఁడగు నాసేద్యకాఁడు గావించిన యవివేకకృత్యము విని నంతన శివాజికి క్రోధోద్రేకము గలిగెను. కన్నులెఱ్ఱబడెను. ఆసేద్యగానిని తెక్కలు విఱచికట్టి యిప్పుడే నాయొద్దకుఁ గొనిరావలయునని భటుల కాజ్ఞాపించెను. ఇదియంతయు శయనాగారమునందుండి సమర్థుఁడు విని శివాజిని తన యొద్దకుఁ బిలిచి ఆసేద్యగానిని కట్టితీసికొని రావలదు. వానిని గొట్టవలదు. ఇక్కడకుఁ బిలువనంపినపిదపఁ దప్పునకుఁ దగినశిక్ష యేదియో తెలిపెను. అట్లు విధించినఁ జాలునని పలికెను. శివాజి సమర్థునియాజ్ఞ శిరోధార్యము గావించెను. మఱుసటిదినమున శివాజీచక్రవర్తి కొలువుదీరెను. దర్బారునకు రాజభటులు సేద్యగానిని గొనివచ్చిరి. అంతకుఁబూర్వమే సేద్యగాడు తానుగొట్టినది సాధారణపు సన్యాసినిగాదనియు నాతఁడు (శిక్షితుఁడు) ఛత్రపతిశ్రీశివాజీచక్రవర్తికిఁ బరమపూజనీయుఁడును గురువును నగు శ్రీరామదాసస్వామియని గ్రహించెను. దర్బారున కాసేద్యగాఁడు వచ్చుసరికి సమర్థుఁడు దివ్యమును మణిగణాలంకృతమును మహోన్నత

మును నగుసింహాసనముపై శివాజికి సమీపమున నాసీనుఁడై యుండెను. పాపమాకర్షకునకు భయవశమున శరీరమంతయు గడగడవణఁకెను. పదములు తడబడెను. నిర్విణ్ణుఁడై కర్షకుఁడు సమర్థుని పాదములపైఁబడి యేడ్చుచు నాదోషమునకు క్షమింపుమని వేఁడుకొనెను. నీపొలము చక్కఁగా ఫలించుఁగాకయని యాశీర్వదించి సమర్థుఁడు కర్షకుని లేవనెత్తెను. అనంతర మాతఁడు శివాజీపాదములపైఁబడి క్షమింపుమని ప్రార్థించెను. సమర్థుని యాజ్ఞానుసారముగ శివాజీచక్రవర్తి కర్షకుని క్షమించి యాచేను పుత్రపౌత్ర పారంపర్యము మాన్యముగా ననుభవించుటకు దానపత్రము వ్రాసియిచ్చెను. ఇదియంతయుఁ గాంచి దర్బారులోనున్నవారందఱును నాశ్చర్యమొందిరి. ఔను. ఎందుకాశ్చర్యమొందరు? ఉపకారమునకుఁ బ్రత్యుపకారము గావించువారలు పెక్కుమంది గలరు. అపకారికి నుపకారము జేయువారలు కేవల సాధుపురుషులే. మహాత్ముఁడగు తులసీదాసుఁ డిటుల నుడివియున్నాఁడు

కం॥ సురసాలము ఫలవృక్షో। త్కారమును బరహేతుకముగ దానముచేయున్
నతికెడివానికి సైతము । దొరికించనుగాదె ఫలము తులసీదాసా॥

సమర్థుని యనుగ్రహమునఁ బడసినభూమిని నేఁటికిని సేద్యగాని వంశీయు లనుభవించుచున్నారు. సమర్థుని క్షమకును ఉదారభావమునకును అనేకధన్యవాదములు.

సమర్థుని యన్నయగు శ్రేష్ఠుఁడు గృహస్థాశ్రమమునం దుండియు భక్తిమార్గమున నెక్కుడు ప్రచార మొనరించెను. అతఁడు భక్తిరహస్యము సుగమోపాయము అను గ్రంథములను గొన్నిచాటుగ్రంథములను రచించెను. శ్రేష్ఠుఁడు దివ్యజ్ఞానిగావునఁ దనకంత్యకాలము సమీపించినదని యెఱింగి యొకయుత్తరమును సమర్థునికడకంపి యంతిమసమావేశమునకుఁ బిలిపించుకొనెను. శ్రీరామనవమి మహోత్సవమునకుఁ గొన్నిదినములుముందు సమర్థుఁడు తనజన్మభూమియగు జాంబునకరిని యొకమాసము దినము లగ్రజునిసన్నిధిలోనుండి తిరిగి తపోభూమికిఁ జేరెను. తరువాతఁ గొన్నిదినములకే శా. శ 1599 (క్రీ. శ 1677) లో శ్రేష్ఠుఁడు

తులసీసంత్ సుఅంబతరు ఫూల్ ఫలహి పరహేంత్ ఇతతే జనపాషనహనేం ఉతతే వేఫలదేత్॥

స్వర్గవాసి యయ్యెను. ఆతనిధర్మపత్ని సహగమనము గావించి తనపాతివ్రత్యగరిమ లోకమునకు వెల్లడించెను. ఈసమాచారమునువిని సమర్థుఁడు తనశిష్యులలో నొకనిని బంపి శ్రేష్ఠునికుమారుల నిరువురను దనయొద్దకు రప్పించుకొనెను. ఈవిషయమంతయు శ్రీశివాజీచక్రవర్తి విని సమర్థుని సన్నిధానమునకేతెంచి తనరాజ్యములో పెక్కుగ్రామములు కలిపి జాబును ముఖ్యస్థానముగావించి యీసంస్థానమును మీస్వాధీనములో నుంచుకొనుఁడని సమర్థుని బ్రార్థించెను. "ఇప్పు డట్టిమావశ్యకము లేదు. తరువాత చూడవచ్చును లెమ్ము" అని సమర్థుఁడు ప్రత్యుత్తరమిచ్చెను. అందులకు శివాజి మిగులదుఃఖించి "శ్రీరాముని సేవ గావించుభాగ్య మీదీనుని నుదుట వ్రాసిపెట్టియున్నచో మీరు నిరాకరింపకుందువారే" అనెను. శివాజియెడ సమర్థుఁ డనుగ్రహించి "శివాజీ, సంప్రదాయసిద్ధములగు వ్యయములకు శ్రీరామోత్సవములు జరుపుటకు ప్రస్తుతము కొలఁదిగ నేర్పాటుగావింపుము" అని పలికెను. అనంతరము శివాజిచక్రవర్తి ముప్పదిమూఁడుగ్రామములను ప్రతిసంవత్సరము నూటయిరువదియొక్కపుట్లధాన్యమును సాధుసమాగమములకు శ్రీరామోత్సవములకు నొసంగెను. ఈగ్రామములతోఁ గూడిన పరగణా నేఁటిదనుక శ్రీసమర్థునివంశజుల యధికారమునం దున్నది. ప్రతివత్సర మెన్నియోమహోత్సవములు సాధుసత్పురుష సమాగమములు నేఁటివఱకు నాపరగణాపయి వచ్చునాదాయముతో జరుగుచున్నవి. శ్రీశివాజీమహారాజుతో సమానులగు రాజుల యుదారత్వము మిగుల ధన్యమైనది. సమర్థుఁ డొకసంవత్సరము దనుక శ్రేష్ఠుని కుమారుల నిరువురను దనయొద్దనుంచుకొని వారలకు బహువిధ విద్యలనేర్పి యింటికిఁ బంపెను.

శా॥ శ ౧౬౦౨ (క్రీ. శ. ౧౬౮౦) చైత్రశుద్ధ పూర్ణిమా రవివారమున శ్రీశివాజీమహారాజు స్వర్గమలంకరించెను. ఈవార్త విని సమర్థుఁడు మిగుల విచారము నొందెను. విచార మెందులకుఁ గలుగదు? శివాజీకొఱకె రామదాసస్వామి జనించెను. శివాజి రుద్రుఁడనియు రుద్రావతారమనియు నొప్పుకొనుచున్నారు. శివాజీసమర్థుల సంబంధము నైసర్గికముగ నుండెను. ఒకరు రెండవవారి సహాయముతో ధర్మప్రచార

లోకోద్ధరణ కార్యములను బూర్ణముగ స్థాపించిరి. శివాజి వియోగ కారణమున సమర్థుఁడు వెలుపలికి వెడలుటగూడఁ బూర్తిగ మానివేసెను. ఆతఁడు తనగదియందేయుండి భగవచ్చింతనము జేయుచుండెను. శంభాజి రాజ్యాభిషేకోత్సవ సందర్భమున శ్రీసమర్థుఁడు స్వయముగా నేగక తనయనుచరు నొకనిని బంపెను. కొంతకాలము జరిగినపిదప శంభాజిగావించు ఘోరసాహస కర్మలను విని సమర్థుఁ డొకయుపదేశపూర్ణమగు లేఖ వ్రాసెను. ఈలేఖ మిగుల మహత్త్వయుతమైనది. దానిని జూచినచో సమర్థుని రాజనీతివిజ్ఞానము చక్కఁగ విశదపడఁగలదు. శంభాజీమహారాజాసమయమున దుస్సాంగత్యములలోఁ జిక్కుకొనియుంటచే సమర్థుని యుపదేశమువలన నెట్టిలాభమునేని పొందఁజాలక పోయెను.

—● సమర్థుని నిర్యాణము ●—

శా. శ ౧౬౦౩ (క్రీ. శ ౧౬౮౧) న శ్రీరామనవమి మహోత్సవమునకు సమర్థుఁడు చాఫలునగరమున కేగెను. అచట మందిరమునఁ దన ప్రియోపాస్యదేవుఁడగు శ్రీరామచంద్రుని దర్శించి శ్రీయాంజనేయుని యనుజ్ఞబడసి శిబికారూఢుఁడై సజ్జనగడమునకు మఱలి వచ్చెను. అంత్యకాలము సమీపించుచున్నదని కొన్నిదినములకు ముందటనుండియే యాతఁ డన్నమును మాని కేవలము పాలుద్రావి యుండసాగెను. ఆసమయమున నాతనితేజ మభివృద్ధినొంది పోవుచున్నను శరీరముమాత్రము దినక్రమమున క్షీణింపఁదొడంగెను. ఇట్లు కొన్నిదినములు జరిగినపిదప మాఘ బహుళాష్టమి వచ్చెను. సమర్థుఁ డాదినమునఁ దనశిష్యులలో నెవరికేని తనయంతిమదినము సమీపించుట తెలియునో తెలియదో పరీక్షింపవలయునను తలంపు కలిగెను. ఈయోచనతో నాతఁడు తనశిష్యులం దఱియెదుట నీయర్ధశ్లోకము జదివెను.

రఘుకులతిలకాచా వేళ సన్నిధి ఆలా
తదుపరి భజనానే పాహిజే సంగకేలా॥

"రఘుకులతిలకుని సమయము సమీపించినది. కావున నిఁక సాంగోపాంగముగ భజనము గావింపవలయును" దీనినాలించి తత్క్షణమే ఉద్ధవస్వామి యాశ్లోకము నీవిధముగాఁ బూర్తిచేసెను.

అనుదిన నవమీహే మానసీ ఆశవాహీ
బహుతలగబగీనె కార్యసిద్ధీ కరావీ

"అంతిమదినమగు నవమిని స్మరణమునం దుంచవలెను. మఱియు మిగుల శీఘ్రముగాఁ గార్యసిద్ధిని గావింపవలెను." ఈశ్లోకార్థమును విని సమర్థుఁడు మిగులఁ బ్రసన్నుఁడయ్యెను. ఆతఁ డన్నిభజనములను జేయుట కాజ్ఞయిచ్చెను. అష్టమిదినమున రాత్రియంతయు భజనముతో నాశ్రమమంతయు ఘూర్ణించుచుండెను. శిష్యులందఱును గూడిరి. నవమిదిన మేతెంచెను. ఆదినమున సమర్థుఁడు స్వయముగా మంచముమీఁదినుండి దిగి క్రిందఁ గూర్చుండెను. శిష్యులందఱును బలవంతపెట్టుటచేఁ గొంచెము పటికిబెల్లముగలిపిన పిండితిని కొంచెముగ జలము గ్రోలెను. కొంతసేపైనపిమ్మట మఱల మంచముపైఁ గూర్చుండవలయునని శిష్యులందఱును బ్రార్థించిరి. "నన్ను లేవనెత్తి మంచముపై నుంచుడు" అని సమర్థుఁ డాజ్ఞయిచ్చెను. ఆజ్ఞానంతరము ఉద్ధవస్వామి సమర్థుని లేవనెత్తఁ బ్రయత్నించెను. కాని యాతనికి సాధ్యము గాకపోయెను. అదిచూచి అక్కాబాయియను శిష్యురాలు గూడ ఉద్ధవస్వామితోఁగూడి సమర్థుని లేవనెత్తఁ బ్రయత్నించెను. కాని యప్పుడుగూడ వారలు లేవనెత్తఁజాలకపోయిరి. చివరకు దాదాపుగఁ బదిమందిగలిసి యాతని నెత్తుటకుఁ బ్రయత్నించిరి. అప్పుడును విఫలులైరి. అనంతరము సమర్థుఁ డందఱిని వేఱుగ నుండని యాజ్ఞాపించెను. అందఱును దూరముగాఁ దొలఁగిరి. పిదప సమర్థుఁడు వాయువు నాకర్షించుచుండుటఁజూచి శిష్యులందఱును బిగ్గఱగా నేడువసాగిరి. సమర్థుఁడు వారలంగఱితో "నేఁటిదనుక నాకడ నుంచి మీ రేడ్చుటనుమాత్రమే నేర్చుకొంటిరా యేమి!" అని నుడివెను. సగుణమూర్తి పోవుచున్నది. ఇఁక భజనము నెవ్వరితోఁ గలిసి చేసెదము. మాటలాడఁదలంచిన నెవ్వరితో మాటలాడెదము? అని శిష్యులు పలికిరి. అంత సమర్థుఁడు "నాతో మాటలాడఁదలంచువారు 'దాసబోధ' మున్నగు నాగ్రంథములు జదువవలెను. వానిని జదువుటయే ప్రత్యక్షముగా నాతో భాషించుటయని భావింపుఁడు. అని యంతిమోత్తరము నొసంగెను. ఇట్లు నుడివినపిదప పదునొకండుమాఱులు హరహరశబ్దము నుచ్చరించి యంత్యమున రామశబ్దము నుచ్చరించెను. తోడనే సమర్థునిముఖమునుండి యొకదివ్యతేజము వెడలి సమీపమున స్థాపింపఁబడియున్న రామచంద్రుని ముఖమునందుఁ బ్రవేశించెను. భజనము యథావిధిగ జరుగుచుండెను.

ఆసమయమున భజనధ్వని మిగుల నతిశయించెను. ఈవిషయమున శా॥ శ ౧౬౦౩ (క్రీ.శ ౧౬౮౨ ఫిబ్రవరి) మాఘబహుళ నవమిని (౧౭౩౮ విక్రమశకము ఫాల్గుణ బహుళనవమి యనియొక మతము) మహారాష్ట్రప్రాంతపు ఏకమాత్రసిద్ధరత్నము, సాధురాజు, చాతుర్యసాగరుఁడు రాజనీతిజ్ఞశిరోమణి, భక్తిజ్ఞానవైరాగ్య ప్రత్యక్షస్వరూపుఁడు, నిస్పృహామహాత్ముఁడు రామునియందు లీనమైపోయెను. మఱియు దాసబోధలో ననేకస్థలములలోఁ దాను నుడివిన యీక్రిందివాక్యములను సత్యమొనరించెను.

..............................హరిభక్తీస పాదర్ వ్హావేమరోక కీర్తీస ఉర్ వావే.........౧౩.........ద ౧౭ స ౨ "నిరంతము హరిభక్తియందుఁ దత్పరుఁడై యుండవలెను. చనిపోయినపిదపఁ గీర్తిరూపముతో నిరంతరమును జగత్తునందు జీవితుఁడై యుండవలెను"

ఓసద్గురుసమర్థా! నీవు పూర్వోక్తవచనానుసారముగఁ గీర్తిరూపముతో ఆత్మరూపముతోఁగూడ అమరుఁడవై యున్నాఁడవు. కేవలము నీవమరుఁడవగుటయేగాక యసంఖ్యాకులగు జనులనుగూడ నీదర్శనముచే నమరులఁ గావించితివి. అమరులఁ జేయుచున్నాఁడవు. అమరులఁ జేయఁగలవు. ఎంతదనుక నీయార్యావర్తమునందు ధర్మముయొక్క నామము నిలిచియుండునో ఎంతదనుక హైందవుల కీశ్వరుని యాస్తికత్వముపై విశ్వాసముండునో ఎంతదనుక నీపవిత్రభూమియందు మహారాష్ట్రనామముపై భారతవాసుల కభిమానముండునో యంతదనుక నోసమర్థమహాత్మా! నీవును నీయుపదేశములును, నీపృథివిపై నచంచలముగ నమరముగ నుండఁగలవు.

సమర్థుడు-శివాజి

శ్రీరామదాసస్వామిని శివాజీచక్రవర్తి గురువుగా నేర్పఱచికొనెననియు వారలపరస్పరసంబంధము మిక్కిలిగహనము, మహత్త్వపూర్ణము నైయుండెననియు నింతకుముందు తెలిపియుంటిమి. ఈయిరువురువ్యక్తులకుఁగల సంబంధమును నిర్ణయించుటలో ఆధునికచరిత్రకారులు గొందఱు భిన్నాభిప్రాయులుగా నున్నారు. కాని శ్రీసమర్థుని శివాజి గురువుగాఁ జేసికొనుటయు సమర్థునియాజ్ఞలను శివాజీ శిరసావహించి పరమధర్మముగనెంచి నిర్వహించుటయుఁ జరిత్రకారులందఱు నంగీకరించిరి.

మహాత్ములగు నీయిరువు రెప్పుడు గలిసికొనిరో కలిసికొన్న పవిత్రస్థల మెద్దియో నిరూపించుటయందును శివాజీమంత్రోపదేశము నెప్పుడొందెనో గురుశిష్యుల పరస్పరవర్తన మెట్లుండెనో యనునంశములందును, శివాజీ యేయేవిషయములలో సమర్థుని యాలోచనము గైకొనువాఁడో స్వధర్మవ్యాపనము, స్వరాజ్యస్థాపనము అనుమహాకార్యములలో సమర్థునిసహాయము శివాజి యెంతదనుక నేవిధముగా నొందువాఁడో యనునంశమందును జరిత్రకారులలోఁ గొంతమతభేదము గలదు. అధికాంశవిద్వాంసుల యభిప్రాయములతో నేకీభవింతుమేని యీవివాదాంశములు సులభముగాఁ బరిష్కరింపఁబడును. మహారాష్ట్రదేశచరిత్రమునకు వలయుసామగ్రిని సంపాదించి శోధించుటలోఁ బ్రఖ్యాతిగాంచిన ప్రొఫెసరు రాజవాడేయను విద్వాంసుఁ డిటుల నుడువుచున్నాఁడు.

* "సిద్ధాంతమైయున్న ప్రకృతాంశమును మఱల నిర్ణయింపఁబూనినచో లాభముండదు. దాసబోధయను గ్రంథము లోకమున నిలిచియున్నంతవఱకు ఇతిహాసమునందు మహారాష్ట్రులు పదునేడవశతాబ్దమున స్వతంత్రరాజ్యము స్థాపించినసంగతి సుస్థిరముగా నుండఁగలదు. కావున ఛత్రపతిశివాజి, సమర్థరామదాసస్వామియొక్క సంబంధములను నిఁక నిరూపింపవలసిన యవసరము మఱిపోయినవాండ్రకుఁదక్క నితరులకుఁ గాన్పింపదు".

శ్రీరామదాసస్వామి లోకోద్ధరణమునకై చాఫల్‌గ్రామమునందు వసించిన సమయమున "నరసోమలనాథుఁ"డను నాతఁ డాప్రాంతములకు తాసీలుదారుగా నుండెను. ఆతఁడు సమర్థుని యోగ్యతనెఱింగి మంత్రోపదేశమొందెను. అనతికాలములో నచట రామదాసీయసంప్రదాయము మిగుల వృద్ధినొందెను. ఈవార్త తిన్నఁగా శివాజీ యాక

---

* ధులియాలోని సత్కార్యోత్తేజకసభవారు శ్రీరామదాసశివాజీల సంబంధము దెలుపనితిహాసముల నెన్నింటినో ప్రకటించిరి. వారలింకను శోధించుచున్నారు. వారలు సమర్థునిసంపూర్ణచరిత్రము నాధునికసంప్రదాయసిద్ధముగాఁ బ్రకాశముచేయుచున్నారలు. ఆంధ్రలోకమునకుఁగూడ సమర్థునిసేవయు నాంధ్రవాఙ్మయమున కాతఁడు గావించినయుపకృతియుఁ గొంతవఱకేని తెలియు నవకాశముగలదు.

ర్షించెను. ఆసమయమునందు శివాజియొక్క రాజ్యనిర్మాణశక్తి మహారాష్ట్రదేశమునందు దినదినాభివృద్ధి నొందుచుండెను.

ఆతఁడు రాయగడదుర్గమును స్వాధీనపఱచుకొనెను. ప్రతాపగడమునందొక నూతనదుర్గమును గట్టించి యచట భవానీదేవిమూర్తిని స్థాపితమొనర్చెను. పూనానగరమును ముఖ్యస్థానమొనరించుకొని నాసికనుండి కరవీరపురముదనుకఁగల సమస్తప్రాంతములను గొంకణదేశమునందుఁ గొంతభాగమును శివాజి జయించెను. ఈవిధముగ నాతఁడు రాజ్యసంపాదనకార్యమునందు మగ్నుఁడైయుండియు సాధుసమాగమమునం దభిరుచి గలిగియుండెను. బాల్యమునుండియు నాతనికి సాధుసజ్జనులయెడఁ బూజ్యభావముంటచే సాధుసమాగమముకొఱకు నిరంతరముత్సాహిగా నుండెను. తన రాజకీయకార్యముల నెరవేర్చుచుండియు నాతఁడు చించివడ్, దేహూ, ఆలంది మున్నగు ప్రసిద్ధస్థానములయందున్న సాధుజనులను మాటిమాటికి సందర్శించి వచ్చుచుండువాఁడు. మఱియు నచటిమహాత్ములయుపదేశములను శ్రద్ధాయుక్తమగు నంతఃకరణముతో నాలించుచుండువాఁడు. హరిభజనము కీర్తనము జరుగుతావునకెల్ల నాతఁ డవశ్యముగా నేగుచుండును. తల్లియగు జిగాబాయి యాతనికి బాల్యమునందే సనాతనధర్మముయొక్కయు, వేదశాస్త్రపురాణాదులయొక్కయు వేదాంతముయొక్కయు గంభీరతత్త్వములు, సిద్ధాంతములు, శిక్షాదాయకములగు కథలు చక్కఁగ నేర్పించెను. కావున దనమాతృశిక్షణమువలనను సాధుసమాగమమువలనను నాతని మానసమునందుఁ దనజీవితసార్థకత్వవిషయమున ననేకోచ్చవిచారములు నిండియుండెను. శివాజి తనజీవితము సార్థకము గావించుటకును నుత్తమరీతియందు వినియోగించుటకును జింతించుచుండెను. ఆతఁడొకసారి సుప్రసిద్ధసాధువగు తుకారాంబాబాను మంత్రోపదేశము గావింపుమని కోరెను. అందులకు తుకారాం ఆమోదింపక శివాజితో "రామదాసస్వామి శరణ్యములోనికరుగు"మని యాజ్ఞాపించెను. ఈవిధముగ మనోముముక్షుదశయం దెప్పుడు శివాజి సమర్థునిసాధుకీర్తి నాలించెనో యప్పు డాసాధుపుంగవుని సందర్శింపవలయుననుకోర్కి మిక్కుటమయ్యెను. కావున శివాజి సమర్థునకొకలేఖవ్రాసి రాజధానిలోనికి రావలయునని కోరెను. కాని సమర్థుఁ డాతనిసన్నిధికరుగక

శివాజికిం గొకజాబు వ్రాసిపంపెను. సమర్థునిలేఖ యితిహాసదృష్టితోఁ జూచినచో మిగుల మహత్త్వముగలది. అందు సమర్థుఁడు శివాజికొసంగిన యుపదేశము ధ్యానమునందుంచుటకు యోగ్యమైనది. కావున నా లేఖలోని కొన్నియంశములభావము నిచట నుదాహరించుట యావశ్యకము. సమర్థుఁడు శివాజి కిట్లు వ్రాసెను.

"ఈసమయమున ధర్మరక్షణము గావించువాఁడు భూమండలమునం దెవ్వఁడును లేఁడు. మహారాష్ట్రధర్మము నీకారణముననే సజీవముగ నున్నది. కొద్దిగనో గొప్పగనో యిపుడు గన్పడుధర్మమునకును సాధుజనులయెడఁ గావింపఁబడు రక్షణమునకును నీవే కారణము. నీవు ధన్యుఁడవు. దుష్టజనసంహారము గావించితివి. నీవన్న దుష్టులు గజగజ వణకుచున్నారు. పెక్కండ్రుజనులు నీయాశ్రయమునం దున్నారు. ఇపుడు నీవు ధర్మసంస్థాపనకార్యమును నిర్వహింపవలెను. నీకుఁ బెక్కురాజకీయ కార్యముల నెఱవేర్పవలసియుంటచే నీచిత్తవృత్తి వ్యగ్రమై పోవుచుండుట సత్యమే! ఈస్థితిలో రాజుయొక్కయు మంత్రియొక్కయు విచారమొక్కటిగావలెను. ఒకవేళ నేకత్వముగాకున్నచోఁ గార్యనాశన మగును. జనులనందఱిని సంతుష్టులుగా నుంచవలెను. మంచిబిడ్డలను బాగుగా బరిశోధింపవలెను. న్యాయమును, నీతిని ఎప్పుడును బరిత్యజింపఁ దగదు. దురాశయం దెప్పుడును జిక్కుకొనవలదు. ఎల్లప్పుడును సావధానముగా నుండవలెను. క్రోధమును దరికి రానీయజనదని నేను స్పష్టముగా నుడువుచున్నాఁడను. నేను గావించు బోధమును దగురీతి నాలింపుము. నీవు వాస్తవముగ నంతఃకరణపూర్వకముగఁ బనిచేయవలసియున్నచో నేనుజూపిన మార్గమున నడుపుము. శ్రీరామచంద్రస్వామి తనయనుగ్రహమును బ్రసరింపఁగలఁడు. నీకార్యము నెరవేరఁగలదు. నీమనోరథము లన్నియుఁ బూర్ణము లగును. ఈవిషయమున సందేహ మేమాత్ర మొందనక్కఱలేదు." ఈయుత్తరమును జదువఁగనే ధార్మికము,నిష్ఠాయుక్తము నగుశివాజియంతఃకరణమునందు శ్రీరామదాసస్వామిని దర్శింపవలయునను నుత్కంఠ యింకను దీవ్రమయ్యెను. అప్పు డాతఁడు తనవెంటఁ గొంతపరివారమును దీసికొని సమర్థునిదర్శనార్థము చాఫల్‌గ్రామమునకుఁ బోయెను. కాని సమ

ర్థుఁడొకతావున నుండువాఁడు గాఁడు. అప్పుడు సమర్థుఁడు చాఫల్‌గ్రామపరిసరస్థమగు కృష్ణాతీరమునఁగల యరణ్యములలోని దరీగహ్వరములయందు సంచరించుచుంటచే నాతనిదర్శనము శివాజికి గాకపోయెను. మహీపతియనుకవి తన"సంతువిజయమను"గ్రంథమునం దిట్లు వ్రాసియున్నాఁడు. "ఈవిధముగా శివాజిమహారా జెన్నియోమాఱులు నిరాశ నొంది తిరిగిపోవలసివచ్చెను. ఐనను నాతఁడు తనయత్నమును విరమింపలేదు. చివర కొకదినమున శివాజిచక్రవర్తి తనలో "సమర్థునిసందర్శనము ఆతనిప్రసాదము లభింపనిచో నాహారము ముట్టనని ప్రతిజ్ఞయొనర్చి గృహమునుండి బయలుదేరెను. ఇట్లు దృఢనిశ్చయమొనర్చుకొని శివాజి సమర్థునిజాడలు దీయుచు, చాఫల్‌నగర పరిసరారణ్యముల ననేకశ్రమ లొంది తిరుగుచు మిగుల విహ్వలుఁడు, ఆర్తుఁడు నైయుండెను. అప్పుడు సమర్థునిశిష్యుఁడొకఁడు శివాజితో "రాజా! సమర్థుఁ డీసమీపమునందలి యొకచెట్టుక్రిందఁ గూర్చుండియుండె"నని చెప్పెను. శివాజి సత్వరమ యచ్చటికేగి సమర్థుని సందర్శించెను. ఉభయులకును బ్రేమపూర్ణమగు సంభాషణము జరిగెను. (శా. శ ౧౫౭౧) వైశాఖశుద్ధనవమి గురువారమునాఁడు సమర్థస్వామి శివాజికి మంత్రోపదేశ మొనరించెను. దాసబోధమునందలి పదమూఁడవదశకములోని "లఘుబోధమను" సమాసమును అద్వైతజ్ఞానమును వివరించుటకై వినిపించెను.

సమర్థుఁ డొకతావుననే చిరకాలము వసించువాఁడు కాఁడని చెప్పితిమిగదా! ఒకప్పుడు సమర్థుఁడు చాఫల్‌గ్రామమునందలి మఠమునం దుండును. ఒకప్పుడు కృష్ణాతీరమునందలి వనపర్వతములలోని వృక్షములకడ నుండును. ఒకప్పుడు దేశపర్యటనమునకో, తీర్థయాత్రలకో పోవుచుండును. ఇందుచే శివాజి తనగురుదర్శనమును నిత్యమును నియమపూర్వకముగఁ జేయఁజాలకపోయెను. సమర్థుఁడు తనసమీపస్థలమునందే నివసించియున్నచోఁ దనకు నిత్యసమాగమలాభము గలుగుగదా యని శివాజి కెంతయో కోర్కెయుండెను. అతఁ డెన్నియోమాఱులు ప్రార్థించెను. కాని సమర్థుఁడు శివాజికోరిన యీకోరికపై నెక్కుడుశ్రద్ధ దీసికొనకుండెను. అప్పుడు శివాజీ అనేకభిన్నభిన్నప్రసంగపూరితమగు నొకలేఖ నంపెను. ఈయుత్తరము శివాజీరామదాసుల పరస్పరసంబం

ధమును దెలిపెడి యొకయైతిహాసికప్రమాణము. ఆయుత్తరములోని యంశములసారము నిచటనుదాహరించెదము. దానివలనఁ బాఠకులు స్వయముగా శ్రీశివాజీరామదాసులసంబంధమెంతగాఢముగా నుండెనో తెలిసికొనఁగలిగెదరు. శ్రీసమర్థుఁడు శివాజికి మంత్రోపదేశ మొనరించి రాజ్యసంపాదనము గావించి ధర్మమునుస్థాపింపుమనియు, దేవబ్రాహ్మణసేవ చేయుమనియు ప్రజాపీడ తొలంగించి పరిపాలింపుమనియు నివి నీముఖ్యధర్మములనియు నాజ్ఞాపించెను. అంతియగాక "నీహృదయమునందలి కోర్కెలెల్ల పూర్ణమగు"ననియాశీర్వదించెను. ఈయాజ్ఞానుసారముగా శివాజిగావించిన రాజ్యసంపాదనోద్యోగము సఫలమయ్యెను. మఱియు నాతనిమనోరథము స్వామియొక్క యాశీర్వాదప్రతాపమునఁ బూర్ణమయ్యెను. దుష్టనాశనము, విపులద్రవ్యప్రాప్తియు శ్రీగురుచరణ ప్రతాపఫలమేయని శివాజికి దృఢవిశ్వాసము గలిగెను. సమర్థుండును సద్గురుఁడును నగు శ్రీరామదాసస్వామి చరణకమలములయందుఁ దన రాజ్యసర్వస్వమును సమర్పించి నిత్యమును గురుచరణసేవయొనర్చుట కవకాశము లభించినఁజాలునని శివాజి తలంచెను. ఆసమయమున సమర్థుఁడు నేను తొలుతఁదెల్పిన ధర్మముల ననుసరించి వర్తించుటయే నాకు సేవగావించుటయని నుడివెను. అనంతరము శివాజీ యిట్లుప్రార్థించెను. "స్వామీ! తామేదేని సమీపస్థానమునందు వసించినచో మాటిమాటికిని దర్శనలాభము కలుగును. ఎందేని శ్రీరామమూర్తిని స్థాపించినచో సంప్రదాయము వృద్ధినొందును." ఈ కోర్కెకనుగుణముగ సమర్థుఁడు చాఫల్ గ్రామమున శ్రీరాముని స్థాపించెను. కాని తానుమాత్రము చుట్టుప్రక్కల గిరిగహ్వరములందే వసించుచుండెను. తరువాతఁ గొంతకాలమునకు శివాజీ సమర్థునిజూచి శ్రీరామనిపూజామహోత్సవాది ధర్మకార్యములను సాంగోపాంగముగా నెరవేర్చుట కెన్నిగ్రామములు నియతపఱుపవలయునో యానతిండని ప్రార్థించెను. సమర్థుఁడు శివాజీతో అంతవిశేషమగు నుపాధితో నవసరమేమియు లేదు. శ్రీరామునిసేవ గావింపవలయునని నీకునిశ్చయభావ మున్నచో యథావకాశముగ నెంతనియతపఱుపవలయునని తలంచెదవో దానిని నెరవేర్పుము" అని చెప్పెను. అప్పుడు శివాజి శ్రీసమర్థునకు సంప్రదాయపు సేవగావించుచుండుటకై గ్రామములను క్షేత్రములను దానముసంగి

శాసనము వ్రాసి సమర్థునికడకంపెను. మఱియుఁ దాను శ్రీరామోత్సవములు నిరంతరము జరుపుట కాజ్ఞయొసంగుమని వేడుకొనెను. శివాజి మిగుల బలవంతపఱుచుచుంటచే సమర్థుఁడు సితారాయొద్దనున్న సజ్జనగడ దుర్గమునందు వసించెను. అచ్చట శివాజి యొక్కమఠము గట్టించెను.

శివాజీసమర్థుల సంబంధమునుగూర్చి యెన్నివిషయములు వ్రాసినను దక్కువయేయగును. ఇఁక మూఁడువిషయములనుమాత్రము వ్రాసి యీశీర్షికను సమాప్తిగావింతుము.

ఒకదినమున సమర్థుఁడు మాహులీసంగమమునందు స్నానసంధ్యల నొనరించి భిక్షనడుగుచు సితారాలోని శివాజీభవనములోని కరిగెను. "జయజయరఘువీరసమర్థ" అని గర్జించి భిక్షనడిగెను. సమర్థుని వాక్కును వినఁగనే శివాజీహృదయము గద్గదికమయ్యెను. సత్పాత్రుఁడగు సద్గురుని జోలెయందు ఏమిభిక్షనిడవలయునాయని శివాజియోచించి తత్క్షణమే యొకకాగితముమీఁద "శ్రీసమర్థుని చరణకమలములయందు నారాజ్యమంతయును సమర్పించితిని" అని వ్రాసి యాలేఖనమునఁ దనముద్ర వేసి సంతకము జేసి వెలుపలికి వచ్చి యా కాగితమును సమర్థుని జోలెయందుంచి సాష్టాంగదండము నర్పించెను. ఈయుదంతమును గాంచి సమర్థుఁడిట్లు ప్రశ్నించెను. "ఏమిశివబా ఎట్టిభిక్షము సంగితివి! పిడికెడు బియ్యమును నా జోలెలో వైచినచో నీరెండుజాములవేళ గడిచిపోయెడిదిగదా! నేఁడు కాగితపుముక్కను సమర్పించియే నాకాతిథ్యము నొనర్చెదవాయేమి!" ఇట్లు నుడివి సమర్థుఁడు జోలెనుండి కాగితమునుదీసి చదువఁగా శివాజీ రాజ్యమునంతయుఁ దనకుసమర్పించినయంశము విశదమయ్యెను. అప్పుడు సమర్థుఁడు శివాజీనిజూచి "ఏమిశివబా! రాజ్యమును నాకిచ్చివైచితివి గదా! ఇఁకనీ వేమిచేసెదవు" అని ప్రశ్నించెను. శివాజీ చేతులుమోడ్చుకొని స్వామీ! మీచరణసేవ గావించుచుఁ గాలము గడుపుదును అనెను. ఈమాటలువిని సమర్థుఁడునవ్వి యిట్లనెను. "బాబా! ఏదియెవనికార్యమో యది వాఁడుచేయుట యుచితము. బ్రాహ్మణులు జపతపములొనరించి జ్ఞానసంపాదనము గావింపవలెను. క్షత్రియులు క్షాత్రధర్మపాలనము గావింపవలెను. ఈవిధముగాఁ దమతమకర్తవ్యములను నెరవేర్చుచుండుట

వలన మోక్షప్రాప్తి యగును. తమతమకర్మలను యథోచితరీతిఁ బూర్ణపఱచుటయందే జన్మసార్థకత్వము గలదు. పూర్వకాలమున రామచంద్రుఁడుగూడఁ దనకులగురువగు వసిష్ఠునకు అర్ధరాజ్యమును సమర్పించెను. ఆసమయమున వసిష్ఠుఁడు శ్రీరామునకు యోగవాసిష్ఠరూపముగ నీతి, న్యాయ, ధర్మములను నుపదేశించి రాజ్యము నాతనికి మఱలనొసంగెను. జనకమహారాజు సైతము యాజ్ఞవల్క్యునకుఁ దనరాజ్యము నిచ్చెను. ఆ సమయమున నాతఁడు జనకునకు రాజధర్మముల నుపదేశించి రాజ్యము తిరుగనొసంగెను. శివబా! విరాగులమగు మాబోంట్లకు రాజ్యముతో నేమియావశ్యకము. ఎప్పుడేని మేమంగీకరించినచో దానినివ్యవహరించుటకొకమంత్రి గావలెనుగదా! ఆమంత్రివి నీవేకమ్ము! రాజ్యము నాయదిగ భావించి దానిని బరిపాలించుము'' ఈయుపదేశమును వినఁగానే శివాజీ యంతఃకరణము గద్గదికమయ్యెను. ఇఁక రాజ్యమును మఱలఁగైకొనుట దక్క వేఱొకయుపాయము లేదని తెలిసికొని శివాజీ సమర్థునిట్లు ప్రార్థించెను "కృపాపూర్వకముగా నీవు మీపాదుకలను నాకనుగ్రహింపుఁడు. వానినే సింహాసనమునందుంచి నేను మీప్రధానునివలె రాజ్యకార్యములు నెరవేర్చెదను.'' సమర్థుఁ డీప్రార్థనము నంగీకరించెను. అప్పటినుండి శివాజీ తనరాజ్యచిహ్నమును (జెండాను) కాషాయవర్ణముగలదానిగ నొనర్చెను. మహారాష్ట్రుల కాషాయవర్ణపతాకము ఇతిహాసమునఁ బ్రసిద్ధముగనున్నది.

శివాజీమహారాజు సామన్‌గడ దుర్గమును నిర్మించునప్పు డొకదినమున దుర్గనిర్మాణకార్యమునఁ బాటుపడుచున్న వందలకొలఁది మనుజులఁ గాంచి "ఇందఱిని నేనుపోషించుచున్నాఁడను గదా! నేను ధన్యుఁడను.'' అని తలంచుకొనెను. ఈతలంపు గలుగఁగనే శివాజీమహారాజు మానసమునం దొకవిధమగు నభిమాన ముదయించెను. ఇంతలో నాకస్మికముగా సమర్థుఁ డచటికరుదెంచెను. ఆతనిగాంచఁగనే శివాజి దండప్రణామము లాచరించి స్వామీ! తామాకస్మికముగ నేఁడువిచ్చేయుటకుఁ గారణం బేమియని ప్రశ్నించెను. సమర్థుఁ డిట్లు నుడివెను. "నీవు శ్రీమంతుఁడవు. వేలకొలఁది మనుజులను బాలించు నేర్పరివి. కావుననే నేఁడు నీకర్మశాలను జూడనేతెంచితిని.'' ఇదియంతయు మీయనుగ్రహఫలమేయని శివాజీ

బదులుచెప్పెను. ఈవిధముగఁ బ్రసంగముజరుగుచుండ సమర్థునిదృష్టి సమీపమునందలి యొకఱాతిమీఁది కరిగెను. ఆఱాతినిదెప్పించి సమర్థుఁడు శివాజీనిజూచి మీపనివాండ్రలో నొకనిబిలిపించి యిప్పుడే యీ ఱాతిని బగులఁగొట్టింపుమని చెప్పెను. శివాజీవలన నాజ్ఞనొందిన కర్మకారుఁ డారాతిని బగులగొట్టసాగెను. సమర్థుఁ డా కర్మకారునితో మిగుల దెబ్బతగులఁగూడదు. సరిగ రెండుతునకలు మాత్రమే యగునటుల జాగ్రత్తగఁ గొట్టవలయునని చెప్పెను. ఆవిధముగనే రెండు ఖండములుగఁ గొట్టఁగనే దాని నడిమిభాగమందుఁ గొంచెము నీరును బ్రదికియున్న యొకకప్పయు గోచరించెను. ఈచమత్కారమును గాంచి యచట జనులందఱు నాశ్చర్యపడిరి. అప్పుడు సమర్థుఁడు శివాజీ కభిముఖుఁడై శివబా! నీయోగ్యత చాలగొప్పది. మఱియు నీలీల లగాధముగనున్నవి చూడుము. ఈయాశ్చర్యకరమగు నంశ మింక నెవని వలన జరుగఁగలదు ? అనిపలికెను. దీనిలో నాదేమున్నదని శివాజీపలికెను. సమర్థుఁ డందులకుఁ జిఱునవ్వునవ్వి "లేకేమి ! నీవుదక్క నీకఁ గర్తయెవఁడు ! నీవుదక్క నీజీవుల నింకనెవఁడు పాలింపఁగలఁడు !'' అని పలికెను. అప్పుడు శివాజీ మహారాజు చకితుఁడై తనప్రమాదమును దెలిసికొని యిట్లు నుడివెను. "స్వామీ ! నేను పామరుఁడను. నావలన నేమియుఁ గాజాలదు. ఈదాసుని క్షమింపుడు.'' సమర్థుఁడు శివాజీని జూచి "ఓయీ సోదరా! క్షమించుటకే సమయమునకు నేనిచ్చటికి వచ్చితిని. నీవు శ్రీరాముని ప్రభుత్వము నం దొక పెద్దసేవకుఁడవు. నీచేతినుండి యీప్రభు వితరుల కొసంగుచున్నాఁడు. ఇంతమాత్రమునకు నీవీవిధముగ నెప్పుడును నభిమానము నొందఁదగదు'' అని పలికెను. దీనిని విని శివాజీమహారాజు మిగులఁ బశ్చాత్తాపమునొందెను. మఱియు నాతఁడు సమర్థునిచరణపద్మములపైఁబడి మాటిమాటికి క్షమార్పణమును వేఁడుకొనెను. ఈశిక్షాదాయకమగు చమత్కారము ననుసరించి యొకచిత్రకారుఁ డొకచిత్రపటమును వ్రాసియున్నాఁడు.

సమర్థుఁ డొకదినమున సజ్జనగడమునం దాసీనుఁడై శిష్యమండలి యొసంగు ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరము నిచ్చుచుండెను. ఇంతలో దనశరీరముపై నొకకదుమున్నట్లు గోచరించెను. సమర్థుఁ డదిచూచి "నాతల్లి

నాకొఱకు దేవికి బంగారుపుష్పము సమర్పింతునని మ్రొక్కుకొనెను. ఆసంకల్పము నెరవేరలేదను నంశము జ్ఞాపకమునకుఁ దెచ్చుకొనెను. శివాజీచే స్థాపింపఁబడిన ప్రతాపగడమునందలి దేవీసన్నిధికి సమర్థుఁడేగి తనతల్లి మ్రొక్కుకొన్న స్వర్ణపుష్పమును సమర్పించెను. అప్పుడు దేవిని గూర్చి సమర్థుఁ డొనరించిన స్తుతియందు ఆతని యాత్మ చరిత్రోల్లేఖన ముగూడఁ గొంతకలదు. అంత్యమున నుడివిన నాలుగు పద్యములలో నున్న శివాజిని గూర్చిన ప్రార్థనము జ్ఞాపక ముంచుకొనఁదగినది. అందలి భావార్థము నిట నుదాహరింతుము.

“ఓమాతా ! నాప్రార్థన మొక్కటి మాత్రమే ! నీవు నాకు వరము లనుగ్రహింప నెంచినచో నీకభిమాన పాత్రుఁడును, సర్వకాల సర్వావస్థలందును నీవాఁడును నగు శివాజిని రక్షింపుము. ఆతనిని నేను జూచుచుండఁగనే వైభవ శిఖరమునం దధిష్ఠింపఁజేయుము. ఇదియే నాకొసంగఁదగిన వరప్రసాదము. నేటిదనుక నీవసంఖ్యాకులగు దుష్టులను సంహరించితివని వినియుంటిని. ఈసమయమున నాకుఁ బ్రతీతి కలిగింపుము. దేవగణములోని వారెల్లరును మమ్మును మామిత్రులను మఱచిరి. నీవింక నెంతదనుక మాస్వత్వములఁ బరీక్షించెదవు ? ఓదేవీ ! . నీభక్తుల మనోరథమును శీఘ్రముగ సఫల మొనర్పుము. నే నత్యంతాతురుఁడ నైయున్నాఁడఁ గావున క్షమింపుము. నాకోర్కె సఫలము గావింపుము ”. ఆహా ! శివాజీమహారా జెంతధన్యాత్ముఁడు. అతని యైశ్వర్యాభివృద్ధికై సద్గురుఁడగు సమర్థుడు దేవి నీవిధముగఁ బ్రార్థించుచున్నాఁడు. సమర్థుని యొక్కయు, శివాజియొక్కయుఁ బరస్పర సంబంధమునం దింతకంటె నధికముగ నేవిషయమును వ్రాయుదుము ? ఏమహాకార్యముకొఱకు శ్రీరామదాసస్వామి తన పుణ్యమంతయు వ్యయ మొనరించెనో తనకుగల శక్తిసామర్థ్యము వినియోగించెనో దాని నాతనియిష్టానుసారముగ శ్రీరామచంద్రమూర్తి పూర్తిజేసెను. ఈవిషయ మింకను సింహావలోకనమువలనఁగూడఁ దెలియగలదు.

సమకాలికులగు నుపదేశకులు.

శ్రీరామదాసస్వామి తనజీవితకాలము నందు మహారాష్ట్రదేశమున స్వధర్మస్థాపనమునకును సమాజహితమునకును నొనరించిన యలౌకిక

కార్యములలో నాతనిసమకాలికులగు నుపదేశకులు (సాధుపురుషులు) కవులుకూడ సహాయముగా నుండిరి. ఆసమయమున మహారాష్ట్ర సమాజ మభ్యున్నతి బడయుట కావశ్యకములగు సనాతనధర్మవ్యాప్తి జాతినిబంధనములలో ననిష్టత్వము, కర్తవ్యపరాయణత్వము, ఏకత్వము, మున్నగు గుణశిక్షణములను అనేకసాధుసత్తములు కవిజనులు తమప్రవర్తనమువలనను, ఉపదేశములవలనను గావించుచుండిరి. మొట్టమొదట ధర్మశాస్త్రాది గ్రంథములన్నియు సంస్కృతమునం దుండెడివి. అందుచే బండితులు, విశేషజ్ఞులు నగువారలు దక్కఁ దక్కినవారలెవ్వరును జదివి లాభము గ్రహింపఁజాలకుండిరి. కాని సమర్థుని సమకాలికులగు సాధుజనులు, కవీశ్వరులు తమయుపదేశములను మాతృభాషయగు మహారాష్ట్రమునందె గావింప నారంభించిరి. ఈకారణమున నహంకారపూరితులగు కొందఱివలన వారలకుఁ గొంతకష్టమును సహింపవలసివచ్చెను. వారల మాతృభాషాప్రేమవలన జనసమాజమున కసాధారణమగు హితము కలిగెను. యూరపుఖండమునందు “బాయిబిల్ ” ను ఆంగ్లభాషయం దనువదించి లూథరను ధర్మసంక్రాంతిబీజమును నాటినట్లు మహారాష్ట్రోపదేశకులు (విశేషించి రామదాసస్వామి కాలమునను దరువాతి కాలమునను గల ఉపదేశకులు) సంస్కృతమునందు మరుగుపడియున్న సమస్తజ్ఞానభాండారమును మహారాష్ట్రభాషాముఖమున సర్వసాధారణులగు జనులకు సుగమమును, సులభమును గావించిరి. క్రీ. శ 1895 లో పూనా సార్వజనిక సభాపత్రమునఁ బ్రచురించు త్రైమాసిక పత్రికయం దిట్లు వ్రాయబడెను.

The saints and prophets addressed the people both in speech and writing in their own vernacular and boldly opened the hitherto hidden and unknown treasures to all and sundry men and women, Brahmans and Sudras alike. These early Marathi -writers knew that modern India, after Budhistic revolution, was less influenced by the Vedas and Shastras than by the Ramayana and Mahabharat the Bhagavat Puranam and the Gita, and these latter works were translated and made accessible to all.

(ఋషులును, భక్తులును, కవితయందును మాటలందును దేశభాషల నుపయోగించిరి. అందుచే బ్రాహ్మణ బ్రాహ్మణేతరులకును స్త్రీపురుషులకును అంతవఱకు మఱుఁగైయున్న విజ్ఞానము బహిర్గతమయ్యెను. బౌద్ధమత విజృంభణమునకనంతరము నవీన భారతవర్షమునందు వేదశాస్త్రములకంటె భగవద్గీతా భారత భాగవత రామాయణము లెక్కుడుగ ఆకర్షించుచున్నవని యీప్రాచీన మహారాష్ట్రకవులు గ్రహించి వానిని దేశభాషలలోనికి అనువదించి యందలి యంశములు బాటులలోనికి దెచ్చిరి.)

ఈ యుపాయముచే మహారాష్ట్రదేశమునందు ధర్మము వృద్ధినొందెను. జనులు తమసమాజమునకు దేశమునకు హితముగావించుటయందు సమర్థులైరి. ఈవిధముగ సమర్థుని కాలమునందు ధర్మమునకు స్వజనమునకు స్వజాతికి, స్వభాషకు సేవగావించిన వారిలోఁ గొందఱివృత్తాంతములను దెలుపుట యావశ్యకమై యున్నది. జయరామస్వామి, రంగనాథస్వామి, ఆనందమూర్తి, కేశవస్వామి, మోరయాదేవుఁడు, తుకారాంబాబా, వామనపండితుఁడు, దేవీదాసుఁడు, కూర్మదాసు, రామాజీ, బోధలేబాబా, నృసింహసరస్వతి, ముక్తేశ్వరుఁడు, విఠ్ఠలకవి, అనంతకవి, ఆనందతనయుఁడు, నిరంజనస్వామి, షేకుమహమ్మదు, శివదీనుఁడు, మున్నగు పలువురు సాధువులును, కవులును సమర్థునకు సమకాలికులుగ నుండిరి. వీరలందఱివిషయమును గొంచెము కొంచెముగా వ్రాసినను ప్రకృత వ్యాసము మిగుల విస్తరించి పోవఁగలదు. కావున వీరిలోని మొదటివారలు గురు సాధుపురుషులవిషయము మాత్రము కొంచెము వ్రాసి యీభాగము ముగింతుము.

మహారాష్ట్రమునందు రామదాస పంచాయతనమునకు మిగులఁ బ్రసిద్ధిగలదు. ఈపంచాయతనములో శ్రీరామదాసస్వామితోఁబాటుగ జయరామస్వామియు, రంగనాథస్వామియు, ఆనందమూర్తియు, కేశవస్వామియుఁగలరు. భికాజీపంతు దేశపాండే యనునాతఁడు కాసరాబాదు పరగణాలోని మాండవగణమను గ్రామవాస్తవ్యుఁడు. ఈతనిభార్య కృష్ణాబాయి. జయరామస్వామి యీదంపతుల కుమారుఁడు. తనతల్లితోఁగలిసి జయరామస్వామి పండరిపురమునందు వసించుచుండెను. అచట భక్తియుతముగ భజనముగావించి భగవద్దర్శన మొందినపిమ్మటనాతఁడు "బడ్‌గావు" అను గ్రామమునందలి "కృష్ణాజీఅపా అభ్యంకరుని"కడ కరిగెను. ఆతని

యుపదేశమువలన జయరామస్వామి రామదాసస్వామికి శిష్యుఁడయ్యెను. జయరామస్వామి శాంతిపంచీకరణము, సీతాస్వయంవరము, రుక్మిణీస్వయంవరము, అను గ్రంథములను రచించి క్రీ. శ 1672 లో మరణించెను. గోపాలపంతు బయాంబబాయిల కుమారుఁడు రంగనాథస్వామి. రంగనాథస్వామి యన్నయగు బ్రహ్మానందస్వామి గొప్పసాధుపురుషుఁడు. బ్రహ్మానందస్వామి కుమారుఁడగు శ్రీధరకవి రామవిజయము, హరివిజయము, పాండవప్రతాపము, భగవద్గీత, శివలీలామృతము మున్నగు ననేకగ్రంథములు రచించెను. మహారాష్ట్రదేశీయులగు పిన్నలు పెద్దలు నగువారలెల్ల నిప్పటికిని మిగులనుత్సాహముతో నితనిగ్రంథములు చదువుచుందురు. రంగనాథస్వామి నిత్యమును రామదాసస్వామిని సందర్శింపఁదలంచి సజ్జనగడమునకు సమీపమునందున్న నిగడీగ్రామమున మఠముగట్టించుకొని యచట నివసించుచుండెను. ఈ స్వామి గొప్పరాజయోగియు విలాసపురుషుఁడునై యుండెను. నిరంతర మీతఁడు గొప్పయైశ్వర్యశాలివలె నుండువాఁడు. తలపయి జలతారుపనిగల పట్టుపాగయు, చెవులకు విలువగల మంచిముత్తెముల పోగులు, శరీరముపై జరీపనితనముగల అంగరకాయు, చేతిలో బాకును,వీపుపై డాలును ధరించి మిగుల మూల్యముగల యున్నతాశ్వమునెక్కి వెలుపలకు బయలుదేరువాఁడు. వెంట దాదాపుగఁ గౌపీనధారులగు బ్రహ్మచారిశిష్యు లుండువారు. రంగనాథస్వామికూడ బాలబ్రహ్మచారి. ఆతఁడు లాగునకు లోపలఁ గౌపీనము ధరించువాఁడు. బృహద్వాక్యవృత్తి, చిత్సదానందలహరి, వాసిష్ఠసారము, మొదలగు నుత్తమోత్తమగ్రంథముల నీతఁడు రచించెను. క్రీ. శ 1634 లో నీతఁడు సమాధిగైకొనెను. ఆనందమూర్తి రంగనాథస్వామిశిష్యుఁడు. సమర్థుఁ డాతని చిరంజీవా! యని పిలుచువాఁడు. క్రీ. శ 1696 లో నాతఁడు సమాధిగైకొనెను. ఆతని సమాధి బ్రహ్మనాళమునందుఁ గలదు. మహారాష్ట్రభాషలో ఆనందస్వామి యనేక చాటుపద్యములను రచించెను. కేశవస్వామి యిపుడు హైదరాబాదనఁబడు భాగ్యనగరమునందు వసించుచుండెను. ఆతని గురుఁడు కాశీరాజస్వామి. కేశవస్వామి కొన్ని విస్ఫుటాభంగపద్యములు రచించెను. క్రీ. శ 1682 లో నీతఁడు స్వర్గవాసియయ్యెను.

రామదాస పంచాయతనమునందలి పైని జేర్కొనిన నలుగురు సాధుపురుషులేగాక సమకాలికులగు నితరసాధువులును, కవీశ్వరులును, శ్రీరామదాసస్వామిని మిగుల సన్మానించువారు. వామనపండితుఁడు మహారాష్ట్రమునందు సుప్రసిద్ధకవియు, గొప్ప సంస్కృత విద్వాంసుఁడును శాస్త్రజ్ఞుఁడును నై యుండెను. కాశి మొదలు రామేశ్వరమువఱకుఁ దన యపూర్వ విద్వత్సామర్థ్యమును బ్రదర్శించి సమకాలిక పండితులవలన జయపత్రముల నార్జించెను. అతఁడు మాతృభాషయగు మహారాష్ట్రమునందును సంస్కృతమునందును ఉత్తమోత్తమగ్రంథము లెన్నియో రచించెను. అందు నిగమసారమను సంస్కృతగ్రంథము మిగులఁ బ్రశస్తమైనది. తొలుదొలుత వామనపండితుఁడు తనమాతృభాషను నిందించువాఁడు. సాధుజనులయెడల విశేషించి పూజ్యభావ మాతనికి లేకుండెడిది. "శ్రీరామదాసస్వామితోఁ గలిసికొన్నప్పటినుండియు నాతని గర్వమంతయు నశించెను. రామదాసస్వామి సందియములన్నియుఁ దొలంగించి తన యపూర్వచమత్కృతి చేనాతనిసంస్కరించిసాధుజనులవిషయమునందుశ్రద్ధాభక్తులుగలిగించెను. సమర్థుఁడు వామనపండితుని శిష్యునిగాఁ జేసికొని మహారాష్ట్రములో గ్రంథములు వ్రాయుమని యాజ్ఞాపించెను. నాఁటనుండి మహారాష్ట్రభాషలో దాదాపుగ ఏఁబదియాఱువది గ్రంథములను రచించెను. శ్రీభగవద్గీతపై నాతఁడువ్రాసిన టీకాత్మకమగు ఓ వీ ఛందోగ్రంథ మద్వితీయమైనది. వామనపండితుఁడు వ్రాసినగ్రంథములలోని పద్యము లన్నియుఁగలిసి దాదాపు పండ్రెండు లక్షలగునని చెప్పుదురు. ఈవిధముగా రామదాసస్వామి సమకాలిక పండితుల హృదయములందు మాతృభాషయగు మహారాష్ట్రమునందుఁ బ్రేమగల్గించెను.

—* సమర్థ శిష్యులు, ఆతనిసంప్రదాయి మఠములు. *—

సమర్థరామదాసస్వామికి శిష్యులెందఱు ? ఎక్కడెక్కడ నెవరుండిరి ? తన సాంప్రదాయికమఠముల నెక్కడెక్కడ నెన్నింటిని స్థాపించెను ? ఎవ్వరెవరిని మఠాధీశ్వరులుగ నొనర్చెను ? అనువిషయములను నిశ్చయముగాఁ దెలుప సాధ్యముగాదు.మహా రాష్ట్ర ఇతిహాసమునందును ప్రాచీనకావ్య సాహిత్యములందును బరిశోధనము గావించువారలు శ్రీరామదాసస్వామి వేలకొలఁది శిష్యులను వందలకొలఁది మహంతులను

గావించెననియు అనేకస్థానములందు మఠములు నెలకొల్పెననియు అతని శిష్యులును మహంతులును ఆర్యావర్తమునం దంతటను విశేషించి మహారాష్ట్రమునందును దిరిగి స్వధర్మమును, సునీతిని నుపదేశించి జనులలో జాగరూకత గలిగించిరనియు వారలగణించుట యశక్యమనియుఁ జెప్పుచున్నారు. స్వయముగ సమర్థుఁడు దాసబోధమునందు (ద ౧౯ స ౧౦లో) “జనులెందఱున్నారో జనసముదాయ మెంతగలదో తెలియదు. జనులందఱిని శ్రవణ మననములందుఁ బ్రవేశపెట్టి సముదాయముల గణించుట యసాధ్యము” అని వ్రాసియున్నాఁడు. అతని ప్రసిద్ధశిష్యుఁడగు కల్యాణస్వామి యొకతావున “ఈభూమండలమునఁగల సమర్థుని భక్తమండలి నెవ్వరును గణింపఁజాలరు” అని వ్రాయుచున్నాఁడు. గిరిధరస్వామియు “సమర్థుఁ డెందఱో శిష్యులను మహంతులను గుప్తరూపముగ నుంచెను. సమర్థుఁడు దక్క వారి నితరు లెఱుంగరు” అనివ్రాసెను. సారాంశ మేమన! శ్రీసమర్థుఁ డనేకులను దనజీవితకాలమున శిష్యులుగను మహంతులుగను నొనర్చెను. అనేకస్థానములందు మఠముల నెలకొల్పెను. ఈకాలమున వారందఱిజాడల నెఱుంగుట కేవలము కఠినతరమేగాక యసంభవమనిగూడఁ దోఁచుచున్నది.

సమర్థుని శిష్యగణమును లెక్కించుట యసంభవమైనను నాతని జీవితచరిత్రమును లిఖించిన మహానుభావులగు మహంతులుకొందఱు సమర్థునిశిష్యుల యొక్కయు మఠములయొక్కయు నామములఁ బేర్కొనిరి. ధూలియా(ఖాన్దేసము)యందలిసత్కార్యోత్తేజకసభామండలివారు శ్రీరామదాసస్వామికవిత్వమునందుఁ బ్రథమఖండము ను బ్రచురించిరి. అందలి ప్రస్తావనలో శ్రీరామదాసస్వామి సంప్రదాయులగు మహంతులను శిష్యులను మఠములను గొంచెమువర్ణించిరి. దాని నాధారముగాఁదీసికొని కొన్ని విషయము లుదాహరింతుము.

శ్రీసమర్థుని మఠాధిపతులలో నిప్పటికి ఎనుబదియాఱుగురిజాడ మాత్రము తెలిసినది. అందుఁ గొందఱినామముల మాత్రము తెలుపుదుము. 1 డోమగావుమఠమునందు కల్యాణస్వామియు 2 శిరగావుమఠమునందు దత్తాత్రేయస్వామియు 3 కణహేరీమఠమునందు వాసుదేవస్వామియు 4 దాదేగావుమఠమున దేవదాసును 5 టాక

లి ఇంచూరుబోధనమఠములయందు ఉద్ధవస్వామియు 6 చాఫలుమఠము నందు దివాకరస్వామియు 7 కర్ణాటకమఠమునందు అనంతమౌనియు నుండిరి. 8 విశ్వనాథపండితుండు త్ర్యగహిందమాస్థానమునను 9 బాలకృష్ణుండు బరారునందును 10 మాధవుండు, యాదవుండు, వేణీమాధవుండు ప్రయాగయందును 11 జనార్దనుండు సూరతునందును 12 శ్రీధరుండు రామకోటయందును 13 గోవిందుండు గోవాయందును 14 శివరాముండు త్రిలింగ ప్రాంతమునందును 15 శంకరుండు శ్రీరంగ పట్టణమునందును 16 హరిశ్చంద్రుండు అంతర్వేదియందును 17 రామకృష్ణుండు అయోధ్యయందును 18 హరికృష్ణుండు మధురయందును 19 జయకృష్ణుండు మాయాపురమందును 20 రామచంద్రుండు కాశియందును 21 భగవంతుండు కాంధియందును 22 హరి ద్వారకయందును 23 దయాళు బదరీకేదారమునందును 24 బ్రహ్మదాసు ఓంకారేశ్వరమునందును 25 బల్లాలుండు జగన్నాథమునందును 26 హనుమానుండు రామేశ్వరము నందును వసించు చుండిరి.

ఈనామములు వారల మూలనామములు గావు. ఇందుం బెక్కునామములు సమర్థుండు పెట్టినవి. తఱుచుగా నీదేశమునందలి ప్రతిప్రధాన స్థలమునందును నాతనిమహంతులు (మఠాధిపతులు) వసించుచుండిరి. అతండు తనమహంతుల నంపని తీర్థక్షేత్రమే లేదు. ఈమహంతులు చిరకాలము శిష్యులవలె సమర్థునియొద్దనుండి సాంప్రదాయిక శిక్షనొందుచుం బరమార్థమార్గరహస్యములను జక్కంగ నెఱుంగుచు సమర్థునిగ్రంథములకుం బ్రతులువ్రాసి శ్రద్ధాపూర్వకముగాం బారాయణమొనర్చుచు నందలి గూఢతత్త్వములను స్వయముగా ననుభవప్రాప్తి గావించుకొనుచు శాస్త్రవచనమును, గురువచనమును, ఆత్మానుభవమును, నిశ్చయము నొనరించుచు నుండువారు. అనంతరము.

ఆతాంహోణార్ తేం హోయీనాకా । జాణార్ తేం జాయే నాకా
తుటలీ మనాంతీల్ ఆశంకా । జన్మ మృత్యూచీ॥ ౮౮- ద ౬ -స౨.

ఈవిధముగ నిర్భయము, నిశ్శంకము నగువృత్తితో జగదుద్ధరణమను కఠినకార్యమొనరించుటకై శ్రీసమర్థునియాజ్ఞానుసారముగ సమగ్రహిందూదేశమునందును లేక యేదేనియొక విశిష్టప్రాంతమునందును సమర్థుని

మహంతులు సంచరించుచుండిరి. సమర్థుండు మహంతుయొక్క ముఖ్యకర్తవ్యము నిట్లుచెప్పెను.

మహంతేం మహంత్ కరావే‌ం యుక్తిబుద్ధీనేం భరావేం
జాణతేం కరూన విఖరావేం । నానాదేశీం. ౨౧-ద ౧౧-స॥ ౧౦.

"మహంతు, ఇంక ననేకమహంతులను సిద్ధపఱుపవలెను. వారియందు యుక్తిని, బుద్ధిని జక్కంగ నింపవలెను. ఈవిధముగ ననేకజ్ఞాతలగు మహంతులను సిద్ధపఱచి నానాదేశములందు వ్యాపింపంజేయవలెను. ఇది యాతనికర్తవ్యము" ఈకర్తవ్యమును యథోచితముగాం భావించుటకై పరిభ్రమణము, వివేకము, కష్టసహనశక్తి, మృత్యువునెడ నిర్భయత్వము, యశమునందు లాలసత్వము, వైరాగ్యము, నిస్పృహత్వము, చాతుర్యము లేక విచక్షణత్వము, మృదువచనము, క్షమ, శాంతి, సహిష్ణుత్వము, పరోపకారబుద్ధి, ఉత్కటేచ్ఛ, మున్నగు ననేక విశిష్టగుణములావశ్యకములు. ఈగుణముల నన్నింటిని సమర్థుండు తనగ్రంథములందు (విశేషించి దాసబోధమున) వర్ణించియున్నాండు.

ఈమహంతులు భ్రమణముగావించునపుడుగాని మఠమునందున్నపుడు గాని యేయేపను లేవిధముగం జేయువారో వారికార్యక్రమ మెట్లుండెనో వార లేవిధముగ నుండిరో వారివర్తన మెట్టిదో సమర్థుం డెట్లు వీరలను బరిశీలించుచుండెనో తెలిసికొనందగిన ప్రమాణసహితములగు పూర్వదృష్టాంతము లింతవఱకు లభింపలేదు. ఇది యంతయు విచారకరము. ఈమహంతుల కార్యప్రణాళికకు సంబంధించిన సప్రమాణమగు నితిహాసము లభించినచో శ్రీసమర్థరామదాసస్వామి జీవితచరిత్రమునందలి ముఖ్యభాగముపై నప్రతిమప్రకాశము కలుగంగలదు.

శ్రీసమర్థునకు శిష్యులేగాక శిష్యురాండ్రుగూడ వేలకొలందిగ నుండిరనుటకు సందియములేదు. పురుషులలో శ్రీఛత్రపతి శివాజీమహారాజు నామముమాత్ర మిచటనుదాహరించుట యుక్తిశీర్షికకుం జాలును. స్త్రీవర్గమునందు సీతాబాయి, చిమణాబాయి, అంబిక, ద్వారకబాయి, భవాబాయి, కృష్ణాబాయి, వేణూబాయి, మనాబాయి, అన్నపూర్ణ, గంగాబాయి, గోదాబాయి మున్నగువారలు ప్రసిద్ధురాండ్రు, వీరిలో, వేణుబాయి సీతాస్వయంవరము, మంగళరామాయణము, సంకేతరా

మాయణము, లవకుశ రామాయణము, సుందరరామాయణము, అబ్ద రామాయణము, భాషారామాయణము మున్నగు ననేకగ్రంథరాజములను రచించెను.

సమర్థుని గ్రంథములు.

ఇతిహాసదృష్టితోఁ జూచినచోఁ బ్రాచీనకవులయొక్కయు సాధువులయొక్కయు గ్రంథసముదాయమును రాష్ట్రీయసాహిత్యమని చెప్పవచ్చును. ఆరాష్ట్రీయసాహిత్య మెంతసూక్ష్మముగ నెంతమార్మికముగ నభ్యాసమొనరించిన నాకాలవు రాష్ట్రీయవిజ్ఞాన మంతయధిక మగును. భరతఖండమునందలి యేప్రాంతమునందైనను ప్రాయికముగఁ బ్రాకృత భాషయందుఁ దొలుదొలుత గద్యగ్రంథముల వ్రాయుచుండుపరిపాటిక లేనట్లు తోఁచుచున్నది. మాటలాడుభాష గద్యగనుండినను రాజకీయ వ్యవహారము గద్యగ వ్రాయఁబడుచున్నను కవులు సాధువులు మాత్రము ప్రాయికముగఁ బద్యమునందే గ్రంథరచనము గావించుచుండిరి. ఈ సాధువులయొక్కయుఁ, గవులయొక్కయు రచనాశైలియందును, భిన్నభిన్నచ్ఛందముల నేరుటయందును దప్పక కొంతభేదముమాత్రము గాన్పించును. ప్రాయికముగాఁ బ్రాచీనసాధువుల కవిత్వమునందు స్వతంత్రరచనము మిగులఁ దక్కువగాఁ గాన్పించును. శ్రీరామదాసస్వామి యేదేని పౌరాణిక విషయమునందు మిగులఁ దక్కువగ గ్రంథరచన మొనరించెను. ప్రాయికముగ నాతనిరచనమంతయు స్వతంత్రము. అతఁడు సాధారణముగ మనోరంజనార్థమై కవిత్వము వ్రాయలేదు. ఆతనికవిత్వమంతటియందును నేదియో ముఖ్యహేతువుఁ గలదు. ప్రాచీనప్రథననుసరించి సమర్థుఁడుగూడఁ దనగ్రంథములన్నింటిని బద్యాత్మకములుగ రచించెను. అతఁడు కేవలము కావ్యరసప్రధానతనే తనముఖ్యహేతువుగ భావించి పద్యాత్మకముగ గ్రంథరచన మొనర్పక తనగ్రంథములన్నింటి నుపదేశార్థమై రచించెను. జనసమాజ సంస్కరణమే యాతనిగ్రంథరచనమునకుఁ బ్రధాన హేతువు. దీనినిబట్టి యొకవేళ నాకాలమున గద్యమును వ్రాసెడి యాచారమున్నచో సమర్థుఁడుగూడఁ దనగ్రంథములను గద్యమునందే వ్రాసియుండెడివాఁడని మన మూహింపవచ్చును.

ఇఁక సమర్థుఁడు కవియగునా? కాఁడా? ఒకవేళ నాతఁడు కవియగుచో నేశ్రేణిలోఁ జేరఁదగినవాఁడు? అను విషయము తెలిసికొనవలసియున్నది. ఆతని పద్యరచనమును గాంచి పలువు రాతనిని కవి యందురు. సర్వసాధారణు లగు జనులు పద్యరచనమునే కావ్యమని భావించుటయే దీనికింగల కారణము. కాని సాహిత్యశాస్త్రపరిభాషానుసారముగ సమర్థుఁడు కవిగాఁడు. సమర్థుఁడు కవియొక్కయుఁ గవిత్వముయొక్కయు లక్షణములను దాసబోధమునం దేవేవి చెప్పెనో వానిననుసరించిచూచినచో నాతఁడు కవి=(ఆధునికభాషయందుఁ బ్రతిభాశాలియుఁ బ్రాసాదికుఁడు, ఉపదేశకుఁడు) యని చెప్పవచ్చును. ఆతనికవిత్వమునందుఁ బ్రసాదగుణము నిండియున్నది. మఱియు మనోహరదృష్టాంతములుగూడ విశేషించి కలవు. కాని యాతఁడు తనగ్రంథములోని దృష్టాంతములను ఇతరకావ్యగ్రంథములందువలె కేవలరమణీయత్వము, చమత్కారము, సమకూర్పనుదాహరింపలేదు. అందందుఁ బ్రతిపాదింపఁబడిన విషయములను బరిపోషణమొనర్చుటకే దృష్టాంతము లొసంగఁబడెను. ఈతనిగ్రంథములం దద్భుతవక్తృత్వశక్తి గాన్పించును. అప్రతిబద్ధమగు విషయనిరూపణప్రవాహమువలనను, సముచితములగు శబ్దముల కూర్పులవలనను, చిత్తాకర్షకమగు విచారపద్ధతివలనను జదువుచున్నవానికిఁ బ్రత్యక్షముగ బృహస్పతియో, వాచస్పతియో వ్యాఖ్యానము గావించుచున్నట్లు తోఁచును. సమర్థుఁడు దాసబోధమునందుఁ బ్రతిపాదించియున్న సిద్ధాంతవిషయములు, పరమతాత్త్వికములును, గహనములును, శాస్త్రీయములు నైయున్నను వానిని జదువునపుడు హృదయాహ్లాదకరమగు కావ్యమును జదువుచున్నారమని స్ఫురించుట కిదియే కారణము.

ఈ వివేచనమువలన సమర్థుఁ డెట్టియుత్తమోపదేశకుఁడగు కవియో యాతనిగ్రంథస్వరూప మెట్టిదియో పాఠకులకు విదితముకాఁగలదు. ఆధునికకవుల దృష్టిలోఁగూడసమర్థునిగ్రంథములం దనేకకావ్యగుణములు గోచరించును. ఆతనిరామాయణమునందలి యుద్ధకాండమునందు వీరరసముపరిపక్వమొందినది. ఆతనిపద్యములందును గీర్తనములందును అభంగములందును గరుణరస మనుపమముగ నావిర్భవించినది. దాసబోధమునందు నిద్రానిరూపణము గావించునపుడు రామదాసస్వామి హాస్యశ్రీ

త్సరసములను బాగుగాఁ జిత్రించెను. కావ్యచమత్కృతియందు సైతము దాసబోధమునం దొకటిరెండుతావుల నుదాహరణములు లభింపఁగలవు. దాసబోధ పదునాలుగవదశకములోని నాలుగవసమాసమునందు "ఏకాఖడీ" యను నక్షరాలంకారము గలదు.

కవులనుగూర్చియుఁ, గవిత్వమునుగూర్చియు విచారించుటలో సమర్థునిభావ మెట్లుండెనో తెలిసికొనఁ బ్రయత్నించుదము. పాఠకుల కీవిషయమున నాతనిముఖమునుండియే యాతఁడెట్టికవియైనది విశదము కాఁగలదు. సమర్థుని మతానుసారముగ గద్యపద్యగ్రంథముల రచించువారలును నానాశాస్త్రములను వివేచనపూర్వకముగఁ జర్చించువారలును కవులైయున్నారు. ఇంతియగాదు. మీఁదుమిక్కిలిగ వారు ప్రాసాదికులగు కవులైయున్నారు. సమర్థునిదృష్టిలోఁ బ్రతిభాసంపన్నుఁడగు వ్యక్తియే కవి. నవరసాత్మకమగు కవిత్వమునురచించుకవియు, గణితశాస్త్రియు, వేదాంతియు, యోధయు, చిత్రకారుఁడును, వ్యాఖ్యాతయు, శిల్పియు, నిటులే యెవరైనఁగానిమ్ము. ప్రతిభాలక్షణములుగలవాఁడే కవియని సమర్థునిమతము. ఆతనిమతమును ననుసరించిచూచినచో కేవలగ్రంథరూపమున నేగాక యాచారరూపముననున్నదిగూడఁ గవిత్వమని తెలియును. సాధనము, పురశ్చరణము, తపము, తీర్థాటనము, ధైర్యము, శౌర్యము, ధృతి మున్నగువాని క్రియలుగూడఁ గవిత్వమునందుఁ జేరియున్నవి. సారాంశమేమన? ఆచారవిచారములు రెంటియందును నీశ్వరీయమగు దివ్యాంశప్రతిభ కలిగియుంటయే కవిత్వలక్షణము. మహాత్ముఁడగు తులసీదాసువలె సమర్థుఁడుగూడ నరస్తుతివిషయిక కవిత్వమును నిషేధించెను. ఉదరశాంతికై రచించు నరస్తుతికవిత్వమునఁ దనయోగ్యత జూపించుట అధమత్వలక్షణమని సమర్థునితలంపు. సమర్థుఁడు దాసబోధలో భక్తుఁడగుకవిని వర్ణించుచుఁ బ్రాసాదిక కవిత్వలక్షణములను ఎట్లువర్ణించెనో చూడుఁడు.

నానాధ్యానే నానామూర్తీం । నానాప్రతాప్ నానాకీర్తీ
తయాపుఢేం నరస్తుతీ । తృణతుల్య వాటే ॥ ౩౨
త్యాచేం భక్తీచే కౌతుక్ । తయానావ్ ప్రసాదిక్
సహజ్ బోలతాం వివేక్ । ప్రగట్ హోయే ॥ ౩౪.

"ఇట్టికవి వాణినుండి సహజముగనే ప్రకటమగు హరిభక్తికౌతుకముయొక్కయు, నానావిధములగు నీశ్వరధ్యానములయొక్కయు, నానావిధమూర్తులయొక్కయు, నానాప్రకారప్రతాపములయొక్కయు ఆవిర్భావమును బ్రాసాదికకవిత్వ మందురు. ఆకవిత్వముముందు నరస్తుతికవిత తృణతుల్యము" సమర్థుఁడు వాకొనిన యీభావమునే ప్రాసాదికకవియగు తులసీదాసు తనయద్వితీయగ్రంథమగు "రామచరితమానసమునం దెంత చమత్కారముగ వ్రాసెనో చూడుఁడు"

భగవతిహేతుబిధి భవనబిహాయీ । సుమిరత శారద ఆవతిధాయీ
కవికోవిదఅస్ హృదయబిచారీ । గావహింహరిజస్ కలిమలహారీ
కీన్హేప్రాకృతజనగుణగానా । సిర్ ధునిగిరాలాగిపఛితానా ॥ ప్ర. సో. చా. ౧౧

"భక్తివర్ణనముగావించుటకై శారదాదేవి (వాణీరూపముతో) సుఖమయమగు విధిభవనమునువదలి కవులహృదయములలోనికిఁ బరుగెత్తి వచ్చుచున్నది. దీనినెఱింగిన కోవిదులగు కవిసత్తములు కలిమలము నుహరించు హరియశమును గానముచేయుచున్నారు. తనపొట్టకొఱకు బలవంతముగ వాణికిఁ గష్టమునుగూర్చి ప్రాకృతజనుల గుణములను గానముచేయుటవలన సరస్వతీదేవి తలదడవికొని పశ్చాత్తాపము నొందుచున్నది." ఉదాహృతవిషయములంబట్టి సమర్థుఁ డేతెగలోఁ జేరఁ దగిన కవియో, కవులవిషయమునను గావ్యవిషయమునను ఆతనివిచారమెట్లుండునో యనువిషయమును మాపాఠకులు చక్కఁగ దెలిసికొనియే యుందురు. ఇఁకఁ బాఠకులకు సమర్థుని గ్రంథసముదాయముతోఁ బరిచయము గలిగింతుము. సమర్థుని యుపదేశగ్రంథభాండారమపరిమితముగ నున్నది. సమర్థునిశిష్యుఁడగు అనంతకవి సమర్థునిగ్రంథములను సముద్రముతోఁ బోల్చెను. వాస్తవమునకు సమర్థుని గ్రంథసముదాయము సముద్రమువలె వ్యాపకమును, అగాధమును, గంభీరమును నై యున్నదనియు నందనేకరత్నములు నిండియున్నవనియుఁ జెప్పుటకు సందేహింపఁ బనిలేదు. మహారాష్ట్రీయవిద్వాంసులు చిరకాలమునుండి సమర్థునిగ్రంథములకొఱ కన్వేషించుచున్నారు. కొందఱు ప్రకాశకు లాతని సమగ్రగ్రంథములను బ్రకటించియున్నారు. కాని యిప్పటికి సమర్థునిగ్రంథసాగరమునందలి రత్నములు చాలకొలఁదిగనే

లభించినవనియు, అందు నింతవఱకు జరిగిన కృషి సమగ్రమని చెప్పఁజాలమనియు విద్వాంసుల యభిప్రాయము. ధూలియా (ఖాన్దేశము)లోని సత్కార్యోత్తేజకసభవారు స్వయముగ సమర్థునియొక్కయు నాతని (రామదాసీయ) సంప్రదాయముయొక్కయు గ్రంథములన్నింటిని వెలువరించు భారము వహించియున్నారు. ఈసభవార లిప్పటికి శ్రీసమర్థుని గ్రంథములలోనుంచి దాసబోధను (రాయలు 8 పేజీల యాకృతిలో 500 పుటలు) రామాయణము మొదలగు కొన్నిగ్రంథములను (దాదాపు 1000 పుటలను) బ్రచురించియున్నారు. ఇవిగాక యింకను జాలగ్రంథములు సభవారియొద్దఁ బ్రకాశితము గావించుటకు సిద్ధముగనున్నవి. పరిశోధనలవలనఁ బ్రతిసంవత్సరము ఏదో యొకనవీనగ్రంథము లభించుచునేయున్నది. కావున శ్రీరామదాసస్వామియొక్క సమగ్రగ్రంథసముదాయ మింతవఱకు లభింపలేదనియుఁ బ్రకటింపఁబడలేదనియు విశదమగుచున్నది. లభించిన గ్రంథములపేరు లిట నుదాహరింతుము. ఇందుఁ గొన్ని అముద్రితగ్రంథములుగూడఁ గలవు.

౧ దాసబోధ, ౨ రామాయణము, ౩ మనస్సంబోధనశ్లోకములు ౪ చౌదా (పదునాల్గు) శతకము, 5 జనస్వభావగోసావీ, 6 పంచసమాసి 7 జునాటపురుష్, 8 మానసపూజ, 9 జునాదాసబోధ, 10 పంచీకరణయోగము, 11 చతుర్థయోగమానము, 12 మానపంచకము, 13 పంచమానము, 14 రామగీతము, 15 సప్తసమాసి, 16 రామకృష్ణస్తవము. మొదలగునవి.

ఈపేర్కొనిన గ్రంథములుగాక స్ఫుటాభంగములు, స్ఫుటశ్లోకములు, ఆరతులు, భూపాలములు, వివిధపదములు మున్నగు ననేకస్ఫుటప్రకరణములుగూడ లభించెను. ఈగ్రంథసముదాయమునందలి ప్రముఖగ్రంథములతో మాపాఠకులకుఁ గొంచెముపరిచయము గలిగించుట యావశ్యకము. కాని యావిషయమునఁ గొంచెముకొంచెము వ్రాసినను ఈసంగ్రహజీవితము విస్తరించునను భయముతో వదలితిమి. సమర్థుని శిక్షారహస్యముల నెఱుంగుట కాతని "దాసబోధ" మున్నగుగ్రంథముల బోధోచితభావమును బ్రకటించుట అత్యంతావశ్యకము.

సింహావలోకనము.

శ్రీసమర్థరామదాసస్వామి తనయవతారమును సమాప్తిగావించుటకు ముందుగఁ దనసంకల్పితకార్యముల సిద్ధివిషయమునఁ దనగ్రంథాంతరములలో వ్రాసికొనియున్నాఁడు. దానినే సమర్థుని చరిత్రమున సింహావలోకనమని భావింపనగును. మన స్వతంత్రకల్పనానుసారముగ మనకుఁ జరిత్రవిషయమున సింహావలోకనము గావింపవలసిన యావశ్యకము లేదు. సమర్థుఁడు చాఫల్‌గ్రామ పరిసరారణ్యములలో సంచరించునపుడును ఏకాంతమునఁ గూర్చున్నపుడును శిష్యు లేదేని ప్రశ్నించినచోఁ దనజీవితవిషయములు జ్ఞాపకమునకు వచ్చినపుడెల్ల శ్రీరామచంద్రుని స్తుతించుచుండును. భగవంతుని గుణములను గానముచేయుచుఁ దనజీవితచరిత్రమునందలి యనేక వృత్తాంతములను గూడ సహజముగ నాతఁడు ఉల్లేఖించును. సమర్థుని స్ఫుటప్రకరణములందలి యాత్మచరిత్రమంతయు నీసహజమగు నానందావస్థయొక్క ప్రేమోద్గారమే. ఈపద్యములలో సమర్థుఁడు ఈకార్యమునంతయు నేనె యొనరించితినని యెందును వ్రాయలేదు. అన్నిస్థానములందును, రాముఁడేకర్త, రాముఁడేభోక్త యని వ్రాసియున్నాఁడు. సమర్థునివంటి నిరహంకారియు, నిస్పృహుఁడును నగుపురుషుని కిదియే యుచితము. అహంకారమునందు మగ్నులైయున్న మనవంటి సాధారణజనులే "నేను నాది" యని నుడువుచుందురు. దాసబోధ ౬ వదశకము ౭ వ సమాసమున సమర్థుఁ డిట్లు చెప్పెను.

"మీకర్తా ఐసేమ్హణసీ । తేణేంకష్టీహోసీ
రామకర్తా మ్హణతాం పావసీ । యశకీర్తిప్రతాప్ ॥ ౩౬ ॥

"నేను కర్తనని నుడివినచో నీకుఁ గష్టములు గలుగును. రాముఁడు కర్తయని నుడువుచో నీవు యశమును కీర్తిప్రతాపమును బొందెదవు" ఆనందభువనము పేరుగల ౫౯ పద్యముల స్ఫుటప్రకరణమునందు సమర్థుఁడు తాను రామచంద్రుని యాజ్ఞానుసారముగా నారంభించిన జనోద్ధరణకార్య మెంతదనుక సఫలమైనదియు వర్ణించెను. ఈకవితాసారాంశముపై దృష్టియుంచినచో సమర్థుని జీవితచరిత్రపు సింహావలోకనము తనంతనే యగును. ప్రథమపద్యమున సమర్థుఁ డానందభువనమున (నాసిక పంచవటిప్రాంతమున) కరుగుటకు హేతువు నీవిధముగాఁ దెల్పెను. "జన్మ

దుఃఖమును, జరాదుఃఖమును మాటిమాటికిని గలుగు నిత్యదుఃఖమును మఱియు సంసారమును త్యాగముగావించుటకును'' దీనినిబట్టి సమర్థుఁడిల్లువదలి పారిపోయిన తరుణముననే తనమనస్సులోఁ బరమార్థవిషయిక హేతువును నిశ్చయించుకొనెనని విశదము కాఁగలదు. రెండవపద్యములో సమర్థుఁడు "ఆనందభువనమునకుఁ జేరఁగనే నాచిత్తము శ్రీరామ చరణానురాగమున లీనమయ్యెను'' అని నుడివెను. దీనికిఁదరువాత "ఈప్రపంచమున నేనెట్టిగొప్పదుఃఖములను సహించితినో స్వధర్మాచరణమున నెట్టి విఘ్నములాటంకపఱచెనో ఆవిఘ్నములను వారించుటకై విఘ్నఘ్నుఁడగు బలభీముని ప్రార్థించుచున్నాఁడ''నని నుడివెను. దీనికిఁబిమ్మట ఆంజనేయుఁడు విఘ్నముల నెట్లు నశింపఁజేసినదియు ఆవేశయుక్తముగ వర్ణించెను. ఈవర్ణనమును జదువుటవలన స్వధర్మాచరణమునందు అనఁగా జపతపోనుష్ఠానపురశ్చరణ తీర్థయాత్రాది భగవత్ప్రాప్తి సాధనముల నభ్యసించెడి సమయమున శ్రీసమర్థుఁ డెట్టియాపదల నెదుర్కొనవలసివచ్చెనో విశదమగును. సమర్థుఁ డనంతరము ఆనందభువన తీర్థమహిమను గానమొనరించి మఱల బంధవిమోచనమునకు లేక లోకోద్ధరణమునకు భగవంతుఁడగు శ్రీరామచంద్రమూర్తి దేవమునిసహితముగా నొనరించిన పనులును, దాను తలపెట్టినకార్యములయందు రాముఁడొనర్చిన సహాయములును (యవన) దండయాత్రలును పౌరాణికరీతిగ వర్ణించెను. ముష్కరములగు నీకార్యములను వర్ణించి యీవర్ణనాంతమున దండయాత్రల యుద్దేశములనుగూడ సమర్థుఁడు స్పష్టముగ వివరించెను.

కల్పాంతీమండళామోళా । మ్లేంచదైత్యబుడావయా
కైపక్షఘేతలాదేవీ । ఆనందవనభూవనీ ॥ ౨౭

దైత్యులను సంహరించుటకు భగవానుఁడగు శ్రీరామచంద్రమూర్తి మాపక్షము స్వీకరించెను. మఱియు ఆనందభువనమున ఘనమును, ఘోరమునగు సంగరమొనరించెను. ప్రత్యక్ష భగవంతుఁడును, భక్తులపాలిటి కల్పద్రుమము నగు శ్రీరామచంద్రస్వామిని సమర్థుఁడు తనకు సహాయకునిగ నెప్పుడు గావించుకొనెనో యప్పుడే మనోరథములన్నియు సఫలమయ్యెననుటలో నాశ్చర్యమేమున్నది ? భగవంతుని సహాయమున నేపరిణామము కలిగెనో అనఁగా ధర్మస్థాపనమునకును, లోకోద్ధారణమున

కును, నేకార్యము లొనరింపఁబడెనో వానినిగూర్చిన యుత్సాహజనకమగు వర్ణనము తక్కినపద్యములలోఁ గలదు.

మహారాష్ట్రదేశపుఁ బదునేడవ శతాబ్ద చరిత్రముతోఁ బరిచయముగల వారలకు శ్రీరామదాసస్వామినిగూర్చిన, పైనుడివిన యాత్మచరిత్రసంబంధమగు సింహావలోకనము యొక్క యథార్థత చక్కఁగఁ దెలియఁగలదు. ఆవిషయమునందింకను నధికముగా వ్రాయవలసిన యవసరము లేదు. సమర్థుఁడు మఱియొక స్ఫుట ప్రకరణమున శ్రీరాముని మహిమను గానముచేయుచు మహారాష్ట్ర జాగరూకత నీవిధముగఁ బేర్కొనెను. "ఇప్పుడు నలువైపులఁ బెచ్చుపెరిగిన ధర్మావనతిని అవహేళనమునుగాంచి దేవుఁడు కుపితుఁడైయున్నాఁడు. కావున నిఁక దేవద్రోహులును, అత్యాచారులును, నగువారలు తమకార్యములనన్నింటిని (అనీతి, అధర్మము, అత్యాచారములను) కట్టిపెట్టవలెను. జనులలో జాగరూకత కలిగినది. అదియే దేవుని చైతన్యరూపము. దానివలననే జనులకోర్కి సఫలము కాఁగలదు. ఏమేమి జరుగునో యదియెల్ల మహారాష్ట్రమునందుండి చూడవలెను.''

స్ఫుటగ్రంథము ప్రథమ సమాసమునఁగూడ శ్రీరాముని గుణవర్ణనము గావించుతఱి సమర్థునిముఖమునుండి స్వాభావికముగా వెలువడిన వాక్యములలో నాతఁడు తనచరిత్రపు సింహావలోకమును గొంచెముగ వెల్లడించెను. ఆపద్యముల సారాంశమిది. "దీనులపాలిటి నాథుఁడగు శ్రీరాముఁడు వైభవమున సమర్థులందఱికంటెను సమర్థుఁడు. ఆతఁడు నామనోరథములను సఫలము గావించెను. నాయభిలాష లన్నింటిని నాతఁడే పూర్తి గావించెను. దీనుఁడనగు నన్ను మర్యాదతో నధికునిగఁ బెంపొందించెను........శ్రీరాముఁడు విభీషణునకు లంకనొసంగెను. ఇంద్రునకు శంకలఁ దొలంగించెను. మఱియు నత్యల్పుఁడగు రామదాసుయొక్క ప్రతిష్ఠ వృద్ధిగావించెను. అతఁ డీస్థానమును సుందరమైనదనితలంచి యిచట నివాసమేర్పఱచుకొనెను. దాసుని తన సన్నిధినే యుంచుకొనెను. సమస్తప్రాంతములను పావనము గావించెను. చూచినంతన భయముగూర్చు దరీగహ్వారగిరికందరములనుగూడ నాతఁడు వైభవసంపన్నములగు నట్లొనరించెను. రాముఁడనుగ్రహించి యిచ్చుట లిట్లేయుండును.

సమర్థునిచరిత్ర సింహావలోకనమున అధ్యాత్మసారమును స్ఫుటప్రకరణము మిగుల మహత్త్వము గలది. కాని యది చాలపెద్దది. కావున నందలి సారాంశమంతయుఁ దెలుపఁజాలము. క్రింది రెండుపద్యముల నుదాహరించుటయే చాలునని తలంచుచున్నారము.

జీవీచాపురలా హేతూ । కామనామన కామనా
షుమేండ్ జాహాలేం హోతేం । ఘుబాడ్ సాధలేంబళేం

* * * * * * *

బోళతాం భవానిమాతా । మహీంద్ర దాస్య ఇచ్ఛితీ
బోలణేం హేం త్రశీలిచేం । అన్యథావా ఉగేంనహ్వే ॥

"జీవితహేతువు పూర్ణమయ్యెను. ఇఁక మనస్సునందుఁ గామ్యములకుఁ బనియేలేదు. చాలకీర్తి కలిగినది. అప్రతిమానమగు లాభము లభించినది. మాతయగు భవానీదేవి ప్రసన్నురాలైనయెడల గొప్పగొప్ప రాజులుగూడ సేవజేయ నిచ్ఛగింతురు. స్వానుభవమగు నీవాక్యమును నుడువుచున్నారము. దీనినెప్పుడును మిథ్యగా భావింపఁగూడదు."

శ్రీ రామదాసస్వామి గ్రంథములవలననే యాతనిచరిత్రమున నెన్నియో విషయములు తెలియుచున్నవి. ఏలయన! ఆతఁడెప్పుడేని ఏదేని బోధగావించువిషయమును వివరించు సందర్భమున మాటిమాటికి నిది స్వానుభవమగు నంశమనియో నుడివియున్నాఁడు. కావున మేము స్వయముగ నేమియువ్రాయక సమర్థునిజీవితోద్దేశముల సాఫల్యమును, నతనివచనముల సారాంశముతోఁ బూర్తిచేయ నిశ్చయించితిమి. ఉదాహృతభాగములవలన సమర్థుని చరిత్రమును సింహావలోకనమొనరించుటలోఁ బాఠకులకు సహాయము లభించునని మేమాశించుచున్నారము. శ్రీరామదాసస్వామి తన సమస్త సంకల్పిత కర్మఫలములను బునరాలోచనము గావించుచున్నపుడు ఆతనియంతఃకరణమునందుఁ బ్రేమ, ఆనందము, హర్షము మున్నగు సాత్త్వికమనోవృత్తి తరంగములు తప్పక యుప్పొంగుచుండ నోపునని మేము భావించుచున్నారము. మాపాఠకులుగూడ నిట్లే భావింతురనియు నిందు సందేహము లేదనియు మా యభిప్రాయము.

శ్రీరామచంద్రార్పణమస్తు.

దాసబోధ విషయసూచిక.

శ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః

ఆంధ్ర దాసబోధ

మొదటి దశకము.

మొదటి సమాసము. గ్రంథారంభనిరూపణము.

శ్రీసమర్థరామదాసులవారి సన్నిధికిఁ జేరి శ్రోతలిట్లుఁ బ్రశ్నించిరి. స్వామీ! ఇది యేగ్రంథము? ఇందేయేవిషయములు చెప్పఁబడియున్నవి? ఈగ్రంథము నాలించుటవలనఁ గలుగు ఫలము లెవ్వి? ౧ సమర్థులిట్లుల నాజ్ఞనొసంగిరి. ఈగ్రంథనామము దాసబోధ. ఇందు గురుశిష్యసంవాదము గలదు. ఇంతియుగాక యిందు స్పష్టముగాఁ దెలియునట్లుల భక్తిమార్గము నుడువఁబడినది ౨ ఈగ్రంథమునందుఁ దొమ్మిదితెఱంగుల భక్తులు, జ్ఞానవైరాగ్యముల లక్షణములు విశేషించి అధ్యాత్మనిరూపణము చెప్పఁబడినది. ౩ మనుష్యుఁడు భక్తియోగమువలన నీశ్వరుని నిశ్చయముగాఁ బ్రాపించునను నంశ మీగ్రంథమునందుఁ దెలుపఁబడినది. ౪. ముఖ్యభక్తి, శుద్ధజ్ఞానము, ఆత్మస్థితి, శుద్ధోపదేశము, సాయుజ్యముక్తి, మోక్షప్రాప్తి, శుద్ధస్వరూపము విదేహస్థితి, అలిప్తత, ముఖ్యదేవము, ముఖ్యబ్రహ్మము, జీవశివులు(జీవాత్మపరమాత్మలు) ముఖ్యబ్రహ్మము, నానామతములు మున్నగు నంశములనుగుఱించి యీగ్రంథమునందు సిద్ధాంతము గావింపబడినది మఱియు నిందు "నేను" అనునదెద్దియో యదిఁగూడ వివరింపఁబడినది. ముఖ్యోపాసనము నానావిధము లగుకవితారీతులు, నానావిధచాతుర్యములు, మాయయొక్క యుత్పత్తి,

పంచభూతములు, వానికర్తృత్వము మున్నగువిషయముల లక్షణము లన్నియు నిందుఁజెప్పఁబడినవి ౫-౧౧ దాసబోధలోఁ బెక్కు తెఱంగుల సందియములు శంకలు నివారింపఁబడుటయేగాక యనేకవిధము లగు ప్రశ్నలకుఁ గూడ సదుత్తరము లొసంగఁబడినవి ౧౨ ఈ రీతిగాఁ బయిని బేర్కొనఁబడిన సంగతులెన్నియో యీగ్రంథము నందు నిరూపించినాఁడను. గ్రంథమునం దంతటను నేమేమి నుడువఁ బడెనో దానిసంగ్రహమునంతయు నిచట వివరింప నవకాశము లేదు. ౧౩

అయినను గొంచెము చెప్పెదను. దాసబోధయంతయు నిరువదిదశకములుగా విభజింపబడి విస్పష్టముగ నొనరింపఁ బడినది. ప్రతి దశకమునందు నేయేవిషయములు చర్చింపఁబడునో యవియన్నియు నాయాదశకములలోనే చెప్పబడినవి. ౧౪ అనేకగ్రంథములసమ్మతియు, ఉపనిషత్తులు, వేదాంతము, శాస్త్రములు, ఆత్మప్రతీతి (శ్రీరామదాసస్వామి స్వయముగాఁ బరమార్థమునందు గడించిన యనుభవము) మున్నగువానినాధారముమీఁద నీగ్రంథరచనము జరిగినది ౧౫ అనేకగ్రంథభావములను సమన్వయించి యీగ్రంథము రచింపఁబడినదిగాన నెవ్వరును దీనిని మిథ్యయని వాకొనఁ జాలరు. ఈవిషయమును నేను జెప్పవలసినపని యేమున్నది? ఇఁకఁ బ్రత్యక్షానుభవమువలనఁగూడఁ దెలియును (గ్రంథముయొక్క సత్యాసత్యములు ఇప్పటికిప్పుడే యధ్యయనమువలనఁ దెలియుచుండ నాకదు చెప్పవలసినపని యేమున్నది?) ౧౬ లోకు లొకవేళ నేదేని మత్సరకారణమున నీదాసబోధయందలియంశము మిథ్యయని వాకొన్నచో వారలు "అన్నిగ్రంథములను (నానాప్రకారములగుగ్రంథములసమ్మతిని) మరియు భగద్వాక్యములను ఖండనము గావించినవార" లని భావింపుఁడు ౧౭ శివగీత, రామగీత, గురుగీత, గర్భగీత, ఉత్తరగీత, అవధూతగీత, వేదము, వేదాంతము, భగవద్గీత, బ్రహ్మ

గీత, హంసగీత, పాండవగీత, గణేశగీత, యమగీత, ఉపనిషత్తులు, భాగవతము, మున్నగుపవిత్రగ్రంథములసమ్మతియే దాసబోధలోఁ బేర్కొనబడినది. ఆయాగ్రంథములలో భగవద్వాక్యములే గలవు. అవినిశ్చయముగా యథార్థములు ౧౮-౨౦ భగవద్వచనమునం దవిశ్వాసముగలిగి వర్తించు పతితుఁడెవ్వఁడేనిగలఁడా? ఈగ్రంథమునఁ జెప్పఁబడినదానిలో నెద్దియును భగవద్వాక్యవిరహితమైనది లేదు ౨౧ పూర్తిగా గ్రంథమును దిలకింపకయె వ్యర్థదోషము లాపాదించు నాదురాత్ముఁడును దురభిమానియు నగు పురుషుఁడు మత్సరకారణమువనే యందులకు సాహసించును. వానిహృదయమునందు అభిమానమునుండి మత్సరమును మత్సరమునుండి తిరస్కారమును జనించుచున్నవి. ఆవలఁ గ్రోధవికారము త్వరితముగ నుత్పన్నమగును. ౨౨-౨౩ ఆమనుష్యుఁడు "అహంభావకారణముననే మలినాత్ముఁడై కామక్రోధములతో సంతప్తుఁడగుచున్నాఁ"డనునది ప్రత్యక్షముగ నేకనుపించును ౨౪ కామక్రోధములకు లోఁబడియున్నవానిని యోగ్యుఁడని యెటులనుమనుము చూడుఁడు. అమృతమును సేవించిన పిదప రాహువు విష్ణునిచక్రధారచేఁ జంపఁబడెను (రాహువువలె నంతరంగము కలుషితమై మలినమనస్కులై యుండెడి మనుజులు ఈయమృతతుల్యమగు గ్రంథమునుండి యేమాత్రపులాభమును బొందఁ జాలరని భావము) మందిని. ఇఁక నిప్పుడీమాటలను గట్టిపెట్టుదము. ఈగ్రంథసారమును ఎవనికెట్టియధికారమున్న వాఁడటుల గ్రహించునుకాని అభిమానమును విడనాడుట యన్నిఁటికంటెను మంచిది (౨౫-౨౬) అయ్యా! ఈ గ్రంథమునం దేమున్నదని శ్రోతలు! శ్రోతలుప్రశ్నించిరి గావున దాని నంతను సంక్షిప్తరీతిగాఁ జెప్పుట జరిగినది ౨౭ ఇఁకనిప్పుడు గ్రంథమునందలి యంశము నాలించుటవలనఁ గలుగుఫలములను దెలుపుచున్నాఁడను. మొదట

నీ గ్రంథశ్రవణమువలన శ్రోతల కాచరణమునందుఁ దక్షణముననే మార్పుగలుగును. మరియు సంశయమూల మొక్కసారిగాఁబటాపంచలైపోవును ౨౮ సుగమమగు మార్గము లభించును. దుర్గమములగు సాధనములవలని యావశ్యకత ముండదు. సాయుజ్యముక్తి మర్మము సహజముగనే విశదమగును ౨౯ ఈ గ్రంథము నాకర్ణించుటవలన అజ్ఞానము, దుఃఖము, భ్రాంతి, నాశనమగును. అటులె శీఘ్రముగా జ్ఞాన మలవడును ౩౦ యోగులయొక్క పరమభాగ్యమగు వైరాగ్యము ప్రాప్తించును. వివేకసహితమును యథాయోగ్యమనను, చాతుర్యమనను, నగు జ్ఞానముకలుగును, ౩౧ భ్రాంతులుగను, అవగుణులుగను, దుర్లక్షణులుగను నుండు మానవు లీగ్రంథమును బఠించుటవలన సలక్షణులగుదురు, ఇంతియగాక ధూర్తలును తార్కికులును, విచక్షణులును నగు మనుజులు అవసరమగు సంశయముల వివేచింప నారంభించెదరు ౩౨ అశ్రద్ధగలవారలు ప్రయత్నశీలు రయ్యెదరు. పాపులుతమదురంతము నెంచికొని పశ్చాత్తాపము నొందెదరు. భక్తిమార్గమును నిందఁజేయువారు దానినే కొనియాడఁ దొడంగుదురు ౩౩ బద్ధులు (సంసారసంబంధులగు మనుజులు) మోక్షమును గోరువారలగుదురు. మూర్ఖు లతిదక్షులయ్యెదరు. మరియు భక్తివిహీనులు సైతము భక్తిమార్గములోనఁ బ్రవేశించి మోక్షమును గడించెదరు. ౩౪ ఈ గ్రంథమును జదువుటవలనఁ బెక్కుతెఱంగులగు దోషములు నాశనమగును. పాపులు పావనులయ్యెదరు. మరియు నీ గ్రంథశ్రవణమాత్రముననే మానవు లుత్తమగతి నొందెదరు. ౩౫ దేహబుద్ధిజములగు పెక్కుతెఱంగుల మోసములు, సందేహపూర్ణములగు ననేక భ్రమలు, సంసారమునందలి సమస్తోద్వేగములు, నీ గ్రంథము వినుటవలన నశించును. ౩౬ దీని ఫలశ్రుతి యిట్టిది. ఈ గ్రంథాకర్ణనము కతన అధోగతి నశించును.

ఇంతియగాక హృదయమునకు విశ్రాంతియు సమాధానముగూడ సమకూరును ౩౭ ఇంతయేల! యెవనిభావ మీగ్రంథవిషయమున నెటులుండునో యట్లు ఫలముసిద్ధించును (యాదృశీభావనాయస్య సిద్ధిర్భవతితాదృశీ) మాత్సర్యయుతున కీ గ్రంథమున మత్సరమె లభించును. ౩౮

రెండవ సమాసము.

గణేశస్తుతి

ఓంకారస్వరూపా! సర్వసిద్ధి ఫలప్రదాయకా! అజ్ఞానభ్రాంతిచ్ఛేదకా! బోధరూప గణనాయకా! నీకు నమస్కారముల నొనర్చుచున్నాఁడను ౧ నా యంతఃకరణమునందు విరాజిల్లుము. మరియు నెల్లపుడు సమస్తవిధముల నావాస మొనరింపుము. నీ కడకంటిచూపులనుండి నాపయి దయారసము ప్రసరింపఁజేసి వాక్యశూన్యుఁడనగు నాచేఁబలికింపుము ౨ నీ యనుగ్రహాతిశయముననే జన్మజన్మాంతర సంబంధమగు భ్రాంతి తొలఁగిపోవుచున్నది. విశ్వభక్షకమగు కాలముసైతము సేవగావించుచున్నది. ౩ నీ యనుగ్రహము ప్రసరించినంతనే పాపములు, విఘ్నములు గజగజ వడంకును. నీ పేరువిన్నంత నవి సుడివడి తిరుగుచుండును ౪ ఇందుచేతనే స్వామీ! నిన్ను విఘ్నహరుఁడని యనుచున్నారు. మావంటి దిక్కులేని వాండ్రకు నీవే సహాయకుఁడవు. ౫ మంగళనిధియగు గణేశ్వరునకు వందనములొనరించి యేకార్యమునేని చేయఁబూనినచో సమస్తసిద్ధులును జేకూరును. ఎట్టి యాటంకములేని పొడసూపఁజాలవు ౬ అతని నామము స్మరించినతోడనే హృదయమున కింతయనరాని నిలుకడ లభించును. మనస్సు ఇతరములగు సమస్తేంద్రియములను విడచి కేవలము నేత్రములలోని కేతెంచి నివసించును. అన్నియంగ

ములును గూటువడిపోవును అన్నియింద్రియములపట్ల విస్మరణము కలుగును. ౭*

గణేశమూర్తియొక్క సగుణరూపము మిగుల సుందరమును, మోహదాయకము నైయున్నది. అతఁడు నాట్యము గావించినవెంటనే వేలుపులందఱును స్తబ్ధులైపోయెదరు. ౮ ఆయన యెల్లప్పుడును మదముతోనిండియుండును ఆనందముతోఁ దూఁగుచుండును సంతసముతో సుప్రసన్నముఖుఁడై యత్యుల్లాసియై యుండును. ౯ మనోహరమును, స్థూలమునగు నాకారముగల వినాయకుని భీమమూర్తి మహాప్రచండమైనది. విస్తీర్ణమును సమున్నతమును నగు నాతని మస్తకము విశేషించి సిందూరచర్చచే నొప్పారియున్నది. ౧౦ నానావిధములగు సుగంధములనీను పరిమళము ఆతని గండస్థలమునుండి (మదజలరూపమున) జారిపడుచున్నది. భ్రమరగణము చుట్టు గుంపులుగుంపులుగఁ గూడి ఝంకారము లొనరించుచున్నది. ౧౧ శుండాదండము సరళమై కొంచెము ముడుచుకొనియున్నది. కపోలములు కాంతిచే నిండారి చూడఁదగియున్నవి. అధరము మిగుల బొడవుగానున్నది క్షణక్షణమునను దీక్ష్ణమగు మదరసము చుక్కలు చుక్కలుగా జారిపడుచున్నవి ౧౨ పదునాలుగువిద్దెలకు వేలుపగు నావేలుపురాయఁడు తనచిన్నికన్నులను మాటిమాటికిఁ గదలించుచున్నాఁడు. మృదులములు విశాలములునగు నాతనిచెవులు పళపళమని మ్రోగుచున్నవి ౧౩ రతనములుచెక్కిన కిరీటము ధగధగమని యతనితలపై మెఱయుచున్నది. దానినుండి పెక్కు తెఱంగులగు కాంతులు ప్రకాశమానములై వెలుఁగొందుచున్నవి. చెవులకుఁ గుండలములు విరాజిల్లుచున్నవి. వానిపయిని దాపిన నీలము

*పయినిజెప్పిన యేడుపద్యములలో గణేశుని నిర్గుణరూపవర్ణనముగలదు. ఇంకముందుసగుణవర్ణనమువచ్చును.

ణులు కాంతులను వెదజలుచున్నవి ౧౪ దృఢములును శ్వేతములు నగు దంతములకు మణులు బంగారముతోఁ జేసినకడియములు తొడుగఁబడియున్నవి. ఆకడియముల క్రిందఁ జిన్నచిన్న బంగారు రేకులు ప్రకాశించుచున్నవి ౧౫ మెల్లమెల్లఁగఁ దొండము కదలుచున్నది. దానిపయిని సర్పము చుట్టవలెఁ జుట్టుకొనియున్నది. చిఱుగంట మందమందనినాదముతో మ్రోగుచున్నది ౧౬ ఆయనకు నాలుగు భుజములున్నవి. ఉదరము వ్రేలాడుచున్నది. ఒకపీతాంబరమును ధరించియున్నాడు. తొండముపైనున్న పాము మాటిమాటికి బుసగొట్టుచున్నది ౧౭ అది పడగనాడించుచు నాలుకలు ముందునకుఁ దీయుచుఁ జుట్టచుట్టుకొనియున్నది. మరియు గణేశుని నాభికమలముఁ బయికిఁ బడగనెత్తియాపాము తీవ్రదృష్టితోఁ జూచుచున్నది. ౧౮ పలుతెఱంగులగు పూవుదండలు సర్పముచేఁజుట్టఁబడియున్న నాభిదనుక మెడలో వేయఁబడియున్నవి. ఆతని హృదయకమలము మీఁద మణులుచెక్కిన పతకమొకటి ప్రకాశవంతముగా నలగారుచున్నది. ౧౯ గండ్రగొడ్డలి, తామరపూవు రెండుచేతులయందును విరాజిల్లుచున్నవి. వాఁడిగలదియు ధగధగమనిమెఱయుచున్నదియు నగు నంకుశ మొకచేతియందును వేఱొకచేతియందు ఉండ్రాయియుఁ దాల్చియున్నాఁడు. విఘ్నేశ్వరునకు ఉండ్రాయిపై నెంతయో ప్రీతి. ౨౦ నటనాట్యకళాకౌశలములను వెల్లడించుచు వినాయకుండు పెక్కుతెఱంగుల నృత్యమొనరించుచున్నాఁడు. తాళము మృదంగము మున్నగువాద్యములు మ్రోగుచున్నవి. ఉపాంగముల ఝంకారము దిక్కుల నిండిపోవుచున్నది ౨౧ ఒకనిముసమేని వినాయకునకు స్థిరబుద్ధిలేదు. చపలత్వమునం దాతని నగ్రగణ్యునిగఁ దలంపనగును. సమస్తాలంకారశోభితమగు సుందరాకారముగలిగి విఘ్నేశ్వరుఁడు సర్వలక్షణముల కాటపట్టుగనున్నాఁడు. ౨౨

నూపురములు గణగణ మ్రోగుచున్నవి. పాదభూషణములు ఝణ ఝణ మనుచున్నవి. గజ్జెలవలనఁ బాదయుగళము మనోహరముగాఁ గనిపించుచున్నవి ౧౩ గణేశుని కారణమున నీశ్వరుని పేరోలగమున క్రొక్రొత్త చెలువు వచ్చినది. దివ్యమగు నాతనియంబర కాంతులు నలుగడల వెలుంగుచున్నవి. సాహిత్యవిషయమున నిపుణులగు అష్టవిధలాయికలు గూడ విఘ్నేశ్వరమూర్తి వెంట సభలోనఁ బ్రవేశించియున్నారు ౧౪ సర్వాంగసుందరుఁడును సమస్తవిద్యలకు నాధారభూతుఁడునగు నిట్టిగణేశ్వరునకు నా భావయుక్తమగు సాష్టాంగప్రణామములను సమర్పించెదను ౧౫ గణేశుని రూపమును వర్ణింపఁగానే భ్రాంతచిత్తులహృదయము ప్రకాశవంతమగును. మరియు గుణానువాదము నాలించినంతన వారికి సరస్వతీ దేవి ప్రసన్నురాలగును ౧౬ బ్రహ్మ మొదలుగాఁగల వేలుపులందఱును నీగణపతికి వందనములొనరించునపుడు పాపపుమనుష్యుఁడొక లెక్కలోనివాఁడా? ఇఁక నీవిషయము నటులుంచుదము, మందమతులగు ప్రాణులు గణేశ్వరునిస్మరింపవలయును. ౧౭ మూర్ఖులును దుర్లక్షణులును హీనాతిహీనులుగూడ విఘ్నేశ్వరునిఁ జింతనమొనరించి సమస్తవిషయములలో నేర్పరులును దక్షులునునగుదురు. ౧౮ ఆయన పరమసమర్థుఁడు. కోరికలనన్నింటిని సమకూర్చును. ఆయనను భజించుటవలన సమస్తకార్యములును జేకూరును. ఇది యనుభవముచేత నెరింగినమాట. కలియుగమునందుఁ జండీవినాయకుఁడు ముఖ్యదైవతము ౧౯ కనుక నా మంగళస్వరూపుఁడగు విఘ్నేశ్వరుని స్తోత్రమును బరమార్థవాంఛ హృదయములోనుంచుకొని నాశక్తికొలఁది యొనరించినాఁడను.

మూడవసమాసము

శారదాస్తుతి.

ఇఁకనిప్పుడు తొలిపలుకులఁ గన్నతల్లియు, నలుమోముల వేలుపు గడుపారఁగన్న బిడ్డయుఁ బలుకుల కాధారభూతురాలును వాగ్దేవియు మహామాయాస్వరూపిణియు నగు సరస్వతీదేవికి వందనములొనరించుచున్నాఁడను ౧ ఓశారదాదేవీ! నీవు శబ్దస్ఫూర్తిని నుజ్జీవింపఁజేసి వైఖరీముఖమున నపారమగు వచనసమూహమును బలుచుచున్నావు. శబ్దములకుఁ గల యంతర్భావమును నీవు ప్రత్యక్షముగావించుచున్నావు. ౨ తల్లీ! నీవు యోగులయెడ సమాధిరూపముననను నిశ్చలభావులగు మనుజులయెడ గృతబుద్ధిరూపమునను నలరారి స్వయముగా విద్యాస్వతోరూపము నొప్పి యవిద్యోపాధి నంతరింపఁజేయుచున్నావు. ౩ నీవు మహానుభావులగు వారలకు ననుకూలవతివగు నర్ధాంగివి. తుర్యావస్థవు. నీకలయికచేతనే గదా సాధుజనులు మహత్కార్యముల నొనరించుటలోఁ బ్రవృత్తులై యుండిరి. ౪ భారతీ! నీవు మహాత్ములయెడ శాంతివై యీశ్వరునెడ స్వయంశక్తివై జ్ఞానులయెడ విరక్తిభావమవై నిరాశావస్థకుఁ బరమావధివై యలరుచుంటివి ౫ అనంతములగు బ్రహ్మాండములను నీవు రచించి లీలావినోదముగా వానినెల్లఁ జెఱచివేయుచున్నావు. ఆదిపురుషునియందు నీవు చిత్రముగా దాఁగియున్నావు ౬ నీవు ప్రత్యక్షముగా జూచుటకుఁ గనిపింతువుగాని విచారము చేయుటచే సాధ్యపడవు. ఇంతయేల! బ్రహ్మాదులకు సైతము నీయంతు తెలియరాకున్నది. ౭ సమస్తసంసారనాటకములకు నీవంతఃకళవు (మూలసూత్రమువు) చిచ్ఛక్తియొక్క నిర్మలమూర్తివి. జ్ఞానశక్తిస్వానందసుఖము మానవులకు నీయనుగ్రహముననే సమకూరుచున్నది. ౮ నీవు సుందరాంగులకుఁ దలమానికమవు. సూర్యపర

బ్రహ్మము నెడ నీవు కాంతిరూపమున విరాజిల్లుచున్నావు. మోక్షలక్ష్మివి నీవు. శబ్దరూపమునఁ బూర్ణముగ నిర్మితమైన దృశ్యసంసారమును నాశనము జేయుటకు నీవు సమర్థురాలవు. పదునేడవ జీవకళవు. యోగిజను లేది పానము జేసినంతన వేలకొలఁది సంవత్సరము లమరులైయుందురో యట్టి బ్రహ్మరంధ్రవినిర్గతమగు నమృతధారవు నీవు. నీవు సత్త్వలీలారూపిణివి. శీతలరూపవు, చక్కఁదనమునకు నీ వునికిపట్టువు ౯—౧౦ తల్లీ! నీవవ్యక్తరూపుఁడగు పరబ్రహ్మము నెడ వ్యక్తరూపవు. విస్తారమై వృద్ధినొందుచున్న తత్త్వమునకు నీవు ఇచ్ఛాశక్తివి, కలికాలమునకు నియంత్రిణివి. గురుకృపారూపమున నీవు ప్రత్యక్షమై యర్థుల నాదరించు లోకమాతవు. (౧౧) పరమార్గము నెఱుంగుటకు నీవు విచారరూపమగు బ్రధానసాధనముగ నున్నావు. సారము అసారము నిశ్చయించుటకు నీతోడ్పాటు గావలసియున్నది. శబ్దబలముచే నీ భవసముద్రమును దరింపఁజేయు నీమహత్త్వము గొనియాడ నేరితరము? ౧౨ భగవత్స్వరూపిణీ, వాణీ! ఈ విధముగా నీవు మాయాస్వరూపముతో బహువేషములను ధరించుచున్నావు స్వయముగా సిద్ధురాలవై అంతఃకరణములలోఁ జతుర్విధములుగాఁ (పరా పశ్యంతి మధ్యమా వైఖరులను నాలుగు రూపములతోఁ) బ్రకటితమగుచున్నావు ౧౩ పరాపశ్యంతి మధ్యమయను మూటి తోడ్పాటుచే నంతఃకరణములోఁ బ్రవేశించు వైఖరిని నీవె ప్రకటనము గావింపఁ గల్గియున్నావు. అందుచేఁ గర్తృత్వమనున దేదియో యయ్యది నీకృపాకారణముననే కలుగుచున్నదని స్పష్టమగుచున్నది. ౧౪ మాతా? నీవు బ్రహ్మాదులకు జననివి. శ్రీమహావిష్ణువు శంకరుఁడు నీకతననే యుద్భవించిరి. సృష్టిరచనము లోకత్రయము గూడ నీ విస్తృతి వలన నేర్పడినవే ౧౫ పరమార్థమూలతత్త్వముగానే గాక కేవల సద్విద్యారూపమునఁగూడ నీవు పేరుగాంచి యుంటివి.

నీ సుస్వరూపము శాంతము, నిర్మలము, నిశ్చలము, నై యున్నది. ౧౬ యోగుల ధ్యానమునందును సాధకుల చింతనమునందును సిద్ధుల యంతఃకరణమునందును నీవు సమాధిరూపమున వసించుచుంటివి ౧౭ నీవు నిర్గుణస్వరూపమును సుబోధము గావించుచున్నావు. అనుభవమునకు నీవు చిహ్నముగా నుంటివి. ఘటాంతరముల యందు నీవు పరివ్యాప్తురాలవై యలరారుచున్నావు ౧౮ శాస్త్రములు పురాణములు, వేదములు, (శ్రుతులు), నిన్ను నిరంతర మఖండరూపముగాఁ గొనియాడుచున్నవి. ప్రాణిమాత్రులందఱు నీ నిర్మలకీర్తిని బహువిధముల గాన మొనరించుచున్నారు. ౧౯ వేదశాస్త్రముల కంతటి మహిమ నీవలన వచ్చినది. నిరుపమానమునకు నీవుపమానభూతురాలవు. నీ సంబంధముచేతనే గదా పరమాత్మకుఁ బరమాత్మయను గౌరవము వచ్చినది ౨౦ తల్లీ! బహువిధములగు విద్యలు, కళలు, సిద్ధులు, నిశ్చయాత్మికమగు బుద్ధి, సూక్ష్మవస్తువు మున్నగువానికి నీవు శుద్ధజ్ఞానస్వరూపురాలవై తేజము ప్రసాదించితివి. ౨౧ హరిభక్తులయెడఁగల భక్తివి నీవె. అంతర్నిష్ఠులకు నంతర్దశవు నీవె. జీవన్ముక్తులగు మహాత్ములకు నీవె సాయుజ్యముక్తిగనొప్పారియున్నావు ౨౨ అనంతమగు వైష్ణవీమాయవు నీవు. నీ నాటక మోహకత్వ మెంతవారికేని తెలియరాదు. జ్ఞానమును నభిమానముతో నీ వెంతయెంతవారలనేని చిక్కుపఱచుచున్నావు ౨౩ నీ దివ్యస్వరూపము కనులతోఁ గాంచనేరము, శబ్దముల సాయముచే గుఱుతింపఁజాలము. మనసునమాత్రము ప్రకాశించుచుండును. ౨౪ స్తవము, భజనము, భక్తి భావమును, వానిలో నెందేని మాయలేకున్న సందమే లేదు. ఈ వచనములయందలి భావము ననుభవనీయులు దక్క నితరు లెఱుంగరు ౨౫ ఓ జగన్మాతా! పెద్దలందరికంటెను బెద్దదానవు. సర్వజగన్నియంతయగు నీశ్వరునకు నీ వీశ్వరివి

నీకు నీ యంశములోనే మాయారూపిణివగు నీకు మాయారూపముననే యిపుడు వందనము లొనరించెదను.

నాలుగవ సమాసము

సద్గురుస్తుతి

సద్గురువర్ణనము నెటులఁ గావింపవలయునో తోఁచకున్నది. మాయకుఁ గూడ స్పృశింప నశక్యమగు గురుస్వరూపము అజ్ఞానుఁడనగు నాకేవిధముగాఁ దెలియును? ౧ సద్గురుపరబ్రహ్మము స్వరూపము నెఱుఁగుట యసాధ్యకార్యము. ఎవరి విషయమున శ్రుతులుసైతము "నేతి, నేతి," యని వాకొనుచున్నవో యట్టి గురుబ్రహ్మమును వర్ణించుటకు మూఢుఁడనగు నాహృదయమునందు స్థానమెక్కడిది? ౨ స్తుతివిషయమున నాకేమియుఁ దెలియరాకున్నది. కావున దూరమునందుండియే నీకు వందనములను సమర్పించుచున్నాఁడను. ఓ గురుదేవా? నీ మహిమాసముద్రమును దరిచేరుటకుఁ దగినశక్తిని నాకు దయతోఁ బ్రసాదింపుము ౩ నిన్నుఁ గొనియాడవలయునని యాపరానియంత కోరిక గలదు. కాని మాయచే నాధైర్యమంతయు వికలమైపోయినది కావున నోగురుస్వామీ? నీవెవ్విధంబున నింతకుమున్నుంటివో యటులనె యుండుము. ౪ ఇంతకుమున్ను మాయాబలమున నిన్నుఁ గొనియాడఁగలనని మురిసితిని. కానిమాయయంతయు లజ్జనొంది పోయినది. ఇఁక నాగురుమూర్తిని స్తోత్రముగావింప ననువగు విధమెద్ది? ౫

ముఖ్యపరమాత్మను గల్పనమొనరించుట యెన్నటికిని సాధ్యముకానిపని. అందుచేతనే యాతనిప్రతిమను జేయవలసివచ్చినది. ఆవిధముగనే నేను మాయాయోగముతో సద్గురునిమహిమ నభివర్ణించెదను. ౬ సాధకుఁడు తనభావానుసారముగా నేవిధముగా

హృదయమునందు దేవతాధ్యానముగావించునో యట్లు ఈస్తుతిప్రకరణమునందు సద్గురుమూర్తిని స్తుతించెద. ౭

ఓసద్గురురాజా! నీకు జయమగునుగాక. నీకు జయమ్మగునుగాక ఓవిశ్వంభరా! విశ్వబీజమూర్తీ! పరమపురుషా! మోక్షధ్వజా! దీనబాంధవా! సూర్యప్రకాశముచే నంధకారసముదయము పటాపంచలగునట్లు నీయభయరూపమగు ప్రకాశలేశముచే దుర్నివారమగు మాయయంతయు నశించుచున్నది. ౮-౯ పగలు సూర్యుఁడంధకారమును రూపుమాపుచున్నాఁడు. రాత్రియైనపిదప నాయంధకారమంతయు లోకమునిండ నల్లుకొనుచున్నది. ౧౦ కాని మా సద్గురుస్వామి యట్టివాఁడుకాఁడు. ఆయన జననమరణములను వినాశన మొనరించుచున్నాఁడు. అజ్ఞానరూపమగు మహాంధకారము నాయన మూలమట్టముగా నశింపఁజేయుచున్నాఁడు. ౧౧ బంగారమెన్నఁటికిని ఇనుముగా మాఱనివిధమున గురుభక్తులెన్నఁటికిని సందియములకుఁ బాల్పడఁజాలరు. ౧౨ ఏనదియైన గంగానదిలోఁ గలసినపిదప అదియు గంగానదియైపోవును. మఱల నొకవేళ నదివేఱు గావింపఁబడినను అదిగంగానదిమాత్ర మెన్నఁటికిని గాఁజాలదు. ౧౩ కాని గంగానదిలోఁ గలియుటకు ముందుగ నానదిని జనులందఱు (సామాన్య) నదియె యని యందురుగాని గంగయని యెప్పుడును జెప్పరు. శిష్యునిస్థితి యట్టిదిగాదు. అతఁడు సర్వవిధముల గురుస్వామియే యగును ౧౪ పరుసవేది లోహమును పరుసవేదిగాఁ జేయనేరదు. సువర్ణము ఇతరలోహమును సువర్ణముగాఁ జేయఁజాలదు. కాని సద్గురుభక్తుఁడు ఉపదేశములచే నితరులనుగూడ సద్గురులనుగాఁ జేయఁగలుగును. ౧౫ శిష్యున కీవిధముగా గురుత్వము చేకూరును. పరుసవేదిచేఁ గావింపఁబడిన సువర్ణము ఇతరలోహములను సువర్ణముగాఁ జేయనేరదుగాన సద్గురునకుఁ బరుసవేదితో నుప

మాన మెన్నటికిని బొసంగదు ౧౬ పోనిమ్ము సద్గురునకు సముద్రము
నుపమానముగ నొసంగుదమన్న నదియు యుక్తియుక్తముగ లేదు.
ఏలయన సముద్రమత్యంతక్షారోదకముతో నిండియున్నది. కాదు
క్షీరసాగరముతోఁ బోల్చుదమన్న నదియుయుక్తముగ లేదు. ఏలయన!
క్షీరసాగరముసైతము కల్పావసానమున నశించుచున్నది. ౧౭ మేరు
మహాపర్వతముతో సద్గురుమూర్తిని బోల్చుదమన్న నదియుఁ దగి
యుండలేదు. మేరువు జడపాషాణమయము. మాసద్గురుమూర్తి
యట్టివాఁడుకాఁడు. అతఁడు దీనజనులను గాంచినంతన దయార్ద్ర
హృదయుఁడగును. ౧౮ ఆకాశము నుపమానముగాఁ గైకొందమనిన
సద్గురుస్వరూప మాకాశముకంటెను నిర్గుణము కాన సద్గురున
కాకాశదృష్టాంతము జతపడుట లేదు. ౧౯ ధీరత్వమునందు సద్గురు
నకునొకవేళ భూమి నుపమానముగఁ జెప్పుదమన్న నదియు సరి
పడదు. భూమి కల్పాంతమునందు నాశనమగుచున్నదిగావున భూమి
నుపమానముగఁ జెప్పుట తగదు ౨౦ అన్నివిధముల సూర్యుఁడు
సద్గురుమూర్తితో నుపమింపఁదగినవాఁ డందుమేని యాతనిప్రకా
శమునకుఁ గూడ శాస్త్రనియమ మున్నటులఁ బెద్దలు జెప్పుచున్నారు.
సద్గురుఁడో నిర్ణయాతీతుఁడుగాన నీయుపమానము తగదు ౨౧
కావున సూర్యుఁడుసైతము గురుమూర్తికంటె నుపమలోఁ దక్కువ
వాఁడు. సద్గురుని జ్ఞానరూపమగు ప్రకాశము మిక్కిలిగొప్పది. ఒక
వేళ నాదిశేషుని నుపమింపఁ దలఁచిన మెడల నదియుసంబంధింపదు.
ఆదిశేషుఁడు భూభారమును మోయువాఁడు ౨౨ జలము నుపమిం
చుదమన్నచో నదియుఁ గాలాంతరమునం దెండిపోవును. సద్గురుని
రూపము నిశ్చలమైనదిగావున నది యెన్నటికిని నశింపఁజాలదు ౨౩
సద్గురున కమృతము నుపమానముగఁ జెప్పుదమన్న నదియు సరిపోక
యున్నది. ఏలయన! అమృతపానము గావించువార లమరులు. వార

లుగూడ నొకప్పుడు మృత్యువునకు లోనగుచున్నారు. సద్గురుకృప
ఆశ్రితులకు యథార్థమగు నమరత్వము కలుగఁజేయునుగాని నీయుప
మానము సరిపడదు ౨౧ ఒకవేళ సద్గురుని గల్పవృక్షమని చెప్పుద
మన్న నదియుఁ బొసఁగకున్నది. సద్గురునిస్వరూపము కల్పనాతీతము
గానఁ గల్పవృక్షోపమము సర్వవిధముల ననుచితము ౨౫ మనస్సు
లోఁ గోరిక లేనపుడు చింతామణిని బాటించువాఁ డెవ్వఁడు? నిష్కా
ముఁడగు వానికిఁ గామధేనువుతోఁ బనియేమి? కాన మాగురు
మూర్తిని జింతామణితోడను గామధేనువుతోడను బోల్చుట యుక్త
ముగాదు, ౨౬ సద్గురుమూర్తి నొకవేళ లక్ష్మీయుతుఁడని చెప్పుదు
మేని యదియు నుచితముగ లేదు. లక్ష్మి నశించునది. మోక్షలక్ష్మిని
దనగృహద్వారమునందు బంధించు సద్గురుమూర్తి కీనాశవంతమగు
లక్ష్మితోఁ బోల్కి తగదు ౨౭ స్వర్గలోకమునకును దేవేంద్రపదవి
కిని గూడఁ గాలాంతరమునందుఁ జలనముగలదు. సద్గురుకృప చలన
రహితమైనది గావున దానిని స్వర్గముతో దేవేంద్రపదవితోఁ
బోల్చుట యెట్లు? ౨౮ హరిహరబ్రహ్మలుగూడ నాశనమగుదురు.
సద్గురుపద మెన్నటికిని నాశనమొందక యవినాశిగా నుండును.
౨౯ కావున మాదృష్టిలో సద్గురుని కుపమింపఁదగిన దేదియు లేదు.
సమస్తసృష్టియు నాశనమగుటకలదు. గానఁ బాంచభౌతికమగు
భూమి నెట్లు గురుమూర్తితోఁ బోల్పనగును? ౩౦ ఇందుచే సద్గురుని
వర్ణనము గావించుట నాకశక్యమని తొలుతనే నిశ్చయించినాఁడను.
"ఇఁకఁజాలును. సద్గురువర్ణనము నాకుసాధ్యము కాదు" అని నుడు
వుటయే నేనుగావించు గురువర్ణనము. అంతరస్థితమగు నెఱుకను
అంతర్నిష్ఠుఁడై (అనుభవనీయుఁడై) యెఱుంగును. ౩౧

ఐదవ సమాసము

సాధుస్తుతి

పరమార్థమున కాశ్రయభూతులును మనుజులలో నిమిడి యున్న జ్ఞానరహస్యమును వెల్లడిచేయువారును నగు సాధుసజ్జనులకు వందనము లొనరించెదను ౧ దుర్లభమగు వస్తుసముదాయమె గాక పరమదుర్లభమగు బ్రహ్మముగూడ సాధుసంగమమున సులభసాధ్య మగుచున్నది. ౨ బ్రహ్మము ప్రకటితముగానే యుండును గాని చూడఁదలంచినవారికెవ్వరికి నది కాన్పింపదు. బహువిధములగు సాధనముల నొనర్చినను పెక్కుతెఱంగులఁ బరిశ్రమ మొనరించినను నది లభింపనేరదు. ౩ బ్రహ్మము నెఱుంగుటలోఁ బరీక్షకులగు విమర్శకులుసైతము మోసపోయిరి. ఇంతియేగాదు. మీఁదుమిక్కిలి కన్నులుగలవారలు సైతము గ్రుడ్డివారలై పోయిరి. మఱియు బరబ్రహ్మమును జూచుచుఁ జూచుచు సాధకులు తాము స్వయముగ నంతర్హితులైరి. ౪ పరబ్రహ్మమును దీపముతో వెదకి కనుఁగొనలేము. నానావిధములగు ప్రకాశములసహాయముతో గుఱుతింపనేరము. నేత్రములం దంజనముబెట్టుకొని గాంచినను నయ్యది దృష్టిసమ్ముఖమున గోచరింపదు. ౫ ఇంతియేల! షోడశకళాభిరాముఁడగు పూర్ణచంద్రుని సాయమునఁగాని తీవ్రకళారాశి యగు సూర్యుని తోడ్పాటునంగాని పరబ్రహ్మమును గుర్తింపఁజాలము ౬ సూర్యప్రకాశమునందు ఉన్నిలోనున్న రోమములనన్నింటిని గురుతింపవచ్చును అణువులు రేణువులుమున్నగు సూక్ష్మవస్తుసముదాయమునుగూడఁ గనుఁగొనవచ్చును. ౭ సూర్యునివెలుఁగున నడిమికిఁ జీల్పఁబడిన వెండ్రుకయొక్క కొననుగూడఁ జూడవచ్చును. కాని పరమాత్మనిమాత్రము సందర్శింపఁ జాలము. సాధుజనుల సత్కృపయొక్కటి సంపాదించితిమేని యావస్తువు తనంతన గోచరించును.

౮ పరబ్రహ్మవిషయమున సమస్తములగు నాక్షేపణలు సమాప్తి నొందుచున్నవి. తార్కికులు పరబ్రహ్మమును గూర్చి తర్కించి తర్కించి మందమతులైపోవుచున్నారు. ౯ పరబ్రహ్మము గుఱుతించుటలో వివేకము సంకుచితమైపోవుచున్నది. కొనియాడుటలో శబ్దములు వెనుకడుగువేయుచున్నవి. మనస్సునకుఁగల గమనశక్తియు దానిఁజేరుటకుఁ జాలకున్నది. ౧౦ వేయిముఖములుగల వాఁడును గొప్పవాచాలుఁడునని పేరొందిన దిట్టయగు నాదిశేషుఁడుసైతము పరబ్రహ్మము గొనియాడఁజాలక పూర్తిగా విసుగెత్తిపోవుచున్నాఁడు. ౧౧ వేదవిరహితమైన దీప్రపంచమున నేదియు లేదు. సమస్తమును వేదము ప్రకటితమొనర్చియున్నది అట్టి వేదముసైతము ఇదమిత్థమని పరబ్రహ్మమును జూపనేరకున్నది ౧౨ దుర్లభమగు నాబ్రహ్మపదార్థము సాధుసాంగత్యమునను వారలస్వానుభవకారణమునను నెఱుకలోనికి వచ్చును. కాన నిట్టియోగ్యతగల సాధుసజ్జనుల మహిమ వర్ణింప నాకు శక్యముగాదు. ౧౩ మాయకుఁగలశక్తి మిగులఁ జిత్రమైనదెగాని యదియు బ్రహ్మపదార్థము నెఱుంగుటకుఁ దోడ్పడ నేరదు. మాయాతీతమగు అనంతవస్తువునుగూర్చిన మార్గమును సాధువులగు సజ్జనులే చూపఁదగినవారు ౧౪ వర్ణింపనలవిగాని బ్రహ్మపదార్థము సాధుజనరూపమునఁ బ్రత్యక్షమగుచున్నది. ఇందుచే బ్రహ్మమువలె సాధుజనులును ననిర్వచనీయులు ౧౫

సాధుజను లానందమునకు మందిరములు. సత్యసుఖస్వరూపులు. నానావిధానందములకు వారలు మూలభూతులు. ౧౬ వారు విశ్రాంతికి విశ్రాంతభూతులును తృప్తికిఁ దృప్తిస్వరూపులు నై యున్నారు. ఇంతయేల! భక్తియొక్క పరిణామములే సాధుజనులుగ గోచరించుచున్నవి. ౧౭ ధర్మమునకు వారునికిపట్టులు. స్వరూపమునకు సత్పాత్రభూతులు. పుణ్యమునకుఁ బవిత్రమగు దేశములు. ౧౮

సాధుజనులు సమాధికి ఆటపట్టులు. వివేకమునకు భాండారస్వరూపులు సాయుజ్యముక్తికి వారలు అధిష్ఠానులు. ౧౯ ఇంతియగాదు సత్యమునకు నిశ్చయులుగను సార్థకమునకు జయప్రదాతలుగను ప్రాప్తికిసమయస్వరూపులుగను సిద్ధరూపులుగను సాధుజనులలరారుచున్నారు. ౨౦ సాధువులన మోక్షలక్ష్మీసమలంకృతులగు శ్రీమంతులు, అసంఖ్యాకులగు నజ్ఞానజీవులను వారు ముక్తులుగఁ జేసిరి. ౨౧ సమర్థులును, ఉదారులును, (అత్యంతదానశూరులును) నగు నితరమానవులు సాధుజనులవలె జ్ఞానరూపమగు ధనమును బ్రసాదింపఁజాలరు. ౨౨ ఎందఱో చక్రవర్తులు, మహారాజులు గతించిరి. ఇంక నెందఱో గతింపనున్నారు. కాని వీరలలో నెవ్వఁడును సాయుజ్యముక్తి నొసంగఁజాలరు. ౨౩ మూఁడులోకములలోని యే ప్రాణియుఁ జేయఁజాలని జ్ఞానదానమును సాధుజనులొక్కమొగిఁ జేయుచున్నారు. ఇట్టి సాధుజనుల మహిమాతిశయము నెంతని వర్ణింపనేర్తును? ౨౪ మూఁడులోకములకు నతీతమైనదియు శ్రుతులవలన నెఱుంగశక్యముగానిదియు నగు పరబ్రహ్మము సాధుజనులకుఁ బ్రసన్నమైయుండుటచే సాధకుల కంతఃకరణములోనికిఁ జేర నవకాశము గలుగుచున్నది. ౨౫ సాధుజనులమహిమ యీవిధముగ నుండునని కొంచెము దెలిపినాఁడ. వారి నెంతగఁ బ్రశంసించినను దక్కువయే. వారలవలననే ముఖ్యపరమాత్మ ప్రకటితమగుచుండును. ౨౬

ఆఱవసమాసము

శ్రోతలస్తుతి.

ఇప్పుడు భక్తులు, జ్ఞానులు, సాధువులు, సజ్జనులు, విరక్తులు గుణవంతులు, సత్యవాదులునగు శ్రోతలకు వందనము లొనరించుచున్నాఁడను. ౧ శ్రోతలారా! మీరలు సత్త్వగుణమునకు సముద్రమువంటివారు. మఱియు బుద్ధివిశేషమునకు మందిరములు. శబ్దరత్నములకు గనులు. ౨ మీరు బహువిధార్థరూపమగు నమృతమును సేవించువారలును నిశ్చయులగు పురుషులునైయుంటిరి. ౩ మీధారణము (స్మరణశక్తి) అంతులేనిది. ఈశ్వరాంశముతో మీర లవతరించిరి. మీరు ప్రత్యక్షదైవతములవలె నాసీనులై యున్నారు. ఇంతియకాక శ్రోతలారా! మీరలు శాంతస్వరూపులును, సత్త్వగుణవిశిష్టులును నగు ఋషీశ్వరమండలిగ గోచరించుచున్నారు. మీకారణముననే సభామండలములందుఁ బరమశోభ వ్యాపించుచున్నది ౫ పరమాత్ముఁడు మీ హృదయకమలములలోఁ బ్రకాశించుచున్నాఁడు. సరస్వతీదేవి మీముఖములందు మనోహరముగా విహరించుచున్నది. మరియు సాహిత్యవార్తలను భావించుటలో మీరలు బృహస్పతివలెఁ గనుపించుచున్నారు. ౬ మీరలు పవిత్రతలో నగ్నిరూపులు. సంపూర్ణకిరణయుతులగు సూర్యభగవానులు. జ్ఞాతృత్వమునందు మీదృష్టియెదుట బ్రహ్మాండమొక లెక్కలోనిదిగాదు. ౭ అఖండసావధానరూపులై మీరలు రాణిల్లుచున్నారు. మీరెల్లరు భూతభవిష్యద్వర్తమాన విషయముల నెఱుంగనగు దివ్యజ్ఞానసంపన్నులరు. ఇంతియగాక నిరంతరము మీరు నిరభిమానులుగ నాత్మజ్ఞానులుగ నున్నారు ౮ మీదృష్టి యెదుటకు రాని దెద్దియును బ్రపంచమునందు లేదు. మీహృదయములు ముఖ్యపదార్థమును (బ్రహ్మమును లక్షిత మొనరించెను) ౯ నేను చెప్పఁబోవునదంతయు మీ కందఱకింతకుమున్నె తెలియును. ఇఁక నిప్పుడు మీముందు జ్ఞాతృత్వాభిమానముతో నే నేమి చెప్పవలయునో దోఁచకున్నది. ౧౦ అయినను మీరలు గుణగ్రహణపారీణులు. కావున సందేహరహితుఁడనై చెప్పుచున్నాఁడను. భాగ్యోపేతులగు నీ శ్రోతలు నామాటల నాలింపకపోరు ౧౧ భాగ్య

యుతులగు పురుషులు నిరంతరము దివ్యాన్నములఁ జవిజూచుచు మనస్సు మార్పునొందుటకు ఒక్కొక్కప్పుడు శుష్కాన్నముగూడ నారగించుచుందురు. అటులే యీనా ప్రాకృతభాషావచనములను (శుష్కాన్నమునువలె) సజ్జనులగు శ్రోతలు స్వీకరింతురుగాక. ౧౨ నాశక్తికొలఁది హృదయపూర్వకముగ బరమేశ్వరుని నుపాసించుచున్నాఁడను. అటులని పరమాత్మునిపూజ బొత్తిగాఁ గావింపనేరనాఁడదని నేనెందును జెప్పలేదు. ౧౩ అట్లే నేనొక వాగ్దుర్లభుఁడను. (చెప్పుటకుఁ బూర్ణమగు శక్తిసామర్థ్యములులేని వాఁడను) శ్రోతలారా! మీరు సత్యముగాఁ బరమేశ్వరులు. ఇఁక నిప్పుడు నాసరళరహితమగు వాక్కుతో మిమ్ములను బూజింప నభిలషించితిని.

పాండిత్యము, కళ, చతురత్వము, కావ్యప్రబంధశక్తి, భక్తి, జ్ఞాన వైరాగ్యములు, వచనమాధుర్యము మున్నగు సల్లక్షణములు నాయందేవియులేవు ౧౪ నావాగ్విలాసస్థితి యిట్టిది. అగుఁగాక ఇపుడు నేనుఁజెప్పఁదలంచినది ప్రసన్నతాపూర్వకముగా నివేదించెదను. ఏలయన జగదీశ్వరుఁడు భావమునకె యాఁకలిగొనియున్నాఁడు. ౧౫ శ్రోతలగు మీరలందఱు ప్రత్యక్షజగదీశ్వరమూర్తులు. మీసన్నిధిలో నాపాండిత్యమెంతటిది. అల్పమతిని బుద్ధివిహీనుఁడ నగునేను మీయెదుట సాహసించుచున్నాను. ఈప్రపంచమునందు (సమర్థుని) పుత్రుఁడు మూర్ఖుఁడైనను దనతండ్రియెదుట ధృష్టత్వము (తనపట్టును) నెఱవేర్చెడిసామర్థ్యము వానికిఁగూడ నుండును. దీనినే తెలిసికొని సాధుమూర్తులగు మీసన్నిధిలో నేదియోచెప్పుటకు సాహసించుచున్నాఁడను. ౧౬ పెద్దపెద్దపులులను, సింహములను, జూచి ప్రజలు భయపడి పాఱిపోవుదురు. కాని యాజంతువులపిల్లలా జంతువుల యందు నిర్భయముగా నాటలాడుచుండును. ౧౭ అటులె సాధుజనుల దాసుఁడనగు నేను సాధువులగు మీ ముందేదియోఁ జెప్ప

సాహసించుచున్నాఁడను. మీరలు నన్ను క్షమించి తీరెదరని విశ్వసించుచున్నాఁడను. ౨౦ నిరర్థకముగాఁ దనవాఁడు భాషించునపుడు విజ్ఞుఁడాదరముతో సమర్థించుచుండును. అటులే నేను జెప్పదానిలో నేదేని దోసఁగున్నచో మాటాడక ఆ న్యూనతను బూర్తిచేయఁగోరెదను ౨౧ ఇది ప్రీతి యొక్కలక్షణము. మనస్సు తనకుఁ దానే లోపములను సవరించుకొనును. సాధుసజ్జనులగు నోశ్రోతలారా! మీరు లోకమునకుఁ దల్లిదండ్రులవంటివారు. ౨౨ నాభావములను హృదయమునందుంచుకొని యుచితమేదియో దానిననుగ్రహపూర్వకముగ నొనర్పుఁడు. ఇఁకముందురాఁబోవు కథయందు ధ్యానమునుంచుఁడని యీ దాసానుదాసుఁడు మిమ్ములనందఱను బ్రార్థించుచున్నాఁడు. ౨౩ ———

ఏడవ సమాసము

కవీశ్వరస్తుతి.

కవీశ్వరులారా? మీకిపుడు వందనము లొనరించుచున్నాఁడను. మీరలు శబ్దసృష్టికి స్వాములు, వేదరూపముతో నుత్పన్నులైన పరమేశ్వరులు. ౧ మీరలు సరస్వతీదేవికిఁ బ్రత్యక్షనిలయులు. సమస్తమగు కళలకు జీవనులు. అంతియగాక నిజముగా బహువిధములగు శబ్దములకు మీరలు భువనములు ౨ మీరలు పురుషార్థమునకు వైభవప్రాయులు, జగదీశ్వరుని మాహాత్మ్యమును ఆదేవుని నానావిధ లీలావిలాసములను, సత్కీర్తిని వర్ణనము గావించుటకై మీరలు నిర్మింపఁబడితిరి. ౩ శబ్దరత్నములకు మీరలు సముద్రములై ముత్యములకుఁ దెలిచిన చెలువులై నానాప్రకారములగు బుద్ధివిశేషములకు నాశ్రయభూతులయి యుత్పన్నమైతిరి ౪ ఆధ్యాత్మికగ్రంథములకు మీరలు గనులు. మఱియు [illegible] మణులు. శ్రోతలను బ్రసన్నాత్ములఁ జేయుటలోఁ గామధేనువుగ

ధారలు ౫ ఇంతియగాదు మీరలు కల్పనమునకుఁ గల్పతరువులు. మోక్షమునకు ముఖ్యమగు నాధారస్తంభములు. కవులారా! సాయుజ్యముక్తియే బహురూపములతో నలరారు మీరు గాఁ బ్రకటనమైనది. ౬ ఇహలోకమునకేగాదు మీరలు పరలోకమునకుఁగూడ ముఖ్యస్వార్థులు. యోగులకు రహస్యనూర్ధభూతులు. ఏలయన? మీరలు జ్ఞానులకుఁ బరమార్థరూపమగు గృహమునుగావించి ప్రసాదింప నవతరించితిరి. ౭ మీరు నిర్గుణ పరబ్రహ్మమూర్తులు. మాయనుండి వేరైన పరమాత్మలక్షణాలక్షితులరు ౮ మీరలు వేదమునకు నంతర్భావరూపులు. పరమేశ్వరుని యలభ్యభావములు. కానసే ఆత్మబోధము కవిరూపమున సులభసాధ్యమయ్యెను. ౯

మోక్షాపేక్షగలవారలకు మోక్షనిధిజూపుటకుఁ గవి యంజనమువంటివాఁడు. కవి సాధకులకు సాధనము. సిద్ధపురుషులకు సమాధానము. ఇందు సంతయేని సందియములేదు. ౧౦ కవి స్వధర్మమున కాశ్రయభూతుఁడు. మనోనిగ్రహమునఁ గవి పెట్టినపేరు. ధార్మికభావమున వినయమున నెన్నఁదగువాఁడు. ఇంతియగాక వినయమును నేర్పు బోధకుఁడు ౧౧ వైరాగ్యము రక్షించుటయందును భక్తిసమూహము నలరించుటయందును బహువిధములగు స్వధర్మములను గాపాడుటయందును గవిని మించినవాఁడు లేఁడు ౧౨ ప్రేమించువారలకుఁ బ్రేమస్థితిగను, ధ్యానించువారలకు ధ్యానమూర్తిగను, ఉపాసకులపాలిటికి గీర్తికాముఁడుగను నుండు కవీశ్వరుని మహత్త్వమెంతని పొగడఁగలను. ౧౩ కవులమూలముననే సమస్తసాధనములు సమకూరుచున్నవి. నానావిధములగు ప్రయత్నములు కవుల కౌశలములకతననే ఫలించుచున్నవి. ఇంతయేల! మానవులకార్యములు [illegible] గవుల కౌశలమె ముఖ్యమగు కారణమైయు [illegible] విలాసములకతన మనుజులకుఁ గవితా

విషయకమగు ననన్యసాధ్యసంతోషము సమకూరుచున్నది. ఆతని కారణముననే కుశాగ్రబుద్ధులకుఁ గవిత్వముచెప్పఁగల శక్తి సంపద చేకూరుచున్నది. ౧౫ విద్వాంసులకు యోగ్యత కవులకతననే లభించుచున్నది. సామర్థ్యవంతులకు శక్తిప్రదాయకుఁడును, నేర్పరులకు నానావిధములగు కౌశలముల ననుగ్రహించువాడును నగు కవిమహిమగొనియాడ నేరితరము? ౧౬ కావ్యప్రబంధములు, నానాప్రకారములగుఛందస్సులు, గద్యపద్యభేదాభేదములు, పదప్రాసములుమున్నగు కవితాలక్షణములకుఁ గవిజనులే కర్తలు. ౧౭ కవులు సృష్టి కలంకారములు. లక్ష్మీదేవికిశృంగారవిలాసములఁ బ్రసాదించు ధన్యులు. సకలకార్యసిద్ధులకు నిర్ధారణకర్తలు ౧౮ సభలు కవులవలననే ప్రకాశవంతము లగుచున్నవి. భాగ్యభోగ్యములకుఁ గవిరాజులే విభూషణములు. బహువిధములగు మానవసౌఖ్యములకుఁ గవులే రక్షకులు ౧౯ కవి, లోకోద్ధారణమునకు దేవాంశముతో నుద్భవించినవాఁడు. ఋషులకంతటి యశోవిభవము మహత్త్వము గలుగుటకుఁ గవులె కారకులు. బహువిధములగు శాస్త్రధర్మములు వానివానిమహత్త్వములు సమన్వయించుటలోఁ గవినిమించినవాఁడు లేఁడు. ౨౦ కవి యొక్క వ్యాపారమే (కావ్యరచనమే) లేకపోయినయెడల లోకోద్ధారణమునకె యవకాశముఁ జిక్కదు. కావుననే కవిని సమస్త సృష్టికి నాధారభూతునిగాఁ జెప్పఁగల్గితిని. ౨౧ అపారములగుశాస్త్రములను జదివి వానిసారభూతమగు జ్ఞానముగడించుట కవులవలననే మానవజాతికి సిద్ధించినది. కవులవలననే బుద్ధిశాలురగు ధన్యులకు సర్వజ్ఞత్వము సమకూరుట తటస్థించుచున్నది. ౨౨ పూర్వకాలమునందు వ్యాసభట్టారకుఁడు వాల్మీకులవారు కవులనుగీర్తినొందిలోకోద్ధరణము గావించిరి. వారివలననేగదా జనులందఱకు జ్ఞానము లభించినది. ౨౩ మొట్టమొదటనే కవులు గ్రంథ సముదాయమును

రచించిరి. అందుచేతనే పాండిత్యము యోగ్యత, జనులకు సిద్ధించినది. ఇంతయేల! కవులవలననే పండితులకు యోగ్యత లభించినది. ౨౪ కవులయోగ్యత యీవిధముగా లోకోత్తరమైనది. కావుననే పూర్వులలో మిగుల విఖ్యాతులై గొప్పకబ్బములు రచించిన మహాకవులకును, ఇపుడు కవిత రచించి కీర్తిగడించుచున్నవారికిని, ముందు వాఙ్మయలోకము పాలింపనున్న భవిష్యత్కవిసముదాయమునకును నేను వందనము లొనరించుచున్నాఁడను. ౨౫ పలు తెఱఁగులఁ బేరొందిన నేర్పరితనములన్నింటికిని గవియే మూలపట్టు. కవిముఖము నుండి బహిర్గతములగుటవు వేదములు శ్రుతులు నుత్సాహపడుచుండును గావునఁ బ్రత్యక్షముగా బృహస్పతియని కవిని బ్రశంసించుచున్నాఁడను. ౨౬ పరోపకారమువలని ప్రశస్తిని పాటుటకుఁ గవులెన్నియో శాస్త్రవిహితములగు యుక్తుల నెఱింగించుచున్నారు. ఎట్టి సందియమునైన నివారించుటలోఁ గవులకుఁ గలశక్తి గొనియాడ నెంతవానికేని యశక్యము. ౨౭ ప్రపంచము నెడఁ బ్రీతిసన్నతదాల్పుటకై యవతరించిన యమృతపూరితమగు మేఘరాజముగఁ గవిని సంభావింపనగును. నవవిధములగు రసములను బ్రవహించునటులఁ జేయుటలోఁ గవులు ప్రవాహములవంటివారు. నానావిధములగు సౌఖ్యములను బ్రసాదించుటలోఁ గవులు పరిపూర్ణసరోవరములు. ౨౮ వివేకభాండారములు కవులుగా మనుష్యరూపమునఁ బ్రకటిత యున్నవి. కవులన సమస్తవిధములగు విజ్ఞానములకు నునికిపట్టులు ౨౯ సంసారులగు మానవులకుఁ బూర్వజన్మసంచితమగు సుకృతాతిశయమున లభించిన యుత్తమపదార్థముల శక్తినిధరించి కవులీ లోకమున నవతరించిరి. ౩౦ కవులు ప్రజలకనేకవిధముల నుపకరించు కొఱకు అక్షయానందపూర్ణమగు సుఖనౌకరూపముసఁ దరించుచున్నారు. ౩౧ వీరలు నిరంజనులు (పరబ్రహ్మమూర్తులు) లేదా

వీరలు విరాట్పురుషుని యోగస్థితియైనఁ గావలయును. కాదుకాదు సత్యమునెరింగితిని. వీరలు భక్తియోగమునకు ఫలశ్రుతిరూపమున ఫలించినధన్యులు. ౩౨ ఇప్పటి కీవర్ణనము చాలును. నిశ్చయముగాఁ గవులు లోకమున కాధారమూర్తులు. ఇందువలననే వారలకు హృదయపూర్వకముగ సాష్టాంగవందనము లొనర్చుచున్నాను.

ఎనిమిదవ సమాసము

సభాస్తుతి.

ముక్తి శులభముగాఁ బడయుట కనుకూలించునదియు స్వయముగా సచ్చిదానందమూర్తియగు పరమాత్ముఁడు వసించు నెలవును నగు నీసభలకు వందనముల నొనరించుచున్నాఁడను ౧

శ్లో॥ నాహంవసామి వైకుంఠే యోగినాంహృదయే రవౌ
మద్భక్తా యత్రగాయంతి తత్రతిష్ఠామి నారద॥

నేను వైకుంఠమునం దుండను. యోగుల హృదయము నందును నుండను. ఓనారదమునీ! నాభక్తులు నన్నే స్థానమునందు గానము చేయుచుందురో యచ్చట నేను నివసించెదను. అని భగవానుఁడు స్వయముగాఁ జెప్పుచున్నాఁడు. ౨ అందువలననే యెచ్చట భక్తులు గానముచేయుచుందురో దానిని శ్రేష్ఠమగు సభయని చెప్పుదురు. ఎచ్చట ఈశ్వరనామోచ్చారణముఁ జేయుటచే జనించిన కోలాహలము జయజయాకారములతో గర్జింపఁబడుచున్నదో యది యే వైకుంఠము. ౩ ఎచ్చట ప్రేమాన్వితులగు భక్తవతంసుల గీతములును భగవంతునికథలును, హరికీర్తనములును, వేదవ్యాఖ్యానములును పురాణశ్రవణము జరుగుచుండునో ర పరమేశ్వరుని గుణానువాదము, అనేక నిరూపణములనుగూర్చిన సంవాదములు, ఆధ్యాత్మకవిద్యయొక్కయు భేదాభేదములయొక్కయు మథనము జరుగుచుండునో యదియె సభయని చెప్పఁబడును. ౪ ఎచ్చట సాధకులకుఁ గలుగు

సందియములు నానావిధములగు వాగ్విలాసములతో నివర్తి గావింపఁ బడునో, యెచట సందేహవంతులు తృప్తినొందుదురో, యెచటనింపు లొలయుఁ జక్కఁని మాటలచే భగవానుని ధ్యానమూర్తి భక్తులహృదయములో నివసించునో, యట్టిసభల పవిత్రత నెన్న నేరితము? ౮ ప్రేమాన్వితులు, భావుకభక్తులు, గంభీరశీలురు, సత్వగుణప్రధానులు నగు సభ్యులు రమ్యముగను రసయుక్తముగను బాటలఁ బాడెడు గాయకోత్తములు, నిష్ఠావంతులు, కర్మశీలురు, ఆచారశీలురు, దానశీలురు, ధర్మశీలురు, శుచిమానులు, పుణ్యశీలురు, అంతశ్శుద్ధులు, కృపాళురు, యోగులు, వీతరాగులు, ఉదాసీనులు, నియమకర్తలు, ఇంద్రియనిగ్రహులగు తాపసులు, విరక్తశీలురు నిస్పృహులు, అరణ్యవాసులు, దండధారులు, జటాధారులు, నాథపంథులు, ముద్రాధారులు, బాలబ్రహ్మచారులు, యోగీశ్వరులు, పురశ్చరణులు, తపస్వులు, తీర్థవాసులు, మనస్వులు (మనస్సును స్వాధీనమున నుంచుకొన్నవారు) మహాయోగులు, జనష్వులు, (జనసమానముగా లోకానుసారులై నడచువారు) సిద్ధులు, సాధులు, సాధకులు, మంత్రశోధకులు, ఏకనిష్ఠోపాసకులు, గుణగ్రాహులు, సాధుశీలురు, సజ్జనులు, విద్వజ్జనులు, వేదజ్ఞులు, శాస్త్రజ్ఞులు, మహాజనులు, బుద్ధులు, సర్వజ్ఞులు, విమలసమాధానకర్తలు, యోగులు, వ్యుత్పన్నులు (శాస్త్రాదిజన్యపరిజ్ఞానముగలవారు) ఋషీశ్వరులు, ధూర్తులు, తార్కికులు, కవీశ్వరులు, మనోజయముగల మునీశ్వరులు, దిగ్వల్కలులు (దిశలే వల్కలములుగఁ గలవారు) బ్రహ్మజ్ఞానులు, ఆత్మజ్ఞానులు, తత్త్వజ్ఞానులు, పిండజ్ఞానులు, యోగాభ్యాసులు, యోగజ్ఞానులు, సంగరహితులు, పండితులు, పౌరాణికులు, విద్వాంసులు, వైదికులు, భట్టులు, పాఠకులు, యజుర్వేదులు, ఉత్తమమహాశ్రోత్రియులు, యాజ్ఞికులు, అగ్నిహోత్రులు, వైద్యులు పంచాక్షరులు,

పరోపకారులు, త్రికాలజ్ఞులు, బహుశ్రుతులు, నిరభిమానులు, నిరపేక్షులు, శాంతిశీలురు, క్షమాశీలురు. దయాశీలురు, పవిత్రులు, సత్యశీలురు, అంతఃపవిత్రులు, జ్ఞానశీలురు, మున్నగుగల వివేకశాలురగు నీశ్వరసంబంధులగు భక్తులు వసించుతావును, సభానాయకుఁడు భక్తిభావముతో నానందించుప్రదేశమునునగు సభయొక్క యలౌకికమహిమ నెంతనికొనియాడనేర్తును? ౯-౨౦ పరమార్థచింతనులగు జనులసమువాయము భగవంతునికథలఁ జెప్పుచు, నొకరు చెప్పుట నాలించుచు నెచటఁ గాలముగడుపుచుందురో యచ్చట సహజముగాఁ బ్రజోద్ధరణ కార్యము (ప్రజలుతరించుట) జరుగుచుండును. ౨౧ సత్యము, ధైర్యము, మొదలగు నుత్తమగుణములుగల సత్వగుణశాలురు నివసించుతావున నెల్లప్పుడు సౌఖ్యము నిండియుండును. ౨౨ విద్యాసంపన్నులు, కళావేత్తలు, విశిష్టగుణయుక్తులు, సజ్జనులు, భగవదనుగ్రహపాత్రులు నెచట సమావేశమైయుందురో ౨౩ ప్రవృత్తులు, నివృత్తులు ప్రపంచవ్యవహారదక్షులు, పారమార్థికులు, గృహస్థాశ్రములు, వానప్రస్థులు, సన్న్యాసులు, మున్నగువారలును, బాలురు, వృద్ధులు, తరుణులు, పురుషులు, స్త్రీలు, మున్నగువారలును, నెచట నంతఃకరణమునఁ బరమాత్ముని ధ్యానముజేయుచు నఖండనిష్ఠతో నుందురో యట్టి సభకు మఱల నొకమారు నమస్కరించెదను. ౨౪-౨౫ పరమేశ్వరభక్తులును, చేతనులకు సందేహనివృత్తి గావించు వారునునగు నుత్తములకు నావందనములు. ౨౬ నిత్యమును భగవంతుని గుణకీర్తనము ఎడతెగక జరుపఁబడు సభకు నమస్కరించుచున్నాఁడను. ౨౭ దేవతుల్యులగు సజ్జనులతోఁ గలసిమెలసి యుండువారలకు మోక్షము లభించితీరును. ఈమాటలు నాస్వకపోలకల్పితములు గావు. మహానుభావులగు వార లనేకస్థలములలో గ్రంథములందుఁ జెప్పినవియె.

౨౭ తరింపఁదలఁచినవారలకుఁ బరమాత్మగుణకీర్తనము మిగుల ముఖ్యమైనది. అది యెచటజరుగునో యదియె శ్రేష్ఠమగుసభ. పరమాత్మునికథల నాలించుచున్న యెడల ననేకములగు దుస్సందేహములు తొలఁగిపోవుట సత్యము ౨౮.

తొమ్మిదవ సమాసము

పరమార్థస్తుతి.

ఇప్పుడు సాధకులకు ముఖ్య స్వార్థమగు నీపరమార్థమును స్తుతించుచున్నాఁడను. పరమార్థయోగ మన్నిఁటి కంటెను గొప్పది. ౧ ఇది యోజించిచూచిన సులభసాధ్యముగఁ గానిపించునుగాని సత్సమాగమమునందలి మర్మము నెఱుంగనివారల కిది మిగుల దుర్గమముగా నున్నది. ౨ పరమార్థమనఁ బ్రత్యక్షమగు పరబ్రహ్మసాక్షాత్కారము. పరమార్థమన ననేకసాధనముల ఫలములను అప్పిచ్చుటవంటిది. (కాలాంతరమున ఫలప్రాప్తిలోనికి వచ్చును.) పరమార్థము నెఱింగినవారలకు వేదశాస్త్రములసారము త్వరలో ననుభవమునకువచ్చును. ౩ (ఈబ్రహ్మరూపమగు పదార్థము) ఉండుటకు పలుమొగముల నావరించి లోకమంతటను నిండియున్నదిగాని అణుమాత్రమేనియుఁ గాన్పింపకున్నది. లోకులు సన్న్యాసులగుచున్నారేగాని యేకదేశీయతాకారణమునఁ బరమార్థమును బొందఁజాలకున్నారు. ౪ ఆకాశమార్గమునఁ బ్రయాణముచేయుట కనుకూలములగు రహస్యమార్గములు సమర్థులగు యోగులకే తెలియును. ఇతరుల కీరహస్యవిషయము సాధారణముగాఁ దెలియనేరదు. ౫ పరబ్రహ్మము (పరమార్థము) సారమునకుఁ గూడ సారభూతము. అది యఖండరూపముగ అక్షయరూపముగ అపారముగనున్నది. ఎన్నివిధముల నగచాట్లుపడినను జోరుఁడు దానినెన్నటికిని దొంగిలింపఁజాలఁడు. ౬ దానికి రాజభయముగాని అగ్ని

భయముగాని లేదు. ఆరణ్యజంతువులవలని భయముగూడ లేదని చెప్పవలయునా? ౭ పరబ్రహ్మము ఒకచోటనుండి మరియొకచోటికిఁ గదలునది గాదు. తనతావు నదియెన్నఁటికిని విడువదు. కాలాంతరములందుఁగూడ దానికి మారుపులేదు. మొదట నది యెటనున్నదో సర్వకాలసర్వావస్థలలోఁగూడ నచ్చటనేయుండును. ౮ చాలకాలము గడచిపోయినపిదపఁగూడ దానియందెట్టిమార్పును గలుగఁబోదు. ఎక్కువతక్కువలు గలుగవవు. దానిముఖ్యతత్త్వ స్వరూపమును గూర్చి యింతకెక్కుడు తెలుపఁ బనిలేదు. ౯ పరబ్రహ్మము అరుగదు. అదృశ్యమునొందదు. గురుఁడను నంజనముతోఁ జూచిననే యది కనిపించును. లేకున్న నెన్నఁటికిని గనిపింపదు. ౧౦ పూర్వము సమర్థులనిపేరొందిగతించిన యోగులకుఁగూడఁ బరమార్థమె ముఖ్యస్వార్థమైనది. ఇది పరమగుహ్యము. కావుననే దీనికిఁ బరమార్థమను పేరువచ్చినది. ౧౧ వెదకి చూచినవారలకె యీపరమార్థము లభించినది. సిద్ధముగనుండినను నిది యితరులకు జన్మజన్మాంతరములదనుక లభింపలేదు. ౧౨ పరమార్థమునకుఁగల యపూర్వమహత్త్వము నెంతని తెలుపఁగలను? దీనికి జన్మమృత్యువులనునవి యెన్నఁటికి నంటుకొనవు. దీనిసహాయమున సాయుజ్యత్వపదవి (పరబ్రహ్మములో లీనమయ్యెడుపదవి) వెంటనే లభ్యమగునుగదా! ౧౩

పరమార్థవివేకమువలన మాయ దూరమగును. సారము నసారము నిర్ణయించు జ్ఞాన ముదయించును. అంతఃకరణమునందుఁ బరబ్రహ్మజ్ఞాన ముదయించును. ౧౪ సర్వవ్యాపకుఁడగు పరమాత్మునిసంబంధమగు జ్ఞానముగలవాఁడై యీబ్రహ్మాండమును జ్ఞానముచే దనయందు లయముగావించుకొను సాధకున కీపంచభూతముల క్రీడాదికములు తుచ్ఛముగా గానిపించును. ౧౫ పరమాత్మ వివేకము గలిగినంతమాత్రముననే యంతఃకరణమునం దీదృశ్య ప్రపంచమం

తయు మిథ్యగా గోచరించును. మఱియు నీప్రపంచము మాయ యొక్క మోసపుఁదడికయని బోధపడును. ౧౬ అంతఃకరణము నందు బ్రహ్మస్థితి సమావేశముకాఁగానే సందేహము లన్నియు బ్రహ్మాండమును దొలఁగి యావలికి బోవును. కంటికగుపడు ప్రతివస్తువుగూడ జీర్ణాతిజీర్ణముగను వికారముగను గనుపించును. ౧౭

పరమార్థస్వరూపము ఇటులుండునని కొంచెము తెలిపితిని. పరమార్థమును గడింపఁదలఁచువారల కిదియె ముఖ్యమగు స్వార్థము. శ్రేష్ఠమగు వస్తుసమూహములో నిదియె మిగుల శ్రేష్ఠమైనది. దీనిని వర్ణించుట యసాధ్యము. ౧౮ బ్రహ్మాదులకుసైతము విశ్రాంతి లభించుచున్నది. యోగులు పరబ్రహ్మమునందుఁ దన్మయు (లీను) లగుచున్నారు. ౧౯ సిద్ధులకు, సాధుజనులకు, యోగులకుఁ బరమార్థము విశ్రమస్థానమైయున్నది. చివరకు సత్త్వగుణపూర్ణులగు జడపురుషులకుఁగూడ బరమార్థము సత్సాంగత్యముకతన నెంతయు సులభసాధ్యమైయున్నది. ౨౦ పరమార్థమె మానవ జీవితమునకు సార్థకము. పరమార్థము మానవులను సంసార సాగరమునుండి యొడ్డునకుఁ జేర్చును. పరమార్థము ధార్మికులను శ్రేష్ఠమగు పుణ్యలోకమునకుఁజేర్చును. ౨౧ తపస్వులకుఁ బరమార్థము ముఖ్యమగు నాశ్రయము. సాధకులకుఁ బరమార్థమే యాధారము. పరమార్థము భవసాగరమునకుఁ బారమును జూపించును. ౨౨ పరమార్థవిదుఁ డెవరో యాతఁడె రాజు. పరమార్థము నెవఁడు గడింపజాలకున్నాఁడో యాతఁడె నిజమైన బిచ్చగాఁడు. ఇట్టి లోకోత్తరము పవిత్రమునగు పరమార్థమునకు ఉపమానమును దేనితో నీయఁగలను? ౨౩ బహుజన్మసంచితమగు పుణ్యఫలము ప్రోగైనయపుడె మానవుఁడు పరమార్థి యగును. అంతియగాక పరమాత్మానుభవప్రాప్తి నొందును. ౨౪ పరమార్థము నెరింగిన మానవుని జీవి

తము సర్వవిధముల సార్థకమైనదని తలంపనగును. పాపులగు నన్యమానవులు కులక్షయము గావించుటకే జనించిరి. పరమాత్మని బ్రాప్తింపక సంసారసంబంధమగు జంజాటములతో నుండు మూర్ఖుని ముఖమును గూడఁ జూడఁగూడదు. ౨౫ పరమార్థసేవనము గావించి శరీరమును సార్థకముచేయుటయు హరిభక్తితోఁ దన్నేగాక తన పూర్వులనుగూడ నుద్ధరించుటయు సత్పురుషునివిధి. ౨౬

పదియవ సమాసము

నరదేహస్తుతి

ఈనరదేహమునకు ధన్యవాదము ధన్యవాదము. పరమార్థము సాధకుల కీనరదేహమువలననే లభించుచున్నది. ౧ ఈనరదేహము ధరించినకారణముననే కొందరు మానవులు భక్తిలో లీనమైరి. కొందరు పరమవిరక్తులై గిరికందరములలోఁ బరమార్థచింతనులై వసించుట కీనరదేహమే కారణమైనది. ౨ కొందరు నిర్వ్యాసంగులై తపముగావించుచున్నారు. ఇంకఁ గొందరు మహామంత్రములను బురశ్చరణము నొనరించుచున్నారు. మరికొందరు నిష్ఠావంతులై భగవంతుని యఖండనామమును దలంచుచుఁ గాలము గడపుచున్నారు. ౩ కొందరు తపము గావించుచున్నారు. కొందరు యోగములందభినివేశము సంపాదించి సాధనము గావించుచున్నారు. కొందరు వేదాధ్యయనము నొనరించుచు శాస్త్రవివేకము సంపాదించి జ్ఞానానందమనుభవించుచున్నారు. ఇందరిన్నివిధములఁ దరించుమార్గములను వెదకుకొనుట యీనరదేహసహాయమునఁగాన నెంతని దీనిని బొగడఁగలను? ౪ ఒకఁడు హఠయోగము నభ్యసించి దేహము నత్యంతకష్టముల పాలొనరించుచున్నాఁడు. మరియొకఁడు భావబలముతోఁ దీవ్రముగా యత్నించి పరమాత్మని సన్నిధికిఁ జేరుచున్నాఁడు. ౫ ఒకఁడు

లోకములో నింతవాఁడులేఁడను ప్రఖ్యాతినిగడించి మహానుభావుఁ
డయ్యెను. ఇంకొకఁడు సుప్రసిద్ధుఁడగు భగవద్భక్తుఁడని కీర్తిని గడిం
చెను. ఇంకొకఁడు సిద్ధుఁడుగమారి యాశ్చర్యకరముగా నాకాశ
మున సంచారము గావించుచున్నాఁడు. ౬ భగవానుని యనంత తేజ
ములో నొకఁడు తేజముగా లీనమైపోయినాఁడు. ఒకఁడు జలములో
జలముగాఁ గలసిపోయినాఁడు. ఒకఁడు చూచుచుండఁగనే వాయుస్వ
రూపమునందుఁగలసి యదృశ్యుఁడై పోయినాఁడు. ౭ నానావిధ
ముల నతిలోకమహిమ జూపుటకీనర దేహమే గదా హేతువు. మాన
వులలోఁ గొందరు ఒక దేహముతోనుండి సుంతలో ననేక దేహము
లను ధరించుచున్నారు. కొందరు చూచుచుండఁగనే యదృశ్యమై
పోవుచున్నారు. కొందరొకస్థలమునఁ గూర్చుండి యాసమయముననే
యనేకస్థానములలోనను, సముద్రములందును భ్రమణముగావించు
చున్నారు. ౮ కొందరు మంత్రశక్తిని వశీకరణమొనరించుకొని పెద్ద
పులి, సింహము మున్నగు భయానకజీవములపై నాసీనులై ప్రయా
ణము గావించుచుందురు. కొందరు అచేతనములగు వస్తువులను
ప్రాణుల నడిపించునటుల నడిపింతురు. కొందరు తపోబలముచే నగ్ని
నుత్పత్తి జేసి చచ్చినవారలను గాల్చివేయుదురు ౯ కొందరు జ్వలించు
చున్న అగ్నిహోత్రము నార్పివేయుచున్నారు. కొందరు నిండుకొని,
యున్న జలము నింకించుచున్నారు. కొందరు జగమునంతటను నిండి
నిబిడముగానున్న ప్రాణవాయువును నిరోధించుచున్నారు. ఇది యంత
యు వారికి నర దేహమహత్త్వముననేగదా సమకూరినది. ౧౦

ఎందఱెందఱో హఠయోగని గ్రహులు, నిశ్చయశీలురు,
బహువిధసిద్ధులును, స్వైవసముగావించుకొనిన సిద్ధాత్ములు గతించిరి.
౧౧ వీరలెగాదు, మనోనిగ్రహము గావించిన ధన్యుఁడు వాచాసిద్ధుఁ
డైన సుకృతాత్ముఁడు, అల్పసిద్ధినొందిన కృతార్థుఁడు, సర్వసిద్ధులను

గడించిన పుణ్యాత్ముఁడు మొదలగు మహానుభావు లెందరో నాన
విధముల విఖ్యాతిగడించి సిద్ధులై గతించిరి. ౧౨ నవవిధములనొప్పు
భక్తిరూప రాజమార్గమునఁ బ్రయాణముగావించి పరమార్థమును
గడించిన సుకృతు లెందరో లోకమునఁ గలరు. అటులే యోగు
లలోఁ గూఢరహస్య మార్గమున బ్రహ్మలోకము జేరిన
మహానుభావు లెందఱో యున్నారు. ౧౩ సాధకులలో వైష్ణవుఁడై
విష్ణులోకమునకు, బ్రహ్మస్వరూపుఁడై సత్యలోకమునకు శివస్వ
రూపియై కైలాసమునకుఁ జేరినవార లెందఱోగలరు. నరదేహ
ధారులలో నింద్రలోకమున కింద్రులైనవారును పితృలోకమునకరిగి
పితృస్వరూపు లైనవారును, తారకాసదనమునందుఁ దారకలైన
వారును, క్షీరసాగరమునఁ జేరి క్షీరసాగరశాయిగమాఱిన వారలును,
బలువురుగలరు. ౧౪ కొందఱు సాలోక్య, సామీప్య, సారూప్య,
సాయుజ్యములను నాలుగువిధములగు ముక్తులను గోరికదీర ననుభ
వించుచున్నారు. ఇదియంతయు నరదేహమహత్త్వముననే సమ
కూరినది. ౧౫

అసంఖ్యాకులగు సిద్ధులును, సాధువులును, సజ్జనులును దమ
తమహితమును సాధించిన దీ నరదేహమహత్త్వముననె. ఇట్టిమానవ
దేహమహత్త్వము నెంతని కొనియాడగలను. ౧౬ ఈమానవదేహ
సహాయముననను నానావిధములగు ధనములను దానముగావించుట
వలనను సారాసారవిచారణము గావించుటచేతను అనేకులు ముక్తులై
నటుల మనము వినియున్నారము. ౧౭ ఈమానవదేహ సంబంధ
ముననే పలువు రుత్తమలోకములను బడయఁ గలిగిరి. మఱియు
నహంభావమును విడచినంతనె సానందముతో సౌఖ్యము లొంద
గల్గిరి. ౧౮ మానవదేహము నొందినపిదపనే చేతనులకందఱకు సం
శయములు నశించుచున్నవి మఱియు నుత్తమగతులుకూడ చేకూరుచు

చున్నవి. ౨౦ పశుదేహముతో నెట్టియుత్తమగతినేని సాధింపఁజాలమని మనమందఱ మెఱింగినసంగతియె. పరలోకము లభించుటకు మానవదేహము సర్వవిధముల సహాయపడుచున్నది. ౨౧ ప్రాణులీనరదేహ సహాయముననే సజ్జనులుగను, మహాత్ములుగను, ఋషులుగను, మునులుగను, సిద్ధులుగను, సాధువులుగను, సమాధానులుగను, భక్తులుగను, ముక్తులుగను, బ్రహ్మజ్ఞానులుగను, విరక్తులుగను, యోగులుగను, తపస్వులుగను, తత్త్వజ్ఞానులుగను, యోగాభ్యాసులుగను, బ్రహ్మచారులుగను, దిగంబరులుగను, సన్న్యాసులుగను, షడ్దర్శనులుగను (షడ్దర్శనములు సాంఖ్యము, యోగము, నైయాయికము, వైశేషికము, మీమాంస, వేదాంతము.) తాపసులుగను మాఱిరి. ౨౨-౨౩ ఇందువలననే నరదేహము మిగుల శ్రేష్ఠమైన దనియు నన్నిదేహములకంటె నెక్కువైనదనియుఁ దెలిసికొనఁ గల్గితిమి. మానవదేహమూలముననె యమలోకమునఁ గలుగనున్న యాతనలు తొలఁగిపోవుచున్నవి. ౨౪ నరదేహము మానవునకు సర్వవిధముల స్వాధీనములోనుండునది. ఇతరజీవుల కళేబరములవలె మానవదేహము పరాధీనమైనదికాదు. కాన నీదేహమునుఁ బరోపకారమునఁ బ్రవేశపెట్టి కీర్తిరూపమున దాని సజ్జీవింపఁ జేయుటకు బ్రతిమానవుఁడును యత్నింపనగును. ౨౫ గుఱ్ఱము, ఎద్దు, ఆవు, బఱ్ఱె, మున్నగు ననేకవిధములగు పశువులును, స్త్రీజనము, దాసీసమూహము, మొదలగు వానినొకవేళ యజమానులు దయఁదలఁచి బంధమునుండి విడిచిపెట్టినచో మఱల నెవరోయొకరు వానినిదప్పక పట్టుకొనిపోయి తీరుదురు. ౨౬ కాని యీమానవదేహ మట్టిదిగాదు ఇది తనయిచ్ఛననుసరించి యుంచుకొనవలయునన్న నుండును. వలదన్నఁ దొలఁగిపోవును. దీని నెవ్వరును గట్టివేయఁజాలరు. ౨౭ నరదేహ మొకవేళ కుంటిదైనచో లేక గూని దైనచోఁ బరోప

కారమునందుపకరింపఁజాలదు. ౨౮ అదియొకవేళ గ్రుడ్డిదైనచో నెందులకుఁ బనిరాకపోవును. లేదా చెవిటిదైనచో భగవత్కథలను గూర్చిన సిద్ధాంతములను వినఁజాలదు. ౨౯ మానవదేహము మూఁగదైనచో నెదుటివారికిఁ దనసంశయము దెలుపుటకుఁగాని తానెఱిఁగిన ధర్మము పరులకుఁదెలిపి సందేహనివృత్తి గావించుటకుఁగాని వీలుండదు. అశక్తముగను రోగవంతముగను నుండి చెడిపోయినచో నట్టి మానవదేహ మెందులకుఁగాక వ్యర్థమగును. ౩౦ అటులఁ గాక వివేకహీనమైనను హృద్రోగముగలదైనను నిశ్చయముగ నట్టిదేహము సర్వవిధముల బనికిమాలినదిగా నెఱుఁగవలయును. ౩౧

ఇంతకును దేలినసారమేమనగాఁ — ఇట్లు ఆధివ్యాధిసంబంధమగు లోపములులేక యారోగ్యవంతముగానుండు దేహమును శీఘ్రముగా సాధకుఁడు పరమార్థమార్గమునందుఁ బ్రవేశపెట్టవలయును. ౩౨ శరీరమన్నివిధముల నారోగ్యవంతముగానుండి స్వాధీనములోనున్న తరుణమునందుఁ బరమార్థమునఁ బ్రవేశపెట్టనిమూర్ఖులు తప్పక మాయాజాలమునందు బద్ధులయ్యెదరు. ౩౩ మంటగృహముల నామూర్ఖులు తమవిగ భావించుచుందురు. కాని యాగృహములపైఁ దమకున్నదానికంటె నెక్కువయధికార మితరప్రాణులకున్నదని వారెరుఁగరు. ౩౪ ఎలుకలు, పందికొక్కులు, ఈఁగలు, సాలెపురుగులు, బల్లిపురుగులు, చిమటలు, తేళ్లు, పాములు, బల్లులు, నల్లికండ్లపాములు, చీమలు, ఈలపురుగులు, మొదలగునవి యన్నియు నీయింటిని దమవిగాఁ దలంచుచున్నవి. ౩౫-౩౮ ఇటులె పిల్లి, కుక్క, ముంగిస, దోమ, నల్లి, మిణ్ణల్లి, గోమారి, మొదలగు జీవిసమూహము దీనిని తమయింటిగనే భావించుచున్నవి. ౩౯-౪౩ పశువులు, దాసీజనము, ఇంటిలోనిమనుష్యులు నీగృహమును దమదని యెంచు

కొనుచున్నారు. ౮౪ చూడవచ్చినవారలును, మిత్రులును, గ్రామవాసులుగూడఁ బ్రసంగమునం దీగృహమును దమదనియే చెప్పుచుందురు. ౮౫ దొంగవాఁడు ఈయిల్లునాదనను. ఈయింటిపైనున్న యాజమాన్యమంతయు మాదెయని రాజు చెప్పును. ఇది మనయిల్లు కెమ్ముల భస్మముగావింతమని అగ్నిహోత్రుఁడు నడువుచుండును. ౮౬ ఈవిధముగానందరు ఇల్లుతమదెయని నుడువుచుందురు. మూర్ఖులగు మానవులుగూడ నిల్లుమాదెయని పలుకుచుందురు. కాని యెద్దియేని యాపదవచ్చినపుడు మాయిల్లు మాయిల్లు అనుకొన్న సుమ కారము క్షణములో మటుమాయమగును. మీఁదుమిక్కిలి యపాయభయమున నన్నివిధములఁ బ్రీతిపాత్రమగు గృహమును వాసయోగ్యమగు దేశమునుగూడ విడచి మానవులు పారిపోవుదురు. ౮౭ కొంతకాల మిటుల గృహత్యాగము దేశత్యాగము గావించి తిరిగి చేరరాకున్నయెడల నూరంతయుఁ బాడువడును. ఇండ్లన్నియుఁ గూలిపోవును. అరణ్యజంతువు లాగృహములలో స్వేచ్ఛగా విహారముఁ జేయుచుండును. ౮౮ చీమలు, జెర్రులు, ఎలుకలు, మున్నగు జీవసముదాయమున కిదియె గృహము. ఇందు సందియము కొంచెముగూడ లేదు. పాప మీమూర్ఖమనుష్యు లిన్నివిధముల నాది నాదియని కొట్టుకొన్న గృహములను వదలిపోవుచుందురు. ౮౯ ఇండ్లయొక్కదశ యీ విధముగా స్వల్పభాగ్యముగా మిథ్యగా నున్నది. ఇది యనుభవ పూర్వకముగా నెరింగి చెప్పుచున్నమాట. రెండుదినముల జీవితము ఎచ్చటగడిపిన గడుపవచ్చును. ఎందేని యుండవచ్చును. ౯౦

ఒకవేళ నీదేహమును మనది యనుకొందుమేని యదియుఁ బొసఁగకున్నది. ఏలయన! నిది యనేక జీవులకొఱకు భగవంతుడు నిర్మించియుండునని తలంచుట కవకాశములు గలవు. పేలు మానవుల మస్తకములపయి గృహముల నిర్మించి యందు వసించి రక్తమాంసములను జవిచూచుచున్నవి. ౯౧ రోగగ్రంథు లన్నింటియందును మనకుఁ గానరానివిధమున నెన్నియోపురుగు లంటిపెట్టుకొని కాపురము చేయుచుండును. అదియుగాదు. దేహమున నెందేని గాయము కలిగినయెడలఁ గొలఁది కాలములో నందుఁ బురుగులు పడును. ప్రాణుల యుదరములలోఁ గూడ జంతుసముదాయ ముండును. ఇది యందరు సామాన్యముగ నెరింగిన యంశమె. ౯౨ దంతములలోఁ, గన్నులలోఁ, జెవులలో బురుగులు పడుచుండును. అటులే యొక కీటకవిశేషము (బగ్ధి) మాంసములోనికిఁ జొరబడి కఱచి తినుచుండును. ౯౩ మిణ్ణల్లులు కఱచి రక్తమును దనివితీఱఁ గ్రోలుచుండును. ఒక కీటకవిశేషము (కిలేని) మాంసములోనికి జొచ్చును. దోమ ఉన్నటులుండి బాగుగాఁ గఱచి పారిపోవును. ౯౪ జోరీగలుఁ కందిరీఁగలు మానవుని గుట్టి పలుతెఱంగులఁ బీడించును. కారు దోమలు రక్తమును బీల్చి త్రాఁగుచుండును. తేలు కుట్టియుఁ బాము కఱచియు నానావస్థలఁ బెట్టుచుండును. ౯౫ జననమొందినది మొదలుగా దేహమును మనము పలుతెరంగులఁ గాపాడుచున్నాగము, ఆకస్మికముగా నీదేహమును బులిదీసుకొనిపోయి భుజించును. లేదా తోఁడేలు ఒంటరిపాటునఁ బైఁబడి చంపి భుజించును, ౯౬ ఎలుకలు, పిల్లులు, మానవుని దేహమును గొరికి తినుచుండును. కుక్కలు గుంటనక్కలు మాంసమును దినివేయును. తమ జోలికిఁ బోకున్నను జంపుదురని వెఱచి తమంతనఁ బయిఁబడి యెలుగుబంట్లు కోఁతులు చంపివేయును. ౯౭ ఒంటె నోటితోఁ బట్టుకొని పైకెత్తి నేలపైఁ బడవేయును. ఏనుఁగు చిక్కినయెడలఁ గనికరింపక తొండముతో రెండుగా జీల్చి దేనిపైనేని వేసి మోది చంపివేయును ఎద్దు హఠాత్తుగాఁ బయిఁబడి వాఁడికొమ్ములతో గ్రుమ్మి చంపి

యును. ౬౮ దొంగ బడితెతో లెక్కలేనన్ని దెబ్బలు గొట్టును.
భూతములు భయపెట్టి చంపివేయును. ఏవిధముగాఁ జూచినను ఈ
దేహమునకుఁగల యవస్థ యీ విధముగానున్నది. ౬౯
ఈ మానవదేహము నాది నాది యని మురియుదుముగాని
నిజమునకిది యొక్కరి సొంతసొమ్ముగాదు. బాగుగ యోచించినచో
అనేకులకుఁ జెందియున్నది. అయినను మూర్ఖులీదేహము నాది నాది
యని చెప్పుకొనుటలో సిగ్గుపడకున్నారు. కాని *తాపత్రయములలో
నీశరీరము జీవులన్నిటికి నుమ్మడిగ భుజింపఁదగిన ఫలహారవస్తువని
చెప్పబడియున్నది. ౭౦ దేహమునకుఁగల దురవస్థగమునించి పరమార్థ
మునందుఁ బ్రవేశపెట్టినయెడల నప్పుడు తప్పక సార్థకమగును. లేని
యెడలఁ బైనిపేర్కొనినవియు నింకమనమెఱుంగరానివియు నగు
నవస్థలచే మృత్యుముఖమునఁబడి వ్యర్థమైపోయితీరునని గమనింపుడు.
౭౧ ప్రపంచసుఖములయందుమగ్నులై యుక్తాయుక్త జ్ఞానశూన్యుల
గుమానవు లీమానవదేహములవలని ప్రయోజనముగాఁని పరమార్థ
ముగాని యెఱుంగఁజాలరు. ఇట్టి మూర్ఖుల లక్షణములు సంగ్రహము
గాముందుఁ జెప్పబోవుచున్నారము.

ఒకటవదశకము సమాప్తము.

---

* మూఁడవదశకము 6, 7, 8 సమాసములలో తాపత్రయమును గూర్చిన వివ
రములు చెప్పబడినవి.

రెండవదశకము.

మొదటి సమాసము

మూర్ఖలక్షణము.

ఓగజాననా! త్రినయనా!* ఏకదంతా! నీకు వందనములనొన
రించుచున్నాఁడను. ౧ తొలిపలుకులను గన్నతల్లీ! నలుమోముల
వేలుపు గారవమునఁగన్న నిశు[illegible]! శారదాదేవీ! నీకును వందనముల
నొనరించుచున్నాఁడను. అనుగ్రహశాలినీ భారతీ! పూర్ణమగు వాత్స
ల్యముతోఁగనికరించి నాహృదయమున నివసింపుమని వేఁడుచున్నాఁ
డను. ౨ నాగురుమూర్తి పాదపద్మములను గనులకద్దుకొని నమస్క
రించి నాయిష్టదైవమగు రఘురాముని దివ్యనామమును మనసార
స్మరించి మూర్ఖ లక్షణములను జెప్పుచున్నాఁడను. ౩ మూర్ఖులు
రెండువిధములుగా నుందురు. ఒకతెగవారు సాధారణమూర్ఖులు.
రెండవతెగవారు చదివిన మూర్ఖులు. ఇరువురిలక్షణములు చిత్రవిచి
త్రముగానుండును. వీనినిగూర్చి శ్రోతలుచక్కఁగ విచారణము గావిం
పఁ గోరెదను. ౪ చదివిన మూర్ఖుల లక్షణములు ముందురానున్న
సమాసములలో వివరించెదము. బుద్ధిమంతులగు శ్రోతలారా! సావ
ధానమనస్కులరై రాఁబోయెడి కథాంశము నాలింపఁ గోరెదను. ౫
మూర్ఖలక్షణము లన్నింటిని గడముట్ట నుడువఁదలంచితినేని దాని
కంతముండదు. అవి యనంతములు. కావున వానిలోఁ గొన్నింటిని
మాత్రమె సంగ్రహించి నివేంచెదను. ధ్యానపూర్వకముగా వినవల
యును. ౬ మూర్ఖులన నెవరో తెలుపుట యవసరము. ప్రపంచసుఖ
మగ్నులై సారాసారముల విచారింపని[illegible]నవులును, ఆత్మజ్ఞానమన

---

* త్రినయన పదము వినాయకునకు విశేషణముగఁ జెప్పఁబడెను.

నేమియో కొంచమేని యెరుంగనివారును, పూర్తిగ నజ్ఞానదశ యందున్నవారును మూర్ఖులని తలంచి వారలలక్షణములను దెలుపు చున్నాఁడు. ౭

గడుపారఁగన్నతల్లిని, శ్రేయోవృద్ధుల నారయుచుఁ బెంచిన తండ్రిని సాధింపఁదలంచువాఁడును, స్త్రీనిమాత్రమే మిత్రునిగనమ్మి యితరులయెడ నవిశ్వాసిగాఁ బ్రవర్తించువాఁడును నొకవిధమగు మూర్ఖుఁడు. ౮ తనకుటుంబసంబంధముగల చుట్టపక్కములతోఁ గల చుట్టరికము ద్రెంచుకొని యాఁడుదాని లోఁబడి జీవితమును గడుపు వాఁడును, ఆఁడుదాని కవియినియనక రహస్యములనన్నింటిని దెలియఁ జేయువాఁడును మూర్ఖుఁడు. ౯ కులకాంతనువిడచి పరస్త్రీపయి మరు లుగొని దానితో మెలఁగువాఁడును, దనయిల్లు వాఁకిలి తల్లి దండ్రులను విడనాడి భార్యతో నత్తవారియింట వసించువాఁడును, గన్యయొక్క కులశీలములను గొంచెమేని విచారింపక పెండ్లియాడు నాతఁడును మూర్ఖుఁడు. ౧౦ సర్వవిధములను సమర్థులగు నుత్తమ పురుషులతోఁ బగఁబెట్టుకొని సాధింపఁదలంచుటయు, అట్టిగొప్ప వానితోఁ దాను నన్నివిధముల సమానుఁడనని మిథ్యాభిమానముతో నెంచుటయుఁ, దనయశక్తిని దాను గురుతింపక తనకెంతయో శక్తి యున్నటుల నెదుటివారిముందు నటించుటయు మూర్ఖలక్షణములు. ౧౧ తనను గూర్చి పలువురిముందుఁ దానే కొనియాడుకొనుటయు నెంతటికష్టములు వచ్చినను స్వదేశమును విడువక కూపస్థకూర్మము వలెఁ బడియుండుటయుఁ, బనిలేనిపని మాపూర్వులంతవారు ఇంత వారు, అంతచేసిరి ఇంతచేసిరని కొనియాడుటయుఁ గూడ మూర్ఖ లక్షణములె. ౧౨ కారణములేనిదే పకపక నవ్వునాతఁడును, పెద్దలు చేయు సదుపదేశముల భావమును గ్రహింపనేరని యాతఁడును, బహుజన ద్వేషముతో వర్తించునాతఁడును మూర్ఖుఁడు. ౧౩ తన

వారలనందఱను విడిచిపెట్టి పరులతో స్నేహముజరుపువాఁడును రాత్రులయందుఁ బరులకపకారములు చేయుట కెంతేని సాహసిం చువాఁడును మూర్ఖుఁడు. ౧౪ చాలమంది మనుజు లొకచోటచేరి మెలఁకొనియుండి యిష్టగోష్ఠితోఁ గాలముగడుపునపుడు వారిమధ్యఁ జేరి నిదురబోవుటయు, రెండవవాఁడు పిలిచినదే తడవుగా నతనింటి కేగి పరిమితి లేకుండ భుజించుటయు, ౧౫ తనమానము అవమాన మును బలువురిముందు వెల్లడించుటయు, * సప్తవ్యసనములలోఁ దగు లుకొని యుక్తధర్మము నెఱుంగకుండుటయు, ౧౬ ఎవఁడో తన్నుద్ధరిం చునను దురాశతోఁ దనప్రయత్నమునంతయు మాని తీరికూర్చుండు టయు, ఆలస్యముచేయుటయందే సంతోషముకలదని కార్యనిర్వాహ ణమునం దలసతచూపుటయు మూర్ఖుని లక్షణములు. ౧౭

ఇంటికడ నిటులమాటలాడవలయును, ఈ యుక్తితో జయింపవల యునని యోచించి సభలోనికి వచ్చినంతన వణకుచేతను భయము చేతను నొకమాటయేని పలుకఁజాలక సిగ్గుపడి పోవుటయుఁ దనకంటె నుత్తముఁడగు వానితో నతినీచమగు సంబంధముఁ గలుగఁజేసు కొని వర్తించుటయుఁ, క్షేమార్థియై యెవఁడేని సదుపదేశము గావించి నయెడల నది చెడువుగా మనస్సులోఁదలఁచుటయు. ౧౮ తానుజెప్పి నది విననివాని కేదియేని నేరుపఁ బ్రయత్నము గావించుటయుఁ, బెద్ద లకడఁ దాను జ్ఞానవంతుఁడనిపించుట కేదేదియో వదరుటయు, ఉత్త మశీలురగు యోగ్యులను మోసముచేయుటయు మూర్ఖుని లక్షణ ములు. ౨౦ విషయోపభోగముల ననుభవించుటలో సిగ్గునొందకుం డుటయు, మరియాదనువిడిచి నిరంకుశముగాఁ బ్రవర్తించుటయు, ౨౧ రోగమువచ్చినపుడు తగినమందును బుచ్చుకొననుకుండుటయు,

* జారణము, మారణము, విధ్వంసనము, వశీకరణము, స్తంభనము, మోహ నము, ఉచ్చాటనము ఇవి సప్తవ్యసనములు.

దేహతత్త్వము ననుసరించి పథ్యపానములు జరుపకపోవుటయు, అనాయాసముగా సమకూర్చినపదార్థము గైకొనటకుంటయు మూర్ఖలక్షణములు. ౨౨ వెంట మనుష్యులను సహాయముగా నుంచుకొనక పరదేశములలోఁ బ్రయాణము చేయుటయుఁ, బరిచయము లేనివానిని వెంటనుంచుకొని సంచరించుటయు, నదీకూలముల (బురద)యందు దుముకుటయు, ౨౩ దనను గౌరవించుతావునకు దేపనిగాఁ బలుమారుపోవుటయు, మానాభిమానములనుగూర్చి యజాగ్రత్తగ మెలంగుటయు మూర్ఖల లక్షణములు. ౨౪ ధనవంతుడగువానిని సేవకునిగా నుంచుకొని వాని కనుసన్నలలో సంచరించుటయు, నెల్లప్పుడు పాపభూయిష్ఠమైన హృదయముతోఁ సంచరించుటయు, ౨౫ కారణకార్యముల సంబంధములు బాగుగా విచారింపక యపరాధము లేనిదే శిక్షగావించుటయు, స్వల్పవిషయమున లోభిత్వము ప్రకటించుటయు, ౨౬ దేవతలను బితృదేవతలను బూజింపమియు, శక్తి లేకున్నను వాగ్బలమును జూపుటయు, వ్యర్థముగాఁ గోలాహలము గావించుటయు, ౨౭ ఇంటివారలపై మాటిమాటికిఁ బటబట పండ్లుకొఱుకుటయు, బాపముచరించి యావలదీనత్వమును బ్రకటించుటయు, వెంగలితనమున నోడలెఱుంగమియు మూర్ఖలక్షణములు ౨౬ నీచజాతులతో స్నేహము చేయఁదగదు. పరుని భార్యతో నెంతయవసరమున్నను మాటలాడఁ గూడదు. ఆహారపదార్థములను భుజించుచుఁ ద్రోవలో నడువఁజనదు. ౨౯ పరుల కుపకారము జేయుటకు శక్తియున్నంతలోఁ బాటుపడవలయును. తనకు మేలుజేసినవాని కెన్నఁటికిని గీడు చేయరాదు. చేయునది కొద్దిగను జెప్పునది గొప్పగా నుండకూడదు. ఇట్టి సామాన్యనీతుల నెఱుంగనియాతఁ డొకమూర్ఖుడు ౩౦ క్రోధమును విడువలేకపోవుటయు నదేపనిగ నధికముగా భుజించుటయుఁ సోమరితనముతో నుచితానుచితములు మఱచి పడియుం

డుటయుఁ, పాపకార్యములు ఆచరించుటయు, మనస్సునందుఁ గుటిల చింతతో నుంటయు, ధైర్యము ననునది మందునకేని లేకుండ సంచరించుటయు మూర్ఖలక్షణములు. ౩౧ విద్య, వైభవము, ధనము, పురుషార్థము, సామర్థ్యము, మానము, లేకయే వృథాభిమానమున నేనన్నింటికిని సమర్థుఁడనని విఱ్ఱవీగువాడు ౩౨ నీచుడు, అసత్యవాది, మోసగాడు, దుష్కర్మలొనరించువాఁడు, కుటిలుఁడు, వంచకుఁడు ద్రోహి, నిరంతరము నిదురబోవువాఁడు గూడ మూర్ఖుఁడే. ౩౩ మిగుల నెత్తైన స్థలమునఁ జేరి వస్త్రమును విడిచి కట్టుకొనుటయు, నాలుగు త్రోవలు గలియు (శృంగాటకము) చౌతురాయందుఁ గూర్చుండుటయు దిగంబరుఁడై యెల్లప్పుడు సంచరించుటయు, మూర్ఖలక్షణములు. ౩౪ దంతములుపాచితోడను, నేత్రములు పుసితోడను, ముక్కులు చీమిడితోడను, వస్త్రములు మురికితోడను, పాదములు మంటితోడను నుంచుకొని పరుల కసహ్యముగా సంచరించువాఁడును, ౩౫ వైధృతి, వ్యతీపాతము మున్నగు నిషేధ ముహూర్తములయందుఁ బ్రవాసము గావించుటకు బయలుదేరువాఁడును, అపశకునములు గలిగినను లక్ష్యపెట్టక మూర్ఖించి ప్రయాణముచేసి యాత్మహత్యాతుల్యముగ నపాయములకుఁ బాల్పడువాఁడును, ౩౬ క్రోధము, అవమానము, దుర్బుద్ధి, మున్నగువానికి లోనై తనజీవితమును దాను సర్వవిధముల వ్యర్థము గావించుకొనువాఁడును, నిశ్చలము, దృఢతరమునగు బుద్ధిలేనివాఁడును, ౩౭ దనయెడఁ బ్రేమజూపువారలలో నంతఃకలహములు గూర్చువాఁడును, అట్టివారితోడ్పాటునఁ దానొందినసుఖములను బల్లెత్తి పలుకనివాఁడును, నీచజనులకు వందనముల నొనరించువాఁడును మూర్ఖుఁడు. ౩౮ తనను దాను బహుభంగుల సంరక్షణము గావించుకొనుచుండుటయు, శరణాగతులననాదరభావముతోఁ జూచుటయు, అశాశ్వతమగు సంపదలు

కలకాలముండునవియని తలంచి విఱ్ఱవీగుటయు, ౩౯ ఈభార్యయు నీబిడ్డలే నన్నుద్ధరించువారు ఎవరితో నేమిపని యని దేవునియెడ భక్తిభావము ప్రకటింపమియు, ౪౦ భగవదిష్టమెట్టులున్నదో కార్యఫలమటులుండునను సంగతి నెఱుంగకపోవుట యు మూర్ఖలక్షణములు. ౪౧ స్త్రీలకుఁ బురుషులకంటె భగవంతుఁ డెనిమిదిరెట్లు కామమును గూర్చియున్నాఁడు (స్త్రీణామష్టగుణః కామః) కావున నొక స్త్రీ కొకపురుషుఁడేచాలఁడు అట్టియెడ ననుచితమెఱుంగక బహుభార్యలతో విహరించువాఁడును, ౪౨ దుర్జను మాటలకతన మర్యాదతొలఁగి వర్తించువాఁడును, బట్టపగటనే కనులమూసికొనువాఁడును, ప్రత్యక్షముగాఁ జూచుచున్న మంచివిషయములపై ధ్యానముంచనివాఁడును, మూర్ఖుఁడు, ౪౩ దేవత, గురువు, తల్లి, తండ్రి, బ్రాహ్మణుఁడు, యజమాని మున్నగు పూజ్యులయెడ ద్రోహముదలంచువాఁడును, ౪౪ ఇతరులదుఃఖమును దనసౌఖ్యముగాఁ దలంచువాఁడును, గడచిపోయిన పదార్థములు క్రమ్మఱరాఁజాలవని యెఱింగియు వానికై శోకించువాఁడునుమూర్ఖుఁడు- ౪౫ ఆదరములేనితావునవాయెత్తి మాటలాడరాదు. అడుగకమున్నె సాక్ష్యము జెప్పఁదగదు. నింద్యములగు వస్తువులను గైకొనరాదు. ౪౬ ఉత్తముల మహత్వమును దగ్గించి చెప్పఁగూడదు. సన్మార్గమును విడచి సంచరింపవలదు. దుష్కర్ములతో సహవాసము జేయుట యుచితముగాదు ఈనీతిమార్గముల నెఱుంగనివాఁడు మూర్ఖుఁడు. ౪౭ సత్యమునుదరికిరానీయరు, నవ్వుల కితవులను బరిహాసము లాడుచుందురు. ఇతరుఁడు నవ్వినంతన తగవునకుఁ దలపడెదరు. ౪౮ అనవసరముగా నెంతయోగోల గావింతురు. పనిలేని పనిగ నార్భాటము లొనర్తురు. నోటికి దాళములుబిగించిరేమో యనునటులఁ బల్లెత్తి యొకపలుకేని పలుకఁబోరు. ౪౯ మంచివస్త్రములు ధరింపకున్నను శాస్త్రజ్ఞానములేకున్నను సభలోముందుఁ

గూర్చుందురు. జ్ఞాతులయెడ విశ్వాసముంతురు. ఇట్టివారలందరును మూర్ఖులనియేనామతము. ౫౦

దొంగవానితోఁ దనకుఁగల పరిచయము బహిరంగము చేయువాఁడును కంటికింపైన వస్తువు నెచటనైన నొకచూపు చూచినచో నదియె తనకుఁగావలయునని తలంచువాఁడును, క్రోధాతిశయమున నోడలెఱుంగక తనకుఁదా నహితము గావించుకొనువాఁడును, ౫౧ హీనజనులతో స్నేహము సంభాషణముజరుపువాఁడును, ఎడమచేతితోఁ దినుచు నెడమచేతితో జలముద్రాగుచునుండువాఁడును, ౫౨ సర్వసమర్థుఁడగువానితోఁ బగగొని యోరువలేనితనము బ్రకటించువాఁడును, అలభ్యవస్తువునకై పరితపించువాఁడును, తనయింటిలోఁ దాను దొంగతనము చేయువాఁడును మూర్ఖుఁడు. ౫౩ జగదీశ్వరునిమఱచి మానవునిపయి విశ్వాసముంచువాఁడును, జీవితమును సార్థకముగావింపకయే బ్రతికినంతకాలము గడిపి మరణమునకు సిద్ధమైనవాఁడును, ౫౪ దనచెలికాండ్రయెడఁగల దోసఁగులు లోపములు బహిరంగముచేయువాఁడును, సంసారమునందలి దుఃఖములను సహింపనోపక యీశ్వరుని నిందగావించువాఁడును. ౫౫ కొద్దిపాటితప్పనకేని క్షమించుటయనునది యెఱుంగనివాఁడును. తన తేజమును మాటిమాటికి జూపుటకుఁ దివురువాఁడును, విశ్వాసఘాతుకుఁడై సంచరించువాఁడును మూర్ఖుఁడు. ౫౬ చిరకాలమునుండి తన్ను గౌరవించు సమర్థుఁడగుపురుషు నగౌరవించి యాతనియాదరణమునకు దూరమైనవాఁడును, తనరాకడచే సభకు వివర్ణము నాపాదించువాఁడును, క్షణములోఁ బ్రసన్నశీలుఁడుగను, క్షణములోఁ గోపస్వభావుఁడుగను వర్తించువాఁడును, ౫౭ చిరకాలమునుండి యున్న సేవకుని దొలఁగించి క్రొత్తవానిని నియమించువాడును, సభలలో నెవరేని నాయకత్వము నొసంగకున్నను నాయక

త్వము వహించి నలువురిలోఁ బరిహాసపాత్రుఁ డగువాఁడును మూర్ఖుఁడు. ౫౮ అవినీతితో ధనమును గూడఁబెట్టుటయు, ధర్మమును, నీతిని, న్యాయమును దొలంగి సంచరించుటయు, వెంటనుండెడి మనుష్యులను వేఱుగావించుటయు, ౫౯ నింటియందు సుందరియగు భార్యయుండినను బరస్త్రీగమనము గావించుచుండుటయు, బలువురి యెంగిలిని భుజించుటయు, ౬౦ ధనమును విస్తారముగా సేకరింపఁ బ్రయత్నముచేయుటయు, నితరులధనము నెటులేనిహరించుటలోఁగృషిచేయుటయు, హీనులగువారితో నిచ్చిపుచ్చుకొనుచు వ్యవహరించుటయు ౬౧ అతిథికిఁ బనిపాటలుజెప్పి శ్రమ కలుగఁజేయుటయు, కుగ్రామమునందు నివాస మొనరించుటయు, ఎల్లపుడు విచారముతో, గాలము గడుపుటయు మూర్ఖుని లక్షణములు. ౬౨ నీటియందుఁ బుక్కిలించి యుమ్మివేయుటయుఁ, గాలిపయి జిలపుట్టినపుడు వేరొక కాలితో గోకుకొనుటయు, హీనకులజాతునకు సేవకుఁడుగా నుండుటయు, రెండుచేతులతోనొకేమారు తలగోకుకొనుటయు, ౬౩ ఇద్దరేకాంతముగా నేదియో మాటలాడుకొనునపుడు మూఁడవవాఁడుగా వారిమధ్యఁజేరి ప్రసంగమునందుఁ బాల్గొనఁ బ్రయత్నము చేయుటయు, ౬౪ స్త్రీకిని బాలునకును నోగానించి యెంగిలిసోఁకించుటయుఁ బిచ్చివానికడకుఁ బోయి కూర్చుండుటయు, మరియాదనువిడనాడి కుక్కను బెంచుటయు మూర్ఖునిలక్షణములు. ౬౫ పరస్త్రీలతోఁ గలహముగావించుటయు, నోరులేనిజంతువుల నకారణముగాఁ గొట్టి బాధించుటయు, మూర్ఖులతోడ సహవాసము జేయుచుండుటయు, ౬౬ దూరముగా నిలిచియుండి వినోదముగ యుద్ధరంగములను గాంచుచుంటయు, దానినాపి వేయించుటకుఁ బ్రయత్నింపకుండుటయు, సత్యమును మరుగుపఱచి యసత్యమును గౌరవించుటయు మూర్ఖుని లక్షణములు ౬౭ ఐశ్వర్యము వచ్చినపిమ్మట పూర్వపుఁ

బరిచయము పూర్తిగా మరచిపోవుటయు, దేవతలమీఁదను బ్రాహ్మణులమీఁదను దనయధికారము నిలువంబెట్ట యత్నించుటయుఁ, ౬౮ దః యవసరమునుబట్టి పనియున్నంతవరకు నెదుటివాని యొద్ద వినయవిధేయతలు ప్రకటించుటయు, నితరులకు సాయము చేయవలసినప్పుడు తిరుగఁబడుటయు, ౬౯ చదువునపు డక్షరములను విడిచి వేయుటయు, లేనివి కలిపిచదువుటయుఁ, బుస్తకముపై దృష్టి నుంచకుండుటయు మూర్ఖుని లక్షణములు. ౭౦ స్వయముగా నెప్పుడును జదువకపోవుటయు, ఇతరులను జదువనీయకపోవుటయు, గ్రంథములనెప్పుడును బదిలముగా సంచిలో గట్టియుంచుటయుఁ గూడ మూర్ఖలక్షణములని నాతలంపు. ౭౧

మూర్ఖునిలక్షణము లెటులుండునో కొంతవరకుఁ దెల్పితిని. వివేకశాలియగు మనుజుఁడు ఈలక్షణములను శ్రద్ధతోఁ దెలిసికొని మనస్సులోఁ బెట్టుకొనును. ౭౨ ఇంక నెన్నియో మూర్ఖలక్షణములు గలవుగాని త్యాగము గావించుటకు (విడచిపెట్టుటకు) అనువైన వానిని మాత్రమె నాశక్తికొలఁది తోఁచినంతలోఁ జెప్పితిని. శ్రోతలు మన్నించి గ్రహింపవేఁడెదను. ౭౩ ఉత్తమలక్షణములకు మానవులు ప్రయత్నింపవలయును. మూర్ఖలక్షణములు తమయెడనున్నచోఁ ద్యాగము గావింపవలయును. వచ్చెడిసమాసమునందు ఉత్తమ లక్షణములు వివరింపఁబడినవి. ౭౪

రెండవ సమాసము

ఉత్తమలక్షణము.

శ్రోతలారా! సావధానమతితో నాలకింపుడు. ఇపు డుత్తమ లక్షణములను వివరింపఁ బోవుచున్నాను. సర్వజ్ఞత యేగుణములవలన నలవడునో వానిని దెలిసికొనుట యవసరము. ౧ అడిగి తెలసికొనక యె క్రొత్తమార్గమునఁ బ్రయాణము చేయరాదు. గురుతింపక యే

ఫలమును భుజింపరాదు. పడియున్నపదార్థము నాలోచింపక వెంటనే గ్రహింపఁ జనదు. ౨ మిక్కిలిగా వాదము లాడరాదు. కడుపులోఁ గపట ముంచుకొనఁగాదు. బాగుగా విచారింపక తొందరపడి పని చేయరాదు. కులహీనురాలగుస్త్రీని బెండ్లియాడఁగూడదు. ౩ అడుగనిదె చెప్పుట తగదు. అనాలోచితముగ మర్యాదాహీనముగ సంచరింపఁ గూడదు. ౪ ప్రీతి తన పయిలేని తావున నిష్ఠురములఁ బలుకరాదు. దొంగవానితో నాకునునీకును బరిచయమున్న దిసుమా యని భాషింపరాదు. రాత్రుల యందొంటరిగాఁ ద్రోవలో నడువవలదు. ౫ మనుజులతోఁ నడఁకువ ద్రెంచి భాషింపఁజనదు. పాపపుద్రవ్యము సమకూర్పఁజనదు. పుణ్యమార్గము నెన్నంటికిని విడనాడరాదు. ౬ ఒరులపయి నిందమోపరాదు. అటులెఁ బగదాల్పఁజనదు. దోసమేదియేని తినయెడ నున్నచోఁ దెలిసికొని తొలగించుకొనవలెను. పరధనమునుగాని పరస్త్రీనిగాని బలాత్కారముగా హరింపరాదు. ౭ ఉపన్యాసమధ్యమున వక్తనాక్షేపింపరాదు. ఏకత్వమును (ఐకమత్యభావమును) ద్రెంచివేయరాదు. ఏమైననుసరియే విద్యాభ్యాసము విడువరాదు. నోటిదుడుకుతనముగలవానితోఁ దగవు లాడరాదు. వాచాలునితో (వాగుఁబోతుతో) మిక్కిలిగ భాషింపరాదు. సాధుజనుల సాంగత్యమును విడువఁజనదు. ౯ క్రోధమును మిగులవహింపరాదు. ప్రేమించువారిలో నంతఃకలహములు గలుగఁజేయరాదు. హితము బోధించినయెడల దానిని జెడ్డగాఁ దలంపరాదు. ౧౦ మాటిమాటికి గోపింపరాదు. అసత్యపురుషార్థములగు కథాదికమును గల్పించి బహిరంగపరుపరాదు. తాను జేయనిపని జేసితినని పరాక్రమప్రకటన జేయరాదు. ౧౧ చేసినప్రతిజ్ఞ నెన్నటికిని మఱచిపోకుము. సందర్భము వచ్చినపుడు సామర్థ్యమును జూపుటలో వెనుకడుగు వేయఁబోకుము వ్యర్థముగఁ బెద్దలగువారలను దిరస్కరించి వారలనొప్పింపకుము. ౧౨

ఆలస్యము జేయుటలో సుఖమున్నదని తలంపకుము. ఇతరులపయిఁ గొండెముల నాలింపఁబోకుము. బాగుగావిచారింపని దేపనినిసేని గావింపఁ బోకుము. ౧౩ శరీరమునకు సుఖము నలవాటు జేయకుము, పురుషునకుఁ బ్రియత్నత్యాగము తగనిపని. కష్టములకు నెన్నఁడును భయమునొందకుము ౧౪ సభలో సిగ్గునొందకుము. అర్థములేని వదరుబోతుతనమును వెల్లడింపకుము. ఏమైననుగానిమ్ము. పేచీమాటలు, నొప్పించుమాటలు నుడువకుము. ౧౫ మిక్కిలిగఁ జింతిలకుము. ఆలస్యమున కలవాటుపడకుము. పరస్త్రీలను బాపబుద్ధితో సందర్శింపఁబోకుము. ౧౬ ఎవరివలననేని యుపకారమును గైకొనకుము. ఉపకారము నొకవేళఁ గైకొంటివేని దానికిఁ బ్రతికృతిని జేయుము. ఇతరులకు విచారము గలుగఁజేయకుము. విశ్వాసఘాతకుఁడవనిపించుకొనఁబోకుము ౧౭ అపరిశుభ్రముగా నుండకుము. మురికిబట్టలను ధరింపకుము. పోవుచున్నవారలను మీరెచటి కేగుచుంటిరని యడుగఁబోకుము. ౧౮ పదుగురిలోఁగలసిమెలసియుండుము. అందరకు మంచివాఁడనిపించుకొనుము. స్వల్పఫలము నాశించి పరాధీనుఁడవు కాఁబోకుము. నీభారము నితరులపైఁ బెట్టకుము. ౧౯ పద్దు వ్రాయుట, వ్రాసినపద్దు తెలియజేయుట లేకుండఇచ్చి పుచ్చుకొను వ్యవహారము జరుపకుము. నీచునివద్దనుండి ఋణమును దీసికొనకుము. తగినసాక్ష్యములేనిది తగవు తీర్పుమని రాజసమ్ముఖమునకుఁ బోకుము ౨౦ అబద్ధపుమాటలను జెవిఁ జేరనీయకుము. పలువురొక్కవిధముగాఁ జెప్పుచున్నమాటను గల్ల యనకుము. ఆదరణము లేని స్థలమునఁ గొంచెమేని మాటలాడకుము. ౨౧ మత్సరమునకుఁ గ్రోధమునకు నీ హృదయమునందుఁ దావొసంగకుము. అన్యాయము గనిపింపదేని యెవరికిని బీడఁగూర్పకుము. శరీరబలము అభిమానము పురస్కరించుకొని యవినీతికరముగాఁ బ్రవర్తింపకుము. ౨౨

మిగుల భుజింపకుము, మిక్కిలి నిదురింపకుము, కొండెములఁ జెప్పు వానితో నీకు సంబంధమున్నచోఁ ద్వరలో ముగించుకొనుము. ౨౩ నిన్నుఁ జూచి నీవేమేసి సాక్ష్యము నొసంగకుము. నీకీర్తిని నీవే కొనియాడఁబోకుము. స్వయముగా నీవొక మాట చెప్పి నవ్వకుము. ౨౪ ధూమపానము జేయకుము మత్తువస్తువులను సేవింపకుము. వాగుబోతువానితోఁ జెలిమిగావింపకుము. ౨౫ పనిలేకుండ నుండకుము. నీచవాక్యమును సహింపకుము. కష్టము లేక లభించిన యన్నమును బెద్దలుపెట్టినదైనను దినకుము. ౨౬ నోటినుండి యెన్నడును దిట్టుమాటలను రానీయకుము. ఇతరులయెడఁగల లోపములను గమనించి పరిహసింపకుము. కులముగలవాని విషయమున నీహృదయమందు దుష్టభావము నుంచకుము. ౨౭ ఎవరివస్తువునేని దొంగిలింపకుము. మిగుల లోభభావముతో మెలంగకుము నిన్నుఁ ప్రేమించెడివారితో నెట్టి క్లిష్టపరిస్థితులయందేని పోరాటమునకుఁ గాని కలహమునకుఁగాని దిగకుము. ౨౮ ఎవనికిని శ్రమకలుగనీయకుము. అసత్యపుసాక్ష్యమును దీసికొనకుము. ఎప్పుడును గల్లల నాదరింపఁబోకుము ౨౯ దొంగతనముచేయుటకును గొండెములఁ జెప్పుటకును నలవాటు పడకుము. పరకాంతలఁగూడకుము. చాటున నుండి యితరుల కెట్టి యపకారమునేని కావింపకుము. 30 సమయమువచ్చినపుడు తెగువ గలవాఁడవు కమ్ము. ఏమైనఁగానిమ్ము ధైర్యము నెన్నటికిని విడువఁబోకుము. సత్త్వగుణము వదలకుము. వైరినేని శరణుజొచ్చినయెడల దండింపఁ బాల్పడకుము. 3౧ అల్పమగు ధనమును జూచుకొని మదోన్మత్తుడవుగాకుము. హరిభక్తుఁడనని చెప్పుటలో సిగ్గుపడకుము. పవిత్రాత్ములగు నుత్తములచెంత నమర్యాద ...త్తింపకుము. ౩౨ మూర్ఖునితో నెట్టిసంబంధమునేని కలుగ...నకుము. చీఁకటిలో ...రిపయినేని చేయివేయకుము. పర

ధ్యానముగానుండి జాగ్రత్తతొలంగి నీవస్తువు నెచటనేని మఱచిపోవకుము. 33 స్నానము, సంధ్య లోనగు నిత్యకృత్యములను విడువకుము. కులాచారములను వదలకుము. అనాచారములను వ్యాసంపఁజేయకుము. 3౪ హరికథల నాలించుటలోఁ దనివి నొందకుము. శాస్త్రనిర్ణయములను జవదాటకుము. ప్రపంచసుఖములలోఁ దగులొక్కని పరమార్థమునెడఁ బెడమొగ మిడబోకుము. 3౪ కులదేవతలపయి భక్తివిశ్వాసములను దొలంగఁ బోకుము. స్వధర్మము నెన్నడేని విడనాడకుము. విచారింపక వెఱ్ఱిపట్టుదలతో నీయిష్టమువచ్చినటులఁ బనిపాటల నొనరింపకుము. 3౬ నిర్దయాభావము నవలంబింపకుము జీవహత్య కెన్నఁడు దొరకొనకుము. మేఘ మావరించియుండుటఁ జూచి దూరప్రయాణము గావింప వెలుపలకుఁ బోకుము. చెడ్డసమయములలో (తిథివారనక్షత్రాదు లనుకూలముగ లేనపుడు) ప్రవాసమునకు బోకుము. 3౭ సభాభయము దరిజేర నీయకుము. సమయము వచ్చినపు డేమైనఁ గానిమ్ము ప్రత్యుత్తరము నిచ్చుటలో జంకకుము. ఎదుటివాఁడు ధిక్కరించినంతన పిఱికివై లోఁబడకుము. 3౮ యోగ్యుఁడగు గురూత్తముని నిర్ణయించుకొని కడతేర యత్నింపుము. నీచజాతివానిని మాత్రము గురువుగాఁ గైకొనఁబోకుము. వైభవమున జూచి మురిసి జీవితము శాశ్వతమని విఱ్ఱవీగకుము. 3౬ సత్యమార్గమును విడనాడకుము. అసత్యమునందు దృష్టిని బోనీయకుము. అసత్యము నెట్టితరుణమునందేని యభిమానింపఁ దలంపకుము. ౪౦ అపకీర్తిగలిగినచో నది పోఁగొట్టుకొన యత్నింపవలయును. సత్కీర్తిని మంచికార్యము లొనరించి వృద్ధినొందింపవలయును. వివేకముతో బాగుగా విచారించి సత్యమార్గమేదియో దానిని గనిపెట్టి నిశ్చలబుద్ధితో ననుసరింపుము ౪౧ ఇట్టి యుత్తమగుణముల నలవరచి కొననివాఁడు అవల... లక్షణములు ముందుసమాసములో వివ...

మూఁడవ సమాసము

కువిద్యాలక్షణము.

శ్రోతలారా! మీ కిపుడు కువిద్యాలక్షణముల నివేదించు చున్నాఁడను. శ్రద్ధతో నాలింపుఁడు. అతిహీనములగు కులక్షణములు తమయెడనున్నచో వానిని విడచుటయే త్యాగము. విసర్జనీయము లగు నాయాదుర్లక్షణములను విడచినవాఁడే త్యాగి. ౧ కువిద్యా వంతుఁడగు మానవుఁడు లోకమునజనించి యెంతహానిగావించెనో రాఁబోవు లక్షణముల గమనించితిరేని మీకె తెలియఁగలదు. ౨ కువిద్యావంతుఁడగు ప్రాణి కఠినరూపణమునకు భయపడిపోవును. ఏల యన! వాఁడు దుర్గుణములన్నింటికి రాశి. ౩

* శ్లో. దంభోదర్పోభిమానశ్చ । క్రోధఃపారుష్యమేవచ
అజ్ఞానంచాభిజాతస్య । పార్థసంపదమాసురీం॥
భగవద్గీత అ ౧౬-౪

కామము, క్రోధము, మదము, మత్సరము, లోభము, దంభము, తిరస్కారము, గర్వము, విరుగుబాటు, అహంకారము, ద్వేషము, వివాదము, వికల్పము (అవాంతరకల్పనము) ఆశ, మమత్వము, తృష్ణ, కల్పనము, చింత, కామనము (కోరిక) భావన (తలంపు) ఈర్ష్య, అవిద్య, ఓరువలేమి, వాసన, అసంతృప్తి, ఆసక్తి, ఇచ్ఛ, వాంఛ, సందేహము, నింద, అవినీతి, కృతఘ్నత, నిగంతరనుదోన్మత్తత, అన్నియుఁ దెలియునను దురభిమానము, అవజ్ఞత, విపత్తి, ఆపద, దుర్వృత్తి దుర్వాసన, స్పర్ధ, కలహశీలత, తంపెలమారితనము, ఉద్వేగము, ఆందోళనము కలుగజేయుట, తిరుగుబాటు

---

* దంభము, దర్పము, అభిమానము, క్రోధము, పరుషత్వము, అవివేకము అన్నియు నసురసంపత్తినిబుట్టినవానికి గలుగుచున్నవి.

తనమును నివి యన్నియుఁ గువిద్యావంతునకుఁ గలుగు. పరమ వ్యర్థులు. ౪-౭ కువిద్యావంతుఁడగు ప్రాణి, వికారస్వరూపుఁడుగను, సకలదుర్లక్షణములకు నాటపట్టు గను, శక్తిహీనుఁడై దుర్జనుడుగను, దరిద్రుఁడై కృపణుఁడుగను నుండును. ౮ వాఁడు సోమరిపోతు తనమున దొలుత గణింపఁదగినవాఁడు. తిండిపోతు తనమున వాసిని మించినవాఁడుండఁడు. దుర్బలుఁడైయున్నను క్రోధగుణమును విడ వడు. తుచ్ఛగుణములకు నెలవుగానుండి యెదుటివారిని ఋణములో వలలోన వేసికొనును. ౯ ఇంతియగాదు మూర్ఖులలో వాడు మొద టివాడు. కయ్యములుపెంచి వినోదించుచుండును. వెఱ్ఱివాఁడుగ నసృతవాదిగ వదరుబోతుగ నోటిదుడుకుడుతనము గలవాఁడుగ నుండును. ౧౦ కువిద్యావంతుఁడు తాను స్వయముగా మంచియుఁ జెడ్డయు నెఱుంగఁడు. వినదగినమాటలు పెద్దలెఱింగించినయడల వినఁడు. స్వయముగా వానికేమియుఁ దెలియదు. ఇతరులవద్దకుఁ బోయి నేర్చుకొనడు. సొంతముగా నిర్వహింపఁ బోఁడు. అభ్యాసదృష్టితో నూతనవిషయములు గమనింపడు. ౧౧ జ్ఞానహీనుఁడును నమ్మదగని వాఁడును వితండవాదము గావించువాఁడును, ఎదుటివానిపై లేనిదోషముల నారోపించువాఁడును స్వయముగా భక్తియందు లగ్నము గాని యాతఁడును భక్తులఁ జూచి యాదరింపనివాఁడును కువిద్యా వంతులని యెఱుంగనగును. ౧౨ ఇతరులను నిందజేయువాఁడును కష్టవర్తనముతోఁ గాలయాపనము గావించువాఁడు ఇతరులను హింసించువాఁడు నిరంతరము విచారమగ్నుఁడై యుండువాఁడు క్రూరకర్మము లొనరించువాఁడు కువిద్యావంతుఁడు ౧౩ హీనత్వముగ మెలంగుట, లేనివి కల్పించుట, రోగముతో నెల్లపుడు మూలుగు చుండుట. దుష్కార్యము లాచరించుట, లోభిత్వముగా నుండుట, అధర్మముగా సంచరించుట' మున్నగు దుర్వృత్తులలో సంబంధము

గలుగఁజేసికొనుటయు, ౧౪ అన్నివిధములఁ హీనజన్ముఁడయ్యు నెదుటివారిముందు విఱుగుబాటుతనము గనపఱచుటయు, దప్పుడు ప్రమాణములకుఁ దాను పెట్టినపేరయ్యు బయటికి శ్రీరంగనీతులు చెప్పుటయు, దాను బుద్ధిహీనుఁడు, వివేకహీనుఁడునయ్యు నెదుటివారికి నీతులు గఱపుటయుఁ గువిద్యావంతుని లక్షణములు. ౧౫ నీచుఁడును ఉన్మత్తస్వభావుఁడును పసిపాటలులేకయుండువాడును తిరుగుబోతును పిఱికి పందయునైయుండియు బరాక్రమ విషయిక సంభాషణములు గావించువాడును, ౧౬ వయస్సున జిన్నవాఁడయ్యు గరువమునఁ బెద్దలకంటెఁ గూడఁ బెద్దవాడును విషయాసక్తుఁడును నష్టుఁడును ఇతరుల ద్వేషించువాడును నియమాదులఁ బాలించుటలో విభ్రష్టుఁడైనవాఁడును కువిద్యావంతుడని తెలిసికొనవలయును. ౧౭ అతిశయమగు నభిమానభావము గలవాఁడుగనుండి సిగ్గువడని యాతఁడును, ఋణములపాలుజేసి సంసారమును గూలఁద్రోచినవాఁడును, దుష్టవర్తనుఁడును, డంబములు పల్కుటలో నగ్రేసరుఁడును ముందువెనుకలు విచారింపక యేపనియేని గుడ్డివానివలెఁ గావించువాడును కువిద్యావంతుడు. ౧౮ ఇతరుల మనస్సు నొచ్చునటుల మాటలాడరాదు. వికారముగ బ్రవర్తింపరాదు. ఎదుటివాఁ డొనరించిన మేలు మఱువజనదు. అనృతము లాడగూడదు. తాను సకల దుర్లక్షణములకు నిలయమయ్యు నుత్తములగు నెదుటివారిని ధిక్కరింపఁగూడదు. ౧౯ బయటికి మందమతిగానుండి పనిలేని పనిగా మొండివాదములు చేయఁగూడదు. బయటికి దీనభావమును బ్రకటించుచు నితరుల మనసులు నొచ్చి మర్మభేదములగునటుల భాషింపరాదు. తాను దుర్బలుఁడయ్యు నెదుటివానిని గటువచనములతో నొప్పింపరాదు. ఇట్టి సామాన్యనీతుల నెఱుంగనివాఁడు కువిద్యావంతుడు. ౨౦ కఠినములును, గర్కశములును, గపటము

లును, సందేహజనకములును, దుఃఖకరములు, తీవ్రములు, నగుమాటలఁ బల్కువాఁడును, క్రూరభావము నిష్ఠురాచరణము దురాచారముగలవాఁడును. ౨౧ హీనవాక్యములు, మిథ్యాపవాదములు (అసత్యనిందలు) అశుభవచనములు, నిలుకడలేనిమాటలు, ద్వేషవచనములు, అనృతవాక్యములు వ్యర్థభాషణములు పలుకుచు నితరులను నీవెంత నీవెంతయని తూలనాడువాఁడును కువిద్యావంతుడు. ౨౨ బయటి కొకటిగ లోనొకటిగ సంచరించుట, పెద్దలను దిరస్కరించుట, కుటిలముగా బ్రవర్తించుట, కోపమును సమయముకొఱకు మనస్సునందుఁ బ్రాచుపామువలె దాచియుంచుట, ఊరక గొణుగుకొనుట, అదిగో ఇదిగోనని కాలము గడుపుట, కార్యభంగమొనర్చుట, కోపముతోనుండుట, స్వతంత్రముగనుండి విచ్చలవిడిగా మెలఁగుట కువిద్యాలక్షణము. ౨౩ క్రోధి, తామసి అవిచారి పాపి, అనర్థి, అపస్మారరోగి, భూతావిష్టుఁడు ౨౪ ఆత్మహత్యాపాతకుడు, స్త్రీహత్యాపాతకుఁడు, గోబ్రాహ్మణహంతకుఁడు మాతాపితృహంతకుడు, మహాపాతకుఁడు, పతితుడు అవిద్యావంతుఁడని చెప్పబడును. ౨౫ హీనకార్యము లొనరించుటయు చెడ్డపనులకుఁ బాల్పడుటయు, దురాగతము లొనర్చుటయుఁ దనను నమ్మిన చెలికాండ్రకు ద్రోహముచేయుటయు, ఎదుటివాఁ డొనరించిన మేలును మఱచిపోవుటయు, సవతితల్లితోఁగాని గురుపత్నితోఁగాని పాపముచేయుటయు నరకప్రదములగు కలుషము లాచరించుటయు ఆతతాయిగ వదరుబోతుగా నుండుటయు ౨౬ మంచిని చెడుగుగాఁ దలంచి తగవులకు దండెలకుఁ గొట్లాటలకు పాల్పడుటయు అధర్మము లొనరించుటయు, పనికిమాలినపనులు జేయుటయు, విచారములలోఁ బాల్పంచుకొనుటయు, సాడీలు చెప్పుటయు, దుర్వ్యసనములను విడచిపెట్టలేకపోవుటయు, విరోధమున్న ముందునకు దుముకుటయు, మొద

లగు నవలక్షణములు గలవాఁడు కువిద్యావంతుఁడు. ౨౭ దుష్టుఁడు అపయశస్సునార్జించినవాఁడు, మలినుఁడు, పరులశ్రేయమును సహింపనివాఁడు, స్వైరవిహారము గావించువాఁడు, ౨౮ మోసకాఁడు మూర్ఖుఁడు, పితికిపంద, దురాచారుఁడు, ఆలోచింపక గోత్రదాటుగ వర్తించువాఁడు, దారిదోపిడికాఁడు, నిందల నారోపించువాఁడు. వేదాచారములను బాటింపనివాఁడు, పరద్రవ్యములను దొంగలించువాఁడు కువిద్యావంతుఁడు. ౨౯ బుద్ధిహీనుఁడు అడ్డదిడ్డములు పలుకువాఁడు అడ్డములేకుండ గబగబ వదరువాఁడు వికారముగా నవ్వువాఁడు దుడుకుతనము గలవాఁడు, పాపవృత్తులయెడ మనసుంచువాఁడు, భ్రష్టత్వము నొందినవాఁడు, దుర్బుద్ధిగలవాఁడు కువిద్యావంతుఁడు. ౩౦ పరులఁజంపుట, దోపిడు లొనరించుట, బందిపోటుతనములు చేయించుట, పరులగుండెకాయలనుగాల్చుకొనితినుట, కనబడినవానినెల్ల మోసగించుట, పరస్త్రీలతో భోగించుట, కార్యసాధనమునకై యెదుటివాని నదేపనిగా స్తోత్రముగావించుట. ౩౧ తాను చేయు చెడుపనులకు లోక మేమనునోయని సందేహముగాని సిగ్గుగాని పొందకుండుట, తగవులకు ముందడుగిడుట, నీచబుద్ధి ప్రకటించుట మిగుల మదోన్మత్తుఁడై సంచరించుట, భయములేక మెలంగుట, చదువనిన ఁబెడమొగమిడుట, తగవులన్న జెవులు కోసికొనుట, వికారకార్యములు గావించుట కువిద్యావంతుని లక్షణములు. ౩౨ ధైర్యములేనివాఁడు, పగసాధింపదలఁచువాఁడు, అనాచారముగనుండువాఁడు, గ్రుడ్డివాడుగ కుంటివాఁడుగ గూనివాఁడుగ జెవిటివాఁడుగ శ్వాసరోగిగ దగ్గురోగిగ నుండియు గరువమును గొంచమేని విడిచిపెట్టనివాఁడు, ౩౩ విద్యాహీనుఁడు వైభవహీనుడు కులహీనుఁడు ఐశ్వర్యహీనుఁడు శక్తిహీనుఁడు సామర్థ్యహీనుఁడు భాగ్యహీనుఁడు బిచ్చమెత్తుకొని బ్రతుకువాఁడు కువిద్యావంతులని తెలిసికొన

వలయును. ౩౪ బలహీనుఁడు కళాహీనుఁడు ముద్రాహీనుఁడు దీక్షాహీనుఁడు లక్షణహీనుఁడు లావణ్యహీనుఁడు అంగహీనుఁడు సౌందర్యహీనుఁడు. ౩౫ బుద్ధిహీనుఁడు యుక్తిహీనుఁడు ఆచారహీనుఁడు ఆలోచనాహీనుఁడు క్రియాహీనుఁడు సత్త్వహీనుఁడు వివేకహీనుఁడు సంశయగ్రస్తుఁడుగ మానవుఁడు మాఱుట కువిద్యాఫలమే. ౩౬ భక్తిహీనుఁడు భావహీనుఁడు జ్ఞానహీనుఁడు వైరాగ్యహీనుఁడు శాంతిహీనుఁడు క్షమాహీనుఁడు అందరికంటెను హీనుఁడు నగుట కువిద్యాప్రభావముననే. ౩౭ సమయాసమయములును, ప్రసంగమును, ప్రయత్నమును, అభ్యాసమును, విన్నపమును మిత్రత్వమును గమనింపనివాఁడును దౌర్భాగ్యులలో నొకడని చెప్పదగినవాఁడును ౩౮ ఇంతియగాదు పూర్వోక్తములైనవెగాక యింకను నిట్టివెయగు నవలక్షణములకు నెలవుగ నుండువారలను గువిద్యావంతులని శ్రోతలు గ్రహింపగోరెదను. ౩౯ కువిద్యాలక్షణములను బాగుగాగ్రహించి వానిని బూర్తిగాఁ దప్పక విడిచిపెట్టవలయును. దురాగ్రహముతో నుచితానుచితము లెఱుంగక వానినే పట్టుకొని ప్రేలాడుట శ్రేయోదాయకము గాదు. ౪౦

నాలుగవసమాసము

భక్తినిరూపణము.

పూర్వజన్మములలో నొనరించిన నానావిధములగు సుకృతఫలముగా నీ మానవజన్మము లభించినది. ఆసుకృతముగూడ మహత్తరము పవిత్రము నయ్యేనేని యీ దేహము సన్మార్గమునందు లగ్నమగును. ౧ నరదేహము లన్నింటిలో బ్రాహ్మణజన్మము మిగుల శ్రేష్ఠమైనది. అందుఁగూడ స్నానము సంధ్య సదుపాసన ఈశ్వరభజనాసక్తి పూర్వజన్మపుణ్యమున్నఁగాని యలవడవు. ౨ పరమాత్మునియెడ భక్తిగలిగియుండుట సర్వోత్తమమగు పని. అందు

సత్సమాగమము లభించినయెడలఁ జెప్పవలసిన దేమున్నది! సమ
యము సార్థకమగును. ఇదియే మానవజన్మము నెత్తుటవలనఁ గలి
గిన పరమలాభము. ౩ భక్తి యభివృద్ధి నొందించుకొనవల
యునన్నచోఁ బ్రేమయొక్కయుఁ బ్రీతియొక్కయు సద్భావము
పెంపొందింపవలయును. భక్తులతోఁ గలసిమెలసి యుండుటవలనను,
హరికథామహోత్సవములు జరుపుటవలననుగూడ భక్తి యభి
వృద్ధినొందును. ౪ నరదేహము నొందినందులకుఁ బరమదుర్లభమైన
పరలోకమునార్జించుటకుఁ గొంచెగనో గొప్పగనో యత్నించి జీవి
తమును సార్థకము గావించుకొనవలయును. ఇది యత్యావశ్యకమగు
పని. ౫ సులభసాధ్యమగు విధిననుసరించి వేదవిహితమగు బ్రాహ్మణ
కర్మము., దానధర్మములు, భగవద్భజనము నొనరింపవలయును. ౬
సంసారదుఃఖముల ననుభవములోనికిఁ దెచ్చుకొని యనుతప్తుఁడై
మానవుఁడు సర్వసంగపరిత్యాగము గావింపవలెను. లేదా భక్తియో
గమునేని స్వీకరింపవలయును. దయాదానధర్మములు తొలఁగకుండు
టయు భగవంతుని దివ్యనామము భజనముగావించుటయు నావ
శ్యము. అట్లుకాదేని సాధుసాంగత్యమునేని జేయవలయును. ౭
అనేక శాస్త్రములను బాగుగాఁ బఠించి తత్త్వమును జక్కగాఁ
దఱచి యెరుంగవలయును. పాపములు నశించుటకై పుణ్యతీర్థము
లను దర్శింపవలయును. మహామంత్రములను బురశ్చరణము గావింప
వలెను. ౮ శక్తియున్నంతలోఁ బరుల కుపకారము జేయుచుఁ బెద్దల
కడ జ్ఞానవిచారము గావించుచు అధ్యాత్మనిరూపణమునందుఁ
బాల్గొని సారాసారముల విచారించి గ్రహించుచుఁ గాలము గడుప
వలయును. ౯ మనుజుఁడు జ్ఞానాధికారి కావలయునన్నచో వేదముల
యాజ్ఞలను బాలింపవలయును, కర్మకాండమును ఉపాసనాకాండ
మును ఆచరణ[illegible] బెట్టవలెను. ౧౦ ఓమానవుఁడా! నామాటలు

శ్రద్ధగా వినుము. తనువు, మనస్సు, వాక్కు, పత్రము, పుష్పము,
ఫలము, జలము మొదలగువానిలో నీకేదిలభించునో దానిని బర
మాత్మునికి సంతుష్టికలుగుటకై సమర్పించి నీజీవితమును సార్థకము
గావించుకొనుము. ౧౧ ఈలోకమున నీవు జనించినందులకు ఫలము
ధర్మకర్మములొనరించుచు భగవంతుని యనుగ్రహము సంపాదించు
కొనుటయే! అట్టి సత్కర్మములు గావింపకుందువేని వ్యర్థముగా
నీభూదేవికి భారముగూర్చినవాఁడ వయ్యెదవు. ౧౨ కొంతలోఁ
కొంతయేని యాత్మహితముకొఱకుఁ బ్రయత్నము చేయవలయును.
తనువును హృదయమును సమర్పించి శక్తికొలఁది యీశ్వరకార్య
ములు గావించుట మానవజీవితమునకుఁ బ్రధానధర్మమని యెరుం
గుము. ౧౩ ఇట్టి ధర్మములను ననుసరించి సంచరింపని మనుష్యుని
మృతప్రాయునిగ భావింపుము. వానిజన్మము వ్యర్థముగాఁ దల్లికి
శ్రమగూర్చుటకె. ౧౪

సంధ్య జ్ఞానసంపాదనము దేవభజనము దేవతార్చనము
మంత్రము జపము ధ్యానము మానసపూజ భక్తి ప్రేమ నిష్ట
నియమము అతిథుల నభ్యాగతుల నాదరించుట సద్బుద్ధి సద్గుణ
ములు లేనివారు భక్తులని చెప్పఁదగరు. నిరంతరము హరికథా
పరతంత్రులై వర్తింపనివారలును ఆధ్యాత్మికవిషయములను బెద్దలవలన
శ్రద్ధనై వినని వారలును యోగ్యులగువారితోఁ జెలిమిగావింపనివార
లును పరిశుద్ధాంతఃకరణముతో సంచరింపనివారలును మిథ్యామద
లోలురై యుండి కైవల్యమును గాంచనివారలును భక్తియోగము
నకుఁగలమహత్త్వ మేమెరుంగుదురు? నీతి న్యాయము పుణ్యక్రియ
లొనరించుశక్తి యుక్తాయుక్తము నెరింగి మెలంగుట పరలోకసాధ
నము విద్య వైభవము చాతుర్యము కళాపరిచయము సరస్వతీ
రమ్యవిలాసము (రసగ్రహణకౌశలము) శాంతి క్షమ (సహనము)

దీక్ష మైత్రి శుభాశుభసాధనము మున్నగునవి లేనివారు భక్తులని యెన్నటికినిఁ జెప్పఁదగరు. శుచి స్వధర్మనిర్వాహణము ఆచారము ఆలోచనము ఇహలోకచింతనము పరలోకచింతనము కర్మనిర్వాహణము ఉపాసనము జ్ఞానము వైరాగ్యము యోగము ధైర్యము మున్నగుసుగుణములు మందునకైన లేనివాఁడెన్నటికిని భక్తుఁడు కాఁజాలఁడు. ఇచ్ఛవచ్చినటుల సంచరింపకుండుట ఉపరతి (నిలుపుదల) త్యాగము, సల్లక్షణము, ఆదరభావము పరమేశ్వరుని యెడఁబ్రియభావము, పరులశ్రేయోవృద్ధుల కంతఃకరణమున నానందించుట పరోపకారమునఁ గలుగు సౌఖ్యము గురుతించుట హరిభక్తిలేశము ననునివి లేనివారు భక్తులెన్నఁటికిని గాఁజాలరు. ఇంతియెగాదు ఇట్టివారలందఱును జీవన్మృతులు (బ్రతికియుండియుఁజచ్చినవారు). పవిత్రహృదయులగు పుణ్యాత్ము లిట్టివారితో సంభాషణముగూడఁ గావింపఁజనదు. ౧౫–౨౬ పూర్వజన్మములయందు బుణ్యసామగ్రి గడించినవారలకు భగవద్భక్తి తనంతన యేర్పడును. తరువాత వారి వారి యాచరణముల కనుకూలముగ ఫలమొందుదురు. ౨౭

ఐదవ సమాసము

రజోగుణనిరూపణము.

ఈదేహము సత్వము రజస్సు తమస్సు అను మూఁడు గుణములతోఁ గూడియున్నది. మూఁడుగుణములలో సత్వగుణ ముత్తమమైనది. ౧ సత్త్వమువలన మానవుఁడు భగవద్భక్తిని రజోగుణమువలనఁ బునరావృత్తిని (మరల మనుష్యజన్మమును) తమోగుణమువలన అధోగతిని బొందుచున్నాఁడు. ౨

* శ్లో॥ ఊర్ధ్వంగచ్ఛంతిసత్త్వస్థాః మధ్యేతిష్ఠంతిరాజసాః
జఘన్యగుణవృత్తిస్థా అధోగచ్ఛంతి తామసాః
భగ. అధ్యా. ౧౪-౧౮

వానిలోఁగూడ శుద్ధము శబలము అను రెండుభేదములు గలవు. నిర్మలభావులగువారు శుద్ధులు. శబలగుణులు బాధకులు. ౩ విచక్షణులగు నోశ్రోతలారా! ఇపుడుశుద్ధసత్త్వగుణులయొక్కయు శబలసత్త్వగుణులయొక్కయు గుణములను సావధానమతితో నాలకింపఁగోరెదను. శుద్ధగుణసంపూర్ణులై వర్తించువారు పరమార్థప్రియులుగను శబలగుణపూర్ణులై మెలఁగువారు సంసారలోలురుగను నుందురు. ౪ సాంసారికులగు జనులస్థితి చెప్పుచున్నాఁడ. సంసారుల దేహములయందు మూఁడుగుణములువర్తించును. వానిలో నొకగుణ మెప్పుడు విశేషితమగునో యప్పుడు తక్కినరెండుగుణములు తగ్గిపోవును. ౫ రజోగుణము తమోగుణము సత్త్వగుణములవలననే మానవజీవితము నడుచుచుండును. ఇపుడు రజోగుణకార్యస్వరూపమును దెలియఁ జెప్పెదను. ౬ రజోగుణము దేహమునందుఁ బ్రవేశించినంతన మనుజుఁ డెటులఁబ్రవర్తించునో యావిషయము నేర్పరులగు శ్రోతలు సావధానమతితో వినియెదరుగాత. ౭

ఈయిల్లునాది. గృహస్థత్వము నాయది. ఈశ్వరుఁ డేమి పదార్థము అని తనలోఁ దాము నిశ్చయించు వారు రజోగుణులు. ౮ తల్లి, తండ్రి, స్త్రీ, బాలుఁడు, మనుమఁడు, బాలిక వీరలను గూర్చి వీరల శ్రేయోభివృద్ధులను దలంచి నిరంతరము చింతించుచుండువాఁడు రజోగుణుఁడు. ౯ సుఖముగా భోజనము గావించుట జలము గ్రోలుట తృప్తిదీర వస్త్రాదులు ధరించుట సేలువలుగప్పు

---

* సాత్వికులు దేవాదిలోకముల నొందుచున్నారు. రజోగుణముగలవారు మనుష్యలోకమునందు మనుజులుగా జన్మించుచున్నారు. నికృష్టవ్యాపారమునందున్న తమోగుణస్థులు పశ్వాది జన్మములను నరకములను జెందుచున్నారు.

కొనుట ఇతరులపదార్థముల నభిలషించుట మున్నగునవి రజోగుణ
లక్షణములు. ౧౦ దానధర్మములు జపధ్యానములు పాపపుణ్య
ములు మున్నగువానినిగూర్చిన విచారము గావింపకుండుటయు,
౧౧ తీర్థవ్రతముల అతిథిఅభ్యాగతుల నెరుంగకుండుటయు, హృదయ
మనాచారమునందు లగ్నమైయుండుటయు, ౧౨ ధనమును ధాన్య
మును ప్రోగుచేయుటయందుఁ దీవ్రకృషి యొనర్చుటయుఁ, బరమ
లోభియై మెలంగుటయు ౧౩ నేను పడుచువాఁడను నేను సుంద
రాకారుఁడను నాయంత బలవంతుఁడు లేఁడు నాయంతనేర్పరి
లేఁడు నేను అందఱికంటె గొప్పవాఁడను అని చెప్పుకొనుటయు,
౧౪ నా దేశము నా గ్రామము నాభవనము నానివాసము మాత్రమె
నాకుఁ గావలసినదని తలంచుటయు రజోగుణలక్షణములు. ౧౫
తాను సుఖముగనుండవలయును. ఎదుటివాఁడు సర్వవిధముల నాశ
నముగావలయునని కోరుటయు ౧౬ కపటము మాత్సర్యము తిర
స్కారము కామవికార ముప్పొంగుచుండ నితరులకు నెగ్గుగావించు
టయు ౧౭ తమబాలురపయి మిక్కిలి మమతవహించుటయు స్త్రీల
యెడ మిగుల వలపుగలిగియుండుటయుఁ దన చుట్టపక్కములపయి
విశేషముగాఁ బ్రేమయుంచుటయు ౧౮ తనకుఁ బ్రియులగువారికి
మేలుచేయ నమితముగాఁ జింత హృదయమునం దుంచుకొనుటయుఁ
రజోగుణలక్షణములు. ౧౯ సంసారసంబంధములగు ననేకవిపత్తుల
నుండి తొలఁగి సుఖపడు విధమెద్దియాయని మిగులఁ జింతించు
టయు ౨౦ మొదటఁ దానొందినసంకటములను మాటిమాటికి
జ్ఞాపకమునకుఁ దెచ్చుకొని యెల్లప్పుడు దుఃఖముల నొందుటయు,
౨౧ పరులవైభవములను దిలకించి మనస్సున నాశపడుటయు, ఆశా
కారణమున నిరంతరముదుఃఖమొందుటయు, ౨౨ తాను జూచిన
మంచివస్తువులన్నియు లభింపవలయు ననుకొనుటయు లభింపనియెడలఁ

బరితపించుటయు రజోగుణలక్షణములు. ౨౩ హాస్యము వినో
దము హేళనము మున్నగువానికై వేడుకపడుటయు నిరంతరము
శృంగారగీతములను బాడుచుండుటయు మఱియు రాగరంగముల
యందును తానమానములయందును హృదయము నిలుపుటయు.
౨౪ కొండెములుచెప్పి నిందించి వైకమత్యముగలతావున తగవులు
సమకూర్చుటయు దనకుఁ దెలసినరహస్యములను బహిరంగమొనరిం
చుటయు. ౨౫ గార్యనిర్వహణమునందు సోమరిపోతుతనముగ నుం
డుటయు హృదయరంజకములగు క్రీడలలోఁ దన్మయుఁడై యుండు
టయు రజోగుణలక్షణములు. ౨౬ కళావంతులయొక్కయు (వేశ్య
లయు) బహురూపులయొక్కయు (పగటివేషధారులయు) నటకుల
యొక్కయుఁ గ్రీడలను దిలకించుటలో నాసక్తుఁడై యుండు వాఁడును
బహువిధములగు నృత్యములు గావించువారికిఁ దానుగడించిన
ధనము వ్యయము గావించువాఁడును రజోగుణుఁడు. ౨౭ మత్తువస్తు
వులను సేవించుటలో నుత్సాహము, నిరంతరము సంభోగమును
స్మరించుచుండుట నీచసాంగత్యమునందుఁ బ్రీతి, ౨౮ దొంగతనమును
గూర్చిన యుత్సాహము ఎదుటివాని హీనత్వము నాలించుటలో
జెప్పుటలో సంతోషము, నిత్యనియమములను దొలగుట, ౨౯ పర
మాత్మునికొఱకు ధ్యానము జేయుటలో సిగ్గుపడుట కడుపుకక్కుఱ
తికై యెంతటికష్టములనేని సహించి నిబ్బరించుట, ప్రపంచమునెడ
ప్రేమభావము ప్రకటించుట యనునివియెల్ల రజోగుణలక్షణములు.
౩౦ మధురవస్తువులుగల యాహారమును భుజించుటలో విశేషించి
యాసక్తిగలిగియుండువాఁడును మిగుల నాదరభావముతో దన కళేబర
మును బోషించుకొనువాఁడును, ఉపవాసమనిన బ్రాణాంతకముగ
భావించి జీవితములో నుపవసించుట యెఱుంగనివాఁడును ౩౧ శృం
గారవిషయములను బ్రియతరములుగా భావించువాఁడును, భక్తినై

రాగ్యములను ప్రియకరములుగాఁ దలంపనివాఁడును, కళాసౌందర్యములయందు హృదయము లీనము గావించి యొడలెఱుంగనివాఁడును, ౩౨ పరమాత్మ్మని నెఱుంగ యత్నింపక నిరంతరము సంసార సంబంధములగు వస్తువులపయి ప్రేమగలిగి యుండువాఁడును. ఎఱింగియుండియుఁ దనను జన్మమృత్యు భ్రమణమునఁ బడవేసికొను వాఁడును రజోగుణుఁడు. ౩౩

మోహకారణమున నీరజోగుణము జన్మమును మరణమును మానవులకు సమకూర్చుచున్నది సంసారబద్ధులగు రజోగుణులను శబలులని గ్రహింపవలయును. వీరలు దారుణదుఃఖముల ననుభవింపఁ బాల్పడుచున్నారు. ౩౪ ఇప్పుడీ రజోగుణ మెంతదనుక విడువదో మానవుఁ డంతదనుక నీ సంసారబంధమును విడువ జాలడు. ప్రపంచమునందు మానవుని విషయాదిక వాసన లంటియే యుండును. వీనినుండి బయటబడుట కుపాయము లేమేని గలవాయని విచారించుట యవసరము. ౩౫ విషయవాసనలనుండి బయట బడుటకు భగవద్భక్తియే తగినసాధనము. మానవుడు విరక్తుఁ డగుట శ్రేయోదాయకము. ఒకవేళ విరక్తుఁడు కాఁజాలఁడేని యథాశక్తిని భగవద్భజనము చేయుచుండవలయును. ౩౬ దేహము మనస్సు వచనము పత్రము పుష్పము ఫలము జలము మున్నగువానిలో నేదిసాధ్యమైన దానిని హృదయపూర్వకముగాఁ బరమేశ్వరార్పణము గావించి జీవితమును మానవుఁడు సార్థక మొనరించుకొనవలయును. ౩౭ శక్తికి సాధ్యమగునంతలో దానముచేయుటయు బుణ్యకార్యము లొనరించుటయు నావశ్యకధర్మము భగవంతునియం దనన్యభక్తిగలిగియుండుటయు సుఖదుఃఖములు సంభవించినప్పుడు దైవచింతనము గావించుటయుఁ గర్తవ్యము. ౩౮ ఆదియందును అంతమునందును నీశ్వరుఁ డొకఁడె. మాయ యీమధ్యనే తగులుకొని

యున్నది. కావున నీశ్వరునియందే పూర్ణభావమునుంచి కడతేఱవలయును. ౩౯ ఈశబల రజోగుణ లక్షణములను సంక్షేపముగా వివరించితిమి. పరమార్థము లభింపవలయునన్న మానవుఁడు సర్వవిధముల యత్నించి శుద్ధరజోగుణము నాశ్రయింపవలయును. ౪౦ శుద్ధ రజోగుణలక్షములనుసత్త్వగుణములనుజెప్పునపుడు తెలియఁ జేసెదను. శుద్ధరజోగుణము పూర్ణముగా భజనము గావించుట కుపకరించును. ౪౧ శ్రోతల కిప్పటికి రజోగుణలక్షణములు బోధపడియుండునని విశ్వసించుచున్నాఁడను. కావున నికముందుఁ దమోగుణమును వివరించి చెప్పుచున్నాఁడను. శ్రద్ధతో నాలింపఁ గోరెదను. ౪౨

ఆఱవసమాసము

తమోగుణనిరూపణము.

ఇంతకుమున్ను క్రియాయుక్తమగు రజోగుణముల లక్షణములను సాకల్యముగా నెఱింగించితిని. ఇపుడు తమోగుణలక్షణములను దెలుపుదును. వినఁ గోరెదను. ౧ సంసారమునం దేదేని దుఃఖము గలిగినతోడనే ఖేదముగాని క్రోధాతిశయముగాని కలిగెనేని యది తమోగుణ లక్షణమని గ్రహింపనగును. ౨ క్రోధము గలిగినపుడు తల్లి, దండ్రి, బంధువులు, తోఁబుట్టువు, స్త్రీ మున్నగువారలను గొంచెమేనివిచారింపక మోదుటయు, ౩ క్రోధాతిశయమున నొడలెఱుంగక యితరుల ప్రాణములను దీయుటయుఁ దనప్రాణములనుగూడఁ గోలుపోవుటయు, ౪ క్రోధావేశము కలిగినపుడు ప్రతిక్రియగావించుటకై పిశాచమువలెఁ దిరుగుటయు, బహువిధోపాయములతో నెదుటివానికి ఘాతగావించుటయు, ౫ తనదేహమును దానుశస్త్రముచే ఛేదించుకొనుటయు నితరులను గూడ నిర్దయగా ఛేదించుటయుఁ దమోగుణలక్షణము. ౬ యుద్ధములను వినోదముగాఁ జూచుటకు

రణరంగమునకుఁ బోవుటయు, ౭ నిరంతరము భ్రాంతిగానుండుటయుఁ, దానొనరించిన ప్రతిజ్ఞ నిర్వహింప లేకపోవుటయు, మిక్కుటముగా నిదురబోవుటయు, ౮ ఇదితియ్యనిది ఇది చేదు అనువిచారమును బెట్టుకొనకుండఁ జిక్కినవస్తువుల నెల్లవిశేషించి భుజించుటయు, మిక్కిలి మూఢుఁడై యుచితానుచితముల నెఱుంగక ప్రవర్తించుటయు, ౯ తాను విశేషముగాఁ బ్రేమించువాఁడు కాలవశమున మరణించినయెడల నతనికై ప్రాణత్యాగము గావించుటయు నాత్మహత్య యొనరించుటయు ౧౦ పురుగులు చీమలు ఇంక నితరాటవికజంతువులు మున్నగువానిని వధించుటలోఁ బ్రీతియు, అత్యంతనిర్దయాళుత్వము కలిగియుండుటయుఁ దమోగుణ లక్షణములు. ౧౧ ద్రవ్యముకొఱకు స్త్రీలను, బాలురను, బ్రాహ్మణులను, గోవులను హత్యగావించుటయు, ౧౨ ఏదేని బాధలోఁ జిక్కుకొని విషమును దిన నుత్సహించుటయు, ఇతరులప్రాణములను దీయఁదలంచుటయు, ౧౩ హృదయములోఁ గపటమునుంచుకొని ఇతరులను సర్వనాశన మొనరించుటయు, ఎల్లప్పుడు మదోన్మత్తుఁడై ముక్కోపియై యుండుటయు ౧౪ కలహమున, కయ్యమున నిచ్చ గలిగియుండుటయు, మనస్సులోఁ ద్వేషముగలిగి వర్తించుటయు, ౧౫ యుద్ధములను దిలకించుటయు, యుద్ధవార్తల నాలించుటయు యుద్ధము స్వయముగా నొనరించి మరణించుటయుఁ బరులనుజంపుటయుఁ గూడఁ దమోగుణ లక్షణములె. ౧౬ మత్సరగ్రస్తుఁడై భక్తిని విడనాడుటయు, దేవమందిరములను గూల్చుటయు, పండిన పండ్లతో నలరారుచెట్టుల మొదలంట నఱికించుటయు, ౧౭ సత్కర్మముల నొనరించుటలో నాసక్తి లేక పోవుటయు, నానావిధములగు దోషములు యోగ్యములుగా స్ఫురించుటయు, హృదయమునందుఁ బాపమన్న భయములేకపోవుటయుఁ దమోగుణ లక్షణములు. ౧౮ బ్రాహ్మణులజీవనాధారములను జెడఁగొట్టుటయు ప్రాణు

లను దుఃఖింపజేయుటయు, జీవలోకమున కషాయముఁ గలుగజేయుటయు, ౧౯ కొంపలుగాల్చిగాని, శస్త్రములతో దెగనఱికిగాని విషప్రయోగము గావించిగాని, పరులను భౌతికోపాయములచే మత్సరమునఁ దెగటార్చుటయుఁ దమోగుణ లక్షణములు. ౨౦ ఇతరుల దుఃఖమునుగాంచి యానందించుట, నిష్ఠురముగాఁ బ్రవర్తించుట, పరులసొమ్ములు దొంగిలించుట, ప్రపంచములోని వారేమను కొందురోయని జంకకుండుట, ౨౧ ఇతరులు తమలోఁ దాము తగవులాడునటులఁ జేసి వినోదించుట, మనఃపూర్వకముగా దుర్బుద్ధితోఁ జరించుట ౨౨ సంపదలతో విఱ్ఱవీగుచు సామాన్యప్రజల కెగ్గులాచరించుట, హృదయములో జాలిలేక మెలంగుట మున్నగులక్షణములు గలవారలు తమోగుణులు. ౨౩

దైవభక్తి, సద్భావము, పుణ్యతీర్థసందర్శనము అనువాని యెడ శ్రద్ధయు, వేదశాస్త్రాదుల నెఱింగి మెలంగుటయు, ౨౪ స్నానసంధ్యాదుల నియమానుసారముగ నాచరించుటయు, స్వధర్మమును విడనాడకుండుటయు సాధారణముగ నెవరియెడ లేదో వారు తమోగుణులు. ౨౫ తనకంటెఁ బెద్దవాఁడగు సహోదరునియుఁ దల్లిదండ్రులయొక్కయు మాట లాలింపకపోవుటయు క్షణక్షణమునకుఁ గోపమునొందుటయు, ౨౬ సోమరిపోతుతనమున దేహము గదలింపక కూర్చుండి యదేపనిగా భుజించుటయు, నేదేని యోజింపఁజాలకుండుటయు, ౨౭ చేతపడులు చేయుచుండుటయు, శస్త్రప్రహారము లొనరించి పరుల నొప్పించుటలో నాసక్తియుఁ దురాచరణములయందు (కుస్త్రీలయందు) ఆదరభావముగ నుండుటయు, ౨౮ దేవతలకొఱకు వీపులలో రంధ్రమును జేసికొని అంకుశమునుఁ దగిలించుకొనుటయు (దీనినేసిడియందురు), మండుచున్న యగ్నికుండములోఁ గూర్చుండుటయుఁ గాష్ఠయంత్రమును నాలుకకు గ్రుచ్చుకొను

టయు మున్నగు కృత్యములు తమోగుణ లక్షణములు. ౨౯ కుంపటిలో బొగ్గులను మండించి తలపయినిడుకొనుటయుఁ, గాగడాలతో దేహమునంతయుఁ గాల్చుకొనుటయు, స్వయముగా వాఁడియగు నస్త్రముతో గాయములగునట్లు కొట్టుకొనుటయు, దేవతాప్రసన్నముకొఱకు కిట్టిమాయలనన్నింటి నాచరించుటయుఁ ౩౦ దలనుగోసి తనయిష్టదైవములకు నివేదనము గావించుటయు, నితరవిధములలో నేదైన నాచరించి తనదేహమును దేవతల కర్పించుటయు ఎత్తుమీఁదనుండి జారి (భృగుపాతము) క్రిందఁబడి చచ్చుటయు నీవిధములగు పనులనాచరించి మరణించుటయుఁ దమోగుణ లక్షణములు. ౩౧ నిగ్రహించియగ్నిపయిఁగూర్చుండుటయుఁ, దన్నితరులచే బంధింపఁజేసికొని పడియుండుటయు, దేవతామందిరద్వారమునఁ బ్రాణత్యాగము నొనరించుటయు, ౩౨ నిరాహారముగా నుండుటయుఁ, బంచాగ్నుల మధ్యను వసించి దేహమును గాల్చుటయుఁ, బొగద్రావుటయుఁ, దనను భూమిలోఁ బ్రాతిపెట్టించుకొనుటయు, ౩౩ సకామములగు (కోరికలనిచ్చు) మంత్రములను అనుష్ఠించుటయు వాయువును దేహములో నాపియుంచుటయు దేవత యావేశించెనని కదలమెదలక పడియుండుటయుఁ దమోగుణ లక్షణములు. ౩౪ గోళ్లను వెండ్రుకలను దీర్ఘముగాఁ బెంచుటయు, తన చేతిని క్రిందికి వ్రాల్పక పయికెత్తుకొని తిరుగుటయు, నెవ్వరితోడను మాటలాడక మౌనవ్రతముతో నుండుటయు, ౩౫ నిగ్రహమున కభ్యాసపడి తనశరీరమును దానుపీడించుకొనుటయు దేహదుఃఖముతో శ్రమనొందుటయుఁ, గోరికల సమకూర్పలేదను కోపముతో దేవతావిగ్రహములు పగులఁగొట్టుటయుఁ దమోగుణ లక్షణములని యెఱుఁగవలయును. ౩౬ దేవతానిందనము గావించుటయు అశలకు లోనై పాపము లాచరించుటయుఁ, బనికిమాలినవాఁడుగ నుండుటయు, సాధువులను సజ్జనులను బ్రేమింపక

స్నేహముచేయక యుండుటయు ఆచారముగాఁ గలవార్తలు తమోగుణప్రధాన పురుషులు. ౩౭

తమోగుణవర్ణనము పూర్తిగాఁ జేయనెంచినయెడల నది మిగుల విస్తరమగును. అందుచే త్యాగము (విడువఁదగినవి తెలియు) కొఱకుఁ గొంచెముగా నిచ్చట నిరూపణము గావించితిని. ౩౮ ఈ తమోగుణము పతనకారణము. అనఁగా నధోగతినిగూర్చునది. మోక్షమీతమోగుణము నాశ్రయించినవారి కెన్నఁటికిని లభింపదు. ౩౯ తమోగుణానుసారముగఁ జేయఁబడు కర్మములఫలితములు మిగులచెడ్డవిగా గణింపబడును. దీనివలన జన్మమృత్యువుల మూలమెన్నఁటికిని నశింపఁజాలదు. ౪౦ జన్మమరణములు నష్టముకావలయునన్న సత్త్వగుణప్రధానుఁడు కావలయును. ముందుసమాసములో దాని నిరూపణము గావింపఁబడును గాన వినఁగోరెదను. ౪౧

ఏడవ ప్రకరణము

సత్త్వగుణనిరూపణము

దారుణదుఃఖదాయకమగు తమోగుణము నింతకుముందు సంగ్రహముగా వర్ణించితిని. కాన నిపుడు పరమదుర్లభమగు సత్త్వగుణమునుగూర్చి చెప్పుచున్నాను వినుఁడు. ౧ సత్త్వగుణము భజనకాధారము. యోగులకు సహాయకరము. దుఃఖదాయకమగు సంసారమునుండి మానవుల నుద్ధరించును. ౨ దీనివలన మనుజులకు ఉత్తమగతి లభించును. భగవంతునితోఁ గలియఁదగుమార్గము సత్త్వగుణము నాశ్రయించినంతన సుబోధ మగును. సాయుజ్యముక్తి (పరబ్రహ్మములో లీనమగుట) లభించును. ౩ సత్త్వగుణము భక్తుల కాధారముఁ సంసారసాగరమునుండి బయటపడవలయు ననుకొన్నచో సత్త్వగుణము నాశ్రయింపక తప్పదు. దీనిమూలముననే మోక్షలక్ష్మి లభిం

చును. ౪ పరమార్థము దీనివలననే లభించును. మహాత్ములకునిది భూషణము. దీనిమూలముననే రజోగుణమును తమోగుణమును నాశనమొందుచున్నవి. ౫ పరమసుఖకారకము, ఆనందతరంగము, జన్మమృత్యునిరాకరణము, ౬ అజ్ఞానసంహారణము, పుణ్యప్రకాశము, పరలోకసాధనము నగు సత్త్వగుణప్రభావము నెంతని కొనియాడ గలను. ౭ పూర్వోక్తములగు సత్త్వగుణములు గలమానవుని నడ వడి యంతయు నెటులుండునో వివరించెద. ౮

సత్త్వగుణకారణమున నీశ్వరునియందు బ్రేమగలుగును. ప్రపంచవ్యవహారమంతయు లౌకికముగాఁ గాన్పించును. వివేకమెల్లప్పుడు కరతలామలకముగా నుండును. ౯ సంసారదుఃఖమును మఱువ వలయునన్న సత్త్వగుణప్రధానుఁడు కావలెను. నిర్మలమగు భక్తి మార్గము సత్త్వగుణసహాయముననే మానవున కలవడును. భజన భావముగూడ సత్త్వగుణమువలననే కలుగును. ౧౦ పరమార్థము నందుఁ బ్రీతియు భక్తియందుఁ బ్రేమయుఁ బరోపకారమునం దాసక్తియు సత్త్వగుణముచేతనే కలుగును. ౧౧ మనుష్యుఁడు స్నాన సంధ్యాదిసత్కర్మము లాచరించి పుణ్యశీలుఁడగుటకును, అంతఃకరణమును బరిశుద్ధముగానుంచి శరీరమును వస్త్రముల సుందరముగా నుంచుకొనుటకును, ౧౨ యజ్ఞయాగాదిక్రతువులను తాను స్వయముగాఁ జేయుటకు,నితరులను బ్రోత్సహించి చేయించుటకును, వేదశాస్త్రాదులను జదువుటకును నితరులచేఁ జదివించుటకును, దానము పుణ్యము స్వయముగాఁ జేయుటకును నితరులచేఁ జేయించుటకును సత్త్వగుణము ప్రధానహేతువు. ౧౩ సత్త్వగుణప్రధానుఁడగు మానవునకు [illegible]త్మికనిరూపణమునందు మనసులగ్నమగును. హరికథలన్న నాసక్తి కలుగును, సదాచరణమునం దుత్సాహము కలుగును. ౧౪ సత్త్వగుణమువలన మానవుఁడు, అశ్వదానము, గజదానము గోదా

నము, భూదానము, వివిధములగు రత్నదానములు గావించును. ౧౫ ధనదానము, వస్త్రదానము, అన్నదానము,ఉదకదానము, బ్రాహ్మణ సంతర్పణములు, ౧౬ కార్తికస్నానము, మాఘస్నానము, వ్రతము, ఉద్యాపనము,దానము, తీర్థయాత్ర, ఉపవాసము వీనిని నిష్కామబుద్ధి మానవుఁడు సత్త్వగుణసహాయమునఁ గావించుచున్నాఁడు ౧౭ సహస్ర జనసమారాధనము, లక్షజనసమారాధనము, బహువిధములగు దానములు మున్నగువానిని నిష్కామబుద్ధితోఁ జేయుట సత్త్వగుణుని లక్షణము. ఇవికామ్యబుద్ధితో నాచరించుట రజోగుణుని లక్షణము. ౧౮ తీర్థస్నానములయందు భూదానములు గావించుటయు, నెడారులలోఁ జెఱువులు బావులు త్రవ్వించుటయు,మందిరములకు ఆలయములకుశిఖరములుగట్టించుటయుసత్త్వగుణ లక్షణము. ౧౯ దేవస్థానములు, నివసించుటకువలయు వసతిగృహములు, సోపానములు నిర్మించుటయు, ఆలయమున దీపమాలను సమర్పించుటయు, దులసి, రావి మున్నగువానికి అరుగులు వేయించుటయు సత్త్వగుణునిలక్షణములు. ౨౦ వనము, ఉపవనము, పుష్పవాటిక, కూపము, తటాకము, మున్నగువానిని నిర్మించుటయు,మునీశ్వరుల హృదయములకు సంతుష్టి గావించుటయు ౨౧ సంధ్యావందనము నియతకాలమున నాచరించుటయుఁ, దాపసులకు గుహలు నిర్మించుటయు,నదీతీరమునందు సోపానములు కట్టించుటయు, దేవాలయములయందు సత్త్రువులను నెలకొల్పుటయు సత్త్వగుణుని లక్షణములు. ౨౨ అసంఖ్యాకములగు దేవాలయములయం దఖండదీపములను బెట్టించుటయు, దేవున కలంకారములు సమర్పించుటయు ౨౩ గడియారము, మ[illegible] తాళము, తాషామార్ఫ, సగారా, సన్నాయి, మున్న[illegible] ములగు సుందరవాద్యములను దేవమందిరములలో నుంచుటయు, ౨౪ ఇవిగాక యింకననేక విధములగు సుందరవస్తువులను దేవాల

యములలో నుంచుటయు, స్వయముగా హరిభజనమునందుఁ దత్పరుఁడై వర్తించుటయు సాత్త్విక లక్షణము. ౨౫ ఛత్రము, సుఖాసనము, తాంబూర, పతాకము, చిహ్నము, చామరము, సూర్యపానము, మొదలగు వస్తువులను దేవాలయమునకు దానమిచ్చువాఁడును ౨౬ బృందావనమును వేయువాఁడును, రంగమాలలను నిర్మించువాఁడును, దేవమందిరమునందు సమ్మార్జనము గావించువాఁడును సాత్త్వికుఁ డనఁబడును. ౨౭ బహువిధములగు దేవపూజోపకరణములను, మండపమును చాందినీని ఆసనమును దేవాలయముల కర్పణము గావించుటయు ౨౮ దేవునికొఱకు నానావిధములగు భోజనములను నివేదనము గావించుటయు, నూతనములు అపూర్వములు నగు ఫలములను సమర్పించియు, ౨౯ దేవస్థానమునందు భక్తిపూర్వకముగా నెట్టినీచసేవనైనఁ గావింప నొడంబడుటయు, స్వయముగా దేవమందిర ద్వారముల నూడ్చుటయు, ౩౦ పర్వతిథులయందును, మహోత్సవములయందును నుత్సాహముతో భగవత్సేవలోఁ బాల్గొనుటయు, తనువు, వాక్కు మున్నగు నింద్రియములను బరమాత్మ సమర్పణము చేయుటయు సత్త్వగుణలక్షణములు. ౩౧ హరికథయందు దత్పరుఁడైయుండి చందనము, హారములు, బుక్కా (గంధపొడి) ధరించి నిరంతరము నిలువఁబడియుండుటయు సాత్త్వికలక్షణము..

ఈప్రకారముగాఁ బురుషుఁడుగాని స్త్రీగాని శక్తికొలఁదిగ సామగ్రినిగైకొని దేవస్థానమునందు సిలిచియుండుటసత్త్వగుణునిలక్షణము. ౩౩ తానుజేయుచున్న మహాకార్యము నాపివేసి భగవంతుని సాన్నిధ్యమునకు నరుదెంచుటయు అంతఃకరణమునందు భక్తిగలిగియుండుటయు, ౩౪ గొప్పతనము విడనాడి నీచకృత్యములఁ గయికొని భగవత్సేవకయి దేవమందిరద్వారమున నుండుటయు ౩౫ దేవతలి

ధ్యానించుచు నుపవసించుటయుఁ దాంబూలాదులఁ గైకొనకుండుటయు, నిత్యము తప్పక జపసంధ్యాదుల నొనరించుటయు సత్త్వగుణునిలక్షణములు ౩౬ ఇతరులతో నెన్నఁడును గటువుగామాటలాడకయెఱుంగనివాఁడును, నియమముతప్పక మెలంగువాఁడును, యోగుల నర్చించి సంతుష్టిపఱచువాఁడును, ౩౭ అభిమానమును విడనాడి నిష్కామభావముతోఁ బరమాత్ముని దివ్యనామమును * గీర్తనగావించువాఁడును, భగవత్కీర్తనసమయమున భక్తియుఁ బ్రేమయు నతిశయించి స్వేదము రోమాంచము దాల్చువాఁడును ౩౮ హృదయమునం దీశ్వరుని ధ్యానముగావించుచు నానందబాష్పముల విడచి దేహస్మృతిమఱచి సంతోషముతో వర్తించువాడును, సత్త్వగుణుఁడు. ౩౯ హరికథయందు మిగుల నాదరభావము గలిగియుండుటయు నిత్యము హరికథ నుత్సాహముతో నాలకించుటయు ఆదినుండి యంతముదనుక హరికథనాలించునపుడు ప్రేమ వృద్ధియగుచుండ నానందతరంగములలో నోలలాడుటయు సత్త్వగుణలక్షణములు. ౪౦ నోటితోఁ బరమాత్ముని దివ్యనామము నుచ్చరించుచుఁ జేతితోఁ గరతాళములను వాయించుచు నృత్యము చేయుచుండువాఁడును, భగవంతుని బిరుదముల భజనమునం దేమరనివాఁడును సాధుజనుల పాదధూళిని గైకొని తలపయిధరించువాఁడును, సత్త్వగుణుఁడు. ౪౧ దేహాభిమానము విడిచి, విషయసుఖములయెడ విరాగము గడించి, మాయను మిథ్యగాగ్రహించి వర్తించువాఁడు సత్త్వగు

* మహారాష్ట్రప్రాంతములందుఁ బ్రజలకు సదుపదేశము నొసఁగుటకై కీర్తనముగావించెడిప్రణాళిక మిగులఁ బ్రాచీనకాలమునుండి వచ్చుచున్నది. కీర్తనకారుఁడు ధార్మికములును, నైతికములునునగు పదములతోఁగూడిన సుస్వరగానమును గావించి వానిపయి వ్యాఖ్యానమిచ్చును. మృదంగము, తాంబూర, కరతాళము, వాద్యములుగూడ వీరివెంట నుండును. కీర్తనకారు నాప్రాంతములలో హరిదాసుఁడని చెప్పుదురు. పెక్కుమంది హరిదాసులు ఆర్థికదృష్టిలోదనుగొందఱు, నిష్కామభావమునను దేవమందిరములలో హరిభజన మొనర్చుచుందురు.

ణుఁడు. ౪౨ "సంసారబంధనములలోఁ జిక్కుకొనుటవలన లాభమేమున్నది? దీనినుండి ముక్తినొందుట కేదేనియుపాయము కలదేమో కనుగొనవలయును." అని తలంచువాఁడును. ౪౩ సంసారమనినంతన మనస్సులో భయమొందుచు భజనము జేసికొన్నచోఁ దరింపఁగలమని తలంచుచు వర్తించువాఁడును సత్త్వగుణుఁడు. ౪౪ తనయాశ్రమమును తద్ధర్మమునునిర్వహించుచు సదా రామునియెడఁ బ్రీతిగలిగి వర్తించువాఁడును, విషయసుఖములయెడ సంపూర్ణమగు నసూయగలవాఁడును, ముఖ్యముగాఁ బరమార్థమునెడ మానసము లగ్నముగావించుకొని సంచరించువాఁడును, ఆపదలయందు ధైర్యముగలిగి ప్రవర్తించువాఁడును సత్త్వగుణుఁడు. ౪౫-౪౬ ఎల్లపుడు కార్యదక్షుఁడుగ నుండనివాఁడును బహువిధములగు భోజనములపయి నాసక్తితోలంగించుకొనువాఁడును, భగవద్భజనమునందు హత్తుకొన్న మనస్సుగలవాఁడును నగుమానవుఁడె సత్త్వగుణుఁడు, ౪౭ సంసారసంబంధములగు వస్తువులమీఁదికి మనస్సు పోనీయకుండువాఁడును, భగవంతుని దృఢమగు భక్తితో స్మరించువాఁడును ౪౮ లోకులు తనపయి నెన్నివిధములగు దోషములారోపించుచున్నను విస్తారముగా వారలను ప్రేమించువాఁడును, హృదయమునందుఁ బరమాత్ముని నిశ్చయరూపమును బాదుకొనఁ జేసినవాఁడును ౪౯ తన హృదయములోఁ దాను నేనెవఁడనని తలంచువాఁడును సత్స్వరూప చింతనముగావించువాఁడును, దుష్టములగు సందేహముల నివారించుకొనువాఁడును సత్త్వగుణుఁడు. ౫౦ ఈ దేహమునకుఁ గొంచెమేని సార్థకత్వము సమకూర్పవలయునను కోరిక హృదయమునందుఁ గలవాఁడును, ౫౧ శాంతియు, క్షమయు, దయయు, నిశ్చయము, హృదయమం దుదయించినయాతఁడును, ౫౨ అతిథిని అభ్యాగతుని ఆకలితోఁ బోవనీయక యాదరించువాఁడును, శక్తికొలఁది దానము గావించువాఁడును సత్త్వగుణుఁడు. ౫౩ దీనుఁడగు బిచ్చగాఁ డాశ్రయించుకొని వాఁకిలిముందుఁ బడియుండ నాదరించుటయు, ౫౪ ఇంటియందాహారము తక్కువగానున్నప్పుడు సైతము దీనులను గృపతో దిలకించుటయు శక్త్యానుసారముగాఁ ద్యాగముగావించి యితరులను మన్నించుటయు సత్త్వగుణునిలక్షణములు. ౫౫ రుచిని జయించి మధురాదివస్తువులపయి మమకారము లేనివాఁడును విషయసుఖములయందుఁ గోరిక లేనివాఁడును కామ్యములు లేనియాతఁడును, ౫౬ కాఁగలది కాకమానదు, జరుగవలసినది జరుగకపోదు, సంసారసంకటములు వచ్చుచుఁ బోవుచుండును అనుకొని యీశ్వరునియెడ హృదయము నిరంతరము నిలుపువాఁడును సత్త్వగుణుఁడు. ౫౭ ముఖ్యముగా భగవంతునికొఱకుఁ దనకున్నదంతయు విడచివేయుట, దేహమునెడ మమకారము లేకుండుట, ౫౮ విషయముల వైపు వాసన పరుగెత్తుచున్నను జంచలింపకుండుట, అచలమగు ధైర్యముతో నుండుట సత్త్వగుణలక్షణము. ౫౯ ఆపదవలన దేహము కృశించుచున్నను, ఆకలిదప్పులవలన దహ్యమానమై మనస్సు పట్టుదప్పినను, నిశ్చలభావముతో నుండువాఁడును, ౬౦ శ్రవణము, మననము నిదిధ్యాసనము (మఱిమఱి తలంచుట) వలన హృదయమునకుఁ సమాధానము కలిగినవాఁడును, విశుద్ధమగు నాత్మజ్ఞానముతో నొలంగునాతఁడును సత్త్వగుణుఁ డనఁబడును. ౬౧ అహంకారము లేకపోవుటయు, వైరాగ్యముతో విలసిల్లుటయుఁ గృపాభావముతోఁ దక్కటిజీవుల నారయుటయు ౬౨ అందఱితో నమ్రతగ సంభాషణము గావించుటయు, మర్యాదతోఁ బ్రివర్తించుటయు అందఱకుఁ దృప్తికరముగా మెలఁగుటయు సత్త్వగుణములు గలవానిలక్షణము. ౬౩ అందఱియెడ మిత్రభావముగలవాఁడై యెవరితోనైనఁ బగఁబెట్టుకొనక పరోపకారముకొరకు జీవము నర్పణముగావింప నేర్చి ౬౪ తనపనికంటె నితరునిపనియెడ శ్రద్ధ విశేషముగానుంచి నెరవేర్చుచు

మరణాంతమున భూలోకమునందుఁ దననిర్మలకీర్తిని విడిచిపోవువాఁడు సత్త్వగుణుఁడు. ౧౫ ఇతరులగుణదోషములను మనస్సునందునుంచని యాతఁడును, సముద్రములో నేదైనవస్తువును వేయ నదియెట్లు వెలుపలకుఁగొనివచ్చునో యటులె యితరులగుణదోషములను హృదయమునందు నిలుపనివాఁడును ౧౬ నీచవచనములను సహించుటయు, వానికిఁ బ్రత్యుత్తరమునీయకుండుటయు వచ్చినక్రోధము నుపసంహరించుకొనుటయు నభ్యాసముగాఁ గలవాఁడును సత్త్వగుణుఁడు. ౧౭ అన్యాయముగా నీవు దోషివని యెవఁడైన బాధించినను బహువిధముల దుఃఖపెట్టినను సహించి మనస్సులో నుంచుకొననివాఁడును ౧౮ పరోపకారముకొఱకు దేహకష్టమును సహించువాఁడును దుర్జనులయెడ సైతము చెడునడవడి ప్రకటింపనివాఁడును నిందించువానికి గూడ నుపకారముగావించువాఁడును సత్త్వగుణుఁడని చెప్పబడును. ౧౯ మనస్సును ఇతరవస్తువులమీఁదకు విషయేచ్ఛలమీఁదికిఁ బోవనీయక యాపుకొనుటయు, నింద్రియ నిగ్రహము నొనర్చుటయు, ౨౦ ఉత్తమకర్మముల నాచరించుటయుఁ జెడ్డకర్మములను త్యజించుటయు భక్తిమార్గము నెడ నాదరముంచి నడచుటయుఁ ౨౧ ప్రాతఃకాలముననే స్నానము గావించుటయుఁ బురాణశ్రవణము నాదరభావముతో నొనర్చుటయు బహువిధములగు మంత్రములతో దేవతార్చనము గావించుటయుఁ ౨౨ పర్వకాలముల యందును పూజాసమయముల యందును నుత్సవములను భగవత్ప్రీతికయిగావించుటయు జయంతి యుత్సవముల యెడ నభిమానభావము ప్రకటించుటయు సత్త్వగుణుని లక్షణములు. ౨౩ విదేశములయందు మరణించిన దిక్కులేనివారలకు సంస్కారములు గావించుటయు, లేదా స్వయముగా నచ్చటకుఁబోయి కూర్చుండి యవసరకృత్యంబులు నిర్వహించుటయుఁ ౨౪ బలువు రొకనిని గొట్టుచున్నప్పుడు పోయి విడిపించుటయును ప్రాణిని బంధనమునుండి తొలంగించు

టయు ౨౫ నిరంతరము శివార్చనము నియతిప్రకారము చేయుటయు లక్షలకొలఁది బిల్వపత్రములను సమర్పించుటయు శివున కభిషేకము శాస్త్రవిధి ననుసరించి గావించుటయు భగవన్నామ స్మరణమునందు విశ్వాసము గలిగియుండుటయు భగవద్దర్శన సమయమున స్థిరభావముతో నుండుటయు సత్త్వగుణుని లక్షణము ౨౬ సాధుజనులనుగాంచి యానందించుటయు సాహసించి తొలుదొలుత వారికి భక్తిభావముతో నమస్కరించుటయు ౨౭ సాధుజనుల యనుగ్రహమునకుఁ బాత్రుఁడగుటయు సత్త్వగుణశాలి లక్షణము. సత్త్వగుణవంతుఁడు ఈశ్వరాంశసంభూతుఁడు. ౨౮ జనులకు సన్మార్గము జూపించుటయు మానవులకు హరిభజనమునం దాసక్తి కలుగఁజేయుటయు అజ్ఞానులకు విజ్ఞానము నేర్పుటయుఁ ౨౯ పుణ్యసంస్కారములు ప్రదక్షిణములు నమస్కారములు గావించుటలో నాసక్తియు బహువిధములగు నుత్తమవిషయములు జ్ఞప్తియందుంచుకొనుటయు సత్త్వగుణుని లక్షణము. ౩౦ భక్తివిషయమునం దుత్సాహము, గ్రంథములు మున్నగువానిని సేకరించుటయు, లోహవిగ్రహములను నానావిధములఁ బూజించుటయు ౩౧ నిర్మలమగు పూజాసామగ్రియు, మాలికలు, ఉత్తరీయము, ఆసనము, పవిత్రోజ్జ్వలమగు వస్త్రము మున్నగువానిని సమకూర్చుటయు ౩౨ ఇతరుల శ్రమకుఁ దాను వగచుటయు నితరుల యానందమును గాంచి సుఖించుటయు మహాత్ముల విరాగమునుగాంచి సంతసించుటయు ౩౩ పరులసౌఖ్యము తనసౌఖ్యముగను పరులదూషణము తనదూషణముగను భావించుటయు నితరుల దుఃఖముగాంచి తాను దుఃఖించుటయు సత్త్వగుణుని లక్షణము ౩౪

నిష్కాముఁడై పరమాత్మను భజించుటయు, ధర్మకార్యములను గావించుటయు, సత్త్వగుణుని ప్రధాన లక్షణములని

యెఱుంగవలయును. ౮౫ సత్త్వగుణుఁడె మానవలోకమును సంసారసాగరమునుండి దరికిఁ జేర్పఁదగినవాఁడు. ఆతనివలననే జ్ఞానమార్గ మలవడి వివేక మతిశయించును. ౮౬ సత్త్వగుణమువలనభగవద్భక్తియు, జ్ఞానప్రాప్తియు, సాయుజ్యముక్తియు లభించును. ౮౭ ఇంతవఱకు సత్త్వగుణమునుగూర్చి సంక్షేపవృత్తాంతమును నా బుద్ధ్యనుసారముగ వివరించితిని. ఇఁకముందు శ్రోతలు చెప్పఁబోవు వర్ణనాంశమును ధ్యానదృష్టితో నాలకింపఁ గోరెదను. ౮౮

ఎనిమిదవసమాసము.

సద్విద్యానిరూపణము.

శ్రోతలారా! సద్విద్యా లక్షణముల నాలకింపుఁడు. ఈ లక్షణములు పరమపవిత్రములు. వీనినివిచారించినయెడల మనుజుఁడు తనంతటతానే సద్విద్యావంతుఁడగును. ౧ సద్విద్యావంతుఁడగు మానవునియెడ నుత్తమలక్షణములు విశేషముగా నుండును. ఇట్టి యుత్తముని గుణగణముల నాలకించినచోఁ బరమసంతోషముకలుగును. సద్విద్యావంతుఁడు వృద్ధికాముఁడును సత్త్వగుణ ప్రధానుఁడును ప్రేమస్వరూపుడును శాంతిశీలుఁడును క్షమాగుణుఁడును దయాభావుఁడును సత్కర్మతత్పరుఁడును అమృత వచనుఁడును నగును. ౩ సద్విద్యావంతులగు పురుషులు పరమసుందరులై చతురులుగను మిగులబలవంతులై ధీరులుగను పరమధనవంతులై యుదారులుగను నుందురు. ౪ సద్విద్యాకారణమున మానవులు పరమవిజ్ఞానులుగను, భక్తవతంసులుగను మహాపండితులుగను, విరక్తిశీలురుగను, మహాతపస్వులుగను శాంతమూర్తులుగను, నుందురు. ౫ ఇంతియగాక వక్తలుగను నిరాశాయుక్తులుగను నుండి కీర్తిగడింతురు. సర్వజ్ఞులైయుండియును సద్గ్రంథములను సాదరభావముతో

శ్రవణము గావించుచుందురు. శ్రేష్ఠులైయుండియు నందఱియెడ విధేయతను గలిగియుందురు. ౬ సద్విద్యావంతులు దామురాజులముగదాయని విఱ్ఱవీఁగక ధర్మస్వభావముతో వర్తింతురు. శూరులమని గరుపింపక వివేకముతో. మెలఁగుదురు కోడెతనమున నుంటిమని పొంగక నియమానుసారముగ సంచరింతురు. ౭ పెద్దలు చూపినమార్గము ననుసరించుటయుఁ గులాచారము ననుసరించి ప్రవర్తించుటయు నుచితమగు భోజనముగావించుటయు, వికారరహితముగ వర్తించుటయు, వైద్యులైయుండి పరోపకారము నొనర్చుటయు యశోవంతులై యుండుటయు సద్విద్యావంతుని లక్షణము. ౮ పాటుపడి పనిచేయువారుగనుండి దురభిమానము ప్రకటింపమియు గాయకులుగ విష్ణుభక్తులుగ నుంటయు వైభవమున్నదని గరువింపక భగవత్కథల నాదరముతో నాలించుటయు, ౯ తత్త్వవిదులైయుండియు నుదాసీనభావము వెల్లడించుటయు విశేషజ్ఞులై యుండియు సజ్జనులుగ నుంటయు, మంత్రాంగములెఱింగి గుణవంతులుగను నీతిమంతులుగను నుండుటయు సద్విద్యావంతునిలక్షణము. ౧౦ సాధుశీలము, పవిత్రవర్తనము పుణ్యకర్మాచరణము, అంతశ్శుద్ధి, ధర్మప్రియము, కృపాళుత్వము, కర్మనిష్ఠ స్వధర్మాచరణమునందు నిర్మలస్వభావము, లోభరహితవృత్తి గలవారును, ప్రమాదమున ననిష్టమగు కార్యమేదియేని గావించియందులకుఁ బశ్చాత్తాపము నొందుచుండువారును ౧౧ పరమాత్మునియెడఁ బ్రీతియు సన్మార్గాచరణము సత్క్రియా ప్రియత, ధారణ(భగవంతునిదప్ప మఱియొకటి యెఱుంగమి)ధృతి(ధైర్యము) శ్రుతి (వినికి)స్మృతి (తలంచుట)లీల, యుక్తి, స్తుతి, మతి, పరీక్ష, మున్నగు నుత్తమవిషయములయందు నభిరుచియుఁ గలవారు సద్విద్యావంతులు ౧౨ దక్షులు, ధూర్తులు, (సభ్యులు Gallant) యోగ్యులు, తార్కికులు, సత్యవంతులు, సాహిత్యవంతులు, నియ

మము నిర్వహించువారు భేదము నెఱింగినవారు, కుశలులు, చపలులు, చమత్కారశీలురు, నగువారు సద్విద్యావంతులు. ౧౩ ఆదరణము, సన్మానము, తారతమ్యము, మర్యాద, ప్రయోగము, సమయము, ప్రసంగము, కార్యకారణచిహ్నములు, నెరింగిన వారలును, విచక్షణగా మాటలాడుట ౧౪ సావధానభావము, ప్రయత్నలోలత్వ సాధకత్వము గలవారలును, వేదములను శాస్త్రములను సవిమర్శముగా నెఱుంగువారును నిశ్చయాత్మకములగు జ్ఞానవిజ్ఞానములను గూర్చి బోధగావింపఁగలిగియుండువారును సద్విద్యావంతులు ౧౫ పురశ్చరణము, పుణ్యతీర్థనివాసము, దృఢవ్రతము, శరీరక్లేశసాహసము, ఉపాసనాప్రియత, నిగ్రహబుద్ధి గలవాఁడును, ౧౬ నిరంతరము సత్యముపలుకుటయు శుభకార్యము లొనర్చుటయుఁ మృదుమధురముగా మాటలాడుటయు నభ్యాసముగాఁగలవాఁడును సుఖాత్మకమును నిశ్చయమును నగుమాటలు నుడువువాఁడును ఆడినమాటల యెన్నటికిని జవదాటనివాఁడును సద్విద్యావంతుఁడును నగు పురుషుఁడు సద్విద్యావంతుడు. ౧౭ విషయాదివాసనలయెడ దృష్టివహించువారును గంభీరభావముతో మెలంగువారును యోగములయందభినివేశము గలిగియుండువారును భక్తులుగను సుప్రసన్నులుగను రాగహీనులుగను నుండువారును, సౌమ్యస్వభావము, సాత్త్వికశీలము, పరిశుద్ధాంతఃకరణము నిష్కపటవర్తనము, నిర్వ్యసనభావము గలవారును ౧౮ చతురుఁడు, వ్యవస్థితుఁడు (శాస్త్రనిరూపితనియమముగలవాఁడు) గుణగ్రాహి, అపేక్షారహితుఁడుగ నుండువారును దోషిమానవులను దనపలుకుబడిలో నుంచుకొనుట సమస్తప్రాణులయెడ నడఁకువ, చెలిమి గలిగియుండుట యభ్యాసముగాఁ గలవారును సద్విద్యావంతులు. ౧౯ ధనము, స్త్రీ, న్యాయము, అంతఃకరణము ప్రవృత్తి నివృత్తి మున్నగువానియెడ నిస్సంగుఁడై యున్నవాఁడును

బరిశుద్ధాంతరంగముగ వర్తించువాఁడును ౨౦ స్నేహభావముతో నెదుటివానికి హితముగావించుట, మధురవాక్యములనునుడివి రెండవవానిచింత తొలంగించుట, సామర్థ్యముతో నెదుటివారిని రక్షించుట పురుషార్థములను నిర్వహించుచు లోకమునకు క్షేమము కలుగఁజేయుట అభ్యాసముగాఁగలవాఁడును ౨౧ సందేహములఁదీర్చి మానవుల నుద్ధరించువాఁడును. విశాలములగు భావములతో వక్తృత్వము వెల్లడించువాఁడును. సాధకుల సందేహములను దీర్చుటలో నేర్పరితనము గలవాఁడును బెద్దలవద్ద విశేషాంశముల నెఱుంగుటలో నుత్సాహముగలవాఁడును, పుణ్యకథలను శ్రద్ధమెయి నాలించువాఁడును సువిద్యావంతుఁడనబడును ౨౨ వివాదములు కలుగని విధమున మాటలాడుటయు, సంగరహితుఁడును, నిరుపాధియును (బాధారహితుఁడు)నై వర్తించుటయు, ఆశారహితత్వము, క్రోధభావశూన్యత, నిర్దోషిత్వము, మాత్సర్యరాహిత్యము మున్నగు సుగుణములు గలిగియుండుటయు సువిద్యావంతునిలక్షణము ౨౩ విమలజ్ఞాని, నిశ్చయాత్మకుఁడు, సమాధానచిత్తుఁడు, భజనపరుఁడు, సిద్ధుఁడై సాధకుఁడుగ నుండువాఁడు, సాధనములను గాపాడువాఁడు. ౨౪ సుఖరూపుఁడు, సంతోషరూపుఁడు, ఆనందరూపుఁడు, హాస్యరూపుఁడు ఐక్యరూపుఁడుగ నుండువాఁడు, జనులనందఱను నాత్మరూపముగా దలంచువాఁడు ౨౫ భాగ్యవంతుఁడు విజయశీలుఁడు, స్ఫురద్రూపి, సుగుణవంతుఁడు, ఆచారవంతుఁడు క్రియావంతుఁడు, విచారవంతుఁడు (ఆలోచించువాఁడు) స్థిరచిత్తుఁడుగ నుండువాఁడు సద్విద్యావంతుఁడనఁబడును ౨౬ కీర్తిశాలియు, యశోధనుఁడును, శక్తిమంతుఁడును సామర్థ్యవంతుఁడును, వీర్యయుతుఁడును, వీరములను బడసినవాఁడును; నిజము పలుకువాఁడును, పుణ్యకర్మములొనరించువాఁడును నగుపురుషుఁడును విద్యావంతుఁడు, ౨౭ కళలనునేర్చిన

వాఁడును, సంపదలుకలవాఁడును, శుభలక్షణములతో నొప్పువాఁ
డును, సత్కుల ప్రసూతుఁడును, పరిశుద్ధుఁడును, బలవంతుఁడును
దయావంతుఁడగు పురుషుఁడును, ౨౮ యుక్తిమంతుఁడును,
గుణవంతుఁడును, శ్రేష్ఠుఁడును, బుద్ధిమంతుఁడును, విస్తారధైర్యవం
తుఁడును, దీక్షావంతుఁడును, నిరంతరము సంతుష్టిగ నుండువాఁడును,
ఆశారహితమనోవృత్తిగలవాఁడును, రాగవిహీనుఁడును నగు పురు
షుఁడు సద్విద్యావంతుఁడని తెలియనగును. ౨౯

ఇట్టి యుత్తమగుణముగలవాఁడై యుండుట సద్విద్యావంతుని
లక్షణము. ఈగుణములను మానవు లభ్యసింపవలయుననియే యిట
వివరించితిని. ౩౦ రూపము, చక్కఁదనము, గావలయునని యెన్ని
విధములఁ బ్రయత్నించినను లాభము లేదు. ప్రకృతిసిద్ధమగు రూప
మును సౌందర్యవంతము జేసికొనుట కెట్టియభ్యాసమేనియు నుపక
రింపఁజాలదు. ఆగంతుకములగు (సహవాసాదివశమునవచ్చు) సుగుణ
ములను బొందుటకేదేని యుపాయమున్నచో నావశ్యకముగా వెదకి
కొనవలయును. ౩౧ సద్విద్యయనునది మానవుఁడు కడతేరుట
కుపకరించు మంచివిషయము. ఇది సాధారణముగఁ బ్రతిమానవుని
యొద్దను నుండవలసియున్నది. విరక్తుఁడగు మానవునకు మాత్రము
దీనియభ్యాసము మిగుల నావశ్యకము. ౩౨

తొమ్మిదవ సమాసము

విరక్తలక్షణము.

శ్రోతలారా! మీకిపుడు విరక్తునిలక్షణములను దెలుపఁబోవు
చున్నాను. యోగుల కంతసామర్థ్యమును గలుగఁజేసిన యేగుణ
రాజములు విరక్తులు గడింపనగునో. ౧ సత్కీర్తిని వృద్ధిగాంచు
నవియు, సార్థకత్వము గలుగఁజేయునవియు, మహత్త్వము నభివృద్ధి

జేయునవియు నగు నేగుణములు విరక్తు లభ్యసింపవలయునో ౨
పరమార్థమున్ను గడించుటకును ఆనందతరంగములపయి నోలలాడు
టకును, వివేకయుక్తమగు వైరాగ్యము నభివృద్ధిజేయుటకును నేగుణ
ములు విరక్తులలవరచికొనవలయునో. ౩ సుఖము లభించుటకును,
సద్విద్యను బ్రసన్నముగావించుకొనుటకును, మోక్షసహితమగు
భాగ్యలక్ష్మిని దినదినాభివృద్ధి నొనరించుటకును, నేగుణములు విర
క్తులు సంపాదింపవలయునో ౪ విరాగులకోరికలు సఫలముగావించు
టకును, సకలకామములను బూర్ణపఱచుటకును, మధురముగ భాషిం
చుటకును సరస్వతీదేవిని ముఖమునందు వసింపఁజేయుటకును విరక్తు
లేగుణములు గ్రహింపనగునో వానిని జెప్పుచున్నాఁడ. ౫ శ్రోత
లారా! శ్రద్ధతో నాలకింపుఁడు. ఆలకించిన దంతతోఁబోవనీక
హృదయములలోఁ బదిలపఱపుఁడు. అటులొనరించినచో మీరు
భూమండలమునందు సుప్రసిద్ధులయ్యెదరు. ౬ విరక్తుఁడు వివేకిగావల
యును. ఇంతియగాక యధ్యాత్మవిద్యను లోకమునందు మిక్కిలి
ప్రచారములోనికిఁ దీసికొనిరావలయును. మఱియు నింద్రియదమ
నమునందు విరక్తుఁడు ధైర్యమును (దృఢత్వమును) జూపవలయును.
౭ విరక్తుఁడగువాఁ డెంతయో భారమును నిర్వహింపవలసియు
న్నాఁడు. సాధనమార్గములను సురక్షితము లొనరించుటయు
జనులను భజనమునందు లగ్నము గావించుటయు బ్రహ్మజ్ఞానమన
నేమియో ప్రజలకుఁ దేటతెల్లమొనరించుటయు, ౮ భక్తిభావము
మానవజాతికి అభివృద్ధినొసర్చుటయు లోకులకు శాంతిని జూపించు
టయుఁ, దన విరక్తిని యత్నముతో రక్షించుకొనుటయు ౯ సదా
చరణములను జేయుటలో నుత్సాహము ప్రజలకుఁ గలుగఁజేయు
టయు నివృత్తిమార్గమునెడ నభిమానము జనింపఁజేయుటయు హృద
యమునందు నిరాశ దృఢముగాఁ బాదుకొల్పుటయు విరక్తుఁడు

ముఖ్యముగా నిర్వహింపవలసిన ధర్మములు. ౧౦ ధర్మమును స్థాపింపవలయును. నీతి నవలంబింపవలెను. ఆదరపూర్వకముగా నోరుపును గాపాడుకొనవలయును. ౧౧ పరమార్థమునుగూర్చి సహచరులకుఁ దెలియఁజెప్పవలయును. విచారణీయమును బాగుగా శోధింపవలయును. సన్మార్గమును సత్వగుణమును దమచెంత నిరంతర ముంచుకొనవలయును. ౧౨ సుస్వభావులను గాపాడు చుండవలయును. ప్రేమస్వభావులను సంతృప్తిపఱపవలయును. ఐహికములకు రోసి పరమార్థదానమును జేయుమని శరణుజొచ్చిన యమాయికజనుల నుపేక్షింపక యుండవలయును. ఈ యుత్తమగుణములు గలవాఁడె విరక్తుఁడు. ౧౩ విరక్తులు పరమదక్షులు (మిగుల నేర్పరులు) కావలయును. అంతఃకరణమునకు సాక్షిభూతులై, పరమార్థపక్షమును గ్రహించి ౧౪ బహువిధాభ్యాసముల నొనర్చుచు సత్ప్రయత్నశీలురై వర్తింపవలెను. ఉపన్యాసములమూలమునఁ బడిపోయిన పరమార్థము మఱల మానవజాతికిఁ బ్రసాదింపవలయును. ౧౫ నిర్మలమగు నాత్మజ్ఞానము నుపదేశించుచు వైరాగ్యమును బ్రశంస చేయుచు నిశ్చయాత్మకమగు సమాధానము సాధకుల కొసంగుచు ౧౬ పర్వతిథులలో నుత్సవములను మహావైభవముగాఁ గావించుచు భక్తులను దఱచుగా నొకచో సమావేశముచేయించుచు మధ్యమధ్య కలుగు నాటంకములను బాటింపక, మహోత్సాహముతో ఉపాసనామార్గమును మిగులవిరివిగా విరక్తుఁడు ప్రచారములోనికిఁ దీసికొనిరావలయును. ౧౭ హరికీర్తనము చేయుట, అధ్యాత్మనిరూపణ ప్రచారముగావించుట నిందించెడిదుష్టులను భక్తిమార్గమునందుఁ జేర్చి పశ్చాత్తాపతప్తులగునట్లొనరించుట, ౧౮ మానవజాతి కుపకారమునసలుపుట, పడిపోయిన ప్రాచీనగౌరవమును బునఃప్రతిష్ఠ నొనర్చుట శక్తికొలఁది పుణ్యమార్గము విస్తరింపఁజేయుట విరక్తుని

విధి. ౧౯ విరక్తులు, స్నానము, సంధ్య, జపము, ధ్యానము, పుణ్యతీర్థయాత్ర, భగవద్భజనము నిత్యనియమముగాఁ జేయవలెను. మఱియు బాహ్యపవిత్రతతోఁబాటు అంతఃకరణశుద్ధిగూడఁ గలిగియుండవలెను. ౨౦ దృఢమగు మనోనిశ్చయము గలిగియుండవలెను. సంసారమును సుఖపూర్ణమొనరించి సత్కార్యంగత్యముచేఁ బ్రజలను గడతేర్చవలెను. ౨౧ విరక్తులు, ధైర్యవంతులుగను, త్యాగశీలురుగను (భక్త్యాది) నిరూపణమునందు ఆసక్తిగలవారలుగను ౨౨ సావధానులుగను శుద్ధమార్గమున సంచరించువారలుగను, జీవితమును బరోపకారమునందు వ్యయపఱచి కీర్తిరూపముతో జీవించువారలుగను నుండవలయును. ౨౩ విరక్తులు తమ శక్తికిఁ దామానందింపక యింకను మహానుభావులగు విరక్తులెందుండిరో విచారించి వారిజాడలు గుర్తింపవలెను. సాధువు లెవరో యెఱుంగవలెను. సజ్జనులను యోగులను, సాధులను కలసికొని వారిస్నేహము సంపాదింపవలయును. ౨౪ పురశ్చరణమునసలుపుట, తీర్థాటనము (పుణ్యతీర్థయాత్ర) నొనరించుట, నానావిధములగు ప్రదేశములలో నాలయములు బృందావనములు నెలకొల్పి పరమరమణీయములు గావించుట. ౨౫ సంసారసంబంధములగు సత్కర్మముల నాదరించుట విరక్తునిధర్మము. కాని సంసారకర్మబద్ధుఁడై కర్మములలో లిప్తుఁడన్నటికిని గాఁగూడదు. ఇంతియగాక యేవిషమునందేని దురాశను దరికిఁ జేరనీయఁజనదు. ౨౬ విరక్తులు అంతర్నిష్ఠులుగా నుండవలయును. క్రియాభ్రష్టు లెన్నటికినిం గాఁగూడదు. పరాధీనతయందుఁ జిక్కి వ్యర్థులు గాఁజనదు. ౨౭ సమయము నెఱింగి ప్రవర్తింపవలయును. ప్రసంగములను బరీక్షింపవలయును. వేయేల! సమస్తవిషయములయందును విరక్తుఁడు చతురతగలవాఁడుగ నుండవలయును. ౨౮ విరక్తుఁడు ఏకదేశిగా (పరిమితజ్ఞానవం

తుఁడుగ) నుండక సమస్తవిషయముల నభ్యసించి, యంతతోఁ దృప్తినొందక యేదేని తెలిసికొనవలసినది మిగిలెనేని దానినిగూడఁ బూర్ణముగాఁ దెలిసికొనవలయును. ౨౯ హరికథ ఆధ్యాత్మనిరూపణము, సగుణభజనము, బ్రహ్మజ్ఞానము, పిండజ్ఞానము, తత్త్వజ్ఞానము, మున్నగువాని స్వరూపము విరక్తుఁడు బాగుగా నెఱింగి యుండవలయును. ౩౦ కర్మమార్గము, ఉపాసనామార్గము, జ్ఞానమార్గము, సిద్ధాంతమార్గము, ప్రవృత్తిమార్గము, నివృత్తిమార్గము, మొదలగువాని నన్నింటిని సమగ్రముగా నెఱింగి ౩౧ ప్రేమస్థితి, ఉదాసీనదశ (కర్మములు మొదలగువాని నంటకుండుట) ధ్యానస్థితి, విదేహదశ, సహజస్థితి, మొదలగువిషయములను పూర్తిగాఁ దెలిసికొని విరక్తుఁడు సర్వజ్ఞుఁడు ననఁదగియుండవలయును. ౩౨ ధ్వని, లక్ష్యము, ముద్రలు, ఆసనములు, మంత్రము, యంత్రము, విధి, విధానము, బహువిధమతములమర్మము విరక్తుఁడు తెలిసికొన్నవాఁడుగ నుండవలయును. ౩౩ విరక్తుఁడు ప్రపంచమునకంతకును స్నేహితుఁడై, స్వతంత్రుఁడై, విచిత్రచరిత్రుండై, బహువిధగుణవంతుఁడై యుండి ౩౪ యేవిషయములయందేని రక్తిలేక వర్తింపవలయును. హరిభక్తుఁడును, అలిప్తుఁడుగను, నిత్యముక్తుఁడుగను ౩౫ శాస్త్రములను దఱచి సారమును నెఱింగినవాఁడుగను నానావిధములగు పాషండమతములను (వేదబాహ్య మతములను) రూపుమాపువాఁడుగను, ముక్తిగోరువారలను శుద్ధమార్గమున బ్రవేశపెట్టుటలో సమర్థుఁడుగను విరక్తుఁ డుండవలయును. ౩౬ ప్రజలకు శుద్ధమగు మార్గమును జూపించుచు, బ్రజలసందేహములను నివారించుచు, మనుష్యమాత్రులనందఱను దనవారలుగఁ జేసికొనుచు ౩౭ నిందయొనర్చువారలకు వందనములను సమర్పించుచు సాధకులకుఁ బ్రబోధము గలుగఁజేయుచు నంతతోఁబోక సంసారబద్ధులకు మోక్షమార్గము

జూపి మేల్కొల్పుచు విరక్తుఁడు లోకోద్ధరణమునఁ బాటుపడవలయును. ౩౮ ఉత్తమగుణములను గ్రహించి, యవగుణములను విసర్జించి వివేకబలముల నానావిధములగు నాటంకములను దూరము చేయువాఁడే నిజమగు విరక్తుఁడు. ౩౯

ఈ యుత్తమలక్షణములను ఏకాగ్రబుద్ధితో నాలింపవలయును. విరక్తులగుపురుషులు వీనిని బరిహాసము గావింపఁదగదు. ౪౦ పయినిజెప్పఁబడిన విరక్తలక్షణములను నేను సహజస్వభావముతో మీకు విశదమొనరించినాఁడను. వీనిలో మీకెన్నిసాధ్యమగునో చూచి యన్నింటిని గ్రహింపుఁడు. చాల చెప్పితిని. ఇందువలన శ్రోతలు వినుటలో విసుగుచెందవలదని (ఉదాసులు కావలదని) కోరుచున్నాఁడను. ౪౧ ఈ విరక్తలక్షణములను మానవులు గైకొనరేని వారికి అవలక్షణత్వము సిద్ధించును. ఇంతియగాక యట్టివారు చదివినమూర్ఖు లనిపించుకొందురు. ౪౨

పదియవ సమాసము

చదివినమూర్ఖులలక్షణములు.

గతసమాసమునందు మూర్ఖులలోఁ జతురత్వమేర్పడుటకు నేయేలక్షణము లవసరమో వానిని వివరించితిని. ఇప్పుడు చతురులని పేర్కొనఁబడుచు మూర్ఖులుగ నుండువారల లక్షణములు నివేదించుచున్నాఁడను. ౧ ఎట్టివారిని జదివినమూర్ఖులందురో తెలియుటకు, వారిలక్షణములను దెలుపుదును. వారిలక్షణములను న్యాలకించి శ్రోతలు విచారింపవలదని నాప్రార్థనము. ఏలయన! అవగుణములను విడచిపెట్టుటవలన సుఖములభించునుగదా. ౨ బహుశ్రుతుఁడుగను బుద్ధిమంతుఁడుగను స్పష్టమగు బ్రహ్మజ్ఞానము బోధించువాఁడుగను నుండి హృదయమునందు దురాశయు దురభిమానమును వీడఁజాలనివాఁడు చదివినమూర్ఖుఁడు. ౩ ముక్తావస్థను బ్రతిపాదించు

సగుణభక్తిని విడనాడఁగోరువాఁడును, స్వధర్మమును, సాధనము
లను నిందఁగావించువాఁడును. ౪ తనకున్న పరిజ్ఞానమును బురస్క
రించుకొని యందఱి యెడ దోషములను స్థిరపఱచువాఁడును బరుల
యెడఁగల లోటుపాటుల వెదకువాఁడును. ౫ శిష్యుఁ డెందేని
తెలిసి తెలియక పొరపాటుచేసినను సంకటములపాలైనను గటు
వచనములాడి యాతనిహృదయమును నొప్పించువాఁడును, జదివిన
మూర్ఖుఁడు. ౬ రజోగుణప్రధానుఁడు, తమోగుణ ప్రధానుడు గప
టహృదయుఁడు, మనస్సులోఁ గుటిలభావము గలవాఁడు, తనమహ
త్త్వము వైభవము పొగడుకొనువాఁడు. ౭ గ్రంథములను సమగ్ర
ముగాఁ జూచి తత్త్వముగ్రహింపక దూషణముగావించువాఁడు, మం
చిగుణములను దుర్గుణములుగా భావించువాఁడు. ౮ సులక్షణముల
అవలక్షణములుగఁ దలంచువాఁడు, మత్సరమువహించి పరులతోఁ దగ
వులాడువాఁడు నీతి, న్యాయములయందు దుడుకుతనముజూపువాఁడు
ను జదివినమూర్ఖుఁడనఁబడును. ౯ నేను తెలిసినవాఁడనని గరువించి
మొండిపట్టు బట్టరాదు. క్రోధమునాపుట కభ్యాసపడవలయును.
చేయునదియొకటి చెప్పునదియొకటిగ నుండఁజనదు. ౧౦ అధికా
రము లేకున్నదని యెఱింగియుఁ బదిమందిలో నేదియో చెప్పఁ బోఁ
గూడదు. పరులను గఠినవచనములచే నొప్పింపఁజనదు. ఈలక్షణము
లకు వ్యతిరేకముగ నుండువాఁ డొక చదివినమూర్ఖుఁడు. ౧౧ తాను
బహుజనులకడ నేర్చినయంశములను నితరులెఱుంగరనియు నితరులు
తనవలె మాటలాడలేరనియు గరువించి వక్తలయెడ లోపము
లారోపించువాఁడును, ౧౨ ఇతరులపైఁ దానారోపించులోపము
స్వయముగఁ దనయందుఁగూడ నున్నను దానినెఱుంగనియాతఁడును
౧౩ అభ్యాసముజేసి సమస్తవిద్యలను దెలిసికొని యావిద్యల నుప
యోగించి జనుల నానందపఱుపఁజాలనివాఁడును, ౧౪ స్పర్శసుఖ

కారణమున నేనుఁగు నీటిలోఁ జిక్కుకొనునట్లును, పుష్పరసము
మీఁది యాసచేఁ దుమ్మెదలు ముండ్లలోఁ దగుల్కొని చచ్చు
నట్లును జక్కఁగనెఱింగి ప్రపంచమునఁ జిక్కినవాఁడును. ౧౫ స్త్రీ
లను వెంటబెట్టి యుండువాఁడును, బ్రహ్మజ్ఞానమునుగూర్చిన సంభా
షణములు స్త్రీలతోఁ గావించువాఁడును, నిందనీయములగు వస్తు
వులయెడ నభిమతము జూపువాఁడును జదివినమూర్ఖుఁడు. ౧౬ శరీ
రమునకు హీనత్వము కలుగఁజేయు విషయములను దృఢముగ
మనస్సునఁ బాదుకొల్పి యుంచుకొనుటయుఁ, దనదేహమును దన
సుఖమును జూచుకొనుటలో నాసక్తియు, ౧౭ భగవంతునిమఱచి
మానవులను గొనియాడుటయుఁ జూచినదానినెల్ల నభివర్ణించుటయు
౧౮ స్త్రీలయంగకములను జూచినంతన ముగ్ధుఁడై వర్ణించుటయు
నానావిధములగు నాటకములను వేషధారుల యొక్కయు
స్త్రీపురుషులయొక్కయు హావభావములనే యెన్నుటయునీశ్వ
రుని మఱచుటయుఁ జదివినమూర్ఖుని లక్షణములు. ౧౯ తాను
వైభవముగలవాఁడనని విఱ్ఱవీగుచు తోడిమానవులను దుచ్ఛులుగఁ
దలంచువాఁడును. బాషండ (వేదబాహ్య) మతమును సిద్ధాంత
మొనరించువాఁడును, ౨౦ వ్యుత్పన్నుఁడునుఁ (శాస్త్రాదిజన్యజ్ఞానము
గలవాఁడును) వీతరాగియును, బ్రహ్మజ్ఞానియును, మహాయోగి
యును నై యుండియు జగత్తునుగూర్చిన భవిష్యద్విధముఁ జెప్పఁ
దొడంగువాఁడును, ౨౧ దాను విన్నవిషయమును గూర్చి గుణ
దోషచర్చ యనవసరముగ మనస్సులోఁ గావించువాఁడును, ఇత
రుల శ్రేయస్సులుగాంచి యోరువఁజాలనివాఁడును, జదివినమూర్ఖుఁ
డని నాతలంపు. ౨౨ భక్తిసాధనము గ్రహించి భజనము చేయక
పోవుటయు, వైరాగ్యమునం దాసక్తిలేమియుఁ గ్రియాశూన్యమగు
బ్రహ్మజ్ఞానమును బోధించుటయు, ౨౩ తీర్థక్షేత్రములయం దాదర

భావము లేకపోవుటయు, వేదశాస్త్రముల నంగీకరింపకుండుటయుఁ బవిత్రమగు కులమున జన్మించియు నపవిత్రముగ వర్తించుటయు, ౨౪ నితరు లాదరించినంతన ప్రీతినొందుటయు, గీర్తిశూన్యుఁడగు మూఢుని గొనియాడుటయు వెంటనే యనాదరించి నిందఁజేయుటయు నాచారముఁగ గలవాఁడు చదివినమూర్ఖుఁ డనఁబడును. ౨౫ ముందొకటియు, వెనుకనొకటియుఁ జెప్పునదియొకటి చేయునదొకటియుగ నుండువాఁడును, ౨౬ ప్రపంచవిషయములయందుఁ దత్పరభావముగలిగి యుండువాఁడును బరమార్థమునందు భక్తిగలవాఁడును, అధికార మదమునఁ దనపరిజ్ఞానము గోల్పోయినవాఁడును, ౨౭ బరుల నానందపఱచుటకు సత్యముతొలంగి కల్లలాడువాఁడును, బరాధీనముగ బ్రదుకునాతఁడును జదివినమూర్ఖుఁడు. ౨౮ బాహ్యాడంబరములను బ్రకటించువారలును, జేయరానిపను లొనరించువారును, మార్గమును మఱచియుండియు నిదమిత్థమని హఠముగా వివాదముగావించువారును, ౨౯ రాత్రింబవళ్లుత్తమగ్రంథముల నాకర్ణించియుఁ దనకుఁగల దుర్గుణములను విడనాడలేనివారును, స్వయముగాఁ దనహితవేదియో గుర్తింపలేనివారును, ౩౦ నిరూపణసమయమునందు వచ్చి కూర్చుండియున్న శ్రోతలనుగాంచి వారి దోషములను బహిరంగపఱచువారును జదివినమూర్ఖులలోనివారు. ౩౧ శిష్యుఁడు విద్యావివేకశూన్యుఁడై యప్రతిష్ఠాకరములగు పనులు చేయుచుండుట స్వయముగా నెఱింగియు నాతనిపయి నమ్మకముంచుగురువు, ౩౨ గ్రంథశ్రవణము గావించునపు డెవరేని కొంచెము తప్పుఁజేసినయెడల వానిపయిఁ గ్రోధమూని యాక్షేపించువక్తయు, ౩౩ వైభవమును జూచుకొని మదించి సద్గురు నుపేక్షాదృష్టితోఁగాంచు శిష్యుఁడును, గురుపరంపరను దాఁచివసాధకుఁడును, ౩౪ జ్ఞానోపదేశమును స్వార్థముకొఱకు (తనకుటుంబపోష

ణమునకు) గావించుబోధకుఁడును, శిష్యులను బీడించి లోభివలె ధనమును బ్రోగుచేయు దురాశాపరుఁడును బరమార్థమును ద్రవ్యముకొఱ కుపయోగించు నవివేకియుఁ జదివినమూర్ఖులలోఁ జేరదగినవారు. ౩౫ తాను స్వయముగా ననుష్ఠింపనివి పరులకు బోధగావించుటయు, బ్రహ్మజ్ఞానివలె బయటికాడంబరముగా భాషించుటయు, గోస్వామినై పరాధీనవృత్తిలో నుండుటయు, ౩౬ సంపూర్ణముగు భక్తిమార్గమును విడనాడుటయుఁ దనకు హానికలిగించు పనులొనరించుటయు, ౩౭ గృహస్థాశ్రమము దైవవశమునఁ దొలఁగిపోయినను బరమార్థమునందుఁ గొంచెమేని యభిరుచి లేకుండవర్తించుటయు దేవబ్రాహ్మణులయెడ ద్వేషభావము ప్రకటించుటయు నేరియందుఁ గలదో వారిని చదివినమూర్ఖులుగా గణింపవలయును. ౩౮

దుర్గుణములను ద్యాగముగావింతురని శ్రోతలారా! మీ ముందుఁ జదివినమూర్ఖుల లక్షణముల నివేదించితిని. మీరు బుద్ధిమంతులుగానఁ జెప్పుటలో జరిగిన యెక్కువ తక్కువలకు క్షమింపుఁడు. ౩౯ సంసారదుఃఖమునకు సరియగుదుఃఖ మింకొకటి ప్రపంచములో లేదుగాన సంసారములో నేదోసుఖమున్నదని దేవులాడువాడు పరమమూర్ఖులలో నగ్రగణ్యుఁడు. ౪౦ సంసారమునందుఁగల దుఃఖములేవో సుఖములేవో ముందుసమాసమున నిరూపింపనున్నాఁడను. మాతృగర్భముననున్నపుఁడును జనించిన పిదపను బ్రాణి యెట్టిదుఃఖములపాలై క్లేశముల ననుభవించుచున్నాఁడో యదియంతయు మీకు నివేదించెదను. సావధానమతితో నాలింప గోరెదను. ౪౧

రెండవదశకము సమాప్తము.

మూడవ దశకము.

మొదటిసమాసము

జన్మదుఃఖనిరూపణము.

దుఃఖమునకును, శోకమునకును, భయమునకును జన్మమే యుత్పత్తిస్థానము. ౧ కర్మములకు మూటయుఁ బాపములకు నెలవును, గాలనియతిచేఁ గలుగు దుఃఖములకు నునికిపట్టునగు నీజన్మమును వర్ణింప నేరితరము? ౨ జన్మము కువిద్యాఫలము. ఇంతియగాదు, మోహకమలము, జ్ఞానహీనతచేఁ గలుగుభ్రాంతికిఁ దెఱయు, ౩ జీవునకు బంధనము, మృత్యువునకు హేతువునై యంతలోఁ బోక జీవుని నిర్బంధించునదిగ నున్నది. ౪ పూర్వసుఖము లీజన్మముకతననే మఱపునకు వచ్చుచున్నవి. శారీరములు మానసికములు నగు విచారముల కీజన్మమే యాటపట్టువు. కర్మవాసనలు విస్తరముగా వ్యాపించి జీవుని బంధించుట కీజన్మమే ప్రధానహేతువు. ౫ జీవునకు దుర్దశగలుగుట కీజన్మమే ముఖ్యకారణము. మమకారమను ఢాకినీ పిశాచి సంచారముచేయుటకు ననువగుతా వీజన్మమే. ౬ మాయకుఁ బుట్టినిల్లును, క్రోధమునకు మందిరమును మోక్షమునుగడించుట కంతరాయమును, ౭ జీవునకు "అహం" (నేను) అనుదానిని బ్రసాదించునదియు నహంకారము నభివృద్ధిపఱచునదియుఁ బరాత్పరుఁడగు నీశ్వరునే మఱపించునదియు నగు నీజన్మమునకుఁ గల విడ్డూరవుఁ బెంపుఁ బొగడ నశక్యము. ౮ ఇదియె ప్రాణికి విషయసుఖములందుఁ బ్రియముగలుగఁ జేయుచున్నది. దురాశాశృంఖములను బ్రాణి కిదియె తగిలించుచున్నది. కాలపురుషుఁడు మిగులఁ బ్రీతితో నారగించు

ఫలరాజము గూడ నిదియే. ౯ జన్మము నెత్తుటచేతనే ప్రాణికి విషమపరిస్థితు లేర్పడుటయు వికటకాలము చేరువయగుటయు భయంకరమగు నరకమునఁ గూలుటయుఁ దటస్థమగుచున్నది. ౧౦ జన్మమునకు శరీరమె సాధనము. దీని పుట్టుపూర్వోత్తరములను గూర్చి బాగుగా యోజించితిమేని ప్రపంచములో దీనికి సమానమగు నమంగళపదార్థ మింకొకటి లేదని స్ఫురించును. రజస్వలాసంపర్కమున నీకళేబర ముదయించినది. ౧౧ అత్యంతదూషితమగు రజస్వలాసతియొక్క రజస్సె యీకళేబరము. దీనికినిర్మలమెక్కడనుండివచ్చును? ౧౨ రజస్వలయొక్క రక్తము (రజస్సు) అంతయు నొక్కచోఁ బ్రోవయి తొలుత యొకబుగ్గగా నేర్పడును. క్రమముగా నాబుగ్గనుండియే యీశరీర మేర్పడినది. ౧౩ ఈశరీరము చూచుటకెంతయో సుందరముగా నున్నది. కాని లోపల నరకపుమూట పెట్టఁబడి యున్నది. ఇంతయేల! ఈదేహమొకవిధమగు చర్మభాండము (తోలుసిద్దె). దీని లోన నంతయు దుర్గంధముగాన మూఁత తెఱచుటకె వీలుకాదు. ౧౪ అయ్యయ్యో! ఈదేహమును బ్రమాదమున భాండమంటిని. భాండమును శుభ్రముగాఁ గడిగితిమేని కల్మషమంతయుఁ బోవును శరీర మట్టిదికాదు. స్నానమనుపేరితో మన మీదేహమును బ్రతిదినమును బలుమారు కడుగుచున్నారము. దుర్గంధభూయిష్టమగు నిది కొంచెమేని పరిశుభ్రము నొందకున్నది. కాన భాండముతోఁ బోల్చుట యనుచితముసుమా! ౧౫ భగవంతుఁ డొక యస్తిపంజరమును నిలువఁబెట్టినాఁడు. దానిని నాడీనివహముతోఁ జుట్టినాఁడు. హెచ్చుతగ్గులు సరిపడుటకై మజ్జ (ఎముకలలోనిచమురు) మాంసము నందందు సవరించి నింపినాఁడు. చాలు, ఇంకేమున్నది? శరీర మేర్పడినది. ౧౬ పేరునుబట్టి చూచినను శుద్ధముగానిదగు అశుద్ధము (రక్తము) ఈదేహమునందు నిండియున్నది. అంతియగాక యీదే

హమునందు నానావిధములగు రోగములు దుఃఖములు పాదుకొని యున్నవి. "శరీరమ్వ్యాధిమందిరమ్" అందురుగదా. ౧౭ ఈకళేబరము నరకపుఁబెంటతో నిండియున్నది. దేహమునందున్న యాపెంట మానవుని దలక్రిందుఁజేయుచున్నది. ఈదేహములో నొకభాగమున దుర్గంథబంధురమగు మూత్రకోశ మంటుకొనియున్నది. ౧౮ లోపల నానావిధములగు జంతువులు కీటకములు పేవ్రులు నిండియున్నవి.బహువిథములగు దుర్గంధములకు దీనిలోనిభాగ మాలవాలము. లోపలనుండి బయటికి మిగుల నసహ్యాకరమగు తోలు వ్యాపించి కళేబరమునుగప్పియున్నది. ౧౯ సంపూర్ణములగు నన్నియువయవములలోఁ దలను శ్రేష్ఠతమమైనదానిగ గణంతురు. అందుఁగూడ ననేకాసహ్యములు గలవు. తలనుండి ముక్కులోనికి మిగుల నేవముగూర్చు కఫము (చీమిడి) ప్రవహించుచున్నది. చెవినుండి యొకప్పుడు చీము గారుచుండును. అప్పుడు జనించుదుర్గంధమును సహింపఁజాలము. ౨౦ కనులనుండి పుసిబయలుదేరును. ముక్కు చీమిడితో నిండియుండును. ప్రాతఃకాలమున నోటినుండి మలము వంటి దుర్వాసన బయలుదేరును. ౨౧ ఉమ్మియుఁ జొంగయుఁ బిత్తరసము కళ్లె, దగ్గు, మొదలగు నసహ్యాకరమగు పదార్థములను వెడలగ్రక్కు ముఖమును గమలమనియుఁ జంద్రబింబమనియుఁ జెప్పుచుందురు. ౨౨ ముఖముసంగతి యటులుండనిండు. ఉదరము మలభాండము. దీనినిండ మలము మూలుగుచున్నది. ప్రత్యక్షముగఁ గానవచ్చు దీనికొఱకు నితరప్రమాణములతోఁ బనిలేదు. "ప్రత్యక్షంకింప్రమాణం?" ౨౩ ఎన్నియుత్తమోత్తమపదార్థములను దినినను నవి యుదరమునఁజేరి మలముగా మారును. లేదా వాంతిరూపమున బయటికివచ్చును. పరమపావనమగు గంగోదకము గ్రోలినను నదియు నుదరగోళములోనికిఁ బోయి మూత్రముగా మారిపోవును.

౨౪ కావున మలము మూత్రము వమనములే యీదేహమునకు జీవమును బ్రసాదించునవి యైయున్నవి. ఈదేహము పెరుగుట కివియె యాధారము. దీనిలో సంశయమున కవకాశము లేదు. ౨౫ పొట్టలోనుండి మలమూత్రములుగాని వమనముగాని బయటికి రానిచో నెల్లరు మరణించుట నిశ్చయము. ధనవంతుఁడైనఁ గానిమ్ము దరిద్రుఁడైన గానిమ్ము ఉదరములో మలముండియే తీరును. ౨౬ నిర్మలముగా నుంచుదమని యుదరస్థములగు విరేచనాదులు తీసివేయుదుమేని యాదేహము తప్పక నశించును. ౨౭ శరీరము రోగరహితముగనున్నప్పుడే యీవిథముగ మలమూత్ర భాండముగనున్నది. దానికి దుర్దశకలిగెనేని యప్పటిస్థితి నేరీతిగ వర్ణింపగలను.? ౨౮ అనేకవిధములగు నపాయముల నొందును. జీవుఁడీగర్భకోశములోఁ బూర్తిగాఁ దొమ్మిదిమాసములు వసింపవలయును. ఆసమయమున నవద్వారములును మూసికొనిపోయియుండును. లోన గాలి వీచుట కవకాశమెక్కడిది? ౨౯ శిశువు తల్లిగర్భములోని వమనమునను విరేచనమునను మునిఁగితేలుచు జఠరాగ్నిచేఁ బరితపించుచునుండును. ఇంతియెగాక జఠరాగ్నిచేగర్భస్థుఁడగు బాలుని యస్థిమాంసాదులు పలచుల మాడుచుండును. 30 చర్మము పూర్తిగ దేహమున కల్లుకొనకపోవుటచేఁ దల్లి గర్భమునందున్న శిశువు ఎట్టిబాధకులోనైనను ఆబాధయంతయుఁ దల్లికిఁజెందును. తల్లిభుజించు వేఁడివేఁడి వస్తువులవలన గర్భస్థుఁడగు శిశువు ఉడికిపోంబు పరితపించును. 3౧ ఎచట పిండమిమిడియుండునో యచటనే (గర్భకోశమునందు) మలము సంచియున్నది. అచటనే నాభినాళమునుండి శిశువునకు నేదో కొంతరసము లభించుచుండును. 3౨ మలము, మూత్రము, వాంతి, పిత్తము, మున్నగు వానివలనను నాసికనుండియు ముఖమునుండియు బయలుదేరు మురికిపదార్థమువలనను గర్భస్థుఁడగు శిశువు అతిశయముగాఁ గలవర పడుచుండును. 33

ఇట్టి కారాగృహప్రాయమగు మాతృగర్భమునందు శిశువు బాగుగా నిర్బంధింపఁబడి పడియుండును. అప్పుడీశిశువు భయపడి యీవిధముగా నుడువనారంభించును. "ఓయీశ్వరా! నన్నీ నిర్బంధమునుండి బయట పడవేయుము. ౩౪ దైవమా! ఈసారికి నన్ను నీవీ నిర్బంధమునుండి విడపించెదవేని నాకుసత్యమగుహితవును నేనేగావించుకొందును. ఇఁక నీగర్భవాసకష్టము కలుగకుండుటకై యెన్నియో పుణ్యకార్యములొనరించెదను" ౩౫ శిశువు మాతృగర్భమునఁ బొందినయవస్థలు దుర్భరములగుటచే నింక నెన్నేని యిట్టి ప్రతిజ్ఞ లొనరించును. తరువాతఁ గొంతకాలమునకు శిశువునకు జన్మసమయము సమీపించును. ఆసమయమునఁ దల్లి ప్రసూతివేదనలకు భరింపజాలక హృదయము కరిగిపోవునటుల నేడువనారంభించును. ౩౬ గర్భమునందున్న శిశువునకు ముక్కునిండ నోటినిండ మాంసమునిండి పేర్కొనియుండును. ఇందుచే శిశువు గర్భములోనున్నంతకాలము మస్తకముతోఁ గాలి పీల్చుచుండును. జననసమయమునందు శిశువునకు మస్తకముగూడ మూసికొనిపోవును. ౩౭ మస్తకద్వారము మూసికొనిపోవగానే శిశువు హృదయము మిక్కిలి భయపడును భయముచే నేమియుఁ దోచక గర్భకోశములో నలుమొగములను గొట్టుకొన నారంభించును. ౩౮ ఉచ్ఛ్వాసనిశ్వాసములు ఆగిపోవుటచే నాప్రాణి మిగుల భయమునొంది మార్గముకనిపించకుండుటచే నెంతయో దుఃఖమొందును. ౩౯ భయభీతులవలన నొకానొకప్పుడా శిశువు మాతృయోనియందుఁ దట్టుకొని ముందునకు రాఁజాలకయందే యాగిపోవును. ఇపుడీపిండమును గోసి బయటికిఁ దీయవలయును. లేకున్న తల్లిప్రాణమునకై యపాయము వచ్చునని చూడ వచ్చినవారు చెప్పుదురు. ౪౦ వారి మాటలు పాటించి చికిత్సకులు తట్టుకొన్నశిశువును గనిపెట్టి చేయి, కాలు, ముఖము, ముక్కు,

పొట్ట లోఁగువానిలో నేదిచిక్కిన దానిని గోసి వెలికిఁదీయుదురు. ౪౧ తునుకలుతునుకలుగాఁ జేయుటచే శిశువు వెంటనే మరణించును. తల్లిగూడ నొక్కొక్కప్పుడీయవస్థలోఁ దనప్రాణములను గోలుపోవును. ౪౨ ఈవిధముగా నాశిశువు తాను జచ్చుటయేగాక తల్లిప్రాణమునుగూడఁ దీయును. శిశువిటుల గర్భవాసమున ననేక దుఃఖముల ననుభవించును. ౪౩ అదృష్టవశమున నొకవేళ శిశువునకు సరియగు యోనిమార్గము దొరకినచో నాసమయమునఁగూడ నొక్కొక్కప్పుడు వెనుకనుండి భుజములో మెడయో తట్టుకొనును. ౪౪ జనులప్పు డాశిశువును బలవంతముగా సంకుచితమగునున్న యోనిమార్గమునుండి బయటికిఁ దీయుదురు. ఈవిధముగా నెందఱో శిశువులు దుర్మరణమొందుచున్నారు. ౪౫ ప్రాణము పోవునపుడు స్మృతితప్పిపోవుటచే శిశువు గర్భకోశములోనవస్థలొందుతఱి గావించిన ప్రతిజ్ఞలన్నింటిని మఱచిపోవును. ౪౬

గర్భములోనున్నపుడు శిశువు 'సోహం, సోహం' (నేనేబ్రహ్మమును. నేనేబహ్మమును) అని నుడువును. వెలుపలకురాఁగానే పూర్వస్మరణము మఱచిపోయి 'కోహం, కోహం' (నేనెవఁడను, నేనెవఁడను) అని నుడువును. శిశు వీవిధముగా గర్భవాసమునం దెన్నియోకష్టముల నొందుచున్నాడు. ౪౭ గర్భదుఃఖములనుండి బయటకువచ్చిన శిశువునకుఁ బూర్వము దావొందినయవస్థలు తలంపునకెన్నటికిని రావు. ౪౮ వృత్తిశూన్యమగును. మనస్సునం దేదియు జ్ఞాపకముండదు. అజ్ఞానమువలన హృదయము భ్రాంతిలో మునిగిపోవును. సంసారదుఃఖము లన్నింటిని సుఖములుగాఁ దలంచుకొనును. ౪౯ దేహమును ధరించి నేలబడినదిమొదలు ప్రాణి తానొందినసుఖముగాని కష్టముగాని మఱచిపోవును. ఈవిధముగా జీవుఁడు మాయాజాలమునందుఁ జిక్కుకొనును. ౫౦ గర్భవాసమునందు

ప్రతిప్రాణికిని నీలాటికష్టములు దుఃఖములు సంభవించుచుండును. ఇందువలననే యీశ్వరుని శరణుజొరమని పెద్దలు చెప్పుచున్నారు. ౫౧ పరమేశ్వరునియెడ దృఢతరమగు భక్తిగల పుణ్యాత్ములు జనన మరణరూపమగు బాధనుండి బయటపడి ముక్తులుగానున్నారు. పుణ్యాత్ములగు నిట్టియోగ్యులు జ్ఞానబలమువలన సదా విరక్తులుగ నుందురు. ౫౨ ఈ గర్భవాససంబంధమగు కష్టముల నన్నింటిని యథామతిగా వర్ణించినాఁడను. ఇఁకముందు సావధానమతితో శ్రోత మహాశయులు చెప్పబోవుదాని నాలింపఁ గోరెదను. ౫౩

రెండవ సమాసము

స్వగుణపరీక్ష (బాల్యము యౌవనావస్థ)

సంసారమె సమస్త దుఃఖములకు మూలకారణము. ఇచట దుఃఖాగ్నికణము లంటుకొన నారంభించును. ౧ వెనుకఁ జెప్పిన గర్భవాసవ్యాకులము నంతయు శిశువుజన్మించినతోడనే మఱచి పోవును. తరువాత దినదినక్రమమునఁ బెరుగనారంభించును. ౨ బాల్యమునందు శిశువు మేనిమీఁది చర్మము మిగులసుకుమారముగ నుండును. అందుచేత శిశువు కొంచెము దెబ్బసోకినను సహింప జాలక విలపించును. ఆసమయమునందు సుఖమునుగాని దుఃఖమును గాని పరులకుఁ దెలుపుదమన్న నోరులేదు. ౩ శరీరమునం దేదేని కష్టముగలిగినను, ఆఁకలితో వ్యాకులపడుచున్నను శిశువు మిగుల విలపించును. ఎంతయేడ్చిన నేమిఫలము? శిశువు మనస్సులోని సంగతి నెవ్వరును గ్రహింపఁజాలరు. ౪ తల్లి పైనుండి యోదార్చును గాని లోననేబాధకలిగినదో, యేల శిశువు ఏడ్చుచున్నదో గ్రహింపఁ జాలదు. శిశువునకీ బలుమారు దుఃఖము కలుగుచునేయుండును. ౫ శిశువు తేపతేపకు వెక్కివెక్కి యేడువసాగును. తల్లిచంక నెత్తుకొని యెన్నోశ్రమలఁబడి యోదార్ప నారంభించునుగాని యేవేళచే బిడ్డయేడ్చుచున్నదో యామె యెటుల గ్రహింపగలదు? పాపమా శిశువు తనలోఁదాను వ్యాకులపడుచునే యుండును. ౬ వ్యాధులు మాటిమాటికిని శిశువునకుఁ గలుగుచుండును. వానిబాధలకు సహింపఁజాలక వాయెత్తి బిగ్గరగా నేడ్చును. అరచును. పడును. మందు యగ్నిహోత్రమునఁ బడి దేహము గాల్చుకొనును. ౭ శిశువున కెట్టియపాయము కలుగకుండఁ గాపాడుట యసాధ్యమగుపని. ఆధివ్యాధులమూలమున నెన్నియో యుపద్రవములు కలుగును. ఒకొక్కప్పుడు దుర్ఘటపరిస్థితు లేర్పడి బాలుఁడు దుర్మరణము నొందును. ౮ దైవవశమున నాదుర్ఘటపరిస్థితులు తొలఁగి పూర్వ పుణ్యము దయమైనచో దినదినక్రమముగా వృద్ధినొంది తల్లిని గుర్తింపసాగును. ౯ ఒకక్షణమైనఁ దల్లిని జూడకుండెనేని దుఃఖముతో వెక్కివెక్కి యేడువ మొదలుపెట్టును. ఆతరుణమున శిశువునకుఁ దల్లితో సమానముగఁ బ్రియకరమైన దెద్దియునులేదు. ౧౦ తల్లి వచ్చుచున్నదను నాశతో దిక్కులు వెదకును. తల్లిలేకున్నచోఁ గొంచెమేని యూరడిల్లకుండును. శిశు వీస్థితిలోఁ దల్లి తన్నొకనిముసము సేపు విడనాడినను సహింపక విలపించును. ౧౧ బ్రహ్మాదిదేవతలు వచ్చినను లక్ష్మీదేవియే స్వయముగావచ్చి బుజ్జగించినను శిశువు తన తల్లిలేకున్నయెడ సంతోషింపదు. ౧౨ ఎంత కురూపిణియైనను, ఎంత యవలక్షణురాలైనను, ఎంత దురదృష్టవంతురాలైనను, బాలునకుఁ దల్లియే మిగులఁ బ్రియతరమగు పదార్థము. అంతకుమించిన ప్రియమగు పదార్థ మింకొకటి లేదు. ౧౩ తల్లిలేనిశిశువు దీనముగను హీనముగను గనుపించును. శిశువును దల్లి కోపించి యావలకు నెట్టిన యెడల నాశిశువు మఱల నామెనే కౌగలించుకొనును. ౧౪ తల్లి సాన్నిధ్యమున శిశువు ఎన్నివిధములైన సౌఖ్యములో యనుభ

వించును. ఆమె దూరమైనంతన వ్యాకులపడును. ఇంతయేల! చిన్నతనమునఁ దల్లియెడ నింతయనరాని ప్రీతి యుండును. ౧౫ కాలవశమునఁ దల్లి గతించిన యెడల శిశువు మాతృహీనుఁడగును. ఆదురవస్థలోఁ దల్లికయి అమ్మా! అమ్మా! యని హృదయము కరగిపోవునటుల నేడ్చును. భయముచేఁ గంపించును. ౧౬ అమ్మ కానరాకున్నచో శిశువు మిగుల దైన్యముతోఁ గనుపడిన వారలనెల్లఁ దేరిపారఁ జూచుచుండును. అమ్మ మరలవచ్చునని శిశువునకు మనస్సులో ఆశవంటిభావ మొకటి యంటుకొనియుండును. ౧౭ తల్లియే కాఁబోలునను భ్రాంతితోఁ గనిపించిన వారినెల్ల నదేపనిగఁ జూచుచు వారలు తనతల్లి కాదని గ్రహించి పాపము శిశువు ముఖము వ్రేలవైచికొని దీనత్వముతో నిరాశ నొందును. ౧౮ మాతృవియోగమున దుఃఖించి క్రమక్రమముగా శిశువు దుర్బలమై కృశింప మొదలుపెట్టును. ౧౯ దైవయోగమునఁ దల్లి బ్రతికియున్నచో శిశువును వేయికన్నులతోఁ గనిపెట్టి కాలోచితముగఁ బెంచుటచే శైశవావస్థ క్రమక్రమముగా విడిపోవును. ౨౦ ఒక్కొక్క దినము గడచినది మొదలు శిశువు తెలివితేటలు గడించి తల్లిని వదలిపోవలయునని తలంచును. ౨౧

క్రమముగా శిశువునకు ఆటపాటలయం దుత్సాహ మారంభమగును. ఆటలాడుకొనుటకు నీడుజోడు బాలురను బిలుచుకొని గుంపుచేసి వారితోఁ గాలయాపనము చేయును. తానోడిపోయినచో విచారపడుచుఁ దాను గెలిచినచో నానందించుచు శిశువు క్రీడలతోఁ గాలము బుచ్చును. ౨౨ శిశువు మగవాఁడైనచో నైదవయేట నక్షరాభ్యాసము చేయింతురు. తల్లిదండ్రులు మిగులఁ బ్రేమతో జద[illegible]ంచుచున్న[illegible] బాలుఁడది మిగుల దుఃఖముగా భావిం[illegible] ఆటలాడుకొనుచు[illegible] బాలురతోఁ గూడి తాను గడించు

ఆనందమునందె బుద్ధియుంచును. ౨౩ బాలురతో నాటలాడుతరుణమునఁ దల్లిదండ్రులు మున్నగువా రెవ్వరును బాలునకు జ్ఞాపకమునకురారు. ఒక్కొక్కప్పు డాటలలోఁ బ్రమాదకరమగు పరిస్థితు లాకస్మికముగాఁ దటస్థమగును. ౨౪ ఆటలాడుచుఁ బ్రమాదమునఁ బడరాని తావునఁ బడిన యెడలఁ బండ్లూడిపోవును. గుడ్లుచిదికి నీరుగారిపోవును. కాళ్లువిరుగును నడుమునకు దెబ్బతగిలి గూనివాఁడగును. మదముడిగిపోవును. ఇంక నెన్నియో దుర్దశలు తటస్థమగును ౨౫ అట్లు కాదేని దైవికముగాఁ గొన్ని వ్యాధులలోఁ దగుల్కొనును. స్ఫోటకము పోయును. తలలోఁ బోటు పుట్టును. జ్వరము తెంపులేక వచ్చుచుండును. హృదయశూలయో వాతప్రకోపమో కలుగును. ౨౬ భూతప్రేతాదుల పీడవలన శిశువున కేదియో రోగము వచ్చినదని తలిదండ్రులు మిక్కిలి విచారపడుదురు. ౨౭ బేతాళగ్రహమో కంకాళగ్రహమో బాలుని బట్టినది. బ్రహ్మగ్రహము బాలు నావేశించినది. కాదుకాదు. ఏదియో గాలిసోకినది. అయ్యయో! ఏదియో నిర్ణయింపఁజాలకుంటిమని చుట్టుపక్కములు పలుకుచుందురు. ౨౮ వీరులావేశించిరని యొకఁడనును. ఖండేరావు (ఈపేరి దేవతావిశేషము మహారాష్ట్రదేశమునఁ గలదు) ఆవేశించినాఁడని వేఱొకఁడనును. ఇవియన్నియు నమ్మదగినవి కావు. వ్యర్థమగు నాలోచనలు. ఇవి బ్రహ్మరాక్షసిచర్యలే యని యింకొకఁడు నిశ్చయించును. ౨౯ ఎవఁడో గిట్టనివాఁడు ప్రయోగము చేసినాఁడని మఱియొకఁడనును. ఎవరో భూతవైద్యులు దుష్టగ్రహము నీబాలునిపై నావేశపఱచిరని యొక్కఁడు తెల్పును. ఇంతతో నూరకుండరు. దేవీపూజలో నేదియో యపచారము గావించినాఁడు ఇది దానిఫలితమని కొంద అందరు. ౩౦ ఇదియంతయుఁ గర్మానుభవముని[illegible]కొందురు. ఈవిధముగా దేహమున నన[illegible]

తురు. అనంతరము ప్రసిద్ధులగు రాజవైద్యులు, భూతవైద్యులు చికిత్సకు దొరకొందురు. ఒకవైద్యుఁ డీతఁ డిక బ్రదుకుట దుస్తరము, నమ్మకము లేనిదిగ నున్నదనును. ఇంకొకఁడు వీఁడుచావఁడు పాప కారణమున యాతనల నొందుచున్నాఁడని పలుకును. ౩౨ ఈప్రకారముగా నెటులో వ్యాధిబాధలొంది యొంది మృత్యుముఖము నుండి బయటపడఁగానే త్రివిధపాపములచేఁ గ్రమక్రమముగాఁ దప్తుఁడై పరితాపమునకు లోనగును. ఇంతియగాక సంసారదుఃఖములతోఁ బ్రాణి బహువిధములగు దుఃఖములననుభవించును. ౩౩ ఇంత గ్రంథము జరిగినపిమ్మటఁగూడ నొకవేళ మానవుఁడు సజీవుఁడై యున్నచోఁ గొట్టియు నూరిపోసియుఁ గోపగించియుఁ దల్లిదండ్రులాతనిని సంసారవ్యవహారములలో దక్షుని గావింతురు. ౩౪

కొంతకాలము గడిచినమీఁదట మావానికిఁ బెండ్లియీడు వచ్చెనని తల్లిదండ్రులు పెండ్లిముచ్చటల నారంభింతురు. బహువిధములగు వైభవములను జూపించి కడకుఁ గన్యానిశ్చయము గావింతురు. ౩౫ పెండ్లికిఁ దరలిపోవుటలోఁ జేయుమహావైభవములకు బాలుఁడు మిగుల నానందించును. వివాహానంతరము బాలుని హృదయమును అత్తవారియిల్లాకర్షించును. ౩౬ తల్లిదండ్రులేమైపోయినను సరియే అత్తవారియింటఁ గొన్నివిశేషముల సమకూర్ప యత్నించును. తనవద్ద ద్రవ్యములేనియెడల వడ్డికయిన ద్రవ్యమును దెచ్చును. ౩౭ తల్లిదండ్రుల నొకప్రక్కకుఁ ద్రోసి అత్తవారిసంబంధులపయి బాలుఁడు ప్రేమమిక్కుటముగా నుంచును. అంతియగాక తల్లిదండ్రులు కష్టములు సహించుటకే జనించిరని వారిని ప్రేమతోఁ జూడక [illegible]దరింపక విడిచి పెట్టును. ౩౮ బాలుఁడు క్రమక్రమముగా యువకుఁడగును. పెండ్లి[illegible]రె మరల నిద్రకు తనయింటికిరాగానే యువకునియుత్సాహమునకు [illegible]యుండదు. ఇంక నాతోసమా

నులు లేరని భార్యనుజూచి మురియనారంభించును. ౩౯ భార్య గృహమునలేకున్నపుడు తల్లిదండ్రులతో సోదరసోదరీలతో నిండినతన యిల్లు శూన్యగృహముకైవడిఁ గనిపించును. అవిద్యాకారణమునఁ గ్రమముగాఁ దనను దామఱచి యువకుఁడు కేవలము స్త్రీమోహమున మునిగితేలుచుండును. ౪౦ సంభోగము జరుగనప్పుడె భార్యపయి నింతప్రేమ భర్తకుఁ బెంపగును. స్త్రీ వయస్సువచ్చి కాపురమునకు వచ్చినపుడు మర్యాదోల్లంఘనము గావించుననుటలో వింతయేమున్నది? దంపతులకు నొకరిపయినొకరికిఁ గ్రమక్రమముగాఁ బ్రేమవృద్ధియగును. ఇరువురిప్రాణములు కామమునందుఁదగుల్కొనును. ౪౧ ఒకక్షణముసేపేని యువకుఁడు తన భార్యను జూడకున్నయెడల మనస్సు పరితప్తమగును. ప్రియకరమగు నాస్త్రీరత్నము మనసు నాకర్షించును. ౪౨ కోమలములును మంజులములును నగుమాటలు, అడఁకువ సిగ్గు ప్రకటించు ముఖకమలము, ఓరచూపులతో విలాసములొలయు నేత్రములు మున్నగునవి యువకు నాకర్షించును. ౪౩ ఈవిధముగాఁ దనచెలువపయిఁ గలుగు కామోద్రేకము నాపుట యెంతవానికేని యశక్యము. అటులే శరీరవ్యాకులముగూడ నాపుట దుస్తరము. కామోద్రేకితరప్రయత్నములయందు హృదయము లగ్నముకానేరదు. ఉదాసీనుఁడై యుండుటయే యప్పుడు సౌఖ్యమనిపించును. ౪౪ ప్రయత్నములు వెలుపల గావింపవలసియున్నది. మనస్సు తనచెలువపయి నిమిడియుండును. క్షణక్షణమును యువకునిహృదయమునఁ దన చెలువ రూపురేఖావిలాసములు కనిపించుచుండును. ౪౫ పురుషునితోఁ గలసినపుడు సుందరి బాగుగా మనసిచ్చి ప్రియుఁడా! నీవు నా ప్రాణములకుఁ బ్రాణమవు నావలపులపంటవు అనిపలికి యెంతయేని మోహముగలుగఁజేసి యాతనిహృదయమును దొంగిలించివైచును.

౪౬ దారిదోపుడుదొంగలు తమవేషభాషలను మార్చుకొని సంచరించుచు బాటసారుల గొంతుకల కురివైచి ధనములను దొంగిలించునట్లు యువతియుఁ గొడుకులును ఆప్తజనులును యువకుని హృదయమును లోఁగొందురు. ఈవిషయము వయస్సునన్నంతవరకుఁ దెలియదు. చావఁబోవుముందు బాగుగా గ్రహింపఁగలుగును. ౪౭ ప్రీతియంతయుఁ దనప్రియురాలిపైనుంచి యువకుఁడు తన్మయుఁడై యుండును. ఒకవేళ నెవరేని తనప్రియురాలియెడ ననిష్టము ప్రకటించిరేని యువకుఁడు కొంచెమేని సహింపఁజాలఁడు ౪౮ తనస్త్రీపక్షము వహించి తల్లిదండ్రులను దిరస్కరించి నీచభాషణములాడుటకుఁగూడ సాహసించి యవసరమయిన వేఱుకాపురము బెట్టును. ౪౯ తనచెలువను బురస్కరించుకొని యువకుఁడు సిగ్గు విడిచిపెట్టును. మిత్రత్వమును విడనాడును. తనస్నేహితులందఱితోఁ గూడ నాయమకతననే పగ కొనితెచ్చుకొనును. ౫౦ క్రమక్రమముగాఁ బరదాస్యమున కలవాటుబడి తనదేహమును విక్రయించును. సేవకవృత్తికి లోనగును. వివేకమునంతయును గోలుపోవును. ౫౧ అతివ్యామోహమును అనువిధేయవృత్తిని, పరాధీనభావమును గడించును. ౫౨ లోభియు మోహియునై క్రమక్రమముగా ధర్మమును విడిచివేయును. తీర్థయాత్రలకుఁ బోడు. కులాచారగారవాదుల గంగలోఁ గలుపును. ఇట్టి దురాచారములన్నియు యువకునకు స్త్రీకారణముననే సిద్ధించును ౫౩ స్త్రీకారణముననే పురుషుఁడు శుభాశుభములనుగూర్చిన విచారణము మానుకొనును. తనువును, మనస్సును, ధర్మమును, ధనమును, సర్వస్వమును గూడ స్త్రీకిఁ బురుషుఁ డనన్యభావముతో సమర్పించును. ౫౪ పరమార్థమును విడచిపెట్టుటయు సత్యమగు హితము గ్రహింపకపోవుటయు భగవంతునిముందు అప్రమాణుఁడుగనుంటయుఁ బురుషునకు స్త్రీ

కారణముననే సంభవించును. కామమునఁ జిక్కుకొని పురుషుఁడెందుకుఁ గానివాఁడగుట సైతము స్త్రీకారణముననె. ౫౫ పురుషుఁడు కామినీమోహమునఁ జిక్కుకొని కావించుదోషము లెన్నేని గలవు భక్తినివిడిచిపెట్టును. విరక్తిభావమును జేరువకు రానీయఁడు. సాయుజ్యముక్తినిగూడఁ దుచ్ఛముగాఁ దలంచును. ౫౬ బ్రహ్మాండమునుగూడఁ దనస్త్రీకారణమున లక్ష్యముగాఁ దిలకింపఁడు. స్నేహితులను దుష్టులని నిశ్చయించును. ౫౭ ఈవిధముగా యువకుఁడు స్త్రీప్రేమయందు మగ్నుఁడై సమస్తయోగ్యవిషయములతోడను సంబంధము త్రెంచివేయును. ఇంతలో నాకస్మికముగఁ దనవలపుల బంటయుఁ జక్కదనాలకెంకియునగు భార్యమరణించును. ౫౮ దీనితో యువకునిజీవితము మాఱిపోవ నారంభించును. హృదయమునం దింత యనరాని విచారము వృద్ధియగును. తనలోఁ దాను ప్రబలముగు ఘాత జరిగినది. నాగృహస్థాశ్రమము కూలిపోయినది. అనిపరితపించును. ౫౯ దుఃఖముచే భ్రాంతుఁడై యిటులఁ గలవరించును. "ఓప్రాణప్రియురాలా! నన్ను విడిచిపెట్టి పోతివిగదా? నీవు మరణించుటచేఁ బూదోటవలెనున్న నాగృహము కూలిపోయినది. నాయజ్ఞానము నశించినది. ఇఁక మాయను విడచెదను" ౬౦ న్మృతినొందిన తనప్రియురాలి కళేబరమును జంఘలమీఁదనుంచుకొని రొమ్ము బాదుకొని విలపించును. అనంతరము కనఁబడినవారిముందెల్ల నాబంగారుపంట నావలపులదీవి నాపున్నెముల గని మాయమైపోయినదని సిగ్గువిడిచి మృతభార్యనుగూర్చి యాడుచుండును. ౬౧ కడకు యువకుఁడు మనస్సు నెటులోఁ గుదురుపఱచుకొని సాటివారితోఁ నాయిల్లు మునిగిపోయినది. ఇఁకముందీ గృహస్థాశ్రమకూపములోఁ బడను." అని వ్యర్థప్రతిజ్ఞలుగావించి విచారాతిశయముచే నొడలుమరచి యేడవఁదొడఁగును. ౬౨ పత్నీవియోగకారణమున భయభ్రాంతుఁడై

గృహస్థాశ్రమమునెడఁ దొలుత విముఖుఁడగును. పిదప విరాగమును దుఃఖమును బురస్కరించుకొని యోగిగనో లోకమహాత్ముఁడుగనో మారును. ౬౩ అటుల జరుపఁజేసి గృహమును గృహస్థధర్మమును విడనాడఁజాలక రెండవవివాహమునకై ప్రాఁకులాడి యొక చిన్నదానిని బెండ్లాడును. 'అది మొదలా క్రొత్తభార్యయే తనను ద్ధరించునది' యని తన్మయుఁడై పంచప్రాణములు దానిపైనుంచును. ౬౪ ఈ రెండవ సంబంధపు భార్యపయిఁ దనసంతోషము ప్రేమ లగ్నమొనరించి మానవుఁ డేవిధముగా వర్తించునో యావివరమునంతయు శ్రోతలు రాఁబోవు సమాసములో వినఁగోరెద. ౬౫

మూఁడవ సమాసము

స్వగుణపరీక్ష 2

(రెండవవివాహమువలనిదుర్దశ, సంతానోత్పత్తి)

పురుషుఁడు రెండవవివాహము జరిగినంత పూర్వదుఃఖము నంతయు మఱచిపోవును, సుఖపడఁదలఁచి మరల గృహస్థాశ్రమము లోఁ దగుల్కొనును. ౧ తొలుత యింతయనరాని లోభత్వమేర్పడును. కడుపునిండ నన్నముగూడ భుజింపఁడు. ద్రవ్యముకొరకవసరమైనచోఁ బ్రాణముైనైన విడచుటకు సిద్ధపడును. ౨ ఎప్పుడైనననేల? కల్పాంతమందుఁగూడ గవ్వయేని వ్యయముగావింపఁ దలంపఁడు మఱల మఱల ధనము ప్రోగుచేయుచుండును. హృదయమునందు సద్భావనకుఁ గొంచెమేని తావొసంగఁడు. ౩ సయముగా ధర్మము గావింపఁడు. ఇతరులు ధర్మముగావింతురేని యాటంకపరచును. సాధుజనులను లేనిపోనివికల్పించి నిందగావించును. ౪ తీర్థములు వ్రతములు, అతిథులు, అభ్యాగతులన్న నేవగించును. చీమలనోటియం

దున్న ధాన్యపుగింజలనుగూడ నేరి కూడఁబెట్టఁదలంచును. ౫ స్వయముగాఁబుణ్యకార్యములనాచరింపఁడు. ఇతరులపుణ్యకార్యములు గావించుచున్నచోఁ గనులారజూడలేఁడు. ఇతరులపుణ్యము వానిహృదయమునకుఁ గొంచెమేని రుచింపదు మంచిమాటలతోఁ బుణ్యాత్ములనుబొగడక తూలనాడ మొదలుపెట్టును. ౬ దేవతలను నిందించుటయో భక్తులఁ బరిహసించుటయో దేహబలముతో విఱ్ఱవీగుచు నితరులకు దుఃఖముగూర్చుటయో నియతవ్రతముగాఁ బెట్టుకొని ద్వితీయవివాహి పరపీడ కలిగించును. నిష్ఠురవాక్యములనాడి యితర హృదయములను నొప్పించును. ౭ నీతినివిడిచి దుర్నీతితోఁ బ్రవర్తించుటయు సదాగర్వముతో విఱ్ఱవీగుటయు ౮ బెద్దలను మోసగించుటయు శ్రాద్ధాదిపితృక్రియలు మానుటయుఁ గులదేవతల పూజలు విడచిపెట్టుటయు నియతకృత్యముగాఁ బెట్టుకొనును. ౯ తనకు భోజనమెప్పు డవసరమని తోఁచునో యప్పుడే దేవతానైవేద్యమొనరించును. బ్రహ్మణభోజనస్థానమునందుఁ దన్నుఁజూడవచ్చిన బావమరఁదిని గూర్చుండఁబెట్టి భుజింపఁజేయును. ౧౦ హరికథయన్న గంటగించును. ఈశ్వరునియందు లక్ష్యమేమాత్రము నుంచఁడు స్నానము సంధ్య గావించుటవ్యర్థము దానివలన నుపయోగమేమని వాదించును. ౧౧ కామ్యములందుఁ బూర్తిగా మగ్నుఁడై ధనము ప్రోగుచేయుచుఁ గానవచ్చినవానినెల్ల నమ్మించి నట్టేటముంచును. తరుణత్వసంబంధమగు మదమునందు లీనుఁడై యున్మత్తునికైవడి యొడలెఱుంగక వర్తించును. ౧౨

ద్వితీయ వివాహితుఁడగు యువకుఁడు నిండు యౌవనమున నుండుటవలన స్థిరబుద్ధితో నుండజాలక యకృత్యములను మహాపాపములను జేయసాగును. ౧౩ నేను బెండ్లాడినబాల మిక్కిలి చిన్నది. చిత్తమును జలింపనీయక నిలుపుటకు నాతరముగాదు. కాన స్వేచ్ఛ

వర్తింతునని మనస్సునకు సమాధానపఱచుకొని విషయలోలుఁడై పరకాంతాగమనమునకు దొరకొనును. ౧౪ జారవృత్తికి లోనైనది మొదలు ఈమె తల్లి ఈయమ తోఁబుట్టువు అను భేదములుమఱచి పరద్వారములలోఁ బడియుండి పాపకార్యము లెన్నేని చేయును. న్యాయస్థానములలోఁ దా నొనరించిన దోషములకు రాజకీయదండనముగూడ ననుభవించును. అప్పటికిని దనదుష్టప్రవర్తనమును గొంచెమేని సవరించుకొనఁడు ౧౫ పరస్త్రీని గాంచినంతన యాతని గామ ముదయించును. పాపమునకుఁ బాల్పడి తరువాత తటస్థించిన కష్టములనన్నిటిని భరించును. ౧౬ ఇంక నెంతటిపాపములఁ జేయుటకేని వెనుకడుగు వేయఁడు. శుభముగాని యశుభముగాని విచారింపఁడు సుఖవ్యాధులు దేహమున జీర్ణమగుటచే నాకస్మికముగా మహారోగియగును ౧౭ క్షయరోగముచే నానావస్థలుపడుచుఁ దానొనరించిన పాపములకు ఫల మీభూలోకముననే యనుభవించును. ౧౮ రోగములచే శరీరమంతయుఁ బగులును. ముక్కు చితికిపోవును. ఇదివఱకున్న సులక్షణములన్నియు నొకదానివెంట నొకటిగా దుర్లక్షణములుగా మాఱును. ౧౯ దేహమునందు నీరస మతిశయించి క్రమముగా క్షీణించిపోవును. అనేకవ్యథ లుత్పత్తియగును. పడుచుదనపుసత్తువ సన్నగిల్లును, ప్రాణి బొత్తిగా నెండిపోవును. ౨౦ శరీరమునం దంతటను బాధ యుదయించును, దేహము దుర్దశకుఁ బాల్పడును. శరీర మాపాదమస్తకము గజగజ వణక నారంభించును. శక్తి యుండదు. ౨౧ చేతులుకాళ్లు ఊడిపోవును. శరీరమునందంతటను బుండ్లుపడి పురుగులుపడును. వానినిజూచి పెద్దలుచిన్నలు అసహ్యించుకొని కేకరించి యుమ్మివేయుదురు. ౨౨ కడుపొక ప్రక్కను ఆకలిచే మలమల మాడుచుండును. నలుదిక్కులనుండి యింత నరాని దుర్వాసన బయలుదేరును. ప్రాణిపూర్తిగా దుర్గతికిఁ బాల్పడును ఇన్నియవ

స్థలు పడుచున్నను ప్రాణముమాత్రము పోదు. ౨౩ ఓ యీశ్వరా! నాకుమరణమునిప్పుడు ప్రసాదింపుము ప్రాణములు భరింపఁజాలకున్నాడను, ఎన్నియో పాపములొనరించితిని, నాదోషముల నేనెఱుంగకుంటినని తనలో వాపోవును. ౨౪ దుఃఖము నాపఁజాలక వెక్కివెక్కి యేడ్చును. తనశరీరమును జూచుకొనుకొలఁది హృదయము నందుఁ బరితాప మతిశయించుచుండును. ౨౫ ఈ ప్రకారముగా ననేకకష్టముల ననుభవించును. అన్నియు దుర్దశలుగా మారును. వీఁడు సేకరించిన ధనమంతయు దుష్టులు బందిపోటుగావించియో దొంగిలించియో గొనిపోదురు. ౨౬ అనంతర మీతని కిహలోకము గాని పరలోకముగాని సమకూరదు. విచిత్రమగు ప్రారబ్ధము నెత్తిమీఁదఁ గూర్చుండి యెన్నివిధములనో యాటలాడించుచుండును. పరమాసహ్యకరములగు దుఃఖముల నెన్నింటినో యనుభవించుచు మొండిబ్రతుకు బ్రతుకును ౨౭

ఈ విధముగా మానవుఁడు నానావస్థలు పడినపిమ్మట నాతని పాపసామగ్రి దినక్రమమునఁ దగ్గిపోవును. క్రమముగా శరీరవ్యథలు గూడ నొకదానివెంటనొకటి తొలగిపోవును. వైద్యులను గ్రహించి దివ్యౌషధముల నొసంగుదురు. అనంతరము జవసత్త్వము లేర్పడి యారోగ్యముగడించి సంచరింప మొదలుపెట్టును ౨౮ ఎటులో మృత్యుముఖ మునుండి బయటపడినంతన లోకులుజూచి పాపము చచ్చుచున్నవాఁడు బ్రదికినాఁడు. వీనిదిపునర్జన్మమే. మనుజులలోఁ గలిసినాఁడని యందురు. ౨౯ ఇంతజరిగినపిమ్మట కార్యముజరుపుకొని తనరెండవభార్యనింటికిఁ గొనివచ్చును 30 గృహస్థధర్మమునకుఁ గావలసిన పదార్థములను జక్కఁగా సమకూర్చును. స్వార్థబుద్ధిమాత్రము ఇన్నియవస్థలుపడిన మీఁదనైన నశింపదు. 3౧ కొంతధనమును కొన్నివస్తువులను సమకూర్చును. సంతానము కలుగమిచే విచాగ

మునొంది యిల్లుమునిగిపోయినటుల దుఃఖపడును. పుత్రసంతానము లేకపోవుటచేఁ తనజీవితము వ్యర్థమైనటులఁ దలంచునుఁ సంతానము లేనియాడుదానిని లోకులు గొడ్డురాలనియందురు. కొడుకులు గలగకపోయినమానె కొమార్తెలైనఁ గలిగినచో గొడ్డురాలనిపేరు పోవును గదాయని దంపతులు తలంచుచుందురు ౩౨ అదిమొదలు సంతానముకలుగుటకుఁ బురుషుడు నానావిధములగు నుపాయములను వెదుకనారంభించును. పెక్కు వేల్పులకు మొక్కును. ముడుపులను గట్టియుంచును. తీర్థయాత్రలకేగి యుపవసించును. బహువిధములగు పాపం డవ్రితములఁ జేయును ౩౩ అంతతో విషయసుఖములు మూలబడును. తనభార్య వంధ్యయయ్యెనను చింతతో నిలువునీరగును. ఇట్లు కొంతకాలము జరిగినపిమ్మటఁ కులదేవత ప్రసన్నురాలగును. సంతానముకలుగును. ౩౪ ఆశిశువుమీఁద నింతయనరానిప్రేమ కలుగును. స్త్రీపురుషులిరువురును క్షణమాత్రముగూడ నాశిశువు నేమరకయుందురు. ఒకవేళ నేదేని యనారోగ్యము కలిగినచో దీర్ఘస్వరముతో బిగ్గరగా విలపింతురు. ౩౫ ఈ ప్రకార మాదంపతులు దుఃఖములనుభవించుచుఁ గన్నగన్న వేల్పులకెల్ల మ్రొక్కుకొందురు. ఇంతలో నాకస్మికముగాఁ బూర్వపాపకారణమున నాబాలకుఁడు మరణించును. ౩౬ దీనివలన మిగులదుఃఖముకలుగును, ఇంటిలోఁ బుత్రశోకము వ్యాప్తియగును. ఈశ్వరుడు మమ్ము వంధ్యల నేలగావించెనోయని దంపతులు విలపింతురు ౩౭ మాకీద్రవ్యమెందులకు? అంతయుఁబోయినను సంతోషమే సంతానము కలిగినజాలును సంతానముకొఱకు సర్వస్వము విడువవలసివచ్చినను మాకు లక్ష్యములేదుఁ అనిపలుకుచుందురు. ౩౮ వంధ్యాత్వముపోయి కొంతకాలమేని గడువలేదు. ఇంతలో మృతకవంధ్య (బ్రదుకనిబిడ్డలఁగనెడుస్త్రీ) యనునామ మేర్పడినది. ఇప్పు డేయుపాయములతో నాకులకాంత కీపేరు తొలంగింపగలనని భర్త విలపించును ౩౯ దంపతులు గతించినసంతానము జ్ఞాపకమునకుఁ దెచ్చుకొని మాటిమాటికి తెగిపోయినది. ఓదైవమా మావంశము నశించినది కులదేవతలారా! మీరు మాపట్ల నేలనాగ్రహించితిరి?. మాకులదీపమారిపోయినది. ౪౦ అని దుఃఖించి దుఃఖించియిటులఁ బ్రతిజ్ఞలొనరింతురు. ఇప్పుడు మఱలఁబుత్రముఖసందర్శనభాగ్యము చేకూరినచో ధగధగలాడుచు మండెడు నిప్పుగుండములలో నడచెదము. కులదేవతల సన్నిధిలో శిశువునకుఁ బుట్టువెంద్రుకలు దీయించెదము ౪౧ ఓజగన్మాతా? నీకుఁ బూజగావించెదము బాలునకు నీపేరుపెట్టుదుము ముక్కునకుఁ బోగుఁ గుట్టించెదము మాకోరికలఁ గొనసాగనిమ్ము. ౪౨ ఇంతతోఁ దృప్తినొందక కానవచ్చిన దేవతలకెల్ల మ్రొక్కుబడులు చెల్లింతురు గోసాయులకొఱకు వెదకుదురు. సంతానము కలుగునని వృశ్చికములను మ్రింగివేయుదురు ౪౩ భూతములకు దృప్తిగా నుపాయనము లర్పింతురు అనేక దేవతలను దేహముమీఁది కావేశమునకుఁ దెచ్చుకొందురు. మామిడిపండ్లు కొబ్బరికాయలు బ్రాహ్మణులకుఁ బంచిపెట్టుదురు ౪౪ నానావిధములగు జారణమారణాదికములగు ఘోరకార్యములు చేయుదురు. పుత్రులు గలుగుట కెన్నియోపాట్లు పడుదురు. ఇన్ని పాటులుబడినను దైవానుగ్రహములేకపోవుటచే సంతానము కలుగదు. ౪౫ రజోదర్శనమైన నాలుగవదినమున వృక్షముక్రిందికరిగి యా వంధ్యాదంపతులు స్నానమొనరింతురు. అందుచేఁ బూలతోఁ బండ్లతో దులతూగుచున్న వృక్షము నిలువున నెండిపోవును. ఇదియె గాక పుత్రలోభమున నింకనెన్నియో దోషముల నొకదానివెంట నొకటి యొనర్తురు ౪౬ సమస్తసుఖములను విడనాడి యనేకోపాయముల నొనరించి వేసారి కట్టకడకు నిరాశతో భయపడుకాలమునఁ గులదేవత ప్రసన్నురాలగును. ౪౭ సుకృతవశమున వారి మ

నోరథము సఫలమగును. అదిమొదలు దంపతుల యానందమునకు మేరయుండదు. ఆవలికథను శ్రోతలు సావధానహృదయముతో నాలింపఁ గోరెదను ౪౮

నాలుగవసమాసము

స్వగుణపరీక్ష 3

(గృహస్థసంకటములచేఁ బరదేశమునకరుగుట)

సంతాన మెక్కువయగుకొలఁది చేతిలోని ధనమంతయు ఖర్చుపడును గౌరవముగా బ్రతికిన యాగృహస్థుఁడు బిచ్చమునెత్తు స్థితిలోకి వచ్చును తినుటకేమియు లభింపని దుర్గతికలుగును ౧ చిన్న పిల్లలాడుకొనుచుందురు. ఒకడు పారాడుచుండును ఒకఁడు గర్భము నందుండును. ఈ విధముగా బాలబాలికల గుంపుతో గృహము నిండిపోవును ౨ దినదినము వ్యయ మెక్కువయగుచుండును. ఆదాయమాగిపోవును. కన్యలు వివాహమునకుఁ దగినప్రాయము గలవారగుదురు. వారలకుఁ బెండ్లిచేయుదమన్నఁ జేతిలో ద్రవ్యము లేదు ౩ ఇదివఱకీగృహస్థుఁడు ధనవంతుఁడై యుండెఁగావున నలుగురిలో నీతనికి మర్యాదయుఁ బ్రతిష్ఠయు సమగ్రముగానుండెను ౪ ఇప్పటికిఁ జాలవఱకు సంపద యడుగు బట్టినది. మిగిలినది పరపతియొక్కటి మాత్రమే. ఇంటిలోఁ బూర్వపుఁ గలిమిలేదు. దినములు గడచిన కొలఁది లోలోన దరిద్రము హెచ్చిపోవుచున్నది ౫ కుటుంబ మొకప్రక్క వృద్ధినొందుచుండును. బాలబాలికలు దినదిన ప్రవర్ధమానులగుచుందురు. ఈ పరిస్థితులు జూచి మానవుఁడు చింతాగ్రస్తుఁడగును. ౬ కన్యలకు వివాహవయస్సు పూర్తియగును. పుత్రులుగూడ వివాహయోగ్యులగుదురు. మాబిడ్డను మీకుమారున కిత్తుమనసి కొందఱు చుట్టములు సంబంధములకు వత్తురు ఇఁకవివాహ

మాపవీలుండదు. ౭ ఒకవేళ బాలుర నట్లే యవివాహితులుగ నుంచినచోఁ బదుగురిలో నవ్వుబాటులు కలుగును. అప్పుడు లోకులు పరిహాసముగా ఈతఁ డీ జన్మదరిద్రులను బుట్టింపకపోయిన బాగుండెడిదని యందురు. ౮ పదుగురిలో నవ్వుబాటు ఇటులుండ మీఁదుమిక్కిలి పూర్వుల పేరుప్రతిష్ఠలకుఁగూడ లోపము తటస్థించును. ఇఁకవివాహములు జరుపవలయునన్నచో ఋణము లొసంగువారలెవరు? ౯ మొదట నెవరెవరి వద్దనో తెచ్చి కుటుంబపోషణమున కుపయోగించిన ఋణములు తీరనే తీరలేదు. వాండ్రొకప్రక్క నొత్తిడిచేయుచుందురు. ఈ విధముగా నా ప్రాణి చింతాసాగరమునందు మునిఁగిపోవును. ౧౦ వాఁడన్నముతినును. కాని వాని నన్నము తినివేయుచున్నది. మనస్సులో చింత మిక్కుటమగుటచే నాతురతతోనుండును. ౧౧ క్రమముగాఁ బరపతియంతయు నశించును ఇంటిలోని పదార్థములు వస్తువాహనములు కుదువకట్టున కొకదాని వెంట నొకటి యంగడికిఁ జేరును. అప్పు డాగృహస్థుఁడు ఓ దైవమా! నాకు దురవస్థ తటస్థించినది. దివాలాతీయుటకు సిద్ధమైతినని పలవించును. ౧౨ చేయునదిలేక యంగడికిఁ గొనిపోయి వస్తువుల దెగనమ్మును. పశువులను దూడలను విక్రయించి కొన్నాళ్లు కుటుంబము జరుపును. వడ్డికి ధనముఁదెచ్చి కుటుంబము మఱికొంతకాలము జరుపును. ౧౩ ఈ ప్రకారముగా ఋణములుదెచ్చి నలుగురిలో డంబముగా గృహస్థుఁడు కాలము జరుపును. లోకులీతనిజూచి వీఁడు యోగ్యుఁడు. పూర్వులపేరుప్రతిష్ఠల నిలిపినాఁడు అనిప్రశంసింతురు. ౧౪ ఋణబాధ యీ విధముగా వృద్ధినొందినకతన సాహుకారులందఱు నొక్కమాఱువచ్చి యింటిని ముట్టడివేయుదురు. ఋణదాతలు పెట్టు బాధలకు వెఱచి యా గృహస్థుఁడు పరదేశములకుఁ బాఱిపోవును. ౧౫ పరదేశములలో నెటులో రెండు సంవత్సరములు గడుప నిశ్చయించుకొని నీచసేవలోఁ బ్రవేశించును. మఱియు నెన్నియో

యాపదల ననుభవించును ౧౬ పడరాని పాట్లుపడి యెటులోఁ గనువుఁగట్టుకొని కొంత ధనము సేకరించును. మనస్సు ఇంటిమీఁదికేఁ బోవును. కొంతకాలము జరిగినమీఁదఁ దన యజమానివద్ద సెలవు గైకొని యింటికి వచ్చును. ౧౭ ఇంటివద్ద నీతని భార్యాపుత్రుల దురవస్థ చెప్పవలసినదె లేదు. వార లత్యంత దుఃఖముతోఁ దమగృహాధికారి యెప్పుడువచ్చునాయని త్రోవలు చూచుచుందురు. ఇంతవఱకు రాఁడాయెనే? ఏక్కడకుఁ బోయెనో? యేమియయ్యెనో? యని యింటివారను కొనుచుందురు ౧౮ ఇప్పుడు మేమేమి తినవలయును? ఆఁకలితో నెంతదనుకఁ జచ్చెదము? ఈశ్వరుఁ డిట్టిపురుషుని సాంగత్యమున మమ్ము నేలఁజేర్చెను? అనియింటిలోనివారందఱు పలుకుచుందురు. ౧౯ ఈ విధముగాఁ గుటుంబములోనివారందఱు తమత సుముఃఖములను గూర్చి పరితపించుచుదురేగాని యాతఁ డేమయ్యెనో యేమి యవస్థల పాలయ్యెనోయని యెవ్వరు దలంపరు. మఱియుఁ వృద్ధుఁడైనపిదపగూఁడ నాతని కెవ్వరు నుపకరింపరు ౨౦

ఇట్లు కుటుంబములోనివారందఱు త్రోవలు తేఱిచూచుచుండునంతలో నాతడాకస్మికముగా నింటికివచ్చును. పిల్లలు పరుగెత్తి నాయన యలసిపోయెనని పలుకుదురు. అతనిఁజూచి భార్యగూడ నానందించును. ఇఁక మనదరిద్రము తీఱినదని పలుకును. ఇంతలో నాతఁడు సంపాదించి తెచ్చినమూట భార్యచేతి కందిచ్చును. ౨౨ అందరకు నానందము కలుగును నాన్నవచ్చినాఁడు మాకుజొక్కాలు కుళ్ళాయిలు తెచ్చినాడని బాలురు సంతోషముతో బలుకుదురు. ౨౩ ఈ విధముగా నాలుగుదినము లానందము ననుభవించిన పిమ్మట నింటిలోనివారు మెల్లఁగ నిటుల నణగనారంభింతురు. ఈద్రవ్యమంతయుఁ గర్చుపెట్టుదుమేని మనము మఱల గష్టములు పడవలసివచ్చును ౨౪ కావుననిప్పుడు తెచ్చినద్రవ్యమును గష్టకాలములో

ననుభవించుటకు నిలువయుంచి పరదేశమునకుఁ బోవుటమేలు. దీని నిచ్చట మేము తినివేయకముందే మఱికొంతద్రవ్య మార్జించి తెచ్చుటయుక్తము ౨౫ ఇంటిలోనివారందఱి యభిప్రాయముగూడ నిటులేయుండును. తనసుఖముకొఱకేగదా కుటుంబమంతయు గృహస్థునివెంట నంటియున్నది? అత్యంతప్రేమపాత్రులగు భార్యసైతము సుఖముకొఱకే భర్తను వెంటనంటియున్నది. ౨౬ పరదేశములందనేకకష్టములను సహించి విశ్రాంతిని గైకొనుటకై పాప మీమానవుడిల్లుచేరినాఁడు. కాని యింటికడ స్వేచ్ఛగా శ్వాసమునైన దీసికొనలేదు. పోపొమ్ము మఱలఁ బరదేశమునకుబొమ్ము అను మందలింపులు మెండైనవి. ౨౭ తరువాత జ్యోతిష్కునితో నవసరము కలుగును. ప్రయాణమునకు సుముహూర్తమును విచారించుటలోఁ దన్మయుఁడగును. వాని హృదయము ఇంటిమీఁదనే చిక్కుకొనియుండుటచే బరదేశమున కేగుటకు బుద్ధికలుగదు. ౨౮ విధిలేక ధనసంపాదనమునకై పరదేశమున కామానవుఁడు పోవసంకల్పించి త్రోవలో నుపయోగమునకుఁ గొంతసామాగ్రి వెంటనుంచుకొనును. పిల్లలనందఱను నొక్కమారు ప్రేమతోఁ గనులారఁజూచి పరదేశయాత్రకు బయలుదేరును. ౨౯ భార్యవైపు చూచుచుఁ బోలేకపోలేక ముందునకేగును. వియోగమువలన దుఃఖ మతిశయించును. కాని చేయునదేమున్నది? దరిద్రవశమున నిల్లాలిస విడిచిపెట్టక తప్పదు. ౩౦ కన్నీరు కంఠమునిండివచ్చును. వియోగమా భరింపరానిది. తండ్రికి బిడ్డలకు భార్యకు భర్తకు వియోగము కలుగబోవుచున్నది. ౩౧ ఆ పరిస్థితులలో బాపమా గృహస్థుఁడు పెండ్లముబిడ్డలను విచారకరములగుచూపులతోఁజూచి నేనుపోయివచ్చెదను. అదృష్టమున్నచో మరల నొకరినొకరము చూచుకొందుము. లేనియెడల నిదియెతుదికలయిక ౩౨ యని నుడువలేకనుడివి మనస్సురాయిజేసికొని పరదేశమునకు బయలుదేరిపోవును. వెనుకకు మఱలిమఱలి మనస్సునిలువక చూచు

చుండును. తనలోఁ బాపము నాభార్య వియోగదుఃఖమును సహింపలేదు. పాపము ఏమిచేయగలదు. తప్పనిసరియైనదని యిల్లాలిని బ్రశంసించును. 33 ఇట్లు ప్రశంసావాక్యములు పలుకుచుఁ దన గ్రామమును విడిచిపోవును. గార్హస్థ్యచింతతోఁ జిత్తము కలవరపడుచుండును. మోహకారణమునఁ బ్రపంచాసక్తిలోఁబడి యాతఁడు పరితపించుచుండును. 3౪ అప్పుడు తల్లిస్మరణకువచ్చును. ఆసమయమునం దిట్లు పలుకును. ఓతల్లీ! నీవుధన్యురాలవు. నావలన నీవెన్నియోకష్టములనుభవించితివి. మూర్ఖుఁడనగుటచే నీయోగ్యత నెఱుంగఁజాలకపోతిని. 3౫ నేఁడు నీవునాయొద్దనుంటివేని యీయవస్థలో నన్ను క్షణమేని విడిచిపెట్టియుండవు. నన్ను విడిపోవలసివచ్చినపుడెల్లఁ గన్నీరుమున్నీరుగాఁ విలపించుదానవు. ఆమోహమే వేఱు. 3౬ వాస్తవముగాఁ బుత్రుఁ డెట్టిదరిద్రుడైనను ఎంతటిబిక్షుకుఁడైనను తల్లికిమాత్రము తప్పక ప్రియతముఁడు. వానిదుఃఖావస్థను గాంచినచో నామె తనహృదయమున నెంతయో వ్యాకులపడును. 3౭ గృహస్థాశ్రమము కావలయునన్న మఱలమఱల సమకూరఁగలదు. కాని యెవరిగర్భమునుండి యీశరీరము వుత్పత్తియయ్యెనో యాతల్లి వెయ్యిజన్మములకేని లభింపఁజాలదు. 3౮ ఆమె మిగుల గయ్యాళియైననుసరియే ఆమె తల్లియే. వేలకొలదిస్త్రీలను గైకొనుటవలన నేమిఫలము? సర్వము నెఱింగియుఁ గామవికారమునకు లోనై వ్యర్థముగా జీవితము పాడుచేసికొంటిని. 3౯ ఈకామకారణముననే ప్రాణసమానులగు నాస్నేహితులతో నకారణముగాఁ గలహించితిని. స్నేహితులను దుష్టులనితలంచితిని. ౪౦ తల్లిదండ్రులకెట్టివిచారము కలుగనీయక సంతోషముగా నుంచు గృహస్థుఁడే ధన్యుఁడు. అంతియగాక స్నేహితులను నిష్ఠురవాక్యములనాడి మనస్సు నొప్పింపనివాఁడు ధన్యతముఁడు. ౪౧ భార్యాపుత్రులసాంగత్యము జన్మమున్నంతవరకు వెంటనంటియుండును. తల్లిదండ్రులు మాత్రము

దాటిపోయినపిదప వలయునన్న లభింపరు. ౪౨ ఇదియంతయు నేనిదివరకు బాగుగా వినియేయుంటిని. కాని దేహములో జవసత్త్వములున్నంతవరకు నీయంశ మనుభవమునకు రాదయ్యెను. ఈనా తుచ్ఛమానసము సంభోగసుఖమున నింతవరకుఁ బూర్తిగా మగ్నమైయుండెను. ౪3 ఈసతియు నీకుమారులు మిత్రులవలెఁ గనిపింతురు. నిజమునకు వీరలుమిత్రు లెన్నఁటికినిగారు. గొప్పస్వార్థపరులు. తనతమసౌఖ్యముల కొరకై వీరలు పురుషు నాశ్రయించుకొనియున్నారు. వీరియెదుటకు శూన్యహస్తములతో నెటులఁబోవలయునో తోఁచక సిగ్గగుచున్నది. ౪౪ ఇప్పు డేమైనఁ గానిమ్ము ద్రవ్యము నార్జించితీరవలయును. రిక్తహస్తములతో నేగుట దుఃఖకారణము. ౪౫ ఈప్రకారములగు యోచనలు చేయుకొలఁది పురుషునిహృదయము దుఃఖపూరితమగును. క్రమముగాఁ జింతాసాగరమునందు మునిఁగిపోవును. ౪౬ అనంతరము పరదేశమునకేగి ద్రవ్యముకొరకుఁ దనదేహమును బరాధీనమొనరించును. కుటుంబమునకు సేవకుఁడై యీశ్వరునియెడ విశ్వాసద్రోహియగును. ౪౭ ఇట్లు పురుషుఁడు కేవలకామముతోఁ బరవశుఁడై తనపవిత్రజన్మమును వ్యర్థముగాఁ గోల్పోవుచున్నాఁడు. ఇంతలో నాయుష్కాలము పూర్తియగును. అపు డెచ్చటివచ్చట విడిచిపెట్టి యొక్కఁడే దాటిపోవును. ౪౮ కొంతసేపువరకా ప్రాణి తనమనస్సునందు గతముఁదలంచి పశ్చాత్తాపమునొందును. క్షణమాత్రముకొరకు ఉదాసీనుఁడగును. మరల శీఘ్రముగనే మాయాజాలమునందుఁ దగుల్కొనును. ౪౯ పుత్రికలు పుత్రులు జ్ఞాపకమునకువత్తురు. హృదయములో మిగుల ఖిన్నుఁడగును. నాపిల్లలను నేవిడచిపోవుచుంటినని పలవించును. ౫౦ ఇట్లు వెనుకటిదుఃఖములన్నింటిని స్మరణకుఁదెచ్చుకొని పనివిపనివి బిగ్గరగ నేడువనారంభించును. ౫౧ అరణ్యరోదనము నొనరించును. ఓదార్చువారెవరు గనఁబడరు. తనహృదయము నాలోచనములోనికి దించి

౫౨ యిపుడేడ్చిన నేమి ప్రయోజనము? ప్రాప్తమెద్దియో దానిననుభవించి తీరవలయును. అనితనకై తానెటులో నిబ్బరించును. ౫౩ ఇటుల బహువిధములగు దుఃఖములచే భీతినొంది శల్యమాత్రావశిష్టుడై పరదేశయాత్రకు బయలుదేరును. ముందుజరుగుసంగతి సాదరముగా వినగోరెద ౫౪

ఐదవసమాసము

స్వగుణపరీక్ష. 4

(మూడవ వివాహమువలనిసంకటములు–వృద్ధావస్థవలనిదుఃఖములు.)

ఇపుడుమరల ఆప్రాణి పరదేశములోనికరిగి ప్రయత్నమున కారంభించును. నానావిధములగు పరిశ్రమలను గావించును. ౧ ఈదుస్తరమగు సంసారసముద్రము దాటుటకు మానవుడెన్నికష్టములుభరించెనో యెవరు నిర్ణయింపగలరు? మూడునాలుగు వత్సరములు పరదేశములలో దాస్యమొనరించి మరల గొంతధనము సేకరించును. ౨ తత్క్షణమె యింటిత్రోవబట్టును. ఇల్లుచేరి విచారింపగా దేశమునందు గరవుకలిగినదనియు నందుచే నింటిలోనివారందరు దుఃఖములపాలై యుండిరనియు గ్రహించును. ౩ ఇక వానికుటుంబస్థితిగతు లెటులున్నవో వినుడు. ఒకకుమారునకు గండలెండిపోయి యాహారములేమిచే అస్థిపంజరమువలె నుండెను. ఒకనికి గ్రుడ్లువెళ్లివచ్చెను. ఇంకొకడు దీనావస్థలోనై నిలువలేక గజగజవణకుచున్నాడు. ౪ ఇంకనొకడు మూలుగుచు జాలిచూపులుచూచుచు గూర్చుండియున్నాడు. మరియొకనికి ఒడలువాచినవి. వేరొకడు చనిపోయినాడు. ఈపరిస్థితులలో దుర్దశననుభవించు తనకుటుంబమును నీతడు తిలకించును. ౫ అయ్యో పూదోటవలెనున్న నాకుటుంబమున కెంతటిదుర్గతి పట్టినదని యేడువ

నారంభించును. కన్నీటితో గంఠమునిండిపోవును. అత్యంతవ్యాకులభావముతో బరితపించును ౬ కొంతసేపటికి దెప్పరిల్లినమీదట గుమారులందఱును దండ్రిని సమీపింతురు. అందొకడు నాయనా! తినుటకేమేని యొసంగుమనిపలుకుచు ఆకలిచిచ్చుచే నకనకలాడుచు బైబడును. ౭ వేరొకడు మానాన్న మాకేమియో తెచ్చినాడని మూటవిప్పిచూచును. చేతికిజిక్కినది చిక్కినటులందుకొని నలువురుపిల్లలు నమలి వేయుదురు. కొంత నోటిలోనున్నది. కొంత చేతిలోనున్నది. ఈదశయందే కుమారులప్రాణములు వెడలిపోవును. ౮ అత్యాతురతతో దినుటకారంభించుటచేత దినెడువారు తినుచుండగనే చావుతటస్థించును. మిగిలినవారు అజీర్ణవ్యాధితో గతింతురు. ౯ ఈవిధముగా గుటుంబమంతయు మృత్యుదేవతకు బలియగును. కర్మానుభవమున మిగిలియున్న యొకరిద్దఱుబాలురీయకాలమృత్యుముఖమున బడక బ్రదికియుందురు. వారుగూడ దల్లిలేని కలవరపాటుతో విచారపడుచుందురు. ౧౦ ఈవిధముగా గుటుంబమంతయు క్షామదేవతకు బలియగును. కొంతకాలమునకు సుభిక్షమగుకాలమేతెంచును. ౧౧ చావగా మిగిలిన పసికూనలను సంబాళించువారలకు గరవువచ్చును. తనచేతి మీదుగ వండికొని తినుచు బిడ్డలు దాను గాలము గడుపవలసివచ్చును. వంటపనియన భయముపుట్టును. ౧౨ ఇరుగుపొరుగువారి నిర్బంధము తన ప్రాలుమాలిక ఆధారపరచుకొని మూడవవివాహము చేసికొనును. దానితో శేషించినధనమంతయు గర్చుపడి అప్పుమిగులును. ౧౩ ఇంటనున్న లాభములేదు. కాగలకష్టము లెన్నోయున్నవని గృహస్థుడు ద్రవ్యసంపాదనమునకు మరల బరదేశమునకేగి యెట్లో కొంతరొక్కము నార్జించి యిల్లుచేరును. ఇంటివద్ద సవతితల్లికి గుమారులకు గలుగు కలహములుచూచి విసిగిపోవును. ౧౪ భార్య

మంచిపడచూఁదనములో నుండును. పుత్రులామెయెడ నసూయతో నుందురు. భర్తను వయసా జారి దానికిఁదోడుగా నశక్తత యేర్పడును. ౧౫ కుమారులు తమలోఁదాము తగవులాడుచు నొకరిమాటనొకరు వినక పెనగులాడుచు దెబ్బలాటకు దిగుదురు. ఈపరిస్థితులలో నతఁడు తనయిల్లాలిమాటలనే విశ్వసించుచు నామెపయిఁ బ్రీతియుంచి కనుసన్నలలో మెలంగును. ౧౬ తనభార్యావిషయమున నకారణముగా సందేహము కలుగును. ఎల్లప్పుడాందోళనము. ఏవిచారమేని మనస్సునఁ స్థిరముగాఁ గొంచెముకాలమేని యుండదు. అందుచేఁ దనవ్యవహారములను బరిష్కరించుటకు మధ్యవర్తులగు పెద్దమనుష్యులను సమకూర్చును. ౧౭ పెద్దమనుష్యులీతగవులు త్రెంచుటకు విభాగములు కాకతప్పదని యున్నయాస్తినంతయు భాగముల వరుసను బంపకము చేయుదురు. ఈపంపకములోఁ బక్షపాతమున్నదని కుమారు లాక్షేపింతురు. ఇందుచే విభాగము పూర్తికాదు. చివరకు యుద్ధరంగములోనికిఁ బ్రవేశింతురు. ౧౮ తండ్రికిఁ గుమారులకుఁ దగవు ముదిరిపోవును. కుమారులు వృద్ధుఁడగు తండ్రినిఁబట్టుకొని కొట్టుదురు. అప్పుడు తల్లి బిగ్గరగా అయ్యలారా! నామగనిని జంపుచున్నారు విడిపింపుఁడని యరవసాగును. ౧౯ ఆమెయరవువిని గ్రామస్థులందరును గుంపుగాఁగూడుదురు. వచ్చినవారు వినోదము చూచుచు నిలువఁబడియుందురు. బలే. బలే. తండ్రికిఁ గుమారులు బాగుగా నుపయోగపడిరని పలుకుదురు. ౨౦ ఎవరికొఱకు నిన్నియనరాని మ్రొక్కులుచెల్లించి నానావస్థల బడిరో యట్టికుమారులు నేఁడు తండ్రినిగొట్టుచున్నారు. ఎంతవింత! కలికాలప్రభావమని యాచూడవచ్చినవారిలోఁ గొందఱందురు. ౨౧ కలియుగచర్యల లక్షణము లివియేయని వచ్చినవారందరు నాశ్చర్యపడుదురు. ఆయుద్ధము నెటులో యాపుదురు. ౨౨ మధ్యవర్తులు తగవునాపి యుండెడిరకు నచ్చజెప్పి యున్న యాస్తిని సమభాగములొనరించి వారందరకు

బంచియొసగుటతోఁ దండ్రికుమారులకలహ ముపశమించును. ౨౩ తండ్రినుండి తామువేఱి కుమారు లాతఁడుంట కొకగుడిసెను గట్టియొసంగుదురు అనంతరము కుమారులతోఁ దండ్రివిడిపోయి తన పడుచుపెండ్లముతోఁ గ్రొత్తకాపురమునకు నడుముగట్టును. అదిమొదలుకొని పెండ్లము స్వార్థపరతంత్రురా లగును. ౨౪ ముసలిమగఁడు పడుచుపెండ్లము సుఖముగాఁ గొంతకాలముందురు. ఉభయు లభేదముగా నానందముగా నుంటిమనుకొందురు. ౨౫ గుణవంతురాలును సుందరియుఁ జాతుర్యవతియునగు నాభార్య వృద్ధావస్థలో లభించుట తనయదృష్టాతిశయముననేయని తలంచియానందించును. ౨౬ ఈయానందములో మునింగి తనదుఃఖమునంతయుమఱచి యావృద్ధగృహస్థుఁడు కాలముగడుపుచుండ రాజ్యమునఁ గల్లోలమేర్పడి మహోత్పాతములు తటస్థించును.

విరోధిరాజులు తామున్న రాజ్యముమీఁదికి సైన్యసహితముగా దండయాత్రకు బయలుదేరుదురు. ౨౭ ఆకస్మికముగాఁ పెద్దముట్టడిజరుగును. ఈ సంకులావస్థలోఁ గొందఱు దుండగులు నగరములోఁ బ్రవేశించి యీ సుందరిని బలవంతముగా గొనిపోవుదురు. * ౨౮ భార్యపోయినది నాసుఖము నశించినది, ఈ వార్ధకమున నాకుదిక్కెవ్వరని యా మానవుఁడు గోడుగోడుమని యేడువసాగును. తనమనస్సులోఁ దనభార్యవంటి సుందరియు గుణవంతురాలును లోకమునలేదని కొనియాడుచుండును ౨౯ ఇంతలో నొకఁడేతెంచి తాతగారూ! నీభార్య భ్రష్టురాలైపోయినది. ఆయమను దుండగులు చెఱఁగొని దేశాంతరము గొనిపోయిరని తెలుపును. ఈ మాటవినఁగానే నేలపయిఁబడి మూర్ఛపోవును. 30 భూమిమీఁద విచారాతిశయమునఁ బొరలును. కనులనుండి దుఃఖబాష్పములు

* ఈ వర్ణనమువలన నాకాలమునఁ బౌరజీవిత మెంతదుర్భరముగ నున్నదో యైతిహాసికు లూహింపవచ్చును.

ధారాళముగాఁ బ్రవహించును. తన పడుచుభార్య జ్ఞాపకమునకు వచ్చినప్పుడెల్ల దుఃఖాగ్నిచే సంతప్తుఁడగుచుండును ౩౧ అప్పు డాతఁ డిట్లు తనలోఁ బరితపించును. "సంపాదించినధనమంతయుఁ బెండ్లిండ్లకు ఖర్చుపెట్టితిని. నాకు బడుచుభార్యమాత్రము మిగిలినది. దానితో నైనఁ బదికాలములపాటు కాపురముచేయనీయకుండ దురాచారులు బట్టుకొనిపోయిరి. ౩౨ నాకు ముసలితనము వచ్చినది. కొడుకులు వేఱుపడిరి. ఓదైవమా! నాభాగ్యము పగిలిపోయినది ౩౩ ద్రవ్యము పోయినది, భార్యను దుండగులు హరించిరి. పోవుదమన్న అండ లేదు దేహమునందు జవసత్వము లంతరించినవి. ఈశ్వరా! నీవేదిక్కు అని నమ్ముకొంటిని" ౩౪ హృదయమునందుఁ దొలుతనుండి యీశ్వరునెడ భక్తికలిగి యుండవలసియుండ వైభవములో మునిఁగి తేలుచు నీయంశమును మఱచెను. ఇపుడు వృద్ధావస్థలో నీతఁడెటులఁ బరితపించుచున్నాఁడో చూచితిరా శ్రోతలారా! ౩౫ శరీరము మిగుల నెండిపోవును. అవయవములన్నియు వంగి దుర్బలములై పటుత్వము తప్పును. వాతపిత్తకఫములు చెలరేగి విజృంభించును. కంఠము చుట్టుకొని కఫము నిబిడముగా వ్యాపించును ౩౬ నాలుక తడబడును గొంతులో గురుకపుట్టును. నోటినుండి దుర్గంధము బయలుదేరును. ముక్కునుండి శ్లేష్మము ప్రవహించును ౩౭ మెడ వణకును, కనుల నుండి యశ్రువులు కారును. ఈ వృద్ధావస్థ యనేకదురవస్థలతో నుపస్థితమగును. ౩౮ దంతము లూడిపోవుటచే నోరంతయు బోసిగా నుండును. నోటినుండి దుర్గంధముగల చొంగనీరు బొట్లుబొట్లుగాఁ గారును, ౩౯ కనులు కనఁబడవు చెవులు వినిపింపవు, దృఢముగా మాటలాడుదమన్నను దేహమున జవసత్త్వములుండవు. ఆయాసము క్రమక్రమముగా నతిశయించును ౪౦ పాదములలో శక్తియంతరించెను. కూర్చుండుటకు దార్ఢ్యము లేదు. నడుము విల్లంబువలె వంగెను. గుదద్వారమునుండి నోటినుండిబయలుదేరునటుల నేదియో

ధ్వని పుట్టును ౪౧ ఆఁకలియైనప్పుడు భరించుటయే కష్టము. తిందమన్న అన్నము దొరుకదు. లభించె ననుకొందము, ఆయాహారము పండ్లూడిపోయెను గావున నమిలి తినలేఁడు. ౪౨ పిత్తాధిక్యమువలన నెటులో మ్రింగిన యన్నము జీర్ణముకాదు. తిన్నది తిననటులనే వాంతిగ వెళ్లిపోవును. లేక గుదద్వారమునుండి వెడలిపోవును ౪౩ మలమూత్రములు, దగ్గు, వాంతులవలన నలుముఖములనున్న భూమి దుర్గంధముతో నిండిపోవును. దూరముగాఁ బోవుచున్నవారి శ్వాసము లా ప్రదేశముకడ నాగిపోవును. ౪౪ బహువిధములగు దుఃఖములును అనేకవిధములగు రోగములు కళేబరము నావరించియున్నవి వార్ధకదశగావున బుద్ధికిగూడ నిలుకడలేదు. ఇట్లు నానావస్థలుపడుచున్నను ఆయుష్యమునకుగల యవధి ముగియదు ౪౫ నొసటివెండ్రుకలు కనుబొమ్మలమీఁది వెండ్రుకలు పూర్తిగఁ బండి రాలిపోవును. దేహమునం దంతటను గబ్బిలములు వ్రేలాడునట్లు మాంస మెండిపోయి ముడతలుపడ్డ చర్మము వ్రేలాడుచుండును ౪౬ పరుల సహాయములేనిది నిముసమేని గడుపఁజాలని దుస్థితిలోనికి వచ్చును. అస్థిపంజరముమాత్రము శేషించియుండును ఇంకను వీఁడేలఁ జావకున్నాఁడు. చావఁడు కాఁబోలు అనియందఱు నందురు. ౪౭ జన్మమిచ్చి యెవరిని గని పెంచి పెద్దవారినిజేసెనో యాకుమారులు పగవాండ్రయ్యెదరు. చివరకుఁ బ్రాణికి విషమావస్థ సమీపించును ౪౮ వయస్సుమీరును. బలముడుగును. గృహస్థితి పాడగును. దేహము, సంపద నీరసమై నశించును. ౪౯ పుట్టినదిమొదలు చేసిన స్వార్థపరతంత్రత యంతయువ్యర్థమైచెడును. ఇప్పుడీ యంత్యకాలమున నెంతటిదుర్గతి ప్రాప్తించినది! ౫౦ జన్మమున్నంతవఱకు సుఖము కొఱకుఁ బ్రాణి విరుగఁబడును. అంత్యమునందు దుఃఖముతో సంతప్తుఁడగును. దీనితరువాత యమయాతనలు ప్రత్యేకించి యనుభవింపవలసియున్నది ౫౧

జీవితమంతయు దుఃఖమూలము. పుట్టినదిమొదలు జీవిని దుఃఖాగ్ని దహించివేయుచుండును. కావున మనుజుఁడు శరీరమును ధరించినందులకు సత్యమగు నాత్మహితమునకై యత్నింపవలయును. ౫౨ వృద్ధావస్థయందుఁ బ్రపంచములో నందఱకును నిదేవిధముగా దుఃఖముకలుగును. కావున మానవుఁడు సర్వము నశ్వరమని నమ్మి భగవంతుని పాదపద్మములకు శరణుజొచ్చవలయును. ౫౩ మాతృగర్భమునం దున్నపుడు శిశువున కేపశ్చాత్తాపము కలిగియుండెనో యది వృద్ధావస్థయందును అంత్యకాలమునందును జ్ఞాపకమునకు వచ్చును ౫౪ పరమేశ్వరునియెడ భక్తిశ్రద్ధలతో నుండుట మానినం దున జన్మాంతరములు మగల మాతృగర్భవాసము తటస్థించును. ఆవల దుస్తరమగు సంసారపాశములో మఱల జిక్కుకొనును ౫౫ భగవంతునియెడ భక్తిశ్రద్ధలు లేనివారికి జన్మమరణములు తొలంగిపోవ నేరవు. త్రివిధపాపము లనుభవింపవలసి వచ్చును త్రివిధపాపముల నేవియో వానిస్వరూప మేదియో విపులముగా వర్ణించెదను ౫౬

ఆఱవసమాసము

ఆధ్యాత్మిక తాపము.

(శారీరిక మానసిక రోగము)

శ్రోతలారా! ఇపుడు త్రివిధతాపముల నేవియో తెలుప నున్నాఁడను. ఏకాగ్రబుద్ధితో నాలింపఁ గోరెదను. ౧ ఆర్తుఁడగు పురుషుఁడు తాను గోరినవస్తువు లభించినంతనె యెటులానందించునో యటులె త్రివిధ పాపములచే సంతప్తుఁడగు మానవుఁడు సత్సాంగత్యమువలన శాంతినొందును. ౨ ఆఁకలిచే నకనకలాడు పురుషునకు అన్నము లభించినపిమ్మటను, దప్పిచేఁ బరితపించుమానవునకు జలము చేకూరినపిమ్మటను, కారాగృహమునందున్న మనుష్యునకు బంధోన్ముక్తుఁడైనపిమ్మటను సౌఖ్యములభించును. ౩ బురదతోనిండిన నూతిలోఁ దిగఁబడినవాఁడు వెలికిదీయఁబడిన యెడల నానందించును. అటులే దుఃఖమయమగు స్వప్నమును గాంచుచున్న వాఁడు మేలుకొనుటచే సౌఖ్య మనుభవించును. ౪ ఏదేని యుపాయమునొంది చావనున్న వానికిఁ బ్రాణదాన మొనరించుటవలనను దురవస్థలలోఁ మునిఁగిఁ తేలుచున్న వాని కవస్థానివారణ మొనరించుట వలనను సుఖముకలుగును. ౫ రోగికిఁ గర్మానుభవము పూర్తియైన పిదపఁ బరిశుద్ధమగు నౌషధము లభించును. దానంజేసి యారోగ్య మొంది యానందభరితుఁడగును. ౬ ఆవిధముగనే త్రివిధములగు (ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము) తాపములచేఁ బరితప్తుఁడగువాఁడు సాధుజనుల సంగమముచే బరమార్థమున కధికారి యగును. ౭ త్రివిధతాపముల నేవియో తెలిసికొన శ్రోత లుత్సాహపడుచుందురు. వాని నామములు వానివాని యుదంతములు స్పష్టముగాఁ జెప్పుచున్నాను ౮ మొదటిది ఆధ్యాత్మికతాపము. రెండవది ఆధిభౌతికతాపము, మూఁడవది ఆధిదైవికతాపము అని గ్రహింపవలయును. ౯ శ్రోత లిట్లు ప్రశ్నించిరి. స్వామీ! ఆధ్యాత్మికతాపమనఁగా నెద్ది? దాని కేమిగుర్తులు? ఆదిభౌతిక తాపమునకుఁ గల లక్షణముల నేవిధముగా గ్రహింపవలయును? ౧౦ ఆధిదైవిక తాపమననెట్టిది? స్పష్టముగా నెరుంగఁ జాలినంత విపులముగా నను గ్రహించి తెలుప వేఁడెదము. ౧౧ శ్రోతలతో వక్త మంచిది అటులేయని నిరూపణముగావించి చెప్పుచున్నాఁడు. తొలుదొలుత సావధానమతితో నాధ్యాత్మికతాపమునుగూర్చి వినఁగోరద. ౧౨ దేహము, ఇంద్రియములు, మనస్సు వీనిసంయోగమువలనఁ దనకుఁ గలిగెడు సుఖదుఃఖానుభవమును ఆధ్యాత్మికతాపమని చెప్పుదురు. ౧౩ దేహమునుండి యుత్పన్నమగు దుఃఖమును, ఇంద్రియమువలన

జనించుదుఃఖమును మనస్సునుండి యుత్పన్నమగు దుఃఖమును ఆధ్యాత్మికతాపమని చెప్పుదురు. ౧౪ దేహమునుండియు నింద్రియములనుండియు మనస్సునుండియుఁ గలిగెడుదుఃఖములను వేరు వేరుగా వివరింపవలసియున్నది. ౧౫ గోకుడుపుండ్లు, దేహములోఁ బోటు, కురుపులు, జిల, దద్దు, వంచెలు, మున్నగు దేహమునం దుత్పన్నమగు వికారములును, ౧౬ గజ్జి, బాలకింక, చిడుము, నెత్తురుగడ్డలు, సహింపరాని మూలవ్యాధిబాధయు, ౧౭ వ్రేలిచివర బుట్టు కురుపులు (గోరుచుట్టు) మెడవాపు, పిచ్చినసిమిరి, ముఖము వాపు, దంతబాధయు, ౧౮ గడ్డలు దేహమునిండ లేచుట, దేహము వాచుట, వాతముప్రకోపించుట, గాదర లేచుటయు, ౧౯ తామర లేచుట, పొట్ట యుబ్బుకొని పెరుగుట, దవడలు కుదియించుకొని పోవుట, చెవిలో పుండుపుట్టి పగులుటయు మున్నగునవి యాధ్యాత్మికతాపములు. ౨౦ శ్వేతకుష్ఠు, గళితకుష్ఠు పాండురోగము, క్షయ రోగమును ౨౧ గ్రంధివాతము, బిడ్డలుపాలుక్రక్కుట, వాతగోళము. కాళ్లుచేతులు లాగుట, వెంటవెంట నావలింతలు వచ్చుటయు, ౨౨ మలమూత్రాదుల నిరోధమువలనఁ గల్గురోగములు, ఆవర్తము, హృదయశూల, పార్శ్వశూల, మున్నగురోగములును, ౨౩ నడుము మెడ నెప్పియెత్తుట, వీపు కంఠము, ముఖము, అస్థిసంధులు మున్నగువానిలో నొప్పికలుగుటయు, ౨౪ అజీర్ణముచే నొడలుత్రిప్పుట, అజీర్ణవిరేచనములు, వాంతులు, కామెరలు, సర్పి, ముక్కిడి, విదేశ జలముత్రాగి రోగములొందుట, మున్నగువ్యాధు లాధ్యాత్మికతాపములుగఁ బరిగణింపఁదగినవి. ౨౫ జలశోషము (ఒకతెగక్షయ) కంటికిఁ బొరలెత్తి దృష్టిదోషముకలుగుట, జ్వరము, దేహము గగుర్పొడుచుటయు, ౨౬ చలి, కాక, ఆఁకలి, దప్పిక, నిద్ర, దృష్టి సోకుట, విషయతృష్ణవలన దురవస్థ లొందుటయు, ౨౭ సోమరి, మూర్ఖుఁడు, అపయశస్వియగుటయు, మనస్సులో భయ మకారణ

ముగాఁ గలుగుటయు, ఆహోరాత్రములయందు దుశ్చిత్తుఁడుగను నపస్మారుఁడుగను నుండుటయు. ౨౮ మూత్రావరోధము, ప్రమేహము, రక్తపిత్తము, రక్తప్రమేహము, గర్భములో మలము నిలిచి పోవుటయు, ౨౯ త్రిప్పుడు, విరేచనములు, కాకవలన మూత్ర లోమంట, మూత్ర మాగిపోవుట, ఇదియని నిరూపింపరాని వ్యధయు నాధ్యాత్మికతాపములు. ౩౦ ప్రేగులు పట్టుకొనుటవలనఁ గలుగు నొప్పియు గర్భములో జంతువులుపుట్టుట (జంతుఘాతము) ఆమము, రక్తముపడుట, తిన్నయన్నము తినినయటులు వెడలి పోవుట, ౩౧ పొట్ట యూఁదుట, కొరబోవుట, పులిత్రేపులువచ్చుట ౩౨ ఎక్కిళ్లువచ్చుట, కొర యాగిపోవుట, పైత్యమువృద్ధియగుట, వాంతులువచ్చుట, నాలుకపయి ముల్లువేయుట, జలుబు దగ్గు బాధ కలుగఁజేయుట, ౩౩ ఉబ్బసము, శ్వాసకాసము, ఎముక పట్టుతొలఁగుట, పొడిదగ్గు, కఫకాసముకలుగుట, ౩౪ ఎవరేని విషముతినిపించుటచేఁ బాధాప్రాయముకలుగుట, మెడపయివ్రణములేచుట, ఘటసర్పి యల్లుకొనుట, నాలుక తెగి పడిపోవుట, ముఖమునుండి దుర్గంధము వెడలుట.దంతములూడిపోవుట, దంతములలోఁ బురుగులు పడుట, యాధ్యాత్మికతాపములు. ౩౬ మూత్రనాళములో రాయి పుట్టుట, ముత్తు వ్యాధులచేఁ బగులుట, గండమాల, ఆకస్మికముగాఁ గన్నుపగిలిపోవుట, స్వయముగా వ్రేలు కోసికొనుట, ౩౭ స్ఫోటకము పోయుట, పండ్లు కదలుట, పెదవులు నాలుక కొఱకికొనిపోవుట, ౩౮ కర్ణబాధ, నేత్రబాధ, నానావిధ దేహబాధల వలన శోకముదయించుట, పుట్టుగ్రుడ్డు, నపుంసకుఁడునగుట, ౩౯ కన్నులలోఁ బూవువేయుట, పొరగ్రమ్ముట, కంటినడుమ తెల్లని చుక్క పుట్టుట, కంటిలోఁ బురుగుపడుట, బయటికిఁ గన్నులు బాగుగానుండియుఁ గనిపింపకపోవుట, రేజీకటికలుగుట, దుశ్చిత్తుఁడగుట భ్రమలపాలగుట, పిచ్చివాఁడగుట మున్నగు బాధ లాధ్యాత్మిక

తాపములు. ౪౦ మూఁగతనము, చెవుడు, పుట్టుకలోనె పెదవులు తొఱ్ఱిబోవుట, గూని తలతిరిగి వంకరగానుండుట. కాలుకుంటుట, రెండుకాళ్లు కుంటిగానుండి నడువ వీలుకాకపోవుట, మరుగుజ్జుగా నుండుట, ౪౧ మిగుల పొడుగరిగానుండుట, వంకరగానుండుట, ఓరగాఁజూచుట, మెల్లచూపు, పిల్లికన్నులు పొట్టిగానుండి, ఎత్తి నడుచుట, వికృతరూపము, వికారస్వరూపము, కురూపము. ౪౨ పొడుగుగా వెలుపలకుఁ బండ్లు వెడలియుండుట, తొఱ్ఱి, దీర్ఘనాసికము, చట్టిముక్కు, చెవిలేకయుండుట, వదరుబోతుతనము, మిగులఁజిక్కిపోవుట, ఎక్కువలావుగా నూరుట యాధ్యాత్మికతాపములు. ౪౩ ఎదుటివారిని జీదరించుకొనుట, నత్తిగామాటలాడుట, దుర్బలత్వము రోగిగానుండుట, కురూపి, కుటిలుఁడు, మత్సరయుతుఁడు, తిండిపోతు క్రోధశీలుఁడునై యుండుట అధ్యాత్మికతాపములు. ౪౪ సంతప్తుఁడు, పశ్చాత్తాపతప్తుఁడు, మత్సరస్వభావుఁడు, కాముకుఁడు ఈర్ష్యాతురుఁడు, తిరస్కారి, పాపి, అవగుణుఁడు, వికారస్వభావుఁడు నగుటయు, ౪౫ చిక్కిపోవుట, వంగిపోవుట, కాలుచేతులు చచ్చుపడుట, మెడవంగుట, నంజు, సంధిరోగము, ౪౬ గర్భముధరించిన మీఁద నది పొట్టలో నిలిచిపోవుటయు, గర్భవతియైనమీఁద నది క్రమముగా క్షీణించుట, తూలిపడిపోవుట, గర్భపాతము, స్తనము లెండిపోవుట, సన్నిపాతము, గృహస్థసంకటములు, అకాలమృత్యువులు, ౪౭ గోళ్లలో విషపుకురుపులు లేచుట, వ్రణములుపుట్టుట, అపథ్యమువలనఁ గ్రొత్తగా రోగములుకలుగుట, ఆకస్మికముగా దంతపంక్తులు రెండును కదలిపోవుట లోనగునవి యాధ్యాత్మికతాపములు. ౪౮ రెప్పలవెండ్రుక లూడిపోవుట, నొసలుబ్బుట, కన్నులలోఁ గురుపులులేచుట, చత్వారముకలుగుట, ౪౯ చర్మముపైనల్లని మచ్చలు పుట్టుట, చుక్కలుచుక్కలుగాఁ దెల్లపొడ బుట్టుట, శోభి, బొల్లి, బట్టతల, కణుతులు లేచుట, మనస్సుభ్రమనొందుట, మున్నగునవి యాధ్యాత్మికతాపములు. ౫౦ నానాప్రకారములగు చావులు, గుల్మములు, శరీరమునందు దుర్గంధమువృద్ధియగుట, చాంగకారుట. ౫౧ విచారము లతిశయించి కృశించి సల్లబడిపోవుట, అనేక బాధ లుదయించి చిత్తము క్షోభించుట, వ్యాధియుఁ గారణము లేని భయభ్రాంతులు ౫౨ వార్ధకదశలోఁ గలుగునాపదలు, నిరంతరము నానావ్యాధులతో నవస్థపడుట, నిరంతరము చిక్కిపోవుట, ౫౩ అనేకవ్యాధులు నానావిధదుఃఖములు సకలవిధములగు భోగబాధలు, అన్నివిధములగు దేహవ్రణములు, శోకముచేఁ గుప్పలుగూలుట మున్నగునవి యన్నియు నాధ్యాత్మికతాపములనఁబడును. ౫౪

ఇంతయేల, పూర్వపాపము హెచ్చినకొలంది మానవునకిట్టివియు నింకఁగొన్ని తెరంగులవియునగు నాధ్యాత్మికతాపములు కలుగును. ఈలోకము ఆధ్యాత్మికతాపములతో నిండియున్న యగాధసాగరముగా నున్నది. కావున నాధ్యాత్మికతాపములను నెంతవరకు వర్ణింపఁగలను? ౫౫ కావున శ్రోతలు నేనుజెప్పిన పయియంశములనుబట్టి యాధ్యాత్మికతాపములన నేవియో బాగుగా గ్రహింపఁగోరెదను. ఇంకముందు ఆధిభౌతిక తాపమునుగూర్చి చెప్పఁబోవుచున్నాఁడను.

ఏడవ సమాసము.

* ఆ ధి భౌ తి క తా ప ము

(చరాచరభూతములవలనఁ గలుగుదుఃఖము)

శ్రోతలారా! గతసమాసమునందు మీకు ఆధ్యాత్మికతాపలక్షణములు నివేదించితిని. ఇపుడు ఆధిభౌతికతాపములనుగూర్చి

---

* బాహ్యపదార్థములకును ఇంద్రియములకును సంయోగమగుటచేఁగలుగునవి ఆధిభౌతికములు.

తెలుపఁ బోవుచున్నాఁడను. శ్రద్ధతో నాలింపుఁడు. ౧ సమస్త చరాచరభూతముల సంయోగమునఁ గలుగు సుఖములను దుఃఖములను విజ్ఞులు ఆధిభౌతికములని యందురు. ౨ మీకు బాగుగా బోధయగుటకై నేను విస్తృతముగా దృష్టాంతసమన్వితముగా నాధిభౌతికతాపమన నేమియో చెప్పెదను. ౩ దెబ్బదగిలి కాలు విరిగిపోవును. ముల్లుగ్రుచ్చుకొనుటచేఁ గాలువాచి బాధకలుగును. శస్త్రప్రహారముచే గాయమై శ్రమపొడమును. కాలిలో లోహపుశకలముగాని పేడుగాని గ్రుచ్చుకొని పుండుపుట్టును. ౪ దూలగొండి దాహకమగు ఆకు సోకుటచేఁగాని లేక విషయుక్తపదార్థము దేహమునకు సోకుటచేఁగాని వ్యథ కలుగును, జెట్టికరచుటచే శరీరము విషమయమైపోవును. ఇట్లు నానావిధముల సమకూరు దురవస్థల నాధిభౌతికతాపములందురు. ౫ ఈఁగలు, జోరీఁగలు, తేనెటీఁగలు, చీమలు, దోమలు మున్నగునవి కుట్టుటచేఁ గలుగుబాధయు, పేలుబడుటచేఁ గలుగు శ్రమయు, ౬ గోమారి, ముక్కుదోమ, గండుచీమ, న ', తుమ్మెద మున్నగునవి కుట్టుటచేఁ గలుగుపీడయు, ౭ కణుదురుగ, పాము, తేలు, బెబ్బులి, తోఁడేలు, పంది, ఖడ్గమృగము మున్నగుజంతువుల వలనఁ గలుగు కష్టములును ఆధిభౌతికతాపములు. ౮ కారుఆవు, అడవిదున్న, ఎలుగుబంటి, అడవియేనుఁగు, చిరుతపులి లోనగునవి చెలరేగి పయిబడి పెట్టుకష్టములకు నాధిభౌతికతాపములనిపేరు. ౯ జలములోనికిఁ బోయినపుడు మొసలి గొనిపోయిచంపుటయు, ఆకస్మికముగా మునిఁగిపోవుటయు, నీటిలో నడుచుచుండఁ పాచిపట్టిన రాతిపయి జారిపడి యవయవములు విరుగుట, ౧౦ కొండచిలువ మున్నగుపాములు, మొసలి సొరచేప లోనగుజలచరములు, బెబ్బులి సింహము లోనఁగు వనచరములు, మానవునకుఁ గలుగజేయు శ్రమలు, ౧౧ గుఱ్ఱము, ఎద్దు, గాడిద, కుక్క, పంది, నక్క, పిల్లి మున్నగు దుష్టజంతువులవలనఁ గలుగుకష్టములు ఆధిభౌతికతాప

ములు. ౧౨ ఇంతియగాక పయినిబేర్కొనిన కర్కశములు, భయానకములు, నానావిధదుఃఖదాయకములు, నగుప్రాణులచేఁ గలుగు బహువిధములగు కష్టములనుగూడ నాధిభౌతికతాపములుగనే పరిగణింపవలెను. ౧౩ గోడలుఇంటికప్పులు తమంతన యాకస్మికముగాఁ గూలుటచేఁ గ్రిందనలిగిపోవుట, కొండలక్రింద గుహలక్రింద నున్నపుడు శిలాపాతముచేఁ జితికిపోవుట వృక్షమువిరిగి మీఁదబడుటచే అణఁగిపోవుట. ౧౪ పెద్దలుపెట్టిన శాపముచే యాతన లనుభవించుట కోరికలు తీరకుండుటచే భ్రాంతికలుగుట, దానిచే నున్మత్తుఁడగుట యాధిభౌతికతాపములు. ౧౫ పరులు శక్తిహీనుని గావించుటచేతను, కులభ్రష్టుని నొనర్చుటచేతను, పట్టుకొనిపోయి నిర్బంధములో నుంచుటచేతను గలుగు బాధలును, ౧౬ విషప్రయోగముచేతను, అపశయస్సు పరులు కల్పించుటచేతను, వల బోను మున్నగువానిలోఁ జిక్కుకొనుటచేతను గలుగుకష్టములును ౧౭ విషయుక్తమగు చెట్టుతాఁకుటచేతను, జీడిరస మంటి దేహమునఁ బుండ్లుపడుటచేతను, పొగలో పడి వ్యాకులుఁడగుటచేతను గలుగుశ్రమలు ఆధిభౌతికతాపములు. ౧౮ కణకణమండుచున్న అగ్నిహోత్రములో కాలుపడి కాలిపోవుట, ఱాతిక్రిందఁ జేయియొ కాలోబడి నలిగిపోవుట, పరుగెత్తునపుడు ఎదురుఱాయికొట్టుకొని పడిపోవుట, ౧౯ బావి, కోనేరు చెఱువు, బొంద లోనగువానిలోఁ బడుట, నదియొడ్డు విరిగి కూలుటచేఁ బ్రవాహమునఁబడుట యాధిభౌతిక తాపములు. ౨౦ దుర్గము మీఁదనుండిగాని చెట్టుమీఁదనుండిగాని పడి గాయములుపడఁ శ్రమయొందుటకును ౨౧ చలిచే బెదవులు, కాళ్లు, చేతులు, పిక్కలు పగిలి బాధకలుగుటకును, వానకాలమున బురదలో నడుచుటచేఁ కాళ్లుపాచిగాని పుండ్లుపడిగాని శ్రమలొందుటకును, ౨౨ వేఁడిపదార్థములు తినుటచేతను వేఁడివేఁడి పానీయములు త్రాగుటచేతను

నాలుక గొంతుక కాలుటయును, దంతములలో జాయిపడి కలుకలు లాగుటయును గూడ నాధిభౌతిక తాపమనియే పేరు. ౨౩

బాల్యావస్థలోఁ బరాధీన జీవితమునం దున్నపుడు పరుషవాక్కులవలనను దెబ్బలవలనను బాధకలుగును. అన్నవస్త్రములకై పరితపింపవలసివచ్చును. ఇది యాధిభౌతికతాపము. ౨౪ అత్తవారి యింటిలోనున్నపుడు పదినెలు మఱదం(డ్రు వావివరసలకై వివిధ పదార్థములతో దండలు(గుచ్చి మెడలో వేయుదురు. దేహమునకువస్త్రములకు రంగులంటింతురు. కాలిన యినుపములికితో మచ్చలుగూర్తురు ౨౫ ఏమఱుపాటున నున్నపుడు చెవులుపిండుదురు కన్నులలో నింగువరసము పోయుదురు ఎప్పుడును హాస్యము హేళనము గావింతురు. ౨౬ దుష్టులగు పురుషులవలన స్త్రీలు నానావిధముల హింసింపఁబడుదురు, ఆస్త్రీల మానుషమునుగూడఁ దీసివేయుదురు, ౨౭ చెప్పినటుల వినలేదని చెవులు ముక్కులు గోసివేయుదురు, బలవంతముగా నిర్బంధించి పనిపాటలు చేయింతురు, పనికి నుపయోగింపనిచో నొడలుగాల్తురు. ౨౮ స్త్రీని దురాగతులు నిర్బంధించి నీచజాతుల కిచ్చివేయుదురు. అదిదుర్దశలపాలై కడకు మరణమొందును. ఇవియన్నియు నాధిభౌతిక తాపములు. ౨౯ రోగముతోనున్నపుడు వైద్యులు కటువుగానున్న యౌషధము దాగింతురు, భూతవైద్యు లనేకవిధముల బాధింతురు. ౩౦-౩౧ బహువిధములగు చేదుతీఁగెల రసము, విదాహకరము నసహ్యకరమునగు కషాయము, గాటుగల ద్రావకములు (త్రాగుటవలనఁ గలుగుభయబాధలు ౩౨ ఔషధప్రయోగమునఁగలుగు విరేచనములు వాంతులు, కఠినపథ్యములు, అనుపానము మఱచి యౌషధము సేవించుటచేఁ గలుగు క్రొత్తబాధలు ౩౩ శస్త్రముతో దేహముచీల్చి రక్తము దీయుటవలనను లోహముతో నొడలినిండఁ గాల్చుటవలనను గలుగుకష్టములు

ఆధిభౌతిక తాపములు. ౩౪ వైద్యులు చిత్రమూలముతోఁడను జీడిగింజలతోడను బట్టువేయఁగా పుండ్లుపడును. నానావిధములగు బాధలుకలిగింతురు. నరములు విఱచివేయుదురు. జలగలను బట్టింతురు. ౩౫ ఇంతయేల! రోగము లసంఖ్యాకములుగాఁ గలవు. వాని కౌషధములుగూడ విశేషముగాఁగలవు. చెప్పఁబూనినచో నీ సమాసము అగాధముగా నపారముగఁ బెరిగిపోవును. రోగములమూలమునను చికిత్సల మూలమునను దేహమునకుఁ గలుగు సమస్తబాధలు ఆధిభౌతికములనిగ్రహింపనగును. ౩౬ భూతవైద్యులు పొగలోఁగూర్చుండఁబెట్టి యూపిరిసలుపకుండ ధూపములు ప్రయోగింతురు. ౩౭ దొంగలు బందిపోటుజేసి యిండ్లమీఁదఁబడి యకారణముగాఁ బ్రజలక్షోభపెట్టుదురు ౩౮ అగ్నిదేవుని కాహుతియై సుందరములగు మందిర రాజములు, రత్నభాండారములు, మనోహరములగు వస్త్రములు నానావిధములగు ధనధాన్యపదార్థములు పశువులు, పాత్రములు, మనుష్యులు తగులఁబడిపోవును. వీనివలనఁ గలుగు సంతాపము ఆధిభౌతిక తాపము. ౩౯-౪౧ పంటకు సిద్ధముగానున్న ధాన్యము చెఱకుమున్నగు పైరులు కాలిపోవుటవలనఁ గలుగు సంతాపము ౪౨ స్వయముగా నంటించిన యగ్నివలనఁగాని యితరులంటించిన యగ్నివలనఁగాని యనేకోత్పాతములు గలిగినందున నొందువిచారము ౪౩-౪౪ ఏదేని ప్రియతరమైన పదార్థము జారిపోయినను మఱచిపోయినను బడిపోయినను నశించినను అక్కఱకురాకుండఁ బోయినను బగిలిపోయినను స్థానభ్రష్టమైపోయినను నానావిధములగు పశువులెందేని చిక్కిపోయినను కన్యలు పుత్రులు భార్యమున్నగు నాత్మసంబంధులు జాడతెలియక దేశాంతరముపాలై పోయినను గలుగు శ్రమ ఆధిభౌతిక తాపము. ౪౫ దొంగగాని వ్యాజ్యములోఁ బ్రతికక్షిగానున్నవాఁడుగాని యాకస్మికముగాఁ జంపవేయును. కన్నపుదొంగ యిల్లు దోఁచుకొనిపోవును. పశుచోరులు ఇంటిలోనున్న

గొడ్లను దూడలను దోలుకొనిపోవుదురు. ౪౭ పొలముదొంగలు పలువిధములగు ధాన్యములను వృక్షఫలములను గోసికొనిపోవుదురు. మొదట నుప్పువైచి భూమిని ఫలింపకుండ నిస్సారముచేయుదురు. ౪౮ మోసగాఁడు దాఁదొంగ సర్వభక్షకుఁడు రసాయనశాస్త్రజ్ఞుఁడు గారడివాఁడు మాంత్రికుఁడు కపట వర్తనుఁడు తాంత్రికుఁడు మున్నగువారలు బహువిధముల సంకటములు కలిగింతురు. ౪౯ జేబులు కత్తిరించుదొంగలు ద్రవ్యమును హరింతురు. చోరులు నానావిధాలంకారములను దీసికొందురు. ఎలుకలు ఇంటిలోని సమస్తవస్తువులను దీసికొనిపోవును వీనివలనఁ గలిగెడు దుఃఖమున కాధిభౌతిక తాపమనిపేరు. ౫౦ పిడుగుబడినను, వడగండ్లుపయిఁబడినను, వర్షములోఁదడిసినను, ప్రవాహములో మునిగినను, ౫౧ నీటిలోని సుడిగుండమునందును, నీటిజాలునందును, ప్రవాహమునందును, ప్రవాహములలోఁ గొట్టుకొనిపోవుచున్న చెత్త చెదారము నందును, అపారములగు తరంగములయందును గొట్టుకొనిపోవునపుడు తేలు జెఱ్ఱి కొండచిలువ మున్నగుజంతువులచే బాధలొందుటయు, ఱాతిగుట్టకో దీవిగడ్డకో కొట్టుకొని కడగండ్లమారి బ్రదుకు బ్రదుకుటయు, మునుగుచు మునుగుచునుండ దైవవశమున నొడ్డుబట్టి జీవించుటయు నాధిభౌతిక తాపములని చెప్పుదురు. ౫౨ ౫౩ తనతలంపు ననుసరించి గృహస్థధర్మములు నడువకున్నందునను భార్య కురూపిణియు కఠినాత్మకురాలు క్రూరవర్తనురాలు నగుటవలనను, కుమారుఁడు మూర్ఖుఁడు బిడ్డ వితంతువు నగుటవలనను, ౫౪ భూతప్రేతము లావేశించి యున్మాదము కలిగించినను, శరీరమునుండి దుర్గంధపూరితమగు దుర్వాయువులు బయలుదేరినను, మంత్రభ్రష్టత్వముచే నున్మాదము కలిగినను సమకూరుబాధలకు ఆధిభౌతిక తాపములని పేరు. ౫౫ క్రూరగ్రహముల దుర్వీక్షణము, గ్రహప్రతికూలము, కాలతిథిఘాత, చంద్రదోషము, కాలదోషము, దుష్ట

నక్షత్రము మున్నగువానిచేఁ గలుగు కష్టములు ౫౬ శరీరమునందు న్న బ్రహ్మగ్రహమువలనఁ గలుగు నవస్థలు బ్రహ్మగ్రహావేశము శనిగ్రహము చాలకుండుట ౫౭ తుమ్మ, బల్లిపలుకుట, పింగళపక్షి పెద్దపక్షి, కాకి, కలాలి మొదలగు నపశకునపుఁ బక్షులవలనఁ గలుగు చింత నష్టము ఆధిభౌతికతాపములు. ౫౮ మోసగాఁడు బుడుబుక్కలవాఁడు, సూనెగుడ్డలవాఁడు జోతిష్కుఁడు మున్నగువారు చెప్ప జరుగఁబోవు విషయములను నమ్మి మనస్సునఁ గలుగఁజేసికొను సందేహ సంబంధమగు విచారము ౫౯ కుక్కలు, నక్కలు ఏడ్చినను, బల్లిపయినిబడినను, నానావిధములగు నపశకునములు గలిగినను జనించు చింత, చెడ్డకలలను గాంచుటచే మనస్సులోఁగలుగు వ్యాకులపాటు ఆధిభౌతికతాపము. ౬౦ ఎచ్చటికైనఁ బోవసంకల్పించి బయలుదేరినపుడు అపశకునముగాని బహువిధములగు విఘ్నములుగాని గలిగిమనశ్శాంతి చెడుటచేఁ గలుగు విచారముగూడ నాధిభౌతిక తాపముగ గణింపనగును ౬౧

చెరసాలలోఁబడి యనుభవించు బహువిధములగు యాతనలను దుఃఖములను నాధిభౌతిక తాపములని చెప్పనగును. ౬౨ రాజదండనము నొందుటకతన భటులు నడుమునకుఁ ద్రాడుగట్టి పాఱిపోకుండఁ బట్టుకొనికొరడాలతోను బరికెలతోడను. గొట్టుదురు అనేకవిధముల తాడనము గావింతురు. ౬౩ చీకటిలోఁబడవైచియుఁ గాలినపెనముమీఁద నిలువబెట్టియు మఱ్ఱియూడలతోఁ గొట్టియుఁ బీడింతురు. ౬౪ అపానద్వారమునందుఁ బొడవైనమేకులు గొట్టుదురు. తుపాకిమందు బాగుగాఁగూరిన పీపాలోపలఁగాని కొట్టులోఁగాని పడవైచి నిష్ప్రాణంటింతురు. నాలుగువైపులఁ గదలకుండునటుల పగ్గములతో నంటుగట్టి లాటీలతోఁ గొట్టుదురు. పిడికిళ్ళతోఁ బొడుతురు. కాలికొక్కెరవైచి కదల మెదలకుండఁజేసి కొట్టుదురు. మోఁకాళ్ళతోఁ గ్రుమ్ముదురు. ఇవియన్నియు నాధిభౌతిక తాప

ములు. ౧౫ తన్నులు, మొట్లు, పేడతోఁగొట్టుట, చెవులలోఁగంకర రాళ్లుదోపి లోనికిదిగునట్లు కొట్టుట, రాళ్లతోఁ జితుకఁగొట్టుట ౧౬ దేనికేని కట్టివేయుట, చిమ్మటలతోఁ జర్మము, ముందునకులాగి కొట్టుట, వెనుకకుఁ జేతులు విఱిచి కట్టుట, సంకెళ్లు తగిలించుట, గొట్టమువలె వంచి చెట్టుమొదటి కంటగట్టుట, బండగొయ్య వేయుట నాలుగుప్రక్కలఁ గావలివాండ్రనుంచి కదలమెదలనీయక నిర్బంధములో నుంచుట యాధిభౌతిక తాపము. ౧౭ ముక్కురంధ్రములలో దీక్ష్ణమైన సున్నపునీరునించి బాధింతురు. ఉప్పునీరు, తమిదెనీరు, బెల్లపునీరుగూడ నించి యూపిరాడకుండఁ జేయుదురు. ౧౮ నీటిలో ముంచివేయుదురు. ఏనుఁగుముందుఁ గట్టివేయుదురు. రాజ్యమునుండి వెడలగొట్టుదురు. నానావస్థలఁ బెట్టుదురు. నానావిధముల బాధింతురు. ౧౯ చెవి, ముక్కు, చేయి నాలుక పెదవి మున్నగు నవయవములను గోసివేయుదురు. ౨౦ బాణములతో గురిజూచి కొట్టుదురు ఉరితీయుదురు. నేత్రములను వృషణములను దీసివేయుదురు. అన్ని గోళ్లలోను సూదులను గ్రుచ్చుదురు. ౨౧ ప్రతిదినము తూచినయెడల గొంచెముకొంచెము తగ్గిపోవునటుల నాహారాము లొసంగక బాధింతురు. కొండమీదినుండి క్రిందికి నెట్టివేయుదురు. ఫిరంగిముందు నిలువఁబెట్టి కాల్చివేయుదురు. ఈ విధముగా రాజభటులు ప్రజలకు గూర్చుబాధలకు ఆధిభౌతిక తాపములని పేరు. ౨౨ చెవులో మేకులును గుదద్వారమునందు గూటములను గొట్టుదురు. బ్రతికియుండగనే దేహముమీఁది చర్మమునంతయు నొలిచివేయుదురు. 23 నఖశిఖపర్యంతముగల చర్మమునంతయు దిత్తివలె నొక్కమాఱొలిచివేయుదురు. పొడిచిపొడిచి చంపుదురు. మెడలో బరువైన లోహపుగుండును గొలుసును అంటగట్టి బాధింతురు. కొయ్యగుదియతో ఎముకలన్నియు విరుగగొట్టుదురు. ౨౪ సీసా పగులఁగొట్టిన చూరనీటితోఁ ద్రాగింతురు. విసము త్రాగింతురు. తలగోసివేయుదురు.

బ్రదికియుండఁగనే బొందలోఁ బూడ్చివేయుదురు. ఈ విధముగా రాజభటులు ప్రజలను బెట్టు బాధలు ఆధి భౌతికతాపములు ౨౫ లాగుతొడిగించి దానిలో తొండలను విడచి పెట్టుదురు. కోపముతోనున్న యరణ్య మృగము లున్నగదిలో రాజదండనపాత్రుని ద్రోసి యతినికృష్టము కష్టరూపముగు మృత్యుముఖమునఁ గూలఁద్రోయింతురు. గొంతుకకు త్రాడుబిగింతురు. నానావిధములఁ గష్టపెట్టి మరణోన్ముఖు నొనర్తురు. ఈవిధముగ రాజభటులుపెట్టు కష్టము లాధిభౌతిక తాపములు. * ౨౬ కుక్కలు గరువగా మరణించుటయు, బులివాతఁబడి చనిపోవుటయు, భూతములవలన గ్రసించుటయు, మొసలివలనఁ జచ్చుటయు నాధిభౌతిక తాపములు, ౨౭ కండరములనుబట్టి లాగివేయుదురు. గంతలలోఁ గట్టి మండుచున్న యగ్నిగుండములలో వేసికాల్తురు. ఇంక ననేకవిపత్తులు గూర్తురు. ౨౮ మనుష్యహాని, ధనహాని, వైభవహాని, మహత్త్వహాని, పదార్థహాని, పశుహాని, మున్నగువానివలనగల్గు తాపములు అధిభౌతిక తాపములు. ౨౯

బాల్యములోఁ దల్లిమరణించుట, వయస్సులో భార్యగతించుట, వృద్ధావస్థలో కొడుకులు కూతుండ్రు చనిపోవుట, ౩౦ దుఃఖము, దరిద్రము, ఋణము, విదేశప్రవాసము, దోఁచుకొనఁబడుట, ఆపదలవెంట నాపదలు కలుగుట, దుష్టాన్నము దినుట ౩౧ మహామారివాత బడుట, యుద్ధములో నోడుట, తనకుఁ బ్రియతమమైనవారలు మరణించుటవలనిదుఃఖము ననుభవించుట, ౩౨ కఠినకాలమువచ్చుట, కఱవువచ్చుట, సందేహాస్పదజీవితుఁడగుట, చెడ్డసమయమే తెంచుటఁ ఉద్వేగమునందును జింతయందును బడిపోవుట ఆధిభౌతిక తాపములు. ౩౩ గానుగలోఁగాని మోటలోఁగాని పడి

* ఈయుదాహరణములవలన శ్రీరామదాసస్వామి కాలమునందు రాజదండనము లెంతఘోరముగ దుర్భరముగానుండెనో పాఠకులు తెలిసికొనవచ్చును.

నలిగిపోవుటయు, బండిచక్రముక్రిందఁబడి యణఁగిపోవుటయు, బహువిధములగు నగ్నిజ్వాలలలో మాడుటయు, ౮౫ శస్త్రపాతముచే మరణించుటయు నానావిధములగు వన్యజంతువులవాతబడి చనిపోవుటయు, బహువిధబంధనములలోఁ దగుల్కొనుటయు, ౮౫ అనేక దుష్టస్థలములలో నివసించి భయమున తహతహపడుటయు అవమానములపాలై సిగ్గుపడుటయు శోకాతిశయముచేఁ బ్రాణి తపించుటయు నాధిభౌతికతాపము. ౮౬

ఈవిధముగాఁ జెప్పఁబూనినచో ఆధిభౌతికతాపమున కంత ముండదు. అదియొక మహాపర్వతము. కావున శ్రోతమహాశయులారా! ఇంతతో ఆధిభౌతికతాపమననేదియో తెలిసికొనుఁడు. ఇప్పటికి విస్తరించితిని. ౮౭

ఎనిమిదవ సమాసము.

ఆధిదైవికతాపము

(యమయాతనలు)

ఆధ్యాత్మికతాపమును ఆధిభౌతికతాపమును విపులముగా వర్ణించి తెలిపితిని. ఇపుడాధిదైవికతాపమునుగూర్చి తెలుపుచున్నాఁడను. సావధానమతితో నాలింపఁ గోరెదను. ౧ మనుష్యుడు శుభాశుభకర్మల నొనరించి మరణమునొందినపిమ్మట ననుభవించు యమయాతనకును స్వర్గమునందును నరకమునందును గలుగు ననుభవమునకును ఆధిదైవికతాపమనిపేరు. ౨ మదాంధుఁడై మానవుఁడనేకవిధములగు నవివేకకార్యము లొనరించి యనేకపాతకములఁ గావించి యంత్యమునందు దుఃఖావహమగు యమయాతనల ననుభవించును. ౩ శరీరబలము, ద్రవ్యబలము, మనుష్యబలము, రాజబలము మున్నగువాని నాధారపఱచికొని యకృత్యము లొనరించు

వారును, నీతితప్పి పాపాచరణము లొనరించుచు విఱ్ఱవీగువారును, యమయాతనలకుఁ బాల్పడుదురు. ౪-౫ స్వార్థపరతంత్రులై కనులమూసికొని మహర్షులవలెఁ గనిపించుచు దురభిలాషలతో వర్తించు దుష్టులును, ఇతరులవృత్తిస్వాస్థ్యములను, భూములను, ద్రవ్యములను, స్త్రీలను హరించువంచకులును, మదముచే నున్మత్తులై జీవహత్య, కుటుంబహత్య, మిథ్యాచారము నొనర్చుపాపులును యమయాతనలనుభవింతురు. ౬-౭ నిబంధనల నతిక్రమించి నడిచినయెడల గ్రామాధికారి దండించును. దేశవాసులు నీతిని న్యాయమును విడిచినయెడల దేశాధిపతి దండించును. దేశాధిపతి తగవుతొలంగినయెడల రాజు దండనమువిధించును. రాజు న్యాయముతప్పినచో నీశ్వరుఁడు శిక్షించును. నీతిని న్యాయమును పాటింపక విఱ్ఱవీగి రాజువర్తించెనేని పరలోకమున యమయాతన లనుభవింపవలసి వచ్చును. ౮-౯ అవినీతిపరుఁడును స్వార్థపరతంత్రుఁడును నైనయెడల రాజుపాపియగును. పాపమువలన రాజ్యాంతమున నరకము సంభవించును. రాజ్యమునకుఁ బిమ్మట రాజునకు నరకము లభించును. (రాజ్యాంతే నరకం ధ్రువం) అనిపెద్దలుచెప్పుదురు. తపస్సువలన రాజ్యము, రాజ్యమువలన నరకము, గలుగుననుసామెత మీరెరుంగనిది గాదు. ౧౦ రాజనీతినిదొలంగి వర్తించు భూపాలకున కంత్యకాలమున యముఁడు భయంకరములగు బాధలొనగూర్చును. యముఁడు పాపులను శిక్షించుటలో నియుతి తొలంగినయెడల దేవబృంద మాతని ముట్టడించి పదచ్యుతుని గావించునుగాన దోషులను శిక్షించుపట్ల యముఁడు కడుజాగరూకతతో నుండును. ౧౧ ఈశ్వరుఁ డీవిధముగాఁ బాపులను శిక్షించుటకు నిర్ణయము లేర్పఱచినాఁడు. ఇందుచేతనే నీతియుక్తుఁడవై ప్రవర్తింపుమని మనకుఁ బెద్దలుచెప్పుచున్నారు. ఒకవేళ నీవు క్రిందుమీఁదుయోచింపక తినీ తప్పి సంచరింతువేని యమయాతనలు నీకు సిద్ధముగానున్నవని తలం

ముక్తిమార్గము. ౧౨ పాపులను దండించుటకు భగవంతుఁడు యముని నియోగించియున్నాఁడు. అందువలననే యీతాపమునకు ఆధిదైవిక మను సార్థకనామ మేర్పడినది. మూఁడవతాపమగు యమయాతన మిగులఁ గఠినమైనది. ౧౩ యమలోకమునందుఁ బాపు లనుభవింప వలసినయాతనలు శాస్త్రములలో బహువిధములుగాఁ జెప్పఁబడినవి. పాపులకు యమదండన మవశ్యభోగ్యము. ౧౪_౧౫ పాపమునకును బుణ్యమునకును దగినకళేబరము లనేకములు పరలోకమున సిద్ధము గానుండును. జీవుని నాకళేబరమునందు దేవదూతలు ప్రవేశపెట్టి నానావిధములగు పాపపుణ్యములఫలము లనుభవింపఁ జేయుదురు. ౧౬ నానావిధములగు పుణ్యము లొనరించినవారికిఁ బరలోకమున బహువిధములగు భోగానుభవములు సమకూరును. వివిధములగు పాపకర్మము లాచరించి యున్నయెడలఁ గర్కశయాతనల ననుభవింపవలసి వచ్చును. ఈ విషయము నాస్వకపోలకల్పనము కాదు. శాస్త్రములయందుఁ జెప్పఁబడినది గావున నవిశ్వసనీయమని తలంపఁ గూడదు. ౧౭ వేదము లాజ్ఞాపించువిధమునఁ బ్రవర్తింపనివాఁడును, భగవంతునియెడ భక్తిశ్రద్ధలు వహింపనియాతఁడును యమునిసన్నిధి కేగి యాతనల ననుభవించును. అదియే ఆధిదైవికతాపము. దాని స్వరూపము వర్ణించెద. ౧౮

ఉడుకుచుండెడి నరకమునందు బహువిధములగు జీవములు పురాతనకీటకములు రవరవయని భయంకరముగా ధ్వనిచేయుచుండును. దానియందుఁ జేతులను గాళ్లను బిగియఁగట్టించి యముఁడు పాపులగు మనుజులను బడవేయును. ౧౯ మిగుల విశాలమగు లోనిభాగమును జిన్నమూతియుఁగల భాండరూపమున యమలోకములో నొకకుండ నిర్మింపబడియున్నది. దానిలో దుర్గంధవస్తువులు, వమనము నిండియున్నది. దానిపేరు కుంభీపాకము. ఇచటఁ బాపియగువాఁడు పొందుయాతనలు ఆధిదైవికతాపములు. ౨౦ యమ

లోకమునకుఁ బాపులను దూతలుపట్టుకొనివచ్చి కాలుచున్నభూమి పయిఁ బడవేసి నిలువఁబెట్టుదురు, కాలుచున్నస్తంభమున కంటఁ గట్టుదురు. నానావిధముల నుడికి పొంగులువచ్చు తప్తవస్తువులను బైనఁ బూయుదురు. ౨౧ యముఁడు తనదీర్ఘదండముతోఁ బాపులను నోడలు పగులఁగొట్టును. ౨౨ పాపియగువాఁడు తొలుదొలుత భూలోకమునందే బహువిధములగు బాధల ననుభవింప వలయును. యమయాతన లంతకంటెను పెక్కురెట్లు కఠినములు. ఉచ్ఛ్వాసనిశ్వాసములు దీసికొననీయకుండ యమదూతలు కొట్టుదురు. ౨౩ నలుగురుదూతలు నాలుగువైపులనుండి లాగుదురు. కోదండము వేయుదురు. కాలితోఁ దన్నుదురు. బడితెలతోఁ గొట్టుదురు. ముందునకు గుంజుదురు. ౨౪ లేచుటకలవిగాదు. కూర్చుండుటకు శక్యముగాదు. ఏడ్చుటకు సాధ్యముగాదు. పడుటకు వశము గాదు. యాతనలపయి యాతనలు వచ్చుచుండును. ౨౫ యమలోకబాధ లనుభవింపలేక ప్రాణి వాయెత్తి బిగ్గరగా నేడ్చును. సంకటములనుభవింపలేక బెదరును. క్రోధులకు భయపడును. ఎండి వకుగై పోవును. నానావిధములగు కష్టము లనుభవించును. ౨౬ యమదూతలు కఠినవాక్యము లాడుచుఁ గర్కశముగాఁ గొట్టుదురు. పాపులు యమలోకమునఁబొందు కష్టము లనేకవిధములుగ నున్నవి వీనినన్నింటిని ఆధిదైవికతాపము లందురు. ౨౭

గతసమాసములో రాజదండనమునుగూర్చి చెప్పితిని. దానికంటెనుగూడ మిగులఁగఠినమైనది యమదండనము. ఈయాతన మిక్కిలిభయానకమును, ఘోరమును నైయున్నది ౨౮ ఆధ్యాత్మిక, ఆధిభౌతికతాపములు రెంటికంటె ఆధిదైవికము మిగుల నసహ్యకరమైనది. ఇచ్చట దానిని సంక్షేపముగాఁ దెలిపినాఁడను. ౨౯

తొమ్మిదవ సమాసము.

మృత్యు నిరూపణము

(మృత్యువునుండి యెవ్వఁడుతప్పించుకొనఁడు.)

ఈప్రపంచము మృత్యువువద్దకుఁ బోవుటకై సిద్ధముగానున్న యొక వాహనము. ఏగడియయం దీకళేబరము నెత్తుకొనిపోవుదునా యని కాలము త్రోవ లారయుచుండును. ౧ మృత్యు వెల్లప్పుడును గాలముతో సాంగత్యముగలిగియుండును. మృత్యుదేవి ముందేవిధముగా గమనింపనున్నదో యెఱుంగనేరికిని శక్యముగాదు. కర్మానుసారముగా మనుష్యుఁడు దేశమునందో విదేశమునందో మృత్యువువాతఁ బడును. ౨ సంచితకర్మముల ననుభవించుట ముగియఁగనే దేహ మీప్రపంచమును విడిచి వెంటనే పరలోకయాత్రకు సిద్ధముగా నుండవలసియున్నది. రెప్పపాటులో నీప్రయాణ సంరంభము ముగియును. ౩ ఆకస్మికముగ యమదూతలు ప్రయాణము చేయించుటకు బయలుదేరివత్తురు. మఱియుఁ గొట్టుచు బాధించుచు మృత్యుమార్గమునకుఁ జేర్చుదురు. ౪ మృత్యువు దెబ్బగొట్టిన పిమ్మట నెవ్వరును సహాయము జేయఁజాలరు. వెనుకముందుగఁ బ్రాణికోటికంతటికిని నీదెబ్బ తగిలితీరును. ౫ మృత్యుకాలము బలవంతమగు లాటీదెబ్బవంటిది. అది బలవంతుల తలపయినిఁ గూడఁ బడును. గొప్పగొప్పరాజులు, మహారాజులు, మిగులబలవంతులని పేరొందిన యోధులుసైతము మృత్యుముఖమునుండి తప్పించుకొనఁజాలరు. ౬

మృత్యువు ఈతఁడుక్రూరుఁడని వెరచి విడిచిపెట్టదు. వ్యాయామవిద్యలో నీతఁ డారితేరినవాఁడని గ్రహింపదు. ఈతఁడు సంగరాంగణములోఁ జెలరేగి విరోధులఁజంపు శూరపురుషుఁడని తెలిసికొనదు. ౭ ఈతఁడు క్రోధస్వభావుఁడనిగాని యీతఁడు ప్రతాపశాలియనిగాని యీతఁ డుగ్రరూపుఁడగు ఖలుఁడనిగాని మృత్యువు తలంపదు. ౮ మృత్యుదేవత బలాఢ్యుని, ధనవంతుని, సర్వగుణసంపన్నుఁడగు నుత్తముని సమానదృష్టితోఁదిలకించును. ౯ విఖ్యాతపురుషుని శ్రీమంతుని బరాక్రమవంతుని సామాన్యరాజును జక్రవర్తిని మహాత్ముని, అశ్వపతి నరపతి గజపతియున్నగు విఖ్యాతరాజులను మృత్యుదేవత లక్ష్యముచేయదు. ౧౦-౧౨ లోకమాన్యులు, రాజనీతివిశారదులు, వేతనభోక్తలు (మనసబుదార్లు) అధికారులు వ్యాపారులు, మదోన్మత్తులగు రాజులు, మృత్యుదేవతముందు గరికిపోచ కక్కరకురారు. ౧౩-౧౪ మృత్యువున కీతఁడు ముద్రాధికారియని గౌరవముగాని ఈతఁ డుద్యోగియని యాదరముగాని లేదు. అదిపరకాంతనుగాని రాజకన్యకనుగాని విడిచిపెట్టదు. ౧౫ మృత్యువునకుఁ గారణములతోఁ బనిలేదు. ఉన్నతకులమనిగాని నీచకులమనిగాని యూహింపదు. వీఁడుకర్మనిష్ఠుఁడగు బ్రాహ్మణోత్తముఁడుగదా యని కనికరము జూపదు. ౧౬ వ్యుత్పన్నుఁడగు (బుద్ధిమంతుఁడగు) పురుషునిమీఁద మృత్యువు దయదాల్పదు. అన్నివిధముల సంపన్నుఁడై యున్నవానిని, విద్వాంసుని, గొప్పజనసముదాయమును జేతిక్రింద నుంచుకొని పరిపాలనాకౌశలము జూపువానినిగాని మృత్యుదేవత విడిచిపెట్టదు. ౧౭ ధూర్తుని (చతురసభ్యుని) బహుశ్రుతుని, బండితోత్తముని, ౧౮ పౌరాణికుని, వైదికుని, యాజ్ఞికుని, జ్యోతిష్కునిసైతము మృత్యు వెత్తుకొనిపోవును. ౧౯ అగ్నిహోత్రనిష్ఠగలవానిని, శ్రోత్రియుని, మాంత్రికుని, యాంత్రికుని, వేదమును బూర్తిగాఁ జదివినవానిని, గూడ మృత్యు వాదరించి విడిచిపెట్టదు. ౨౦ ఈపురుషుఁడు శాస్త్రవిశారదుఁడుగదాయని మృత్యు వనుగ్రహింపదు. లేక వేదజ్ఞుఁడు సర్వజ్ఞుఁడునని జాలిదలంపదు. ౨౧ బ్రహ్మహత్య, గోహత్య, బాలహత్య, స్త్రీహత్య మున్నగు ఘోరకృత్యములు గావించుచుంటినని మృత్యుదేవత విచారింపదు. ౨౨ రాగజ్ఞానిని,

తత్త్వవేత్తను తాళజ్ఞానిని, ౨౩ యోగాభ్యాసిని, సన్యాసిని, యోగబలముచే మరణము నాపఁగల మహాత్ములను, ౨౪ సావధానపురుషులను, సిద్ధులను, వైద్యులను, భూతవైద్యులను సైతము మృత్యువెత్తుకొనిపోవును. ౨౫ ఈతఁడు గోస్వామియనియు, తపస్వియనియు, మనస్వియనియు, నుదాసీనుఁడనియు, ౨౬ ఋషీశ్వరుఁడనియు, కవీశ్వరుఁడనియు, దిగంబరుఁడనియు, సమాధిస్థుఁడనియు, ౨౭ హఠయోగియనియు రాజయోగియనియు రాగదూరుఁడనియు మృత్యువు రవ్వంతయేని యనుగ్రహముఁజూపదు. ౨౮ బ్రహ్మచారిని, జటాధారిని, నిరాహారిని యోగీశ్వరుని సైత మది యెత్తుకొనిపోవును. ౨౯ సాధువును, మహాత్ములను, అదృశ్యవిద్య నభ్యసించి గుప్తమైపోయెడివారిని, ౩౦ స్వాధీనుని, పరాధీనుని సైతము విడిచిపెట్టదు. సమస్తప్రాణులను మృత్యువు తినివేయును. ౩౧ ఈ ప్రపంచమునందున్న మనుజులలోఁ గొందరు మృత్యుమార్గములోనికిఁ బూర్తిగానే తెంచియున్నారు. కొందరు సగముదనుక చేరిరి. మఱికొందఱు వృద్ధులై యంత్యమువఱకుఁ జేరిరి. ఇంక నెందఱెందరో మరణించిరి. ౩౨ బాలకుని, తరుణుని, సులక్షణుని, అవలక్షణుని, వ్యాఖ్యాతశిరోమణిని, మృత్యుదేవత లెక్కఁగఁ బరిగణింపదు. ౩౩ ఈతఁడు సంఘమునకు దేశమునకు నాధారభూతుఁడనిగాని, యుదారశీలుఁడనిగాని, సుందరపురుషుఁడనిగాని, అన్నివిధముల సామర్థ్యముగలవాఁడనిగాని మృత్యువు తలంపదు. ౩౪ పుణ్యపురుషుని, హరిదాసుని, భగవత్కీర్తనకారుని, గొప్పగొప్ప సత్కర్మములాచరించు సుకృతాత్ముని సైతము మృత్యువు విడువదు. ౩౫

అది యటులుండనిండు. మృత్యువునుండి తప్పించుకొనువాఁడే లేఁడు. ముందో వెనుకయో తప్పక యందఱును మృత్యుముఖమునఁ బడవలసియే యున్నది. ౩౬ ప్రాణిసమూహము నాలుగువిధములు. జరాయుజములు, ఉద్భిజ్జములు, అండజములు, స్వేదజములు అని

యీనాల్గింటిని చెప్పుదురు ఈ చతుర్విధసృష్టియందుఁగల యెనుబదినాలుగు లక్షల యోనులనుండి జనియించిన సమస్తజీవులను మృత్యువు రేపోమాపో తప్పక తినివేయును ౩౭ మృత్యుభయము వలన నెచ్చటికేని పాఱిపోయినను వాని నెప్పుడును విడువదు. ఏయుపాయముచేతనైనఁ గడతేర్చియే తీరును. ౩౮ స్వదేశీయుఁడైనను విదేశీయుఁడైనను మృత్యువు తినక మానదు. నిత్యము నుపవాసవ్రతమునను వానినైననుసరియే మృత్యుదేవత బ్రతికియుండనీయదు ౩౯ మృత్యువు పెద్దల విడువదు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులను సైతము మదిలక్ష్యము సేయదు. భగవంతుని యవతారములుగఁ దలంపఁబడు రాముని కృష్ణునిగూడఁ గడతేర్చినది. ౪౦ నేనిటులఁ జెప్పితినని శ్రోత లాగ్రహింపవలదని కోరుచున్నాఁడను. ఏలయన! ఈ భూలోకమున నవతరించినవారెల్ల మృత్యువువాతఁ బడిదీరును. ఇది మృత్యులోకమని మీరెల్ల రెఱింగియే యున్నారుగాన నింక విస్తరమెందులకు? ౪౧ ఇందు సందేహింపవలసిన యంశమేదియును లేదు. దీనికి మృత్యులోకమను పేరు ప్రఖ్యాతమైనది. ఈ యంశమును చిన్నలు పెద్దలు బాగుగా నెఱింగినదే. ౪౨ ఒకవేళ సందేహించినయెడల నిది మృత్యులోకము గాకపోవునా? ఇది మృత్యులోకమే! ముమ్మాటికిని మృత్యులోకమే! ఇచ్చట పుట్టినవారెల్లఁ జచ్చియే తీరును ౪౩ కావున వివేకవంతుఁడగు మానవుఁడు సామాన్యప్రాణులవలె మృత్యుముఖమునఁబడక కీర్తిగడించి జన్మము సఫలము గావింపవలయును. అంతియగాక మరణించినతరువాతగూడఁ గీర్తిరూపములోఁ బ్రపంచమున జీవితుఁడై యుండవలెను. ౪౪ చిన్నలు పెద్దలు మొదలుకొని సమస్తప్రాణులు మృతినొందుట నిశ్చయము. ఇందు సందియము లేనే లేదు. ౪౫

మహావైభవ సంపన్నులగు రాజాధిరాజులు, చిరకాలజీవులుగానున్న సిద్ధాత్ములు అగాధమహిమాన్వితులు మృత్యుమార్గమునఁ బడి యదృశ్యమైపోయిరి. ౪౬ పలువురు పరాక్రమవంతులు, పలువురు కపటాచారపరాయణులు, పలువురు బహుకాలద్రష్టలు, పలువురు

కులనాయకులు, పలువురు రాజులు మరణించిరి. ౪౭ బహువిధములగు యుద్ధములలో జయముబడసిన శూరులు, బలసంపన్నులు ౪౮ సమస్త ప్రజాసమూహమును బరిపాలించినవారు, బుద్ధిశాలురు, యుక్తిమంతులు, తార్కికులు ౪౯ విద్యావంతులు, శైలసదృశబలవంతులు కుబేరుని దిరస్కరించునంతటి ధనికులు ౫౦ పురుషార్థవంతులు, తేజస్సంపన్నులు, కార్యాచరణకౌశలురు ౫౧ శస్త్రధారులు పరోపకారులు భిన్నభిన్న మతరక్షకులు పరలోకముచేరిరి. ౫౨ ప్రతాపశాలురు సత్కీర్తిధనులు భిన్నభిన్న నీతివిదులు, రాజనీతివిదులగు రాజులు ప్రయత్నవాదులు, వివాదశీలురు ౫౩ భిన్నభిన్న మతవాదులు పండితవతంసులు, శబ్దస్వరూపమునుగూర్చి కోలాహలమొనరించు వయ్యాకరణులు నానామతములపై బూర్వపక్షసిద్ధాంతములొనరించగల మహామహులు పరలోకగతులైరి. ౫౪—౫౫ తపస్విసమూహము, సన్న్యాసిబృందము, తత్త్వవేదిసముదాయము, ౫౬ గృహస్థులు, బహువిధవేషధారులు, నానావిధపురుషులు, బ్రాహ్మణసమూహము, ఆచార్యపురుషులు, మృత్యువునోటc బడిపోయిరి. ప్రపంచ మేర్పడినదిమొదలు లింతవఱకెందఱెందఱు మహాత్ములు ప్రపంచమునందుc దమలీలజూపి మగణించిరో యెవరికిc దెలియును? ఎంతదనుకc జెప్పగలను? ౫౭. ౫౮

ఈ విధముగాc బ్రాణిసమూహమంతయు మృత్యుదేవతనోటc బడిపోయెను. ఇంత ప్రాణిబృందము నశించినను నశింపక నాcటినుండి నేcటిదనుక శాశ్వతస్థాయిగా నున్నది ఆత్మజ్ఞానస్వరూపాకార యొకటి మాత్రమెయని శ్రోతలు గ్రహింతురుగాక ౬౦

పదియవసమాసము

వైరాగ్యనిరూపణము.

ఈ సంసారము తరంగసంగతులచే నుప్పొంగు నదియైయున్నది. దీనిలో ననేకజలచరములు నివసించియున్నవి. విషయతము

లను కాలసర్పములు కాటువేయుటకుc బరుగులిడుచుc బైకివచ్చుచున్నవి. ౧ ఈ మహానదిలో ఆశ, మమకారము, దేహబుద్ధియను మొసళ్లుగలవు అవి మనుజులనుబట్టి ప్రక్కకు లాగుకొనిపోయి సంకటముల పాలుచేయుచున్నవి. ౨ అహంకారరూపములగు నక్రములు పాతాళమునకుc బట్టుకొని తీసికొనిపోయి మానవుని నాకస్మికముగా ముంచి వేయుచున్నవి. అచటి కీడ్వంబడిన ప్రాణియెన్నంటికి బయటంబడజాలcడు ౩ కామరూపియగు మొసలి పిడికిలినుండి యెన్నటికి మనుష్యుcడు విడిపించుకొనలేcడు. తిరస్కారము వెంటనంటియున్నది. మదమత్సరములను విడువలేకుండుటవలన మనుజుcడు భ్రమలయందుc బడిపోవుచున్నాcడు. ౪ వాసనారూపమగు నాcడు పాము మెడకుc జుట్టుకొని నాలుకలు గ్రోలుచు విషము నుమియుచున్నది. ౫ ఇట్టిదశయందు మనుష్యుcడు చూచినదానినెల్ల నాదినాదియని నుడువుచుc బ్రపంచభారమును (గృహస్థభారము) తలపయి కెత్తుకొనియున్నాcడు. అతcడాయుప్పొంగు సంసారనదిలో మునుcగcగోరుచున్నాcడు. కాని భారము విడువకున్నది. మిక్కిలి కులాభిమానములోcబడి పొంగిపోవుచున్నాcడు. ౬ అట్టిదశయందు భ్రాంతియను నంధకార మావరించుటచే నభిమానరూపుcడగు చోరుcడు వానిని దోcచుకొనుచున్నాcడు. మఱియు నహంతారూపిణియగు భూతము వాని నలముకొనుచున్నది ౭ ఈవిధముగా ననేక ప్రాణులు ఈ మహానదియందుc గల సుడిగుండములలోcబడి చుట్టుకొని పోవుచున్నారు. అట్టుల నవస్థపడుచు భక్తిభావపూర్వకముగా భగవంతుని స్మరించుటకుc బిలుచువాcడు ఒడ్డుబట్టుచున్నాcడు. భగవంతుc డాతని నెంతేసిమన్నించి యొడ్డునకుc జేర్చుచున్నాడు పాపము తక్కిన భక్తిరహితుల దురవస్థ చెప్పవలసిన పనియేలేదు. వాండ్రా ప్రవాహమున దిక్కుమోక్షములేక కొట్టుకొని పోవుచునే యున్నారు. ౮—౯.. భగవంతుcడు భక్తిభావమున కాcకలిగొనియున్నాcడు. అతcడు భక్తిభావము నానందముతో గ్రహించును. భక్తిభావముగలవాcడు సంకటములొందు సమయమున నాతcడు ప్రసన్నవదనముతోc బ్రత్యక్షమై రక్షించుచున్నాcడు. ౧౦ ఎవcడు పరమా

త్మునిమీఁదఁ బ్రేమగలిగియుండునో యాతనియెడఁ బరమాత్ముఁడు గూడఁ బ్రేమతోనుండును. అతఁడు తనభక్తుని యెడఁ గనికరించి సమస్తమైన యాపదలనుండితొలఁగించును. ౧౧ పరమాత్మునియెడల భక్తివిశ్వాసములుగలవారై దాసానుదాసులై వర్తించు పుణ్యాత్ములు తప్పక స్వాత్మసుఖానందము జూరగొందురు. ఇట్టి భక్తవతంసులకు నమస్కరించెదను ౧౨ ఎవనికి భగవంతునిపయి నెట్టి భావముగలదో వానిపట్ల పరమాత్మునకుఁ గూడ నట్టిభావము గలుగును. భగవానుఁడు ప్రాణిమాత్రుల హృదయములలో నంతస్సాక్షిగానున్నాఁడు. మఱియు నందఱిభావము లెఱింగి మెలఁగుచున్నాఁడు. ౧౩ ఎవఁడు మోసగాఁడై లోకులను భగవంతుని వంచించుచుండునో నట్టివంచకునెడ భగవంతుఁడు నైతము మోసగాఁడుగనుండును. ఆతనికౌశల మత్యంతాశ్చర్యకరమైనది. ఆయన ఎట్టివాని కట్టివాఁడుగాఁ గన్పించును. ౧౪ తనదివ్యనామము జపించుచు నిరంతరము భక్తిశ్రద్ధలతో దపముగావించు భక్తునియెడ భగవంతుఁడు శాంతభావముతో మెలంగి శాంతిప్రసాదించును. ఒకవేళ భక్తునిభావము కొంచెమేని న్యూనమై భక్తిపదవినుండి తొలంగినయెడల భగవానుఁడువేఱై భక్తుని విడిచి వెళ్లిపోవును. ౧౫ ఎవఁడెటులుండునో వానికట్టిప్రతిబింబము దర్పణమునందుఁగనిపించును. దానికి ముఖ్యమగు తాళపుఁజెవి మనయొద్దనేయున్నది. ౧౬ మనమెట్లుచేయుదుమో దర్పణములోనిమన ప్రతిబింబము నైత మటులే చేయుచుండును. ఒకవేళ మనము కనులను బాగుగా విప్పిచూచితిమేని మనప్రతిబింబముగూడఁ గనులను విప్పినటులఁ గనిపించును. ౧౭ కనుబొమ్మలను ముకుళించి మనము కోపముతోఁ జూచినయెడల నదియుఁ గ్రోధస్వరూపముగా గోచరించును. ఒకవేళ మనము నవ్వసాగినచో మనప్రతిబింబముగూడ నవ్వసాగును. ౧౮ మనుజునిభావములెట్లు దర్పణమునందుఁ బ్రతిబింబితములగుచున్నవో యటులేపరమాత్ముఁడుగూడ భక్తునివిషయమున మాఱుచుండును. ఎవరు తన్నెటులభజింతురో వారికటులే భగవంతుఁడు కామితఫలములను బ్రసాదించును. ౧౯ సాధకుఁడగు

మానవుఁడు భావమార్గమునను బరమార్థమార్గమునను భక్తిస్థానమునకుఁ జేరును. అప్పుడు సాధుసమాగమము చేకూరి మోక్షమార్గము లభించును ౨౦ భావపూర్వకముగ భగవానునియెడ భక్తిప్రపత్తులు గలిగియుండు మానవులు పావనులగుదురు. అంతియగాక భావబలమునఁ దమపూర్వులనుగూడ నుద్ధరింతురు. ౨౧ స్వయముగ ముక్తులయ్యెదరు. ఇతరులకుఁగూడ నుపకరించి భక్తిరహితులకు భక్తిగలుగఁజేసి తరింపఁజేయుదురు. ౨౨ పరమాత్మునియెడ భక్తిగల భక్తులనుగన్న తల్లులే ధన్యురాండ్రు. వారల జన్మము సర్వవిధముల సార్థకమైనది. ౨౩ భగవంతునికిఁ బ్రియతములగు భక్తుల యాధిక్యము నెంతని కొనియాడనేర్తును? వారలకు దుఃఖముకలిగినపుడు ఆపరమాత్ముఁ డాలంబనముగాఁ దననడుమునొసంగి దరిజేర్చుచున్నాఁడు. ౨౪ అనేక జన్మములకుఁ బిమ్మట నీ నరదేహము లభించును. ఈ నరదేహమును సత్క్రమమార్గములఁ బ్రవేశపెట్టి భక్తిమార్గమున నన్వయించినయెడల నీశ్వర సమావేశము కలుగును. ౨౫ అట్టిభక్తిస్వభావులగు పుణ్యపురుషులకు నమస్కరించెదను. భక్తుల ప్రభావము గొనియాడ నశక్యము. వారలు హరినిధానమును సంచితముగావింతురు. అందుచే వారల యనంతజన్మఫలము సఫలమగును. ౨౬

మానవుని యాయు వాకరత్నపేటిక. దీనిలోనిండ సుందరములగు భజనరత్నములు కలవు. మానవులారా! అట్టి లోకోత్తరములగు భజనరత్నములను నీశ్వరసమర్పణముగావించి యానందము చూరగొనుఁడు. ౨౭ సంసారసంబధములగు భోగభాగ్యములలో హీనులైనంతమాత్రమున హరిభక్తులెన్నఁటికిని హీనులుగాఁ బరిగణింపఁడగరు. వారు వాస్తవమునకు బ్రహ్మాదులకంటెను శ్రేష్ఠులు. సర్వకాల సర్వావస్థలలో వారు నిరాశానందమున మునిఁగి తేలుచుందురుగదా! బ్రహ్మాదుల కట్టి నిరాశానందమెక్కడిది? ౨౮ ఈశ్వరుని సహాయము నొక్కదానినిమాత్రము విశ్వసించి సంసారముపట్ల నిరాశాభావముతోఁ బ్రి[illegible] భక్తిస్వభావులను సర్వ[illegible]

ధముల భగవంతుఁడు సంబాళించును. ౨౯ భక్తిస్వభావులగు నుత్తములు వివేకముగలవారలుగాన సంసారదుఃఖముల నన్నింటిని సుఖములుగా భావింతురు. భక్తిరహితులు సుఖములయందే చిక్కుకొని పడియుందురు ౩౦ ఈశ్వరునియం దత్యంతముగాఁ బ్రేమగలభక్తులు స్వానందసుఖమున నోలలాడుదురు. వారియక్షయకోశము (స్వానందము) లోకాతీతమైనది. ౩౧ భక్తులు సంసారకష్టములను సుఖములుగా భావించి యక్షయసుఖముతో సుఖులుగానుందురు. సంసారదుఃఖమును మఱచిపోయెదరు. ఈశ్వరునియందు మగ్నులైయుండి విషయసుఖమునుండి పరాఙ్ముఖులైయుందురు. ౩౨ భక్తులగు మానవులీనరదేహముకతనఁ బరమాత్ముని బ్రాపింతురు. భక్తిరహితులును అభాగ్యులునగు నితరులకీజన్మము వ్యర్థముగాఁబోవును. ౩౩ ఎవనికేని సుకృతవశమున నాకస్మికముగా గొప్పధనరాశి లభించినచో దానిని గవ్వకుమార్చివేయుట యెట్టిదో భక్తిభావరహితులగు మానవులు తమయమూల్యదేహమును వ్యర్థముగాఁ గోల్పోవుటయు నట్టిది. ౩౪ పూర్వపుణ్యకారణమున నెవనికేని స్పర్శవేది లభించిన యెడల దానినుపయోగించువిధ మెఱుంగక పాడుచేయును. అటులే భక్తిహీనుఁడగు పురుషుఁడు పూర్వజన్మసుకృతమున గడించిన యీనరదేహమును సార్థకముగావించువిధము నెఱుంగక పాడుచేయుచున్నాఁడు. అంతతోఁబోక మాయాజాలమునందుఁ దగుల్కొని తనజీవితమునుగూడ నాశనము చేసికొనుచున్నాఁడు. ౩౫-౩౬ ఈనరదేహసంయోగమువలననే మానవులనేకులు ముక్తపురుషులును మోక్షగాములు నైరి. ఇట్టిమనుష్యజన్మమునుబొంది భగవంతునియెడ భక్తిశ్రద్ధలుగలవారై సంచరింపనిప్రాణులు జన్మమరణదుఃఖములను నిరంతర మనుభవించుచుందురు ౩౭

కావున మానవులు నరదేహమునకుఁగల గొప్పతనముగ్రహించి సాధుసమాగమముకతన జీవితము సఫలముగావించుకొనవలయు[illegible]మున కేతిరానున్నదో తెలిసికొనఁజాలము. [illegible]ల్లవారినంతన పదిదిక్కులకు నెగిరి

పోయినటుల నీసమస్తవైభవము, స్త్రీలు, పుత్రులు, ధనము, మున్నగునవి యేసమయమున నేవిధముగాఁ బరాధీనములై యెక్కడకు వెళ్లిపోవునో మనము గ్రహింపలేము. ౩౯-౪౦ ఏగడియకు నేమికానున్నదో తెలియదు. ఆయువు పూర్తికావచ్చినది. దేహాంతమైనపిదప మరల నేనీచయోనియో సిద్ధముగాఁ గాచుకొనియున్నది. ౪౧ శ్వానసూకరాది నీచయోనులలో నెందుజనించి విపత్తుల ననుభవింపవలసివచ్చునో చెప్పఁజాలము. ఈనీచయోనులయందు జనించినప్రాణికి ఉత్తమగతి లభింపదు ౪౨ ఓరీ! అవివేకీ! నీవు తొలుదొలుత గర్భవాసమునందున్నపు డెన్నియోకష్టములొందితివి. ఎన్నెన్నియో యవస్థల పడిపడి వేసారి పూర్వసుకృతమున మానవుఁడవై జన్మింపఁగలిగితివి. ౪౩ వెనుకటిజన్మములలో సమకూరిన సమస్తదుఃఖములను నీవొక్కరుఁడవే యనుభవించితివి. అక్కడ నీలోఁ బాలుపంచుకొనుటకు ఈభార్యగాని ఈకుమారులుగాని లేకుండిరి. మరల నదేవిధముగా నీచజన్మములను నెత్తుటకు నేఁడో రేపో యైహికజీవితము ముగించుకొని నీవొక్కరుఁడవే పోవలసియున్నాఁడవు. ౪౪ ఎక్కడితల్లి, ఎక్కడితండ్రి, ఎక్కడిసోదరి, ఎక్కడిభ్రాతలు, ఎక్కడిస్నేహితులు, ఎక్కడిస్త్రీపుత్రాదులు? ౪౫ సమస్తమును మిథ్యయైయున్నది. అందరును సుఖమునుగోరి నిన్నాశ్రయించినారు. వీరలకు నీసుఖముతో సాంగత్యముగలదేమో గాని కొంచెమేని దుఃఖముతో సాంగత్యముకలవారు కారని యూఢిగా నమ్ముము. ౪౬ ఈప్రపంచ మెక్కడినుండివచ్చినది? నీకుల మెక్కడిది? ఏల వ్యాకులమునొందెదవు? ధనము, ధాన్యము, సంపద, మున్నగు సంసారభోగములన్నియు నస్థిరములు. ౪౭ ఎక్కడి దీగృహము? ఎక్కడి దీగృహస్థాశ్రమము? ఎందులకై యీవ్యర్థపరిశ్రమతో మునిఁగి తేలుచున్నాఁడవు? బ్రదికియున్నంతవఱకీకుటుంబపు జంజాటమను బరువును మోసిమోసి పరితపింతువు. కడకుఁ గాలము దీరును. అన్నియు విడిచిపోయెదవు. ౪౮ ఈతరుణతావిజృంభణము, ఈభోగభాగ్యములు, ఈహావభావానంద[illegible]మ్ము ముట్టకను. ఇవియన్నియు మాన[illegible]

యివి మాయతోఁ గూడినవని గమనింపుము ౪౯ ఒకవేళ నీవాకస్మిక
ముగ మరణింతువేని పరమాత్ముఁడగు శ్రీరాముని జెందనేరవు. నీవు
కనుపించువానినెల్ల నాదినాదియని చెప్పుచున్నాఁడవు. నీవాసన విష
యములలోఁ జిక్కియున్నది. ౫౦ నీ వెన్నెన్నియో జన్మము లిదివర
కెత్తియుంటివి. అటులె ప్రతిజన్మమున కొక మరణమువంతున నెన్ని
యో మరణములను సైతమొందియున్నాఁడవు. ఈ జననమరణములలో
నీకిలాటి తల్లులు, తండ్రులు, భార్యలు, బిడ్డలు, కొడుకులు, మున్నగు
వార లెన్నిలక్షలమంది యైపోయిరో యేమెఱుంగుదువు? ౫౧ కర్మ
యోగమువలన వీరందరు నీకు సమకాలికులుగా నీలోకమున జనించి
నీతోఁ గలసిమెలసియున్నారు. ఓరీ! చదివిన మూర్ఖుఁడా! వీరలను
నీవు సిగ్గుబిడియములులేక నావారలు నావారలుఅని యెటులఁ జెప్పు
కొనుచుంటివో నాకుఁదోఁచకున్నది. ౫౨ బాగుగా యోజించి
చూడుము. ఈ శరీరమే నీదికాదు. అట్టియెడ నెట్టిసంబంధమును లేని
వీరినందరను నావారు నావారు అనిపూసికొందువేల? ఇప్పటికైన
నీయొక్కయు నీవుప్రేమించుజనులయొక్కయు నస్థిరత్వము గ్రహించి
భక్తిభావముతోఁ బరమాత్ముని నమ్ముకొనుము. ౫౩ ఈపాపపుఁ
బొట్ట నించుకొనుట కెందరెందరు నీచజనులనో సేవింపవలసివచ్చు
చున్నది. నీచులకడ జేరి సిగ్గులగ్గువిడిచి స్తోత్రపాఠములు వల్లింపవలసిన
గతి కలుగుచున్నది. పోషించువానికడ నెంతయో వినయవిధేయ
తలు జూపవలసివచ్చుచున్నది. పట్టెడన్నము బెట్టినందులకె
యీరీతిగ నీజీవితసర్వస్వమును హీనులకు విక్రయించివేయుచున్నాఁ
డవు. అంత కెన్నిరెట్లో యోగ్యుఁడును నరదేహప్రదాతయు జీవి
తము ననుగ్రహించినవాఁడునగు దేవుని నీవేలమఱచిపోవుచుంటివో
నాకుఁ దోఁచకున్నది ౫౪-౫౫ భగవానుఁడు సర్వశక్తిసంప
న్నుఁడు. ఆతనిమాహాత్మ్యము నీకుఁ దెలియకున్నచో నేను జెప్పెద
నాలింపుము. ఈశ్వరుఁడు రేయుంబవళ్లు సమస్తప్రాణి లోకమునకు
శుభము నెటులఁ గూర్పఁగలుగుదునాయని చింతించుచున్నాఁడు.
ఆతని ప్రతాపముకతననే సకాలమున మేఘములు వర్షించి పృథివిని
సస్యసంపూర్ణము గావించుచున్నవి. ఆయన కనుసన్నలకు లోనై

సముద్రము చెల్లెలికట్టనుదాటక యథావిధిగానున్నది. ౫౬ భగ
వంతుని యాజ్ఞననుసరించియే భూభారము నాదిశేషువు వహించు
చున్నాఁడు. సూర్యుఁడాతని తేజముచేతనే మింటఁ బ్రకాశించు
చున్నాఁడు. సమస్త చరాచరభూతవిశిష్టమగు భూతనివహమును
సృష్టిని నాతఁడు తనమహత్వముచే (సత్తామాత్రముచే) నడుపు
చున్నాఁడు. ౫౭ దేవాధిదేవుఁడు, మహాదేవుఁడు, దయాళుఁడునగు
నాపరమాత్ముని లీలలను మానవులే మిగులగ్రహింపఁగలరు. కృపా
పూర్వకముగ నాతఁడు రక్షింపకున్నచో నీజీవలోకము ప్రాణ
ముతో నింతకాలముండఁగలదా. ౫౮ సర్వాత్ముఁడు లోకపావ
నుఁడునగు నిట్టిశ్రీరామచంద్రునివిడిచి కామ్యవిషయములలో మగ్ను
లైయుండు ప్రాణులను దురాత్ములన్నను, అధములన్నను దప్పులేదు.
వారు తాముచేసినదానిఫలము తప్పక యనుభవింతురు. ౫౯
శ్రీరామచంద్రునిగూర్చికాక స్వోపయోగమునకయిచేయు నాశా
కృత్యములన్నియు నిరాశలని గ్రహింపవలయును. కానఁబడినదానినెల్ల
నాదినాది యనుకొనుటవలనఁ గడకు మిగులునది కష్టమొక్కటియే.
౬౦ ఎవనికిఁ గష్టమునొందవలయునను గోరికయుండునో వానిని సం
తోషముగా విషయచింతన నొనరింపనీయవలెను. కడకు విషయచింత
నములవలన లభించునది కష్టమె. అదిలభించినంతన హృదయము
క్షోభించును. విషయములస్థితి యిట్టిది ౬౧ ఆనందధనమగు శ్రీరామ
చంద్రుని విడిచి హృదయమునందు విషయచింతనము లొనరించు
మానవుఁడు ఎన్నఁటికిని మోక్షమును బొందఁజాలఁడు. వానికి సమా
ధానము కలుగనేరదు ౬౨ ఎల్లప్పుడును సౌఖ్యము నభిలషించు
మానవుఁడు శ్రీరామ భజనయందుఁ దత్పరుఁడైయున్నఁ జాలును.
వాఁడు సుఖపడును. దుఃఖమూలమగు కుటుంబజనముతో సంబంధము
నుమాత్రము వాఁడు తొలంగించుకొనవలయును. ౬౩ వాసనలకారణ
ముననే మానవునకుఁ గష్టములు దుఃఖములు కలుగుచున్నవి. కావున విష
యవాసనలనువిడనాడినవానికె సౌఖ్యములుసమకూరును. ౬౪ విషయ
ములవలననుత్పన్నమగు సమస్తసుఖములు సుఖములుగావు. అనిసుఖా
భాసములు. వానిలోఁ బరమసుఖము పూర్తిగా నిమిడియున్నది.

తొలుదొలుత విషయసుఖములు మధురతరములుగఁ దోఁచును. కాని తరువాత వానివలన శోకము కలిగితీరును. వానిస్వభావమిట్టిది. ౬౫ గాలమునకుఁ దగిలించిన యెఱ్ఱయందుఁ జేపకుఁ దినఁబోవునపుడు సుఖముకనిపించినను దానిసిలాఁగఁ పిమ్మట గొంతుక పగిలిపోవు చున్నది. మేఁతదినవలయునను నాశతో లేఁడి వలలోఁ దగుల్కొను చున్నది. అటులె విషయసుఖములయొక్క తీపిదనమందు తీపిగను పించినను నిజమువిచారించిన మిక్కిలిచేదు. ఇందుచేతనే శ్రీరాముని యెడఁ బ్రీతినుంచుమని చెప్పుచున్నాఁడను. ౬౬–౬౭

దీనినాలించి శ్రోతలలోనొకఁడగు భక్తిభావయుతుఁడైన శిష్యుఁ డిటు లడుగుచున్నాఁడు. ఓ స్వామీ! ఈజన్మమును సఫలము గావించునదియు యమలోకమును దప్పించునట్టిదియునగు నుపాయ మునుఁజూపుఁడు. ౬౮ ఓమహారాజా! పరమాత్మఁడెచ్చటనున్నాఁడు? ఆతనిసాన్నిధ్యము నాకులభించుమార్గమేది? దుఃఖమూలమగు సంసారము తొలంగుమార్గమేది? ౬౯ ఓ కృపామూర్తీ! తప్పక భగవంతుఁడు లభించునట్టిదియు అధోగతిని దూరముచేయునదియు నగు నుపాయము దీనుఁడనగు నాకుఁ దెలుపుఁడు. ౭౦ వక్త చెప్పు చున్నాఁడు. సోదరా! నీవనన్యుఁడవై భగవంతుని భజనగావింపుము. దీనివలన సహజముగనే నీకు సమాధానముగలుగును. ౭౧ శిష్యుఁ డిటుల నడుగుచున్నాఁడు. గురువరా! భగవంతునిభజన మెటులఁ జేయవలయునో మనస్సు నెక్కడ నుంచవలయునో తెలిపి కృపతో నాకు భగవద్భజనలక్షణములను బోధింపుఁడు. ౭౨ ఈవిధముగా భక్తుఁడగు శిష్యుఁడు దీనవదనముతోఁ బలికి దృఢహృదయముతో గురువరునిపాదములను బట్టుకొని గద్గదకంఠుఁడయ్యెను. దుఃఖము వలన నాతని కన్నుఁ బాతమయ్యెను. ౭౩ శిష్యుని యనన్యభక్తి నిగాంచి సద్భావముతోఁ బ్రసన్నుఁడై శ్రీసద్గురుమూర్తి యిటులనుడివెను. మిత్రుఁడా! ఇఁక నిప్పుడు రాఁబోవుసమాసమునందు స్వానందమును బొందుమార్గము తెలుపుదును. సావధానమతితో నాలింపుము.

మూఁడవ దశకము సమాప్తము.

నాలుగవసమాసము.

మొదటిదశకము

శ్రవణభక్తి

ఓగణేశ్వరా! సర్వవేళలను నీకు విజయమగుఁగాక. దేవా! నీవు విద్యావైభవములందు సమర్థుఁడవు. కృపాళుఁడవై నాకు ఆధ్యాత్మిక విద్యనుగూర్చిన పరమార్థమును సాధకులకు బోధింపగల శక్తినిఁ బ్రసాదింపుము. ౧ ఓవేదమాతా! శారదా! నీకుఁగూడ వందనము లొనరించుచున్నాఁడను. నీమహత్త్వమువలననే వక్తలకు సమస్తసిద్ధులు సమకూరుచున్నవి. నీకతననే హృదయము మననము గావించుటయందుఁ బూర్ణముగాఁ బ్రవృత్తమగుచున్నది. ౨ ఇఁక సద్గురుమూర్తిని స్మరించెదను. గురుమూర్తి ఉత్తములలో నుత్తముఁడు. ఆతనియనుగ్రహమువలన జ్ఞానవివేకము ప్రకటితమగును. ౩ భగవద్భజనము నెటులఁజేయవలయునని శ్రోతలు నన్ను మంచిప్రశ్నమునడిగిరి. కావున ననేకగ్రంథములయొక్కయు షట్ఛాస్త్రములయొక్కయు నాధారములను గైకొని నవవిధభక్తులనుఁగూర్చి వర్ణన మొనరించెదను. శ్రోతలు దీనిని సావధానమతితో నాలించి పావనులుగాఁ గోరెదను. ౪–౫

శ్లో. శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం. భాగ.స్క. 7–5–23

శ్రవణము, కీర్తనము, విష్ణుస్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము అనునీతొమ్మిదియు భక్తిభేదములు. వీనిలోఁ బ్రతిభక్తినిగూర్చియు వివరణము

ప్రతిసమాసమునందుఁ జేయుదును. సావధానమతితో శ్రోతలువినవలెను. ౬ హరికథలను పురాణములను నానావిధములగు నధ్యాత్మనిరూపణములను వినుచుండవలయును. ఇది మొదటిభక్తి. ౭ కర్మమార్గము ఉపాసనామార్గము, జ్ఞానమార్గము, సిద్ధాంతమార్గము యోగమార్గము, వైరాగ్యమార్గమును గూర్చిగూడ సాధకుఁడు వినుచుండవలెను. ౮ అనేకవిధములగు వ్రతములు తీర్థములు దానములు మున్నగుమహిమలు గూడ నాలింపవలెను. ౯ ఇంతియగాక బహువిధములగు మాహాత్మ్యములు, పుణ్యస్థలముల వర్ణనములు, బహువిధమంత్రములు సాధనములు, అనేకప్రకారములగు తపములు, పురశ్చరణములు వినవలయును. ౧౦ దుగ్ధాహారులు, నిరాహారులు, ఫలాహారులు, పర్ణాహారులు, శాకాహారులు, నానావిధాహారులు నెటులుందురో వారిస్థితియు ౧౧ ఎండలో వానలోఁ జలలో అడవిలోఁ బృథ్విలో ఆకాశములో సిద్ధులేవిధముగా వసింతురో యదియు ౧౨ జపి, తపి, తామసయోగి, నిగ్రహి, హఠయోగి, శక్తిమార్గి అఘోరయోగియెటులుందురోయదియు నెఱుంగవలయును. ౧౩ అనేకప్రకారములగు ముద్రలు, ఆసనములు, లక్ష్యస్థానములు, పిండజ్ఞానము, తత్త్వజ్ఞానము మున్నగువాని వర్ణనమువిని స్వరూపము గ్రహింపవలెను. ౧౪ నానావిధములగు పిండరచనము, అనేకవిధములగు భూగోళరచనము, పలుతెఱంగులుగల సృష్టిరచనము ఏవిధముగానుండునో యదియు ౧౫ చంద్రుఁడు, సూర్యుఁడు, తారామండలము, గ్రహమండలము, మేఘమండలము ఇరువదియొక్క స్వర్గములు, ఏడుపాతాళములు మున్నగువానిస్వరూపమును ౧౬ బ్రహ్మవిష్ణుమహేశ్వరులస్థానములు, ఇంద్రాదిదేవతలయొక్కయు ఋషులయొక్కయుస్థానములు, వాయువరుణకుబేరులస్థానములు, నెటులుండునోయను విషయమును శ్రవణముచేయవలయును. ౧౭ తొమ్మిదిఖండములు, పదునాలుగుభువనములు, అష్టదిక్పాలురస్థానములు గహనములగు ననేకవనోపవనముల స్వరూపములును ౧౮ గరుడ గంధర్వ విద్యాధరయక్షకిన్నర నారదతుంబురు ప్రముఖులగు అష్టగాయకుల సంగీతవిచారవర్ణనములును వినవలయును. ౧౯

రాగజ్ఞానము తాళజ్ఞానము నృత్యజ్ఞానము వాద్యజ్ఞానము అమృతసిద్ధియోగము ప్రసంగజ్ఞానము లెటులుండునో యదియు ౨౦ పదునాలుగువిద్యలు అఱువదినాలుగుకళలు సాముద్రికలక్షణము మనుష్యుని ముప్పదిరెండులక్షణములు, మఱియు నానావిధములగుకళలు వానిస్వరూపములును ౨౧ మంత్రము మణిమయౌషధములు సూత్రిగ్రంథులు సిద్ధులు, నానాభాషలు నానావిధౌషధములు ధాతువులు రసాయనక్రియలు నాటికాజ్ఞానము శ్రవణభక్తిస్వరూపము నెఱుంగఁగోరువాఁడు వినవలయును. ౨౨ ఏదోషమువలన నేరోగమువచ్చునో ఏరోగమునకు ఏ ప్రయోగము చెప్పఁబడెనో ప్రయోగమునకు ఏయోగ ముపకరించునో యదియు ౨౩ రౌరవ కుంభీపాకాదినరకములు, యమలోకములోని నానాయాతనలు, స్వర్గనరకములలోని సుఖదుఃఖములు గూడ నెఱుంగవలయును. ౨౪ నవవిధభక్తులు, చతుర్విధభక్తులు ఏవిధముగానుండునో ఉత్తమగతి యెటులలభించునో ౨౫ పిండబ్రహ్మాండములరచనము నానావిధములగుతత్త్వములస్వరూపము సారాసారవిచారము నెటులుండునోయను నంశములు వినవలయును. ౨౬ సాయుజ్యముక్తి స్వరూపము, మోక్షము లభించుతెఱంగు నెఱుంగ వలయు నన్నయనేక సద్గ్రంథరాజములు బఠింపవలయును. ౨౭ వేదము, శాస్త్రములు, పురాణములు, తత్త్వమసి మున్నగు మహావాక్యముల వివరణము, తనుచతుష్టయనిరసనము (స్థూల, సూక్ష్మ, కారణ మహాకారణశరీరములు) తెలిసికొనవలయును. ౨౮ వినుట కన్నియును వినవలయును. వినినంతన లాభములేదు. విన్నయంశములు మనస్సునకుఁ బట్టించుకొని సారము వెదుకవలయును. అసారమునుగుర్తించి విడిచివేయవలయును. దీనికే శ్రవణభక్తియనిపేరు. ౨౯ సగుణపరమాత్ముని చారిత్రముల నాలించుచు ఆధ్యాత్మజ్ఞానమూలమున నిర్గుణమును వెదకుచునుండుటయే శ్రవణభక్తిలక్షణము. ౩౦ ఈశ్వరుని సగుణచరిత్రము, నిర్గుణతత్త్వము, అను నీరెండువిషయములు పరమపవిత్రములు గాన వీనిని శ్రద్ధాభక్తులతో వినుచుండవలయును. ౩౧ జయంతులు, ఉపవాసములు, బహువిధసాధనములు, మంత్రయంత్ర

జపధ్యానములు, కీర్తిస్తుతి, స్తవనము, భజనము మొదలగునవి తెలిసికొనవలయును. ౩౨ ఈవిధముగా సగుణపరమాత్ముని గుణశ్రవణము, నిర్గుణమునుగూర్చిన యాధ్యాత్మికనిరూపణశ్రవణము గావింపవలయును. మరియు భిన్నత్వమునువదలి భక్తిమూలమును వెదుకవలయును. ౩౩ ఇప్పుడు శ్రోతలకు శ్రవణభక్తి యననేమియో తెలిసియుండును. కావున నిఁకముందుఁ గీర్తనభక్తిలక్షణముఁ జెప్పెదను. శ్రద్ధతో నాలింతురుగాక. ౩౪

రెండవ సమాసము

కీర్తనభక్తి

నవవిధభక్తులలో నొకటియగు శ్రవణభక్తిని దెలిపితిని. ఇపుడు రెండవదగు కీర్తనభక్తినిగూర్చి తెలుపుచున్నాను వినుండు. ౧ సగుణపరమాత్ముని గుణములను గీర్తనము చేయవలయును. అంతియగాక జగత్తునందు శక్తికొలఁదితిరిగి తనవాణితో పరమాత్ముని కీర్తిని వ్యాపింపఁజేయువలయును. ౨ అనేకగ్రంథరాజములను బఠింపవలయును. గ్రంథములలోని యవసరవిషయములను గంఠస్థము చేయవలయును. భగవంతునిలీలలఁ దెలుపు కథలు నిరంతరమును నుడువుచుండవలయును. ౩ తనసుఖస్వార్థముకొఱకు హరికథలను భక్తులకుఁ జెప్పుచుండవలయును. హరికథలులేకుండ నొకనిముసమేని వృథాగా గడుపఁ గూడదు. ౪ నిత్యము నూతనోత్సాహముతో హరికథల నభివృద్ధిపరచుటలో మిగులఁ గృషి చేయవలయును. హరికీర్తనతో సంపూర్ణబ్రహ్మాండమును నింపివేయవలయును. ౫ అత్యంతప్రేమరుచితో సర్వకాల సర్వావస్థలయందును మానవుఁడు తత్పరుఁడై యుండవలయును. ౬ భగవంతునకుఁ గీర్తనమన్న నింతయనరానిప్రీతి. కీర్తనమువలన హృదయమునకు సమాధానము గలుగును. కలియుగములోని మనుష్యులలో ననేకులను హరికీర్తనమే తరింపఁ జేయుచున్నది. ౭ వివిధప్రకారములతో నుండు

నదియు విచిత్రకరమైనదియు నగు ధ్యానమును, అలంకారముల యొక్కయు, భూషణములయొక్కయు వర్ణనమును భక్తుఁడు నిరంతర మొనరింపవలయును. అంతఃకరణమునందు ధ్యానమూర్తిని దెచ్చుకొని ప్రతిష్ఠించి హరికథలను జెప్పవలయును. ౮ ప్రేమతోఁ బరమాత్ముని యశమునుఁ గీర్తిని, ప్రతాపమును, మహిమను వర్ణింపవలయును. దీనివలన భగవద్భక్తుల యాత్మలు సంతుష్టినొందును. ౯ కథను అన్వయమును, వ్యాఖ్యానమును, జెప్పుచుఁ గరతాళమును మనోహరముగా ప్రయోగించుచు హరికథకుఁడు పరమాత్ముని నామఘోషణమును, బ్రసంగమువచ్చినపు డనేకకల్పితవిషయములను, జరిగినసంగతులనుగూడఁ జక్కనిరీతిగా వివరించి చెప్పవలయును. ౧౦ తాళము, మృదంగము, హరికీర్తనము, సంగీతము, నృత్యము, తానమానము, నానావిధకథానుసంధానము, తెగిపోనీయక యన్నియు హరికథకుఁడు సమానముగా జరుపుచుండవలెను. ౧౧ హరికథఁ జెప్పువాఁడు కరుణారసాత్మికములగు కీర్తనములలోని యానందమున మగ్నుఁడై మహోత్సాహముతోఁ గథనునడుపవలయును. మరియు శ్రోతల శ్రవణపుటముల నానందముతో నింపివేయవలయును. ౧౨ కంపితము, రోమాంచము, స్ఫురణము, ప్రేమాశ్రుపాతము గలవాఁడై పరమేశ్వరుని గుణానువాదమును భక్తుఁడు గానము చేయవలయును. దేవస్థానమునందు భగవానునకు సాష్టాంగనమస్కారము లొనర్పవలయును. భక్తిభావములోఁ బూర్తిగా లీనుఁడై మైమఱచి పొరలాడవలయును. ౧౩ పదము, శ్లోకము, ప్రబంధము, ఘాటీ ముద్ర, దోహా (పద్యభేదము) మున్నగు ననేకచ్ఛందములను వీర భాషణములను వినోదములను అవసరమువెంట భక్తబృందము మధ్య గానము చేయవలయును. ౧౪ నానావిధములును నవరస భూషితములును, శృంగారరసమయములు, సంతోషకరములు నగు గద్యపద్యములను అనేకవిధములగు ప్రాస్తావికవచనములను హరికథకుఁడు శాస్త్రాధారముతోఁ జెప్పవలెను. ౧౫ భక్తిజ్ఞానవైరాగ్యములలక్షణములను నీతి, న్యాయ, స్వధర్మముల రక్షణోపాయములను సాధనమార్గములను, ఆధ్యాత్మిక నిరూపణము

లను జక్కనిరీతిని భక్తులకడ వివరింపవలయును. ౧౬ సందర్భము ననుసరించి హరికథల నుడువవలయును. సగుణోపాసకులగు జనుల కడ సగుణపరమాత్మునికీర్తిని వర్ణింపవలయును. మఱియు నిర్గుణముతో నవసరముకలిగినపుడు అధ్యాత్మికవిద్యమీద వ్యాఖ్యానము గావింపవలయును. ౧౭ పూర్వపక్షమును విడిచి నియమముతో సిద్ధాంతనిరూపణము చేయవలయును తాను సిద్ధాంతపఱచి చెప్పదానిని ప్రజలయెదుట శాస్త్రనిరూపిత నియమ క్రమానుసారముగా నుంచవలయును. ౧౮ వేదములను పారాయణము చేయవలయును. ప్రజలకుఁ బురాణములు వినిపింపవలయును. అంతియగాక మాయాస్వరూపము బ్రహ్మస్వరూపముగూడ నిరూపింపవలయును. ౧౯ బ్రాహ్మణత్వము నాదరభావముతో రక్షింపవలయును. ఉపాసనమును, భక్తిసాధనమును, గురుపరంపరను స్థిరముగానుంచవలయును. ౨౦ హరికీర్తనమునందు వైరాగ్యలక్షణము చేయవలయును, జ్ఞానలక్షణములను గూడ విడిపోవనీయఁగూడదు. పరమచతురుఁడును, విలక్షణుఁడు నగు పురుషుఁ డన్నింటిని సవరించుకొనఁగలఁడు. ౨౧ వినువారల హృదయములలోని సత్యసమాధానము (విశదజ్ఞానము) చెదరిపోవునట్లును, సందేహము కలుగఁజేయునట్లును నుండువిషయములను గీర్తనములలో నుడువరాదు. కీర్తనమునందు, నీతి, న్యాయము, సాధనములరక్షణముగూడఁ జేయవలెను, ౨౨ సగుణపరమాత్ముని గుణానువాదము గావించుటను గీర్తనమని యుగ్గడింతురు. అద్వైతవివరణమును నాధ్యాత్మిక నిరూపణమని చెప్పుదురు. ఎప్పుడేని నిర్గుణనిరూపణము గావింపవలసి వచ్చినచోఁ బరమాత్ముని సగుణత్వమునుగూడ రక్షగావింపవలయును. ఆధ్యాత్మనిరూపణము చేయునపుడు సగుణమును బంధింపఁగూడదని తెలిసికొన వలయును. ౨౩ వక్తృత్వమునకుఁ దగినంత విద్యాబల ముండవలయును. అల్పజ్ఞుఁడగు పురుషుఁడు మహావిషయములను గూర్చి సత్యమగు వ్యాఖ్యానము గావింపనేరఁడు. అందువలన వక్త ముఖ్యముగా విద్యాధికారియు అనుభవశాలియు నైయుండవలెను. ౨౪ దేనినైన మాటిమాటికి ఖండనము గావింపక

వేదములలోని యాజ్ఞలను మండనము గావించుచు మనుజులఁదఱును సదాచారములయందుఁ బ్రవృత్తులగురీతిగా హరికథకుఁడు జ్ఞానమును బోధింపవలయును.

భక్తియోగమును గోరు మానవుడు వాదవివాదముల నన్నింటిని విడిచి పరమాత్ముని సగుణమూర్తిని గీర్తనము చేయువలయును. దీనినే భగవద్భజన మందురు. ఇదియే రెండవభక్తి ౨౬ భగవంతుని గుణములు గీర్తించుటవలన మహత్తరములైన పాపములునశించును, ఉత్తమగతి లభించును. కీర్తనభక్తివలన నవశ్యముగ భగవంతుని సన్నిధికిఁ జేర నవకాశము గలుగును. ఇందు సందియము కొంచమేని లేదు. ౨౭ కీర్తనమువలన వాణి పవిత్రమగును సత్పాత్రము గలుగును. జనులందరును సుశీలురును సదాచరణులును నయ్యెదరు. ౨౮ కీర్తనమునవలన మనశ్చాంచల్యము తొలగిపోవును. స్థిరమగు బుద్ధివిశేషము కలుగును. వినువాతనికిని జెప్పువానికిగూడ సందియము నివర్తియగును ౨౯ బ్రహ్మపుత్రుఁడగు నారదుఁడు సర్వకాల సర్వావస్థలయందును హరికీర్తన మొనరించుచున్నాఁడు. అందుచేతనే యాతనికి స్వయముగానారాయణుని పదవి లభించెను ౩౦ కావున కీర్తనమహిమ మపారమయినది. అగాధమయినది కీర్తనమువలన. బరమాత్ముఁడు ప్రసన్నుఁడగును. పరమాత్ముని గుణానువాదముగల కీర్తనలు జరుగు ప్రదేశమునందు సమస్తపుణ్యతీర్థములును, స్వయముగా జగదాత్మయు నివసించును. ౩౧

మూఁడవ సమాసము

స్మరణభక్తి.

గత సమాసమందు మానవులందఱిని పావనము చేయునది యగు కీర్తనభక్తిని వర్ణించితిని. ఇప్పుడు విష్ణుస్మరణమను పేరుగల మూఁడవభక్తియెట్టులుండునో తెలుపుచున్నాను వినుండు. ౧ హృద

యమునందు బరమాత్ముని దివ్యనామమును స్మరింపచేయవలెను. అతని యనంతనామముల నఖండరీతి జపముచేయవలెను. నామస్మరణమువలన మనస్సునకు సమాధానము లభించును. ౨ నిత్యమును నియమముదప్పక ప్రాతఃకాలమునందును, మధ్యాహ్నమునందును, సాయంసమయమునను నిరంతరముగా భగవన్నామస్మరణము జేయుచుండవలయును. ౩ సుఖసమయమునందును, దుఃఖసమయమునను, ఉద్వేగ సమయమునను జింతాసమయమునను, ఆనందానుభవ సమయమునను, ఇంతయేల! సర్వకాల సర్వావస్థలయందును భగవన్నామస్మరణము గావింపక యూరకుండరాదు. ౪ హర్ష సమయమునను దుఃఖసమయమునను సర్వాదికోత్సవములను నాలించునపుడును ఏదేని శుభకార్య ప్రస్తావనము జేయు తరుణమునను విశ్రాంతియందునను నిద్రాసమయమునను భగవన్నామస్మరణము గావించుచుండవలయును. ౫ ఏవేని దొసంగులు పొసఁగి సంకటములు గలిగినప్పుడును సంసార సంబంధములగు నిర్బంధము వాటిల్లినపుడును నేదేనిదుర్దశ సమకూరినప్పుడును భగవన్నామము సాదరభావముతో స్మరింపవలయును ౬ నడుచుచు, మాటలాడుచు, దినుచుఁ ద్రావుచు, సుఖించుచు, బహువిధములగు నుపభోగములను దనివిదీఱ ననుభవించుచు నుండునపుడుగూడ నేమఱిపాటు లేక భగవంతుని దివ్యనామమును స్మరించుచుండవలెను. ౭ సంపదలతోఁ దులతూఁగుసమయమునను ఆపదలలో మునిఁగి తేలుచున్నపుడును కాలగతులు వ్యతిరేకించి చిక్కులు వాటిల్లినను భగన్నామస్మరణము మానరాదు ౮ వైభవము, సామర్థ్యము, బలము, బహువిధపదార్థములు గలవనహంభావముతోఁగాని వివిధసుఖముల ననుభవించుచుంటినను సంతోషమునఁగాని భగన్నామస్మరణమును విడువఁదగదు. ౯ భగవంతుని నామమును నిరంతరము హృదయమునందుఁ దలంచువారికాపదలు గలుగవు. చేయుచున్న పనులకు విఘ్నములు వాటిల్లవు. అంతమున సద్గతిగూడ లభించును. ౧౦ మొదట భోగభాగ్యములతో సౌఖ్యము లనుభవించుచుఁ దరువాత దరిద్రుఁడైనను మొదట దరిద్రుడుగనుండి యనంతరము మహా భాగ్యవంతుఁడైనను భగవం

తుని స్మరించుటలోఁ దృప్తినొందఁజనదు. ౧౧ భూతములు, పిశాచములు, నానాబాధలు, బ్రహ్మగ్రహము, బ్రహ్మరాక్షసి, మంత్రభ్రష్టతవలన యున్మాదావస్థ, నానావిధములగు నాధివ్యాధులు భగన్నామస్మరణ మూలమున నశించును. ౧౨ విషబాధయు రోగబాధయుఁగూడ భగవన్నామస్మరణమునఁ దొలఁగిపోవును. ఇంతియగాక యంత్యకాలమునఁగూడ స్మరించిన యెడల నుత్తమగతి లభించును. ౧౩ బాల్యావస్థయందును, తరుణావస్థయందును, వార్ధక్యావస్థయందును, కష్టకాలమునందును, సర్వకాలములయందును, అంత్యకాలమునందును, భగవంతుని స్మరించుచుండవలయును. ౧౪ నామస్మరణమహిమ యెంతజెప్పినను నీవు గ్రహించినటుల దోఁచదు. శివుఁడు బాగుగా నెఱుంగును. ఆతఁడు కాశీనగరములో నివసించి నిజభక్తులకు శ్రీరామనామము నుపదేశించుచుండుననుహంశము నీవు వినియేయుందువు. రామనామమహత్త్వముచేతనే కాశీనగరమునకు ముక్తిక్షేత్రమనునామము గలిగినది. ౧౫ రామనామమును దలక్రిందుఁజేసి తొల్లి వాల్మీకి "మరా, మరా" యని జపించి ముక్తినొందినాఁడు. అనంతర మాతఁడు నూరుకోటుల శ్లోకములతో శ్రీరామచంద్రమూర్తి దివ్యచరిత్రమును ఆయన యవతారమునకు ముందుగనే రచింపఁదగినంత జ్ఞానము మహత్త్వమును సంపాదించెను. ౧౬ పరమాత్ముఁడగు హరినామమును నిరంతరము జపించి ప్రహ్లాదుఁడు ముక్తినొందెను. తండ్రిబెట్టు కడగండ్లనుండి బ్రదికెను. పాపియగు నజామిళుఁడుసైతము నారాయణస్మరణమువలననే పవిత్రుఁడు మోక్షగామియు నయ్యెను. ౧౭ పెక్కులు తడవనేల? తొల్లి నామస్మరణముననే జడజీవియగు పాషాణముగూడఁ దరించెను. అసంఖ్యాకులగు భక్తులుద్ధరింపఁబడిరి. మహాపాపులుగూడఁ బరమపవిత్రులై మోక్షమొందిరి. ౧౮

పరమేశ్వరుని నామము లనంతములు. వానిని నిత్యమును నియమపూర్వకముగా హృదయమునందు స్మరించు భక్తులు తరించెదరు, నామస్మరణము గావించువారికి యమలోకబాధలు తప్పును. ౧౯ భగవంతుని యసంఖ్యాక నామములలో నేయొక్కనామము

నేని ధ్యానము గావించినయెడల జీవితము సఫలమగును. నామస్మరణమువలనఁ బాపములు నశించి సుకృతము ప్రాప్తించును. ౨౦ మనుజుఁ డితరకార్యము లేవియుఁ జేయవలసిన యవసరము లేదు. ఏకాంతముగా పరమపదవాసుఁడును జక్రపాణియునగు పరమేశ్వరుని నామమును స్మరించినయెడలఁ బ్రసన్నుఁడై కాపాడును. ౨౧ నిరంతరము భగవన్నామస్మరణము గావించువాఁడె పుణ్యాత్ముఁడు రామనామము స్మరించుచున్నయెడలఁ గొండలవంటి పాపములు సైతము కూలిపోవును. ౨౨ భగవన్నామ మహిమ యగాధమైనది దానిమహత్త్వము వర్ణనముసేయ నెవ్వరికిని దరముగాదు. భక్తులనేకులు నామస్మరణమువలన ముక్తులైరి. తొల్లి మహాదేవుఁడైన శంకరుఁడు హాలాహలముఁద్రావి వ్యాకులుఁడైనపుడు రామనామమును మనసార స్మరించుటకతననే యాకష్టము తొలంగెను. ౨౩ బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, స్త్రీలు, పురుషులు, వారు వీరని చెప్పనేల అందఱికిని నామస్మరణము గావించుట కధికారము గలదు. నామస్మరణముచే జడులు మూఢులు కూడఁ దరించెదరు. ౨౪ పరమేశ్వరుని పవిత్రనామమును మానవుండఖండరీతిగ నిరంతరము స్మరణచేయుచుండవలయును. భగవానుని దివ్యరూపమును హృదయమునందు ధ్యానింపవలయును. ఇదియే స్మరణభక్తి. దీని మహాత్త్వము నెంతని తెలుపగలను? ౨౫

నాలుగవ సమాసము.

పాదసేవనభక్తి

గత సమాసమునందు స్మరణభక్తిని గురించి చెప్పితిని. ఇపుడు నాలుగవదియగు పాదసేవనభక్తిని జెప్పుచున్నాఁడను. ౧ కాయికమునంతయు మోక్షముమీఁద నెలకొల్పి మనోవాక్కాయకర్మములతో సద్గురుని చరణములను అనన్యభావముతో సేవించుటకే

పాదసేవనభక్తి యనిపేరు. ౨ సద్గురుని మాహాత్మ్యము చాలగొప్పది. అనిర్వచనీయము. ఆతనిచరణకమలములను హృదయమునఁ దలంచుచున్నవారికి జనన మరణ యాతన లెన్నటికిని గలుగఁజాలవు. అనన్యభావముతో నట్టి గురుని సేవింపవలయును ౩ సంసారసాగరమునుండి దరిజేరదలంచితిమేని సద్గురుకృపదప్ప నితరాధారమేదియు లేదు. ఐహికతృష్ణయు సంసారనిర్బంధములు తొలఁగించుకొనఁదలంచిన మానవుడు సద్గురుని చరణములను ధ్యానించుటదప్ప గత్యంతరము లేదు. ౪ సద్గురుఁడెంత కేని జాలినవాఁడు. గురుమూర్తి సారమిది అసారమిది యని బాగుగఁ దెలియఁజెప్పి పరమాత్మని దర్శించు భాగ్యమును శిష్యునకు సమకూర్ప గలడు. ౫ బ్రహ్మము చూచెదనన్నఁ గనిపింపదు. మనస్సునందు భాసింపదు. సంగత్యాగము నొనరింపఁ జాలకున్నయెడల నది యనుభవములోనికి రాదు. అనుభవములోనికిఁ దే దలంచినయెడల సంగత్యాగముగాదు. సంగత్యాగమువలన ననుభవము రాదు. ఈవిషయములోని భావము అనుభవనీయులగువారికే తెలియునుగాని తదితరుల కెట్లు తెలియును? ఇదియొక యభేద్యమగుగాధ ౬ అనుభవములోనికిఁ దెచ్చుకొనఁ దలంచినయెడల సంగత్యాగము (అహంకారము, అభిమానము దేహబుద్ధి యనువానిని విడుచుట) జరుగదు. ఏలయన? యనుభవములోనికిఁ దెచ్చుకొన నెంచునంతనే అనుభవము, అనుభవముచేయువాఁడు, అనుభవయోగ్య విషయము, అనుమూఁడిటితో సంగమము తటస్థమగును. ఈ మూఁడింటిని విడిచివేయుదమన్న వానితో ననుభవశబ్దముసైతము జారిపోవును. ఏలయన, ఈ త్రిపుటియందే యిదియున్నది. ఇంతియగాదు ఎప్పుడహంకారమునుగూర్చిన భావమే లేదో అప్పుడనుభవమెట్లు కలుగును? మఱియు దానిని గైగొనువాఁడెవడు? ఇంతకు దేలినదేమన—ఈ విషయముల ననుభవనీయు లెరుంగుదురు ఇతరులకిది యభేద్యమగుగాథ. సంగత్యాగము ఆత్మ నివేదనము, విదేహస్థితి, అలిప్తత, సహజస్థితి, ఉన్మనము, విజ్ఞానము అను నీయేడును నేకరూపములు. ౭ ఇవిగాక యింకను గొన్ని పేరులు గలవు. వానిని, సమాధానమునకు సంకేతములని చెప్పవలయును, సాధు

వుల చరణసేవ గావించినయెడల నన్నియుఁ దెలినుయు. ౬ వేదము, వేదరహస్యము, వేదాంతము, సిద్ధత్వము, సిద్ధభావము, సిద్ధాంత రహస్యము, అనుభవము, అనుభవవిషయము, అనుభవఫలము, సత్యవస్తువు (బ్రహ్మము) మున్నగునవి యెన్నియోగలవు, ఇవి యనుభవమునకు ద్వారములు. ఈద్వారములన్నింటినిగూర్చి పూర్ణవిజ్ఞానము గడించినచో ననుభవమునకు వచ్చును. ఈజ్ఞానము మహాత్ములను సేవించుటచే లభించును. పాదసేవనభక్తి ననుష్టించువానికిఁ బరబ్రహ్మము ప్రకటనమగును. ౧౦-౧౧ బ్రహ్మముసంగతి బహుచిత్రమైనది. అది ప్రకటనమగుచుండియును గోప్యముగానున్నది. గోప్యముగానుండియు బ్రకటనమగుచున్నది. ఇంతియకాకయది (బ్రహ్మము) గోప్యమునకును బ్రకటనమునకును వేరుగానున్నది. దానిమార్గము గ్రహింపవలెనన్నను దాని నెరుంగవలెనన్నను మహాత్ముల పాదసేవనము గావింపవలయును. లేకున్నదానిమార్గము లభింపఁజాలదు. ౧౨ బ్రహ్మము నెరుంగుటకు మార్గమున్నది. కాని బ్రహ్మపదార్థ మాకాశమువలె శూన్యముగానున్నది. గుప్తముగఁగూడ నున్నది. అన్నివిధములచేతను నది సందేహాస్పదమైయున్నది. చూడఁదలచితిమేని యలక్ష్యపదార్థమగు నాబ్రహ్మము కనుపింపదు. ౧౩ లక్ష్యముతో దేనిని లక్షించుచున్నారమో ధ్యానముతో దేనిని ధ్యానించుచున్నారమో అదియే పరబ్రహ్మము. ఆపరబ్రహ్మము త్రివిధప్రతీతితో శాస్త్రము, గురువు, ఆత్మఅను నీ మూఁడింటి యనుభవము నొకటి గావించి తానై (స్వయమై) పోవలయును. ౧౪ ఈయనుభవద్వారములు సారాసార విచారమువలనఁగాని తెలియవు సత్యవిషయము. సత్సంగమువలనఁగూడ నివి యనుభవములోనికి వచ్చును. ౧౫ ఒకవేళ సత్యమును జూడఁబోయినచో అసత్యముయొక్క అభావము గానిపించును. అసత్యమునుజూడబోయినచో సత్యము కాన్పింపదు. ఏలయనిన సత్యాసత్యములను జూచుట చూచెడివానికడనున్నది. ౧౬ చూచెడివాఁడు తాను జూచుచున్న రూపమునందు విలీనుఁడైపోయినపుడు (ద్రష్ట, దర్శనము, దృష్టి యనుమూఁడును నేకమైనపుడు) సమాధానము ప్రాప్తించును. ఎట్టి సమాధానమును బడయ

గోరినను సద్గురునికరుణ ముఖ్యముగా గావలయును. సద్గురునికరుణ లేకున్నయెడల సన్మానమెన్నటికిని లభింపబోదు. ౧౭ నానావిధములగు (ప్రయోగముగా సాధనలు, పరిశ్రమలు ప్రయత్నములు, విద్యాభ్యాసము లేనియెడల నెంతభ్యాసమునొనరించినను గురుగమ్యము, (బ్రహ్మము నెరుంగుమార్గము) దొరుకఁజాలదు. ౧౯ అభ్యాసమువలనఁ బడయరానిదియు సాధనములవలన సాధ్యముగానిదియు నగు బ్రహ్మస్వరూపవివేకము సద్గురుసేవలేకున్న నెన్నటికిని దెలియదు. ౨౦ జ్ఞానమార్గమును దెలిసికొనుటకు ముఖ్యముగా సత్సాంగత్యము చేయవలయును. అది లేదేని జ్ఞానమార్గముపేరే యెత్తబనిలేదు. ౨౧ సద్గురుని చరణములను సేవించిన పరమార్థమును గణింపయత్నించుటయే పాదసేవనము. ఇది నవవిధభక్తులలో నాల్గవదియైయున్నది. ౨౨ సామాన్యదృష్టితో వేల్పులను నేలవేల్పులను మహానుభావులను సత్పాత్రులనుగా భావించి వారలసేవ యొనరించుటలో సద్భావము గలియుండుటగూడ సేవాభక్తియే యగును. కాని బాగుగా విచారించినచో సద్గురుచరణసేవ గావించుటకే పాదసేవనభక్తియను పేరెంతయుఁ దగియున్నది. ౨౩-౨౪ పాదసేవనమను పేరుగల యీనాలుగవభక్తి మూఁడులోకములను బావనముచేయుచున్నది. సాధకునకు సాయుజ్యముక్తి పాదసేవనభక్తివలననే లభించును, ౨౫ కావునఁ బాదసేవనభక్తికిఁ గలమహాత్మ్యము దెలుప శక్యముగాదు. దానివలననే యీ భూలోకమున ననేకమనుష్యులు తరించి పుణ్యలోకములు బడయుచున్నారు. ౨౯

అయిదవ సమాసము

అర్చనభక్తి

శ్రోతలారా? మీర లుత్సాహముతోఁ బాదసేవనభక్తితత్వమువింటిరి. ఇపుడైదవదియగు అర్చనభక్తినిగూర్చి తెలుపుదును.

సావధానముతో వినుండు ౧ ఐదవభక్తిపేరు అర్చనము. అర్చన పదము సాధారణముగా మనము దేవతార్చనముపట్ల నుడివెదము ౨ బహువిధములగు ఆసనములు, మనోహరములగు వస్త్రములు, అలంకారములు, భూషణములు మున్నగువానిని సమకూర్చి మానసపూజ గావించుటకును మూర్తిధ్యానము గావించుటకును అర్చన భక్తియని పేరు. ౩ దేవబ్రాహ్మణులను, అగ్నిహోత్రమును, సాధుసజ్జనులను, అతిథి అభ్యాగతులను, యతీశ్వరులను, మహానుభావులను, గాయత్రిని బూజించుటకును ౪ ధాతువులతోడంగాని పాషాణములతోడంగాని, మృత్తికతోడంగాని చేసిన విగ్రహములను, చిత్తరువులలోఁజిత్రించిన మూర్తులను, సత్పురుషులను, తనయింటిలోని దేవతలను, సేవించుటకును ౫ సప్తాంకితములు, నవాంకితములునగు శిలలు సాలగ్రామములు, శకలములు, చక్రాంకితలింగములు, సూర్యకాంత సోమకాంతములు బాణతాండలములు, నర్మదేశ్వరములు, మున్నగుమూర్తుల నారాధించుటకును ౬ భైరవ, భగవతి, ఖండేరావు, ముంజా, నృసింహస్వామి, నవశంకరి, నాగ, శిక్కే, మున్నగు బహువిధ దేవతామూర్తులను బంచాయతనమును గొలుచుటకును అర్చనభక్తియని పేరు. ౭ గణేశుఁడు, శారద, విఠలదేవుఁడు, బాలకృష్ణుఁడు, జగన్నాథుఁడు, తాండవమూర్తి, శ్రీరంగనాయకులు, హనుమంతుఁడు, గరుత్మంతుఁడు ౮ మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, భార్గవ, రామకృష్ణ, హయగ్రీవాదులు ౯ కేశవ, నారాయణ, మాధవ, గోవింద, విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభమూర్తులు, ౧౦ దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్నానిరుద్ధ, పురుషోత్తమాధోక్షజ, నారసింహాచ్యుత, జనార్దనోపేంద్రమూర్తులు, ౧౧ హరిహరులయనంతస్వరూపములు, భగవంతుఁడు, జగదాత్ముఁడు, జగదీశ్వరుఁడునగు పరమాత్ముని యవతారములు శివునియొక్కయు, శక్తియొక్కయు ననంతరూపములు భక్తుఁడు నిరంతరము దేవతార్చనలోఁ బూజింపవలయును ౧౨ అశ్వత్థనారాయణ, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, త్రిమల్లనారాయణ, శ్రీహరినారాయణ,

ఆదినారాయణ, శేషశాయిమున్నగు పరమాత్మని[illegible]ములఁ బూజింపవలెను. ౧౩

భగవంతుని యనంతమూర్తులీలోకమునం దంతటను నిండియున్నవి. అన్నింట సమానభావముతో నర్చింపవలయును. ౧౪ ఇంతియగాక కులధర్మానుసారముగా భక్తుఁడు ఉత్తమమధ్యమరీతులతో అనేక దేవీదేవతల పూజనము గూడ నొనరింపవలయును. దేనినిగూడ విడచివేయరాదు. ౧౫ ౧౬ భక్తుఁడనేకతీర్థయాత్రలకుఁ బోవలయును. అచటి దేవతలను శ్రద్ధాభక్తులతోఁ బూజింపవలయును. నానావిధములగు పూజోపకరణములతో నర్చన మొనర్పవలెను. ౧౭ పంచామృతము, చందనము, అక్షతలు, పుష్పములు, ధూపములు, దీపము, కర్పూరము, మున్నగు వస్తువుల యథోచితముగాఁ బూజ కుపయోగించి ౧౮ నానావిధములగు భోజనపదార్థములతో నివేదనముగావించి ఫలములు, తాంబూలము, దక్షిణ, బహువిధాలంకారములు, దివ్యవస్త్రములు, వనమాలాది సామగ్రులు, భగవంతునకు సమర్పింపవలయును. ౧౯ పాలకి, ఛత్రము సుఖాసనము, మేఘాడంబరము, సూర్యముఖి, పతాకము, ధ్వజచిహ్నము, మున్నగు నుపచారపరికరములతోడను, వీణ, కరతాళము, ఝాంఝు, మృదంగము, మున్నగు మనోహర వాద్యములతోడను భక్తిభావపూరితులగు సాధుజనుల భజనములతోడను మిగులఁ గోలాహలముగా భగవంతున కుత్సవములు గావింపవలయును. అంతియగాక హరిదాసులచే హరినామ సంకీర్తనము గూడఁ జేయింపవలయును. అందుచే భగవంతునిపట్ల మానవులకు సద్భావము వృద్ధినొందును. ౨౦-౨౧ దేవాలయముల చెంత కోనేరు, బావి, సరోవరము, రాజాంగణము, తులసీవనము, మండపములు నెలకొల్పి గర్భాగారముపై నొకశిఖరము గట్టింపవలయును, వసతిగృహములు, యోగులకుఁదగిన మఠములు, ధర్మశాలలు, సత్తరువులు దేవాలయమునఁ బ్రతిష్ఠింపవలెను. ఇరువదియేడుముత్తెములతో జపమున కుపకరించు మాలికయు వివిధములగు వస్త్రములు దేవునికొఱకు సమకూర్పవలెను. ౨౨-౨౩ బహువిధములగు తెరలు, మండపములు, ఆస్తరణములు, నానావిధరత్నభూషణములు,

౨ భగవంతునికి మిగుల వైభవములు సమకూర్చుచు నెట్టిన్యూనత నురానీయకుండుటయు భగవద్భజనమును జనసమూహము నందుఁ బెంపొందించుటయు దాస్యభక్తియందురు. ౩ దాస్యభక్తి మగ్నుఁడగు సాధకుఁ డితరచింతలుమాని పడిపోయిన దేవళములను బాగుచేయింపవలెను తెగిపోయిన సరోవరములను మరల గట్టింపవలెను. ధర్మశాలలను నివాసస్థానములను నిర్వహింపవలెను. నిత్యమును బరమాత్ముని లీలలఁ దెలుపు నూతన కావ్యములు పఠించుచునుండవలెను. ౪ ఇంతియగాక నానావిధములగు జీర్ణజర్జరములగు మండపాదులు పునరుద్ధరింపవలెను. వేయేల యేపనివచ్చి పడినను శీఘ్రముగా నెరవేర్చుచు నుండవలయును. ౫ ఆలయములోనికిఁ గావలసిన గుఱ్ఱము, ఏనుఁగు, సింహాసనము, పాలకి, చౌకి, సుఖాసనము, మంచనము, మేనా, విమానము, మున్నగు వాహనములను నూతనముగ నిర్మింపవలయును. ౬ మేఘాడంబరము, ఛత్రము, చామరము, సూర్యముఖి, చిహ్నము మున్నగు నుపకరణములను దేవాలయమునకు నిత్యము నవీనముగా నిర్మింపవలయును. ౭ నానావిధయానములు సమకూర్పవలెను నుత్తమస్థానములగు సువర్ణాసనములు మిగులమనోహరముగఁ జేయింపవలయును. ౮ భవనములను, కొట్లను, పెట్టెలను, చందూకలను వాహనములను, పాత్రలను, సకలద్రవ్యములను మిగులయత్నముతో నితరులకుఁజిక్కనీయకుండఁ గాపాడవలయును. ౯ గుహాలు అంతర్గృహములు, అరుగులు, బిలములు, మున్నగు ప్రదేశములు గుప్తద్వారములు అమూల్యవస్తుభాండారములు, దేవాలయమున విశేషప్రయత్నముతో దృఢతరముగాఁ గట్టించుచుండవలయును ౧౦ అలంకారములు, భూషణములు, దివ్యవస్త్రములు, మనోహరరత్నములు, సువర్ణము మున్నగు నానావిధ ధాతుపాత్రములు ప్రయత్నపూర్వకముగ దేవాలయముకొఱకు సేకరింపవలయును. ౧౧ పుష్పవాటికలు, నానావిధ వృక్షములు గలతోఁటలు, వేయించి వానికి నిరంతరము నీరుగట్టి పోషించుచుండవలయును. ౧౨ పశుశాలలు, పక్షిశాలలు, చిత్రశాలలు, నాట్యశాలలు, దేవళమున దృఢతరముగాఁ గట్టింపవలెను. అంతియగాక బహువిధవాద్యములు గుణవంతులగు గాయకులు భగవద్భజనమునకై ప్రత్యేక ప్రయత్నమున సిద్ధమొనర్పవలెను. ౧౩ పాకశాలలు, భోజనశాలలు, ధర్మశాలలు, నిదురింపవచ్చెడి బాటసారులకొఱకు శయ్యాగృహములు, సామగ్రులుంచు గృహములు ౧౪ నానావిధ పరిమళ ద్రవ్యములను నిలువజేయు కొట్లు, భిన్నభిన్నఖాద్య ఫలస్థానములు, రసముల కుచితములగు ప్రత్యేకస్థలములు సాధకుఁడు శ్రద్ధతో నాలయమున నేర్పఱుపవలెను. ౧౫ ఆలయములో నేయేభాగము లేని జీర్ణములైన యెడల వానిని వెంటనే గమనించి నూతనముగా నిర్మింపవలెను. భగవంతుని వైభవ మనిర్వచనీయమైనది. ఎంతదనుక వివరింపఁగలము? ౧౬ భగవత్సేవాసంబంధములగు సమస్తకార్యములను నిర్వహింప సంసిద్ధముగా నుండవలయును. భగవంతుని సేవయందు సాధకుఁడు తత్పరభావముతో మెలంగుచు నేపనినేని మఱచిపోఁగూడదు. ౧౭ జయంతులు, పర్వములు మొదలగు మహోత్సవములను సాధకుఁడు స్వర్గమునందలి దేవతలుచూచి ముగ్ధులుకాఁగలయంతటి మహావైభవముతో జరుపుచుండవలయును. ౧౮ భగవంతునకు నీచాతినీచమగు సేవనుగూడఁ జేయుటకు సర్వసిద్ధముగా నుండవలయును. మఱియు సమయమేతెంచినపుడు సమస్తోపచారములు గావించుటకు సావధానముగా నుండవలయును. ౧౯ భగవంతుని కేదేదియావశ్యకమో ఆలయమున నేయేవస్తువులకుఁ గొఱంతగలదో వానిని తత్క్షణమె యొసంగుచు సర్వసేవలు ప్రేమపూర్వకముగాఁ గావింపవలెను. ౨౦ పాదప్రక్షాళనము, స్నానము, ఆచమనము మొదలగువానికి జలము, చందనాక్షతలు, మనోహరవస్త్రములు, భూషణవిశేషములు, ఆసనములు, నానావిధ పరిమళ పుష్పములు ధూపదీపనైవేద్యములు మున్నగువానిని పూజాదుల కుచితకాలమున సిద్ధముగానుంచవలెను. ౨౧ శయనమునకు నుత్తమస్థానము, త్రాగుటకుఁ బరిశుద్ధమును శీతలమునగు జలమును రుచికరమగు తాంబూలమును సమర్పింపవలెను. శ్రుతిని రాగములతో మేళవించి భక్తియుక్తములగురసవత్పదములను మనోహరగముఁ బాడుచుండవలయును. ౨౨ పరిమళద్రవ్యములు. పుష్పములు, నానావిధ సుగంధమయములగు తైలములు, బహువిధములగు ఫల

తోరణములు, గంటలు, ఏనుఁగులు, గుఱ్ఱములు, బండ్లు ౨౫ అలంకారములు, అలంకారపాత్రములు, ద్రవ్యము, ద్రవ్యపాత్రములు, అన్నోదకములు, అన్నోదకపాత్రములు, ౨౬ వనములు, ఉపవనములు, పుష్పవాటికలు, తపస్వులపర్ణకుటీరములు సమకూర్పవలయును. ఇవియన్నియు భగవంతుని బూజించుటకే యుపకరించును. ౨౭ చిలుకలు, గోరువంకలు, నెమిళ్ళు, హంసలు, చక్రవాకములు, కోకిలలు, చకోరములు, సివంగులు, లేడులు, మప్పాలు మున్నగువానిని భక్తులగువారలు దేవాలయముల కర్పింపవలయును. ౨౮ కస్తూరిమృగము, పునుఁగుపిల్లి, ఆవు, గేదె, ఎద్దు, క్రోతి మున్నగు జంతువులను బాలుగను దేవాలయము కొఱకర్పింపవలెను. ౨౯

ఈవిధముగ వివిధవస్తువుల జంతువుల సమకూర్చి భగవంతున కర్పింపవలయును. మఱియు తను, మనో, వచన, చిత్త, జీవ, ప్రాణములతోడను సద్భావముతోడను భగవంతుని నర్పింపవలెను. దీనికే అర్చనభక్తియని పేరు ౩౦ ఇటులె సద్గురునిగూడఁ బూజించి యాతనియెడ ననన్యభావముతో నుండవలయును. ౩౦ పైన జెప్పఁబడినవిధముగా భగవంతుని సాంగోపాంగముగాఁ బూజింప నవకాశము కలుగకున్నయెడల మానసపూజనైనఁ దప్పక గావింపవలెను. మానసపూజయొక్క మహత్త్వము చాల ప్రశస్తమైనది. ౩౧ భగవద్భక్తుఁడు తనహృదయమునందే తనరూపమును భగవంతునిరూపమును సమర్పింపఁదగిన పూజాసామగ్రిని కల్పితము గావించుకొని పరమాత్మున కర్పింపవలయును. ఇదియే మానసపూజావిధము. ౩౨ మానసపూజయందు దేయేపదార్థములు తనకావశ్యకములో వానిని గల్పనము జేసికొని పరమేశ్వరునకు సమర్పింపవలెను. ౩౩

ఆఱవసమాసము

వందనభక్తి.

శ్రోతలారా! అర్చనభక్తియన నేదియో మీరు బాగుగ గ్రహించితిరి. ఇప్పుడు మీకుఁ దెలుపఁదగినది వందనభక్తి. ఇది నవ

విధభక్తులలో నాఱవది. దానిని వినఁగోరెదను ౧ ఈశ్వరునకు సాధువులకు సజ్జనులకు నమస్కారము గావించుటకే వందనభక్తియని పేరు ౨ సూర్యభగవానునకును పరమేశ్వరునకును సద్గురునకును సాష్టాంగముగా నమస్కరింపవలెను. ౩ శాస్త్రములలో ముఖ్యముగా బహువిధములుగనున్న దేవతావిగ్రహములకును ఈశ్వరునకును గురువునకును సాష్టాంగప్రణామము లాచరింపవలయునని చెప్పఁబడును. ఇతరులకు వారివారి యోగ్యతల ననుసరించి నమస్కరింపవలెను. ౪ ఈ పృథివి వైశాల్యము ఏబదియారుకోట్లయోజనములు. ఇందు శ్రీమహావిష్ణుని మూర్తు లనంతములుగానున్నవి. వానికన్నింటికిని ప్రీతిపూర్వకముగా సాష్టాంగప్రణామము లొనరింపవలెను. ౫ మహాదేవుని విష్ణుమూర్తిని సూర్యుని హనుమంతుని దర్శించినంత మానవుని సమస్తపాపములు నశించును. ఈ దేవతలకు నిత్యమును నియమముతప్పక నమస్కరించుచున్నయెడల విశేషముగాఁ బుణ్యముకలుగును. ౬

* శ్లో. శంకర శ్శేషశాయీచ మార్తండో మారుతి స్తథా
ఏతేషాం దర్శనం పుణ్యం నిత్యనేమేవిశేషతః

భక్తుని, జ్ఞానిని, రాగహీనుని, మహానుభావుని, తాపసుని, యోగిని సత్పాత్రుని ౭ వేదవిదుని, శాస్త్రజ్ఞుని, సర్వజ్ఞుని, పండితుని, పౌరాణికుని, విద్వజ్జనుని, యాజ్ఞికుని, వైదికుని, పవిత్రాత్ముని గాంచినంతన నమస్కరింపవలెను ౮ విశేషగుణ మేమానవునియందుఁ గాన్పించినను నాతనియందు సద్గురుని యధిష్ఠానమున్నదని తలంచి యత్యాదరముతో నాతనికి నమస్కారము లొనర్పవలెను. ౯ గణేశ్వరుఁడు, సరస్వతి, శక్తి, విష్ణువు, శివుఁడు అను దైవతముల మూర్తులకు లెక్కయే లేదు. వానివివరముల నెంతవఱకు నివివరింపవలెను. అన్నిమూర్తులకును భక్తుఁడగువాఁడు ప్రేమపూర్వకముగా నమస్కరింపవలయును. ౧౦ అన్ని దేవతల కర్పించు నమస్కారములును బరమాత్మునకగు భగవంతునకే చేరుచున్నవి. ఇది

---

* శివుఁడు, విష్ణువు, సూర్యుఁడు, ఆంజనేయుఁడు అనువారిదర్శనము పుణ్యప్రదము. నిత్యము సేవించిన మిగులఁ బుణ్యముకలుగును.

౨ భగవంతునికి మిగుల వైభవములు సమకూర్చుచు నెట్టి న్యూనతను రానీయకుండుటయు భగవద్భజనమును జనసమూహము నందుఁ బెంపొందించుటయు దాస్యభక్తి యందురు. ౩ దాస్యభక్తి మగ్నుఁడగు సాధకుఁ డితర చింతలు మాని పడిపోయిన దేవళములను బాగుచేయింపవలెను తెగిపోయిన సరోవరములను మరల గట్టింపవలెను. ధర్మశాలలను నివాసస్థానములను నిర్వహింపవలెను. నిత్యమును బరమాత్ముని లీలలఁ దెలుపు నూతన కావ్యములు పఠించుచుండవలెను. ౪ ఇంతియగాక నానావిధములగు జీర్ణజర్జరములగు మండపాదులు పునరుద్ధరింపవలెను. వేయేల యేపని వచ్చి పడినను శీఘ్రముగా నెరవేర్చుచు నుండవలయును. ౫ ఆలయములోనికిఁ గావలసిన గుఱ్ఱము, ఏనుఁగు, సింహాసనము, పాలకి, చౌకి, సుఖాసనము, మంచనము, మేనా, విమానము, మున్నగు వాహనములను నూతనముగ నిర్మింపవలయును. ౬ మేఘాడంబరము, ఛత్రము, చామరము, సూర్యముఖి, చిహ్నము మున్నగు నుపకరణములను దేవాలయమునకు నిత్యము నవీనముగా నిర్మింపవలయును. ౭ నానావిధయానములు సమకూర్చుటకు నుత్తమస్థానములగు సువర్ణాసనములు మిగుల మనోహరముగఁ జేయింపవలయును. ౮ భవనములను, కొట్లను, పెట్టెలను, చందూకలను వాహనములను, పాత్రలను, సకలద్రవ్యములను మిగుల యత్నముతో నితరులకుఁ జిక్కనీయకుండఁ గాపాడవలయును. ౯ గుహాలు అంతర్గృహములు, అరుగులు, బిలములు, మున్నగు ప్రదేశములు గుప్తద్వారములు అమూల్యవస్తుభాండారములు, దేవాలయమున విశేషప్రయత్నముతో దృఢతరముగాఁ గట్టించుచుండవలయును ౧౦ అలంకారములు, భూషణములు, దివ్యవస్త్రములు, మనోహరరత్నములు, సువర్ణము మున్నగు నానావిధ ధాతుపాత్రములు ప్రయత్నపూర్వకముగ దేవాలయమునకొఱకు సేకరింపవలయును. ౧౧ పుష్పవాటికలు, నానావిధ వృక్షములు గల తోఁటలు, వేయించి వానికి నిరంతరము నీరు గట్టి పోషించుచుండవలయును. ౧౨ పశుశాలలు, పక్షిశాలలు, చిత్రశాలలు, నాట్యశాలలు, దేవళమున దృఢతరముగాఁ గట్టింపవలెను. అంతియగాక బహువిధవాద్యములు గుణవంతులగు గాయకులు భగ

వద్భజనమునకై ప్రత్యేకప్రయత్నమున సిద్ధమొనర్పవలెను. ౧౩ పాకశాలలు, భోజనశాలలు, ధర్మశాలలు, నిదురింపవచ్చెడి బాటసారుల కొఱకు శయ్యాగృహములు, సామగ్రులుంచు గృహములు ౧౪ నానావిధ పరిమళద్రవ్యములను నిలువజేయు కొట్లు, భిన్నభిన్న ఖాద్య ఫలస్థానములు, రసముల కుచితములగు ప్రత్యేకస్థలములు సాధకుఁడు శ్రద్ధతో నాలయమున నేర్పఱుపవలెను. ౧౫ ఆలయములో నేయే భాగములేని జీర్ణములైన యెడల వానిని వెంటనే గమనించి నూతనముగా నిర్మింపవలెను. భగవంతుని వైభవ మనిర్వచనీయమైనది. ఎంతదనుక వివరింపఁగలము? ౧౬ భగవత్సేవాసంబంధములగు సమస్తకార్యములను నిర్వహింప సంసిద్ధముగా నుండవలయును. భగవంతుని సేవయందు సాధకుఁడు తత్పరభావముతో మెలంగుచు నేపని నేని మఱచిపోఁగూడదు. ౧౭ జయంతులు, పర్వములు మొదలగు మహోత్సవములను సాధకుఁడు స్వర్గమునందలి దేవతలు చూచి ముగ్ధులుకాఁగలయంతటి మహావైభవముతో జరుపుచుండవలయును. ౧౮ భగవంతునకు నీచాతినీచమగు సేవనుగూడఁ జేయుటకు సర్వసిద్ధముగా నుండవలయును. మఱియు సమయమేతెంచినపుడు సమస్తోపచారములు గావించుటకు సావధానముగా నుండవలయును. ౧౯ భగవంతునికేదేదియావశ్యకమో ఆలయమున నేయే వస్తువులకుఁ గొఱంతగలదో వానిని తత్క్షణమె యొసంగుచు సర్వసేవలు ప్రేమపూర్వకముగాఁ గావింపవలెను. ౨౦ పాదప్రక్షాళనము, స్నానము, ఆచమనము మొదలగువానికి జలము, చందనాక్షతలు, మనోహరవస్త్రములు, భూషణవిశేషములు, ఆసనములు, నానావిధ పరిమళ పుష్పములు ధూపదీపనైవేద్యములు మున్నగువానిని పూజాదుల కుచితకాలమున సిద్ధముగానుంచవలెను. ౨౧ శయనమునకు నుత్తమస్థానము, త్రాఁగుటకుఁ బరిశుద్ధమును శీతలమునగు జలమును రుచికరమగు తాంబూలమును సమర్పింపవలెను. శ్రుతిని రాగములతో మేళవించి భక్తియుక్తములగు రసవత్పదములను మనోహరగముఁ బాడుచుండవలయును. ౨౨ పరిమళద్రవ్యములు, పుష్పములు, నానావిధ సుగంధమయములగు తైలములు, బహువిధములగు ఫల

ములు సమకూర్చి దేవస్థానము నలికి చల్లి స్వచ్ఛముగా నుంచవలెను. జలపాత్రములందుఁ బూర్ణముగా జలము నింపవలయును. వస్త్రములను సుందరముగను నిర్మలముగను నుంచవలయును. ౨౩-౨౪ సమస్తవిషయములను గూర్చియు విచారించుచు సాధకుఁడు జాగరూకతగనుండి యాలయమున కేతెంచు భక్తులను గౌరవింపవలయును. ఇదియే దాస్యభక్తియొక్క సత్యస్థితి. ౨౫ మనుష్యమాత్రునిచిత్తము ప్రసన్నమగు విధమున స్తుతిని గరుణాపూరణములగు మాటలతో నుడువవలెను. ౨౬ సప్తమగు నీదాస్య భక్తిని యథామతితో వివరించితిని. భగవంతునిపట్ల గావించినటులె సద్గురునిపట్లగూడ ననన్యభక్తితో సేవగావింపవలెను. ప్రత్యక్షముగా సేవజేయుటకు సాధ్యముగానియెడల మానసికపూజవలెనే యీదాస్యభక్తినిఁగూడ మానసికముగాఁ జేయవచ్చును. ౨౭

ఎనిమిదవసమాసము.

సఖ్యభక్తి.

శ్రోతలారా! మీరలింతకుమున్ను దాస్యభక్తిస్వరూపము నుత్సాహముతో నాలించితిరి. ఇపుడు సావధానమతితో నెనిమిదవదియగు సఖ్యభక్తిని గూర్చి తెలుపుదును. వినఁగోరెదను. ౧ పరమాత్ముని తనకుఁ బరమమిత్రునిగా నొనరించికొని యాతనిని ప్రేమవలనను బ్రీతివలనను లోఁబఱచికొనుటకే సఖ్యభక్తియని పేరు. ౨ పరమేశ్వరునకు సంతోషావహములగు విషయము లేవియో గుర్తించి వాని నానందముతో నొనర్చుచు. ౩ భక్తి, భావము, భజనము, అధ్యాత్మనిరూపణము, భగవత్కథ, భగవద్గుణకీర్తనము, ప్రేమగల భక్తులగానము, బరమేశ్వరునకు సంతోషావహముగాఁ గావించుచు నుండుటయే సఖ్యభక్తి. ౪ పైనిచెప్పినవన్నింటిని శ్రద్ధతోఁ గావింపవలెను. అందుచే భగవంతునియెడల మనకును మనయెడల భగవంతునకును మనస్సు గలిసిపోవును. ఈరూపముగ నుభయులకు సహజముగా మైత్రియేర్పడును. చాలును. ఇంకఁ గావలసినదేది యున్నది? ౫ పరమాత్మునిమైత్రిని గడింపవలయునన్న మనము

మనసమస్తసుఖములకును దిలాంజలి యొసంగవలెను. మఱియు నన న్యభావముతో జీవుఁడు తనప్రాణమును, శరీరమును గూడ భగవదర్పణము గావింపవలెను. ౬ సాధకుఁడా! నీవు సఖ్యభక్తి నభిమానించి యనుష్ఠింపఁ దలంతువేని గృహస్థసంకటములను దలంపక భగవంతుని దివ్యనామము చింతించుచుండుము. నిరూపణము, కీర్తనము, కథ, వార్త, మున్నగునవియెల్ల ఈశ్వరసంబంధముగా నుంచుము. ౭ జగదీశ్వరునితోఁ జెలిమిచేయుటలో నొకవేళ ఇష్టమిత్రులను ముఖ్యబాంధవులను, కుటుంబమును, మఱియుఁ బ్రేమాస్పదబంధులగు చుట్టపక్కములను విడువవలసివచ్చినయెడల నేమియు నభ్యంతరము చేయకుము. ఇంతియగాక నీసర్వస్వమును సమర్పింపవలసివచ్చినను వెనుకాడకుము. చివరకు బ్రాణములుగూడ భగవత్ప్రీత్యర్థమై విడువవలసివచ్చినయెడల విడువుము. ౮ నీసర్వస్వమును గోలుపోవవలసివచ్చినను నంగీకరింపుము. పరమాత్ముని మైత్రిమాత్రము చెడనీయక హృదయమునఁ బ్రేమింపుము భగవానుఁడే భక్తునిప్రాణము. ఆప్రాణమును రక్షచేయుటయే భక్తునికర్తవ్యము. ఇదియే పరమప్రీతియొక్క లక్షణము. ౯. ౧౦ ఇట్టిపరమప్రీతియు మైత్రియు నీయెడ భగవంతునకుఁ గలిగెనేని నిన్నుఁ గాపాడవలసిన బాధ్యతయు శ్రద్ధయు నేర్పడును. లాక్షాగృహములోఁ దగులఁబడి పోవనున్న పాండవులను బిలద్వారమునుండి వెడలించి వారి నెటుల నాదరభావముతో భగవంతుఁడు రక్షించెనో యెఱుంగవా? ౧౧ మిత్రరూపమునఁ బరమాత్ముని మనకడ నుంచుకొనఁదగిన తాళపుఁజెవి మనయొద్దనేయున్నది. ఎత్తైనస్థలమునకుఁ గ్రిందిభాగమునుండి ధ్వనిగావించినయెడలఁ బ్రతిధ్వని కలుగునటుల మనము పరమాత్మునిపట్ల ననన్యభావముంచినయెడల నాతఁడుగూడ సమయమునకుఁ బ్రసన్నుఁడగును. ఒకవేళ మన మాతనియెడఁ బరాఙ్ముఖులమైనయెడల నాతఁడుగూడ మనయెడఁ బరాఙ్ముఖుఁడగును. ౧౨. ౧౩

శ్లో॥ యేయథామాం ప్రపద్యంతే తాంస్తథైవభజామ్యహం

ఎవఁడెట్టుల భక్తివహించునో అటులే పరమేశ్వరుఁడును వర్తించును. కావుననే దీనితాళపుఁజెవి మనయొద్దనే యున్నదని చెప్పితిని. ౧౪ ఒకవేళ మనమనస్సునకనుకూలముగా జరుగకపోయినచో నీశ్వరునెడఁ గల భక్తినేమాత్రము తగ్గింపరాదు. అటులొనరిం

చినయెడల నాపాపమంతయు మన తలపయిఁబడును. ౧౫ మేఘము చాతకమునకుఁ బ్రసన్నము కాకపోయినను చాతకము ప్రయత్నమును మనోనిశ్చయమును వదలుటలేదు. చంద్రుఁడు సమయమున కుదయింపక పోయినను చకోర మాతనిపట్ల ననన్యభావమును విడుచుట లేదు. ౧౬ భగవంతునియెడఁ గూడ సాధకుఁ డిట్టి మైత్రిని నెల కొల్పి వివేకయుక్తమగు ధైర్యభావముతో మెలఁగుచుండవలయును. భగవంతునియెడ మమత నెన్నఁటికిని విడనాడఁజనదు ౧౭ భక్తుఁడగు సాధకుఁడు భగవంతుని జెలికానిగాఁ దలంచుచునంతతోఁ దృప్తిగాకున్నఁ దల్లిగను, దండ్రిగను, గురువుగను, విద్యగను, లక్ష్మిగను, ధనముగను, విత్తముగను, సర్వస్వముగను, నెంచుచునుండవలయును. ౧౮ ఈశ్వరుఁడుతప్ప మాకింకొంక దిక్కెవ్వరును లేరనుమాట సర్వసాధారణముగ మానవులందఱును ననునదియే. కాని యటులఁ బలుకువారి యాచరణము మాత్రము వ్యతిరేకముగా నుండును. ౧౯ తరింపఁగోరువా రెవ్వరును నిటుల ఆచరణ మొకవిధముగా నంతరంగ మొకవిధముగా నుంచఁ గూడదు. దీనిని గపటమైత్రి యందురు. మైత్రిని గావింపఁ దలంచినయెడల సత్యమగు మైత్రియే గావింపవలయును. పరమేశ్వరుని దృఢముగా హృదయపీఠమునందు నెలకొల్పవలయును ౨౦ తనకోరిక నెరవేరనిస్థితిలో నీశ్వరునియెడఁ గ్రోధభావము గలిగియుండుట సఖ్యభక్తి యనిపించుకొనదు ౨౧ ఈశ్వరునియిచ్ఛ యేదియో గ్రహించి యదియొనరించుటయే మన కుచితవిధి. కేవలము ఇచ్ఛాకారణమున భగవంతుని నెన్నఁటికిని విడువరాదు ౨౨ భగవానుని యిచ్ఛానుసారముగాఁ బ్రవర్తించుచు నాతఁ డిద్దిగావించిన దానిని శిరసావహించి పరిగ్రహింపవలెను. ఇందువలన సహజముగా నాతఁడు దయను జూపించును. ౨౩ ఈశ్వరానుగ్రహముముందుఁ దల్లిదయ యొక లెక్కలోనిది గాదు. తల్లి యన్ననో విపత్తికాలము వచ్చినపుడు బాలకుని జంపిగూడ వేయుచున్నది ౨౪ కాని ఈశ్వరుఁడెన్నఁడును దనభక్తుని జంపినటుల నెప్పుడును గనలేదు. వినలేదు. శరణాగతునిపట్ల నీశ్వరుఁడు వజ్రపంజరమువంటివాఁడు. ౨౫ పరమాత్ముఁడు భక్తులయెడఁ బక్షపాతభావముగలవాఁడు. ఆతఁడు పతితులను దరింపఁజేయును. మఱియు నసా

థులకు సహాయకారియగును ౨౬ ఆతఁడనాథులగు దీనజనులనుగాపాడి సంకటములనుండి తొలఁగించుటకై యనేకావతారముల నెత్తుచున్నాఁడు. అంతస్సాక్షియగు నాపరమాత్ముఁడు తొల్లి గజేంద్రుని గూడ నుద్ధరించినాఁడు ౨౭ ఈశ్వరుఁడు కృపాసాగరము. కరుణామేఘము. ఆయన తనభక్తుల నెన్నఁటికిని మఱువఁజాలఁడు. ౨౮ భక్తునిపై నెంతప్రేమ యుంచవలయునో పరమాత్ముఁడు బాగుగా నెఱుంగును. కావున నాతనితో సఖ్యత్వము గావింపవలెను. ఈ కుటుంబసంబంధమంతయు నొకమాయ. అంత్యమున కిది కొంచెమేని యుపయోగపడ నేరదు. ౨౯ ఈశ్వరుని మిత్రత్వమెన్నఁటికిని విడిపోవునది కాదు. ఆయనప్రేమ కెన్నఁటికిని భిన్నము కలుగనేరదు. శరణాగతునిపట్ల నాతఁడెప్పుడును నుపేక్ష వహింపఁడు. 30 కావున ముముక్షువగుమానవు లీశ్వరునితో సఖ్యము గలిగి యుండవలయును. అతనితోఁ దనసుఖదుఃఖములను విన్నవించుకొనవలయును. ఇదియే సఖ్యభక్తి 3౧ శాస్త్రములలోఁ బరమాత్ముఁడు, గురువు, అనునీ యిరువురు సమానులని చెప్పఁబడెను. కావునఁ బరమాత్ముని పయి నుంచినట్లె సద్గురుని పట్లగూడ మిత్రభావ ముంచవలెను. 3౨

తొమ్మిదవ సమాసము

ఆత్మనివేదనభక్తి

శ్రోతలారా! సఖ్యభక్తి తరువాతది ఆత్మనివేదనభక్తి. ఇంతకుమున్ను మీరు సఖ్యభక్తినిగూర్చి సాకల్యముగా వింటిరిగావున నిపుడాత్మనివేదనభక్తినిగూర్చి సావకాశముగా వినఁగోరెదను ౧ నవవిధభక్తులలో నాత్మనివేదనభక్తి తొమ్మిదవది. దానిస్వరూప మిఁక స్పష్టముగా మీకు బోధించెదను ౨ స్వయముగఁ దాను దనను బరమాత్మున కర్పణజేసికొనుటయే ఆత్మనివేదనము. ఈ విషయము తత్త్వవివరణము గావించుటవలన మీకుఁ జక్కఁగా బోధపడును 3 స్వయముగఁ దనకు భక్తుఁడనుటయు మఱియు విభక్తుఁడైయుండి యీశ్వరుని భజించుటయు నాత్మనివేదనభక్తిలక్షణములు ౪ లక్షణుఁడై యలక్షణుఁడగుటయు జ్ఞానియై యజ్ఞానియ

గుటయు భక్తుఁడై విభక్తుడగుటయు నీ భక్తిలక్షణములె ౫ విభక్తుఁడు కానివాఁడే భక్తుఁడు. భక్తుఁడు కానివాఁడే విభక్తుఁడు, ఈ విరోధభావమును గూర్చి సాకల్యముగా విచారము గావింపని సాధకునకెన్నఁటికిని సంతోషము లభింపనేరదు ౬ ఈ విషయము సంపూర్ణముగ విచారణ మొనరింపవలయును. ఈశ్వరుని గుర్తింపవలయును. అంతఃకరణమునందు స్వయముగఁ దనను వెదుకవలయును ౭ తత్త్వమును విచారించి "నేను" అనునదెవ్వరు? అనువిషయమును దృఢముగా తీర్మానించితిమేని "నేను" అనునది యెచ్చటను లేదని విశదము గాఁగలదు ౮ తత్త్వము తత్త్వములతోఁ గలిసిపోవునని వివేకమువలన గ్రహించినపుడు నేను అనునది యింకనెక్కడ మిగిలియుండును? ఇదియే ఆత్మనివేదనము * ౯ ఇదియంతయు దత్త్వరూపముగా భాసమగుచున్నది. వివేకముతోఁ గాంచినపిమ్మట నంతయును నిరసనమై పోవుచున్నది. ప్రకృతిని వేఱుచేయుటవలన ఆత్మ నిలిచియుండును. అచ్చట నేను అనునది యెచ్చటనుండి వచ్చును? ౧౦ ముఖ్యముగఁ బరమేశ్వరుఁ డొకఁడున్నాఁడుగదా! రెండవది జగద్రూపమున బ్రకృతియున్నది. (మాయ బ్రహ్మము రెండును నుండనేయుండెను) ఇఁక నీమధ్యను నేను అనుదొంగ నెచ్చటినుండి వచ్చితిరో తోఁచకున్నది ౧౧

ఇదియంతయు నీ విధముగా సిద్ధాంతమైన పిమ్మటఁగూడ నీ యసత్యదేహముయొక్క అహంతాత్వము (నేనను భానము) మధ్యమునం దంటియుండును. కాని బాగుగా విచారించి చూచితిమేని యేమియును లేదని స్పష్టమగును ౧౨ తత్త్వవిచారముతోఁ జూచినమీఁదట నీ పిండబ్రహ్మాండములు కేవలము తత్త్వరచనమని విశదపడగలదు. నానాప్రకారములగు వ్యక్తులు తత్త్వములతో రచింపఁబడిన విశ్వాకారమునందు వ్యాపించియున్నవి. ౧౩ సాక్షిత్వము

* ప్రకృతి నియమానుసారముగ పంచతత్త్వాత్మకమగు శరీరము పంచతత్త్వములలోఁ గలిసిపోయినప్పుడు "నేను" అనున దెక్కడ మిగిలియుండును? అనఁగా మనుజుఁడు దేనిని "నేను" అనిచెప్పునో యది మిగిలియుండదు. కాని యీ శరీరముయొక్క యైదుతత్త్వములు నొక్కొక్కటిగ నొక్కొక్కటిగ నైదింటితోఁ గలిపి వేయుటతో నిఁక శేషించియుండునదేదియో యదియే ఆత్మరూపము "నేను" అనునది. దీని నెఱుంగుటయే ఆత్మనివేదనము

వలనఁ దత్త్వములు నిరసనమగును. మఱియు నాత్మానుభవమువలన సాక్షిత్వమేమియును మిగిలియుండదు. కావున ఆదియందును అంతమునందును నున్నది యాత్మయే అప్పుడు మఱల "నేను" అనున దెచ్చటనుండి వచ్చునో? ౧౪ *ఆత్మయనున దొక్కటియే యైయున్నది. అది స్వానందము. మఱియు అహమాత్మ (అహం+ఆత్మా) అను వచన మొక్కటియున్నదికదా! మఱల నచ్చట "నేను" అను భిన్నత్వ మెక్కడనుండి శేషించినది? ౧౫ "సోహంహంస" (నేను కేవలముగ ఆత్మనై యున్నాఁడను) అను నీవాక్యమునందుఁగల యంతరార్థము గ్రహింపవలసియున్నది. నేనే యాత్మరూపుఁడనని యాత్మవిచారము గావించుటచే మఱల నచ్చట నేనుఅనున దెద్దియుఁ గలుగఁబోదు ౧౬ ఆత్మ నిర్గుణము నిరంజనము నైయున్నది. కావున దానివిషయమున ననన్యత గలిగియుండవలయును. అన్యము (ఇతరము) లేదు. అని యనన్యపదమున కర్థము. ఇఁక నచట "నేను" అను ననన్యమగునది యెచ్చటనుండివచ్చినది? ౧౭ ఆత్మ యద్వైతము. అచట ద్వైతాద్వైతము లేమియును లేవు కావున నిఁక నచ్చట నేను అనుకల్పన యెచట నుండఁగలదు? ౧౮ ఆత్మ, పూర్ణత్వముతోఁ బరిపూర్ణమైయున్నది అచట గుణాగుణములేవియును లేవు. ఆ నిఖిల నిర్గుణమునందు ,,నేను'' అనున దెవ్వరు? అది యెక్కడనుండి వచ్చినది? ౧౯ త్వంపదము తత్పదము, అసిపదముల భేదాభేదము నిరసనమైపోయినమీఁదట తత్త్వమసి=అది నీవైయున్నాఁడవు. అను ఈమహావాక్యము సిద్ధమైనమీఁదట) శుద్ధబ్రహ్మము శేషించి యుండును. ఇఁక నచ్చట "నేను" అనున దెచ్చటినుండి వచ్చును? ౨౦

* నేను అనునది తత్త్వములకు సాక్షియైయున్నది. దీనిచే "నేను" అనునది తత్త్వములకంటె భిన్నమగు నొకపదార్థమని విదితమగుచున్నది. నాది, యను ప్రత్యక్షప్రమాణమువలననే "నేను" అనునది తత్త్వముకంటె వేఱగనున్నట్లు ధ్రువపడుచున్నది. మఱియు నాత్మ ప్రతీతియైపోయినపిదప అనఁగా సర్వంఖల్విదం బ్రహ్మ యను జ్ఞానము కలిగినపిమ్మట నిఁకఁ బ్రత్యక్షప్రమాణ మెక్కడనుండి శేషింపఁగలదు. సారాంశమేమన—ఆద్యంతములయం దాత్మ యొక్కటియే యున్నది. "నేను" అనునది దానికంటె నేదో యొక భిన్నపదార్థము గాదు.

జీవాత్మ శివాత్మ యను నీ రెండుపాధులు నిరసించినపిమ్మట
గాని మొదట నీ రెండు నెచ్చటనుండివచ్చెనో బోధగాదు. స్వరూ
పమునందు దృఢమగు బుద్ధిగలిగినపిమ్మట "నేను" అనున దేదియు
నుండఁబోదు. ౨౧ నేను అసత్యము ఈశ్వరుఁడు సత్యము. ఈశ్వరుఁ
డుభక్తుఁడనను నీ యుభయులు ననన్యులు. అనఁగా నీ యిరువురు
నొకటియై యున్నారనుట. ఈ వచనమునందలి భావము సామాన్యు
లగు జనులకుఁ దెలియఁబోదు. అనుభవనీయు లెఱుంగుదురు ౨౨
ఆత్మనివేదనమన నిదియేసుండీ ఇదియే జ్ఞానులకు బాగుగాఁ దెలిసిన
యంశము ౨౩ పంచభూతములలో నాకాశము, దేవతలలో జగత్పిత
యగుపరమాత్ముఁడు, నెలులశ్రేష్ఠులో యటులే నవవిధభక్తులలో ఆత్మ
నివేదనభక్తి శ్రేష్ఠమైనది ౨౪ తొమ్మిదవదియగు నీ యాత్మనివేద
నభక్తి లేనిమానవున కెన్నఁటికిని జననమరణములు తొలంగి పోఁజా
లవు. ఈవచనము సత్యసిద్ధము. కావుననిందు సందియమువలదు. ౨౫
ఈ నవవిధభక్తుల నలనవలచికొనిన మానవునకు సాయుజ్య
ముక్తి లభించును. సాయుజ్యముక్తియన నేమియో యెఱుంగుదువా?
దానికిఁ గల్పాంతమునందుఁగూడ నాశనము లేదు ౨౬ శేషించిన
మూఁడుముక్తులకును నాశనమున్నది. కాన సాయుజ్యముక్తిమాత్ర
మచలమైనది. మూఁడులోకములు నిర్వాణమై పోయినప్పుడు సైతము
సాయుజ్యముక్తి చెక్కుచెదరక యథారూపముగ నుండును ౨౭
నేనేకాదు వేదశాస్త్రాది సమస్తగ్రంథములుసైతము నాలుగుముక్తులు
గలవని చెప్పుచునేయున్నవి. వానిలో మూఁడింటికి నాశనమున్నది.
నాలుగవదియగు సాయుజ్యముక్తి యవినాశిగా నుండును. ౨౮
మొదటిముక్తి సాలోక్యము (దేవునితో సమానముగానుండుట) రెం
డవది సామీప్యము (దేవుని సమీపము నందుండుట) మూఁడవ
ముక్తి సారూప్యము (దేవుని సమానరూపము నొందుట) నాలుగ
వది సాయుజ్యము (దేవునితో లీనమయ్యెడుపదవి) ౨౯ ఈనాలుగును
మానవులకు సామాన్యప్రయత్నములచే లభింపఁజాలవు. భగవద్భ
జనవలననే లభించును. కావున భగవద్భజనప్రభావ మెంతని పొగడ
గలను. 30

పదియవ సమాసము

సృష్టివర్ణనము, ముక్తిచతుష్టయం

ఆదిబ్రహ్మము నిరాకారము. అందె పూర్ణస్వరూపముతో
నహంకార ముత్పన్నమగుచున్నది. ఈయహంకారము పంచభూత
ములకును మూలమైయున్నది. దీనినిగూర్చిన విచారమంతయు నెని
మిదవ దశకమునందుఁ జేయఁబడినది. ౧ ఆయహంకారము వాయు
రూపమైయున్నది దానితరువాత తేజస్స్వరూపము (అగ్నిస్వరూపము)
గలదు. ఆతేజము నాధారముగాఁ జేసికొని జలము ఆవరణరూప
ముగ వ్యాపించియున్నది. ౨ ఆజలావరణపుటాధారముతో నాది
శేషుఁడీపృథ్విని ధరించియున్నాఁడు. ఈపృథ్వియంతయు నేఁబది
యారుకోట్ల యోజనములవిస్తీర్ణముగా నున్నది. 3 పృథ్విని ఏడు
సముద్రములావరించుకొనియున్నవి పృథ్వీమధ్యమున మహత్తర
మగు మేరుపర్వతమున్నది. మరియు నీపృథ్వికిఁ బరివారరూపులుగ
అష్టదిక్పాలకులు దూరదూరముగ నొక్కొక్కదిక్కు నావరించుకొని
యున్నారు. ౪ మహత్తరమగు నామేరుపర్వతము సువర్ణమయము.
ఈ భూమండలము దానియాధారముననే కదలక నిలిచియున్నది.
మేరుపర్వతము ఎనుబది నాలుగు వేల యోజనముల విశాలముగ
నలరారుచుండును ౫ దానియెత్తు నిర్ణయింప నెంతవానికేని తరము
గాదు. పదునాలుగువేల యోజనములదనుక మేరుపర్వతము భూమి
లోనికిఁ జొచ్చుకొనిపోయియున్నది. దానిచుట్టుప్రక్కలను లోకా
లోక (చక్రవాళ) పర్వత మావరించియున్నది ౬ చక్రవాళపర్వత
మున కావల హిమాలయ పర్వతముయున్నది. అచ్చటనే పాండవు
లందఱు నిలువునీరై కరిగిపోయిరి. ధర్మనందనుఁడును తమాల నీల
గాత్రుఁడగు శ్రీకృష్ణుఁడును మాత్రమే హిమాలయముదాటి ముం
దునకరిగిరి. ౭ హిమాలయముచేరుట కనువగు మార్గమే లేదు.
మార్గమధ్యమున శీతలవాయు సేవనమున సుఖముగానున్న బలిసిన
సర్పరాజము లాయాప్రదేశము లావరించుకొనియున్నవి. అవియుఁ
జూచుటకుఁ బర్వతములవలెనే కనిపించుచుండును. ౮ హిమాలయ
మునకావల బదరికాశ్రమము బదరీనారాయణము అనుక్షేత్రరాజము

లున్నవి. నిర్వాణసమయమునందు పూర్వతపస్వులగు పుణ్యమూర్తులు దేహత్యాగము గావించుటకచటికి వెళ్లుచుందురు. ౯ దాని తరువాత బదరీనాథము కేదారనాథము అను రెండుక్షేత్రములున్నవి. ఈ రెండుక్షేత్రములను పెద్దలు పిన్నలు దర్శించి వచ్చుచుందురు. ఈ ప్రదేశములన్నియుఁ గలిసి మేరుపర్వతమంత విస్తృతిగలవి. ౧౦ మేరుపర్వతమునకుఁ బైభాగమునందు మూఁడుమహోన్నతశిఖరములు గలవు. వానిపయిని బరివారసహితులై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నివసించుచుందురు ౧౧ బ్రహ్మ నివసించు శృంగము స్వర్ణమయము. విష్ణువు నివసించుశృంగము మరకతమణిమయము. శివుడు నివసించుశృంగము స్ఫటికమణిమయము. దీనినే, కైలాసమని పెద్దలు చెప్పుచుందురు. ౧౨ విష్ణువు నివసించు శృంగమునకు వైకుంఠమనియు నీమూఁడింటి కావలనున్నది. లోకమునకు అమరావతి లేక యింద్రలోకమనియుఁ బేరు ౧౩

ఇంద్రలోకమునందు గణములు, గంధర్వులు, లోకపాలురు ముప్పదిమూఁడుకోట్ల దేవతలు మున్నగువారలు నివసించుచున్నారు. అదేవిధముగఁ బదునాలుగు లోకములును మేరుపర్వతము నావరించుకొనియున్నవి ౧౪ స్వర్గలోకమునందుఁ గామధేనువులు మందలు మందలుగా నున్నవి. కల్పతరువులుగల వనములు లెక్కకు మిక్కుటముగా నున్నవి. అమృతసరోవరములు ప్రతిప్రదేశమునందును నలరారుచున్నవి. ౧౫ చింతామణులు, పరుసవేదిగనులు నట లెక్కకుమించి కలవు. ఇంతయేల! అచటి నేలయంతయు స్వర్ణమయము ౧౬ ఆలోకమునందంతటను బరమ రమణీయము నయనానందకరము నగుప్రకాశము వ్యాపించియున్నది. అచటగల నవరత్నమయములగు పాషాణములకు లెక్కయేలేదు. అచటివారలగు వేల్పులందఱును నిరంతర మానందవారాశి నోలలాడుచుందురు ౧౭ అచ్చటనున్న వేలుపులందఱకు నాహారము అమృతము. దివ్యసాంగీతములాలోకమున వెదకికొనవలసిన పనియేలేదు. దివ్యకుసుమము లెప్పుడును వికసించి హృదయానందకరముగా నుండును. అష్టవిధగాయకులును గంధర్వులును మందాకినీ సికతాతలమున

నిరంతరము గానముచేయుచు విహరించుచుందురు. ౧౮ అచటనున్న వార లందఱు నిరంతరము యౌవనులుగా నుందురు. స్వర్గవాసులకు ఆధివ్యాధు లుండనేయుండవు. వార్ధకముగాని మరణముగాని వారలకెన్నఁటికిని రాఁజాలదు. ౧౯ స్వర్గమునందుఁ గలవానిలో నొకదానికంటె నొకటి సుందరమైనది. ఒకటికంటె మఱియొకటి చతురమైనది. అచట వసించువార లందఱును గొప్పధీరమూర్తులును, ఉదారస్వభావులును, శూరవతంసులు నై యున్నారు. ౨౦ స్వర్గవాసుల దేహములు మెఱుపుతీఁగలవలె జ్యోతిస్స్వరూపములై యున్నవి. వారలకీర్తికిని యశమునకును బరాక్రమమునకును మేరయే లేదు. ౨౧ స్వర్గభువన మెటులుండునో మీకు సంగ్రహముగాఁ దెలిపినాఁడను. అది దేవతలకు నివాసస్థానము. దాని మహిమ యెంత వర్ణించినను దక్కువయే గావున విరమించుచున్నాడను. ౨౨

భూలోకవాసులగు మానవులు నిష్కల్మషమగు భక్తిభావముతో నేదేవతనుభజించెదరో యాదేవతసన్నిధానమునందు సాలోక్యముక్తి ననుభవింతురు. ౨౩ భక్తులు తాముధ్యానించు దేవతలుండులోకములో నున్నచో సాలోక్యముక్తి నొందిరనియు, సమీపముననున్నచో సామీప్యముక్తి నొందిరనియు, దేవతాస్వరూపముతో నున్నచో సారూప్యముక్తి నొందిరనియుఁ జెప్పుదురు. ౨౪ సారూప్యముక్తియందుఁ బ్రాణికి దేవరూపము కలుగును. కాని శ్రీవత్సలాంఛనము, కౌస్తుభమణి, లక్ష్మి మున్నగునవి వానికి లభింపవు. ఇదియె సారూప్యముక్తి లక్షణము. ౨౫ సుకృతసంచయ మెంతదనుక నుండునో యంతదనుకఁ బ్రాణిలోక మీమూఁడుముక్తుల ననుభవించుచుండును. అదిసమాప్తియైనంతన ప్రాణిలోకమంతయుఁ దమతమ తావులకుఁ ద్రోసివేయఁబడును. దేవతలుమాత్రము యథావిధముగాఁ దమలోకమునందే యుందురు. ౨౬ కావున నీమూఁడుముక్తులు నశించునవియని చెప్పవచ్చును. నాలుగవదియగు సాయుజ్యముక్తి యట్టిదికాదు. అది నిరంతర మవినాశిగానుండును. ౨౭ కల్పాంతమునందు బ్రహ్మము నశించును. మేరుపర్వతముతోఁబాటు భూలోకమంతయు భస్మమైపోవును. ఆసమయమున దేవతలే నశింతురు. కావునఁ బయినిఁ బేర్కొనిన మూఁడువిధములముక్తు లెటులనిలువఁగలవు? ౨౮

అప్పుడు ముఖ్యముగా నాశనమొందక నిలిచియుండునది కేవల నిర్గుణ పరమాత్మ యొక్కటిమాత్రమేసుమా! కావున నిర్గుణబ్రహ్మమును గూర్చిన భక్తియొక్కటియే స్థిరమైనది. అదియే సాయుజ్యముక్తి. ౨౯ నిర్గుణమునం దనన్యత నొందుటవలన సాయుజ్య ముక్తి లభించును. నిర్గుణమునందుఁ గలిసిపోవుటను, తదాకారము నొందుటను, సాయుజ్యముక్తియని చెప్పుదురు. ౩౦ సగుణభక్తికిఁ జలనము గలదు. నిర్గుణభక్తి యచలమైనది. (స్థిరమైనది.) ఇవియన్నియు సద్గురుశరణ్యములోని కరిగినచోఁ విశదమగును. ౩౧

నాలుగవదశకముసమాప్తము.

ఐదవ దశకము.

మొదటి సమాసము.

గురునిశ్చయము.

సద్గురుసేవలేనిది మోక్షము లేదు.

ఓ పరమపురుషా! ఆత్మారామా! పూర్ణకామా! సద్గురూ! మీకు జయమగుఁగాక. జయమగుఁగాక. మీమహత్త్వము వర్ణింప నాతరముగాదు ౧ గురువర్యా! మీయనుగ్రహ మన్నంతమాత్రమున సచ్ఛిష్యులకు వేదముల కగమ్యమును శబ్దములకందనిదియునగు బ్రహ్మము సాధ్యమగుచున్నది. ౨ అంతియగాక యోగులగువారలకుఁగూడ ముఖ్యరహస్యముగానున్నదియు శంకరునకు ముఖ్యవిశ్రామముగ నలరారునదియుఁ బరమగుహ్యమును అగాధమునునగు బ్రహ్మము మీయనుగ్రహమువలనఁ బ్రాణి (జీవుడు) స్వయముగఁ దానెయగుచున్నాఁడు. (ఈదుస్తరసంసారమునుండి విముక్తుఁడగుచున్నాఁడనిభావము.) ౩-౪

గురువతంసా! ఇప్పుడు మీయనుగ్రహమువలననె శ్రోతలకు గురుశిష్యలక్షణముల నెఱింగించుచున్నాఁడను. వీని ననుసరించి మోక్షాసక్తిగల శ్రోతలు సద్గురుని శరణ్యములోని కరుగుట కర్తవ్యము ౫ వాస్తవమునకు సమస్తవర్ణములవారికిని బ్రాహ్మణుఁడె (బ్రహ్మజ్ఞానియై బ్రాహ్మణుఁ డనిపించుకొన్నవాఁడె) గురువై యున్నాఁడు. (వర్ణానాం బ్రాహ్మణో గురుః) కావున మోక్షాసక్తిగలవాఁ డనన్యభావముతో నాతని సన్నిధి కరుగవలెను. ౬ బ్రహ్మజ్ఞానులై బ్రాహ్మణు లనిపించుకొనువారికొఱకె స్వయముగా శ్రీమన్నారాయణమూర్తి యవతారమెత్తెను. మఱియు శ్రీమహావిష్ణువే నిరంతరమును శ్రీవత్సలాంఛనము (భృగుమహర్షిచేఁ దన్నఁబడినతన్ను గురుతు) సాదరముగఁ దన పేరురమునఁ దాల్చినాఁడు. ఇఁక నితరుల లెక్కయేమి? ౭ బ్రాహ్మణులవచనములచేతను బ్రాహ్మణుల మంత్రములచేతను శూద్రాదులు బ్రాహ్మణులగుచున్నారు. వేయేల ధాతుపాషాణములయందు సైతము బ్రాహ్మణమంత్రప్రభావముచే దేవత్వమేతెంచుచున్నది. ౮ యజ్ఞోపవీతము లేనియాతఁడు నిస్సందేహముగా శూద్రుఁడె. యజ్ఞోపవీతసంస్కారముచే రెండవజన్మము కలుగుచున్నది. నాఁడు మొదలుకొని ద్విజుఁడని చెప్పుచుందురు. ౯ వేదములు సైతము బ్రాహ్మణుఁడు సమస్తవర్ణములవారికిని బూజ్యుఁడని చెప్పుచున్నవి. ఈయంశము నందఱు నభిమానభావముతో గమనించుచునేయున్నారు. వేదవిరుద్ధవిషయములు భగవంతున కప్రియములుగావున వానితో మన కేమి పని? ౧౦ యోగము, యాగము, వ్రతము, దానము, తీర్థము మున్నగు కర్మయోగాంగములలో నేదియుఁ బ్రాహ్మణుఁడులేనిది నెఱవేఱజాలదు. ౧౧ బ్రాహ్మణుఁడు ప్రత్యక్షముగా వేదస్వరూపుఁడు. అంతియగాదు. భగవంతుఁడుగూడ నైయున్నాఁడు. విప్రవాక్యమువలనఁ గోరికలు ఫలించును. ౧౨ బ్రాహ్మణపూజనమువలన వృత్తి పవిత్రమగును. చిత్తము భగవంతునియందు లగ్నమగును. ప్రాణు లుత్తమగతులను బ్రాహ్మణులతీర్థమువలననే పడయుచున్నారు. ౧౩ అన్యజాతులను విడిచి బ్రాహ్మణులకు సంతర్పణలు భోజనములు చేయించుటగూడ బ్రాహ్మణ పూజనమే. భగవంతుఁడు భావమున కాఁకలిగొని యున్నాఁడు. ఆయన జాతులను కులములను జూడఁడు. ౧౪ బ్రాహ్మణునకు గొప్పదేవతలుగూడ నమస్కరించుచున్నారు. ఇఁక సామాన్యమానవునిసంగతి చెప్పవలసినదేమున్నది? నేటికాలమునన్ బ్రాహ్మణుఁడెంతమూఢమతియై యున్నను నాతఁడె జగమునందంతటను వందనార్హుఁడై యున్నాఁడు. ౧౫ అంత్యజుఁడు గొప్పశబ్దజ్ఞానియై యున్నచో వానిని

గైకొని చేయవలసిన దేమున్నది? బ్రాహ్మణునివద్దఁ గూర్చుండఁబెట్టివాని నేమేని పూజింపఁగలమా? ౧౬ లోకమునకుఁగాని మతమునకుఁగాని విరుద్ధముగా నెయ్యదియేని గావించినయెడల దానిని వేదము సైతము పరిహాసము చేయును. వేదదూష్యమగు కార్యమాచరించిన వానిని పాషండుఁడని చెప్పుదురు. ౧౭ పరమాత్ముని భక్తులగువారలకు బ్రాహ్మణులపయి విశ్వాసము సహజముగనే యున్నది. బ్రాహ్మణునిఁ బూజించి యనేకులు పవిత్రులైరి. ౧౮ బ్రాహ్మణసేవవలన దేవాధిదేవుఁడగు పరమాత్ముఁడు లభించుచుండ నిఁకసద్గురునితో నేమిపని? యని యొకవేళ శ్రోతలుప్రశ్నింతురేమో? అదిసరిగాదు. సద్గురుఁడులేనిది బ్రహ్మజ్ఞాన మెన్నఁటికిని గలుగఁజాలదు. ౧౯ స్వధర్మములయందును స్వకర్మములయందును బ్రాహ్మణుఁడు పూజ్యుఁడు. కాని జ్ఞానముమాత్రము సద్గురుఁడులేనిది కలుఁగజాలదు. బ్రహ్మజ్ఞానము కలుగనిది జననమరణదుఃఖము నశింపదు. ౨౦ కావున జ్ఞానము బడయుటకు సద్గురుని యనుగ్రహ మావశ్యకము. సద్గురుని యనుగ్రహము అవలంబనముగా లేకున్న యెడల నజ్ఞానులగు మానవులు సంసారప్రవాహమునందుఁ బడి కొట్టుకొని పోవుదురు. ౨౧ జ్ఞానరహితముగఁ జేయఁబడు కర్మమంతయు జన్మ కారణమగును. కావుననే జ్ఞానమార్జించి జన్మరాహిత్యము గావించుకొనుటకు సద్గురుచరణములను దృఢభావముతోఁ బట్టుకొనవలయునని చెప్పితిని. ౨౨ పరమాత్ముని దివ్యరూపమును సందర్శింపఁగోరికగలవాఁడు సత్సంగ మొనరింపవలయును. ఏలయన సత్సంగములేనియెడల దేవాధిదేవుఁడు (బ్రహ్మము) లభింపఁజాలఁడు. ౨౩ అయ్యయ్యో! అజ్ఞానులగు పురుషులీరహస్యము నెఱుంగక సద్గురు నాశ్రయింపఁబోక నానావిధములగు సాధనాంతరములలో మగ్నులై తిరుగుచుందురు. సద్గురుకృపలేని దాపరిశ్రమయంతయు వ్యర్థమైపోవును. ౨౪ కార్తికస్నానము, మాఘస్నానము, వ్రతములు, ఉద్యాపనములు, దానములు, గోరాంజనములు. (ఈశ్వరప్రీతికై దేహమునిండ వాతలుబెట్టుకొనుట) ధూమపానము (తల క్రిందుగా వ్రేలాడుచుఁ బొగబీల్చి చేయుతపస్సు) పంచాగ్నిమధ్యనుండుట మున్నగు సాధనములు కొందఱు గావించుచుందురు. ౨౫ కొందఱు ప్రజలు హరికథలు, పురాణశ్రవణములు, అధ్యాత్మనిరూపణములు, మి

గుల నాదరభావముతోఁ గావింతురు. మఱియు మిగుల శ్రమపడి యగమ్యములగు పుణ్యతీర్థములకు యాత్రార్థముగా నేగుదురు. ౨౬ నిర్మలభావముతో దేవతార్చనము, స్నానము, సంధ్య, దర్భాసనము, తిలకము, మాల, గోపీచందనము, శ్రీముద్రాధారణము మున్నగునవియన్నియుఁ గొందఱు నిర్వహింతురు ౨౭ అర్ఘ్యపాత్రములు, సంపుటములు, గోకర్ణపాత్రములు, మంత్రయంత్రసంబంధమగు తామ్రపాత్రములు, నానావిధపాత్రములు సమకూర్చి కొందఱు భగవత్పూజనము నొనర్తురు. ౨౮ గణగణమని పూజాసమయమున గంటవాయింతురు. స్తోత్రములు, స్తవములు, స్తుతులు, ఆసనములు, ముద్రలు, ధ్యానములు, నమస్కారములు, ప్రదక్షిణములు, మున్నగువానిని నన్నిటినిగూడఁ గావింతురు. ౨౯ పుష్పనారికేళాదులను సమర్పించి పంచాయతనపూజయు మృత్తికతో లక్షలకొలఁదిలింగములనుగావించి వానిపూజయు సాంగోపాంగముగాఁ జేయుదురు. ౩౦ మఱియు నియమనిష్ఠావంతులై కష్టములకు సహించి యుపవాసాదికర్మములను నొనర్తురు. కాని వారలీకర్మముల యొక్క ఫలమునుమాత్రమే పొందెదరు. మర్మముమాత్రము గ్రహించుట లేదు. ౩౧ హృదయమునందు ఫలాశనుంచుకొని కొందఱు యజ్ఞయాగాదులుగావించుచున్నారు. ఇవియన్నియు ముందుజన్మమున ఫలముల నొందుటకై బయానాను (క్రయనిర్ధారణమైనపిమ్మట నిశ్చయార్థముగ ముందుఁ గొంతయిచ్చుసొమ్ము) పుచ్చుకొనుటవంటివి. ౩౨ నానాపరిశ్రమము లొనరించి పదునాలుగువిద్యల నభ్యసింతురు, వారల కా విద్యల సహాయమున సమస్తసిద్ధులును ఫలించును. అయినను సద్గురుకృపలేనిది వారికి సత్యమగుహితము ఎన్నఁటికిని గలుగఁబోదు. అంతియగాదు. వారలకు యమపురమునం దనుభవింపవలసిన యనర్థములలో నొక్కటియుఁ దొలఁగదు. ౩౩.౩౪ వేయేల మానవునకు జ్ఞానప్రాప్తి కలుగనంతవఱకు జననమరణములు నశింపవని రూఢిగా నమ్మవలయును. గురుకృపలేనివారల కీ ఘోరగతియు గర్భవాసము తొలఁగిపోవఁజాలదు. ౩౫ బ్రహ్మజ్ఞానము సమకూరనంతవఱకు ధ్యానము, ధారణము, ముద్ర, ఆసనము, భక్తి, భావము, భజనము మున్నగునవియన్నియు ఫలమునీయక యటులే యుండును. ౩౬ సద్గురుని కృపాభాగ్యమును బడయక

ణుత్తరసాధనములతో మునిఁగి తేలుచున్నవాఁడు గ్రుడ్డివాఁడు త్రోవదెలియక కందకములోనో గోతిలోనో కూలినటులఁ బడిపోవును. ౩౭ గుప్తమగు ద్రవ్యమును రత్నాదిఖనిజములను అంజనము వేసికొనినచోఁ గనిపెట్టగలుగునట్లు సద్గురువాక్యముతో జ్ఞానము ప్రకాశమొందును. ౩౮ సద్గురుఁడు లేనివానిజన్మము నిష్ఫలము. సద్గురుఁడు లేనియెడల నంతయు దుఃఖమయమే. సద్గురుఁడు లేనివాని కెన్నఁటికిని సంసారవ్యధ నివృత్తిగాఁజాలదు. ౩౯ సద్గురుని యనుగ్రహమువలననే పరమకారుణికుఁడగు నీశ్వరుఁడు ప్రసన్నుఁడగును. అంతియగాక యపారమగు సంసారదుఃఖము గూడ నాశనమగును. ౪౦ మనమే కాదుసుమా! పూర్వకాలమున మహాత్ములు, సాధువులు, తపస్వులు బ్రహ్మర్షులు అనిపించుకొన్న పుణ్యాత్ములుకూడ సద్గురుని సేవచేతనే జ్ఞానవిజ్ఞానవిచారణములు బడయఁగలిగిరి. ౪౧ మహారాజగు శ్రీరామచంద్రమూర్తియు, మహాయోగియగు శ్రీకృష్ణమూర్తియు, గురుభజనమునందెంతయో తత్పరభావము గలవారై యుండిరి. సిద్ధులు, సాధువులు, మహాత్ములు నగు వారలు పలువురు గురుసేవ గావించి ధన్యులైరి. ౪౨ వేయినుడువు లెందులకు? సకలసృష్టిని నడపెడు బ్రహ్మవిష్ణుమహేశ్వరాదులు సైతము సద్గురుచరణసేవ నిరంతరము గావించుచునుందురు. సద్గురుని యెదుట నీత్రిమూర్తులకుఁ గూడ మహత్త్వము లేదు. ౪౩

మోక్షవాంఛగల మానవుఁడు సద్గురుని వెదుకవలయును. సద్గురుఁడు లేనివానికి మోక్ష మెన్నఁటికి లభింపఁజాలదు. ౪౪ సద్గురుఁడు సాధారణులగు నితరగురువులవలె నుండఁడు. ఏలయన! అతనికృపవలన శుద్ధజ్ఞానము శిష్యునిహృదయమునఁ బ్రకాశించును. ౪౫ రాఁబోవు సమాసమునందు సద్గురునిలక్షణము లేవియో సాకల్యముగాఁ జెప్పఁబోవుచున్నాఁడను. శ్రోతలు ధ్యానపూర్వకముగా వినియెదరుగాక. ౪౬

రెండవ సమాసము

సద్గురునిలక్షణములు.

సామాన్యముగా జనులు గొప్పగొప్పమహత్త్వములను జూపెడువారలను గురువులని నుడివెదరు. కాని యట్టివార లెన్నఁటికిని మోక్ష

ప్రదాతలగు సద్గురువులు గాఁజాలరు. ౧ సభాసమ్మోహనమంత్రములు, గారడివిద్య, భూతవైద్యము, బహువిధములగు అసంభవచమత్కారములును, నేర్పి సంతోషమును గలుగఁజేయువారును. ౨ ఔషధప్రయోగము, రాసాయనికసమ్మేళనము, కనుకట్టు, కేవల దృష్టిచేఁ గోరినవస్తువులను దాత్కాలముననే సమకూర్చుకౌశలము నేర్పువారును, ౩ సాహిత్యము, సంగీతము, రాగజ్ఞానము, గీతములు, నృత్యము, తానమానములు నేర్పువారును నానావిధమగు గురువులు. ౪ పంచాక్షరీవిద్యయు నానావిధములగు భూతప్రయోగమంత్రములు కుక్షింభరవృత్తికి అనువగు విద్యలు, ౫ జాతికనుకూలమగు వ్యాపారము, నేర్పి మానవుని దనపొట్టఁ దానుబోసికొనుటకుఁగాని నాలుగుడబ్బులు గడించుటకుఁగాని నేర్పువారుగూడ గురువులే. కాని వాస్తవమునకుఁ జూచినచో వారలెన్నఁటికిని సద్గురువులు కాఁజాలరు. ౬ సత్యము విచారించినచోఁ దల్లిదండ్రులుగూడ గురువులే. భవసాగరమునుండి యుద్ధరించు సద్గురువు వీరిరువురుగాక వేఱుగ నున్నాఁడు. ౭ గాయత్రీమంత్రము నుపదేశము జేయువాఁడుగూడ యథార్థమునకు గురువే. భవసాగరము దాటుట కనువగు జ్ఞానము నుపదేశించిన సద్గురుఁడు వేఱుగా నున్నాఁడు. ౮ బ్రహ్మజ్ఞానము నుపదేశించి అజ్ఞానమును నిరసింపఁజేసి జీవశివుల కైక్యము గావించువాఁడును జీవత్వశివత్వకారణములవలన ఈశ్వరునియందును భక్తునియందును గలిగిన భిన్నత్వపుగుణము దొలఁగించువాఁడును (పరమేశ్వరుని భక్తుని నేకము జేయువాఁడు) మాత్రమే సద్గురుఁడు. ౯.౧౦ భవభయరూపియగు శార్దూలము పంచవిషయరూపములగు దుముకులు దుముకుచు జీవరూపియగు దూడను ఈశ్వరరూపియగు నావునుండి లాగుచున్నది. ఆసమయమున నెవ్వఁడు జ్ఞానరూపమగు ఖడ్గముతో నాశార్దూలమును ఖండించి దూడను గాపాడి మరల నావుతోఁ గలిపివేయునో (జీవునకును శివునకును నైక్యము గావించునో) యాతఁడే సద్గురుఁడు. ౧౧ మాయాజాలములలోఁ బడి సంసారదుఃఖములతోఁ బరితపించు ప్రాణులను ముక్తులఁ గావించు నాతఁడును, ౧౨ వాసనారూపమగు నదీపంకమునందు దిగఁబడి భయపడుచున్న ప్రాణికడకరిగి దరిజేర్చువాఁడును, ౧౩ విజ్ఞానమును బ్రసాదించి గర్భవాససంబంధమగు మహాసంకటములను వారించి యిచ్ఛా

బంధములను శృంఖలములను త్రెంచివేయు నాతడును, ౧౪ తనయుపదేశప్రభావముచే నాత్మదర్శనము శిష్యునకు ననుగ్రహించు వాడును, అనాథులపాలిటికి రక్షకుడుగ నుండునాతడును సద్గురుడు. ౧౫ ఏకదేశీయుడగు (అంశరూపుడగు) జీవుని ప్రత్యక్షబ్రహ్మముగా జేయువాడును, ఉపదేశమాత్రమున సంసారసంబంధమగు సమస్తశ్రమలను దూరముచేయువాడును, ౧౬ వేదములలోని గూఢతత్త్వమును శిష్యుని హృదయమునందంకితముగావించు వాడును సద్గురుడు ౧౭ వేదములయొక్కయు, శాస్త్రములయొక్కయు, మహానుభావులయొక్కయు, ననుభవమొక్కటియే. ఆయనుభవమే సద్గురురూపము. ౧౮ సద్గురుడు సందేహములను మొదలంట నాశనముగావించును. స్వధర్మము నాదరపూర్వకముగా బ్రతిపాలనము జేయును. వేదవిరుద్ధములగు నన్యవిషయములను గురుమూర్తి యెన్నటికి దరికి జేరనీయడు. ౧౯ తనచిత్తవృత్తి ననుసరించి నడచువాడు (తనమనస్సును జయింపలేని యాతడును) ఎన్నటికిని సద్గురువు కాడు. వాడొకవిధమగు బిచ్చగాడు. లోభమునకు లోనై శిష్యుల వెంట దిరుగు పాపగ్రహమని వానిని జెప్పవచ్చును. ౨౦ శిష్యులను సాధనములలో ప్రవేశబెట్టక, యింద్రియదమనము జేయింపక, తనపని తాను జూచుకొను కపటగురువులు గవ్వకు ముగ్గురు దొరికినను బరిగ్రహింపరాదు. ౨౧ జ్ఞానముకొఱకై శిష్యునకు బోధచేయువాడును అవిద్యను మొదలంట నాశనము చేయువాడును, ఇంద్రియదమనము గావించువాడును సద్గురుడని గ్రహింపుము. ౨౨ కేవలము ద్రవ్యముకొఱకు వేదమును శిష్యునకు విక్రయించుకొనినవాడును, దురాశాబద్ధుడై శిష్యులకడ దీనరూపముతో ననుగ్రహార్థియై యుండువాడును గురువుగాడు. ౨౩ పాపదాయకమగు కామమునకు బద్ధుడై వర్తించువాడును, శిష్యుని మనస్సుననుసరించి నడచుచు నాతని దృప్తిపరచుటయే తనకర్తవ్యముగా భావించువాడును, శిష్యునికడ నణగిమణగి ప్రవర్తించునాతడును గురువుగాడు. వాడు మహామూర్ఖుడు, దొంగ, మోసగాడు, పాపి, ద్రవ్యవ్యసనియని చెప్పదగినవాడు. ౨౪, ౨౫ దురాచారియగు వైద్యుడు రోగిమనస్సు ననుసరించి వర్తించుచు వాని సర్వస్వము హరించుటయే గాక యంత్య

మున దయ్యమై వానిప్రాణములనుగూడ గైకొనునట్లు ద్రవ్యవ్యసనశీలుడగు పాపిష్ఠిగురువు శిష్యుని గోరువంకదువ్వలు దువ్వి వానినింకను సంసారబంధనములలో బడవేయును. పరమాత్మునితో గలియనీయడు. ఇట్టి గురుని పరిచయము వలదు. అపాయకరము. ౨౬, ౨౭.

శుద్ధబ్రహ్మజ్ఞానియైయుండియు గర్మయోగిగా (సత్కర్మములాచరించువాడుగ) నుండువాడే సద్గురుడు. అతడే శిష్యునకు బరమార్థదర్శనము గావింప దగినవాడు. ౨౮ బాహ్యాడంబరములను జూపుటకు జెవిలో నేదియో మంత్రమునూదుటకు దగిన మిడిమిడిజ్ఞానముగలవాడు పాపిష్ఠిగురువు. వాడు పరమాత్మునకు విరుద్ధుడు. ౨౯ గురుప్రతీతి, శాస్త్రప్రతీతి, ఆత్మప్రతీతియను నీమూడింటి యనన్యత యెవనియనుభవమునకు వచ్చియున్నదో (గురునిభాషణము, శాస్త్రవాక్యము, స్వానుభవము అనువాని సహాయమున ఒకేవిషయము గ్రహించెనో) యతడే సద్గురుమూర్తి. మోక్షము నపేక్షించువార లిట్టిసద్గురుని సన్నిధిలోనికి పోవలయును. ౩౦ అద్వైతనిరూపణము గావించుటలో నగాధవక్తగా నుండి విషయలోలత్వమున జిక్కుకొని చెడిపోయినగురునివలన సాధకునకెన్నటికిని శుభము కలుగజాలదు. ౩౧ అనుభవజన్యమును, నిశ్చయాత్మకమును నగు నిర్మలజ్ఞానము లేకపోవుటచే నేప్రసంగమువచ్చిన నాప్రసంగమున కనుకూలముగా గొంచెముకొంచెము చెప్పనేర్చిన వేషధారియగు వంచకు డెన్నటికిని గురువుకాడు. ౩౨ అధ్యాత్మనిరూపణము గావించునపుడు సామర్థ్యసిద్ధుల విషయమువచ్చినయెడల హృదయమున దురాశగలవాడును, బహువిధములగు చమత్కారస్థితిగతులలో జంచలహృదయుడై వర్తించువాడును, మత్సరకారణమున "పూర్వకాలమునందీశ్వరునితో సమానమగు సామర్థ్యము గలిగిన విరక్తులు, భక్తులు, జ్ఞానులు గతించిరి. వారిసామర్థ్యమెక్కడ! మనయీ వ్యర్థజ్ఞానమెక్కడ? మాయందుగూడ నట్టిసామర్థ్యమున్నచో బాగుండునుగదా" యని హృదయమున లోభప్రేరితుడై తలంచువాడును సద్గురుడుకాడు ౩౩-౩౪. ఎప్పుడు దురాశ పూర్తిగానశించిపోయినదో అపుడే యీశ్వరుడు లభించును. దురాశలకు లోనైయుండువారలు క్షుద్రులు, కాముకులు, శబ్దజ్ఞాతలు నైయున్నారు. అంతియగాని వారు సద్గురువులుకాబోరు.

సత్యమిద్దియే. ౩౬ దురాశయుఁ గామ్యవాంఛయుఁ బలువురుజ్ఞానులను మోసగించి నశింపఁజేసెను. పాపము కొందఱు మూర్ఖులు కామ్యములను గోరుచునే మరణించిరి. ౩౭ కామ్యవాంఛ హృదయమున రవ్వంతయేనియు లేనివాఁడును తనమతము నక్షయముగా నలౌకికముగాఁ బ్రతిష్ఠించినవాఁడును నగు సాధుమూర్తియైన సద్గురుఁ డెచటనో వేఱుగా నున్నాఁడు. ౩౮ ఆత్మరూపమగు ధనమన్ననో అందఱికిని నక్షయముగా నున్నది. (అందఱికడనున్న ఆత్మయు నక్షయమే) కాని శరీరముమీఁది మమత్వము వీడిపోవదు. ఈకారణముననే యీశ్వరమార్గము నందఱును మఱచిపోవుచున్నారు. ౩౯ సామర్థ్యము సిద్ధి ప్రాప్తమైనంతన దేహమహత్త్వ మధికమైనదని సామాన్యజనులు భావించుచున్నారు. ఈకారణముననే దేహబుద్ధియొక్క యభిమానము మఱింత యభివృద్ధి నొందుచున్నది. ౪౦ అక్షయసుఖముమాట తలపెట్టక వ్యర్థమగు సామర్థ్యము కొఱకుఁ బ్రాకులాడువాఁడు మూర్ఖుఁడు. ఏలయన? కామ్యవాంఛకు సమానమగు దుఃఖ మీప్రపంచమున వేఱొకటి లేదు. ౪౧ కామ్యములకు వశులై యున్న యీశ్వరభక్తిరహితులు నానావిధములగు యాతనల ననుభవించి కడకధోగతి నొందుదురు. ౪౨ శరీరము నశించుటతోడనే సామర్థ్యము గూడఁ దొలఁగిపోవును. మఱియు నంత్యకాలమునందు మనుజుఁడు కామ్యవాంఛలకతన నీశ్వరునిచే వంచితుఁడగును. ౪౩ కావున నిష్కాముఁడును దృఢబుద్ధిశాలియు నైనవాఁడే సద్గురుఁడు. అతఁడే తనశిష్యులను భవసాగరమునుండి దరిఁజేర్చును. ౪౪ మొదట విమలమగు విజ్ఞానము నిశ్చయాత్మికమగు సమాధానము స్వరూపస్థితియు యోగ్యముగానున్నవాఁడే సద్గురుఁడు. ఇవియే సద్గురుని ముఖ్యలక్షణములు ౪౫ ఇంతియగాక సద్గురునియందుఁ బ్రబలమగు వైరాగ్యము, ఉదాసవృత్తి (దేనికిఁదగులమి) యుఁ గూడ నుండవలయును. మఱియు నాతఁడు స్వధర్మాచరణమునందు విశేషించి శుద్ధుఁడుగఁ గూడ నుండవలయును. ౪౬ ఇంతయున్నమీఁదట నిరంతరము అధ్యాత్మశ్రవణము హరికథానిరూపణము, పరమార్థవివరణము చేయుచుండువాఁడే సద్గురుఁడు ౪౭ సారాసారవిచారము గావించిన సద్గురుఁడు శిష్యులనేగాదు జగత్తునుగూడ నుద్ధరింపఁగలఁడు. జనుల నుద్ధరించుటకు సద్గురునకు నవవిధభక్తులుగూడ నవసరము. ఏలయన! భక్తిసహాయ

మునఁ బ్రజలను లోఁబఱచికొన నవకాశము కలుగును. ౪౮ కావున నవవిధభక్తులను సాధనముగావించువాఁడే సత్యమగు సద్గురువని నేను చెప్పుచున్నాఁడను ౪౯ అంతఃకరణమునందు శుద్ధమగు బ్రహ్మజ్ఞానముండియు బాహ్యమునకుఁ బరమాత్మని నిష్ఠాపూర్వకముగా భజించువాఁడె సద్గురుఁడు. (లోపల జ్ఞానయోగముతో నుండి వెలుపల కర్మయోగమాచరించువాఁడు) అతనిమూలమున నీప్రపంచమంతయు నుద్ధరింపఁబడును. ౫౦ ఉపాసనాధారము లేనివానికడఁ బరమార్థ మొకదినముననే జారిపోవును. ఏలయన ! కర్మయోగము లేకున్నచో అనాచారము వ్యాపించును. అందువలన జనులు సులభముగ భ్రష్టులయ్యెదరు ౫౧ కావున జ్ఞానము, వైరాగ్యము, భజనము, స్వధర్మకర్మము, సాధనము, కథానిరూపణము, శ్రవణము, మననము, నీతి, న్యాయము, మర్యాద అను వానిలో నేదితక్కువయైనను అలక్షణత్వమే తెంచును. కావున నీగుణము లన్నియుఁ గలిగి శోభించువాఁడు సద్గురుఁడు. సద్గురుఁడగువానియం దీగుణములన్నియు విరాజిల్లుచుండును ౫౨-౫౩ సద్గురుఁ డనేకులను బరిపాలించును. ఆయనకు అనేకులనుగూర్చిన చింత హృదయమునం దుండును. సమర్థుఁడగు సద్గురుసన్నిధిలో బహువిధములగు సాధనల కవకాశము కలుగును ౫౪ కర్మయోగసాధనములు లేకయే పరమార్థమును బ్రతిష్ఠించుకొనఁ జూచువాఁడుమిగులఁ దొందరలో భ్రష్టుఁడగును. కావుననే మహానుభావులగు పురుషులు మొదటినుండియు విచారించి కర్మయోగ సాధనము చేయుచుందురు. ౫౫ ఆచారము ఉపాసనము విడిచివేసిన వారలు భ్రష్టులు. అంతియేగాదు. భక్తిహీనులుగూడ నగుదురు. ఇట్టివారల గురుత్వము నిష్ఫలము. వీరి నెవ్వ రడుగుదురు? ౫౬ కర్మము ఉపాసనము లేనికావున ఉద్రేకము నకుఁ దావేర్పడును. ఇట్టికళంకులగు గురువులను జూచినచో జ్ఞానులదనుకఁ బోనేల? సంసారులగు గృహస్థులు సైతము పకపకనవ్వెదరు. ౫౭

నీచజాతిగురువు నేర్పఱచుకొనుటగూడ గొప్పకళంకము. నీచజాతిగురుఁడు బ్రహ్మజ్ఞానులసభలలో దొంగవలె దాఁగి యుండును. ౫౮ బ్రహ్మసభయం దాతనిపాదతీర్థము నెవ్వరును బరిగ్రహింపరు. ఆతనిప్రసాదమును స్వీకరించినయెడలఁ బ్రాయశ్చిత్తముగూడఁ జేసికొనవలెను. ౫౯

తీర్థప్రసాదమును బరిత్యజించుటచే నీచత్వము ప్రకటనమగును. వెంటనే సాధకుల కాతనియెడల గురుభక్తిలోప మేర్పడును. ౬౦ ఒకవేళ నాతని వారుగురుమర్యాదనుంచినయెడల బ్రహ్మజ్ఞానిబృందము ప్రసన్నభావమును విడుచును. బ్రహ్మత్వరక్షణము గావింపయత్నించినయెడల గురుం డప్రసన్నుడగును. నీచుని గురునిగాం జేసికొనుటచే నిట్టితగవు లింకనెన్నియో తటస్థించును. ౬౧ ఈవిధముగా నుభయపక్షములనుండి సంకటములు వచ్చినయెడల సాధకునకుం బశ్చాత్తాపము కలుగును. అందుచే నీచజాతులకు గురుత్వమునొసంగరాదు. ౬౨ ఒకవేళ నెవనికేని నీచజాతిగురువు మీాఁద మనస్సు లగ్నమైనయెడల స్వయముగాం దానే భ్రష్టుండగుట మంచిది. తనతోంబాటుగా ననేకులను భ్రష్టులనుగావించుట మంచిది గాదు. ౬౩ ఇంక నిప్పు డీవిచారము నటులుంచుదము. ఇంతకును సాధనకు స్వజాతిగురుండు కావలయును. లేనియెడల భ్రష్టాచారము తప్పక వ్యాపించును. ౬౪

ప్రపంచమున నెన్నిసద్గుణములుగలవో యవియే సద్గురులక్షణములు. సద్గురుండన నెవరో సాధకులు సులభముగా గుర్తించుటకై కొందఱుగురువుల నిచ్చట వర్ణించెదను. ౬౫ ఒకండు సాధారణగురువు. ఒకండు మంత్రము నేర్పెడిగురువు, ఒకండు యంత్రముజూపు గురువు. వేఱొకండు తాంత్రికుండగు గురువు. ఒకనిని జనులందఱును గురువందురు. ఇంకనొకండు రాజగురువుగం గూడ నుండును. ౬౬ ఒకండు కులగురువు. ఒకండు మర్యాదగురువు. ఒకండు విద్యనేర్పినగురువు. అటులె కువిద్య నేర్పినవాండుగూడ గురువె. ఒకండు అసద్గురుండు. ఒకండు జాతిగురువు. ఈజాతిగురువు దండనకర్తగంగూడ నుండును. ౬౭ తల్లి యొకగురువు. తండ్రి యొకగురువు, రాజొకగురువు. దేవత యొకగురువు, ఒకనిని సమస్తకళల నెఱింగిన జగద్గురుం డందురు. ౬౮ ఈవిధముగాం బదునేడ్గురు గురువులను జెప్పితిని. వీరలుగాక యింకనెందఱో గురువులున్నారు. వారినిగూడం దెలుపుదును. ౬౯ ఒకండు స్వప్నగురుండు. (కలలోం గన్పించి ధర్మమార్గ మెఱింగించును.) కర్మదీక్షనొసంగువాం డొకగురువు. కొందఱు ప్రతిమనే గురువుగా భావింతురు. ఇంకంగొందఱు తమకుం దామే గురువులమని చెప్పుకొందురు. ౭౦ ఏజాతి కేయేవ్యాపారములు

గలవో వానివానికి గురువులు ప్రత్యేకించియున్నారు. ఈనిర్ణయము చాల గొప్పది. ౭౧

ఈవిధముగా నెందఱో గురువులున్నారు. ఇది నానావిధమతవిచారము. ఇందఱు గురువులలోం జేరక మోక్షదాతయగు సద్గురుండు వేఱుగానున్నాండు. ౭౨ సద్విద్యాసంబంధములగు సుగుణములు దయయు నిరంతరముగాంగల సుకృతాత్ముండే సత్యమగు గురువుగా నెఱుంగందగినవాడు. ౭౩

మూఁడవ సమాసము

శిష్యలక్షణము.

గత మాసమునందు సద్గురులక్షణములు విస్తరించి చెప్పితిని. ఇపుడు సచ్ఛిష్యుని లక్షణములను జెప్పంబోవుచున్నాండను. శ్రోతలు సావధానమతితో వినంగోరెదను. ౧ సద్గురుండు లేనిది సచ్ఛిష్యుని యుపయోగ మెద్దియును లేదు. అంతియగాక సచ్ఛిష్యుండు లేనిచో సద్గురుని పరిశ్రమమంతయును వ్యర్థమగును. ౨ సారవంతము నుత్తమము నగు భూమిని వెదకి యందుం జెఱికిపోయినవిత్తనములను నాంటినయెడలను లేక చవిటిపఱ్ఱయందు ఉత్తమబీజములు పెట్టినయెడలను నట్టిస్థితికలుగునో యట్టిస్థితి సచ్ఛిష్యున కసద్గురునియొద్దను అసచ్ఛిష్యునకు సద్గురునియొద్దను గలుగును. ౩ ఉదాహరణము చెప్పెదను. సచ్ఛిష్యుండు సత్పాత్రుండె. వాని కసద్గురువు ప్రాప్తమగుటచేం దంత్రములు మంత్రములు చెప్పును. అందుచే నాశిష్యునకు ఇహలోకముగాని పరలోకముగాని సిద్ధింపదు. లేదా- గురుండు పూర్ణముగాం గృపంజూపును, శిష్యుండు అనధికారి. ఈగురుశిష్యన్యాయము భాగ్యవంతుండగు పురుషునకు భిక్షుకుండు పుత్రుండున్నటుల నుండును. ౪౫ సారాంశమేమన- గురువు శిష్యులు యోగ్యులు కానేని కార్యము నడువంజాలదు. గురువు శిష్యులు సరిగా సమకూరనియెడలం బరమార్థము కుదురదు. ౬ సద్గురునకు సచ్ఛిష్యునకు సంబంధము కుదిరినతావున నేకం బరిశ్రమతోం బనియే లేదు. అనాయాసముగనే యుభయుల యుత్సాహముకు నెరవేరును. ౭ మంచిది. ఇవుడు ఉత్తమమైనభూమియు సారవంతమగు విత్తనములు లభించినవి. కాని

సకాలమున వర్షము కురియకున్న పైరతుకదు. ఇటులె సద్గురువు సచ్ఛి
ష్యుఁడు కూడినపిమ్మట సైతము అధ్యాత్మనిరూపణము లేనిచోఁ
గార్యము నెరవేరదు. ౮ ఇప్పుడు పొలమునందు విత్తనము వేయఁబడినది.
బాగుగా మొలచినది- కావలిలేనిచోఁ బైరునకు హానికలుగును. ఈస్థి
తియే సాధనము లేని సాధకులకుఁ గలుగును. ౯ సారాంశమేమన- ఎంత
దనుకఁ బంట మనయింటికి చేరదో యంతదనుకఁ జేయవలసినదెల్లఁ జేయక
తప్పదు. వేయేల! ఆపంట వచ్చినపిమ్మటఁగూడ నూరక కూర్చుండ
రాదు. ౧౦ అటులే ఆత్మజ్ఞానము కలిగినపిమ్మటసైతము సాధనము జే
యుచునే యుండవలెయును. ఒక్కసారి మిక్కుటముగా భుజించినను
అనంతరమునందుసైతము భోజనసామగ్రితో నవసరము కలుగునటులఁ
బూర్ణముగా ఆత్మజ్ఞానము కలిగినతరువాతఁగూడ సాధనము ముందు
నడిచి పని నిచ్చుచునేయుండును. ౧౧ కావున సాధనము, అభ్యాసము,
సద్గురుఁడు, సచ్ఛిష్యుఁడు, సచ్ఛాస్త్రవిచారము, సత్కర్మము, సద్వాసన,
సదుపాసన, సదాచరణము, స్వధర్మనిష్ఠ, సత్సంగము, సత్యనియమము
మున్నగునవియన్నియు నొకచో నేకత్రితమైనపుడే విమలమగు విజ్ఞానము
ప్రకాశించును. అటులఁగాకున్నచో జనసముదాయమునందు పాషండ
త్వము విజృంభించును. ౧౨-౧౪ కాని యిందు శిష్యునిదోషమెద్దియును
లేదు. తాళపుఁజెవియంతయు సద్గురునికడ నున్నది. సద్గురుఁడు నానావిధ
ములగు ప్రయత్నము లొనరించి శిష్యునియెడఁగల సమస్తదుర్గుణములను
దూరముచేయును. ౧౫ సద్గురునిమూలమున శిష్యుఁడు సచ్ఛిష్యుఁడ
గును. సచ్ఛిష్యునివలన నసద్గురు వెన్నటికిని సద్గురువు కాఁజాలఁడు. ఏల
యన! సచ్ఛిష్యునివలన అసద్గురునిగొప్పతనము పోవును. శిష్యునిసంబంధ
ముచే గురుఁడు సద్గురువయ్యెనేని గురునకు గురుత్వ మెక్కడనుండివ
చ్చును. ౧౬ కావున సద్గురుఁడు లభించినయెడలనే సన్మార్గము లభించును.
లేనియెడల శిష్యుఁడు నాస్తికత్వమువలన సర్వనాశన మగును. ౧౭ భవ
సాగరమునుండి దరికిఁ జేర్చుటలో బూర్ణబాధ్యుఁడు గురుఁడె యైనను
నేనిచ్చటఁ గొన్ని సచ్ఛిష్యలక్షణములను దెలుపుదును. ౧౮

సద్గురునివాక్యములయందుఁ బూర్ణవిశ్వాసముంచి యనన్య భావ
ముతో నాతనిశరణమునందుండుట సచ్ఛిష్యుని ముఖ్యధర్మము. ౧౯

శిష్యుఁడు, పవిత్రాంతరంగుఁడు, సదాచారసంపన్నుఁడు, విరక్తాత్ముఁడు,
మోక్షాసక్తుఁడు గావలయును. ౨౦ శిష్యుఁడు నిష్ఠావంతుఁడును, శుచి
మంతుఁడును, సర్వవిధముల నియమవంతుఁడును, ౨౧ విశేష ప్రయత్న
శీలుఁడును, పరమదక్షుఁడును నలక్ష్యపదార్థమునలక్ష్యముంచెడివాఁడును
౨౨ అతిధైర్యశాలియు, అత్యుదారుఁడును, బరమార్థతత్పరుఁడును,
౨౩ పరోపకారియు, నిర్మత్సరుఁడును, నర్థము నవగాహనము గావించు
కొనువాఁడునుగా నుండవలయును. ౨౪ అంతియెగాక పరమశుద్ధాత్ముఁ
డుగను బరమసావధానుఁడుగను అంతులేని రీతిగ నుత్తమగుణములుగల
వాఁడుగను, ౨౫ ప్రజ్ఞావంతుఁడుగను, ప్రేమస్వభావుఁడుగను, మర్యా
దావంతుఁడుగను, నీతిమంతుఁడుగను ౨౬ యుక్తిమంతుఁడుగను, బుద్ధి
మంతుఁడుగను, నిత్యానిత్యములను (సత్ అసత్) విచారించువాఁడుగను,
౨౭ ధైర్యశాలిగను, దృఢవ్రతుఁడుగను, కులవంతుఁడుగను, పుణ్యాత్ముఁ
డుగను, ౨౮ సాత్వికుఁడుగను, భజనచేయువాఁడుగను, సాధనకర్తగను
నుండవలయును. ౨౯ మఱియు శిష్యుఁడు విశ్వాసవంతుఁడుగను, దేహక్లే
శము సహించునంతటి సహనశీలుఁడుగను, బరమార్థము నున్నతికిఁ దేఁద
గినవాఁడుగను, సమస్తధర్మముల నెఱింగినవాఁడుగను ౩౦ అన్నివిధము
లను సత్పాత్రుఁడుగను స్వతంత్రుఁడుగను, సర్వజనప్రియుఁడుగను ౩౧
సద్విద్యావంతుఁడుగను, సద్భావవంతుఁడుగను, శుద్ధాంతఃకరణుఁడుగను
నుండవలయును. ౩౨ శిష్యుఁ డవివేకి కాఁగూడదు. పుట్టుక మొదలు
సుఖము లనుభవించినవాఁడుగ నుండఁదగదు. మఱియు నాతఁడు సంసార
దుఃఖముచే సంతప్తదేహుఁడైనవాఁడుగ నుండవలయును. ౩౩ ఏలయన!
సంసారదుఃఖములచేఁ బరితప్తుఁడై త్రివిధతాపములతోఁ గృశించినవాఁడె
సర్వవిధములఁ బరమార్థమును బొందుటకుఁ దగిన యధికారియై యు
న్నాఁడు * ౩౪ సంసారదుఃఖములవలననే మానవునకు వైరాగ్య ముద

---

* మనుజుఁడు సంసారదుఃఖములలో మునిఁగి తాపత్రయముతోఁ దప్తుఁడై
నప్పుడు "ఈసంసారములోనున్న వఱకీయవస్థ తొలఁగదు. కావునఁ గష్టమయమగు
నీసంసారము తొలఁగిపోవు విధమేదేనికలదా యని విచారింపవలయును." అని యీ
విధముగ జిజ్ఞాస యధికమగును. ఇదియే పరమార్థమున కధికారము గలుగుట. ఈయం
శము నిఁకముందు వివరించెదము.

యించుచున్నది. విశేషించి దుఃఖము లనుభవించినవాని హృదయము నందే పరమార్థము దృఢముగాఁ బాదుకొనును. ౩౫ సంసారమునందు దుఃఖముల ననుభవించినవానికిఁ బరమార్థమునందు విశ్వాసము గలుగును. మఱియు వాఁడు విశ్వాసబలముతో దృఢహృదయుఁడై సద్గురునిశరణమును గైకొనును. ౩౬ అవిశ్వాసముతో సద్గురునిశరణమును విడనాడు వారు ఈసంసారసాగరమునఁ బడి మునిఁగిపోయిరి. వారిని సుఖదుఃఖరూపములగు జలచరములు మధ్యనే నమలి మ్రింగివేసెను. ౩౭ కావున సద్గురునివచనములపై దృఢమగు విశ్వాసభావముగలవాఁడు సచ్ఛిష్యుఁడు. వాఁడే యందఱికంటె ముందుగా మోక్షమును బడయుట కధికారి. ౩౮ సద్గురునివచనముల నాలించి సంతుష్టుఁడగు మానవుడు సాయుజ్యముక్తి నొందును. అతఁడు సంసారదుఃఖమువలన నెన్నఁడును బరితపింపఁడు. ౩౯ సద్గురుని (నిర్గుణపరబ్రహ్మము) కంటె దేవతను (సగుణహరిహరాదిదేవతలను) ఎక్కుడుగా భావించువాఁడు అభాగ్యుఁడు. వాఁడు వైభవములకు సామర్థ్యములకు మురిసి శాశ్వతసుఖమునుండి (సత్య వైభవమునుండి) వంచితుఁ డగుచున్నాఁడు ౪౦ సద్గురుఁడు సత్స్వరూపుఁడు (నిత్యుఁడు) హరిహరాదిదేవతలో కల్పాంతమునందు నాశనమైపోయెడి వారు. మోసమునకు లోనై గురునికంటె గొప్పవారని తలంచిన యాదేవతలసామర్థ్య మిఁకనెచట నుండఁగలదు? ౪౧ కావున సద్గురునిసామర్థ్యమునకు మేరయే లేదు. అతనిముందు బ్రహ్మవిష్ణుమహేశ్వరాదు లొక లెక్కలోనివారు కారు. కాని అల్పబుద్ధులగు మానవుల కీరహస్యము తెలియదు ౪౨ సద్గురుమూర్తిని సామాన్యగురువులతోడను దేవతలతోడను సమానుఁడుగాఁ దలంచుశిష్యుఁడు దురాచారి. వానియంతఃకరణమునందు భ్రాంతి స్థిరముగా నెలకొనియున్నది. వానికి సిద్ధాంతములు తెలియవనవచ్చును. ౪౩ మనుష్యులమూలముననే శిలలకు దేవతాభావన కలిగినది. మంత్రములవలన నాశిలలకు దేవత్వ మేర్పడినది. సద్గురునియందటుల మహత్త్వ మొకరు కల్పింపలేదు. ఈశ్వరుఁడు సైతము కల్పింపఁజాలఁడు ౪౪ కావున సద్గురుఁడు ప్రభావమునందును, పూర్ణరూపమునందును, దేవతలకంటెఁ గోటిరెట్లు గొప్పవాఁడు.

సద్గురుని వర్ణించుటలో వేదశాస్త్రములలోఁ గూడ వివాదము చెలఁగినది. ౪౫ సద్గురుపదముముందు నితరు లెవ్వరికిని మహత్త్వము లభింపఁజాలదు. గురునిముందు దేవతాసామర్థ్య మొక లెక్కలోనిది కాదు. అది మాయాజనితము. ౪౬ సద్గురుని యనుగ్రహము బడసిన శిష్యునియొద్ద దేవతల సామర్థ్య మించుకేనియు లెక్కలోనికి రాదు. సద్గురుఁడు తనజ్ఞానబలముచే నెంతటి వైభవమునేని గడ్డిపరకతో సమానముగా భావించును. ౪౭ సద్గురుని యనుగ్రహాతిశయమున అపరోక్షజ్ఞానము కలుగును. అనంతరము మాయాసహితమగు నీబ్రహ్మాండము తుచ్ఛముగాఁ గనిపించును. ౪౮ సద్గురుని వచనములయందు దృఢభావ ముంచుటచే సచ్ఛిష్యుఁడు స్వయముగా దేవాధిదేవుఁ (సద్గురుఁ) డగుచున్నాఁడు. ౪౯ సచ్ఛిష్యుల యంతఃకరణము మొట్టమొదట సంసారదుఃఖమువలని పశ్చాత్తాపముచే దప్తమై శుద్ధియయ్యెను. కాన వారిఁక సద్గురుని యుపదేశామృతమును దనివారఁ గ్రోలి అక్షయశాంతిని నొందఁగల్గుదురు. ౫౦ సద్గురుఁడు చూపినమార్గము ననుసరించి నడుచునపుడు సమస్తబ్రహ్మాండము విరుద్ధమైనను శిష్యునకు గురుభక్తియందే మాత్రము వ్యతిరేకము కాఁజాలదు. ౫౧ సచ్ఛిష్యుఁడు సద్గురుని శరణ్యము నెప్పుడును విడువఁజాలఁడు. మఱియు సదాచరణుఁడై యీశ్వరదృష్టిలోఁ బవిత్రుఁడుగ నుండును. ౫౨

పయినిజెప్పఁబడిన సద్గురువిషయికసద్భావము హృదయమునందుఁ గలవారలే ముక్తికి భాగస్వాములు. ఇతరమాయావేషధారులగు వంచకులను అసచ్ఛిష్యులుగా భావింపవలయును. ౫౩ విషయములయందు సౌఖ్యమున్నటులఁ దలంచువారును బరమార్థము కేవలము లోకాచారమున కేయని తలంచువారును నగుశిష్యులు చదివినమూర్ఖులు. అట్టివారు క్రమముగా నొకరినిజూచి యొకరుగా సద్గురునిశరణమున కేగుదురు. ౫౪ విషయేచ్ఛలు తొందరించుట కారంభింపఁగనే వానిధాటికి నిలువఁజాలక దుర్బలహృదయులగు శిష్యులు గృహస్థాశ్రమములోనికిఁ బరతెంతురు. అంతటితో వారలుగడించిన పరమార్థఫలము మలినమై పోవును. ౫౫ అంతతో నాగక పరమార్థమును వ్యాజముగాఁగొని ప్రపంచమునందుఁ బ్రేమయుంతురు. కుటుంబభారమును మోయఁజాలక కడకు సర్వవిధముల నాశనమైపోయెదరు. ౫౬ వారు ప్రపంచమునందు ఆనందమున్నటుల

మనసారనమ్మి పైకిమాత్రము పరమార్థకౌతూహలమును జూపుచుందురు. అంతియగాక భ్రాంతులు, మూఢులు, మందమతులునై బహువిధకామ్య వాంఛలతో లుబ్ధులగుదురు. ౫౭ పందిని సుగంధలేపనముతోఁ బూజించినను గేదెకు జందనము పూసినను వ్యర్థమగునటుల విషయవాంఛాశీలురగు పురుషులకు బ్రహ్మజ్ఞానముగాని వివేకమునుగాని బోధించుట వ్యర్థప్రయత్నము. ౫౮ బూడిదలోఁ బొరలాడు గాడిదకుఁ బరిమళసుగంధద్రవ్యముల విలువయుఁ జీఁకటిలోఁ బరుగులువారు గ్రుడ్లగూబకు హంసతో సమానగౌరవము నెట్టివో విషయసుఖములకై పలవించు వారలకు భగవద్భక్తియు సత్సాంగత్యమును నట్టివి. ఇట్టివారలు తప్పక అధోగతినే పొందుదురు. ౫౯.౬౦ కుక్క యెముకచిక్కినంతన పండ్లుబయటికిఁదీసి కొఱుకుచుండునట్లు విషయలోలుఁడగు పురుషుఁడు విషయభోగములలో మగ్నుఁడై యుండును. ౬౧ అటులనెముకలు కొఱుకుచున్న కుక్కకు నుత్తమభోజనము పెట్టినను గోతిని సుందరమగు సింహాసనముమీఁద నెక్కించినను ఏస్థితి కలుగునో యాస్థితియే విషయాసక్తుఁడగు పురుషునకు జ్ఞానోపదేశము గావించుటచేఁ దటస్థించును ౬౨ గాడిదలను బెంచిపెంచి జీవితకాలమంతయు గడుపుకొన్న చాఁకివాఁడుఁ బండితబృందమునఁ జేరుట కసర్హుఁడైనటుల విషయవాంఛల నభివృద్ధి యొనరించుకొనిన పురుషుఁడు పరమార్థమును స్మరించుటకేని తగఁడు ౬౩ బొల్లిగ్రద్ద రాజహంసములమధ్య చేరి నేను రాజహంసమును రాజహంసముననని చెప్పుకొనుచున్నను దాని ధ్యానమంతయు నపరిశుభ్రవదార్థములమీఁదనే యుండును. అటులే విషయాసక్తపురుషుఁడు సజ్జనులమధ్యనుండి తాను సజ్జనుఁడనని పిలిపించుకొనుచున్నను అతఁడు తనహృదయమునుమాత్రము విషయరూపమగు మలినముమీఁద నుంచును ౬౪. ౬౫ ఎవఁడేని తనచంకలో స్త్రీనుంచుకొని మహాత్ములవద్దకేగి నన్నుసన్న్యాసినిగాఁ జేయుఁడని పలుకుట యెటులుండునో విషయములలోఁ జిక్కియున్నపురుషుఁడు జ్ఞానవాక్యములను వల్లించుట యట్లుండును ౬౬ ఇట్టి తెలిసినమూర్ఖులు అద్వైతసుఖమును (బ్రహ్మానందమును) ఏమి యెఱుంగఁగలరు? వీరలు బాగుగా నెఱింగియు నరకమునఁ బడుచున్నారు ౬౭ వేశ్యాసేవగావించువాఁడుపదేశమునకుఁ [illegible]యటుల విషయా[illegible]కుఁడగుపురుషుఁడుభక్తశ్రేష్ఠుఁడనియనిపించుకొన

జాలఁడు ౬౮ కావున విషయలోలురగు పురుషులకు జ్ఞానముకలుగదు. వారు వాచాటులై కేవల ముపన్యాసములకె యలవాటు పడియుందురు. ౬౯ ఇట్టి శిష్యులను నష్టాత్ములుగను మిగులనీచులుగను హీనులుగను అవివేకులుగను దుష్టులుగను దుర్మార్గులుగను దలంపవలయును ౭౦ పాపపూర్ణులును మహాపరాధులును అత్యంతకఠినహృదయులును నగునిట్టి శిష్యులు పశ్చాత్తాపతప్తులగుటకు మంచిప్రాయశ్చిత్తముగలదు ౭౧ అదియేదన-వీరలు మరల సద్గురునిశరణమున కరుగవలయును. అతనిని బ్రసన్నాత్మునిగా నొనరించుకొనవలయును. వాని యనుగ్రహమును సంపాదించి పరిశుద్ధాత్ములు కావలయును ౭౨ ఏలయన! స్వామిద్రోహియగువాఁడు సూర్యచంద్రులున్నంతవఱకు నరకమునఁబడును. స్వామిని బ్రసన్నాత్ముఁ గావించుకొనకున్నచో వాఁడు కడతేరుట కవకాశములేదు. ౭౩ * శ్మశానవైరాగ్యము నవలంబించి సద్గురుని పాదములపయి బడినంతమాత్రమున జ్ఞానము స్థిరముగా బొదుకొనఁజాలదు. ౭౪ మనస్సులోఁ గల్పిత గురుభావములను దెచ్చిపెట్టుకొని కొందఱుశిష్యులు గురునికడ మంత్రముగ్రహించి యామంత్రకారణమున మూన్నాళ్లపట్టవగలు శిష్యులుగ నుందురు ౭౫ ఇటులె పలువురు గురువులనుజేసికొని యేవియో పాషండపదములు నేర్చుకొని నోటిగద్దరితనము సిగ్గులేమితనముగల పాషండులై చెడిపోవుచున్నారు ౭౬ ఈయవివేకులు తమప్రమాదము నెఱింగి యొకప్పుడేడ్తురు. ఒకప్పుడు పడిపోవుదురు. కొంచెము సేపు వైరాగ్యమూర్తులగుదురు. మఱికొంచెముసేపు నేనే జ్ఞానినని గర్వింతురు ౭౭ ఒక గడియకాలము హృదయమునందు విశ్వాసము దెచ్చుకొందురు. రెండవ గడియయందే తిరుగఁ బడుదురు. ఈవిధముగాఁ బిచ్చివానివలె అవివేకులగు శిష్యులు నానావేషములు వేయుదురు. ౭౮ కామము, క్రోధము, మదము, మత్సరము, లోభము, మోహము, అభిమానము, కపటము, తిరస్కారము లోనగు ననేకవికారములు వారలహృదయములలో వ్యాపించియుండును.

---

* శ్మశానమునందు జరుగు శవదహనము గాంచినంతన క్షణికవైరాగ్య మందఱను గలుగును. ఈవైరాగ్యము ఇల్లుచేరఁగనే నశించును. ఈవైరాగ్యమును శ్మశానవైరాగ్యమందురు.

౭౯ అహంకారము శరీరసంబంధమగు ప్రేమ, అనాచారము, విషయసాంగత్యము, సంసారప్రపంచవిషయికమగు నుద్వేగము లోనగునవి హృదయములందు వారలకు నిరంతరము కాపురముండును. ౮౦ దీర్ఘసూత్రి, కృతఘ్నుఁడు, పాపి, దుష్కర్ముఁడు, కుతర్కి, వికల్పాత్ముఁడు, భక్తిహీనుఁడు, భావశూన్యుఁడు, శీఘ్రకోపి, నిష్ఠురహృదయుఁడు, పరఘాతకుఁడు, శూన్యహృదయుఁడు, దయారహితుఁడగు సోమరి, అవివేకి, విశ్వాసశూన్యుఁడు, అధీరుఁడు, అవిచారి, సందేహాత్ముఁడు నైనయట్టి శిష్యుఁడు నానావస్థలపాలగును. మఱియు ఆశ, మమకారము, తృష్ణ, కల్పనము, కుబుద్ధి, దుర్వృత్తి, దుర్వాసన, బుద్ధిహీనత, విషయవాంఛ, మున్నగుదుర్గుణములాతనిహృదయమునందు వాసముచేయుచుండును. ౮౧ - ౮౩ ఇచ్ఛామోహాతిరస్కారములకు వశుఁడై యితరుల నిందచేయుటలో నుత్సాహియై యాతఁడు విఱ్ఱవీఁగును. మఱియుఁ జక్కఁగనెఱింగియు దేహాభిమానమునఁబడి యున్మత్తుఁడగును. ౮౪ ఆతఁడాఁకలిదప్పికల నాపఁజాలఁడు. నిద్దురకుఁ గొంచెమేని సైరింపలేఁడు. కుటుంబచింత యెప్పుడును విడువనే విడువఁడు. భ్రాంతియందు మునిఁగియుండును. ౮౫ కేవలవాగాడంబరముతోడనే యేవియో గొప్పగొప్ప యుపన్యాసములు గావించును. కొంచెమేనినిలుకడగనుండఁడు. పశ్చాత్తాపము, ధైర్యము, సాధనము మున్నగువాని మార్గముల ననుసరింపఁడు. ౮౬ భక్తి, విరక్తి, శాంతము వానికడఁ గొంచెమేని యుండదు. సద్వృత్తి, లీనత, దమనములు లేవు. కృప, దయ, తృప్తి, సుబుద్ధి బొత్తిగ లేవు. ౮౭ కాయమును గ్లేశములపాలు గావింపలేఁడు. ధర్మవిషయమునందుఁ బరమకృపణుఁడు. సదాచరణమును గ్రహింపఁడు. మఱియుఁ గఠోరహృదయుఁడు. ౮౮ సాంసారికజనులతో నాతఁడు సరళముగా మెలంగఁడు. సజ్జనులను విద్వేషించును. రాత్రింబవళ్ళు ఇతరుల హీనస్థితి, కానందించును. ౮౯ నిరంతరము అనృతములాడుచుండును. మాయమాటలుచెప్పి యితరులను గష్టములపాలుచేయును. క్రియావిచారాదులలో దేనియందును సత్యమును బాటింపఁడు. ౯౦ అవగుణుఁడగు నిట్టినీచుఁడు ఇతరులను దత్పరబుద్ధితోఁ బీడించుచుండును. తేలు కుట్టియుఁ బాము కఱచియు బాధకలుగఁజేయునటుల నతఁడు అందఱియంతఃకరణములను

కఠినభాషణములచే నొప్పించును. ౯౧ తనదుర్గుణములను మఱుగుపఱచుచుఁ బరులతోఁ గఠినవాక్యములాడుచు గుణదోషరహితులయెడ లేనిదోషము లారోపించుచుఁ ౯౨ బాపుఁడుగను నిర్దయుఁడుగను వర్తించును. మఱియు దురాచారియు హింసకుఁడునై యితరులు దుఃఖించుటఁ జాలిగొనఁడు. ౯౩ దుర్జనులు ఇతరులదుఃఖమునకు విచారపడరు. మీఁదు మిక్కిలి దుఃఖము నొందువారిని మఱియు దుఃఖింపఁ జేయుదురు. వారు దుఃఖించుటఁగాంచి తామానందింతురు. ౯౪ తనకు దుఃఖము కలిగినపుడు మాత్రము దుఃఖించుచుఁ బరులకు దుఃఖము కలిగినపు డానందించు వానికి యమపురము తప్పకసిద్ధించును. అట్టినీచుని యమకింకరులు నిర్దయగాఁ గొట్టుదురు. ౯౫

పూర్వపాపము వలన సద్బుద్ధి మందునకేని లేనియిట్టి మదాంధులకు భగవంతుఁ డెటుల లభించును? ౯౬ ఇట్టిదుష్టునకు వార్ధకమున అవయవములు శిథిలములై పడిపోయినపుడును గుటుంబములోనివారలు విడిచివేసినపుడును గొంచెము జ్ఞానము కలుగును. ౯౭ పయినిజెప్పిన దుర్గుణములు లేనివారు శ్రేష్ఠులగు సచ్ఛిష్యులు. వారలు తమదృఢభక్తివలన స్వానందసౌఖ్య మనుభవింతురు. ౯౮ వికల్పులును కులాభిమానులునగు జనులు ప్రపంచకారణమున దుఃఖములపాలగుదురు. దుఃఖము దేనివలనఁగలిగినదో దానినే మరల నాశ్రయించినచో దుఃఖము కలిగితీరును. ౧౦౦ సంసారసాంగత్యము వలన సౌఖ్య మెవ్వరికిని గలుగఁజాలదని యెఱింగియుండియుఁ దమకుసత్యహితము గావించుకొననివా రంత్యమున దుఃఖములపాలగుదురు. ౧౦౧ సంసారమునందు సౌఖ్యమున్నటులఁ దలంచుప్రాణులు మూఢులు. ఇట్టిచదివినమూర్ఖులు సర్వమునెఱింగియుండియు గ్రుడ్డివార లగుచున్నారు. ౧౦౨ గృహస్థాశ్రమమును సుఖముగా జరుపుకొనవచ్చును. పరమార్థమునుగూడ దానితోఁబాటు కొంచెము వృద్ధిఁజేయవలయును. పరమార్థమును పూర్తిగా మానివేయుట యుక్తముగాదు. ౧౦౩ ఈవిధముగా గురుశిష్యుల లక్షణముండునని చెప్పితిని. ఇఁకముందు మంత్రలక్షణము దెలుపుదును. శ్రోతలు శ్రద్ధతో వినఁగోరెద. ౧౦౪.

నాలుగవ సమాసము.

మంత్రలక్షణము.

మంత్రముల కనేకలక్షణములు గలవు. వానినిట సంగ్రహముగాఁ దెలుపుచున్నాఁడను. వినుఁడు. ౧ కొందఱుగురువు లేదేని మంత్రదీక్ష నొసంగుదురు. కొందఱేదేని దేవతనామమును మాత్రమే చెప్పెదరు. కొందఱోంకారమును జపింపఁజేయుదురు. ౨ కొందఱు శివుఁడు, దేవి, విష్ణువు, మహాలక్ష్మి, అవధూత, గణేశ్వరుఁడు, సూర్యుఁడు. 3 మత్స్య కూర్మవరాహావతారములు, నరసింహమూర్తి, పరశురాముఁడు, రఘునాథుఁడు, శ్రీకృష్ణుఁడు మున్నగు దేవతలనుగూర్చిన మంత్రములు జపింప నుపదేశించెదరు. ౪ భైరవుఁడు, మల్లారి, ఆంజనేయుఁడు, యక్షిణి నారాయణుఁడు, పాండురంగస్వామి, అఘోరమూర్తి, ౫ శేషుఁడు, గరుత్మంతుఁడు, వాయువు, బేతాళుఁడు, ఝోటింగస్వామి మున్నగు దైవత మంత్రములు పెక్కులుగలవు. ఎంతదనుకఁ జెప్పఁగలను. ౬ బాల, బగళ, కాళి, కంకాళి, వటుకమూర్తి మున్నగు ననేకశక్తులకు లెక్కలేనన్ని మంత్రము లున్నవి. ౭ ఇటులె భిన్నభిన్న దేవత లెన్నిగలవో యన్ని మంత్రములున్నవి. కొన్ని స్వాభావికములుగా నుండును. మఱికొన్ని యడ్డదిడ్డములుగా నుండును. కొన్ని ఖేచరాది దారుణబీజములుగల్గి యుండును ౮ ప్రపంచమునం దెన్నియో దేవతలుగలవు. వానినన్నిఁటిని లెక్కింప నెవ్వనికిని దరముగాదు. వానికన్నింటికినిగల మంత్రము లసంఖ్యాకములుగా నున్నవి. అవియిన్నియని వివరించుటకు నాకెగాదు వాణీదేవికిఁగూడ నశక్యము ౯ మంత్రమాల లనంతములుగా నున్నవి. ఒకదానికంటె వేఱొకటి మించియున్నది. ఇదియంతయు మాయయొక్క విచిత్రతరమగుకళ. దీని నెవ్వఁ డెఱుంగజాలును? ౧౦ కొన్నిమంత్రములతో భూతములు దిగిపోవును. కొన్నింటితో వెత లంతరించును. కొన్నింటితో విషమజ్వరములు సర్పవృశ్చికాది విషజంతుబాధలు తొలంగిపోవును ౧౧ ఇట్టి నానావిధమంత్రములను జెవిలో నుపదేశింతురు. మఱియు జపము, ధ్యానము, పూజ, యంత్రాదులు విధానపూర్వకముగా వివరింతురు ౧౨ కొందరు శివశివయనియుఁ, గొందఱు హరిహరియనియు, కొందఱువిష్ణు, విష్ణుఅనియుఁ, గొందఱు విఠ్ఠలవిఠ్ఠలయనియు నుపదేశింతురు ౧౩

ఒకఁడు కృష్ణకృష్ణయనియు, నింకొకఁడు నారాయణ, నారాయణయనియు నుపదేశించును ౧౪ కొందఱు అచ్యుత, అచ్యుతయనియుఁ గొందఱు అనంతఅనంతయనియుఁ గొందఱు దత్తదత్తయనియు ౧౫ కొందఱు రామరామయనియుఁ గొందఱు ఓంఓంఅనియు శ్రీమహావిష్ణుని యనేకనామములను ఉపదేశింతురు ౧౬ కొందఱు కేవలము గురుని గొందఱు పరమేశ్వరుని కొందఱు విఘ్నేశ్వరుని ౧౭ కొందఱు శ్యామరాజును ఇటులేకొందఱు శ్యామరాజును గరుడధ్వజుని అధోక్షజుని ౧౮ దేవదేవుని కేశవుని భార్గవుని ౧౯ విశ్వనాథుని, మల్లారిని, [1] తుకాయిని జపింపుమని తమ్మాశ్రయించినవారికిఁ దెలుపుచుందురు. ౨౦ ఎంతవఱకని తెలుపుదును? శివునకును శక్తికిని అనంతనామములు గలవు. ఈనామములనే గురువులందఱును దమశిష్యులకుఁ దమయిష్టానుసారముగ నుపదేశించుచుందురు ౨౧ ఒకఁడు ఖేచరి. భూచరి చాచరి, అగోచరియను [2]నాలుగు ముద్రలను జూపును. ఒకఁడు నానావిధములగు ఆసనములను దెలుపును ౨౨ కొందఱు చమత్కారములగు దృశ్యములను జూపింతురు. కొందఱ [3] అనాహతధ్వనినిగూర్చి తెలుపుదురు. పిండజ్ఞానులగు గురువులు (శరీరరచనాజ్ఞానము) పిండజ్ఞానము గఱపింతురు. ౨౩ కొందఱు కర్మమార్గమును గొందఱుపాసనామార్గమును గొంద[4]

---

1 తుకాయి. తులజాపురమునందుండు దేవి.

2 ముద్రలు. విషయములనుండి దృష్టిని తొలంగించి విశేషపదార్థముమీఁద విశిష్ట ప్రకారముతో దృష్టిని లగ్నపఱచుట.

3 అనాహతధ్వని-దేహమునందు నిరంతరము జరుగుచుండు ధ్వనులు. ఇవి పది తెఱంగులనున్నవి. వెలుపలనుండి సాధారణముగా వినిపించుధ్వనులు ఆహతమువలన (కొట్టుటవలన) కలుగుచుండును. శరీరములో జనించుధ్వనులస్థితి యట్టిదిగాదు. అందువలననే దానికి అనాహతమను పేరువచ్చినది.

4 అష్టాంగయోగము. యమనియమాసన ప్రాణాయామప్రత్యాహారధారణధ్యాన సమాధులను నెనిమిది యోగమున కంగములు. ఈయెనిమిది యంగములను సాధించిన పిమ్మట యోగము సిద్ధించును. యోగమనఁ జిత్తవృత్తినిరోధము.

అష్టాంగయోగమును [5]సప్తచక్రములను జెప్పుదురు. ౨౪ కొందఱు బహువిధములగు తపస్సులను, [6]అజపమంత్రములను నుపదేశింతురు. తత్త్వజ్ఞానులగు వార లవి యన్నియు నేలయని తత్త్వజ్ఞానము నుపదేశింతురు. ౨౫ కొందఱు సగుణమును, మఱికొందఱు నిర్గుణమును, దీర్థాటనమును నుపదేశింతురు. ౨౬ కొందఱు [7]మహావాక్యములను వివరించి వానిని జపించుచుండుమని యాజ్ఞాపింతురు. కొందఱు "సర్వంఖల్విదంబ్రహ్మ" యనుమంత్రమును నుపదేశింతురు. ౨౭ కొందఱు శక్తిమార్గమును జూపుదురు. మఱికొందఱు ముక్తిమార్గమును బ్రతిష్ఠింతురు. కొందఱు భక్తిపూర్వకముగా నింద్రియపూజ జేయింతురు. ౨౮ కొందఱు వశీకరణము, స్తంభనము, మోహనము, ఉచ్చాటనము, లనుకూర్చిన మంత్రములను, మఱికొందఱు నానావిధప్రయోగ మంత్రములను నుపదేశింతురు. ౨౯ ఇది మంత్రములస్థితి. ఇఁక దీని ప్రశంస చాలించెదను. చాలింపక యెంతదనుకవని చెప్పుదును. ఈవిధముగా మంత్రములు లెక్కపెట్టరానియన్ని యున్నవి. ౩౦ మంత్రములు పెక్కులున్నంత నేమి ఫలము? వానిజ్ఞానము లేకున్నచో నిష్ఫలములును, నిరర్థకములు నగును. ఈవిషయమునందు శ్రీకృష్ణభగవానుఁ డిటులఁ జెప్పియున్నాఁడు. ౩౧

శ్లో॥ నానాశాస్త్రం పఠేల్లోకో నానాదైవతపూజనం।
ఆత్మజ్ఞానం వినాపార్థ సర్వకర్మ నిరర్థకమ్॥
శైవశాస్త్రాగమాధ్యాయే అన్యేచ బహవోమతాః।
అపభ్రంశసమాస్తేఽపి జీవానాం భ్రాంతచేతసామ్॥
నహిజ్ఞానేనసదృశం పవిత్ర మిదముత్తమమ్॥

---

5 శరీరమునందు గుదద్వారము మొదలుకొని బ్రహ్మరంధ్రమువరకును గల యేడుస్థానములలో ఏడు చక్రములున్నవి.

6 ప్రాణియొక్క ఉచ్ఛ్వాసనిశ్వాసములవెంట 'సోహం' అను ధ్వని నిరంతరము కలుగుచుండును. దానిని అజపాగాయత్రియని చెప్పుదురు. ౧౭ దశకము ౫ వ సమాసము చూడుము.

7 "ప్రజ్ఞానంబ్రహ్మ, అహంబ్రహ్మాస్మి, తత్త్వమసి అయమాత్మాబ్రహ్మ" అను నీనాలుగు మహావాక్యములు వరుసగా ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణవేదముల లోనివి.

జ్ఞానముతో సమానమైన పవిత్రవస్తు వింకొకటిలేదు. అదిమిగుల నుత్తమమైనది. అందుచే మానవుఁడు తొలుదొలుత ఆత్మజ్ఞానమును సంపాదించుకొనవలయును. ౩౨ అన్నిమంత్రములకంటెను ఆత్మజ్ఞానమంత్రము (గుహ్యోపదేశము) మిగుల నుత్తమమైనది. ఈ విషయములో భగవంతుఁడు పెక్కుతావుల నిట్లు నుడివియున్నాఁడు. ౩౩

శ్లో॥ యస్య కస్యచ వర్ణస్య జ్ఞానం దేహే ప్రతిష్ఠితం
తస్యదాసస్య దాసోహం భవేజ్జన్మని జన్మని॥

ఆత్మజ్ఞానమహిమము చతుర్ముఖబ్రహ్మకూడ నెఱుంగఁడు. ఇఁకఁ బాప మీజీవాత్మప్రాణుల కేమి తెలియును? ౩౪ సమస్తమైన పుణ్యతీర్థములను క్షేత్రరాజములను సేవించుటవలనఁ గలుగుఫలమునకుఁ గోటిరెట్లు ఫలమైనను బ్రహ్మజ్ఞానమునకుఁ దుల్యము కాఁజాలదు. ౩౫

శ్లో. పృథివ్యాం యానితీర్థాని స్నానం దానేషు యత్ఫలమ్
తత్ఫలంకోటిగుణితమ్ బ్రహ్మజ్ఞానసమం హిన॥

ఆత్మజ్ఞానము గహనముకంటెను మిగుల గహనమైనది. ఈవిషయమునుగూర్చి చెప్పఁబోవుచున్నాఁడను. శాంతచిత్తముతో శ్రోత లాలింపఁ గోరుచున్నాఁడను. ౩౬

అయిదవసమాసము.

బహుధాజ్ఞానము.

(ఆత్మజ్ఞానముకంటె భిన్నములగు ననేకవిధజ్ఞానములు)

ఎంతదనుక సత్యమగు జ్ఞానముండదో యంతదనుక సర్వమును నిష్ఫలము. ఏలయన! జ్ఞానములేనిది కష్టము దూరముకాఁజాలదు. ౧ జ్ఞానమనుపే రుచ్చరించినంతిన భ్రమ కలుగుచున్నది. అన్నా! దీనియందేమి రహస్యము లుండవచ్చును? అని యందఱును నడిగెదరేమో? ఇపుడు వరుసగా నీవిషయము వివరించెద. ౨ భూతభవిష్యద్వర్తమానములలోని సంగతులను దెలిసికొనుటకూడ జ్ఞానమందురు. నిజమునకిది జ్ఞానము కాఁజాలదు. ౩ గొప్పగొప్పవిద్యలను జదువుట, సంగీతశాస్త్రము నేర్చుకొనుట, రాగ పరిచయము కలిగియుండుట, వైద్యశాస్త్రమునందు నేర్పుగడించుట, వేదాధ్యయనము సలుపుట. ౪ అనేకపరిక్ష

యాజ్ఞయిందు. ౩౮ గురువుచెప్పిన ప్రత్యుత్తరమిది- శిష్యా! అట్టి శుద్ధజ్ఞానమునుగూర్చి రాఁబోవుసమాసములోఁ దెల్పెదను. ధ్యానపూర్వకముగా వినఁ గోరుచున్నాఁడను. ౩౯

ఆ ఱ వ స మా స ము.

శు ద్ధ జ్ఞా న ని రూ ప ణ ము.

శుద్ధమగు జ్ఞాన మాత్మజ్ఞానము. ఆత్మజ్ఞానముయొక్క లక్షణమేది యనఁ దన్నుఁదాను గ్రహించుటయే. ౧ ముఖ్యదైవతము నెఱుంగుటయు సత్యస్వరూపమును గురుతించుటయు నిత్యానిత్యవిచారమును గావించుటయు జ్ఞానమని పెద్దలుచెప్పుదురు. ౨ సంపూర్ణముగా నీదృశ్యప్రకృతి లయమైపోవుటయుఁ బాంచభౌతికము నెవ్వియు లేకుండుటయు, నద్వైతము మూలమట్టముగా నశించుటయు (ఒకటిదక్క రెండవది లేకపోవుటయు) జ్ఞానము. ౩ మనస్సునకు బుద్ధికినిగూడ నగోచరముగానున్నదియుఁ దర్కమున కవకాశమునొసంగనిదియు ఉల్లేఖనము కంటెను (నిర్దేశముకంటెను) బరావైఖరికంటెను బైగానున్నదానికి జ్ఞానమని పేరు. ౪ ఎచట దృశ్యమానమగున దెద్దియును లేదో? యెచట [1]అహంబ్రహ్మాస్మి యను జ్ఞానముగూడ నజ్ఞానమగునో యట్టిశుద్ధమును విమలమునునగు స్వరూపజ్ఞానమే జ్ఞానమని చెప్పఁబడును. ౫ అన్నింటికిని సాక్షియగు[2] తురీయావస్థను జనులు జ్ఞానమందురు. కాని యాయవస్థయందుఁ గలి

---

1 మనము బ్రహ్మస్వరూపులమై యున్నారమను జ్ఞానము-బ్రహ్మస్వరూపప్రాప్తియైనపిమ్మట నీజ్ఞానముండదు. ఒకవేళనున్నచో నది యజ్ఞానమగును.

2. అవస్థలునాలుగు: జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్త్యవస్థ, తురీయావస్థ- జాగ్రదవస్థయందు జీవుఁడు సమస్తవిధములగు బాహ్యవ్యవహారములు గావించును. స్వప్నమునం దింద్రియములన్నియు లయమైపోయి కేవలమొక మనస్సే సమస్తవ్యవహారములు చేయును. సుషుప్తి (గాఢనిద్ర)యందు ఇంద్రియములన్నియు మాత్రమే గాక మనస్సుగూడ నజ్ఞానములో లయమైపోవును. జీవుఁడు కేవలము మూఢావస్థయం దుండును. ఈమూఁడవస్థలలో జ్ఞానమునఁగలుగును. తురీయావస్థయందు జీవునకు స్వస్వరూపజ్ఞానము కలుగును. అనగా జీవునకు నేనుబ్రహ్మరూపుఁడ ననునను భవము కలుగును. ఈజ్ఞానముగూడ నుపాధిసహితమే గాన నిదియును శుద్ధజ్ఞానముగాదు. దీని పిమ్మట ఉన్మనీయావస్థ యున్నది. దానిలో మనస్సుగూడ లయమైపోవును.

గెడు జ్ఞానముకూడఁ బదార్థముకంటెను భిన్నముగాదు. కావున నిదియు వ్యర్థమే. ఏలయన? దృశ్యపదార్థమును దెలిసికొనుటకుఁ బదార్థజ్ఞానమనియే చెప్పుదురు. శుద్ధస్వరూపమును దెలిసికొనుటకు స్వరూపజ్ఞానమని చెప్పుదురు. ౭ ఆస్తిక్యము లేనిదానికి సర్వసాక్షిత్వము అనునది యెచ్చటనుండి రాఁగలదు? కావునఁ దుర్యజ్ఞానము నెన్నఁటికిని శుద్ధజ్ఞానమని తలంపఁ కూడదు. ౮ జ్ఞానమన నద్వైతమని (ఒకటివిడిచి రెండవది లేనిదానిని) చెప్పుదురు. తుర్యావస్థయన్ననో యది ప్రత్యక్షముగ ద్వైతరూపము (తురీయ మన్నింటికిని సాక్షిగావున నొకటిస్వయముగఁ దుర్యము. రెండవది సాక్ష్యముగానున్నయది) కావునఁ దుర్యావస్థాజ్ఞానము శుద్ధజ్ఞానముగాదు. శుద్ధజ్ఞానమనునది వేఱుగానున్నది. ౯ శ్రోతలారా! ఇపుడు మీరు శుద్ధజ్ఞానలక్షణములను వినుండు "మనము శుద్ధస్వరూపులమే యనుదానియం దనుభవముగలుగుటయే శుద్ధజ్ఞానము మహావాక్యమంత్రము మంచిదియే (తత్త్వమసితత్ + త్వం + అసి=ఆబ్రహ్మము, నీవేయైయున్నాఁడవు) ఈమంత్రము జపించుమని చెప్పలేదు. ఈవాక్యమును సాధకుఁడు విచారము గావింపవలసియున్నది. ౧౧ ఈమహావాక్యము సమస్తమంత్రముల సారము. దీనినిగూర్చి బాగుగా విచారించి పర్యవసానము గ్రహింపవలయును. ఈమంత్రమును జపించుటవలన అజ్ఞానాంధకార మెన్నఁటికిని నశింపనేరదు. ౧౨ ఈమహావాక్యమున కర్థమును విచారించితిమేని "మనము స్వయముగా బ్రహ్మమేఅయియున్నార"మని తెలును కావున దీనినిజపించుటవలన వ్యర్థపరిశ్రమదప్ప ఫలమేదియుఁ గలుగఁజాలదు. ౧౩ ఈమహావాక్యవివరణమునుగావించుటయే జ్ఞానమునకు ముఖ్యలక్షణము. అట్టిముఖ్యలక్షణముకతన మనము బ్రహ్మస్వరూపులమనుసంగతి సుబోధమగును. ౧౪ తనకుఁ దనదిలభించుట (నేనెవ్వగని తెలిసికొనుట లేక యాత్మస్వరూపమెఱుకయగుట) యను నీజ్ఞానము పరమదుర్లభమైనది. ఈజ్ఞాన మాద్యంతముయందు స్వయంభూస్వరూపమునను న్నది. ౧౫ సమస్తము నెచటనుండి ప్రకటితమగుచున్నదో దేనియందిదియంతయు లీనమగుచున్నదో యట్టిజ్ఞానము గలిగినపిమ్మట బంధనములను గూర్చిన భ్రాంతియంతయు నశించును ౧౬ శుద్ధజ్ఞానముముందు ఈమతములు మతాంతరములు దుర్బలములై నిలువఁజాలక నశించుచున్నవి.

అంతియగాక అతిసూక్ష్మవిచారము గావించినయెడల శుద్ధజ్ఞానముగలిగిన వారి కన్నిటను నైక్యము గనిపించును. ౧౭ ఈచరాచరప్రపంచమునకు నిర్మలమును శుద్ధస్వరూపమునగు [1] శుద్ధజ్ఞానమె మూలమై యున్నది. (నిర్మలమును శుద్ధస్వరూపమునగుదానిని వేదాంతమతానుసారముగ శుద్ధజ్ఞానమందురు) ౧౮ తనమూలస్థానమును అన్వేషించుటవలన అజ్ఞానము తనంతన నశించును. దీనినే మోక్షప్రదమగు బ్రహ్మజ్ఞానమందురు. ౧౯ ఇట్లు తనను గురించుచుండఁ గ్రమముగా సర్వజ్ఞత్వము ప్రాప్తించును. దీనివలన ఏకదేశీయత పూర్తిగాఁ దొలఁగిపోవును ౨౦ "నేనెవ్వఁడను" అను హేతువును హృదయమునందుంచుకొని చూచినయెడల "నేను నిశ్చయముగ దేహమునకతీతరూపుఁడనై యున్నాఁడను" అను సంశ మెఱుకపడును ౨౧.

ప్రాచీనకాలమున ఈజ్ఞానసహాయమున పలువురు మహాత్ములు ముక్తులైరి. ౨౨ వ్యాసుఁడు, వసిష్ఠుడు, శుకుఁడు, నారదుఁడు, జనకుఁడు మొదలగు మహాజ్ఞానులీజ్ఞానమువలననే మున్ను తరించిరి. ౨౩ వామదేవుఁడు, వాల్మీకి, అత్రి, శౌనకుఁడు మున్నగు ఋషీశ్వరులు ఈజ్ఞాన సహాయముననే వేదాంతవిచారముల నొనరించి పరమాత్మని బొందిరి. ౨౪ సనకాదిఋషులు, ఆదినాథుఁడు, మత్స్యేంద్రనాథుఁడు, గోరక్షనాథుఁడు మున్నగు మహాత్ములు ఈశుద్ధజ్ఞానముకతననే ముక్తులైపోయిరి. ౨౫ సిద్ధులు, మునులు, మహానుభావులు మున్నగువారలందఱకును ఆశుద్ధజ్ఞానమొక్కటియే మోక్షమును బడయు నాధారమైనది. శుద్ధజ్ఞానానందముననే నిరంతరము మహాదేవుఁడు తాండవమాడుచున్నాఁడు. ౨౬ శుద్ధజ్ఞానము, వేదశాస్త్రములసారము అదియె గురుప్రతీతి, అదియె ఆత్మప్రతీతి విచారము. భావికులకు వారివారి భాగ్యానుసారముగ శుద్ధజ్ఞానము ప్రాప్తించును. ౨౭ సాధువులు, సత్పురుషులు, సజ్జనులు నగు యోగ్యులేజ్ఞానసహాయమున భూతభవిష్యద్వర్తమానకాలముల నెఱుంగుదురో ఆజ్ఞానముకంటె నధికగుహ్యతరమైనది ఆత్మజ్ఞానము ౨౮ తీర్థసేవ, తపము చేయుట, దానములొనర్చుట, ధూమపానము చేయుట (తలను గ్రిం

1. మననము. అహం (నేను) బ్రహ్మ (శుద్ధస్వరూపమగు బ్రహ్మమును) అని యనుచున్నారము. దీనిని అనుభవములోనికిఁ దెచ్చుకొనుటకే శుద్ధజ్ఞానమని పేరు.

దుగఁగట్టుకొని క్రిందనున్న పొగను బీల్చుట) పంచాగ్నులమధ్య నుండుట (నాలుగువైపుల నగ్నిరగులుకొల్పి మధ్యనుండి సూర్యతాపము సహించుట) గోరాంజన మొనరించుట (భగవత్ప్రీతికై యగ్నితోఁ గాల్చుకొనుట) మున్నగువానివలన ఆత్మజ్ఞానము కలుగఁజాలదు. ౨౯ అది సకల సాధనములకును ఫలము. సంపూర్ణజ్ఞానమునకు శిరోమణి ఆత్మజ్ఞానము గలిగినమీఁదట సందేహము లన్నియు నశించును. ౩౦ ఏబదియాఱుభాషలును, ఆభాషలలోని సామాన్యగ్రంథము మొదలుకొని వేదాంతమువఱకును గల సమస్తమునకు ఆత్మజ్ఞానమే గహనార్థము (ఎఱుంగ శక్యముగాని యంశము.) ౩౧ ఆత్మజ్ఞానము పురాణములను చదువుటచే నెఱుంగబడదు. దానిని వర్ణించివర్ణించి వేదములు విసిగిపోయెను. కాని శ్రీసద్గురుమూర్తియనుగ్రహమువలన నేనిప్పుడు మీకందఱకు దానినే చెప్పుచున్నాఁడను. ౩౨ సంస్కృతము, మహారాష్ట్రము మున్నగు భాషాగ్రంథములయందు నాకేమియుఁ బ్రవేశము లేదు. కాని హృదయమునందుఁ గృపామూర్తియగు సద్గురుస్వామి నివసించి విరాజిల్లుచున్నాఁడు. కావున నిప్పుడు ప్రస్తుతాంశము దెలుపుటకు నాకు సంస్కృతప్రాకృతగ్రంథములతో నెట్టి యావశ్యకమును లేదు. ౩౩ ౩౪ వేదాభ్యాసము, సద్గ్రంథశ్రవణము మున్నగు పరిశ్రమలు కొంచెమేని లేకపోయినను కేవలము సద్గురునికృపవలన నన్నియును సహజముల (సులభముల) గును. ౩౫

మహారాష్ట్రము మున్నగు సమస్తదేశభాషలలోఁగల గ్రంథములన్నింటిలో సంస్కృతగ్రంథము లుత్తమోత్తమములు. సంస్కృతగ్రంథములన్నింటిలో వేదాంతగ్రంథములు సర్వశ్రేష్ఠములు. ౩౬ వేదాంతమునందు వేదములందలి సంపూర్ణరహస్యమంతయు నిమిడియున్నది. అందుచే వేదాంతము సర్వశ్రేష్ఠమనిపించుకొనఁగలిగెను. ౩౭ ఆవేదాంతమునుకూడ మథించి (తఱచి) తీసినయర్థము అతిగహనమగు పరమార్థము. దానిని మీకిప్పుడు నే నెఱింగించుచున్నాఁడను ౩౮ ఓహో! గహనమునకంటెను గహనమైనది సద్గురునివచనము. సద్గురునివచనమువలన నవశ్యముగా శాంతిలభించును. ౩౯ సద్గురునివచనమే వేదాంతము. సద్గురునివచనమే సిద్ధాంతము, సద్గురునివచనమే ప్రత్యక్షమగు నాత్మానుభవము. ౪౦ ఎయ్యది గ్రహింపశక్యముగానివిషయమో ఎయ్యది నాగురు

స్వాదివాక్యమో దేనివలన నాకుఁబరమశాంతిలభించునో ఏయ్యేది నా హృదయమునందలి రహస్యతరాంశమో దానినిప్పుడు ఈక్షణమున మీ కందఱకుఁ దెలుపుచున్నాఁడను. నావైపు ధ్యానమునుంచి వినఁగోరెదను. (౪౧-౪౩) "అహంబ్రహ్మాస్మి" అనునది యజుర్వేదములోని మహా వాక్యము. దీనియర్థమునుఁ దరిగింప నసాధ్యము. ఇందలి భావమువలన గురుశిష్యుల కైక్యముగలుగుచున్నది. ౪౪ "స్వయముగా నీవెబ్రహ్మవు; ఇందు సందేహముగాని భ్రమగాని యుంచుకొనకుము." అనునదియే యీ వాక్యమునందుంగల మహామర్మము. ౪౫ నవవిధభక్తులలోనిదగు ఆత్మనివేదనభక్తికిఁగూడ నిదియేమర్మము. ౪౬ ఈపంచమహాభూతములు క్రమముగా నొకదానివెంటనొకటి కల్పాంతమునందు నాశనమై పోవును. మఱియుఁ బ్రకృతిపురుషులు (మాయ, బ్రహ్మము) గూడ బ్రహ్మమేయగును. ౪౭ దృశ్యపదార్థములన్నియు లుప్తమైపోవఁగనే వాస్తవములో "నేను" అనునదిగూడ నుండఁజాలదు. ఇఁకఁ బరబ్రహ్మమన్ననో, ఆతత్త్వమాదినుండియు నద్వైతమే. ౪౮ ఎచ్చట సృష్టినిగూర్చినవార్తయే లేదో యచట నాదినుండియు ఏకత్వము (అద్వైతము) గలదు. అచ్చట పిండముయొక్కగాని బ్రహ్మాండముయొక్కగాని జాడ లేవియు నుండవు. ౪౯ జ్ఞానాగ్ని ప్రకటనముకాఁగానే దృశ్యరూపమగు చిత్తచిదాకారమంతయు నష్టమైపోవును. తదాకారమగుటవలన భిన్నత్వమూలమంతయును దెగి పోవును. ౫౦ జగత్తు అనిత్యమను జ్ఞానముకలిగినపిమ్మట వృత్తి దానినంటు కొనదు. అది దానినుండి (వృత్తిజ్ఞానమునుండి) పరాఙ్ముఖమై పోవును. కావున దృశ్యము (సంసారము) ఎదురుగాఁ గనిపించుచున్నటులున్నను దాని యభావమే స్పష్టముగా భాసమగుచుండును. ౫౧ అనన్యమగు భక్తి గురుని యందుఁ గలిగినపుడు నీకిట్టిచింతతోడనే పనిలేదు. గురునినుండి వేఱై భక్తుఁడవుగాక యుండకుము. ౫౨ ఈవిషయము దృఢముగావించుకొనుటకు సద్గురునిసేవింపుము. ఏలయన సద్గురుసేవవలన అవశ్యముగ సమాధానము కలుగును. ౫౩ ఇదియే ఆత్మజ్ఞానము. దీనివలననే పరమశాంతి లభించును. మఱియు భవభయము గూడఁ దొలంగిపోవును. ౫౪ ఈ దేహమే నేననితలంచువాఁ డాత్మఘాతకుఁడు. అట్టియవివేకి దేహాభిమాన కారణమున తప్పనిసరిగ జననమరణదుఃఖము లనుభవించుచుండును. ౫౫

ఓశిష్యుఁడా! నీవు నాలుగుదేహములకంటెను వేఱుగానున్నాఁడవు. నీవు జన్మకర్మములకు భిన్నుఁడవు. మఱియు సంపూర్ణచరాచరసృష్టికి లోపలను వెలుపలను నీవేనిండియున్నాఁడవు. ౫౬ వాస్తవములో బద్ధుఁడవ్వాఁడును లేఁడు. ఈజనులందఱును భ్రాంతివలన సర్వమును మఱచి యున్నారు. ఈదేహాభిమానమును దృఢముగాఁ బట్టుకొనియున్నారు. ౫౭ ఓశిష్యుఁడా! నీవు పరమార్థమును దృఢముగావించుకొనఁ దలంచితివేని ఏకాంతములోఁ గూర్చుండి స్వరూపమునందు (బ్రహ్మస్వరూపమున లేక అహంస్వరూపమున) విశ్రాంతిఁ గైకొనవలయును. ౫౮ శ్రవణమును మననమును ఎప్పుడఖండముగాఁ జేయుదువో అప్పుడే నీకు సమాధానము లభించును. మఱియు బ్రహ్మజ్ఞానము పూర్ణమైనపిమ్మట నీకు వైరాగ్యము లభించును. ౫౯ ఓశిష్యుఁడా! ఒకమాటవినుము. నీవు ఇచ్ఛకువచ్చినటుల మెలంగుచు ఇంద్రియములకు స్వాతంత్ర్యము కలుగ జేసి వానికిలోఁబడి మెలంగెదవేని జన్మమృత్యుదుఃఖము లెన్నఁటికిని నిన్ను విడిచిపోఁజాలవు. ౬౦ త్యాగము గావించుటచేఁ బ్రాణికెటుల రాజ్యలాభముకలుగునో యటులె విషయసుఖములను త్యాగముగావించి వైరాగ్యమును గడించినవానికి సంపూర్ణజ్ఞానము సమకూరును. ౬౧ గొంగునఁగల మణియందలి లోభమున మూర్ఖించి రాజ్యము నవహేళనముగావించుట మంచిపనిగాదు. ౬౨ అవిద్యను వదలి సువిద్యను గ్రహింపవలయును. దానివలన నీశ్వరప్రాప్తి త్వరలోనగును. ౬౩ సన్నిపాత రోగమునందు భయానకదృశ్యములను గాంచునట్టిరోగి సరియగునౌషధమును సేవించినవెంటనే సుఖానందమును బడయునటుల అజ్ఞానరూపమగు సన్నిపాతవ్యాధియందుఁగూడ మిథ్యాదృశ్యములు (సాంసారికములు) కానిపించును. కాని జ్ఞానరూపమగు ఔషధమును దీసికొన్నతోడనే యామిథ్యాదృశ్యము జాడపొడలే కాన్పింపవు. ౬౪,౬౫ అసత్యస్వప్నములతో నిదురించువాఁడుభయమునఁ గేకలువేయును. వానిని మేలుకొలిపినయెడల మొదటినిర్భయదశ తిరుగ సమకూరును. ౬౬ స్వప్నమన్ననో నదిమిథ్యయే, కాని స్వప్నమునొందినవానికది సత్యముగాఁ దోఁచుచున్నందున దుఃఖము కలుగుచున్నది. కాని యెయ్యేదిమిథ్యయో దాని నిరసనమును నెటులఁజేయనగును. ౬౭ స్వప్నము మేలుకొనినవానివట్లనే

యసత్యమైనది. అది నిదురబోవువాని నావరించియుండును. మేల్కొని లేచినపిమ్మట వానికి స్వప్నమువలని భయమెద్దియు నుండదు. ౧౮ ఇటులే అవిద్యానిద్రయు నంతగాఢముగా నుండును. దానివలన మిగుల గొప్ప భ్రమ పొడముకొనును. ఇట్టిదశయందు శ్రవణము వలనను మననమువలనను పూర్ణమగుజాగరూకత నొందవలయును. ౧౯ హృదయపూర్వకముగా విషయములనుండి విరక్తుఁడై యుండువాఁడే జాగరూకుఁడు. (సిద్ధుఁడు) ౨౦ విషయములనుండి విరక్తుఁడుగానివాఁడు సాధకుఁడు. అతఁడు నేను గొప్పవాఁడనను అభిమానమును విడిచిపెట్టి మొట్టమొదట సాధనమునే చేయవలయును. ౨౧ సాధనమునుగూడఁ జేయఁజాలనివాఁడు సిద్ధుఁడ (జ్ఞాని) నను దురభిమానముచే బద్ధుఁడగుచున్నాఁడు. (సాంసారికబంధనములలోఁ జిక్కుపడుచున్నాఁడు) ౨౨ ప్రకృతాంశము సుబోధమగుటకిపుడు బద్ధుల, ముముక్షువుల, సాధకుల, సిద్ధులలక్షణములను జెప్పెదను. సావధానులరై యాలింపఁ గోరెదను. ౨౩,౨౪

ఏడవ సమాసము.

బద్ధలక్షణములు.

సృష్టిలోని సంపూర్ణచరాచరజీవులు బద్ధులు, ముముక్షువులు, సాధకులు- సిద్ధులుఅను నాలుగుతెఱంగుల నున్నారు. ౧ ఈనాలుగువిధములఁదప్ప ఐదవవిధమున నున్నదెద్దియును లేదు. ఇవు డీనాలుగులక్షణములు మీకు సవిస్తరముగాఁ దెలుపుదును. ౨, ౩ పైనిఁజెప్పిన చతుర్విధజీవులలోనుంచి తొలుదొలుత నీసమాసమునందు బద్ధులలక్షణము దెలుపుదును. సావధానమనస్కులరై వినుండు. శేషించిన మూఁడింటిలక్షణములు క్రమముగాఁ జెప్పుదును. ౪, ౫ గ్రుడ్డివానికి దృష్టిలేనికారణమున దశదిశలును శూన్యాకారములుగాఁ దోఁచును. అటులే స్వార్థమను నంధత్వము కలిగినకారణమున బద్ధునకుఁగూడ జ్ఞానదృష్టిలేకుండుటచే సమస్తప్రపంచము (సంసారమంతయు) బంగారమువలెఁ దోఁచుచున్నది. ౬ భక్తులు, జ్ఞానులు, తపస్వులు, యోగులు, విరాగులు, సన్యాసులు మున్నగుసత్పురుషులచే నావరింపఁబడిన యీప్రపంచమునందు బద్ధుని దృష్టిలోనికివచ్చు యోగ్యులులేరు. ౭ బద్ధపురుషుఁడు, కర్మములు

అకర్మములు, ధర్మములు, అధర్మములు, సుగమమగుపరమార్థమార్గము నెఱుంగఁడు. ౮ షట్ఛాస్త్రములు, సత్సాంగత్యము, సత్పాత్రత, పవిత్రమగుసన్మార్గములుగూడ వానికిఁ గాన్పింపవు. ౯ సారాసారవిచారము, స్వధర్మాచరణము, పరోపకారము, దానపుణ్యము నాతఁడు గ్రహింపఁడు. ౧౦ బద్ధునిహృదయమునందు భూతదయ యుండదు. శరీరము పవిత్రముగానుండదు. మఱియుఁ దోడిమనుష్యులను ప్రసన్నముగావించుకొనుట కాతఁడు మృదుమధురవచనములనుగూడ నుడువఁడు. ౧౧ బద్ధుడగు పురుషుఁడు భక్తి,జ్ఞానము,వైరాగ్యము,ధ్యానము,మోక్షము,మొదలగు సాధనముల నించుకేనియు నెఱుంగఁడు. ౧౨ అంతియగాక వాఁడు నిశ్చయాత్మికమగు దేవతనే యెఱుంగఁడు. వీరు మహాత్ములను వివేకమే యతనిహృదయమునఁ గలుగదు. మాయాకౌతుకమును దెలిసికొనఁజాలఁడు. ౧౩ వాఁడు పరమార్థమును గురుతించుతెఱంగే యెఱుంగఁడు. అధ్యాత్మనిరూపణము నెఱుంగఁడు. అంతదనుక బోనేల స్వయముగ తన్నే యెఱుఁగఁడు. ౧౪ బద్ధునకు జీవుఁడొందు జన్మకారణము తెలియదు. సాధనఫలముల గురుతింపఁడు. మఱియు వానికియథార్థమగు సత్యమునుకూర్చిన జ్ఞానముండదు. ౧౫ దేనియందుఁ దానుస్వయముగా బంధింపఁబడుచున్నాడో అట్టిబంధనస్వరూపమే బద్ధుఁ డెఱుంగఁడు. వానికి ముక్తిలక్షణముగాని విలక్షణవస్తు బ్రహ్మజ్ఞానముగాని యుండదు. ౧౬ శాస్త్రములలోని యర్థమును విప్పిచెప్పినను వాఁడు తెలిసికొనఁడు. తనజీవితమునకు ముఖ్యమైన స్వార్థమెద్దియో వానికిఁదెలియదు. మఱియు నేనుసంకల్పముచే నిటులబంధింపఁబడియున్నాఁడనని గూడ నాతఁడు విచారింపఁడు. ౧౭ ఆత్మజ్ఞానము లేకుండుట బద్ధుని ముఖ్యలక్షణము. వాఁడు పుణ్యతీర్థములు దానములు పుణ్యములు మున్నగునవి కొంచెమేనియెఱుంగఁడు. ౧౮ వానిహృదయమునందు దయ, కరుణ, వినయము, మైత్రి, శాంతి క్షమ మున్నగు సుగుణములుండుటకుఁ దావులేదు. ౧౯ వేయేల? జ్ఞానహీనుఁడగు బద్ధపురుషునకు జ్ఞానలక్షణము లెట్లుపట్టువడనేర్చును? తనయందు సమస్తమైన దుర్లక్షణములు నిండియున్నవాఁడే బద్ధుఁడు ౨౦ బద్ధుని స్వభావము తెలిపెదను. నానావిధములగు పాపకార్యములను గావించుటవలన వానికిఁ బరమానందము కలుగును. వానిహృదయము

మూర్ఖోద్రేకముతో నిండియుండును. ౨౧ ఏమానవుని హృదయమున కామము, క్రోధము, గర్వము, మదము, ద్వంద్వము, భేదము మున్నగు దుర్గుణములు నిలుకడగానుండునో వానిని బద్ధుఁడని తెలిసికొనుము. ౨౨ దర్పము, దంభము, విషయేచ్ఛ, లోభము, కర్కశత్వము, అశుభత్వము, హృదయమునందు విశేషముగనుండువాఁడు బద్ధుఁడు. ౨౩ వ్యభిచారము, (కామాసక్తి) మత్సరము, అసూయ (పరగుణేషు దోషావిష్కరణం) తిరస్కారము, పాపము, వికారము మొదలగు అవగుణసమూహ మెవని నావరించుకొని యుండునో వాఁడె బద్ధుఁడు ౨౪ బద్ధపురుషుఁడు దురభిమానమునకును, హఠమునకును, అహంకారమునకును, వ్యగ్రతకును (తొట్రుపాటునకు) దుష్కర్మములకును గనియైయుండును. ౨౫ కపటము, వాదవివాదములు, కుతర్కము, భేదము, క్రూరత్వము, నిర్దయాళుత్వము, మున్నగు దుర్గుణములు బద్ధుని నాశ్రయించియున్నవి. ౨౬ నింద, ద్వేషము, అధర్మము, అభిలాష మొదలగు బహువిధదోషముల కాతఁడు ఆటపట్టుగా నుండును. ౨౭ భ్రష్టత్వము, అనాచారము, నష్టత్వము, ఐకమత్యరాహిత్యము, అవినీతి, అవిచారము బద్ధునిహృదయమునఁ జెంపొందును. ౨౮ నిష్ఠురస్వభావుఁడును, ఘాతుఁడును, ఇతరులను వధించువాఁడును, పాపకార్యముల నాచరించువాఁడును, క్రోధమునకు నెలవుగ నుండునాతఁడును, ఉంఛ యనేకకువిద్యల నెఱింగినవాఁడును బద్ధుఁడు. ౨౯ దురాశ, స్వార్థపరత్వము, కలహప్రియత్వము, అనర్థము, దుర్మతి, ప్రతీకారము చేసితీరవలయునను క్రోధస్వభావము ౩౦ కల్పనము, కామన (ఇచ్ఛ) తృష్ణ, వాసన, మమత, భావన, మున్నగు దుర్గుణములతో వీఁగుచుండువానిని బద్ధుఁడని గ్రహింపవలయును. ౩౧ వికల్పుఁడుగను (ప్రమాది) విషాదిగను, మూర్ఖుఁడుగను, ఆసక్తుఁడుగను, ప్రాపంచికుఁడుగను, అధికోపాధిగను, (కుటుంబపోషకుఁడు) ౩౨ అతివాచాలుఁడుగను, పాషండుఁడుగను దుర్జనుఁడుగను, మోసగాఁడుగను, దుష్టుఁడుగను, దుర్గుణుఁడుగను నుండి ౩౩ అవిశ్వాసము, భ్రమ, భ్రాంతి, తమము, విక్షేపము (చాంచల్యము) ఆలస్యము మున్నగు భావము లెక్కువ కాఁగలవాఁడు బద్ధుఁడు ౩౪ లోభియు, ఉద్ధతుఁడు, పరుల శ్రేయస్సునకు సహింపనివాఁడు మదయుతుఁడు, అసత్కర్ముఁడు, ఎంతవాని నేని

లక్ష్యముచేయనివాఁడు ౩౫ పరమార్థవిషయమునందు అజ్ఞానిగనుండి ప్రాపంచికవిషయములలో నపరిమితపరిజ్ఞానము గలిగియుండువాఁడు, స్వయముగా మనశ్శాంతి యెఱుంగనివాఁడు ౩౬ పరమార్థము ననాదరించుచు ప్రపంచము నెక్కువయాదరించుచు గృహస్థాశ్రమభారమును సంతోషముతో నిరంతరము మోయుచుండువాఁడుబద్ధపురుషుఁడనఁబడును. ౩౭ బద్ధునకు సత్సంగము మిగులనసహ్యకరముగ నుండును. సాధువులను అవతారపురుషులనునిందించుటయన్నఁబరమానందము. తనబుద్ధినిధర్మవిషయమున బ్రసరింపనీక శృంఖలములు తగిలించినటుల బంధించి కూర్చుండుట యన్నసంతోషావహము ౩౮ చేతిలో ద్రవ్యము నకుసంబంధించినజపమాలధరించి నిరంతరము కాంతారతుఁడై వర్తించుట వాని నియతకృత్యము. సత్సంగ మనునది వానికడఁ గలికమునకేని యుండదు ౩౯ నిరంతరము కనకమును గాంతలను గనులకఱవారఁగాంచి యానందించుటయుఁ జెవులతో నిరంతరము కాంతాకనకములను గూర్చిన ప్రసంగములను దనివారనాలించుటయు ధనమునుగూర్చి యెల్లపుడు చింతించుటయు ౪౦ మనోవాక్కాయములతోడను జీవప్రాణములతోడను ధనమునకై కాంతలకై పలవించుచుంటయు ౪౧ ఇంద్రియములను సంపూర్ణముగా స్థిరమొనరించి స్త్రీలకొఱకును ద్రవ్యముకొఱకును మగ్నముగావించుటయు బద్ధునిలక్షణములు ౪౨ కాంతాకనకములను బుణ్యతీర్థములుగను బరమార్థముగను స్వార్థముగను గడకు సర్వస్వముగను భావించువాడును ౪౩ సమయమును ఇతరపుణ్యకార్యములతో వ్యయపఱుపక నిరంతరము గృహస్థచింతనములతోఁ గడుపుకొనువాడును లోకసంబంధములగు కథలు వార్తలు తనవిగాదలంచి కాలయాపనము చేయువాడును ౪౪ బహువిధచింతలు, ఉద్వేగములు, దుఃఖసంసర్గము, మున్నగువానికి ఆటపట్టుగా వర్తించువాఁడును బరమార్థమును బూర్తిగా విడనాడినవాఁడును బద్ధపురుషుడు ౪౫ గడియ, నిముసము, ఱెప్పపాటు, లోనగు నేస్వల్పకాలమునేని సద్వినియోగముచేయక స్త్రీ, ధన, ప్రపంచ, ధ్యానములయందు గడుపునాతఁడును, ౪౬ తీర్థయాత్రలు, దానము, పుణ్యము, భక్తి,సత్కథానిరూపణము, మంత్రము, పూజ, జపము, ధ్యానముమొదలగు సమస్తమును అనుష్ఠించుటలో స్త్రీధనములను విడువని

వాఁడును ౪౭ మేల్కొనియున్నప్పుడును, కలలుగాంచునప్పుడును, రాత్రులందును, పగటియందును ప్రతినిమిషమునందును, విషయములయందు దన్మయుఁడై యాతన్మయసౌఖ్యమునఁ దదితరవిషయములశోక్యము వదలినవాఁడును బద్ధుడు ౪౮ ఈబద్ధలక్షణములు ముముక్షుదశలో మాఱిపోవును. కావున బద్ధలక్షణములు మార్చుకొనుటకై ముందుసమాసములో ముముక్షులక్షణముల నెఱింగించెదను. ఆలకింపుడు ౪౯

ఎనిమిదవ సమాసము.

ముముక్షు లక్షణములు.

కులాభిమానమున ననేక క్షుద్రములగు నవలక్షణములకు నెలవైన దుష్టునిముఖము గాంచుటగూడ దోషమే ౧ అట్టిబద్ధప్రాణికి అదృష్టవశమున స్వైరవర్తనములో మెలంగుచుండఁ గాలాంతరమునందు ఖేదముప్రాప్తించును ౨ ఈవిధముగ బద్ధప్రాణి సంసారదుఃఖములలోఁ దగుల్కొని పలవించును. త్రివిధతాపములచే సంతప్తుఁడగును. తరువాత నాబద్ధుఁడు సౌభాగ్యవశమున అధ్యాత్మనిరూపణములనాలించి యంతఃకరణమునందు దనదోషములకుఁ బశ్చాత్తాపమునొందును ౩ తరువాతఁ బశ్చాత్తాపఫలముగా గృహస్థాశ్రమమునుండి విసివడును. పిదప విషయసుఖములన్న దనమనస్సులో విసుగునొందును. చాలుచాలు గృహస్థాశ్రమమువలని యుద్వేగమునాకుఁదగ్గినదని నుడువును. ౪ అప్పుడు బద్ధుఁడు ఈప్రపంచమంతయు నశించునదె. గృహస్థాశ్రమసంబంధములగు శ్రమలవలన ఫలమేమియుఁ గలుగఁబోదు. ఇప్పుడైన నాజీవితమును సార్థకము గావింపవలయునని తలంచును. ౫ ఈవిధముగా బుద్ధితిరిగిపోయినపిమ్మట బద్ధుఁడు ఆలోచనములోనికిఁదిగి అయ్యయ్యో నాజీవితము నేఁటిదనుక వ్యర్థముగా గడచిపోయినదని వ్యాకులుఁడగును. ౬ మొదటినుండి గావించిన దోషములన్నియు జ్ఞాపకమునకువచ్చును. ఆదోషములన్నియు మూర్తిమంతములై కన్నులకుఁ గట్టినటు లుండును. ౭ తనదోషములకు విచారపడి దోషఫలముగా సమకూరనున్న యమయాతనఁ దలంచికలంచి హృదయమునందు భయపడును. అంతతోఁబోక తానొనరించిన యగణితములగు పాపములనుగూర్చి యీవిధముగఁ బరితపింప నారంభించును. ౮

"అయ్యయ్యో! నాహృదయమునఁ బుణ్యకార్యము లాచరింపవలయునని యెప్పుడును గొంచెమేని విచారింపకపోతినిగదా! నాపాపమంతయుఁ బర్వతమువలెఁ బెరిగిపోయినది. ఇఁక నెటు లీదుస్తరసంసారసాగరమును దాటఁగలుగుదును. ౯ నాదోషముల నన్నింటని దాఁచియుంచుకొంటిని. యోగ్యులు, ఉత్తములునగు పెద్దలసద్గుణములను దోషములని వాకొంటిని. ఈశ్వరా! నేనుసాధువులను, అవతారమూర్తులను, సజ్జనులను వ్యర్థముగాఁదూలనాడి పాపము గట్టుకొంటిని. ౧౦ ఈలోకము నందు బరనిందకు సమానమైనదోష మింకనెద్దియును లేదు. ఈదోషము నాయందు విశేషించి పాదుకొనియున్నది. నాదుర్గుణము లాకాశము నావరించినవి. ౧౧ సాధుసజ్జనుల గురుతింప లేకపోతిని. భగవంతుని నర్చించుటలోఁ బాలుగొనకపోయినవాఁడను. అతిథులను అభ్యాగతులను సైతము సంతుష్టి నొందింపలేనైతిని. ౧౨ పూర్వపాపములవలన నేనించుకేనియు సత్కృత్యము లొనరింప లేకపోయినాఁడను. నాహృదయము నిరంతరము దుష్టమార్గములయందే మగ్నమైయుండెను. ౧౩ నాశరీరము నెన్నఁడు కష్టింపఁజేయనైతిని. పరోపకారబుద్ధి మొదలే లేకుండెను. కామమదమువలన నొడలెఱుంగక ఆచారలక్షణముకూడఁ గావింపనైతిని. ౧౪ కన్నతల్లివంటిదగు భక్తిని పూర్తిగా వంచించితిని. శాంతి విశ్రాంతులను భంగపఱచితిని. మూర్ఖత్వమువలన సద్బుద్ధిని సద్వాసనలను నాశనమొందించినాఁడను. ౧౫ ఇఁక నెట్లు నాజీవితము సార్థకము కాగలదు? వ్యర్థములగు దోషములను నేను లెక్కలేనన్ని గావించితిని. వివేకమునొకనిముసమేని నాదరికి రానీయనైతిని ౧౬ ఇఁక నేయుపాయమున్నది. పరలోకము నాకులభించుమార్గమేది? అక్కటా! ఓపరమాత్మా! దీనుఁడనగు నేను నీసన్నిధి కెటులజేరఁగల్గుదును? ౧౭ నాహృదయమునం దింతకుమున్ను సద్భావమొకప్పుడే నుదయింపదయ్యెను. బ్రతికిననాల్గునాళ్లు మానప్రతిష్టల నార్జించుటతో మునిఁగితేలుచుంటిని. దాంభికత్వముతో నీకర్మకాండనటనమును జూచువారలను దృష్టిపఱచుట కాచరించితిని. ౧౮ పొట్టకొరకై హరికీర్తనము గావించితిని. దేవతావిగ్రహములనువీథులందును అంగడులందునుబెట్టి ధనమునార్జించితిని. ఓదైవమా! నేనొనరించినపాపములు నాపాపపుబుద్ధియు నాకు బాగుగాఁ దెలి

యును. ౧౯ నేను నిరంతరము హృదయములో నభిమానము పెట్టుకొని పైకిమాత్రము గర్వరహితముగా మాటలాడితిని. మఱియు ధ్యానము గావించునెపముతోఁ బరులధనము నెటులహరింపఁగలుగుదు నాయని యోజించుచుంటిని. ౨౦ నాజన్మకాలమంతయుఁ బరులమోస గించుచు గడిపితిని. నాశాస్త్రజ్ఞాన మిందులకె పాల్పఱచితిని. పొట్ట కొఱకు సాధువులను సజ్జనులను నిందగావించితిని. ఓయీశ్వరా! నా హృదయమునందు నానావిధదోషములు నిండియున్నవి. ౨౧ సత్యమని తెలిసినదానినే నేనుఖండించితిని. మిథ్యనే యెత్తింగి ప్రతిపాదించితిని. ఇటులే పొట్టను నిండించుకొనుటకు లెక్కలేనన్ని కపటకర్మముల నొనరించి నాఁడను." ౨౨

ఈవిధముగా ముముక్షుఁడు బద్ధావస్థలోఁ గావించినపాపములకుఁ బరితాపమునొందును. అధ్యాత్మనిరూపణములను బెద్దలకడనాలించి తనమొదటివర్తనములన్నియును మార్చుకొనును. ౨౩ పుణ్యమార్గము వైపున కాతనిహృదయము పరుగులిడును. సత్సంగమున కాశపడును. సంసారమునందు విరక్తినొందును. ౨౪ రాజులు చక్రవర్తులు అంతవారు తమతమరాజ్యములనువదలి వెళ్ళిపోయిరి. నావైభవ మొకలెక్కలోనిదా? కావున నేనిప్పుడు సత్సాంగత్యము చేయవలయును అనితలంచును. ౨౫ తనయవగుణములనుగూర్చి విచారపడును. విరక్తివశమునఁ దనదుర్గుణము లన్నింటి నెఱుంగును. పశ్చాత్తాపతప్తుఁడై మనస్సులోఁ దననుగూర్చి యిట్లు నిందఁ గావించుకొనును. ౨౬

"అయ్యో! నేను లోకమున కపకార మొనరించితిని. డాంబికముగాఁ బ్రవర్తించినాఁడను. ఎన్నియో యనాచారములకుఁ బాల్పడితిని. ౨౭ నేను చండాలుఁడను, దురాచారుఁడను, ఖలుఁడను, ఇంతియగాదు మహాపాపాత్ముఁడను. ౨౮ నాహృదయమున భక్తికిఁ దావేలేదయ్యెను. దుర్జనుఁడ ననిపించుకొంటిని. హీనులలో నత్యంతహీనుఁడనై సంచరించితిని. జ్ఞానహీనుఁడనగు నేనీప్రపంచమున నొకజాయివలెఁ బుట్టినాఁడను. ౨౯ దురభిమానమునకును క్రోధగుణమునకును నేనాశ్రయముగా నుంటిని. నాయం దెన్నియో దుర్వ్యసనములు నిండియున్నవి. ౩౦ నా యంతసోమరిపోతు లోకమునలేదు. నోటిధాటితో లోకులను బెదరించి

బ్రతికితిని. కపటము, పిఱికితనము, అనాలోచనము, మూర్ఖత్వము మున్నగు దుర్గుణములకు నేను శరణ్యమైతిని. ౩౧ నేను వ్యర్థుఁడను కృతఘ్నుఁడను, పాషండుఁడను, కఠోరవచనుఁడను, కుబుద్ధిని, కపటశీలుఁడను, ఎంతని నన్ను నేను వర్ణించెదను. ౩౨ నేను పూర్ణముగా జ్ఞానవిహీనుఁడను. నాకంటె హీనుఁ డీలోకమున నుండఁబోఁడు. ఇంకను నాయం దెన్ని యవలక్షణములు పాదుకొనియున్నవో నేనెఱుంగను ౩౩ నేనధికారుఁడను, మలినస్వాంతుఁడను, పనికిమాలినవాఁడను. అత్యంతనీచ హృదయుఁడను. ౩౪ నేనంతయు నపస్వార్థుఁడను, గొప్ప యసమర్థుఁడను, పరమార్థవాసన నాయందు మందునకేని లేదు. ౩౫ అవగుణరాశినగు నేనీలోకమున వ్యర్థముగా జన్మించి భూమికి మిగుల భారమైతిని. ౩౬

ఈవిధముగ నాతఁడు తన్నుఁదా నిందించుకొనును. గృహస్థాశ్రమ మన్నఁ బూర్తిగా నాతనికి విసుగెత్తిపోవును. సత్సంగముకొఱకు నిరంతరము పరితపించును. ౩౭ పుణ్యము సంపాదించుకొననెంచి యనేకపుణ్యతీర్థములను సేవించును. శమదమాదిసాధనములలోఁ దన్మయుఁడై వర్తించును. అనేక మహాగ్రంథములను జక్కఁగాఁ బఠించును. కాని వీనివలన నాతని కించుకేని సమాధానము కలుఁగదు. సమస్తము నాతనికి సందేహయుక్తముగా గోచరించుచుండును. ఇఁక సాధువులశరణ్యములోని కరుగవలయునని నిశ్చయము గావించుకొనును. ౩౮, ౩౯ దేహాభిమానమును కులాభిమానమును ద్రవ్యాభిమానమును నాతఁడు విడిచి నానాభిమానములను మఱచి సాధుజనులశరణ్యమునం దనన్యభావము వహించును. ౪౦ అంతతో నూరకుండక యహంకారమును బూర్తిగా విడిచి తన్నుఁదాను బహుభంగముల నిందించుకొనును. మోక్షమునందు గాఢముగఁ గోర్కెనెలకొల్పును. ౪౧ నేను గొప్పవాఁడనని యంతకుమున్ను విఱ్ఱవీగినందులకుఁ బరితపించును. పరమార్థముకొఱకుఁ గష్టించును. సాధుసజ్జనుల చరణకమలములే తన్నుద్ధరించునవియను నమ్మిక మాతనిహృదయమున గట్టిగాఁ బాదుకొనును. ౪౨ అనంతరము తనగృహస్వార్థములను బ్రపంచమును విడిచి పరమార్థమునం దుత్సాహముంచును. ఇఁక నిదిమొదలు సాధుసజ్జనులకు దాసుఁడనై యుండెదనని నిశ్చయించుకొనును. ౪౩ పైని

చెప్పఁబడిన యవలక్షణములనుండి విముక్తుఁడైన పురుషుని ముముక్షుఁడని తెలిసికొనవలెను. ఇఁకముందు సాధకలక్షణములను వివరించెదము. ౪౪

తొమ్మిదవ సమాసము.

సాధక లక్షణము.

గతసమాసమునందు మీకు ముముక్షులక్షణములు సంగ్రహముగాఁ దెలిపితిని. ఇపుడు సావధానబుద్ధితో సాధకలక్షణములను వినుఁడు ౧ తనకుఁ బూర్వమున్న దుర్గుణము లన్నింటినిఁ బూర్తిగ విడిచి పరమార్థమును గడింప సాధుసజ్జనుల సమాగమము కోరువాఁడు సాధకుఁ డనఁబడును ౨ సాధుజనుల శరణ్యములోని కరుగువానిని సజ్జనులచే నాదరింపబడువానిని బెద్దలు శాస్త్రవచనములలో సాధకుఁడని చెప్పిరి. ౩ సాధుసజ్జనుల కడ నాత్మోపదేశము నొంది సంసారబంధములను దొలంగించుకొనుటకు సాధనము గావించువాఁడును, ఆత్మజ్ఞానము దృఢము గానుండుటకు నిరంతరము సాధన మొనరించువాఁడును సాధకుఁ డనఁబడును. ౪ వాఁడు అధ్యాత్మశ్రవణమునందును అద్వైతనిరూపణమునందును బ్రీతియు నభిరుచియు నుంచును. సద్గ్రంథములను మననము గావించి వానియర్థమును సారమును వెలికిఁ దీయును. ౫ సారాసారవిచారమును మనస్సునంచి యాలకించును. మఱియుఁ దనకుఁగల సందేహములను దొలంగించుకొని దృఢభావముతో నాత్మజ్ఞానవిచారణము చేయును. ౬ సాధకుఁడు తనహృదయమునందు నెలకొనియున్న బహువిధ సందేహములను రూపుమాపుకొనుటకై సత్సాంగత్యము నిరంతరము గావించుచుండును. మఱియు శాస్త్రానుభవమును, గురుని యనుభవమును ఆత్మానుభవమును (ఈ మూఁటిని) నేకము గావించును * ౭ సాధకుఁడు వివేకముతో దేహబుద్ధిని

---

* ఎంతదనుక సత్సాంగత్యము గలుగదో యంతదనుక నానావిధములగు సందేహములు నశింపవు. ఈసందియములను నశింపఁజేయుశక్తి సాధుజనులయందున్నది. సత్సాంగత్యవలన సాధకుఁడు, ఆత్మానుభవము, శాస్త్రానుభవము గురుని యనుభవమునొకటిగ సిద్ధాంతపరచును. ఇట్లు తనయనుభవము, శాస్త్రసిద్ధాంతము, గురునివలన బొందినయుపదేశము నభ్యాసము గావించినపిదప అంశమున సాధకున కీమూఁడు నొక్కటియనునంశ మనుభవములోనికి వచ్చును.

నిగ్రహించును. ఆత్మబుద్ధిని దృఢముగ ధారణ గావించును. మఱియు శ్రవణమననములను జేయుచునేయుండును ౮ దృశ్యమును (సంసారము, ప్రకృతి, మాయ) గూర్చిన యభిమానమును విడిచి సాధకుఁడు దృఢముగా నాత్మజ్ఞానమును ధారణము జేయును. వివేకసహాయమున సమాధానము నొందును ౯ ద్వైతోపాధిని (మాయికసృష్టిని) అద్వైతవస్తువును (కేవలబ్రహ్మమును) సాధకుఁడు సాధనములసహాయమునఁ బడయును. మఱియు నేకత్వమను సమాధి ననుష్ఠించును ౧౦ మలినమైయుండిన తన జ్ఞానమును బ్రకాశింపఁజేయుచు వివేకముతో నాతఁడు భవసాగరమును దాటిపోవును ౧౧ సాధకపురుషుఁడు సద్గ్రంథములవలన నెఱింగిన యుత్తమసాధులక్షణములను తనయాచరణములోనికిఁ దెచ్చుకొనును. పరమాత్మునిలో లీనమగుట కుత్సహించుచుండును. ౧౨ అసత్కర్మములను బరిత్యజించి సత్కర్మములను వృద్ధిగావించును. స్వరూపస్థితిని దృఢము జేయును. ౧౩ దిన దిన క్రమముగాఁ దనకడనున్న దుర్గుణములను విడనాడి యుత్తమగుణముల నభ్యసించును ఆత్మస్వరూపమునందు నిదిధ్యాసము (తదేకధ్యానము) పెట్టును ౧౪ దృశ్యము (సంసారము) అస్తిత్వముగా నున్నప్పటికిని తనదృఢనిశ్చయ బలసహాయమున దానికి బద్ధుఁడుగాక యాతఁడెల్లపుడును స్వరూపములోఁ గలసిపోవుచుండును ౧౫ ప్రత్యక్షముగనున్నను మాయను లక్ష్యపెట్టఁడు. మఱియు నలక్ష్యమును అదృశ్యమునగువస్తువు (బ్రహ్మము) ను అంతఃకరణమునందు లక్షించుచుండును. ఈవిధముగా ఆత్మస్థితిని సాధకుఁడు ధారణముచేయును ౧౬ జనులకు సాధ్యముగాక దాఁగియున్నదియు మనస్సహాయమున ననుమానముచేనైన నున్నటు లెఱుంగరానిదియునగు బ్రహ్మమునే సాధకుఁడు ధారణముగావించును ౧౭ వర్ణనమున కారంభించినంతన మాటలతోఁ జిక్క వాగ్బంధనము గలిగించునదియుఁ జూడనారంభించినంతన కానరాక గ్రుడ్డితనము గూర్చునదియు (వాఙ్నేత్రముల కతీతమైనదియు) నగు వస్తువును సాధకుఁ డనేకయుక్తులసహాయమునఁ బడయఁగలుగుచున్నాఁడు ౧౮ సాధించుటకు సాధ్యముగానిదియుఁ జూచుటకు దొరకొన్నంతన గానరానిదియునగు తత్త్వము నాతఁడనుభవములోనికిఁ దెచ్చుకొనును ౧౯ ఎచ్చట విచారణముగావింపఁజాలక మనస్సే లోపించిపోవునో ఎచ్చట తర్కమే కుంటువడిపోవునో యట్టివస్తు

వునే సాధకుఁడు దృఢముగా ననుభవములోనికిఁ దెచ్చుకొనును ౨౦ సాధకుఁడు స్వానుభవయోగముకతన శీఘ్రముగా వస్తువును స్వాధీనము జేసికొనుచున్నాఁడు. అంతియగాదు ఆతఁడే స్వయముగా వస్తువైపోవును ౨౧ ఆఁతడనుభవమార్గమును దెలిసికొని యోగిలక్షణములను బడయుచున్నాఁడు. మఱియు సంసారమున లిప్తుఁడై యుండి కర్మయోగి యగుచున్నాఁడు. ౨౨ ఉపాధికి వేఱుగానుండి సాధకుఁ డసాధ్యవస్తువును సాధనముల సహాయముచేఁ బడయఁ గలుగుచున్నాఁడు. ఆత్మస్వరూపముతో దనబుద్ధిని దృఢపఱచుచున్నాఁడు ౨౩ ఈశ్వరుఁడన నేమియో భక్తుఁడన నేమియో తెలిసికొనఁగోరి దానిమూలమును శోధించును. దేని సాధ్యముగావింపవలయునో యదిగాఁ దానుమాఱును ౨౪ సాధకుఁడు వివేకబలమున గుప్తుఁ (అంతర్ముఖుఁ) డగును. తనలోఁ దాన లుప్తుఁడై (స్వరూపమునందు నిరంతరము లయుఁడై) పోవును. మఱియు నొకవేళ (తనస్థూలశరీరముకనుపించుచున్నను) వానినెవ్వరును గాంచఁజాలరు ౨౬ వాఁడు నేను (అహం)అను దానిని వెనుకకుఁ ద్రోసివేయును. స్వయముగాఁ దన్ను దానన్వేషించును. తుర్యావస్థనుగూడ దాటిపోవును. ౨౭ అటుపిమ్మట ఉన్మనీయావస్థాంతమునం దాతఁ డఖండరీతితో స్వయముగాఁ దనతోఁ గలసిపోవును (అఖండాత్మానుభవము నొందును) ౨౮

ఈవిధముగా సాధకుఁడు ద్వైతసంబంధమును విడిచివేయును. భాసియొక్కభాసత్వమునకుఁగూడ సాక్షిగనుండఁడు. దేహమునందుండియే విదేహుఁడై పోవును. ౨౮ ఆతఁ డఖండస్వరూపస్థితియందుండును. దేహాహంకారమును విడిచివేయును. సందేహమును సంపూర్ణముగా నివృత్తిగావించుకొనును ౨౯ పంచభూతాత్మికమగు నీవిశాలప్రపంచమంతయు సాధకునకు స్వప్నమువలెఁ దోచును. మఱియు నాతనికి నిర్గుణస్వరూపము నిర్ధారణమైపోవును. ౩౦ స్వప్నమునందు దోచినభయము జాగ్రదవస్థలోఁగనుపింపనట్లు ఆతఁడీసంపూర్ణప్రపంచమును మిధ్యగాఁ దలంచును ౩౧ జనులకు సత్యముగాఁ గాన్పించుచున్న ఈమాయారూపమును సాధకుఁడు స్వానుభవమువలన మిధ్యగా భావించుచున్నాఁడు ౩౨ నిద్రను విడిచి మానవుఁడు జాగ్రదవస్థనొందినపిదప స్వప్నభయమునుండి విడివడునట్లు మాయనువిడిచి సాధకుఁడు స్వరూపస్థితినిఁ బ్రాప్తించుచున్నాఁడు.

౩౩ ఈవిధముగా వానియంతఃకరణము స్వరూపస్థితియందుండును. వెలుపలనుండి యాతఁడు నిస్పృహత్వము నవలంబించును. సంసారమును విరక్తిభావముతోఁ దలంచును. కామము, క్రోధము, మదము, మాత్సర్యము నొకప్రక్కకుఁ ద్రోసివేయును. ౩౫ సాధకుఁడు కులాభిమానమును ద్యజించును. లోకలజ్జను గూలద్రోయును. విరక్తిబలము నూతఁగాఁగొని పరమార్థభేరిని మ్రోగించును. ౩౬ అవిద్యనుండి దూరమగును. ప్రపంచమునుండి తొలంగును. ఆకస్మికముగా లోభమునుండి యావలఁబడును. ౩౭ నేను గొప్పవాఁడనను అహంభావము నంతరింపఁజేయును. వైభవమున కరికాలు చూపును. విరక్తిబలమువలనఁ బ్రతిష్ఠనుఁగూడ ధిక్కరించివేయును. ౩౮ భేదమును నాశనముగావించును. అహంభావమును గొట్టివేయును. మఱియు సందేహరూపమును (సందేహమును) ఆవలకుఁ జిమ్మును. ౩౯ వికల్పమును వధించును. భవసింధువును దన్ని దిక్కులకు వెడఁజల్లును. సమస్తజీవులపట్లఁ దనకుఁగల విరోధమును త్రెంపివేయును. ౪౦ పాపభయమునకు వెఱపుగలిగించును. కాలపుటెక్కలను విఱచివేయును. జన్మమృత్యువుల మస్తకములను జూర్ణముగావించును ౪౧ దేహసంబంధమగు అహంభావము పైకి దండెత్తును. సంకల్పముపై దాడివెడలును. కల్పనము లాకస్మికముగాఁ జంపివేయును ౪౨ భీతిని నాకస్మికముగాఁ దాడన మొనరించును. లింగదేహమును శిధిలముగావించును. పాషండమతమును వివేకబలముచే నోడించును. ౪౩ గర్వమును బరాభవించును. స్వార్థము ననర్థమునఁ బడవేయును. అనర్థమును గూడ నీతిచే న్యాయముచే ఖండించివేయును ౪౪ మోహమును మధ్యనే త్రెంచివేయును. దుఃఖమును నిర్మూలనము చేయును. శోకమును బీక్చి యొకమూలపారవేయును. ౪౫ ద్వేషమును తనసరిహద్దులలో నిలువనీయఁడు. నాస్తికత్వమును బెగటార్చును. మఱియు సాధకుని భయమువలనఁ గుతర్కము మొదలంట నశించును ౪౬ జ్ఞానమువలన వివేకమును వివేకమువలన వైరాగ్యవిషయికనిశ్చయభావమును ప్రబలము గావించుకొని సాధకుఁడు తనయెడనున్న దుర్గుణములనన్నింటిని వినాశనమొనర్చును. ౪౭ అధర్మమును స్వధర్మముతో జయించును. కుకర్మములను సత్కర్మములవలన రూపుమాపును. విచారమువలన అవిచారమును

దీసివేయుమార్గము జూపించును. ౮ తిరస్కారమును దిరస్కరించును. ద్వేషమును గూలార్చును. విషాదమును సంతోషముచే నిర్జించి లోఁగొనును. ౯ కోపముమీఁద దనయధికారము జూపును. కపటమును లోలోననే నశింపఁజేయును. ప్రపంచమునందలి సమస్తమానవబృందమును దనకుమిత్రులనుగాఁజేసికొనును ౧౦ ప్రవృత్తిని బరిత్యజించును. సుహృదుల సాంగత్యమును విడిచివేయును. నివృత్తిమార్గమును జ్ఞానయోగమును బడయును ౧౧ సాధకుఁడు విషయరూపిణియగు మోసకారిని మోసగించును. కువిద్యను ముట్టడించును. ఆప్తరూపులగు చోరులనుండి తాను తొలంగి బైటఁబడును. ౧౨ పరాధీనతపై నాగ్రహించును. మమకారమును దరికి జేరనీయఁడు. ఆకస్మికముగా దురాశాత్యాగము గావించును. ౧౩ స్వరూపమునందు హృదయమును మగ్న మొనరించును. యాతనకు యాతన గూర్చును. ఉద్యోగప్రయత్నములకు వీడ్కోలు దెలుపును ౧౪ సాధన మార్గములతో నభ్యాసప్రయత్నములు గావింపనారంభించును. ప్రయత్నపూర్వకముగాఁ బని కారంభించును. ప్రయత్నమును దనకుమంచిసహకారినిగాఁ జేసికొనును ౧౫ సాధకుఁడిట్లు వర్తించి యనంతరము సావధానుఁడును దక్షుఁడునునై నిత్యానిత్యవివేచనము జేయును. మఱియు దేహబుద్ధిసాంగత్యమును విడనాడి కేవలసత్సంగమును బరిగ్రహించును ౧౬ సంసారమును బలవంతముగా వదలిపెట్టును. వివేకముతో గృహస్థసంబంధములగు చిక్కులనన్నిఁటిని విడిచివేయును. మఱియు శుద్ధాచారము నూతనగాఁగొని యనాచారమును భ్రష్టముచేయును ౧౭ మఱపును దరిచేరనీయఁడు. ఆలస్యమున కలసత గూర్చును. దుశ్చిత్తముతో నిముసమేని వర్తింపఁడు. దుశ్చిత్తముతో నుండుట కియ్యకొనఁడు ౧౮

సాధకపురుషుఁడు అధ్యాత్మికనిరూపణశ్రవణముగావించి యవగుణములను వీడును. ఉత్తమమార్గములలోనికి వచ్చును. ౧౯ ఆతఁడు దృఢభావముతో విరక్తుఁడై పరమార్థమార్గమును బడయుటకై సాధనములను జేయును. ఇఁక సిద్ధలక్షణములను ముందుసమాసములోఁ దెలుపుచున్నాఁడను. శ్రోతలారా! సావధానులై వినుండు ౨౦ ఇచట నిస్పృహుఁడును, విరక్తుఁడును నగుపురుషుఁడే సాధకుఁడగునా? సంసారమునందున్న మనుష్యులు త్యాగము చేయనిచో సాధకులు కాఁజాలరా యనునొకసందియము కలుగుచున్నది.

౨౧ ఈశంకకు సమాధానముగూడ రాఁబోవుసమాసమునందుఁ జెప్పెదను. ధ్యానపూర్వకముగా వినఁగోరెదను ౨౨.

పదియవసమాసము.

సిద్ధలక్షణములు.

సంసారమునం దుండెడిమానవులు త్యాగముగావింపనియెడల సాధకులు కాఁజాలరా? యను గతసమాసమునందలి సందేహమున కిప్పుడు సమాధానమును జెప్పుచున్నాఁడను ౧ గృహస్థధర్మము పరిపాలించుచు సాధకుఁడు గాఁదలఁచినయెడల మానవుఁడు సన్మార్గస్వీకారమును అసన్మార్గత్యాగమును జేయవలసియే యుండును. ౨ కుబుద్ధిని విడుపకున్న సుబుద్ధి కలుగఁజాలదు. కావున కుబుద్ధిని, అసన్మార్గమును బరిత్యజించుటయే సంసారమనుజుని (గృహస్థుని) త్యాగము ౩ ప్రపంచమును జెడ్డదిగా భావించి మనఃపూర్వకముగా నెప్పుడు మానవుఁడు విషయత్యాగమొనరించునో యప్పుడే ముందునకువచ్చి పరమార్థమును బడయగల్గును. ౪ నాస్తికత్వము, సంశయము, అజ్ఞానము త్యాగము, పరమార్థము బడసినపిమ్మట మెల్లమెల్లఁగా జరుగును ౫ పైనినుడివిన యాంతరికత్యాగము సాంసారికులు, నిస్పృహులు (విరాగులు) చక్కఁగా నిర్వహింపవలయును. నిస్పృహునికొఱకై బాహ్యత్యాగము నింకను విపులముగాఁ జెప్పఁబడియున్నది ౬ కానిసాంసారికుల (గృహస్థుల) పట్లగూడఁ గొన్నికొన్నియెడల బాహ్యత్యాగ మవశ్యముగాఁ గావలసియున్నది. ఏలయన ఈత్యాగమే లేకున్నచో నిత్యనియమము, సద్గ్రంథశ్రవణము జరుగఁజాలదు ౭ దీని వలనఁ బైనిబేర్కొనఁబడిన సందేహమునకు సులభముగా సమాధానము కలుగును (అనఁగా త్యాగము లేనిది సాధకుఁడు కాఁజాలఁడు) ఇప్పుడు మనము పూర్వనిరూపణములోనికిఁ బోదము రండు ౮ గతసమాసములో సాధకుని లక్షణములు చెప్పితిని. ఇప్పుడు సిద్ధలక్షణములు వినుండు. ౯

సిద్ధపురుషుఁడు స్వయముగా బ్రహ్మమైపోవును. వానిసంశయము బ్రహ్మాండమునుదాటి యావలికిఁ బోవును. ఆతనినిశ్చయము అచలమై యుండును. ౧౦ బద్ధుని అవగుణములు ముముక్షువునం దుండవు. ముము

క్తునిలక్షణములు సాధకునియం దుండవు. ౧౧ అటులే సాధకునిసందేహావృత్తి ముందునకరిగిన పిమ్మట సిద్ధావస్థయందు నివృత్తియై పోవును. కావున నెట్టిసందేహములకును ఆస్పదముగా నుండనివానిని సిద్ధపురుషుఁడని దెలిసికొనవలయును. ౧౨ సంశయరహితమగు జ్ఞానమే సాధులక్షణము. సిద్ధపురుషుల కెన్నఁటికిని సందేహము కలుగఁజాలదు. ౧౩ కర్మమార్గము సందేహములతో నిండియున్నది. సాధనములవలన సంశయ ముత్పన్నమయ్యెను. అన్నిఁటియందును సంశయము నిండియున్నది. నిస్సందేహుఁడు సాధుపురుషుఁ డొక్కఁడేనుమా! ౧౪ ఎవనికేని యొకవేళ తనజ్ఞానముపట్లను, వైరాగ్యముపట్లను, భజనముపట్లను, సందేహముండినచో, నవియన్నియు నాతనికుపకరింపక నిష్ఫలములగును. ౧౫ అటులే యెవనికేని యీశ్వరునియందును దనభక్తియందును సందేహమున్నచోఁగాని, లేక తనస్వభావమునందే సందేహమున్నచోఁ గాని, వాని సాధనములన్నియు వ్యర్థములగును ౧౬ ఎవనికేని తనవ్రతము, తీర్థము, పరమార్థము మున్నగువానియెడ సందేహమున్నయెడల నవియన్నియు నాతనిపట్ల నిష్ఫలములగును ౧౭ సంశయాత్మకమగు భక్తియుఁ బ్రీతియు సాంగత్యమును వ్యర్థము. మఱియు వానివలన సందేహములే యభివృద్ధి నొందును ౧౮ సంశయసహితమగు జీవితము, సంశయసహితమగుకృత్యము సంశయసహితమగు ధారణము మున్నగునవన్నియును వ్యర్థములు. ౧౯ పుస్తకము, శాస్త్రజ్ఞానము ఏదేఁపని, సందేహసహితమైనచో (నిశ్చయరహితమైనచో) వ్యర్థము ౨౦ సంశయయుక్తమగు దక్షత్వమును సంశయయుక్తమగు పక్షపాతమును వ్యర్థములు. సంశయయుక్తమగు జ్ఞానముగలవాని కెన్నఁటికిని మోక్షము లభింపఁజాలదు ౨౧ సాధువులు, బండితులు బహుశ్రుతులు, నగువారలుసైత మొకవేళ సంశయసహితులుగను నిశ్చయరహితులుగను నున్నచో వారును వ్యర్థులేయగుదురు ౨౨ సంశయుని శ్రేష్ఠత్వమును ఉత్పన్నతయును వ్యర్థములు. అటులే సంశయుని నిశ్చయరహితమగు జ్ఞాతృత్వముగూడ వ్యర్థమే. ౨౩ నిశ్చయములేనిచో నేదియు అణుమాత్రమేని ప్రామాణ్యమును గలిగియుండదు. ఇవియన్నియు వ్యర్థములై సందేహప్రవాహములోఁ బడిపోయినవి ౨౪ నిశ్చయములేక చెప్పెడిదంతయుఁ బరిగ్రహింపఁ దగనిది. వాచాలుఁడై యమితముగాఁ

జెప్పుటయు వ్యర్థమేయగును ౨౫ నిశ్చయములేని వల్లనము (ఉపన్యాసము) విలంబనామాత్రమే. సంశయమువలన సమాధానమెద్దియును లభింపఁజాలదు. ౨౬ కావున సందేహరహితమును నిస్సంశయమును నగు జ్ఞానమే మఱియు నిశ్చయ యుక్తమగు సమాధానమే సిద్ధలక్షణము ౨౭ దీనినంతయు విన్నపిదప శ్రోత యిటులఁ బ్రశ్నించుచున్నాఁడు. నిశ్చయ మెద్దానినిగూర్చి చేయవలయును. నిశ్చయమనుదానికి ముఖ్యలక్షణములెవ్వి! సెలవిండు ౨౮ మంచిది వినుఁడు. దైవతము ఎట్టిదో తెలిసికొనుటయే నిశ్చయమునకు సరియగు లక్షణము. ఇది దక్క నానావిధములగు దేవతలగొడవ యెప్పుడును వ్యాపింపఁజేయఁదగదు ౨౯ ఎవఁడు చరాచరములను సృజించెనో యాభగవానునిగూర్చి విచారింపవలయును. మఱియు శుద్ధమగు వివేకము నుపయోగించి పరమాత్ముని గుర్తింపవలయును. ౩౦ ముఖ్యదైవతమెద్దియో భక్తునిలక్షణము లెయ్యవియో యెఱుంగవలయును. అసత్యమును విడనాడి సత్యమును గ్రహింపవలయును. ౩౧ మొట్టమొదట తనసత్యదేవుని గురితింపవలెను. తరువాత నేననువాఁడెవఁడు అనువిషయమును శోధింపవలయును. సర్వసంగపరిత్యాగము గావించి సిద్ధుఁడు వస్తురూపియై (బ్రహ్మస్వరూపుఁడై) యుండవలయును. ౩౨ బంధనములవలనఁ గలుగు సంశయములను ద్రెంచివేయవలయును. మోక్షమునుగూర్చి నిశ్చయము జేసికొనవలయును. పంచభూతములను విచ్ఛేదముగావించి వానియన్వయము (మిశ్రణము) ఎటులగుచున్నదో చూడవలయును ౩౩ పూర్వపక్షమును సిద్ధాంతముతోఁ గలిపి ప్రకృతిమూలమును వీక్షింపవలయును. దీనికిఁ బిమ్మట శాంతముగాఁ బరమాత్మ నిశ్చయము ప్రాప్తించును ౩౪ సంశయము దేహాభిమానముతోఁగలసి సత్యమగు సమాధానమును వినాశనము గావించును. కావున ఆత్మబుద్ధియొక్క నిశ్చయమును స్థిరముగా నుంచవలయును. ౩౫ ఆత్మజ్ఞానము సిద్ధించినపిదపఁగూడ నొకానొకఁడు దేహాభిమానమునకు సందేహ కల్పనమునకుఁ బాలగుచుందురు. కావున ఆత్మనిశ్చయ పూర్వకమగు సమాధానమును రక్షణము గావించు

చుండవలయును. ౩౬ * దేహబుద్ధిజ్ఞప్తికిరాఁగానే వివేకము విస్మరణము (మఱపు)నకు వచ్చును. కావున ఆత్మబుద్ధిని దృఢముగా ధారణముచేయ వలయును. ౩౭ నిశ్చయమునుగూర్చిన యాత్మబుద్ధికలుగుటయే మోక్షశ్రీయొక్క దశ. "అహమాత్మ" (నేనాత్ముఁడను) అనుదాని నెన్నఁటికిని మఱువఁజనదు ౩౮ ఈవిధముగా నిచ్చట నిశ్చయలక్షణమును గూర్చి తెలిపితిమి. కాని సత్సాంగత్యములేనిచో నిది విశదముగాఁ దెలిసికొనవీలుగాదు. సాధుజనుల శరణ్యములోని కరుగుటవలన సమస్త సందేహములు నివారణమగును ౩౯

మంచిది. ఇపుడీవార్తను ముగింతము. సిద్ధులలక్షణములను దెలుపుచున్నాఁడను వినుఁడు. నిస్సందేహత్వమే సిద్ధునిముఖ్యలక్షణము ౪౦ సిద్ధస్వరూపములందు దేహమేలేదు. (నిరాకారుఁడు)ఇఁక నచట సందేహమెక్కడినుండి వచ్చును. ౪౧ దేహాభిమాన కారణమున అనేకలక్షణములతో ఆస్తిత్వము కలుగుచుండును. కాని యెవఁడు దేహాతీతుఁడో వానికేమిలక్షణములను జెప్పవీలుకలుగును. ౪౨ నేత్రములతోఁ జూచుటకు వలనుగానిదాని లక్షణములను మాటలతో నెటుఁ వివరింపఁగలను. నిర్మలవస్తువగు (కేవలబ్రహ్మస్వరూపుఁడగు) సిద్ధునియందితరలక్షణము లెక్కడనుండివచ్చును ౪౩ లక్షణములనఁగా కేవలగుణములు. అటు వస్తువన్ననో (బ్రహ్మ) నిర్గుణమయ్యెను. ఆవస్తురూపుఁడగుటయే (నిర్గుణబ్రహ్మరూపుఁడగుటయే) సిద్ధునిలక్షణము ౪౪ ఐనను జ్ఞానదశకమునందు సిద్ధులలక్షణములను గురుతించురీతిగా వివరించితిని. కావునఁ బ్రస్తుతసమాసమునం దీవ్యాఖ్యానము చాలునని సమాప్తిగావించితిని. న్యూనాధిక్యములను గూర్చి శ్రోతలు క్షమించెదరుగాక ౪౫

ఐదవదశకము సమాప్తము.

---

* దేహబుద్ధి—దేహమే నేనను భావమును గ్రహించుట.
- నేనను శబ్దమునుండి దేహాతీతమగు ఆత్మయను నర్థమును గ్రహించుట.

ఆఱవదశకము.

మొదటి సమాసము.

పరమాత్ముని గురుతించుట.

* చిత్తమును స్థిరముగావింపుఁడు. శ్రోతలారా! ఇదివఱకుఁ జెప్పినదంతయు మనస్సునం దుంచుఁడు. మఱియు నింక నొక క్షణమాత్రము సావధానమతితోఁ గూర్చుండి చెవియొగ్గి యాలింపుఁడు. ౧ ఒక గ్రామమునందైనను లేక యొక దేశమునందైనను మనము నివసింపవలసియున్నయెడలఁ దొలుతొలుత నాగ్రామమునుగాని దేశమునుగాని పరిపాలించుస్వామిని (యజమానిని) కలసికొనవలయును. అతనితో సమావేశముగావింపఁజాలమేని సౌఖ్యము లభింపఁజాలదు ౨ కావుననెవ రెచట నివసింపఁబోవుచున్నారో యచటి యజమానిని గలసికొనుట యావశ్యకము. దానివలన సమస్తవిధములచేతను మేలుకలుగును ౩ స్వామి (యజమాని)తో సమావేశము గావించి పరిచయము జేసుకొననిచో మానావమానములు కలుగుట సహజము. యజమానితోఁ బరిచయము గలుగఁజేసికొననివానికి అగౌరవము (మహత్త్వముపోవుట) కలుగుట కెంతయో యాలస్యము పట్టదు ౪ ఈకారణములకతన శ్రీమంతుఁడు మొదలుకొని దరిద్రుఁడుదనుక నెవ్వఁడెందు నాయకుఁడుగానుండునో యట్టివానిసమావేశ మవశ్యముగా నొనరింపవలయును. ఆలోచనాశక్తిగల మానవుఁడీవిషయములోని రహస్యమును దెలిసికొనఁగలుగును ౫ యజమానితో నేమి పనియని యతనిని గలిసికొనక గ్రామములో వసించినయెడల రాజదూతలు వెట్టిపనులకుఁ బట్టుకొనిపోయెదరు. మఱియు దొంగతనము

---

* మొట్టమొదట కష్టమయసంసారము, త్రివిధతాపములు, నవవిధభక్తులు, విరక్తులు, సద్గురుఁడు, సచ్ఛిష్యులు, శుద్ధజ్ఞానము మున్నగు విషయములనుగూర్చి, కావించిన చర్చయంతయు మనస్సులో నుంచుకొనవలయును. ఈచెవినుండి విని యాచెవినుండి విడువఁగూడదని శ్రీసమర్థ రామదాసస్వామి శ్రోతలకు సూచించినాఁడు.

ముందు అధ్యాత్మనిరూపణము కాఁబోవుచున్నది గావున స్థిరచిత్తులుకండని శ్రోతలను శ్రీసమర్థులు హెచ్చరించిరి.

చేయఁబోయినను దొంగనేరమువచ్చి తలపైఁ బడును ౬ కావున నేర్ప
రియు నుచితవివేకియు నగుమానవుఁడు యజమానితోఁ దప్పక పరిచ
యము సంపాదింపవలయును. ఇట్లు గావింపనివారికి గార్హస్థ్యజీవితము
నందు అనేకసంకటముల ననుభవింపవలసి వచ్చును. ౭ గ్రామమునందు
గ్రామాధికారి పెద్దయనిపించుకొనును. వానికంటె దేశాధిపతి
పెద్దవాఁడు. దేశాధిపతికంటె రాజు గొప్పవాఁడుగాఁ బరిగణింపఁబ
డును. ౮ రాష్ట్రమునకంతకును నెవ్వఁడు యజమానియో వానిని రాజం
దురు. మఱియుఁ బెక్కురాష్ట్రములకు యజమానియగువానిని మహారా
జందురు. ఇటులే మహారాజులకుఁగూడ నధిపతిగానుండువానిని జక్రవర్తి
యనియందురు ౯ ఒకఁడు నరపతియైయుండును. మఱియొకఁడు గజపతి
యైయుండును. వేఱొకఁడు అశ్వపతియైయుండును. ఇంకనొకఁడు భూపతి
యైయుండును. కానివీరలందఱిలోఁ బెద్దవాఁడు చక్రవర్తియైయున్నాఁడు ౧౦
వీరలనందఱు సృజించినవాఁడు బ్రహ్మ. కానియాబ్రహ్మను సృజిం
చినదెవఁడో యెఱుంగవలయును ౧౧ బ్రహ్మను, విష్ణును, మహేశ్వరుని
కూడ నెవరుసృజించెనో యాతఁడే వేలుపులందఱిలో గొప్పవాఁడు. ఆవే
లుపుపెద్దయగు పరమేశ్వరుని నానాప్రకారములగు సాధనములతో
గురుతింపవలయును ౧౨ ఆపరమాత్ముని ప్రాప్తికలుగ నంతదనుక యమ
యాతన తొలంగి పోవఁజాలదు. అట్టిబ్రహ్మాండనాయకునితో మనకు
సమావేశము గలిగించుకొనకుండుట శ్రేయోదాయకముగాదు ౧౩ సమ
స్తచరాచర భూతావృతమగు నీవిశ్వమును సృజించినవాఁడును బ్రహ్మాండ
మునుగల్పించినవాఁడునునగు పరమాత్ముని గురుతింపజాలనివాఁడు పతితుఁ
డు (పదచ్యుతుఁడు) ౧౪ కావున నీశ్వరుని గురుతించి జన్మము సార్థకము
గావించుకొనవలయును. ఒకవేళ నీవిషయమావంతయేని తెలియకున్న
యెడల సజ్జనసాంగత్యము గావింపవలయును. దానివలన సమస్తమును
దేటతెల్లమగును ౧౫ ఎవఁడు భగవానునెఱుంగునో యతఁడె అవతారపు
రుషుఁడు. అతఁడే నిత్యానిత్యములను శాశ్వతాశాశ్వతములను
నిశ్చయింపఁ గలిగియుండును ౧౬ పరమాత్ముని అచలుఁడనియు
అవికారియనియు నెవఁ డనుభవపూర్వకముగా నెఱింగియున్నాఁడో
వానిని మహానుభావుఁడనియు అవతార పురుషుఁడనియు సాధువ

నియు నెఱుంగవలయును ౧౭ మానవసంఘములో నివసించుచుం
డియు మానవాతీతములును అలౌకికములును నగువిషయములనుగూర్చి
భాషించునాతఁడును ఆంతర్యమునందు నిరంతరమును బ్రజ్వలించు జ్ఞాన
ముతో నుండువాఁడును సాధుపురుషుఁడు ౧౮ పరమాత్మునియొక్క నిర్గు
ణనిరాకారమును అనుభవము గావించుకొనుటయే ముఖ్యమగు జ్ఞానము.
దీనికి భిన్నములగు నవన్నియు నజ్ఞానములు ౧౯ కొందఱుమనుష్యులు
పొట్టనిండించుకొనుట కభ్యసించు విద్యలనన్నింటినికూడ జ్ఞానమని నుడువు
దురు. కాని వానివలన నెన్నఁటికిని జన్మము సార్థకముగాదు ౨౦ పర
మాత్ముని గుర్తించుట కేవిద్యయుపకరించునో యదియే జ్ఞానము. దాని
వలననే జీవితము సార్థకము సఫలము నగును. తక్కినవన్నియు నిరర్థక
ములు. పొట్టకూటివిద్యలు ౨౧ మానవులు బ్రతికియున్నంతదనుక
పొట్టను నిండించుకొనుచునే యుందురు. దేహరక్షణము గావించుచునే
యుందురు. అంత్యకాలమున కివియన్నియు వ్యర్థములై పోవును ౨౨
కావునఁ బొట్టనిండించుకొనుటకై నేర్చుకొనువిద్యలనన్నిఁటిని సద్విద్యలని
చెప్పఁదగదు. ఏవిద్యవలన సర్వవ్యాపకమగు బ్రహ్మము తత్కాలము
నందే లభించునో యదియే జ్ఞానము ౨౩
ఇట్టిజ్ఞాన మెవనికడనున్నదో వానినిసాధువని యెఱుంగవలయును.
వానియొద్దకరిగి పరమశాంతికి వలయు నుపాయమడుగవలయును. ౨౪
అజ్ఞానపురుషునియొద్ద కజ్ఞానిపోయిన యెడల జ్ఞాన మెటుల లభించును?
దరిద్రునియొద్దకు యాచించుట కొకవేళ దరిద్రుఁడేగినచో ధనమెటుల
లభించును ౨౫ పిశాచముయొద్దకుఁ బిశాచముపోయినయెడల నేయుద్దే
శము వెలువడఁగలదు? ఒకవేళ నున్మత్తునియొద్ద నున్మత్తుఁడు సమావేశ
మైనయెడల వారలకు సమాధానములుజెప్పి బోధింపఁగలవాఁ డెవఁడు?
౨౬ భైక్షుకునివలన భిక్షము, దీక్షాహీనునివలన దీక్ష, కృష్ణపక్షమునందు
వెలుతురు ఎన్నఁటికిని లభింపఁజాలదు ౨౭ రోగియొద్దకు రోగి యొకవేళ
పోయినయెడల వానికారోగ్య మెటుల లభించును? దుర్బలునికడ దుర్బలు
నకు సహాయ మెటుల కల్గును? ౨౮ నియమహీనునియొద్దకు నియమహీను
డేగినచో నెన్నఁటికిని నియమవంతుఁడు గానేరఁడు. బద్ధపురుషుఁడు బద్ధుని
వద్ద కేగినచో నెన్నఁటికిని సిద్ధుఁడు గాలేఁడు ౨౯ దేహాభిమాని దేహాభి

మానికడ కరిగినయెడల విదేహుఁ డెన్నఁటికిని గాఁజాలఁడు. ఇటులే జ్ఞానహీనునికడకు జ్ఞానహీనుఁ డేగినచో జ్ఞానమార్గ మెన్నఁటికిని లభింపదు ౩౦ కావున ముముక్షువగువాఁడు జ్ఞానిని శోధించి కనుఁగొని యాతని యనుగ్రహమును సంపాదించి సారాసారమునుగూర్చిన విజ్ఞానమును బడయవలయును. అప్పుడే మోక్షము లభించును. ౩౧

రెండవసమాసము

పరమాత్మప్రాప్తి.

శ్రోతలారా! సాయుజ్యముక్తి ప్రాప్తించెడి యుపదేశలక్షణములను మీకెఱింగించెదను, చెవియొగ్గి వినుండు. నానావిధములగుమతములను దెలిసికొనుచు నుండుటవలనఁ బ్రయోజన మెద్దియు లేదు. ౧ బ్రహ్మజ్ఞానములేని యుపదేశములయందు విశేషమెద్దియు నుండదు. అది ధాన్యమును దీసిన పొట్టువంటిది. ౨ ఉముకయందు ధాన్యము, చల్లయందు వెన్నయు లభింపదు. బియ్యమును గడిగిన నీటికిఁ దెల్లదనమున్న నుండుఁగాక పాలరుచి కలుగఁజాలదు ౩ ఏదేని ఫలవృక్షమును జేరి దాని తొటతినుట, దానిబెరఁడునమలుట లేదా రసమునువిడిచి పిప్పిని భుజించుట మూర్ఖత్వము ౪ ఆవిధముగనే బ్రహ్మజ్ఞానములేని యుపదేశములను బడయుటయు వ్యర్థము. అంతియగాక యసారముగూడ, చతురుఁడగు పురుషుఁ డెన్నఁటికిని సారమునువిడిచి యసారమును బరిగ్రహింపఁడు ౫

ఇప్పుడు నిర్గుణపరబ్రహ్మమును నిరూపించుచున్నాఁడను కావున శ్రోతలు స్థిరచిత్తులు గావలయును. ౬ ఈసృష్టియంతయుఁ బంచమహాభూతములతో రచింపఁబడినది. అది యెప్పటికిని స్థిరముగా నుండఁజాలదు ౭ ఈపాంచభౌతికసృష్టి కాద్యంతములయందు నిర్గుణబ్రహ్మము గలఁడు. ఆతఁడుమాత్రమే శాశ్వతుఁడు. తక్కిన పాంచభౌతిక మెంతగలదో యదియంతయు నాశన మగుచుండును. ౮ ఈభూతములను బరమాత్మయని యెటుల నుడువఁగలము? ఒకవేళ నేమనుష్యునేని భూతమన్నచో నాతఁడు కోపించును ౯ ఇఁకఁ బరమాత్ముఁడన్ననో జగత్పిత. ఆతనిమహిమను బ్రహ్మాదులుసైత మెఱుంగరు. అట్టివానికి భూతోపమాన మెంతమాత్రము తగియుండదు. ౧౦ పంచభూతములవలె బరమాత్ముఁడున్నాఁడని చెప్పుదుమేని మిథ్యాదోషము కలుగును. ఈవిషయము సాధుజను లెఱుంగుదురు. ౧౧ పృథ్వి, జలము, తేజము, వాయువు, ఆకాశము అనునవి లోపలను వెలుపలను అన్నిస్థలములందును జగదీశునిచే వ్యాప్తములైయున్నవి. కాని యీపంచభూతములు నాశనమగును. వీనియందున్న పరమాత్ముఁడుమాత్రము అవినాశిగా నుండును ౧౨ రూపము, నామము ఎంతదనుకఁగలవో అంతదనుక సమస్తమును భ్రమయే కావున నామరూపముల కవ్వలనున్న దానిమర్మమును అనుభవపూర్వకముగా గ్రహింపవలయును ౧౩ పంచభూతములతోడను త్రిగుణములతోడను గలసి యీయష్టవిధప్రకృతి యేర్పడినది. దీనికే దృశ్యమనిపేరు ౧౪ అట్టి యీదృశ్యమునంతను (ప్రకృతిని) శ్రుతులు నాశవంతమనియును నిర్గుణబ్రహ్మము శాశ్వతమనియును జెప్పుచున్నవి. ఈవిషయమును జ్ఞాను లెఱుంగుదురు ౧౫ * బ్రహ్మము శస్త్రములచే ఛేదింపఁబడదు. అగ్నిచే దహింపఁబడదు. నీటను గరుగఁజాలదు. వాయు వెగురఁగొట్టనేరదు. అది పడుచు లేచుచు నుండునదిగాని కూడ్డివీడునదిగాని కాదు. ౧౬, ౧౭ బ్రహ్మమేదేని వర్ణముగలదికాదు. అది యన్నింటికంటెను నావలనున్నది. అది యెక్కడికక్కడ సూక్ష్మరూపముతో నిండియున్నది, ౧౮ కనిపింపకపోయిననేమి! అది సర్వస్థలములయం దిమిడియున్నది. ఎక్కడికక్కడ సూక్ష్మరూపముతో నిండియున్నది. ౧౯ తమకుఁ గనిపించుదాని నున్నదనుట, కనుపింపని దానిని గోప్యమనిచెప్పి యుపేక్షించుట మానవున కొక యభ్యాసముగా నేర్పడినది. ౨౦ కాని సత్యమేమన ప్రకటనముగానున్న దానినంతిను అసారముగఁ దెలిసికొనవలయును. మఱియు గుప్తముగానున్నదానినే సారముగా నెఱుంగవలయును ౨౧ ఎయ్యది తెలియఁబడకుండునో (ఆబ్రహ్మమును) దానిని వివేకబలముచే గ్రహింపవలయును. ఎయ్యది కానబడకుండునో దానిని వివేకబలముతోఁ జూడవలయును.

---

* ఈయంశమే భగవద్గీతలోఁ గృష్ణపరమాత్ముఁ డిటులఁజెప్పెను.

శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి । నైనం దహతి పావకః

నచైనం క్లేదయత్యాపో । నశోషయతి మారుతః॥

మఱియు నెయ్యది యెఱుంగబడదో దానిని వివేకబలముచే నెఱుంగవలయును. ౨౨ ఎయ్యది గుప్తమో దానినిఁ బ్రకటింపవలయును. ఎయ్యది యసాధ్యమో దానిని సాధింపవలయును. ఎయ్యది యభేద్యమును గఠినమునై యున్నదో దానినే చక్కఁగ నభ్యసింపవలయును ౨౩ చతుర్వేదము, చతుర్ముఖబ్రహ్మ, సహస్రముఖుఁడగు శేషుఁడు, ఎద్దానిని వర్ణించివర్ణించి విసిగి పోయిరో యాపరబ్రహ్మమును బడయవలయును ౨౪ అది సాధుజనుల ముఖమున అధ్యాత్మనిరూపణశ్రవణము గావించుటవలనఁ బ్రాప్తించును. ౨౫ పరబ్రహ్మమన పృథివ్యాపస్తేజోవాయురాకాశములు గావు మఱియు నదివర్ణరూపనామములతో వ్యక్తము కాఁజాలదు. అన్నివిధముల నది అవ్యక్తమైయున్నది ౨౬ అదియే సత్యముగాద్వైతము. సాధారణజనులు తమయజ్ఞానమువలన ననేకదేవతలను గల్పించిరి. లోకములో నెన్నిగ్రామములున్నవో యన్నిదైవతము లేర్పడియున్నవి ౨౭ ఇది పరమాత్మనుగూర్చిన నిశ్చయము. (పరమాత్ముఁడు నిర్గుణుఁడని బోధయైనది) ఇఁక స్వయముగాఁ దనను వెదకికొనవలయును ౨౮ "ఈశరీరమునాది" అని తెలిసికొనునది యేదియో అది వాస్తవమునకు (ఆత్మ) శరీరముకంటె వేఱుగ నున్నది. ఎయ్యది "నామనస్సు" అని నుడువుచున్నదో అది వాస్తవమునకు మనస్సుకంటె భిన్నముగ నున్నది ౨౯ ఇట్లు దేహవిచారమును గావించుటవలన నిదియంతయును బంచభూతములతోడనే నిర్మింపఁబడియున్నదని విదితమగుచున్నది. ఇపుడా పంచతత్త్వములను పంచతత్త్వములలోనికి వేఱువేఱుగాఁ జేర్చివైచినచో మిగులునట్టి సారమిఁక నేమియునుండఁబోదు. ఆత్మయే మిగులును ౩౦ ఇపుడు మనము దేనిని "నేను నేను" అని చెప్పుచున్నారమో దానిజాడ లెచ్చటను గనిపింపవు. కావున ఆత్మను శోధించుటెట్లు? ఐదు తత్త్వము లుండెను. అవి ఎక్కడివక్కడనే కలిసిపోయెను ౩౧ ఈవిధముగా విచారముగావించిన మీఁదట నీశరీర మొక్క పంచతత్త్వముల మూటఅనియు ఇది నశించిపోవుననియు, రెండవది యాత్మఅనియు నది యవినాశియై యుండుననియు విదితమగుచున్నది. అంతియేగాని యీరెండుదప్ప మూడవది యగు నేనుగీను అనునదియెచ్చటనెద్దియును లేదు ౩౨,౩౩ ఎప్పుడు "నేను" అనుదానిజాడయే లేదో అప్పుడు జన్మమృత్యువు లెవ్వారివగును? అవియెట్లు జరుగును? ఒకవేళ

ఆత్మయే జన్మమును దాల్చునని చెప్పునెడల నదియించుకయేని పొసఁగఁజాలదు. ఏలయన! ఆత్మ పాపపుణ్యములకు జన్మమృత్యువులకు వేఱుగానున్నది. ౩౪ ఎప్పుడా నిర్గుణమునందు పాపపుణ్యములు జననమరణములు యమయాతనలు మున్నగునవి లేవో అప్పుడు మనయందుఁగూడ నవి లేవు. ఏలయన మనమనునది సైతమాత్మయేకదా ౩౫ ఈజీవుఁడు దేహాభిమానకారణమున బద్ధుఁడైయున్నాఁడు. వివేకమువలన దేహాభిమానము వీడిపోవుచున్నది. ఈతఁడు ముక్తుఁడైపోవుచున్నాఁడు అని సారాంశము ౩౬ ఇంతటితో జన్మము సార్థకమై పోవుచున్నది. నిర్గుణాత్మయును మనమును నేకమైపోవుచున్నారము. కానిదీని దృఢీకరణమునకు సాధకులు పైనిచెప్పఁబడిన వివేచనమును మాటిమాటికిఁ జేయుచుండవలయును ౩౭ మేల్కని లేచినపిమ్మట స్వప్నమెట్లుండదో యటులే వివేకముతోఁ జూచినపిమ్మట దృశ్యము (పాంచభౌతికసృష్టి) అదృశ్యమై పోవును. నశించిపోవును. మఱియు స్వరూపానుసంధానమువలనఁ (బ్రహ్మస్వరూపమును శోధించుటవలన) బ్రాణిమాత్రులు తరించిపోవుదురు. ౩౮ వివేకముతో "నేను" అనుదానిని నివేదించి సాధకుఁడు పరమాత్మస్వరూపుఁడై పోవలెను. వానినుండి భిన్నముగా నుండఁగూడదు. ఇదియే యాత్మనివేదనము. ౩౯ మొట్టమొదట అధ్యాత్మనిరూపణశ్రవణమును జేయవలయును. మఱల సద్గురుచరణసేవ గావింపవలయును. అప్పుడు సద్గురుప్రసాదమువలన ఆత్మనివేదనమగుచుండును. ౪౦ ఆత్మనివేదనమునకుఁ బిమ్మట వస్తువు నిర్మలమును, అలిప్తమును, సంపూర్ణమును, అఖండమును, శాశ్వతమును, నై యున్నదని బోధపడును. మఱియు నావస్తువే (ఆత్మయే) స్వయముగా మనమైయున్నారమని విదితమగును ౪౧ * పైనిజెప్పఁబడిన బ్రహ్మజ్ఞానమువలన నీజీవుఁడు స్వయముగా బ్రహ్మమైపోవును. వాని సంసారబంధనములు తెగిపోవును. అతఁడానందముతో దేహమును బ్రారబ్ధముపై విడిచివే

---

* ప్రాణికి బ్రహ్మజ్ఞానము కలుగుటవలన స్వయముగా బ్రహ్మరూపియగును. పాంచభౌతికసృష్టి, దృశ్యపదార్థము, ప్రాపంచికసృష్టిమున్నగు కష్టజ్ఞానము దానికి గలుగదు. సమస్తము శూన్యమగును. అది యఖండబ్రహ్మమేయగును. ఇట్టిదశయందు దేహము ప్రారబ్ధాధీనమగును. ఈదేహమావల రేమైననుసరియే, అది యుండనీ నశింపనీ, కాని నిరంతరము ఆత్మ అవినాశిగానేయుండును.

యును. ౪౨ దీనినాత్మజ్ఞానమని చెప్పుదురు. దీనివలననే పరమశాంతము లభించును. ఈజ్ఞానమువలననే ఈజీవుఁడు పరబ్రహ్మముతో అభిన్నుఁడై యుండును. సత్యమగు భక్తిగలవాఁడు (ఐక్యమునొందినవాఁడు) గ మాఱి పోవును. ౪౩ ఆసమయమున ఏమిజరిగినను జరుగనిమ్ము, ఏమిపోయినను పోనిమ్ము, జన్మమృత్యువులనుగూర్చిన సందేహమంతయు నాహృదయము నుండి తొలంగిపోయినదిగదా! ఇఁక నేమైనను గానిమ్ము అను స్థిరభావముతో నుండుస్థితి యేర్పడును. ౪౪ ఈవిధముగా నాతఁడు జననమరణములనుండి ముక్తుఁడై పరమాత్మ్మని బ్రాప్తించును. ఇదియంతయును సాధుసమాగమమహత్త్వము. ౪౫

మూఁడవ సమాసము.

మాయయొక్క పుట్టుక.

నిర్గుణాత్మ నిర్మలమైయున్నది. అదియాకాశమువలె సర్వవ్యాపకమై యున్నది. మఱియు నచలమును, సర్వకాలములయందుఁ బ్రకాశవంతమును ౧ అఖండమును, గొప్పదానికంటెను గొప్పదియు, నాకాశముకంటె నెక్కువయగు విశాలమును సూక్ష్మమును నై యున్నది ౨ నిర్గుణాత్మ చూపులకందదు. అది భాసముగాదు. పెరుగుటలేదు. తరుగుటలేదు. వచ్చుటలేదు. పోవుటలేదు ౩ అది నడచుటలేదు. తెగుటలేదు. పగులుటలేదు. అమరుటలేదు. చెడుటలేదు. ౪ నిరంతమును నిర్గుణాత్మ సన్మ్ముఖముగా నున్నది. అంతియగాక నిష్కళంకమును నిఖిలమునుగూడ నై యున్నది. మఱియు నాకాశము పాతాళముగూడ వ్యాపించియున్నది. ౫ ఆనిర్గుణబ్రహ్మము అవినాశిగానున్నది. సగుణమాయ నాశనమగును. ఈలోకమునందు సగుణనిర్గుణములు రెండును గలసియున్నవి ౬ యోగీశ్వరులు ఈసగుణ నిర్గుణమిశ్రణమును గూర్చిన విచారమును, నీరక్షీరవివేచనము రాజహంసలు గావించునటుల నొనర్తురు ౭ ఈసంపూర్ణమగు చరాచర పంచభూతాత్మిక సృష్టియందు ఆత్మ వ్యాపకమైయున్నది. ఈవిషయము నిత్యానిత్యవివేచనము గావించినయెడలఁ దెలియును ౮ చెఱకును నమలి రసమును మ్రింగి పిప్పిని బారవేయునటుల నీజగమును శోధించి యీశ్వర

తత్త్వమును గైకొని మాయికమగుదృశ్యపదార్థమును విడిచివేయవలయును ౯ ఇచ్చట రసమునకీశ్వరతత్త్వము నుపమానముగాఁ దీసికొంటిమిగాని రసము నాశవంతము వలుచనిది యైయున్నది. ఆత్మ (ఈశ్వరతత్త్వమన్ననో) శాశ్వతము, నిశ్చలము నైయున్నది. అంతియగాక రసమసంపూర్ణము. ఆత్మ కేవలము పరిపూర్ణము ౧౦ ఆత్మతో సమానమగు వస్తు వేదేని యున్నచో దానినిచట దృష్టాంతముగాఁ గైకొనవచ్చును. కాని యట్టిది లేకపోవుటచే నేదేని యొకానొకదృష్టాంతము నిచ్చి యేదోయొకవిధముగా బోధింపవలసియుండును. ౧౧ ఆత్మస్థితియీ విధముగా నున్నప్పు డిచట మాయయెటులఁ బుట్టినది? దీనికి దృష్టాంతము నిచ్చుట యసాధ్యము. ఆకాశమునందు వాయుతరంగములు వచ్చునటుల నాత్మనుండి మాయ బయలువెడలినదని గ్రహింపవలెను. ౧౨ వాయువు నుండి తేజము, తేజమునుండి జలము, జలమునుండి పృథివి యుత్పన్నమైనది ౧౩ దీనితరువాతఁ బృథ్వినుండి యెన్ని జీవులుత్పన్నమయ్యెనోగాని యన్నింటి యాద్యంతములందును బ్రహ్మము వ్యాపకుఁడై యున్నాఁడు. ౧౪ ఉత్పన్నమైనదంతయు నశ్వరమైనది. కాని అది పరబ్రహ్మము యదార్థముగా స్థిరమై యున్నాఁడు. ౧౫ భాండమేర్పడకమున్ను ఆకాశమున్నది. భాండములోపలఁగూడ భాండజలమునఁ బ్రతిబింబరూపమున ఆకాశమున్నది. కాని భాండము పగిలిపోయినపిదప ఆకాశము పగిలిపోవని రీతిగాఁ బరబ్రహ్మతత్త్వము కేవలము అచలమును, అవికారము నైయున్నది. మధ్యను సంపూర్ణ చరాచరజీవులు కలుగుచుఁ బోవుచుండును. ౧౬, ౧౭ ఉత్పన్నతమంతయు మొదటినుండియే యగును. బ్రహ్మమువలన నుత్పన్నమగు జీవులన్నియు వ్యాప్తమై యున్నవి. అవి నాశనమైనపిమ్మటఁగూడ నాయవినాశియగు బ్రహ్మ మెప్పటివలెనే స్థిరముగా నుండును. ౧౮ జ్ఞానియగుపురుషుఁ డాయవినాశియగు బ్రహ్మమునే వివేచింపుచుండును. అనగాఁ బంచమహాతత్త్వములను బంచమహాతత్త్వములలో నిరసనమొనరించి తనను బ్రాప్తింపఁజేసికొనును ౧౯ ఈ దేహము పంచతత్త్వములతో నిర్మింపఁబడినది. తెలిసినవారలు ఈతత్త్వములను జక్కఁగ నావిష్కరణము (వెల్లడి)చేయుదురు. ౨౦ తత్త్వములను యావిష్కరణము జరిగినపిమ్మట వారలకు దేహాభిమానము తొలంగును. ఈవిధముగ వివేకముతో

వారలు నిర్గుణబ్రహ్మమునం దనన్యులై పోవుదురు ౨౧ వివేకమువలన
నెప్పు డీదేహసంబంధములగు పంచతత్త్వములు, పంచతత్త్వములలోఁ
గలసిపోవునో యప్పుడు "నేను,మనము" అనువాని జాడపోడలే యుండవు. •
౨౨ మనము "మన" నుదానిని శోధించుచున్నయెడల నాది, మనది,
మాదియనువార్తపూర్తిగ మాయికమని విశదమగును. ఏలయన తత్త్వ
ములను నిరసనముగావించుటవలన వాస్తవములోఁ గేవలము నిర్గుణపర
బ్రహ్మమే మిగిలియుండును. ఇంక నెద్దియు నుండదు ౨౩ "మన"యను
దానిని, (దేహబుద్ధిని)విడిచి కేవలనిర్గుణబ్రహ్మమును అనుభవము జే
యుటయే ఆత్మనివేదనము నందలి మర్మము. ఏలయన! నేను నీవు నాది
నీదియనుభ్రమ; తత్త్వములతోడనే వెడలిపోవును ౨౪ ఒకవేళ నేనుఅను
దానిని శోధింపుదమన్న చోనది దొరుకదు. ఇటు నిర్గుణపరబ్రహ్మమో
కేవల మచలమైయున్నది. కావున నిజముగ నారసినయెడల మనము
అదియే (నిర్గుణబ్రహ్మమె)అయియున్నారము. కాని సద్గురుమూలమునఁ
దప్ప నీవిషయము బోధగాదు ౨౫ మనము సంపూర్ణమగు సారాసార
మునుగూర్చి విచారణము జేసితిమేని యసారము తొలంగిపోవును. సార
మగు నిర్గుణబ్రహ్మమే నిలిచియుండును ౨౬ సమస్తసృష్టిలోఁ బయిని
బేర్కొనఁబడిన బ్రహ్మమే వ్యాప్యమైయున్నది ఈసృష్టియంతయు నశ్వ
రము. బ్రహ్మము అవినాశి ౨౭ వివేకముతో మనమెప్పు డీసంపూర్ణసృ
ష్టిని సంహారముగావించుచున్నారమో, ఈపంచభూతాత్మికమగు సృష్టిని
మనమెప్పుడు పృథక్కరణము (వేఱుగావించుట) చేయుచున్నారమో
అప్పుడు సారము, అసారము వేఱువేఱుగా బయలువెడలును. మఱియు
"మన"యనునది మనకులభించును (ఆత్మలభించును) ౨౮ "నేను"అనునది
స్వయముగాఁ గల్పించుకొనఁబడినది. కాని వాస్తవమునందిది యెందును
లేదు. తత్త్వనిరసనము గావించినపిదప నేననునది వెడలిపోయి కేవల నిర్గుణ

• ఈదేహమునుగూర్చి విచారముగావించుటవలన నిది పంచభూతాత్మికమని తెలియుచున్నది. ఈపాంచభౌతికశరీరమునందలి తత్త్వములను ఒక్కటొకటిగా ఆతత్త్వములలోఁ బంచివైచినచో నిఁక "నాది నీది"అని శేషించినదెద్దియు నుండదు. శేషించునది కేవలము నిర్గుణమగునాత్మ. దీనినే "మన-నా"యని నుడువవచ్చును.

మగు ఆత్మ నిలచియుండును ౨౯ తత్త్వనిరసనమైనపిదప శేషించియుం
డునిర్గుణాత్మయే "నేను"అనునది (తత్త్వనిరసనానంతరము నేననునది
యుండనేరదు) ౩౦ తత్త్వములతోఁ బాటు "నేనను"నది వెడలిపోవఁగనే
స్వాభావికముగనే అది నిర్గుణాత్మయైపోవును. ఈవిధముగ "సోహం"
యొక్క యనుభవమువలన ఆత్మనివేదన మగును ౩౧ ఆత్మనివేదనము
అయినంతనే దైవతమునందును భక్తునియందును ఏకత్వము కలసిపోవును.
విభక్తత్వము(భిన్నత్వము)ను విడిచి యాతఁడు సత్యమగు భక్తుఁడైపోవును.
నిర్గుణమునందు జననమరణములు పాపపుణ్యములు మున్నగునవేవియు
నుండవు ఇట్టి నిర్గుణమునం దనన్యుఁడై (ఏకమై)న పిదప ఆతఁడు స్వయ
ముగా ముక్తుఁడైపోవుచున్నాఁడు ౩౩ పంచభూతము లావరించుటవలనఁ
బ్రాణి సందేహములలోఁ జిక్కుకొనును. స్వయముగాఁ దన్ను మఱచి
"కోహం"(నేనెవ్వఁడను)అని నుడువసాగును ౩౪ భూతములలోఁ దగుల్కొ
న్నపిదప "కోహం"అని నుడువును. మఱియువివేచనముగావించినమీఁదట
"సోహం"(ఆబ్రహ్మము నేను)అనినుడువును. అనన్యత(ఐక్యము)నొందినమీఁ
దట "కోహంసోహం"అనునవన్నియుపీడిపోవును ౩౫ పయినిబేర్కొనినఅను
భవము గలిగినమీఁదట నుండునదియే సాధుస్వరూపము. ఇట్టిసాధు
(అవతార) పురుషులు సదేహులైయుండియు దేహాతీతులు. ౩౬ విష
యము మిగులగహనముగావున శ్రోతలకు ఒక్కమారు చెప్పుటచే సందే
హము తీరఁజాలదు. కావునఁ బలుమాఱు చెప్పినదానినే మఱలఁజెప్ప
వలసివచ్చుచుండును. * ప్రసంగవిశేషమునుబట్టి అందందు నే నటులఁ
గావింపవలసివచ్చినది. శ్రోతలు క్షమించెదరుగాక ౩౭

* చెప్పినది మరలఁజెప్పుట పునరుక్తియనుకావ్యదోషము. ఈదోషమునకుఁ బరిహారముగా శ్రీసమర్థరామదాసస్వామి "జనులసందేహములను నివారించుటకై పలుమాఱు ఒకేవిషయమునే నుడువవలసివచ్చె"నని సెలవిచ్చియున్నారు.

నాలుగవ సమాసము.

మాయయొక్క విస్తారము.

కృతయుగము (సత్యయుగము) యొక్క పరిమితి పదునేడులక్షల యిరువదియెనిమిదివేల సంవత్సరములు. త్రేతాయుగము పండ్రెండులక్షల తొంబదియాఱు వేల సంవత్సరములు. ద్వాపరయుగము ఎనిమిదిలక్షల అఱువదినాలుగువేల సంవత్సరములు. కలియుగము నాలుగులక్షల ముప్పది రెండువేల సంవత్సరములు. ఇదియంతయుఁ గలిపినయెడల (నాలుగుయుగముల పరిమితి) చతుర్యుగపరిమాణమగును. ఇట్టి చతుర్యుగములు వేయియైనచో బ్రహ్మకొక్క దినమగును ౧౨ ఇట్టిబ్రహ్మలు వేయిమంది గడచిపోయినమీఁదట విష్ణువునకొక గడియ యగును. ఇట్టి విష్ణువులు వేయిమంది గడచిపోయినపిదప మహేశ్వరునకొక ఱెప్పపాటుకాల మగును ౩ ఇట్టిమహేశ్వరులు వేయిమంది గడచిపోయినమీఁదట శక్తి (మాయలేక ప్రకృతికి) ఒక ఱెప్పపాటుకాల మగును. ఈవిధముగానుండు కాలసంఖ్య అన్ని శాస్త్రములందును జెప్పఁబడెను ౪

శ్లో॥ చతుర్యుగసహస్రాణి దినమేకం పితామహం
పితామహసహస్రాణి విష్ణోర్ఘటికమేవచ॥౧॥
విష్ణోరేకసహస్రాణి పలమేకం మహేశ్వరం
మహేశ్వరసహస్రాణి శక్తిరర్ధపలం భవేత్॥౨॥

ఇట్టిశక్తు లనంతములుగానున్నవి. మఱియు ననంతములగుసృష్టిరచనములు జరిగిపోవుచున్నవి. కాని పరబ్రహ్మము యథావిధముగ నఖండముగ ననాదినుండియు నొకేవిధముగా నున్నది ౫ నిజమారసినచో పరబ్రహ్మమునకీస్థితి యెక్కడినుండివచ్చినది? ఇది యెవరును జెప్పఁజాలని గహనాంశము. ఈవిషయమునందు వేదశ్రుతులుసహితము "నేతి, నేతి" (న + ఇతి, న + ఇతి)యని నుడువుచున్నవి ౬ * నాలుగువేలయేడువందల అఱువదినాలుగు సంవత్సరములు కలియుగమునందు గడచిపోయినవి. ౭ నాలుగులక్షల యిరువదియేడువేల రెండువందల నలుబదిసంవత్సరములు

* ఈసంఖ్య శ్రీదాసబోధరచించుకాలమునాటిది. దీనిబట్టిదాదాపు 1716 విక్రమశకమున నీగ్రంథమురచింపఁబడి యుండును.

కలియుగమునందింకముందు నడువవలసియున్నవి. ఇంకముందుఁ బూర్తిగా వర్ణసాంకర్యము జరుగనున్నది ౮ ఈచరాచరసృష్టియందున్న వేల్పులమహిమ కంతేలేదు. ఒకదైవతమును వేఱొకదైవతము మించియుంటచే నీభేదము పారావారమువలె నంతులేనిదిగా నున్నది ౯ ఒకఁడు వేల్పులందఱిలో విష్ణుమూర్తి గొప్పయనియు నింకొకఁడు శంకరుఁడు గొప్పవాఁడనియు వేఱొకఁడు ఆదిశక్తి అందరుదేవులకంటె గొప్పదనియు నుడువును ౧౦ కాని వీరందఱు కల్పాంతమునందు నశించుపోవువారే. ఏలయన! శ్రుతి "యద్దృష్టం తన్నష్టం" అని నుడువుచున్నదిగదా!(కనుబడునదెల్ల నశించునదియు) ౧౧ ప్రజలెల్లరును దమతమ యుపాస్యదేవతలపట్ల నభిమాన ముంచెదరు. కాని సత్యనిశ్చయము సామాన్యులకుఁ దెలియఁజాలదు. సాధుపురుషులే సత్యమును నిర్ణయింప సమర్థులు ౧౨ సర్వవ్యాపకమగునాత్మయొక్కటియే సత్యమనియుఁ దక్కినచరాచరసృష్టియంతయు మాయికమనియు సాధువులు నిశ్చయింతురు ౧౩ పటములో లిఖింపబడిన సైన్యమునందు (మాయికసృష్టిలో) నెవఁడు పెద్దయో యెవఁడు చిన్నయో నిరూపింప వీలుపడదు. ఈయంశము మీరే విచారింపుఁడు ౧౪ స్వప్నములో మన మనేకసంగతులను గాంచితిమనియు వీరు పెద్దలు వీరలుచిన్నలని నిశ్చయించుకొంటిమనియు నొప్పుకొనుచున్నారముగదా! మేల్కొనినపిమ్మట నానిశ్చయ మేమగుచున్నదో చూడుఁడు ౧౫ మనము మేల్కొనిచూచునపుడు కలలోఁ గనుపించిన పెద్దవాఁడుగాని చిన్నవాఁడుగాని తదితరముగాని గోచరించుటలేదు. మీఁదుమిక్కిలి మనము గాంచినదంతయు స్వప్నములోనని విదితమగుచున్నది. ౧౬ ఎక్కడిపెద్ద, ఎక్కడిచిన్న, ఇదియంతయు మాయావిచారము. నిజమారయుచోఁ బెద్దచిన్నలవిచార మందఱికిని దెలియదు. జ్ఞానులకే తెలియును ౧౭ జననమునొందిన ప్రతిమానవుఁడు బ్రతికిన నాల్గుదినములు నేనుపెద్దవాఁడను. నేను గొప్పవాఁడనని నుడువుచు నుడువుచునే గతించును. ఎవఁడు పెద్దవాఁడో నిర్ణయింపదగినవారుమహాత్ములే ౧౮ మనశాస్త్రములన్నియు ఆత్మజ్ఞానముగలవారలే మహాత్ములనియు శ్రేష్ఠులనియు నుడువుచున్నవి. ఇటులే సాధువులు సత్పురుషులుగూడఁ జెప్పుచున్నారు. ౧౯ అందఱికంటెను గొప్పవాఁడు పరమాత్ముఁ డొకడేయనియు బ్రహ్మవిష్ణు

మహేశాదులుగూడ నాపరమాత్మునికి లోఁబడినవారనియుశాస్త్రములు తెలుపుచున్నవి ౨౦ పరమాత్ముఁడు నిర్గుణుఁడును నిరాకారుఁడును నై యున్నాఁడు. ఆతనికి ఉత్పత్తివిస్తారములు లేవు. మఱియు స్థానమానములను గూర్చి మననము చేయు విచారమంతయు నీవలె విషయము ౨౧ పరమాత్మునిగురించి మననము చేయునామము, రూపము, స్థానము, మానము మున్నగునిర్ణయములన్నియు ననుమాత్రములే. । బ్రహ్మప్రళయము నందీ యనుమాన పూర్వకనిర్ణయములన్నియుఁ దుడిచిపెట్టుకొనిపోవును ౨౨ కాని ప్రళయమునందుఁ బరబ్రహ్మమునకు నాశనము లేదు. పరమాత్ముఁడు నామరూపరహితుఁడుగను సర్వకాలసర్వావస్థలయం దచంచలుఁడుగను నున్నాఁడు ౨౩ బ్రహ్మనిరూపణమునెఱింగి బ్రహ్మమును దెలిసికొనినవారు బ్రహ్మవిదులని బ్రాహ్మణులని చెప్పఁదగియుందురు ౨౪

ఐదవసమాసము.

మాయ మఱియు బ్రహ్మము.

శ్రోతలారా! మీకిపుడు మాయయొక్కయు బ్రహ్మము యొక్కయు నిరూపణము నెఱింగించుచున్నాఁడను. శ్రద్ధతో వినఁగోరెదను ౧ బ్రహ్మము నిర్గుణమును నిరాకారము నై యున్నది. మాయ సగుణమును సాకారమునై యున్నది. బ్రహ్మమునకు దరిదాపులు లేవు. మాయకున్నవి. ౨ బ్రహ్మము నిర్మలమును నిశ్చలమును నై యున్నది. మాయ చంచలమును జపలము నై యున్నది. బ్రహ్మము ఉపాధిరహితము. మాయ ఉపాధిరూపము ౩ బ్రహ్మము కనుపింపదు. మాయ కనుపించును. మాయ భాసించును. బ్రహ్మము భాసింపదు, మాయ నాశనమగును. బ్రహ్మము కల్పాంతము నందుఁగూడ నశింపదు ౪ మాయ నిర్మితమగుచున్నది. బ్రహ్మము నిర్మితమగుట లేదు. మాయ చెడుచున్నది. బ్రహ్మము చెడుట లేదు. అజ్ఞానమునకు మాయ రుచించును. బ్రహ్మము అజ్ఞానమునకు రుచింపదు ౫ మాయ వృద్ధినొందును. బ్రహ్మ మంకురించునదియు వృద్ధినొందునదియుఁ గాదు. మాయ మరణించును. బ్రహ్మమునకు మరణము లేదు. మాయ ధారణశక్తితో అవగాహనమగును. బ్రహ్మ మటులఁగానేరదు ౬

మాయ భిన్నమగును. బ్రహ్మము భిన్నమగునది కాదు. మాయ తెగిపోవును. బ్రహ్మము తెగిపోవునది కాదు. మాయ మలినమగును. బ్రహ్మము మలినము కానేరదు. అది యవినాశి ౭ మాయ వికారయుక్తము. బ్రహ్మము నిర్వికారము. మాయ యన్నింటినిఁ జేయఁగలదు. బ్రహ్మ మెద్దియును జేయదు. మాయ నానారూపములను ధరించును. కాని బ్రహ్మము రూపరహితము ౮ మాయకుఁ బంచభూతాత్మికములగు రూపము లనేకములుగలవు. బ్రహ్మము శాశ్వతముగా నొక్కటియే. మాయయొక్కయు బ్రహ్మముయొక్క వివేచనమును వివేకులుతప్ప నితరులెఱుంగరు. ౯ మాయచిన్నది, బ్రహ్మము పెద్దది. మాయ సారరహితము. బ్రహ్మము సారవంతము. మాయ కాద్యంతములు గలవు. బ్రహ్మమునకు లేవు. ౧౦ సంపూర్ణ మాయావిస్తరమువలన బ్రహ్మస్థితి మరుగుపడియున్నది. సాధుజనులు విజ్ఞానసాధనములచే మాయనుండి బ్రహ్మమును వెలికిఁదీయుదురు ౧౧ నీటిమీఁది శైవాలమును (నాచును) దొలంగించినగాని శుద్ధమగు నీరులభింపదు. నీరుగలిసిన పాలనుగాచి విడదీసినగాని శుద్ధమగుపాలు లభింపవు. అటులే మాయనుతొలంగినఁగాని బ్రహ్మము లభ్యముకానేరదు. ౧౨ బ్రహ్మము ఆకాశమువలె నిర్మలమైనది. మాయ పృథ్వివలె మలినమైనది. బ్రహ్మము సూక్ష్మరూపము. మాయ స్థూలరూపము ౧౩ బ్రహ్మమప్రత్యక్షము. మాయ ప్రత్యక్షము, బ్రహ్మము, సమము, మాయ విషమరూపము ౧౪ మాయ లక్ష్యము. బ్రహ్మము అలక్ష్యమైనది. మాయసాక్ష్యము. బ్రహ్మము అసాక్ష్యము. మాయయందు జ్ఞానము అజ్ఞానము అను రెండుపక్షము లిమిడియున్నవి. బ్రహ్మమునందుఁ బక్షములెవ్వియును లేవు ౧౫ మాయ పూర్వపక్షము. అనఁగా సంశయయుక్తము. బ్రహ్మము ఉత్తరపక్షము. అనఁగా సిద్ధాంతము. మాయ అనిత్యము. బ్రహ్మము నిత్యము. మాయ ఇచ్ఛాయుక్తము. బ్రహ్మము నిరిచ్ఛామయము ౧౬ బ్రహ్మ మఖండఘనము. మాయ పంచభూతమిళితము. బ్రహ్మము నిరంతరపరిపూర్ణము. మాయ జీర్ణజర్ఝరితము. ౧౭ మాయ కల్పింపఁదగినది బ్రహ్మము కల్పింపరానిది. మాయకుఁ బతనావస్థగలదు. బ్రహ్మమునకుఁ బతనము లేదు. మాయ చెడునది బ్రహ్మము చెడునది కాదు. (చెక్కు... [illegible] రక రా కేవిధముగా

నుండును ౧౮ ఎంతటి ప్రళయకాలమునందేని బ్రహ్మము చెదరక స్థిరముగా నుండునది. మాయను నిరసనముగావించినచో నాశనమైపోవును. బ్రహ్మము నందు సంకల్పవికల్పములు లేవు. మాయయందీరెండు నున్నవి. ౧౯ మాయ కఠినమైనది. బ్రహ్మము కోమలమైనది. మాయ అల్పము. బ్రహ్మము విశాలము. మాయకు అంతమున్నది బ్రహ్మమునకు లేదు. ౨౦ బ్రహ్మము ఇట్టిదని వివరింపదగినదికాదు. మాయ ఎటులున్నదో యటుల వివరింపవచ్చును. బ్రహ్మమును కాలమంటజాలదు. మాయను గాలము వశముగావించుకొనును. ౨౧ ఈకనుపించుచున్న నానావిధ రూపవర్ణములన్నియును మాయయే. ఇవియన్నియు నశ్వరములు. కాని బ్రహ్మము శాశ్వతము. ౨౨ ఇంతయేల - ఈచరాచరరూపమునగలుగుచున్నసృష్టియంతయును మాయ. పరమేశ్వరుడీసృష్టికి లోపల వెలుపల నంతటను వ్యాప్తమైయున్నాడు ౨౩ ఆకాశము జలమునందుండియు జలమునుదాకకుండునటుల సకలోపాధిరహితుడగు పరమాత్ముడును సృష్టికి అలిప్తుడుగా నున్నాడు. ౨౪ ఈమాయయొక్కయు బ్రహ్మము యొక్కయు వివరణమును సాధుజనులవలననే చక్కగా బోధయగును. వారల శరణ్యములోని కరుగుటవలన జననమరణములు విడిపోవును ౨౫ సాధువులమహిమ కంతములేదు. వారల యనుగ్రహమున సులభముగా బరబ్రహ్మము సిద్ధించును. ౨౬

ఆఱవ సమాసము.

సత్యద్వైతనిరూపణము.

శ్రోత వక్తతో నిటుల విన్నవించుచున్నాడు. ఓగురుమహారాజా! మీరు సర్వజ్ఞులగు గోస్వాములు. నాకున్న యీసందియమును దొలంగింపుడు. సృష్టియొక్క పుట్టుకకుముందు బ్రహ్మమునందు సృష్టి లేకున్నయెడల నీకాన్పించుచున్నసృష్టి సత్యమా లేక మిథ్యయా? ౧ ... దీనికి వక్తచెప్పబోవు ప్రత్యుత్తరమును సావ-

ధానులరై వినుండు ౩ భగవద్గీతలోనున్న "జీవభూతస్సనాతనః" * అను వాక్యమునుబట్టి చూచినయెడల సృష్టి సత్యమైనదని తెలియుచున్నది. ౪ మఱియు "యద్దృష్టం తన్నష్టం" (ఏయ్యది కనిపించునో యదినశించునది) అను నీశ్రుతివాక్యమువలన సృష్టి మిథ్యయని తెలియుచున్నది. ఇపుడు సత్యాసత్యముల నెవడు నిశ్చయింపగలడు? ౫ దీని నొకవేళ సత్యమందమాయన్న నిది (యీసృష్టి) నాశనమగుచున్నది. మిథ్యయందమాయన్న కనంబడుచునే యున్నది. కావున నెటులున్నదో యటులే చెప్పుదును ౬ ఈసృష్టియందున్న మానవులలో గొందఱజ్ఞానులుగను మఱికొందఱు సుజ్ఞానులుగను నున్నారు. కావున నిందులకుసమాధానము కలుగజాలదు ౭ సృష్టిసత్యము. ఇటులే దేవ, ధర్మ, తీర్థవ్రతములుకూడ సత్యములేయని యజ్ఞానులమతము. ౮ "మూర్ఖస్య ప్రతిమాపూజా" (మూర్తిపూజ అనగా విగ్రహపూజ మూర్ఖులకొఱకే) అని పెద్దలు చెప్పిరి. సృష్టికూడ విచారించినచో సత్యమైనదిగాదు. ఏలయన ప్రళయమునందది నాశనమగుచున్నది. అని జ్ఞానులు తెలుపుదురు ౯ దీనిని విని యజ్ఞాని యిటుల వాకొనుచున్నాడు. అటులైనయెడల సంధ్యాస్నానము, గురుభజనము, తీర్థాటనము చేయుటవలన ఫలమేమి? ౧౦ జ్ఞాని దీనికి బ్రత్యుత్తర మొసంగుచున్నాడు.

శ్లో॥ తీర్థేతీర్థే నిర్మలం బ్రహ్మబృందమ్
బృందేబృందే తత్త్వచిత్తానువాదః
వాదేవాదే జాయతే తత్త్వబోధా
బోధేబోధే భాసతే చంద్రచూడః॥

తీర్థాటనము గావించుటకుం గారణమేమియో నీవు తెలిసికొనజాలకుంటివి. తీర్థములలో గలుగు సాధుజనుల సమాగమమువలన సారాసారవిచారము నెఱింగి భక్తు లీశ్వరుని బ్రాప్తింపగలుగుదురు. గురుని భజించుటకుగల కారణమును గురుగీతయందు స్వయముగా మహాదే-

---

* గీతయందుం బరమాత్మస్వరూపుడగు శ్రీకృష్ణుం డిటుల జెప్పి యున్నాడు. "మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః" సృష్టియందు ... ది యెల్ల నాయంశమే. మఱియు నది యవినాశియైనదని బ్రా... గ్రంథకారుడు.

వుఁడు చెప్పియేయున్నాఁడు ౧౧ గురుభజనమునకు నియమమేమన మొదట గురునిసత్యస్వరూపమును గుర్తింపవలయును. తరువాత వివేకముతోఁ దానుగురుని రూపమునందు లీనుఁడై పోవలయును ౧౨

శ్లో॥ బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాదిలక్ష్యం
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తంనమామి॥

సద్గురునికిఁగల సత్యస్వరూపము గురుగీతలో విపులముగాఁ జెప్పఁబడెను. ఈ స్వరూపమునందు సృష్టిభాస ముండ జాలదు. ౧౩ ఈవిధముగా నెప్పుడును జ్ఞాని సద్గురుని సత్యస్వరూపమును జూపి సృష్టిని మిథ్యయని నిశ్చయము గావించుచున్నాఁడు. అప్పు డజ్ఞాని యింకను నధికమగువివాదమును గావించుటకు సిద్ధమై యిట్లునుడువుచున్నాఁడు. యిదియేమి? నీవుపరమాత్ముఁడగు శ్రీకృష్ణు నజ్ఞానియని సిద్ధాంతము గావింపఁబూనుకొంటివి ౧౪, ౧౫ గీతయందలి "జీవభూతస్సనాతనః" అనువచనము మిథ్య యెటులఁగాఁగలదు? ౧౬ ఈవిధముగా నజ్ఞానియగు శిష్యుఁ డాక్షేపించి తనహృదయమునందు ఖిన్నుఁడగుటనుజూచి జ్ఞాని యిట్లు సమాధానముచెప్పెను ౧౭ గీతయందు శ్రీకృష్ణుఁ డేమిచెప్పెనో దానిభేదము(మర్మము)ను నీవు కనుఁగొనఁజాలకున్నాఁడవు. ఇందువలననే యీవివాదమునకుఁ బూనుకొంటివి ౧౮ అశ్వత్థ స్సర్వవృక్షాణాం(రావిచెట్టు నా విభూతియైయున్నది) అని నుడివియున్నాఁడు. ఆవృక్షమో విరిగిపడిపోవు స్వభావముకలది. మఱియుఁ గృష్ణుఁ డిటులజెప్పినాఁడు ౧౯

"శ్లో॥ నైనంఛిందంతి శస్త్రాణి నైనందహతి పావకః
నచైనం క్లేదయంత్యాపో నశోషయతి మారుతః"

నాస్వరూపము శస్త్రముచేఁ దెగదు. అగ్నిచేఁ గాల్పబడదు. జలమువలనఁ దడియదు. వాయువు శోషింపఁజేయలేదు ౨౦ కాని రావిచెట్టు(శ్రీకృష్ణుఁడు తనవిభూతియని చెప్పిన అశ్వత్థము)శస్త్రమువలన ఖండింపఁదగినదిగను అగ్నిచేఁ గాల్పబడునదిగను, నీటిచేఁ దడియునదిగను నున్నది. అంతియు [illegible] నొందునది. ౨౧ ఇప్పుడు శ్రీకృష్ణుని పరస్పరవిరుద్ధము [illegible]టికిని సమన్వ[illegible]మెటులగును? దీనిమర్మము సద్గు

రుముఖమునుండియేచక్కఁగాఁదెలియఁగలదు."ఇంద్రియాణాంమనశ్చాస్మి" (ఇంద్రియములలో మనస్సును నేను) అని శ్రీకృష్ణుఁడు నుడివియున్నాఁడు. అటులైనచో "చంచలమగు మనస్సునుండిప్రవహించుచున్న భావతరంగముల నేలయాపవలయును." ౨౩ శ్రీకృష్ణుఁ డేలయిటుల నుడివియుండును? అనుప్రశ్నయొకటి యిచట నుపస్థితమగుచున్నది. దీనికిఁ బ్రత్యుత్తరముచెప్పెదను. తెలియని బాలకులకుఁ జిత్రములు మున్నగుపరికరములను ముందుంచి వానిసహాయమున నెట్లు *

"ఓనమఃసిద్ధం" అనుఅక్షరములను నేర్పుదురో యటులే భగవానుఁడగుశ్రీకృష్ణుఁడు అబోధసాధకులకు గీతలవలన సాధనమార్గములనుజూపియున్నాఁడు ౨౪ ఈవాక్యభేదములనన్నిఁటిని నాగోవిందుఁడే యెఱుంగును. ఆతనివట్ల నీ దేహాభిమానపురస్సరమగు వివాదము నిలువఁజాలదు. ౨౫ ఈ విధముగానుండు వాక్యభేదము లొక్కగీతయందే కాదు. వేదశాస్త్రశ్రుతిస్మృత్యాది సమస్తగ్రంథములందును గాన్పించుచున్నవిగాని వానినిర్ణయము సద్గురుని వాక్యములవలననే కాఁగల్గును. ౨౬ వేదశాస్త్రము లనుండి జనియించు వివాదముల నెవ్వఁడుత్రెంపివేయఁగలఁడు. సాధువులకుఁదప్ప నవి యితరులచేఁ గల్పాంతమునందుఁగూడ నవరింపఁబడజాలవు ౨౭ శాస్త్రములలోఁ బూర్వపక్షసిద్ధాంతములు సాంకేతికమాత్రముగా నుడువఁబడియున్నవి.వానికిఁ బూర్ణములగు వివరణములను గ్రహింపవలయునన్నచో సాధుజనులశరణ్యమున కరుగవలయును ౨౮ సాధారణముగా వేదశాస్త్రములయందు ఒకదానికంటెనొకదానిని మించినవాదవివాదప్రశ్నలెన్నియోఁగలవు ౨౯ కావున మనము వాదవివాదములను విడిచిపెట్టి జ్ఞానమును బడయవలయును. దానివలననే స్వానుభవము గలిగి బ్రహ్మానందము సమకూరును. ౩౦ ఒకేకల్పనముయొక్క గర్భమునందెప్పు డనంతములగు సృష్టులు కలుగుచుఁబోవుచున్నవో యప్పుడు ఆకల్పనమును సత్యమనియెటు

---

* విద్యావిధానమునందు ప్రస్తుతకాలపు కిండర్ గార్డన్ప్రణాళిని (బాలోద్యానశిక్షణపద్ధతిని)ఆంగ్లేయులు కనిపెట్టిరని మనవారలు తలంచుచున్నారుగాని యిది మనదేశమునందు మొదటనే యాచరణమునందుండెననియు మనపూర్వులు ప్రాచీనా[illegible]నెసరికసాధనములతో బాలురను శిక్షణొసంగుటను జక్కఁగ [illegible]యుదాహరణమువలన విశదమగుచు[illegible].

లంగీకరింపవీలుపడును? ౩౧ భక్తులు కల్పనముతో నెద్దియేని దేవతను బ్రతిష్ఠించి ప్రార్థింతురు. మఱియు నంతఃబోక యాకల్పిత దేవతయెడ దృఢమగు భక్తిని బ్రతిష్ఠింతురు. కారణాంతరములచే నేదేని యాదేవతావిగ్రహమునకు హానిగలిగినచో భక్తులుకూడ నావిచారమునకతన దుఃఖితులగుదురు. ౩౨ కొందఱు శిలలతో దేవతలనుజేయుదురు. అవి పగిలిపోయినయెడల విచారపడుదురు. ఏడ్తురు. పడిపోవుదురు. అరచెదరు ౩౩ ఒకానొక దేవత యింటియందే భిన్నభిన్నముగావింపబడును. ఒకానొకదానిని దొంగలెత్తుకొనిపోవుదురు. ఒకానొక దేవతావిగ్రహమును దురాచారులు బలాత్కారముగా విరుగగొట్టివేయుదురు ౩౪ ఒకానొక దేవతావిగ్రహమును భ్రష్టత కావించెదరు. ఒకానొకదానిని నీటిలోఁ బారవేయుదురు. ఒకానొక దేవతనుగొందఱుదుష్టులుతమపాదములక్రిందఁ (అరుగుమెట్లుగాఁ) బడవేయుదురు ౩౫ ఇదియంతయుఁజూచి జను లీవిధముగాఁ జెప్పుకొందురు. ఏమి చెప్పుదుము. పూర్వమీతీర్థమహిమమిగులగొప్పదిగా నుండెను కాని యాదుర్మార్గులు సర్వనాశనమొనరించిపోయిరి. ఇపు డీవిగ్రహముల మాహాత్మ్య మెచటికిఁ బోయినదో తెలిసికొనఁ జాలకున్నారము * ఒక దేవతను స్వర్ణకారులు సువర్ణముతో నిర్మింతురు. ఒక దేవతను కంచరులు లోహముతోఁ జక్కఁగాఁ బోతపోయుదురు. ఒక దేవతను శిలాశిల్పులు (కానేపనివాండ్రు) సుందరముగాఁ దీర్చెదరు ౩౬ నర్మదా గండకీనదులతీరమునందు సైతము లక్షలకొలఁది దేవతామూర్తులు పడియున్నవి. ఈ యసంఖ్యాకములగు దేవతావిగ్రహముల నెవరు లెక్కింపగలుగుదురు? ౩౭ చక్రతీర్థమునందు అసంఖ్యాకముగా విగ్రహములు పడియున్నవి. ఆవిగ్రహములు చక్రాంకితములుగనుండి యే దేవతయైనది నిశ్చయింపరానివిధముగా నున్నవి ౩౮ బాణములు, తాండలములు, స్ఫటికమూర్తులు, నాణెములు మనము పెక్కింటిని సేకరించి దేవతాభావముతోఁ బూజించుచున్నారము. ఈ దేవతామూర్తులన్నియును

---

* ఈయుదాహరణమువలన ఆకాలపు ధార్మికాచారములను ధ్వంసముగావించిన [illegible] తెలియవచ్చును. ఈధ్వంసక్రియ విశేషించి యవనులచేతుల మీఁదుగా జరుగుచుండెను.

సత్యములో అసత్యములో యెవరెఱుంగఁగలరు? ౪౦ ఒకఁడు పట్టుతో దేవతనుగావించును. అది యెప్పుడు చిదిగిగాని విరిగిగాని చెడిపోవునో యప్పుడు మరలమట్టితో మూర్తినొనరించి పూజింపనారంభించును. ౪౧ ఒకానొకభక్తుఁడు "అన్నా! మా దేవతామూర్తి మిగులసత్యమైనది. మా కాపదలుగలిగినపు డామూర్తియెంతయేని సహాయముగావించును. నిరంతరము మాకోర్కెలను నెరవేర్చుచుండును. కాని యేలకో యిపుడు దానిమాహాత్మ్యము తగ్గిపోయినది. ఏమి చేయుదుము. ఏది జరుగవలసియుండెనో అదియే జరిగిపోయినది. కానున్నదాని నీశ్వరుఁడు సైత మాపఁజాలడు" అని నుడువును. ౪౨, ౪౩ ఓమూర్ఖుడా! లోహము, ఱాయి, మన్ను, కఱ్ఱ, చిత్తరువు మున్నగునవి యెచటనేని దైవతములు కాఁగలవా? ఏల భ్రాంతిలోఁ బడియున్నాఁడవు ౪౪ ఇదియంతయుఁ గేవలము మనము కల్పించునదియేసుమా! కర్మానుసారముగ జీవులకు ఫలము లభించుచుండును. ఆయాకర్మములకుఁ దగినఫలము లొసంగు సత్యదైవతము వేఱుగానున్నాఁడు ౪౫ ఈసృష్టి మాయ[illegible]లఁ గలిగిన భ్రమయనియు నిది కేవలము మిథ్యయనియు వేదము, శాస్త్రము, పురాణము, నుడువుచున్నవి. ౪౬ సాధుసజ్జనుల[illegible]యు మహానుభావులయొక్కయు ననుభవముగూడ నిదియే యైయున్న[illegible] సత్యదైవత[illegible] ఈపంచభూతాత్మక సృష్టి కావలనున్నా[illegible] ఆదేవుఁడు శాశ్వతుఁడు. సృష్టి యశాశ్వతము ౪౭ సృష్టికిముందుగను [illegible]త్తమానసు[illegible]నుసృష్టివినాశనమైనపిమ్మట ను సత్య దేవుఁడు [illegible]గా స్థిరు[illegible]న్నాఁడు. ఆయనకు ఆద్యంతములు లే[illegible] ౪౮ [illegible] శాస్త్రకారుల యభిప్రాయము. ఇందు సందియ మావంతయును లేదు. [illegible]ాయయొక్కయు [illegible] బ్రహ్మముయొక్కయు సంబంధము కేవలము కల్పితము ౪౯ కేవలమొక కల్పనాగర్భమునందు ఎనిమిది సృష్టులున్నవని చెప్పుదురు. [illegible]టిని వివరింపఁబోవుచున్నారము ౫౦

మొదటిది కల్పనాసృష్టి, రెండవది శాబ్దికసృష్టి, మూఁడవది ప్రత్యక్షసృష్టి. ఈమూఁడింటి నందఱు నెఱుంగుదురు ౫౧ [illegible]ల్గవది చిత్రలేపనసృష్టి, ఐదవది స్వప్నసృష్టి, ఆఱవది గాంధర్వసృష్టి, ఏడవది జ్వరసృష్టి ౫౨ ఎనిమిదవసృష్టి దృష్టిబంధనము. ఈయెనిమిదియు సృష్టులని చెప్పఁబడును. ఇపు డీయెనిమిదింటిలో సత్యమని యంగీకరింపఁదగిన శ్రేష్ఠ

మగుసృష్టి యెద్ది? ॥౩ కావుననే సృష్టినాశవంతమైనదని నుడువుదురు. ఈవిషయమును మహాత్ములు సాధువులు బాగుగా నెఱింగియున్నారు. ఐనను ఆత్మజ్ఞానము దృఢమగుటకొఱకు మానవులు సాధనరూపమున సగుణపరమాత్మని భజనము ముఖ్యముగాఁ జేయవలయును ॥౪ సగుణాధారమువలనను సాధుసజ్జనసమావేశమువలనను సారాసారవిచారమువలనను దప్పక సాధకులకు నిర్గుణపరబ్రహ్మము లభించును ॥౫ ఈవిషయము నిఁక ముగించుదము. ఇప్పటికే విషయము చాల విస్తరమైనది. సాధుసమాగమమువలన సర్వము విదితమగును. లేనియెడల మనస్సు సందేహములపాలగును ॥౬ ఇదియంతయు విని శిష్యుఁడీవిధముగా నాక్షేపించెను "సృష్టిమిథ్యయగుట తెలిసెను. ఇదియంతయు మిథ్యయైనప్పుడు మనకేల కనిపించును? ॥౭ ఓగురుస్వామి! దృశ్యము ప్రత్యక్షముగాఁ గాన్పించుచున్నది కావున సత్య"మనియే నాకుఁ దోఁచుచున్నది. ఇది మిథ్యయనుసంగతి నాకెటుల గోచరించునో యావిషయము కృపతో నాజ్ఞయిండు ॥౮ దీనికి ప్రత్యుత్తరము వక్త యిటులఁజెప్పుచున్నాఁడు. ఓయీ! నీప్రశ్నమునకు సమాధానము ముందుఁబోవుసమాసములో విపులముగా నొసంగఁబడినది. సావధానమనస్సుతో నాలింపుము ॥౯ సృష్టిని మిథ్యయనియే భావింపవలయును. మఱియు సగుణభజనమునుగూడ (విగ్రహపూజకూడ) నాచరింపవలయును. ఈయనుభవరహస్యము సామాన్యులెఱుఁగరు. అనుభవనీయులకే యి[illegible]ు తెలిం[illegible]

ఏడవ సమాసము.

సగుణభజనము.

శ్రోత యిటుల నడుగుచున్నారు. జ్ఞానము[illegible]తయు మిథ్యగ నెఱుంగనయ్యెనుగదా! ఇఁక [illegible] నేలచేయవలయును? అట్టి భజనమువలనఁ బ్రాప్తించు ఫలమేదియో యాజ్ఞయిండు ॥౧ జ్ఞానమునకంటె శ్రేష్ఠమైన దెద్దియును లేదని మీ రాజ్ఞయిచ్చితిరి. అటులైన ఉపాసనములోఁ బనియేమున్నది? ఉపాసనమువలనఁ బ్రాప్తించు ఫలమేది? ॥౨ ముఖ్యసారము నిర్గుణముగానుండి సగుణము కనిపించుటయే లేనప్పుడు సగుణభజనము గావించుటవలనఁ గలుగులాభమేదియో యాజ్ఞయిండు

౩ ఈదృశ్యప్రపంచమంతయు నశ్వరమని తాము నాకు ధ్రువముగాఁ దెలియఁజెప్పితిరి. ఇఁక నీనశ్వరపదార్థమునుగూర్చి చేయుభజనమువలనఁ గలుగులాభములెవ్వి? సత్యమువిడిచి యసత్యము నేయవివేకియేని భజించునా? ౪ అసత్యవస్తు విదియని గ్రహించినపిమ్మట నీనియమము లేల పాటింపవలయును? సత్యమునువిడిచి యేల యీయాందోళనములో బడవలయును ॥౫ నిర్గుణమువలన మోక్షము లభించుచున్నది. ఇది ప్రత్యక్షానుభవమునకుఁగూడ వచ్చుచున్నయంశము. ఇప్పటున సగుణము నుపాసింపవలసిన యవసరమేమున్నది? సగుణోపాసన మేమి ఫలము నొసంగునో సెలవిండు ౬ మొట్టమొదట మీరు సగుణము నశియించెడిదని చెప్పియుంటిరి. మరల మీరే యిపుడు సగుణభజనము జేయుమని చెప్పుచుంటిరి. కాని యిప్పుడు సగుణభజన మేలచేయవలయునో తోఁచకున్నది ౭ దేవరవారి భయమువలన నడుఁగజాలకున్నాము. తా మీవిధముగాఁ బరస్పరవిరుద్ధముగాఁ జెప్పుటవలన మాకేమియు బోధగాకున్నది. సాధ్యము ప్రాప్తమైనప్పుడిఁక సాధనములతోఁ బని యేమియుండును? ౮ శ్రోతలు గావించిన యీసందేహములనాలించి వక్త యిటులఁ బ్రత్యుత్తరము నొసంగుచున్నాఁడు ౯

గురునివాక్యములను బ్రతిపాలించుట పరమార్థమునకు ముఖ్యలక్షణము. గురునివాక్యమును నిర్వహింపనియెడలఁ దప్పక హానిగలుగును. ౧౦ కావున గురునియాజ్ఞను దలపయిధరించి యవశ్యముగా సగుణభజనము నంగీకరింపవలయును. ఇందుమీఁద శ్రోత మఱలనిటులఁ బ్రశ్నించెను. అయ్యా! ఈశ్వరుఁ డీసగుణభజనము నేల మాతలపయిఁ బెట్టినాఁడు ౧౧ ఈశ్వరుఁడు సగుణభజనము ప్రసాదించుటనేలయుపకారముగా భావించును. దీనివలన నేది సాక్షాత్కారమగును. లేక ఈశ్వరుఁడు ప్రారబ్ధరూపమున వ్రాసియున్నదాని నేమేని యీసగుణభజనము తుడిచివేయునా? ౧౨ మనుజునకుఁ గావలసినది లభింపనపు డీసగుణభజనము నేల చేయవలయును? ఇది యేమియునునాకుబోధగాకున్నది. ౧౩ తమయాజ్ఞ పవిత్రతరమైనదే. దానినెవ్వరును గాదనఁజాలరు. ముందు నాకీ సగుణభజనమువలనఁ గలుగు లాభములెవ్వియో సెలవిండు ౧౪ వక్త యిటులఁ జెప్పుచున్నాఁడు. ఓయీ నీవు జ్ఞానివగుచున్నాఁడవు. కాని సావధానుఁ

డవై నాకు జ్ఞానలక్షణములను దెలుపుము. నీకేమైనఁ జేయవలసిన పని యున్నదా లేదా! ౧౫ నీవు భోజనము జేయుచున్నాఁడవు. జలపానము గావించుచున్నాఁడవు. మలమూత్రములను విడుచుచున్నాఁడవు. వీనిలో నేదేని విడిచిపెట్టుటలేదు. ౧౬ నీవు జనుల నానందపఱచుచుంటివి.. నీది యనియుఁ బరులదనియు నీవు గురుతెఱుంగుదువు. ఇంధు నీవేదియు విడువ నేరవుగదా! అట్టిస్థితియందు నీవు భజనలక్షణమును విడచుట జ్ఞానలక్షణముగా భావింతువాయేమి? ౧౭ జ్ఞానవివేకముతో నీవు సమస్తమును మిథ్యయని గ్రహించినాఁడవు. ఇందు విశిచినదిమాత్ర మెద్దియును లేదు. అట్టియెడల భజనముమాత్రము విడిచిపెట్టుట కేమిపాపము గావించినదో చెప్పుము ౧౮ యజమాని (సాహెబుగారి) పాదములకడ నీవు సంతోషముగాఁ బడి పొరలాడెదవు. చక్కఁగ నెఱింగియుండియు నీచత్వమునకుఁ గూడ లోనయ్యెదవు. కాని పరమాత్మునిమాత్ర మొప్పుకొనవు. ఇది యెక్కడిజ్ఞానము? ౧౯ బ్రహ్మవిష్ణుమహేశాదు లెవ్వనిముందుఁ జేతులను జోడించుకొని నిలువఁబడియుందురో యాపరమాత్ము నొకవేళ నీవంటినీచమానవుఁడు భజియింపకుండిన నయ్యెడిదేమి? ౨౦ రాముఁడు మా కుపాస్యుఁడు. రామునితోనే మాపరమార్థమున్నది. అతఁడే సమర్థులందఱికంటెను సమర్థుఁడు. దేవతలనుసైతము ముక్తులను గావించెడివాఁడు. మనమందఱ మాయనకు సేవకులము. అతని చరణసేవలవలననే మనకు జ్ఞానము లభించినది. అట్టిరామునియెడ మనము భక్తిజూపక విముఖులమైనయెడలఁ దప్పక పతనమొందుదుము ౨౧ సారాసారవిచారమును దెలిపినగురుని మిథ్యయని యెటుల నుడువఁగలము? నీవీవిచారము నేమఱుంగుదువు? నేర్పరులకందఱకు నీయంశము తెలిసినదె ౨౩ సమర్థుడగు దేశికునియనుగ్రహమునకు దూరమైనమానవుఁడు దౌర్భాగ్యుఁడు. రాజ్యపదవినుండి చ్యుతుడైనవానిదశ యెటులుండునో గురునియనుగ్రహమునకు దూరమైనవానిస్థితి యట్లుండును ౨౪ నేను గొప్పవాఁడనని తనహృదయమునందు భావించువాఁడు బ్రహ్మజ్ఞాని కాఁడు. ఆలోచించిచూచినచో వాఁడు ప్రత్యక్షదేహాభిమాని ౨౫ వాస్తవమగు భక్తితో రాముని భజింపనివాఁడును నేను భజింపనని స్పష్టముగా నుడువనివాఁడును సందేహశీలుఁడు. ౨౬ అట్టివానిని జ్ఞానియని చెప్పఁజాలను.

భజనశీలుఁడగు భక్తుఁడనిగూడఁ జెప్పఁజాలను. మఱి యెవఁడన్నచో కేవలదేహాభిమాని. ఇందు సందేహ మావంతయు లేదు. ఇది ప్రత్యక్షమగు నుదాహరణముగదా ౨౭ ఇట్లు వర్తింపదగదు. శ్రీరాముని భజింపవలయును. అదియే సత్యమగుజ్ఞానము ౨౮ దుర్జనులను శ్రీరాముఁడు సంహరింపుచున్నాఁడు. భక్తులను గాపాడుచున్నాఁడు. ఇదిప్రత్యక్షము ౨౯ రామానుగ్రహమువలన భక్తులమనోరథములు నెఱవేఱుచున్నవి. విఘ్నములు సంపూర్ణముగా దూరమగుచున్నవి. ఇది యనుభవపూర్వకముగాఁ జెప్పుచున్నసంగతి ౩౦ రఘునాయకుని భజనమువలననే జ్ఞానము కలుగును. రఘుకులభూషణుని భజనమువలననే మహత్త్వము వృద్ధినొందును. కావునఁదొలుతొల్తనీవుసగుణభజనమును (శ్రీరామభజనమును) గావింపుము ౩౧ అనుభవపూర్వకముగా నేనుజెప్పుచున్న యీవిషయమునందు నీకుఁ గొంచెమేని నమ్మకముగలుగకున్నది. కావున నీవు స్వయముగ నిది యనుష్ఠించిచూడుము ౩౨ రఘునాథునిస్మరించి యనంతరము గావించుపనులన్నియు వెంటనే నెరవేఱును. కాని కర్త రాముఁడేయని మాత్రము అంతఃకరణమునందు సంపూర్ణముగా విశ్వాసముంచవలయును ౩౩ స్వయముగాఁ దన్ను దేనికిని గర్తనుగా దలంపక రాముఁనే యన్నింటికిని గర్తనుగా దలంచుట సగుణాత్మనివేదనభక్తిలక్షణము. నిర్గుణాత్మనివేదనమునందన్ననో స్వయముగాఁదానుగూడ నిర్గుణుఁడై యనన్యుఁడుగావలసియుండును. * ౩౪ తనను గర్తనుగాఁ దలంచినయెడలనెప్పుడును నేవిషయమేని సమకూరదు. ఈవిషయములో ననుభవమునొందుట కంతశ్రమ నొందవలసినపని లేదు ౩౫ ఒకవేళనీవు నేనేకర్తనని నుడివెదవేని కష్టములపాలగుదువు. రాముఁడే కర్తయని భావించుటవలన నీకుఁ గీర్తియుఁ బ్రతాపము లభించును ౩౬ పరమాత్మునితో సంబంధమును ద్రెంపివేసికొనుటయు నాతనియనుగ్రహము సంపాదించుకొనుటయు భావనామాత్రమున జరుగును. నీహృదయమునందు నేనేకర్తనను భావమును గలిగియుంటివేని పరమాత్మునితో నీకుఁ

---

* సగుణనివేదనమునందు సర్వస్వమునకును బూర్ణభారము శ్రీరామునిమీదనే యుండును. సాధకుఁ డిచట కేవలనామమాత్రముగా నుండును. నిర్గుణనివేదనమునందు దానుగూడఁ బూర్తిగ రాముఁడైపోవును.

గలసంబంధము దూరమగును. పరమాత్మునియందుఁ గర్తృత్వభావమును గలిగియుంటివేని యాతఁడు ప్రసన్నుఁడగును) ౩౭ మనము ఈప్రపంచమున రెండుదినము లుండిపోవువారము. పరమాత్ముఁ డంతములేనియంతకాల మిటనుండును. మనమందఱము స్వల్పపరచీయులము. పరమాత్ముని మూఁడులోకము లెఱుంగును ౩౮ రఘునాథునిభజనఘును జాలమంది యొప్పుకొందురు. బ్రహ్మవిష్ణుమహేశ్వరులుసైతము రామభజనతత్పరులై యున్నారు. ౩౯ భక్తులమగుమనము జ్ఞానబలమువలన ఉపాసనమునంగీకరింపకపోయినయెడల నీదోషకారణమున భక్తిశూన్యులమై కడ కధోగతి నొందుదుము ౪౦ పరమాత్ముఁడు మిగుల గొప్పవాఁడు. ఆతఁడు తన భక్తుల నెన్నఁటికిని ఉపేక్షింపడు. ఉపేక్షించునేని కాఁబోవునదేదియో యాతఁ డెఱింగియే యున్నాఁడు. అక్రమకృత్యములు శ్రేష్ఠుఁడగువాఁ డెన్నఁటికిని గావింపఁడు. అటులొనరించుట శ్రేయముగాదని యాతఁ డెఱుంగనివాఁడుకాఁడు ౪౧ సాధువులకు దేహముతోఁబాటు ఉపాసనము గూడ విడరానిబంధముగ నున్నది. లోపలనుండి వారలు పరమాత్మునితోఁ గలిసియుందురు (దేహాభిమానమునువిడిచి వారలు జన్మాంతమునుక యీశ్వరోపాసనము గావించుచుందురు) ౪౨ సాధుపురుషులు ఈసృష్టిని స్వప్నదృశ్యములనువలె మిథ్యగా భావింతురు. ఈవిషయము శ్రీరామభజనముకతన విదితమగును ౪౩, ౪౪ దృశ్యసృష్టి మిథ్యయగుచో నేల కాన్పించును? అనిశ్రోతలకు సంశయము కలిగినది. ఈసందేహమును రాబోవుసమాసమునందుఁ దొలఁగించెదను ౪౫

ఎనిమిదవ సమాసము.

దృశ్యమునకుఁగల మిథ్యాభాసము.

ఈదృశ్యసృష్టియొక్క ఆభాసము (లేనిది యున్నటులఁదోఁచుట) మిథ్యయెటులయ్యెనో మీకు నిరూపించి తెలుపుచున్నాఁడను. శ్రద్ధాభక్తులతో జెవియొగ్గి వినుండు ౧ జడులు, మూఢులు, అజ్ఞానులునగుమనుజు లీసృష్టిని సత్యమని విశ్వసించిన విశ్వసింతురుగాక. కనుబడుదానినెల్ల సత్యమనివిశ్వసించుట జ్ఞానిదృష్టికిఁదగినపనికాదు. ౨ "నాకు గనఁబడునదియెల్ల సత్యము, దీనినెవఁడేని కాదనిపలుకునేని నేను వానినోడించెదను" అను

నీదురభిమానమునకు లోనుగాఁగూడదు. కేవల మీచర్మచక్షువులకుఁ గాన్పించుచున్నంతమాత్రమునఁ గోట్లకొలఁదిగనున్న గ్రంథములయొక్కయు సాధుసజ్జనులయొక్కయు మాటలను మిథ్యయని యెట్లనుడువఁగలము ౩,౪ మృగము, మృగజలమును (మృగతృష్ణను) గాంచి జలమని భ్రాంతినొంది నలుగెలంకులఁ బరుగెత్తుచున్నది. "ఇదిమిథ్యాదృశ్యము. ఇచ్చట జలములేదు." అని యాపశువుతో నెవ్వఁడు చెప్పఁగలఁడు! ౫ అపారమగు ద్రవ్యములభించినట్లును ఆధనముతోఁ బలువురితో వ్యవహారముగావించినట్లును రాత్రిస్వప్నమునఁ జూతుము. దీనిని సత్యమనియెట్లు నమ్మెదము ౬ ఒకానొకచిత్రకళాకుశలుఁడు నిర్మించిన ప్రతిమను గాంచినంతన హృదయమునందుఁ బ్రీతిజనించుచున్నది. కాని యట నేమున్నది. మన్ను ౭ బహువిధములుగానుండు రమణీమణులను, ఏనుఁగులను, గుఱ్ఱములను, రాత్రులందుఁ గాంచెదమేని మనస్సు మోహమగ్నమగును. కాని పగటిపూటఁగాంచెదమేని యవియన్నియును దోలుబొమ్మలని తెలియును. చూచుటకెంతయో యసహ్యకరముగఁగూడ నుండును ౮ శిల్పులు నానావిధకౌశలములతో రచించినదారు, పాషాణవిగ్రహములు మిగులసుందరముగాఁ గాన్పించును. కాని యచటనున్న దేమిటో తెలియునా? కొయ్యముక్కలు. లేదా ఱాయి. ౯ అనేకమందిరములపైనుండు ప్రతిమలు శరీరము వంచి యోరచూపుతోఁ జూచుచున్నటు లుండును. వాని సౌందర్యము గాంచినంతన చిత్తవృత్తి వానియందు లీనమైపోవును. కాని వానిలోనుండునవి (ఇసుక సున్నము మసాలయును) త్రిభాగములే ౧౦ దశావతారనాటకములాడుటలో రంగస్థలిమునకు సుందరాంగులగుస్త్రీలు వత్తురు. వారలు కళాకౌశలముతోఁ గనులనుద్రిప్పుదురు. కానివారలందఱును నటకులగు పురుషులే ౧౧ ఈసృష్టి నానావిధముల నున్నది అసత్యమైనది ఇది పగటివేషకాండ్రు (బహురూపులు) గావించు వినోదమువంటిది. అవిద్యాకారణమున నీకీదృశ్యమంతయును సత్యముగాఁగాన్పించుచున్నది ౧౨ ఓయీ నీవు అసత్యమును సత్యముగాఁదలంచి తిలకించుచున్నాఁడవు. అంతతో నూరకయుండక బాగుగా విచారింపుము. దృష్టికిఁగల తరళత్వచంచలత్వవికారములవలన నేదేని యొకటి యింకొకటిగ భాసించినయెడల దానిని సత్యమని నెటులనంగీకరింతుము ౧౩ పైకిఁజూచినయెడల నాకాశము నిలు

కడగానున్నటులఁ గాన్పించును. నీటిలోఁ గొంతుమేని కదలుచున్నటు లుండును. ఆకాశమధ్యమున నక్షత్రసముదాయము ప్రకాశించుచున్నవి. కాని యీదృశ్యమంతయును మిథ్యయేగదా ౧౪ ఒకరాజొక చిత్రకారుని బిలువనంపి తనకుటుంబములోనివారినందఱను యథాతథ్యముగఁ జిత్తరువులోఁ జిత్రింప నాజ్ఞాపించును. చిత్రకారుఁడు చిత్రించిన ప్రతిరూపములు వారలవలనే యుండును. యథార్థమునకు అదిఅంతయు మాఱుకరచనముగాక యేమున్నది? ౧౫ నేత్రములయందు స్వయముగా నేచిత్రమునుండదు. కాని మనము దేనినేనిగాంచినపు డాదృశ్య వస్తుప్రతిబింబము మననేత్రములలోనికి వచ్చును. ఇపు డీప్రతిబింబము స్వయముగా నావస్తువే యని యెటులొప్పుకొనగలము? ౧౬ నీటియందెన్ని బుడగలుపుట్టునో వానియన్నిఁటియందు మనరూపము లనేకములు గాన్పించును. కాని యవి క్షణమాత్రములోఁ బగిలిపోయినపిమ్మట ఆరూపములయసత్యత్వము ప్రకటితమైపోవును ౧౭ చేతియందెన్ని చిన్న చిన్న యద్దములదీసికొంటిమో యన్నింటియందును మనముఖ మన్నిగాఁగనిపించును. వాస్తవమునకు మన కన్నిముఖము లెక్కడివి? ఒక్కముఖమేగదా! అటులఁ బెక్కులుగాఁగనిపించుట కేవలము మిథ్యాభాసము ౧౮ నదీతీరమున బరువునుగొనిపోవునపుడు తలక్రిందుగానున్న బరువుమోయుచున్న రెండవరూపము నదిలోఁ గాన్పించును. ఆకస్మికముగా మనముగావించు ధ్వనికిఁ బ్రతిధ్వనివినిపించును ౧౯ బావియందును జెఱువునందునుగల నీటిలో సమీపముననున్న పశుపక్షినర వానరనానావిధవృక్షలతాదులు ప్రతిబింబితములుగాఁ గనఁబడుచుండును. ౨౦ కత్తిని త్రిప్పునపుడు చూచితిమేని ఒకకత్తియే రెండుకత్తులుగాఁ గనఁబడును. వివిధములుగానుండు తీఁగలను జలింపజేయుదుమేని యొకటి రెండుగాఁ గనిపించును ౨౧ నిలువుటద్దములతో నలంకరింపఁబడిన భవనమునందొకవేళ సభ జరుగుచున్నయెడల రెండవసభ ఆభాసరూపముగా నద్దములలోఁ గాన్పించును. దీపపంక్తులుగూడ అద్దములయందు బహువిధ ప్రకాశములతోఁ గానఁబడుచుండును ౨౨ ఈవిధముగా బహుప్రకారములగు నీకౌతుక ప్రదర్శనములు సత్యతుల్యముగాఁ గాన్పించుచుండును. వీనినన్నింటిని మనము సత్యములని యెన్నఁటికిని విశ్వసింపనేరము ౨౩ ఇటులె మాయగూడ నొకకపటనాటకము.

బైటికి సత్యమువలెనే కాన్పించును. జ్ఞానులు దీనినెన్నఁటికిని సత్యమని విశ్వసింపరు ౨౪ కల్పితమగువస్తువును సత్యమైనదానిగా భావించినయెడల నిఁక విమర్శకులతో విమర్శముతో నావశ్యకమేమున్నది? ఈ యవిద్యాకృత్యములును నిటులెయుండును ౨౫ మనుజులుగావించు గారడివిద్యగూడఁ గొందఱకు సత్యముగనే తోఁచును. కాని యంత్యమునందు శోధనముగావించినపిదప నందుగల యసత్యమంతయు విదితమగును. ౨౬ రాక్షసులమాయసైతమిట్టిదియే. అది దేవతలకుసైతము సత్యముగనే కాన్పించును. పంచవటియందు శ్రీరాముఁడే లేడిని వెంబడించి పరుగెత్తినాఁడు ౨౭ రాక్షసులు కోరినపుడు తమదేహమును మార్చివేయుదురు. ఒకఁడే పెక్కుమందిగా మాఱును. రక్తపుఁబొట్టులనుండిగూడఁ బలువురు జనింతురు ౨౮ అభిమన్యుని వివాహసమయమునందు ఘటోత్కచుని మాయవలన అనేకులు రాక్షసులు నానావిధపదార్థములుగ ఫలములుగా మాఱిరి. శ్రీకృష్ణుఁడే గోకులమునందు ఎందఱో కపటరూపులగు దైత్యులను వధించెను ౨౯ రామునితో సంగరముగావించు సమయమునందు రావణుఁ డెన్నికపటములగు మాయలను గావించెనో ఎన్నిమాయశిరములను నిర్మించిమోసగించెనో కాలనేమి హనుమంతునిజంపుటకై కపటఋషియై యెటులవంచించెనో మీరెఱుంగనియంశము గాదు ౩౦ నానావిధములగు కపటమతులుగల రాక్షసుల దేవతులు చంపజాలకున్నపుడు దేవి ప్రత్యక్షమై వారలనందఱను గడతేర్చెను. ౩౧ ఇదియంతయును రాక్షసులమాయ. దీనిని దేవతలుసైతమెఱుంగఁజాలరు. రాక్షసుల కపటవిద్యాలీల లఘటితములు ౩౨

మనుజులుగావించు గారడిమున్నగుమాయలు, రాక్షసులుగావించు మోసములు, భగవంతుని నానావిధములగు విచిత్రమాయలు అనునీమూఁడును బయటికి సత్యసమానములుగా గాన్పించును. బాగుగా విచారించిన మీఁదట నందు సత్యమేమియును లేదని బాగుగాఁ దెలియును. లోనఁ బ్రవేశించి చూచినకొలఁది వానిమిథ్యాత్వము ప్రకటనమగును ౩౩, ౩౪ మాయను సత్యమందుమేని యదిబొసఁగదు. ఏలయన మాయ నాశమగుచున్నది. ఒకవేళ అసత్యమందుమా! అది కాన్పించుచున్నది. రెండుప్రక్కలను మనస్సునందు అవిశ్వాసము కలుగుచున్నది. ౩౫

వాస్తవములో నిది సత్యముగాదు. మాయమిథ్యగ నున్నది. ఈసం పూర్ణమగు దృశ్యమంతయు స్వప్నమువంటిది. ౩౬ అన్నా! వినుము. ఒకవేళ నీకు భాసమే (కనుపించునదియే) సత్యముగాఁ దోఁచెనేని నీవు ప్రమాదమునొందితివని యర్థము ౩౭ ఈదృశ్యభాసమంతయు నవిద్యాత్మకము. నీదేహముగూడ నవిద్యాత్మకము. కావుననే యీయవివేకము నీయందుఁ జొచ్చినది. ౩౮ దృష్టివలన దృశ్యము గనిపించుటకును మఱియు మనస్సు దానిభాసముపయిఁ బాదుకొనుటకును ఈయవిద్యాత్మకమగు లింగదేహమే కారణము ౩౯ *అవిద్య యవిద్యను చూచుచున్నది. ఇందువలనఁ బైనిచెప్పిన విషయము పై విశ్వాసముకలుగుచున్నది. ఏలయన! నీశరీరముగూడ నవిద్యచే నిర్మింపఁబడినదిగదా ౪౦ ఈ దేహమునే నీవు స్వయముగా నేను అనుచున్నాఁడవు. ఇటులనుట దేహబుద్ధిలక్షణము. దీనివలననే సంపూర్ణదృశ్యము నీకు సత్యముగాఁ దోఁచుచున్నది ౪౧ ఇటు దేహమును సత్యమని విశ్వసించుచున్నాఁడవు అటు దృశ్యమును సత్యమని విశ్వసించుచున్నాఁడవు. ఈకారణములచేతనే నీకుఁ బ్రబలమగు సందేహము కలుగుచున్నది ౪౨ దేహబుద్ధిని దృఢముగావించి దిట్టతనముతో బ్రహ్మమును జూచుటకు యత్నించుచుంటివిగాని యిచట దృశ్యము మాయ పరబ్రహ్మము యొక్కమార్గము నాటంకపఱచుచున్నది ౪౩ ఇందుచే దృశ్యమునే సత్యముకాఁ దలంచి భ్రమలోఁబడుచుంటివి. ౪౪ అహమత్వము (నేనునాదియనుట) వలన బ్రహ్మము లభింపదు. దేహబుద్ధివలననే దృశ్యమునకుఁగల మిథ్యాభాసము సైతము సత్యముగాఁ దోఁచుచున్నది ౪౫ చర్మచక్షువులతో బ్రహ్మమును దర్శించెడువాఁడెన్నఁటికిని జ్ఞాతయని చెప్పఁదగఁడు. వానిని గ్రుడ్డివాఁడనిగాని కేవల మూర్ఖుఁడనిగాని నుడువవచ్చును. ౪౬ దృష్టికిఁ గాన్పించునదియంతయు మనస్సునకు భాసించునదియుఁ గాలాంతరమునందు వినాశనమగును. కాని యవినాశియగు పరబ్రహ్మము దృశ్యమునకంటె వేఱుగ (ఆవలన) నున్నాఁడు. ౪౭ శాస్త్రములన్నియును బరబ్రహ్మమును శాశ్వతమనియు మాయ నశాశ్వతమనియు నిశ్చయించుచున్నవి. ౪౮ రాఁబోవుసమాసములో దేహబుద్ధిలక్షణములను దెలిపి భ్రమయందుఁ బడియున్న "నేను" అనునదెవ్వరో దానినిగూడ వివరించెదను ౪౯ "నేను" అనుదానినెఱింగి భావమును విడిచి పరమాత్మునియం దనన్యతనొందుటవలన సులభముగాఁ బరమశాంతిలభించును ॥౫౦

*దృశ్యము అవిద్యాత్మకము. ఈదేహముగూడ అవిద్యాత్మకమే. ఈస్థితియందు నీయవిద్యాత్మకదేహమునకు (శరీరములనే నీవు నేనుఅని భావించెదవుగాన నీవు) ఈ యవిద్యాత్మకమగు దృశ్యజగత్తు సత్యముగాఁ గనఁబడుచున్నచో నంవాశ్చర్యకరమగు విషయ మేదియును లేదు. సాధారణమే!

తొమ్మిదవ సమాసము

గుప్త పరమాత్మ శోధనము

ఇంటిలో రహస్యముగాఁ దాచినధనమును సేవకు లెఱుంగరు. సేవకులకు బహిరంగముగాఁ గనవచ్చు పదార్థములతోడనే సంబంధముండును ౧ బయటికిఁ గాన్పించుచున్న పదార్థములను విడిచిపెట్టి నేర్పరులు లోపలనున్న ముఖ్యధనమును వెదకి గైకొందురు ౨ ఇటులే వివేకమతులగు మానవు లీమాయిక (సృష్టి) దృశ్యమును విడిచి పరమాత్ముని శోధించి గైకొందురు. తక్కినవార లీదృశ్య మాయలోఁ దగుల్కొనియుందురు ౩ ద్రవ్యమును లోపలనుంచి పైననీటిని నింపినయెడల జనులది యొకసరోవర మనుకొందురు. కాని దానిలోపలనేమున్నదో సమర్థులగువారలకే తెలియును ౪ ఇటులె సమర్థులగు జ్ఞానులు పరమార్థమునుగురుతించి గ్రహింతురు. తక్కినవారలు దృశ్యపదార్థమునే తమస్వార్థముగాఁ దలంతురు. ౫ పాటకపుజనులు కూలివాండ్రు బరువులను మోయుదురు. శ్రేష్ఠులగు పురుషులు సుందరీరత్నములతోఁ గలసి భోగముల ననుభవింతురు. కర్మయోగమువలన నెవ్వనికెయ్యది నియమితమగుచున్నదో యది వానికిఁ బాగుగాఁ దోఁచుచుండును ౬ ఒకఁ డరణ్యమునందలి కొయ్యలనునఱికియు నొకఁడు జాయిఱప్పల నొకచోటఁ జేర్చియు జీవయాత్ర గడుపుకొనుచున్నారు. కాని యుత్తమపదార్థములతో భోగములననుభవించు రాజుల కెదురవస్థ కలుగఁబోదు ౭ విద్వాంసులగు పురుషులు సౌఖ్యముల ననుభవించుచున్నారు. అన్యులు బరువులను మోయలేక చచ్చిపోవుచున్నారు. ౮ ఒకఁడు దివ్యమగు భోజనమును భుజించుచున్నాఁడు. ఒకఁ డమేధ్యమునే వెదకి ప్రోగుగావించుచున్నాఁడు. అందఱు

ను దమతమ కార్యములయం దభిమానులై యున్నారు ౯ శ్రేష్ఠుడగుమను జుడు సారవంతములగు పదార్థములను సేవించుచున్నాఁడు. సోమరిపోతు అసారవస్తువులను గ్రహించుచున్నాఁడు. ఇంతకును సారమేమన్న — సారా సారవిషయములను సుజ్ఞానులే యెఱుంగుదురు. ౧౦ స్పర్శవేధియును చింతామణియును మనకుఁజిక్కక గుప్తములుగా నెందోయున్నవి. ఇనుము, కంచులోనగుసామాన్య లోహములు బహిరంగముగానున్నవి. ఇటులె బంగారము, రత్నములు, మున్నగునవి గనులలో నెందో గుప్తములుగా నున్నవి. ఱాళ్ళు, మన్ను ప్రకటనముగా నన్నికడల నున్నవి. ౧౧ దక్షిణావర్త శంఖము దక్షిణావర్తలత అమూల్యవనస్పతులు గుప్తముగానున్నవి. గ్రుడ్లు, ఉమ్మెత్తలు, నత్తగుల్లలు ప్రకటనముగా నున్నవి.

౧౨ కల్పతరు వెచ్చటను గాన్పింపదు. కాని యితరవృక్షములు చాల గలవు. చందనవృక్షములు గనిపింపవుగాని రేగు, తుమ్మ మున్నగువృక్ష ములు ప్రపంచమునందంతటను విస్తరించియున్నవి ౧౩ కామధేను వింద్రునియొద్దనే యున్నది. ఇతరములగు దూడలు ఆవులు, దేశమునిండ బెక్కులుగలవు. రాజ్యభోగములను రాజులే యనుభవించుచున్నారు. ఇతరులు కర్మానుసారముగా సుఖదుఃఖముల ననుభవించుచున్నారు. ౧౪ బహువిధముల వ్యాపారములు గావించువారలు తమకుఁ దాము ధన వంతులమని చెప్పుకొందురు. కాని కుబేరునిముందు వీరెంతవారో యెఱుం గరు ౧౫ ఇటులే గుప్తమగునర్థమును (పరమాత్మని) బడయఁగలుగు వారలు యోగీశ్వరులే. ఉదరదాసులగు నన్యులు నానామతములనుగూర్చి తర్కించుచుందురు. ౧౬ సారముగలవస్తువు జనులకుఁ గాన్పింపదు. అసా రము సులభముగాఁ గాన్పించును. సారాసార వివేకమును సాధుపురుషులే యెఱుంగుదురు. ౧౭ సత్యాసత్యవిషయములను సామాన్యజను లెటుల నెఱుంగఁగలరు. సాధువులయొక్కయు సత్పురుషులయొక్కయు మహత్త్వ ములను సాధువులు, సత్పురుషులే యెఱుంగుదురు. ౧౮ భూగర్భమునందుం చిన ధనమును అంజనమువేసి కనుఁగొనునటుల సాధుజనానుగ్రహమున గుప్తపరమాత్మని గ్రహింపవలయును ౧౯ రాజువద్దనున్న ధనము సుల భముగాఁ బ్రాప్తించునటుల సాధుజనులకడనున్న యెడలఁ బరమాత్మ లభించును ౨౦ సజ్జనులకుఁ బరమాత్ముఁడు లభించును. దుష్టులకు దుర్గతి

లభ్యమగును. ఆలోచనాధీనుఁడగుమానవునకు ఆలోచనాశక్తి సిద్ధించును. ౨౧ సంపూర్ణముగనుండు నీదృశ్యమంతయు నశాశ్వతమైనది. అచ్యుతుఁడును అనంతుఁడునునగు పరమాత్ముఁడు ఈదృశ్యమునకంటె వేఱుగానున్నాఁడు ౨౨ అంతియగాక యాపరమాత్ముఁడు దృశ్యమునకు వేఱుగను దృశ్యము నకు లోపలను నున్నాఁడు. చరాచరము లన్నింటియందును నున్నాఁడు. వివేకసహాయమున నాతఁ డనుభవములోనికివచ్చును. ౨౩ సంసారమును విసర్జింపకున్నను ప్రపంచోపాధిని వదలకు న్నను కేవలవిచారముతోడనే జీవితము సార్థకమగును ౨౪ ఇది యను భవసిద్ధమగు మాట. వివేకసహాయమున దీని ననుభవములోనికిఁ దేవల యును. ఇందు సందియ మావంతయు లేదు. అనుభవనీయుఁడగుపురుషుఁడే సమర్థుఁడు ౨౫ అప్పుగాఁ దెచ్చుటలో సొమ్మునిచ్చి తెచ్చుటలో నెంత యంతరముగలదో యంతయంతరము అనుభవానుమానములకును మానస పూజాప్రత్యక్షపూజలకుఁ గలదు ౨౬ ఈజన్మమునఁగావించిన సత్కర్మము లఫలము ముందుజన్మమునకు లభించుటయనునది అప్పుతోసంబంధించిన విషయము. కాని సారాసారవిచారమువలని ఫలము (ముక్తి) తత్కాల మునసే(ఈజన్మమునందే) లభించుచున్నది. ౨౭ సారాసారవివేచనమువలన దత్కాలముననే ఫలితము గన్పించును. మనుజుఁడు సంసారమునుండి విడిపోవును. జనన మరణములనుగూర్చిన సందియములు తొలఁగును. ౨౮ వివేకముగలవారు ఈ జన్మమునందే యీకాలముననే సంసారమునుండి వేఱుగాఁగల్గుదురు. మఱియు నిశ్చలస్వరూపాకారులై మోక్షమును బడయుదురు. ౨౯ ఈవిషయమునందు సందేహముగలవాఁడు సిద్ధుఁడై నను దప్పక యధోగతినొందును. దీని నసత్యమని చెప్పువానితో నిదిసత్య ము సత్యము అని మాయుపాసనతో శపథముగావించెదము. ౩౦ ఈవిష యమంతయు సత్యమైనది. మానవులు వివేకసహాయమునఁ దత్క్షణమే ముక్తులుగాఁగలరు. మఱియును వారు సారమునందుండియు నలిప్తులయ్యె దరు. ౩౧ నిర్గుణపరమాత్మస్వరూప మెటులుండును? దానియందనన్యత నొందువిధమేది? అను నీయంశములనుగూర్చి యోచించినయెడల సాధకు కుఁ బూర్ణశాంతి లభించును ౩౨ దేహమునందుండియే విదేహుఁడగు యుఁ జేసియు నేమియుఁజేయనివాడుగ నుండుటయు జీవన్ముక్తుల లక్షణ

ములు. ఈజీవన్ముక్తలక్షణములు జీవన్ముక్తులే యెఱుంగుదురు ౩౩ సాధారణముగా నీవిషయము మానవులకు సత్యముగాఁ గాన్పింపదు. ఇది సంశయాస్పదమని తోఁచును. సద్గురువచనములతో నీసందేహము సమూలముగా నశించిపోవును. ౩౪

పదియవ సమాసము

అనుభవము – అకథనీయము

అనుభవవిషయమును దెలుపుమని యడుగుదుమేని యదియకథనీయమని (చెప్పవలనుపడనిదని) జనులు చెప్పుదురుగావునఁ దాము దీని స్థితినంతయు దయచేసి తెలుపఁగోరెదము ౧ మూఁగవాఁడు బెల్లపురుచి నెఱింగింపనేరనియట్లు అనుభవమునుగూడఁ జెప్పవలనుపడదని కొందఱందురు. దీనికారణమెద్దియో తాము దెలుపుడు ౨. ౩ ఎవ్వరినడుగబోయినను ఈవిషయ మగమ్యమనియే చెప్పుదురు. నా కామాటపయి నమ్మకముగలుగకున్నది. ఈయంశమును నాకు మనస్సునకుఁ బట్టునటులఁ దాము సెలవీయవలయును. ౪ శ్రోతలారా! మీరడిగిన ఈప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరము చెప్పెదను. సావధానులరై వినుండు. ౫ పరమశాంతిని (ఆత్మానుభవస్వరూపమును) మీకు స్పష్టముగావివరించెదను. ౬ ఏది మాటలవలన దెలియఁబడదో అటులే యెయ్యది చెప్పకున్న నెఱుకపడదో మరియు నెద్దానిని గల్పించిచెప్పుటవలనఁ గల్పనాశక్తి మందగించునోయట్టిపరబ్రహ్మము వేదములకుఁగూడఁ బరమగుహ్యముగానున్నది. దానిని సాధుసమాగమమువలనఁ బాగుగా గ్రహింపవచ్చును. ౭,౮ ఇపుడు గంభీరశాంతిని నిరూపణము గావించెదను. నేనుజెప్పు అనుభవవాక్యముల నాలింపుఁడు. మీకిపుడు అనిర్వాచ్యవస్తురహస్యము దెలుపఁబోవుచున్నాఁడను ౯ తెలుప నశక్యమగునంశములను దెలుపయత్నించుట తీపునెఱుంగుటకు బెల్లము నోసంగుటవంటిది. ఈపని (అకథనీయాంశము నెఱింగించుట) గురునివలనఁ దప్ప నితరునివలనఁ గాఁజాలదు ౧౦ తన నన్వేషించువానికిఁ (దేహాభిమానమువిడిచినవానికి) దొలుదొలుత సద్గురునియనుగ్రహము ప్రాప్తించును. పిమ్మట వస్తువు (బ్రహ్మము) తనంతన యనుభవములోనికి వచ్చును ౧౧ బుద్ధినిదృఢముగావించి తొలుత "నేనెవఁడను" అనుజాడ తీయవలయును.

దీనివలన నొక్కసారిగా (సమాధి) ధ్యాన మేర్పడును ౧౨ "తన" యనుదానిమూలమున శోధించినపిమ్మట "తన" యనునది మిధ్యయని విశదమగును. ఇది యనుభవమైనపిమ్మట వాస్తవమునకు దానుస్వయముగా వస్తురూపుఁడై పోవును. ఇదియే పరమశాంతి ౧౩ పూర్వపక్షమునందు ఆత్మను సర్వసాక్షియని చెప్పిరి కాని సిద్ధపురుషులాపూర్వపక్షమును విడిచి సిద్ధాంతమునే గ్రహింతురు ౧౪ సిద్ధాంతముమీఁద మనము ధ్యానముంచఁగనే ఆత్మ సర్వసాక్షి కాదనునంశము విశదమగును. అవస్థయే సర్వసాక్షి. ఆత్మ దానికంటె భిన్నమైనది (అవస్థాతీతమైనది) ౧౫ పదార్థజ్ఞానము లయమైపోవఁగనే ద్రష్ట (పరమాత్మనుజూచువాఁడు) ద్రష్టరూపమున నుండఁడు (స్వయముగాబ్రహ్మమునందు లీనుఁడగును) అప్పుడు "నేను" అనుమైకము పూర్తిగాఁ దొలంగిపోవును. ౧౬ నేననుభావము లయమైపోవుటయే అనుభవలక్షణము. ఈకారణముననే దీనిని అనిర్వాచ్యసమాధానమని (అనుభవముచే నెఱుంగదగినదని) చెప్పుదురు. ఏలయన "నేను" అనునది లేకపోయినప్పుడు సమాధానమును వర్ణించువాఁడెక్కడనుండును? ౧౭ ఎంతవివేకముతోఁ గూడినమాటలనైనను అనుభవదృష్టితోఁ జూచితిమేని మాయాయుతములుగను వ్యర్థములుగను నుండును. కాని యామాటలు లోపలనువెలుపలను గంభీరార్థముతో నిండినవిగా నుండును ౧౮ శబ్దములవలన నర్థము తెలియును. అర్థమును విచారించి గ్రహించినపిమ్మట శబ్దములు వ్యర్థములై పోవును. శబ్దములు చెప్పెడిదంతయు యదార్థమెగాని స్వయముగా నవి(శబ్దములు)మిథ్యయై యున్నవి ౧౯ శబ్దముల సంయోగముచే వస్తువు భాసించును. వస్తువును గాంచినపిమ్మటశబ్దములునశించును(శబ్దములను శోధించి వానియందలియర్థమును గ్రహించినపిదప నవి వ్యర్థములగును) ౨౦ లేదా శబ్దములను పొట్టుగను అర్థమునుధాన్యముగను భావింపవచ్చును. ధాన్యము నుగ్రహించి పొట్టును మనముపారవేయుదుము. ఐనను ధాన్యము తొలుతపొట్టుతోడనే మనకు లభించుచున్నది ౨౧ పొట్టులో ధాన్యముండునుగాని ధాన్యములోఁ బొట్టుండదు. అటులే పరబ్రహ్మము శబ్దములయందుండునుగాని శబ్దములు పరబ్రహ్మమునందుండవు ౨౨ ఏదేని చెప్పినపిమ్మట శబ్దములు మిగిలియుండవు. కాని అర్థమాత్రము శబ్దములు బయలువెడలుటకుముందు

నుండియే స్థిరపడియుండును కావున శబ్దము లు అర్థముతో సమానత్వమును గాంచఁజాలవు ౨౩ మనము పొట్టునువిడిచి ధాన్యము నెటులఁగైకొందుమో యటులే వాచ్యాంశమును (శబ్దమును) విడిచి లక్ష్యాంశమును (అర్థమును లేక బ్రహ్మమును) శుద్ధమగు స్వానుభవముతో గ్రహింపవలయును. ౨౪ దృశ్యమునకు వేఱైన (బ్రహ్మమును) విషయమునుగూర్చి చెప్పుదానిని వాచ్యాంశమందురు. దానియర్థమును శుద్ధలక్ష్యాంశమని చెప్పుదురు ౨౫ పైనఁ జేర్కొనిన శుద్ధలక్ష్యాంశమునుగూడఁ బూర్వపక్షమనియే భావింపవలయును. స్వానుభవమన్ననో యది యలక్ష్యము. అది యెన్నఁటికిని లక్ష్యములోనికి రాఁజాలదు ౨౬ దేని కాకాశముతోఁగూడ నుపమింప వీలుపడదో యెయ్యది యనుభవసారమో దానిని (బ్రహ్మమును) లక్ష్యాంశమని చెప్పుటగూడఁ గల్పనమే ౨౭ ఎయ్యది మిథ్యాకల్పనమువలన నుత్పన్నమయ్యెనో దానియందు సత్యత్వ మెక్కడనుండివచ్చును? కావున నిట ననుభవముతోఁ బనిలేదు ౨౮ అంతియగాదు అద్వైతో (పరబ్రహ్మ)ముపట్లగూడ ననుభవముతోఁ బనిలేదు. అనుభవమో! అది ద్వైతమునందే యడఁగియున్నది ౨౯ అనుభవకారణమననే త్రిపుటి (అనుభవనీయుఁడు. అనుభావ్యము. అనుభవము) ఉద్భవమగుచున్నది. అద్వైతమునందున్ననో అందు ద్వైతమే లజ్జనొందుచుండ నిఁకఁ ద్రిపుటికి నిర్వాహ మెట్లుకుదురును? కావున నది యనిర్వాచ్యమని చెప్పుటయే యుక్తమని తోఁచుచున్నది ౩౦ దినమునకును రాత్రికిని బరిమితి నేర్పఱచువాఁడు సూర్యుఁడు. ఒకవేళ సూర్యుఁడే నాశనమగుచో నట్టియవస్థ నేమందుము? ౩౧ అటులే శబ్దోచ్చారణము గావించుటకుఁగాని లేక మౌనముగానుండుటకుఁగాని మూలము ఓంకారము. ఒకవేళ నాయోంకారమే లేకపోయినచో నుచ్చారణ మెటులఁగావింపవలయును. ౩౨ అనుభవము అనుభవించెడివాఁడు. అనుభావ్యము అనునవియెల్ల మాయనుండియే యేర్పడినవి. ఒకవేళ మాయయే యుండకపోయినచో నివియెటు లేర్పడును. ౩౩ ఒకవేళ మన ముభయులము వేఱువేఱుగా నున్నచో అనుభవవివేకమువలన వస్తువు చక్కఁగాఁ దెలియునట్టిదియే ౩౪ భిన్నత్వవిషయమిచట గోడ్రాలి సంతతివలె మిథ్యగానున్నది. భిన్నత్వమనుపేరు మొట్టమొదటినుండియు

లేదు ౩౫ ఉదాహరణము వినుండు. ఒక యజమానుఁడు నిదురించుచు (స్వప్నావస్థలో) నుండెను. వాఁడు సంసారదుఃఖకారణమున సద్గురుని శరణ్యములోనికిఁ బోవుచున్నటులఁ గలగనుచున్నాఁడని భావించుదము. ౩౬ సద్గురునకు వానియందనుగ్రహము కలుగుటచే వానికి సంసార దుఃఖమునాశన మగుచున్నది. మఱియు నాతనికి సద్గురునను గ్రహమువలన జ్ఞానము కలుగుచున్నది, ౩౭ కావున నిదియంతయు "నుండినదెద్దియో యదిలేదు'' అనుదానికి సమముగానున్నది. మఱియు నెయ్యేదిలేదో యది లేనేలేదు అనుటకుఁగూడ నిది సమముగనున్నది. అటులే ఉన్నది, లేదు అనునీ రెండును లేకున్నపిమ్మట నాతఁడు శూన్యావస్థను బ్రాపించుచు ౩౮ దీనితరువాత, శూన్యావస్థ కావలనున్న శుద్ధజ్ఞానముచే నాతనికిఁ బరమశాంతి కలుగును. మఱియు నైక్యరూపమువలన అభిన్నతయో లేక సహజస్థితియో ప్రాప్తించును ౩౯ అద్వైతనిరూపణమగుటవలన నాతని ద్వైతవార్తయంతయు నంతతో నశించును. అనంతర మాతఁడు జ్ఞానచర్చలు గావింప నారంభించును. ఇంతలోననే ఆయజమానుఁడు స్వప్నమునందే జాగరూకుఁడగుచున్నాఁడు ౪౦ ఇప్పుడు శ్రోతలు సావధానులరై యిందలియర్థమునందు ధ్యానముంచుఁడు. ఏలయన! యిందలి రహస్యము దెలిసిన పిమ్మట మీకు సమాధానము గలుగును. ౪౧ ఆయజమానుఁ డెంతజ్ఞానము గడించెనో యదియంతయు స్వప్నముతోఁబాటుగా దాటిపోయినది. శబ్దములకవ్వలనున్న యనిర్వాచ్యసుఖము వేఱుగనేయున్నది. ౪౨ ఆ శబ్దాతీతసుఖమువట్ల శబ్దములేకయే ఏకత్వమున్నది. అచ్చట అనుభవము అనుభవించెడివాఁడు అనునదెద్దియును లేదు. కాని ఆయజమానుఁ డంతదనుకఁ జేరకముందే మేల్కాంచెను. ఇంతకును దేలినసారాంశమేమన - ఆతఁడు స్వప్నమునందుస్వప్నమునుగాంచెను. మఱియుస్వప్నమునందేయొక మాఱు మేల్కొని కనులనుదెఱచెను. (ముఖ్యావస్థను జేరలేకపోయెను) ౪౩, ౪౪ ఈనిరూపణమునే యింకను స్పష్టముగాఁ జెప్పెదను, దానివలన శ్రోతలకు విషయము చక్కఁగా బోధయగును. ౪౫ ఇదియంతయు నాలించి గురుని శిష్యుఁడిటుల నడుగుచున్నాఁడు. గురువర్యా! ఈయంశమును ముఖ్యముగా మఱల బోధింపుఁడు. అట్లుబోధింతురేని ముఖ్యవిషయము చక్కఁగా గ్రహింప నవకాశముచిక్కును. ౪౬-౪౭ ఈయజమానుఁ

డెవఁడు? ఆతఁడుగాంచిన స్వప్నమెట్టిది? స్వప్నమునం దాతఁడు గురునితో నేమేమి మాటలాడినాఁడు, ౪౮ గురుఁడిటులఁ బ్రత్యుత్తరమొసంగెను. ఓ శిష్యుఁడా! ఆయజన్ముఁడవు నీవే! నీవు స్వప్నములో నేస్వప్నముఁ గాంచుచుంటివో దానినిగూడ నెఱింగించెదను. ౪౯-౫౦ ఈ సంసారమే స్వప్నములోస్వప్నము. ఇచటనీవు సారాసారవిచారము నొనరించుచున్నాఁడవు. ౫౧ సద్గురునిశరణులోనికరిగి యచట శుద్ధనిరూపణమునాలించి ప్రత్యక్షముగా నిపుడు నీవు తద్విషయకచర్చలనే గావించుచుంటివి. ౫౨ ఈచర్చల యనుభవమంతయు లభించినపిమ్మట నీ యువదేశమంతయు ముగియుచున్నది. ఈశాంతియుక్తమగు విశ్రామమే మేల్కొనుట. ౫౩ జ్ఞానచర్చలతో సంబంధించిన గోలయంతయు దూరమగుటచే అర్థము ప్రకటనమగుచున్నది. మఱియు నీవిచారమువలన ననుభవము ప్రాప్తించుచున్నది. ౫౪ అనంతరము నీవు ఇదియే జాగరూకతయనియు నాకు (శిష్యునకు) అనుభవము ప్రాప్తించినదనియు (వాస్తవములో కాకున్నను) భావించుచున్నాఁడవు. ఇంకను నీకు భ్రాంతి తొలంగిపోలేదని దీనియర్థము. ౫౫ అన్నా! అనుభవమునం దనుభవము మునిఁగిపోవుటయు అనుభవములేకయే యనుభవము కలుగుటయుఁగూడ వాస్తవములో స్వప్నమునుండి మేల్కొనుటకాదు. ౫౬ ఏలయన - మేల్కొనినపిమ్మటఁగూడ ఆయజన్ముఁడను నేనేయని నీవు నుడువుచున్నాఁడవు. ఇందువలన నీకు స్వప్నరూపమగు సంసారతరంగములింకను దగ్గలేదని విదితమగుచున్నది. ౫౭ స్వప్నమునందు జాగ్రదవస్థలోనుంటినని నీవెటులఁదలంచితివో యటులే అనుభవమును గూడ సిద్ధించినదనిగూడఁ దలంచితివి. వాస్తవమునకిదియంతయుస్వప్నమే. మఱియు భ్రమరూపము ౫౮ జాగ్రదవస్థయన్ననో స్వప్నావస్థకుఁ జాలముందుగానున్నది. ఇఁకఁ జెప్పుటయెట్లు? స్వప్నావస్థయందు వివేకధారణమే విచ్ఛిన్నమగుచున్నది. ౫౯

ఇదియంతయు నిదమిత్థమని వివరింపఁదగని సమాధానము. అంతియగాదు. అకథనీయము. ఇదియే నిశ్శబ్దమునకుఁ జిహ్నము ౬౦ దీనినంతయు నాలకించి శిష్యుఁ డాయకథనీయమగుననుభవమును దెలిసికొనెను ౬౧.

ఆఱవదశకము సమాప్తము.

ఏడవదశకము

ప్రథమ సమాసము.

మాయను గూర్చిన శోధనము.

విద్యావంతులకెల్లరకును బూర్వజుఁడును గజాననుఁడును ఏకదంతుఁడును జతుర్భుజుఁడును త్రినయనుఁడును బరశుపాణియు నగువిఘ్నేశ్వరున కు నమస్కరించెదను ౧ కుబేరునివలన ధనము, వేదమువలనఁ బరమార్థము, లక్ష్మివలనసౌభాగ్యములభించువిధమున ఆదిదేవుఁడునుమంగళమూర్తియునగు శ్రీగణేశ్వరస్వామివలన సమస్తవిద్యలు ప్రాప్తించును. ఆవిద్యలవలననేజనులు కవులుగను బండితులుగను సాధువులుగను సత్పురుషులుగను మాఱుచున్నారు ౨, ౩ ధనవంతులు తమబాలురకు నానావిధములగుభూషణములనలంకరించుటచే సుందరాకారులుగాఁ గనిపించుచున్నారు. అటులే మూలపురుషుఁడగు గణేశ్వరునిమూలమునఁ గవులు వ్యుత్పన్నులగుచుఁ బేరొందుచున్నారు. ౪ విద్యాప్రకాశుఁడగు గణేశపూర్ణచంద్రునివలన బోధసముద్ర ముప్పొంగును. ఆయనకు నేను నమస్కరించుచున్నాను ౫ అతఁడు కర్తృత్వమునకు ఆరంభరూపుఁడు. మూలపురుషుఁడు. మూలారంభుఁడు. పరాత్పరుఁడు. మఱియు నాద్యంతములయందుఁగూడ నామహాత్ముఁడు స్వయంభువుగా నున్నాఁడు ౬ సూర్యునివలన మృగతృష్ణ మెఱయునట్లు గణేశ్వరునివలన ఇచ్ఛాకుమారియగు సరస్వతి ప్రకాశవంతురాలగుచున్నది ౭ మాయారూపిణియగు శారదాదేవిని మిథ్యయని తలంచువారల నాయమ మోసగించును. అంతియగాక యామె తనమాయాత్వమువలన వారలను మోహింపఁజేసి పరమాత్మనుండి వారలను భిన్నుల నొనర్చును (వక్త బ్రహ్మనిరూపణము జేయుటవలన బ్రహ్మమునకు భిన్నముగనుండును) ౮ ఆయమ ద్వైతమునకు జనని. అంతియగాక యద్వైతమునకు ఖని; మఱియు మూలమాయాస్వరూపముతో నాయమ అనంతబ్రహ్మాండముల నావరించుకొనియున్నది ౯ సరస్వతీదేవి యొకయౌదుంబరవృక్షము. ఔదుంబర (మేడి) వృక్షమును ఫలములంటియుండునటుల ననంతములగు

బ్రహ్మాండములాయెను నంటియున్నవి. పుత్రికారూపముగనున్న యా భారతీదేవి మూలపురుషునకు (బ్రహ్మకు) మాతయైయున్నది ౧౦ ఆయమ వేదమాతకును ఆదిపురుషునకును సత్తారూపమున నలరారుచున్నది. అట్టిశారదకు నమస్కరించెదను ౧౧

ఇఁక నిపుడు సమర్థుఁడగు నాసద్గురుని స్మరించుచున్నాఁడను. ఆయనకృపాదృష్టి యానందమును వర్షించుచున్నది. దానిచే నీసృష్టి యంతయు నానందమయ మగుచున్నది ౧౨ గురుమూర్తి ఆనందమునకు జనకుఁడు. సాయుజ్యముక్తికి నాయకుఁడు. కైవల్యపదవీ ప్రదాయకుఁడు. అంతియగాక యనాథులగు దీనులకుఁ జుట్టము ౧౩ చాతకము మేఘము వైపు చూపులునిగుడ్చి చినుకులకై యాతురపడునటుల మోక్షేచ్ఛగల సాధకుఁడు నిరంతరమును సద్గురునియందుభక్తినిడి యనుగ్రహమును నభిలషించును. అపుడు ఆసద్గురుఁడు కృపాభావుఁడై సాధకులవట్లఁ బ్రసన్నుఁడగును ౧౪ సద్గురుఁడు సంసారసముద్రమును దరింపఁజేయుటకునౌక. భావికులు సుడిగుండలములలోఁ బడిపోకుండ నానౌక మిగులఁ దోడ్పడుచున్నది. సాధకులను గురుమూర్తి తనయమూల్యమగు బోధముకతన సంసారమునుండి ముక్తులనుజేయుచున్నాఁడు ౧౫ గురుదేవుఁడు కాలమునకు నియంత. ఆపదలను దొలంగుటలో ననన్యుఁడు. మఱియు భావికులను గనికరించి యుద్ధరించుటలో దయాళువగు వల్లివలెనున్నాఁడు ౧౬ పరలోకమును బడయుటకు గురుఁడే యాధారము. విశ్రాంతి కాతఁడే నెలవు. సుఖస్వరూపమగు నాశ్రయస్థానము ౧౭ భేదబంధనములను దొలంగించి మానవలోకము నుద్ధరించు ఆప్రభువునకు సద్గురుమూర్తికి విదేహుఁడనై సాష్టాంగ ప్రణామములను గావించెదను ౧౮

సాధువులకును సజ్జనులకును మహాత్ములకును శ్రోతృగణమునకును నమస్కరించి ప్రకృతము ననుసరించుచున్నాఁడను. సావధానులరై యాలింపఁగోరెదను. ౧౯

సంసారమొక గొప్పస్వప్నము. ఇచట మోహకారణమున "ఇది నాకాంత, ఇది నాధనము, ఈమె నాకుమార్తె, వీఁడు నాకుమారుఁడు" అని జనులు తలపోయుచుందురు ౨౦ జ్ఞానసూర్యుఁడస్తమించుటచేఁ బ్రకాశము లోపించినది. బ్రహ్మాండమంతయు నంధకారముతో

నిండిపోయినది ౨౧ కొంచెమైని మార్గమును గాంచుదమన్న సత్త్వమనువెన్నెలగూడ లేదు. విభ్రాంతివశమున జనులందఱును దమ్ముఁదామెఱుంగకున్నారు. ౨౨ దేహబుద్ధివలని యహంకారముతో జనులు ఘోరనిద్రామగ్నులై గురుకలుపెట్టుచున్నారు. విషయసుఖములకొఱకు దుఃఖముతో విలవిలఁ గొట్టుకొనుచున్నారు. ౨౩ ఈ విధముగ నిద్రించుచు నిద్రించుచు నెందఱు మానవులు మరణించిరో మన మెఱుంగము. అనేకులు పుట్టుకతోడనే నిదురించుచు మరణించిరి. ఇటులే యసంఖ్యాకులగుజనులు ఈప్రపంచములోనికి వచ్చిరి. పోయిరి. ౨౪ ఈవిధముగా సుప్తావస్థయందుండియే పొరలిపొరలి యనేకులు పరమాత్మ నెఱుంగనికతన రాకపోకలవలని కష్టము లనుభవించుచున్నారు. ౨౫ ఈకష్టమును దూరపఱుపవలయునన్నచో ఆత్మజ్ఞాన మావశ్యకమైయున్నది. ఇందువలననే (యాత్మజ్ఞానము గలిగించుటకు) ఆధ్యాత్మికగ్రంథమగు నీదాసబోధను బ్రకటింపవలసివచ్చినది. ౨౬

అన్నివిద్యలలో ఆధ్యాత్మికవిద్య యుత్తమమైనది. ఈవిషయమునుగూర్చి భగవద్గీత పదియవయధ్యాయములో భగవానుఁడగు శ్రీకృష్ణుఁడిటుల నుడివియున్నాఁడు. ౨౭

శ్లో॥ అధ్యాత్మవిద్యావిద్యానాం వాదః ప్రవదతామహం.

తన యింద్రియములనన్నింటిని మనస్సమేతముగా బ్రహ్మమునందు లగ్నపఱుచువాఁడు అధ్యాత్మవిద్యను దెలిసికొనఁగల్గును. ౨౮ చంచలహృదయుఁడగు మానవుఁడు అధ్యాత్మవిద్యవలని లాభమును గొంచెమైని పడయఁజాలఁడు. పరమార్థియగు పురుషుఁడే యధ్యాత్మవిద్యావిచారమును జేయవలయును. దీనివలన వానిపరమార్థము మిగులదృఢమగును. ౨౯ పరమార్థమునందుఁ బ్రవేశములేనివాఁడు అధ్యాత్మగ్రంథములను గొంచెమైని గ్రహింపఁజాలఁడు. నేత్రములు లేనివాఁడేదేనిగాంచఁగలఁడా? అటులే యాధ్యాత్మిక పరిచయమునకుఁ బరమార్థముయొక్క తోడ్పాటు ముఖ్యముగఁ గావలసియున్నది. ౩౦ "ప్రాకృతభాష (మహారాష్ట్రభాష) అంతయుక్తమైనదిగాదు. యోగ్యులగువారలు దీనిని వినఁగూడ"దని చాలమంది నుడువుదురు. అటులఁ బలుకుమూర్ఖులకుఁ గొంచెమైని అర్థాన్వయసరళత్వము తెలియదు. ౩౧ నానావిధరత్నములతో నింపఁబడిన

యినుపపెట్టె నొకయజ్ఞాని లోహమయమని త్యజించినటులఁ బ్రాకృతభాషలోఁ బ్రకటింపఁబడిన వేదాంతతత్త్వమును భ్రాంతపురుషుఁడు మందమతియై విడచివేయుచున్నాఁడు * ౩౩, ౩౪ అనాయాసముగ ధనము లభించినమీఁదట దానివిడిచిపెట్టుట మూర్ఖత్వము. ద్రవ్యమును గ్రహింపవలయును. ద్రవ్యపాత్రములను (పేటికాదుల) జూచుట కూడఁ దగదు. ౩౫ ముంగింటిలోఁబడియున్న స్పర్శవేధిని, మార్గమునఁ బడియున్న చింతామణిని, నూతిలో బెరిగియున్న దక్షిణావర్తలతను విడిచిపెట్టువాఁ డుండఁడు. ౩౬ ఇటులనే యొకవేళఁ బ్రాకృతభాషయందు సుగమమగురీతితో అనుభవయుక్తముగ నద్వైత నిరూపణము గావింపఁబడియున్నను, దానివలనసులభముగఁ దనకధ్యాత్మజ్ఞానలాభము సమకూరగలిగియున్నను నాగ్రంథము నవశ్యముగా గ్రహింపవలయును. ౩౭ విద్యాభ్యాసశ్రమమును జేయకున్నను సాధుసమాగమమువలన శాస్త్రజ్ఞానమంతయుఁ బ్రాకృతగ్రంథములవలన సులభముగఁ దెలియును ౩౮ విద్యాభ్యాసమువలనఁ దెలియనియంశములు సాధుజనసమావేశము వలన సుబోధమగును. శాస్త్రములలోనున్న సమస్తజ్ఞానకరాంశములు సాధుసమావేశమువలన అనుభవములోనికివచ్చును. కాన జ్ఞానప్రాప్తి కొఱకు సాధుజనసమావేశము గావించుటయే ముఖ్యసాధనము. వ్యుత్పన్నతను (శాస్త్రజ్ఞానమును) గూర్చి పరిశ్రమచేయుట వ్యర్థప్రయత్నము.

* శ్రీ సమర్థరామదాసస్వామి శ్రీ గోస్వామితులసీదాసు మున్నగు మహాత్ములు మహారాష్ట్రము, హిందీ మున్నగు ప్రాకృతవాఙ్మయముల కింతయనరాని యుపకార మొనర్చిరి. వీరలు తమకాలములందుఁ బ్రాకృతభాషలను ద్వేషులును అదూరదర్శులు నగు సంస్కృతవిద్వాంసులను తమయలౌకిక సామర్థ్యముచేఁ జకితులఁగావించి వారల హృదయములలోఁ బ్రాకృతభాషలపయి భక్తిని గలుగఁజేసిరి. మహాత్ముఁడగు తులసీదాసునితో నొకసంస్కృతపక్షపాతి మీరు మీగ్రంథములను సంస్కృతములో నేల వ్రాయరని యడిగెను. అపుడు తులసీదాసు మిగులశాంతస్వభావముతో నిటులఁ బ్రత్యుత్తరమునొసంగెను.

కాభాషా కాసంస్కృత్ ప్రేమచాహియే సాఁచ్
కాల్ జో ఆవేకామరీకాలై కరేకమాచ్

సంస్కృతమైననేమి! ఇతరభాషయైననేమి? అంత్యకాలమాసన్నమైనపుడేది కడతేర్చునో యట్టిసత్యమగు ప్రేమయే కావలయును.

జీవితమును సార్థకముగావించు రహస్యము సాధుసమావేశమునందిమిడి యున్నది. ౪౦

శ్లో॥ భాషాభేదాశ్చవర్తన్తే। హ్యర్థఏకో నసంశయః
పాత్రద్వయే యథాఖాద్యం। స్వాదుభేదో నవిద్యతే॥

భాషాభేదమువలన అర్థమునందుఁ గొంచెమేనిమార్పుకలుగదు. ముఖ్యభావము అర్థముతోనున్నది. * ౪౧ నిశ్చయమునకుఁ బ్రాకృతభాషవలననే సంస్కృతమునకు మహత్త్వమేర్పడియున్నది. ఇంకొకవిధముగా నైనచో సంస్కృతములోని గుప్తార్థమును జనులు సర్వసాధారణముగా నెటుల గ్రహింపఁగలుగుదురు. ౪౨ ఇఁక నీవిషయము నటుంతము. భాషనువిడిచి అర్థమునుగ్రహింపవలయును. సారమునుగైకొని పిప్పిని విడిచివేయవలయును. ౪౩ అర్థము సారము. భాష పొట్టు. జనులుభాషనుగూర్చిన వాదవివాదములను అభిమానపూర్వకముగాఁ జేయుచుందురు. నానావిధములగు అభిమానములే మోక్షమార్గమునకు ఆటంకములై యున్నవి. ౪౪ లక్ష్యాంశమును వెదకునపుడు వాచ్యాంశమునుగూర్చి భాషింపవలసిన యవసరమేముండును? భగవానుని యగాధమగుమహిమ నెఱుంగవలయును. ౪౫ మూఁగవాఁనిభావములు మూఁగవాఁడే గ్రహించునటుల స్వానుభవవిషయమును స్వానుభవుఁడే యెఱుంగఁగలఁడు. ౪౬ అధ్యాత్మవిద్యను గ్రహింపఁగలశ్రోతలు కొలఁదిగనే లభింతురు. వారలకు ఉపదేశము లొనరించుటవలనఁ బ్రాణి కానందము గలుగును. ౪౭ రత్నములను బరీక్షించువానికి రత్నములను జూపుటవలన నెటుల సంతోషముగలుగునో యటులే జ్ఞానితో జ్ఞానమునుగూర్చి భాషించుటవలన నింతయనరానియానందము గలుగును, ౪౮ మాయాజాలమునందుఁ దగుల్కొని దుశ్చిత్తుఁడైయుండు పురుషునకు అధ్యాత్మనిరూపణమువలనఁ గొంచెమేని లాభమొనగూడదు. ఏలయన వానికి దాని యర్థమే బోధపడదు. ౪౯ శ్రీకృష్ణభగవానుఁడు గీతయందిటులఁ జెప్పుచున్నాఁడు.

* భారతచంద్రుఁడగు హరిశ్చంద్రబాబుగూడ నొకచో నిటుల నుడివియున్నాఁడు. "బాత్ అనూఠీచాహియే భాషాకోమాహోయ్" విషయ ముత్కృష్టమైనదిగా నుండవలయును. భాష యేదైనా నొకటియే.

శ్లో॥ వ్యవసాయాత్మికాబుద్ధి రేకేహ కురునందన
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయో వ్యవసాయినాం॥

వ్యవసాయకారణమున మలినబుద్ధియగువాని కెన్నఁటికిని అధ్యాత్మనిరూపణము బోధపడఁజాలదు. ఏలయన, అధ్యాత్మనిరూపణమునకు సావధానబుద్ధి యవసరముగదా! ౫౦ బహువిధరత్నములను నాణెములను బరీక్షింపక తీసికొన్నచో నెటుల నష్టముగలుగునో మఱియుఁ బరీక్షింపనేరని కారణమున నెటుల మోసమునకు లోనయ్యెదరో యటులే అధ్యాత్మనిరూపణమునసైతము హృదయమును లగ్నముగావింపనియెడల బోధపడనేరదు. ఇంతియే ? ప్రాకృతభాషయే కానిమ్ము హృదయమును లగ్నముగానిచోఁ గొంచెమేని బోధకాఁజాలదు. ౫౧,౫౨ యేభాషయైనను గానిమ్ము. అందు అధ్యాత్మనిరూపణమున్నచో మఱియు ననుభవరసమున్నచో దానిని సంస్కృతముకంటెనుగూడ గాంభీర్యమైన దానినిగా భావింపవలయును. దాని నాలించుటకే యధ్యాత్మశ్రవణమని పేరు. ౫౩ మాయను బ్రహ్మమును గుర్తెఱుంగుటను అధ్యాత్మశ్రవణమందురు. మొట్టమొదట మాయాస్వరూపమును గ్రహింపవలయును. ౫౪

మాయ సగుణమును సాకారమును నైయున్నది. అది యన్నివిధములచేతను వికారిణియైయున్నది. దానిని బంచభూతముల వికారమనియే గ్రహింపనగును. ౫౫ మాయ (దృశ్యము) కాన్పించుచున్నది. అది భాసమానముగనున్నది. మనసునందు భాసించుచున్నది. క్షణభంగురమైనది. వివేకముతో జూచినపిమ్మట నది వినాశమగును. ౫౬ మాయ బహురూపిణియు విశ్వరూపిణియు నైయున్నది. అయ్యది విష్ణుస్వరూపము. దానినిగూర్చి యెంతవివరించినను దక్కువయే. * ౫౭ మాయ బహురూపిణియు బహువర్ణయుతయు నైయున్నది. అది యీశ్వరుని కధిష్ఠానము. చూచుటకది యభంగముగను (భంగములేనిదిగను) అఖిలముగను (ఖిలములేనిదిగను) గన్పట్టుచున్నది. ౫౮ సృష్టియొక్క రచనము మాయయే. మనకల్పనముగూడ మాయయే. జ్ఞానసహాయములేకుండ

* ఏలయన, విష్ణుస్వరూపము సగుణబ్రహ్మము. మాయోపాధివలననే సగుణబ్రహ్మము కలుగుచున్నది. ఇందువలన మాయయే విష్ణురూపమై యున్నటులఁ జెప్పఁబడెను.

మాయను దెగఁగోయఁ జాలము ౫౯ ఇదిమాయనుగూర్చినసంక్షేపవర్ణనము. ఇకముందు సమాసమునందు బ్రహ్మజ్ఞానమును నిరూపణముగావించెదను. దానివలన మాయయెల్ల నొక్కమారునష్టమై పోవును. ౬౦, ౬౧.

రెండవ సమాసము
బ్రహ్మనిరూపణము

సాధుజనులు బ్రహ్మమును నిర్గుణమనియు, నిరాకారమనియు, నిస్సంగమనియు, నిర్వికారమనియు, అపారమనియుఁ జెప్పెదరు ౧ శాస్త్రములు బ్రహ్మమును సర్వవ్యాపకమనియు అనేకములందొక్కటియనియు శాశ్వతమనియుఁ జెప్పుచున్నవి ౨ బ్రహ్మము అచ్యుతము, అనంతము, సర్వదాభాసురము కల్పనారహితము, నిర్వికల్పము నైయున్నది ౩ అది యాదృశ్యమున కావలనున్నది. శూన్యముకంటెను వేఱైయున్నది ఇంద్రియసహాయమున దానిని నెఱుంగఁజాలము ౪ బ్రహ్మము చూపులకు గాన్పింపదు మూర్ఖునివివేకమున కందదు. సాధులకుఁదప్ప నది యితరులకనుభవములోనికి రాదు ౫ బ్రహ్మము అన్నింటికంటెనుమిగులఁ బెద్దది. దానితో సమానమగు శ్రేష్ఠవస్తు వింకొకటిలేదు. అయ్యది బ్రహ్మవిష్ణుమహేశ్వరాదులకుఁగూడ నగోచరమును సూక్ష్మతరము నైయున్నది ౬ శబ్దములమునఁ జెప్పఁబడుదానికంటెను బ్రహ్మము వేఱుగనున్నది. అధ్యాత్మశ్రవణముగావించుటవలన నయ్యది సులభముగా లభించును ౭ బ్రహ్మమున కనంతనామములు గలవు. ఐనను నది నామాతీతముగనే యున్నది. అందులకుఁ గారణమిద్దియును లేదు. దృష్టాంతమొసంగుటగూడ యుక్తముగఁ దోచుటలేదు. ౮ బ్రహ్మముతో సమానమగు సత్య మింకొకటి లేదు. కావుననే బ్రహ్మమున కుదాహరణము నొసంగలేమైతిమి. ౯ శ్రుతిసైతమిట్లు సిద్ధాంతీకరించుచున్నది "శ్లో॥ యతో వాచానివర్తంతే అప్రాప్య మనసా సహ" బ్రహ్మమునువర్ణించుటకు వాక్కు అశక్తమగుచున్నది. మనస్సుసైతము బ్రహ్మమును జెందనేరదు. ౧౦ మనస్సు కల్పనారూపము. బ్రహ్మము కల్పనారహితము. కావున మనస్సు బ్రహ్మమును బొందఁజాలదు. కావున బైనిచెప్పిన శ్రుతివాక్యము యథార్థము. ౧౧ బ్రహ్మ

ము మనస్సునకు అప్రాప్యముగదా! అదిసాధకునకెటుల సిద్ధించుననిమీరు
ప్రశ్నింపవచ్చును? అట్లు ప్రశ్నించెదిపక్షమున బ్రహ్మమును సద్గురుమూల
మునఁదక్క వేఱుమార్గమున గ్రహింపరాదనుటయే మాప్రత్యుత్తరము
౧౨ బొక్కసపుఁగొట్టులు ధనముతో నిండియున్నవి. అయిన ఫలమేమి? అవి
తాళములచే బాగుగా బంధింపఁబడియున్నవి. తాళపుఁజెవి లభింపనంతవరకు
అందు వస్తువులలో నేదియు లభింపదు ౧౩ ఇది విని శ్రోతయిట్లుప్రశ్నిం
చుచున్నాఁడు. అయ్యా, అటులైనచో దాళపుఁజెవి యెయ్యది? దయచేసి
మాకు సెలవీయరాదా? ౧౪ వక్త యిట్లు చెప్పుచున్నాఁడు. సద్గురుని
కృపయే తాళపుఁజెవి. దానివలన బుద్ధి బాగుగాఁ బ్రకాశించును. మఱి
యు, ద్వైతకవాటము లొక్కపెట్టునఁ దెఱువఁబడును. ౧౫ ఆపరబ్రహ్మ
మునందు సుఖపారావారము లేదు. అచ్చట మనస్సునకు గమ్యశక్తిలేదు.
కావునఁ బరబ్రహ్మప్రాప్తి కావలయునన్నచో
మనస్సును లయముగావింపవలయును. లేకున్నచో ఏసాధనమును బనిచే
యఁజాలదు. ౧౬ మనస్సులేకయే పరబ్రహ్మము ప్రాప్తించును.
అచట వాసనాసంబంధము లేకయే తృప్తియున్నది. బ్రహ్మమునెడఁ గల్ప
నాచాతుర్యము గొంచెమేని యుపయోగపడఁజాలదు ౧౭ అది పరా
వాణికంటె నావలనున్నది. మనోబుద్ధులకగోచరముగనున్నది. సర్వసంగపరి
త్యాగము గావించినయెడల నది సులభముగా లభించును ౧౮ "తన"
యనుదాని సంగమునువిడిచి యాపిమ్మట బ్రహ్మమును జూడవలయును.
ఎవ్వఁడనుభవనీయుఁడగునో యాతఁడీవిషయమునందు సుఖియగునుగా
"నేను" అనుదానిని "తన" యనునర్థమున నుడివెదరు. జీవిత్వమనుదానిని
"నేను" అనుదానిపట్ల నుడివెదరు. అజ్ఞానమును జీవత్వమని చెప్పెదరు.
ఈయజ్ఞానసంగమే ప్రాణి నంటుకొనియున్నది. ౨౦ అజ్ఞానమునువిడిచిన
పిమ్మటనిస్సంగము(బ్రహ్మము)తోనేకత్వముకలుగును. ఇదియే(కల్పనములేని
స్థితియే)బ్రహ్మప్రాప్తికిమూలము ౨౧ నేనువఁడనుఅనుదానినెఱుంగకుండు
టనేఅజ్ఞానమందురు. ఈయజ్ఞానమునశించినపిమ్మటపరబ్రహ్మము లభించును
౨౨ దేహబుద్ధికిగల గొప్పతనము పరబ్రహ్మమునందు నిలువఁజాలదు.
పరబ్రహ్మముముందు అహంకార మంతరించిపోవును ౨౩ పరబ్రహ్మము
ముందు ఉచ్చనీచ భేదములులేవు. దానిముందు ధనవంతుఁడు దరిద్రుఁడు

స్త్రీయుఁ బురుషుఁడు సమానము ౨౪ బ్రాహ్మణునిబ్రహ్మము శుద్ధ
మైనది. శూద్రునిబ్రహ్మ మశుద్ధమైనదను భేదములచ్చట లేనేలేవు ౨౫
ఉచ్చబ్రహ్మము రాజులకొఱకు నీచబ్రహ్మ ప్రజలకొఱకు నేర్పడియుం
డెనను భేదబుద్ధి కచ్చటఁ గొంచెమేని యవకాశములేదు ౨౬ అందఱకు
నొక్కటియే బ్రహ్మము. అచ్చట ననేకత్వమునకుఁ దావులేదు. ఏనీచ
మానవుని ప్రాణియైనను బ్రహ్మవిష్ణుమహేశ్వరాది దేవతలైనను బ్రహ్మ
మువైపునకేఁ బోవుచున్నారు ౨౭ స్వర్గమర్త్యపాతాళములను మూడు
లోకములలోనున్న జ్ఞానులందఱి విశ్రాంతికిని బ్రహ్మమొక్కటియే స్థాన
ము. ౨౮ గురుశిష్యులకు నొక్కటియే ప్రాప్యపదము. అచట భేదాభేద
ములు లేవు. పరబ్రహ్మమును బడయవలయునన్న దేహసంబంధమును
విడువవలయును ౨౯ దేహబుద్ధి (దేహమేనేనను బుద్ధి) యంతరించినపిదప
నెల్లరకు నొక్కటియేవస్తువు ప్రాప్తించును. శ్రుతిసైతము "ఏకం బ్రహ్మ
ద్వితీయంనాస్తి" అని(బ్రహ్మమొక్కటియే రెండవదిలేదు) నుడువుచున్నది
౩౦ సాధువులు వేఱువేఱుగాఁ గాన్పింతురు, కాని వారలుస్వరూపము
తోఁ గలసిపోవునపుడు దేహాతీతమగు నొక్కవస్తువుగా (బ్రహ్మముగ)
నయ్యెదరు ౩౧ బ్రహ్మము క్రొత్తదిగాదు. ప్రాతదికాదు. న్యూనము
గాదు. అధికముగాదు. ఆబ్రహ్మమువిషయమున న్యూనభావముకలవాఁడు
దేహాభిమానియగు శునకము ౩౨ దేహబుద్ధి సంశయసమాధానము
లను నశింపఁజేయును. దానిసంయోగమున సమాధానపుటవకాశము
గూడఁ దొలంగిపోవును ౩౩ దేహమును శ్రేష్ఠమనిభావించుటయే
దేహబుద్ధిలక్షణము. ఇందువలననే విచక్షణులగు పురుషులు
దేహముమిథ్యయని తెలిసికొని దానిని నిందింతురు ౩౪
మానవుఁడు చనిపోవునంతవఱకు దేహాభిమానమును విడువఁడు. ఈకార
ణముననే మనుష్యుఁడు జననమరణ చక్రమునందు (పరిభ్రమణమునందు)
బడియుండును ౩౫ మనుష్యప్రాణి అజ్ఞానయుతమైనది. అది దేహము
క్షణభంగురమను నంశమును గ్రహింపక మీఁదు మిక్కిలిగ నదియే
శ్రేష్ఠమైనదానినిగా భావించుచుఁ గడకుఁ దనశాంతినంతయును గోల్పో
వుచున్నది ౩౬ హితుఁడగు దేహాతీతుఁడు దేహబుద్ధివలనఁ దప్పక యన
హితుఁడగునని సాధుజనులు నుడువుచుందురు. ౩౭ తమసామర్థ్యమును

గూర్చి యొకవేళ యోగులకుసైతము అభిమానముగలిగినయెడల వారల కా దేహాభిమానమే విఘ్నకారణమగును. ౩౮ కావున దేహబుద్ధి వినాశన మయినపుడే పరమార్థమునందు దృష్టి కుదురును. దేహాభిమానకారణముననే బ్రహ్మముతో (వైరుద్ధ్యము) వ్యతిరేకభావము గలుగును. ౩౯ వివేకము మానవుని బ్రహ్మమువైపునకు లాగును. దేహాభిమానమో అచ్చటినుండి క్రిందికిఁ బడవేయును. అహంతాత్వము (నేననుభావము) మనుష్యుని బరమాత్మనుండి వేఱుపఱచును ౪౦ ఈకారణములన్నింటి నెఱింగి విచక్షణులగు పురుషులు దేహబుద్ధిని బరిత్యజించి యదార్థరీతిఁ బరబ్రహ్మమునందు విలీనులై పోవలయును. ౪౧ ఇదియంత యును విన్నమీఁదట "సత్యబ్రహ్మము" అన నెవ్వఁడు? అని శ్రోతలు ప్రశ్నింపఁగా వక్త యిటులఁ బ్రత్యుత్తరము నొసంగెను. ౪౨

వాస్తవమునకు బ్రహ్మమొక్కటియే. కాని యది బహువిధముల భాసించుచున్నది. మానవులకు అనేకమతానుసారముగ భిన్నభిన్నవిధములతో దానినిగూర్చిన యనుభవము ప్రాప్తించుచున్నది. ౪౩ ఎవ్వనికెటుల ననుభవము ప్రాప్తించునోయటుల నాతఁడు బ్రహ్మము నంగీకరించుచున్నాఁడు. ఆయనుభవరూపముననే విశ్వాసముగూడఁ గలుగుచున్నది. ౪౪ వాస్తవము విచారించితిమేని బ్రహ్మము నామరూపముల కతీతముగా నున్నది. అయినను దానికి నిర్మలము, నిశ్చలము, శాంతము, నిజానందము మున్నగు నామము లనేకములుగలవు ౪౫ ఇంకను అరూపము, అలక్ష్యము, అగోచరము అచ్యుతము, అనంతము, అపరంపారము, అదృశ్యము, అతర్క్యము మున్నగునామము లెన్నియో గలవు ౪౬ నాదరూపము, జ్యోతీరూపము, చైతన్యరూపము, సత్తారూపము, సాక్షిరూపము, సత్స్వరూపము అనునవిగూడ నాబ్రహ్మమునకుఁ గల నామములే ౪౭ శూన్యము, సనాతనము, సర్వేశ్వరము, సర్వజ్ఞము, సర్వాత్మము, జగజ్జీవనము అనిగూడ నాబ్రహ్మమునే బేర్కొందురు ౪౮ సహజము, సదోదితము, శుద్ధము, బుద్ధము, సర్వాతీతము, శాశ్వతము, శబ్దాతీతము అనిగూడ నాబ్రహ్మమునే చెప్పుదురు ౪౯ విశాలము, విస్తీర్ణము విశ్వంభరము, విమలము, వస్తువు, వ్యోమాకారము, ఆత్మము, పరమాత్మ, పరమేశ్వరము అనునవిగూడ దానికె నామములు ౫౦ ఏకరూ

పము, జగదాత్మము, జ్ఞానఘనము, పురాతనము, చిద్రూపము, చిన్మాత్రములను నవిగూడ నామరూపరహితమగు నాబ్రహ్మమునకె నామములు ౫౧ ఇటులె బ్రహ్మమున కనంతనామములు గలవు. కాని యా పరేశుఁడు (బ్రహ్మము) నామాతీతుఁడుగ నున్నాఁడు. ఆతని నిశ్చయము గావించుటకే యీనామము లుంచబడినవి. ౫౨ బ్రహ్మస్వరూపుడగు నాపరమాత్ముఁడు విశ్రాంతికిగూడ విశ్రామమైయున్నాఁడు. అంతియగాక ఆ యాత్మారాముఁడును ఆదిపురుషుఁడును నైయున్నాఁడు. ఆతఁ డొక్కఁడే పరబ్రహ్మము. రెండవది లేదు ౫౩

చతుర్దశబ్రహ్మలక్షణములు శాస్త్రాధారములతో వివరించెదను. ఈవివరణమును గ్రహించి అసత్యబ్రహ్మములను వేఱుపఱచినయెడల సత్యబ్రహ్మస్వరూపము గోచరించును. ౫౪-౫౫

మూఁ డ వ స మా స ము.

చతుర్దశమాయాబ్రహ్మములు.

శ్రోతలారా! సావధానులుకండు. సాధకులకు సమాధానమును బ్రసాదించునట్టి బ్రహ్మజ్ఞానమును మీకు వివరించెదను. ౧ రత్నములను వెదకవలయునన్నచోఁ దొలుతొలత మట్టినిగాలింపవలయును. అటులే సత్యబ్రహ్మమును నిశ్చయింపవలయునన్నయెడలఁ బదునాలుగు మాయాబ్రహ్మముల లక్షణములను గ్రహింపవలయును. కావున మాయాలక్షణముల నిచట వివరించుచున్నాఁడను. ౨ పదార్థము లేనియెడల సంకేతమును (నామనిర్దేశమును) ద్వైతము లేనియెడల దృష్టాంతమును పూర్వపక్షము లేనియెడల సిద్ధాంతమును జెప్పుటకు సాధ్యముగాదు. ౩ కావున దొలుతొలుత మిథ్యావిషయముల నెత్తుకొనవలయును. తరువాత వానిని బాగుగా శోధించి పరీక్షించుచు విడిచివేయవలెను. ఆపిమ్మట సత్యమగు విషయము సులభముగా (సహజముగా) నంతఃకరణములోనికి వచ్చును. ౪ ఇపుడు పదునాలుగు బ్రహ్మములను వర్ణించెదను. శ్రోతలు జాగరూకులై యాలింపవలయును. ఈవర్ణనము నాలించుటవలన సత్యసిద్ధాంతము విశదమగును. ౫

శ్రుత్యనుసారముగాఁ బదునాలుగు బ్రహ్మముల నామము లివి. ౧ శబ్దబ్రహ్మము. ౨ ఓమిత్యేకాక్షరబ్రహ్మము, ౩ ఖంబ్రహ్మము. ౪ సర్వబ్రహ్మము. ౫ చైతన్యబ్రహ్మము. ౬ సత్తాబ్రహ్మము. ౭ సాక్షిబ్రహ్మము. ౮ సగుణబ్రహ్మము. ౯ నిర్గుణబ్రహ్మము. ౧౦ వాచ్యబ్రహ్మము. ౧౧ అనుభవబ్రహ్మము. ౧౨ ఆనందబ్రహ్మము ౧౩ తదాకారబ్రహ్మము. ౧౪ అనిర్వాచ్యబ్రహ్మము ౬,౯

ఇవి పదునాలుగు బ్రహ్మముల నామములు. సంక్షేపముగా నిపుడు వానిస్వరూప మర్మముల నెఱుంగఁ జెప్పెద వినుండు ౧౦ అనుభవములోనికి రాక శబ్దములలో మాత్ర మెయ్యది చెప్పఁబడుచున్నదో యది శబ్దబ్రహ్మము. ఓంకారమును ఓంఇత్యేకాక్షరబ్రహ్మ యని చెప్పుదురు. ౧౧ ఖంబ్రహ్మము అనగా నాకాశబ్రహ్మమని యర్థము. ఇది మహదాకాశమువలె నన్నికడల వ్యాప్తమైయుండును. ఇఁక సర్వబ్రహ్మముయొక్క మర్మమును వినుండు ౧౨ ఈ బ్రహ్మమునుగూర్చి శ్రుత్యాశయ మేమన్న "పంచభూత చమత్కారము వలన గనుపడుచున్న యీ సమస్తము బ్రహ్మమే యని" సర్వం ఖల్విదం బ్రహ్మ అను శ్రుత్యర్థ మీసర్వబ్రహ్మమునే చెప్పుచున్నది. ఇఁక చైతన్యబ్రహ్మరహస్యమును జెప్పుదును. వినుండు. ౧౩. ౧౪ పంచభూతాత్మకమగు మాయయందుఁగలుగు చేతనమే చైతన్యబ్రహ్మము ౧౫ చేతనము మీఁద నధికారము (సత్తా) గలది సత్తాబ్రహ్మము. ఆయధికారమును (సత్తా) నెఱింగినది సాక్షిబ్రహ్మము. ౧౬ ఆసాక్షిత్వమునందుఁ ద్రిగుణము లారోపింపఁబడినపుడు దానినే సగుణబ్రహ్మమందురు. ౧౭ గుణాదులెవ్వియు లేకయుండునది నిర్గుణబ్రహ్మము. ౧౮ వాక్కులమూలమున నిట్టిదని చెప్పుటకవకాశముగలదై యనుభవమున రానిది వాచ్యబ్రహ్మము. అనుభవములోనికివచ్చి మాటలచేఁ జెప్పఁదగనిది అనుభవబ్రహ్మము. ఆనందమనునదియొక వృత్తిధర్మము అది వాచ్యముగనున్నది. దానినే ఆనందబ్రహ్మమందురు. భేదాభేదరహితమగు తదాకారత్వమె "తదాకారబ్రహ్మము." ఇఁక ననిర్వాచ్యబ్రహ్మమునుగూర్చి యేమిచెప్పుదును? దానిగూర్చి చెప్పుటకు వాక్కునకు శక్తిచాలదు. (అది వాణీవిషయమే కాదు) కాన నీసంవాదము సమాప్తిచేయుదును. ౧౯,౨౧.

వరుసఁగఁ జెప్పిన యీపదునాల్గు బ్రహ్మములనుజూచి సాధకులు భ్రమపడఁగూడదు. ఇందున్న శాశ్వతబ్రహ్మమును గుర్తించి మాయాబ్రహ్మముల నశాశ్వతములని పరిత్యజింపవలయును. ఇప్పుడే పదునాలుగు బ్రహ్మములనుగూర్చిన సిద్ధాంతము రాఁబోవుచున్నది, చెవియొగ్గి వినుండు. ౨౨, ౨౩.

శబ్దబ్రహ్మము శబ్దములతో సంబంధించినది. అది యనుభవరహితమైనది. కావున నది మాయికము. దానికి శాశ్వతత్వము లేదు. ౨౪ ఏబ్రహ్మము క్షరమును అక్షరమునుగాదో యాబ్రహ్మమునకు ఓమిత్యేకాక్షరబ్రహ్మ (ఓం + ఇతి + ఏక + అక్షర + బ్రహ్మ) అను నామమెక్కడనుండివచ్చినది? కావున నీబ్రహ్మమునందుగూఁడ శాశ్వతత్వచిహ్నమెద్దియును గాన్పింపదు. * ౨౫ ఖంబ్రహ్మమనునది ఆకాశమువలె శూన్యస్వరూపము. (అజ్ఞానస్వరూపము) కావున దానినిగూడ శాశ్వతబ్రహ్మమని చెప్పఁజాలము. ౨౬ ఇఁక సర్వబ్రహ్మమునుగూర్చి విచారింతము. సర్వమును (పంచభూతాత్మకమగు సర్వదృశ్యము) అంతమొందును. వేదాంతశాస్త్రమునందీయంతమును కల్పాంతమనియు, బ్రహ్మప్రళయమనియు, గూడ నుడువుదురు. ఈవిషయము నందఱు నెఱింగియేయున్నారు. కావున సర్వబ్రహ్మముసైతము నశ్వరమనియే తేలినది. ఇదిగూడ శాశ్వతముగాదు. ౨౭, ౨౮ విముక్తులగు విద్వాంసులు అచలమునందుఁ జలనమును, నిర్గుణమునందు గుణమును, నిరాకారమునందాకారమును అంగీకరింపరు, ౨౯ పంచభూతాత్మకమగునది (పంచభూత రచనము) ప్రత్యక్షముగా నాశవంతమైనది. కావున నది సర్వబ్రహ్మమెటులఁ గాఁగలదు. ౩౦ సర్వస్వమును నాశనమై పోవునపుడు ఉండునదెవరు? చూచువారలెవరు? ౩౧ ఇఁక చైతన్యబ్రహ్మమును విచారింతము. చైతన్యబ్రహ్మము దేనికి (పంచభూతాత్మకరచనమునకు లేక సర్వబ్రహ్మమునకు) చైతన్యమొసఁగుచున్నదో యదియే మాయికమని సిద్ధాం

---

* బ్రహ్మము క్షరముగాదు అక్షరమునుగాదు. అవినాశి యేలకాదన? ఎచ్చట నాశనములేదో యచ్చట అవినాశియనుశబ్దప్రయోగమున కవకాశమెక్కడిది? ఏబ్రహ్మము క్షరముగాదో మఱియు నక్షరముగూడఁగాదో యచ్చట ఓమిత్యేకాక్షర బ్రహ్మ అనుదాని నెచ్చటనుండి తెచ్చిపెట్టిరి!

తమైనప్పుడుదీనికి ఈబ్రహ్మమునకుఁజైతన్యత్వ మెచ్చటనిలచినది. కావున నిదిగూడ అశాశ్వతమని సిద్ధాంతమైనది. ౩౨ ఇఁకఁ బ్రజయే (చైతన్య సర్వము లే) లేనప్పుడు వాస్తవములో సత్తామాత్ర మెక్కడినుండివచ్చును? కావున సత్తాబ్రహ్మముగూడ నేమియును లేదు. ఇఁక సాక్షిబ్రహ్మమును దీసి కొందము. ఎప్పుడు సత్తాయే లేదో అపుడు సాక్ష్యమెవ్వరిది? కావున సాక్షిబ్రహ్మముగూడ నశ్వరమని తేలినది. ౩౩ సగుణబ్రహ్మమన్నో యది ప్రత్యక్షముగనే నాశవంతమైనదిగదా! దీనిని దెలుపుటకు విశేషించి ప్రమాణములు చూపవలసిన యావశ్యకము లేదు. ౩౪ ఇఁక నిర్గుణబ్రహ్మమును దీసికొందము. మొట్టమొదట గుణము లేలేనపుడు నిర్గుణమనుపే రెక్కడనుండివచ్చినది? గుణములు లేనిచో నెందేని గౌరవము ప్రాప్తించునా ? కావున నిర్గుణబ్రహ్మ మనునదిగూడఁ బూర్తిగా వ్యర్థమైనదేయగును. ౩౫ మాయ మృగతృష్ణవంటిదని నుడువుట యెటులుండునో యీ (నిర్గుణ) బ్రహ్మమును నిర్గుణమని నుడువుట యటులున్నది. ఎవరేని యాకాశమునకు (స్వరూప) కల్పనముగావించినచో నది యెంతదనుక సత్యముకాగలదు. ౩౬ గ్రామమే లేనప్పుడు పొలిమేర యెక్కడనుంచి వచ్చును? జన్మమే లేనప్పుడు జీవాత్మ యెక్కడనుండి వచ్చును? అద్వైతమునకు ద్వైతోపమాన మెట్లుసరిపడును? ఈస్థితియే గుణములు లేని నిర్గుణబ్రహ్మమునెడగూడఁ గలదు. ౩౭ మాయయే లేని యెడల సత్తాయును, పదార్థమే లేనియెడల సాక్షిత్వమును, అవిద్యయే లేనియెడల చైతన్యము, ఎట్లునిలువఁజాలవో అటులే గుణములు లేని యెడల నిర్గుణముగూడ నిలువఁజాలదు. ౩౮ సత్తా, చైతన్యము, సాక్షి యను నివియన్నియు గుణములతోడనే నిండియున్నవి. ఎయ్యదినిర్గుణమో దానిలో గుణము లెచ్చటనుండివచ్చినవి? ౩౯ గుణములు లేనిదానికి నిర్గుణమను సంజ్ఞనొసంగుట స్వయముగా దానికశాశ్వతత్వమును సిద్ధాంతము జేయుటయేయని తెలిసికొనుడు ౪౦ ఇఁక వాచ్యబ్రహ్మమునుగూర్చి విచారింతము. నిర్గుణబ్రహ్మము తనంతనే యది పేరుచేతనే యశాశ్వతమని సిద్ధమయ్యెను. అటులే వాచ్యబ్రహ్మముగూడ మిథ్యయైయున్నది. ఏలయన, వాచ్యబ్రహ్మము ఉపర్యుక్తబ్రహ్మములయందు ఖండనము గావింపఁబడిన విషయములతో నున్నది. ౪౧

ఇఁక నానందబ్రహ్మమునుగూర్చి వినుండు. ఆనందబ్రహ్మముగూడ వృత్తియొక్క భావనయైయున్నది. వృత్తి ప్రత్యక్షముగా నశ్వరమైయున్నది. కావున ఆనందబ్రహ్మమున్నఁ బ్రత్యక్షముగనే అశాశ్వతమైయున్నది. ఇఁకఁ దదాకారబ్రహ్మమును దీసికొనుఁడు. తదాకారమైపోయినపిమ్మట వృత్తియేమియు వేఱుగానుండదు. కావునఁ దదాకారబ్రహ్మముగూడ నేమియునూ లేదు. ౪౨ ఇఁక శేషించినది అనిర్వాచ్యబ్రహ్మము. కాని అనిర్వాచ్యమను నీనామ నిర్దేశముగూడ వృత్తి కారణమునననేగదా! బ్రహ్మమునందు నివృత్తి వచ్చుచున్నది కావున నీయనిర్వాచ్యబ్రహ్మముగూడ శాశ్వతబ్రహ్మముగాదు. బ్రహ్మమునకు నామమే నిర్దేశముగాజాలదని తాత్పర్యము ౪౩

ఏ నివృత్తిదశ అనిర్వచనీయముగానున్నదో యదియే ఉన్మనీయావస్థ. అదియే యోగులకు నిరుపాధికవిశ్రాంతి ౪౪ నామము, రూపము, గుణము, వృత్తి, మొదలగు నుపాధియేదియును లేని వస్తువేదియో యదియె జ్ఞానులకు సహజసమాధి. దానివల్లనే భవసాగరమువలన గలుగు ఆధివ్యాధులన్నియు దూరమగును ౪౫ ఉపాధులన్నియు నెచట నంతరించునో యదియే సిద్ధాంతము. సిద్ధాంతముమాత్రమే కాదు. మీదుమిక్కిలి అదియే వేదాంతము. అదియే ఆత్మానుభవము ౪౬

ఏది శాశ్వతబ్రహ్మమో ఎచ్చట మాయాభ్రమ లేదో? దానిమర్మమును అనుభవనీయులగు పురుషులు స్వానుభవమువలన నెఱుంగుచున్నారు. ౪౭ స్వానుభవసహాయమునఁ దొలుతొలుత కల్పనమును నాశమొనరించి తరువాత ఆనందమును జూరగొనవలయును. ౪౮ నిర్వికల్పమును గల్పనమొనరించుటచేఁ గల్పనము సహజముగా విడిపోవును. పిమ్మట నేమియు శేషించియుండదు. ఆవల సాధకు లాత్మస్వరూపులై కోట్లకొలఁది సంవత్సరములదనుక నుండఁగల్గెదరు ౪౯ కల్పమునందొక మంచితనమున్నది. ఏమన, దానిని మన మెచ్చటనియోగించెదమో యది అచ్చటనే లగ్నమగును. కాని యొకవేళ మనము పరమాత్మస్వరూపమునందు నియోగించినచో స్వయముగా దానియందే విలీనమగును. మఱియు మనయనునదిగూడ ఆరూపమే యైపోవును. ౫౦ నిర్వికల్పమును గల్పనము చేయఁబూనితిమేని కల్పనము స్వయముగా నశించి

పోవును. నిస్సంగమును గలియుటచే స్వయముగా నిస్సంగులై పోవుదురు. ౨౧

బ్రహ్మ మనచేతిలో నిముడ్చుకొనుట కనువగుపదార్థముగాదు. సద్గురుని జ్ఞానోపదేశముచే నది యనుభవములోనికి వచ్చును. ౨౨ ముందు మఱల నీవిషయమునుగూర్చి నిరూపణము గావించెదము. ఆ నిరూపణమువలన మీకుఁ గేవలబ్రహ్మము అననేదియో బాగుగాఁ దెలియఁగలదు. ౨౩

నాలుగవ సమాసము

కేవల బ్రహ్మము.

బ్రహ్మము ఆకాశమునకంటె నిర్మలముగను నిరాకారముగను విశాలముగను, వ్యాపకముగను నున్నది. ౧ ఇరువదియొక్క స్వర్గములును ఏడుపాతాళములును గలసి యొక బ్రహ్మాండమైనది. ఈవిధముగా నున్న యనంతబ్రహ్మాండములకుఁ గ్రిందను మీఁదను అన్నిస్థలములను నదియున్నది. బ్రహ్మముచే నావరింపబడనిస్థల మణుమాత్రము గూడ లేదు. ౩ స్థలజలకాష్ఠపాషాణాదు లన్నింటియందును బ్రహ్మము ఇమిడి యున్నది. అదిలేనిప్రాణి యెద్దియు నుండఁజాలదని యందఱు నెఱుంగుదురు ౪ జలమునందు జలచరములు నిలిచియుండునటుల బ్రహ్మమునందుఁ బ్రాణిసమూహము సమస్తము నిలిచియున్నది ౫ కాని బ్రహ్మమునకు జలోపమానము నొసంగుట యుక్తముగా లేదు. ఏలయన జలమునియమముగలది. జలచరములు నీటియందు నీటివెలుపలను నుండవచ్చును. బ్రహ్మము నియమరహితమైనది. దానికి వేఱుగా నేప్రాణియు నుండఁజాలదు ౬ ఒకవేళ నెవఁడేని యాకాశము వెలుపలకుఁ బాఱిపోవఁ దలంచిన యెడల నెటులఁ బరుగెత్తఁగలఁడు? అది యన్నిప్రక్కలను నిండియున్నదిగదా! అటులే బ్రహ్మమునకుఁగూడ నంతములేదు. ౭ అది యన్నింటియందును నఖండరీతిగాఁ గలిసియున్నది. శరీరమునం దంతటను నది చుట్టుకొని యున్నది. బ్రహ్మము అన్నింటికి మిగుల సమీపమునందుండియు దాఁగి యున్నది ౮ అన్నియును బ్రహ్మమునందే యిమిడియున్నవి. అటులున్న విషయము జనులందఱు నెఱుంగరు. తెలియుచున్న దంతయు భాసము.

అపరబ్రహ్మము కొంచెమేని యెఱుంగఁబడదు ౯ మేఘము, ధూమము ఉరుము, మంచు మున్నగునవి ఆకాశముతోఁ గలిసియున్నటు లొక్కొక్కప్పుడు గాన్పించును. అది సత్యము గాదు. ఆకాశము నిర్మలమైనది ౧౦ ఆకాశమువైపు మనము చాలసేపుదనుకఁ జూచుచున్న యెడల ఆకాశమునం దేదియో ఒకదృశ్యము చక్రమువలెఁ దిరుగుచున్నటుఁ గనుపించును. వాస్తవమున కందేమియును లేదు. మిథ్యాభాస ఇటులే మీదృశ్యముగాడ (సృష్టిసైతము), జ్ఞానులకు మిథ్యగఁ గన్పట్టును ౧౧ నిద్రించినవానికిఁ దనస్వప్నము జరుగుచున్నటులె యుండును. మేల్కనిన యనంతరము అంతయును మిథ్యయని విదితమగును. అటులే జ్ఞానరూపమగు జాగరూకత గలిగినపిమ్మట మనుష్యునకీ స్వప్నమువంటి దృశ్యమంతయు మిథ్యయని తెలియును ౧౨ కావున మానవుఁడు తన యనుభవజ్ఞానసహాయమున మేల్కొనవలయును. మేల్కొనిన పిమ్మట నీమాయిక దృశ్యము (ప్రపంచము) అంతయు మిథ్యయని దెలియును ౧౩ ఇఁక నీ కూటసమస్య నటులుంచి యెయ్యది బ్రహ్మాండమున కావల నున్నదో యాబ్రహ్మమును మీకు స్పష్టముగాఁ దెలియఁజెప్పెదను ౧౪.

బ్రహ్మము బ్రహ్మాండమునందుఁ గలసియున్నది. ప్రతిపదార్థమునందును నది వ్యాప్తమైయున్నది. మఱియు నది అంశ (భాగ) మాత్రముతో సమస్తవస్తువులయందును విస్తృతమై యున్నది ౧౫ బ్రహ్మమునందు సృష్టి భాసించుచున్నది. సృష్టియందు బ్రహ్మమున్నది. అనుభవము గావించుకొన్నపిమ్మట నది యంశమాత్రముతో భాసించును ౧౬ బ్రహ్మము అంశమాత్రముతో సృష్టికి లోపలనున్నది. కాని సృష్టికావల నదియెంతవఱకు వ్యాప్తమైయున్నదో యనునియతి నెవ్వరును గనుగొని నిశ్చయింపఁ జాలరు. ఏలయన, సంపూర్ణబ్రహ్మము బ్రహ్మాండమునం దెట్లుసరిపోవును. ౧౭ అమృతి (చరణామృతముంచు చిన్నపాత్రము)లో సంపూర్ణాకాశము ప్రతిఫలింపఁజాలదు. అటులే బ్రహ్మములోఁ గొంత యంశము మాత్రమే యీ బ్రహ్మాండమునందు నిండియున్నదని జ్ఞానులు తలంచుచున్నారు ౧౮ బ్రహ్మము సమస్తమునందునుగలిసియున్నది. కాని యది కదలదు. వ్యాపకత్వమువలన నన్నింటిలోనను బరిపూర్ణముగా నిండియున్నది ౧౯ పంచభూతములతో నిండియుండియును పంకమునం దుండి

యును ఆకాశమలిప్తముగానుండునటుల బ్రహ్మముగూడ సర్వవస్తువులలో వ్యాపించియు వేఱుగానున్నది ౨౦ బ్రహ్మమునుగూర్చి యొసంగఁదగిన దృష్టాంతమెద్దియును లేదు. శ్రోతలకు విషయస్వరూపము బాగుగా బోధపడుటకై దృష్టాంతము నొసంగవలసిన యవసరముగలదు. బాగుగా విచారించిచూచినచో బ్రహ్మముతోఁ గొంచెమో గొప్పయో పోలికగలదిగా ఆకాశమొక్కటిమాత్రమె కనిపించుచున్నది ౨౧ శ్రుతులయందును, స్మృతులయందును క్రమముగా బ్రహ్మము ఖంబ్రహ్మమనియు గగనసదృశమనియుఁ జెప్పఁబడెను. కావుననే బ్రహ్మమును ఆకాశముతోఁ బోల్చుట సంభవించినది ౨౨ ఇత్తడియంచు నలుపురంగు లేనియెడల నది స్వచ్ఛమగు బంగారమే. అటులే ఆకాశమునందు శూన్యము లేనియెడల నదియే బ్రహ్మము ౨౩ ఇందువలననే బ్రహ్మమును గగనమువలెను మాయను పవనమువలెను గ్రహించుచున్నారు. అంతియగాని బ్రహ్మమును దర్శింపఁజాలము ౨౪ శబ్దసృష్టికి సంబంధించిన రచనము క్షణక్షణమునఁ గల్పింపఁబడును. అంతలో నశించును. అదివాయువువలె నిలచియుండదు. నడచి పోవుచునే యుండును ౨౫

మాయయు నిటులె మిథ్యయైయున్నది. కేవలబ్రహ్మమే శాశ్వతము. బ్రహ్మము అన్నింటియందును వ్యాప్తమైయున్నది ౨౬ అది పృథ్వి లోనికిఁ జొచ్చి (పృథ్వినిభేదించి)యున్నది. కాని యది పృథ్వియంత కఠినమైనదిగాదు. ఏలయన, పృథ్వి సహజముగా జడము (పృథ్వినిభేదించుటకు బ్రహ్మము కఠినముగానుండవలెను) బ్రహ్మము మిగులమృదువైనది. దాని మృదుత్వమున కుపమానమే లేదు ౨౭ పృథ్వికంటె సూక్ష్మముజలము, జలముకంటె సూక్ష్మము అగ్ని, అగ్నికంటె సూక్ష్మము వాయువు ౨౮ వాయువుకంటె నధికసూక్ష్మమాకాశము. ఆకాశమునకంటె నధికసూక్ష్మము బ్రహ్మము ౨౯ బ్రహ్మము వజ్రమునుగూడ భేదించి యందిమిడియున్నది. కోమలత్వమునఁ జెప్పవలసినపనియే లేదు. బ్రహ్మము పోవలేదు. ఉపమారహితమై యది యన్నింటియందును నిండియున్నది. బాగుగాశోధించిచూచినచో నది కఠినమైనదియు గాదు, మృదువైనదియుఁ గాదు. ౩౦ బ్రహ్మము భూమండలమునం దంతటను వ్యాప్తమైయున్నది. భూమండలము నాశనమగుగాని బ్రహ్మమునాశముగాదు. అటులే జలమెండి యినికిపో

వును. బ్రహ్మమో జలమునందుండియు నెండిపోవదు. ౩౧ పరబ్రహ్మమగ్నియందుండునుగాని తగులఁబడిపోదు. వాయువునందుండునుగానిపీవదు. గగనమునం దున్నదిగాని భాసింపదు. ౩౨ అది శరీరమునం దంతటను వ్యాప్తమైయున్నది. కాని దొరుకదు. మఱియు నది దగ్గఱనుండియును దూరమగుచున్నది. ఇది మిగుల నాశ్చర్యకరమగువిషయము ౩౩ బ్రహ్మ మెదురుగానున్నది. నలుముఖముల నాక్రమించుకొని యున్నది. పగలు రాత్రిగూడ మన మాబ్రహ్మమునందె చూచుచున్నారము. లోపలను వెలుపలను సర్వస్థలములయందును బ్రహ్మము ప్రత్యక్షముగానున్నది. ఇందు సందియ మావంతయు లేదు ౩౪ మనము బ్రహ్మమునం దున్నారము. అది మనలోపలను మనవెలుపలను నున్నది. ఆకాశమువలె నది దృశ్యముకంటెను వేఱుగా నున్నది. ౩౫ ఎచ్చటనేమియును గనుపింపదో యచటగూడ బ్రహ్మము నిండియున్నది. తనధనము తనకే కనిపింపనటులఁ బరబ్రహ్మ మదృశ్యమగుచున్నది. ౩౬ కనుపించుచున్న ప్రతిపదార్థమును బ్రహ్మ మంటుకొనియున్నది. (మొట్టమొదట బ్రహ్మముమీఁద దృష్టిపడవలయును. అప్పుడు పదార్థముమీఁది) అనుభవమువలన నీకూటసమస్యను సాధింపవలయును. ౩౭ సంపూర్ణదృశ్య పదార్థములను (పృథివ్యాదులను) విడిచి శేషించిన సమస్తమునకును ముందువెనుక నలుముఖములను నాకాశమెటులున్నదో యటులే యాపరబ్రహ్మము నలుముఖముల సామరస్యముగా నిండియున్నది. ౩౮ రూపము, నామము లున్నంతదనుక నది యంతయు నసత్యము, భ్రమ. మఱియు నామరూపముల కావలనున్నదాని (బ్రహ్మము) మర్మమును అనుభవనీయులగు పురుషులే యెఱుంగుదురు. ౩౯ ఆకాశమునందు ధూమము పెద్దపెద్దపర్వతములవలెఁ గనంబడునటుల మాయాదేవియుఁ దనయాడంబరమున వింతవింతరీతులఁ గనిపించుచున్నది. ౪౦ ఈమాయ అశాశ్వతము. బ్రహ్మము శాశ్వతము. బ్రహ్మము అన్నిస్థలములయందు నిరంతరము నిండియున్నది. ౪౧ చూడుఁడు. పుస్తకము జదువునప్పు డది యక్షరములలోసైతము నిండియున్నది. మఱియు మిగులకోమల రూపముతో నేత్రములలోఁగూడఁ బ్రవేశించియున్నది ౪౨ చెవులతో శబ్దమునాలకించునపుడు, మనస్సుతో ఆలోచనమును జేయునప్పుడు వాస్తవములో నాపరబ్రహ్మము హృదయ

మునకు లోపలను వెలుపలను నమరియున్నది. ౪౩ మార్గమునందు నడచునపుడు పాదములు తొలుదొలుత దానినే తాఁకును. అది సర్వాంగములను దాఁకుచున్నది. ఎప్పుడైనను మనమే దేనివస్తువును దీసికొనినచో నపుడా వస్తువుకంటె ముందు మనకుఁ బరబ్రహ్మమే చేతిలోనికి వచ్చుచున్నది. ౪౪ ఎంతదనుకఁ జెప్పగలను. సమస్తేంద్రియములును, మనస్సును సైతము నిరంతరము పరబ్రహ్మమునందే వర్తించుచున్నవి. కాని దానిని దెలిసికొనుటలో మనము హతాశులమగుచున్నారము. ౪౫ (పరబ్రహ్మము) దగ్గఱనే యున్నది గాని చూచినచోఁ గానుపింపదు. అది కనుపింపక పోయినను దప్పక యదియున్నదనుమాట సత్యము. ౪౬

దృశ్యమును నిరసించినపిమ్మటఁ దనయనుభవమువలననే యది (పరబ్రహ్మము) ప్రాప్తమగును. అది యనుభవగమ్యముగానున్నది. ౪౭ జ్ఞానదృష్టితోఁ జూడఁదగినవస్తువు చర్మదృష్టికిఁ గాన్పింపఁజాలదు. లోపలి యనుభవ విషయమును లోనివృత్తియే తెలిసికొనఁగలుగును ౪౮ బ్రహ్మమును, మాయను, అనుభవవిషయమును దెలిసికొనునట్టి సర్వసాక్షిణి తుర్యావస్థమాత్రమే సుమా ౪౯ దానిసాక్షిత్వమునకు వృత్తికారణము (తుర్యమునందువృత్తియున్నది) దానికిఁ బిమ్మటనున్నది ఉన్మనీయావస్థ (నివృత్తిదశ) అచట (ఉన్మనీయావస్థయందు) ఎఱుక (జ్ఞాతృత్వము) నశించిపోవును. అదియే విజ్ఞానము ౫౦ ఉన్మనీయావస్థలో అజ్ఞానము నశించిపోవుచున్నది. జ్ఞానముగూడ నుండదు. విజ్ఞానవృత్తి పరబ్రహ్మమునందు లీనమైపోవుచున్నది. అచ్చట కేవలబ్రహ్మమున్నది. కల్పనమచట సంత్యమగుచున్నది. అదియే యోగిజనుల యేకాంతవిశ్రామము. దానిని ననుభవపూర్వకముగా నెఱుంగవలయును ౫౧, ౫౨.

అయిదవ సమాసము.

కల్పనానిరసనము.

పైనిఁ జెప్పబడిన శాశ్వతశుద్ధబ్రహ్మము అనుభవములోనికి వచ్చినది. మాయాస్వరూపముగూడ బోధపడినది ౧ బ్రహ్మమునుగూర్చి మా హృదయములలో ననుభవము గలుగుచున్నది. మాయగూడ ప్రత్యక్షముగాఁ గన్పించుచున్నది. ఇపుడీ ద్వైతనిరసన మే విధముగాఁ గావలయునో

తెలియకున్నది. గురుమహారాజా సెలవిండు ౨ శ్రోతలకు వక్త యిటులఁ జెప్పుచున్నాఁడు. శ్రోతలారా! అటులైనచో నిప్పుడు మనస్సును, సావధానమును, ఏకాగ్రముగావించి మాయను బ్రహ్మమును నెవఁడెఱుంగునో దానిని వినుండు ౩ "బ్రహ్మసంకల్పము సత్యము. మాయావికల్పము మిథ్య" అనునీ ద్వైతకల్పనమును మనస్సే చేయుచున్నది * ౪ మాయను, బ్రహ్మమును సమస్తమును తుర్యావస్థయొక్కటియే యెఱుంగును. కావుననే దానిని సర్వసాక్షియని చెప్పుదురు. ౫ తుర్యము అన్నింటి నెఱుంగును. కాని యెచ్చట అన్నియునునది లేదో యచ్చట నెఱుంగువాఁడెవఁడు? దేనిని? ౬ సంకల్పవికల్పములసృష్టి మనోగర్భమునుండి జరిగినది. అంత్యమునందామనస్సే మిథ్యయని నిర్ధారణమగుచున్నది. అప్పుడు సాక్షియెవఁడు? ౭ సాక్షిత్వము. చైతన్యము, సత్త అనుగుణములు మాయాకారణమున వ్యర్థముగ బ్రహ్మమునకు మధ్యను జేర్పఁబడినవి ౮ ఘటాకాశము, మఠాకాశము, మహదాకాశము అను నీ మూఁడు భేదము లేర్పడుటకెట్లు ఘటము, మఠము, కారణములో యదేవిధముగా మాయాసంయోగము వలన బ్రహ్మమునందుగుణారోపణము కలుగుచున్నది. కాని వాస్తవమునకు ఆకాశ మొక్కటియే. అటులే బ్రహ్మముగూడ నిర్గుణమును శాశ్వతమునునై ఒక్కటిగా నున్నది. ౯ ఎంతదనుక మాయ సత్యముగా భావింపఁబడునో యంతదనుకనే బ్రహ్మమునందు సాక్షిత్వమున్నది. అవిద్యానిరసనమైనపిదప ద్వైత మెక్కడనుండఁగలదు! ౧౦ ఇటులే సర్వసాక్షియగు మనస్సు ఉన్మనమైపోయినపుడు తుర్యరూపమగు జ్ఞానమస్తమితమై పోవును. ౧౧ ద్వైతముగా భాసమగు మనస్సెప్పుడు ఉన్మ

---

* మాయయెద్దియో బ్రహ్మమెద్దియో తెలిసినదిగాని మాయాబ్రహ్మముల ద్వైతనిరసన మెటులగును? అనిశిష్యుఁ డడిగెను. ప్రత్యుత్తరము. మాయాబ్రహ్మముల కల్పనమగుచున్న దెవనికి? మనస్సునకు. ఆకల్పనము నశించినపిమ్మట (మనోవృత్తి లేకున్న పిదప అనగా నున్మనీయావస్థలో) ద్వైతమిఁక నెటులుండఁగలదు? కాని యీకల్పనమును నశింపఁజేయుటయెట్లు? కల్పనమువలనఁ గల్పనము నశించును. బ్రహ్మమును గూర్చిన కల్పనము శుద్ధకల్పనము, సంకల్పము, మాయనుగూర్చినకల్పనము శబలము (దోషాధికము) లేక అశుద్ధకల్పనము అదివికల్పము ఇవుడీసంకల్పముకంటె ముందుగా వికల్పములు నాశన మొనరింపవలయును. దీనికిఁ బిమ్మట సంకల్పము స్వయంబ్రహ్మమునందు లీనమైపోవును. మఱియుఁ గేవలబ్రహ్మము ప్రాప్తించును.

నమయ్యెనో యప్పుడు ద్వైతాఽద్వైతానుసంధాన మెచ్చట నున్నది?
౧౨ అనఁగా ద్వైతాఽద్వైతకల్పనము వృత్తిచిహ్నము. వృత్తి నివృత్తి
యై పోయిన పిమ్మట ద్వైతముయొక్క జాడపొడలుగూడఁ గాన్పింపవు.
౧౩ వృత్తి రహితమగునట్టి జ్ఞానమే (విజ్ఞానము) పూర్ణశాంతి. పూర్ణ
శాంతి లభించిన పిమ్మట మాయా బ్రహ్మములనుగూర్చిన వివాదము
తయు నంతరించును. ౧౪ మాయాబ్రహ్మములనుగూర్చిన వివాదమును
మనస్సే కల్పించినది. బ్రహ్మము వాస్తవమునకుఁ గల్పనాతీత మైనది.
ఈ రహస్యమును జ్ఞానులే యెఱుంగుదురు. ౧౫ మనోబుద్ధుల కగోచర
ముగా నున్నదియుఁ గల్పనమునకంటె వేఱుగనున్నదియు నగు పరబ్రహ్మ
ముయొక్క యథార్థమును అనుభవము గావించిన యెడల ద్వైత
మెచ్చట నిలువఁ గలుగును? ౧౬ ద్వైతమువైపు చూచినచో బ్రహ్మము
గోచరింపదు. బ్రహ్మమువైపు చూచినచో ద్వైతము నశించును. ఏలయన
ద్వైతాద్వైతముల భాసము కల్పనమువలననే జరిగియున్నది. ౧౭ కల్ప
నము మాయానివారణమును జేయుచున్నది. బ్రహ్మమును స్థాపించు
చున్నది. అటులే సంశయమును గలుగఁజేయునదియు సంశయము నాటం
కపఱచునదియుఁగూడ కల్పనమే. ౧౮ అదియే (కల్పనమే) మానవుని
అధిబంధములయందుఁ బడద్రోయుచున్నది. సమాధానము నొసంగు
చున్నది. మఱియు బ్రహ్మమువైపు ధ్యానమును గలిగించుచున్నది. ౧౯
కల్పనము ద్వైతమునకు జనని. అదియే జ్ఞానమునకు స్వరూపమై యున్నది.
మఱియు (బద్ధత్వము) ముక్తిత్వముగూడ దానివలననే యేర్పడుచున్నది.
౨౦ శబల (ఔపాధిక) కల్పనము మిథ్యాబ్రహ్మాండమును సృజించుచున్నది.
శుద్ధకల్పనము ఆక్షణముననే నిర్మలస్వరూపభావనము గావించుచున్నది.
౨౧ కల్పనము క్షణమాత్రములోఁ జింతనము గావించును. క్షణమాత్ర
ములో స్థిరమై పోవును. మఱియు క్షణమాత్రములో విస్మృతమై చూచు
చుండును. ౨౨ కల్పనము క్షణమాత్రములోఁ దెలిసికొనుచున్నది.
క్షణమాత్రములో భయపడుచున్నది. ఇటులే బహువిధవికారములను
దెచ్చిపెట్టుకొనుచున్నది. ౨౩ జన్మమునకుఁ గల్పనమే మూలము. భక్తికి
ఫలము కల్పనమే. మఱియు మోక్షమునుగూడఁ గల్పనమే ప్రసాదించు
చున్నది. ౨౪ సాధనము చేయునపుడీకల్పనమును జక్కఁగా నుపయో

గించినచో శాంతము లభించును. అటులఁ గానియెడల నిదియే మాన
వుఁడు పతనమగుటకుఁగారణమగును. ౨౫ ఇటులే కల్పనమన్నింటికినిమూల
మైయున్నది. దీనిని నిర్మూలనముగావించిన పిమ్మటబ్రహ్మము ప్రాప్తించును.
౨౬ శ్రవణము, మననము, నిదిధ్యాసములవలన సమాధానము లభించును.
అంతతో మిథ్యాకల్పనాభాసుఁ డస్తమించును. ౨౭ నిశ్చితమగు అర్థము
వలన సంశయము నశించునట్లు శుద్ధబ్రహ్మనిశ్చయమువలనఁ గల్పనము నశిం
చును ౨౮ మిథ్యాకల్పనమునకుఁ గలటక్కరితనము సత్యముముం దెటు
లనిలువఁగలదు? సూర్యుని తేజఃపుంజమున కెదురుగాఁ జీకటి యెటుల
నిలిచియుండఁగల్గును ౨౯ జ్ఞానప్రకాశమువలన మిథ్యాకల్పనము నశిం
చును. అప్పుడు ద్వైతాభాసము తనంతట తానే విడిపోవును ౩౦ మృగ
ము వలనమృగము వంచింపఁబడి (వేటకానిచే) నశించునటులఁ గల్పనము
వలనఁగల్పనమెగిరిపోవుచున్నది, ఆకాశమార్గమునకువిడువఁబడిన బాణము
వేఱొకబాణముచేఁ దెగఁగొట్టఁబడునటుల కల్పనమువలనఁ గల్పన మంత
రించును. ౩౧

శుద్ధకల్పన ప్రబలత్వమువలన శబలకల్పన మెటుల నాశనమగు
చున్నదో యావిషయమును మీకు స్పష్టపఱచి చూపెదను. ౩౨ శుద్ధ
కల్పనము గురుతించువిధమును వినుండు. శుద్ధకల్పనము స్వయముగా నిర్గు
ణకల్పనము గావించుచున్నది. మఱియు నది సత్స్వరూపమును విస్మరింప
నీయదు ౩౩ స్వరూపానుసంధానము యొక్కయు, ద్వైతనిరసనముయొక్క
యు, అద్వైత నిశ్చయముయొక్కయు జ్ఞానమును గలుగఁజేయునదియే
శుద్ధకల్పనము ౩౪ అద్వైతకల్పనము గావించునది శుద్ధమనియు ద్వైత
కల్పనము గావించునది అశుద్ధమనియు నెఱుంగవలయును. అశుద్ధకల్ప
నమునే శబలకల్పనమనిగూడ నందురు ౩౫ అద్వైతనిశ్చయము జేయు
టయే శుద్ధకల్పనాకార్యము. శబల (అశుద్ధ) కల్పనము వ్యర్థముగ ద్వైత
భావమును జేయును ౩౬ అద్వైతకల్పనము ప్రకాశితమైనంతనే ద్వైతము
నశించిపోవును. ద్వైతముతోఁబాటుగ శబల (అశుద్ధ లేక ఔపాధిక)కల్ప
నముగూడ నిరసనమైపోవును ౩౭ కల్పనమువలనఁ గల్పనము నశించును.
శబలత్వకల్పనము వెడలిపోయినపిమ్మట శుద్ధకల్పనము శేషించియుండును.
ఈ విషయమును జతురపురుషు లెఱుఁగవలయును. ౩౮ శుద్ధకల్పన

మేస్వరూపమునుగల్పించునో యదియే దాని స్వరూపము. మఱియు నా స్వరూపమును గల్పించుచు గల్పించుచు స్వయముగా నది తద్రూపమై పోవును. ౧౯ కల్పనము యొక్క మిథ్యాత్వము ప్రకటనమై పోయినపిదప సహజముగఁ దద్రూప మేతెంచును. మఱియు నాత్మనిశ్చయమైనపిమ్మట కల్పనము లయమైపోవును ౨౦ సూర్యుఁ డస్తమించినపిమ్మట నంధకారము ప్రబలునట్లు నిశ్చయము లోపించినపిమ్మట ద్వైత ముప్పొంగును ౨౧ అటులే జ్ఞానము మలినమైనపిమ్మట అజ్ఞానము ప్రబలును. కావున సద్గ్రంథశ్రవణము అఖండరీతిగఁ జేయుచుండవలయును. ౨౨ ఇఁక నీవిపులప్రసంగము జాలించి యొక్క మాట తోడనే మీసందియముఁ దీర్చెదను. ద్వైతముగా భాసించు నీవుఅను నది లేదు. ౨౩ సంశయ మిప్పటికి విడిపోయియుండును. ఇఁకముందుఁ జెప్పఁబోవు విషయమును సావధానమతితో వినఁగోరెదను ౨౪

ఆఱవ సమాసము

ముక్తుఁడెవ్వఁడు?

శ్రోతలిటుల నడుగుచున్నారు. గురువర్యా! తాము కల్పనాతీతమగు అద్వైతబ్రహ్మనిరూపణము గావించి నన్ను క్షణమాత్రము కొఱకుఁ దదాకారునిగఁ జేసివైచితిరి ౧ కాని నేను తదాకారుఁడనై కేవల బ్రహ్మమును గావలయునని గోరుచున్నాఁడను. చంచలత్వమునకు లోనై యెప్పుడును నీసంసారములోనికి రానొల్లను ౨ కల్పనారహితమగు ఆసుఖమునందు సంసారదుఃఖము లేదు. కావున నదియే (ఆబ్రహ్మమె) యైపోవలయును. ౩ వాస్తవమునకు అద్వైతశ్రవణము వలన సాధకుఁడు బ్రహ్మమే కావలయును. గాని యిచ్చట మఱల వృత్తిమీఁదకు రావలసివచ్చుచున్నది. అందుచే నీరాకపోకలు తొలఁగుటలేదు. ౪ నేను క్షణమాత్రముకొఱకు ఎత్తుపయినెక్కి బ్రహ్మమునే యగుచున్నాఁడను. కాని తత్క్షణమే మఱలఁ గ్రిందికి (వృత్తిలోనికి) వచ్చిపడుచున్నాఁడను. ౫ పిల్లలు సీతాకోకచిలుక కాళ్ళకు దారమునుగట్టి దానిని గ్రిందికిని మీఁదకును నెగురవేయునటుల నేనుగూడఁ (వృత్తిబద్ధుఁడనై) గ్రిందికిని మీఁదకును ప్రత్యావర్తనము (రాకపోకలు) చేయు

చున్నాఁడను. ఇటులెంతదనుకఁ జేయవలెనో తోఁచకున్నది. ౬ ఉపదేశము నాలించునపుడు తదాకారమైనతోడనే శరీరము పతనమైనటులుండవలయును. నాదియిది. పరునిదిదియనుభావము లేకుండఁ బోవలయును. ౭ ఇట్లు కాఁజాలనిస్థితియందున్న నేను ఏమిచెప్పుచుంటినో యావిషయమునందే సిగ్గుపడుచున్నాఁడను. ఒకసారి బ్రహ్మమునై మఱల గృహస్థాశ్రమములోనికి వచ్చిపడుటఁ గూడ నాకు విపరీతముగాఁ గాన్పించుచున్నది. ౮ ఈజ్ఞానము నాకు యుత్తమముగాఁ దోఁచుటలేదు. ఒకసారి స్వయముగా బ్రహ్మమైపోయినవాఁడు మఱల నాదశనుండి యేల వెనుకకుఁ దిరిగివచ్చుచున్నాఁడు. ౯ అగుచోఁ బూర్తిగా బ్రహ్మమేయైపోవలయును. లేనియెడల సంసారసాగరమునందే స్థిరముగా నుండవలెను. రెండుప్రక్కల నెంతదనుకఁ దిరిగి వేసారవలయును? ౧౦ అధ్యాత్మనిరూపణమును వినుచుండునపుడుమాత్రము జ్ఞానము ప్రబలమగుచుండును. (స్వయంబ్రహ్మమునందుఁ దదాకారమై పోవుదనుకగూడ జ్ఞానము విజృంభించును) నిరూపణ మాగిపోయినపిదప ఆజ్ఞానము నష్టమైపోవును. మఱల నాబ్రహ్మరూపునే (మనుష్యునే) కామక్రోధము లావరించుకొనుచున్నవి. ౧౧ ఇది యెక్కడిబ్రహ్మమగుట. ఈవిధముగా రెండుపక్షముల నుండి పడిపోతిమి. గార్హస్థ్యకాలమంతయు నిట్టి పెనఁగులాటయందే గడచిపోయెను. ౧౨ బ్రహ్మానందమును బడయుకాలమున గార్హస్థ్యకర్మములు వెనుకకు లాగుచుండును. గృహకర్మములను నెఱవేర్చెడిసమయమున బ్రహ్మమునందుఁ బ్రీతి యుప్పతిల్లుచుండును. ౧౩ ఈవిధముగా బ్రహ్మానందసుఖమును గార్హస్థ్యము గ్రహించుచున్నది. గార్హస్థ్యసుఖము బ్రహ్మజ్ఞానమువలనఁ దొలఁగిపోవుచున్నది. రెండును నసమగ్రములుగానే యున్నవి. ఒక్కటియును బూర్తి కాదు. ౧౪ ఈకారణమున నేను జంచలుఁడను దుశ్చిత్తుఁడనైపోతిని. ఏమిచేయుదును? ఇపుడు నాకేదియు నిశ్చితము గాకున్నది. ౧౫ సారాంశమేమన్న నేనఖండబ్రహ్మకారుఁడను గాకుంటిని సరిగదా! ఇటు గార్హస్థ్యమునందుఁగూడ విఘ్నము గలుగుచున్నది. కావున నిపుడెటు లుండవలెను? ౧౬ శ్రోతదెలిపిన యీసందేహమునకు వక్త చెప్పఁబోవు ప్రత్యుత్తరమును సావధానమనస్కులరై యాలింపుడు. ౧౭

వక్తతిరుగ నిటులఁ బ్రశ్నించుచున్నాఁడు. "ఓయీ! జ్ఞాని బ్రహ్మమై జడమువలెఁ గర్మము చేయకుండఁ బడియున్నచో మోక్షమునొందుననియా నీయభిప్రాయము? అట్లులైనచోఁ గర్మయోగులగు వ్యాసాదులు మునిఁగి పోయిరా? ౧౮ వక్తకు శ్రోత యిటుల విన్నవించుచున్నాఁడు. అయ్యా! కేవలము శుకుఁడు, వామదేవుఁడు ననునిరువురుమాత్రమే ముక్తినొందిన వారలని శ్రుతి నుడువుచున్నది. ౧౯ ఈయిరువురు జ్ఞానులనే ముక్తులని వేదము లంగీకరించినవి. అన్యులందఱును జ్ఞానులని వేదము వాకొనెను. ఇపుడీ వేదవచనమును అశ్రద్ధతో విడనాడుట యెట్లు? ౨౦ ఈవిధముగా శ్రోత వేదాధారముతోఁ బ్రత్యుత్తరమునొసంగెను మఱియు మిగులఁ బట్టుదలతో నిరువురే ముక్తులని సిద్ధాంతీకరించెను. ౨౧ ఇదివిని వక్త యిటులఁ జెప్పుచున్నాఁడు. ఒకవేళ సృష్టియంతటికిని సిద్ధులే ముక్తులుగలరని చెప్పఁబూనినచో నికఁ దక్కినవారలకు గతియేమియుండును. ౨౨ ఋషులు, మునులు, సిద్ధులు, యోగులు, ఆత్మజ్ఞానులు, సమాధానులు మున్నగువారు పలువురు ముక్తులైపోయిర. ౨౩

శ్లో॥ ప్రహ్లాదనారదపరాశరపుండరీక
వ్యాసాంబరీష శుకశౌనక భీష్మదాల్భ్యాన్
రుక్మాంగదార్జున వసిష్ఠవిభీషణాదీన్
పుణ్యానిమాన్ పరమభాగవతాన్ స్మరామి॥ ౧

శ్లో॥ కవిర్హరిరంతరిక్షః ప్రబుద్ధః పిప్పలాయనః
అవిర్హోత్రోథ ద్రుమిళశ్చమసః కరభాజనః॥ ౨

వీరలేగాక మహానుభావులగు బ్రహ్మవిష్ణుమహేశ్వరాదులును దేవర్షులును జనకాదిరాజర్షులునుగూడ ముక్తులైపోయిరి. ౨౪ ఒకవేళ శుకమహర్షి వామదేవుఁడుమాత్రమే ముక్తులయినచోఁ దక్కినవారలందఱును మునిఁగిపోయిరాయేమి? అవును మునిఁగిపోయిరనువేని యది మూర్ఖత్వమేయగును. ౨౫ ఇదివిని శ్రోత మరల నిటుల నడుగుచున్నాఁడు. అటులైనచో వేద మావిధముగా నేలనుడువును? మీరు వేదమును మిథ్యగావింపఁగలరా? ౨౬ వక్త ప్రత్యుత్తరము నొసంగుచున్నాఁడు. వేదములు నుడివినది పూర్వపక్షము. సిద్ధాంతముగాదు. మూర్ఖులగు జనులు దీనినేపట్టుకొని కూర్చుందురు. సాధువులు, విద్వాంసులు, నేర్పరులు నీవిషయము నంగీకరింపరు. ౨౭ వాదసౌఖ్యమునకు నెటులో నీవిషయము నంగీకరించినయెడల నిఁక వేదములకు సామర్థ్యమెక్కడ నున్నది? అంగీకరించినపక్షమున వేదమెవ్వరినేనియు నుద్ధరింపఁజాలదని సిద్ధాంతమగును. ౨౮ వేదములయందు సామర్థ్యములేనిచో వానినిఁక నెవ్వఁడు గొనుదురు? కావున నట్లెన్నటికిఁగాదు. వేదములయందు జనుల నుద్ధరించెడిసామర్థ్యము తప్పకయున్నది. ౨౯ వేదాధ్యయనము గావించు పురుషుఁడు మిగులఁ బుణ్యాత్ముఁడుగాఁ బరిగణింపఁబడుచున్నాఁడు. వేదములయందు సామర్థ్య మెక్కువగానున్నది. ౩౦ వేదశాస్త్రపురాణాదుల నాలకించుట భాగ్యవశముననే లభించుననియు వానినాలకించుటచే జనులు పవిత్రులగుచున్నారనియు సాధుజనులు చెప్పుదురు. ౩౧ వానిలో నొకశ్లోకమైనను శ్లోకార్ధమైనను కడకొకపాదమైనను గట్టకడ కొకశబ్దము నైనను వినినచో ననేకపాపములు నశించును. ౩౨ వ్యాసాదిమహర్షులు నుడివినయీయర్థముగల శ్లోకములు, వచనములు ననేకములు వేదశాస్త్రపురాణములలో నున్నవి. ౩౩ ప్రతిస్థలమునను వేదశాస్త్రముల మహిమ గానము చేయఁబడెను. వేదమునందేని, శాస్త్రమునందేని యొక్కయక్షరము విన్ననుగూడ మానవులు పవిత్రులగుదురు. ౩౪ కావున నొకవేళ శుకమహర్షి, వామదేవుఁడు దప్ప నితరులు ముక్తులుగానియెడల వేదశాస్త్రములకు మహత్త్వమెక్కడినుండిరాఁగలదు? ౩౫ వేదశాస్త్రపురాణములవలన మానవులనేకు లుద్ధరింపఁబడిరనువిషయము సిద్ధాంతమై యున్నది. ౩౬ ఒకవేళ నీవు "మొద్దువలె జడముగాఁ బడియుండువాఁడొక్కఁడే ముక్తుఁడుగా భావింపఁబడు"నని చెప్పినచో నదియుక్తమైనది గాదు. ఏలయన! నీవు ముక్తుఁడుగా నొప్పుకొనిన శుకమహర్షిగూడ స్వయముగా ననేకస్థలములలో నిరూపణమును (జ్ఞానోపదేశమును) గావించియున్నాఁడు. ౩౭ శుకుఁడు ముక్తుఁడని వేదములు చెప్పుచున్నయంశము సర్వవిధముల సత్యము. శుకదేవుఁడు అచేతనబ్రహ్మకారుఁడు గాఁడు. ౩౮ శుకదేవుఁడొకవేళ అచేతనబ్రహ్మకారుఁడే యైనచో మఱల నాతఁడెట్లు సారాసారవిచారము గావింపఁగలఁడు? ౩౯ నీవు నుడివినవిధముగా నైనచో బ్రహ్మకారుఁడు మొద్దువలె జడమై పడియుండును. శుకయోగీంద్రుఁడట్లు పడియుండక పరీక్షిన్మహారాజునకు భాగవతమును వినిపించెను.

౪౦ కథానిరూపణము గావింపవలయునన్నచో సారాసారావిచారము గావింపవలసివచ్చును. అటులే దృష్టాంతముఁగొఱకు సమస్తచరాచరసృష్టిని నన్వేషింపవలసివచ్చును. ౪౧ క్షణమాత్రముకొఱకు బ్రహ్మమే యైపో వలసివచ్చును. మఱియు క్షణమాత్రముననే సంపూర్ణదృశ్యసృష్టినంతయు శోధింపవలసివచ్చును. అటులే యనేకదృష్టాంతములనొసంగి వక్తృత్వసం పాదనము చేయవలసియుండును. ౪౨ శుకయోగీంద్రుఁడీవిధముగానే భాగవతాదులను నిరూపించి వినిపించెను. కావున దీనివలన శుకమహర్షిని మనము ఎప్పుడేని బద్ధుఁడని నుడువఁగలమా. ౪౩

కావున సద్గురూపదేశమునుబడసి సమస్తకర్మములనుగావించి (నిశ్చేష్టుఁడుగను మొద్దుగను బడియుండక) సాయుజ్యముక్తిని బొందవచ్చును. ౪౪ ఈ లోకము (సంసారము) నందు కొందఱు ముక్తులును కొందఱు నిత్యముక్తులును కొందఱుజీవన్ముక్తులును కొందఱుసమాధానులు కొందఱుయోగులు కొందఱువిదేహస్థముక్తులు నై యున్నారు. ౪౫ ఎవ్వరు సచేతనులో (జీవితావస్థయందే జ్ఞానసహాయమున ముక్తులైవ్యవహరించు) వారు జీవన్ముక్తులు. ఎవ్వరచేతనులో వారలువిదేహముక్తులని చెప్పఁబడుదురు. (అజగరమువలె దేహాభిమానమునుమఱచి జీవితావస్థయందే ముక్తులైపడియున్నవారు) ఈయుభయులకును వ్యతిరేకులగు యోగీశ్వరులను నిత్యముక్తులనుగా భావింపవలయును. ౪౬ స్వరూపబోధయగుట వలన గలిగెడు స్తబ్ధత్వమును (ఉదాసీనతను) తటస్థావస్థగా నెఱుంగవలయును. ఈతటస్థత్వ, స్తబ్ధత్వములయందు దేహసంబంధముతో లంగకయుండును * ౪౭ ముక్తికిఁ గారణము స్వానుభవము. మిగిలినదంతయు వ్యర్థము. తనయనుభవముతోడనే తృప్తుఁడు కావలయును. (వర్తనమును జూచి యెవరేని బద్ధుఁడని నుడువుచున్నను స్వానుభవతృప్తుఁడగు పురుషుఁడే సత్యమగు ముక్తుఁడు) ౪౮ కంఠపర్యంతము తృప్తిగా భుజించినపురుషుని నెవ్వఁడేని క్షుధాతురుఁడన్నమాత్రమున నాతఁడు క్షుధావ్యాకులుఁడు గానేరఁడు ౪౯ నిరాకారస్వరూపమునం దెప్పుడు దేహమే లేదో యప్పుడు సందేహమెక్కడనుండివచ్చును? బద్ధముక్తులభావన దేహమువఱకె యున్నది. ౫౦ దేహాభిమానము నుంచుకొన్నయెడల బ్రహ్మవిష్ణుమహేశులు సైతము ముక్తులు గాఁజాలరు. అట్టియెడ శుకునిముక్తిత్వ మెకలెక్కలోనిదా? ౫౧ ఏలయన, ముక్తిత్వభావనయే బద్ధత్వలక్షణము. కావున ముక్తబద్ధములు రెండును వ్యర్థములే. సత్స్వరూపమునందు ముక్తభావన లేదు. బద్ధభావనయును లేదు. అది స్వతస్సిద్ధమైనది ౫౨ గర్భమునకు శిలనంటఁగట్టుకొని నీటిలో నీఁద వీలుకానట్లు ముక్తత్వాభిమానమును బెట్టుకొని పరమాత్మునితోఁ గలసియుండఁజాలము ౫౩ "నేను" అనుభావమునుండి విడిపోయినవాఁడె ముక్తుఁడు. ఏలయన, అట్లు విడిపోయినపిమ్మట మూగవాఁడుగనున్నను మాటలాడుచున్నను ముక్తుఁడే. ౫౪ ఏసాధుస్వరూపుఁడు బంధింపఁబడఁడో యాతనిపట్ల ముక్తత్వమెక్కడనుండి వచ్చును? (ఎచ్చట బద్ధత్వముగలదో యచ్చటనే ముక్తత్వభావనగూడఁ గలదు) అచ్చట గుణవార్తలన్నియు వ్యర్థములు ౫౫

శ్లో॥ బద్ధోముక్తఇతివ్యాఖ్యాగుణతో మేనవస్తుతః
గుణస్యమాయా మూలత్వాన్నమే మోక్షోనబంధనమ్.

పరమశుద్ధతత్త్వజ్ఞానియైయున్నవానికి బద్ధముక్తులభేదమే లేదు. ముక్తబద్ధవిరోధము మాయాకారణములవలన నేర్పడుచున్నది. ౫౬ నామరూపములు నశించియుండుకావున ముక్తత్వము శేషించియుండఁజాలదు. అచ్చట ముక్తబద్ధత్వములు పూర్తిగా విస్మరణీయములై పోవును. ౫౭ బద్ధముక్తులు వాస్తవములో నెవ్వరు? ఆ (బద్ధముక్తులు) నేను అనునది లేనేలేదు. నేననుభావము అవశ్యముగా నందఱను గట్టివేయుచున్నది. నేననుభావమును ధారణముచేయువారలను అది బంధనమునందుఁ ద్రోయుచున్నది. (దేహాభిమానముగలవానినే ముక్తుఁడనుకొమ్ము లేక బద్ధుఁడనుకొమ్ము నేననుభావమును విడచినవాఁడు బద్ధుఁడును ముక్తుఁడునుగాఁడు) ౫౮ ఈవిధముగా నిదియంతయు భ్రమయై [illegible] యాతీతమగు విశ్రాంతి లభింపనంతవరకు నీయహంత [illegible]

* స్వరూపబోధమైనపిమ్మట నిశ్చేష్టుఁడై పడియుండుట ముక్తునిలక్షణమనియు, గదలుట మెదలుట బద్ధునిలక్షణమనియు శిష్యునిమతము. దీనికి గురువిట్లు చెప్పుచున్నాఁడు. "కదలక మెదలక స్తబ్ధుఁడుగను తటస్థుఁడుగనుండుట దేహకారణముననై [illegible] దేహబుద్ధిగలవాఁడు ముక్తుఁడు గాఁజాలఁడు, నేనుముక్తుఁడనని నుడువువాఁడే [illegible] బద్ధుఁడు.

వుని వెంటనంటియే యుండును ౧౯ ఇప్పుడు బద్ధముక్తతలు కల్పనామాత్ర మునఁ గలుగుచున్నవి. ఇట్టిస్థితియందా కల్పనముమాత్రము సత్యమా? (అదియును సత్యముగాదు) ౨౦ కావున నిదియంతయును మృగతృష్ణ మాయాకారణమువలననే నీ యసత్యమేఘాడంబరము విజృంభించెను. జ్ఞానము బాగ కూకత కలిగినమీఁదట నీమాయాస్వప్న మంతయును వెంటనే మిథ్యయైపోవును. ౨౧ ఈస్వప్నస్వరూపమగు సంసా రమునందు "నేనుబద్ధుఁడను నేనుముక్తుఁడను" అని తలంచువాఁడు నిశ్చ యమునకు మోక్షము లేదనియే గ్రహింపవలయును. ఇందువలననే వానికి, ఎవరు? ఎట్లు? ఏమయ్యెను? అనునవి తెలియకున్నవి, ౨౨ కావున నాత్మజ్ఞానము కలిగినవారలందఱును ముక్తులే. శుద్ధజ్ఞానము గలిగినపిమ్మట ముక్తత్వభావన సమూలముగా నష్టమై పోవును. ౨౩ బద్ధత్వముక్తత్వభావనలు దేహబుద్ధిని వెంబడించియుండును గాని సాధుజనులు దేహాతీతులుగావున వారలపట్ల బద్ధముక్తభావనలే యుండవు ౨౪ సాధనము నెట్లు చేయవలయునో ముందు దెలుపుదును. శ్రోతలు సావధానులై వినుండు ౨౫

ఏడవ సమాసము

సాధననిశ్చయము

వస్తువును గల్పనము చేయవలయునన్నచో నది యెట్లుసాధ్యము గును? ఏలయన! స్వాభావికముగా నది నిర్వికల్పముగదా! అచ్చట కల్పనము నామముతోఁబాటు శూన్యాకారముగానున్నది ౧ ఎటులైనను గల్పనము జేయవలయునన్నచో నది సాధ్యముగాదు. గురుతేదొరుకదు. చిత్తమునకు భ్రమకలుగును ౨ దృష్టికేమియుఁ గన్పింపదు. మఱియు మనస్సునకేమియును భాసింపదు. భాసింపని, కనుపింపనివస్తువును గురు తించుటయెట్లు? ౩ మనము నిరాకారమును జూడఁదలంచితిమేని మనస్సు శూన్యాకారమునందుఁ బడిపోవును. లేదా కల్పనము జేయుదుమంటిమేని యంధకారము నిండియున్నటులఁ దోఁచును. ౪ కల్పనముజేయుటవలన బ్రహ్మము నల్లగానున్నటుల స్ఫురించును. కాని యదినల్లనిదిగాని, పచ్చ నిదిగానిగాదు. అది యెఱుపు, నీలము, తెలుపుగూడఁగాదు. వర్ణరహితము

౫ వర్ణరూపములేనిదియు భాసమునుండి వేఱుగనున్నదియు ఇంద్రియ ములకగోచరముగనున్నదియు నగు నావస్తువును గురుతింప నవకాశ మెట్లుచిక్కును? ౬ కాన్పింపనిదాని నెంతవఱకు గురుతింపఁగలము? దీని వలన వ్యర్థముగా శ్రమవృద్ధియగును. ౭ (పరబ్రహ్మము) అది నిర్గుణము లేక గుణాతీతము. అది యదృశ్యము లేక అవ్యక్తము. ఆపరమపురుషత త్త్వము అచింత్యము. లేక చింతనాతీతము నైయున్నది ౮

శ్లో॥ అచింత్యావ్యక్తరూపాయ నిర్గుణాయగుణాత్మనే
సమస్తజగదాధారమూర్తయే బ్రహ్మణేనమః॥

అచింత్యమునుగూర్చి గావించుచింతనము, అవ్యక్తమునుగూర్చి యొనరించు ధ్యానస్మరణము, నిర్గుణము గురితించుట అనునివి యెట్లుసా ధ్యమగును? ౯ నిర్గుణము కనులకుఁ గాన్పింపదు. మనస్సునకు గోచరిం పదు. దాని నెటులఁజూడఁగల్గుదుము? ౧౦ అసంగముతో సంగముగా వించుటయు నిరావలంబనమునందు (నిరాధారముగ నాకాశమున) వసిం చుటయు నిశ్శబ్దమును బ్రతిపాదించుటయు నెట్లుజరుగును? ౧౧ అచింత్య మును జింతించుటవలనను నిర్వికల్పనమును గల్పనముచేయుట వలనను అద్వైతమును ధ్యానించుటవలనను ద్వైతమే విజృంభించును ౧౨ ఒకవేళ ధ్యానమునే విడిచిపెట్టినను అనుసంధానమునుగూడఁ బెట్టుకొనకపోయి నను సాధకుఁడు సంశయములపాలు గావలసివచ్చును ౧౩ ద్వైతభయము వలన నొకవేళ వస్తువిచారమునే జేయకున్నచో, హృదయమునకుఁ గొంచెమేని శాంతిలభింపఁజాలదు ౧౪ అభ్యాసముచేయుటవలన వస్తు నలవాటగును. అభ్యాసమువలన వస్తుప్రాప్తియగును. నిత్యానిత్యవిచార మువలన సమాధానము గలుగును ౧౫ వస్తువును జింతించుటవలన ద్వైత ముప్పొంగును. దానిని వదలివేయుదుమేని యేమియును గోచరింపదు. ఇటులే వివేకములేని యెడల శూన్యత్వసందేహములయందుఁ బడిపోవు దుము. ౧౬

కావున మానవుఁడు ముఖ్యముగా వివేకధారణము గావింపవల యును. జ్ఞానసహాయమునఁ బ్రపంచమునుండి తప్పించుకొనవలయును. అహంభావమును దొలంగఁద్రోయవలయును. కాని యెంత యత్నించి నను అహంభావముమాత్రము దూరముగాదు. ౧౭ పరబ్రహ్మ మద్వై

తము. దానిని గల్పించుటతోడనే ద్వైతము వృద్ధియగుచున్నది. అచ్చట హేతువులు దృష్టాంతములు గొంచెమేని సాగవు. ౧౭ పరబ్రహ్మమును స్మరియించునపుడు సాధకుఁడు స్మరణమును మఱచిపోవలయును. విస్మరణుఁడైన పిమ్మటగూడ దానిని స్మరించుచుండవలయును. ఆపరబ్రహ్మము నెఱింగి యెఱుకను మఱచి పోవలయును. ౧౮ దానితోఁ (పరబ్రహ్మముతోఁ) గలయిక కలుగకయే కలయిక సమకూరును. కలియఁబోయినచో అంతరాయము కలుగును. ఈ మూకావస్థ మిగుల నద్భుతముగానున్నది. ౨౦ పరబ్రహ్మము సాధింపఁదలంచినచో సాధ్యముగాదు. విడిచినచో విడిపోవదు. దానితోఁ గల్గియున్న నిరంతరసంబంధ మేవిధముగానైనఁ దెగిపోవనేరదు. ౨౧ అది యెల్లప్పుడును గుదిరిక గల్గియుండును. చూచినచోఁ గనఁబడక దాఁగికొనును. చూడకపోయినచో ఇక్కడనక్కడఁ (సర్వత్ర) బ్రకాశించుచుండును ౨౨ దానిపట్ల అపాయములే ఆపాయములు (విఘ్నములు). కాని యపాయమే ఉపాయము. ఇది యనుభవములేనిది యెట్లు బోధింప ననువగును? ౨౩ పరబ్రహ్మము తెలిసికొనయత్నింపకున్నను దెలియవచ్చును. తెలిసిన పిమ్మటఁగూడ నేమియును దెలియఁబడదు. ఆ నివృత్తిపదమును బ్రాప్తింపవలయు నన్నచో వృత్తిని విడువవలయును. ౨౪ అది ధ్యానములోనికి రాఁజాలదేని చింతన మెట్లుచేయవలయును? ఆపరబ్రహ్మము హృదయమునకు నంటదు. ౨౫ దానికి జలోపమానము నొసంగుటయెట్లు? పరబ్రహ్మము నిర్మలమును నిశ్చలమును గలది. విశ్వమంతయు నందు (పరబ్రహ్మమునందు) మునిఁగి యున్నది. కాని యది జగమున కలిప్తముగనే యున్నది. ౨౬ అది (పరబ్రహ్మము) ప్రకాశముగాఁగాని యంధకారముతో సమానముగాఁగాని లేదు. ఇఁక దానితో నుపమింపఁదగిన దేమున్నది. ౨౭ ఆబ్రహ్మము సర్వవిధముల నిరంజనముగా నున్నది. ఎప్పుడును గాన్పింపదు. ఇట్టి పరిస్థితులలో దీని ననుసంధానము జేయుట యెట్లు సాధ్యమగును! ౨౮ జాడదీసినచో నేమియును గోచరింపదు. హృదయము సందేహములలోఁ బడిపోవును. ౨౯ ఇట్టిదశయందు హృదయము భీతినొంది సత్యస్వరూపము నభావముగా భావించును. (నాస్తికమైపోవును) దాని నెట్లు చూడఁగలుగుదుము! చూచుట కెప్పటికిఁ బోవుదము. అదిలేనేలేదని నుడువు

దురు. ౩౦ వాస్తవమున కది యభావముగనే యున్నచో వేదశాస్త్రములు చెప్పినదంతయు మిథ్యయేనా యను ప్రశ్న ముదయించును. కాని వ్యాసాదిమహర్షుల వచనములు మిథ్యయెటులఁ గాగలవు? ౩౧ కావున వేదశాస్త్రములు మిథ్యయని నుడువఁజాలము. జ్ఞానులు, మహర్షులు తెలిపినజ్ఞానసాధనము లెప్పటికిని మిథ్యకాఁజాలవు. ౩౨ స్వయముగా మహాదేవుఁడుగురుగీతములయందుఁ బార్వతికి అద్వైతజ్ఞానము నుపదేశించినాఁడు. ౩౩ అవధూతగూడఁ దనయవధూతగీతలయందు గోరక్షమునికిఁ దెలుపు భాగమునఁగూడ జ్ఞానమార్గమునే చెప్పియున్నాఁడు. ౩౪ స్వయముగా శ్రీమహావిష్ణువు రాజహంసరూపము ధరించి బ్రహ్మకుపదేశించిన విజ్ఞానమంతయును హంసగీతయను పేరటఁ బ్రసిద్ధి నొందియున్నది. ౩౫ బ్రహ్మ నారదునకుఁ జతుశ్శ్లోకములుగల భాగవతము నుపదేశించెను. దానినే తరువాత వ్యాసుఁడు మిగుల విస్తరముగా రచించెను, ౩౬ వసిష్ఠమహాముని యోగవాసిష్ఠమునందు శ్రీరామచంద్రమూర్తికి వసిష్ఠసారము నుపదేశించెను. మఱియు శ్రీకృష్ణభగవానుఁడు అర్జునునకు సప్తశ్లోకములుగల గీతను దెలిపెను. ౩౭ ఈవిధముగా నెంతదనుకఁ జెప్పుదును, మహర్షులనేకులు జనసముదాయమునకు జ్ఞానోపదేశము గావించిరి. సారాంశమేమన, అద్వైతజ్ఞానము సత్యము. ౩౮ కావున ఆత్మజ్ఞానమును మిథ్యయని నుడివినచో అధోగతి లభించును. ప్రజ్ఞారహితులగు నజ్ఞానులకీయంశము తెలియఁబడదు. ౩౯ పరబ్రహ్మస్వరూపస్థితిని వివరించుటలో ఆదిశేషుని ప్రజ్ఞ మందగించెను. శ్రుతులుగూడ మౌనము దాల్చెను. జ్ఞానాభిమానమును బెట్టుకొని నేనేమి చెప్పఁగల్గుదును. ౪౦ మనకుఁ జక్కఁగ బోధకాని యంశమును మిథ్యయని యెన్నఁటికిని సాహసించి నుడువఁగూడదు. దానిని సద్గురుని సన్నిధి కేగి దృఢభావముతో నభ్యసింపవలయును. ౪౧

మిథ్యావిషయము సత్యముగాఁ గాన్పించును, సత్యవిషయము మిథ్యగా గోచరించును. ఇటులే మనస్సు ఆకస్మికముగా సందేహసాగరమునందు మునిఁగిపోవుచుండును. ౪౨ మనస్సునకుఁ గల్పనము చేయుచుండు అలవాటు గలదు. కాని మనస్సు కల్పనముచేయునది బ్రహ్మముకాదు. ఈకారణమున "నేను" అనుమార్గముననే సందేహము పరుగులిడును. ౪౩

అందువలన మొట్టమొదట "నేను" అనుభావముతోఁగూడిన మార్గమును విడిచి పరమాత్మునిఁ గలసికొనవలెను. సాధుసాంగత్యమువలన సందేహములను సమూలముగాఁ దొలఁగించుకొనవలెను. ౪౪ "నేను" అనునది శస్త్రముచేఁ దెగదు. పగులఁగొట్టినచోఁ బగులదు. ఏమైనను జేయుము. విడచివేయదలంచినను అది విడిపోఁజాలదు. ౪౫ "నేను" అనుదానివలన వస్తువు బోధపడదు. భక్తి జారిపోవును. వైరాగ్యశక్తియంతయు వ్యర్థమై పోవును. ౪౬ "నేను" అనుదానివలనఁ బ్రపంచము కుదురదు. పరమార్థము మునిఁగిపోవును. యశము, కీర్తి, ప్రతాపము మున్నగున వన్నియు నశించును. ౪౭ దానివలన మైత్రి విడిపోవును. ప్రీతి క్షీణించును. అభిమానము వృద్ధియగును. ౪౮ నేననుభావము (అహంభావము) వలన వికల్పము తలయెత్తును. కలహ మంకురించును. ఏకత్వప్రేమ చెడిపోవును. ౪౯ ఈయహంభావ మెవ్వనికిని రుచియింపదు. ఈస్థితిలో నా పరమాత్మున కెటుల రుచించును? కావున అహంకారమును విడిచియుండువాఁడే సమాధాని, ౫౦ అహంభావము నెట్లు విడువవలయునో? బ్రహ్మానుభవము నెట్లు గావింపవలయునో? శాంతి నెట్లు బడయవలెనో? తెలిపెదను ౫౧ వివేకము వలన అహంభావమును గుర్తించి వదలివేయవలెను. బ్రహ్మమై బ్రహ్మానుభవమును గడింపవలయును. నిస్సంగుఁడై సమాధానమును బడయవలెను ౫౨ అహంభావమును విడిచి సాధనము జేయుట యెఱింగిన శాంతుఁడే ధన్యుఁడు ౫౩ నేను బ్రహ్మమునైతిని. ఇఁక సాధనము చేయునదెవ్వఁడు అనునీవిషయమును గల్పనముగావించుకొనుటచేఁ గల్పనము మఱింత వృద్ధియగును ౫౪ బ్రహ్మమువిషయమునఁ గల్పనమున కవకాశము లేదు. అది యక్కడ నిలచియుండును. దానినెవ్వఁ డన్వేషించిచూచునో వాఁడే సాధువు. ౫౫ నిర్వికల్పనమును గల్పనచేయవలయును. కాని తానుస్వయముగాఁ గల్పకుఁడుగాఁ గూడదు. (దేనినిగల్పనముజేయుచున్నారమో దానికంటె మనము వేఱుఅనుకల్పనముండరాదు) ౫౬ కావున నేమియునుగాకుండ నుండవలయును. ఇవి యన్నియును బ్రహ్మవిద్యనుగూర్చిన బంధనములు. దక్షుఁడును సమాధానియు నగువాఁడుమాత్రమే యీయంశమును గ్రహింపఁగల్గును ౫౭ "మనము దేనిని కల్పించుచున్నారమో అదియైయుంటిమి" అని తెలిసి

కొనినపిదప "కల్పనము" అను పేరునుండి శూన్యులమైయుందుము. ౫౮ సాధకుఁడు తనపదవిలోఁ జలింపక స్థిరముగానుండి సాధనమును, ఉపాయమును, సాధింపవలయును. అప్పుడే అలిప్తతామార్గము లభించును ౫౯ రాజు తనరాచగద్దియమీఁదనే కూర్చుండియుండును. సమస్తప్రభుత్వము తనంతనదియే (అధికారకిరణములచే) నడచుచుండును. అటులే మానవుఁడు సాధ్యుఁడై యుండియును సాధనము గావింపవలయును ౬౦ అప్పుడు సాధనము దేహమధ్యమునకు వచ్చును. స్వయముగా మనము ఎప్పటికిని దేహముకాము. ఈప్రకారముగాఁ జేసితిమేని కర్తలమయ్యును సులభముగా అకర్తలము గావచ్చును ౬౧ "మేము దేహులము" అను కల్పనము గావింపఁగల్గినప్పుడే సాధనము తొలంగఁగల్గును. (దేహాభిమానము లేనిది సాధనత్యాగము సాధ్యముగాదు) కావున సాధనత్యాగముచే దేహాభిమానదోష మంటును. మనము స్వభావముగనే దేహాతీతులమైనప్పుడు దేహ మెక్కడినుండివచ్చినది? ౬౨ దానిని దేహమనియును జెప్పఁజాలము. సాధనమనియును జెప్పఁజాలము. మనము స్వయముగా నిస్సందేహులము. దేహముండినను నిదియే విదేహస్థితి ౬౩ సాధనముచేయకయే బ్రహ్మమునైతినని తలంచినచో నంతమాత్రమున దేహమమత్వము తొలంగిపోదు. బ్రహ్మజ్ఞానగ్రాహ్యలోకమువలన (తప్పుభావమువలన=పొరపాటున) అలసత్వము వృద్ధినొందును ౬౪ పరమార్థలోపమువలన స్వార్థము వృద్ధిగాంచును. ధ్యానమునుమిషతో నిద్రాదేవివచ్చి యావరించుకొనును. ముక్తిలోపమువలన స్వచ్ఛందతాపాపము లభించును ౬౫ నిరూపణలోపమువలన నిందగల్గును. సంవాదలోపములచే వివాదములు పెచ్చరిల్లును. ఉపాధిమిషచే శరీరమునందు అభిమానము ప్రవేశించును ౬౬ అటులే బ్రహ్మజ్ఞానలోపమువలన అలసత పట్టువడును. ఆసమయమున మానవుఁడు సాధనోన్మాదమునఁ బడి "యేమిచేయవలయును" అని నుడువును ౬౭

శ్లో॥ కింకరోమి క్వగచ్ఛామికిం గృహ్ణామి త్యజామి కిం
ఆత్మనాపూరితం సర్వం మహాకల్పాంబునాయథా॥

అవివేకి, అలసత్వకారణమున బ్రహ్మముయొక్కపూర్ణస్థితిని దనపై నిడుకొని స్వయముగాఁ దనచేతులతోడనే తనపాదములమీఁద గొడ్డలిదెబ్బను

గొట్టుకొనుచున్నాఁడు ౬౮ ఇటులే ఉపాయమునకుబదులుగా అపాయమును గలుగజేసికొని కూర్చున్నాఁడు. సత్యమగుహితము నుండి వంచితుఁడగుచున్నాఁడు. మఱియు ముక్తత్వమిషతో నింకను బద్ధుఁడై పోవుచున్నాఁడు. ౬౯ ఇట్టియవివేకులు సాధనము చేసినంతన మాసిద్ధత్వమంతయుఁ గూలిపోవునని తలంతురు. ఈకారణమున సాధనము చేయుటయన్న వారికి రుచింపదు. ౭౦ మనుష్యులనుగూడ జనులు సాధకులని యెక్కడ అనిపోదురోయను బిడియమొక్కటియే వారిని బాధించుచుండును. పాపము, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది దేవతలుగూడ సాధనము జేయుచుండిరనుసంగతి వారికిఁ దెలియనే తెలియదుగదా ౭౧

ఇఁక నీ యవిద్యావిషయికవార్తలను గట్టిపెట్టుదము. విద్య అభ్యాసశాలినియైయున్నది. ఎంతయభ్యసించిన నంత ప్రాప్తించును) అభ్యాసమువలన ఆద్యమగు పూర్ణ బ్రహ్మము లభించును ౭౨ ఇదియంతయు నాలించి శ్రోత "ఏయభ్యాసము చేయవలయును? పరమార్థసాధనము లెవ్వి?" యనియడిగెను ౭౩ వక్త యిటులఁ జెప్పుచున్నాఁడు. ఓయీ! ప్రశ్నములకు సమాధానమును ముందుసమాసములో వివరించినాఁడను. అందే పరమార్థసాధనములనుగూడఁ జెప్పితిని ౭౪

ఎనిమిదవసమాసము

శ్రవణమహిమ.

పరమార్థమునకు ముఖ్యసమాధానకారణమగు సాధనము శ్రవణము. ౧ శ్రవణమువలన భక్తిలభించును. విరక్తిఉత్పన్నమగును. మఱియు విషయాసక్తి తెగిపోవును ౨ శ్రవణమువలనఁ జిత్తశుద్ధి యగును. బుద్ధి దృఢమగును. అభిమానోపాధి తొలంగును. ౩ శ్రవణమువలన నిశ్చయము కలుగును. మమత్వము తెగిపోవును. అంతఃకరణమునందు సమాధానము జనించును. ౪ శ్రవణమువలన సందేహములు విడిపోవును. శంకలంతరించును సద్గుణములు గలుగును ౫ శ్రవణమువలన మనోనిగ్రహముసిద్ధించును. సమాధానము చేకూరును. దేహబుద్ధితోఁగూడిన బంధనములు తొలంగును ౬ "నేను" అనుభావము దూరమగును. సందేహము దరికిరాదు. బహువిధవిఘ్నములు పటాపంచలగును ౭ కార్యసిద్ధియగును. సమాధి

యేర్పడును. మరియుఁ బూర్ణమగుపరమశాంతి లభించును. ౮ సాధుసమాగమముగావించి అధ్యాత్మశ్రవణ మొనరించుటచే వృత్తిదానియందు లీనమగును ౯ శ్రవణమువలనఁ బ్రబోధము వృద్ధియగును. ప్రజ్ఞ ప్రబలమగును. విషయపాశములు తెగిపోవును ౧౦ వివేకము వచ్చును. జ్ఞానము వృద్ధినొంది బలము సమకూరును. దానివలన సాధకునకు వస్తుజ్ఞానము కలుగును ౧౧ దుస్సాంగత్యము విడిపోవును. కామవాసనలు క్షీణించును. ధైర్యము ప్రకాశించును. నిశ్చయాత్మికమగు సద్వస్తువు భాసమగును ౧౨ శ్రవణమువలన సద్బుద్ధి కలుగును. వివేకమతిశయించును. మనస్సు భగవంతునియందు నాటుకొనును. ౧౩ మోహము నశించును. భవభయము నాశనమగును. ౧౪ ఉత్తమగతి గలుగును. శాంతి లభించును. నివృత్తియు అచలపదమును బ్రాప్తమగును. ౧౫ శ్రవణమునకు సమానమగు నుత్తమసాధన మెద్దియును లేదు. దానివలన నన్నియును సమకూరును. భవనది తరించుటకు శ్రవణము నౌకసుమా ౧౬.

శ్రవణము భజనకుఁ బ్రారంభము. అన్నివిషయములు శ్రవణములును ఆరంభమగుటయుఁ బూర్ణమగుటయుఁ గలదు ౧౭ ప్రవృత్తిమార్గముగాని నివృత్తిమార్గముగాని శ్రవణము లేకున్నఁ బ్రాప్తింపదు. ఈ సంగతిఁ బ్రత్యక్షముగా నందఱు నెఱింగినదే ౧౮ "విననియెడల నెఱుక గలుగదు" అను నీయంశముగూడ నెల్లరకును జక్కఁగఁ దెలిసియేయున్నది. కావున శ్రవణమె సాధకునకు ముఖ్యప్రయత్నము ౧౯ ఎప్పుడును వినియుండని విషయము హృదయమునకు నిశ్చయముగా నెన్నఁటికిని బోధగాదు. కావున శ్రవణమునకు సమానమగుసాధన మింకొకటి యెక్కడను లేదు. దీనిని విడిచిపెట్టినయెడల నేపనియు జరుగఁజాలదు ౨౦, ౨౧ సూర్యుఁ డదృశ్యుఁడుగానున్నప్పు డంధకార మన్నిస్థలములందును వ్యాపించును. శ్రవణము లేనియెడల నిటులే యజ్ఞానము గలుగును. ౨౨ నవవిధభక్తి, చతుర్విధ ముక్తి, సహజస్థితి మున్నగువానియందు జ్ఞానము శ్రవణము లేకున్నచోఁ గలుగఁజాలదు. ౨౩ విధియుక్తమగు షట్కర్మాచరణము, పురశ్చరణము, ఉపాసనము చేయవలసినవిధము శ్రవణము లేకున్నచో ద్యోతకముగాదు ౨౪ నానావిధములగు వ్రతములు, దాన

ములు, తపస్సు, సాధనములు, యోగములు, తీర్థాటనము, శ్రవణము
లేకున్నచో నెఱుంగఁబడవు ౨౫ అనేకవిధములుగా నున్న విద్యలు, పిండ
జ్ఞానము, బహువిధతత్త్వశోధనము, నానాకళలు, బ్రహ్మజ్ఞానము, శ్రవ
ణము లేకున్న సమకూరనేరవు ౨౬ అనంతములగు వనస్పతు లొక్క జల
ముతోడనే వృద్ధియగుచున్నవి. సంపూర్ణజీవసమూహము ఒకపృథివి ఒక
సూర్యుఁడు ఒకవాయువుపై నాధారపడియున్నవి. సమస్తజీవులకుఁ జుట్టు
ప్రక్కల నాకాశమొక్కటియే యావరించుకొని యున్నది. సంపూర్ణ
జీవాత్మ లొక్క పరబ్రహ్మమునందే నివసించుచున్నవి. అటులె ప్రాణి
మాత్రులందఱకును శ్రవణము ముఖ్యసాధనము. అదియె సమస్తప్రాణు
లకుఁ దరింపఁదగిన యవలంబనము ౨౭-౩౦ భూమండలమునఁగల మత
ములకును భాషలకును దేశములకును లెక్కయే లేదు. వానికన్నిఁటికిని
శ్రవణము విడిచినచో నింక రెండవసాధనమే లేదు ౩౧ శ్రవణమువలన
మానవున కుపరతి (నిలుకడ) గలుగును. జనులు బద్ధదశనుండి ముముక్షు
లయ్యెదరు. మఱియు ముముక్షుదశనుండిసాధకులై మిగుల నియమముతో
సాధనము జేయుదురు ౩౨ శ్రవణమువలన బోధము (జ్ఞానము) ప్రాప్త
మగును. చాలును. ఇఁకఁ గావలసినదేమున్నది ? అట్టి సాధకులే
సిద్ధులై పోవుదురు. ౩౩ శ్రవణమువలనఁ గలుగు తాత్కాలిక సుగు
ణము వినుఁడు. మహాదుష్టులు, చండాలురు (హింసకులు) సైతము పుణ్య
శీలు రగుదురు. ౩౪ దుర్బుద్ధియు దురాత్ముఁడగువాఁడుగూడ శ్రవణ
యోగమువలనఁ బుణ్యాత్ముఁడగును. శ్రవణమహిమ అగాధమైనది. దాని
మహత్త్వము వర్ణింపఁ జాలను. ౩౫ పుణ్యతీర్థముల వ్రతముల ఫల
ములు ముందుముందు లభించునని చెప్పుదురు. కాని శ్రవణస్థితి యట్టిది
కాదు. దాని ఫలమంతయును దత్కాలముననే (అప్పుడే) లభించును. ౩౬
రోగములు, వ్యాధులు ఔషధములవలన నప్పటి కప్పుడే నశించును.
అటులే శ్రవణమువలన నంతఃకరణముకూడ శీఘ్రముగాఁ బరిశుద్ధమగును.
౩౭ వినినవిషయము అర్థయుక్తముగా నెప్పుడు తెలియునో యప్పుడు
మానవునకుఁ దనంతన భాగ్యశ్రీ సమకూరును. మఱియు ముఖ్యపరమాత్మ
స్వానుభవములోని కేతెంచును. ౩౮

ఇది మననఫలము. శ్రవణసమయమున అర్థము గ్రహించుట
యందు హృదయము లగ్నము కావలయును. తత్క్షణమే నిది ధ్యాస
మేర్పడును. ఆపిమ్మట పరమశాంతి లభించును. ౩౯ చెప్పిడి దానికంత
కును అర్థముకూడఁ దెలియునప్పుడే సమాధానము లభించును. అప్పుడే
సందేహములు తొలంగిపోవును. ౪౦ ఈసందేహమే జన్మమునకు మూ
లము. శ్రవణమువలన నిది సమూలముగ నష్టమైపోవును. తరువాత సుల
భముగా సత్యసమాధానము (పరమశాంతి) లభించును. ౪౧ శ్రవణమన
నములను గావింపనివానికి సమాధాన మెట్లుప్రాప్తింపఁగలదు? వాని పాద
ములకు ముక్తత్వాభిమాన శృంఖలములు గాటముగఁ దగుల్కొని యుం
డును. ౪౨ ముముక్షు, సాధకుఁడు, సిద్ధుఁడు మున్నగువా రెవరైనను
శ్రవణము గావింపవలయును. శ్రవణము గావింపరేని వారలందఱును
అవ్యవస్థితు లగుదురు. ఏలయన? శ్రవణమననములవలనఁ జిత్తవృత్తి శుద్ధ
మగును. ౪౩ నిత్యనియమముగా శ్రవణసాధనము జరుగని తావున నొక
క్షణమాత్రమేని సాధకు లుండఁగూడదు. ౪౪ శ్రవణసాధనమును గావిం
పనివాఁడు పరమార్థము నెన్నఁటికినిఁ బడయఁజాలఁడు. శ్రవణసాధనము
లేనియెడల మానవుఁడు పూర్వజన్మమునఁ జేసినసత్కర్మములన్నియువ్యర్థ
మగును. ౪౫ కావున శ్రవణము జేయవలయును. ఈ సాధనమునందు
హృదయముంచవలయును. మఱియు నిత్యనియమములను పాలనము
జేయుచు సంసారసాగరమునుండి దాటిపోవలయును. ౪౬ మనము ఆఁకలి
యగునప్పుడెల్ల ఒకేవిధమగు నన్నమును, ఒకేవిధమగు జలమును దేవ
తేపకుఁ గైకొనుచున్నారము. అటులే శ్రవణమును మననమునుకూడఁ
దేపతేపకుఁ గావించుచుండవలయును. ౪౭ సోమరితనముచే శ్రవణమునెడ
ననాదరము జూపుమానవుఁడు స్వహితమునకు హానిగావించుకొన్నవాఁ
డగును. ౪౮ సోమరితనము నభివృద్ధిగావించుకొనుటయన్న పరమార్థ
మును భగ్నము గావించుటయని గ్రహింపనగును. ఈ హేతువువలన
నిరంతరము శ్రవణముగావింపవలెను. ౪౯ రాఁబోవు సమాసమునందు
శ్రవణమునకుఁగల నియమములను, శ్రవణయోగ్యగ్రంథములును కూర్చి
తెలుపుదును. ౫౦

తొమ్మిదవ సమాసము

శ్రవణనిశ్చయము

శ్రవణము నేవిధముగాఁ జేయవలయునో వివరించెదను. శ్రోతలారా సావధానమతితో నాలకింపుఁడు ౧ ఒకానొకని వక్తృత్వము వినుటవలన నంతకుమున్ను కొంచెముగనో గొప్పగనో లభించిన శాంతి ఆకస్మికముగా భంగమగును. మఱియు నిశ్చయముగూడ విసిపోవును ౨ ఇట్టివాయికము నిశ్చయశూన్యము, నగు వక్తృత్వమును అవశ్యముగాఁ ద్యజింపవలయును ౩ ఒకగ్రంథము విన్నపిమ్మట కొంచెమెద్దిమో నిశ్చయము ప్రాప్తించెను తరువాత వినిన రెండవగ్రంథమువలన ఆనిశ్చయ మెగిరిపోయినది. ఇటులే జరుగుచున్నయెడల బ్రదికినంతకాలము సంశయము వృద్ధియగుచునే యుండును ౫ కావున సంశయవిచ్ఛేదకములు, శంకానివృత్తికారకములు అద్వైతబోధకములు, పరమార్థప్రదములు నగుగ్రంథమునే శ్రవణము గావింపవలయును ౬ సంసారమునం దాసక్తినిఁ దొలగించుకొనినయాతఁడు మోక్షసాధనముల నొనరించునాతఁడు అద్వైతశాస్త్రమునందు వివేకము గడింపవలయును. ౭ అద్వైతప్రియుఁడగు శ్రోతకు ద్వైతనిరూపణము ను వినిపించినయెడల వానిచిత్తము క్షుబ్ధమగును. ౮ అట్లుగాక మనోభావానుసారముగా నిరూపణము గావించినయెడల శ్రోత కత్యానందము గలుగును. అన్యమార్గము లవలంబించినయెడల శ్రోత హృదయము ముకుళించిపోవును. ౯ ఎవ్వనికెవ్వనికెయ్యది యుపాసనమొ తొలుత నెఱింగి తదనుకూలముగా నిరూపణము గావించినయెడల వానికిఁ బ్రీతికలుగును. దీనికిఁ బ్రతికూలములుగానుండు అన్యనిరూపణములు శ్రోతకుఁ బ్రశస్తములుగాఁ దోఁచవు ౧౦ నీరు పల్లమునకుఁ దనంతనపోవునట్లు ప్రీతికూడ హృదయమునుండి యనాయాసముగాఁ దనకుఁ బ్రియకరములగు విషయములవైపునకు నడచిపోవును. ఇది ప్రీతిలక్షణము ౧౧ సారాసారవిచారముగలగ్రంథములే ఆత్మజ్ఞానముగల పురుషునకు రుచికరములగును. ఇతరవిషయములుగల గ్రంథములు వానికి రుచింపవు ౧౨ భగవతియగు పార్వతిని కులదేవతగాఁ గొలుచువానికి సప్తశతి (దుర్గాస్తోత్రగ్రంథమె) కావలయును. అన్యదేవతాస్తుతిగ్రంథము లతనికి సర్వవిధముల నిరుపయోగములుగా నుండును ౧౩ అనంతవ్రతము జేయువానికి (సకామపురుషునకు) భగవద్గీత (నిష్కామగ్రంథము)తోఁ బనియుండదు. అటులే సాధువులకు సన్న్యాసులకు ఫలాశానిరూపణగ్రంథములు రుచింపవు ౧౪ వీరకంకణమును ముక్కునకుఁ దగిలించుకొన్నయెడల నెంతశోభాకరముగానుండును? ఏది యెచ్చటధరించుటకొఱకుఁ దొలుత నుద్దేశించిచేయఁబడెనో దాని నచ్చటనే ధరింపవలయును. అన్యస్థానములయందవి పూర్తిగా నిరుపయోగములు ౧౫ ఏతీర్థమాహాత్మ్య మాతీర్థమునందే వినిపించినయెడలమహాత్వముండును. అన్యస్థలములయందా గ్రంథమును పఠించినచో నేమియు ఫలముండదు ౧౬ దృష్టాంతమును వినుండు. కాశీక్షేత్రమహిమను ద్వారకలోను ద్వారకాక్షేత్రమహిమ కాశీక్షేత్రమునందును కాశీక్షేత్రమహిమ వేంకటేశ్వర క్షేత్రమునందును నుడివినచో నది యుక్తముగానుండదు ౧౭ ఏక్షేత్రమునం దాక్షేత్రమాహాత్మ్యము బాగుండును. ఇట్టిదృష్టాంతములనేకము లీయవచ్చును. జ్ఞానులకు అద్వైతగ్రంథములే గావలయును ౧౮ రోగులముందు భూతసంచారవార్తలు, రత్నపరీక్షకునిముందు కొండఱాళ్ళ ముచ్చటలు, పండితులముందు మూర్ఖాలాపములు రుచింపవు ౧౯ వేదశాస్త్రజ్ఞునిముందు మంత్ర తంత్రములు, నిస్పృహుని (సన్న్యాసి) ముందు ఫలశ్రుతి, జ్ఞానిముందు కోకశాస్త్రము ఏమిశోభింపఁగలవు? ౨౦ బ్రహ్మచారిముందు నాట్యము, అధ్యాత్మ నిరూపణమునందు రాసక్రీడ, రాజహంసము యెదుట జలము బెట్టిన నిరుపయోగములగును. అటులే ఆత్మజ్ఞానియెదుట శృంగారగ్రంథము లుంచినయెడల నాతనికి సమాధానము గలుగఁజాలదు ౨౧, ౨౨ రాజు బీదవాని స్థితిగతుల నాశించుటయు, అమృతము చప్పఁగానుండుటయు, సన్న్యాసి ఉచ్ఛిష్ట చండాలివ్రతము గావించుట నెన్నటికిఁ బొసఁగదు ౨౩ కర్మనిష్ఠునకు వశీకరణమంత్రములు భూతవైద్యునకుఁ బురాణకథానిరూపణము, వినిపించినచో వారల యంతఃకరణములు తప్పక భంగమునొందును ౨౪ ఇటులే పరమార్థియగు పురుషునిముందు ఆత్మజ్ఞానము లేనిగ్రంథములు వినిపించుటవలనఁగూడ సమాధానము గలుగదు. ౨౫ ఇఁక నీవిషయము చాలింతము. స్వహితము నపేక్షించు ప్రతిమానవుఁడును నిరంతరము అద్వైతగ్రంథవిచారము చేయుచుండవలయును. ౨౬ ఆత్మజ్ఞాని స్థిరచిత్తముతో అద్వైతగ్రంథవిచార మెల్లపుడొనరింపవలెను. మఱియు నేకాంతస్థలము

నందు శుద్ధమగు సమాధానముఁ బ్రాపింపవలెను. ౨౭ అన్నివిధముల నాలోచించి చూచినచో "అద్వైతగ్రంథములతో సమానమగు గ్రంథము లెవ్వియును లేవు'' అని నిశ్చయమగును. పరమార్థియగు పురుషునకు అద్వైతగ్రంథములు భవసాగరమును దరించుటకు నౌకవంటివి ౨౮ ఇతరప్రాపంచకసంబంధములగు హాస్యవినోదగ్రంథములు, నవరసయుక్తమగు కావ్యములు, మున్నగునవి పరమార్థయుక్తుఁడగు పురుషున కెన్నఁటికిని హితకరములు గావు ౨౯ పరమార్థమును వృద్ధిజేయునవియు విషయములపట్లఁ బశ్చాత్తాపము గలిగించునవియు, భక్తియందును సాధనములయందును ఆసక్తి కలుగఁజేయునవియు సత్యమగు నుత్తమగ్రంథములు ౩౦ ఆలకించినంతన గరువమును దొలంగించునదియు, భ్రాంతిని నశింపఁజేయునదియు మనస్సును భగవంతునియందు లగ్నముగావించునదియు సత్యమగు నుత్తమగ్రంథము ౩౧ మనస్సునకు నిలుకడ గలుగఁజేయునదియు, అవగుణములను దూరముగావించునదియు అధోగతిని దొలంగించునదియు నుత్తమగ్రంథమని చెప్పఁబడును ౩౨ వినినంతన హృదయమునకు ధైర్యముగూర్చునదియు పరోపకారమును బోధించునదియు విషయవాసనల నష్టముగావించునదియు, జ్ఞానమును, మోక్షమును, పవిత్రతను సమకూర్చునదియు, నుత్తమగ్రంథ మనఁబడును. నానావిధములగు వ్రతాదివిధానములు వానిఫలశ్రుతులు దెలుపు గ్రంథము లనేకము లుండవచ్చును. కాని దేనివలన విరక్తియు భక్తియుఁ గలుగదో యది గ్రంథమేగాదు ౩౩, ౩౫ ఫలశ్రుతియందు మోక్షప్రాప్తి చెప్పఁబడనిపుస్తకము దురాశాగ్రంథము. దానిని వినుటవలనను జదువుట వలనను దురాశ మిగుల వృద్ధినొందును. వాస్తవమున కట్టి పుస్తకమును పుస్తకమనిగూడఁ జెప్పరాదు. ౩౬ ఇట్టిగ్రంథములు చదువుటవలనను వినుటవలనను మోహము ప్పతిల్లును. వివేకము దూరముగాఁ బలాయనమగును. దురాశాభూతము లావేశించును. చివర కథోగతి సిద్ధించును. ౩౭ కామ్యగ్రంథములను విని ఫలశ్రుతిని మనస్సునం దుంచుకొని ముందుజన్మమున నీఫలములను బడయఁగల్గుదునని తలంచువానికి జన్మరూపమగు అధోగతి తప్పక ప్రాప్తించును. ౩౮ అనేకపక్షిజాతములు ఫలములనుదిని తృప్తినొందుచున్నవి. కాని చకోరములు తమ

హృదయములందుఁ జంద్రకిరణములనుండి స్రవించు నమృతమునే గోరుచున్నవి. ౩౯ అటులే అన్యపక్షిజాతములు ఫలములఁగోరునట్లు సంసారులగుమానవులు సంసారమునే గోరుచున్నారు. కాని భగవదంశగలవారలు చకోరము లమృతమునుగోరునటుల భగవంతునే గోరుదురు. ౪౦

జ్ఞానికి జ్ఞానము, భజనపరునకు భజనము, సాధకునకు ఇచ్ఛానుసారమగు సాధనము గావలయును. ౪౧ పరమార్థియగువానికిఁ బరమార్థము, స్వార్థతత్పరునకు స్వార్థము, కృపణునకు ధనము, యోగులకు యోగము, భోగపురుషులకు భోగము, రోగులకు రోగనివారణముజేయు నౌషధము, కవులకుఁ గావ్యప్రబంధములు, తార్కికులకు దర్కవాదము, భావికులకు సంవాదము, పండితులకుఁ బాండిత్యము, విద్యాంసులకు అధ్యయనము, కళావిదులకు నానావిధములగుకళలు రుచించును. ౪౨-౪౫ హరిదాసులకు హరికీర్తనము, శుచిపరునకు స్నానసంధ్యాద్యనుష్ఠానములు, కర్మనిష్ఠునకు విధివిధానములు ప్రియము గలుగఁజేయును. ౪౬ ప్రేమమూర్తికిఁ గరుణము, విచక్షణునకు దక్షత్వము, చతురమనుష్యునకుఁ జాతుర్యము నుత్సాహకరములు, ౪౭ భక్తుఁడు ధ్యానమున కుత్సాహపడును. సంగీతవిదుఁడు తాల, తాన, మాన, మూర్ఛనలను బరిశీలించును. ౪౮ యోగాభ్యాసి పిండజ్ఞానమును తత్త్వజ్ఞుఁడు తత్త్వజ్ఞానమును, నాటికాపరిచితుఁడు మాత్రాజ్ఞానమును జూచుచుండును. ౪౯ కాముకుఁడు కోకకళాశాస్త్రమును, చేటకీచేటక మంత్రములను, యాంత్రికుఁడు నానావిధయంత్రములను, విదూషకుఁడు వినోదభాషణమును, ఉన్మత్తుఁడు నానావిధచేష్టలను, తామసుఁడు గర్వాంధత్వమును నాదరపూరముగాఁ జూచును. ౫౦-౫౧ మూర్ఖుఁడు అంతరంగశుద్ధిలేని పైపైమాటలను బ్రేమించును. నిందకుఁడు దోషమునకుఁ బొంచియుండును. పాపాత్ముఁడు పాపబుద్ధినిబట్టుకొని యుండును. ౫౨ ఒకనికి రసవంతమగు భక్తిరుచించును. ఒకనికి వ్యర్థవిస్తరమగు భక్తి వచ్చును. ఒకనికిఁ గేవలమాయికమగు భక్తియే హితమగును. ౫౩ ఆగమశాస్త్రజ్ఞుఁడు ఆగమమును, శూరుఁడు సంగరమును, ధార్మికుఁడు నానావిధధర్మములను, ముక్తపురుషుఁడు మోక్షానందమును, సర్వజ్ఞుఁడు సమస్తకళలను, బ్రేమించును. జ్యోతిష్కుఁడు పింగళ (పక్షివిశేషము)

నుజూచి భవిష్యద్వర్ణనము గావించును. ౧౪-౧౫ ఈవిధముగా నెంత దనుక లెక్కించిచెప్పుదును. జనులు తమ తమచిత్తవృత్తుల కనుకూలము లగు ననేక గ్రంథములను నిరంతరము జదువుచుందురు. విను చుందురు. ౧౬ దేనివలనఁ బరలోకము లభింపదో దానిని శ్రవ ణమని చెప్పఁగూడదు. (ఆత్మజ్ఞానప్రదముగాని దానిని మనస్సం తోషకరమనియే చెప్పవలయును.) ౧౭ మిఠాయికంటె మధురవస్తువు లేదు. ముఖమునకు ముక్కు లేకున్నచోఁ జక్కదనమే లేదు. జ్ఞానము లేకున్న నిరూపణమునకే తావులేదు. ౧౮ ఇఁక నీవిష యము నింతతో ముగింతము. ఇప్పటికి గ్రంథవిస్తరమైనది. పరమార్థ ములు వినవలయును. పరమార్థగ్రంథములుదక్క మిగిలినవన్నియు వ్యర్థ గాథలు. ౧౯ నిత్యానిత్యవిచారము, సారాసారవివేకము చెప్పఁబడిన గ్రంథములు వినుటవలననే మోక్షము లభించును. ౨౦

పదియవ సమాసము.

జీ వ న్ము క్తు ని దే హాం త ర ము.

మాయవలన సత్యము మిథ్యగా గోచరించును. మిథ్య సత్యము వలెఁ దోఁచును. దానిలీల యిట్టిది. ౧ సత్యమును నిశ్చయముగావించుట కనేకగ్రంథనిరూపణములు గావింపఁబడెను. ఎంతపనిచేసినను అసత్యప్రా బల్యముమాత్ర మంతరింపకున్నది. ౨ అసత్యము మానవహృదయము నందుఁ బాగుగాఁ బాదుకొన్నది. దాని నెవరుపదేశింపకపోయినను మానవహృదయమునందది దృఢముగాఁ దనంతన నాటుకొనియున్నది. అందువలన సత్యమెద్దియే దానిజాడపొడ లెట్టులుండునో మనుజునకుఁదెలి యకున్నది. ౩ వేదములు, శాస్త్రములు, పురాణములు సత్యమునుగూర్చిన నిశ్చయమును దెలుపుచున్నవి. ఐనను సత్యస్వరూపణము మనస్సునకు గోచరింపకయున్నది. ౪ చూడుఁడు: ప్రత్యక్షముగాఁ గనులయెదుటఁ జూచుచుండఁగనే శాశ్వతముగానున్న సత్యము మరుగుపడుచున్నది. మఱియు నశ్వరమగు మిథ్య సత్యమగుచున్నది. ౫ ఈమాయాలీలయం తయు సాధుసమాగమ మొనరించి ఆత్మనిరూపణము గావించినపిమ్మట తత్ క్షణమె తెలియవచ్చును. ౬

"నేను" అనుదానిజాడను గనుగొన్నపిమ్మట బరమార్థమును గురుతించుట తెలియఁగలదని వెనుకఁజెప్పియుంటిని. ౭ పరమార్థజ్ఞానము వలన సమాధానము లభించును. చిత్తము చైతన్యమునందు లీనమగును. పిమ్మట ఆముఖ్యవస్తువు (పరబ్రహ్మము) నేనేయని విశదమగును. ౮ ఇంత దనుకఁ దెలిసినపిమ్మట జ్ఞానియగువాఁడు ప్రారబ్ధాధీనుఁడై దేహమును విడిచివేయును. సద్బోధమువలన నాతనిసందియములన్నియు విడిపోవును. అంతియగాక "ఈకళేబరము మిథ్య. ఇప్పుడే నశింపనిమ్ము లేక యుండిన నుండనిమ్ము" అని నిశ్చయించుకొనును. ౯ దేహముయొక్క మిథ్యా త్వము తెలిసికొనుటచే సాధువుల దేహములు పవిత్రములగుచున్నవి. అట్టి పవిత్రదేహముల కెచట నంతముగలిగినను సరియే. అదియే పుణ్యభూమి యగును. ౧౦ సాధువులసంయోగముచేఁ దీర్థములుకూడఁ బవిత్రము లగుచున్నవి. సాధుసంసర్గముననే పుణ్యక్షేత్రములమహిమ యినుమడిం చును. సాధువులు వసింపనితీర్థములను బుణ్యతీర్థములనఁదగదు. ౧౧ ఏదేని యొకానొకపుణ్యనదీతీరమున శరీరముదొరగుట మంచిదనువిచా రము అజ్ఞానులకొఱకేర్పడినది. సాధువులు మేనుదొరంగుటకుఁ బుణ్య నదీతీర్థములతోఁ బనిలేదు. ఏలయన, వారలు నిత్యముక్తులు ౧౨ ఉత్త రాయణమునందు మరణించుట పుణ్యమనియు దక్షిణాయణమున మరణిం చుటయధమమనియు జనులుసంశయాకులులై పలుకుచుందురు. కాని సాధు వులట్టిసందేహములకు లోనుగారు ౧౩ శుక్లపక్షములో ఉత్తరాయణము నందు, ఇంటిలో దీపమున్నప్పుడు పగటివేళ అంత్యమున భగవన్నామ స్మరణ మొనరించుచు మరణించినయెడల గృహస్థునకు మోక్షము లభిం చును * ౧౪ కాని యోగికట్టి నియమములతోఁ బనిలేదు. ఏలయన! యోగి జీవించియుండఁగనే పాపపుణ్యములకుఁ దిలాంజలియొసంగి జీవ న్ముక్తుఁ డయ్యెనుగదా ౧౫

---

* శ్లో॥ అంత్యకాలేచమామేవ స్మరన్ ముక్త్వాకళేబరమ్
యః ప్రయాతి సమద్భావం యాతినాస్త్యత్ర సంశయః॥ ౫
అగ్నిర్జ్యోతిరహం శుక్లః షణ్మాసా ఉత్తరాయణం
తత్రప్రయాతాగచ్ఛంతి బ్రహ్మబ్రహ్మవిదోజనాః॥ ౨౪
గీత. అ౮.

మంచిదశలో మరణించినవానిని సుఖముగా మరణించినవానిని జూచి
అజ్ఞానులగు మానవులు "ఈతఁడు భగవంతునిసన్నిధికిఁ జేరఁగలఁడు" అని
నుడువుచుందురు ౧౬ కాని వీరల యభిప్రాయము మిగుల విపరీతమైనది
"అంత్యమున భగవానుఁడు లభించు" ననుకల్పనము వ్యర్థముగాఁ గల్పించు
కొని వీరలుస్వయముగాఁ దమకుఁ దామే హాని కలుగఁజేసికొనుచున్నారు.
౧౭ జీవితమునం దెన్నఁడును బరమాత్ముని భజనము జేయక వ్యర్థముగ
నాయువు గోల్పోయిన వాండ్రకు అంత్యమున భగవత్సన్నిధి యెట్లు
లభించును? ధాన్యపుగింజను నాటకపోయినచో నెటులంకురించును?
౧౮ జన్మాంతముదనుక నీశ్వరభజనము గావించినవానికే ముక్తిలభించును.
వ్యాపారమును జేసిననేగదా లాభము గలుగును? ౧౯ "ఈయనివానికి
దొరుకదు. నాటినగాని మొలువదు" అను నీసామెత లోకులందఱు నెఱింగి
యేయున్నారు ౨౦ స్వామిద్రోహియగు మనుజుఁడు నెలదినములును బని
బాటలు చేయక మాసాంతమున జీతమునిమ్మని యడుగుట యెట్లుండునో
బ్రదికియున్నంతదనుక నీశ్వరునిభజింపకయే అంత్యకాలమునందు మోక్ష
మును గోరుట యట్లుండును ౨౧ బ్రతికియున్నప్పుడు భగవంతుని భక్తి
శ్రద్ధలతో భజింపనిమానవునకు మరణించినపిమ్మట మోక్షమెటుల లభిం
పఁగలదు? ఇంతయేల! ఎవఁడెటులఁ బ్రవర్తించునో వానికట్లు ఫలము
సిద్ధించును ౨౨ కావున జన్మమున్నంతవఱకు భగవంతుని భజింపవల
యును. లేకున్నచో నంత్యమున ముక్తిలభింపఁజాలదు. ఎంతమంచిదశలో
మరణించిననేమి? భక్తిలేకున్నచో వానికిఁ దప్పక యధోగతి ప్రాప్తిం
చును ౨౩ అందువలననే సాధుజనులు ధన్యులని చెప్పుదురు. వారలు
జీవించియుండఁగనే తమ జీవితమును సార్థక మొనరించుకొందురు
౨౪ ఇట్టి జీవన్ముక్తులగు జ్ఞానులకు శరీరపాతము అరణ్యములో
నైనను లేక శ్మశానములోనైనను నొక్కటియే. వారలు సర్వ
కాలములందును ధన్యులు ౨౫ సాధుపురుషుని దేహమొకవేళ
సంస్కారరహితముగాఁ బడియున్నను దానిని శునకాదులు తినివేసినను
ప్రజలకు మందబుద్ధికారణమున నది బాగుగా నున్నట్లుతోఁచదు ౨౬ ఆ
జనులు తలఁచుచుగా "ఈదేహమునకంత్యక్రియలు బాగుగాజరుగలేదు" అను
మాటనే తలంచుకొని మిక్కిలిదుఃఖపడుదురు. కాని పాపము వారలు

దుఃఖపడక యేమిచేయుదురు? మర్మము నెఱుంగరుగదా ౨౭ ఎవఁడు వాస్త
వమునకు జన్మింపలేదో వానికి మరణమెక్కడినుండివచ్చును? ఆతఁడు వివే
కబలమువలన స్వయముగా జననమరణములను నఱిమివైచెను ౨౮ స్వరూ
పానుసంధానకారణమున వానిని మాయ యంటుకొనఁజాలదు. బ్రహ్మ
విష్ణుమహేశ్వరాదులుగూడ వానిగతి నెఱుంగఁజాలరు ౨౯ ఆతఁడు జీవిం
చియుండి మరణించియున్నాఁడు. అంతియగాదు మృత్యువునుకూడఁ జంపి
జీవించుచున్నాఁడు. వివేకబలమువలన నాతనికిఁ బూర్వజన్మమృత్యువులను
గూర్చి జ్ఞాపకమే లేదు. ౩౦ బయటికాతఁడు ఒకమానవునివలెఁ గనిపించు
చున్నను నిశ్చయమునకు మానవత్వమున కతీతుఁడుగనున్నాఁడు. జనులతో
నాతఁడు గలసిమెలసియున్నటుల భాసించునుగాని వాస్తవమునకు అలి
ప్తుఁడుగనే యున్నాఁడు. వేయేల! ఆ పరిశుద్ధపదార్థము నందు దృశ్యపదార్థ
ముల స్పర్శయే లేదు. ౩౧ ఇట్టిసాధుజనులను సేవించుటవలన మానవులు
ముక్తులగుచున్నారు. ౩౨.

సద్గురుకృపాపాత్రుఁడగు సాధకుఁడు ఒకసారి గావించినవివేచనము
మఱలమఱలఁ బలుమాఱు చేయవలెను. అట్లుచేయుటవలన అధ్యాత్మ
నిరూపణమునందు బుద్ధి గాఢముగాఁ బ్రవిష్టమగును ౩౩ ఇఁక నంత్య
మున సాధకుల కొకమాటఁ జెప్పవలసియున్నది. ఏమన? శుద్ధమగు నద్వైత
నిరూపణమువలన మీకుఁగూడ సాధుపురుషులకుఁగల్గిన సమాధానమే
కల్గును ౩౪ సాధుపురుషుల శరణములోని కరుగువాఁడు సాధుపురుషుఁ
డగును. మఱియు నాతఁడు తనకృపారసముచే మానవసముదాయమును
కూడఁ దరింపఁజేయును ౩౫ సాధుజనులమహిమ మిగుల విచిత్రతరమై
నది. సాధుసాంగత్యమువలన జ్ఞానప్రాప్తియగును. సత్సంగముతో సమా
నమగు రెండవసాధన మెద్దియును లేదు. ౩౬ గురుసేవవలనను అధ్యాత్మ
నిరూపణమును మననముజేయుటవలనను మానవుని యాచరణము తప్పక
పరిశుద్ధమగును. మఱియు నంత్యమునఁ దప్పక మోక్షములభించును ౩౭

సద్గురునిసేవయే పరమార్థమునకు జన్మస్థానము. సద్గురుసేవవలన
తనంతటనే సమాధానము లభించును. ౩౮ ఈశరీరము ఏదినముననో నాశన
మొందితీరును గావున నంతదనుక జన్మమును సఫలముగావింపవలయును.
భజనభావముతో సద్గురునిచిత్తమును దనయెడఁ బ్రసన్నముగావించుకొన

వలయును ౩౯ తల్లి నానాప్రయత్నములనొనరించి తనకుమారునిఁ బోషించునటుల సద్గురుఁడుకూడ శరణాగతులఁగూర్చి చింతనము జేయుచుండును. ఇట్టిదాత సద్గురుఁ డొక్కరుఁడే ౪౦ కావున సద్గురుసేవ లభించినవాఁడే పరమధన్యుఁడు. సద్గురుసేవను విడిచినచోఁ బరమశాంతిని బొందుటకిఁకనన్యమగు నుపాయమెద్దియును లేదు ౪౧,౪౨ ఈవిషయమునందు విశ్వాసము లేనివారలు గురుగీతలు చదువనగును. ౪౩ దానిలో మహాదేవుఁడు పార్వతీదేవికి సద్గురునిమహిమను జక్కఁగా వర్ణించిచెప్పియున్నాఁడు. కావున సద్గురుచరణసేవను ముముక్షువులు సద్భావముతోఁ జేయవలయును ౪౪ ఈగ్రంథమునందుఁ జెప్పబడిన వివేకమును మననముజేయువానికి సత్యజ్ఞానమునుగూర్చి నిశ్చయభావ మేర్పడును ౪౫ అద్వైతనిరూపణము గావింపబడిన గ్రంథమును బ్రాకృతమని (సంస్కృతగ్రంథముగాదు- దేశభాషాగ్రంథమని) యుపేక్షింపఁదగదు. అర్థదృష్టితో నాగ్రంథమును సత్యమగు వేదాంతగ్రంథమనియే గ్రహింపవలయును ౪౬ ప్రాకృతభాషవలన వేదాంతము విశదమగును. సంపూర్ణశాస్త్రములలోని విషయములు ప్రాకృతగ్రంథములలో దేశభాషలలో లభింపఁగలవు. వానినిజదువుటవలన హృదయము పరమశాంతము నొందును ౪౭ జ్ఞానోపాయము చెప్పఁబడినగ్రంథమును బ్రాకృతభాషాగ్రంథమని నిరసింపరాదు. కానిమూర్ఖుల కీయంశము తెలియదు. అల్లపుచిని కోఁతిఏమిగ్రహింపఁగలదు? ౪౮

ఎవని కెంతయధికారముగలదో అంతవఱకే వాఁడు గ్రంథములందలిసారము గ్రహించును. ముత్తెములు నత్తగుల్లలు నిర్మించిన చిప్పలలో నున్నవి. అంతమాత్రమున ముత్తెముల నెవ్వఁడేని క్షుద్రవస్తువని నుడువఁగలఁడా! నుడువలేఁడు. (అటులే ప్రాకృతభాషయందు నుడువఁబడిన వేదాంతవిషయములనుగూడ నెవరేని క్షుద్రములుగా భావింపఁగూడదు) ౪౯ దేనినిగూర్చి శ్రుతులు "నేతినేతి"అని నుడువుచున్నవో యట్టివిషయమునందు భాషామహత్త్వమేమియునుఁదోడ్పడఁజాలదు. పరబ్రహ్మము వాస్తవమునకు ఆద్యంతరహితమును అనిర్వాచ్యమునై యున్నది ౫౦.

ఏడవదశకము సమాప్తము.

ఏనిమిదవదశకము

ప్రథమసమాసము

పరమాత్మనిశ్చయము.

శ్రోతలారా! ఇఁక సావధానమనస్కులరై శుద్ధజ్ఞాననిరూపణమునుగూర్చి చెప్పఁబోవునది వినుండు ౧ నానావిధశాస్త్రములను బరిశోధించి భావముగ్రహింపవలయు ననుకొందుమేని జీవితకాలము చాలదు. ఒకవేళ వానినన్నింటిని జూడఁగలిగినయెడల అంతఃకరణమునందుసంశయవ్యథ వృద్ధియగుచునేయుండును. ౨ ప్రపంచములోఁ బుణ్యదాయకములగు తీర్థస్థానము లనేకములుగలవు. వానిలోఁ గొన్నిసుగమములు,కొన్నిదుర్గమములు కొన్ని దుష్కరములుగా నున్నవి ౩ ఈతీర్థస్థానముల నన్నింటినెవఁడు తిరిగి సేవింపఁగలఁడు? ఒకవేళ వీనినన్నింటిని సేవింపవలయుననుకొన్నచో ఆయుష్కాలముకూడఁ జాలదు. ౪ బహువిధములగు జపము, తపము, దానము, యోగము మున్నగు సాధనములన్నియుఁ గేవలము ఆపరమాత్ముని కొఱకే మానవులు గావించుచున్నారు. ౫ దేవాధిదేవుఁడగు పరమాత్ముని బొందుటకు సమస్తయత్నములు గావింపవలయు ననునంశము సర్వజనసమ్మతము. ౬ పరమాత్మను బొందుటకే నానావిధమార్గములు బహువిధమతములు బయలుదేరెను. కాని యాభగవానుని స్వరూపమెట్లుండును? ౭ ఈకాలమునఁ బ్రపంచమునం దెందఱో దేవతలున్నట్లు భావించుచున్నారు. ఆదేవతల నెవ్వరును లెక్కింపఁజాలరు. ఏదేవతనుగూర్చియు సరియగు నిశ్చయము లేదు. ౮ దేవతల ననుసరించి యుపాసనములలోఁగూడ ననేకవిధములగు భేదము లేర్పడినవి. ఒకానొకనికిఁ గోరికయొకసారి యేదేని దేవతసహాయమున నెరవేరినచో నాతఁడది మొదలుకొని యాదేవతనే యాశ్రయించును. ౯ దేవత లనేకములుగా నున్నట్లు భక్తులుసైతము అనేకులుగా నున్నారు. వారలు తమతమ యిచ్ఛానుసారముగా నాయాదేవతలయెడ నాసక్తులై యున్నారు. ఈ విధముగనే ఋషులుకూడఁ బెక్కుమంది గలరు. వారలమతములు అసం

ఖ్యాకములుగా భిన్నభిన్నములుగా నున్నవి. ౧౦ కావున నీబహుత్వమునం దొకదానియందును నిశ్చయము గలుగకున్నది. అన్నిశాస్త్రములును బరస్పరము భిన్నాభిప్రాయములతోఁ గలహము గావించుచున్నవి. కావున సరియగు నిర్ణయము గావింపకున్నవి. ౧౧ శాస్త్రములనేకములు. వానిలో మఱల ననేకభేదములు గలవు. ఇఁక మతమతాంతరుల విరోధమన్నచో దానినడుగవలసిన పనియే లేదు. ఈ విధముగానున్న మతభేదములను బట్టుకొని వాదప్రతివాదములను గావించుచు నెందఱెందఱు దాటిపోయిరో యెవరెఱుంగుదురు? ౧౨

వేయిమందిలో నెవఁడో యొకమానవుఁడు మాత్రమే పరమార్థమునుగూర్చి విచారముగావించును. కాని వానికిఁగూడ నాస్వరూపపు జాడపోడలు గనుపించుట లేదు. ౧౩ అచ్చట నహంకర్తృత్వ మంటియుండెనుగదా! "జాడగాన్పించుట లేదు" అని యెటుల నుడువుచున్నాఁడవు? (జాడ తెలియుటయెట్లు?) ఈ యహంకర్తృత్వమువలననే పరమాత్ముని దర్శనము కలుగకున్నది. ౧౪ ఇఁక నీయంశము విడిచిపెట్టి ఏపరమాత్మకొఱకు జనులు నానాప్రకారములగు సాధనములు జేయుచున్నారో? అది యేవిధముగా లభించునో? మఱియుఁ బరమాత్మయని దేనినందురో? దాని నెటులఁ దెలిసికొనఁగలమో? యీవిషయములనుగూర్చి ముందుఁ దెలుపుదును. ౧౫, ౧౬

ఈ సంపూర్ణ చరాచరసృష్టినిగావించి దానికిఁ గదలికనుగూర్చిన వానిని అవినాశియనియు, సర్వకర్తయనియుఁ బరమేశ్వరుఁడనియుఁ జెప్పుదురు. ౧౭ మేఘమాల నాతఁడే యేర్పఱచెను. చంద్రబింబమునందు అమృతకళ నాతఁడే ప్రసాదించెను. రవిమండలమునకుఁ బ్రకాశము నాతఁడె సమకూర్చెను. ౧౮ ఆతనికట్టుబాటువలననే సాగర మొక్కచోట నిలిచియున్నది. భూభరణమునకు నతఁడే శేషుని నియోగించియున్నాఁడు. ఈ సంపూర్ణ తారాగణ మాతని మాహాత్మ్యమువలననే ఆకాశమునందు నెలకొని యున్నది. ౧౯ జరాయుజములు, ఉద్భిజ్జములు, అండజములు, స్వేదజములు అను చతుర్విధజీవసమూహము, పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరియను నాలుగువిధములగు వాక్కులు ఎనుబదినాలుగు లక్షలజీవయోనులు మూఁడులోకములు నెవ్వఁడు సృజించెనో యా

తఁడే పరమాత్ముఁడు. ౨౦ బ్రహ్మవిష్ణుమహేశ్వరాదులుగూడ నాతనియవతారములే. ఇందు సందియము కొంచెమేని లేదు. ౨౧ ఇలువేలుపు చెలరేగి యీ చరాచరజీవలోకమును నిర్మింపలేదు. ఈ బ్రహ్మాండమును రచించుశక్తి గృహదేవతలకు లేదు. ౨౨ అడుగడుగున కొన్నియో దేవతలు గనుపించును. ఈ దేవతలన్నియుఁ గలసి యీసృష్టి నొనర్పలేదు. అవి చంద్రసూర్య తారాగణములను, మేఘమండలమును నిర్మింపఁజాలవు. ౨౩ వీనినన్నింటిని సృష్టిగావించినవాఁడే సర్వకర్తయగు పరమేశ్వరుఁడు. వాస్తవమున నాతఁడు నిరాకారుఁడు. వాని కళాలీలాకౌతుకములను బ్రహ్మవిష్ణుమహేశ్వరాదిదేవతలుసైత మెఱుంగరు. ౨౪ నిరాకారుఁడు సర్వకర్త గాఁగలఁడను సందేశము కలుగ నవకాశముగలదు. ఈశంకకు సమాధానము ముందుసమాసములో నొసంగఁబడినది. ఇఁక శ్రోతలు ప్రకృతవిషయమున సావధానులు గాఁగోరెద. ౨౫

ఏమియులేక అవకాశరూపముగానున్న రిక్త (ఖాలీ) స్థలమే ఆకాశము. అది నిర్మలమైనది. వాయువు దానిలోనే జన్మించెను. ౨౬ వాయువువలన నగ్నియు, నగ్నివలన జలమును ఉత్పన్నమయ్యెను. పరమాత్ముని యఘటనఘటనాశక్తి చూడుఁడు. ఎంతవింతగానున్నదో? ౨౭ జలమునుండి పృథివికలిగెను. అది నిరాధారముగా నిలిచియున్నది. ఇట్టి విచిత్రకళను గావించినవాఁడే దేవుఁడు. ౨౮ వివేకహీనులగు మానవులు ఆదేవునిచే నిర్మింపఁబడిన పృథ్వియందు వెడలిన శిలలనే దేవరలని నుడువుదురు. ౨౯ సృష్టినిర్మాణకర్తయగు దేవుఁడు సృష్టికిఁ బూర్వమునుండియే యుండెననియు నాతనిశక్తి సృష్టికనంతరము మిగుల విస్తృతమైనదనియు వారలెఱుంగరు. ౩౦ కుండకంటె ముందుగానే కుమ్మరివాఁ డేర్పడి యున్నాఁడు. అటులే తనసృష్టికంటెఁ బూర్వమె పరమేశ్వరుఁ డేర్పడి యున్నాఁడు. ఆతఁడు రాయి యెన్నఁటికినిగాఁడు. రాయి భగవంతుని సృష్టిలో నొకక్షుద్రపదార్థము ౩౧ ఒకానొకఁడు మట్టితో సైన్యమును నిర్మించెనని భావింపుఁడు. దానిని నిర్మించినవాఁడు నిమిత్తకారణము లేక (కర్త) ఆసైన్యముకంటె వేఱుగానున్నాఁడు. ఏలయన? కార్యకారణములెన్నఁటికిని ఒకటి కాఁజాలవు. ౩౨ ఒకవేళ కార్యకారణములు రెండును బంచభూతాత్మికములైనచోఁ బంచభూతాత్మికదృష్టి కవి యొక్కటి కాఁ

గలవు గాని యెచ్చట నిర్గుణవిషయముగానుండునో యచ్చట నిటులనెన్నఁడును జరుగఁజాలదు. ఏలయన! కార్యకారణములకు ఏకత్వసంబంధము పంచభూతములదనుకనే యేర్పడియున్నది. ౩౩ కావున నీసంపూర్ణసృష్టికర్త సృష్టికంటె వేఱుగానున్నాఁడు. ఇందు సందేహము లేదు. ౩౪ తోలుబొమ్మల నాడించువాఁడు స్వయముగాఁ దానుగూడ నొకతోలుబొమ్మ యెట్లు కాఁగలఁడు? ౩౫ ఛాయామండప(బైస్కోపు)సైన్యము కేవలము సత్యమగు సైన్యమువలెనే యుద్ధము జేయును. ఒకమనుష్యుఁ డావినోదము నంతయుఁ జేయించుచుండును గాని యామనుష్యుఁ డాసైన్యము నందలి యొకానొకవ్యక్తి కాఁగలిగి యుండునా! లేదు. ౩౬ ఈవిధముగానే పరమాత్ముఁడుసృష్టిని రచించియున్నాఁడు. కాని యాతఁడుస్వయముగా సృష్టికొక యంగముగా లేఁడు. సమస్తజీవజాతమును సృజించిన యాతఁడు స్వయముగా నొకజీవుఁ డెట్టులగును? ౩౭ పదార్థమును జేయువాఁడు స్వయముగా నాపదార్థమైయుండుననుట యెట్లుపొసఁగును? పాపము వివేకహీనులగు పురుషులు వ్యర్థముగా సందేహములకుఁ బాల్పడుచుందురు. ౩౮ పరమాత్ముఁడు సృష్టియొనరించినటుల నొకశిల్పి సుందరమందిరము నిర్మించెననుకొనుఁడు. కాని యామందిరనిర్మాత స్వయముగా మందిరము కాఁగలఁడా ౩౯ అటులే జగత్తును నిర్మించిన పరమాత్ముఁడు జగత్తునకంటె వేఱుగా నున్నాఁడు. కొందఱు మూర్ఖులీయంశము నెఱుంగక "జగమే జగదీశ్వరుఁ"డని నుడువుదురు ౪౦ జగదీశ్వరుఁడు వేఱుగా నున్నాఁడు. జగద్రచనము వానికళ. అతఁ డన్నింటిలో నున్నాఁడు. కాని యన్నింటికంటెను వేఱుగానుండి యన్నిఁటిలో నున్నాఁడు ౪౧

పంచభూతములను కర్దమమునఁ దగుల్కొనక పరమాత్ముఁడు వేఱుగానున్నాఁడు. అవిద్యాకారణమున మాయాభ్రమ సత్యముగ గాన్పించును ౪౨ మాయోపాధియు జగదాడంబరమును సత్యమనితలంచుట విపరీతము. ౪౩ అన్నిఁటికంటెను నావలనున్న పరమాత్ముఁడే యన్నింటికి వెలుపలను లోపలను వ్యాపించియున్నాఁడు. ఆ యంతరాత్మయే సత్యమైనది. ఈజగత్తు మిథ్యయైయున్నది ౪౪ ఆపరమాత్మనే దేవతయని గూడ నుడువవచ్చును. తక్కినవన్నియు నసత్యములు. ఇదియే వేదాంతశాస్త్రమర్మము ౪౫ ఈదృశ్యపదార్థజాతమంతయు నాశవంతమైనదనియు భగవంతుఁ డవినాశియనియు ప్రత్యక్షానుభవమువలన గన్పట్టుచున్న విషయమేగదా! కావున భగవంతుఁ డీదృశ్యపదార్థములకంటె వేఱుగా నున్నాఁడు ౪౬ శాస్త్రములన్నియుఁ బరమాత్ముని నిర్మలుఁడనియు అచలుఁడనియుఁ జెప్పుచున్నవి. చంచలుఁడనియు నశ్వరుఁడనియు నాపరమాత్ముని నుడువఁదగదు ౪౭ ఆయనకు, వచ్చుట, పోవుట, పుట్టుట, చచ్చుట మున్నగునుపాధుల నారోపించుటవలన మహాపాతకము ప్రాప్తించును ౪౮ పరమాత్మునకు జననమరణములు లేవు. ఆతని సత్తామాత్రముననే దేవతలందఱును అమరులగుచున్నారు. ఇఁక నాతనికి మృత్యువెట్లువచ్చును? ౪౯ పుట్టుట, చచ్చుట, వచ్చుట, పోవుట, దుఃఖము ననుభవించుట యనునవియన్నియుఁ బరమాత్మునికార్యములు. ఆతఁడు కర్తృత్వకారణరూపములకు వేఱుగానున్నాఁడు ౫౦ అంతఃకరణము, పంచప్రాణములు, బహువిధతత్త్వములు, పిండజ్ఞానము మొదలగునవి యన్నియును జంచలములు. కాఁబట్టియే యివి పరమాత్మగాఁజాలవు ౫౧

ఈవిధముగాఁగల్పనారహితముగ నున్న వాఁడేపరమాత్ముఁడు. కాని వాస్తవమునకుఁ బరమాత్మత్వమనుమాటయాతనియందులేదు (పరమాత్మత్వమనుశబ్దమువలనఁ గల్పనమేర్పడుచున్నది. ఆతఁడు కల్పనాతీతుఁడు) ౫౨ ఈ విషయమంతయు విని శిష్యుఁడిటులఁ బ్రశ్నించెను "అయ్యా! పరమాత్ముఁడు కల్పనాతీతుఁడైనపు డీబ్రహ్మాండము నాతఁడెటుల రచించెను. ఈ కర్తృత్వమువలన కర్తృకారణకార్యములోనికి వచ్చునుగదా * ౫౩ ద్రష్టృత్వమువలన ద్రష్ట (చూచెడివాఁడు) అనాయాసముగా దృశ్యమగునట్లు కర్తృత్వమువలన నిర్గుణమునందు గుణము రాగల్గును. ౫౪ కావున బ్రహ్మాండకర్తయెవఁడో ఆతనిచిహ్నములెట్టివో పరమాత్ముఁడు సగుణుఁడో నిర్గుణుఁడో నా కాజ్ఞయిండు. ౫౫ "ఆ బ్రహ్మము ఇచ్ఛామాత్రముననే సృష్టికర్తయగును." అనికొందఱు నుడువుదురు. ఆతనిని వదలినచో

---

* కర్తను గర్తయనినుడువుటవలననే దానికిఁ గర్తృత్వగుణముకలుగుచున్నది. దేనియందు గుణముండునోయది కార్యము. ఈరీతిగఁ గారణమె (కర్తయే) కార్యమగుచున్నది. ఉదాహరణము. చూచువానియందుఁ జూచునట్టిగుణము (ధర్మము)ండుట వలన నాతఁడు స్వయముగాఁగూడ నితరులకు దృశ్యమగుచున్నాఁడు. ఇంద్రియములు విషయములకు ద్రష్టలు. కాని యవి స్వయముగా మనస్సునకు దృశ్యములుగ నగుచున్నవి అనఁగా మనస్సుచేఁ గాంచుచున్నవి.

నిఁక సృష్టి కెవఁడు కర్తయగును? ౧౬ ఈవిధముగా ననేకసంశయములు గలుగుచున్నవి. కావుననోస్వామీ! ఈమాయయంతయు నెందుండి కలిగినది? ౧౭ ఇందుమీఁద వక్త యిటులనుడివెను. ఇకముందు మాయను గూర్చి విస్తరించి చెప్పెదను. శ్రోతలారా! సావధానమనస్కులరై వినుండు. ౧౮, ౬౦

రెండవ సమాసము.

మాయయొక్క ఆస్తిత్వమునందు శంక.

"నిరాకారమునందీచరాచరమాయ యెటులఁగలిగె"ను శ్రోతల సంశయమునకుఁ బ్రత్యుత్తర మొసంగెదను. ౧ శుక్తియందు రజతము రజ్జువునందు సర్పము భాసించునటుల సనాతనబ్రహ్మమునందు (వాస్తవములో లేకున్నను) మాయ భాసించుచున్నది. ౨ ఆదియందు నిత్యముక్తము పరమార్థక్రియయునగు పరబ్రహ్మ మొక్కటియేగలదు. దానియందు అస్పష్టముగను సూక్ష్మముగను మూలమాయ కలిగెను. ౩

శ్లో॥ ఆద్యమేకంపరబ్రహ్మ నిత్యముక్తమవిక్రియమ్
తస్యమాయాసమావేశో జీవమవ్యాకృతాత్మకమ్॥

శ్రోత యిటుల మఱలఁబ్రశ్నించెను. ఒకవేళ బ్రహ్మము, నిరాకారము, ముక్తము, అక్రియ, నిర్వికారమునైనచో దానినుండి మిథ్యయగు మాయ యెట్లుకలిగెను. ౪ బ్రహ్మము అఖండనిర్గుణము. దానికి ఇచ్ఛ యెటులఁగలుగును? ఏలయన! ఇచ్ఛయనునది సగుణమునందే కలుగఁదగినది. నిర్గుణమునందది కలుగఁజాలదుగదా. ౫ బ్రహ్మము ఆదినుండియు సగుణముకాదు. కావుననేగదా దానికి నిర్గుణమనునామము గలిగినది! ఈస్థితిలో దానికి సగుణత్వము (ఇచ్ఛాశక్తి) యెచ్చటనుండివచ్చెను? ౬ ఒకవేళ నిర్గుణమే సగుణమైనదని చెప్పనెడ దానివలన మూర్ఖత్వము ప్రకటనమగును. ౭ ఆనిరాకారుఁడగు నీశ్వరుఁడు సృష్టిజేసియు అకర్తగానున్నాఁడు. పాపము ఈజీవులు వానిలీల నేమియెఱుంగుదురు? అని యొకఁడు పల్కెను. ౮ "అతఁడు పరమాత్ముఁడు వానిమహిమను బాపమీజీవాత్మఁడెటులఁదెలిసికొనఁగల్గును? అని మఱియొకఁడు నుడువును. ౯ శాస్త్రములయర్థమును దాచి వానిమహిమను మానవులు వ్యర్థముగా గానముచేయుచున్నారు. మఱియు నిర్గుణముమీఁద బలవంతముగఁ గర్తృత్వభారమును వైచుచున్నారు. ౧౦ కర్తవ్యతయే భ్రాంతిగాలేనప్పుడు చేసియును అకర్తగా నెవఁడుండఁగలఁడు? అకర్తకర్తల వార్తయే సమూలముగా మిథ్యయైయున్నది ౧౧ ఆదినుండియు నిర్గుణముగానున్న దానియందుఁ గర్తృత్వ మెప్పటినుండివచ్చినది? (ఒకవేళకర్తృత్వము రానిచో) లేనిచో నీసృష్టిని రచించుకోర్కి యెవ్వనికేర్పడినది? ౧౨ చాలమంది "పరమేశ్వరుని యిచ్ఛయని సాధారణముగాఁ బలుకుచుందురు. కానియీ నిర్గుణపరబ్రహ్మమునందిచ్ఛయెచ్చటినుండి వచ్చెనో తెలియకున్నది ౧౩ అటులైన నీవిశ్వమునంతయు సృజించినదెవరు? తనంతటతానుగా నైనదా? ఈశ్వరుఁడు గాకున్నచో నిదియంతయు నెవ్వఁ డుత్పత్తిచేసెను ౧౪ ఈశ్వరుఁడు లేకయే అంతయు నుత్పన్నమైనదన్నచో నప్పట్టున నీశ్వరుఁడెక్కడకుఁ బోవఁగలఁడు. సృష్టి తనంతనే యేర్పడెననుకొందమేని యీశ్వరునిపట్ల నభావ మేర్పడును. ౧౫ ఈశ్వరుఁడే సృష్టికర్తయని యందుమేని యాతనియందు సగుణత్వ ముండవలయును. అటుల యోజించితిమేని (సగుణత్వమారోపించితిమేని) యీశ్వరునియెడఁగల నిర్గుణత్వమే సమాప్తమగును ౧౬ యీశ్వరుఁడు మొదటినుండియు నిర్గుణుఁడైన పక్షమున సృష్టికిఁ గర్తయెవఁడు? ఈశ్వరుఁడే కర్తయనిచెప్పెదమాయన్న దానిచే సగుణత్వ మేర్పడుచున్నది. సగుణత్వము నశ్వరముగదా ౧౭ ఇక్కడ గొప్పశంక గలుగుచున్నది. ఈచరాచరజగత్తు పరబ్రహ్మమువలనఁ గలిగినదందురుగదా! ఎటులఁ గలిగినది? ఒకవేళ మాయను స్వతంత్రమైనదానినిగాఁ జెప్పెదమాయన్న నదియు విపరీతముగానే కనఁబడుచున్నది. ౧౮ "మాయనెవ్వరును జేయలేదు. తనంతటనదియే వ్యాపించిపోయినది." అని యొకవేళ జెప్పెదమాయన్న దీనివలన నీశ్వరవిషయికవార్తయే మునిఁగిపోవుచున్నది ౧౯ ఈశ్వరుఁడు నిర్గుణుఁడు, స్వతస్సిద్ధుఁడు ఆయనకును మాయకును సంబంధమేమియును లేదని నుడువుటగూడ నుచితముగఁ గనుపట్టదు ౨౦ ఒకవేళ సమస్తకర్తృత్వము మాయపైననే పెట్టుచో నిఁక భక్తుల నుద్ధరించెడి యీశ్వరుఁడే లేఁడా యేమి? ౨౧ యీశ్వరుఁడుతప్ప నీమాయ నెవఁడుదూరముచేయఁగలఁడు? భక్తులమగుమమ్ము ననుగ్రహించెడివాఁ డెవఁడేనియు లేఁడాయేమి? ౨౨

మాయను స్వతంత్రమనిగూడఁ జెప్పజాలము. మాయకు నిర్మాణకర్తయగు సర్వేశ్వరుఁ డొకఁ డవశ్యముగానున్నాఁడు. ౨౩ ఈశ్వరుఁ డేవిధముగా నున్నాఁడు? మాయయన నెట్టిది? ఈవిషయము సవిస్తరముగాఁ దెలుపుము.'' ౨౪ వక్త ఈసందేహమునుగూర్చి జనులలో భిన్నభిన్నములగు విచారము లనేకములు గలవు. అవియన్నియును గ్రమముగా వివరించెదను. శ్రోతలారా! ధ్యానముంచి ప్రకృతాంశమును వినియెదరుగాక ౨౫, ౨౬

మాయ నీశ్వరుఁడే నిర్మించెను. ఆయనవలననే యది నలుముఖముల వ్యాపించియున్నది. ఈశ్వరున కిచ్ఛగలుగకపోయినచో నీ మాయ యెక్కడినుండివచ్చును? అనియొకఁడు చెప్పును ౨౭ ఈశ్వరుఁడు నిర్గుణుఁడై యున్నప్పుడు ఇచ్ఛజేయువాఁ డెవఁడు? మాయమిథ్య, అది లేనే లేదని యొకఁడుజెప్పును. ౨౮ ప్రత్యక్షముగా నిదిగాన్పించుచున్నప్పుడు లేనేలేదని యెట్లనుడువఁగలుగుదుము? మాయ యీశ్వరుని యనాది శక్తియని యొకఁడుచెప్పును ౨౯ మాయ సత్యమేయగుచో నది జ్ఞానమువలన నేలనిరసనమైపోవును? సత్యసమానముగాఁ గాన్పించునేగాని అది మిథ్యయేయని యొకఁడుచెప్పును ౩౦ ఇది (మాయ) స్వాభావికముగానే మిథ్యయైనయెడల సాధనము నేలచేయవలయును? ఈశ్వరుఁడు మాయాత్యాగముకొఱకే భక్తిసాధనములు వివరించియున్నాఁడు. అని యొకఁడు నుడువును ౩౧ మాయ యథార్థమునకుమిథ్యయే. అజ్ఞానరూపమగు సన్నిపాతవ్యాధివలన మాయయన్న భయమగుచున్నది. కావున దానివారించుటకు సాధనరూపమగు నౌషధమును బుచ్చుకొనవలెను. ఇంతయే; మాయ మిథ్యయేయని యొకఁడుచెప్పును ౩౨ మాయను త్యాగముగావించుట కెన్నియోసాధనములు చెప్పఁబడెను. ఇందులకు నానావిధమతములు గలవు. అయినను మాయను ద్యాగము జేయఁజాలకున్నారము. ఈస్థితిలో దానిని మిథ్యయని యెట్లునుడువుదుము? అని యొకఁడు చెప్పును ౩౩ యోగవాణి మాయనుగూడ మిథ్యయని చెప్పుచున్నది. వేదశాస్త్రపురాణములలో మాయ మిథ్యయని చెప్పఁబడెను. మఱియు నానావిధనిరూపణములయందుఁగూడ మాయ మిథ్యయని చెప్పఁబడెను. అనియొకఁడు ప్రత్యుత్తరమిచ్చును ౩౪ మాయను మిథ్యయనినంతమాత్ర

మున నది తొలఁగిపోయినట్లు మేమెక్కడను వినియుండలేదు. మిథ్యయన్నంతన యది మిగుల వెంటనంటును. అనియొకఁడు పలుకును ౩౫ అంతఃకరణమునందు విజ్ఞానము లేనివానికి సజ్జనులను గురుతింపఁజాలనివానికిని మిథ్యాభాసయగు మాయ సత్యముగాఁ గాన్పించును ౩౬ ఎవఁ డెట్లు నిశ్చయించునో వానికట్లె ఫలితముండును. అద్దములోఁ జూచుకొనువానికిఁ దనఛాయయే యెదురుఁగా గాన్పించుటయెట్టిదో మాయయొక్క స్థితియు నట్టిదెయని యొకఁడునుడువును ౩౭ మాయ యెక్కడనుండి వచ్చినది? ఉన్నదంతయు బ్రహ్మమే. కరగియున్నను పేరియున్నను నేయి యొక్కటియేయని యొకఁడుచెప్పును ౩౮ పరమాత్మస్వరూపము కరుగుననియుఁ బేరుకొనుననియు నెచ్చటను జెప్పఁబడలేదు. ఆతనిపట్ల నీవొసంగిన యుపమానము సరిపడలేదు. అని యొకఁడనును ౩౯ "సర్వబ్రహ్మము" అనుదానిమర్మము నెఱుంగనివానికి భ్రమ తొలంగఁజాలదని యొకఁడనును ౪౦ ఈశ్వరుఁ డొకఁడే. అచట నీసర్వశబ్ద మెక్కడనుండివచ్చినది? సర్వబ్రహ్మమనునది అపూర్వముగను ఆశ్చర్యముగను గనుపట్టుచున్నదిఅని యొకఁడు నుడువును ౪౧ సత్య మొక్కటియే రెండవది లేనేలేదు. కావున సాధారణముగ "సర్వబ్రహ్మమని" బ్రహ్మమునందురు. అనియొకఁడనును. ౪౨ అన్నియు నొక్కసారిగనే మిథ్యయైపోవును. ఇఁక నిలచియేదియుండునో అదియే సత్యబ్రహ్మము అనియొకఁడు శాస్త్రాధారములతోఁ జెప్పును. ౪౩ భూషణములందును బంగారమునందును భేదమేమియును లేదు. (బంగారము భూషణములలోని బంగారమునొకటియే) వివాదములతో నేలవ్యర్థముగాఁ బరిశ్రమచేయుదురు అనియొకఁడనును ౪౪ హీనము, ఏకదేశీయమునగు నీయుపమానము వస్తువుతో (బ్రహ్మముతో) నెట్లుసంబంధించును? వర్ణవ్యక్తిత్వము అవ్యక్తముతోఁ దులఁదూఁగఁజాలదు ౪౫ సువర్ణమునుజూచినయెడల దీనియం దనాదినుండియు వ్యక్తత్వమున్నదని తోఁచును బంగారుసొమ్ములను జూచినచో నాబంగారే కాన్పించును ౪౬ అనఁగా బంగారము మొదటినుండియు వ్యక్తముగనున్నది. అది జడమును, ఏకదేశీయమును, పచ్చనిదియు నై యున్నది. ఇట్టి యసంపూర్ణదృష్టాంతములు పూర్ణబ్రహ్మమునెడ నెట్లుసరిపడును? అని యొకఁడనును ౪౭ దీనిని విని మొదటివాఁ డిట్లుచెప్పును. విషయముబోధచేయుటకై

యేకదేశీయదృష్టాంతములనుగూడ నీయవలసివచ్చును. సముద్రతరంగముల యందు భిన్నత్వమెక్కడనున్నది? ఉత్తమము, మధ్యమము, అధమము అని దృష్టాంతములుమూఁడు విధములుగా నున్నవి. ఒకదృష్టాంతమువలనఁ (బ్రహ్మము) దథ్యమని తెలియును. ఒకదానివలన వ్యర్థముగా సందేహములు వృద్ధినొందును. ౪౯ దీనిమీఁద మఱియొకఁ డిటులనుడువును. సముద్రమేమి? తరంగములెక్కడ? అచలముతో చలమునకెక్కడనేని సామ్యమునీయఁదగునా? మాయను సత్యముగా నెన్నఁటికిని భావింపఁ గూడదు ౫౦ ఒకఁడిట్లుచెప్పును. మాయకల్పనము. ఇది జనులకు నానా విధములగు భాసలను జూపుచున్నది. ఈవిధముచే దీనిని బ్రహ్మమనియే తలంపవలయును. ౫౧ ఇట్లు మాయ, బ్రహ్మములనుగూర్చి పరస్పరవివాదములు జరుగుచుండుకతన ముఖ్యసందేహము అటులే నిలిచియున్నది. ముందది సావధానులై వినుండు. ౫౨

మాయయనునది మిథ్యయని మీకిదివఱకే తెలిసినదిగదా! కాని యది బ్రహ్మమునందెట్లు ఉత్పత్తియయ్యెను? ఒకవేళ నిర్గుణమే దానిని గావించినదని చెప్పఁదలఁచినచో నది (మాయ) అనాదినుండియు మిథ్యయైయుండెను. ౫౩ మిథ్యాశబ్దమువలన "అది యేమియును లేనేలేదు." అనునర్థము వెడలుచున్నది. ఇట్టిస్థితిలోఁ జేసినదేమి? ఎవరుచేసిరి? నిర్గుణమునకుఁ గర్తృత్వముకలుగుటకూడ నసంభవమేగదా! ౫౪ ఒకటి కర్తనుగూర్చినవిషయము అది (కర్తయగుబ్రహ్మము) యనాదినుండియు రూపరహితముగా నున్నది. ఇఁక రెండవది అదిగావించిన (బ్రహ్మము గల్పించిన) దానినంతను (మాయను) గూర్చినవిషయము. దానికిఁగూడ అస్తిత్వములేదు. ఐనను శ్రోతలయాక్షేపణములకు సమాధానముల నొసంగెదను. ౫౫

మూఁడవసమాసము

నిర్గుణమునందు మాయ యెట్లుకలిగెను?

ఓరీ! ఎయ్యదికలుగనేలేదో దానినిగూర్చి చెప్పనదేమున్నది? అయినను సంశయమును దూరపరచుటకై చెప్పుచున్నారము ౧ రజ్జువువలన సర్పమును, నీటివలనఁ దరంగములును, సూర్యునివలన నెండ

మావులును, భాసించుచున్నవి. మఱియు నీటినుండి వడగండ్లుకలుగుచున్నవి. ౩ మంటివలన గోడ నిర్మింపఁబడుచున్నది. సముద్రకారణమున అలలేర్పడుచున్నవి. కంటిలోనిపాపవలనఁ బ్రపంచము కాన్పించుచున్నది. ౪ బంగారమువలన భూషణములు, దారములవలన వస్త్రము, తాఁబేటియొక్క దేహమునుండి దానిహస్తపాదములవిస్తృతి యేర్పడుచున్నది. ౫ నెయ్యియున్నది. అదియున్నప్పుడే కరుగుటయు నుండును. ఉప్పునీటినుండి యుప్పు వెడలుచున్నది. బింబమునుండి ప్రతిబింబ మేర్పడుచున్నది. ౬ పృథ్వినుండి వృక్షములుకలుగుచున్నవి, వృక్షమునుండి నీడకలుగుచున్నది. మఱియు ధాతువు (వీర్యము) నుండి ఉచ్చనీచవర్ణము లుత్పత్తి యగుచున్నవి. ౭

ఇప్పటికి దృష్టాంతములు చాలయైనవి. అద్వైతమునందు ద్వైతమెక్కడనుండివచ్చినది? ద్వైతమును విడిచినయెడల అద్వైతనిరూపణము గావింపవలనుగలుగకుండు టెందులకు? ౮ ఏదేని యొక్కవస్తువునకు భాసమున్నప్పుడే యదిభాసించును. మఱియు దృశ్యమున్నప్పుడే కనిపించును. కాని యాదృశ్యపుస్థితి యిట్టిదిగాదు. కావున నదృశ్యమునకేయుపమానమేని సరిపడదు. అది యనుపమమైయుండును. ౯ కల్పనములేకుండ హేతువు దృశ్యములేకుండ దృష్టాంతము, ద్వైతములేకుండ నద్వైతము ఎట్లుకాఁగలవు? ౧౦ సహస్రముఖములుగల శేషుఁడుసైత మేభగవంతునిచిత్రకృత్యములను వర్ణింపఁజాలఁడో యాతఁడే యీయనంతబ్రహ్మాండములను సృజించెను. ౧౧ ఆపరమేశ్వరుని (పరమాత్ముని) వలననే యీసృష్టి విస్తృతమైనది. ఆయీశ్వరుఁడే సర్వకర్తయైయున్నాఁడు. ౧౨ ఆయన కనంతనామములుగలవు. ఆయన అనంతశక్తులను నిర్మించెను. అతఁడే మూలపురుషుఁడు. ౧౩ ఆమూలపురుషునిగుర్తు స్వయముగా నామూలమాయయే యైయున్నది. గావునఁ గర్తృత్వమంతయు దానిలోనికేవచ్చును. ౧౪

శ్లో॥ కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే
పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే॥

కాని యీయంశమును స్పష్టముగాఁ జెప్పవీలుగాదు. ఏలయన! దీనివలన (మూలపురుషునకు ద్వైతోపమానమిచ్చుటవలన) మాటలా

డుట, నడచుట, శ్రవణమననాదులగు బ్రహ్మప్రాప్తియుపాయములే సత్యమగును. ఇటులఁ జూచిన సత్యమెయ్యది. ౧౫ పరమాత్మునివలన నంతయు సృజింపఁబడినదనునంశము నందఱు నొప్పుకొనియున్నారు. కాని యాపరమాత్ముని గుర్తింపవలయునుగదా. ౧౬ సిద్ధులనిరూపణము సాధకుని కుపకరింపదు. ఏలయన! సాధకులయంతఃకరణము సిద్ధులయంతఃకరణమువలెఁ బక్వముగాదు. ౧౭ అవిద్యాకారణమును (పిండరూపమగు నుపాధి ధరించువానిని) జీవుఁ డనుచున్నారు. మాయాకారణమును (బ్రహ్మాండోపాధినిధరించువానిని) శివుఁ డనుచున్నారు. మూలమాయాగుణమువలనఁ బరమేశ్వరుఁడు బ్రహ్మమని పిలువఁబడుచున్నాఁడు. ౧౮ కావున అనంతశక్తులను ధరించునది మూలమాయయే. దీనియర్థమును అనుభవనీయులగు పురుషులే తెలిసికొనఁ గలుగుదురు. ౧౯ మూలమాయయే మూలపురుషుఁడు. అతఁడే సమస్తమునకు నీశ్వరుఁడై యున్నాఁడు. అతనినే అనంతనామజగదీశ్వరుఁడని చెప్పుదురు ౨౦ ఈ సంపూర్ణవిస్తృతమగు మాయ కేవలము మిథ్యయైయున్నది. దీనిమర్మమును దెలిసికొనినవారలు చాల యరుదుగానున్నారు ౨౧ వాస్తవమున కీవిషయము లనిర్వాచ్యములు. కాని నే నిచ్చటఁ జెప్పుచున్నాఁడను. ఇవి స్వానుభవమువలననే గ్రహింపఁదగినవి. మఱియు నివి సత్సంగము లేకున్నచో బోధగావు ౨౨ సాధకుల కీసందర్భమున మాయయే మూలపురుషుఁడెటులయ్యెనను సందియము గలుగవచ్చును, అట్లుగానిచో (మాయయే మూలపురుషుఁడుగాకున్న) అనంతనామయుక్త జగదీశుఁడని యెవ్వని నుడువుదురు? ౨౩ ఏలయన! నామరూపములు మాయదనుకనే గలవుగదా. కానఁ బైనజెప్పినదానిలో సందేహింపవలసినదెద్దియును లేదు. ౨౪ నిరాకారమునందు మూలమాయ యెట్లుకలిగెనను పూర్వసందేహమటులే నిలచియున్నది. దానిని నివారించెదము, శ్రద్ధతో నాలకింపఁగోరెదను ౨౫

దృష్టిబంధనపుటాట (గారడి) వలె నీమాయయంతయును మిథ్యయైయున్నది. ఇప్పు డాగారడియాట (మాయాకౌతుకము) ఏప్రకారముగా నగుచున్నదో చెప్పెదను ౨౬ నిశ్చయమగు ఆకాశమునందుఁ జంచలమగు వాయువు ఎట్లుకలుగుచున్నదో యటులే అచలమును నిరా

కారమునగు స్వరూపమునందు మూలమాయ కలుగుచున్నది. ౨౭ కాని వాయువుండుటవలన నాకాశముయొక్క నిశ్చలత్వమునకు వేఱొకవిధమగు బాధ కలుగుట సంభవింపదు ౨౮ ఇటులే మూలమాయయుండుట వలనఁ బరమాత్ముని నిర్గుణత్వమునందుఁగూడ నేవిధమగు బాధయుఁ గలుగదు. ఈదృష్టాంతమువలన వెనుకటిసంశయము తొలఁగిపోవును ౨౯ వాయువు మొదటినుండియే యుండవలయునను నియతము లేదు. ఇటులే మూలమాయయుఁ బురాతనముగాదు. దానిని సత్యమని యంగీకరించుచో అది మఱల లీనముగూడఁ గాఁ గలిగియున్నది ౩౦ వాయువునకువలె మూలమాయకుఁగూడ స్వరూప మెఱుంగవలయును. వాయువు భాసమగుచున్నదిగాని దృష్టిలోనికి రాదు ౩౧ వాయువును మీరు సత్యమే యనుఁడు. కాని యదియెప్పుడేని కనులకుఁగనిపించుచున్నదా! దానిని (గాలిని) జూడఁదలఁచినచో ఎగురఁదలఁచినధూళి, కదలుచున్న యాకులు మాత్రమే కనిపించును ౩౨ వాయువువలెనే మూలమాయయు భాసించుచున్నదిగాని కనిపించుటలేదు. అవిద్య మాయయొక్క విస్తరమునుమా ౩౩ వాయుయోగమువలన దృశ్యము (ధూళిమున్నగునవి) ఆకాశమునందుఁ గాన్పించునట్లు మూలమాయాయోగమువలన నీజగము నిర్మింపఁబడినది ౩౪ ఆకసమునం దాకస్మికముగా మేఘాడంబరము కలుగునటుల మాయాగుణమువలన నీజగము నిర్మింపఁబడెను ౩౫ ఆకాశమునందు ఆకస్మికముగా నశ్వరమగు మేఘసముదాయ మావరించునట్లు బ్రహ్మమునందీమిథ్యామాయ యుత్పన్నమగుచున్నది. ౩౬ ఆమేఘాడంబరముకతన ఆకాశమునకు నిశ్చలత్వమే లేనటులఁ గనిపించును. అదిసరిగాదు. ఆకాశము చలనరహితమై యొక్కచోటనే యున్నది. ౩౭ అటులె మాయాకారణమున నిర్గుణము సగుణముగాఁ దోఁచును. కాని యదిసరిగాదు. పరబ్రహ్మము యథావిధిగఁ జెక్కుచెదరక నిర్గుణముగనున్నది. ౩౮ మేఘములు వచ్చుచున్నను పోవుచున్నను ఆకాశముమాత్రము తనపూర్వరూపముతో నిలచియున్నది. అటులే మాయవచ్చుచున్నను బోవుచున్నను నిర్గుణబ్రహ్మమునందు మాయాకారణమున గుణములు కలుగుటలేదు. ఎట్టిదటులే యున్నది. ౩౯ పర్వతశిఖరములమీఁద నాకాశము పెట్టఁబడినటులఁ గనిపించుచున్నను వాస్తవమున కది కేవలము భాసమాత్రమే.

అటులే నిర్గుణముగూడ మాయాకారణమున సగుణముగా భాసించుచున్నను వాస్తవముగా నది నిర్గుణమె యైయున్నది. ౪౦ ఆకాశమును జూచినచో దానియందు నీలిమ వ్యాపించియున్నట్లు గన్పించును. కాని దానిని మిథ్యాభాసముగానే భావింపవలయును. ౪౧ ఆకాశము బోరగిలఁబడి నాలుగుదిక్కులను జుట్టుకొనినట్లును సంపూర్ణవిశ్వమునది బంధించినట్లును గోచరించును. కాని వాస్తవమున కాకాశము అట్లు లేదు. అది నాలుగుదిక్కుల నావరించినను దిశలు తెలుపఁబడియే యున్నవి. ౪౨ దూరమునుండి చూచినచో పర్వతములు నీలవర్ణముగాఁ గాన్పించును. కాని వాస్తవమునకు శైలములు నీలవర్ణముగా లేవు. ఇటులె నిర్గుణబ్రహ్మమునందుఁగూడ గుణాభాసము కలుగును. కాని బ్రహ్మము సగుణ మెన్నఁటికిని గాదు. ౪౩ రథము పరుగెత్తునపుడు లోననున్న వారి కీపృథ్వియే పరుగెత్తుచున్నటులఁ దోఁచును. కాని వాస్తవమునకుఁ బృథ్వి నిశ్చలముగా నేయున్నది ఇటులె పరబ్రహ్మముగూడ నిర్గుణము కేవలము నై యున్నది. ౪౪ మేఘకారణమునఁ జంద్రుఁ డాకాశమునఁ బరుగెత్తుచున్నటులఁ గానుపించును. కాని యదియంతయును మిథ్య. మేఘమే యుఱుకుచున్నది. ౪౫ ఉష్ణవాయువలనఁగాని అగ్నిజ్వాలవలనఁగాని వాతావరణము (అంతరాళము) వణకుచున్నటులఁ గనుపించును. కాని యదిభ్రమ. అది యెప్పటివలెనే నిశ్చలముగానున్నది. ౪౬ ఇటులే పరబ్రహ్మస్వరూపము నిర్గుణమైయుండియు మాయాకారణమున సగుణమువలెఁ దోఁచుచున్నది. కాని యిది కేవలము కల్పనమువలనఁ గలిగినభ్రమ సుమ్మా. ౪౭

దృష్టిబంధనపుటాట (గారడి) వలె నీమాయ చంచలముగను మిథ్యగను నున్నది. వస్తువు (బ్రహ్మము) యథావిధిగా శాశ్వతమును నిశ్చలము నై యున్నది. ౪౮ కాని మాయ నిరాకారవస్తువును సాకారముగాఁ జేయుచున్నది. దానికది (మాయకది) స్వభావగుణము. మాయ గొప్పమోసగత్తె. ౪౯ చూచినచో మాయయనునది లేనేలేదు. కాని యదిసత్యమువలె భాసించుచున్నది. మఱియు మేఘాడంబరమువలె నుద్భూతమగుచున్నది. అంతలో నాశనమగుచున్నది. ౫౦ ఈవిధముగా మాయ ఉద్భూతమగుచున్నది. కాని బ్రహ్మము నిర్గుణముగనేయున్నది.

బ్రహ్మమునందు అహంరూపముగనున్న స్ఫూర్తి (శక్తి)యే మాయ ౫౧ గుణములు మాయాఖేలనములు. నిర్గుణమునందు గుణాదులెవ్వియును లేవు. మాయ సత్స్వరూపమునందు (బ్రహ్మమునందు) ఉత్పన్నమును నాశనమును నొందుచున్నది. * ౫౨ దృష్టిచలనము వలన ఆకాశమునందు (మేఘసముదాయము) సైన్యమో బొమ్మలో ఆడుచున్నటులఁ గాన్పించును. కాని యదిమిథ్య. ౫౩ ఈవిధముగా జూచితిమేని యీమాయానటనమంతయును మిథ్య. దానిపుట్టుకయంతయు నానాతత్త్వములవి స్తరత్వమును విడిచిచెప్పితిని. ౫౪

మొదటనుండియుఁ బంచమహాతత్త్వములు మాయయందున్నవి. ఓంకారము వాయువుయొక్కగతి. (శక్తియే వాయువుయొక్కరూపము) దీనియర్థమును దక్షులును జ్ఞానులునునగువారలే గ్రహింపఁగలుగుదురు. ౫౫ మూలమాయాచలనమే వాయులక్షణము. మూలమునందలి సూక్ష్మతత్త్వములే ముందునకరిగి జడత్వమును బెంపొందించుచున్నవి. ౫౬ మూలమాయయందుఁ దొలుదొలుత అవ్యక్తముగానున్న యీపంచమహాభూతములు సృష్టిరచనమునందు వ్యక్తములగుచున్నవి. ౫౭ మూలమాయాలక్షణముగూడఁ బాంచభౌతికమే. దానిశోధనమును సూక్ష్మదృష్టితోఁ జేయవలయును. ౫౮ ఆకాశము, వాయువు లేకున్నచో మూలమాయకు శక్తి, ఇచ్ఛ యెటులఁగలుగఁగలవు? (కావున ఆకాశము వాయువు మూలమాయయందున్నవి) అటులే మాయయందు ఇచ్ఛాశక్తికలుగుట తేజోలక్షణమైనది. ౫౯ ఇంతియగాక మాయయందున్న మృదుత్వమే జలము. మఱియు జడత్వము పృథ్వీలక్షణము, ఈవిధముగా మూలమాయయందుఁ బంచమహాభూతము లుత్పన్నమయ్యెను. కావున మూలమాయయనఁ బాంచభౌతికమనియే నిర్ధారణమైనది. ౬౦ ఇంతియగాదు. ఒక్కొక్కభూతమునం దైదేసి భూతములున్నవి. ఈవిషయము సూక్ష్మదృష్టితో నారయునెడ విశదమగును. ౬౧ ముందునకరిగి

*గుణములు వ్యాప్తిమాత్రములు. నిర్గుణమునం దివిలేవు. మాయయొక్కసాక్షిత్వమున గుణములు కలుగుచున్నవి. పోవుచున్నవి. రజ్జువుయొక్క యధిష్టానమున భుజంగము భాసించుచున్నట్లు నిర్గుణమునం దీమాయ తనంతన కలుగుచు నశించుచునున్నది. కడను నిర్గుణము నిర్గుణముగానే యున్నది.

పృథ్వియయ్యెను. ౧౬ ఆకాశమునందుఁగల మృదుత్వమే జలలక్షణము కావున నాకాశమునందు జలము అవశ్యముగానున్నది ౧౭ అజ్ఞానము వలన నాకాశమునందుఁ దోఁచు శూన్యత్వభాసమే తేజోలక్షణము. కావున ఆకాశమునం దగ్నియున్నది. ౧౮ వాయువునకును ఆకాశమునకును నంతగా భేదమేమియును లేదు. ఏలయన? వాయువునందుఁగూడ నాకాశమునందున్నటుల స్తబ్ధత్వమున్నది. కాన నాకాశమునందుఁగల స్తబ్ధత్వమే వాయులక్షణము ౧౯ ఇఁక శేషించినది ఆకాశమునం దాకాశము. ఆకాశమునం దాకాశమున్నదన సంగతి ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. ఈవిధముగా ఆకాశమునం దైదుభూతములు గలవను నంశము సిద్ధాంతమైనది. ౨౦ ఇఁక స్థిరచిత్తులై వాయువునందుఁ బంచమహాభూతము లెట్లుగలసియున్నవో క్రమముగా వినుండు ౨౧ మిక్కిలి తేలికయగు వస్తువునందుఁగూడ జడత్వముండునట్లు వాయువునందు సైతము జడత్వమున్నది. దానితాఁకిడివలన (ఝంఝామారుతమువలన) వృక్షములు పడుచున్నవి. ఈజడత్వమే పృథ్వీలక్షణము. కావున వాయువునందుఁ బృథ్వియున్నది ౨౨, ౨౩ లేదా వాయువునందుఁగల శక్తి నే పృథ్వీలక్షణమనిగూడఁ జెప్పవచ్చును. ౨౪ మిగుల స్వల్పమగు నంగార (అగ్ని) కణమునందుఁగూడఁ గొంచెముగనో గొప్పగనో ఉష్ణత్వముండును. అటులే వాయువునందుఁగూడ జడత్వము (పృథివ్యంశము) సూక్ష్మరూపముగా నుండియేయున్నది ౨౫ వాయువునందలి కోమలత్వమే దానిలోని జలము. దానిభాసమే అగ్నిస్వరూపము. ఇటులే వాయువునందుఁ జంచలరూపముతో వాయువు స్వాభావికముగానే వర్తించుచున్నది ౨౬ అవకాశరూపముతో నాకాశము వాయువునందు సహజముగనే కలసియున్నది. ఈవిధముగా వాయువునందుఁగూడఁ బంచభూతము లున్నవని ధ్రువమైనది ౨౭ ఇఁకఁ దేజమునందుఁగల యైదుభూతములనుగూర్చి వినుఁడు తేజమునందు భాసించుచున్న ప్రఖరత్వమే (తీక్ష్ణమే) దానియందుఁగల పృథివి ౨౮ మఱియు మృదువుగా గోచరించుచున్న అగ్నిభాసమే దానియందుఁగల జలాంశము. తేజమునందుఁ దేజమున్నదని చెప్పవలసిన యావశ్యకమే లేదు ౨౯ ఇఁక నగ్నియందుగల సంచలనమే వాయువు మఱియు దానియందుఁగల స్తబ్ధత్వమే యాకాశము. ఈవిధముగాఁ బంచభూతములు తేజమునందుఁగూడఁ గలవు ౩౦ ఇఁక జలములోని పంచభూతములను గ్రహింపుఁడు. వాస్తవమునకు మృదుత్వమే జలలక్షణము. ఆమృదుత్వమునందు భాసించు కఠినతయే జలములోని పృథ్వ్యంశము. ౩౧ ఇఁక జలములో జలముండియే యున్నదిగదా! ఇదిగాక మృదుత్వము (జలాంశము) నందుఁ దేజముగూడ మృదురూపముతో భాసించుచుండును. దానియందున్న స్తబ్ధతయే వాయువు ౩౨ ఇప్పుడు జలమునందుఁగల యాకాశమునుగూర్చి వివరింపవలసిన యవసరమే లేదు. ఏలయన! అది (ఆకాశము) స్వాభావికముగా నన్నింటియందును వ్యాప్తమైయున్నది. ఇప్పటికి జలమునందుఁగూడఁ బంచభూతము లున్నసంగతి స్పష్టమైనది. ౩౩ ఇఁకఁ బృథివియందుఁగల పంచభూతములసంగతి విచారింపుదము. పృథ్వియందుఁగల కఠినమే పృథ్వికిఁగల పృథ్వీలక్షణము. ఆకఠినత్వమునందుఁగల మృదుత్వమే పృథ్వియందుఁగల నీరు. ౩౪ పృథ్వియందు భాసించుచున్న కఠినత్వమే భాసాగ్నియొక్క యంశము. మఱియుఁ గఠినత్వము (పృథ్వీలక్షణము) నందుఁగల నిరోధలక్షణమే పృథ్వీలోఁగల వాయువు ౩౫ అన్నిఁటియందున్నటులఁ బృథ్వియందుఁగూడ నాకాశమున్నదనుసంగతి ప్రత్యక్షమెగానఁ బ్రమాణమనవసరము. ఆకాశమునందే పంచభూతములు భాసించుచుండ నాకాశమునందు అన్యములగు నాలుగుభూతములుండుటలో నాశ్చర్యమేమియును లేదు ౩౬ ఏలయన; ఆకాశము విఱిచిన విఱుగదు. పగులఁగొట్టినఁ బగులదు. మఱియు సువ్వగింజయంతయేని యున్నతావునుండి కదలదు. అదియెంతయు సూక్ష్మమైనది. ౩౭ పృథ్వీలోఁగూడ నైదుభూతము లుండుట సిద్ధాంతమైనది. ఇట్లు ప్రతిభూతమునందును ఐదుభూతములు ఇమిడియున్నవి ౩౮ ఈయంశము బైఁబైని తెలియవలయునన్నఁ దెలియదు. తెలియకపోఁగా సందియముగూడఁ గలుగును. మఱియు భ్రాంతివశమున నీవిషయముపై వివాదములను గావింపవలయునను దురభిమానముసైతము గలుగును ౩౯

వాయువునం దింకేమేని యున్నటుల స్ఫురింపకపోయినను నందు బంచభూతము లిమిడియున్నసంగతి సూక్ష్మవాయువును శోధించినను గోచరించును. ౪౦ ఈపంచభూతాత్మికవాయువే మూలమాయ. దీని

యందే సూక్ష్మత్రిగుణములు గలవు. కావున మాయ, త్రిగుణములు, నన్నియుఁ బాంచభౌతికము లైయున్నవి ౪౧ ఇట్లు పంచమహాభూతములు త్రిగుణములుగలసి యష్టవిధప్రకృతి యైనది. కావునఁ ద్రిగుణముల వెంట నవిగూడఁ బాంచభౌతికములనియే తెలిసికొనుము. ౪౨ శోధింపక సందేహములకుఁ బొల్పడుట మూర్ఖత్వమగును. కావున నీయంశమును సూక్ష్మ దృష్టితో విచారింపవలయును. ౪౩ మాయయందున్న సూక్ష్మమహాపంచభూతములు త్రిగుణములతోఁ గలసి స్పష్టదశకు వచ్చెను. తరువాత జడత్వమునొంది స్థూలపంచతత్త్వస్వరూపము లోనికి వచ్చెను. ౪౪ పిమ్మట ఆస్థూలపంచతత్త్వములనుండి యీపిండబ్రహ్మాండము మొదలగునవియన్నియు సృజింపఁబడెను ౪౫ పైని సంగ్రహముగాఁ జెప్పిన పంచమహాభూతముల మిశ్రణమంతయును బ్రహ్మాండము నిర్మాణమగుటకుఁ బూర్వస్థితి* ౪౬ బ్రహ్మాండమునకు (సృష్టి రచనమునకు) బూర్వము మూలమాయ యుండెను. దానిని సూక్ష్మదృష్టితో విచారణము జేయవలయును ౪౭ (పంచతత్త్వములు, అహంకారము, మహత్తత్త్వముగలసి) ఈసప్తకంచుకియగు ప్రచండబ్రహ్మాండము (త్రైలోక్యము) అప్పుడు నిర్మితముగాకుండెను. ఈమాయ, అవిద్యల కోలాహలము బూర్తిగా నీవలవిషయమే. (పైనఁజెప్పినదంతయు దీనికిఁ బూర్వస్థితి) ౪౮ బ్రహ్మవిష్ణుమహేశ్వరుల యుత్పత్తియు, బృథ్వి, మేరుపర్వతి, సప్తసాగరముల పుట్టుకయుఁ, దరువాతిదే ౪౯ సమస్తలోకములు, నానావిధస్థానములు, చంద్రసూర్య తారాగణములు, సప్తద్వీపములు, పదునాలుగు భువనములు, మున్నగునవియు, ౫౦ శేషుడు, కూర్మము, సప్తపాతాళములు, ఇరువదియొక్క స్వర్గములు, అష్టదిక్పాలురు, ముప్పదిమూడుకోట్ల దేవతలు, మున్నగునవి యన్నియుఁ దరువాత నేర్పడినవే ౫౧ పండ్రెండుగురు సూర్యులు, ఏకాదశరుద్రులు, నవనాగములు, ఋషులు, నానావిధ దేవావ

---

* మూలమాయ పాంచభౌతికము. కాని యీపంచభూతములు మాయయందు సూక్ష్మరూపముతో నున్నవి. దీనికిఁదరువాత గుణమాయ, త్రిగుణములు, సూక్ష్మభూతములు, స్థూలభూతములు(వీనిని శ్రీసమర్థులవారు తత్త్వములనిరి.) క్రమముగా నిర్మాణమయ్యెను. ఐనను బైనజెప్పిన "ఒకొక్క భూతములోని పంచభూత మిశ్రణము" సూక్ష్మభూతములస్థితి. అప్పుడీ బ్రహ్మాండము నిర్మాణము కాకుండెను.

తారములు, గూడఁ బిమ్మటఁ బుట్టినవె ౫౨ మేఘములు, చక్రవర్తియగుమనువు, నానావిధముల యుత్పత్తి, మున్నగునవి. యసంఖ్యాకముగా నున్నవి. ఎంతదనుకనని చెప్పుదును. ఇవియన్నియును (బరమాత్మకును మాయకును) నీవలివె ౫౩ ఈసంపూర్ణవిస్తృత బ్రహ్మాండమూలము, వెనుకఁజెప్పిన పాంచభౌతికమూల మాయయే ౫౪ ఇంతకుమున్ను జెప్పఁబడిన సూక్ష్మభూతములే ముందునకువచ్చి స్థూలరూపము నొందెను. వాని వర్ణనము రాఁబోవుసమాసమునందు వేఱువేఱుగా విపులముగానొనర్చితిని. శ్రోతలు వానిని బాగుగా నాలోచించి గ్రహింపవలయును. ౫౫,౫౬ అట్లు విచారించి గ్రహించినయెడల నీపంచభూతాత్మకమగు బ్రహ్మాండస్థితిచక్కగా విశదముగాఁగలదు. అటుపిమ్మట నీ"మిథ్యాదృశ్యమును" విడిచి నిరాకారవస్తువును బొందఁగల్గుదుము. ౫౭ మహాద్వారమును గడచి భక్తులు దేవదర్శనమును గావించునట్లు దృశ్యవివేచనముగావించి మిథ్యాదృశ్యమును వదలి సాధకులు పరమాత్మదర్శనము నొందఁగల్గెదరు. ౫౮ ఈసంపూర్ణదృశ్యమంతయుఁ బంచభూతమయముగా నున్నది. దృశ్యము పంచభూతములు గలసిమెలసి యొకదానితోనొకటి పెనగొనియున్నవి ౫౯ ఈవిధముగా నీసృష్టియంతయుఁ బంచభూతములవలననే నిర్మాణమయ్యెను. దీని వర్ణన ముందుగ వినుండు ౬౦

ఐదవసమాసము.

స్థూలపంచమహాభూతములు.

ప్రస్తుతవిషయము చాల కఠినమైనది. కావున సుబోధమగుటకై మిగులస్పష్టముగాఁ జెప్పుదును. ౧ పంచభూతములతో నేర్పడిన యీ మిశ్రణము వేఱువిధముగాఁ గాఁజాలదు. ఇంకను గొంతస్పష్టపఱచి చెప్పుదును. ౨

నానావిధములుగానున్న చిన్నపెద్దపర్వతములు, ఱాళ్లు, శిలలు, శిఖరములు, కంకరఱాయి మున్నగునవియన్నియుఁ బృథ్వి ౩ అనేకస్థలములలో నానావిధములుగానుండు మన్ను, ఇసుక, మున్నగువస్తువులును ౪ గొప్పగొప్ప సుందరగ్రామములు, నగరములు, మందిరములు, సౌధములు, సప్తద్వీపములు, నవఖండములు మున్నగునవియు ౫,౬

అనేక దేవతలు, రాజులు, బహుభాషలలో గౌశలము గలమానవులు, నానావిధములుగనుండు ఆచారపద్ధతులు గల మనుష్యులు, ఎనుబదినాలుగులక్షల యోనులనుండి జనించిన సంపూర్ణ జీవులు, నింక నెందఱు జీవధారులుగలరో వారలందఱును పృథ్వియనియే గ్రహింపవలయును: ౭ పాడుపడిన మైదానములు వచ్చగనుండి నేత్రపర్వమునుగూర్చు నరణ్యములు, గిరికందరములు మున్నగు నానావిధ స్థావరములన్నియును బృథివియే ౮ అనేకప్రాకృతికస్థలములు, నానావిధములుగానున్న మానవనిర్మితస్థలములును, ౯ సువర్ణాద్యనేకధాతువులు, నానావిధరత్నములు, బహువిధవృక్షములు మున్నగు దారుజాతియుఁ బృథ్వియే ౧౦ ఇంతయేల? జడమును, గఠినమును, నెంతగలదో యది యంతయు నిస్సంశయముగాఁ బృథివియే. ౧౧ సాధారణరీతిగా నిప్పుడు పృథ్వీరూపమును దెలిపితిని. ఇఁక జలలక్షణములను సంక్షేపముగాఁ జెప్పెదను. శ్రోతలు సావధానులరై విందురుగాక. ౧౨

బావి, కొలను, చెఱువు, నది మున్నగు వానిలోని జలము, మేఘము, సప్తసాగరములు మున్నగునవి యన్నియును గలసి జలము ౧౩

"క్షారక్షీరసురాసర్పిర్దధిఇక్షుర్జలంతథా"

క్షారసముద్రమును మనమందఱము దఱచుగాఁ జూచియే యున్నారము. దాని జలమువలననే లవణమును జేయుచున్నారు. ౧౪ రెండవది పాలసముద్రము. దానినే క్షీరసాగరమని చెప్పుదురు. ఈ సముద్రమును భగవంతుఁడు ఉపమన్యున కిచ్చెను. ౧౫ ఇవిగాక, మద్య సముద్రము, ఘృతసముద్రము, దధిసముద్రము, ఇక్షురససముద్రము, శుద్ధజల సముద్రము అని యైదు సముద్రములు గలవు. ఈ యేడు సముద్రములు భూమి నావరించుకొనియున్నవి. ౧౬, ౧౭ ఈవిధముగానున్న జలమంతయు అప్పు. ౧౮ పృథ్వికిలోపలను వెలుపలను ముల్లోకములయందును నెంతజలమున్నదో యదియంతయు అప్పు. ౧౯ బహువిధలతలు, వృక్షములు, వృక్షరసము, తేనె, పాదరసము, అమృతము, విషము, మున్నగునవియన్నియు అప్పులోఁ జేరును. ౨౦ నానావిధరసములు, నేయి, నూనె, మొదలగు చిక్కనిద్రవపదార్థములు, శుక్ర,

రక్త, మూత్ర, లాలా, స్వేద, శ్లేష్మ, బాష్పములగు నార్ద్రపదార్థములన్నియును అప్పులోఁ జేరును. ౨౧, ౨౪

ఇఁకఁ దేజోలక్షణములను జెప్పెదను. చంద్రసూర్యతారాగణములు తేజోయుతములగు దివ్యదేహములు మున్నగునవన్నియుఁ దేజోరూపములు. ౨౫ సాధారణమగు నగ్నియు మేఘములలోనుండి బయలువెడలు పిడుగు, ప్రళయాగ్ని, బడబానలము, రుద్రాగ్ని, కాలాగ్ని, భూగర్భాగ్ని మున్నగునవన్నియుఁ దేజము. ౨౬, ౨౭ ఇంతకును సారాంశమేమన! తేజోయుతములును బ్రకాశితములును ఉష్ణోపేతములును బ్రఖరములు నగునవన్నియుఁ దేజోరూపములు. ౨౮

వాయువునకుఁగల ముఖ్యలక్షణము చంచలత్వము. వాయువు చైతన్యస్వరూపము. అన్నిఁటికిని జేతనమును బ్రసాదించునది వాయువె. కదలుట, మెదలుట, మాటలాడుట, నడచుట, మున్నగు సృష్టిలోని బహువిధవ్యాపారములు వాయువువలననే జరుగుచున్నవి. ౨౯, ౩౦ చలనము, వల్గనము, ప్రసరణము, నిరోధనము, అకుంచనము మున్నగునవన్నియుఁ జంచలరూపియగు వాయులక్షణములు. ౩౧ ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానములను బంచప్రాణములును నాగము, కూర్మము, కృకరము, దేవదత్తము, ధనంజయములను ఐదు ఉపప్రాణములును ఇంకను నితరచలనమునుగూడ వాయులక్షణములు. చంద్రసూర్యతారాగణములుగూడ వాయుకారణముననే యాకాశమున స్థిరముగానున్నవి, ౩౨, ౩౩ ఇఁక ఆకాశమును విచారింతము. నిర్మలముగను, నిశ్చలముగను, అవకాశరూపముగను, రిక్తముగను నుండు ప్రదేశమునంతయును ఆకాశమని తలంపవలయును. ౩౪ ఆకాశ మన్నింటియందును వ్యాపించి యున్నది. ఆకాశ మనేకములో నొకటియై యున్నది. మిగిలిన నాల్గుభూతములును ఆకాశమునందే నర్తనము గావించుచున్నవి. ౩౫ అన్నిభూతములలో శ్రేష్ఠమైనది ఆకాశము. అది యన్నిటికంటెను బెద్దది. నిరాకారస్వరూపముతో నది సమానముగనున్నది. ౩౬ శిష్యుఁ డిటులఁ బ్రశ్నించెను. గురువర్యా! రెంటి రూపము సమానముగా నున్నపు డాకాశమునే బ్రహ్మమని యేల నుడువరాదు?

౩౭ ఆకాశమునందును బ్రహ్మమునందును భేద మేమియును లేనప్పుడు ఆయాకాశమును స్వతస్సిద్ధమని చెప్పవచ్చునుగదా! ౩౮ వస్తువు (బ్రహ్మము) అచలము, అటమును, నిర్మలమునై యుండునట్లు ఆకాశముగూడ నున్నది. ఇంకయేల! ఆకాశము బ్రహ్మమునకు సరిసమానముగ నున్నది. ౩౯ వక్త యొసంగిన ప్రత్యుత్తరము. ఓయీ! వస్తువు (బ్రహ్మము) నిర్గుణమును శాశ్వతమునునై యున్నది. ఆకాశమునందుఁ గామక్రోధశోకమోహాభయములు అజ్ఞానశూన్యత్వములు అను నీయేడు విధములగు గుణములున్నటుల శాస్త్రములలోఁ జెప్పఁబడెను. అందుచే ఆకాశము భూతములలో నొకటిగాఁ బరిగణింపఁబడినది. నిర్గుణస్వరూపమన్ననో నిర్వికారమును, నిరుపమమును నైయున్నది. ౪౦, ౪౧ కంచుతోఁ గూర్పఁబడిన పృథివియు, జలమును నొక్కరీతిగనే కాన్పించును. కాని యిది కంచు ఇది జలము అను వివేకమును జతురులగు మానవు లెఱుంగుదురు. ౪౩ దూదిరాశిలో మధ్య నొక స్ఫటికశిల పడియుండెను. ఇదియంతయును దూదిరాశియని జనులు దలంచుచుండిరి. ఒకదినమున నొకమనుజుఁడు ఇది దూదిరాశి యనుకొని దానిమీఁద దుమికెను. వెంటనే తలపగిలెను. ఈపని దూదివలన నెట్లుకాగలదు. ౪౪ కొన్నికొన్ని తెల్లని కంకరరాళ్ళు బియ్యములోఁ గలసి బియ్యపుగింజలవలె వంకరగలిగి యుండును. అవి భోజనము చేయుసమయమున దంతములలో బడినపుడుగాని గోచరించవు. త్రిభాగము (సున్నము, ఇసుక, గచ్చు,) నందున్న కంకర (ఇసుక) త్రిభాగమువలెనే కనిపించును. కాని వెదకి పరిశోధించినచో కఠినరూపముతో వేఱుగనున్న యిసుకగోచరించును. ౪౬ బెల్లమువలెనే బెల్లపురాయిగూడ నుండును. కాని బెల్లపురాయి కేవల కఠోరముగ నుండును. నాగవల్లికట్టెయు, మూలహాఠియు, హాఠియు నొక్కటేపోలికగనుండును. అంతమాత్రమున నారెండును నొకటియేయని యెవరును జెప్పఁజాలరు. ౪౭ బంగారవునీరు పూయఁబడినయిత్తడియు బంగారమును జూచుటకు సమానముగనుండును. నిప్పుపయినుంచి కాల్చినచో బంగారునీరు పూసిన యిత్తడిబ్రతుకు బైటబడును. ౪౮ ఇక నీయల్ప దృష్టాంతములను జాలింతము. ఆకాశము కేవలము భూతము. అభూతము అనంతము (బ్రహ్మము) నొక్కటి యెట్లుగాఁగలవు? ౪౯ వస్తువునందు

(బ్రహ్మమునకు) వర్ణమే లేదు. ఆకాశమో శ్యామలవర్ణము గలది. ఈస్థితిలో నేర్పరులగుమానవులు ఆకాశము బ్రహ్మము సమానమని యెట్లుచెప్పఁగలుగుదురు? ౫౦

అనంతరము శ్రోత లిట్లు ప్రశ్నించిరి. స్వామీ! ఆకాశము కేవలరూపహీనము. (ఆకాశము బ్రహ్మము సమానముగా రూపరహితములు) ౫౧ మిగిలిన నాలుగుభూతములు నశ్వరములు. ఆకాశమునకుమాత్రము నాశనము లేదు. ఆకాశమునందు వర్ణవ్యక్తియును వికారమును లేదు ౫౨ ఆకాశము అచలముగాఁ గాన్పించును. దానికి నాశనమున్నటుల నెచట గోచరించును? ఆకాశము శాశ్వతమని మా యభిప్రాయము ౫౩ ఈప్రశ్నమునాలించి వక్తయొసంగు ప్రత్యుత్తరమిది. ఇఁక నాకాశలక్షణములను ఆలింపుడు. ౫౪ ఆకాశము తమోగుణమునుండి జనించెను. అందుచే ఆకాశము కామక్రోధవేష్టితముగా నున్నది. అంతియగాక, ఆకాశమునకు అజ్ఞానము శూన్యత్వము అనుపేరులుగూడ గలవు ౫౫ అజ్ఞానమువలనఁ గామక్రోధమోహాభయశోకాదులు జనించును. ఆగుణములన్నియును ఆకాశలక్షణములే. ౫౬ ఆస్తిక్యములేనిదానికి శూన్యమని పేరు. ఈయర్థములోనే అజ్ఞానప్రాణులను హృదయశూన్యులని యందురు ౫౭ సబ్ధతాకారణమున ఆకాశము శూన్యము. శూన్యమే అజ్ఞానము. ఇటులే యజ్ఞానము జడత్వమునకు రూపము ౫౮ కఠినమును, శూన్యమును, వికారరహితమును, నగు నాకాశమును శాశ్వతస్వరూపమని యెట్లుచెప్పఁగలుగుదుము? పైపైనిజూచుటకుమాత్రము ఆకాశము సత్స్వరూపమువలెఁ గన్పించును. ౫౯ కాని యాకాశమునందు అజ్ఞానము గలసియున్నది. ఆకాశము అజ్ఞానుప మిశ్రణము. జ్ఞానమువలన నాశనమగునుగాన ఆకాశము నశ్వరమని గ్రహింపనగును ౬౦ ఆకాశము, బ్రహ్మస్వరూపము, చూచుటకు ఏకరూపముగా గోచరించును. కాని రెంటిలో శూన్యత్వవిక్షేపము గలదు. (ఆకాశమునకు స్వరూపమునకు భేదముచెప్పుదును. ఆకాశములో శూన్యత్వమున్నది. స్వరూపమున లేదు) ౬౧ కల్పనబుద్ధితోఁ బైపయిచూచిన యెడల ఆకాశము బ్రహ్మము సమానముగాఁ దోఁచును. వాస్తవమునకు ఆకాశమునకు బ్రహ్మమునకు నెంతయో భేదమున్నది. ౬౨ జాగరూకసుషుప్త్యవస్థలు రెండును సమానముగనే గోచరించును. వివేకముతోఁ

జూచిన యెడల నీరెంటియందుఁగలభేదము విశదమగును ౬౩ కల్పిత పదార్థము సత్యపదార్థము సమానముగఁ గాన్పించును. పరీక్షకుల కీరెంటి కినిగల భేదము గోచరించితీరును. ౬౪ ఎండమావులనుజూచి లేళ్ళేల మోసపోవుచున్నవి? లేళ్లకు సత్యాసత్యవివేచనశక్తి లేదు.

ఈదృష్టాంతములవలన ఆకాశభూతము, పరమాత్మస్వరూపము వేఱు వేఱని శ్రోతలు గ్రహింపఁగలరు. ౬౫ ఆకాశమునకంటె వేఱుగనుండి మనము ఆకాశము జూడఁగలము. అట్లు బ్రహ్మమును జూడవీలులేదు. బ్రహ్మమును జూడవలయునన్నచో మనము గూడ బ్రహ్మముగావలసి యుండును. స్వభావసిద్ధముగా వస్తువునుజూచు విధ మిది. (వస్తువుతోఁ దాదాత్మ్యము కలుగునంతవరకది గోచరింపదు) ౬౬

ఇంతటితో శంకానివారణ మగును. సందేహవృత్తి యస్తమించును. భిన్నత్వమువలన స్వరూపస్థితి యనుభవములోనికి రాఁజాలదు ౬౭ ఆకాశము అనుభవములోనికి వచ్చును. స్వరూప మట్లుగాదు. అనుభవము కంటె వేఱుగానున్నది. కావున నాకాశముతో దానికి సామ్యము కొంచె మేనిలేదు. ౬౮ పాలలోఁగలసియున్న జలమును రాజహంసములు విడదీయునట్లు బ్రహ్మమును ఆకాశమును సాధుపురుషులు గ్రహించి విభజింపఁ గల్గుదురు ౬౯ సంపూర్ణమాయకు సంబంధించిన గాథాజాలముదెలిసి కొనవలయు నన్నచో సాధుపురుషులచెంత కేగవలయును. మోక్షపదవి సాధుసమాగమువలననే సిద్ధించును.

ఆఱవ సమాసము.

సత్సాంగత్యము - మోక్షము.

శ్రోత వక్తనుజూచి వినయపూర్వకముగా నిటులఁ బ్రశ్నించెను. కృపామూర్తీ! దీనుఁడనగునాకు సత్సంగమమహిమయెట్టిదో మోక్షము సత్సమాగమమువలన నెన్నిదినములకుఁ బ్రాపించునో తెలుపఁబ్రార్థించెదను. ౧,౨ వక్త యిటులఁ బ్రత్యుత్తరముచెప్పెను. సత్సమాగమమువలన ముక్తి తత్కాలముననే లభించును. కాని సాధుజనుల యుపదేశముల యందు విశ్వాసముంచవలెను. దుశ్చిత్తుఁడుగనుండుటవలనహానికలుగును. ౩ ప్రశ్న-స్వస్థదశయందుఁగూడ మనస్సొక్కొక్కప్పుడుఆకస్మికముగఁజంచల మైపోవును. దానినిస్థిరముగానుంచు విధమెద్ది? ౪ ఉత్తరము మనస్సునకుఁ గల చంచలత్వమును వివేకముతోనాపి సావధానమును జూచికొని సాధుజనుల యుపదేశములనాలించి సమయమును సార్థకము గావింపవలయును ౫ తాను వినినదానియర్థమును సిద్ధాంతమునుగూర్చి హృదయమునందు విచారింపవలయును. ఒకవేళ మనస్సింకను జంచలముకాఁదొడంగినయెడల మఱల శ్రవణము జేయవలయును. ౬ అర్థమును దనహృదయమునఁ బాదుకొలుపక పైపైశ్రవణములు గావించువాఁడు శ్రోతయనఁదగఁడు. మనుష్యరూపముగానున్న పాషాణము ౭ ఇక్కడశ్రోతలను బాషాణముతోఁ బోల్చినారమని చింతించెదరేమో! మంచిది. ఇఁక సావధానమతితోఁబాషాణలక్షణములు వినుండు ౮

పాతినొకమారు చెక్కసరిపఱచినచో నెల్లపుడునది యటులేయుండును మాఱుఁడు. సుత్తెతోనొకమాఱు పాతినుండి విరుగఁగొట్టబడిన తునక మఱలనెప్పుడును దానితో నతుకదు, కాని మనుజునిస్థితి యట్టిది కాదు. వానికున్నదుర్బుద్ధి యొకమాఱు తొలంగించివైచినచో రెండవమాఱు తనంతన యావరించును. ౯, ౧౦ నేర్పుటవలన మనుజునకు దుర్బుద్ధి యొకమాఱు తొలంగిన తొలంగును. రెండవసారి మఱలనది లోనికివచ్చును. (పాషాణస్థితి యిట్టిదికాదు. అదియొకసారి చెక్కసరిచేసినచో నిరంతర మటులేయుండును.) కావున మనుజునికంటెఁ బాషాణము మిగులమంచిదని తేలినది. ౧౧ దుర్గుణములను విడువఁజాలనిమనష్యునిఁ బాషాణముకంటె నీచునిగాభావింపనగును. అతనికంటె బాయియేకోటిరెట్లు మంచిది ౧౨ పాషాణము కోటిరెట్లుమంచిదని యేలచెప్పితినో వినుండు. ౧౩ మాణిక్యము, ముత్యము, ప్రవాళము, వైడూర్యము, వజ్రము, గోమేధికమణి, స్పర్శవేది, చంద్రకాంతము, సూర్యకాంతము మున్నగు నమూల్యమగు పాళ్ళెన్నియోగలవు. ఇటులె నానావిధములగు నౌషధమణులు అత్యంతోపయోగకరము లింకనెన్నియో గలవు. ౧౪, ౧౫ ఇవిగాక యింకను విలువగలపాషాణము లెన్నియో గలవు. అవి నానావిధపుణ్యతీర్థములందును బావులయందును గోనేరులయందును నున్నవి. మఱికొన్నిశిలలు శివకేశవులరూపముతోఁ బూజింపఁబడుచున్నవి. ౧౬ ఈదృష్టితో విచారించితిమేని మనుష్యుఁ డాపాషాణముల

ముందు మిగులఁదుచ్చుఁడని విశదమగును. ౧౭ కావున మనుజుఁడు పైనబేర్కొనినశిలలతో సమానుఁ డెన్నఁటికినిగాఁడు. దుశ్చిత్తులు, భక్తిహీనులు నగువారలనుమాత్రమే అపవిత్రములు, నిరుపయోగములు నగుఱాళ్ళతో బాగుగాఁ బోల్పవచ్చును. ౧౮

ఇఁక నీవిషయమును విడిచివేయుదము. దుశ్చిత్తమువలన హాని గలుగుననియు నీకారణముననే మానవునకుఁ బ్రపంచముగాని పరమార్థముగాని సమకూరఁజాలదనియు బాగుగా జ్ఞాపకముంచుకొనవలయును. ౧౯ దుశ్చిత్తత్వమువలనఁ గార్యనాశన మగును. మనస్సునఁ జింతగలుగును. మఱియు విన్నమాట క్షణముసేపైనను హృదయమున నుండదు. ౨౦ దుశ్చిత్తమువలనఁ బరాజయము కలుగును. జననమరణములుప్రాప్తించును. హానికలుగును. ౨౧ దుశ్చిత్తులగువారు సాధనమునకుఁగాని భజనమునకుఁగానితగరు. వారలుజ్ఞానమునెన్నఁటికి నార్జింపఁజాలరు. ౨౨ నిశ్చయముగాని విజయముగాని స్వహితముగాని దుశ్చిత్తునకు సమకూరదు. ౨౩ కి జూచుటకు స్థిరబుద్ధిగలవానివలెగోచరించినను దుశ్చిత్తుఁడు తనహృదయమునమాత్రము తీరనిసందియములచే నాందోళనపడుచుండును. ౨౫ పిచ్చివానికి, పిశాచావేశముచేబాధపడువానికి, గ్రుడ్డివానికి, మూగవానికిఁ జెవిటివానికి నెట్టులఁగాలము వ్యర్థముగాఁగడచునో యటులే దుశ్చిత్తునకు గూడఁ గడచుచుండును. ౨౬ సావధానము గలిగియున్నను నిట్టిమనుజులకుఁ బరమార్థమేమియు బోధగాదు. చెవులుండినను మంచివిషయము వినఁబడదు. జ్ఞానమున్నను సారాసారవిచారమే తెలియదు. ౨౭ దుశ్చిత్తునకును, రాత్రింబవళ్ళు సోమరితనముతో మెలఁగువానికిని బరలోకమెన్నఁటికిని లభింపదు. ౨౮ దుశ్చిత్తుఁ డెటులో తననైజగుణము నుండి విడివడినంతనే వానిని సోమరితన మావరించును. సోమరితన మేర్పడినయంతన మానవునకు సదవకాశము చిక్కఁజాలదు. ౨౯

అలసత్వమువలన నాలోచన మంతరించును. ఆచార మడుగుబట్టును. ఏ మేమియాచరించినను సోమరికి ఉత్తమోత్తమములగు విషయములు జ్ఞాపకముండవు. ౩౦ అలసత్వమువలన శ్రవణము కుదురదు. నిరూపణము కాదు. పరమార్థవివేచనమునందు శక్తి మలినమైపోవును. ౩౧ నిత్యనియమములు సోమరితనమువలన నశించును. అభ్యా

సము తొలఁగిపోవును. సోమరితనమువలన సోమరితనము మఱింత వృద్ధినొందును. ౩౨ అలసత్వమువలన ధారణయు, ధృతియు, నడుగుబట్టును. వృత్తి మలినమగును. వివేకము మందగించును. ౩౩ అలసత్వమువలన నిద్ర వృద్ధియగును. వాసన విస్తృతమగును. నిశ్చయాత్మకమగు సద్బుద్ధి నేలఁగలియును. ౩౪ దుశ్చిత్త్వమువలన అలసత్వ మంకురించును. అలసత్వమువలన సుఖనిద్రవచ్చును. సుఖనిద్రవలనఁ గేవల మాయువునాశనమగును. ౩౫ నిద్రయు, సోమరితనము, దుశ్చిత్తత కలుగుటయే మూర్ఖలక్షణము. ఈ యవగుణములవలన నిరూపణము బోధలోనికి రాఁజాలదు. ౩౬ ఈ మూఁడు దుర్లక్షణము లెచటనుండునో యచ్చట వివేకము నిలువనే నిలువదు. అజ్ఞానియగు పురుషుఁ డీయవగుణములయందే సౌఖ్యమున్నదని తలంచును. ౩౭ ఆఁకలియైనతోడనే భుజించును. భుజించినంతన సోమరితన మావరించును. సోమరితన మావరించినంతన నిర్భయముగా నిదురించును. ౩౮ ఇటుల నిద్రాసౌఖ్యమనుభవించి లేవఁగనే మఱల దుశ్చిత్తుఁడగును. ఇట్లు వర్తించు పురుషు లెన్నఁటికిని సావధానచిత్తులు కాఁజాలరు. ఇఁక నిట్టిస్థితిలో వారలకు నిరూపణమునం దాత్మహితజ్ఞానమెట్లు కలుగును? ౩౯ కోతికి రత్నమును బిశాచమునకు ద్రవ్యకోశమును అప్పగించుటవలనఁగలుగు దశయే దుశ్చిత్తునియందు నిరూపణమునకుఁ గలుగును. ౪౦

సాధుసమాగమమువలన మోక్ష మెన్నిదినములలో లభించునని మొదట శ్రోతలు ప్రశ్నించియున్నారు. దానికిఁ బ్రత్యుత్తర మిపుడు సావధానులరై వినవలయును. ౪౧, ౪౨ స్పర్శవేదిసోకినంతనే ఇనుము బంగారముగా మారునట్లుగను, జలబిందువు సాగరములో వెంటనే కలసిపోవునట్లుగను, ఏదేని యొకనది గంగలో సంగమించినంతన గంగారూపమైపోవునట్లుగను ౪౩ సావధానియు, ఉద్యోగియు, దక్షుఁడును నైయుండు పురుషుఁడు తత్కాలముననే సత్సంగమమున మోక్షమును బడయును. ఇతరుల కది యలభ్యము. దాని నితరులు చూడనేలేరు. ౪౪ మోక్షము బడయుటకు శిష్యునిప్రజ్ఞయే ప్రధానసాధనము. ప్రజ్ఞావంతునకుఁ గార్యముసాధించుటలో నాలస్యముండదు. అనన్యుఁడగు వానికిఁ దత్కాలముననే మోక్షము లభించును. ౪౫ ప్రజ్ఞావంతుఁడును అనన్యుఁడునగు

వాఁడు మోక్షమునొందుట క్షణమాత్రమేని పట్టదు. అనన్యభావము కలుగునంతవఱకుఁ బ్రజ్ఞయేమియు నుపకరింపఁజాలదు. ౪౬ ప్రజ్ఞలేనిది అర్థము తెలియదు. విశ్వాసములేనిది వస్తుజ్ఞానము కలుగదు. ప్రజ్ఞావిశ్వాసములవలన దేహాభిమానము విడిపోవును. ౪౭ దేహాభిమానము విడిపోయినంతన సహజముగానే వస్తుప్రాప్తి యగును. సత్సంగమువలన సద్గతి వెంటనే లభించును. ౪౮ విశేషించి సావధానిగను ఉద్యోగిగను ప్రజ్ఞావంతుఁడుగను విశ్వాసిగను నుండువాఁడు సావధానములనుగూర్చి పరిశ్రమచేయవలసిన యవసరమేలేదు. ౪౯ ఉత్తమభావయుక్తులుగనుండు వారికిఁగూడ సాధనమువలన మోక్షములభించును. సాధుసంగమువలన దత్కాలముననే వివేకదృష్టి వికసించును. ౫౦ ఐనను అధ్యాత్మనిరూపణ శ్రవణసాధనమును అవశ్యముగాఁ జేయవలయును. ఏలయన నీసాధనము వలన నందఱకును లాభముగలుగదు. ౫౧

ఇఁకముందు మోక్షమెట్టిది? స్వరూపదశయెట్టిది? సత్సంగము వలన మోక్షముచేకూరునను విశ్వాస మేలకలిగియుండవలయును? అను నీనిరూపణము లన్నియుఁ జక్కఁగ వివరింపఁబడును. శ్రోతలు స్థిరచిత్తులై యీనిరూపణములయెడఁ దమధ్యానము నుంతురుగాత. ౫౨, ౫౩ అవగుణములను విడిపించుటకు న్యాయనిష్ఠురములను (న్యాయమతిక్రమింపని నిష్ఠురవాక్యములను) నుడువవలసి వచ్చెను. శ్రోత లనుగ్రహించి యిట్టివాక్యములు పలికినందులకు అప్రసన్నులు కాకుందురుగాక. ౫౪

ఏ డ వ స మా స ము.

మోక్షలక్షణము.

మోక్ష మెన్నిదినములలో లభించునని శ్రోత లింతకుమందుఁ బ్రశ్నించియున్నారు. ఇప్పుడు దానికిఁ బ్రత్యుత్తరము చెప్పెదను. స్థిర చిత్తముతో వినుండు ౧ మోక్షము నెటు లెఱుంగవలయును? మోక్షమని దేనినందురు? సత్సంగమువలన మోక్ష మెట్లు లభించును? అను విషయములనుగూర్చిగూడ మీకుఁ దెలుపుదును ౨ బంధింపఁబడినవానిని బద్ధుండందురు. విడివడినవానిని, మోక్షమునొందినవానిని ముక్తుఁడం దురు. ౫ ఇప్పుడు సాధుసమాగమమువలన మోక్ష మెట్లుగలుగు నను విషయ

మును దెలుపుదును ౩ ప్రాణి ... యుతో బంధింపఁబడియున్నది. జీవత్వమువలన బద్ధమైయున్నది. సాధుజనులు బంధమునుండి వివేకముచే విముక్తినిగాంతురు ౪ "నేను జీవుఁడను" అనునీసంకల్పమును దృఢముగా మానవులు ధారణము గావించినపిదపఁ గొన్ని సంకల్పములు దాటిపోయినవి. ఈసంకల్పముచేతనే దేహబుద్ధితోఁ బ్రాణిబద్ధమగుచున్నది ౫ "నేను జీవుఁడను నాకు బంధనములున్నవి. నాకు జన్మమరణములున్నవి. మఱియు నిప్పుడు గావించినఫలమును మఱియొకప్పుడు నేను అనుభవింతును. పాపఫలము దుఃఖము. పుణ్యఫలము సుఖము. పాపపుణ్యముల ఫలము ప్రాణి యవశ్యముగా ననుభవింపవలెను. పాపపుణ్య ఫలానుభవము విడిపోదు. గర్భవాసముకూడఁ దొలఁగిపోదు" అను నీకల్పనము దృఢముగాఁ బాదుకొనిపోవుటకే ౬-౮ బంధింపఁబడియుండుటయని పేరు. పట్టుపురుగు తన దారముచేఁ దన్నుఁజుట్టుకొని తనకుఁదానే బద్ధమగుచున్నది. ౯ అజ్ఞాన ప్రాణియగు మానవుఁడు భగవంతుని నెఱుఁగఁజాలక యిట్లునుడువును. "నాకు జన్మమరణములు తొలంగిపోవు ౧౦ ముందుజన్మమున కాధారము గలుగుట కిప్పుడే దేని దానముచేసికొందును. దానివలన నా జీవితము సుఖముగా గడువఁగలదు. ౧౧ పూర్వజన్మమున దానముచేయలేదు. అందువలననే నేను దరిద్రుఁడనైతిని. ఇప్పుడైనను కొంచెము దానము చేయవలదా" ౧౨ ఇట్లు విచారించి యాతఁడేదేని ప్రాఁతవస్త్రమునో రాగిడబ్బనో దానముగావించును. మఱియు నిఁకముందు నేను జేసినదానమునకుఁ గోటిరెట్లు ప్రతిఫలము నొందుదునని తలంచును ౧౩ కుశావర్తములో కురుక్షేత్రములోఁ గావించినదానమహిమలను విని దానములు గావించును. అనంతరము తన హృదయమునందు నేను కోటిరెట్లు ఫలితము నొందుదునని ఆశించును. ౧౪ డబ్బునో దుగ్గానినో దానముగావించును. అతిథిఅభ్యాగతుల ముఖమునందొక తృణమునో కణమునో వేయును. అనంతరము తనమనస్సులో "నీకవాకు నేనొసంగిన దానికిఁ గోటిరెట్లు లభింపఁగలవు ౧౫ ఆకోటిరెట్లు నేను ముందుజన్మమునందు హాయిగాఁ గూర్చుండి యనుభవింతును." అని యనుకొనును. ఇట్లి ప్రాణులు ... జన్మకర్మములయందుఁ గూరుకొనిపోవును. ౧౬

ఈజన్మమునందు నేనేమియిచ్చితినో

డుం దిరుగం బొందంగల్గుదునని తలంచువాండు అజ్ఞానియనియును, బద్ధుండని యును నెఱుంగవలయును ౧౬ బహుజన్మములపిమ్మట నీనరదేహము లభించినది. ఒకవేళ నీదేహమున జ్ఞానముచే సద్గతికలుగదేని మఱల గర్భవాసము విడిపోవదు. ౧౭ ఆపిమ్మట గర్భవాస మీ నరదేహమునందే కలుగునని నిశ్చయముగా భావింప వీలులేదు. ఆకస్మికముగా నీచయోనుల ... జనించుటగూడం దటస్థింపవచ్చును. ౧౮ శాస్త్రము లనేకములు గలవు. అందు ననేకులీ లోకమునందు మఱల నరజన్మము లభించుట దుర్లభమని ఏకకంఠముగా నిశ్చయించియున్నారు ౨౦ పాపపుణ్యములు సమముగా నున్నపుడే మానవదేహము లభించుననియు నితరవిధముగా మానవజన్మము ప్రాప్తింపదనియు శ్రీభాగవతములో వ్యాసులవారు చెప్పినారు ౨౧

శ్లో॥ శరీరమాద్యం సులభం సుదుర్లభం
ప్లవం సుకల్పం గురుకర్ణధారం
మాయానుకూలేన నమస్వతేరితం
పుమాన్ భవాబ్ధిం నతరేత్సఆత్మహా॥ ౧

పరమదుర్లభమును, అతిదృఢమునగు నరదేహరూపమను నౌకను గురురూపియగు కర్ణధారుని ఈశ్వరకృపారూపమగు అనుకూలవాయువును బొందియుండియు భవసాగరమును దాటంజాలని మానవుండు ఆత్మహంతకుండు ౨౨, ౨౩ జ్ఞానములేనియెడల మనుజుండు ఎనుబదినాలుగు లక్షల జన్మమృత్యువుల ననుభవింపవలసియున్నది. దీనినిబట్టి యాతండు ఎనుబదినాలుగులక్షల జీవములను గావించెనని భావింపవలెను. ఇందువలననే యాతండాత్మహంతకుం డయ్యెను ౨౪ జీవుండు నరదేహమునందు జ్ఞానప్రాప్తి గావించుకొననంతవఱకు జననమరణములు విడిపోవు. నానావిధదారుణములును, నీచములునునగు యోనుల ననుభవింపవలసియే యుండును ౨౫ జ్ఞానము కలుగకుండుటవలన జీవునకు, ఎలుగుబంటి, కోతి, కుక్క, పంది, గుఱ్ఱము, ఎద్దు, గేదె, గాడిద, కాకి, కో..., నక్క, బల్లి, ..., ఈగ మున్నగు నీచయోనులెన్నియో యనుభవింపవలసివచ్చును ... మూర్ఖమగు మనుష్యజాతి ముందుజన్మమును గూర్చి యిందుమీఁద ... ఆశపడుచున్నది. ౨౬, ౨౭ చనిపోయిన

పిమ్మట మఱల మనుష్యదేహమే లభించునను విశ్వాస ముంచుకొనుటలో మనుజులు సిగ్గుపడకున్నారు ౨౮ మఱల నరదేహమే లభించుటకుం దగిన పుణ్య మామానవుం డేమిసంపాదించుకొనెను? ముందుజన్మవు టాశపెట్టుకొనుట దురాశ యనిపించుకొనును ౨౯ మూర్ఖమును, అజ్ఞానమునునగు నీమనుష్యజాతి సంకల్పమువలననే స్వయముగా దన్ను బంధించుకొని తనకుందాను శత్రువై కూర్చుండియున్నది. ౩౦

ఆత్మైవహ్యాత్మనో బంధురాత్మైవరిపురాత్మనః॥

ఆ సంకల్పబంధనము సాధుసమాగమమువలన విడిపోవును ౩౧ సమస్త చరాచరజీవుల శరీరములు పంచభూతములవలన నిర్మాణములగుచున్నవి. ప్రకృతిస్వభావముగనే జగదాకారమునందు వర్తించుచున్నది ౩౨ దేహము, అవస్థ, అభిమానము, స్థానము, భోగము, మాత్రము, గుణము, శక్తి మున్నగునవి చౌపుటి (నాల్గేసిగల) తత్త్వములలక్షణములు * ౩౩ పిండబ్రహ్మాండములరచనము ఇట్టిది. విస్తారమువలనం గల్పనము వృద్ధియయ్యెను. తత్త్వజ్ఞానమునుగూర్చిన నిర్ధారణము చేసిచేసి నానామతములు డీకొనుచున్నవి. ౩౪ ఆ నానామతములలో నానాభేదములు గలవు. భేదములవలన వివాదములు వృద్ధియగుచున్నవి. కాని యేకత్వవిషయము సాధువులుమాత్రమే యెఱుంగుదురు. ౩౫ ఆవిషయలక్షణమేమన! దేహము పాంచభౌతికము దానియందుంగల ఆత్మ ముఖ్యమైనది. ౩౬ దేహము అంత్యమున నాశనమైపోవును. కావున దాని నాత్మయనంజాలము. దేహములందు నానాతత్త్వముల సముదాయ మిమిడియున్నది. ౩౭ అంతఃకరణము, ప్రాణము, విషయములు, దశేంద్రియములు, సూక్ష్మదేహము ౨ మున్నగువాని లక్షణములు శాస్త్రములలో వివరింపంబడియున్నవి. ౩౮ సూక్ష్మదేహమునుగూర్చి శోధించుటవలన అంతఃకరణము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము మున్నగు

---

* నాలుగేసి తత్త్వములుగల చౌపుటినిగూర్చి ౧౪ వదశకము ౯ వసమాసము ౧ మొదలు ... పద్యములలో విస్తృతముగ వర్ణింపంబడెను. అందుంజూడనగును.

౨ సూక్ష్మదేహ వివరణమును గూర్చిన విశేషవర్ణనము ౧౭ వ దశకము ... వ, సమాసము ౧౭ మొదలు ౨౨ వఱకుగల పద్యములలో గ్రాంథవలయును.

నానాతత్త్వోపాధులకంటె వేఱుగ ఆత్మయున్నదని విశదమగును. ౩౯ స్థూలము, సూక్ష్మము, కారణము, మహాకారణము, విరాట్టు, హిరణ్యగర్భ, అవ్యాకృత, మూలప్రకృతి, యను నామములుగల దేహము లెనిమిది గలవు. ౪౦ నాలుగు పిండములలో నాలుగు బ్రహ్మాండములలో నీవిధముగా దేహము లెనిమిదిగలవు. వీనియందు ప్రకృతినిబురుషుని వృద్ధినొందించినచో పదిదేహము లగును. ౪౧ తత్త్వముల లక్షణమట్టిది. ఆత్మ తత్త్వములకు సాక్షిగనున్నది. ఐనను ఆత్మతత్త్వములకంటె వేఱుగనున్నది. కార్యము, కర్త, కారణము, ఈమూడు దాని (ఆత్మయొక్క) దృశ్యములు ౪౨

జీవశివులు, పిండబ్రహ్మాండములు మున్నగునవి మాయ, అవిద్యలతో సంబంధించిన గందరగోళములు. వీనిని (ఈగందరగోళములను) వివరింపఁబూనినచో విషయము మిగుల విస్తృతమగును. ఆత్మ వీనియన్నింటికంటెను వేఱుగా నున్నది. ౪౩ వాస్తవముగాఁ జూచినచో ఆత్మలు నాలుగుగలవు. వానిలక్షణములు చెప్పెదును. ఈ చెప్పఁబోవువిషయమునందు మీహృదయము దృఢముగా నుంచుఁడు. ౪౪ మొదటిది జీవాత్మ, రెండవది శివాత్మ, మూఁడవది సంపూర్ణవిశ్వవిశ్వమున కాత్మయగు పరమాత్మ, నాలుగవది నిర్మలాత్మ ౪౫ మాయాకారణమున నీనాలుగింటిలో ఉచ్చనీచభేదములు భాసించుచున్నవి. కాని వాస్తవమున కీనాలుగును నొక్కటియే. దీనికి దృష్టాంతము. ౪౬ ఘటాకాశము, మఠాకాశము, మహదాకాశము, చిదాకాశము అను నీనాల్గును ఆకాశభేదములు. (ఉపాధికారణమునఁగల్గినవి) కాని వాస్తవమున కివియన్నియును గలసి ఒక్కయాకాశమేయైనట్లు ౪౭ జీవాత్మ, శివాత్మ, పరమాత్మ, నిర్మలాత్మలు అను నీనాలుగు భేదములును మాయాకారముననే యేర్పడి యున్నవి. బాగుగాఁ జూచితిమేని అన్నియును గలసి ఆత్మయొక్కటియే. ౪౮ ఘటమునందు వ్యాపించియున్న ఆకాశము ఘటాకాశము. అటులే పిండము (సచరాచర దేహములు) నందు వ్యాప్తమైయున్న బ్రహ్మాంశమును జీవాత్మయందురు. ౪౯ మఠము (గృహము) నందు వ్యాపకమైయున్న ఆకాశము మఠాకాశము. అటులె బ్రహ్మాండమునందున్న బ్రహ్మాంశమును శివాత్మయనిచెప్పెదరు. ౫౦ మఠమునకు వెలుపలవ్యాపించియున్నటులఁ

గాన్పించు ఆకాశమును మహదాకాశమని చెప్పెదరు. ఇట్లే బ్రహ్మాండమునకు వెలుపలనున్న బ్రహ్మాంశమును బరమాత్మయని చెప్పెదరు. ౫౧ చిదాకాశము ఘటమఠాదులగు నుపాధులకంటె వేఱుగానున్నట్లు పరమాత్మగూడ దృశ్యరూపోపాధికంటె వేఱుగానున్నది. ౫౨ ఉపాధియోగమువలనఆకాశము భిన్నముగాఁ గాన్పించును. సత్యముగ నది యభిన్నమైనది. అట్లె స్వానందఘనమగు సచ్చిదానందపరమాత్మగూడ సమరసమును అభిన్నమునై యున్నది. ౫౩ దృశ్యమునందు లోపలవెలుపల నిరంతరముగాఁ బరమాత్మ వ్యాప్తమైయున్నది. దానిగొప్పతనము వివరించుటకు శేషువుగూడ నసమర్థుఁడు. ౫౪ ఈపరమాత్మను నెఱుంగుటవలన జీవత్వముండదు. ఉపాధినిజూపుచున్నపుడు జీవాత్మాదిచతుర్భేదములును దానియోగముననే యేర్పడియున్నటుల విశదమగును. వాస్తవమున కివియన్నియు నభిన్నములు. ౫౫ ప్రాణి జీవత్వకారణమున ఏకదేశీయుడై అహంకారయోగమువలన జన్మపరిభ్రమణములందుఁ బడెను. వివేకదృష్టితోఁ జూచినచోఁ బ్రాణికి జన్మాదులేవియును లేవని తేటపడును. ౫౬

జన్మమృత్యువులనుండి విడిపోవుటను మోక్షమందురు. తత్త్వముల నన్వేషించినచో వాస్తవవస్తువు (బ్రహ్మము) లభించును. ౫౭ ఆవస్తువే మనస్థమైయున్నారము 'సోహం'అను నీమహావాక్యతాత్పర్యమును సాధువులే తమనోటినుండిచెప్పెదురు. ౫౮ సాధు వీక్షణమునం దనుగ్రహించునో ఆక్షణముననే మోక్షముగలుగును. ఆత్మయందు బంధన మెక్కడనుండివచ్చినది? ౫౯ ఇంతటితో మాశ్రోతలకు శంకవిడిపోవును. సందేహవృత్తి యస్తమించును. సాధుజనసంగమువలనఁ దత్కాలముననే మోక్షపదవి లభించును. ౬౦ స్వప్నమందు బంధితమగుప్రాణి జాగ్రదవస్థలోనికి వచ్చినపిదప ముక్తమగునట్లు అజ్ఞానకారణమున బద్ధులగుజీవులు జ్ఞానమువలన మోక్షమొందుచున్నారు. ౬౧ అజ్ఞానసిద్ధ యంతమైనపిమ్మట సంకల్పవిషయికములగు దుఃఖములన్నియు నాశనమగును. వెంటనే మోక్షము సిద్ధించును. ౬౨ స్వప్నబంధములను ద్రెంచివేయుటకు ఇతరసాధనములను వెదుకవలసినయవసరము లేదు. జాగ్రదవస్థనొందుటతక్క నందుల కితరయత్నముతోఁ బనియేలేదు, ౬౩ అట్లె సంకల్పముతో బంధింపఁబడిన జీవునకుఁ గడతేరుటకు రెండవయుపాయ మేదియులేదు. అతనిబంధనము

లన్నియు వివేకమువలననే విడిపోవును. ౬౪ వివేకము లేక చేయుసమస్తో పాయములు వ్యర్థములగును. వివేకముతోఁ జూచినయెడల స్వయముగా జీవుఁడేయాత్మ. ౬౫ ఆత్మకు బద్ధత్వము లేదు. మోక్షము లేదు. ఆత్మ కీరెంటిలో నేదియును లేదు. అట్లే జన్మమృత్యువులుకలుగుటగూడ ఆత్మ కెప్పటికిని సంభవముగాదు. ౬౬

ఎనిమిదవ సమాసము.

ప ర మా త్మ ద ర్శ న ము.

పరమాత్మవునీవేయని వెనుకఁ జెప్పియుంటిని. ఇప్పు డాపరమాత్మను జూడుఁడు. ౧ పరమాత్మకు జన్మమృత్యువులు, రాకపోకలు, బంధమోక్షములు లేవు. ౨ పరమాత్మ నిర్గుణముగను, నిరాకారముగను, అనంతముగను, అపారముగను, నిత్యముగను, నిరంతరముగనునై యథావిధముగనున్నది. ౩ అదియన్నింటియందును వ్యాప్తమైయున్నది. అనేకములో నొక్కటిగనున్నది. దానినిగూర్చినవివేక మతర్క్యము. ౪ పరమాత్మస్థితి పైనిచెప్పఁబడినటులుండునని శ్రుతులుపలుకుచున్నవి. భక్తివలనఁ బరమాత్మలభించుననుట నిస్సంశయము. ౫ ఆభక్తి తొమ్మిదివిధములుగానున్నది. నవవిధభక్తులవలన ననేకులుముక్తులైరి. ౬ ఈతొమ్మిదివిధములగుభక్తులలో ఆత్మనివేదనభక్తి ముఖ్యమును శ్రేష్ఠమును నై యున్నది. దీనిని స్వయముగను స్వానుభవరూపముగను విచారముచేయవలయును ౭ తనను దనయనుభవముతోనే నివేదింపవలయును. దీనినే ఆత్మనివేదనమని చెప్పుదురు. ౮ మహాపూజాంతమున "నా" యనుమోహమును విడిచి దేవతాసన్నిధిని మస్తకమునుగోసి యర్పించునట్లు ఆత్మనివేదన భక్తియందుగూడఁ బరమేశ్వరునిలోఁ దన "నా" యనుభావమును లీనపఱుపవలయును. ౯ తన్నుఁదానర్పించెడి (నివేదించెడి) భక్తులు కొలఁదిగనుందురు. అట్లుచేయువారలకుఁ బరమాత్ముఁడు తత్క్షణమే ముక్తినొసంగును ౧౦ శ్రోతయిట్లు ప్రశ్నించెను. తననెట్లునివేదించుకొనవలయును? ఎక్కడకేనిపోయి సాష్టాంగపడవలయునా? లేక దేవతాసన్నిధిని దలను గోసిపెట్టవలయునా? ఏమి చేయవలయును ౧౧ దీని ప్రత్యుత్తరమును సావధానముగ వినుండు ౧౨

ఆత్మనివేదనలక్షణ మెద్దియన? మొట్టమొదట "నేనెవ్వఁడను" అనిచూడవలయును. ఆపిమ్మట నిర్గుణపరమాత్మను గు ర్తింపవలయును ౧౩ ఈప్రకారముగాఁ బరమాత్మునియొక్కయు భక్తునియొక్కయు శోధనము గావించుటవలన ఆత్మనివేదనమగును. భక్తుఁడు పరమాత్మని శాశ్వతత్వము ననుభవముగావించును ౧౪ పరమాత్మను గురుతించుచు గురుతించుచునుండ భక్తుఁడు ఆపరమాత్మయందె తద్రూపమైపోవును. మఱియుఁ బరమాత్ముని యందును భక్తునియందును భిన్నత్వమేమాత్రము నుండదు ౧౫ భక్తుఁడు పరమాత్మునికి విభక్తుఁడుగ నుండడు. అందువలననే యాతఁడు భక్తుఁడని పిలువఁబడుచున్నాఁడు. బంధనము లేనివాఁడు ముక్తుఁడగును. నేనుచెప్పునది శాస్త్రోక్తము ౧౬ పరమాత్మునియొక్కయు భక్తునియొక్కయు మూలమును జూచినచో నీరెంటిమూలములకు భేదము లేదనియు నివిరెండును నొక్కటియేయనియు నీదృశ్యము జగత్తుకంటె వేఱుగానున్నదనియు విశదమగును ౧౭ పరమాత్మునితోఁ గలిసినపిమ్మట ద్వైతముండదు. పరమాత్మకును, భక్తునకును గలభిన్నత్వభేదము నశించును ౧౮ ఆత్మనివేదనానంతనమునుండెడి యభేదభక్తినే సత్యసాయుజ్యముక్తియని యెఱుంగవలయును. ౧౯ సాధుపురుషుల శరణ్యములో నికరిగి అద్వైతనిరూపణ బోధనొందునాతఁడు తప్పక తద్రూపమగును. వానినొకవేళ మఱల వేఱుచేయఁబూనినను వేఱుకాఁడు ౨౦ నది సముద్రములోఁగలసిపోయినపిదప మఱల వేఱుజేయ నశక్యము. లోహము బంగారమైనపిమ్మట నదిమఱలఁ గాళిమమునొందఁజాలదు ౨౧ అటులె భగవంతునిలోఁ గలసిపోయినవాఁడు మఱల వేఱుగాఁజాలఁడు. భక్తుఁడు స్వయముగాఁ బరమాత్ముఁడగును. ఇఁక మఱల నాతఁడెన్నఁటికిని విభక్తుఁడుగాఁడు. ౨౨ పరమాత్మునియొక్కయు భక్తునియొక్కయు అనన్యతను అనుభవముగావించు సాధుపురుషునే మోక్షప్రదాయకుఁ డనఁదగును ౨౩

ఇఁక భక్తత్వముతోఁ బరమాత్మునిదర్శించుతెఱంగుదెలుపుదును. ఈయంశము నెఱింగినంతన పరమాత్మునియైశ్వర్యము మనలోని కేతెంచును ౨౪ దేహమునే నేననిభావించుటవలన స్వాభావికముగా దేహదుఃఖముల ననుభవింపవలసివచ్చును. దేహాతీతుఁడగుటవలనఁ బరబ్రహ్మము లభించును. ౨౫ ప్రశ్న. దేహాతీతుఁడగుటయెట్లు? పరబ్రహ్మము నెట్లుపొందవలయును?

ఐశ్వర్యలక్షణము లెయ్యేవి? ఆజ్ఞయిండు ౨౬ దీనికిఁ బ్రత్యుత్తరమును
జెప్పుచున్నాఁడను. సావధానులరై వినుండు ౨౭ వస్తువు దేహాతీతము. ఆపర
మాత్మయే నిన్నుఁగా నీవు భావింపుము. విదేహుఁడవైన నీకు దేహసంగము
తో నేమియుఁ బనిలేదు. ౨౮ ఇట్టి (పైనిబేర్కొనిన) బుద్ధిగల్గినవానిని వేద
ము లభివర్ణించును. నానాశాస్త్రములుగూడ వెదకి వానినిబొందనేరవు
౨౯ దేహబుద్ధిని విడచినపిమ్మట సత్యముగా నీయైశ్వర్యము సిద్ధించును.
దేహమే నేనని భావించునెడల అధోగతికలుగును ౩౦ సాధుపురుషుని
వచనముల నసత్యములుగాఁ దలంపఁదగదు. ఏలయన! అట్లుభావించినచోఁ
బాపముగలుగును ౩౧ శిష్యుఁడిటులఁ బ్రశ్నించెను-ఓస్వామీ! సాధువచ
నములనఁగానెయ్యవి? విశ్వాసముంచదగినదెద్ది? అనుగ్రహించి సెలవింపు
౩౨ స్వానందధనము, అజన్మ, సోహం, అనుశబ్దములతో నిర్దిష్టమగు నా
త్మయే నీవు. ఇదియే సాధువచనము. దీనిమీదనే విశ్వాసముంచవలయును.
౩౩ నీవే నిరంతరము బ్రహ్మమవు మహావాక్యమునందలి రహస్యమిదియే.
ఈవాక్యమును మఱువఁగూడదు. ౩౪ దేహాంతమైనపిమ్మట నేననంతమును
(బ్రహ్మమును) పొందెదను అను నీవిషయము నిర్భ్రాంతమని యెప్పుడును
భావింపరాదు ౩౫ కొందఱుమూర్ఖులు కల్పాంతమునందు మాయనాశన
మైనప్పుడె మాకు బ్రహ్మప్రాప్తియగును. ఇంకొకవిధముగాఁ గలుగదని
చెప్పుచుందురు. ౩౬ మాయకుఁ గల్పాంతమైనపుడుగాని లేక దేహమున
కత్యంతముగలిగినపుడుగాని నేను బ్రహ్మము బొందుదునని చెప్పుట మిథ్య.
ఈవిధముగా సమాధానము కలుగఁజాలదు. సమాధానలక్షణము వేఱుగా
నున్నది. ౩౭, ౩౮ "సేనయంతయును మరణించినపిమ్మట రాజ్యపదవి
ప్రాప్తించును" అనితలంచువానికి సేన సురక్షితముగా నుండకున్నచో
రాజ్యము నేలఁజాలము అను నంశము తెలియదు. (ఇదిమూర్ఖకల్పనము)
౩౯ దేనియందు మాయయుండియు నుండదో దేహముండియు దేనియం
దు విదేహదశ కలుగునో యట్టిసమాధానమును బడయవలయును ౪౦
రాజ్యపదము చేతిలోనికివచ్చినపిమ్మట సేనయున్నను అభ్యంతరమేమియు
నులేదు. ఏలయన! సేనయున్నచో రాజ్యమెన్నఁటికిని బోదు. ౪౧ ఆత్మ
జ్ఞానము ప్రాప్తమైనపిదప దృశ్యదేహస్థితిగూడ నిట్టిదే. దేహదృష్టికలుగు

టవలన సమాధానము శాంతితొలంగిపోదు. * ౪౨ మార్గమధ్యమునందే దే
ని సర్పరూపముగా నున్న చెట్టువేరును జూచినచో
మిగుల భయముకలుగును. వాస్తవమున కిది సర్పముకాదు. చెట్టువేరు
లని తెలిసినపిమ్మట దానినెవరును గొట్టరు (౪౩) ఇట్లె మాయ భయానక
మైనను యోజించిచూచినచో మిథ్య. మఱల నది భయానకమని యేల
తలంపవలయును? ౪౪ ఎండమావులనుజూచి యెవరేని భ్రాంతులై దీని
నెట్లుదాటఁగలుగుదునని చింతించుచున్నచో నది భ్రమ. దానిని బాగుగా
విచారించితిమేని సంకటము కలిగించునది కాదని స్పష్టమగును. ౪౫ భయా
నకమగుస్వప్నమును గాంచితిమేని స్వప్నావస్థయందు మిగుల భయ
ముకలుగును. మేలుకొన్నపిదప భయముఁ బొందవలసిన యవసరమే లేదు.
౪౬ మాయ కల్పనమును జూపుచున్నదినిజమే. కాని కల్పనాతీతుడైన
పిదప నిర్వికల్పదశ సిద్ధించును. నిర్వికల్పదశలో మాయ రాఁజాలదు.
౪౭ అంత్యమున మతియెటుండునో గతియు నటులుండునని యందఱును
జెప్పుచుందురు. కావున దేహబుద్ధి నశించినపిమ్మట సహజముగనే మోక్ష
ముసిద్ధించును. ౪౮ స్థూలసూక్ష్మకారణమహాకారణములు అను నీనాల్గు
దేహములయంత్యమునకు జన్మమునకు ఆత్మ యంటకయున్నది. ఆయా
త్మయే నీవు. ౪౯.

పైనఁజెప్పఁబడినవిధముగా మతిగలవానికి జ్ఞానమువలన ఆత్మగతి
కలుగును. అంత నాతఁడు అవగతికి, గతికి దూరమగును ౫౦ ఎచ్చటవేద
ములకుఁ గూడ మతిమందమైపోవుచున్నదో యచ్చట గతియవగతు లెక్క
డినుండివచ్చును? అచ్చట ఆత్మ, శాస్త్రము, గురుప్రతీతియను నీమూఁడు
నొక్కటియగుచున్నవిగదా (ఈమూఁడు నేకత్వమొందుచున్నవి) ౫౧

---

* రాజ్యపదవియు, సేనయు నెటులుండునో యట్లె ఆత్మజ్ఞానము, దృశ్యదేహ
ముఉన్నవి. సేనయంతయును మరణించినపిదప రాజగుటకంటె సేనయుండఁగనే రా
జగుట నుంచిది. మాయయుండినను అదిమిథ్యగాఁ దోచవలెను. దేహముండినను విదేహ
స్థితి ప్రాప్తి కావలయును. రాజ్యపదవి లభించినపిమ్మట సేనయున్నంతమాత్రమున
నేమియును జెడిపోదు. ఇట్లె ఆత్మజ్ఞానము గలిగినపిమ్మట మాయయును దేహమును
నేమియును జేయఁజాలవు.

సద్గురునిబోధవలన జీవత్వభ్రాంతి తొలంగిపోవును. వస్తువుఆత్మానుభవము లోనికివచ్చును. ప్రాణి ఉత్తమగతి నొందును. ౧౨ సద్గురుబోధ నాఁకించుట తటస్థింపఁగనే నాలుగు దేహము లంతరించును. అనంతరము సత్స్వరూపమునందు నిదిధ్యాసము కలుగును. ౧౩ ఆనిదిధ్యాసమువలనఁ బ్రాణి యంతమునందు స్వయముగా పరబ్రహ్మమే (ధ్యేయమే) యగును. మఱియు సాయుజ్యముక్తికి స్వామియైయెకూర్చుండును. ౧౪ దృశ్యపదార్థములను నిరసించుటచే వాస్తవమునందు మిగిలినది ఆత్మయే. దృశ్య మాదినుండియు మిథ్యయని ధ్యానముతో విచారించినచో విదితమగును. ౧౫ ఈమిథ్య (మాయ) యొక్క మిథ్యాత్వము నెఱుంగుటయు నామిథ్యాత్వము ననుభవములోనికిఁ దెచ్చుకొనుటయు మోక్షమనఁబడును. ౧౬ సద్గురుని వచనమును హృదయమునందునిలుపువాఁడే మోక్షమునకధికారి. వాఁడు మాటిమాటికి అత్యాదరముతో శ్రవణము, మననము జేయుచునే యుండును ౧౭ ఎచ్చట రెండుపక్షములుండవో ఎచ్చట లక్ష్యాలక్ష్యములు లేవో యదియే ఆత్మ. దానిపేరే మోక్షము. ౧౮ అచ్చట (మోక్షమునందు) ధ్యేయధారణములు సమాప్తియగును. కల్పనము నిర్వికల్పనమునందు లీనమగును. మఱియుఁ గేవలజ్ఞప్తిమాత్రమును, జ్ఞానస్వరూపమునునగు సూక్ష్మబ్రహ్మముమాత్రమే శేషించియుండును. ౧౯

అనంతరము భవమృగజలము (జన్మమను ఎండమావులు) మిథ్యాబంధములు విడిపోవును. అట్టిదశయందు ముక్తుఁడు వాస్తవముగా నాత్మను జన్మదుఃఖములనుండి విముక్తముగావించును. ౨౦ అంతియగాదు. నిస్సంగుని సంగవ్యాధిని, విదేహుని దేహబుద్ధిని, నిష్ప్రపంచుని యుపాధిని, గూడ వివేకముఁ ద్రెంపివేయును. ౨౧ అద్వైతునకుఁగల ద్వైతభావమును దొలంగించును. ఏకాంతున కేకాంతవాసమునొసంగును. మఱియు ననంతున కనంతపుటంతము నిచ్చివేయును. ౨౨ జాగ్రతుని మేలుకొలుపును. మేలుకొనియున్నవానికి సావధానము సమకూర్చును. ఆత్మజ్ఞానికి ఆత్మజ్ఞానమును బ్రబోధించును. ౨౩ అమృతమును అమరముగను, మోక్షమును ముక్తినిలయముగను గావించును. సంయోగమునకు నిరంతరయోగమునొసంగును. ౨౪ నిర్గుణమును నిర్గుణముగఁ జేయును. ఈవిధముగా సార్థకమునకు సార్థకము కలుగును. చాలదినములకుఁ దనకు "తన"

యనునదెద్దియో యదిలభించును. ౨౫ ద్వైతము తెగి చినిఁగిపోవును. అభేదము భేదమును ద్రెంచివేయును. మఱియు భూతపంచక(పంచభూతాత్మకమగు దేహముయొక్క అహంకర్తృత్వభావము) బాధ వెడలిపోవును. ౨౬ సాధనఫలము లభించును. నిశ్చలమునకు నిశ్చలముదొరకును. వివేకబలము వలన నిర్మలమునందుఁగల మలముగూడఁ దొలంగును. ౨౭ దగ్గఱనున్నను దేనినిమఱచియుంటిమో యది(బ్రహ్మము) ప్రాప్తమగును. చూచుచుండఁగనే జన్మదుఃఖములు తొలంగిపోవును. ౨౮ దుష్టస్వప్నమునందు బ్రాహ్మణుఁడు నీచజాతినొంది భయమునొందును. మేల్కనినపిమ్మట తానుత్తమజాతియందెయున్నసంగతి గమనించును. ౨౯ ఇట్లే అజ్ఞానరూపమగు స్వప్నమునందుఁ దనసత్యస్వరూపమును మఱచియుండినజీవుఁడు జ్ఞానరూపమగు మెలకువగలిగిన పిమ్మట తనసత్యస్వరూపమును గుర్తించుచున్నాఁడు. ఇట్టిజ్ఞానులలక్షణములే ముందుసమాసములోఁ జెప్పఁబడినవి. ౩౦

తొమ్మిదవ సమాసము.

సాధులక్షణములు.

అమృతపానమును గావించినపిమ్మట శరీరము కాంతిమంతమగును. అటులె సత్స్వరూపానుభవమైనపిమ్మటఁ గృతార్థత సమకూరును. ఇఁక సత్పురుషులనడిగి తెలిసికొనవలసినలక్షణము లేమిఁకను? ౧ అయినను సత్యమగు నాత్మజ్ఞానముగలవాఁ డెవఁడు? అనుదానినెఱుంగుటకిచట సాధారణరీతిగా సాధువులలక్షణములను వివరించెదను. ౨ సిద్ధులు, సాధువులు ప్రత్యక్షముగా సత్స్వరూపులైయున్నారు. సత్స్వరూపసిద్ధస్వరూపములందు భేదమేమియును లేదు. ౩ స్వత్స్వరూపుఁడైయుండు వానిని సిద్ధుఁడందురు. సిద్ధస్వరూపమునందే (బ్రహ్మస్వరూపమునందే) సిద్ధత్వము శోభనిచ్చును ౪ వేదశాస్త్రము లెవనిని సహజముగా సత్స్వరూపుఁడని కొనియాడుచున్నవో వానిని సిద్ధుఁడనిచెప్పవచ్చును. రెండవవానినట్లుచెప్ప వీలులేదు. ౫ ఐనను సాధకులకు వివేకవంతమగు జ్ఞానము కలుగుటనుగూర్చి కొంచెముచెప్పెదను. సిద్ధలక్షణకౌతుకులు వినుండు ౬ అంతరస్థితి స్వరూపాకారమైనప్పుడు శరీరస్థితి స్వప్నావస్థయందలి స్వప్నరచనమువలెనగును. ౭

ఐనను సిద్ధులలక్షణములను గొంచెముగఁ జెప్పెదను. ఇందువలనఁ బర మార్థముయొక్క చిహ్నము శ్రోతలకు విశదమగును. ౮

సాధుల ముఖ్యలక్షణ మేమన, సాధువు నిరంతరము స్వరూపాను సంధానమున లక్ష్యముంచును. జనులకంటె వేఱుగ నుండును ౯ స్వరూపమునందు దృష్టిలగ్నమైనంతనే సంసారచింత తొలఁగిపోవును. అధ్యాత్మనిరూపణమునందు మమత్వము గలుగును. ౧౦ ఇదియే సిద్ధలక్షణము. ఈలక్షణములుగలవాఁడే సిద్ధుఁడు. సాధకము లేనిది సిద్ధలక్షణ మేర్పడఁ జాలదు. ౧౧ సిద్ధులు చూచుటకు సాధకులవలెఁ గనిపింతురుగాని వార లంతరంగమునందు స్వరూపాకారులు. ఇట్టి సిద్ధలక్షణములు నేర్పరులగు వారలు గమనింపవలయును ౧౨ సందేహ రహితసాధనులై యుండుటయే సిద్ధులలక్షణము. వారలకు లోపలను వెలుపలను అచలమగు సమాధాన ముండును ౧౩ అంతరస్థితి యచలమైపోయినయెడల చంచలత నిలువనే నిలువదు. స్వరూపమునందు వృత్తిలగ్నమగుటవలన మానవుఁడు స్వరూపమె యగును ౧౪ ఇట్టిదశ గలిగిన మానవుఁడు నడచుచున్నను అచలుఁడె. చంచలుఁడయ్యును నిశ్చలుఁడె. ఇంతయేల ఆతఁడు స్వయముగా నిశ్చలుఁడు. వానిదేహముమాత్రము చంచలము ౧౫ స్వరూపమునందు స్వరూపుఁడైనవాఁడు పడియున్నను లేచి పరుగెత్తినను అచలుఁడే ౧౬ ఇచట ముఖ్యకారణము అంతరస్థితి. అంతరమునందే నివృత్తి కావలయును. ఎవనిహృదయము భగవంతునియందు లగ్నమైనదో యతఁడె సాధుపురుషుఁడు ౧౭ వెలుపల (దేహాదులు) ఎటులున్నను సరియే. అంతరముమాత్రము స్వరూపమునందు లగ్నమైయుండవలయును. ఈలక్షణములన్నియు సాధువులయెడ సహజముగాఁ గన్పించును. ౧౮ రాజ్యము లభించిన పిమ్మట రాజకళ సహజముగా వచ్చును. అటులే అంతఃకరణము స్వరూపమునందు లగ్నమైనయెడల నీలక్షణములన్నియు సహజముగా వచ్చును. ౧౯ అన్యవిధముగా నభ్యాసము గావించినచో ఈలక్షణము లెన్నంటికిని సాధ్యముకావు. స్వరూపములో స్వరూపమె యుండవలయును ౨౦ నిర్గుణమునందు వృత్తియుండుటయే అన్నిటికంటెను గొప్ప యభ్యాసము. సాధుసమాగము నొనరించి అధ్యాత్మనిరూపణమును మననము చేయుట వలన స్వరూపస్థితి కలుగును. ౨౧ స్వరూపాకారుఁడై యుత్తమలక్షణ

ముల నభ్యసింపవలయును. స్వరూపమును విడిచినయెడల సాధువు లేవగింతురు ౨౨ ఇపు డీకథానకమును జాలించెదను. ఇఁక సాధుజనులలక్షణములను వినుండు. వీనిని వినుటవలన సాధకులకు సమాధానము ప్రాప్తించును. ౨౩ స్వరూపమునందుఁ గల్పనము లీనమై పోఁగానే కామ్యములపైఁ గోర్కెయుండదు. కాననే సాధుజనులకుఁ గామ్యము లుండవు. ౨౪ కల్పనముగావించిన విషయము తొలఁగిపోయినపుడు క్రోధముకలుగును. సాధుజనులుమాత్ర మిట్లు క్రోధమునకు బాల్గారు ౨౫ అందువలననే వారు క్రోధరహితులై యున్నారు. సాధుపురుషులు నాశవంతమగు పదార్థమును విడిచి శాశ్వతస్వరూపమును జూచుచున్నారు. ౨౬ ఎచట రెండవ భేదమే లేదో యట్టి సాధుపురుషుని హృదయమునందుఁ గ్రోధ మెవరిపయి వచ్చును? ఇందువలననే సాధుపురుషులు సచరాచరమునందుఁ గ్రోధరహితులై వర్తించుచున్నారు. ౨౭ సాధువులు తమయందె తామానందింతురు. ఈస్థితిలో మదము నెవరిపై చూపుదురు. మదములేనివారుగాన సాధువులు వాదములందును వివాదములందును బాల్గొనక వేఱుగా నుందురు. ౨౮ సాధువు నిర్వికారస్వరూపుఁడై యుండును. నిర్వికారస్వరూపమునఁ దిరస్కార మెచటినుండి వచ్చును? అంతటను దానే తానుగానున్న సాధుపురుషుఁడు ఎవరిపై మత్సరమును జూపును? ౨౯ సాధువులు అనాయాసముగనే వస్తురూపులగుదురు. అందుచే వారలు మత్సరమునకు లోనుగారు. మదమత్సరపిశాచములు సాధువుల కంటవు ౩౦ సాధువు స్వయంభూస్వరూపుఁడుగనుండునుగాన నాతనిని దంభ మెటు లావరింపఁగలదు. స్వయంభూస్వరూపమునం దద్వైతమునకు నారంభమే లేదు గదా ౩౧ దృశ్యమును నష్టముగావించు స్వయంభూస్వరూపమునందుఁ బ్రపంచ మెట్లు రాఁగలదు? కావున సాధువులు నిష్ప్రపంచులని యెఱుంగవలెను. ౩౨ సమస్తబ్రహ్మాండము సాధుపురుషునకు గృహము. సాధువు పాంచభౌతికవిస్తరమును మిథ్యగాఁదలంచి శీఘ్రముగాఁ ద్యాగము గావించును. ౩౩ అందుచే సాధుపురుషుని లోభ మంటుకొనదు. సాధువు నిరంతరమును లోభరహితుఁడై యుండును. వాని వాసన శుద్ధస్వరూపమునందు సమరసమై కలసిపోవును. ౩౪ అంతటను దానే తానుగా నున్నవు డెవనినిగూర్చి శోకింపవలయును? ఈకారణము

వలన సాధుపురుషుని శోకరహితుఁడని యెఱుంగవలయును. ౩౫ నాశవంతమగు దృశ్యమును విడనాడిన శాశ్వతస్వరూపమును సేవించుటవలన సాధువును శోకరహితుఁడని తలంపవలయును. ౩౬ శోకముచే వృత్తిని దుఃఖితముగఁ జేయఁగోరునెడ నది సాధ్యముగాదు. ఏలయన, సాధువులయందు వృత్తి నివృత్తియై పోయెను. ఇందువలన నివృత్తులగు సాధువులు నిరంతరము శోకరహితులుగనే యుందురు. ౩౭ మోహముచే నొకవేళ మనస్సును వ్యాప్తముచేయఁగోరినయెడల నదియు సాధ్యముగాదు. ఏలయన, వారల మనస్సే బ్రహ్మమునం దున్మనమయ్యెను. అందుచే సాధుజనులు నిరంతరము మోహాతీతులుగ నుందురు. ౩౮ సాధు వద్వయవస్తువుగ నుండును. అట్టియెడ నచట భయమునకుఁ దావెక్కడిది? పరబ్రహ్మము నిర్భయమైనది. సాధువుగూడ నిర్భయస్వరూపుఁడు ౩౯ కావున సాధుపురుషుఁడు భయాతీతుఁడును నిర్భయుఁడును శాంతుఁడునునై యుండును. అన్నియును నంత్యమొందగలవుగాని సాధుసంతరూపుఁడు ౪౦ సత్యస్వరూపమునం దమరుఁడుగనున్నవానికి భయమెట్లు తెలియును. కావున సాధుజనులు నిర్భయముగా నుందురు. ౪౧ ఎచ్చట ద్వంద్వభేదము లేదో, ఎచట నంతయుఁదానే తానుగ నభేదరూపముగ నున్నదో యచ్చట దేహబుద్ధికి సంబంధించిన భేదము ఎచ్చటనుండి తలయెత్తఁగలదు? ౪౨ సాధుపురుషుఁడు బుద్ధితో నిర్గుణనిశ్చయము గావించును. నిర్గుణము నెవ్వఁడును గొనిపోవఁజాలఁడు. అందుచే సాధువులచే సాధుపురుషులు ఖేదపడుటకుఁ గారణమే లేదు. ౪౩ సాధువు స్వయముగ నొంటరిగనే యుండును. ఆస్థితిలో స్వార్థము నెందులకై యవలంబింపఁగలఁడు? దృశ్యరహితమగుతావున స్వార్థమున కవకాశమెట్లుగలుగును? ౪౪ సాధువు స్వయముగా నెప్పుడును ఒకఁడుగా (ఏకాంతముగా) నుండును? అట్టియెడ దుఃఖశోకములు గలుగుట కవకాశమెక్కడిది? ద్వైతములేనిది అవివేకముగూడ రాఁజాలదు ౪౫ పరమార్థమునం దాశయుంచుటచే సాధుపురుషునకు స్వార్థసంబంధమగు దురాశ తెగిపోవును. కావున నిరాశయుండుటయు సాధుచిహ్నము ౪౬ సాధువు ఆకాశమువలె మృదువుగ నుండును. కావున వానిమాటలలోఁ గాఠిన్య మెక్కడినుండివచ్చును ౪౭ బ్రహ్మస్వరూపసంయోగమువలన సాధువు స్వయముగా బ్రహ్మస్వరూపుఁడగును.

కావున సాధువు నిరంతరము వీతరాగిగ విషయరహితుఁడుగ నుండును ౪౮ స్వరూపస్థితి కలుగుటచే సాధువు దేహచింతను విడిచివేయును. అందుచేఁ గానున్నదానినిగూర్చి వాఁడించుకేని చింతనొందఁడు ౪౯ సాధువులబుద్ధి పరబ్రహ్మమునందు లీనమైయుండును. అందుచే వారలకు సంపూర్ణోపాధి పటాపంచలైపగిలిపోవును. అందువలననే వారు నిరుపాధికులుగ నున్నారు ౫౦ సాధువు నిరంతరము పరబ్రహ్మస్వరూపమునం దిమిడియుండును. పరబ్రహ్మస్వరూపమునం దేవిధమగు నన్యసంగమునకును నవకాశము లేదు. కాననే సాధువు మానము, అవమానములను లక్ష్యము సేయఁడు. ౫౧ అలక్ష్యమునందు లక్ష్యముంచినకారణమున సాధువు పరమదక్షుఁడగుచున్నాఁడు. అతఁడు పరమార్థపక్షము నవలంబించువిధ మెఱుంగును ౫౨ సాధువు స్వయముగా బ్రహ్మస్వరూపుఁడగుచున్నాఁడు. బ్రహ్మస్వరూపమునందు పాపమునకుఁ (మలమునకు) దావులేదు కావున సాధువు నిర్మలుఁడు ౫౩ సాధువుయొక్క ముఖ్యలక్షణమేమన్న అతఁడుపరబ్రహ్మస్వరూపమునందు లీనుఁడై యుండుటయే తనధర్మములన్నింటిలో శ్రేష్ఠమగుధర్మముగా భావించును. దీనినే యాతఁడు స్వధర్మముగా నెంచును ౫౪

సాధుసాంగత్యము గావించుటవలన స్వరూపస్థితి తనంతటనే వచ్చును. స్వరూపస్థితి వచ్చుటవలన దేహమునందు సాధుల ణము లేర్పడును ౫౫ అధ్యాత్మికనిరూపణముల నాలించుటవలన దేహమున సాధుల ణము కలుగును. కాని యాలక్షణములతోఁ దనియక స్వరూపానుసంధానుఁడై యుండుట మిగుల నవసరము ౫౬ నిరంతరము బ్రహ్మస్వరూపమునందుండుటవలన సాధువు స్వయముగా స్వరూపుఁడగును. దీనికిఁబిమ్మట శరీరమునందు సాధులక్షణము లేర్పడుట కాలస్యముపట్టదు. ౫౭ స్వరూపమునందు మతియుండుటవలన అవగుణములు తొలఁగిపోవును. ఇందుకొఱకు సాధుజనులసాంగత్యము ఆధ్యాత్మికనిరూపణము కావలయును ౫౮ సమస్తసృష్టిలో అనుభవ మొకవిధముగా లేదు. అనుభవము లనేకవిధముల నున్నవి. వానినన్నింటిని ముందుసమాసములో వివరించెదను ౫౯ జను లేస్థితిలోనున్నారో? అనుభవము నెట్లుచేయుచున్నారో తెలుపుదును. ధ్యానపూర్వకముగా వినుఁడు ౬౦

పదియవసమాసము.

బహువిధానుభవములు.

మనము జనులభిన్నభిన్నానుభవములపైకి దృష్టిని సారింతుమేని సంసారము (ప్రపంచము) నందు గొప్పకోలాహలము జరుగుచున్నట్టుల గోచరించును. ఈవృత్తాంతమును కుతూహలముతో వినుండు ౧ "మనము గార్హస్త్యమునందుండియే తరింపఁగలము. ఏలయన! ఈసంసారసంబంధమగు విస్తరమంతయు మన దేమియుఁగాదు. అంతయును జీవేశ్వరులది" అని యొకఁడనును. ౨ "అట్లుకాదు మోహము కలుగుచున్నది. పొట్టకొఱకుఁ గుటుంబసేవను జేయవలసియేయున్నది" అని యొకఁడనును ౩ "స్వాభావిక సుఖముఁతోడనే గృహస్థస్థితి యందుండవలయును గాని సద్గతికి ఏమేమిదానము, పుణ్యము చేయుచుండవలయు"నని యొకఁడనును. ౪ "సంసారమసత్యము. వైరాగ్యదీక్షధరించి దేశాటనము గావింపవలెను. అందువలన స్వర్గలోకద్వారము తెఱువఁబడు"నని యొకడనును. ౫ "ఎక్కడకుబోవుదము. వ్యర్థముగా నేలతిరుగవలయును. మనయాశ్రమమునందే ఆశ్రమధర్మమునునిర్వహించుచుండవలయు"నని యొకడనును. ౬ "ఎక్కడిధర్మమును దెచ్చిపెట్టుచున్నాడవు. అంతయు నధర్మమే జరుగుచున్నది. ఈప్రపంచమునందుండి నానావిధములగుపనులను జేయుచునేయుండవలసివచ్చుచున్నది" అనియొకఁడనును ౭ "చేతనైనంతదనుక వాసనమంచిదిగానుండవలయును. వాసనావశముననే అనాయాసముగా సంసారమును దాటిపోవుదురు" అని యొకఁడనును. ౮ "ముఖ్యకారణము భావము. భావమువలననే పరమేశ్వరుఁడు లభించును. తక్కినదంతయును వ్యర్థగాథాజాల"మని యొకఁడనును౯ "పెద్దలెందఱుగలరో వారలనందఱును దేవతలుగాభావింపవలయును. జననీజనకులననన్యభావముతోఁబూజింపవలయు"నని యొకఁడనును ౧౦ "దేవబ్రాహ్మణపూజనముగావింపవలయును. జగత్తులోని జనులందఱకును నారాయణమూర్తియే తల్లిదండ్రియని" యొకఁడనును. ౧౧ "శాస్త్రమును జూడవలయును వానియందు ఈశ్వరుఁడేమియాజ్ఞాపించెనో దానిననుసరించి వర్తించి పరలోకమునుబొందవలయు"నని యొకఁడనును. ౧౨ "ఓరిఅన్నా! శాస్త్రములను జూచుచున్నయెడలఁ బనిసాగదు. సాధువులశరణ్యమునకుఁ బోవలయునురా" అని యొకఁడనును. ౧౩ "అయ్యా!

ఈమాటలను జాలింపుము వ్యర్థముగా నేల వదురుబోతుతనము జూపుదురు. హృదయమునందు భూతదయగలిగియుండుట అన్నిటికంటెను ముఖ్యము" అనియొకఁడనును ౧౪ "తనయాచారమును విడువకుండవలెను. అంత్యకాలమునందు సర్వోత్తముఁడగు పరమాత్మునినామమును స్మరింపవలయును. ఇదియేమంచిమార్గ"మని యొకఁడనును, ౧౫ "పుణ్యముండిననేగాని భగవన్నామము స్మరణమునకు రాదు. పుణ్యము లేకున్నచో అంత్యకాలమునందు భగవన్నామము మఱపునకువచ్చును" అని యొకఁడునుడువును. ౧౬ "బ్రదికియుండగనే జన్మమునుసార్థకము గావింపవలయును" అని యొకఁడనును. "తీర్థాటనము గావింపవలయు"నని యొకఁడనును ౧౭ "ఇదియంతయును నాకప్రయాస. తీర్థములలో నేమున్నది? అచ్చట జలపాషాణముల సమావేశమే గదా! మునకలు వేసి వేసి వ్యర్థముగానేల ఆయాసపడవలయును" అని యొకఁడనును ౧౮ "ఈవాచాలత్వమును గట్టిపెట్టుము. భూమండలమునందుఁగల తీర్థముల కగాధమహిమ గలదు. వానిదర్శనమాత్రముననే మహాపాతకములు భస్మములైపోవును" అనియొకఁడనును ౧౯ "అన్నిటికిని గారణమగు మనస్సునునిలుపఁగలిగినచో తీర్థములు మనయొద్దనేయున్నవని యొకఁ"డనును "కాదుకాదు ప్రసన్నతాపూర్వకమగు కీర్తనముచేయవలయు"నని యొకఁడనును. ౨౦ "అన్నింటికంటెను మంచిది యోగము ముఖ్యముగా దానినే మొదట సాధింపవలయును మఱియు అకస్మికముగా దేహమును మరణరహితముగఁ జేయవలయును" అని యొకఁడనును ౨౧ "అందువలన నేమగును. కాలమును మోసగింపఁదగ"దని యొకఁడనును. "భక్తిమార్గమునుసాధింపవలయు"నని యొకఁడనును ౨౨ ఒకఁడు జ్ఞానముమంచిదనును. అట్లుగాదు సాధనముచేయవలయునని యొకఁడనును. నిరంతరము ముక్తుఁడైయుండవలయునని యొకఁడనును ౨౩ "అనర్గళమగు పాపములకు భయపడవలయు"నని యొక్కఁ"డనును. "ఓరీ! మాది చక్కఁగాఁ దెలుపఁబడినమార్గమని యొక్కఁడనును" ౨౪ "ఒకరిపట్ల నిందాద్వేషములు వహింపకుండుటయే అన్నిటికంటెను మంచిపద్ధతి"యని యొకఁడనును. "దుష్టసాంగత్యమెల్లప్పుడును విసర్జింపవలయు"నని యొకఁడనును ౨౫ "అన్నా! ఎవరిద్రవ్యమును దింటిమో వారిముందే మరణించినచో తత్కాలముననే మోక్షముప్రా

ప్తించునని" యొకఁడనును * ౨౬ "వద, ఈమాటలు చాలింపుము. అన్నిఁటి కంటెను ముందుగ భోజనము సమకూడవలయును. ఆపిమ్మటఁ గుడిచికూర్చుండి యెన్నిబకవాదములనైనఁ జేయవచ్చు"నని యొకఁడనును. ౨౭ "వర్షము సకాలమునగురియుచున్నచో రోగములన్నియుఁ జక్కఁగానుండును కఱవు దుర్భిక్షాదులు కలుగకుండుటయే మంచి"దని యొకఁడనును. ౨౮ "తపోనిధియగుటవలన సమస్తసిద్ధులును ప్రసన్నములగును." అనియొకఁడనును. "ఓరీ! అన్నిటికంటెముందుగా నింద్రపదముప్రాప్తింపవలయు"నని యొకఁడనును. ౨౯ "ఆగమములను జూడవలయును. భేతాళుని ప్రసన్నము గావించుకొనవలయును. ఇందువలన స్వర్గమునందుఁ బరమేశ్వరుఁడు లభించు"నని యొకఁడనును ౩౦ "అఘోరమంత్రమువలననే స్వాతంత్ర్యము లభించును. దానిమూలముననే లక్ష్మీదేవి ప్రసన్నురాలగును ౩౧ ఆలక్ష్మీదేవియందే ధర్మములన్నియు సంబంధపడియున్నవి. అన్యక్రియాకర్మము లెక్కడనుండివచ్చినవి?" అని యొకఁడనును. "లక్ష్మీదేవిసహాయముననే గదా లోకులు దుష్కర్మములాచరించుట"యని యొకఁడనును. ౩౨ "మృత్యుంజయుని జపించుయత్నము చేయవలయును. దానివలన సంకల్పములన్నియు ఫలించు"నని యొకఁడనును ౩౩ "వటుకభైరవుని పూజించినచో వైభవములన్నియు సమకూరు"నని యొకఁడనును "ఝోటింగు(ఒక దేవత) తల్లియేసమస్తకామ్యములను పూర్తిచేయు"నని యొకఁడనును ౩౪ "ఒకఁడు కాళినిగంకాళి సేవింపు"మనును. "ఒకఁడు భద్రకాళిని, మఱియొకఁడు ఉచ్ఛిష్టచండాలిని వశపఱచుకొనవలయు"ననును ౩౫ "విఘ్నహరుడగు గణేశ్వరు గొల్వవలెనని యొకఁడును, భోళాశంకరుని పూజింపవలయునని యొకఁడును శీఘ్రప్రసన్నయగుభగవతినిఆరాధింపవలయు"నని యొకఁడును జెప్పును. ౩౬ "ఖండోబా త్వరితముగ భాగ్యమునొసంగునని యొకఁడును, వేంకటేశ్వరుని సేవించుటయన్నింటికంటెను త్తమ"మని యొకఁడును బల్కును. ౩౭ "పూర్వకర్మానుసారముగా ఫలములభించునని యొకఁడును, అట్లుకాదు ప్రయత్నము

---

* తంత్రశాస్త్రము:—

శ్లో॥ ఆగతశ్చవవక్త్రేభ్యోగతంచ గిరిజాశ్రుతౌ
మతంచ వాసుదేవస్య తస్మాదాగమ...చ్య

చేయవలయునని యొకఁడును, అయ్యో! మనదేమియును లేదు. అన్నియు నీశ్వరునిపై విడిచివేయవలయునని యొకఁడనును. ౩౮ ఎక్కడి ఈశ్వరుని దెచ్చిపెట్టుదువు? అతఁడు మంచివారలకే కష్టములుగలిగించి పరీక్షించుచుండునని యొకఁడును, దానియందీశ్వరునిదోషమావంతయులేదు. ఇది యుగధర్మమని యొకఁడనును. ౩౯ కొందఱిది యాశ్చర్యమని యొప్పుకొనుచున్నారు. కొందఱు విస్మితులగుచున్నారు. ఏమిజరుగునో చూడవలయునని కొందఱు భయముతో నుడువుచున్నారు. ౪౦ ఈవిధముగఁ ప్రపంచమునందలి జనులలక్షణములు వివరింపఁబూనినచో నింకనెన్నియో గలవు. కాని యిచటఁ గొన్నిచిహ్నములనుమాత్రమే చెప్పెదను. ౪౧

ఇఁక జ్ఞానుల భిన్నభిన్నానుభవములనుగూడఁ దెలుపుదును. సావధానులరై వినుండు. ౪౨ భక్తితో భగవంతుని ధ్యానించుచున్నచో శ్రీహరి సద్గతియొసంగునని యొకఁడును, కర్మమువలననే బ్రహ్మప్రాప్తియగునని యొకఁడును అనును. ౪౩ భోగములు విడిచిపోవు. జననమరణములు తెగిపోవు అని యొకఁడును అజ్ఞానతరంగములు పెక్కులుగనున్నవని యొకఁడును అనును. ౪౪ సర్వము బ్రహ్మముగానున్నచోఁ క్రియాకర్మము లెట్లువచ్చునని యొకఁడును, ఇట్టి యధర్మ భాషణములు గావింపఁగూడదని యొకఁడును బలుకును ౪౫ సర్వమును నశించిన పిదప మిగులునదియే బ్రహ్మమని యొకఁడును ఇది సమాధానముకాదని యొకఁడును అనును. ౪౬ సర్వబ్రహ్మము, కేవలబ్రహ్మము అను నీరెండును పూర్వపక్షములే, భ్రమాన్వితములే అనుభవమర్మము వేఱుగనున్నది అని యొకఁడనును ౪౭ ఇట్లుగాదు. వస్తువు అనిర్వాచ్యము. దానిని వివరింపలేక వేదశాస్త్రములు గూడ మౌనము అవలంబించుచున్నవని యొకఁడనును ౪౮ ఇదివిని శ్రోత యిట్లు ప్రశ్నించెను. అటులైన మీరు గావించిన నిశ్చయమెద్ది! సిద్ధాంతమతమువలన అనుభవమునకుఁ దావే లేదయ్యెను. (అనుభవమును దలంచినంతనె యచట ద్వైతము రానేవచ్చును). ౪౯ వక్త చెప్పు ప్రత్యుత్తరము. ప్రతిమనుజుని యనుభవము వేఱువేఱుగానుండునని తొలుతనే చెప్పితిని. కావున అనుభవమువలన నేమియుఁ గాఁజాలదు. ౫౦ కొందఱు నాస్తిక్యముతో వర్తించుచున్నారు. మఱియు సాక్షి (దృశ్యముకంటె)

వేఱుగనున్నట్లుగఁ జెప్పుచున్నారు. అటులె తాము స్వయముగ ద్రష్టలై యుండి స్వానుభవస్థితియందున్నారు. ౫౧ దృశ్యముకంటె ద్రష్టవేఱుగ నున్నాఁడు. స్వానుభవమువలన సాక్షిత్వముకంటెఁ దానువేఱుగనుండును. అలిప్తతారీతి యిది ౫౨ అన్నిపదార్థములను నెఱింగియున్నవాఁడు పదార్థములకంటె భిన్నుఁడుగనున్నాఁడు. ఈ యనుభవముకలుగుటవలన దేహమునందున్నను సహజముగనే అలిప్తతవచ్చుచున్నది. ౫౩ ఒకజ్ఞాత అనుభవముతో నిట్లుచెప్పుచున్నాఁడు. సాక్షిత్వముతో వర్తింపవలయును. ద్రష్టృత్వముతో అన్నిపనులను జేయుచుగూడ వేఱుగ నుండవలయును. ౫౪ ఒకజ్ఞాత యిటులఁ జెప్పుచున్నాఁడు. "భేదమనునది లేనేలేదు. వస్తువు ఆదినుండియు నభేదముగానున్నది. అచ్చటికి ద్రష్టనెచ్చటినుండి తెచ్చితివి? ౫౫ స్వాభావికముగా శర్కరామయముగా నున్న పదార్థములోఁ జేదును విడదీయుట యెట్లు సాధ్యమగును? అట్లె స్వానుభవమువలన సర్వము బ్రహ్మముగానున్న తావున ద్రష్ట యెక్కడినుండివచ్చును ౫౬ ప్రపంచ పరబ్రహ్మములు అభేదములు; వీనిలో భేదవాదులు భేదమున్నటుల విశ్వసింతురు కాని యీస్వసందాత్మయే దృశ్యాకారమైనది. ౫౭ కఱఁగిన నెయ్యి పేరుకొనినట్లు నిర్గుణముకూడ సగుణమగును. అచట ద్రష్టృత్వముతో వేఱుగాఁ జేయునదేమున్నది? ౫౮ అనఁగా ద్రష్టృదృశ్యములన్నియును నొక్క జగదీశ్వరుఁడే యైయున్నాఁడు. ఇంక ద్రష్టృత్వభేదముతో నావశ్యక మేమున్నది? ౫౯ ద్రష్టదృష్టికి ఈదృశ్యాకారమంతయు బ్రహ్మమేయని కొందఱియనుభవము. ౬౦ అన్నిటియందును ఆత్మయే పరిపూర్ణముగా నున్నప్పుడు స్వయముగా (తాను) భిన్నుఁడై యెట్లుండగలెనను!" (కావున బ్రహ్మమే సమస్తమని) ఇది రెండవజ్ఞాత యనుభవము. ౬౧ ఇఁక మూఁడవ యనుభవము వినుము. సమస్తప్రపంచమును నిరసనముగావించినచో మిగిలిన శూన్యమే యీశ్వరుఁడనియు ౬౨ సమస్తదృశ్యమును వేఱుగావించినపిమ్మటఁ గేవలము అదృశ్యముమాత్రమె మిగులును. దానినే బ్రహ్మముగా నెఱుంగవలయుననియు వీరలందురు. *

* ద్రష్ట దృశ్యముకంటె వేఱుఅనునది యొకమతము. ద్రష్ట, దృశ్యము నొక్కటి. ఉన్నదంతయును బ్రహ్మమె యనునది రెండవమతము. దృశ్యమును వేఱుపఱచినపిదప "ఏమియును లేనిదే బ్రహ్మము" అని మూఁడవమతము.

శూన్యమును బ్రహ్మమని చెప్పఁజాలను, శూన్యమును బ్రహ్మమని చెప్పుట అపాయమును ఉపాయముతో సమానముగాఁ జెప్పుటవంటిది. శూన్యమును బ్రహ్మమని యెట్లనుడువగలము? ౬౪ సంపూర్ణ దృశ్యమును దాటిపోయినపిదప అదృశ్యరూపమగు శూన్యత్వము లభించును. అజ్ఞులగు ప్రాణులా శూన్యమును బ్రహ్మమనుకొని యచటినుండియే మరలుదురు ౬౫ ఈయొడ్డున దృశ్యముండును. ఆయొడ్డునఁ బరబ్రహ్మముండును. మధ్య శూన్యత్వస్థానమున్నది. ఈతావునే జనులు మందబుద్ధివలన బ్రహ్మమనియెదరు ౬౬ రాజును గుర్తింపలేదు. సేవకుని రాజని విశ్వసించుచున్నారు. రాజును జూచినపిమ్మట పూర్వాభిప్రాయమంతయు నిరర్థకమగును ౬౭ అటులే శూన్యమును బ్రహ్మమని విశ్వసించుచున్నారము. కాని ముందుగ బ్రహ్మమును దెలిసికొనుటవలన శూన్యత్వసంబంధమగు సమస్తభ్రమయు విడిపోవును. ౬౮ రాజహంస క్షీరముగ్రహించి నీరమునువిడిచిపెట్టునట్లు వివేకి యీ సూక్ష్మవిఘ్నమును వివేకముతో వేఱుపఱుపవలయును * ౬౯

మొట్టమొదట దృశ్యమును విడిచివేయుదురు. తరువాత శూన్యత్వమును జేరెదరు. ఆపిమ్మట మూలమాయకు ఆవలనున్న బ్రహ్మము లభించును. ౭౦ వేఱుగనుండి చూచుటవలన వృత్తి శూన్యత్వమునందుఁ బడిపోవును. అందుచే శూన్యత్వభ్రమ హృదయమునందుఁ బాదుకొనును. ౭౧ భిన్నత్వముతో ననుభవముగావించుటను శూన్యత్వమందురు. వస్తువును లక్షించుటకు ముందుగ సాధకుఁడు అభిన్నుఁడుగావలయును. ౭౨ స్వయముగాఁ దాను వస్తురూపుఁడైనపుడె నిశ్చయముగా వస్తువును దర్శించుట యగును. కాని భిన్నత్వముతోఁ దిలకించినయెడల శూన్యత్వమే లభించును. ౭౩ శూన్యమెన్నఁటికిని బరబ్రహ్మము కానేరదు. పరబ్రహ్మమును స్వానుభవముతో వస్తురూపుఁడైనపుడే మానవుఁడు చూడఁ

* దృశ్యమును దాటి పరబ్రహ్మమునకుఁ బోవునపుడు మధ్యను శూన్యత్వము లభించును. ఎందఱో అరజ్ఞానులు దానినే బ్రహ్మమనిదలఁచి యచటనే యుండిపోదురు. వారలు ముందునకరిగెడి యవసరమునే తెలిసికొనరు. కాని యిది భ్రమ. ఇట్లు చేయఁగూడదు. ఈ శూన్యత్వసంబంధమగు విఘ్నమును వివేకముతో దూరపఱచి ముందునకుఁ బోవలెను. ఆపిమ్మటనే బ్రహ్మము లభించును.

గలఁడు. ౭౪ యథార్థమునకు, స్వయమే వస్తురూపము. నేను, మనస్సు అనుకల్పనము నెప్పుడును జేయఁగూడదు. ఆత్మ స్వయముగా నీవేయై యున్నాఁడవు అనుదానినే సాధువులు నిరంతమును దెలుపుచుందురు. ౭౫ నేను, మనస్సు, అనుమిథ్యానిరూపణమును సాధుజను లెక్కడను గావింపలేరు. అట్టిస్థితిలో నెవరిబోధ నాధారముగాఁ జేసికొని "నేననునదిమనస్సు" అని యంగీకరింపనగును? ౭౬ సాధువులవచనము హృదయమునం దుంచుటయే శుద్ధస్వానుభవము. మనస్సు స్వాభావికముగనే చంచలమైనది. అది "నేను" అనునది కాదు. "నేను" అనునది స్వయముగా వస్తువే ౭౭ అనుభవమొందఁదగినదియు, వాస్తవమైనదియు, నిరవయవమైనదియు నగు వస్తువే మనమైయున్నారము. మఱియు మనయనుభవమే సమస్త జగత్తునందలి ప్రజలును గైకొందురు. ౭౮ లోభియగుమానవుఁడు ధనమును సమకూర్చుకొని స్వయముగా ధనరూపుఁడగును. కాని యాధనమును (ఆభోగమును) భాగ్యవంతుఁడు(అదృష్టశాలి) అగుపురుషుఁడే యానందముతో ననుభవించును. ౭౯ దేహబుద్ధిని విడుచుటవలన సాధకులకు గూడ నీస్థితియే వాస్తవముగాఁ గలుగును. ఇదియే అనుభవముయొక్కముఖ్యవిషయము. ౮౦ "స్వయముగా మనము, (అందఱము) వస్తువు, వాస్తవమునం దొక్కటిరో" అనువివేకము గలుగుటయే జ్ఞానము. ౮౧ యథామతిగా నేనీయాత్మజ్ఞాననిరూపణమును గావించినాఁడను. శ్రోతలు న్యూనాధికములకు క్షమింతురుగాక.

తొమ్మిదవ దశకము

ప్రథమ సమాసము.

బ్రహ్మనిరూపణము.

ప్రశ్నోత్తరరూపము.

నిరాకారము, నిరాధారము, నిర్వికల్పముఅనువానికర్థ మెయ్యోదియో నాకుఁ దెలుపుఁడు: ౧ నిరాకారమన, పరబ్రహ్మమునకు ఆకారములేదని యర్థము. నిరాధారమన, పరబ్రహ్మమునకు ఆధారములేదని

యర్థము. నిర్వికల్పమన, ఆపరబ్రహ్మము కల్పనముచేయఁబడదు. అని యర్థము. ౨ నిరామయము, నిరాభాసము, నిరవయవము అనువాని యర్థ మెయ్యోదియో తెలుపుఁడు? ౩ నిరామయమన, పరబ్రహ్మము, వికారరహితుఁడు. నిరాభాసుఁడన- ఆతఁడు భాసించుటలేదు. నిరవయవుఁడన ఆతనికవయవములులేవు. ౪ నిష్ప్రపంచము, నిష్కళంకము, నిరుపాధి, అననేమియో తెలుపుఁడు? ౫ నిష్ప్రపంచమన, పరబ్రహ్మమునందుఁ బ్రపంచములేదు. నిష్కళంకమన ఆతనియందుఁ గళంకములేదు. నిరుపాధియన ఆబ్రహ్మమునకు ఉపాధిలేదనియర్థము. ౬ నిరుపమము, నిరవలంబము, నిరపేక్షముఅననేమియో తెలుపుఁడు? ౭ నిరుపమమునఁ బరబ్రహ్మమునకు సమానములేదు. నిరవలంబమన నాతని కవలంబనములేదు. నిరపేక్షముఅన ఆబ్రహ్మమునం దపేక్షలేదు. ౮ నిరంజనము, నిరంతరము, నిర్గుణముఅన నేమియర్థమో తెలుపుఁడు? ౯ నిరంజనమన, బ్రహ్మమునందు నలుపురంగులేదు, నిరంతరమన అందుఅంతరములేదు. నిర్గుణమన నందు గుణములేదనియర్థము. ౧౦ నిస్సంగము, నిర్మలము, నిశ్చలము అననేద్దియో వివరింపుఁడు? ౧౧ సంగములేనిబ్రహ్మమె నిస్సంగము. మలములేని బ్రహ్మమె నిర్మలము. చలనములేనిబ్రహ్మమే నిశ్చలము. ఆపరబ్రహ్మ స్వరూప మిట్టిది. ౧౨ నిశ్శబ్దము, నిర్దోషము, నివృత్తిఅను దానికర్థమేదియో తెలుపుఁడు? ౧౩ శబ్దరహితమైనది నిశ్శబ్దము, దోషములేనిది నిర్దోషము. వృత్తిలేనిది నివృత్తి. ఆపరబ్రహ్మతత్త్వ మిట్టిది. ౧౪ నిష్కామము, నిర్లేపము, నిష్కర్మముఅను దానికర్థము దెలుపుఁడు? ౧౫ కామములేనిది నిష్కామము. లేపరహితమైనది నిర్లేపము. కర్మములేనిది నిష్కర్మము. ఆపరబ్రహ్మమిట్టిది. ౧౬ అనామ్యము, అజన్మము, అప్రత్యక్షముఅన నర్థమేదియో తెలుపుఁడు? ౧౭ నామములేనిది అనామ్యము జన్మములేనిది అజన్మము. ప్రత్యక్షములేనిది అప్రత్యక్షము. ఆపరబ్రహ్మమిట్టిది. ౧౮ అగణితము, అకర్తవ్యము. అక్షయము అనుదాని కర్థమేదియో తెలుపుఁడు? ౧౯ లెక్కింపశక్యముగానిదగణితము. కర్తవ్యమేదియులేనిది అకర్తవ్యము. క్షయరహితమైనది అక్షయము. ఆపరబ్రహ్మతత్త్వమిట్టిది. ౨౦ అరూపము, అలక్ష్యము, అనంతము, అననేదియో యర్థముదెలుపుఁడు? ౨౧ రూపరహితమైనది అరూపము.

లక్ష్యముగానిది అలక్ష్యము. అంతములేనిది అనంతము. ఆపరబ్రహ్మ మిట్టిది. ౨౨ అపారము, అటలము, (అచలము) అతర్క్యముఅననేమి యో అర్థముతెలుపుడు? ౨౩ పారములేనిది అపారము. చలనములేనిది అచలము (అటలము) తర్కింపరానిది అతర్క్యము. ఆబ్రహ్మమిట్టిది. ౨౪ అద్వైతము, అదృశ్యము, అచ్యుతము, అననేమియో యనుగ్రహించి తెలుపుడు! ౨౫ ద్వైతములేనిది అద్వైతము. దృశ్యముకానిది అదృశ్యము. ఎప్పుడును చ్యుతముకాఁజాలనిది అచ్యుతము. ఆపరబ్రహ్మస్వరూప మిట్టిది. ౨౬ అచ్ఛేద్యము, అదాహ్యము, అక్లేద్యము అననేమియో తెలుపుఁడు? ౨౭ ఛేదింపరానిదిఅచ్ఛేద్యము. దహింపవీలుగానిది అదాహ్యము. తడువరానిది అక్లేద్యము. ఆపరబ్రహ్మమిట్టిది. ౨౮ అన్నింటికిని ఆవలనున్నదానిని పరబ్రహ్మ మనియెదరు. ఆస్వరూపమును విచారము గావించుటవలన మనము బ్రహ్మమైయున్నారము. ఈవిషయము అనుభవముతో సద్గురుసిబోధవలన విదితమగును. ౨౯.

రెండవసమాసము.

ఆత్మజ్ఞానము

సాకారముగాఁ గాన్పించుచున్నదంతయును గల్పాంతమునందు నాశమగును. పరబ్రహ్మస్వరూప మట్లుగాక నిరంతరము చెదరక యథావిధముగానుండును. ౧ అన్నింటిలో సారమైన వస్తువును, మిథ్యగానిదియు, సత్యమును, నిరంతరము నిలచి యుండునదియు ౨ నగునది యేదికలదో యదియే భగవంతుని ముఖ్య రూపము. దానినే స్వరూపమందురు. భగవంతున కిదిగాక యింక ననేక నామములుఁ గలవు. ౩ భగవత్సంబంధమగు జ్ఞానమార్జించుటకై నామని ర్దేశము గావింపఁబడెను. కాని వాస్తవమునకు ఆస్వరూపము నామాతీతము, అది నిరంతరము స్థిరముగానుండును. ౪ దృశ్యమునందు అది (ఆబ్రహ్మస్వరూపము) వెలుపలనులోపలను అంతటను నిండియున్నది. అంతియగాక యది విశ్వమునందు డాఁగియున్నది, (ఎవరికిఁగాన్పింపదు.) అది మనకు సమీపముననుండియు గుప్తముగా నెటులున్నదో చూడుఁడు ౫ పరమేశ్వరుని వర్ణనము విన్నమీఁదటఁ గనులతో జూడవలయునను

కోర్కి గలుగును, కాని చూచినచోఁ గనుపించునది సమస్తదృశ్యము మాత్రమే సుమా ౬ దృష్టికి విషయముదృశ్యము. విషయముగాంచినచో దృష్టికానందముకలుగును. కాన యిదిసత్యమగుచూపుగాదు. ౭ దృష్టికి గాన్పించునదియంతయు నశించునది. ఈవిషయమును నేను గాదు శ్రుతియే చెప్పుచున్నది (యద్దృష్టమ్‌తన్నష్టమ్) కావున దృష్టికిఁగాన్పించునది స్వరూపముగాదు. (దృష్టికిఁగానుపించునది నశ్వరమైనది. స్వరూపము అవినాశము) ౮ స్వరూపము నిరాభాసము. దృశ్యమో భాసము. వేదాంతశాస్త్రమునందు భాసము నాశమగునని చెప్పఁబడెను. ౯ చూచినచో దృశ్యమే భాసించుచుండును. వస్తువు దృశ్యముకంటెను వేఱుగానున్నదికాని స్వానుభవముతోఁజూచినపిమ్మట "వస్తువు" దృశ్యమునకులోపలను, వెలుపలను, అన్నిచోట్లను గనుపించును. ౧౦ నిరాభాసమును, నిర్గుణమును నగు బ్రహ్మము ఇటులుండునని గురుతులతో నెట్లు జెప్ప వీలగును? కాని యాస్వరూపము మనయొద్దనే యున్నదనిమాత్రము బాగుగాఁ దెలిసికొనుము. ౧౧ ఆకాశమునందు భాసము భాసించునట్లును, అన్నింటియందును ఆకాశమున్నట్లును, జగదీశ్వరుఁడు గూడ అన్నిస్థలములందు లోపలను వెలుపలనుగూడ నున్నాఁడు. ౧౨ నీళ్ళయందున్నాఁడుగాని తడియుటలేదు. పృథ్వియందున్నాఁడుగాని తరుగుటలేదు. అగ్నియందున్నాఁడుగాని కాలుటలేదు. ౧౩ అతఁడు బురదయందున్నాఁడుగాని యది వానికంటుటలేదు. వాయువునందున్నాఁడు. ఎగుకుటలేదు. బంగారమునందున్నాఁడుగాని (బంగారమువలె) పెరుగుతరుగు లొందుటలేదు. ౧౪ ఆతఁడీవిధముగా నిరంతరమును సంచితుఁడుగా నున్నాఁడు. కాని యాతఁడు అవగాహనమునకు రాఁడు. ఆ యభేదవస్తువునుండి విభేదమును అభివృద్ధిగావించునది అహంభావమే. ౧౫ కావున మీ కిపుడు *ఆ "యహంత" లక్షణములను వివరించెదను. శ్రోతలారా! సావధానులై వినుండు. ౧౬

---

* ఇచట మిగులనుచ్ఛమగు అహంతాత్వమును శ్రీసమర్థులవారు జెప్పుచున్నారు. "నేను స్వయముగా బ్రహ్మమును" అని చెప్పుటయు అహంతృత్వమని పేరు. అహంబ్రహ్మాస్మి అను మహావాక్యములోని అహంతృత్వమునకుఁగూడ నిదియే తాత్పర్యము.

స్వరూపమువై పునకుఁ బోవునదియు, అనుభవమునకు వెంటనంటి యుండునదియు, అనుభవసంబంధములగు శబ్దములనన్నింటిని వివరించి చెప్పునదియు ౧౭ నేనే యేకస్వరూపుఁడను (బ్రహ్మమును) అని చెప్పునదియు నేదిగలదో అదియే అహంతయొక్క రూపము. అది నిరాకారమునందుఁ దనంతఁ దానే వేఱగును. ౧౮ భ్రమవలన అహంత స్వయముగాఁ దననే బ్రహ్మముగా భావించును. మిగుల సూక్ష్మముగా విచారించిన పిదప ఆ భ్రమయంతయు వెల్లడియగును. ౧౯ "నేనే బ్రహ్మమును" అను నీహేతువు (ఇట్లు చెప్పుట) కల్పనముతో నవగాహనము జేసికొననచ్చును. కాని "వస్తువు" కల్పనాతీతముగా నున్నది. అందువలననే ఆ యనంతముయొక్క యంత మాకలనము గానేరదు. ౨౦ అష్టదేహముల యుత్పత్తికి సంబంధించిన నామాన్వయములు ఆయుత్పత్తియొక్క సంహారమునకు సంబంధించిన నామములు వేఱువేఱుగ నున్నవి. అష్టదేహముల యుత్పత్తిసంహారములనుగూర్చి వివరించుట కొక శాబ్దికజ్ఞానము మాత్రమే చాలును. నిశ్శబ్దమగు పరబ్రహ్మమును వివరింపవలయునన్నచో సూక్ష్మవివేకము గావలయును. సూక్ష్మవివేకము లేకున్న నన్వేషింప వీలుగాదు. ౨౧ మొదట వాచ్యాంశము నెత్తుకొనుఁడు. తరువాత లక్ష్యాంశమును గుర్తింపుఁడు. లక్ష్యాంశమును గాంచినపిదప వాచ్యాంశమెట్లుండగలదు? ౨౨ సర్వబ్రహ్మము, మాయావిరహితబ్రహ్మము అను నీరెంటిని బ్రతిపాదించుపక్షములు రెండుగలవు. ఈరెండుపక్షములు చెప్పుటకుమాత్రమే వేఱుగనున్నవి. లక్ష్యాంశమర్మమును దెలిసికొన్నపిమ్మట (పరబ్రహ్మమెట్టిది అను జ్ఞానము కలిగినపిమ్మట) చెప్పుట (వాచ్యాంశము) ఉండనేయుండదు. ఈ రెండుపక్షములుగూడ నుండవు. ౨౩ సర్వము, విమలము (మాయారహితము) అను నీరెండుపక్షములు వాచ్యాంశమునందే నిలిచిపోవును. అవి చెప్పెడిదానికంటె ముందున కరుగఁజాలవు. లక్ష్యాంశమునందు లక్ష్యముంచిన తరువాతఁ బక్షపాతములుండవు. ౨౪ ఈ లక్ష్యాంశము ననుభవము గావింపవలయును. ఇచ్చట చెప్పుటకు (వాచ్యాంశమునకుఁ) బనియే లేదు. ముఖ్యానుభవము గనుఁగొనుటకుఁ జెప్పుటతోఁ బనియేమున్నది. ౨౫ పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరులను నాలుగువాక్కులును గుంఠితములగు పరబ్రహ్మమును గూర్చి చెప్పు

టకు శబ్దకళాకౌశలములతోఁ బనియేమున్నది. ౨౬ చూడుము. శబ్దము చెప్పినంతనే నాశనమై పోవుచున్నదిగదా దానికి శాశ్వతత్వ మెట్లురాఁగలదు? ప్రత్యక్షమునకుఁ బ్రమాణము లేదు. చూడుఁడు. ౨౭ శబ్దము ప్రత్యక్షముగా నశ్వరముగనున్నది. అందుచేఁ బక్షము లుండనేరవు. అనుభవమునందు సర్వము, విమలము అను భేదమే యుండదు. ౨౮ అనుభవలక్షణములు వినుండు. అనుభవమన అనన్యుఁడగుటయే. ఇఁక ననన్యలక్షణములు వినిపించెదను. శ్రద్ధతో వినుఁడు. ౨౯

అన్యము లేనిదే యనన్యము. ఆత్మనివేదనము వంటిది. సంగము భంగమైన పిమ్మట (ద్వైతము నష్టమైన పిదప) ఆత్మ ఆత్మత్వముతో స్థిరమైయుండును. ౩౦ ఆత్మయందు ఆత్మత్వము గలుగకుండుటయే నిస్సంగలక్షణము. ఈ విషయము విశదమగుకొఱకు మేము వాచ్యాంశముతోఁ దెలుపుచున్నారము. ౩౧ లక్ష్యాంశమును వాచ్యాంశముతోఁ దెల్పుటకు మరియొకవిధముగా నెట్లుసంభవమగును? మహావాక్యవివరణమువలనఁ దనంతట నదియే విదితమగును. ౩౨ తత్త్వవివరణము గావించుటవలనను, నిర్గుణబ్రహ్మము నన్వేషింపఁ బూనుటవలనను, మఱియు స్వయముగాఁ దనను దానుచూచుటవలనను అన్నియును విశదమగును. ౩౩ చెప్పుటతోఁ బనిగొనకయే పరబ్రహ్మమును మననముచేయవలయును. ఎల్లప్పుడును మననము చేయుచునే యుండవలయును. ఇందువలననే మహాపురుషులకు మౌనమే శోభనొసంగుచున్నది. * ౩౪ దానిని వివరించుటలో శబ్దములుగూడ నిశ్శబ్దము లగుచున్నవి. మఱియు శ్రుతిసైతము "నేతి, నేతి" యనుచున్నది. ఇవి ప్రత్యక్షానుభవవిషయమేగదా ౩౫ ప్రతీతి (ఎఱుక) యైనపిమ్మట సందేహముంచుకొనుట ప్రత్యక్షదురభిమానము. ఈస్థితియందే విధముగా నుడువవలయును. "నేను అజ్ఞానుఁడను. నాకేమియుఁ దెలియదు. ౩౬ నేను మిథ్య, నాచెప్పునదియు మిథ్య. నావర్తనము మిథ్య. నేను, నాది, అనునంతయు మిథ్య, కల్పనము, ౩౭ నేననుదానికిఁ దావేలేదు. నాచెప్పునది యంతయును వ్యర్థము. నాచెప్పునది ప్రకృతిస్వభావము. ప్రకృతి మిథ్య" ౩౮ ప్రకృతియుఁ బురు

* బ్రహ్మము అనిర్వాచ్యమగుటకతన సత్స్వరూపమును చెప్పుటకుఁగాని చూపుటకుఁగాని వీలులేదు. "గురోస్తు మౌనం వ్యాఖ్యానమ్" అను వాక్యము సత్యము.

షుఁడు నిరసనమగు తావున అహంతాత్వము (నేననునది) ఉండుట యె ప్పుడు సంభవమగును. ౩౯ ఏమియు శేషించి లేనితావున విశేషించి చెప్ప వలసిన దేముండును? "నేను మౌనవ్రతమును ధరించియున్నాఁడను." అని నోటినుండి చెప్పుటవలన మౌనవ్రతము నష్టమగునట్లు నోటితోఁ జెప్పు అనుభవవాక్యమునుబట్టి యాబోధకునకింకను అనుభవము గాలేదని తెలిసి కొనవలయును ౪౦ ఇప్పుడు మౌన భంగమును జేయఁ గూడదు. (దోషరహితమగు క్రియను జేయవలయును) చేసియును నేమియుఁ జేయఁ గూడదు. వివేకబలముతోనుండియును బొత్తిగా లేకుండవలయును ౪౧

మూఁడవ సమాసము.

జ్ఞానికి జననమరణములు లేవు

శ్రోత లిట్లు ప్రశ్నించుచున్నారు. "ఇది యెట్టి బ్రహ్మజ్ఞానము? ఉండి యును నేమియు లేకుండుట యెట్లు సంభవమగును? ౧ అన్నిఁటిని గావించి యకర్తగను, అన్నిఁటిని భోగించి అభోక్తగను అన్నిఁటియందు అలిప్తుడు గను నుండుట యెట్లు సంభవమగును? ౨ యోగి భోగములననుభవించియు అ భోక్తగానుండునని తాము నుడువుచున్నారు. అటులైనచో నీపద్ధతిప్ర కార మాతఁడు స్వర్గనరకముల ననుభవించిగూడ అభోక్తగానుండునా యేమి! * ౩ యోగి జన్మమృత్యువుల ననుభవించుచునే యుండును. జన్మమృత్యువులను భోగించియు నాతఁడభోక్తగానున్నాఁడు. యాతనల ననుభవించియు ననుభవింపనివాఁడుగా నున్నాఁడుగదా ౪ యోగీశ్వరుఁడు కొట్టినను గొట్టినవాఁడు కాఁడు. ఏడ్చినను ఏడ్చినవాఁడు కాఁడు. బాధించినను బాధించినవాఁడు కాఁడు ౫ జన్మింపకుండినను ఆతఁడు జన్మిం చుచున్నాఁడు. పతితుడుగాకుండియుఁ బతితుఁడగుచున్నాఁడు. యాతన లొందకయే నానావిధయాతన లొందుచున్నాఁడు. దీని కర్థమేమి? (ఈవి షయము సంశయాస్పదముగా నున్నది గావునఁ దెలుపుఁడు) ౬

శ్రోతల కీసందేహములు గలిగెను, కావున సమాధానములు జె ప్పవలయును. ౭ వక్త చెప్పుచున్నాఁడు "శ్రోతలారా! సావధానులుగండు. మీర లడిగినది బాగుగనేయున్నది. మీకు మీయనుభవమువలన నిట్టిసం దేహము కలిగినది ౮ మనుజుఁడు తనయనుభవమునుబట్టి చెప్పుచుండును. సామర్థ్యసంపదలు లేనిహీనవుఁడు ధనవంతుఁడగుట నిరర్థకము ౯ జ్ఞానసంప దలులేని జ్ఞాని, యజ్ఞానదారిద్ర్యము వలన గేవలశబ్దజ్ఞానముతో నిరంతరమాప దల ననుభవించుచుండును. ౧౦ యోగీశ్వరుని యోగీశ్వరుఁడే గురుతెఱుం గును. జ్ఞానేశ్వరుని జ్ఞానియే గుర్తెఱుఁగును ౧౧ మహాచతురుని చతురుఁడే గురుతెఱుంగును. అనుభవనీయు ననుభవనీయుఁడె యెఱుంగును. అలిప్తుని నలిప్తుఁడే యెఱుంగును ౧౨ విదేహుని విదేహుఁడే యెఱుంగును. బద్ధు నితో సమానముగా సిద్ధుని, సిద్ధునితో సమానముగా బద్ధుని భావించు పురుషుఁడు మూర్ఖుఁడని ప్రత్యేకించి తెలుపవలసిన పనిలేదు. ౧౩ దయ్య ము పట్టినవాఁడు దేహధారియే. దానిని వారించుమాంత్రికుఁడును దేహ ధారియే. ఈ యిరువురను సమానులని యెట్లు చెప్పగలము? ౧౪ ఇట్లే అజ్ఞానిని లేక పతితుని, జీవన్ముక్తుని లేక జ్ఞానిని సమాన ముగాఁ దలంచుపురుషుని బుద్ధిమంతుఁడని యెట్లనగలము? ౧౫ ఇఁక నీదృష్టాంతములను జాలింతము. ఇప్పుడు కొంతయనుభవముతోఁ గూడిన విషయమును దెలుపుదును. కొంచెముసేపు సావధానమతితో వినఁగోర దను ౧౬

జ్ఞానముతో గుప్తుఁడుగానుండి, వివేకముతో నాత్మస్వరూపము నందు లయుఁడై, యనన్యుఁడగుటకతన వేఱుగ నెవఁడుండఁడో ౧౭ యాతని నేవిధముగాఁ బ్రాప్తిఁగావించుకొనవలయును? ఏలయన! ఎప్పుడు మన మాతని వెదుకఁబోవుదమో యప్పుడు మనముగూడ స్వయము గా నదియేయగుచున్నారము. అదియేయగుటవలన నేదేని చేయ వలసినయవసర ముండదు ౧౮ దేహమునందుఁ జూచినచోఁ గనిపింపఁడు. తత్త్వముతో శోధింతమన్న భాసింపఁడు. బ్రహ్మమైయున్నాఁడుగాని యేమిచేసినను గుర్తింపఁబడఁడు ౧౯ చూచుటకు దేహధారియేగాని లోపల నిర్వికారుఁడైయున్నాఁడు. ఈస్థితిలోఁ బైపైఁ జూచుటవలన

---

* శ్రోతలు బొత్తిగాఁ దెలియక యిట్లు ప్రశ్నించిరి. "యోగి యన్నిఁటిని జేసియు అకర్తగను అన్నిటిననుభవించి యభోక్తగను నున్నాఁడని మీరు చెప్పుచున్నారు. ఈ స్థితియందు పాపాచరణమును జేయువారికి అంటుకొనుచ్చుటను గూడనుండనేయుండదు. ఏలయన! పాపమును జేసినను జేయనిదానితో సమానమైనది. కావునఁ బాపపుణ్యములు సుకృతదుష్కృతములు సమానమయ్యెనని చెప్పవలసివచ్చును. స్వర్గమునకుఁ బోయినను నరకమునకుఁ బోయినను పోనిదానితో సమమే"

నెట్లు గుర్తింపగలము? ౨౦ ఆతనిగూర్చినజ్ఞానము నార్జించుట కాతని నన్వేషించినచో నతఁడు నిత్యుఁడుగను, నిరంజనుఁడుగను గాన్పించును. అతని నన్వేషించుటవలన విశ్రాన్తి సైతము నిర్వికారియగును ౨౧ అతఁడు కేవలము పరమాత్మ. అతనియందు మాయామలములు లేవు. ఆతఁడఖండుఁడు. కామ్యము లాతని నెన్నఁడును నంటుకొనవు ౨౨ ఇట్టి యోగిరాజు స్వాభావికముగా ఆత్ముఁడు. ఆతఁడు వేదబీజమగు పూర్ణబ్రహ్మము. దేహమువైపు చూచినంతమాత్రమున నాతఁడు గోచరింపఁడు ౨౩ దేహభావన చేయుటవలన దేహమే కాన్పించును. కాని గుహ్యవిషయము వేఱుగానున్నది. శోధించిచూచితిమేని యాయోగీంద్రునకు జననమరణములు లేవని విదితమగును ౨౪ జననమరణములు పొందుచున్నది అంతరాత్మ యెప్పుడునుగాదు. ఎయ్యెగి లేనేలేదో దానినెచ్చటనుండి తేఁగలము? ఎట్లు తేఁగలము? ౨౫ నిర్గుణమునకు జనన మరణములు గల్పించినచో స్వయముగా మనకే జననమరణములు లభించును ౨౬ రెండుజాములవేళ సూర్యునిమీఁద నుమ్మివైచినచో నాయుమ్మి మనమొగముననే వచ్చిపడును. ఇట్లె యితరులమంచిచెడ్డతనములనుగూర్చి చింతనమొనరించినచో మనకే యామంచిచెడ్డలు తటస్థించును ౨౭ సమర్థరాజేశ్వరునిమహిమ నెఱింగినచో సమాధానము కలుగును. కానియొకొక్కవేళ కుక్క మొఱిగినచో (నేమందుము? చివరకు) అది కుక్కయేగదా ౨౮ జ్ఞాని సత్యస్వరూపుఁడు. కాని యజ్ఞాని వానిని (జ్ఞానిని) మనుష్యరూపునిగా భావించుచున్నాఁడు. భావము ననుసరించి యీశ్వరుఁడు ప్రాప్తించును ౨౯ ఈశ్వరుఁడు నిరాధారుఁడు. నిర్గుణుఁడు. జనులు పాషాణమును ఈశ్వరుఁడని నమ్ముచున్నారు. పాషాణమన్నో పగిలిపోవును. నిర్గుణ మెట్లు పగిలిపోఁగలదు? ౩౦ ఈశ్వరుఁడు సదోదితముగా నొక్కఁడేయున్నాఁడు. కాని జనులాతని ననేకవిధములఁ జేసివేసిరి. అంతమాత్రమున నాతఁడు బహువిధములగుట యెప్పటికిని దటస్థింపదు ౩౧ అట్లే ఆత్మజ్ఞానియగు సాధువు తనజ్ఞానమువలనఁ బూర్ణసమాధానియై యుండును. ఆతఁడు వివేకముతో ఆత్మనివేదనుఁడును ఆత్మస్వరూపుఁడును నగును ౩౨

కొయ్యబొమ్మ కాలినచో దానినిగాల్చినయగ్ని కొయ్యబొమ్మవలెఁ గాన్పించును. అంతమాత్రమున అగ్నిహోత్రుఁడు కొయ్యబొమ్మవంటి యాకారముగలవాఁడగుట తటస్థింపదు ౩౩ జ్ఞానియొక్క దేహదశ కర్పూరమువంటిది. ఒకసారి కర్పూరము కాలిపోయినయెడల మఱలనది తన పూర్వరూపములోని కెప్పుడును రాఁజాలదు. అటులే జ్ఞానిదేహము ఒక్కసారి యదృశ్యమైనయెడల మఱలనది జన్మమునొందదు ౩౪ వేయించిన విత్తనములు మొలువవు. కాలినవస్త్రములు మఱల బూర్వరూపము నొందవు. గంగయందుగలిసిన రెండవనదీప్రవాహమును జూడఁదలంచినచో నది వేఱుగాఁగాన్పింపదు ౩౫ ఆప్రవాహము గంగకు వెనుకఁగాన్పించును. ఏలయన! గంగ ఏకదేశీయము. కాని సాధువునకు భాసమేమియుఁ గలుగదు. (ఏలయన! దేనియందు సాధువుగలిసియుండునో) ఆ యాత్మ సర్వగతము ౩౬ (స్పర్శవేదితోఁ జేసిన) బంగారము మఱల యినుము కాదు, ఇటులే సాధువునకు మఱల జన్మము రాదు. జడులు మూఢులునగు అజ్ఞానప్రాణుల కీవిషయము బోధగాదు ౩౭ గ్రుడ్డివానికేమియుఁ గాన్పింపనట్లు అజ్ఞానులకుఁగూడ సత్యవిషయము గోచరింపదు. అజ్ఞానులను సన్నిపాతవ్యాధిలోఁ బ్రలాపించు పిచ్చివానివలెఁ దలంపవలెను. ౩౮ స్వప్నమునందు భయపడినవాఁడు ఆస్వప్నభయముతో నేదేనిప్రలాపించును. ఆభయము మేల్కొనియున్నవాని కెట్లుగలుగును? ౩౯ ఏదేని చెట్టువేఱు పామువలెఁ గనిపించుటచే నొకఁడు భయపడి పాఱిపోవును. మఱియొకఁడు దానిసత్యమును దెలిసికొనును. అప్పుడీయిరువురిదశ యొక్కటియేయని యెట్లు ఒప్పుకొనఁగలము? ౪౦ ఒక మనుష్యుఁడా వేఱును జేతితోఁ బట్టుకొనియున్నాఁడు. అది (ఆభ్రమ సర్పము) వానిని గఱువదు. రెండవాని కీవిశ్వాసము కలుగదు. వానికల్పనమె వానినింకనుభయపెట్టుచున్నదని దీని తాత్పర్యము. ౪౧ తేలుగాని పాముగాని యెవరినిగఱచునో వాఁడే బాధనొందును. ఆ కఱువఁబడిన బాధచే నితరులెట్లు బాధింపఁబడుదురు. ౪౨ శ్రోతలసందేహ మింతటితో నశించిపోవఁగలదు. జ్ఞానము జ్ఞానులకే తెలియును. అజ్ఞానులకు జన్మమరణములు విడిపోవు ౪౩ జ్ఞానము కలుగకపోవుటచే మానవులనేకులు పతనమొందిరి. అజ్ఞానకారణముననే మనుష్యులు జన్మమృత్యుకష్టములను భరించుచున్నారు. ౪౪ దీని సిద్ధా

పణమును శ్రోతలు రాఁబోవు సమాసమునందు సావధానులరై వినఁ గోరెదను రగి

నాలుగవ సమాసము.

ఎఱుఁగుట, ఎఱుఁగకుండుట (ఎఱుకమఱపులు).

"భూలోకమున ననేకవిధముల మనుజులున్నారు. అందుఁగొందఱు సంపన్నులు, కొందఱు దుర్బలులు, కొందఱు మలినులుగ నున్నారు. ఇట్లేల యున్నారు? ౧ ఎందఱో రాజులై యానందము ననుభవించుచున్నారు. ఎందఱో మనుజులు దరిద్రులై కష్టముగా దరిద్రమును అనుభవించుచున్నారు. ఎందఱో ఉత్తమస్థితియందున్నారు. ఎందఱెందఱో అధమాధమస్థితియందున్నారు. ౨ ఈస్థితిగతులు మానవులకే కారణములచేఁ గలుగుచున్నవో తెల్పుఁడు" అని శ్రోతలు వక్తనుబ్రశ్నించిరి. ౩ ప్రత్యుత్తరము. ఇదియంతయు గతియొక్కయు గుణముయొక్కయుఁ గారణమున జరుగుచున్నది. గుణవంతులగువారు భాగ్యభోగ్యముల ననుభవించుచునే యున్నారు. అవగుణులు దరిద్రకష్టముల ననుభవించుచున్నారు. ఇందు సందియమావంతయు లేదు. ౪ ఏజాతియందు జనించినవాఁ డాజాతికిసంబంధించిన వృత్తిని నేర్చుకొనినయెడల నాతనిని జనులు ప్రశంసచేయుదురు. ౫ ఎఱిఁగినవాఁడు కృషి (పరిశ్రమ) చేయును. ఎఱుఁగనివాఁ డేమియును జేయఁడు. ఎఱిఁగినవాఁడు (కృషిఫలితముగా) కడుపునింపించుకొనును. ఎఱుఁగనివాఁడు భిక్షమునెత్తుకొని బ్రదుకును. ౬ విద్యలేనివాఁడు దరిద్రుఁడు. విద్యావంతుఁడు భాగ్యవంతుఁడు. ఇది స్పష్టముగాఁ దెలిసినసంగతియే. దీనినందఱును బ్రత్యక్షముగాఁ జూచుచునేయున్నారు. ౭ ఎచ్చటనైన జూడుఁడు. పెద్దవారలు "ఓరీ! నీవు విద్యను నేర్చుకొనకపోయినచో బిచ్చమెత్తుకొందువాయేమి?" అని సర్వసాధారణముగా నీనీతిబోధకవాక్యమును నుడువుచునే యుందురు. ౮ తండ్రి యభాగ్యుఁడై యున్నను పుత్రుఁడొక్కొక్కప్పుడు భాగ్యశాలిగానుండుట మనముజూచుచున్నాము. పుత్రుఁడు విద్యాధికుఁడగుటవలననే తండ్రికంటె భాగ్యశాలియయ్యెను. ౯ విద్య, బుద్ధి, వివేకము, ఉద్యోగము, కుశలత, వ్యాపారము, మున్నగు గుణములు లేకపోవుటచేతనే మనుష్యుఁ డభాగ్యుఁ డగుచున్నాఁడు. ౧౦

ఈగుణములుగలవానికి వైభవమున నేకొంతయు నుండదు. ఆతఁడు వైభవములను విడిచినను తనంతటనవి వెంటఁబడును. ౧౧ పెద్దలు (తలిదండ్రులు) ధనవంతులుగను బుత్రులు భిక్షుకులుగను నుండుట మనముజూచుచున్నారము. కారణమేమన? పుత్రులు తమపెద్దలవలె ఉద్యోగమును (ప్రయత్నమును) జేయలేదు. అందువలననే వారు బిచ్చగాండ్రైరి. ౧౨ విద్య యెట్టిదిగ, నెంతగానుండునో ధైర్యోత్సాహములు అట్టివిగ నుండును. కృషి యెట్లుండునో వైభవ మట్లేయుండును. జనులు తూకమును (గౌరవమును) గనిపెట్టి గౌరవింతురు. ౧౩ విద్యావైభవములు లేనితావున నిర్మలత్వ మెటులుండగలదు? అభాగ్యకారణమున మనుజుఁడు కురూపిగను, మలినుఁడుగను, రోగిగను కాన్పించును. ౧౪ గుణవంతమగుటచేఁ బశుపక్షులుసైతము ఆదరపాత్రము లగుచున్నవి. గుణవంతుఁడైనచో మానవునకేల ప్రతిష్ఠకలుగదు? గుణహీనుఁడగు మానవుని జీవితము వ్యర్థము. ౧౫ గుణహీనుఁడగుమానవునకు గౌరవ ముండదు. గుణహీనునకు సామర్థ్యము, మహత్త్వము, కౌశలము, చతురత్వము మున్నగునవియేమియు నుండవు. ౧౬ ఉత్తమగుణము లుండుటయే సౌభాగ్యలక్షణము. గుణహీనునకు సహజముగా గుణలక్షణత్వ మేతెంచును. ౧౭ ఎఱిఁగినపురుషునకే మాన్యతగలుగును. ఏదైనను సరియే! ఒకవిద్యయున్నచో మానవునకు మహత్త్వము కలుగును. ౧౮

ప్రపంచము,పరమార్థము అను నీరెంటిలో నేయొక్కదానినైనను, లేదా రెంటినైనను దెలిసికొనినవాఁడు సమర్థుఁడగును. ఏమియుఁ దెలియని మానవుని జీవితము వ్యర్థము. ౧౯ ఎఱుగనివి కావుననే తేలు,పాము కఱచుచున్నది. జీవఘాతము కలుగుచున్నది. ప్రతికార్యము ఎఱుఁగమికతననే నష్టమగుచున్నది. ౨౦ ఎఱుఁగనిస్థితియందు మనుజుఁడు చిక్కులపాలగుటయు హాతమునందుఁ బడుటయు, మోసగింపఁ బడుటయుఁ దటస్థించుచున్నది. ఏదేని పదార్థమును మఱచిపోవుటయు నెఱుఁగమివలననే కలుగుచున్నది. ౨౧ ఎఱుఁగనిస్థితియందుఁ బ్రతిపక్షుఁడున్నపుడే వైరి విజయమును బడయును. ఎఱుఁగని స్థితివలననే మానవుఁడు సంకటములపాలగును·జీవనాశనము ఎఱుఁగనిస్థితియందే జరుగుచున్నది. ౨౨ తనహితమును దానెఱుఁగని కారణమున జనులు యాతన

లనుభవించుచున్నారు. జ్ఞానములేనికారణముననే అజ్ఞాని కధోగతి లభించుచున్నది. ౨౩

మాయాబ్రహ్మములను, జీవశివులను, సారాసారములను, భావాభావములను, గ్రహించుటచే జననమరణములు నశించును. ౨౪ నిశ్చయముగు కర్త యెవఁడో బద్ధుఁడు, ముక్తుఁడు అని యెట్టివారలనందురో తెలిసికొనుటవలనఁ బ్రాణులకు విడుదల (ముక్తి) కలుగును. ౨౫ నిర్గుణదైవమును గుర్తింపవలయును. "నేను" అనునదెద్దియో యెఱుంగవలయును. అనన్యలక్షణములను గ్రహింపవలయును. దీనివలన ముక్తిలభించును. ౨౬ మానవుఁడు తెలిసి యెంతవిడిచివేయఁగలఁడో యంతదృశ్యము (మాయ)ను దాటిపోవఁగలఁడు. జ్ఞాత నెఱుంగుటవలన అహంతాత్వమూలము నశించును. ౨౭ తెలిసికొనకయే కోట్లకొలఁదిగా నానావిధసాధనములు గావించినను మానవుఁడు మోక్షాధికారి కాఁజాలఁడు ౨౮ మాయాబ్రహ్మముల గురుతెఱుఁగవలయును. మరియు స్వయముగాఁ దన్నుఁదా నెఱుంగవలయును. ఇంతవరకుఁ దెలసికొన్నచోఁ జాలును. సులభముగా జననమరణములు విడిపోవును. ౨౯ రాజుయొక్కగాని ధనవంతునియొక్కగాని మనస్సులోనిమాటను గురుతించి తత్క్షణమె సమయానుకూలముగా మాటలాడినచో మిక్కుటమైన వైభవము లభించును. ౩౦ కావున ఎఱుఁగుటయునది సామాన్యవిషయముగాదు. ఎఱుకవలన మానవుఁడు సర్వమాన్యుఁడగును. ఏమియు నెఱుంగనివాని కన్నితావులయందును అవమానమే తటస్థించును ౩౧ ఏదేనిపదార్థమును గాంచి దానియందుఁ బిశాచమున్నదని భావించి ఎఱుఁగని మానవుఁడు భయపడిప్రాణములువిడచును. ఎఱిఁగిన మనుజుఁడు పిశాచముల విషయము మిథ్యయని తెలిసికొనును. ౩౨ ఎఱిఁగినవానికి మర్మము తెలియును. ఎఱుఁగని మనుజుఁడు మిథ్యాకర్మములయందుఁ జిక్కుకొని పడియుండును. ధర్మాధర్మాదులన్నియును నెఱుక వలననే విదితములగుచున్నవి. ౩౩ ఎఱుఁగనివానికి యమయాతనలు కలుగును. ఎఱిఁగినవాని కెట్టిసంకటములునుగలుగవు. సమస్తము నెఱింగి యెఱింగిన వానినిగూర్చి విచారముగావించువాఁడె ముక్తుఁడగును, ౩౪ రాజనీతి విషయము తెఱుంగకపోవుటచే నొక్కొక్కప్పుడు కొందఱకు అవమానముకలుగుటయేగాక ప్రాణములనుగూడ వెంటనే విడువవలసిన దు

ర్దశ తటస్థించుచున్నది. ఇటులే యెఱుఁగనిస్థితివలననెల్లరకును సంకటములు గల్గును. ౩౫ కావున నెఱుఁగని దశయందుండుట మంచిదిగాదు. ఎఱుకలేని ప్రాణు లభాగ్యులు. ఎఱుఁగుటవలనను దెలిసికొనుటవలనను జననమరణములు నశించును. ౩౬ కావున మానవుఁడు ఎఱుఁగుటయందు మెలకువలేక వర్తింపఁదగదు. ఎఱుంగుటయే ముఖ్యోపాయము. ఎఱుకవలనఁ బరలోకమార్గము లభించును. ౩౭ ఎఱుఁగుట యందఱకును మంచిదిగఁ గన్పట్టుచున్నది. మూర్ఖునకుమాత్రము మంచిదిగాఁ దోఁచదు. ఎఱుకవలననే అలిప్తతను గురుతించుట సాధ్యమగును. ౩౮ ఎఱుఁగుట (జ్ఞానము) తప్పనింకెయ్యది ప్రాణులను ముక్తులఁజేయగలదు? ఏపనియైనను గానిమ్ము. ఎఱుకలేకయున్నచోఁ గాఁజాలదు. ౩౯ ఎఱుఁగుట (స్మరణము) ఎఱుఁగకుండుట (విస్మరణము=మఱపు) అను నీరెంటిలో నెయ్యది యోగ్యముగానున్నదో యా విషయము చతురులగువారలు తెలిసికొనఁగలరు. ౪౦ ఎఱుకగలవారలే చతురులుగను, ఎఱుఁగనివారే పిచ్చివారును, దీనులుగను నున్నారు. ఎఱుకవలన విజ్ఞానము (అనుభవజ్ఞానము) గూడఁ దెలియును. ౪౧ ఎచ్చట యెఱుక కుంఠితమయ్యెనో యచ్చట చెప్పుటఁగూడ సమాప్తమయ్యెనని తెలిసికొనుఁడు. చాలును. ఈ దశ కలిగినపిమ్మటనే అనిర్వాచ్యమగు సమాధానము లభించును. ౪౨

ఇదియంతయు విని శ్రోత లిట్లు ప్రశ్నించిరి. మీరు చెప్పినది బాగుగా నున్నది. మాకు దీనివలనఁ జాల సమాధానము కలిగెను. ఇఁక మాకుఁ బిండబ్రహ్మాండలక్షణము లేవియో అనుగ్రహించి తెలుపుఁడు. ౪౩ బ్రహ్మాండమునం దేదియున్నదో అదియే పిండమునందున్నదని చాలమంది చెప్పుదురు. ఈ విషయమును దాము మాకుఁ బ్రత్యయము (విశ్వాసము) కలుగు విధమున వివరించి తెలుపుఁడు. ౪౪

ఐదవ సమాసము.

పిండబ్రహ్మాండములు.

పిండసమానముగా బ్రహ్మాండ మెటుల రచింపఁబడెనో యా విషయము మాకుఁ దెలియకున్నది. దీనిని బ్రతీతి (ఎఱుక) గావించుటకై

మతములన్నియుఁ దట్టుమిట్టాడుచున్నవి. ౧ సమయసమయములందు (ఎల్లప్పుడును) తత్వజ్ఞులగువారలు "ఏయ్యది పిండములోనున్నదో యది బ్రహ్మాండములో నున్న"దని చెప్పుచుందురు. ౨ పిండబ్రహ్మాండములు రెండును నొకేవిధముగానున్నవని జనులు చెప్పుదురు. కాని యీ విషయము ప్రత్యయమను నికషోపలముపై (నమ్మికయను ఒఱకాయిపై) పరీక్షింపఁబడకున్నది. ౩ స్థూలము, సూక్ష్మము, కారణము, మహాకారణము అను నీ నాలుగుపిండదేహములు, విరాట్టు, హిరణ్యగర్భము, అవ్యాకృతి, మూలప్రకృతియను నీ నాలుగుబ్రహ్మాండదేహములు ౪ ఇది శాస్త్రములలోఁ జెప్పఁబడిన విధము. కాని దీని నెట్లు ప్రతీతి (నిశ్చయము) చేయవలయును? ప్రతీతినిగూర్చి విచారింప నారంభించితిమేని గొప్ప గందరగోళములోఁ బడుదుము. ౫ పిండమునం దంతఃకరణ మెట్లున్నదో యట్లే బ్రహ్మాండమునందు విష్ణువున్నాఁడు. పిండమునం దెట్లుమనస్సున్నదో అట్లే బ్రహ్మాండమునందుఁ జంద్రుఁడున్నాఁడు. ౬ పిండమునందు బుద్ధియున్నట్లుల బ్రహ్మాండమునందు బ్రహ్మమున్నాఁడు. పిండమునందుఁ జిత్తమున్నట్లు బ్రహ్మాండమునందు నారాయణుఁడున్నాఁడు. ౭ పిండమునందు అహంకారమున్నదనియు, బ్రహ్మాండమునందు రుద్రుఁడున్నాఁడనియు నిశ్చయించుచున్నారు. ఈ విచారము శాస్త్రము లందుఁ గలదు. ౮ అటులయినచో విష్ణున కంతఃకరణమెవ్వఁడు? చంద్రునకు మనస్సెయ్యది? బ్రహ్మమునకు బుద్ధియెట్టిది? మాకుఁ దెల్పుఁడు. ౯ నారాయణుని జిత్తమెయ్యది? రుద్రుని యహంకార మెయ్యది? వీని నన్నింటిని జక్కఁగా విచారించి మాకుఁ దెలుపుఁడు? ౧౦ ప్రతీతి నిశ్చయములముందు అనుమానము సింహముముందుఁ గుక్కవలె నిస్తేజమగును. సత్యముముందు అసత్యము సరియైనదని యెవఁ డంగీకరింపఁగలఁడు? ౧౧ కాని దీనికొఱకొకపరీక్షకుఁడు గావలయును. పరీక్షకునివలన సత్యవిషయము విశదమగును. పరీక్ష నెఱుంగకపోయినయెడల సందేహములకుఁ బాల్పడవలసివచ్చును. ౧౨ ఓస్వామీ! విష్ణువు, చంద్రుఁడు, బ్రహ్మ, నారాయణుఁడును, రుద్రుడు అను నీయైదుగురి యంతఃకరణములనుగూర్చిన వివరములు దెలుపుఁడు ౧౩ ఇచ్చట ప్రతీతియే (ఎఱుకయే) ప్రమాణము. శాస్త్రములకు సంబంధించిన అనుమానములతోఁ బనిలేదు. లేదా శాస్త్రములనుజూచి సత్య

విషయమును ప్రత్యయము (విశ్వాసము) లోనికిఁ దేవలయును. ౧౪ ప్రతీతిలేకున్నచో నేకథానకమైనను మంచిదిగానుండదు, అట్లు (ప్రత్యయరహితముగాఁ) జెప్పినదంతయుఁ గుక్కనోరు తెఱచి యేడ్చుటవంటిది ౧౫ ఎచ్చటఁ బ్రత్యయమనుపేరుతో శూన్యాకారమున్నదో యచ్చట నేమివినవలయును? ఏమి వెదకిచూడవలయును. ౧౬ గుడ్డివాండ్రందఱు గుమిగూడినతావునఁజేరి కనులుగలవాఁ డేమినుడువగలఁడు? అటులే యనుభవనేత్రములు పోయినతావున సర్వమును అంధకారబంధురమగును ౧౭ పాలును నీరునుగలచోటనే రాజహంసలకుఁ బనియుండును. పురీషమయమగు ప్రదేశమున మాలకాకులకె పనిగలదుగాని రాజహంసలకుఁ బనియుండునా?

మీయిచ్ఛానుసారముగాఁ బిండసమానము బ్రహ్మాండమని నిశ్చయించుకొంటిరి. కాని యది ప్రతీతిలోనికిఁగూడ రావలయునుగదా ౧౯ కావున నీసందేహమంతయుఁ గల్పనముతోఁగూడిన మహారణ్యము. రోగ్యులగువారలు అరణ్యములలోనికిఁబోవు వంకరటింకరత్రోవలలో నడువరు. ఆత్రోవలలో నడచుపని దొంగలది ౨౦ మంత్రములు కల్పనములకతన నిర్మింపఁబడెను. దేవతలుగూడఁ గల్పనమువలననే నిర్మింపఁబడిరి. దేవతలు స్వతంత్రులుగారు. మంత్రాధీనులు ౨౧ ఈవిషయ మొకరు చెప్పకయే తెలిసికొనవలయును. చతురపురుషులు వీఁడుగ్రుడ్డివాఁడని నడవడినిబట్టియే గుర్తింతురు. అట్లే పూర్వోక్తవిషయములన్నింటిని వివేకముతో నెఱుంగవలయును ౨౨ ఎవని కెట్లుభాసించునో వాఁడట్టికావ్యమును రచించును. తనబుద్ధితో దానినెఱుంగవలయును. ౨౩ బ్రహ్మ యీ సంపూర్ణసృష్టిని రచించుచున్నాఁడుగదా! బ్రహ్మ నెవఁడురచించినాఁడు? విష్ణువు సమస్తవిశ్వమును బాలించుచున్నాఁడుగదా? విష్ణువును బాలించువాఁడెవఁడు? ౨౪ రుద్రుఁడు విశ్వసంహారమునకుఁ గర్తయైయున్నాఁడుగదా! రుద్రుని సంహరించుటకు కర్త యెవఁడు! కాల మన్నిఁటిని శాసించుచున్నదిగదా ! కాలమును శాసించువాఁ డెవఁడు! ఈవిషయములన్నియు నెఱుంగవలయును. ౨౫ పై విషయములు తెలియునంతవరకు నంతయు నంధకారముగనే భావింపవలయును. కావున సారాసారవిచారము గావింపవలయును. ౨౬ బ్రహ్మాండము తనంతటతానే యగుచున్నది. పిండాకార మంగీకరింపఁబడుచున్నది. అంగీకరింపఁబడుచున్నదేగాని దీనిప్రత్యయ మెన్నఁటికిని గలుగదు ౨౭ బ్రహ్మాండం

ము యొక్క ప్రతీతినిగూర్చి విచారముగావించుటవలన ననేకసందేహము లుత్పన్నమగును. వాస్తవమున కిదియంతయుఁ గల్పనముగా నెఱుంగవల యును. ౨౮ పిండసమానముగా బ్రహ్మాండము రచింపఁబడెనని యెవ్వఁ డంగీకరించును ? బ్రహ్మాండమునం దనేకపదార్థములు నిండిపడియున్నవి అని పిండమునం దెక్కడనున్నవి. ౨౯ మూఁడుకోట్లయేఁబదిలక్షలభూత జాతులు మూఁడుకోట్లయేఁబదిలక్షల తీర్థజాతులు, మూఁడుకోట్లయేఁబది లక్షలమంత్రములు పిండమునం దెక్కడ నిమిడియున్నవి? ౩౦ ఏఁబది ఆఱుకోటుల చాముండీదేవతలు, ఎన్నియో విధములుగనుండు కోట్లకొలఁదిజీవులు, ఎనుబదినాలుగులక్షల జీవయోనులు, వీనికూడిక పిండమునం దెక్కడనున్నది ? ౩౧ ముప్పదిమూఁడుకోట్ల దేవతలు, ఎనుబదినాలుగువేల ఋషులు, తొమ్మిదికోటుల కాత్యాయనీదేవతలు, పిండమునం దెక్కడనున్నారు ? ౩౨ ఇంతియగాక యింకను బ్రహ్మాండమునందు నానాప్రకారములగు పదార్థములు పెక్కులు వేఱువేఱుగా నిర్మాణములై యున్నవి. వానినన్నింటిని పిండమునందుఁ జూపింపవలయును గదా ! ౩౩ అనేకౌషధములు, అనేకరసాలఫలములు, నానావిధ బీజములు, ధాన్యజాతులు మొదలగు వానినన్నింటిని బిండమునం దెవఁడు చూపఁగలఁడు ? ౩౪ ఇటులే యెంతచెప్పినను బ్రకృతాంశము పూర్తి కాదు. ఇంకను నిటులే చెప్పుచుండుటగూడ సాధ్యముగాదు. మఱియుఁ జెప్పినది ధ్యానములోనికి రాకుండుటవలన సిగ్గుగలుగును ౩౫

ఇది చెప్పఁజాలని విషయమేయైనప్పుడు మఱల నేలవ్యర్థముగాఁ జెప్పవలయును ? సందేహపడవలసిన యవసరము లేదు. ౩౬ వాస్తవమునకుఁ బంచభూతములు బ్రహ్మాండమునందును బిండమునందునుగూడ వర్తించుచున్నవి. దీనిని జక్కఁగాఁ దెలిసికొనుఁడు ౩౭ పంచభూతముల కల్పనమే బ్రహ్మాండము. పిండముగూడఁ బాంచభౌతికమే. దీనికి వ్యతిరేకముగనున్న జ్ఞానమంతయు ననుమానజ్ఞానమే ౩౮ అనుమానమునకు సంబంధించిన వచనమువలెఁ ద్యాజ్యము. నిశ్చయాత్మకమగు కథనమే ప్రత్యయపూర్ణమును గ్రాహ్యమునై యున్నది. ౩౯ ఎయ్యేది పిండమునందుఁగలదో యదియే బ్రహ్మాండమునందుఁ గలదనువిషయము ప్రత్యక్షానుభవముగాకున్నను బంచభూతములవ్యాప్తి రెంటియందును నున్నది.

౪౦ ఈ రెంటివిషయమునందిది అనుమానమాత్రముగనే యున్నపుడిక ముఖ్యసమాధానమెద్ది? * ౪౧

ఆఱవ సమాసము.

పంచభూతములు - త్రిగుణములు.

ఆకాశమువలె బ్రహ్మము నిరాకారము. ఆకాశమునందు వాయువుత్పన్నమైనవిధమున బ్రహ్మమునందు మూలమాయ గలిగెను ౧ ఈ యంశము గ్రంథములందుఁగూడ వివరింపఁబడెను. గతదశకమునం దీయంశము విశదీకరింపఁబడెను. మూలమాయయందుఁ బంచభూతముల యునికి (అస్తిత్వము) చూపింపఁబడెను. ౨ ఆమూలమాయయందుఁ గల యెఱుకయే సత్త్వగుణము. ఎఱుకలేమియే (మఱపే) తమోగుణము. రెండింటి మధ్యదశ (ంతయెఱుక - కొంతయెఱుకలేమి) రజోగుణము ౩ అక్కడ ఎఱుక యెక్కడినుండివచ్చినది ! అనియొకవేళ శ్రోతలుప్రశ్నింతురేమో! దాని యభిప్రాయమేమన ? పిండమునం దేవిధముగా మహాకారణదేహమే సర్వసాక్షిణి (తురీయమగు) అవస్థయగుచున్నదో ౪ అట్లే బ్రహ్మాండముయొక్క మహాకారణదేహము మూలప్రకృతియై యున్నది. ఇందువలన మూలప్రకృతియందు ఎఱుకకు అధిష్ఠానమున్నది. ౫ త్రిగుణములు మూలమాయయందు గుప్తరీతిగా నున్నవి. కాని యా త్రిగుణములు స్పష్టమైనపుడాదశను జతురులు గుణక్షోభిణి (గుణమాయ) యనుచున్నారు. ౬ ఏదేని గరికిమొక్కకుఁ జివరరేకెత్తి పూవువికసించునట్లు మూలమాయనుండి త్రిగుణములుగూడ సులభముగాఁ బ్రకటనమగును. ౭ మూలమాయ వాయుస్వరూపముగా నుండును. అల్పగుణవికారమైన పిమ్మట దానినే గుణక్షోభిణియని యందురు. ౮

దీని తరువాత ఎఱుక, ఎఱుకలేమి, ఎఱుకయెఱుకలేములమధ్యస్థితి- అనునీమూఁడును (త్రిగుణములు) ప్రకటనమై మిశ్రరూపముతోఁ బ్రవర్తించును. దాని తరువాత అకారాద్యక్షరముల కధిష్ఠానమగు

---

* ఈ సమాసమునందుఁ బ్రశ్నోత్తరములు నిరూపించి వ్రాయఁబడలేదు., సందర్భమునుబట్టి 1పవ పద్యమువఱకుఁ బ్రశ్నయనియు 14వ పద్యమునుండి ప్రత్యుత్తరమనియుఁ దోఁచుచున్నది.

ధిలోఁ బడిపోయెను. సూక్ష్మముగాఁజూచినచో భాసించుచున్నది.
చాలును. ఈకారణమువలననే ఆకాశము భూతరూప మొందెను. ౩౬
ఆకాశము శేషించిననాల్గుభూతముల యుపాధికంటెను శూన్యరూప
ముతో భాసించుచున్నది. పరబ్రహ్మము నిరాభాసము. ఉపాధిరహిత
మగు నాకాశమే వాస్తవమునకుఁ బరబ్రహ్మము. ౩౭ ఎఱుఁగుట,
ఎఱుకలేమి, ఈరెంటిమధ్యమస్థితి అనునదియే త్రిగుణలక్షణము. ఇచ్చట
త్రిగుణములుసహితము రూపసహితములని చెప్పఁబడినవి. ౩౮ ప్రకృతి
విస్తృతియైనకొలఁది ఒకటికి మఱియొకటిగ నేర్పడిపోవసాగెను. వికార
వంతమగుదానికి నియమముండునా? ౩౯ నలుపును దెలుపును గలిపి
నచో నీలవర్ణమేర్పడును. మఱియు నలుపును బసుపును గలిపినచో
ఆకుపచ్చరం గేర్పడును. ౪౦ ఈవిధముగాఁ బలురెంగులరం
గులు కలియుటచేఁ గ్రొత్తక్రొత్తరంగులు కలుగునట్లు ఒకటితో మఱి
యొకటి కలియుటకతన నీవికారవంతమగుదృశ్యము నానారూపములు
ధరించుచున్నది. ౪౧ ఒక్కటియగుజలము నానావర్ణములతోఁ దరంగ
రూపముగ లేచుచుండును. ఈత్రిమ్మరివికారముల నెంతదనుక విచారింప
నగును? ౪౨ ఒకజలమొందువికారము లపారములుగనున్నవి. ఇఁకఁ బంచభూ
తములవిస్తరమన్ననో అది యెనుబదినాలుగుకోటుల యోనులరూపమున
నున్నది. ౪౩ నానాదేహములబీజమే జలము. ఉదకమునుండి సమస్తజను
లును జనించిరి. కీటకము, చీమ, మొదలుగాఁగలశ్వాపదాదికము (హిం
సించుజంతుజాతి) అంతయు ఉదకమునుండియే కలుగుచున్నది. ౪౪ నీటి
వలననే రజస్సు, వీర్యము ఏర్పడెను. ఈశరీరమంతయు జలమయము. నఖ
ములు, దంతములు, శల్యములు మున్నగునవియన్నియు, నీటివలననే
నిర్మితములగుచున్నవి. ౪౫ వేళ్ళయొక్క సూక్ష్మద్వారములనుండి వృక్ష
ములోనికి జలము ప్రవేశించును. ఆనీటివలననే వృక్షజాతు లభివృద్ధినొందు
చున్నవి. ౪౬ జలకారణముననే మయూరము మామిడిచెట్టులోని కరు
డెంచుచున్నది. వృక్షము ఫలములతోఁ, బల్లవములతోఁ, బూవులతో నల
రారుటకు జలమే కారణము ౪౭ వృక్షముయొక్క మొదలును, శాఖలును,
బగులఁగొట్టి ఫలములనువెదకినచోఁ గనిపింపవు. అచ్చటఁ బచ్చిచెక్క
మాత్రమే యుండును. ౪౮ వేఱు మొదలుకొని పయిరెమ్మలవరకు శోధిం

చినను వృక్షములోఁ బండ్లుగనిపింపవు. ఇఁక ఫలము లెక్కడనుండివచ్చు
చున్నవి? వృక్షములో ఫలము జలరూపముగానున్నది. ఈయంశము చతు
రులగుపురుషులు వివేకముచే గ్రహింతురు. ౪౯ ఆజలమే పైకెక్కినపుడు
వృక్షమంతయుఁ బూవులతోఁ, బండ్లతో నలరారును. ఈవిధముగా జల
సహాయముననన్నియు నేర్పడును ౫౦ ఇట్లే ఆకులు, పూవులు, పండ్లు
కలుగును. మాటిమాటికి ఈవిషయము నెంతదనుకని చెప్పవలయును?
సూక్ష్మదృష్టితో నారయుచో నంతయు విదితమగును. ౫౧ భూతముల
వికారము నెంతదనుకఁ జెప్పఁగలను? క్షణక్షణమును భూతములు మా
ఱుచుండును. నానావర్ణరూపములతో నొకటివేఱొకటిగా మాఱుచుం
డును. ౫౨ త్రిగుణములు, పంచభూతములు, (అష్టవిధప్రకృతి) వీనిచలన
మును విచారించినచో వీనికిఁ బెక్కురూపములు గలవని విదితమగును.
నానావిధముల మాఱుచుండు వానివివరణము నెంతదనుకఁ జెప్పసాధ్య
మగును? ౫౩ ఈప్రకృతి వివేకసహాయమున బాగుగా నిరసనముగావిం
పవలయును. ఆపిమ్మటఁ బరమేశ్వరుఁడగు నాపరమాత్మని యనన్యభావ
ముతో భజింపవలయును. ౫౪.

ఏడవసమాసము.

వి క ల్ప ని ర స న ము

శ్రోత యిట్లు శంకించుచున్నాఁడు "మొట్టమొదట నొకస్థూలదే
హ మున్నది. పిమ్మట దానిలో అంతఃకరణపంచక మున్నది. జ్ఞాతృత్వ
వివేకము స్థూలకారణమువలన నేర్పడెను. ౧ ఇట్లి బ్రహ్మాండము లేనిది
మూలమాయయందు ఎఱుక రానేరదు. స్థూలాధారమువలన నన్నిపను
లును నడచుచున్నవి. ౨ స్థూలమే నిర్మాణము కానప్పుడు అంతఃకరణ
మెచ్చటనుండఁగలదు? ౩ పైశంకకుఁ బ్రత్యుత్తరము. పట్టుపురుగుజాతి
లోఁజేరిన పెద్దవిచిన్నవియగుపురుగులు తమతమశక్త్యనుసారముగాఁ దా
ముండెడిచెట్టుమీఁదనే గృహములు నిర్మించుకొని యందువసించును. ౪
ఇటులే శంఖపుఁబురుగులు, నత్తగుల్లలోనిపురుగులు, గవ్వలలోని పురు
గులు మొదట పుట్టుచున్నవియా? లేక మొదట వానిగృహములు
నిర్మాణము లగుచున్నవా? ఈ యంశమునుగూడ విచారింపవలయును.

౫ పైనిఁ బేర్కొనిన కీటకజాతులే తొలుతఁ బుట్టును. తరువాత నవి తమ తమనివాసములను నిర్మించుకొనును. ఈ విషయము ప్రత్యక్షానుభవ మైనది. దీనిని విశేషించి వివరింపఁ బనిలేదు. ౬ ఈ విధముగఁ దొలుత సూక్ష్మమును దరువాత స్థూలమును నిర్మాణ మగుచున్నది. ఈ దృష్టాంతమువలనే శ్రోతలప్రశ్నకు సులభముగఁ బ్రత్యుత్తరము చెప్పినట్లగును ౭

పిమ్మట శ్రోత మఱల నిట్లడిగెను. "అయ్యా! నాకిపుడు జన్మమరణవిచారమును బోధింపుఁడు. ౮ జన్మమునిచ్చువాఁ డెవఁడు? జన్మమును గైకొనువాఁ డెవఁడు? దీని నెట్లెఱుంగవలెను. ౯ బ్రహ్మ జన్మమునొసంగుననియు, విష్ణువు ప్రతిపాలించుననియు రుద్రుఁడు సంహారము గావించుననియుఁ బెద్దలు చెప్పుదురు ౧౦ కాని యీ ప్రవృత్తికథనము (జనరూఢి) నాకు బోధగాకున్నది. అనుభవదృష్టి కీకథనము విశ్వాసనీయముగఁ దోఁచుటలేదు ౧౧ బ్రహ్మ కెవఁడు జన్మము నొసంగుచున్నాఁడు? విష్ణువు నెవ్వఁడు ప్రతిపాలనము జేయుచున్నాఁడు? మహాప్రళయమునందు రుద్రు నెవ్వఁడు సంహారము చేయుచున్నాఁడు. ౧౨ నాబుద్ధి కిదియంతయును సృష్టిప్రభావమనియు మాయాస్వభావమనియుఁ దోఁచుచున్నది. నిర్గుణియగు దేవునే యొకవేళ కర్తగా నంగీకరింతమాయన్న నాతఁడు నిర్వికారిగదా (వికారములేనిది కర్తృత్వ మెట్లు రాఁగలదు) ౧౩ ఈ కార్యములన్నింటిని మాయయే యొనర్చుచున్నదని యందుమన్నచో మాయ స్వయముగా నుత్పత్తియై నశించునది. మాయావిస్తరము స్వయముగా నగుచున్నది. విచారించిచూచినచో మాయ స్థిరముగలది కాదనిగూడ విశదమగుచున్నది (కావున నిట్టియశాశ్వతమగు మాయ కర్తయని యెట్లుచెప్పనగును? ౧౪ (ఇదిగాక జన్మించువాఁడెవఁడు? వాని చిహ్నములు గుర్తించుటయెట్లు? సంచితలక్షణ మెద్ది? వీనినిగూడ నెఱింగింపుఁడు ౧౫ పుణ్యపాపస్వరూపము లెవ్వి? మఱియుఁ బ్రస్తుతము శబ్దములతో శంకలను గలుగఁజేయువాఁ డెవఁడు? [ఈ శబ్దములవలన నీశంకల నొనర్చిన 'నేను' ఎవఁడను] ౧౬ ఇవియేమియు నాకుఁ దెలియుట లేదు. వాసనయనునదియే జన్మను గైకొనుచున్నదని యందురు కాని వాసన కనుపింపనే కనుపింపదు. అది పట్టుకొనుటకుఁగూడ నవకాశములేనిదిగా నున్నది. ఈ స్థితిలో వాసన జన్మముల నెట్లుగైకొనుచున్నది? ౧౭

వాసన, కామనము, హేతువు, భావన, కల్పనము, నానావిధములుగ నున్నమతి, మున్నగు ననేకవృత్తులు అంతఃకరణపంచకములోని వై యున్నవి ౧౮ ఇవియన్నియు ఎఱుకయొక్కయంత్రములు. ఎఱుకయన; కేవలస్మరణమున కర్థమగును. ఆస్మరణమునందు జన్మసూత్ర మెట్లుసంధించును? ౧౯ దేహము పంచభూతములతో నిర్మింపఁబడినది. దానిని నడపునది వాయువు. మఱియు ఎఱుఁగుట మనస్సునకుఁగల మనోభావము. ౨౦ ఈవిధముగా నిదియంతయు స్వాభావికముగనే, తనంతటనే, యగుచున్నది. ఇదియంతయుఁ బంచభూతముల జంజాటము. ఎవఁడు, ఎవనికి జన్మమునొసంగుచున్నాఁడు? ౨౧ కావున జన్మము లేనేలేదని నాయభిప్రాయము. ఒకసారిపుట్టినప్రాణి మఱలనెన్నఁటికిని జన్మము నెత్తఁజాలదు. ౨౨ మానవునకు మఱల జన్మములేదు. అట్టియెడ సాధుసమాగమము గావింపవలసిన యవసరమేమున్నది? ౨౩ మొట్టమొదట స్మరణ విస్మరణములే (ఎఱుకమఱపులే) లేవు. ఈస్మరణము మధ్యనే వచ్చినది. అది యంతఃకరణమునెఱింగెడి యొకకళ. ౨౪ చైతన్యమున్నంతదనుకనే స్మరణ ముండును. చైతన్యము నష్టమైన తోడనే విస్మరణము (మఱపు) కలుగును. అట్లే విస్మరణమువచ్చిన తోడనే ప్రాణికి మరణము కలుగును. ౨౫ స్మరణము, విస్మరణము నష్టమైనంతనే దేహమునకు మరణముప్రాప్తించును. అపుడు మఱల జన్మమును ఎవరికెవరిచ్చెదరు? ౨౬ కావున జన్మములేదు. యాతనయును గాన్పించుటలేదు. ఈకల్పనమంతయు వ్యర్థముగా వృద్ధియైనది. ౨౭ సారాంశమేమన్న—"ఎవనికిని జన్మముకలుగుట లేదు. ఒకసారి మరణించినవారలు మఱల జన్మమునెత్తరు. (అని శ్రోతలకు శంకగలిగెను.) ౨౮ ప్రత్యుత్తరము:- ఎండిపోయినకట్టె మఱలఁ బచ్చదనము నొందదు. పడిపోయినఫలము మఱల నతుకదు. ఇట్లే పతనమైనశరీరము మఱల జననమునొందఁజాలదు. ౨౯ కుండ ఆకస్మికముగాఁ గ్రిందఁబడి పగిలిపోయినచో మఱల నది యేవిధముగానైనను కుండగాదు. అటులే మృతమనుష్యుఁడు మఱల జన్మమునొందఁడు. ౩౦ అనగా మరణించి యెవ్వఁడును మఱల జన్మమునే యెత్తకపోయినచో అప్పుడు శ్రోతలయభిప్రాయములో అజ్ఞానసుజ్ఞానములు సమానములేయైనవి. ౩౧

శ్రోత యిట్లు నుడివెను. "వినుఁడు. సకలమును బ్రహ్మాండమును గావింపఁకుము. సందేహము కలిగినచో వివేకసహాయమున విచారింపవలయును. ౩౨ ప్రయత్నము లేనిది పని నెఱవేరుటయుఁ దినకయే కడుపు నిండుటయు జ్ఞానము కలుగకయే ముక్తిలభించుటయు నెప్పుడును సంభవింపదు. ౩౩ తాను తృప్తిగా భుజించినవానికిఁ బ్రపంచమంతయుఁ దృప్తినొందినట్లు తోఁచవచ్చును. కాని యందఱును దృప్తినొందు దనుక నది సత్యమెట్లు కాఁగలదు ? ౩౪ ఈఁతను నేర్చినవాఁడే తీరమునకుఁ జేరఁగలడు. ఈఁత నేరువనివాఁడు మునిఁగిపోవును. ఇందు సందేహమావంతయును లేదు. ౩౫

ఈవిధముగా జ్ఞానప్రాప్తినొందినవారలు తరింతురు. బంధనములు తెగిపోయినవాఁడే ముక్తుఁడగును. ౩౬ ముక్తపురుషుఁడు బంధనము లేనేలేదని చెప్పును. లోకులు ప్రత్యక్షముగా బంధనములకుఁ బాల్పడియున్నారు. వారలస్థితి యేమి ? దీనినిగూడ నీవుకొంచెము యోచించిచూడుము! ౩౭ ఇతరులదుఃఖము నెఱుంగనివానిని, ఇతరులదుఃఖములోఁ దనకు సుఖమున్నదని తలంచువాఁడని నిశ్చయింపవచ్చును. పూర్వోక్తమగు నీయనుభవస్థితియు నట్టిదె. ౩౮ ఆత్మజ్ఞానము గలిగినవాఁడు వాస్తవమునకు సంపూర్ణతత్త్వములను వివరించుకొనును. అనుభవము లభించిన పిమ్మట వానికిఁ బరమశాంతి కలుగును. ౩౯ జ్ఞానమువలన జననమరణములు నశించుననుకథనమును మిథ్యగ భావించితిమేని వేదశాస్త్రపురాణములనుగూడ మిథ్యయని చెప్పవలసి వచ్చును. ౪౦ ఒకవేళ వేదశాస్త్రములను ప్రపంచమునందలి మహానుభావుల వాక్యములను మిథ్యయని భావించినచో నిఁక మావంటివారల మాటల నెవ్వఁడు విశ్వసించును? కావున నెవని కాత్మజ్ఞానముండునో యాతఁడె ముక్తుఁడు. ౪౧, ౪౨ వాస్తవమునకు మనుజులందఱును ముక్తులే. ఇట్లు చెప్పువాక్యములుగూడ జ్ఞానకాండలోనివే. కాని యిదియంతయు జ్ఞానము కలిగినప్పుడే సంభవమగును. ౪౩ ఆత్మజ్ఞానము కలిగినయెడల దృశ్యము మిథ్యయై పోవును. కాని యజ్ఞానదశయం దీదృశ్య మందఱను జట్టవేసుకొనియుండును. ౪౪ ఇంతటితో నీప్రశ్నము పూర్తియైనది. అనఁగా జ్ఞాని జ్ఞానమువలన ముక్తుఁడగును. అజ్ఞాని తనకల్పనమువలననే బంధింపఁ

బడియుండును. ౪౫ విజ్ఞానమును అజ్ఞానమునకు సమానముగను, ముక్తుని బద్ధునకు సమానునిగను, నిశ్చయము అనుమానమునకు సమానముగను భావింపఁ దగదు. ౪౬ బాగుగా యోచించిచూచినచో బంధనమనునది లేనేలేదు. ఇది సత్యమే! కాని బంధన మందఱి నావరించుకొని యున్నది గదా! బంధనము తొలంగుటకు జ్ఞానము తప్ప వేఱుసాధనము లేదు. ౪౭ తొలుత నీయాశ్చర్యమును గమనింపుడు. బంధనమునునది లేనేలేదు. అయినను అది యందఱి బంధించియున్నది. జను లీబంధనమును (మాయను) జ్ఞానసహాయమున మిథ్యయని తెలిసికొనలేకపోవుటచేతనే బద్ధులైయున్నారు. ౪౮ కేవల నిష్కపటభావమువలననే మోక్షము సిద్ధియగుననునమ్మకమునందుండుట గౌణవిషయము. వివేకమునో జ్ఞానమునో ప్రాప్తిగావించుకొని తత్కాలముననే ముక్తినొందుట ముఖ్యము. ౪౯ ప్రాణి ముక్తినొందవలయునన్నచో అన్నింటికంటెను దొలుత "ఎఱుక" యనుకళ యుండవలయును, ఇఁక నేమున్నది. అన్నింటి నెఱుంగుటవలన సులభముగనే ప్రాణిబంధములనుండి విడివడి బ్రహ్మరూపుఁడగును. ౫౦ ఏమియు నెఱుంగకుండుట యజ్ఞానము. అన్నింటి నెఱుంగుట జ్ఞానము. ఇట్లే యన్నింటి నెఱింగిన భావనగూడ లయమైపోవుట విజ్ఞానము. ఈదశ గలిగిన పిమ్మటఁ బ్రాణి స్వయముగా ఆత్మయై పోవును. ౫౧ అమృతమును సేవించి స్వయముగా నమరుఁడైనవాఁడు ఇతరులనుజూచి వీరలిట్లు మరణించుచున్నారేమి యనును. అట్లె వివేకియగు పురుషుఁడు బద్ధులనుజూచి మరల వీరలిట్లు జన్మములెత్తుచున్నారేమి యనును. ౫౨ భూతవైద్యుఁడు ఓయన్నా! నీకు భూతమావేశించినప్పు డెట్లుండునురా యని యడుగును. విషవైద్యుఁడు నీకు విషమేవిధముగా నెక్కునని యడుగును. ౫౩ కాని యీవిషయము లట్లడిగినంతమాత్రమునఁ దెలియునవికావు. మొదట స్వయముగా నాదశలోనికి రావలయును. (వివేకము నొకప్రక్కనుంచి మొదటఁ దాను బద్ధునితో సమానుఁడై బద్ధునిలక్షణములను బరిశీలింపవలయును.) అట్లు గావించినచో నిఁక వాని నడుగవలసిన యవసరముండదు ౫౪ మేల్కొనియున్నవాఁడు నిదురించెడువానినిజూచి ఓరీ! నీవెందులకు గుఱ్ఱుపెట్టుచున్నాఁడవని యడుగును. ఇటుల నడుగుటకంటె గుఱ్ఱుపెట్టుటయందలి యను

భవమును గుర్తింపవలయునన్నచో స్వయముగా నిద్రించియే చూడవలయును. ౫౫ ఏలయన! జ్ఞాతయొక్క వృత్తి జ్ఞానకారణమున జాగరూకతనొందును. కావున నది బద్ధునివృత్తివలెఁ జిక్కువడదు. కడుపునిండినవానికాఁకలిగొన్నవాని కష్టనిష్ఠురములు తెలియఁజాలవు ౫౬ చాలును. ఇంతటితో శ్రోతలసందియము విడిపోవఁగలదు. జ్ఞానమువలన మోక్షము కలుగును. వివేకమువలన ఆత్మానుభవము కలుగును. ఇది సిద్ధాంతము. ౫౭

ఎనిమిదవసమాసము

బద్ధుని పునర్జన్మము.

ప్రశ్న. జ్ఞాత జ్ఞానకారణమున జన్మమును వదలించుకొనిపోవును. కాని బద్ధునకు మఱల నెట్లు జన్మములభించుచున్నది? వాఁడు మరణించినపిమ్మట నేయవయవము జన్మముగైకొనుటకై శేషించియుండును? ౧ ప్రత్యుత్తరము- ఒకసారి బద్ధప్రాణి చనిపోయినపిమ్మట వానియవయవములెవ్వియును శేషించియుండవు. వానియెఱుక వాఁడు మరణించుటకుముందుగనే వెడలిపోవును. ౨ శ్రోతలారా! మీసందియమునకుఁ బ్రత్యుత్తరము సావధానులరై వినుండు ౩ వాసనావృత్తి ప్రాణములను వెంటనంటియుండును. కావునఁ బంచప్రాణములు తమతమస్థానములను విడిచిపోవుచున్నపుడు వాసనగూడ వానివెంట దేహమును విడిచివెడలిపోవును. ౪ ఈవిధముగాఁ బ్రాణవాయువుల వెంటనంటి తొలుదొలుత వెడలిపోవునది వాసనయే. మఱల హేతువునను సరించి యదియే జన్మముగైకొని ప్రపంచములోనికి వచ్చును. ౫ ఎన్నియో ప్రాణులు పూర్తిగా మరణించి యూవల మఱలలేచుచుండుటను మనము అప్పుడప్పుడు జూచియున్నారము. వారలు మరణించిరని గట్టిగఁ దాళ్ళతో బిగించికట్టుటచేఁ జేతులును, పాదములునుగూడ బాధనొందుచున్నవి. ౬ సర్పము కఱచుటచే మనుజుఁడు మరణించును. మూఁడేసిదినములు గడచినపిదప వైద్యులు వానిని బ్రతికించుచున్నారు. ఇట్టిసంఘటనము లప్పుడప్పుడనేకులు చూచియున్నారు. ఇది యెట్లుజరుగుచున్నదో చెప్పెదను. ఆవాసనయే వెనుకకుఁ దిరిగివచ్చుచున్నది. ౭ మృతినొందినవారల నెందఱెందఱినో ఒకఁడు మఱల బ్రతికించుచున్నాఁడు. మఱియుఁ గొందఱు యమలోకమునకేగిన ప్రాణములను

గూడఁ దిరిగి వెనుకకు రప్పించుచున్నారు. ౮ ఎందఱో శాపమునొంది అన్యదేహమునొందుచున్నారు. శాపనివారణసమయమేతెంచినంతన మఱలఁ దమపూర్వదేహములలోనికి వచ్చుచున్నారు. ౯ ఎందఱెందఱో జనులు పెక్కుజన్మములను ధరించుచున్నారు. ఎందఱో పరకాయప్రవేశము గావించుచున్నారు. ఈ విధముగా నెందఱెందఱో యెందఱో లోకములోని కేతెంచిరో యెవ్వరెఱుంగుదురు. ౧౦ ఊఁడినంతనే అగ్ని ప్రకటనమగునట్లు వాసనారూపమగు వాయువు గూడ జన్మము నొందుచుండును ౧౧ మనస్సునకు నానావిధములగు వృత్తులుగలవు. నియందే (ఆ వృత్తులయందే) వాసన యుత్పత్తియగును. వాసనయనునది చూచుటకుఁ గాన్పింపకున్నను అది యవశ్యముగా నున్నదిసుమా ౧౨ వాసనయందు ఎఱుకయొక్క హేతువున్నది. ఈయెఱుక మూలమాయనుండి వెడలిన తంతువు. ఇది కారణరూపముతో మూలమాయయందు మిశ్రితమైయుండును ౧౩ ఎఱుకయనునది కారణరూపముతో బ్రహ్మాండమునందును, కార్యరూపముతోఁ బిండమునందును బ్రవర్తించుచుండును. త్వరత్వరగా దానిని అనుమానను గావించినచో నది యనుమానములోనికి రాదు ౧౪ ఎఱుక వాయుస్వరూపమువలె సూక్ష్మముగా నున్నది. దేవతాగణము వాయుసృష్టి వాయురూపముననే యున్నది ౧౫ వాయువునందు నానావికారములు గలవు. అయినను వాయువు చూచుటకుఁ గాన్పింపదు. ఇటులె యెఱుకయొక్క వాసనగూడ అతి సూక్ష్మముగా నున్నది. అదిగూడఁ గాన్పింపదు ౧౬ త్రిగుణములు పంచభూతములు, వాయువునందు మిశ్రితములై యున్నవి. ఈ విషయ మనుమానములోనికి రాఁజాలకున్నను మిథ్యయని దీని నెన్నఁటికినిఁ జెప్పఁజాలము. ౧౭ స్వాభావికమగు వాయువువలననే సుగంధదుర్గంధములు విదితమగుచున్నవి. మఱియు ఉష్ణత, శీతలత గూడ నీవిధముగనే భాసించుచున్నది. ౧౮ వాయువువలననే మేఘములు వర్షించుచున్నవి. వాయువువలననే నక్షత్రములు, నడచుచున్నవి. సృష్టియంతయును నీవాయువువలననే ప్రవర్తించుచున్నది. ౧౯ దేవతలు, భూతములు, వాయురూపమున ఆకస్మికముగ శరీరములోనికేతెంచి నిండిపోవును. విధివిధానమునను మంత్రప్రయోగమునను

శవములు బ్రతికి లేచుచున్నవి. ౨౦ శరీరములోనికి దేవత నావేశపరచుటవలన బ్రహ్మపిశాచములు తొలంగిపోవును. హరింపఁబడినవి లభించును. మఱియు ననేకగుప్తవిషయములు ప్రత్యక్షముగా విశదమగును. ౨౧ వాయువు ప్రత్యేకించి మాటలాడదుగాని శరీరమునందంతటను నిండియుండి మాటలాడును. ఎన్నియో ప్రాణులు తమయిచ్ఛవలననే జన్మమును బడయుచున్నవి. ౨౨ వాయువికార మిట్టిది. దీనివిస్తారము తెలియనే తెలియదు. సమస్తచరాచరజంతుజాలము వాయువువలననే వర్తించుచున్నది. ౨౩ వాయువు స్తబ్ధరూపముతో సృష్టిని ధారణము చేయుచున్నది. మఱియుఁ జంచలరూపముతో సృష్టిని రచించుచున్నది. ౨౪ ఆదినుండి యంతముదనుక సమస్తమును వాయువే కావించుచున్నది. వాయువునకుఁదప్ప నింక దేనికేని కర్తృత్వమున్నచోఁ జతురులగుపురుషులు నాకెఱింగింపఁ గోరెదను. ౨౫

మూలమాయ యొఱుకరూపమున నుండును. ఆయొఱుకయే మనయందుఁగూడ నున్నది. ఈప్రకారముగా నెఱుక యొకచోట గుప్తముగను, ఒకచోటఁ బ్రకటనముగను, జగమునందు వర్తించుచుండును. ౨౬ నీరావిరిరూపమున గుప్తమైపోయి వర్షరూపమునఁ బ్రకటమగునట్లు ఎఱుకయనునది వాయువునందు నిరంతరము హెచ్చుచుఁదగ్గుచు గుప్తమును, బ్రకటనమును నగుచుండును. అది యొకానొకచోట వికృతియగుచుండును. ఒకానొకచోట సాధారణముగ వాయురూపమున నుండును. ౨౭, ౨౮ ఒక్కొక్కప్పుడు శరీరముమీఁదినుండి వాయువు వీడలుటవలనఁ జేతులు కాళ్లు మున్నగు నవయవములు పట్టుకొనిపోవును. ఒక్కొక్కపుడు వాయుప్రసరణమువలననే నిలిచియున్న పచ్చని పైరు లెండిపోవును. ౨౯ అనేకరోగములలో నిట్టివాయువు లనేకములుగలవు. వానివలన జనులకు బాధలు కలుగుచుండును. ఆకాశమునందుఁ బిడుగు సైతము వాయుకారణముననే జ్వలనమగుచున్నది. ౩౦ వాయువువలననే సంగీతశాస్త్రజ్ఞానము, స్వరజ్ఞాననిశ్చయము గలుగును. సంగీతశాస్త్రమునందుఁగల (దీపకళ్యాణరాగముతో) దీపము వెలిగింపఁబడుటయొక్కయు (మేఘమల్లారరాగముతో) మేఘములు వర్షించుటయొక్కయుఁ జమత్కారము వాయుకారణముననే కలుగుచున్నది. ౩౧ వాయువుసోకుట

వలన భ్రమకలుగును. వృక్షాదు లెండిపోవును. వాయువువలననే నానావిధమంత్రములు నడచుచున్నవి. ౩౨ మంత్రములవలన దేవతలు ప్రత్యక్షమగుచున్నారు. భూతములు పాఱిపోవుచున్నవి. మంత్రసామర్థ్యమువలననే యక్షిణీవిద్య (గారడి) రాక్షసమాయ మొదలగు కౌతుకములు గోచరించుచున్నవి. ౩౩ రాక్షసమాయారచనము దేవాదులుగూడ గ్రహింపఁజాలరు. స్తంభనము, మోహనము మున్నగు బహువిధముల విచిత్రసామర్థ్యములన్నియు వాయుకారణముననే యగుచున్నవి. ౩౪ మంచివానిని పిచ్చివానిగను పిచ్చివానిని మంచివానిగను జేయుట మున్నగు ననేక విచిత్రములు వాయువువలననే జరుగుచున్నవి. ఇట్లెంతదనుకనని చెప్పఁగలుగుదును? ౩౫ మంత్రమువలననే దేవసంగరములు జరుగుచున్నవి. మంత్రములవలననే ఋషులయెడ నభిమానము కలుగుచున్నది. మంత్రసామర్థ్యమహిమ నెవ్వఁడెఱుంగఁగలఁడు? ౩౬ మంత్రమువలనఁ బక్షులు వశమగును. మూషికశ్వాపదాదులు బంధింపఁబడును. మహాసర్పములు స్తబ్ధములగును. అంతియగాక ధనలాభముసైతము మంత్రములవలననే కలుగును. ౩౭ పయినిజెప్పినదాని విచారమువలన బద్ధుని జన్మము విశదమగుచున్నది. శ్రోతలుగావించిన వెనుకటి సందేహము గూడ నివారణమైనది. ౩౮.

తొమ్మిదవసమాసము

బ్రహ్మములో బ్రహ్మాండము.

బ్రహ్మము ఆపిన నాగునదిగాదు. కదిలించినఁ గదలునదికాదు. ఒకప్రక్కకుఁ దొలఁగునట్టిదియుఁ గాదు. ౧ బ్రహ్మము ఛేదించినచో భేదింపఁబడదు. ఛేదించినచో ఛేదింపఁబడునది కాదు. వేఱుగావింపనెంచినచో వేఱగునట్టిదియుఁగాదు. ౨ బ్రహ్మము అఖండము. అందెట్టి గజిబిజియు (వికారమును) లేదు. అట్టిబ్రహ్మములోనికి బ్రహ్మాండమేవిధముగాఁ జొరఁబడివచ్చెను? ౩ పర్వత, పాషాణ, శిలా, శిఖర, నానాస్థల, స్థలాంతరాదులతోఁగూడిన భూగోళ[illegible] నం దేవిధముగా నేర్పడెను? ౪ బ్ర[illegible]ది. భూగోళమునందు బ్రహ్మమున్నది. వి[illegible]చినచో నొక్కటిరెండవ

దానియందుఁ బ్రత్యక్షముగాఁ గనుపించుచున్నది. ౫ బ్రహ్మమునంతను భూగోళము ప్రవేశించియున్నది. భూగోళమునందు బ్రహ్మమునిండియున్నది. విచారించిచూచినయెడల నీవిషయము ప్రత్యక్షముగా విశ్వాసములోనికి వచ్చును. ౬ బ్రహ్మము బ్రహ్మాండమునందు వ్యాపించియున్నదని చెప్పుట సమంజసముగనే కన్పట్టుచున్నది. కాని బ్రహ్మాండము బ్రహ్మమునం దెట్లిమిడియున్నదో బోధగాకున్నది ౭ ఒకవేళ బ్రహ్మాండము బ్రహ్మమునందుఁ బ్రవేశించియుండలేదని చెప్పఁబూనినచో నదియును యుక్తముగాలేదు. ఏలయన! బ్రహ్మమునందు బ్రహ్మాండమున్నసంగతి అనుభవమువలన నందఱకును సహజముగనే కాన్పించుచున్నది ౮ బ్రహ్మమునందు బ్రహ్మాండ మెట్లుండెను? ఈయంశముల నిపుడు విచారమొనరించి తెలుపవలయును.'' శ్రోత లీవిధముగాఁ బ్రశ్నించిరి. ౯ ఇక్కడ గొప్పసందేహాశ మడ్డుపడినది. ఇఁక దీనికిఁ బ్రత్యుత్తరమును శ్రోతలు సావధానులరై విందురుగాక. ౧౦

బ్రహ్మాండమే లేదని చెప్పుదునా? యదిసరిగాదు. ఏలయన! అది కాన్పించుచున్నది. కనుపించుచున్నదిగావున ఉన్నదని చెప్పుదునా? అదియును యుక్తముగాలేదు. ఏలయన! అదినాశమగుచున్నది. ఇప్పుడిక్కడ బెద్దచిక్కువచ్చిపడినది. శ్రోత లీవిషయమును దెలిసికొనఁగలుగుట యెట్లు? ౧౧ దీనిని విని ఉత్కంఠతో శ్రోతలిట్లు చెప్పిరి. "మేము సావధానులమైయున్నారము. ఇఁకఁ బ్రసంగానుసారముగ నుచితమగు నుత్తరమునిచ్చెదము. ౧౨ చూడుఁడు. ఆకాశమునందు దీపము వెలిగింపఁబడినది. కాని దానిని ఆకాశమునుండి వేరుపఱచియుంచుట యెట్లు తటస్థింపఁ గలదు? ౧౩ ఆపస్తేజోవాయువులు ఆకాశమును తొలంగింపఁజాలవు. ఏలయన? ఆకాశము సఘనముగానున్నది. (చంచలముగాదు) ౧౪ పృథ్వి కఠినమైనదే! ఐనను ఆకాశము దానిని దనయునికి కనువుగాఁ జేసివైచినది. అది (ఆకాశము) సంపూర్ణపృథివియందు వ్యాప్తముగానున్నది. ౧౫ జడరూపములగు సమస్తవస్తువులును నాశనమగుట సత్యము. ఆకాశమెప్పుడును ఒకేవిధముగా నుండును. అది యచంచలము. ౧౬ భిన్నముగనుండి మానవుఁడు తానుచూచు దానిని ఆకాశమని చెప్పుచున్నాఁడు. అభిన్నుఁడై చూచినచోఁ గనుపించు ఆకాశమే పరబ్రహ్మము. (ఆకాశము పరబ్రహ్మ

ములలో నంతరమేమన? ఆకాశము భిన్నముగా నున్నప్పుడుగూడఁ గాన్పించును. పరబ్రహ్మమట్లుగాదు. అద్రూపస్థమైన యెడలనే కనుపించును.) ౧౭ సారాంశము - ఆకాశము అచలము - దాని భేదము తెలియదు. బ్రహ్మమువలె భాసించుదానినంతను ఆకాశమనవలయును. ౧౮ అది నిర్గుణబ్రహ్మమువలె భాసించుచున్నది. కల్పనముగావించినచో ననుమానములోనికి వచ్చును. ఇందువలననే దాని నాకాశమనుచున్నాము. (కల్పనకారణమున నది యాకాశమనిపించుకొనుచున్నది.) ౧౯ కల్పనమున కెంతభాసము భాసించునో యది యాకాశము. కాని బ్రహ్మము నిరాభాసము, నిర్వికల్పము నైయున్నది ౨౦ ఆకాశము స్వాభావికముగానే శేషించిననాలుగుభూతములతో నిండియున్నది. ఆభాసించునది బ్రహ్మాంశము. ౨౧ ప్రత్యక్షముగ నుత్పన్నమగునవన్నియు నాశనమొందునవివే. అట్టివాని నచలములని యెట్లు చెప్పగలము? గగనము నేదియు భేదింపఁజాలదు. ౨౨ పృథ్విలేకుండఁ బోయినపిమ్మట జలము శేషించును. జలము లేకుండఁబోయినపిమ్మట అగ్నిమిగులును. అగ్నిచల్లారినపిదప వాయువుండును. అదియు (వాయువుగూడ) అంత్యమున నాశనమగును. ౨౩ మిథ్యాపదార్థము వచ్చుచుండును. పోవుచుండును. అంతమాత్రమున సత్యభంగమగుట (మిథ్యాపదార్థమునిల్చుట) సంభవముగాదు. ౨౪ భ్రమకారణము నిదియంతయుఁ బ్రత్యక్షముగాఁ గాన్పించును. విచారించిచూచినయెడల నందేమియును లేదని బోధపడును. ఈభ్రమమూలమగు జగత్తును సత్యమని యెట్లు చెప్పఁగలము? ౨౫ భ్రమను శోధించితిమేని అది యేమాత్రమును సత్యముగాదని విదితమగును. అట్టిస్థితిలో భేదించినదెవరు? దేనిని? ఒకవేళ భ్రమ భేదించినదని చెప్పినచో నదిమాత్ర మెట్లుపొసఁగును? అది స్వయముగనే మిథ్యగదా. ౨౬ భ్రమరూపము మిథ్యగాఁ బ్రతీతియైనపుడు అదియే భేదించినదని సులభముగా ననుకొనుము. కాని స్వయముగా మిథ్యయగునదేదియో యదిగావించినవెల్ల నట్లే (మిథ్యగ) గావలసియున్నది. ౨౭ ఎయ్యది స్వయముగామిథ్యయో యది యేమిచేసినను జేయనిమ్ము. దానివలన మనదేదిపోవును? చతురపురుషులు మిథ్యాకర్తృత్వమును మిథ్యగనే భావించెదరు. ౨౮ సాగరములో నౌకయావ

గింజవేసిన నెటులుండునో యటులే పరబ్రహ్మమునం దీసమస్తదృశ్యము గూడియున్నది. మతిననుసరించి హృదయమున నూహాశక్తి ప్రసరించును. ౨౯ మతిని విశాలముగావించినచో ఆకాశమునుగూడఁ జేతిలోనికిఁ దీసికొనవచ్చును. బ్రహ్మాండముగూడ వెలగపండువలె సుబోధమగును. ౩౦ మతికంటె వృత్తిని నధికవిశాలము గావించినయెడల బ్రహ్మాండము రేఁగువండువలెఁ గాన్పించును. కేవలబ్రహ్మాకారమైనపిమ్మట నేమియు నుండదు. ౩౧ వివేకసహాయమున దనను అమర్యాదితధీవిశాలునిగ (హద్దులేనంత విశాలబుద్ధిఁగలవానినిగాఁ) గావించినచో బ్రహ్మాండము వటబీజమువలెఁ గనిపించును. ౩౨ అంతకంటెను బుద్ధి యధికవిస్తీర్ణమైనపిమ్మట ఈబ్రహ్మాండము వటబీజములోఁ గోట్యంశసమానముగా (అతి సూక్ష్మముగ) గోచరించును. మఱియుఁ గేవలపరిపూర్ణుడైన పిదప నేమియు నుండదు. ౩౩ భ్రమకారణమున అల్పుఁడై తననొక దేహధారినిగాఁ దలంచుకొనువాఁడు బ్రహ్మాండమును దనచేతిలోని కొట్లుతీసికొనఁగలఁడు ? ౩౪ వృత్తిని వృద్ధినొందింపవలయును. దానిని వికసింపఁజేసి యూరకయుండరాదు. దానిని (వృత్తిని) పూర్ణబ్రహ్మముతో నలుమొగముల నిండింపవలయును. ౩౫ జొన్నగింజంత బంగారమునుదెచ్చి దానితో బ్రహ్మాండమునంతను జిత్రింపఁబూనితిమేని యెన్నఁటికిని ఆప్రయత్నము సాధ్యముగాదు. ౩౬ (జొన్నగింజంత బంగారమునుదెచ్చి రేకునుజేసి దానిమీద బ్రహ్మాండమును జిత్రింపఁబూనినచో ఆయాకు పగిలి బంగారము లయమగునట్లు) వృత్తితో నెవఁడేని బ్రహ్మము నాకలనము గావింపనెంచునెడల వృత్తి భిన్నమై లయమగును. కేవలనిర్గుణాత్మ యథావిధముగ మిగిలియుండును. ౩౭.

ఇంతటితో సందేహము తీరును. శ్రోతలారా! సందేహముంచుకొనకుఁడు. ఒకవేళ సంశయముగలిగినచో వివేకముతో దానిని నిరసనమొనర్పుఁడు. ౩౮ వివేకమువలన సందేహములు తొలంగును. సమాధానము కలుగును. మఱియు వివేకసహాయమున ఆత్మనివేదమైనపిదప మోక్షము లభించును. ౩౯ మోక్షమునుగూడ నుపేక్షించి, (అపేక్షించుటపూర్వపక్షము) విచారముతోఁ బూర్వపక్షవిషయమును వేఱుజేసి, సిద్ధాంతవస్తువును (ఆత్మను) ప్రత్యక్షప్రత్యయములోనికిఁ దెచ్చువానికి

అన్యప్రమాణములతో నావశ్యకములేదు. ౪౦ ఈప్రతీతివచనములు సారాసారవిచారము గావించినపిమ్మట విశదమగును. మననముయొక్క అధ్యాస (మిథ్యాజ్ఞానము) వలన బ్రహ్మము సాక్షాత్కారమగును. మఱియుఁ బరమశాంతిలభించును. ౪౧.

పదియవసమాసము.

ఆత్మస్థితి.

దేవతావిగ్రహము ఆలయములోపల నుండును. కాకి మందిరశిఖరముపైఁ గూర్చుండును. అంతమాత్రమునఁ గాకి యాలయమునందలి దేవతకంటె గొప్పదగునా ! ౧ రాజమందిరమునందు సభజరుగుచుండును ఒకకోతి యామందిరములోని స్తంభముమీఁది కెగఁబ్రాకి పైనఁజేరి కూర్చుండును. ఆకోతికి సభ్యులందరికంటె శ్రేష్ఠత్వము కలుగునా ? ౨ బ్రాహ్మణుఁడు స్నానము గావించినీటితోఁ బనిముగించుకొనును. నీటికొంగ (బాతు) నీటియందే తిరముగా నుండును. అంతమాత్రమున నీటికొంగకు బ్రాహ్మణునితో సమానమగు పవిత్రత గలదని యెట్లంగీకరింపనగును ? ౩ బ్రాహ్మణులలోఁ గొందఱు నియమవంతులై యుందురు. కొందఱు అవ్యవస్థితముగా నుందురు. కుక్క నిరంతరము ధ్యానస్థముగా నుండును. ఇందువలనఁ గుక్క యెన్నఁటికైన బ్రాహ్మణునితో సమానమగునా ? ౪ ఒకానొకబ్రాహ్మణుఁడు ఏకాగ్రధ్యానమునెఱుంగఁడని భావింపుము. మార్జాలము తదేకధ్యానమునందు మిగులఁ జతురతగలదై యుండును. అంతమాత్రమున మార్జాలము బ్రాహ్మణునితో సమానముగు గొప్పదనముగలదని యెవరైనఁ జెప్పఁగలరా? ౫ బ్రాహ్మణుఁడు భేదాభేదవిచారముతో వర్తించును. మక్షికము అందఱను సమానముగాఁ జూచును. ఇందువలన నీఁగకు జ్ఞానబోధకలిగినని యెట్లనుడువనగును ? ౬ ఒకనీచమనుజుఁడు గొప్పవారలు ధరింపఁదగిన విలువగల దుస్తులు ధరించి కూర్చుండియుండును. ఒకరాజు దేహముపయి నాచ్ఛాదనమైనలేక కట్టుబట్టతోఁ గూర్చుండియుండును. చతురుఁడగు పురుషుఁడు ఈయిరువురిని వెంటనే గుర్తింపఁగలఁడు ౭ సారాంశము- బాహ్యరూపము నెంతగా అలంకరించుకొనినను ఆయలంకారమంతయు

మోసమని తనంతనే వెల్లడియగును. మానవునకుఁ గావలసినది బాహ్యాడంబరముగాదు. ముఖ్యమగు ఆత్మనిష్ఠ కావలయును ౮ సంసారమునందు మిగుల ప్రతిష్ఠనుసంపాదించినను ఆత్మవిషయమగు జాగరూకతలేనివాఁడును పరమాత్మను మఱచినవాఁడును ఆత్మఘాతుకుఁడు ౯ దేవతలను భజించుటచే దేవలోకము, పితరులనుభజించుటచేఁ బితృలోకము భూతములను భజించుటచే భూతలోకము లభించును ౧౦ ఎవ్వరెవ్వరిని భజించెదరో వారలు వారిలోకమున కరుగుదురు. నిర్గుణభజనమువలన నిర్గుణులగుదురు ౧౧ నిర్గుణమునందనన్యుఁడై యుండుటయే నిర్గుణభజనము. అనన్యుఁడగుటవలనఁ దప్పక నిర్గుణత్వము ప్రాప్తించును ౧౨ ఏకస్వరూపుఁడగు పరమాత్ముని గుర్తించుటయే సంపూర్ణకర్మఫలము. మఱియు, "మనమెవ్వరము" అను విచారమును జేయవలయును ౧౩ నిరాకారపరమాత్ముని యనుభవము గడించుటవలన దేహాభిమాన ముండదు. అంతేకాక "బ్రహ్మముమేమే" అను నిశ్చయ మేర్పడును ౧౪ పూర్వోక్తదశ గలిగినయనంతరము సందేహమునకుఁ దావుండదు. పరమాత్మునియందనన్యత కలుగును. మఱియు దేహభావనకు సంబంధించిన జాడగన్పింపదు. ౧౫ ఆయవస్థయందు సిద్ధాంతములు సాధనములు భ్రమమాత్రముగా నుండిపోవును. ముక్తునకు సాధనాదిబంధనములతో నేమియవసరము? ౧౬ ఏలయన? సాధనములను సాధింపవలసినది తాను (ముక్తుఁడు) స్వయముగనే యయ్యెను. ఇఁక సాధకుఁడుగావలసిన యావశ్యకము మిగిలియుండలేదు. ౧౭ కుమ్మరివాఁడు రాజైనపిమ్మట వాఁడు (కుండలనుమంటినిమోయు) గాడిదల నింక నెందులకుంచుకొనును? కుమ్మరితనమునకు సంబంధించిన మన్ను మోయుటవలన వానికేమిప్రయోజనము కలుగును? ౧౮ ఇట్లే సాధ్యవస్తువు ప్రాప్తమైనపిదప సంపూర్ణవృత్తిభావనయు, సాధనప్రయత్నములును ఉండనేరవు ౧౯ ఆదశయందు సాధనములవలన నేమిసిద్ధి గావించుకొనవలసియున్నది? నియమసహాయమునఁ బడయవలసిన ఫలప్రాప్తి యేమియున్నది? ముక్తుఁడు స్వయముగా బ్రహ్మమైనపు డింక నెందులకు శ్రమనొందవలయును? ౨౦

దేహము పంచభూతములతో నిర్మింపఁబడెను. జీవుఁడు బ్రహ్మాంశము. అదిగూడఁ బరమాత్మునందు లీనము గాఁగలిగియున్నది. ౨౧

కావున "నేను"అనునది మధ్యనే వచ్చినది. విచారించి తెలిసికొనినయెడల "నేను" అనునది యేమియును లేదు. పంచభూతములు నిరసనమై పోయిన పిదప నిఖిలమగు ఆత్మ నిలిచియుండును ౨౨ ఆత్మ ఆత్మత్వముతో నున్నది. జీవుఁడు జీవత్వముతో నున్నాఁడు. మాయ మాయాత్వముతో విస్తృతమైయున్నది. ౨౩

ఈవిధముగా నన్నియు నున్నవి. మనముగూడ నేదియో యొకటిగా నున్నారము. వీనినన్నింటిని విమర్శించిచూచువాఁడే జ్ఞాని. ౨౪ అన్నిఁటిని విమర్శించి శోధింపనేర్చినవాఁడును దన్నుదానునుజూచుట నెఱింగినవాఁడును జ్ఞానియనఁదగినవాఁడు. జ్ఞానియొక్కవృత్తి యేకదేశీయముగానుండును. (వ్యాపకముగలదికాదు) ౨౫ ఇట్టివృత్తిని మనము విచారించినయెడల నేమియును లేదని విశదమగును. ఏలయన ? ప్రకృతిని నిరసించినపిమ్మట వికారవంతమగు (పదార్థము) ఏదియు నిలచియుండఁజాలదు. ౨౬ ఒకవేళ నేదేని నిలిచియున్నచో నది కేవలనిర్గుణమే ! విచారించిచూచినపిమ్మట నదియే మనమైయున్నారము. ఇది పరమార్థమున కొకగొప్పచిహ్నము. ౨౭ ఆయవస్థయందు "ఫలమువేఱు, మనమువేఱు" అను వివేకముండదు. అచట ఫలము, మనము ఒక్కటియై పోవుచున్నారము. ౨౮ ఒకానొకభిక్షుఁడు రాజయ్యెననియును నేను రాజును అను ననుభవముగూడ వానికిఁ గలుగుచున్నదనియును భావింపుఁడు. ఇఁక వాఁడు భిక్షమునెందుల కడుగును ? భిక్షుకుఁడుగానున్నవాఁడే భిక్షము నడుగును. ౨౯ వేదశాస్త్రపురాణము లెవ్వానివర్ణించుచున్నవో అనేకసిద్ధసాధుపురుషు లెవనికొఱకు నానావిధములసాధనములతోడను నియమములతోడను బరిశ్రమసలుపుచున్నారో యట్టిపరబ్రహ్మరూపము సారాసారవిచారములవలన సాధకుఁడొందినపుడు మఱల నచ్చటచేయుట, చేయకుండుట (విధినిషేధములు) మొదలగు విచారమేదియు నుండదు. ౩౦, ౩౧ ఒకభిక్షుకుఁడు రాజాజ్ఞనాలించి భయము నొందెననియు, ఆభిక్షుకుఁడు మఱల ముందున కరిగి (కొన్నాళ్ళతరువాత) రాజయ్యెననియును భావింపుఁడు. ఇప్పు డట్టిదశయందు వానికి రాజాజ్ఞయనిన భయమెట్లుండఁ గలదు? ౩౨ వేదము వేదాజ్ఞలననుసరించి యెట్లు నడచును? సచ్ఛాస్త్ర

ములు శాస్త్రాభ్యాసము నెట్లుచేయును? తీర్థములు తీర్థముల కెట్లరుగును? ౩౩ అమృతము అమృతము నెట్లు సేవించును? అనంతము అనంతము నెట్లుగాంచును? భగవంతుఁడు భగవంతు నెట్లుజూచును? ౩౪ సత్స్వరూపము సత్స్వరూపముతో నెట్లుకలియును? నిర్గుణము నిర్గుణభావన నెట్లుగావించును? ఆత్మ యాత్మయం దేవిధముగా నానందించును ౩౫ స్వయముగా అంజనము అంజనము నెట్లుపెట్టుకొనును? ధనము ధనము నెట్లు బడయఁగలదు? నిరంజనుఁడు నిరంజను నెట్లనుభవము గావింపఁగలఁడు? ౩౬ సాధ్యము స్వయముగా సాధనము నెట్లుచేయును? స్వయముగానున్నమనుఁడైనవాఁడు (మనస్సులయమైనవాఁడు) మనస్సు నేవిధముగా నరికట్టఁగలఁడు? ౩౭

తొమ్మిదవ దశకము సమాప్తము.

పదియవ దశకము.

మొదటిసమాసము.

అంతఃకరణమొక్కటి.

శ్రోత యిట్లుప్రశ్నించుచున్నాఁడు. "అయ్యా! అందఱకును అంతఃకరణమొక్కటియా లేక వేఱువేఱా! దీనిని నిశ్చయాత్మకముగా దెలుపుఁడు. వక్త- మంచిది. దీనికిఁ బ్రత్యుత్తరము వినుండు ౧-౨ అందఱియంతఃకరణ మొక్కటియే. ఇందుసందేహమేమియు లేదు. ఇది యనుభవముచే గ్రహించినయంశము ౩ శ్రోత యిట్లనుడివెను. అయ్యా అందఱియంతఃకరణ మొకటియేయని మీరంటిరిగదా! అట్లైనచో నందఱియందును ఏకత్వమును గలయికయును నేలలేవు. ౪ అంతఃకరణ మొక్కటియేయైనచో నొక్కఁడుతినినయెడల నందఱకును క్షుధతీరవలయును. ఒకఁడు సంతుష్టుఁడగుచో నెల్లరును సంతుష్టులు గావలయును. ఒకఁడు చనిపోయినచో నెల్లరును జనిపోవలయును ౫ ఈలోకమునందుఁ గొందఱు సుఖులుగను మఱికొందరుదుఃఖులుగను నున్నారు. దీనినిబట్టి యందఱియంతఃకరణ మొక్కటియేయని యెట్లనుకొనఁగలము? ౬ జనులభావనలు వేఱువేఱుగానున్నవి. ఒకనితో నింకొకనికిఁ గలయిక కలు

గుటలేదు. కావున నిట్టిస్థితియందు అంతఃకరణమొక్కటి యగుట యెట్లో తెలియకున్నది. ౭ ఒకవేళనెల్లరియంతఃకరణ మొక్కటియేయగుచో నొకని యంతఃకరణములోని విషయము రెండవవానికిఁ దెలియుచుండెడిది. అందుచే లోకమునందు గోప్యమగు విషయముండుటయే సంభవముగాదు. అందఱి యంతఃకరణ మొక్కటియేయగుచో జనులయందుఁ బరస్పర విరోధమేల వ్యాపించియున్నది? ౮ సర్పము కాటువేయుటకుఁ బరుగెత్తుచున్నది. ప్రాణి భయపడి పాఱిపోవుచున్నాఁడు. అన్ని జీవులయందును అంతఃకరణమొకటి యేయగుచో నీవిరోధ మేలకలిగెను? (సర్పముకఱచుటకుఁ బరుగెత్త రాదు, జీవుఁడు భయపడి పాఱి పోవరాదుగదా) ౧౦

శ్రోత యిట్లు శంకింపఁగా వక్త యిటుల నుడివెను. భయపడకుఁడు. సావధానులరై నిరూపణము నాలింపుడు. అంతఃకరణమని సంజ్ఞకుఁ జెప్పుదురు. సంజ్ఞయని యెఱింగెడిస్వభావమునకుఁ జెప్పుదురు. ఇదియే దేహరక్షణకుపాయము (ఎఱుఁగునట్టికళ) ౧౨ సర్ప మెఱిఁగి కఱువవచ్చుచున్నది. ప్రాణి యెఱిఁగి పాఱిపోవుచున్నాఁడు. సంజ్ఞ (consciousness) ఇరువురియందు నున్నది. ౧౩ సంజ్ఞయనునది రెండువస్తువుల నొక్కటియేయున్నట్లుగఁ జూచెదమేని అంతఃకరణముగూడ నొక్కటియగును. ఏలయన! అంతఃకరణము సంజ్ఞారూపమని యింతకుముందుఁ జెప్పితిని. ౧౪ కావున సంజ్ఞారూపముతో నందఱియంతఃకరణ మొక్కటిగనేయున్నది. సంపూర్ణజీవులయందెఱుక యొక్కటియే ౧౫ దృష్టితోఁ జూచుట, నాలుకతో రుచిని గ్రహించుట, వినుట, ముట్టుకొనుట, వాసనదెలిసికొనుట మున్నగునవి యందఱియందును నొకటిగనే యున్నవి. ౧౬ పశు, పక్షి, కీటక, పిపీలికాదిజీవములెన్నియో లోకమునందు నిర్మాణమైయున్నవి. వానియన్నిఁటియందును సంజ్ఞాశక్తి యొకటిగనే యున్నది. ౧౭ అన్ని జీవములకును జలము శీతలముగా నున్నది. అన్ని జీవములకును అగ్ని వేడిగానున్నది. అందఱకును అంతఃకరణ మొక్కటిగనే యున్నది. ౧౮ ఒకానొకవస్తువు చెడ్డగను మంచిగను దోఁచుటకు దేహస్వభావమే కారణము. ఈవిషయము అంతఃకరణయోగమువలననే తెలియును. ౧౯ అందఱియంతఃకరణము నొక్కటియే. ఇది పూర్తిగ సత్యము. దీని నుత్సాహవంతులందఱు నెఱుంగుదురు. ౨౦ ఇంతటితో సందేహము నివారణమగును.

ఇంత శంకింపవలసినపని లేదు. ఎంత తెలిసికొనవలయునో యదియంతయు నంతఃకరణధర్మము. ౨౧

ఎఱిఁగి జీవములు మేఁతమేయుచున్నవి. ఎఱిఁగి భయపడుచున్నవి. ఎఱిఁగి దాఁగుకొనుచున్నవి. ఎఱిఁగియే పాఱిపోవుచున్నవి. ౨౨ కీటకములు, పిపీలికములు మొదలుకొని బ్రహ్మవిష్ణుమహేశ్వరులవఱకు అంతఃకరణ మందఱకు నొక్కటియే. ఈవిషయమును ఉత్సాహవంతులనుభవముతో నెఱుంగవలయును. ౨౩ పెద్దదైనను జిన్నదైనను అగ్ని యగ్నియే. స్వల్పముగానున్నను ఎక్కువగానున్నను జలముజలమే. ఈవిధముగనే (వస్తుస్వరూపమును) ప్రాణి అంతఃకరణమువలననే తెలిసికొనుచున్నది. ౨౪ ఒకానొకచోట న్యూనముగానున్నను ఒకానొకచోట నధికముగానున్నను బదార్థముయొక్క గమనిక యొక్కటియే. సంజ్ఞారహితమగు జంగమప్రాణి యెద్దియును లేదు. ౨౫ సంజ్ఞయనియంతఃకరణమునకుఁ జెప్పుదురు. అంతఃకరణము విష్ణ్వంశము. ఈవిధముగా విష్ణువు పాలనము జేయుచున్నాఁడు. (అంతఃకరణరూపుఁడై యన్నింటియందుండుటయే యతనిపాలనము) ౨౬ సంజ్ఞారహితము కాఁగానే ప్రాణి మరణించును. సంజ్ఞారహితమగుట తమోగుణలక్షణము. ఈవిధముగాఁ దమోగుణముతో రుద్రుఁడు సంహారము జేయుచున్నాఁడు. ౨౭ కొంత సంజ్ఞగలిగి కొంతసంజ్ఞలేకయుండుట రజోగుణలక్షణము. దీనికారణముననే ప్రాణి జన్మము నొందుచున్నది. ౨౮ ఎఱుకవలన సుఖము కలుగును. మఱపు (ఎఱుకలేమి) వలన దుఃఖము కలుగును. ఇట్లే యుత్పత్తిగుణమువలన (ఎఱుకమఱపుల మిశ్రణమువలన) సుఖదుఃఖములను రెండిటిని అవశ్యముగా ననుభవింపవలసియున్నది. ౨౯ ఎఱుక, యెఱుకలేమితోఁగలసిన బుద్ధియే యీ దేహములోని బ్రహ్మము. అతఁడే వాస్తవమున నుత్పత్తికర్త. ౩౦ ఈయుత్పత్తి, స్థితి, సంహారములవిషయము ప్రసంగమువచ్చినందునఁ జెప్పవలసివచ్చినది. కాని దీనిని అనుభవముతో నిశ్చయింపవలయును. ౩౧

రెండవ సమాసము.

ఉత్పత్తివిషయమునందు సందేహము.

శ్రోతయిట్లు ప్రశ్నించెను. అయ్యా! తాము పైనవివరించిన విచారమునందు విష్ణువుయొక్క యభావము గాన్పించుచున్నది. విష్ణువే యననేల? దానియందు బ్రహ్మ విష్ణు మహేశ్వరు లెవ్వరికిని దావులేదు. ౧ ఉత్పత్తిస్థితి సంహారములను బ్రహ్మ విష్ణు మహేశులెట్లుచేయుచున్నారు? ఇదియేమియును బోధగాకున్నది ౨ ఈ విచారమునందు ఉత్పత్తికర్త చతుర్ముఖబ్రహ్మయనుటలో విశ్వాసము కలుగకున్నది. పాలనకర్త చతుర్భుజధారియగు విష్ణుమూర్తియని యాలోచించుట మాత్రముగలదు ౩ మహేశుఁడెట్లు సంహారముగావించునో యదియు విశ్వసింపఁదగినదిగా లేదు. పురాణములలోఁ జెప్పఁబడిన లింగమహిమ గూడ విపరీతముగానున్నది ౪ మూలమాయ నెవ్వఁడునిర్మించెనో యది తెలిసికొనవలసియున్నది. మూఁడుమూర్తులుగూడ మూలమాయ కావల నేగదా యుత్పత్తియైనది! ౫ మూలమాయ లోకజనని! దానివలన గుణక్షోభిణిమాయ యుత్పన్నమయ్యెను. గుణక్షోభిణివలనఁ ద్రిగుణాత్మికములగు త్రిదైవతములుకలిగెను ౬ శాస్త్రికారు లీవిధముగాఁ జెప్పుచున్నారు. వారలేగాక "ప్రవృత్తిని లేకగుణపరంపరను" వివరించెడివారలుగూడ నిట్లే చెప్పుచున్నారు. కాని యనుభవమునుగూర్చిన ప్రశ్న వచ్చినంతన యెందఱో భయపడిపోవుచున్నారు ౭ కావున నీసందేహము ఇట్టి భయశీలురవలన నెన్నఁటికిని దీఱఁజాలదు. వారల నడిగియుఁ బ్రయోజనము లేదు. వారలు బోధింపనుగూడ సమర్థులుగారు. అట్లే తెలిసికొనని ప్రయత్నమంతయు వ్యర్థము ౮ అనుభవములేక యెవఁడేని తాను వైద్యుఁడని పదిమందిచేఁ బిలిపించుకొనుచు నేదియో తనకుఁదెలియనికార్యభారమును దలపైఁబెట్టుకొన్నచో నట్టిమూర్ఖుని ప్రాణిమాత్రులందఱును నిందింతురు ౯ ప్రకృతవిచారముగూడ నిట్టిదే! వాస్తవికమగు నిర్ధారణము అనుభవముతోడనే చేయవలయును. అనుభవము లేకున్నచో గురుశిష్యులిరువురియందును అంధకారముండును ౧౦ జనుల ననవలసినదేమున్నది? జనులు తాముచెప్పుదానిని యుక్తమనియే తలంచి చెప్పుదురు.

కావున నీవిషయమును సంపూర్ణముగాఁ దామే విశదముగావింప వలయును ౧౧

దేవతలు మాయనునిర్మించిరనియందమా యన్న దేవతలరూపములు మాయలోనికే వచ్చుచున్నవి. లేక మాయయే మాయను గావించెననియందమా యన్న నదియు నసంభవమే. ఏలయన! మాయయంతయు నొక్కటియేగదా ౧౨ లేక భూతములే మాయనుగలిగించెనంద మాయన్న నదియుఁ బొసఁగదు. ఏలయన! మాయయే భూతములను గలుగఁజేసెను. కాదు. పరబ్రహ్మమే మాయను గలిగించెననియందమా యన్న బ్రహ్మమునందుఁ గర్తృత్వమే లేదు. అతఁ డెట్లు నిర్మింపఁ గలఁడు ౧౩

మాయనే సత్యమన్నచో బ్రహ్మమునందుఁ గర్తృత్వ మాపాదితమగును. లేక మాయను మిథ్యగా భావింతమాయన్నచో నట్టిస్థితియందు దానికిఁ గర్తృత్వమెక్కడినుండి రాఁగలదు? ౧౪ ఓస్వామీ! సాధుమహారాజా! దయతో నీవృత్తాంతమంతయు అనుభవములోనికి వచ్చునట్లు బోధింపుడు. ౧౫ అక్షరము లేనిది వేదము కలుగదు. అక్షరము లేనిది దేహములుకలుగవు. దేహములు లేనిది దేహనిర్మాణము కలుగదు ౧౬ అన్ని దేహములలో నరదేహము శ్రేష్ఠము. నరదేహమునందు బ్రాహ్మణదేహము శ్రేష్ఠము. బ్రాహ్మణదేహమునకే వేదాధికారము గలదు. ౧౭ వేదము లెట్లు కలిగెను? దేహము లెవ్వరు సృజించిరి? దైవ మెట్లు ప్రకటన మయ్యెను? ౧౮

శ్రోత లిట్లు సందేహించిరి. దీనికి సమాధానము చెప్పవలయును. వక్త యిట్లు చెప్పెను. శ్రోతలారా! సావధానులరై వినుండు ౧౯ అనుభవమును విచారించెదమని చిక్కుగలుగును. (ఏలయన! లోకవ్యవహారము శాస్త్రనిర్ణయము ఒకేవిధముగా నుండని కారణమున అనుభవ మొక్కవిధముగా నుండదు.) అంతయును జెడిపోవును. గడియగడియకును అనుమానించుచుండుటవలన సమయము వ్యర్థముగా నష్టమై పోవును. ౨౦ లోకవ్యవహారమునందును శాస్త్రనిర్ణయమునందును బహువిధములగు నిశ్చయములు గలవు. ఈకారణమున నొకేవిధమగునమభవము కలుగదు. ౨౧ ఇప్పుడొకవేళ శాస్త్రములకే భయపడు

దమాయన్నచో వానిగోలలో నొకతెన్నే స్ఫురింపదు. ఎటులేని యాగోలను (లోకవ్యవహారమును) నొకతెన్నునకుఁ దెత్తమాయన్న నచట మఱల శాస్త్రభేదములు కలుగుచున్నవి. ౨౨ కావున శాస్త్రములను గాపాడుచుఁ బ్రతీతిని (ఎఱుకను) గడింపవలసియున్నది. పూర్వపక్షమును విడిచి సిద్ధాంతమును జూడవలయును. చతురతయో మూర్ఖతయో ఒక్కమాటతో బోధింపవలెను. ౨౩ శాస్త్రమునందు పూర్వపక్షము చెప్పఁబడెను. మిథ్యను బూర్వపక్షమని నుడువుదురు. కావున దీని దోషము మనమీఁదకు రాఁజాలదు. ౨౪ ఐనను శాస్త్రములను రక్షగావించుచు కొన్ని కౌతుకములను వివరించెదను. శ్రోతలు చక్కగా విచారమును గావింపవలయును. ౨౫

మూఁడవసమాసము.

సృష్టి యొక్క యుత్పత్తి.

నిరుపాధియగు నాకాశమే నిరాభాసబ్రహ్మము. ఇట్టి నిరాభాస బ్రహ్మమునందు మూలమాయ జనించెను. ౧ ఆమూలమాయ వాయుస్వరూపము, పంచభూతములు, త్రిగుణములు, ఆవాయురూపమగు మూలమాయవలనఁ గలుగుచున్నది. ౨ ఆకాశమునుండి గలిగినవాయువు వాయుదేవుఁడని పిలువఁబడుచున్నాఁడు. వాయువునుండి కలిగిన అగ్ని అగ్నిదేవుఁడని పిలువఁబడును. ౩ అగ్నినుండి కలిగిన జలమే ఆపోనారాయణుఁడని పిలువఁబడెను. జలమునుండి కలిగిన పృథ్వియే సంపూర్ణబీజములకు మాతయయ్యెను. ౪ పృథ్వినుండి కలిగిన రాళ్ళే దేవరఁని పిలువఁబడుచున్నవి. పాషాణదైవతములయెడ జనులకు బహువిధములుగా ననుభవములు గలవు. ౫ జనులు, రాయి, మట్టి మున్నగు వానిని దేవతలుగ విశ్వసింతురుగాని వాస్తవమునందు సంపూర్ణదేవతలు వాయువునందే యుందురు. ౬ దేవి, యక్షిణి, కాత్యాయిని, చాముండ, జాఖిణి, మూవవిణిమున్నగు నానాశక్తులు భిన్నభిన్న దేశానుసారముగా ననేక స్థానములం దున్నవి. ౭ ఇవిగాక యింక నెన్నియో దేవతలు పురుషవాచక నామముల నున్నవి. ౮ ఇట్లే భూతములు, దేవతలు మున్నగునవి కొన్ని నపుంసకనామములతోఁ

గూడఁ గలవు ౮ దేవ, దేవత, దైవత, భూతాదులు భూమండలమునం దసంఖ్యాకములుగా నున్నవి గాని యివియన్నియు వాయురూపములుగాఁ జెప్పఁబడును ౯ నిరంతరము వాయురూపముగ నుండుటయుఁ బ్రసంగముగలిగినపుడు నానాదేహములను ధరించుటయు గుప్తముగను బ్రకటనముగను నుండుటయు మున్నగు వర్తనములు వీనియన్నింటికార్యములు ౧౦ వాయుస్వరూపముతో దేవతలు చరించుచున్నారు. వాయువునందు చేతన, వాసన, వృత్తి, మున్నగురూపములుదాల్చి జగజ్జ్యోతి యలరారుచుండును. ౧౧ ఆకాశమునుండి కలిగిన వాయువు రెండువిధముల నున్నది. ధ్యానపూర్వకముగా వినుండు ౧౨ ఒకటి సాధారణవాయువు. దీని నందఱు నెఱుంగుదురు. రెండవది వాయువునందు జగజ్జ్యోతిరూపమున నుండునది. ఈజగజ్జ్యోతిరూపమునందు దేవీదేవుల యనన్యమూర్తు లుండును ౧౩ వాయువు మిగుల వికారయుక్తముగానున్నను అది రెండుప్రకారములుగా విభజింపఁబడియున్నది. ఇఁక శ్రోతలు తేజోవికారమునుగూర్చి వినవలయును ౧౪ వాయువునుండి తేజను జనించెను. అది యుష్ణముగను శీతలముగను బ్రకాశవంతముగను నున్నది. తేజోరూపము సహితము రెండువిధములనున్నది. వినుండు ౧౫ ఒక తేజము ఉష్ణము, రెండవది శీతలము. ఉష్ణమువలనఁ బ్రకాశయుతుఁడును దేదీప్యమానుఁడునునగు సూర్యుఁడు, సర్వభక్షకుఁడగు నగ్ని, విద్యుల్లత జనించెను. ౧౬ శీతలతేజమువలన జలము, అమృతము, చంద్రుఁడు, నక్షత్రములు మంచు మున్నగునవి జనించెను. ఇఁక శ్రోతలు సావధానులరై ముందువృత్తాంతము నాలింపుడు ౧౭ తేజము గూడ బహు వికారయుక్తమైనదిగ నున్నను నదియు రెండువిధములుగా నుండును. అట్లే జలముగూడ రెండువిధములుగఁ జెప్పఁబడెను. ఉదకము, అమృతము అనియే ఆరెండువిధములు ౧౮ ఇఁకఁ బృథ్వినిగూర్చిన విచారము నాలింపుడు. పృథ్విలోని యొకవిధము పాషాణము. మంటితోఁగూడినది. రెండవవిధము సువర్ణము, స్పర్శవేది, నానావిధరత్నాదులు నైయున్నది ౧౯ ఈవసుంధరకు బహురత్నయని నామాంతరము గలదు. ఎయ్యది నిజమో, యెయ్యదికల్పితమో యదియంతయును విచారించినచో విశదమగును ౨౦ "ఇఁక మనుష్యు లెచ్చటినుండికలిగిరి." అను

ముఖ్యసందేహము మిగిలియున్నది. దానినిగూడ సావధానమతితో నాలకింపుఁడు. ౨౧

నాలుగవ సమాసము.

ఉత్పత్తియొక్క విస్తారము.

మనము ఉత్పత్తినిగూర్చి విచారించితిమేని మనుష్యునివలన మనుష్యుఁడును, పశువునుండి పశువును బుట్టుచున్నవని స్పష్టముగా విశదమగును ౧ ఖేచరములు, భూచరములు, వనచరములు, జలచరములు మొదలగు నానావిధశరీరములు శరీరమునుండియే కలుగుచున్నవి. ౨ ప్రత్యక్షముగ గనుపించుదానికిఁ బ్రమాణముతోఁ బనిలేదు. నిశ్చయమునకు అనుమానముతో నవసరములేదు. సరళమార్గమున్నపుడు వంకరటింకరత్రోవలతో నావశ్యకములేదు. ౩ విపరీతములకంటెను విపరీతములు కలుగుచుండునుగాని యవియన్నియు శరీరములనియే పిలువఁబడును. శరీరము లేనిది ఉత్పత్తి కాఁజాలదు. ౪ అట్లైనచోఁ దొలుత నీయుత్పత్తి యెట్టులయ్యెను. దేనివలన నయ్యెను? ఎవరుగావించిరి? మఱియు నెవ్వరుగావించిరో వానిదేహమును నెవ్వఁడు నిర్మించెను. ౫ ఇట్టివిచారము గావింపఁబూనినచో మిగులదూరము బోవలసివచ్చును. కాని ఆదియందు దేహ మెట్లునిర్మితమైనది? ఎవ్వఁ డేపదార్థము నేవిధముగా నుద్భూతమొనరించెను? ౬ ఈవిధమగు నీవెనుకటి శంక శేషించియుండెను. దాని నిప్పుడు వినుండు. ప్రతీతియైనపిదప మఱల శంకింపఁబనిలేదు. ౭ ప్రతీతియే ముఖ్యముగాని మూర్ఖులగువార లీవిషయమును దెలిసికొనరు. ప్రతీతియైనవిషయములయందే విశ్వాసముగలుగును ౮ బ్రహ్మమునందున్న మూలమాయయే ముందునకరిగి అష్టవిధప్రకృతి యనఁబడుచున్నది. పంచభూతములయందును త్రిగుణములయందును మూలమాయ కలసియే యుండును. ౯ ఆమూలమాయ వాయుస్వరూపము, వాయువునందున్న చేతనారూపమే యిచ్ఛ. కాని దీనియారోపణము బ్రహ్మముమీఁదికి రాదు. ౧౦ ఐనను బ్రహ్మమునందు "ఇచ్ఛచేయుట" యనునారోపణము నొకవేళ నంగీకరింతమన్నను నదివ్యర్థము. ఏలయన! బ్రహ్మము నిర్గుణమును శబ్దాతీతమును నైయున్నది. ౧౧

ఆత్మ నిర్గుణవస్తుబ్రహ్మము. నామమాత్రముగా నెంతగలదో యంతయును భ్రమ. ఒకవేళ బ్రహ్మమునందుఁ గల్పనముగావించి ఉపాధినంటించినచో నది యంటునెట్లు? ౧౨ బ్రహ్మమునం దారోపణము నంటించితిమేని ఆకాశమును జూలితో గొట్టినటులగును. కాని దీనివలన నాకాశమెట్లుభిన్నము కాఁగలదు? ౧౩ ఇట్లే నిర్వికారబ్రహ్మమునందు వికారము నంటించుట వ్యర్థము. వికారమునకు నాశనమున్నది. నిర్వికారము శాశ్వతమును యథావిధముగ నుండునదియు నైయున్నది. ౧౪

ఇఁక ననుభవవిషయమును వినుండు. దాని నెఱింగి నిశ్చయింపవలయును. దానివలననే యనుభవసంబంధమగు జయము లభించును. ౧౫ బ్రహ్మమునందు సమీరరూపముగనున్న మూలమాయయందుఁగల చైతన్యమే యీశ్వరుఁడు. ఆచైతన్యమును ఈశ్వరుఁడనియు సర్వేశ్వరుఁడనియుఁ గూడఁ జెప్పుదురు. ౧౬ ఆయీశ్వరుఁడే గుణయుక్తుఁడైనపు డాతని గుణమున ననుసరించి మూఁడుభేదములు కలుగుచున్నవి. ఆభేదములను బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుఁడుఅని యందురు. ౧౭ సత్వరజస్తమోగుణములు మూఁడు. ఈగుణములను, వెనుక వర్ణించితిమి. ౧౮ జ్ఞాతవిష్ణుభగవానుఁడు, జ్ఞాత అజ్ఞాత చతురాననబ్రహ్మఅజ్ఞాత పంచాననమహేశ్వరుఁడు. ఈతఁడు (మహేశ్వరుఁడు)మిగుల నమాయికుఁడు. ౧౯ త్రిగుణములు పరస్పరముకలసి మెలసియున్నవి. అవియిప్పుడెట్లు వేఱుగాఁగలవు? కాని కొంచెముగనో గొప్పగనో భాసించెడి, వానిని వివరింపవలసి వచ్చుచున్నది. ౨౦ మొట్టమొదట వాయుస్వరూపమగు మూలమాయయందు సత్త్వగుణాత్మకమగు విష్ణుస్వరూపముగూడ వాయుస్వరూపముగనే యుండును. ఆపిమ్మట నారూపము దేహధారియగు చతుర్భుజుఁడుగా నగుచున్నది. ౨౧ ఇదేవిధముగా బ్రహ్మమహేశ్వరులుగూడ దేహమును ధరించుచున్నారు. వారికి గుప్తముగుటకును బ్రకటనమగుటకును నాలస్యము పట్టదు, ౨౨ ఇఁకఁ బ్రత్యక్షప్రతీతి గావించుకొనుము. మనుష్యుఁడే గుప్తముగను బ్రకటనముగను మాఱుచున్నప్పుడు దేవతలసంగతి చెప్పవలసినపనిలేదు. దేవతలు స్వయముగా శక్తిసంపన్నులు ౨౩ దేవునకు, దేవతలకు, దైవమునకు, భూతములకు మనుజులకంటె మిగుల నెక్కువసామర్థ్య ముండును. వారలకున్నట్లు రాక్షసులకుఁగూడ సామర్థ్య

కళ యుండును ౨౪ పిశాచము వాయుస్వరూపముగా నుండును. మిగులఁ ద్వరగా నడచును. కొబ్బరికాయలు, పెంకులు, రాళ్లు ఆకస్మికముగాఁ బడవేయును. ౨౫ ఒకవేళ యివియన్నియు లేవని యంగీకరించెదమేని యది యుక్తముగాదు. ఏలయన! పిశాచాదులయునికి పలువు రెఱింగియే యున్నారు. తమతమ యనుభవానుసారముగా నందఱకీవిషయము తెలియును ౨౬ మనుష్యుఁడే యనేకవేషములను ధరించుచుండఁ బురుషులనేకులు పరకాయములలోఁ బ్రవేశించుచుండ నిఁక స్వయముగాఁ బరమాత్ముఁడగు జగదీశుఁ డిట్లుచేయఁజాలఁడు? ౨౭ ఈవిధముగా వాయుస్వరూపమునుండి దేహరూపులై బ్రహ్మవిష్ణుమహేశ్వరు లుత్పత్తియైరి. అనంతరము వారలే పుత్రపౌత్రులతో విస్తృతు లగుచున్నారు ౨౮ వారలంతఃకరణమునందె స్త్రీలను గల్పనముగావింతురు. కల్పనముగావింపగనే స్త్రీ లుత్పన్నమగుదురు. కాని వారివలన సంతానోత్పత్తి యెప్పుడును గాదు ౨౯ వారలు ఇచ్ఛామాత్రముననే పుత్రులనుగూడఁ గల్పనము గావింతురు. కల్పనము గావించునప్పుడెల్లఁ బుత్రులు లుత్పన్నమగుదురు. ఇట్లే హరిహరవిధాత్రాదులు వర్తించుచుందురు ౩౦ అనంతరము బ్రహ్మసృష్టిని కల్పనము గావించును. ఆతని యిచ్ఛానుసారముగా సృష్టి నిర్మింపఁబడును. ఇట్లే బ్రహ్మ జీవసృష్టి నేర్పఱచును. ౩౧ ఈరీతిగ నానావిధప్రాణులు కల్పనమగుదురు. అన్నియు నిచ్ఛానుసారముగాఁ గల్పనమగుచుండును. అండజములు, జరాయుజములునగు జీవులు జతలుజతలుగా (ఒకటి మొగది ఒకటి ఆఁడుదిగఁ) బుట్టును. ౩౨ స్వేదమువలనఁ గలుగు ప్రాణులను స్వేదజములందురు. వాయువువలనఁ గలుగు జీవములను ఉద్భిజ్జములనెదరు. ౩౩ ఇట్లే మనుజుల యింద్రజాలము (గారడీవిద్య) రాక్షసుల యంత్రీవిద్య బ్రహ్మయొక్క సృష్టివిద్య యుండును ౩౪ మనుజుల సృష్టివిద్య కొంచెమైనపాటిది. రాక్షసులసృష్టివిద్య అంతకంటెగొప్పది. దానికంటెను మిగుల గొప్పది బ్రహ్మసృష్టివిద్య ౩౫ కొన్నిప్రాణములు జ్ఞానవంతములుగను, మఱికొన్నిప్రాణు లజ్ఞానవంతములుగను సృజింపఁబడెను. బ్రహ్మ తొలుదొలుత వేదములను బ్రచురించి యావేదములసహాయమునఁ బ్రాణులను మార్గమునఁ బెట్టుచున్నాఁడు. ౪౬ అనంతరము శరీరమువలన శరీరములేర్ప

డుచున్నవి. ఈవికారమువలన సృష్టి యథేచ్ఛముగాఁ జెరిఁగిపోవుచున్నది. శరీరములన్నియు నీవిధముగా నిర్మాణములగుచున్నవి. ౩౭ ఇంతటితో శ్రోతలకు సందేహము నివారణమై సృష్టియంతయు నెట్లువిస్తృతమయ్యెనో విశదముగాఁగలదు. విచారముఁగావించినచో నీవిషయము చక్కఁగా ననుభవములోనికివచ్చును. ౩౮ ఈవిధముగ బ్రహ్మ సృష్టి యొనరించుచున్నాఁడు. ఈసృష్టినంతయు విష్ణు వెట్లుప్రతిపాలనము గావించుచుండునో శ్రద్ధతో శ్రోత లాలకింతురుగాక ౩౯

విష్ణువు మూలరూపము, సత్త్వగుణము, జ్ఞానము నైయున్నది. ఈసూక్ష్మరూపము స్థూలదేహధారణముగావించి దుష్టులను సంహరించుచుండును. ౪౦ నానావతారములు ధరించుటకును, దుష్టులను సంహరించుటకును, ధర్మస్థాపనము గావించుటకును విష్ణువు జననమునొందుచుండును. * ౪౧ ధర్మస్థాపనముగావించు పురుషుఁడుగూడ విష్ణుని యవతారమే! అట్టివారలుగాక అభక్తులుగను, దుర్జనులుగను నుండువారెల్లరును సహజముగనే రాక్షసగణములోనికి వచ్చెదరు. ౪౨ పుట్టిన ప్రాణులన్నియుఁ జైతన్యరహితములైనంతన నాశనమగును. ఈవిధముగా రుద్రుఁడు తమోగుణరూపముగా వానిని సంహరించుచున్నాఁడు. ౪౩ రుద్రులకుఁ బూర్తిగాఁ గోపముగలిగినపిదప సంపూర్ణసృష్టియంతయు సంహారముగాఁ గలదు. ఆసమయమున సమగ్రమగుబ్రహ్మాండమే భస్మము కాఁగలదు. ౪౪ ఈయుత్పత్తి, స్థితి, సంహారములవర్ణనమును శ్రోతలు ధ్యానముతో యోజింపవలయును. ౪౫ ఇఁకముందు సమాసమునందుఁ గల్పాంతసంహారమునుగూర్చి వర్ణించెదను. పంచప్రళయముల నెఱింగినవాఁడే జ్ఞాని గాఁగలఁడు. ౪౬

ఐదవ సమాసము.

పంచప్రళయములు.

శ్రోతలారా! ఇఁకఁ బ్రళయలక్షణములను వినుండు. పిండము (శరీరము) నందు రెండుప్రళయములు గలవు. ఒకటి నిద్ర, మఱియొకటి

---

* శ్లో॥ పరిత్రాణాయసాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగేయుగే॥ (గీత. అధ్యా ౪)

మరణము. ౧ దేహధారులగు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు నిదురఁబోవు సమయమును బ్రహ్మాండనిద్ర ప్రళయ మందురు. ౨ ముగ్గురు మూర్తులకును బ్రహ్మాండమునకునుగూడ నంత్యముకలుగుకాలమును బ్రహ్మప్రళయ మందురు. ౩ మొత్తము నాలుగువిధములగు ప్రళయములుగలవు. వీనిలో రెండు పిండమునందును రెండుబ్రహ్మాండమునందును నున్నవి. అన్నిఁటికంటెను గొప్పదగు నైదవప్రళయము వివేకమునుగూర్చినది. ౪ ఇటులే యైదుప్రళయములను గ్రమముగాఁ జెప్పితిని. ఇఁక నీయంశము అనుభవములోనికి వచ్చునటులఁ దెలిపెదను. ౫

నిదురవచ్చినప్పుడు జాగరూకతకు సంబంధించిన ప్రచారమంతయు నాగిపోవును. ఆకస్మికముగ దేహమునకు స్వప్నావస్థయో సుషుప్త్యవస్థయో తటస్థించును. ౬ ఈ జాగరూకత నశించుటకు నిద్రాప్రళయమని పేరుగలదు. ఇఁక మృత్యుప్రళయస్థితి వినుండు. అది దేహాంతసమయమునఁ గలుగును. ౭ దేహమునందు రోగము వృద్ధినొంది నపుడుగాని యేవేని కఠినపరిస్థితులు సంభవించినపుడుగాని పంచప్రాణములు దమ తమ వ్యాపారములు మానివేయును. ౮ ఆసమయమున మనస్సుగూడ వెడలిపోవును. కేవలదేహముమాత్రమె నిలచును. ఇదియే రెండవప్రళయము. ౯ బ్రహ్మ నిద్రించినపుడు మృత్యులోకము లయమగును. ప్రాణిమాత్రుల వ్యవహారములన్నియు నాగిపోవును. ఇది మూఁడవప్రళయము. ౧౦ ఆసమయమునఁ బ్రాణికోట్ల సూక్ష్మాంశములు వాయుచక్రమునందు వసించును. ఎంతయోకాలము గడచిన పిమ్మట బ్రహ్మకు జాగ్రత గలుగును. ౧౧ బ్రహ్మ మఱల సృష్టిగావించును. విసంచితజీవులను (నష్టజీవులను) మఱల సంచితములుగఁ జేయును. బ్రహ్మ కాయుష్కాలము పూర్తియగునప్పుడు వచ్చు ప్రళయముపేరు బ్రహ్మప్రళయము. ౧౨

నూఱుసంవత్సరముల దనుక వర్షము కురియదు. అందుచేఁ బ్రాణులన్నియు నశించును. పృథ్వీమండలము అసంభావ్యము అమర్యాదితముగాఁ బగిలిపోవును. ౧౩ సూర్యుఁడు ద్వాదశకళాపూర్ణుడై భూమండలమును దీపింపఁజేయును. అందుచే భూమండలమంతయుఁ గాలిపోవ నారంభించును. ఈ యగ్ని క్రమముగాఁ బాతాళలోకములోనికి వ్యాపింపఁగనే శేషువు విషమును వాంతిచేసుకొనును. ౧౪ ఆకాశమునందు

సూర్యకిరణజ్వాలలు విజృంభించుటచేతను పాతాళమున శేషువు విషము వమనము చేయుటచేతను భూమండల మీరెండు ప్రక్కల నున్న యగ్ను లచే మాడిపోవును. ఈపరిస్థితులలో బృథ్వీమండలము అపాయము నుండి బయటబడజాలదు. ౧౫ సూర్యుని వేడి మిగుల వృద్ధినొందును. నలుముఖములు గోలాహలము చెలరేగును. మేరుశిఖరములు విరిగి పడి పోవును. ౧౬ అమరావతి, సత్యలోకము, వైకుంఠము, కైలాసము మున్నగు లోకములన్నియు భస్మమైపోవును. ౧౭ మేరుపర్వతమంతయు గ్రుంగిపోవును. దాని మహత్త్వముగూడ నంతరించును. దేవసముదాయము వాయుచక్రమునందు దిరుగ నారంభించును. ౧౮ ధరణిభస్మమైపోయిన పిదప రోకటింటి ధారలతో వర్షము గురియును. నిమిషమాత్రములో బూదియైన భూమండలమంతయు జలములో గరిగిపోవును. ౧౯ పిమ్మట భూమండలముండదు. కేవలము జలమే నిల్చియుండును. ఆజలమునుగూడ అగ్ని శోషింపజేయును. అనంతరము హద్దు, అంతములేని అగ్నిజ్వాల లావరించును. ౨౦ సముద్రములోని బడబానలము శివుని నొసటి నేత్రానలము, సప్తకంచుకియగు బ్రహ్మాండముయొక్క ఆవరణానలము, సూర్యుడు, విద్యుల్లత మున్నగునగ్నులన్నియు నొకచోట రాశియగును. ఆకారణమున దేవతలందఱును దేహములను విడుతురు. అనంతరము దేవతలు వాయురూపముతో ప్రభంజనునియందు గలసిపోవుదురు. ౨౧ ౨౨ ఆ వాయువు అగ్నిని లోగొనును. అగ్నియారిపోవును. వాయువు స్వచ్ఛందముగా పరబ్రహ్మములోనికి బరుగెత్తును. ౨౩ పొగ ఆకాశమునందంతటను వ్యాపించి నష్టమగునట్లు వాయువుగూడ నశించును. మహద్వస్తువులతోబాటు స్వల్పవస్తువులకుగూడ నాశనము గలుగును. ౨౪ వాయువు లయమైనతోడనే సూక్ష్మభూతములు, త్రిగుణములు, ఈశ్వరుడు (ప్రకృతి, పురుషుడు అనగా మూలమాయ) నిర్వికల్పమునందు లీనమై తమతమ యధిష్టానములను విడిచివేయుదురు. ౨౫ అప్పు డెటుకయుండదు. జగజ్జ్యోతి లయమగును. నిరాకారస్వరూపస్థితి శేషించియుండును. ౨౬

నామరూపములన్నియును ప్రకృతికారణములు. ప్రకృతిలేనప్పుడు చెప్పుట యెట్లుపొసగును ? ౨౭ ప్రకృతియుండగనే వివేకించుటను వివేకప్రళయ మందురు. ఈపంచప్రళయములను వివరముగా దెలిపితిని. ౨౮

ఆఱవసమాసము.

భ్రమ నిరూపణము

ఇంతవఱకు ఉత్పత్తి, స్థితి, సంహారములవృత్తాంతము చెప్పితిని. ప్రళయాంతమునగూడ నిర్గుణనిరాకారపరమాత్మ యథావిధముగా నుండును. ౧ కలుగుట, వర్తించుట, నశించుట యనువానిసంబంధము లాపరమాత్మునకు లేవు. ఆతడు ఆదిమధ్యాంతములయందు నిరంతర మొకేవిధముగ నుండును. ౨ పరబ్రహ్మము యథావిధముగా నుండును. మధ్యయందే యీసృష్టిభ్రమ భాసించుచున్నది. కాని కాలాంతరమున నంతయు నాశనమైపోవును. ౩ మధ్యయందు ఉత్పత్తిస్థితిసంహారము లఖండరీతిగా జరుగుచుండును. కాని యంత్యమున నన్నిటికిని ప్రళయము కలుగును. ౪ వివేకముగలవాడీయంశము మొట్టమొదటనే గ్రహించును. సారాచారవిచారమువలన వివేకశాలి యీయుత్పత్తిస్థితిసంహారముల స్వరూపమును మొదటినుండియు దెలిసికొనును. ఇట్లెఱుంగువారలనే జ్ఞానులందురు ౫ భ్రాంతాత్ములు పలువురు పోగైనచోట నొకతెలిసినపురుషుడేమిచేయగలడు ? సృష్టియందిట్టివివేకవంతులు చాలస్వల్పముగా నున్నారు. ౬ ఈమహాపురుషులెన్నడును భ్రమకు బాల్పడరు. తెలిసినవారి ముఖ్యలక్షణము భ్రమకు బాల్పడకయుండుటయేసుమా ! ౭ భ్రమయందు జిక్కుకొననివారెవరో మనము మనస్సులో గుర్తింపవలయును. భ్రమయొక్కతత్త్వమును జెప్పెదను. సావధానులరై వినుండు ౮ ఒకపరబ్రహ్మమె పరిపూర్ణముగా నంతటను నిండియున్నాడు. ఆతడెన్నటికిని వికారయుక్తుడు గాడు. ఆతనిని విడిచినచో మిగిలినభాసమంతయును భ్రమరూపము. ౯ ప్రళయమునొందుచున్న త్రిగుణములు, పంచభూతములు (అష్టవిధప్రకృతి) మున్నగునవన్నియు భ్రమరూపములే యగును. ౧౦ నేను, నీవు, ఉపాసన, ఈశ్వరభావము అనునవిగూడ నిశ్చయముగ భ్రమయే ౧౧

శ్లో॥ భ్రమేణాహం భ్రమేణత్వం భ్రమేణోపాసకాజనాః

భ్రమేణేశ్వరభావత్వం । భ్రమమూలమిదంజగత్॥

ఈకారణమున సృష్టిభాసమానమగుచుండినను సమస్తమును భ్రమరూపమే. ఈవిషయమునం దెవ్వరువిచారముగావింతురో వారలు ధన్యులు ౧౨ ఇక భ్రమనుగూర్చి మిగులస్పష్టముగా జెప్పెదను.

మఱియు దృష్టాంతపూర్వకముగా శ్రోతలకు బోధించెదను ౧౩ దూరదేశమున సంచరించుచు నొకవేళ దిశాభ్రమణముగలిగినను లేక తనకుటుంబములోనివారు తన్నుగుర్తింపఁజాలకపోయినను దానిని భ్రమయందురు ౧౪ మత్తుపదార్థములను సేవించినచో ఒకవస్తు వనేకవస్తువులుగాఁ గనిపించుచుండుటను భ్రమయందురు. భూతముసోఁకి నానావ్యాధులు కలిగినచో దానినిగూడ భ్రమయందురు ౧౫ దశావతార నాటకములాడునపుడు పురుషులు స్త్రీలుగాఁ గాన్పించుట, ఇంద్రజాలవిద్య, యంతఃకరణము నందేదేనిసందేహము నెలకొనుట మున్నగువాని పేరు భ్రమ ౧౬ ఏదేనివస్తువు నెందేని దాఁచి మఱచిపోవుట, నడచుచు నడచుచుఁ ద్రోవను మఱచిపోవుట, పట్టణములోఁ దెన్నుగానక తిరుగుట భ్రమయనఁదగును ౧౭ తన కెదురుగానున్న వస్తువు పోయినదనుకొని దానికై పరితపించి దుశ్చింతుఁడగుటయు స్వయముగాఁ దన్నుఁదా మఱచిపోవుటయు భ్రమ ౧౮ ఏవస్తువు నేని మఱచుట, లేక నేర్చినవిద్య మఱచుట, స్వప్నదుఃఖమువలన భయముండుటగూడ భ్రమయే ౧౯ దుస్స్వప్నమువలనఁగాని అపశకునములవలనగాని మిథ్యావార్తలవలనగాని మనస్సు చెదరుటయు నేదేని పదార్థమునుజూచి వెఱచుటయు భ్రమ ౨౦ వృక్షమునుగాని కొయ్యనుగానిచూచి భూతమువచ్చుచున్నదని సందేహించుటయు ఏమియు లేకున్నను భయముండుటయు భ్రమయనఁబడును ౨౧ నీటిని కాంస్యమనుకొని యందుఁబడుటయు నిలువుటద్దములోఁ గనిపించు సభాప్రతిబింబమును గాంచి యందుఁ జొరయత్నించుటయు ద్వారమునుమఱచి యిటునటు తిరుగుటయు భ్రమ ౨౨ ఒకటియున్న మఱియొకటి యనుకొనుటయు, ఒకటి చెప్పిన మఱియొకటిగా గ్రహించుటయు, ఒకదానినిజూచి మఱియొకదానిని మనస్సులోనికిఁ దెచ్చుకొనుటయు భ్రమ ౨౩ ఈజన్మలోనిదానిని ముందుజన్మములోఁ బొందెదనను నాశపెట్టుకొనుటయు, మనుష్యుని పేరుపైఁ బ్రీతియుంచుటయు, భ్రమ ౨౪ ఈజన్మమునందిచ్చినదానిఫలము ముందుజన్మములో ననుభవింపఁగలననుకొనుటయుఁ, జనిపోయినవారలు (శ్రాద్ధాదులలో) తినుటకు వత్తురని నమ్ముటయు భ్రమ ౨౫ మరణించినవారలు స్వప్నములోఁ గనిపించి మనల నేదేని యడుగుచుందురనుభావము హృదయమునందు నిశ్శంకముగా

నుంచుకొనుటయు ౨౬ సర్వము మిథ్యయనిచెప్పుచు ధనద్రవ్యములపైకి మనస్సునుబరుగులెత్తించుటయు జ్ఞాతయయ్యు వైభవములనుజూచుకొని యుక్తాయుక్తముల మఱచుటయు భ్రమ ౨౭ కర్మఠత్వములో జ్ఞానము ను మఱచుటయు జ్ఞాతృత్వముతో బలాత్కారముగ భ్రష్టుఁడగుటయు నేదేని నియమము నుల్లంఘించుటయు ౨౮ దేహాభిమాన, కర్మాభిమాన, జాత్యభిమాన, కులాభిమాన, జ్ఞానాభిమాన, మోక్షాభిమానములఁ గలిగియుండుటయు ౨౯ న్యాయము నెఱుంగకుండుటయుఁ దానొనరించిన యన్యాయమును గ్రహింపకుండుటయు, వ్యర్థముగా నభిమానమును బెంచుకొనుటయు భ్రమ ౩౦ వెనుకటివిషయములను మఱచిపోవుటయు ముందువిషయములు తోఁచకుండుటయు, నఖండముగ గర్వియైయుండుటయు ౩౧ ప్రతీతిరహితముగ నౌషధమును సేవించుటయుఁ బ్రతీతిరహితముగాఁ బథ్యమునొనర్చుటయుఁ బ్రతీతిరహితముగా జ్ఞానబోధ గావించుటయు భ్రమ ౩౨ ఫలము నెఱుఁగక యేదేని ప్రయోగము గావించుటయు, జ్ఞానములేకున్నను యోగము గావించుటయు, వ్యర్థముగ శరీరభోగముల ననుభవించుటయు, ౩౩ "బ్రహ్మ లలాటమున నెట్లు లిఖించెనో యట్లె జరుగును" అను నిట్టి వేదాంతవాక్యములు నుడువుచుఁ గార్యములలోఁ బూనికచూపక యున్నకుంటయు భ్రమ. ౩౪

ఈవిధముగా అజ్ఞానులలో భ్రమ బాగుగాఁ బాదుకొనియున్నది. సాధారణరీతిగా నెఱుంగుటకై నేనిట భ్రమను సంక్షేపముగాఁ దెలిపితిని ౩౫ విశ్వమంతయు స్వాభావికముగా భ్రమరూపముగానున్నపుడు చెప్పవలసిన దింకనేమున్నది? నిర్గుణబ్రహ్మము దక్క మిగిలినదంతయు భ్రమరూపమనియే గ్రహింపవలయును ౩౬ జ్ఞానులు ప్రపంచాతీతులు కావున గతించిన జ్ఞానుల చమత్కారములనుగూడ భ్రమయని గ్రహింపనగును. ౩౭ "జ్ఞాతులసమాధులు పూజింపఁబడుచున్నవిగదా! అందువలన ఫలము కలుగునా! లేదా!" యనియు ౩౮ అవతారపురుషులీకాలమున లేకున్నను వారలమహిమలు వారిసామర్థ్యములు నేటికిని ఆదరింపఁబడుచున్నవి. వారలుగూడ వాసనయందుఁ జిక్కియుండిరాయనియు నొకశంక మాశ్రోతలకుఁ గలుగుచున్నది. ౩౯ ఇప్పుడు సమర్థుఁ డీసందియమును దొలఁగింపవలయును. ఇంతతో భ్రమనుగూర్చిన కథగూడ సమాప్తియైనది. ౪౦

ఏడవసమాసము.

సాధువులు చమత్కారము చేయరు.

శ్రోత యిట్లు ప్రశ్నించిరి. అవతారపురుషులు, జ్ఞానులు, సాధుపురుషులు పూర్తిగ ముక్తులైరిగదా! వారి సామర్థ్యము నేటిదనుక నెట్లునడచుచున్నది? వక్త యిట్లు నుడివెను. చాలమంచి ప్రశ్నగావించితిరి. ఇఁక దీనికి ఉత్తరము వినుండు ౧, ౨ జ్ఞానులు ముక్తులగుచున్నారు. అనంతరము వారిసామర్థ్యము నడచుచుండును. కాని వారలు వాసనను ధరించిరారు ౩ లోకులకుఁ గాన్పించుచున్న చమత్కారములను ఆ చమత్కారములను లోకులు సత్యములని నమ్ముచుండుటను జతురులు విచారింపవలసియున్నది ౪ చనిపోయినవారి సంగతి నటులుంచుఁడు. బ్రదికియున్నపుడెన్నిచమత్కారములు ప్రజలలో జరుగుచున్నవో సరిగా నెవ్వరెఱుంగుదురు? ఈవిధమగు తాత్కాలిక ప్రతీతిని బ్రత్యక్షముగఁ జూచుకొనుఁడు ౫ అతఁడొకస్థలమునుండి స్వయముగా వేఱొకస్థలమునకుఁ బోవనే లేదు. జనులాతనిని బ్రత్యక్షముగా వేఱొకస్థలమునందుఁ జూచిరి. ఈ చమత్కార మీవిధముగా జరిగినది. ఇప్పుడు దీనిని నేమందము? * ౬ తమ తమ భావకారణముననే జనులకిట్లు గోచరించుచున్నది. భావికులకు దేవుఁడు యథార్థముగా నున్నాఁడు. భావము లేని కల్పనమంతయు వ్యర్థము, కుతర్కపూరితము. ౭ తనకుఁ బ్రియమైన వస్తువును స్వప్నమునందుఁ గాంచుటగలదు. వాస్తవమున కావస్తువచటికి వచ్చుచున్నదా యేమి? "అట్లు వచ్చుటలేదు. అది జ్ఞప్తికిమాత్రము వచ్చుచున్నది." అని యొకవేళఁ జెప్పఁదలఁచినచోఁ దక్కినవస్తువుల రూప మెందులకుఁ గనుపించుచున్నది? కేవలము వానికిఁగూడ స్వప్నమునందు జ్ఞప్తియే యేలరాదు? ౮ కావున నిదియంతయును మనకల్పనము. స్వప్నమునందు నానావిధపదార్థములు కనిపించుచున్నవి. కాని వాస్తవమున కవియెవ్వియును లేవు. అవి జ్ఞప్తికి వచ్చుటయును లేదు. ౯ ఇంతటితో సందేహము తొలఁగిపోవుచున్నది. జ్ఞాతకు జన్మకల్పనము గావింపకుము. ఒక

* ఉదాహరణముగా వ్రాసిన యీయంశము, ఎవరో సాధుపురుషుని చమత్కారమును దృష్టిపథమునందుంచుకొని శ్రీసమర్థుఁడు రచించెనని తోఁచుచున్నది.

వేళఁ జక్కఁగ బోధపడకపోయినచో వివేకముతో మరల బాగుగాఁ దెలిసికొనుము. ౧౦ జ్ఞానులు ముక్తులైపోయెదరు. వారల సామర్థ్యము నడచుచుండును, వారలు పుణ్యమార్గమును దొలంగరు గావున గతించిన పిమ్మట మహత్త్వము కొఱఁతపడకున్నది. ౧౧ కావున పుణ్యమార్గమును దొలంగక వర్తింపవలయును. ఈశ్వరభజనము నభివృద్ధిగావింపవలయును. న్యాయమును దొలంగి యన్యాయమార్గమున నడువరాదు. ౧౨ శుభపురశ్చరణ లెన్నేని చేయవలయును. తీర్థాటనము చక్కఁగఁ జేయవలయును. అంతతోఁ బోక వైరాగ్యబలముచేఁ దన సామర్థ్యమును బెంపొందింపవలయును. ౧౩ పరమాత్మునియందు విశ్వాసమున్నచో జ్ఞానమార్గమువలనఁగూడ సామర్థ్యము వృద్ధియగును. కాని శాంతిభంగమగునట్లు యత్నము చేయరాదు. ౧౪ గురువు, ఈశ్వరుఁడు అను నీయిద్దరిలో నొకరియందుఁగాని యిద్దరియందుఁగాని అవశ్యముగా శ్రద్ధకలిగియుండవలయును. శ్రద్ధలేనిచో నంతయు వ్యర్థమగును. ౧౫ జ్ఞాతలు నిర్గుణజ్ఞానముగలిగిన పిమ్మట సగుణమునందున్నధ్యానమును దొలంగించినయెడల నిర్గుణమునకు సగుణమునకుఁగాక చెడిపోవుదురు. ౧౬ అట్టిజ్ఞాతలకు సహజముగా భక్తియుండదు, జ్ఞానముగూడ నుండదు. కేవలముగ నభిమానముమాత్రమే మధ్యయందుఁ గలుగును. కావున జప, తపోధ్యానముల నెప్పుడును విడువఁజనదు. ౧౭ సగుణభజనము విడిచివేయువారు జ్ఞానులైన నగుదురుగాక. వారికి యశము లభింపదు. కావున సగుణభజనము విడువనే కూడదు. ౧౮ నిష్కామబుద్ధితోఁ గావించుభజనమునకు సమానమైన దీమూఁడులోకములలో నేదియు లేదు. కాని సామర్థ్యములేనిది నిష్కామభజన మెన్నఁటికిని కుదురదు. ౧౯ సకామభజనమువలన ఫలము దొరుకును. నిష్కామభజనమువలన భగవంతుఁడు దొరుకును. ఇఁకఁ జెప్పుడు, ఫలమెక్కడ? భగవానుఁడెక్కడ? ఔరా! ఈ రెంటికెంతయంతరమున్నది. ౨౦ ఈశ్వరునియొద్ద నానావిధ ఫలములుగలవు. కాని ఫలములు భగవంతునినుండి మనుజునిదూరపఱచును కావున నిష్కామమే భజింపఁదగినది ౨౧ నిష్కామభజనఫల మద్భుతమైనది. దానివలన నంతులేనిసామర్థ్యము వృద్ధినొందును. ఈ స్థితిలో భావము ఫలాపేక్షితులేమిలేక

కువత్తురు? ౨౨ భక్తుఁడు తనహృదయమున నుంచుకొన్న విషయము నీశ్వరుఁడు స్వయముగాఁ జేయును. భక్తుల కేవిషయమునందేని జింతింప వలసిన యవసరము లేదు. ౨౩ రెండుసామర్థ్యములు (భగవంతునియొక్కయు భక్తునియొక్కయుసామర్థ్యములు) ఒకటియైనపుడు కాలము గూడ నేమియుఁ జేయఁజాలదు. ఇఁక నితరులదేమిలెక్క? అందఱు నచ్చటఁ బురుగులవలె నుందురు. ౨౪ కావున నిష్కామభజనమునకును బ్రహ్మజ్ఞానమునకును గట్టెదుటం ద్రిలోకసంపదలుగూడఁ బరిగణింపఁ దగినవి కాఁజాలవు. ౨౫ బుద్ధికిఁ బ్రకాశదాయకమైన దింతకంటె వేఱుగా నేదిగలదు? నిష్కామభక్తునకుఁ గీర్తియు, యశమును, బ్రతాపమును నిరంతరము లభించును. ౨౬ అధ్యాత్మనిరూపణము హరికీర్తనము జరుగుతావున మనుష్యమాత్రునకుఁ గల్యాణము కలుగును. ౨౭ భ్రష్టాకారముగాని పరమార్థమెన్నఁటికిని సంకుచితము కాఁజాలదు. పరమార్థమువలన నేర్పడిన నిశ్చయసమాధాన మెన్నఁటికిని జెదరదు. ౨౮ సారాసారవిచారణమువలనను, న్యాయాన్యాయములపై నిరంతరము దృష్టినుంచుటవలనను, బరమాత్మునిచేఁ బ్రసాదింపఁబడిన బుద్ధి స్థిరపడును. ౨౯ అనన్యభక్తునకు భగవంతుఁడు స్వయముగా బుద్ధినొసంగును ఈభగవద్గీతావాక్యమును వినుఁడు. ౩౦ "దదామి బుద్ధియోగం తంయేన మాముపయాంతి తే" కాని సగుణభజనము, దానిమీఁద బ్రహ్మజ్ఞానము, మరల ననుభవయుక్తమగుశాంతి సంసారమునందు (ప్రపంచమునందు) దుర్లభములైయున్నవి. ౩౧

ఎనిమిదవ సమాసము.

ప్ర తీ తి ని రూ ప ణ ము.

ప్రతీతి (ఎఱుక) లక్షణములు వినుండు. ప్రతీతిని విచారముగావించువారలే చతురులు. ప్రతీతిరహితులగుమానవులు పిచ్చివాండ్రు దీనులునైయున్నారు. ౧ నానావిధరత్నములు, నాణెములు పరీక్షింపక తీసికొన్నచో హానికలుగును. అట్లే విశ్వాసముకలుగకున్నచో నిరూపణమునందుఁ బ్రవేశింపనేకూడదు. ౨ గుడ్డమును శస్త్రమును ద్రిప్పిచూడవలయును. అవి మంచివని తెలిసికొనినప్పు డెఱిగినమనుజుఁడు వానిని

దీసికొనవలయును. ౩ విత్తనములను మొలచుటకర్హములని బాగుగ నిర్ణయించుకొన్నపిమ్మట మూల్యమునొసంగి తీసికొనవలయును. ఇట్లే ప్రతీతియైనపుడు నిరూపణమును వినవలయును ౪ ఔషధమువలన శరీరమున నారోగ్యముకలుగుననునమ్మకము ప్రజలలోఁ గలిగియున్నపుడే యాయౌషధమును దీసికొనవలయును. ౫ ప్రతీతిలేక యౌషధమునుదీసికొనుట తనయారోగ్యమును భంగముగావించుకొనుటయే. అనుమానముతోఁ బనిచేయుట మూర్ఖత్వము, ౬ ప్రతీతిలేనితావున బంగారపునగలు చేయించుట తన్నుఁదాను కావలయునని మోసగించుటయేసుమా. ౭ చూడక, ఆలోచింపక యేపనినేనిచేయుట యుక్తముగాదు. దీనివలనఁ బ్రాణములుసైతము పోవును. ౮ యోగ్యులెన్నఁటికిని అనుమానముతోఁ బని చేయరాదు. అట్లుచేసినచో మంచికిబదులుగాఁ జెడుగుజరుగుచుండును ౯ నీటిలో మునిఁగియున్నబట్టను గ్రయమునకుఁదీసికొనుట ఉత్తమబుద్ధికి లక్షణముగాదు. చూడక విచారింపక పనులొనరించినచో తరువాత వ్యర్థమయ్యెనని పశ్చాత్తాపము నొందవలసివచ్చును. ౧౦ పలువురుమనుజులు విశ్వాసముగలవారై యెదుటివారిపై నమ్మకముంచి యింటఁ గూర్చుండి అమ్ముట,కొనుట జరుపుదురు. కాని కపటులు తమకాపట్యమునందుపయోగించియే తీరుదురు. అట్టికపటములను దెలిసికొనవలయును. ౧౧ చూడక, యోజింపక అన్నమునుగాని, వస్త్రమునుగాని గ్రహించుటచే నొకానొకప్పుడు జనులు తమప్రాణములను జేతిమీఁదుగాఁ గోల్పోవుచున్నారు. అనృతవాదిని నమ్ముటయే మూర్ఖత్వము ౧౨ దొంగతోఁ జెలిమిచేసినచో హాని కలిగితీరును. కపటులు మోసగాండ్రు బాగుగా విచారించిన వెల్లడియగుదురు. ౧౩ అసత్యవాదులు, తామసులు, వేషము మార్చిమోసగించువారు, నానావిధకపటజాలనిర్మాతలు నగువారలను బాగుగా నెఱింగి వారలయెడ జాగరూకత గలిగియుండవలయును. ౧౪ దివాలాతీయువారలవైభవములు,చమత్కారములు చూచుటకు మిగుల గొప్పగఁ గనిపించును. కాని యంతయు వట్టిమోసపుబని. కొన్నాళ్ళకీ యమృతభాండము పగిలితీరును. ౧౫ ఇట్లే విశ్వాసములేనిది జ్ఞానగ్రహణము జేసినచో సమాధానముకలుగదు. సందేహాయుక్తమగు జ్ఞానమువలన ననేకులకహితమయ్యెను. ౧౬ వైద్యశాస్త్రమునెఱుంగక వైద్యముచేయు

చుండు వైద్యనామధారి రోగిని దనయుక్తివలనఁ జంపునట్లు మంత్రయంత్రోపదేశమువలన నజ్ఞానప్రాణులు మరింత యధోగతిపాలగుచున్నారు. ౧౭ సరిగాఁ దెలియని వైద్యమువలనఁ బాపము! ఎవఁడేని మనుజుఁడు చనిపోయిన యెడల రెండవవారు రోగశాంతి కేమి యుపాయము గావింపఁగలరు? ౧౮ బాధవలన లోలోనఁ గుమిలి యెండిపోవుదురు. అంతియ గాని వైద్యునికడకుఁ బోయి యౌషధమును మాత్ర మడుగరు. అట్టి ప్రజలకాత్మహత్యాదోష మేల కలుగదు! ౧౯ జ్ఞానిపయి నభిమానము కలిగియుండుట స్వయముగాఁ దా నజ్ఞానియగుటవలననే తటస్థించుచున్నది. ఇది తన్ను దాను ముంచుకొనుటయే. బాగుగా యోజింపుఁడు. ఇట్లు చేయుటవలన హానికలుగున దెవరికి? (జ్ఞానికా లేక అభిమానముంచువానికా) ౨౦ "పాపములు నశించినవి. జననమరణయాతనలు తొలఁగినవి" అను విశ్వాసము తనకు గలిగినపుడె మానవునకు శ్రేయము కలుగును. ౨౧ "నేను పరమాత్ముని గుర్తించితిని. నే నెవ్వఁడనో తెలిసికొంటిని. ఆత్మనివేదన మైనద"ని నిన్నుఁ గూర్చి నీవు చక్కఁగ తెలిసికొన్నప్పుడు అంతయుఁ జక్కఁబడును ౨౨ బ్రహ్మాండము నెవఁడు రచించినదియు మఱియు నే పదార్థములతో రచించినదియు ముఖ్యకర్త యెవఁడైనదియు నీవు చక్కఁగఁ దెలిసికొన్న యెడల నంతయుఁ జక్కఁబడును ౨౩ ఇది యంతయుఁ దెలిసికొనుటలో నింకను నొకవేళ సందియము శేషించియున్న యెడల నాతని యనుభవమంతయు వ్యర్థమయ్యెననియు విశ్వాసహీనుఁడగుటచే నామానవుఁడు సందేహమగ్నుఁ డయ్యెననియు గ్రహింపవలయును ౨౪ ఇది పరమార్థమర్మము. ఇం దసత్యము కలదని యెవఁడేని నుడివినచో వాఁ డధముఁడు. అట్లసత్యముగా భావించువాఁడు పాపులలో నగ్రేసరుఁడు ౨౫ ఇఁక నిప్పుడు చెప్పుచున్న యంశమునకుఁ బరిమితి పూర్తియైనది. ఎఱుఁగని యెడలఁ బరమాత్మ యెఱుంగఁబడదు. పరమాత్మా! ఇం దసత్యము లేదని నీవె యెఱుంగుదువు ౨౬ సత్యమగు జ్ఞానమును వివరించుటయె నా యుపాసనా విశేషము. మిథ్య చెప్పిన యెడల నా ప్రభువుమీఁదికి దోషము వచ్చును ౨౭ కాన సత్యమును జెప్పుచున్నాఁడను. కర్తను గుర్తింపవలెను. మాయోత్పత్తిహేతువు శోధింపవలయును ౨౮ వివరింపఁబడిన నిరూపణమునే యిచట మఱల వివరించితిమి. శ్రోతలు సావధానులరై వినుఁడు ౨౯ నాత్మనిరూపణమును గూర్చి ప్రసక్తి వచ్చినపుడు చెప్పినదానిని మఱలఁ జెప్పుచుందును. ఏలయన! శ్రోతల హృదయములో నా విషయము బాగుగా బోధపడుటకె. ౩౦ వాస్తవమునకుఁ బ్రతీతిని సంబాళించుటవలన జనరూఢి తొలఁగును. కావునఁ జనరూఢిని గాపాడుచుఁ బ్రతీతిని గావించుటకై, ఇంత చిక్కును దెచ్చిపెట్టుకొనవలసి వచ్చినది ౩౧ ఒకవేళ జనరూఢిననుసరించియే చెప్పుదుమన్నచో ప్రతీతియొక్క సమాధానము తొలఁగిపోవుచున్నది. ఒకవేళ ప్రతీతిసమాధానముల రక్షగావింతమన్నచో జనరూఢి చెడిపోవును ౩౨ ఈవిధముగ రెండుపక్షములనుండియు సంకటములు కలుగుచున్నవి. ఈకారణముననే చెప్పినదానిని మఱలఁ జెప్పవలసివచ్చుచున్నది. ఇపుడు రెండింటిని (జనరూఢిని, ప్రతీతిసమాధానమును) రక్షజేయుచు సమస్యను సాధించెదను ౩౩ కావున జనరూఢి, ప్రతీతి ప్రమాణము అను నీరెంటిని రక్షజేయుచుఁ గావింపఁబడిన నిరూపణమును బరమచతురులగు శ్రోతలు మననము గావింపవలయును ౩౪

తొమ్మిదవసమాసము

పురుషుఁడు ప్రకృతి.

ఆకాశమునందు వాయునిర్మాణమున్నట్లు బ్రహ్మమునందు మూలమాయ యుండును. అనంతరము వాయురూపమగు మూలమాయనుండి త్రిగుణములును బంచభూతములును గలుగుచున్నవి ౧ వటబీజమునందు మిగులఁ బెద్దవృక్షము జనించుచున్నది. కాని బీజమును బగులఁగొట్టి చూచిన యెడల నది కాన్పింపదు. నానావిధవృక్షసమూహమంతయు బీజమునుండియే కలుగుచున్నది ౨ అటులె మూలమాయగూడ బీజరూపముగా నున్నది. ఆబీజరూపమునుండియే సమస్తవిశ్వ మేర్పడెను. దీనిస్వరూపమును శోధించి చక్కఁగాఁ జూడవలయును ౩ అచట నిశ్చలచంచలములు రెండును గాన్పించును. వాని ప్రతీతిని వివేకమువలనఁ జేయవలెను. నిశ్చలమునందున్న చంచలస్థితియే వాయువు. ౪ దానియందున్న చేతనశక్తియే జగజ్జ్యోతియొక్క స్ఫూర్తి. వాయువు, చేతనశక్తిగలిసి మూల

మాయ యనిపించుకొనును. ౫ "సరిత" యని నుడువఁగానే యది యేస్త్రీకైనఁ బేరై యుండునని తోఁచును. కాని యచటఁజూచినచో నేముండును? జలము. ఇట్లే వివేకవంతులు మాయ నెఱుంగవలయును. ౬ వాయువు చేతనశక్తి (జగజ్జ్యోతి) కలిసి మూలమాయ యనఁబడును. పురుషుఁడు ప్రకృతియని సైతము దీనినందురు. ౭ వాయువును ప్రకృతి యనియు, జగజ్జ్యోతిని పురుషుఁడనియు నందురు. వీనికే పురుషప్రకృతులు, శివశక్తులుఅని పేరులుగలవు. ౮ వాయువునందుఁగల చేతనవిశేషమే ప్రకృతియందుఁ బురుషుఁడు. ఈవిషయమునందు విశ్వాస ముంచవలయును. ౯ వాయువుశక్తి, చేతనము శివుఁడు, వీనినే జనులు అర్ధనారీనటేశ్వరుఁ డందురు. ౧౦ వాయువులోఁ జేతనగుణముగలదు. ఇదియే ఈశ్వరలక్షణము. దీనినుండియే మరలఁ ద్రిగుణము లేర్పడెను. ౧౧ త్రిగుణములలో సత్త్వగుణము శుద్ధచైతన్యలక్షణము. దీని దేహధారిస్వరూపము శ్రీవిష్ణుమూర్తి. ౧౨ ఆవిష్ణ్వంశమువలననే జగత్తు నడచుచున్నదని భగవద్గీత నుడువుచున్నది. ఈగందరగోళము విచారము వలన నెట్లుస్పష్టమగును? ౧౩ ఒక్క చేతనశక్తియే అన్నిప్రాణులయందును వ్యాపించియున్నది. అదియే తనయెఱుకవలన నన్నిశరీరములను రక్షించుచున్నది. ౧౪ దానిపేరే జగజ్జ్యోతి. ప్రాణిమాత్రులు దానివలననే జీవించుచున్నారు. దాని సాక్షాత్ ప్రతీతిని ప్రత్యక్షముగాఁ గనుఁగొనవలెను. ౧౫ జగత్తునందలి పక్షిశ్వాపదకీటకపిపీలికాది సమస్తప్రాణివర్గమునందును జేతనము నిరంతరము వర్తించుచుండును. ౧౬ దాని గుణమువలననే, దానియెఱుకవలననే శరీరమును బరుగెత్తించుటయుఁ గాపాడుటయు దాఁచుటయు దటస్థించుచున్నది. ౧౭ అది జగములన్నింటిని పాలించుచున్నది. అందువలననే దానిపేరు జగజ్జ్యోతి. అది వెళ్లిపోయినపిమ్మటఁ బ్రాణులెచ్చటిచ్చటఁ జనిపోవును. ౧౮ జలము తుషారమై యనంతరేణురూపములో నున్నట్లు మూలమాయయొక్క చేతనవికారము ముందునకరిగి విస్తృతమయ్యెను. ౧౯ అట్లే దేవదేవతాద్వైతభూతాదులు మిథ్యయని చెప్పఁబడుటలేదు. అవియన్నియుఁ దమతమసామర్థ్యములవలన నీసృష్టియందుఁ దిరుగుచుండును. ౨౦ ఇవి నిరంతరము వాయుస్వరూపముతోఁ జరించుచుండును. మఱియుఁ దమతమ యి

చ్ఛానుసారముగా రూపములను మార్చుకొనుచుండును. అజ్ఞానప్రాణులు తమభ్రమవలనను సంకల్పమువలనను భూతాదులచేఁ బీడితులగుచుందురు. ౨౧ జ్ఞాతకుసంకల్పము కలునే కలుగదు. అందుచే భూతాదులు జ్ఞాతనుబాధింపనేరవు. కావున ఆత్మజ్ఞానాభ్యాస మవశ్యముగాఁ జేయవలయును. ౨౨ ఆత్మజ్ఞాన మభ్యసించుటవలన సకలకర్మములును ఖండనమగును. ఇది కేవలముగఁ బ్రత్యక్షానుభవమగు నంశము. ఇందు సందియములేదు. ౨౩ జ్ఞానముకలుగనిది కర్మములెన్నఁటికిని ఖండింపఁబడవు. ఇట్లే సద్గురుఁడు లేనిది జ్ఞానమెన్నఁటికిని గలుగదు ౨౪ కావున సద్గురుని యనుగ్రహము సంపాదింపవలయును. సత్సంగమమును బడసి దానిశరణ్యమున కరుగవలయును. అంతఃకరణమునందుఁ దత్త్వజ్ఞానమును మననముజేయవలయును ౨౫ తత్త్వములోఁ దత్త్వము వెడలిపోయినపిమ్మట వాస్తవములో స్వయముగ నీవు (త్వం) అనునదియే మిగులును. ఈవిధముగ ననన్యభావము గలిగినపిమ్మట సులభముగనే సార్థకత్వము గలుగును. ౨౬ విచారింపక చేయునదంతయును వ్యర్థమగును. కావున మొట్టమొదటనే విచారింప నారంభింపవలయును. ౨౭ విచారమును జేయువాఁడే పురుషుఁడు. విచారమును గావింపని వాఁడు పశుప్రాయుఁడు. ఈవిధమగు భగవద్వచనము లన్నిగ్రంథములయందును గనిపించుచున్నవి ౨౮ సిద్ధాంతమును నిశ్చితము గావించుటకుఁ బూర్వపక్షము నెగురగొట్టవలసియున్నది. మఱియు నీనిరూపణము వలననే సాధకులకు సత్యమగుజ్ఞానముమీఁద విశ్వాసముగలుగును. ౨౯ శ్రవణ, మనన, నిదిధ్యాస, ప్రతీతుల నొనరించుటవలన విశ్వాసము జనించును. మఱియుఁ బ్రత్యక్షానుభవము గలుగుటయందుఁ బ్రయాస ముండదు. ౩౦

పదియవ సమాసము.

నిశ్చలము - చంచలము

బ్రహ్మము ఆకాశమునకు సమానము. అది మిగుల గొప్పదియు, ఉన్నతమును, విస్తీర్ణమును, నిర్గుణమును, నిర్మలమును, నిశ్చలమును, సర్వకాలప్రకాశితము నైయున్నది. ౧ దానిని పరమాత్మయందురు, ఇంకను దాని

కెన్ని పేరులుగలవో సమగ్రముగా నెవరెఱుంగుదురు? అది యాద్యంత ములయందొకరీతిగానే యున్నది ౨ అది యనంతరూపముతో నన్ని యెడలను సఘనముగా వ్యాపించియున్నది. మఱియు నిరాభాసముగా నున్నది (౩) పాతాళమునఁగాని అంతరాళమునఁగాని నలుదిక్కులఁగాని మఱియెచ్చటఁగాని దానికంతము లేదు. కల్పాంతకాలమునందును సర్వకాలములయందును నది సంచితముగనే యున్నది. ౪ ఒక్కటియగు నా యచంచల మిట్టిది. ఆయచంచలమునందు భాసించు చంచలమునకు సైతము పెక్కునామములు గలవు. అది త్రివిధముగా నున్నది ౫ చూడ కయే పేరులుబెట్టుటయు గురుతులు దెలుపుటయు నొక చిత్రవిషయము. దానినెఱుంగుట కట్లు చేయక తప్పదు. ౬ మూలమాయ, మూలప్రకృతి, మూలపురుషుఁడు, శివుఁడు, శక్తి మున్నగుపేరులు దాని కెన్నియో గలవు. ౭ కాని యేపేరు దేనికిఁ బెట్టఁబడినదో దానిని మొదట గుర్తెఱుఁగ వలయును. ప్రతీతిలేని కల్పనమేల చేయవలయును? ౮ స్వరూపము నెఱుంగక నామముపై నాధారపడి క్రిందుమీఁదు కారాదు. ప్రతీతిలేని కేవలానుమానజ్ఞానమువలన భీభత్సమగును. ౯ నిశ్చలమగు గగనమందుఁ జంచలమగువాయువు మహోర్భటితోఁ బ్రవహించుచున్నది. కాని యాగగన సమీరములలో భేదమున్నది. ౧౦ అటులె పరబ్రహ్మము నిశ్చలముగ నున్నది. దానియందుఁ జంచలమగుమాయయొక్క భ్రమ భాసించుచున్నది. ఇపు డాభ్రమను వివరించెదను. ౧౧ గగనమునందు వాయువు నడచునట్లు నిశ్చలము (బ్రహ్మము) నందు స్ఫూర్తిలక్షణరూపియగు ఇచ్ఛకు (మాయకు) స్ఫురణరూపముతో జలనము గలుగుచున్నది. ౧౨ బ్రహ్మముయొక్క అహంత్వమువలనఁ జేతనము కలుగుచున్నది. అదియే మూలప్రకృతి యనఁబడుచున్నది. మఱియు దానివలననే ఈబ్రహ్మాండవు మహాకారణకాయము రచింపఁబడెను. ౧౩ స్థూలసూక్ష్మకారణమహాకారణములను నీనాలుగుదేహము లెట్లు పిండమునకుఁగలవో యట్లే విరాట్టు హిరణ్యగర్భము, అవ్యాకృతము, మూలప్రకృతియను నీనాలుగుదేహములు బ్రహ్మాండమునకుఁ గలవు. ౧౪ ఈపంచీకరణము శాస్త్రసమ్మతమైనది. విరాట్ హిరణ్యగర్భా వ్యాకృతమూలమాయలను ఈశ్వరతనుచతుష్టయమని చెప్పెదరు. ఇందువల

ననే చేతనమునకుఁబైన మూలమాయయని చెప్పఁబడెను. ౧౫ పరమాత్ముఁడు పరేశుఁడు, పరమేశ్వరుఁడు, జ్ఞానఘనుఁడు, ఈశ్వరుఁడు, జగదీశుఁడు, జగదాత్ముఁడు, జగదీశ్వరుఁడు మున్నగునవి పురుషనామములు. ౧౬ దానిని సత్తారూపము, జ్ఞానరూపము, ప్రకాశరూపము, జ్యోతిరూపము, కారణరూపము, చిద్రూపము, శుద్ధము, సూక్ష్మము, అలిప్తము అని చెప్పుదురు. ౧౭ కాని ఆత్మ, పరమాత్మ, విశ్వాత్మ, ద్రష్ట, సాక్షి, సర్వాత్మ, క్షేత్రజ్ఞుఁడు, శివాత్మ, జీవాత్మ, దేహి, కూటస్థమనినుడువుదురు. ౧౮ దానిని ఇంద్రాత్మ, బ్రహ్మాత్మ, హరిహరాత్మ, యమాత్మ, ధర్మాత్మ, నైరృత్యాత్మ, వరుణవాయుకుబేరాత్మ, మఱియు ఋషిదేవముని ధర్మాత్మయని చెప్పుదురు. ౧౯ గణగంధర్వవిద్యాధరయక్షకిన్నరనారదతుంబురాదులందఱకు నేదియాత్మయో దానిని సర్వాత్మయందురు. ౨౦ చంద్రుఁడు, సూర్యుఁడు, తారామండలము, భూమండలము, మేఘమండలము, ఇరువదియొక్క స్వర్గములు, సప్తపాతాళములు, మున్నగువాని యన్నింటివ్యాపారము ఆయంతరాత్మయే నడుపుచున్నది. ౨౧ ఆగుప్తవల్లిక నలుదెసల వ్యాప్తినొందియున్నది. దాని పురుషనామముల నిదివరకుఁ జెప్పియుంటిని. ఇఁక శ్రోతలు దానిస్త్రీనామముల నాకర్ణింపనగును. ౨౨ దానిని మూలమాయ, జగదీశ్వరి, పరమవిద్య, పరమేశ్వరి, విశ్వవంద్య, విశ్వేశ్వరి, త్రైలోక్యజనని యని యందురు. ౨౩ దానిని అంతశ్చైతన్యము, అంతర్కళ, మాన్యగర్భముచేతనశక్తి, చపల, జగజ్జ్యోతి, జీవనకళ, పర, పశ్యంతి, మధ్యమయని యందురు. ౨౪ అది యుక్తి, బుద్ధి, మతి, ధారణ, సావధానత, నానావిచారములు భూతభవిష్యద్వర్తమానములు మున్నగువానిని బ్రకటపఱచి చూపుచున్నది. ౨౫ అది జాగ్రత, స్వప్నము, సుషుప్తి, తుర్యము, తటస్థము మొదలగు నవస్థలను, మానావమానములను, అన్నింటిని గ్రహించుచున్నది. ౨౬ అదిపరమకఠినమును, కృపాళువును, నైయున్నది. అది పరమకోమలమును, స్నేహాళువును, నైయున్నది. అటులే యది పరమక్రోధియు మితిలేనిప్రేమతోఁ బ్రేమించునదియు నైయున్నది ౨౭ శాంతి, క్షమ, విరక్తి, భక్తి, అధ్యాత్మవిద్య, సాయుజ్యముక్తి, వివేకము, సహజస్థితి, దానిమూలముననే మనుజులకుఁ బ్రాప్తించుచున్నది.

౨౮ మొదటఁ బురుషనామములను అపిమ్మట స్త్రీనామములు నిరూపించితిని. ఇప్పు డాచంచలమునకుఁగల నపుంసకనామముల నాలింపుఁడు. ౨౯ ఎఱుఁగుట, అంతఃకరణము, చిత్తము, శ్రవణము, మననము, చైతన్యము, జీవితము, వచ్చుట, పోవుట, మున్నగునవి సుశిక్షితుఁడై చూడవలయును ౩౦ దానిని అహంత్వము, త్వంత్వము(నీవు నేనుఅనునవి) ఎఱుక, జ్ఞాతృత్వము, సర్వజ్ఞత్వము, జీవత్వము, శివత్వము, ఈశ్వరత్వము, అలిప్తత్వము, అని చెప్పుదురు ౩౧

ఇట్టినామము లెన్నియో గలవు. కాని యాజగజ్జ్యోతి యున్నదొక్కటియే. ఆసర్వాంతరాత్మను విచారవంతులగువారలే యెఱుంగుదురు ౩౨ ఆత్మ,జగజ్జ్యోతి, సర్వజ్ఞత్వము అనునీమూఁడింటిని నొక్కటియనియే తెలిసికొనవలయును. దానినే అంతఃకరణము లేకజ్ఞప్తియని నిశ్చయపూర్వకముగా నెఱుంగవలయును. ౩౩ పదార్థములయొక్కయుఁ బురుషస్త్రీనపుంసకములయొక్కయు నామములే లెక్కకుమించియున్నవి. ఈస్థితిలో సృష్టిరచననామముల నెంతదనుకఁ జెప్పఁగలను? ౩౪ అన్నిఁటిని నడుపునది యదియొక్కటియే. ఆయంతరాత్మ అనంతబ్రహ్మాండముల వ్యాపారమును నడుపుచున్నది. చీమమొదలుకొని బ్రహ్మ విష్ణు మహేశ్వరులదనుకఁగల సమస్తమును దానిమూలముననే వర్తించుచున్నవి. ౩౫ ఆయంతరాత్మ నిచ్చట నీస్వల్పవివరణమువలననే తెలిసికొనవలయును. నానాప్రకారములగు చిత్తములు (వినోదములు) అన్నియు దానియందేయున్నవి. ౩౬ అది తెలిసికొనఁదగినదేగాని కన్పించునదికాదు. దానివిషయమున నమ్మకము గలుగుచున్నది గాని గోచరించుటలేదు. అది శరీరమునందున్నదిగాని యొక్కతావునఁ గూర్చుండియుండదు ౩౭ అది తీక్ష్ణభావముతో ఆకాశమునందు నిండిపోవుచున్నది. సరోవరమునుగాంచేఁగనే పూర్ణమగుచున్నది. మఱియుఁ బదార్థమునుజూడఁగనే నలుదెసల వ్యాప్తమగుచున్నది. ౩౮ ఏవిధముగఁ బదార్థముగాన్పించుచున్నదో యావిధముగ నదియగుచున్నది. మఱియుఁ జంచలత్వమునందది వాయువునకంటె నధికమైనది ౩౯ అది యనేకదృష్టులతోఁజూచుచున్నది. పెక్కునాలుకలతోఁ జవిజూచుచున్నది. అనేకమనస్సులతోఁ బరికించుచున్నది. ౪౦ చెవిలోఁగూర్చుండిశబ్దము నాలించుచున్నది. ఘ్రాణేంద్రియసహాయమునవాసన మూర్కొనుచున్నది. చర్మముతో శీతోష్ణాదులను గ్రహించుచున్నది ౪౧ ఇట్లే యది యందఱిమనస్సులలోని మాటలను(భావములను)గ్రహించుచున్నది. అది యన్నింటియందున్నది. అన్నింటికి వేఱుగనొక్కటియైయున్నది. దానియగాధలీలల నదియే యెఱుంగును ౪౨ అది పురుషుఁడుకాఁడు. స్త్రీకాదు. బాలకాదు. తరుణకాదు. కుమారికాదు. అది నపుంసకమగుశరీరమును ధారణముచేయుచున్నది. కాని యదినపుంసకము సైతముగాదు ౪౩ అదిసమస్తదేహమును నడుపుచున్నది. చేసియును అకర్త యనిపించుకొనుచున్నది. అది క్షేత్రజ్ఞమును క్షేత్రవాసియు నైయున్నది మఱియు దానిని దేహియనియుఁ గూటస్థునియుఁ గూడ ననుదురు. ౪౪

శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవచ
క్షరఃసర్వాణిభూతానికూటస్థోఽక్షర ఉచ్యతే ॥

జగత్తులో క్షరము అక్షరముఅని రెండువిధములగు పురుషులు గలరు. భూతములన్నింటిని క్షరమనియుఁ గూటస్థుని అక్షరమనియునుఁ జెప్పుదురు ౪౫ ఉత్తమపురుషుఁడింకను వేఱుగనున్నాఁడు. ఆతఁడు నిష్ప్రపంచుఁడును, నిష్కలంకుఁడును, నిరంజనుఁడును, పరమాత్ముఁడును, ఏకమును, నిర్వికారుఁడును నైయున్నాఁడు ౪౬ సాధకులు నాలుగుదేహములను నిరసనముగావించి దేహాతీతులుగావలయును. దేహాతీతుని అనన్యభక్తునిగ నెఱుంగవలయును. ౪౭ దేహమాత్రము నిరసనమైపోయినంతన అంతరాత్మగూడ నెచ్చట శేషింపఁగలదు? నిర్వికారమునందు వికారమునకుఁ దావేలేదు, * ౪౮ నిశ్చలమైన దొకబ్రహ్మమేయనియుఁ, జంచలమెంతగలదో యదియంతయు మాయికమనియు వివేకమువలన నిశ్చయమగు ప్రత్యయము గావింపవలయును. ౪౯ దీనియందు మిక్కిలి తలముసుకలు గొనఁబనిలేదు. ఏలయన! ఉన్నవిరెండే. ఒకటి చంచలము. మరియొకటి నిశ్చలము. ఈరెంటిలో శాశ్వతమెద్ది? యనువిషయము కేవలజ్ఞానముతో నెఱుంగవలయును. ౫౦ అసారమును విడిచి

* ఈపద్యములో (౪౮) అంతరాత్మ యను శబ్దప్రయోగము దేహసంబంధముతో చేయఁబడెనుగావున దేహమే నిరసనమైపోయినప్పుడు ఆనంతర మంతరాత్మ యెక్కడ మిగులును? బ్రహ్మస్వరూపము నిర్వికారము: దానియందు వికారములేదు. అంతరాత్మ యనుశబ్దప్రయోగము దేహోపాధియోగమువలన నైనది. ఆయుపాధిబ్రహ్మమునందు లేదు.

సారమును గ్రహింపవలయునని సారాసారవిచారమునఁ జెప్పఁబడెను. జ్ఞానులు నిరంతరమును నిత్యమెయ్యది, అనిత్యమెయ్యది యనునంశమును విచారింపుచుందురు. ౫౧ జ్ఞానము విజ్ఞానముగను, మనస్సు ఉన్మనముగను నగు ఆత్మయందుఁ జంచలత్వమెక్కడఁ గలుగఁగలదు ? ౫౨ చెప్పుటతో నేమియుఁ బనిలేదు. తనయనుభవమువలననే తత్త్వము నెఱుంగవలయును. అనుభవము లేని వ్యర్థ పరిశ్రమ చేయుటయే పాపము ౫౩ సత్యమునకు సమానమగు సుకృతము లేదు. అసత్యమునకు సమానమగు పాతకము లేదు. మఱియుఁ బ్రతీతిలేని సమాధాన మెచ్చటను లేదు. ౫౪ సత్యమున కర్థము బ్రహ్మము. ఇదియే పుణ్యము. అసత్యమున కర్థము మాయ. ఇదియే పాపము. మాయారూపమగు పాపము నష్టమైనపిమ్మటఁ బుణ్యరూపమగు పరబ్రహ్మము శేషించియుండును. దానియందనన్యమైనంతన తానుగూడ నామాతీతుఁడగును ౫౫ మనము స్వతస్సిద్ధమగు వస్తువు ఐయున్నారము. అచ్చట దేహసంబంధము లేదు. ఇంతజరిగినపిమ్మటఁ బాపరాసులు స్వయముగ భస్మమగును. ౫౬ బ్రహ్మజ్ఞానము దప్ప ఇతరసాధనము లెన్నింటిని గావించినను వ్యర్థపరిశ్రమ యగును. నానాపాపము లెట్లు అడంగిపోఁగలవు? ౫౭ ఈశరీరము పాపముతో (దృశ్యము లేక మాయతో) నిర్మింపఁబడినది. మఱియు ముందు పైకము (మాయను సత్యమని విశ్వసించుకతన) పాపములే ప్రోవగుచున్నవి. లోపల రోగమున్నపుడు పయిపయి యుపచారమువలననేమి యగును? ౫౮ అనేకక్షేత్రములలోఁ దలలు గొరిగించుకొనుచున్నారము. అనేక తీర్థములలో దేహమునకు దండనము లొసంగుచున్నారము. స్థలస్థలముననానావిధములగు విగ్రహములతో దేహమును ఖండించుచున్నారము. బహువిధములగు మృత్తికలతో నీదేహమును గసగస తోముచున్నారము. తప్తముగావింపఁబడిన ముద్రలతో నీదేహమునిండ వాతలను వేయుచున్నారము. ఈ విధముగాఁ బైపైని దేహమున కన్నిశ్రమలుకలుగఁజేసినను గొంచెమేని శుద్ధినొందగలదా ౫౯, ౬౦ ఎన్నిపేడముద్దలను మ్రింగినను, గోమూత్రధార యెంతగ్రోలినను, రుద్రాక్షలు, కాష్ఠమణిమాలలు మెడలో నెన్నిధరించినను బాహ్యడంబరములీవిధముగా నెన్నియొనరించినను లోపలఁ బాపమునిండి

యున్నచో దానిని దూరపఱచుట కాత్మజ్ఞానమే కావలయును ౬౧, ౬౨ బహువిధములగు వ్రతదానయోగతీర్థాటనాదు లన్నింటికంటె ఆత్మజ్ఞానమహిమ కోటి రెట్లధికము. ౬౪ ఆత్మజ్ఞానమునుగూర్చి యోచించు పురుషుని పుణ్యమునకు మేరయే లేదు. దుష్టమగు పాపబాధ లట్టిపురుషుని నంటఁజాలవు. ౬౫ వేదశాస్త్రములయందుఁ జెప్పఁబడిన సత్యస్వరూపమే (ఆత్మవిచారులగు) జ్ఞానులకుఁ గూడ గలరూపము. అట్టివారల అనుపమపుణ్యాత్ములనియు, మేరలేనిసుకృతులనియు నెఱుంగనగును ౬౬ ఇవి యనుభవవాక్యములు. ఆత్మదృష్టితో జను లనుభవము గడింపవలయును. అనుభవముతో భిన్నులైకష్టాత్ములు కాఁజనదు. ౬౭ ఓ యనుభవనీయులారా! అనుభవము లేనిదంతయు శోకము. కావున మీరలు రఘునాథునికృపవలన నిశ్చయాత్మికమగు అనుభవము గలవారలై యుండుఁడు ౬౮

పదునొకండవ దశకము.

ప్రథమసమాసము.

సిద్ధాంతనిరూపణము.

ఆకాశమునుండి వాయువు జనించినవిధము మనకుఁ దెలియుచునే యున్నది. వాయువునుండి యగ్నియెట్లుత్పత్తియయ్యెనో శ్రోతలు సావధానులరై యాలింపఁగోరెదను. ౧ వాయువువలని కఠినమగు రాపిడివలన అగ్నియును, శీతలమును మందమునునగు వాయువువలన ఉదకమును ఉత్పన్నము లగుచున్నవి. ౨ ఉదకమువలన నానావిధబీజరూపమగు నీపృథ్వి కలుగుచున్నది. బీజములనుండి యుత్పత్తికలుగుట స్వాభావికమే కదా ౩ ఆదినుండియే సృష్టికల్పనామయము. కల్పనముమూలమాయకుఁ జెందినది. అట్లే దానివలననే (త్రిగుణాత్మికమగు) ముమూర్తు లుదయించిరి ౪ నిశ్చలము (పరబ్రహ్మము) నందున్న చంచలము (మూలమాయ) కేవలము కల్పనమే. అదియే అష్టవిధప్రకృతికి మూలము ౫ అనఁగా

కల్పనమే అష్టధాప్రకృతి. అష్టధాప్రకృతియే కల్పనము. అష్టధాప్రకృతి మూలమాయనుండి ఉత్పన్నమయ్యెను. ౬ పంచభూతములు త్రిగుణములు గలసి యెనిమిదియయ్యెను. ఇందువలననే దీనిని అష్టధాప్రకృతియని యందురు. ౭ అష్టధాప్రకృతి ఆదియందు కల్పనరూపముతో నుండును. తరువాత నదియే విస్తృతమై సృష్టిరూపమునందు స్థూలత్వమునొందుచున్నది. ౮ మూలమునందున్నదే మూలమాయ. దానివలనఁ ద్రిగుణములను గలిగించినది గుణమాయ. దానివలన సృష్టిరూపమునకుఁ గలిగెడి స్థూలత్వమే అవిద్యామాయ ౯ దానివలననే మఱల (జరాయుజములు, ఉద్భిజ్జములు, అండజములు, స్వేదజములు అను) నాలుగు (సృష్టి) గనులును [పరాపశ్యంతిమధ్యమావైఖరులను] నాలుగు వాణులును, అనేకయోనులును, అనంతవ్యక్తులును, ప్రకటనములై విస్తృతములగుచున్నవి ౧౦

ఈవిధముగా నుత్పత్తి యగుచున్నది. సంహారక్రమమునంతయు వెనుకటిదశకమునఁ జెప్పితినిగదా ౧౧ ఐనను మఱల నిచట సంక్షేపరూపముగాఁ జెప్పెదను. ధ్యానమునొసంగి యాలింపుడు ౧౨ శాస్త్రములందుఁ గల్పాంతవర్ణన మీవిధముగానున్నది. "నూఱుసంవత్సరములు వర్షములు కురియవు. అందుచే సమస్తజీవసృష్టియు నశించును ౧౩ పండ్రెండుకళలతో సూర్యుఁడు లోకమును మాడ్చివేయును. దానిచే భూమండలమంతయు బూడిదయైపోవును. తరువాత నాబూడిదయంతయు నీటిలోఁ గరగిపోవును ౧౪ అనంతర మాజలమునుగూడ అగ్ని శోషింపఁజేయును. అగ్నిని వాయువు హరించును. తరువాత తనంతన వాయువుగూడ నదృశ్యమగును. నిరాకార మెచ్చటిదచ్చటనే యుండిపోవును ౧౫ ఈవిధముగా సృష్టి సంహారమగును." ఈసంహారక్రమమునంతయు నింతకుమున్ను విస్తారముగ వివరించితిని. మాయయంతయు నీవిధముగా నిరసనమైనపిమ్మట నిరాకారస్వరూపస్థితి శేషించును ౧౬ అపుడచట జీవశివులు, పిండబ్రహ్మాండములు మొదలగువానినిగూర్చిన వితర్కములు నశించును. మఱియు నవిద్యామాయవలని సంపూర్ణకోలాహలమంతయు నాశనమైపోవును. ౧౭

ఈప్రళయమును వివేకముతోఁగూడఁ జేయవచ్చును. దానిని వివేక

ప్రళయమందురు. వివేకవంతులే వివేకప్రళయము నెఱుంగుదురు. పామరు మూర్ఖులేమిఎఱుంగుదురు? ౧౮ సృష్టినంతను బరిశోధనముగావించిన పిదప ఒకటి చంచలమనియు నొకటి నిశ్చలమనియు విదితమగును. చంచలమునకుఁ గర్త చంచలరూపముగనే యుండును. ౧౯ సకలశరీరములందు వర్తించునదియు, అన్నికర్తృత్వములయందుఁ బ్రవృత్తమగునదియు, చేసియు అకర్తయనబడునదియు ౨౦ దరిద్రుఁడు మొదలుకొని రాజుపఱకును బ్రహ్మవిష్ణుమహేశ్వరాదిదేవులదనుకను అన్నింటియందును సమానముగవర్తించునదియు, ఇంద్రియములతోడ్పాటుతో శరీరములవ్యాపారములు నడుపునదియుఁ బరమాత్మయని లోకులు చెప్పుచున్నారు. పరమాత్మను సర్వకర్తయని భావించుచున్నారు. ఆపరమాత్మకుసైతము నాశనము కలుగుచున్నది. వివేకముతో దీనిని ప్రతీతి గావింపవలయును. ౨౧, ౨౨ పరమాత్మ కుక్కయందుండి మొఱుగుచున్నది. సూకరము నందుండి ఘుర్ఘురమనుచున్నది. గాడిదయందుండి బిగ్గరగా నోండ్రపెట్టుచున్నది. ౨౩ సాధారణజనుల ధ్యానము కేవలముగ నానావిధశరీరములపై మాత్రమేయుండును. వివేకవంతులు ఈశరీరములలోపలివస్తువునుఁ జూతురు. అనఁగా నిట్టి పండితులు సమదర్శులుగా నుందురు. ౨౪

శ్లో॥ విద్యావినయసంపన్నే । బ్రాహ్మణే గవిహస్తిని।
శునిచైవశ్వపాకేచ । పండితాః సమదర్శినః॥

పైపైనిజూచుటకు దేహములు వేఱువేఱుగా నున్నను అన్నింటిలోపల నున్నది యొక్కవస్తువేయని తలఁచి సమదర్శులగు వివేకులు ప్రాణిమాత్రులనెల్ల సమానభావముతోఁ జూచుచుందురు. ౨౫ చూచుటకుఁ బ్రాణిసముదాయము అనంతప్రాణులుగాఁ గనిపించుచున్నను సత్యమున కివి యన్నియు నొక్క శక్తి వలననే వర్తించుచున్నవి. ఆశక్తి జగజ్జ్యోతి లేక సంజ్ఞాశక్తియైయున్నది. ౨౬ ఈజ్యోతి (శక్తి) చెవియందుండి బహువిధములుగ శబ్దజ్ఞానమును కలిగించుచున్నది. త్వక్కునందుండి శీతోష్ణముల నెఱుంగఁ దోడ్పడుచున్నది. కనులయందుండి వస్తుసముదాయమును జూచు జ్ఞానమును గలుగఁజేయుచున్నది. ౨౭ అటులే నాలుకయందుండి రుచిని, ఘ్రాణమునందుండి గంధమును, కర్మేంద్రియమునందుండి నానావిధ విషయ సౌఖ్యములను గ్రహించుచు

న్నది. ౨౮ ఈవిధముగాఁ బరమాత్మ సూక్ష్మరూపముతో అంతరమునం దుండి స్థూలమును రక్షించుచున్నది. అంతియగాక నానావిధసుఖ దుఃఖములను దెలిసికొనుచున్నది. కావుననే దానిని అంతస్సాక్షియనియు, అంతరాత్మయనియుఁగూడఁ బిలుచు చున్నారు ౨౯ దానినే ఆత్మ, అంతరాత్మ, విశ్వాత్మ, చైతన్యము, సర్వాత్మ, సూక్ష్మాత్మ, జీవాత్మ, శివాత్మ, పరమాత్మ, ద్రష్ట, సాక్షి, సత్తారూపి యందురు ౩౦ ఈ వికారియే (అంతరాత్మయే) వికారము (దృశ్యసృష్టి) నందుండి అఖండరీతిగా నానావిధ వికారములను గావించుచుండును. దీనినే మూర్ఖులు పరబ్రహ్మమని నుడువుదురు. ౩౧ అన్నింటిని (చంచలమును నిశ్చలమును) సమానముగా భావించుట అంతయును మిశ్రితముగావించుట యను నీమాయికస్థితికి అచంచలమగు అవిద్యామాయమాత్రమె కారణమైయున్నది. ౩౨ కాని వాస్తవములోఁ జంచలము, మిథ్యయునగు మాయ వేఱుగా నున్నది. అచలమును శాశ్వతమునగు పరబ్రహ్మము వేఱుగా నున్నది. దాని నెఱుంగుటకొఱకే నిత్యానిత్యవివేకముయొక్క ఆవశ్యకము గలుగుచున్నది. ౩౩ అట్లే బ్రహ్మముతో నైక్యమునొందినజీవుఁడు బ్రహ్మాంశము. అట్టి జీవునిపట్ల పిండబ్రహ్మాండములు రెండును నిరసన మగుచున్నవి. ఇవియే చతుర్జీవులు. ౩౪

కనుపించునదియెల్లఁ జంచలము. చంచలమంతయు నశ్వరము. నిశ్చలమంతయు ఆద్యంతములయందుఁగూడ నిశ్చలమే ౩౫ ఆవస్తువు (బ్రహ్మము) ఆదిమధ్యాంతములయందు సమానముగా నుండునది. మఱియు నది నిర్వికారియు, నిర్గుణియు, నిరంజనమును, నిస్సంగమును, నిష్ప్రపంచమునై యున్నది. ౩౬ ఉపాధినిరసనమైనపిదప జీవశివుల కైక్యత గల్గిపోవును కాని విచారించిచూచితిమేని ఉపాధియనున దేమియును లేదు. ౩౭ తెలిసికొనఁదగినది జ్ఞానము. కాని పరబ్రహ్మమునందు అనన్యమైపోయినపిమ్మట ఈజ్ఞానము విజ్ఞానమైపోవును. మనస్సు ఉన్మనమైపోవును. ఆయున్మనీయదశను మనస్సుతో నెట్లుగు ర్తింపఁగలము ? ౩౮ వృత్తికి నివృత్తిస్థితి దెలియదు. గుణమునకు నిర్గుణప్రాప్తి యెట్లుకాఁగలదు? సాధకుఁడు వివేకముతో గుణాతీతుఁడై సత్స్వరూపమును బడయును. ౪౦ శ్రవణముకంటె మననము శ్రేష్ఠమైనది. ఏలయన? మననమువలన సారాసారము విదిత

మగును. ఆపిమ్మట నిదిధ్యాసమువలన నిస్సంగమగు వస్తువు సాక్షాత్కారమగును. ౪౧ నిర్గుణమునం దనన్యతగలుగుటయే సాయుజ్యముక్తి. అచట (సాయుజ్యముక్తియందు) లక్ష్యాంశవాచ్యాంశములు రెండును సమాప్తి యగుచున్నవి. ౪౨ అలక్ష్యమునందు లక్ష్యము లీనమగును. సిద్ధాంతమునందుఁ బూర్వపక్షము లయమగును. మఱియు అప్రత్యక్షము (దృశ్యము) ఉండియును గూడ లేకుండును. ౪౩ అనఁగా మాయికమగు నుపాధి యుండఁగనే స్వరూపాకారవృత్తియగుట సహజసమాధి యందురు. శ్రవణమువలన నిశ్చయబుద్ధిని బొందింపవలయును. ౪౪

రెండవ సమాసము.

సృష్టిక్రమము.

ఒకటి నిశ్చలమైనది. ఒకటి చంచలమైనది. చంచలమునం దెల్లరును జిక్కియున్నారు. నిశ్చలము యథావిధముగ నిశ్చలముగనే యున్నది. ౧ నిశ్చలమును వివేకించువాఁడు లక్షలకొలఁదిమనుజులలో నొక్కఁడుండును. నిశ్చలముతో సమానమగు నిశ్చయాత్మకుఁడె నిశ్చలుఁడు. ౨ నిశ్చలమునకు సంబంధించినమాటలను జెప్పుచుఁ జంచలమువైపునకె పరుగెత్తుచుండువారలు పలువురు గలరు. చంచలచక్రమునుండి విడివడి పోవువారలు మిగుల నరుదుగా నున్నారు. ౩ చంచలమునందుఁ జంచలము జనించుచున్నది. చంచలమునందె పెరుగుచున్నది. బ్రతికినంతకాలమును జంచలమే ప్రతిబింబించును. ౪ పృథ్వియంతయుఁ జంచలమువైపునకె పోవుచున్నది. చేయవలసినదంతయుఁ బెట్టవలసినదంతయుఁ జంచలమునందె జరుగుచున్నది. చంచలమునువిడిచి నిశ్చలమువైపునకు మొగ్గెడివాఁ డెవఁడు ? ౫ చంచలమేమాత్రమును నిశ్చలము కాఁజాలదు. నిశ్చలమెప్పుడును జంచలము కాఁజాలదు. ఈవిషయము నిత్యానిత్యవిచారణమువలన జనులకుఁ గొంతకొంత బోధయగును. ౬ కొంచెముగఁ దెలిసికొనుటవలన నిశ్చయము గాదు. మఱియు సందేహ మట్టులే నిలిచియుండును. ౭ కాని సంశయము, అనుమానము, భ్రమ మున్నగువానివలనఁ గలుగు ఆపత్తు చంచలమునందుమాత్రమే యుండును. నిశ్చ

లయమునం దెప్పుడు నుండదు. దీనిమర్మమును గ్రహింపవలయును. ౮ చంచలాకార మంతయు మాయ. మాయికమగున దంతయు లయము గును. ఇట్లు లయమగునవి చిన్నవి పెద్దవియని చెప్పవలసిన యావశ్యకము లేదు. ౯ సమస్తమునందును మాయ వ్యాపించియున్నది. అష్టధా ప్రకృతి విస్తృతమైయున్నది. మఱియు నానావిధరూపములతోఁ జిత్రవిచిత్ర వికారములు కనుపించుచున్నవి. ౧౦ నానావిధములగు నుత్పత్తివికారములు, పలుతెఱంగులనున్న చిన్నపెద్దప్రాణులు, నానావిధపదార్థములు మున్నగునవియెల్ల మాయయొక్క క్రీడలు. ౧౧ వికారవంతమగు నీమాయ వికృతియై సూక్ష్మమునుండి స్థూల మగుచున్నది. మఱియు నమర్యాదితరీతిగ నొకటికి వేఱొకటియై కాన్పించుచున్నది. ౧౨

మఱల నానావిధములగు శరీరములు నిర్మింపఁబడుచున్నవి. అనంతనామములు పెట్టఁబడుచున్నవి. భిన్నభిన్నభాషల ననుసరించి యందుఁ గొన్నికొన్ని తెలియుచుండును (౧౩) తరువాత నానావిధములగు వాడుకలు, రీతులు, జనరూఢులు ప్రచలితము లగును. నానావిధములగు నాచారము లేర్పడును. వాని ననుసరించి జనులందఱును బ్రవర్తింతురు. (౧౪) అష్టధా ప్రకృతికిఁ బెద్దవియుఁ జిన్నవియునగు శరీరములు నిర్మాణమగుచుండును. పిమ్మట ప్రజలు తమతమమనస్సుననుసరించి వర్తించుచుందురు (౧౫) నానామతములు నిర్మాణమగును. అనేకవిధములగు పాషండమతములు వ్యాపించును. బహువిధములగు కోలాహలములు చెలరేగును ౧౬ జనరూఢి ననుసరించి ప్రజలు ప్రవర్తింతురు. ఎవఁ డెవని నాటంకపఱుపఁ గలఁడు? జనులలో నేకత్వము లేకున్నది ౧౭ భూమండలమునందంతటను గల్లోలము వ్యాపించియున్నది. ఒకనికంటె నొకఁడు పెద్దయైయున్నాఁడు. ఎవనిది సత్యమో యెవనిది అసత్యమో యెవ్వఁడెఱుంగును! ౧౮ దురాచారములు విశేషించి వ్యాపించియున్నవి. ఎందఱెందఱో ఉదరపోషణమునఁ దన్మయులై చనిపోవుచున్నారు. ఎందఱెందఱో అభిమానగ్రస్తులై యాడంబరములకుఁ బాలగుచున్నారు. ౧౯ దేవతలగణితములైనవి. ఆదేవతల యార్భాటములు మిగుల విజృంభించియున్నవి. దేవతలు, భూతములు గావించుమోసములుగూడ మిక్కుటమైనవి ౨౦ ముఖ్యదైవతము నెఱుంగుటలేదు. ఒకనికి మఱి

యొకనితో నైక్యము కుదురుటలేదు. ఒకని కింకొకఁడు లొంగియుండుట లేదు. ఎవరికివారుగ నందఱును స్వచ్ఛందు లగుచున్నారు ౨౧ విచారమంతయు నీవిధముగ నష్టమైనది. సారాసారవిచారము గావించువాఁడే లేఁడు ఎక్కడిపెద్ద! ఎక్కడిచిన్న! ఏమాత్రముగోచరించుటయే లేదు ౨౨ శాస్త్రముల విక్రయవీథి సాగినది. దేవతలగోల యెక్కువయైనది. జనులు సకామ్యవ్రతములయెడ నాసక్తి గలవారలై ప్రాణముల విడుచుచున్నారు. ౨౩ ఈవిధముగా సత్యధర్మమంతయు నాశనమగుచున్నది. సత్యాసత్యముల జాడపోడలే కనిపించుటలేదు. నలుదెసల పరస్పరవిరుద్ధవర్తనము లతిశయించుచున్నవి. ౨౪ మతమతాంతరుల కలహములు పెచ్చుపెరుగుచున్నవి. ఒకనిని మరియొకఁ డఱుగనే యడుగఁడు. ఎవ్వఁ డేమతమునందుఁ బడిపోయిన వానికదియే సర్వోత్తమమైనదిగఁ దోఁచుచున్నది ౨౫ అసత్యము నభిమానించుజనులు పతన మొందుచున్నారు. ఇందువలననే జ్ఞాతలగువారలు సత్యమును శోధించుచున్నారు. ౨౬ జనుల ప్రవర్తనమంతయు జ్ఞాతలగువారికిఁ గరతలామలకముగ నున్నది. కావున వివేకులగు జనులారా! వినుఁడు. ౨౭ జను లేమార్గమునఁ నడచుచున్నారలో ఏదేవతను భజించుచున్నారో తెలిపెదను. ప్రత్యక్షానుభవమగు నీయంశమును సావధానులరై వినుండు ౨౮

మన్ను, రాయి, ఇతరధాతువులు సమకూర్చి చేసిన విగ్రహములను దేవతలని నమ్మి పలువురు వానినే పూజించుచున్నారు. ౨౯ కొందఱు దేవతల యవతారకథల నాలకించుచున్నారు. అంతేకాక యవతారములనుగూర్చి ధ్యానము, జపము, పూజ గావించుచున్నారు. ౩౦ కొందఱు అందఱి యంతరాత్మను విశ్వమునందు వర్తించు విశ్వాత్మను ద్రష్టను జ్ఞానాత్మను (సాక్షిని) విశ్వసించుచున్నారు. ౩౧ కొందఱు నిర్మలులుగ, నిశ్చలులుగ నున్నారు. ఎప్పుడును జంచలత్వ మొందుటయే లేదు. మఱియు ననన్యభావముతో స్వయముగఁ గొందఱు కేవలవస్తురూప మగుచున్నారు. ౩౨ ఈ సృష్టియందు నాలుగువిధముల దేవతలున్నవి. మొదటిది నానావిధప్రతిమలు. రెండవది అవతారములు. మూఁడవది అంతరాత్మ. నాలుగవది నిర్వికారము. ఈ నాలుగింటియందు దక్క నితరమునందు జనులకు భావము లేదు. ౩౩, ౩౪ కొందఱు వస్తు

నొక్కటియేయని నమ్ముచున్నారు. అంతియేగాక పరమేశ్వరుని సాక్షియని చెప్పుచున్నారు. పరమేశ్వరుని సాక్షియగుటకుఁ బ్రధానకారణమగు అష్టధాప్రకృతినిగూడఁ గుర్తెఱుంగవలయును. ౩౫ ప్రకృతికి సాక్షియగు పరమేశ్వరుఁడు ఆప్రకృతిస్వభావమే! కాని భావాతీతుఁడగు నా పరబ్రహ్మమును వివేకముతో నెఱుంగవలయును. ౩౬ నిర్మలమును ధ్యానించువాఁడు నిర్మలుఁడే యగును. ఇంతయేల! ఎవఁడెద్దానిని భజించునో వాఁ డాభావమునందే లీనమగును. ౩౭ నీటిని పాలను వేఱువేఱు గావించునవి రాజహంసలు, అట్లే సారమును అసారము నెఱింగినవారలు మహానుభావులు. ౩౮ ఓరీ! చంచలమును (మాయను) ధ్యానించువాఁడు స్వాభావికముగనే నాశనమగును. నిశ్చలమును (బ్రహ్మమును) భజియించువాఁడు నిశ్చలుఁడుగనే యుండును. ౩౯ ప్రకృతిననుసరించి వర్తింపవలయును. కాని అంతఃకరణమునందు శాశ్వతమును గుర్తెఱుంగవలయును. మఱియు సత్త్వస్వరూపులై సాధారణజనులవలెఁ బ్రవర్తింపవలయును. ౪౦

మూఁడవ సమాసము.

సాంసారికోపదేశము.

మనుష్యశరీరము బహుజన్మము లెత్తిన మీఁదట లభించును గావున దీనిని బడసినందులకు నీతిని, న్యాయమును విడువక సత్యముగఁ బ్రవర్తింపవలయును. ౧ ప్రపంచమును (సాంసారికకార్యములను) నియమపూర్వకముగ నిర్వహింపవలయును. దీనివలన ఇహపరములు రెంటియందును సౌఖ్యముగలుగును. ౨ మానవుని ఆయువునకు నియతి నూఱు వత్సరములు. అందు బాల్యావస్థ అజ్ఞానముతోడను, యౌవనావస్థ సంపూర్ణవిషయసుఖములతోడను గడచి పోవుచున్నది. ౩ వృద్ధావస్థయందు నానారోగములను, కర్మభోగములను ననుభవింపవలసి యుండును. ఇఁక భగవంతునిభజన మెప్పుడు గావింపనగును? ౪ రాజకీయములు, దైవికోద్వేగములు నగు చింతలయందో అన్నవస్త్రశరీరరక్షణములయందో ఇట్టివియు నింకనితరములునగు నిర్బంధములయందో దగులొ్కని యున్న సమయమునం దాకస్మికముగా మృత్యువే తెంచును. ౫ జనులు మరణించుచుందురు. ఇది ప్రత్యక్షమేగదా! పలువురు పేరొందిన

వారలు గతించిరి. ఇది మన మెఱింగిన యంశము. నీ విదియంతయుఁ గాంచి నిశ్చయముగ నేమిగావింపగలిగితివి? ౬ ఇంటియందుఁ జిచ్చు దగులొ్కని యున్నది. గృహయజమాని సావకాశముగా నిదురపోవుచున్నాఁడు. ఇట్టి యాత్మహంతకు నెవఁడేని మంచివాఁడనియనునా? ౭ పుణ్యమార్గమంతయు వ్యర్థమైనది. పాపసంగ్రహము మితిమీఱినది. యమయాతన మిగుల దుస్సహమైనది. ౮ కావున నిఁక నిట్లువర్తింపఁదగదు. మిగులఁ గనిపెట్టి నడువవలయును. ఇహపరములను రెంటిని సాధింపవలయును. ౯ అలసత (సోమరితనము) యొక్క ఫలము ప్రత్యక్షముగఁ గనిపించుచున్నది. ఆవలింతతో నిదురవచ్చుచున్నది. సోమరిపోతు లానిదురనే సుఖమనితలంచి యుప్పొంగుచున్నారు. ౧౦ ఉద్యోగము గావించుటవలన కష్టము గలుగును. కాని ముందు సౌఖ్యము లభించును. యత్నము గావించుటచే దినుట, త్రాగుట మున్నగుసకలసౌఖ్యములు సమకూరును. అలసతవలన ఉదాసీనత్వము, దరిద్రము కలుగును. ప్రయత్నము నిష్ఫలమగును. దౌర్భాగ్య మావరించుకొనును. ౧౧ కావున సోమరితనము లేకుండుటవలననే వైభవములు లభించుచున్నవి. అంతియగాక ఇహలోకపరలోకములలోఁగూడ మనుజులకు సమాధానము కలుగును. ౧౨

ఇపుడు చేయఁదగినప్రయత్నమేదియో తెలుపుదును. సావధానులరై వినుండు ౧౩ ఉషఃకాలమున లేచి కొన్నియుత్తమవచనములను వల్లింపవలయును. యథాశక్తిగఁ బరమాత్మని స్మరింపవలయును. ౧౪ అనంతరము దానేకాంతప్రదేశమునకు మలవిసర్జనమున కేగవలయును. మఱియు నిర్మలమగుజలముతో శౌచాచమనములను జేయవలయును, ౧౫ ముఖమార్జనమును ప్రాతఃకాలస్నానమును సంధ్యాతర్పణదేవతార్చనములను నొనరించి అగ్నిపూజనము, ఉపాసనము సాంగోపాంగముగా నొనర్పవలయును. ౧౬ పిదపఁ గొంచెము జలముద్రావి గృహకార్యములు నిర్వర్తింపవలయును. మధురభాషణములతో నెల్లరను దనకిష్టులుగాఁ జేసికొనవలయును. ౧౭ తనవ్యాపారములలో జాగ్రత్తగల్గి యుండవలయును. దుశ్చిత్తుఁడుగనున్నచో దుష్టులు మోసగింతురు. ౧౮ దుశ్చిత్తతవలనను సోమరితనమువలనను మనుజుఁడు పొరఁబడుననియు మోసగింపఁబడుననియు, మఱచిపోవుననియు హితమునువిడుచుననియు జ్ఞాపకమువచ్చినపుడు

తడబడునని యు మన మెఱింగియే యున్నారము ౨౦ కావున మనస్సును సావధానముగను ఏకాగ్రతగను నుంచవలయును. అట్లు సావధానముగ నేకాగ్రతగ నుంచినపుడె తినుట, త్రాగుట మంచిదిగ స్ఫురించును. ౨౧ భోజనాంతర మేదేని కొంచెము చదువవలయును. చర్చింపవలయును, లేదా యేకాంతముననుండి నానావిధగ్రంథములను మననముగావింపవల యును. ౨౨ ఇటుల నొనరించుటవలననే మానవుఁడు సేర్పరియగును. ఇటులఁజేయకున్న మూర్ఖుఁడుగ మారును. ఇట్టి మూర్ఖులున్నంతలోఁ దిని దీనరూపులై వ్యర్థముగా సంచరించుచుఁ బ్రొద్దుగడుపుదురు. ౨౩ భాగ్య వంతునిలక్షణములను నిఁక నాలకింపుఁడు. భాగ్యయుతులు దమజీవిత మున నొకక్షణమేని నిరర్థకముగాఁ గడుపరు. తమసంసారవ్యాపారము లను మిగులనేరుపుగ నెరవేర్చుచుందురు. ౨౪ భాగ్యయుతుఁడు మొదట కొంతసంపాదించి నిలువఁజేసికొని యవసరమువెంట నుపయోగించుకొను ను. దిగబడినజనుల నుద్ధరించును. తన దేహము నేదేని సత్కార్యముల యందు మగ్న మొనర్చును. ౨౫ కొంతధర్మచర్చ, పురాణము, హరికథ, అధ్యాత్మనిరూపణము మున్నగు సత్కార్యములు భాగ్యయుతుఁ డొన రించుచుండును. అంతియగాక ప్రపంచపరమార్థములను రెంటి నొకక్షణ ముగూడ వ్యర్థముగఁ బోనీయఁడు. ౨౬ అన్నివిధముల నీప్రకారముగ నున్న సావధానికి దుఃఖ మెట్లుకలుగఁగలదు? వానియభిమానము వివేక ములవలన నశించును. ౨౭ ఉన్నదంతయు నీశ్వరునిదేయని తెలిసికొని వర్తింపనగును. ఈవిధముగ మెలంగుటవలన ఉద్వేగము సమూలముగా నాశనమగును. ౨౮ ప్రపంచమునందు ధనమెట్లవసరమో యటులె పర మార్థమునందుఁ బంచీకరణము గావలయును. దీనితరువాత మహావాక్య ముల వివరణ మొనరించుటవలన మోక్షము గలుగును ౨౯ కర్మము, ఉపాసనము, జ్ఞానములవలన సమాధానము కలుగును. కావునఁ బరమార్థ సాధనములను శ్రవణము గావింపవలయును. ౩౦

నాలుగవ సమాసము.

స ద్వి చా ర ము.

బ్రహ్మము నిరాకారము. అది యాకాశమువలె నున్నది. దాని

యందు వికారము లేదు. అది నిర్వికారము ౧ బ్రహ్మము నిశ్చలము. అంతరాత్మ చంచలమైనది. ద్రష్టయనియు సాక్షియనియు నంతరాత్మనే చెప్పుదురు ౨ అంతరాత్మ నీశ్వరుఁడని చెప్పవలయును. దానిస్వభావము చంచలము. అది సమస్తజీవులలో నుండి పరిపాలించుచున్నది. ౩ అది లేని పదార్థము జడము. దేహము వ్యర్థమైనది. అంతరాత్మవలననే పర మార్థము మొదలగునవి తెలియుచున్నవి. ౪ కర్మమార్గము, ఉపాసన మార్గము, జ్ఞానమార్గము, సిద్ధాంతమార్గము, ప్రవృత్తిమార్గము, నివృత్తిమార్గముల నీశ్వరుఁడె నడుపుచున్నాఁడు. చంచ లము (అంతరాత్మ) లేనిది నిశ్చలము (బ్రహ్మము) తెలియఁబడదు. చంచ లము స్థిరముగా నుండదు. ఇట్టివిచారముల నెన్నింటినో బాగుగా గమ నించి చూడవలయును ౬ చంచలము (అంతరాత్మ) నిశ్చలము (పరబ్ర హ్మము)లసంధి (మాయ)లో బుద్ధి తిరుగుడువడును. కర్మమార్గము మొద లగునవి యాసంధికి (మాయకు)దరువాత ప్రకటనమైనవి ౭ వాని కన్నింటికిని మూల మీశ్వరుఁడు (అంతరాత్మ) కాని యీశ్వరునకు మూ లము లేదు. పరబ్రహ్మము నిశ్చలమును నిర్వికారమును నైయున్నది. ౮ నిర్వికారము వికారము నొక్కటియేయని చెప్పువాఁడు మూర్ఖుఁడు. అట్టి మూర్ఖునివలనఁ జూచుచుండఁగనే విచారము నష్టమగును. ౯ సమస్తపర మార్థములకును మూలము పంచీకరణమును మహావాక్యవిచారమును నైయున్నది. దానినే మాటిమాటికి మననము గావింపవలెను ౧౦ స్థూల దేహము మొదటిది. మూలమాయాదేహ మెనిమిదవది. ఈ మెనిమిది దేహములును నిరసనమై పోయినపిమ్మట వికార మింక నెచ్చటనుండఁ గలదు? ౧౧ వాస్తవమునకు ఈ వికారవంతమగు మాయ గారడివిద్య వలె సత్యమువలెఁ గాన్పించును. దీనియథార్థ మొకానొకఁడుమాత్రమె తెలిసికొనును. ఒకఁడు సత్యమని విశ్వసించును ౧౨ నిర్వికారము ఉత్పత్తి, స్థితి, సంహారములకంటె భిన్నముగానున్నది. దీని నెఱుంగుటకే సారాసారవివేకము పేర్కొనఁబడెను. ౧౩ సారాసారములు రెండును నొకటిగావింపఁబడినపుడు వివేక మిఁక నచట నెక్కడనుండును? తెలిసికొనఁజాలనివారలు (బుద్ధిహీనులు) పరీక్షించుటయెఱుంగరు. ౧౪ అన్నింటియందు నేదివ్యాపించియున్నదో

నైన మిక్కుటముగ సంబంధ ముంచుకొనరాదు ౮ ప్రయత్నమును విరివిగ నొనర్పవలయును. కాని ప్రయత్నోపాధిలోఁ దగుల్కొనరాదు. నీచతను మూర్ఖతను దొలఁతనుండియుఁ దనతలపై నుంచుకొనవలయును. ౯ ఇతరుల దోషములను దాఁచవలయును. ఎవరిదుర్గుణములనేని నిరంతరముగ వివరింపఁజనదు. దుర్జనులను దన పిడికిటిలోనికిఁ దెచ్చుకొని వారలకు మేలొనరించి విడిచివేయవలయును. ౧౦ ఏవిషయములోనైనను మొండిపట్టుదల తగదు. నానావిధములగు నుపాయములను శోధించి వెలికిఁ దీయవలయును. ఏ కార్యమేని కాకున్నచో దీర్ఘయత్నమొనరించి దాసిని నెరవేర్పవలయును ౧౧ జనసముదాయమును జీలిపోవనీయఁగూడదు. ఏవేని సంకటములు కలిగినచో నేర్పుగా వానిని సవరింపవలెను. ఎవరితోడనేని మిగుల వాదోపవాదము లొనరింపరాదు ౧౨ ఇతరుల కోర్కెల నెఱిఁగి బహుజనాభిప్రాయమును బాటింపనగును. ఒకవేళ బహుజనాభిప్రాయమును బాటింపరాని పరిస్థితు లేర్పడినచో ఆతావున నుండనేకూడదు ౧౩ ఇతరులదుఃఖము నెఱింగి తొలంగింప యత్నింపవలయును. అట్లె జనసముదాయపు మంచితనము, చెడ్డతనము గూడ సహించుటకు సిద్ధముగా నుండవలయును. ౧౪ గద్యమయములు, పద్యమయములు నగు విషయముల నెన్నియేని జ్ఞాపక ముంచుకొనవలయును. ఆలోచనమును విడువఁజనదు. సర్వావస్థలందును నిరంతరమును బరోపకారమునఁ దత్పరతగలిగి యుండవలయును. తనహృదయమున శాంతిని నెలకొల్పి ఇతరులయందుశాంతిమును స్థాపింపవలయును. తాను మొండిపట్టు విడిచి యితరుల మొండిపట్టు వదలింపవలయును. అంతియగాక తొలుతఁ దాను స్వయముగఁ గార్యమునొనరించి యితరులచే నట్టి కార్యములను జేయింపవలయును ౧౫ ఒకవేళ నెవరిపట్లనేని అపాయము (విఘ్నము) చేయవలసియున్నచో నావిషయము తొలుతనే తెలుపఁగూడదు. ఇంకను వేఱువేఱుగ వానికి విఘ్నానుభవమును గలుగఁజేయవలయును ౧౬ బహుజనాభిప్రాయమును సహింపకున్నచో బహుజనము తనతోఁ గలియదు. కాని బహుజనుల భావములను సహించుటవలనఁగూడఁ దనమహత్త్వముండదు. * ౧౭ రాజనైతికయుక్తుల విశేషించి యొనరింపవలయును. అన్నింటిని రహస్యముగా నుంచవలయును. ఇతరులకుఁ గష్టము గలిగింపవలయుననుతలంపు హృదయమునం దుంచరాదు ౧౮ జనులను బరీక్షించి (స్వభావములను) గనుఁగొనవలయును. రాజనైతికయుక్తులతో వారలయభిమానమును తొలంగింపవలయును అట్లె యేదేని సూత్రాంతరముతో వారలను మఱలఁ గలుపుకొనవలయును ౧౯ నిలుకడలేని మనుజుని దూరముగా నుంచవలయును. దుష్టవృత్తిగలవారితో మాటలాడరాదు. ఒకవేళ సంబంధము తటస్థించిచోఁ దప్పించుకొని తొలఁగిపోవలయును ౨౦ ఈవిధముగ రాజనైతికయుక్తులను జెప్పఁబూనినచో నెన్నియేని కలవు. స్థిరచిత్తము గలిగియున్నచో రాజనైతికయుక్తులు చక్కఁగ విశదమగును. ౨౧ భయపడువానికి ధైర్యము కలిగింపవలయును. త్రెలయొత్తెడివానిని హుంకరింపవలయును. ఇట్టి రాజనైతికయుక్తు లెన్నియో గలవు. వాని నన్నింటి నిచట వివరింపఁజాలను ౨౨ రాజనైతికవిముఁడు శోధించినచోఁ బట్టువడఁడు. తనకీర్తి నలుదెసల నావరింప నంగీకరించును. సంపత్తివైభవములు వానికడకుఁ దమంతన వచ్చును. కాని వానినాతఁడు గైకొనఁడు ౨౩ ఒకనికి సహాయము గావించుటయు నొకానొకనికిసహాయముగావింపనిచ్చగింపకుండుటయుఁ జాతుర్యలక్షణముగాదు. (అందఱిపట్లను మనస్సుంచవలయును) ౨౪ న్యాయమగుమాట లంగీకరింపక హితమగు యోచనలకు హృదయమునందుఁ జావొసంగకయుండు మానవుని బరిత్యజించుటతప్ప గత్యంతరము లేదు. ౨౫ శ్రోతలహృదయము ననుసరించి యీయంశము జెప్పితిని. న్యూనాధిక్యములకు క్షమింపఁగోరెదను. ౨౬

ఆఱవసమాసము.

మహంతు (సాధు) లక్షణము.

శుద్ధముగను సుందరముగను జదువవలయును. వ్రాసి శుద్ధముగ సంస్కరింపవలయును. అనంతరము శుద్ధముగా జదువవలయును. చదివినది

---

* బహుజనాభిప్రాయమును సహించుటవలనఁ బలువురు ... శక్యమే! సహనశీలము నెక్కువగాఁ జూపించుటవలనఁగూడ ... మహత్త్వము తగ్గనేమొయను భయముగలుగును. ... విధమున వర్తింపవలయును.

మఱువఁగూడదు (౧) చెడిపోయినవర్ణములను సవరింపవలయును. విషయములను దృఢపూర్వకముగా హృదయమునం దుంచుకొని కథలను సరసముగా వర్ణింపవలయును ౨ ఎఱిఁగినయంశ మితరులకుఁ దెలుపఁబనిలేదు. చెప్పఁదగినమాటను గొద్దిలోఁ జెప్పవలయును. గొద్దిలోఁ జెప్పుమాటలు శ్రోతలకు నిశ్చయాత్మికములు కాఁజాలవు. తెలిసికొననియెడల శ్రోతల నుండి యేమాటయు వెలువడదు ౩ సాధుపురుషుఁడు హరికథ, అధ్యాత్మనిరూపణము. నిశ్చయాత్మికములగు రాజనైతికయుక్తులు వ్యావహారిక జ్ఞానము మున్నగు నంశము లెఱింగియుండవలయును. ౪ సాధుపురుషుఁడు అడుగుటయుఁ జెప్పుటయు నెఱింగియుండవలయును. బహువిధముల అర్థసమన్వయముతో నితరులకుఁ జెప్పగల్గి యుండవలయును. ఇంతియగాక అందఱను సమాధానపఱుప నేర్చియుండవలయును. ౫ తాను జాడనెఱుంగఁదలఁచినయంశమును తొలుత నెఱింగియుండవలయును. సావధానముగఁ బూర్వపక్షము గావింపఁబడని తెఱంగున విషయమును దర్శింపఁగలిగి యుండవలయును. ఎఱుక నెఱింగి యథాయోగ్యముగ నేర్పుగలిగి యుండవలయును. ౬ ఈవిధముగా సర్వము నెఱింగిన వాఁడు బుద్ధిమంతుఁడగుమహాంతు (సాధువు) ఇందులకు వ్యతిరేకులగు మానవులు సాధారణులు. ౭ సాధుపురుషునకుఁ దాళజ్ఞానము, తానమానములు, ప్రబంధము, కవిత్వము, సుభాషితశ్లోకములు మున్నగుసభాచాతుర్యములగు ననేకాంశములు తెలిసియుండును ౮ అతఁడేకాంతవిచారమునందు తత్పరుఁడై యుండును. బహువిధములగు గద్యపద్యమయవిషయములను గంఠస్థము గావించియుండును. మఱియు నేదేని దుర్భేదములగు గ్రంథములందలి మార్మికార్థములను వెదకుచుండును. ౯ ఇట్లు తొలుత దాను నేర్చి ఇతరులకు నేర్పుచుండువాడు మహాంతుపదవి కర్హుఁడగును. మహాంతుపురుషుఁడు తనవివేకము నుపయోగించి పడిపోయినవారల నుద్ధరించును. ౧౦ ఆతని లేఖనము, పఠనము, వక్తృత్వము, ప్రవర్తనము మున్నగునవి మనోహరముగా నుండును. భక్తిజ్ఞానవైరాగ్యములయందు మహాం[illegible]ముగ నుండును. ౧౧ ప్రయత్నకార్య మాతనికి సంతోష[illegible] నానావిధ ప్రస[illegible]ములయం దాతఁడుపాల్గొనును. సాహసముతో ముందంజవేయును. వెన్ను [illegible] గిన్నఁడు వేయఁడు ౧౨ మహాంతు సంకటములోదవినవుడు తప్పించుకొనగల్గును. ఉపాధియందుఁ గలియుట నెఱుంగును. అంతియగాక యుపాధి కంటియంటకయుండుటఁగూడ నెఱిఁగియుండును ౧౩ ఆతఁడంతటను వర్తించుచుండునుగాని వెదకిచూచినచో నెచటను లభింపఁడు. అంతరాత్మవలె నాతఁ డన్నికడల నుండియు గుప్తముగ మెలఁగును. ౧౪ అంతరాత్మలేని ప్రాణియే లేదు. కాని చూచినచో నాయంతరాత్మ గోచరింపదు. గోచరింపకుండియుఁ బ్రాణిమాత్రులవ్యాపారములను అంతరాత్మ నడుపుచున్నది. ౧౫ ఇట్లే మహాంతుగూడ నానావిధయత్నములతో జనసముదాయమును జతురుల నొనరించుచుండును. పెద్దవారియందును చిన్నవారలయందును మహాంతు బహువిధములగు విద్యాప్రచారము లొనరించును. ౧౬ స్వప్రయత్నమువలన దక్షుఁడైన మానవుఁడు స్వాభావికముగనే ప్రయత్నశీలుఁడుగా నుండును. ఇదియే సత్యమగుమహాంతులక్షణము ౧౭ మహాంతు న్యాయమును నీతిని రక్షింపఁగల్గియుండును. ఆతఁడన్యాయము నెన్నఁడును జేయఁడు. ఇతరులచేఁ జేయింపఁడు. కఠినపరిస్థితులలో నుపాయము నెఱిఁగియుండును. పూర్వోక్తమగు నిట్టిధారణాశక్తిగలపురుషుఁడె సర్వజనుల కాధారుఁడై యుండును. ఇట్టి మహాంతుల గుణగణము అనుసరణీయమని శ్రోతలకు రామదాసస్వామి చెప్పుచున్నాడు. ౧౮

ఏడవసమాసము.

మాయారూపియగు చంచలనది.

చంచలము (మాయ) గుప్తమగు గంగానది దీని వివరణమువలన లోకము పావనమగును. ఈయంశమును శ్రోతలారా! మీరలు ప్రత్యక్షముగాఁ బ్రతీతి గావించుకొనుఁడు. ఇందు మిథ్య యావంతయేని లేదు. ౧ ఇది యచలమునుండి (నదిపర్వతమునుండి కలిగినట్లు మాయ యచల పరబ్రహ్మమునుండి) నిర్మాణమగుచున్నది. మరియు నదివేగముగా దిగువవైపునకుఁ బ్రవహించుచున్నది. ఇది యఖండముగాఁ బ్రవహించుచున్నను దీనిని నెవరును జూడఁజాలకున్నారు. ౨ దీనిలో నందందు వంపులు, వంకరలు, సుడిగుండములు, నురువు, తెప్పలు, తరంగములు, ఉబ్బలలు, అలలు, ఖురద, అగాధమగు[illegible] మున్నగునవి కలవు. ౩

ఉత్తమగుణము లెన్నిగలవో వానినన్నింటిని గ్రహింపవలెను. పిమ్మట నితరుల కాగుణములనే నేర్పవలెను. మిగుల గొప్ప జనసముదాయమును బ్రోవుచేయవలెను. ౧౮ కాని గుప్తరూపముతో నాజనసముదాయమును ఉచితకార్యమునం దఖండరీతిగ నన్వయింపఁజేయవలయును. సంపూర్ణ సంసారమును (ప్రపంచమును) ఉపాసనయందు లగ్నపఱుపవలెను. ఈతఁడు సత్యముగు నిస్పృహగల మహాంతుగ నున్నాఁడని లోకులు తెలిసికొన్నఁగాని యాజ్ఞాపాలనము గావింపరు. ౧౯ తొలుదొలుత కష్టమును సహించినఁగాని ఫలము లభింపదు. కష్టము లేదేని ఫలమేయుండదు: ప్రయత్నము లేకున్నచో సర్వము వ్యర్థమగును. ౨౦ జనులను వెదకి వెదకి వేలకొలఁదిగ తనచేతిలోనికిఁ దీసికొనవలెను. వారి వారి యోగ్యత నెఱుంగవలెను. అనంతర మాప్రజలను వారివారి యోగ్యతలను విచారించి యొకానొకనిని సమీపమునందును. ఒకానొకనిని దూరమునందును నుంచవలెను. ౨౧ యోగ్యతననుసరించి కార్యములు జరుగుచుండును. యోగ్యతయే లేనప్పుడామనుజుఁడేవని కుపకరించును? మహాంతు అంతఃమనస్సులను జక్కఁగాఁ బరీక్షింపవలెను, ౨౨ ఎదుటివాని యోగ్యతను గమనించి పని చెప్పుచుండవలెను. కార్యశక్తినిగాంచి యెదుటివానియెడ విశ్వాసముంచవలెను. అట్లే తనవిచారము నింకొకటిగనే యుంచవలెను. ౨౩ ఇది యనుభవముతోఁ జెప్పెడుమాట. ఇపుడు చెప్పినదన్నియు మొదట నాచేఁ జేయఁబడినవి. తరువాతఁ జెప్పఁబడినవి. యుక్తముగనున్నచోఁ బ్రజలొకవేళ గ్రహించిన గ్రహింతురుగాక. * ౨౪ మహాంతు ఇంక ననేకమహాంతులను నుత్పత్తిగావించుట విధి. ఆమహాంతులను యుక్తులతోడను సద్బుద్ధులతోడను నుండునట్లుదిద్ది జ్ఞాతలఁజేసి అనేక దేశములలో వ్యాపింపఁజేయవలెను. ౨౫

---

* ఈసమాసము మిగుల మహత్త్వముగలది. ఇందుఁజెప్పఁబడిన యంశములన్నియు అనుభవపూర్ణములు. ఈవిషయముల నన్నింటి మొట్టమొదటఁ దానొనరించి తరువాత నేర్పుచున్నాఁడనని శ్రీరామదాసస్వామివారు నుడువుచున్నారు. ఇందు సందేహింపఁదగినది లేదు. ఈసమాసము రామదాసస్వామి యాత్మచరిత్రయని భావింపనగును.

పండ్రెండవ దశకము.

మొదటిసమాసము.

విమలలక్షణము

తొలుదొలుతఁ బ్రపంచమును (గృహస్థాశ్రమధర్మమును) జక్కఁగ నాచరింపవలెను. పిమ్మట పారమార్థికవిచారము గావింపవలెను. వివేకవంతులారా! ఇందు సోమరులై వర్తింపఁదగదు. ౧ ఒకవేళ ప్రపంచమును (గృహస్థాశ్రమమును) విడిచి పరమార్థమును గావింతువేని దానివలన నీవు బాధనొందుదువు. ప్రపంచ పరమార్థములను రెంటిని గాపాడగలిగినపుడే నీవు వివేకివని యనిపించుకొందువు. ౨ ఎవఁడేని యొకవేళఁ బ్రపంచమును విడిచి పరమార్థకృత్యము గావించుచో వానికి మొదటఁ దినుటకు అన్నమే దొరుకదు. ఇంక నా యభాగ్యుఁడు గడించిన పరమార్థపుఁ జేరే యెత్తవలసిన పనియుండదు, ౩ ఇట్లే యెవఁడేని పరమార్థమును విడిచి ప్రపంచబంధమునఁ దగులొన్నచో వాఁడుగూడ యమయాతనల ననుభవింపఁగలఁడు. అందుచే నంత్యమునందుఁ బరమకష్టములకుఁ బాలగును ౪ ఎవఁడేని తనయజమానునికొలువున కేగక యింటియందు సుఖముగాఁ గూర్చుండియున్నచో నాతనిని యజమానుఁడు దండించును. జనులు వినోదము చూచుచుందురు. ఇది యెల్లరు నెఱింగినయంశము. ౫ ఆదశయందు వానిమహత్త్వమే పోవును. ఆతఁడు దుర్జనులచేఁ బరిహాసము గావింపఁబడును. అంతియగాక స్వయముగాఁగూడఁ గష్టముల ననుభవించును. ౬ ఈస్థితియే చివరకుఁ గలుగఁబోవునది. కావున భగవంతునిభజనము గావింపవలయును. పరమార్థమును బ్రత్యక్షముగా ననుభవము గావించుకొనవలయును. ౭ సంసారమునందుండియు దానినుండి ముక్తుఁడై (అంటియుంటకుండ) వర్తించువానిని నిజమగు భక్తునిగ నెఱుంగవలయును. అతఁ డఖండరీతిగ యుక్తాయుక్తములను విచారణముగావించుచుండును. ౮ ప్రపంచమునందు (గృహస్థాశ్రమమున) సావధానిగ నుండువాఁడు పరమార్థము నొనరింపఁగలడు. గృహస్థాశ్రమమును సవరించుకొనఁజాలనివాఁడు పరమార్థము నేమిచేయొనర్పఁగలడు ? ౯ కావున మానవుఁడు సావధానత

ఈనదియందు గుప్తజలము ప్రవహించుచున్నది. ధారయున్నది. ప్రతాపము ధ్వని యున్నది. చంచలముగ జల మెగురుచు జలజలమని పరుగెత్తుచున్నది. ౪ ఫేనము లేచుచున్నది. తుంపురులు మింటికెగురుచున్నవి. నీరు స్వచ్ఛందముగాఁ బరుగులెత్తుచున్నది. చినుకులను, తుంపురులను, అణువులను, రేణువులను ఎంతదనుక లెక్కింపశక్యమగును? ౫ బురద నీటిలోఁ జెత్తయుఁ జెదారము గలసి ప్రవహించుచు వచ్చుచున్నది. ఎత్తునుండి జలము పడుచున్నది. గండశిలలు, చిన్నరాళ్ళు, కంకర, బండలు, మధ్య నాటంకపరచుటచే నందందు సుడిగుండము లేర్పడుచున్నవి. ౬ మెత్తని పృథ్వియంతయుఁ బ్రవాహపురాపిడిచేఁ దెగిపోయినది. కఠోరభాగము లట్లే నిలిచియున్నవి. ఈస్థితి స్పష్టముగ నన్ని తావులందును గనుపించుచున్నది. ౭ కొందరీ ప్రవాహమునందుఁ గొట్టుకొనిపోవుచున్నారు. కొందఱు సుడిగుండములలోఁ దట్టుకొని పడియున్నారు. కొందరు తలక్రిందై కందకములోఁ దట్టుకొనుచున్నారు. ౮ కొందఱు పడుచు లేచుచు వెళ్ళిపోవుచున్నారు. కొందఱు నలిగి నలిగి చనిపోవుచున్నారు. కొందఱు నీరు కడుపునిండఁ గ్రోలుటకతన ఉబ్బిపోయిరి. ౯ బలశాలు రిది ఉద్గమము (బ్రహ్మము) దనుకఁ జేరుచున్నారు. మఱియు నుద్గమదర్శనముకతన స్వయముగాఁ బవిత్రులై తీర్థస్వరూపులగుచున్నారు. ౧౦ ఉద్గమమునందు బ్రహ్మమొదలగు దేవతల భవనములు గలవు. బ్రహ్మాండదేవతల స్థానములు గలవు. గంగకు దిగువనుండి యీదుకొనిపోవు వారలందఱు నాయుద్గమస్థానమునందుఁ గలిసికొందురు. ౧౧ ఈ జలమునకు సమమగు నిర్మలపదార్థ మింక నేదియు లేదు. దీనికి సమానమగు చంచలపదార్థము గూడ వేరొకటిలేదు. దీనిని కేవలము "ఆపోనారాయణ" యని చెప్పుదురు. ౧౨ ఆనది మిగుల గొప్పది. కాని గుప్తముగా నున్నది. సర్వకాలము ప్రత్యక్షముగఁ బ్రవహించుచున్నది. ఇంకను జూడుఁడు. ఆనది స్వర్గమర్త్యపాతాళలోకములయందుఁ గూడ వ్యాపించియున్నది. ౧౩ క్రిందను మీఁదను దశదిశలను ఆనదీజల మావరించియున్నది. జ్ఞాత లానదిని జగదీశునకు సమానముగా నెంచుచున్నారు. ౧౪ పాత్రరూపములుగ నున్న మనుజులందఱు మాయానదీజలముతో నిండియున్నారు. కొందఱు కొందఱి లోనిజలము (సాధువులకువలె) కారిపోవుచున్నది. కొందఱు కొందఱు తమజలమును (బద్ధమనుజులవలె) వ్యయపఱచుచున్నారు. ౧౫ ఒకానొకని కాజలము చేదగుచున్నది. ఒకానొకనికిఁ దీయగను, వేరొకనికి పులుపుగను ఇంకొకనికి ఉప్పగను జప్పగను బరిణమించుచున్నది, ౧౬ జల మేయేపదార్థములతోఁ గలియు నప్పుడాయారూపము నొందుచున్నది. లోతగు పృథ్వీతలమున నాజలము లోతుగఁ బ్రవేశించుచున్నది ౧౭ అది విషముతోఁ గలసి విషముగను అమృతములోఁ గలసి అమృతముగను సుగంధములోఁ గలసి సుగంధముగను దుర్గంధములోఁ గలసి దుర్గంధముగను మాఱుచున్నది. ౧౮ అది గుణావగుణములలోఁ గలియుచున్నది. ఇంతయేల! అది దేనితోఁ గలియుచున్నదో యావస్తురూపము నొందుచున్నది. జ్ఞానములేని దాయుదక మహిమ తెలియనేరదు ౧౯ అపరిమితమగుజలము ప్రవహించుచున్నది. ఆజలము నదినుండి ప్రవహించుచున్నదో బుగ్గనుండి ప్రవహించుచున్నదో యెఱుంగ శక్యముగాదు. ఎందఱో జనులు జలవాస మొనరించుచున్నారు. (ఆమాయలోనే మునిఁగియున్నారు) ౨౦ ఉద్గమమున కావలి యొడ్డు నకరగినపిమ్మట వెనుకకుఁ దిరిగిచూచినచో నాయుదకమే సమాప్తమగును. ఏమియునుండదు.*

౨౧ యోగీశ్వరులు వృత్తిశూన్యులుగనుందురు, ఈవిషయమును కూర్చి సాధకులు విచారింపవలయును. మాటిమాటికెంతదనుకఁ జెప్పుదునని రామదాసు నుడువుచున్నాఁడు. ౨౨

ఎనిమిదవ సమాసము

అంతరాత్మ నిరూపణము

ప్రప్రథమున సకలకర్తయగు నీశ్వరునకు నమస్కరించెదను. అతఁడు దేవతలందఱకును స్వామి. ఓసోదరా! యెవరైననుసరియే. ఈశ్వరభజ

---

* మాయారూపమగునది యందు ఉద్గమము వైపున కీదుకొనిపోయి మాయ యొక్క ఉద్గమమగు పరబ్రహ్మ స్వరూపమునొంది వెనుకకు మఱలిచూచినచో ఇంతవఱకున్న ఈదిదాటిననది లేనేలేదని విదితమగును. అప్పటున మాయమిథ్యయని వారలకుఁ దెలియును. అనంతరము నదియనునది లేనేలేదని ఎఱుకపడును. (అనఁగా వారలు వృత్తిశూన్యులై పోవుదురని భావము)

నమునందుఁ బ్రవృత్తులుకావలయును ౧ ఈశ్వరుడె లేకున్నచో నే పనియు జరుగఁజాలదు. ఆతఁడులేనిది ఆకుగూడఁ గదలనేరదు. త్రిలోక వ్యాపార మాతనివలననే నడచుచున్నది ౨ కర్తయగు నాభగవానుఁ డం దఱకు నంతరాత్ముఁడు. దేవదానవమానవజాతులకును నాలుగుగనులకు నాలుగువాణులకును నాతఁడే ప్రవర్తకుఁడు ౩ అన్నిఘటములలో భిన్నరూ పుఁడై యాతఁడొక్కఁడే వ్యవహరించుచున్నాఁడు. సమస్తసృష్టినిగూర్చిన యీవిషయ మెంతదనుకఁ దెలుపగలను ? ౪ ఈవిధముగ గుప్తముగ నున్నవానినే యీశ్వరుఁడని చెప్పవలయును, అందఱునుఆతనిమూలముననే గొప్పగొప్ప యైశ్వర్యముల ననుభవించుచున్నారు ౫ ఆయీశ్వరునిగాం చువారలు విశ్వంభరులె యగుదురు. అట్టివారలముందు సమాధిని సహజ స్థితిని నెవఁడుప్రశ్నించును. ? ౬ త్రిలోకవివరణము నొనరించిన పిదపఁ ముఖ్యమగుమర్మము సిద్ధించును. ఆపరమనిధానము సిద్ధించినపిదప జేయ వలసినపరిశ్రమయేదియు లేదు. (౭) వాస్తవములో నెవఁ డంతరాత్మను వివరణముగావించి చూడఁగలఁడు? ఎవనినేని చూడుము. కొద్దిగనో గొప్పగనో తెలిసికొని తనసమాధానముతోఁ దానే తృప్తిపడును. (౮) ఓసోదరా! ఈచూచినదానినే మరలమరలఁ జూడవలయును. వివరణము గావింపఁబడినదానిని మరలమరల వివరణ మొనరింపవలయును. ఇంతియ గాక చదివినదానిని పలుమారుచదువవలయును (౯) అంతరాత్మ ఎంత పెద్దది? ఎట్టిది? దానిని విచారించువాని స్థితి యెట్లుండును? మున్నగు ననేకవిషయములలో పాటుపడివినినవానికిఁ గనినవానికి వివేక ము గోచరించును. ౧౦ ఎన్నియేని వినియు, నెన్నియేనియాలించియు గడిం వివేకము అంతరాత్మనెఱుంగుటకుఁ జాలదు. క్షుద్రదేహధారియగు జీవుఁడు (ఆసర్వవ్యాపియగు నంతరాత్మను) ఏమియెఱుంగఁగలఁడు ? ౧౧ ఆపూర్ణమును (అంతరాత్మను) ఈయపూర్ణుఁడు (జీవుఁడు) ఏల తెలిసికొ నఁజాలఁడో తెలియునా ? ఏలయన ! ఇతఁడు (జీవుఁడు) అంతరాత్మ నఖం డరీతిగ వివరణమొనర్పఁడు. ఒకవేళ నఖండరీతిగ వివరణమునుగావించి నచో నప్పుడితఁ డద్దానినుండి వేఱుగ మిగులఁడు. (ఈతఁడుకూడ నదియే యైపోవును.) ౧౨ విభక్తుఁడై యుండనివాఁడే (అనన్యుఁడై యుండువాఁడె) భక్తుఁ డనఁదగియుండును. అట్లుగానిచో వ్యర్థపటాటోపమును గావించి

పాటుపడుటయే యగును. ౧౩ సాధారణముగ మనుజులు ఏదేనిగృహ మును దృష్టియందుంచుకొని నడచివత్తురు. కాని యాగృహయజమానిని దెలిసికొనఁ దలంపఁడు. బాటసారులు రాజ్యమునుండి ప్రయాణము చేయుచుందురు. ఆరాజ్యమునేలు రాజెవ్వరో గ్రహింపరు. ౧౪ అట్లే దేహము నాధారముగఁ జేసికొని మనుజులు విషయసుఖములను అనుభవిం చుచున్నారు. అంతియగాక దేహసంయోగమున సౌఖ్యములనొందు చున్నారు. కాని దేహమును ధారణచేయుచున్న అంతరాత్మను మఱచి యున్నారు. ఇది మిగులనాశ్చర్యకరమగు సంశయము. ౧౫ జను లీవిధ ముగాఁ బ్రత్యక్షముగ నవివేకులయ్యు మేమువివేకులమని చెప్పుచు న్నారు. ఓయన్నలారా ! మీయోగ్యతానుసారముగ వర్తింపుఁడు, ౧౬ అజ్ఞాను లేదేని మనస్సునందు నిలుపుట యెఱుంగరు. కాననే జ్ఞానుల యొక్కయవసరము కలుగుచున్నది. కాని జ్ఞానులే మూర్ఖులైయున్నారు. గదా ! ౧౭ తాను ప్రాతిపెట్టినధనమును మఱచి యిటునటు వేసారి తిరుగువానివలె నజ్ఞానియగుజీవుఁడుసైతము ఈశ్వరునిఁ దనయొద్దనుంచు కొనియు నన్నికడల వెదకుచుఁ దిరుగుచున్నాఁడు ౧౮ ఈయంతరా త్మను ధ్యానింపఁగలవాఁ డీసృష్టియం దెవఁడున్నాఁడు ? వృత్తి యేక దేశీయముగా నుండునుగదా ! అట్టియెడ నది యీసర్వవ్యాపి నెటుల నాకలనము గావించుకొనఁగలదు ! ౧౯ బ్రహ్మాండమునం దనంతరూప ములతో ననంతవిధములగు ప్రాణులు నిండియున్నవి. చిట్టచివరకుఁ భూగర్భమునందును బాషాణములయందునుగూడ నెన్నియో ప్రాణులు నిండియున్నవి. ౨౦ అన్నిప్రాణులయందును సర్వవ్యాపియగు భగవానుఁ డొకఁడె వర్తించుచున్నాఁడు. ఆతఁ డొకచోట గుప్తముగను నొకచోట ప్రకటితముగను నున్నాఁడు. ౨౧ కాని చంచలమెన్నఁటికిని నిశ్చలము కాఁజాలదు. ఇది యనుభవనీయమగుసంశయము. చంచలముగాని దేది గలదో అదియే నిశ్చలపరబ్రహ్మము. ౨౨ ఈశరీరమునందలి తత్త్వము లన్నియు నొకదానివెంటనొకటి తొలంగినంతన దానితోఁబాటు దేహాభి మానముగూడ నెగిరిపోవును. అపుడు నలుమొగములందును నిర్మలనిశ్చల నిరంజనమే శేషించియుండును. ౨౩ మనమెవ్వరము ? ఎందున్నారము ? ఎక్కడివారము ? అను సంశయములనుగూర్చి యోచించుటయే వివేక

మార్గము. కాని స్వయముగా నీయంశము అపరిపూర్ణముగనున్న ప్రాణికిఁ దెలియఁబడదు. ౨౪ కావున ఉత్తముఁడు వివేకమును గడింపవలెను. వివేకమూలమున దుస్తరసంసారము తరింపవలెను. ఇట్లే హరిభక్తిగలవాఁడై తనవంశమునంతయు నుద్ధరింపవలయును. ౨౫

తొమ్మిదవ సమాసము.

జ్ఞానోపదేశము.

తొలుదొలుత మానవుఁడు విధిపూర్వకములగు కర్మము లొనరింపవలయును. అందే దేని కొఱంత వాటిల్లినయెడల దోషము కలుగును ౧ కావునఁ గర్మారంభము తొలుతఁ జేయుట కర్తవ్యము. ఎంతదనుక కర్మ సరిగ ననుకూలించునో యంతదనుక మంచిదె. ఒకవేళ నంతరాయము తటస్థించినయెడల హరిస్మరణము గావింపవలెను ౨ (రిక్తగ స్మరణముమాత్రమే చేయఁగూడదు) ఇంకను ఆహరి యెట్టివాఁడు? అను విచారమునుగూడఁ జేయవలెను. సంధ్యావార్చుటకు ముందా జగదీశ్వరుని యిరువదినాలుగు నామములను స్మరణము జేయవలయును ౩ ఆ చతుర్వింశతి నామములు, సహస్రనామములు, అనంతనామములు అనామము గల పరాత్పరుఁ డెట్టివాడను నంశము నంతఃకరణమునందు గుర్తెఱుంగవలయును. ౪ బ్రాహ్మణుఁడు స్నానసంధ్య లొనరించి దేవతార్చనము నారంభించును. అట్లే విధిపూర్వకముగఁ బ్రతిమాపూజనము జేయును. అనేక దేవతామూర్తులను జనులు ప్రేమపూర్వకముగాఁ బూజించుచున్నారు. కాని యావిగ్రహము లెవనివి? ఆపరమాత్మ యెట్టివాఁడు? అనుదానినిగూడ గుఱుతింపవలయునుగదా! ౫ గురుతెలిసి భజింపవలయును. అధికారిని గుఱుతెఱింగి వందనము జేయునట్లు పరమాత్ముఁడగు పరమేశ్వరుని జక్కఁగ గుర్తెఱింగి నమస్కరింపవలయును. అప్పుడే యీ భవసాగరమునకుఁ దీరము లభించును. ౬, ౭ అవతారపురుషులు నిజధామమున కేగుచున్నారు. కాని వారిమూర్తుల కొనరించు పూజయంతయు నంతరాత్మకే చెందును ౯ ఐనను ఆయవతారపురుషులుగూడ నిజరూపముతో నుందురు. ఆనిజరూపము జగజ్జ్యోతియే. ఇదియే సత్త్వగుణము. దీనినే చేతనాశక్తి యనియెదరు ౧౦

ఆశక్తి యుదరమునందుఁ గోటులకొలఁదిగ దేవత లుందురు. ఈయనుభవ విషయములను బ్రత్యయముచే నెఱుంగవలయును. ౧౧ దేహరూపకమగు నగరమునందు నివసించియుండు ఈశ్వరుని బురుషుఁడని చెప్పుదురు. సంపూర్ణజగత్తునందు వ్యాపించియుండువానిని జగదీశుఁ డందురు. ౧౨ సంపూర్ణ ప్రపంచములోని శరీరముల నన్నింటిని చేతనమె నడుపుచున్నది. ఆచేతనమునే అంతఃకరణ విష్ణువని యెఱుంగవలయును. ౧౩ ఆవిష్ణువు సంపూర్ణజగత్తుయొక్క అంతఃకరణమునం దున్నాఁడు. మఱియు మనయంతఃకరణమునందుఁగూడ నాతఁడే యున్నాఁడు. చతురపురుషులాయంతరాత్మనే కర్తగను భోక్తగను ఎఱుంగవలయును ౧౪ ఆతఁడే ఆలకించుచుఁ జూచుచు వాసనజూచుచు భుజించుచు నున్నాఁడు. బుద్ధితో విచారించి సమస్తమును నాతఁడే గుర్తించుచున్నాఁడు. తనది పరులదియనుదాని నాతఁడె గ్రహించుచున్నాఁడు. ౧౫ నిశ్చయముగా సంపూర్ణజగత్తున కంతరాత్మ యాతఁడొకఁడె కాని శారీరక మోహము మధ్య వచ్చిపడినది. శరీరసంయోగమువలన నతఁడు భిన్నుఁడై యభిమానధారణము గావించుచున్నాఁడు ౧౬ అతఁడు పుట్టుచుఁ బెరుగుచుఁ, జంపుచుఁ, జచ్చుచు నున్నాఁడు. సముద్రయోగమునఁ దరంగములపైఁ దరంగములు లేచుచుఁ బోవునట్లు ఈయంతరాత్మ సంయోగమునఁ ద్రిలోకములు కలుగుచు నశించుచు నున్నవి. ౧౭ ఈ మూఁడులోకములను నడిపెడివాఁడొక్కఁడే. కాననే యాతనిని త్రిలోకనాయకుఁ డందురు. ఈయనుభవనీయాంశమును బ్రత్యక్షముగాఁ జూచుకొనవలయును ౧౮

అంతరాత్మస్వరూప మిట్టిది. కాని దీనికిఁగూడఁ దత్త్వముల యందే గణనయున్నది. దీనితరువాత మహావాక్యవిచారము గావింపవలయును. ౧౯ తొలుత దన దేహములోనియంతరాత్మను జూడవలయును. తరువాత దానినే సంపూర్ణజగత్తునందు వ్యాపకమై యున్నదానినిగ నెఱుంగవలయును. ఆవల పరబ్రహ్మమునుగూర్చి విచారము కలుగును. ౨౦ పరబ్రహ్మమును విచారించుటచే సారాసారనిర్ణయము సిద్ధించును. ఇఁకఁ జంచలము నాశమగుట నిశ్చయమేగదా! ౨౧

నిరంజనమగువస్తువు ఉత్పత్తి, స్థితి, సంహారముల కావలనున్నది

అచట జ్ఞానము విజ్ఞానమైపోవును ౨౨ అష్టదేహములు, నామరూప ములు మున్నగునవి వివేకముచే నాశనమైనపిమ్మట నిరంజనమగు విమలబ్రహ్మము ప్రాపించును ౨౩ విచారమువలననే అనన్యుఁడు గావలయును. చూచెడివాఁడును ద్రష్టృత్వము లేకయే యనుభవము రావలయును. కాని (ప్రత్యయము) వచ్చుటగూడ వృత్తియే. ఈవృత్తికిఁగూడ నివృత్తి కావలయును. చక్కఁగ యోచింపుఁడు ౨౪ చాలును. ఇంతతో వాచ్యాంశము వదలిపోవుచున్నది. లక్ష్యాంశముగూడ వివేకముతోఁ జూచినచో విడువఁబడును, అట్లే లక్ష్యాంశమువెంటనే వృత్తిభావన గూడ వెడలిపోవును ౨౫

పదియవ సమాసము.

నిస్పృహుని వర్తనము

మూర్ఖుఁడు ఏకదేశీయుఁడుగ (సంకుచితవిచారయుక్తుఁడుగ) నుండును. చతురుఁడన్ననో అంతరాత్మ సర్వవ్యాపకమై యెల్లు నానాసుఖముల భోగించుచున్నదో యట్లుండి సర్వమును దిలకించుచుండును ౧ మహంతుగూడ నాయంతరాత్మయే. అతఁడు సంకుచితవిచారవంతుఁ డెట్లుకాఁగలఁడు? మహంతు (సాధుపురుషుఁడు) వ్యాపకుఁడును, సర్వజ్ఞుఁడును, విఖ్యాతయోగియు నైయున్నాఁడు ౨ వాస్తవమునకుఁ గర్తయు భోక్తయు నాతఁడె. భూమండలమునఁగల శక్తియంతయు నాతనిదె. దానినెఱుంగఁదగుజ్ఞాత మహంతుదక్కనింక నెవఁడున్నాఁడు? ౩ మహంతు ఇట్టివాఁడై యుండవలయును. ఆతఁడు సారమునంతయువెదకి కైకొనవలయును. ఒకవేళయెవరేని శోధించినచో తటాలున నాతఁడు పిడికిలిలోనికి రాఁగూడదు ౪ నిస్పృహుఁడగుమహంతు నిశ్చయముగాఁ గీర్తిరూపముతో లోకమునందు మిగులఁ గీర్తినొందును. చివరకుఁ బిన్నపెద్దలందఱు నాతని నెఱుంగుదురు. కాని యాతఁ డేదేని యొకవేషముతోఁ గాన్పింపఁడు ౫ ఆతనియచంచలకీర్తి ప్రత్యక్షప్రపంచమునం దావరించియుండును. స్వయముగ నాతఁడు జనులకుఁ దెలియఁబడఁడు. జను లాతనిని వెదకుచుందురు. కాని యాతనిజాడపోడలే కాన్పింపవు. ౬ మహంతు సుందరమగువేషము నాదరింపఁడు. కీర్తియొక్క యభివృద్ధినే భూషణముగనెంచి

యాదరించును అట్లే అఖండరూపముగా నాతనిహృదయమున నాలోచనలు వృద్ధి యగుచుండును. ౭ మహంతుతన్నుగురుతెఱింగిన వారలను విడిచిపోవును. నిరంతరము అన్నితావులందున గ్రొత్తవారితోఁ బరిచయము కలుగఁజేసికొనును. ప్రజ లాసాధుపురుషుని హృదయాభిప్రాయముల యందుఁ గనుఁగొనఁ దలంచుచుందురు. కాని యాతనిసంకల్పమెద్దియో యెవ్వరికిని విశదముగాదు. ౮ ఆతఁడు పూర్తిగ నెవరివైపును జూడఁడు. పూర్తిగ నెవ్వరితోడను మాటలాడఁడు. పూర్తిగనొకచోట నిలచియుండఁడు. లేచి వెళ్ళిపోవును. ౯ తానెచటికిఁ బోవలసియుండునో యాస్థల మితరులకుఁ జెప్పఁడు. ఎచటికి బోవుచుంటినని చెప్పనో యచ్చటకుఁ బోవనే పోవఁడు. సారాంశమేమన- తనవిషయ మెవ్వని యనుమానమున కేని రానీయఁడు. ౧౦ జను లాతనిపట్ల నేమిచేయఁ దలఁతురో దానినుండి తప్పించుకొనును. జను లాతని విషయమున నేమితలంతురో దాని నసత్యము గావించును. మఱియు జను లాతనిగూర్చి యేమితర్కింతురో దానిని నిష్ఫలము గావించును. ౧౧ జను లామహంతును దర్శింప వాంఛింతురు. కాని యితరులకు దర్శనమీయవలసిన నిమిత్త మాతనికి లేదు. జను లాతనిసేవకై వేచియుందురు. కాని జనులకు సేవయొసంగవలసిన నిమిత్త మాతనికి లేదు. ౧౨ ఈవిధముగా నాయోగీశ్వరుండు (మహంతు=నిస్పృహుఁడు) కల్పనములోనికి రాఁడు. తర్క మాతనియెదుటఁ బనిచేయదు. మఱియు నెప్పుడును భావనచేయుటకుఁగూడ నాతఁడు సాధ్యపడఁడు. ౧౩ ఈవిధముగ నాతనిహృదయము గోచరింపదు. ఆతనిదేహ మొక తావున నుండదు. ఒకక్షణకాలమేని యాతఁడు కథాకీర్తనములను మఱువఁడు. ౧౪ జనులాతనిపట్ల గావించు సంకల్పవికల్పములన్నియు నిష్ఫలములగును. ఆయోగీశ్వరుఁడు జనులకు దమతమ వృత్తులచేతనే లజ్జితులఁ గావించును. ౧౫ మహంతు, పెక్కుమంది పరీక్షించిన పిమ్మటను పెక్కుమంది హృదయములలోఁ దనకుస్థాన మేర్పడిన పిమ్మటను మిగుల భారమగు కార్య మిప్పుడు నెరవేర్పఁగలిగితినని తెలిసికొనవలెను. ౧౬ అఖండరీతిగ ఏకాంతసేవ గావింపవలెను. నిరంతర మభ్యాసమునే చేయుచుండవలెను. అట్లే అన్యజనులనుగూడఁ దనవెంటనుంచుకొని కాలము సార్థకము గావింపవలెను. ౧౭ మహంతు తొలుదొలుత

తోఁ బ్రపంచపరమార్థములను రెంటిని గావింపవలెను. ఇట్లు చేయఁజాలకున్న యెడల నానాదుఃఖముల ననుభవింపవలసివచ్చును ౧౦ వనస్పతులమీఁద నుండు తృణజలూకము (ఆకుపచ్చగను పొడవుగనుండుపురుగు) ముందుఁ జూచి తనశరీరభాగము నెత్తి నడుచుచుండును. (జీవజంతువులుగూడ నీ విధముగ వివేకముతో వర్తించుచున్నవి) పురుషుఁడైయుండియు నవివేకియై వర్తించువారల నేమనవలయునో తోఁచదు ౧౧ కావున దూరదర్శిగ మానవుఁ డుండవలెను. అఖండరీతిగ విచారము గావింపవలెను. ముందు జరుగఁగలస్థితిగతులను (భవిష్యత్ఘటనలను) మొదటినుండియే తెలిసికొనవలెను ౧౨ జాగరూకతగ నుండువాఁడు (సావధానపురుషుఁడు) సుఖియగుననియు, అజాగ్రతగలవాఁడు (సావధానరహితుఁడు) దుఃఖిగ నుండుననియు అంద ఱెఱింగియున్నారు ౧౩ కావున సర్వవిధముల సావధానిగ నుండుపురుషుఁడే ధన్యుఁడు. అట్టివాఁ డొకఁడే జనులను సంతోషపఱుపఁ గలిగియున్నాఁడు ౧౪ మొదటినుండి సావధానిగనుండుటలో సోమరితనము ప్రకటించుచుండెను. వానివయికి మధ్యకాలమున నాకస్మికముగ తుములయుద్ధము తటస్థమయ్యెను. అప్పు డాత్మరక్షణము గావించుకొనఁ దగు సందర్భ మెక్కడనుండును? ౧౫ దూరదర్శులగు పురుషుల యోచనల ననుసరించి వర్తింపవలెను. ఏలయన! రెండవవాని నాదర్శముగ నుంచుకొనియే జనులు చతురులగుచున్నారు ౧౬ కావున గుణవంతులు; చతురులు నగుపురుషులను గురుతెఱింగి వారిగుణగణములను గ్రహింపవలెను. అవగుణములను బరీక్షించి విడిచివేయవలెను ౧౭ వివేకియగుపురుషుఁ డందఱను బరీక్షించుచునేయుండును. ఎవరిమనస్సునుగాని నొప్పింపఁడు. ఆతఁడు మనుష్యమాత్రుని దన యనుమానములోనికిఁ దెచ్చుకొని పరిశీలించును ౧౮ సాధారణముగ వివేకవంతుఁడు జనులందఱకు సామాన్యునివలెఁ గనుపించును. వాస్తవమున కాతఁడు గొప్పవివేకిగా నుండును ౧౯ ఆతఁడు బాగుగా నెఱింగియే, బాగుగాఁ దెలిసికొనియే అన్నివిధములగు జనులను నంగీకరించును. అంతియగాక యెవరి నెట్లు గౌరవింపవలయునో యట్లు గౌరవించును. అన్నిటికంటె గొప్పగ నాతనియందుఁగల యపూర్వత్వ మిదియే ౨౦

రెండవ సమాసము.

ప్ర ప ం చా ను భ వ ము.

ప్రపంచములోని కేతెంచిన స్త్రీ, పురుష, నిస్పృహాజనులారా! నేను చెప్పఁబోవునంశమును ధ్యానపూర్వకముగ వినుఁడు ౧ వాసన యేమగుచున్నదో కల్పన మేవిషయమునఁ గల్పనచేయుచున్నదో చూడవలయును. ఏలయన! మనస్సులో నానావిధములగు తరంగము లుద్భూతము లగుచుండును ౨ చక్కఁగఁ దినుటయుఁ, జక్కఁగఁ ద్రాగుటయు, మంచిమంచి యాభరణములను ధరించుటయు, మంచిదుస్తును గట్టుకొనుటయు, సర్వవిషయములయందును మనస్సున కనుకూలముగ వర్తించుటయు సాధారణముగ జరుగుచునేయున్నది. దీనివలన జరుగున దొక్కటియు లేదు. మంచిపనిచేయుచుండగనే యాకస్మికముగ నది చెడుగై పోవును. ౩-౪ ప్రపంచమునందలి మానవులలోఁ గొందఱు సుఖులుగఁ గొందఱుదుఃఖులుగ నుంట ప్రత్యక్షముగఁ జూచుచున్నారము. జనులు తఱుచుగా భయచేతనుక్తులై చిట్టచివరకు భాగ్యముల ననుభవించుచున్నారు. ౫ మనుజులు పొరపాటులేకుండ నేయత్నము నేని చేయఁజాలరు. కావుననే వారొనరించుయత్నములు నెరవేరకున్నవి. మఱియు నేమైనఁ జేయనిమ్ము. మానవుఁడు తనదుర్గుణములను దాను గ్రహింపలేఁడు. ౬ తన లోటుపాటులఁ దానెఱుంగనివాఁ డితరులవిషయ మేమియెఱుంగఁగలఁడు ? పూర్వోక్తములగు కట్టుబాటులననుసరించి నడువక పోవుటచేతనే మానవులకు స్వాభావికముగ దారిద్ర్యము కలుగుచున్నది. ౭ వాస్తవమేమన్న! జనులు పరస్పరముగ నొకరిహృదయములోనియంశము నొకరు తెలిసికొనఁ జాలకున్నారు. ఈకారణముననే జనులలో సమానప్రవర్తనము కనఁబడకున్నది. అట్లే అజ్ఞానకారణమున మనుజులలో నానావిధములగు పోరాటములు సమకూరుచున్నవి. ౮ ఆపోరాటములే క్రమముగ వృద్ధినొందుచున్నవి. కావున నెల్లరును గష్టముల నొందుచున్నారు. ప్రయత్న మొకప్రక్క నిలిచిపోవుచున్నది. వ్యర్థమగు శ్రమమాత్రము జరుగుచున్నది. ౯ కాని వాస్తవములో-శవర్తనము విహితముగా లేదు. నానాప్రకారములుగా నున్న జనులను బరీక్షింపవలెను. ఎవ్వఁ డెటులుండులో వానినట్లే తెలిసి

కొనవలెను. ౧౦ దక్షుఁడగుపురుషునకుఁ గొంచెముగనో గొప్పగనో ఎదుట వానివాక్యములు హృదయము గోచరించును. మూర్ఖపురుషున కెట్లు తెలియును ? ౧౧ జనులు తమయెడఁ బక్షపాతము గలిగియుంటకు ఇతరులను నిందించుటకు బాగుగా నలవాటుపడియున్నారు. ప్రపంచమునందు దఱచుగా నిదియే కానఁబడుచున్నది. ౧౨ కాని తనప్రతిష్ఠను గాపాడుకొనుటకై మంచివాఁడుసైత మీనిందను వహించుచున్నాఁడు. సహింపకపోయినచో నవ్వఁ పాఁగుట స్వాభావికవిషయము. ౧౩ తనకు యోగ్యముగ నుండనితావున నుండుట మానవున కెన్నఁటికిని రుచింపదు. మఱియు నెవనిమొగమాటము నేని త్రెంచివేయుటఁగూడ నుచితమని తోఁచదు. ౧౪ సత్యము మాటలాడుచు సత్యముగా వర్తించుచు నుండు వానిని పిన్నపెద్దలందఱును ప్రేమింతురు. న్యాయాన్యాయవిషయములు సులభముగాఁ బరస్పరము విదితమగును. ౧౫ ఇతరులయపరాధములను వివేకపూర్వకముగ సహింపవలయును. లేకున్న నాతనిపయి లోకులకు భక్తికలుగదు. అంతియగాక అట్టివానిని జనులు సాధారణమానవునిగా భావింతురు. ౧౬ అరుగదీయకయుంచినంతవఱకు గంధపుకట్టెయొక్క సుగంధము వెల్లడిగాదు. అన్యవృక్షములనుజూచినట్లు దానిని జూతురు. ౧౭ ఉత్తమగుణములు స్వయముగాఁ జూచినఁగాని లోకులీతఁడు లోకోత్తరుఁడని నిర్ణయింపరు. అట్లునిర్ణయించినపిదప నుత్తమునియెడ లోకమంతయుఁ బ్రసన్నమగును. ౧౮ లోకము ప్రసన్నముకాగానే లోకముతో మైత్రికలుగును. అనంతరము జనులందఱును సంపూర్ణముగఁ బ్రసన్నులగుదురు. ౧౯ జగద్రూపియగు జనార్దనుఁడే (ఈశ్వరుఁడే) ప్రసన్నుఁడైనపు డింక నాతనికిఁ దక్కువయేమున్నది ? కాని లోకులనందఱను సంతోషపఱచుట మిక్కిలికష్టము. ౨౦ నాటఁబడినవిత్తనము మొలచును. ఇచ్చినవాయనము మఱల దొరకును. మర్మమునకుసంబంధించిన మాట చెప్పినచో ఇతరులహృదయమునకుఁ గష్టముగలుగును. ౨౧ జనులకు మేలుచేయుటచే సుఖ మభివృద్ధినొందును. శబ్దము ననుసరించియే ప్రతిశబ్దము వచ్చుచుండునుగదా. ౨౨ ఇది యంతయు మనస్వాధీనములో నున్నవిషయము. దీనియం దితరులదోషమించుకేనియు లేదు. ఈయంశము సాధకుఁడు తనమనస్సునకు క్షణక్షణమునను

నేర్పుచుండవలెను. ౨౩ ఒకవేళ నెందేని దుర్జనుఁడు గలిసినచో తానాతనిని క్షమింప నవకాశములేకున్నచో సాధకుఁడగువాఁడు వెంటనే యచటనుండి మౌనముగా వెడలిపోవలెను. ౨౪ జనులు నానావిధపరీక్షలు బాగుగా నెఱుంగుదురుగానిఇతరుల హృదయములను బరీక్షించుటయెఱుంగరు. కావుననే జనులు దుఃఖముల నొందుచున్నారు. ఇందు సందియము లేదు. ౨౫ మనమేనాఁడో చావవలసియేయున్నది. కాన మంచిబుద్ధితో నడుచుకొనవలయును. వివేకలక్షణము మిగులఁ గఠినమైనది. ౨౬ చిన్నతోనైనను బెద్దతోనైనను, సమానునితోనైనను, తనవానితోనైనను, బరునితోనైనను, గడకెవరితోనైనను, గాఢమైత్రి గలిగియుండవలెను. ౨౭ మంచియొక్క పర్యవసానము మంచియే యగును. దీనినందఱు నెఱుంగుదురు. ఇంక నింతకంటె నధికముగా నేమి చెప్పవలయును? ౨౮ హరికథలను, అధ్యాత్మికనిరూపణములను గావించుచుండవలెను. మహత్త్వపూర్ణములగు రాజనైతికవిషయములవైపునగూడ ధ్యానము నుంచవలెను. కాని ప్రసంగము (సందర్భము) తటస్థింపనివిషయ మెద్దియు యుక్తముగనుండదు. ౨౯ ఒకఁడు విద్య బాగుగా నేర్చుకొనియున్నాఁడు. కాని అవసరము నెఱుంగఁడు. ఈస్థితియం దీవిద్య నవ్వఁ దడుగును ౩౦

మూఁడవసమాసము.

ఈశ్వరుఁడు, భక్తుఁడు.

పృథివిమీఁద నున్నజనులందరును వివేకముతో నడచుకొనవలెను. ఇహపరలోకములను రెంటిని బాగుగా విచారింపవలెను. ౧ ఇహలోకమునుసాధించుటకు జ్ఞాతలసాంగత్య మొనరింపవలెను. పరలోకమును సాధించుటకు సద్గురుఁడు కావలెను. ౨ సద్గురుఁడు కావలయుననుట సరియే. మొదట నాయన నేమియడుగవలెనో తెలియకున్నది. మంచిది మొదట ననన్యభావముతో నాతనిని రెండువిషయము లడుగవలయును. ౩ ఆరెండువిషయము లెవ్వియన ? ఈశ్వరుఁ డెవ్వఁడు ? మనమెవ్వరము అనునవి. ఈరెండువిషయములను మాటిమాటికి వివరణ మొనరింపవలెను. ౪ మొదట ఈశ్వరుఁడెవ్వరు ? అనుదానిని జూడవలెను. పిమ్మట భక్తులగు మనమెవ్వరము ? అనునంశము చూడవలెను. పంచీకరణమహా

వాక్యములవివరము మాటిమాటికిఁ జేయుచుండవలెను. ౫ నిశ్చలమును శాశ్వతమును గురుతెఱుంగుటకును మన మెవ్వరము ? అనువిషయమును విచారించుటకును ముఖ్యముగ నిదియంతయుఁ జేయవలయునని భావము ౬ సారాసారవిచారము గావించుటవలన నేపదవియందైనను శాశ్వతము లేదని విదితమగును. కావున వానికన్నిఁటికిని గారణమగు భగవంతుని దొలుదొలుత గుర్తెఱుఁగవలెను. ౭ నిశ్చలము. చంచలము, జడము ఇదియంతయు మాయావికారము. కాని వీనియన్నిఁటిలో వస్తువేసారము దానికి నాశము లేదు. ౮ ఆపరబ్రహ్మమును వెదుకవలెను. వివేకముతో మూఁడులోకములందును లెస్సగాఁ జరింపవలెను. మాయికమును విచారముచే ఖండింపవలెను. ౯ అసత్యమును విడిచి సత్యమును గైకొనవలెను. పరీక్షకుని బరీక్షింపవలెను. మఱియు మాయాస్వరూపమంతయు మాయికమని (మిథ్యయని) యెఱుంగవలెను. ౧౦ ఈమాయ పాంచభౌతికము. మాయికమంతయు లయమైపోవును. పిండబ్రహ్మాండములు, ఎనిమిది దేహములు నాశవంతములే. ౧౧ కనుపించునదంతయు నాశమయ్యెడిదే. ఉత్పత్తియగు నదంతయు మరణించునదే. మాయారూపమును దాల్చు నదంతయుఁ జెడిపోయెడిదె. ౧౨ వృద్ధినొందు నదంతయు క్షీణించెడిదె. వచ్చు నదంతయుఁ బోయెడిదె. కల్పాంతమునందు భూతములను భూతములె తినివేయును. ౧౩ దేహధారు లెన్నిగలవో యన్నియు నాశమొందునవె. ఇది ప్రత్యక్షమగు సంశము. మనుజుఁడు లేనిది వీర్యోత్పత్తి యెటులగును? ౧౪ అన్నము లేకున్న వీర్యమెక్కడనుండి కలుగును? ఓషధులు లేనిచో అన్నమెట్లు వచ్చును? పృథ్వి లేకున్నయెడల ఓషధు లెట్లుండును? ౧౫ ఉదకము లేనిది పృథ్వి యేర్పడఁజాలదు. తేజము లేకున్నచో జలము కలుగనేరదు. వాయువు లేకున్నచోఁ దేజము కలుగఁజాలదు. ౧౬ అంతరాత్మ లేకున్నచో వాయు వెట్లుకలుగును? వికారము లేకున్నచో అంతరాత్మ యెక్కడనుండివచ్చును? చూడుఁడు. నిర్వికారమునందు వికార మెచ్చటి నుండివచ్చినది? ౧౭ నిర్వికారమునందు పృథివ్యాపస్తేజోవాయు అంతరాత్మాదివికారము లెవ్వియు లేవు. ౧౮ నిర్వికారమును నిర్గుణమును నగు నదియే శాశ్వతలక్షణము. అష్టధాప్రకృతి సంపూర్ణముగ నాశవంతమైనది. ౧౯ నాశవంతమగునదంతయు నుండియు నశించిన దగుచున్నది.

సారాసారవిచారమువలన సమాధానము కలుగును. ౨౦ ఇట్లు వివేకపూర్వకముగఁ జూచినచో సారాసారవిచారము హృదయమునఁ గాదుకొనును. ౨౧

శాశ్వతమును, నిర్గుణమునగునదె ముఖ్యదైవశమని యిప్పుడు విదితమైనది. ఇఁక నేను అనువాఁడెవఁడు? అనువిషయము తెలియవలసియున్నది. ౨౨ "నేను" ఎవ్వఁడు? అనునది తెలియవలసియున్నది. దేహముయొక్క సంపూర్ణతత్త్వముల నన్వేషించుటవలన నేను నీవు అనునది మనోవృత్తియందుండునని విదితమగుచున్నది. ౨౩ శరీరమునంతను వెదకుటచేతను తత్త్వవిచారణ మొనరించుటచేతను నేను నీవు అనుదాని జాడపాడ లెచ్చటను గాన్పింపవు. వాస్తవమునకు నేను నీవు అనుభావము తత్త్వములలోనే లీనమైయుండును. ౨౪ దృశ్యపదార్థములు నిరసనమగుటయుఁ, దత్త్వములలోఁ దత్త్వములు లయమగుటయుఁ దటస్థించిన యెడల అప్పుడు నేను నీవు అనునదెచ్చట శేషించును? ఆసమయమునఁ గేవలవస్తువే వాస్తవముగ శేషించియుండును. ౨౫ పంచీకరణతత్త్వవివరణ మహావాక్యములవలన "నేనే వస్తువునై యున్నాను." అనునది సిద్ధాంతమగుచున్నది. (కాని యిట్లు నుడువుటనుబట్టి యేవస్తువైనను బ్రహ్మము కాఁజాలదు.) నిస్సంగత్వముతో నివేదనము (ఆత్మనివేదనము) గావింపవలెను. ౨౬ ఈశ్వరునియొక్కయు, భక్తునియొక్కయు మూలమును శోధించినచో నిరుపాధియుఁ గేవలమునునగు ఆత్మప్రాప్తి కలుగును. ౨౭ అహంత్వము (నేనను భావము) మునిఁగిపోవును. వివేకమువలన భిన్నత్వము తొలంగును. నివృత్తిపదవి (ఉన్మనీపదవి) లభించును. ౨౮ జ్ఞానము విజ్ఞానములో లీనమగును. ధ్యానము ధ్యేయములోని కరుగును. కార్యకారణాదులన్నింటినిగూర్చిన వివేక ముదయించును. ౨౯ అంతటితో జననమరణములగోల నశించును. పాపములన్నియు మునిఁగిపోవును. యమయాతనలు తొలంగిపోవును. ౩౦ బంధములన్నియు విడిపోవును. విచారమువలన మోక్షప్రాప్తి యగును. జన్మమంతటికిని సార్థకత్వము కలుగును. సందేహములన్నియుఁ దొలంగును. ప్రమాదములన్నియు విడిపోవును. జ్ఞానవివేకమువలన జనులందఱును బవిత్రులగుదురు. ౩౨ పతితపావనుని దాసులు (పతితపావనుఁడు రాముఁడు అతనిదాసుఁడు రామదాసు)

జగత్తును భావనము గావించెదరని పెక్కుమంది హృదయములలోఁ బ్రతీతి కలుగును. ౩౩

నాలుగవసమాసము

వి వే క వై రా గ్య ము లు .

ఎవనికేని రాజ్యప్రాప్తియై యాతఁడు దానిననుభవించుట యెఱుంగకున్నచో వానిదశ యేమగునో యట్లే వివేకములేనివైరాగ్యయుతునిదశగూడఁ బరిణమించును ౧ గార్హస్థ్యముయొక్క నానావిధములగు జంజాటములవలన విసుగొంది వేసారి దుఃఖములపాలైనపిదప మానవునకు వైరాగ్యముదయించును. మనుజుఁ డాస్థితియందు గృహమును విడిచి వెడలిపోవును. ౨. ౩ వాడుచింతనువిడిచి పరాధీనతను రూపుమాపి సాంసారికదుఃఖములనుండి ముక్తుఁడై ఆరోగ్యమునొందిన రోగివలెనగును. ౪ కాని స్వచ్ఛందముగాఁ దిరిగి నష్టుఁడు, భ్రష్టుఁడు కాఁగూడదు. ౫ వివేకములేనిది వైరాగ్యమును గైకొనువాఁడు అవివేకకారణమున అనర్థముల పాలగును. అంతతోఁబోక యిహపరములుగూడ నష్టమగును ౬ వానికిఁ బ్రపంచమూ కుదురదు. పరమార్థమూ అంతకుమున్నె కుదురదు. జీవితమంతయు వ్యర్థమగును. అవివేకమువలన అనర్థము కలుగును ౭ వై రా గ్య యో గ ము లే కుం డి జ్ఞా న సం బం ధ ము ల గు వైరాగ్యవాక్యములను వదరుట కారాగృహమున బంధీకృతుఁడగుపురుషుఁడు పురుషార్థములనుగూర్చి మాటలాడుటవంటిది ౮ వైరాగ్యశూన్యులై జ్ఞానసంబంధవాక్యములనుజెప్పుట, వ్యర్థమగు నభిమానము జూపుటయే, ఇట్టిమనుజుఁడు మోహ, దంభ, కారణమునఁ గష్టములనుభవింపవలసివచ్చును ౯ కట్టివేసియుంచినను కుక్క మొఱుగుచుండును. అట్లే దంభశీలురుగూడ స్వార్థముకొఱకు (ఎన్నియో వేదాంతవాక్యములు)వల్లించుచుండును. మఱియు నాతఁడభిమానకారణమున రెండవవాని యుత్కర్షఁగాంచి సహింపఁజాలఁడు. ౧౦ వివేకములేనివైరాగ్యము, వైరాగ్యములేనివివేకము అనునీరెండవస్థలందును శోకమే కలుగును. ఇఁక నిప్పుడు వివేకవైరాగ్యముల రెంటిసంయోగముకలవాని లక్షణముల నాలకింపుఁడు ౧౧

వివేకవైరాగ్యములు గలమానవుఁడు లోలోన విరక్తుఁడగును. మఱియు వైరాగ్యముకతన బ్రపంచమున కతీతుఁడగును. ఇట్లాతఁడు అంతర్బాహ్యములనుండి ముక్తుఁడై నిస్సంగయోగియగును ౧౨ నోటినుండి చెప్పుజ్ఞానవాక్యములకుఁ గొంచెమేని మార్పులేనివిధమున నాచరణముగూడ నుండును. అతనియుపదేశమును విని గొప్పగొప్పపవిత్రపురుషులుగూడఁ జకితులగుదురు. ౧౩ త్రైలోక్యరాజ్యమునుగూడ నాతఁడు లెక్కచేయఁడు. వైరాగ్యస్థితి వానిహృదయమునఁ బాదుకొని యుండును. ఆతనిహృదయమునఁగల యత్నవివేకధారణాశక్తులకు మేరయే యుండదు ౧౪ హృదయపూర్వకముగా నాతఁడు మనోహరముగను రసవంతముగను హరికీర్తన మొనరించును. తాళస్వరములతోఁ బ్రేమపూర్వకముగ భక్తిపూర్ణములగు భజనముల గానమొనరించును. ౧౫ ఆతనిహృదయమునందు జనసముదాయమును తత్కాలముననే సన్మార్గమునఁ బ్రవేశపెట్టఁగల వివేకము మెలకువతో నుండును. అనుభవసాహిత్య మాతనిహృదయమును విడిపోవదు ౧౬

సన్మార్గమును బ్రచారముజేయుచుఁ దనవ్యాపకత్వమువలన నెవ్వఁడు సంపూర్ణజనులలోఁ గలసిపోవునో యాతనికి జగదీశ్వరుఁడు ప్రసన్నుఁడగును. సత్యమేమన్నచో! సందర్భమును గనిపెట్టవలెను ౧౭ తీక్ష్ణమగు వైరాగ్యము, ఉదాసీనత్వము, అనుభవజన్యమగుబ్రహ్మజ్ఞానము, స్నానసంధ్యలు, భగవద్భజనము, పుణ్యమార్గాచరణము కలిగి యుండవలెను. ౧౮ వివేకయుక్తమగు వైరాగ్యమె సరియగువైరాగ్యము. కేవలవిరాగమునగాని శబ్దజ్ఞానమాత్రమునఁగాని కార్యమెన్నటికిని నెరవేరఁజాలదు ౧౯ కాఁబట్టి వివేకవైరాగ్యములు రెండును గలిగియుండుట మహాభాగ్యము. ఈవిషయమును యోగ్యులగుసాధువులే యెఱుంగుదురని రామదాసు నుడువుచున్నాఁడు ౨౦

ఐదవ సమాసము.

త్రి వి ధా త్మ ని వే ద న ము .

గీతలవంపులవలన అక్షరము లేర్పడుచున్నవి. అక్షరములనుండి శబ్దములు కలుగుచున్నవి. శబ్దములతోఁ గద్యపద్యమయమగు ప్రబం

ధము లేర్పడుచున్నవి. ౧ ఇట్లు వేదశాస్త్రపురాణములు, అనేక కావ్యములు మున్నగు అసంఖ్యాకగ్రంథములు నిరూపణ మొందుచున్నవి ౨ ఋషులనేకులు. వారలమతము లనేకములు. భాషలుగూడ నట్లేయున్నవి. ఇంతియగాదు. లిపులుగూడ అనంతములుగా నున్నవి. ౩ వర్గము, ఋక్కు, శ్రుతి, స్మృతి, అధ్యాయము, సర్గము, స్తబకము, జాతి, ప్రసంగము, మానము, సమాసము, ప్రకరణము, మున్నగు భేదములుగలవు ౪ పదము, శ్లోకము, పద్యము, డోరా, సాఖీ, దోహా, మున్నగు ఛందోభేదములు గలవు. ౫ సన్నాయిపాట, నాగస్వరము మురళీగానము, వీణాగానము, కథాగానము మొదలగు నానావిధగానములు గలవు. ఇట్లే అనేకవిధములగు నాటలుగలవు. ౬ ధ్వని, ఘోష (నాదము) చతుర్విధవాణులతో నున్నవి. దీనిభేదములను వినుఁడు. ౭ ఉన్మేషము (స్ఫురణము) పరనుండియు, ధ్వని పశ్యంతినుండియు, నాదము మధ్యమనుండియు, శబ్దము వైఖరినుండియు ఉత్పన్నము లగుచున్నవి. వైఖరి నానాశబ్దరత్నములను వెల్లడించును. ౮ అకారము, ఉకారము, మకారము, అర్ధమాత్రము గలిసిన "ఓం" అను మూడక్షరవర్ణము మాత్రముననే సంపూర్ణవర్ణసముదాయ ముత్పత్తియయ్యెను. ౯ పిదప రాగజ్ఞానము, నృత్యభేదము, తానమానము, అర్థభేదము, తత్త్వజ్ఞానము మున్నగునవి సృష్టియయ్యెను. ౧౦ శుద్ధసత్త్వగుణమే సంపూర్ణతత్త్వములలో ముఖ్యతత్త్వము. ఓంయొక్క అర్ధమాత్రమే శుద్ధతత్త్వగుణము (మహత్తత్త్వము లేక మూలమాయ) ఐయున్నది. * ౧౧ చిన్నపెద్దతత్త్వము లెన్నియో గలసి ఎనిమిదివిధములగు శరీరములయ్యెను, అష్టధాప్రకృతి నాశవంతము. ౧౨ పరబ్రహ్మము వాయురహితమగు ఆకాశమువలె ఘనముగా నున్నది. అష్టదేహములను నిరసించి పరబ్రహ్మమును జూడవలెను. ౧౩ బ్రహ్మాండము మొదలుకొని పిండముదనుక నుత్పత్తి. పిండమునుండి బ్రహ్మాండముదనుక సంహారము. ఈరెంటికిని వేఱుగనున్న శుద్ధసారమే విమలబ్రహ్మము. ౧౪ దృశ్యప్రకృతి జడము.

* ఓంలోనున్న అకారము తమోగుణమునను, ఉకారము రజోగుణమునను మకారము సత్వగుణమునను దర్శకములైయున్నది. అర్ధమాత్రము (బిందువు). శుద్ధతత్త్వగుణము (లేక మూలమాయ లేక మహత్త్వము)నను దర్శకము.

ఆత్మ చంచలము. విమలబ్రహ్మము నిశ్చలము. దానినే వివేకించి దానియందే తద్రూపుఁడు కావలెను. ౧౫ తనువు, మనస్సు, వాక్కు, మఱియుఁ బదార్థమాత్రసహితముగ నేను పరమాత్మునకుఁ జెందియుంటినని యెఱుంగుట జడాత్మనివేదనము. ౧౬ సంపూర్ణసృష్టికిఁ గర్తయగు జగదీశ్వరుని యంశములే ప్రాణిమాత్రములు. సమస్తము జగదీశ్వరునిదే. మనమేమియుఁ గాము. ఆతఁడే కర్తయని తెలిసికొనుట చంచలాత్మనివేదనము. ౧౭, ౧౮ చంచలమాయ స్వప్నమువలె నశ్వరమైనది. పరమాత్మ నిశ్చలమును, నిరాకారము నైయున్నది. ఇదిగాక చంచలమాయ యెప్పుడు వాస్తవమునం దేమియులేకున్నదో యప్పుడు "మనము" (మేము) అనుకల్పనమే మిథ్య * ఇది నిశ్చలాత్మనివేదనము ౧౯, ౨౦ పైనిఁ జెప్పిన మూఁడువిధములగు విచారములుగావించినపిదప మనమనున దేమియు లేదు. రెండవది (ద్వైతము) లేనేలేదు. మనమే లేనప్పుడు నేననునది కలుగుట యెక్కడ సంభవమగును? ౨౧ యోచింపఁగ యోచింపఁగ అంతయు ననుమానములోనికి వచ్చును. తెలియుచుఁ దెలియుచుఁ దెలిసిపోవును. పూర్ణానుభవము కలిగినపిదపఁ జెప్పుట శాంతించును. ౨౨

ఆఱవసమాసము.

ఉత్పత్తిక్రమము.

పరబ్రహ్మము, నిర్మలమును, నిశ్చలమును, శాశ్వతమును, సారమును, అమలమును, విమలమును ఆకాశమువలె సర్వవ్యాపకమును నైయున్నది. ౧ ఆపరబ్రహ్మమునకు, చేయుట, పెట్టుట, పుట్టుట, మరణించుట, ఎఱుంగుట, ఎఱుంగకుండుట మున్నగునవి లేవు. అది శూన్యముసకంటెఁగూడ అతీతముగనున్నది. ౨ అది యేర్పడుటలేదు. చెడుటలేదు. ఆగుటలేదు, పోవుటలేదు, మాయాతీతముగ నిరంజనముగ నదియున్నది.

* ఆత్మనివేదనము మూఁడువిధములు. జడము. చంచలము. నిశ్చలము. నేను నాదియనునదంతయు ఈశ్వరుఁదనుబుద్ధి కలుగుట జడాత్మనివేదనము. ఉన్నదంతయు ఈశ్వరరూపము. అనఁగా కొంతయున్నది. అది యీశ్వరస్వరూపమని తెలియుట చంచలాత్మనివేదనము. పరబ్రహ్మస్వరూపముకంటె వ్యతిరేకమైన దెద్దియునులేదని నిశ్చయించుట నిశ్చలాత్మనివేదనము.

దానికి మేర లేదు. ౩ (పరబ్రహ్మమునుండి) తొలుత నుదయించుసంకల్ప మును షడ్గుణుండీశ్వరుఁడనియు అర్ధనారీనటేశ్వరుఁడనియుఁ జెప్పుదురు. ౪ అతనిని సర్వేశ్వరుఁడు, సర్వజ్ఞుఁడు, సాక్షి, ద్రష్ట, జ్ఞానఘని, పరేశుఁడు పరమాత్ముఁడు, జగజ్జీవనుఁడు- మూలపురుషుఁడు అనియందురు. ౫ ఆత నినే (దానినే) మూలమాయయనిగూడ నందురు. అతఁడు బహుగుణియై యుండును. సృష్టి గావింపవలయునను సంకల్పము గలుగఁగనే ఆతనిని (ఆపరబ్రహ్మమును) గుణక్షోభిణి యందురు. త్రిగుణము లాగుణక్షోభిణి నుండియే కలుగుచున్నవి. ౬ పిదప చేతనరూపియు సత్త్వగుణాకారుఁడు నగు విష్ణువుఁ డుత్పన్నమగుచున్నాఁడు. ఈతఁడు త్రిలోకములను బాలించును. ౭ తరువాత జ్ఞానాజ్ఞానమిశ్రితమును రజోగుణరూపము నగు బ్రహ్మ జనించుచున్నాఁడు. ఆతనివలన నీమూఁడులోకము లుత్పత్తి యగుచున్నవి ౮ ఆవల సకలసంహారకారణుఁడును, తమోగుణస్వరూపుఁడును నగు రుద్రుఁ డుత్పన్నమగుచున్నాఁడు. ఇంతటితోఁ గర్తృత్వము సమాప్తమగును. ౯

అనంతరము పంచభూతములు వ్యక్తమగుచున్నవి. ఈరీతిగా అష్టధా ప్రకృతి స్వరూపములు మూలమాయనుండి యేర్పడుచున్నవి ౧౦ నిశ్చలమునందుండు చలనమే వాయులక్షణము. పంచభూతములు, త్రిగుణములు కలిసి అష్టధాసూక్ష్మప్రకృతి యగుచున్నది. ౧౧ ఆకాశము అంతరాత్మ వలెనే యుండును. దానిమహిమను అనుభవముతో నెఱుంగవలయును. దానినుండియే వాయువు జనించుచున్నది. ౧౨ ఆవాయువు రెండువిధముల నుండును. ఒకటిశీతలము, రెండవదిఉష్ణము. శీతలవాయువువలనఁ దారాగణము చంద్రుఁడు నుదయించుచున్నారు. అట్లే ఉష్ణవాయువు వలన సూర్యుఁడు, అగ్ని, పిడుగుమున్నగునవి యుదయించుచున్నవి. శీతలము ఉష్ణముఅను నీరెండునుగలసి "తేజ"మని పిలువఁబడును. ౧౩-౧౪ తేజమువలన జలము జనించుచున్నది. ఉదకమువలన పృథ్వీరూపము కలుగుచున్నది. అనంతరము అనంతములగు నోషధీసముదాయ ముత్పన్నమగుచున్నది. ౧౫ ఓషధులవలన బహువిధబీజములు అన్నాదులరసము ఉత్పన్నమగుచున్నది. అట్లే భూమండలమునందు ఎనుబదినాలుగులక్షలయోను లుదయించుచున్నవి. ౧౬.

ఇట్లు సృష్టియగుచున్నది. ఈయంశమును హృదయమునకుఁ దెచ్చుకొనవలయును. ప్రతీతి లేకున్న యెడ సందేహపాత్రులు కావలసివచ్చును. ౧౭ ఉత్పత్తిప్రకారమిది ఇట్లే సంహారముకూడఁ గలుగుచున్నది. ఈ విషయమున గావించువిచారమును సారాసారవిచార మందురు. ౧౮ ఏది యేది యెచ్చటనుండి పుట్టుచున్నదో అయ్యది యచ్చటనే లీనమగుచున్నది. ఈవిధముగా మహాప్రళయమునం దన్నింటికిని సంహారము జరుగును. ౧౯ ఆది మధ్యాంతములందు శాశ్వతుఁడుగను నిరంజనుఁడుగను నుండు పరబ్రహ్మమును జ్ఞాత లనుసంధానమునం దుంచుకొనవలెను. ౨౦ బహువిధములగు రచనలు కలుగుచున్నవి, పోవుచున్నవి. కాని యవి యేమాత్రమును నిలిచి యుండుట లేదు. ఇందుచే సారాసారవిచార మావశ్యకమైయున్నది. ౨౧ అంతరాత్మను ద్రష్టయనియు సాక్షియనియు నెల్లరు దానిమహిమను గానమొనరించుచుందురు. కాని యాసర్వసాక్షియవస్థను గమనింపవలెను. ౨౨ ఆదినుండి యంతముదనుక నది యంతయు మాయావిస్తారమే. దానియందు నానావిద్యలను, కళాకౌశలములు నున్నవి. ౨౩ ఉపాధి కంతము గనుఁగొనినవాని కిదియంతయు భ్రమయని తెలియును. ఉపాధి మగ్నుఁడగు మానవు నెవ్వఁడు వెలికిఁ దీయఁగలఁడు? ౨౪ వివేక కార్యములగు అనుభవకార్యములు సందేహపూర్ణములు భ్రమాకులములు నెన్నఁటికిని గావు. సారాసారవిచారయోగమువలననే సాధకులు బ్రహ్మమును బడయుచున్నారు. ౨౫ వాస్తవమునకు మూలమాయ బ్రహ్మాండము యొక్క మహాకారణదేహము. కాని వివేకహీనులగు పురుషులీయపూర్ణమునే పూర్ణబ్రహ్మ మందురు. ౨౬ సృష్టియందు బహువిధమానవులున్నారు. అందుఁ గొందఱు రాజ్యభోగముల ననుభవించు చున్నారు. కొందఱు అశుద్ధమును మోయుచున్నారు. ఇప్పుడు ప్రత్యక్షముగాఁ జూడుడు. ౨౭ తామే యందఱికంటెను మిగుల గొప్పవారలమని చెప్పుకొనువార లెందఱో గలరు. వివేకియగు పురుషుఁ డన్నింటి నెఱుంగును. ౨౮ మానవులదశ యీవిధముగా నున్నది. కావున దీనిని విచారింపవలసి యున్నది. పెక్కుమంది యీవిధముగఁ జెప్పుచున్నంతమాత్రమున నీప్రపంచమును నిందింపఁజనదు. ౨౯ పుస్తకపఠనముననే యొకవేళ నిశ్చయజ్ఞానము గలిగినచో నిఁక గురువు నేర్పఱచికొనవలసిన యవసరముండదు.

పొట్టకొఱకు భ్రష్టులై పోయిరి ౧౧ తొలుతనుండి వైరాగ్యమన నేమి యో యెఱుఁగనివారును, ప్రత్యయజ్ఞానరహితులును, శుచి, ఆచారముల నెన్నఁడుతెలియనివారును, భజనమును గ్రహింపనివారును నగు మానవులు పరులతో మేము సజ్జనులమని చెప్పుకొనుచుందురు. వాస్తవమునకు భ్రమయందుఁ బడియున్నందుననే అట్లు భాషించుచున్నారు. ౧౨. ౧౩ తమపూర్వకృతకర్మములఁ దలంచి పశ్చాత్తాపమునొందకుండుటయే గొప్పపాపము. ఇట్టిబద్ధపురుషులు పరోత్కర్షను గాంచినంతనే క్షణక్షణమునకు దుఃఖమొందుదురు ౧౪ మాయొద్ద లేదు. కావున మీయొద్దనుండుటగూడ మాకిష్టములేదని చెప్పుమానవులు పలువురు గలరు. ఉన్నంతలోఁ దృప్తిగఁ దినుచు, దాచుచునుండువానిని దరిద్రులు చూచి సహింపనేసహింపరు ౧౫ దివాలా ఎత్తినవారు గొప్ప గొప్పభాగ్యవంతులనే నిందజేయుదురు. అంతియగాక సాహుకారును గాంచినచో దొంగలు కన్నమువేయ నుత్సాహపడుదురు. ౧౬

(ఈస్థితినంతను గాంచినపిదపఁ దెలియవచ్చెడిదేమన?) వైరాగ్యమునకు సమానమగు భాగ్యమెద్దియు లేదు. వైరాగ్యములేనికావున అభాగ్యము పాదుకొనును. వైరాగ్యములేని పరమార్థకృత్యము యోగ్యముగాదు ౧౭ ప్రత్యయజ్ఞానియు, వీతరాగియు, వివేకబలమున సకలత్యాగియు నైయుండువానినే మహాయోగియనియు ఈశ్వరీయపురుషుఁడనియు నెఱుంగవలయును ౧౮ మహాదేవుఁడు అష్టసిద్ధుల నుపేక్షించి యోగదీక్షనువహించి ఇంటింట భిక్ష నడుగుచుఁ దిరుగుచున్నాఁడు. ౧౯ ఆమహేశ్వరునితో వేషధారిపురుషుఁడైనను సామ్యము కాఁగలఁడా? కావున నెల్లరును సమానము కాఁజాలరు ౨౦ ఉదాసీనుని వివేకిని జనులందఱును వెదకుదురు. దురాశాపీడితుని, మూర్ఖుని, దరిద్రుని, దుర్బలుని ఎవ్వఁడును నడుగఁడు ౨౧ విచారచ్యుతులును, ఆచారభ్రష్టులును, విషయలోభమున వైరాగ్యమును మఱచినవారలును ౨౨ భజనయన్న రుచింపనివారును శుభపునశ్చరణ మొనర్పనివారలును నగువారిసంపర్కమువలన (ఉత్తముల) మంచితనము వికసింపదు ౨౩ వైరాగ్యశీలురై ఆచారభ్రష్టులు గానివారును, జ్ఞానులై భజనము విడువనివారును, వ్యుత్పన్నులై వితండావాదమునందుఁ బ్రవేశింపనివారును మిగులఁ

కావుననే తనయనుభవముతో వివరణ మొనరింపవలయును. ౩౦ పెక్కుమంది చెప్పిరని దాని ననుష్టించువాఁడు తప్పక శ్రమలపాలగునని గ్రహింపవలెను. యజమానిలేకున్న యెడల వేతనము నెవని నడుగవలయును? ౩౧

ఏడవ సమాసము.

విషయత్యాగము.

న్యాయకారణమున నిష్ఠురములాడుట చాలమందికి వెగటుగఁ దోఁచును. మనస్సు వ్యాకులముగ నున్నసమయమున భోజనముచేయుట మంచిదిగాదు. ౧ విషయములను జాలమంది నిందింతురు. కాని యానందించువారలే దానిని సేవించుచుందురు. అట్లేలగావింతురన్నచో? విషయత్యాగము గావించినచో శరీరరక్షణమే యసంభవమందురు. ౨ చెప్పునదొకటి. చేయునది మఱియొకటి. అట్లొనరించుట వివేకహీనతవలననే సుమా! ఇట్లు వర్తించువానిని గాంచి లోకులు నవ్వుదురు. ౩ బాగుగా విచారించి చూడుఁడు. విషయత్యాగము గావింపనియెడలఁ బరలోకము కొంచెమేని ప్రాప్తింపనేరదని ప్రతిగ్రంథమునందును జెప్పఁబడెను. ౪ శ్రోతలిట్లు ప్రశ్నించిరి. గృహస్థాశ్రమలోలురు తినుచుఁ, ద్రాగుచునున్నచోఁ బారమార్థికు లేమేని యుపవాసముగావించుచున్నారా? ప్రపంచవిషయములయందు గృహస్థులు, విరాగులు సమానముగనే కాన్పించుచున్నారు. ౫ కావున నోదేవా! (గురువర్యా) దేహముండఁగనే ప్రపంచమునందు విషయముల నెవ్వఁడు బరిత్యజింపఁగలఁడు? దయచేసి యీసంగతి నాకుఁ దెలుపుఁడు, ౬ సంపూర్ణ విషయములను విడనాడినపుడే పరమార్థము గావింపనగునని చెప్పువిషయము విచిత్రముగఁ గనిపించుచున్నది. ౭ వక్త యిట్లు ప్రత్యుత్తరమొసంగెను ౮

వైరాగ్యముతోఁ ద్యాగముగావించినపుడె పరమార్థము లభించును. ప్రపంచమును ద్యజించినయెడల సాంగోపాంగముగాఁ బరమార్థ మేర్పడును ౯ పూర్వకాలమునం దీయార్యావర్తమునందుఁ బలువురు జ్ఞానులుండిరి. వారలుగూడఁ దొలుత నెన్నికష్టములు సహించి జ్ఞానులని పేరుబడసిరి ౧౦ తక్కినవారలు మత్సరలోలురై గతించిరి. కొంద 'అన్నమో దేవుఁడా' యనుచుఁ జనిపోయిరి. మఱియు నెందఱో

గొడ్డిగ నున్నారు. ౨౪ పరిశ్రమయొక్క కష్టము ఫలించుటచేతనే పొలము నందు అన్నము (ఫలము) లభించుచున్నది. మంచిపదార్థములు తత్కాల మునసే అమ్మకమగును. జ్ఞానియగుపురుషునిసేవకై జనులంద ఱుత్సాహ ముతోఁ బఱగెత్తుదురు. ౨౫ దురాశాపీడితులకు మాహాత్మ్యము నిలిచి యుండఁజాలదు. వారలజ్ఞానము విభ్రష్టమై పోవును. ౨౬ నిరర్థకవిషయ ములను బరిత్యజించి కేవలావశ్యకవిషయములనే గ్రహణ మొనరించుట విషయత్యాగముయొక్క ముఖ్యలక్షణము ౨౭ పరమాత్ముఁడు సమస్త మునకుఁ గర్త. మాయయనున దేమియును లేదు. ఇదియే వివేకుల సమ్మతము ౨౮ శూరత్వమున మిగులఁ దీవ్రతగలిగియుండువానిని బిన్నలు పెద్దలు అంగీకరింతురు. సోమరియుఁ, బ్రయత్నశీలుఁడు నెన్నఁటికి సమాన ముకారు. ౨౯ త్యాగాత్యాగములు, తర్కవిషయములు నెఱింగి చెప్పిన దాని ననుసరించి నడుచువాఁడును, పిండబ్రహ్మాండాదుల యథాయోగ్య ముగ నెఱింగినవాఁడునునగు నుత్తమగుణోపేతుఁడును సర్వజ్ఞుఁ డునగు పురుషునితోఁ గలిసికొనుటవలన సులభముగనే సార్థకత్వము కలుగును ౩౦, ౩౧.

ఎనిమిదవ సమాసము.

కా ల స్వ రూ ప ము.

మూలమాయయే జగదీశ్వరుఁడు. సృష్టిక్రమము ననుసరించి అష్టధా ప్రకృతియొక్క ఆకారము మూలమాయనివలననే వ్యాపించియున్నది ౧ ఇదియంతయు నేమియు లేకుండినపుడు ఒకనిరాకారమే ఆకాశము వలె విస్తారమాత్రమై యుండెను. అప్పుడు కాలాదికములకల్పనముగూడ లేకుండెను. ౨ ఉపాధి విస్తారమైనప్పటినుండియుఁ గాలము దృగ్గోచర మయ్యెను. లేకున్నచోఁ గాలమునకు స్థానమేలేదు ౩ ఒకటి చంచలము, ఒకటినిశ్చలము. ఈరెండునుగాక కాలమనునది యెచ్చటనున్నది? ఎంతద నుకఁ జంచలమో అంతదనుకఁ గాలమని యనుకొనుము. ౪ అవకాశమును ఆకాశమని చెప్పుచున్నారము. అవకాశమని విలంబనమును జెప్పుచున్నా రము. అట్టివిలంబరూపమగు కాలమును గుర్తెఱుఁగవలెను. ౫ ఆవిలం బము సూర్యునికారణమున మనకు విదితమగుచున్నది. దానివలననే

సమస్తమును గణింప నవకాశముకలిగినది. మఱియుఁ గనురెప్పపాటు మొదలుకొని యుగములదనుక లెక్కింపఁగలిగితిమి. ౬ సూర్యుఁడుం టవలననే, నిమిషము, గడియ, జాము, దినము, సంధ్య, పక్షము, నెల, అయనము, సంవత్సరము, యుగసృష్టి యేర్పడెను. ౭ సూర్యునిసంబం ధముననే ఈభూమండలమునందు సత్యయుగము త్రేత, ద్వాపరము, కలియుగము మున్నగుయుగములసృష్టి యేర్పడెను. శాస్త్రములలో దేవతలకుఁ జెప్పఁబడిన గొప్పగొప్పయవస్థలన్నియు సూర్యునికారణము ననే యుత్పన్నమయ్యెను. ౮ త్రిగుణాత్మకులగు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల కృత్యము (ఉత్పత్తిస్థితిసంహారములు) సూక్ష్మరూపముగను, విశేషరూప ముగను అన్నిపిండములందును జరుగుచున్నవి. కాని జనులు సంప్రదా యమును వదలివేయుచున్నారు. ఈకారణముననే వారికి అజ్ఞత కలుగు చున్నది. ౯ మిశ్రితత్రిగుణము లెన్నఁటికిని వేఱువేఱుకాఁజాలవు. ఆది నుండి అంత్యముదనుక సృష్టిరచనము వానివలననే సాగుచున్నది. ఏది పెద్దదిరో ఏదిచిన్నదియో యెట్లునుడువనగును? ౧౦ ఇది జ్ఞాత యొక్క పని. అజ్ఞాని వ్యర్థముగ భ్రమయందుఁ దగుల్కొనుచున్నాఁడు. అనుభవసహాయమున ముఖ్యతత్త్వము నెఱుంగవలయును. ౧౧ ఉత్పన్న కాలము, సృష్టికాలము, స్థితికాలము సంహారకాలము, మున్నగు ఆద్యం తకాలములన్నియు విలంబరూపములే. ౧౨ ప్రసంగానుసారముగఁ గాలము ను పేరుపడిపోయినది. అనుమానకారణమున నీయంశ మొకవేళఁ జక్కఁగ ధ్యానములోనికి రాకున్నచో ముందీవిషయమునుగూర్చి యింకను వినుఁడు. ౧౩

వర్షాకాలము, శీతకాలము, ఉష్ణకాలము, సంతోషకాలము, సుఖ దుఃఖకాలము, ప్రాతఃకాలము, మధ్యాహ్నకాలము, సాయంకాలము, వసంతకాలము, వర్షాకాలము, కఠినకాలము మున్నగుకాలములన్నియుఁ బ్రసంగానుసారముగా నెఱుంగఁబడుచుండును. ౧౪, ౧౫ జన్మకాలము, బాల్యకాలము, తరుణకాలము, వృద్ధకాలము, అంత్యకాలము, విషమ కాలము మున్నగునవియెల్ల సమయముయొక్కరూపములు. ౧౬ సుకా లము, దుష్కాలము, ప్రదోషకాలము మొదలగుసమయము లన్నియుఁ గలిసి కాల మనఁబడును. ౧౭ జరుగుచున్నదొకటి తెలియవ

చ్చుచున్నది వేఱొకటి. దీనిపేరు వివేకహీనత. నానావిధములుగనున్న ప్రవృత్తిజనులు ప్రవృత్తినే యెఱుంగుదురు. ౧౭ ప్రవృత్తి అధోముఖముగ నడుచును. నివృత్తి ఉచ్చముఖముగా నడుచును. ఉచ్చముఖముగా నడుచుటవలన నానాసుఖములుఁ గలుగును. వానిని వివేకియే యెఱుంగును ౧౮ బ్రహ్మాండరచన మెచ్చటినుండి జరిగెనో యంతదనుక వివేకియగు పురుషుఁడు తనదృష్టిని బ్రసరింపఁజేయును. అంతియగాక వివేకి వివరణ మొనరించి యొనరించి పూర్వాపర (మూల) స్థితులకుఁ బ్రాపించును. ౨౦ ప్రపంచమునందుండి పరమార్థమును సాధించువాఁడును, బ్రారబ్ధయోగమున జనులలోఁ గలిసియుండు వాఁడును గూఢ నాస్థితినె పడయును. ౨౧ మానవులందఱకును మూలమొక్కటియే. కాని యీమానవులలోఁ గొందఱు జ్ఞాతలుగను మఱికొందఱు మూర్ఖులుగా నున్నారు. వివేకముతోఁ దత్కాలముననే పరలోకమును సాధింపవలెను. ౨౨ వివేకమువలననే జన్మము సార్థకమగును. వివేకినే ఇహపరసాధకులగు జనులు మంచివాఁడందురు. వాస్తవములో ముఖ్యతత్త్వము నన్వేషింపవలెను. ౨౩ వివేకహీనులగు మనుజులను పశుసమానులుగ భావింపవలెను. అవివేకులమాటలు వినినయెడలఁ బరలోకమెట్లు లభింపఁగలదు? ౨౪ మంచిది. దీనివలన మన దేమిపోవుచున్నది? మానవులెట్లు కర్మము నొనరింతురో అట్లు ఫలము నొందుదురు. విత్తిన దెద్దియో అదియే మొలచును. మఱియు దానినే మానవు లనుభవింతురు. ౨౫ ముందుఁగూడ నెవఁ డెట్లుగావించునో యట్లు ఫలమొందును. భక్తియోగమువలన భగవానుఁడు లభించును. భగవంతునకు భక్తునకు నైక్యము కలుగుటవలన అపూర్వమగు సమాధానము ప్రాప్తించును. ౨౬ చచ్చిన పిమ్మటఁ దమకీర్తిని లోకమున వదలిపోవనివారలు సాధారణముగ నిల్లే లోకములోనికి వచ్చుచుఁ బోవుచుందురు. చతురులయ్యును ధర్మమును మఱతురు. ఏమి చెప్పవలయును? ౨౭ అంతయు నిచటి దిచటనే యుండునని తెలియుచున్నది. ఓయీ సోదరా! చెప్పవేమి? ఎవ్వఁ డేమితీసికొని పోవుచున్నాఁడు? ౨౮ సాంసారికపదార్థముల విషయమున ఉదాసీనతతో నుండవలెను. మఱియు నిశ్చింతగ వివేకమును సాధింపవలయును. ఇట్లు చేయుటచే అలభ్యుఁడగు జగదీశ్వరుఁడు లభించును. ౨౯ జగదీశ్వరుఁడు

లభించుటకు సమానమగు లాభమెద్దియు లేదు. అవసరమునుబట్టి అన్నింటి నొనరించుచు గృహకర్మములు నెఱవేర్చుచునుండినను గూడ సమాధానము బ్రాప్తించును. ౩౦

పూర్వకాలమునందు జనకాదిరాజన్యు లెందఱో రాజ్యమును బాలించుచు భగవానుని బొందిరి. ఇప్పటికిఁ గూడ నిట్టిపుణ్యశ్లోకు లెందరో గలరు. ౩౧ రాజునకొకవేళ మృత్యువాసన్నమగుచో నారాజు తనకున్న దిగదాయని లక్షలు కోట్లకొలఁది రూప్యముల లంచమిచ్చెద నన్నను మృత్యు వాతని నేమాత్రమును విడువఁజాలదు. ౩౨ ఇది యిట్టి పరాధీనజీవితము. జీవికసంబంధములగు నానావిధకష్టోద్వేగ చింతాదులయం దెంతదనుకఁ జిక్కుకొని యుందము? ౩౩ కావున మానవులారా! ప్రపంచమను (గార్హస్థ్యమను) వ్యాపారవీధి తెఱువఁబడి యున్నది. దీనియందుఁ జరించి యీశ్వరుఁడను లాభమును ఆర్జింపుఁడు. అప్పుడే యీ కష్టములకుఁ బ్రత్యామ్నాయము లభించును. ౩౪

తొమ్మిదవ సమాసము.

ప్రయత్నమును గూర్చినయుపదేశము.

దుర్బలులును, జేతకానివారలును, దరిద్రులును, సోమరులును, దింతిపోతులును, ఋణగ్రస్తులును నగుమనుజులందఱును మూర్ఖత్వమువలననే న్యస్తులై (వేసవసినవారలుగ) యున్నారు. ఇంక నేకారణమునను గాదుసుమా! ౧ “తినుటకు లేదు, త్రాగుటకు లేదు, తొడుగుటకు లేదు, పఱచుకొనుటకు లేదు, కప్పుకొనుటకు లేదు. కడకు నివసించుటకు గుడిసెగూడ లేదు. అభాగ్యుఁడై యున్నాఁడు. ౨ సహాయులు లేరు, కుటుంబులు లేరు. ఇష్టులు లేరు, మిత్రులు లేరు, ఎఱిఁగినవారలు కూడ నెచ్చటను గానిపింపరు. ఆశ్రయరహితుఁడును బరదేశియును నై యున్నాఁడు. ౩ ఇట్లున్న పురుషుఁ డేమిచేయవలయును? ఎవరిసహాయమును దీసికొనవలయును? బ్రదుకవలయునా? లేక చావవలయునా? ఏవిధముగ వర్తింపవలయును? తెలుపు”మని యొకఁడు ప్రశ్నించెను. ఈప్రశ్నమున కింకొకఁ డీవిధముగాఁ బ్రత్యుత్తర మొసంగెను. శ్రోతలు సావధానులై వినవలెను. ౪

పెద్దపనిగానిమ్ము, చిన్నపనిగానిమ్ము, చేయని దేదియుఁ గాఁజా

లదు. కావున నోనిర్భాగ్యుఁడా! ప్రయత్నమును గావింపుము. దానివలన నీవుగూడ భాగ్యవంతుఁడ వగుదువు ౬ చిత్తమే సావధానముగ నుండనపుడును యత్నముగూడఁ బూర్తిగ నెరవేరనపుడును, సుఖసంతోషములు లభింపవలయునన్నచో నెట్లు లభించును? ౭ కావున సోమరితనమును విడువవలయును. పరిశ్రమతోఁ బ్రయత్నము చేయవలెను. ఇంతియగాక దుశ్చిత్తతను దొలంగఁద్రోచి వెలువరింపవలెను. ౮ ప్రాతఃకాలమున లేచి ప్రాతస్స్మరణము గావించి నిత్యనియమానుసారముగ సుభాషితములను గొన్నింటిని పఠింపవలెను. ౯ వెనుకటిదానిని వల్లించి ముందు దానిని బఠింపవలెను. నియమబద్ధముగఁ బ్రవర్తింపవలెను. వ్యర్థముగ వదరరాదు. ౧౦ మలవిసర్జనమునకు దూరమేగి పవిత్రుఁడై రావలెను. మఱల వచ్చునపుడు ఏదేని గొనిరావలెను. రిక్తహస్తములతో వచ్చుట మంచిదిగాదు. ౧౧ ధౌతవస్త్రములను బిండి ఆరవేయవలెను. పాదములను బాగుగాఁ గడుగుకొనవలెను. అనంతరము యథావిధముగ దేవదర్శనమును దేవతార్చనమును గావింపవలెను. ౧౨ పిదపఁ గొంచెము ఫలాహారమొనరించి తనవృత్తిని నొనర్పవలెను. పరులనుగూడఁ దనవారలుగ నెంచవలెను. ౧౩ సుందరముగా నక్షరములను లిఖింపవలెను. స్పష్టముగను సరిగను జదువవలెను. మనన మొనరించి మర్మమగునర్థము గ్రహింపవలెను. ౧౪ యుక్తమును సుందరమునగురీతిగఁ బ్రశ్నింపవలెను. చెప్పునది బాగుగాఁ దెలియునట్లు స్పష్టపరచి చెప్పవలెను. అనుభవములేనిది చెప్పఁగూడదు. అట్లుచెప్పుటవలనఁ బాపము కలుగును. ౧౫ సావధానముగ నుండవలెను. నీతిమర్యాదలను గాపాడవలెను. జనులకు రుచించునట్లు క్రియాసిద్ధి నొనరింపవలెను. ౧౬ వచ్చినవానికి సమాధానము కలిగించి హరికథ, అధ్యాత్మనిరూపణము, సందర్భోచితవర్తనము జరుపవలెను. ౧౭ తాళము, చిఱుతలు, ముద్ర, అర్థము, ప్రమేయము, అన్వయము, మున్నగునవి, శుద్ధముగ నుండవలెను. గద్యపద్యాది దృష్టాంతములు గూడ శుద్ధముగఁ గ్రమానుసారముగ నుండవలెను. ౧౮ పాడుట, వాయించుట, ఆడుట, హావభావములను వెల్లడిచేయుట, సభారంజకములగు మాటలనుడువుట, ఉపకథ, ఛందఃప్రబంధములు మొదలగునవియెల్ల సరిగను చక్కఁగను నుండవలెను. ౧౯ పెక్కండ్రసమావేశపఱచి యెవరికేది

యిచ్చరియో దానినే చెప్పవలెను. మఱియు కథయందు త్రుటులను (అపుటలు) జేరనీయరాదు. ౨౦ జనులను మిక్కిలిగ వెక్కిరింపరాదు. లోకులహృదయములను విప్పవలెను. ఇట్లొనరించినయెడల సులభముగా యశము వ్యాపించును ౨౧ భక్తిజ్ఞానవైరాగ్యయోగములను మననముగావించినంతనే భవరోగములు దూరమగు నానావిధసాధన ప్రయోగములను జనసముదాయమునకు వివరింపవలెను ౨౨ వాక్యములను వర్తనమును సమానముగ నుండవలెను. దీనివలన స్వాభావికముగ మహంతుధర్మము (సాధువృత్తి) ప్రాప్తించును ౨౩ యుక్తరహితమగునది యెంతమంచిదైనను బరిగ్రహింపరాదు. అదిదురాశారోగము. దానివలన వెంట నుండువారికిఁ గష్టముగల్గును ౨౪ కావున నిట్లెప్పుడును జేయఁజనదు. జనులకుఁ గష్టము కల్గనీయరాదు. హృదయమునందు సమర్థరఘునాథుని జింతించుచుండవలెను ౨౫ ఉదాసీనవృత్తి జనుల కామోదావహముగ నుండును. ఇంతియగాక కథానిరూపణముగూడఁ గావింపనగును. రామకథను సంపూర్ణబ్రహ్మాండమునందు వ్యాపింపఁజేయవలెను ౨౬ సాంగోపాంగలక్షణయుక్తుఁడై సుందరముగ లోకప్రియముగ గానము గావింపనేర్చిన మహంతునకు వైభవమునకుఁ గొఱంత యెన్నఁటికిని గలుగదు. ఆకాశమునందుఁ దారాగణము లొక్కచోఁ గూడియున్నట్లు మహంతువద్ద జనులు గుమిగూడియుందురు ౨౭ ఎచ్చట బుద్ధియుండదో యచట సర్వమును అవ్యవస్థగనేయుండును. బుద్ధియనున దొక్కటిలేనిచో సమస్తమును వ్యర్థమే. ౨౮ ఆ బుద్ధిని విస్తరింపఁజేసి మానవుఁడు బ్రహ్మాండముకంటె గొప్పవాఁడు కావలెను. ఇటు లొనరించినచో నీచమగు దరిద్ర మెచ్చటినుండి రాఁగలదు? ౨౯ ఇంతటితో సందేహము తొలంగిపోవును. యత్నమునందు హృదయము ప్రవేశించును. అంతఃకరణమునందు (యత్నమునొనర్చిఫలము లభించునను) కొంతయాసగూడ అభివృద్ధినొందును ౩౦

పదియవసమాసము.

ఉత్తమపురుషుఁడు.

కడుపునిండ భుజించి పిమ్మట మిగిలినఅన్నమును బంచిపెట్టవలెను.

వ్యర్థముగఁ బారవేయుటధర్మముగాదు ౧ ఇట్లుసాధకుఁడుతొలుత జ్ఞానమునుగడించి తృప్తి నొందవలెను. తరువాత ఆజ్ఞానమును లోకులకుఁ జెప్పవలెను. మునిఁగిపోవువారల నుద్ధరించుట ఈఁతనేర్చినవానికి ధర్మము ౨ ఉత్తమగుణములను దాను స్వయముగ ముందు గ్రహింపవలెను. తరువాత వానినే పలువురకుఁ దెలుపవలెను. తాను నడుచుకొనక యితరులకుఁ జెప్పునదంతయు మిథ్య ౩ స్నానము, సంధ్య, దేవతార్చనమునొనర్చి ఏకాంతమునందు జపమును ధ్యానమును గావింపవలెను. హరికథను అధ్యాత్మనిరూపణమును గావింపవలెను ౪ శరీరమును బరోపకారమున నన్వయింపవలెను. పెక్కుమందికుపకరింపవలెను. ఎవరికిని హాని గలుగనీయరాదు ౫ దుఃఖులు, పీడితులు నగువారల నెఱుంగవలెను. యథాశక్తిగ నట్టివారలకుఁ దోడ్పడవలెను. అందఱితో మృదుమధురముగా మాటలాడవలెను ౬ ఇతరులదుఃఖములనుగాంచి దుఃఖియు, ఇతరులసుఖము గాంచిసుఖియు నగువాఁడె ఉత్తమపురుషుఁడు. మృదువచనములతో ప్రాణిమాత్రులను గలుపుకొనవలెను ౭ పెక్కుమంది యన్యాయమును క్షమింపవలెను. పెక్కుమందితలపైఁగల కార్యమును దానొక్కరుఁడె చేయవలెను, మఱియుఁ బరులను సన్మానింపవలెను ౮ ఇతరుల హృదయములోనిభావమును గ్రహించి తదనుసారముగాఁ బ్రవర్తింపవలెను. జనులను నానావిధముల నట్లు పరిశీలింపవలెను. ౯ మితభాషిగ నుండవలెను. తత్కాలముననే ఉత్తరము చెప్పవలెను. ఎప్పుడును క్రోధస్వభావముతో నుండరాదు. క్షమరూపుఁడై యుండవలెను. ౧౦ సోమరితనము నంతలో విడిచి ప్రయత్నమును విశేషించి చేయవలెను. ఎవరిపట్లఁగూడ మత్సర ముంచరాదు. ౧౧ ఉత్తమపదార్థము నితరులకీయనగును. శబ్దము నాలోచించి పలుకుట యుచితము. సమాధానము వెంటఁ దనగృహస్థధర్మమును సంబాళించుకొనఁదగును. ౧౨

మరణమును స్మరణమునందుంచుకొని హరిభక్తియందు తత్పరభావముతోనుండవలెను. మరణానంతరమునఁగూడ భూలోకమునఁ దన కీర్తిని నిలిపియుంచవలెను. ౧౩ ఉత్తమవర్తనము గలమానవుఁడు జనులందఱకుఁ బరిచితుఁడై యుండును. ప్రజలందఱియెడ వినీతభావము గలిగివర్తించువాని కేవిషయముననేని లోపము గలుగదు. ౧౪ ఇట్టి

యుత్తమగుణములు గలవానినే వాస్తవమునకుఁ బురుషుఁ డనఁదగును. అతఁ డొనరించుభజనవలనఁ బరమాత్ముఁడు తృప్తినొందును. ౧౫ ఇతరు లెంతధిక్కరించిమాటలాడినను దనశాంతిని భంగముగావింపఁదగదు. దుర్జనులతోఁ గలిసిమెలసియుండు సాధువులు ధన్యులు (అనగా దుర్జనులను దమవంటివారలనుగఁ జేసికొందురు.) ౧౬ జ్ఞానవైరాగ్యాది ఉత్తమగుణములతో శోభించుమానవుఁ డొకఁడే యీభూమండలమున యోగ్యుఁడు. ౧౭ తాను స్వయముగాఁ గష్టమునుసహించి పలువురికుపకారము జేయవలెను. మఱియు నీవిధముగాఁ దన దేహమును బరోపకారమునందు నియోగించి కీర్తిరూపముతోఁ బ్రపంచమునం దమరుఁడై యుండవలెను. ౧౮ కీర్తినాశించినచో సుఖము లభింపదు. సుఖమునాశించినచోఁ గీర్తి లభింపదు. విచారములేని సమాధాన మెచ్చటను లేదు. ౧౯ రెండవవానిహృదయమునకు శ్రమ గలుగఁజేయఁ జనదు. మఱెవ్వ నెప్పటికిని దరిజేరనీయఁగూడదు. క్షమాశీలుఁడగువాని ప్రతిష్ఠ కెప్పటికిని హానిగలుగదు. ౨౦ తనదైనను, బరునిదైనను కానిమ్ము, అందఱిపనులను నెరవేర్పవలెను. సమయమువచ్చినప్పుడు పనిచేయుటలో వెనుదీయుటమంచిదిగాదు. ౨౧ చక్కఁగ (నమ్రతగ) మాటలాడుటవలన సుఖముగలుగునని యంద ఱెఱింగియున్నారు. పరునిసైతము ఆత్మీయునివలె నాదరింపవలెను. ౨౨ కఠినశబ్దములు కటువుగనుండునని అంద ఱెఱింగియుఁ గొందఱు కఠినవాక్యముల నేలకో నుడువుచుందురు. ౨౩ తనవద్దనున్నచిన్న వస్తువు నింకొకఁడు గైకొనినచో మనస్సున కెంతేని శ్రమగలుగును. ఇట్లే యెల్లరకు నుండునని గ్రహింపవలెను. ౨౪ ఇతరులకు మనోవేదనమును, గష్టము గలిగించు వాణి అపవిత్రమైనది. అపవిత్రవాణి యెప్పుడోయొకప్పుడు తననుగూడ సంహరించును. ౨౫ విత్తినదే మొలచును. మాటలాడినరీతిగనే ప్రత్యుత్తరము లభించును. ఇట్టిస్థితిలోఁ గర్కశముగా నేలమాటలాడవలెను? ౨౬ తనపురుషార్థవైభవములవలనఁ బలువురకు సుఖము గలుగఁజేయుట యుక్తమెగాని ఎవరికైనను గష్టము గలుగఁజేయుట రాక్షసకార్యము. ౨౭ దంభము, దర్పము, అభిమానము, క్రోధముగలమాటలు పలుకుట అజ్ఞానిలక్షణమని భగవద్గీతయొక్క పదునాఱవయధ్యాయమునందలి నాలుగవశ్లోకమునఁ జెప్పఁబ

డెను. ౨౮ ఉత్తమగుణశోభితుఁడే మిగుల సజ్జనుఁడు. అట్టివానికై మనుజులెందఱో వెదకుచుందురు. ౨౯ క్రియలేని కేవల శబ్దజ్ఞానము కుక్కగావించినవమనము. యోగ్యుఁడగువాఁడు దానివైపు చూడనే చూడఁడు. ౩౦ మనస్సుబురికొల్పి భక్తియోగము ననుష్ఠించు వాఁడును ఉత్తమగుణముల నవశ్యముగా గ్రహించువాఁడును నగుమహా పురుషునికై జనులు వెదకుచుందురు ౩౧ ఇట్టి మహానుభావులగు పురుషులు జనసముదాయమును ప్రోగుచేయవలెను. భక్తియోగముతో దేవాధిదేవుఁడగు పరమాత్ముని దనవానినిగాఁ జేసికొనవలెను ౩౨ ఎప్పుడో యొకదినమున నాకస్మికముగాఁ జావవలసియున్నదిగదా! ఇక (మరణానంతరము) భజనము నెవ్వఁడు చేయఁగలఁడు! ఇట్లు తలపోసి ఇంకను బెక్కండ్రుజనులను భజనమునకు సమకూర్పవలెను ౩౩ (నాయభి ప్రాయమేమని యడిగినచో) శిష్యుల నింకేమియు నడుగఁజనదు. ఓయన్న లారా! నేను మరణించినపిదప మీరలందఱును జగదీశ్వరుని భజింపు చుండుఁడు. (ఇదియే నాకోరిక అనెదను) ఇదియె నాప్రతిజ్ఞ ౩౪ కావున మిగుల నుత్సాహముతో జనసముదాయమును ప్రోగుజేయవలెను. త్వరితముగ దేవాధిదేవుని ప్రసన్నుని గావించుకొనవలెను. ౩౫

ఇఁక సముదాయముకొఱకు ఆవశ్యములగు విషయములు రెండు గలవు. శ్రోతలందఱును సావధానముగ మనస్సు నిటనుంచి యవియేవియో వినవలెను ౩౬ పెక్కుమందిహృదయములలో భక్తియేయుక్తివలన నుత్పన్న మగునో నాయుక్తి ప్రబోధయుక్తి (బోధించునైపుణ్యము) అనేకులహృద యములనుదనచేతిలోనికిఁ దీసికొనవలెను. ౩౭ వెనుక వివరింపఁబడిన యుత్తమ గుణములు మానవున కుండవలసినవె! కాని ప్రబోధశక్తి (ఉపదేశము నిచ్చెడుబలము) వాని యన్నింటికంటె నత్యధికావశ్యకము ౩౮ రెండవ విషయమెద్దియన్న! చెప్పినదాని నెవఁడనుసరించునో మొదటఁ దానాచ రించి పిదప నితరుల నెవఁడుజేయుమనిచెప్పునో అట్టివానిమాటల నెల్లరును సత్యమని యంగీకరింతురు ౩౯ జనులు తమకు రుచింపనిమాట లెన్నఁటికిని విశ్వసింపరు. ఆపరిస్థితులలో నొంటరిగ నొక్కమనుజుఁ డేమిచేయఁగ లఁడు ! ౪౦ కావున వెంబడించువారలు (అనుయాయులు) ఉండవలెను. కొద్దికొద్దిగ వారికి నేర్పవలెను. మెల్లమెల్లఁగ వివేకసహాయమున వార

లను దీర్చము జేర్పవలెను ౪౧ కాని యిది వివేకముతోఁ గాదగుపని. దీనిని వివేకులే చక్కఁగ యుక్తాయుక్తముగ నెరవేర్పఁగల్గియుందురు. ఇతరులవలననన్ననో! పాపము ఇతరులు భ్రమకులోనై తగవులాడుచుందురు ౪౨ సైన్యమేమియు లేని ఒంటరిమనుజుఁడు పలువురితోఁ బోరాడి యెట్లు జయింపఁగలఁడు? ఈకారణముననే పలువురుమనుజులను దనకిష్టులనుగ నుంచుకొనవలెను. ౪౩

పదమూఁడవదశకము.

మొదటిసమాసము

ఆత్మానాత్మవివేకము.

ఆత్మనుగూర్చియు అనాత్మనుగూర్చియు వివేచన మొనరింప వలెను. అనంతరమున చక్కఁగ మననముగావింపవలెను, మనన మొనర్చి దృఢపూర్వకముగ మనస్సునందుభరింపవలెను. ౧ ఆత్మయెద్ది! అనాత్మయెద్ది! దీని నిరూపణమును సావధానులరై వినుండు. ౨ పురాణములలోఁ జెప్పఁ బడిన విధముగా నాలుగుఖనులు (అండజస్వేదజాది నాలుగుయోనులు) నాలుగువాణులు (పరాపశ్యంతి మొదలగు వాక్కులు) ఎనుబదినాలుగు లక్షల జీవజాతులు లోకమునందు వర్తించుచున్నవి. ౩ ఈసృష్టియందు అపారములు నానావిధములు నగు శరీరములు గలవు. వానిలో ఆత్మ యెద్దియో యిపుడు నిర్ణయింపవలెను. ౪ ఆత్మ ప్రత్యక్షదృష్టితో జూచుచున్నది. శ్రవణముతో నాలించుచున్నది. నాలుకతోఁ జవిజూచు చున్నది. ౫ ఘ్రాణముతో వాసనజూచుచున్నది. సర్వాంగములతోఁ దాకుచున్నది. వాక్కునందు శబ్దజ్ఞానము గలుగఁజేయుచున్నది. ౬ ఆత్మ సావధానముగనుండి చంచలమైయున్నది. అది యొక్కటియే ఇంద్రియ సహాయమున నలుదిక్కులను సమగ్రముగు నలజడి గలిగించుచున్నది. ౭ ఆత్మ పాదములను నడిపించుచున్నది. చేతులను గదిలించుచున్నది. కను బొమ్మలఁ జిట్లించుచున్నది. కనులను ద్రిప్పుచున్నది. మఱియు నితరసంకే

తములను జూపుచున్నది. ౮ ఆత్మ దంభములు పలికించుచున్నది. లజ్జింపఁ జేయుచున్నది, గోకించుచున్నది. దగ్గుచున్నది. వమనముగావించుచున్నది. ఉమియుచున్నది. అన్నముతినుచున్నది. నీళ్ళను ద్రాఁగుచున్నది. ౯ ఆత్మ మలమూత్రములను విసర్జించుచున్నది. సంపూర్ణ దేహమును నిర్వహించుచున్నది. ప్రవృత్తినివృత్తుల విచారించుచున్నది. ౧౦ ఆత్మ వినుచున్నది. చూచుచున్నది. ఆఘ్రాణించుచున్నది. రుచిజూచుచున్నది. నానావిధముల గుర్తించుచున్నది. సంతోషించుచున్నది. మఱియు భయపడుచున్నది. ౧౧ ఆనందము, వినోదము, ఉద్వేగము, చింత, కాయము, ఛాయ, మాయ, మమతల ననుభవించునదియు జీవితకాలమున నానావిధ వ్యథల నొందునదియు ఆత్మ ౧౨ పరమార్థమునం దాసఁ బెట్టుకొనునదియు జనులలో మంచిచెడుఁగుల గావించునదియుఁ దనవారలను బ్రతికించునదియుఁ బెరవారలఁ జంపునదియు నాత్మ ౧౩ యుద్ధసమయమునందు ఉభయదళములలోని మనుజుల దేహములం దాత్మ యాపరించియున్నది. ఆత్మ చచ్చుచుఁ బడుచుఁ జంపుచుఁ బడవేయుచునున్నది. ౧౪ ఆత్మవచ్చుచున్నది. పోవుచున్నది. దేహమున వర్తించుచున్నది. నవ్వుచున్నది. ఏడ్చుచున్నది. పశ్చాత్తాపము నొందుచున్నది. ఉద్యోగానుసారముగ ధనవంతుఁడో దరిద్రుఁడో యగుచున్నది. ౧౫ పిఱికిపందగను, బలవంతుఁడుగను, విద్యావంతుఁడుగను, మూఢుఁడుగను, న్యాయవంతుఁడుగను, ఉద్ధతుఁడుగను నగుచున్నది. ఆత్మయే ౧౬ ధీరత్వము, ఉదారత్వము, కృపణత్వము, ఉన్మత్తత్వము, విచక్షణత్వము, ఉచ్ఛృంఖలత్వము, సహనశీలత్వము మున్నగుభావములు గలదియే ఆత్మ ౧౭ విద్య, కువిద్యయను రెంటిలో నానందరూపమున వ్యాపించి వర్తించునదియు, ఎచ్చటఁ జూచిన నచ్చట నన్నిదెసలఁ గాన్పించునదియు ఆత్మ నాఁబడును. ౧౮ నిద్రించుచుఁ, గూర్చుండుచు, లేచుచు, నడచుచు, బరుగెత్తుచు, ఊగుచుఁ, బొరలుచు, మఱియు జోడుగనుండి యోచనలఁ గావించుచు నుండునదియే ఆత్మ ౧౯ పుస్తకము చదువునది, అర్థమును వివరించునది, తాళముదధరించునది, పాడఁదొడంగునది, వాదవివాదములను గావించునది యాత్మయేసుమా ౨౦ దేహమునం దాత్మలేకున్నచో నా దేహము శవమగును. ఆత్మ దేహమును వెంబ

డించుకొని సర్వము గావించుచున్నది. ౨౧ ఒకటి లేకున్నచో రెండవది యొందుఁకుఁ బనికిరాదు. ఆత్మ శరీరముల సంయోగమువలన సమస్తవ్యాపారములును నడచుచున్నవి. ౨౨ దేహ మనిత్యము, ఆత్మనిత్యము, ఇదియే నిత్యానిత్యవివేకము, ఆసూక్ష్మము (ఆత్మ) యొక్క సంపూర్ణవృత్తాంతమును జ్ఞానులే యెఱుంగుదురు. ౨౩ పిండమునందు దేహధారి జీవుఁడు. బ్రహ్మాండమునందు దేహి శివుఁడు. మఱియు నీశ్వరతను చతుష్టయమునందు దేహి యీశ్వరుఁడు ౨౪ త్రిగుణాతీతుఁడగు అర్ధనారీనటేశ్వరునివలననే సమస్తసృష్టివిస్తారము జరిగెను. ౨౫ అచట (అర్ధనారీనటేశ్వరునందు) స్త్రీత్వపురుషత్వములెవ్వియు లేవనియు గొంచెముగనో గొప్పగనో చంచలరూపముగ గోచరించుననియుఁ జక్కఁగ విచారించినచో విశదమగును. ౨౬ ఆదినుండి యంత్యముదనుకను బ్రహ్మవిష్ణుమహేశ్వరులు మొదలుకొని చీమదనుకను నందఱును దేహధారులే ఈనిత్యానిత్యవివేకమును జతురులగువారలెల్లరు నెఱుంగవలెను. ౨౭ జడమంతయు అనిత్యము. సూక్ష్మమంతయు నిత్యము. ఇందు నిత్యమెద్దియో అనిత్యమెద్దియో ముందే చెప్పితిమి. ౨౮ (యోగులు) వివేకముతో నీస్థూలసూక్ష్మములను రెంటిని లంఘించి పోవుచున్నారు. కారణ మహాకారణ దేహములనుగూడ విసిచివేయుచున్నారు. మఱియు విరాట్టు, హిరణ్యగర్భులనుసైతము ఖండన మొనరించుచున్నారు. ౨౯ దీనికిఁ బిమ్మట వృత్తి అవ్యాకృతమగు మూలప్రకృతిలోని కరిగి కూర్చుండును. ఇఁక నీవృత్తిగూడ నివృత్తియగుటకు అధ్యాత్మనిరూపణమును వినవలెను. ౩౦ ఇచటఁ జెప్పఁబడిన ఆత్మానాత్మవివేకమువలనఁ జంచలాత్మ ప్రత్యయము నకు వచ్చును. ఇఁక రాఁబోవుసమాసమునందు సారాసారముల నెఱింగించెద. ౩౧

రెండవసమాసము.

సారాసార విచారము.

ఈకనంబడుచున్న సంపూర్ణబ్రహ్మాండాడంబరమునందు సారమెద్దియో అసారమెద్దియో గుర్తెఱుంగవలెను ౧ కనఁబడునదియెల్ల నశించుచున్నది. వచ్చునదియెల్లఁ బోవుచున్నది. కావున నెల్లప్పుడు చెదరకయుం

డుదానినే సారమని గ్రహింపవలెను. ౨ గతసమాసమునందుఁ జెప్పిన ఆత్మానాత్మవివేకమున ఆత్మయెట్టిదో గుర్తించి విడివైచితిమి. అంతియ గాక ఆత్మ నెఱుంగుటవలన మూలమాయయొక్క జాడ గోచరించెను. ౩ కాని ఆమూలమాయలో శేషించెడి వృత్తి గూడ నివృత్తిగావలెను. అందులకై శ్రోతలు సారాసారవిచారము చక్కఁగ జేయవలెను. ౪ నిత్యానిత్యవివేచనము గావించితిమి. ఆత్మ నిత్యమని స్థాపించితిమి. కాని యానిరాకారమునందుఁగూడ నివృత్తిరూపముతో హేతువు (నివృత్తియనుభావన) అట్లే నిలచియున్నది. ౫ ఈహేతువనునదిగూడఁ జంచలమే! వాస్తవమునకు నిశ్చలము నిర్గుణమైయున్నది. సారాసారవిచారమువలన నీచంచలము (ఆత్మభావన)గూడ నిరసనమైపోవును. ౬ ఇది నశ్వరము. కావుననే యిది చంచలము. అది శాశ్వతము కావుననే నిశ్చలము. నిశ్చలమునందుఁ జంచల మిగిరిపోవును. ౭ జ్ఞానమును, ఉపాసనమును, జక్కఁగఁ దెలిసికొనుము. ఉపాసనమువలన జనులును, జగత్తును ఉద్ధరింపబడుదురు ౮ ద్రష్ట, సాక్షి, జ్ఞాతి, జ్ఞానధని, చైతన్యము మొదలగు వానికన్నిఁటికిని బయినున్నసత్తయు, ఈజ్ఞానస్వరూపు లన్నియుఁ బరబ్రహ్మమేయని చక్కఁగ విచారించుకొనుఁడు ౯ కాని యాజ్ఞానముగూడ విజ్ఞానమగును. మతములన్నింటిని జక్కఁగ విచారించి చూడుఁడు. చంచలమంతయు నాశనమగుచున్నది ౧౦ నాశవంతమగుచున్నదెల్ల నిజముగ నాశమగుచున్నదా లేదాయని సంశయించుపురుషుఁడు సులభముగ నన్నిఁటికిని జ్ఞానాధికారి కాఁజాలఁడు ౧౧ నిత్యమును నిశ్చయముగ నెఱింగినపిమ్మటఁగూడ నొకవేళ సందేహములకుఁ బాల్పడుచో నట్టిమానవుఁడు మహామృగజలమునందుఁ గొట్టుకొనిపోవుచుండెనని భావింపనగును ౧౨ పరబ్రహ్మమునకు క్షయము లేదు. అది యక్షయము. సర్వవ్యాపి. ఆనిర్వికారమునందు హేతువు (సందేహము) లేనేలేదు ౧౩ పరబ్రహ్మము మిగులగొప్పదియు సఘనము నైయున్నది. ఆదిమధ్యాంతములయందది అచలముగ, అటలముగఁ, బూర్ణముగ యథావిధమున నున్నది ౧౪ చూచుటకది గగనముగ నున్నను గగనముకంటెను మిగుల సఘనముగా నున్నది. దానియందంజనము (మలముతమము లేక అనిత్యత) లేదు. అదినిరంజనముగను నిరంతర మేకరీతిగఁ బ్రకాశించునది

గను నున్నది ౧౫ చర్మచక్షులు, జ్ఞానచక్షులుగూడ నిరర్థకములే. నిర్గుణము వాస్తవమునకు అలక్ష్యము, లక్ష్యింపఁబడనేరదు ౧౬ సర్వసంగపరిత్యాగము గావింపనిది మానవులు పరబ్రహ్మమును గాంచఁజాలరు. మాన్యగర్భుని (బ్రహ్మమును) సర్వసంగత్యాగమొనరించి దర్శింపవలెను. ౧౭ నిరసనము గావించుటవలన సమస్తమును వెడలిపోవును. చంచలమంతయుఁ దొలంగును. నిశ్చలపరబ్రహ్మము నిలుచును. ఇదియే సారము ౧౮ ఎనిమిదవదేహముదనుక (మూలమాయవఱకు) నిరసనమగును. సాధుపుంగవులగు మానవులకుఁ గృపాపూర్వకముగ ముక్తిసాధనమును దెలుపుచున్నారు. ౧౯ "సోహం, హంసః" (ఆపరబ్రహ్మము నేనేనైయున్నాడను) తత్త్వమసి (అది నీవైయున్నావు.) ఈస్థితి వివేకమువలన సులభముగనే ప్రాప్తించును. ౨౦ ఈస్థితి నొందిన పురుషుఁడు పైకిఁజూచుటకు సాధకునివలె నుండును. కాని లోపల బ్రహ్మమైయుండును. వానికడ వృత్తిగూడ నుండదు. సారాసారవిచారమున కిదియె ఫలము. ౨౧ ఆపరబ్రహ్మము ఉష్ణత్వమొందదు. చల్లఁబడదు. తెలుపును, నలుపును కాదు. మాలిన్యముగాని, శుభ్రముగాని పొందదు. ౨౨ అది తడియదు. ఎండదు. చల్లారదు, కాలదు, మరియు దానినెవ్వరును గొనిపోఁజాలరు. ౨౩ అది కనుపింపదు. భాసింపదు. మొలువదు. నశింపదు. వచ్చుటలేదు. పోవుటలేదు. ౨౪ అది సన్ముఖముగనే యున్నది. నలుదిక్కులనున్నది. దానికి దృశ్యభాసము లేదు. ఇట్టి నిర్వికారబ్రహ్మమునందు లీనమగు సాధుపురుషుఁడే ధన్యుఁడు. ౨౫ నిర్వికల్పనముగ (కల్పనాతీతముగ) నుండునదియే సత్స్వరూపము. తక్కినదంతయు అసత్తు. (భ్రమారూపమునన్నది.) ౨౬ కృత్రిమమగుదానిని విడిచి సత్యమును గైకొనువాఁడె పరీక్షకుఁడు. అసారమును విడిచి సారమును (బ్రహ్మమును) గైకొనవలెను. ౨౭ ఎఱుఁగఁగా ఎఱుఁగఁగా ఎఱుకదనము లీనమైపోవును. మఱియు తన వృత్తిగూడఁ దద్రూపమైపోవును. దీనిపేరే ఆత్మనివేదనభక్తి ౨౮ వాచ్యాంశముతో భక్తిని, ముక్తిని బోధింపవలెను. లక్ష్యాంశముతో తద్రూపత ననుభవము గావింపవలెను. మననము చేయఁగఁ జేయఁగ నెప్పుడు హేతువుండదో యాయవస్థకే తద్రూపతయని పేరు. ౨౯ సద్రూపము,

చిద్రూపము, తద్రూపము, తరువాత స్వస్వరూపము, తనరూపము అను నీదశలన్నియుఁ దత్త్వనిరసనమైనపిదపఁ గలుగుచున్నవి ౩౦

మూఁడవ సమాసము

ఉత్పత్తినిరూపణము.

బ్రహ్మము, ఘనమును, నిరాకారమును, నై యున్నది. ఆకాశమునకంటె నధికమగువిశాలముగను, నిర్మలముగను, నిశ్చలముగను, నిర్వికారముగను నున్నది. (౧) బహుకాల మిట్లున్నపిదప నచటినుండి భూగోళము ఉదయించును. ఇపుడాభూగోళమూలమున శ్రోతలు సావధానచిత్తులై వినఁగోరెదను. ౨ నిశ్చలపరబ్రహ్మమునందుఁ జంచలమగు సంకల్పముదయించును. ఆసంకల్పమునే ఆదినారాయణుఁడనియు జగదీశ్వరుఁడనియు, మూలమాయయనియు, షడ్గుణైశ్వర్యసంపన్నుఁడనియు భగవంతుఁడనియుఁ జెప్పుదురు ౩. ౪. ఆపిమ్మట గుణక్షోభిణి యుండును. అచటనే త్రిగుణము లుదయించుచున్నవి. అచటినుండి ఓంకారము ఉత్పత్తియగుచున్నది ౫ అకార, ఉకార, మకారములు మూఁడుగలిసి ఓంకారమయ్యెను. పిమ్మటఁ బంచభూతములు జనించెను ౬ అంతరాత్మను ఆకాశమందురు. దానినుండి వాయువు, వాయువునుండి తేజము జనించెను ౭ వాయువురాపిడినుండి అగ్నియు, దానినుండి సూర్యబింబము నుత్పన్నమయ్యెను. ౮ శీతలవాయువువలన జలము జనించెను. జలము పేరుకొని పృథ్వియయ్యెను ౯ పృథ్వియందనంతకోటి బీజజాతు లుండును. పృథ్వియు జలమును ఐక్యమైనపిదప బీజములనుండి యంకురములు వెడలును. ౧౦ ఆయంకురములనుండి లతలు, పత్రములు, పుష్పములు బహువిధస్వాదుఫలములు జనించుచున్నవి ౧౧ పిదప నానావిధవర్ణములుగల రసయుతములగు పత్రములు, పూవులు, ఫలములు, మూలములు, ధాన్యములు, అన్నాదులు కలుగుచున్నవి ౧౨ అన్నమునుండి రేతస్సు (వీర్యము) కలుగును. రేతస్సువలనఁ బ్రాణు లుత్పన్నమగును. ఇదియందఱకును బ్రత్యక్షముగఁ దెలిసియున్నయంశమేగదా! ౧౩ అండజములు, జరాయుజములు, స్వేదజములు, ఉద్భిజ్జములు నున్నగువానికన్నింటికిని

బీజము పృథ్వియు జలము నై యున్నది. ఇదియే సృష్టిరచనమునందుఁగల యద్భుతచమత్కారము ౧౪

ఈవిధములుగ నాలుగుగనులు (అండజాదిసృష్టిభేదములు) నాలుగువాణులు, ఎనుబదినాలుగు లక్షలజీవయోనులు, మూఁడులోకములు, పిండము, బ్రహ్మాండము మున్నగునవన్నియు నిర్మాణమగుచున్నవి ౧౫ సంపూర్ణాష్టధాప్రకృతి సాధారణముగ మూలమాయయందే యుండును. ఉదకము పృథ్వితోఁగలసినపిమ్మట జడచైతన్యజీవములన్నియు జనించును. ఒకవేళ జలమే లేకపోయినచోఁ బ్రాణివర్గమంతయు మరణించును ౧౬ ఈచెప్పినదానిలో సందియ మావంతయు లేదు. వేదశాస్త్రపురాణాదులవలన నీయంశమును విశ్వసింపవలెను. ౧౭ విశ్వసింపఁదగిన సందేహయుక్తమగు నంశమును గ్రహింపఁదగదు. విశ్వాసములేనితావున నేవ్యవహారముగూడ నెరవేరదు ౧౮ ప్రవృత్తియందైనను, నివృత్తియందైనను ప్రతీతి కావలెను. ప్రతీతిరహితులై సందేహములలోఁ బడియుండువారలు వివేకహీనులుసుమా ౧౯

ఈవిధముగ సృష్టిరచనమునుగూర్చిన విస్తారమును సంక్షేపముగ వర్ణించితిని. ఇఁక నీవిస్తారమునకుఁ గలసంహారమును వినుండు ౨౦ ఆదినుండి యంతము దనుక జరుగునదంతయు నాత్మారాముఁడే జరుపుచున్నాఁడు. మఱియు నాతఁడే యథాయోగ్యముగ దీనివ్యవస్థనుగూడఁ గావించుచున్నాఁడు ౨౧ ఇఁకముందుఁ బ్రళయనిరూపణమును వినవలెను. ఇంతటితో నీసమాసము పూర్ణమగుచున్నది ౨౨

నాలుగవ సమాసము.

ప్రళయనిరూపణము.

ప్రళయకాలమునందుఁ బృథివి యంత్యమైపోవుననియు సంపూర్ణభూతములు నష్టమగుననియు శాస్త్రములందుఁ జెప్పఁబడెను ౧ నూఱుసంవత్సరములదనుక అనావృష్టియుండును. దీనిచే సంపూర్ణసృష్టి కాలిపోవును. పృథ్వియందుఁ బర్వతములుగూడ నిమిడిపోఁగలయంతటి నెఱ్ఱెలు పడిపోవును ౨ పండ్రెండుకళలతో సూర్యుఁడు భూమిని దపింపఁజేయును. సూర్యకిరణములనుండి అగ్నిజ్వాలలు వెలువడును. నూఱుసంవత్సరముల

దనుక భూమండలము తగులబడుచుండును ౩ వసుంధర సిందూరవర్ణ మొం
దును. శేషనాగము కాలి వేగముగ విషమును గ్రక్కును ౪ ఆవిషమునుం
డిన వెడలిహాలాహలజ్వాలలచే సప్తపాతాళములుగూడఁ గాలును. పాతాళ
లోకముగూడ నీవిధముగ మహాపావకమునందు భస్మమగును. ౫ పిదప
మహాభూతములు సంతప్తమగును. ప్రళయవాయువు బయలువెడలును.
నలుదిక్కులఁ బ్రళయాగ్ని విజృంభించును ౬ ఏకాదశరుద్రులు కుపితులగు
దురు. ద్వాదశాదిత్యులు కాలి వేంద్రమై పగిలిపోవుదురు. మఱియుఁ
ప్రళయకాలమునందు అగ్నులన్నియు నొక్కటియగును ౭ వాయుఘాత
మునను అశనిఘాతమునను భూమియంతయుఁ బగిలిపోవును. భూమికి సహ
జముగఁ గలపీఠస్థితి (సఘనత్వము) భిన్నభిన్నమగును ౮ అప్పుడు మేరుప
ర్వతముగూడ లెక్కలోనికిరాదు. ఎవరు దేనిని గాపాడఁగలుగుదురు?
చంద్రసూర్యులయొక్కయుఁ దారాగణముయొక్కయు ఆధారస్థానము
బంధింపఁబడును ౯ భూమి తనవీర్యమును (కాఠిన్యమును) విడచివేయును
పృథ్వియంతయు మండిపోవును. ఈవిధముగ నీబ్రహ్మాండము ఒక్కసారిగ
గాలిపోవును ౧౦

అనంతరము గొప్పవర్షము గురియును. అపుడుభూమండలము జల
మునందు లయమగును. ౧౧ కాల్చినసున్నము నీటిలోఁగరగిపోవునట్లు పృ
థ్విగూడఁ బిమ్మట నదృశ్యమగును. తన కాఠిన్యమునంతయు విడచి జలము
నందుఁ గలసిపోవును ౧౨ శేషకూర్మవరాహములు నష్టమగుటవలనఁ బృ
థ్వికిగలయాధారముతొలంగును. మఱియు నది తనసత్వమునువిడిచి నీటి
లోఁ గలయును ౧౩ ప్రళయ మేఘములొక్కచో గుమియగును. మిగులఘో
రధ్వనితో గర్జించును. మెఱుపులు, ఉఱుములు అఖండరీతిగఁ బ్రజ్వలిం
చును. కోలాహల ముప్పతిల్లును ౧౪ పర్వతములవంటి వడగండ్లు పడు
ను. కొండలనుగూడ నెగురఁగొట్టునంతటి గాలివీచును. నిరుపమానముగా
గాఢాంధకారము వ్యాపించును. ౧౫ సంపూర్ణనదులును సముద్రములును
నొక్కటియగును. ఆకాశమునుండి నదులు క్రిందికిఁబడు చున్నట్లుండును.
అంతర ముండదు. సర్వము జలమయమగును ౧౬ ఆజలముతోఁ బాటు పర్వ
తసమానములగు మత్స్యములు, కూర్మములు, సర్పములు పడును. గర్జన
ముకాఁగానే జలములో జలము కలియును ౧౭ సప్తసముద్రములయావరణ

ము గలసిపోవును. ఆవరణసేతువులు తెగును. సమస్తమునుజలమయమైనపిదపఁ
బ్రళయపావకుఁడు ప్రబలుఁడగును ౧౮ బ్రహ్మాండములకు సమమగు తప్త
లోహము జలసమూహము నింకించునట్లు జలమంతయు నదృశ్యమగును౧౯
సంపూర్ణజల మీవిధముగా నిగిరిపోవును. పిదప నంతయు నగ్నిమయ
మగును. ఆయగ్నిని బ్రళయవాయువు కొట్టివేయును. ౨౦ ఆధారరహిత
మగుటవలన దీప మారిపోవునట్లు ప్రళయపావకుఁడుగూడఁ జల్లారును.
పిదప అసంభవమగు వాయువు ప్రబలమగును. ౨౧ కాని మిగుల
విస్తృతమగు నవకాశము (ఆకాశము) నం దావాయువు లయమగును.
ఇట్లు ఈసంపూర్ణపంచభూతాత్మికమగు వ్యాప్తియంతయు సమాప్తి
యగును. ౨౨ మహదద్భుతమగు మూలమాయగూడఁ దనలోఁ దాను
మఱచి లయమొందును. ఈవిధముగా సంపూర్ణపదార్థమాత్రమునకు
నిలువ తావేయుండదు. ౨౩ సంపూర్ణమగు నీదృశ్యజగత్తును బ్రళయ
మీవిధముగాఁ గబళించును. జడచంచలములన్నియు లయమగును.
శాశ్వతమగు పరబ్రహ్మముమాత్రము కడకు నిలిచియుండును. ౨౪

ఐదవ సమాసము.

సృష్టి నిగూర్చిన కథ.

ఉదాసీనులగు సాధువు లిరువురు పృథ్వీపర్యటనము గావించుచుం
డిరి. వారలు మనోరంజనముకై యొకకథను జెప్పుకొనిరి. ౧ ఆయిరు
వురిలో నొక్కఁడు శ్రోతగ రెండవవాఁడు వక్తగ నైరి. ఏదేనియొక
మంచికథను జెప్పుమని శ్రోత వక్త నడిగెను. అట్లేచెప్పెదను. సావధాన
ముగ వినుమని యిట్లుచెప్పెను. ౨ ఒకానొకచోట స్త్రీపురుషులిరువురు
(ప్రకృతి - పురుషుఁడు) ఉండిరి. ఉభయులకు మిగులఁ బ్రేమయుండెను.
వారలిరువురును నిరంతరమొక్కచోట నొక్కటిగనే వర్తించుచుండిరి.
ఎప్పుడును వేఱుగాకుండిరి. ౩ ఇట్లు కొంతకాలము జరిగినపిదప వారి
కొకబాలుఁడు * జనించెను. ఆబాలుఁడు మంచికార్యకర్తగను, సర్వ
విషయములందును జతురుఁడుగను నుండెను. ౪ కొన్నిదినములు గడ

---

* సత్త్వగుణాత్మకుఁడును, చైతన్యస్వరూపుఁడును బ్రతిపాలకుఁడునగు విష్ణువు

చినపిదప నాపుత్రునకుఁగూడఁ * 1 గుమారుఁడు గలిగెను. అతఁడు తండ్రి కంటెఁగూడ నధికోద్యోగియయ్యెను. వ్యాపకత్వమునం దీబాలుఁడు తనతండ్రిలో అర్ధభాగము చతురుఁడయ్యెను. ౫ * 2 ఈతఁడు మిగుల గొప్పప్రయత్నమునుగావించెను. కన్యలను, పుత్రులను, (సమస్తసృష్టి) చాలమందిని గనెను. మఱియు నానాప్రకారములుగఁ జాలజనమును సమకూర్చెను. ౬ ఈతనిజ్యేష్ఠపుత్రుఁడు * 3 అజ్ఞానియుఁ గ్రోధియు నయ్యెను. కొంచెముమరినచో గొప్పసంహారము గావింపఁదొడంగెను. ౭ తండ్రి మౌనముగఁ గూర్చుండియుండెను. కుమారుఁడు (విష్ణువు) మిగులఁ బ్రయత్నము గావించెను. ఈతఁడు సర్వజ్ఞుఁడును జతురుఁడును మిగులమంచివాఁడును నయ్యెను. ౮ మనుమఁడు (బ్రహ్మ) ఆతనిలో సగమెఱుంగును, మునిమనుమఁడు (శంకరుఁడు) ఏమియు నెఱుంగఁడు. ఏమఱినచో సంహారముగావించును. మహాక్రోధి. ౯ కుమారుఁ డన్నింటిని బరిపాలించుచుండును. మనుమఁడు సరిగ వృద్ధిఁజేయును. మునిమనమఁ డాకస్మికముగ మఱచియున్నపుడు సమస్తమును సంహరించును. ౧౦ ఈ విధముగ వంశము వృద్ధినొందెను. మిగుల విస్తరమయ్యెను. మఱియు నానందముతోఁ జాలకాలము గడచెను. ౧౧ అనంతమగు విస్తృతినొందెను. పెద్దలనుడువు లెవరును విశ్వసింపరైరి. పరస్పరవిరోధములు వృద్ధినొందెను. ౧౨ గృహమునందు బలమగు కయ్యములు చెలరేగెను. ఇందుచేఁ జాలవఱకు సంహారమయ్యెను. పెద్ద పెద్దలయందే వైరముకలిగెను. అంతయు నిరంకుశమయ్యెను. ౧౩ అనంతరము ఉన్మత్తతవలన యాదవులకు నాశనముకలిగినట్లు అజ్ఞాన కారణమున వారలకందఱకును నాశనము కలిగెను. ౧౪ అంతయు మొదలంట నాశనమయ్యెను. కన్య పుత్రుఁడు మున్నగువారల నామములు చిహ్నములుగూడ శేషింపకపోయెను. ౧౫ ఈకథను మననముగావించు వానికి జన్మమృత్యువులు తొలంగును. వానిప్రతీతివలన శ్రోతయు, వక్తయు

* 1 రజోగుణాత్మకుఁడును చేతనాచేత మిశ్రితుఁడును, ఉత్పత్తికర్తయు నగు బ్రహ్మ * 2 అర్ధచతురుఁడగుట యెందుచేతననఁగా ! బ్రహ్మయందు అర్ధభాగము చేతనము, అర్ధభాగ మచేతనము నున్నది. *3తమోగుణాత్మకుఁడును అచేతనరూపుఁడును సంహారకుఁడునగు మహేశ్వరుఁడు.

ధన్యులగుదురు. ౧౬ ఇట్టి విచిత్రకథఁ బ్రపంచమునఁ బలుమాఱు జరుగుచు ముగియుచున్నది. ఈకథ నిట్లుజెప్పుకొని యోగోస్వాములు(సాధువులు) మౌనముగఁ దమత్రోవను వెడలిపోయిరి. ౧౭

ఈకథను మానవులందఱును మాటిమాటికిని మననము జేయుచుండవలెను. ౧౮ ఏమఱుపాటునను మఱపునను నుంటచే సంగ్రహముగ నింతవఱకుఁ జెప్పితిని. న్యూనాధికములకు శ్రోతలు క్షమింతురుగాత ౧౯ వివేకముతో నీకథను నిరంతర మాలించుపురుషులు జగదుద్ధరణము జేయుదురని దాసు నుడువుచున్నాఁడు ౨౦ ఆజగదుద్ధారణవిషయములను వివరణ మొనరింపవలెను. సారవస్తువు నన్వేషించి లోకుల సమ్ముఖము నందుంచుటయే నిరూపణము ౨౧ నిరూపణమును శ్రద్ధాపూర్వకముగ విచారింపవలెను. గుప్తతత్త్వముల నన్నిఁటినో దెలిసికొనవలెను. తెలిసికొనుచుఁ దెలిసికొనుచు నిస్సందేహి కావలయును. ౨౨ ఎనిమిది దేహములను వివరణముగావించి చూచినయెడల సహజముగనే నిస్సందేహత్వము ప్రాప్తించును. అంతియుగాక అఖండనిరూపణమువలన సమాధానము కలుగును. ౨౩ తత్త్వములనుగూర్చి గగ్గోలుపడుచున్నంతదనుక శాంతి లభింపదు. కావున నీతత్త్వములగగ్గోలును దూరము జేయవలెను. ౨౪ ఈసూక్ష్మసంవాదమునుమాటిమాటికిమననముగావింపవలెను. ఇఁక ముందు సమాసమునందు సావధానులరై శ్రోతలు లఘుబోధ వినఁగోరెద ౨౫

ఆఱవసమాసము.

* లఘు బోధము.

తొలుదొలుతఁ బంచతత్త్వములనామములు నేర్వవలెను. పిదపఁ దనయనుభవము మాత్రగఁగాని వానిస్వరూపము నెఱుంగవలెను. ౧ ఆవల శాశ్వతమెద్దియో అశాశ్వతమెద్దియో యనునది నిశ్చయ మొనర్పవలెను. ౨ పంచభూతవిచారము వానినామరూపములు, సారాసారనిశ్చయము నిపుడు వివరించెదను. సావధానులరై వినుండు 3 పృథివ్యాపస్తేజోవాయ్వాకాశము లనుపేరులతో ఐదుభూతము లున్నవి. ఇఁక వీని

* శ్రీసమర్థరామదాసస్వామి శ్రీఛత్రపతిశివాజీమహారాజునకు సింగణవాడియందు ఈలఘుబోధము నుపదేశించెనని పరంపరగఁ జెప్పుచున్నారు.

స్వరూపములను వినుండు. ౪ భూమిని పృథ్వియనియు, ఉదకమును అప్పనియు, అగ్ని సూర్యుఁడు మున్నగు సతేజఃపదార్థములను దేజమనియు నందురు. ౫ గాలిని వాయువనియు, అవకాశము నాకాశమనియు నందురు. ఇవుడిందు శాశ్వతమగు నదేద్దియో నీమనస్సునందు విచారింపుము. ౬ అన్నకణము నొక్కదానిని జూచినంతన అన్నపుమర్మమంతయు విశదమగును. అట్లే స్వల్పానుభవ మువయోగించి సమస్తము నెఱుంగవలెను. ౭ పృథివి యేర్పడు చున్నది. నశించుచున్నది. ఈయంశము ప్రత్యక్షముగఁ జూచుచున్నదే! ఈసృష్టియందు నానావిధకల్పనములు జరుగుచున్నవి. నశించుచున్నవి. ౮ నిర్మితమగునదెల్ల నశించును. జలముగూడ నాశనమగును. తేజముగూడఁ జల్లారును. వాయువుగూడ నుండదు. ౯ ఆకాశము నామమాత్రముగ నున్నది. అదిగూడ విచారించిచూచిన యెడల నుండనే యుండదు. (పంచభూతములుండవు) ౧౦ పంచభూతములవిస్తృతి యిట్టిది. ఇది నిశ్చయముగ నాశన మగునట్టిది. నిరాకారమగు ఆత్మను సత్యమనియు, శాశ్వతమనియు నెఱుంగనగును. ౧౧ ఆత్మ యెవరికిఁ గనుపింపదు. జ్ఞానము లేనియెడల నది అవగాహనముగాదు. దానిని సత్పురుషుల నడిగి తెలిసికొనఁదగును. ౧౨ సజ్జనుల నడిగినచో ఆత్మ అవినాశియని చెప్పుదురు. ఆత్మకు జన్మమృత్యువులు లేనేలేవు. ౧౩ నిరాకారమునం దాకారమును ఆకారమునందు నిరాకారమును భాసించుచున్నది. నిరాకారాకారములను వివేకముచే గుర్తింపఁదగును. ౧౪ నిరాకారము నిత్యము, ఆకారము అనిత్యము. దీనినే నిత్యానిత్యవిచార మందురు. ౧౫ సారమునం దసారమును, అసారమునందు సారమును భాసించుచున్నది. ఈ సారాసారవిచారమును శోధించి చూడవలెను. ౧౬ పాంచభౌతికము మాయికము. అయినను నది బహురూపములతో భాసించుచున్నది. ఒక్కటియగు నాత్మ సర్వవ్యాపిగ నున్నది. ౧౭ నాలుగుభూతములలో నాకాశ మెట్లు వ్యాపించియున్నదో అట్లు ఆకాశమునందుగూడ పరబ్రహ్మము వ్యాపించియున్నది. ఆలోచించి చూచినచో ఆకాశము, పరబ్రహ్మము అభిన్నముగ గోచరించును. ౧౮ ఉపాధియోగముననే ఆకాశమున్నది. ఒకవేళ నుపాధియే లేకున్నచో ఆకాశమెక్కడిది? పరబ్రహ్మము

నిరాభాసము, నిరాభాస మవినాశి. ఇట్లే ఆకాశమునుగూడ నెఱుంగనగును. ౧౯

ఇఁక నీవివరణమును ముగించుదము. ఏది నాశన మొందదో దానిని వివేకముతో ననుమానములోనికిఁ దేవలెను. ౨౦ పరమాత్మ నిరాకారము, ఇఁక మనమెవ్వరమో విచారింపవలెను. ఈ విచారము మిగుల ముఖ్యమైనదిసుమా! ౨౧ వాస్తవముగ దేహాంతసమయమున వాయువు వెడలిపోవును. ఇది యస్పృతముగఁ దోచినచో ఇపుడే నిశ్వాసమును, ఉచ్ఛ్వాసమును నాపి చూడుము. ౨౨ శ్వాసము నాపినచో దేహపాతమగును. దేహపాతమైనంతన దేహము శవమగును. శవముతో నేపనియు జరుగదు. ౨౩ దేహము లేకున్నచో వాయు వేమియుఁ జేయనేరదు. వాయువులేకున్నచో దేహమేమియుఁ జేయనేరదు. యోచించినచో నొకటిలేకున్నచో వేఱొకటి యేమియుఁ జేయనేరదని విశదమగును. ౨౪ సాధారణముగఁ జూచినచో మనుజుఁడు గోచరించు చున్నాఁడు. విచారించిచూచినచో నేమియు లేదు. అదియే వస్తువైయున్నాఁడు. ఇట్లే అభేదభక్తిలక్షణమును గుర్తెఱుంగవలెను. ౨౫ మన మొకవేళ మనమే కర్తలమని చెప్పునెడల మనతలంపు ననుసరించియే సమస్తము జరుగవలెను. అట్లు జరుగుటయే లేదు గావున మనము కర్తలమని చెప్పుట వ్యర్థము. ౨౬ మనము కర్తలము గాముగదా! భోక్తల మెట్లగుదుము? ఆలోచింపని దీయంశము తెలియదు ౨౭ ప్రకాశమునకు, అంధకారమునకు నెంతభేదముగలదో విచారమునకు అవిచారమునకు అంతభేదముగలదు. వికారము, నిర్వికారము లొక్కటి కానేరవు ౨౮ విచారము లేనితావున నేమియు జరుగదు. సత్యవిషయ మెప్పుడు అనుమానములోనికిరాదు ౨౯ అనుభవమును న్యాయమనియు అననుభవమును అన్యాయమనియుఁ జెప్పుదురు, జన్మాంధుఁడగుమానవుఁడు రత్నపరీక్ష నెట్లుగావింపఁగలఁడు? ౩౦ కావున నిర్గుణమునందు అనన్యుఁడై యుండువాఁడే జ్ఞాత. అతఁడె ధన్యుఁడు. ఆపరమపురుషుఁడాత్మనివేదకారణమున అందఱకును మాన్యుఁడుగ నుండును ౩౧

ఏడవసమాసము.

అ ను భ వ ము ను గూ ర్చి న వి చా ర ము.

ఆత్మ నిర్మలము, నిశ్చలము, నిరాభాసము నై యున్నది. దానికాకాశమును దృష్టాంతరముగ నిచ్చుచుందురు. అవకాశరూపముగ వ్యాపించియున్నదాని నాకాశమందురు ౧ మొదటి దాకాశము. తరువాత దానియం దన్నిపదార్థములును (తక్కిన నాలుగు భూతములును) నున్నవి. అనుభవముతోఁ జూచినచో నిదియే యథార్థము. అనుభవములేనిచో నంతయు వ్యర్థమే ౨ బ్రహ్మము నిశ్చలము. ఆత్మ చంచలము. ఆత్మకు వాయువును దృష్టాంతముగ నీయవచ్చును ౩ బ్రహ్మమునకు ఘటాకాశము దృష్టాంతము. ఆత్మకు (ఆకాశమునందలి) ఘటబింబము దృష్టాంతము. వివరణముగావించినచో నీరెంటియర్థము వేఱుగనున్నది ౪ జరుగుచున్నదానినంతయు భౌతికమందురు. జరుగుచున్న దంతయు నాశనమగును. జంచలము వచ్చుచుఁ బోవుచుండును. దీని నెఱుంగవలెను. ౫ అవిద్య జడము. ఆత్మచంచలము. జడము (అవిద్య) కర్పూరము. ఆత్మ అనలము. రెండును కాలి వెంటనే చల్లారుచున్నవి. ౬ బ్రహ్మము, ఆకాశము నిశ్చలజాతివి. ఆత్మయు, వాయువు చంచలజాతివి. సత్యాసత్యములను బరీక్షకులు గుర్తించెదరు. ౭ జడ మనేకము గలది. ఆత్మ యేకము. ఇదియే ఆత్మానాత్మవివేకము. జగత్తుయొక్క వ్యవహారమును నడుపువాఁడు జగన్నాయకుఁడు. ౮ జడము అనాత్మ. చేతనము ఆత్మ. అన్నింటియందును వర్తించుచున్నది సర్వాత్మ. అన్నియుఁ గలిసి చంచలాత్మ యయ్యెను. ఇది నిశ్చలమైనది కాదు. ౯ పరబ్రహ్మము నిశ్చలము. దానికి దృశ్యభ్రమ లేదు. విమలబ్రహ్మమునకు భ్రమ లేదు. అది యచలము. ౧౦ మొట్టమొదట ఆత్మానాత్మవివేకము ముఖ్యమైనది. ఆపిమ్మట సారాసారవిచార మొనర్పవలెను. సారాసారవిచారమువలనఁ బ్రకృతి సంహారమగును. ౧౧ విచారమువలనఁ బ్రకృతి సంహారమగును. ఉండియును దృశ్యము నష్టమగును. మఱియు అధ్యాత్మశ్రవణమువలన అంతరాత్మ నిర్గుణమునందు సంచరించును. ౧౨ అర్థమవగాహనమగు[illegible]ంది అంతరాత్మయు నవగాహనమునకు వచ్చును. అర్థ మవగాహనము కాకున్నచో ఆత్మ వికాసము నొందదు. ౧౩ అర్థ

మున ననుసరించి ఆత్మ మార్పునొందును. అది యెటుఁగొంపోయిన నటుపోవును. అనుమానమువలన నది యొకానొకప్పుడు సందేహములోఁ బడును. ౧౪ ఒకవేళ నిస్సందేహముగా అర్థ మవగాహనమగుచో ఆత్మ గూడ నిస్సందేహ మగును. అనుమానార్థమగుచో అనుమానరూపమగును. ౧౫ నవరసమిళితమగు నర్థము గ్రహించినచో శ్రోతలు నవరసవిదులగుదురు. దురర్థము గ్రహించినచో శ్రోతలు దురర్థు లగుదురు. ౧౬ సంగమునననుసరించి గిరిశిఖరములయందు వర్ణభేద మేర్పడుచుండును. కావున ఉత్తమమార్గముల నెఱింగి నడువనగును. ౧౭ ఉత్తమభోజనము నువర్ణించుచున్నచో మనస్సుగూడ భోజనాకారము నొందును. వనితాలావణ్యావర్ణనము వినుటవలన మనస్సు ఆలావణ్యమునందే మగ్నమగును. ౧౮ ఇట్లే అన్నిపదార్థములను నెంతదనుక వర్ణింపఁగలను? ఇట్లగునా? కాదా? యని యింతటితోనే తెలిసికొనవలెను. ౧౯ ఎయ్యది విందుమో కందుమో అదియంతయు హృదయములో దృఢముగాఁ బాదుకొనును. పరీక్షావంతులు కనునెడ, వినునెడ హితాహితములఁ బరీక్షింతురు. ౨౦

అన్నింటిని వదలి కేవల మీశ్వరు నన్వేషింపవలెను. అప్పుడే కొంత మర్మము లభించును. ౨౧ అన్ని తెఱంగుల సుఖములను ఈశ్వరుఁడే నిర్మించియున్నాఁడు. కాని జను లీశ్వరు మఱచియున్నారు. మఱియు జన్మమున్నంతదనుక మఱచియే యుందురు. ౨౨* అన్నింటిని విడిచి నన్నే వెదకుమని స్వయముగఁ బరమాత్ముఁడే చెప్పియున్నాఁడు. కాని జనులు భగవంతునివిషయమున విశ్వాసహీనులై యున్నారు. ౨౩ కావున నే మానవులు నానాదుఃఖముల ననుభవించుచున్నారు. కష్టములకుఁ బాల్పడుచున్నారు. మనస్సునందు సుఖమునుగోరుదురుగాని తావెక్కడిది? ౨౪ మానవులు దేనివలన సౌఖ్యములు లభించునో దానిని (పరబ్రహ్మమును) బుద్ధిహీనులై మఱచియున్నారు. సుఖము సుఖమని కలవరించుచు దుఃఖముల ననుభవించి మరణించుచున్నారు. ౨౫ చతురులగుపురుషు లిట్లు గావింపఁజనదు. దేనినుండి సుఖములు లభించుచున్నవో దానినే చేయునగును. బ్రహ్మాండమునకు [illegible]

---

* సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం [illegible] అ. ౧౮ శ్లో. ౬౬.

ఈశ్వరుని వెదకుచుఁ బోవలెను. ౨౬ ముఖ్యుఁడగు నీశ్వరుఁడు ఎప్పుడు బ్రాప్తించునో యపుడు మానవునకుఁ గొఱంతయే యుండదు. లోకులు పిచ్చివాండ్రు. తమవివేకమును గోల్పోవుచున్నారు. ౨౭ వివేకఫలము సౌఖ్యము. అవివేకఫలము దుఃఖము. ఈరెంటియం దెయ్యదియుక్తముగఁ దోఁచునో దానినె గావింపవలెను. ౨౮ కర్తను గుఱుతెఱుంగవలెను. అదియే వివేకము. వివేకమును విడిచినచోఁ బరమదుఃఖ కావలసివచ్చును ౨౯ చతురపురుషుఁడు స్వహితమును మఱువఁగూడదు. ౩౦

ఎనిమిదవసమాసము.

కర్తయెవఁడు?

శ్రోత లిట్లు ప్రశ్నించిరి. అయ్యా! నిశ్చయముగఁ గర్తయెవఁడు? ఈసృష్టియంతయు నెవఁడు నిర్మించెను. ౧ ఈప్రశ్నను ఒకరికంటె నొకరు గొప్పగనున్న సభలోనిపండితు లాలకించి ప్రత్యుత్తరము జెప్ప నారంభించిరి. వారలు చెప్పినవిధమును శ్రోతలు సావధానులరై వినుండు. ౨ ఒకఁ డీశ్వరుండు కర్తయనుచున్నాఁడు. మఱియొకఁ డీశ్వరుఁడెవఁడు? అనుచున్నాఁడు. ఈవిధముగ నెల్లరును దమతమయభిప్రాయములను వివరింప నారంభించిరి. ౩ ఉత్తమ, మధ్యమ, కనిష్ఠములుగ నెవరిభావము లెట్లుండునో యారీతిగఁ బండితు లీవిధమున స్పష్టపఱచిరి. తమతమయుపాసనయే శ్రేష్ఠమని లోకులు విశ్వసించెదరు. ౪ మంగళమూర్తియగు వినాయకుఁడు కర్తయని యొకఁడును సరస్వతీదేవి కర్త్రియని యొకఁడును ౫ భైరవుఁడు కర్తయని యొకఁడును ఖండేరావు కర్తయని యొకఁడును వీరదేవుఁడు కర్తయని యొకఁడును, భగవతి కర్త్రియనియొకఁడును, ౬ నరహరి కర్తయనియొకఁడును, వనశంకరి కర్త్రియనియొకఁడును, సమస్తమునకు శ్రీమన్నారాయణమూర్తియే కర్తయని యొకఁడును జెప్పుచున్నారు. ౭ శ్రీరాముఁడే కర్తయని యొకఁడు శ్రీకృష్ణుఁడు కర్తయని యొకఁడు భగవానుఁడగు కేశవుఁడే కర్తయని యొకఁడు ౮ పాండురంగఁడు కర్తయనియొకఁడు రంగనాయకులు కర్తయనియొకఁడు పిశాచములు సర్వము జేయుచున్న[illegible]వున నవియే కర్తలని యొకఁడు ౯ ముంజ్యా కర్తయని యొకఁడు ప[illegible]ర్తయనియొకఁడు అన్నిఁటిని జేయుచున్నాఁడు

గావున అగ్నిదేవుఁడే కర్తయని యొకఁడు చెప్పుచున్నారు. ౧౦ లక్ష్మి కర్త్రియని యొకఁడు మారుతి కర్తయనియొకఁడు భూమియే సమస్తము గావించుచున్నదిగాన నాయమయే కర్త్రియనియొకఁడు ౧౧ తుకాయీ కర్తయనియొకఁడు, యమాయి కర్తయనియొకఁడు సట్వాయి కర్తయనియొకఁడు ౧౨ భార్గవుఁడు కర్తయనియొకఁడు వామనుఁడు కర్తయనియొకఁడు కేవలపరమాత్ముఁడే కర్తయనియొకఁడు నుడువుచున్నారు. ౧౩ రేవన్న కర్తయనియొకఁడు బసవన్న కర్తయనియొకఁడు వీరన్నయే అందఱికిఁ గర్తయనియొకఁడు ౧౪ ఖలయా కర్తయనియొకఁడు కార్తికస్వామి కర్తయని యొకఁడు వేంకటేశ్వరుఁడే సమస్తముగావించుచున్నాఁడుగాన నాతఁడే కర్తయనియొకఁడు ౧౫ గురువే కర్తయనియొకఁడు దత్తాత్రేయుఁడు కర్తయనియొకఁడు జగన్నాథుఁడే ముఖ్యకర్తయని యొకఁడు ననుచున్నారు ౧౬ బ్రహ్మకర్తయని యొకఁడు విష్ణువు కర్తయనియొకఁడు మహేశ్వరుఁడు కర్తయని యొకఁడు ౧౭ పర్జన్యుఁడు కర్తయనియొకఁడు వాయువు కర్తయనియొకఁడు నిర్గుణదేవుఁడు చేసియు అకర్తగా నున్నాఁడు గావున నాతఁడె కర్తయనియొకఁడు ౧౮ మాయయే చేయుచున్నదిగాన నదియే కర్త్రియని యొకఁడు, జీవుఁడు చేయుచున్నాఁడు కాన నాతఁడె కర్తయనియొకఁడు ప్రారబ్ధయోగమే అంతటికిని కర్తయని యొకఁడు ౧౯ ప్రయత్నమే కర్తయనియొకఁడు స్వభావము కర్తయనియొకఁడు ఎవఁడుకర్తయో యెవ్వరెఱుంగుదురని యొకఁడును నుడువుచున్నారు. * ౨౦

కర్తనుగూర్చి ప్రశ్నింపఁగనే సభయంతయు సంగడివీథియయ్యెను. ఇంకెవరిమాట సత్యమని విశ్వసింపనగును? ౨౧ ఎవఁడేవేల్పును నమ్మునో వాఁడు ఆతనిని కర్తయని చెప్పును. ఈజనుల కోలాహలమావఁజాలము ౨౨ తమతమ అభిమానములతో నెల్లరును మన్సులలో నిశ్చయము గావించుకొనియున్నారు. ఈయంశమునుగూర్చిన చర్చ యెన్నఁటికిని ముగియదు ౨౩ ఒక్కొక్కనియోచన మొక్కొక్కవిధముగ నుండును. ఈ కోలాహలమునంతయు నటుండనిమ్ము. ఈవిచారమునందలి వాస్తవార్థ

---

* ఖండేరావు, ముంజ్యా, తుకాయీ, యమాయి, సట్వాయి, ఖలయీ మున్నగువారలు మహారాష్ట్రదేశమునందలి దైవతవిశేషములు.

మును జెప్పెద వినుండు. ౨౪ శ్రోతలారా! సావధానులు కండు. నిశ్చయముతో అనుమానమును ఖండింపవలెను. జ్ఞాతయగుపురుషుఁడు అనుభవమును సత్యమని యెఱుంగవలెను ౨౫ కర్త చేయుపనియెల్ల కర్తకుఁ దరువాతనే జరుగును. కర్తచేయుపని కర్తకుముం దెటులగును? ౨౬ నిర్మింపబడినదెల్లఁ బాంచభౌతికము. బ్రహ్మాదిదేవతలుగూడఁ బాంచభౌతికులే. కావునఁ బైనిపేర్కొనిన పాంచభౌతికులగు దేవత లీపాంచభౌతికసృష్టి నెట్లుగావింపఁగలరు? ౨౭ పంచభూతములను వేఱుపఱచి కర్తను గుఱుతెఱుంగవలెను. ఏలయన? పాంచభౌతికములు స్వభావసిద్ధముగనే కార్యములోనికి వచ్చుచున్నవి ౨౮ నిర్గుణము పంచభూతములకంటె భిన్నముగ నున్నది. నిర్గుణమునందుఁ గర్తృత్వభావము లేదు. నిర్వికారమునకు వికారము నెవఁడు ఆరోపింపఁగలఁడు? ౨౯ నిర్గుణమువలనఁ గర్తవ్యము కాఁజాలదు. సగుణము కార్యమున కుపకరించును. కావునఁ గర్తవ్యమెవరివలనజరుగునో దానిని బాగుగా నెఱుంగవలెను. ౩౦ వాస్తవమున కెయ్యది లేనేలేదో (నిర్గుణమును) దానినిగూర్చి 'దీనికిఁ గర్తయెవఁ'డని ప్రశ్నించిన లాభములేదు. కాన నిదియంతయు స్వభావసిద్ధముగనే యైనదనుట యుక్తముగనున్నది. ౩౧ ఒకటి సగుణము, ఒకటినిర్గుణము. ఇఁక నిప్పుడు కర్తృత్వము నెవని కారోపించెదను? ఈయంశము బాగుగా విచారింపఁదగినది ౩౨ సగుణమే సగుణమును నిర్మించెనందునా? సగుణోత్పత్తి మొదటినిర్మాణమయ్యెను. ఇంక నిర్మించున దేది? నిర్గుణమునందుఁ గర్తృత్వమెప్పుడైన నారోపింప నవకాశమే లేదు. ౩౩ ఇవుడిచట కర్తయే కాన్పించుట లేదు. అనుభవముతో సమస్తము నెఱుంగవలెను. ఏలయన! దృశ్యము సత్యము కాదు. ౩౪ చేయబడినదంతయు మిథ్యయే. ఈస్థితిలోఁ గర్తపేరెత్తుటయే వ్యర్థము. వక్త యిట్లు వాకొనెను. ఓయీ సోదరా! వివేకముతోఁ జక్కఁగఁ గనుఁగొనుము. ౩౫ బాగుగా విచారించి చూచినచో ప్రతీతిగలుగును. ప్రతీతిగలిగినచో నిఁక మీఁద ఆర్భాటములు గావింపవలసిన యవసరమే లేదు. ౩౬ ఈకథనము నింక ముగించెదను. వివేకియగువానికే యీయంశము బోధపడును. పూర్వపక్షమును ఎగురఁగొట్టవలెను. ఎగురఁగొట్టకున్నచో నిది యనిర్వాచ్యమగును. ౩౭ అనంతరము శ్రోత యిట్లు ప్రశ్నించెను. "స్వామీ!

దేహమునందు సుఖదుఃఖముల ననుభవించునదెవరు?" వక్త యిట్లు చెప్పెను. ఈ ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరమును ముందు సమాసమునఁ దేటపడఁగలదు. ౩౮

తొమ్మిదవ సమాసము.

ఆత్మయొక్క సుఖదుఃఖానుభవము.

ఆత్మకు శరీరసంయోగమువలన ఉద్వేగము, చింత, కలుగుచున్నది. శరీరయోగమువలన ఆత్మ జాగరూకతగ నుండుననుసంగతి మీరెల్ల తెలిసికొనినదేగదా ౧ అన్నమును దేహ మొకవేళభుజింపకపోయినచో ఆత్మ జాగరూకతతో నుండఁజాలదు. ఆత్మలేనిది దేహమునందుఁ జేతనముగూడ నుండఁజాలదు. ౨ ఒకటిలేకున్న నింకొకటి యేమియుఁ జేయనేరదు. ఏపనియైనను ఆత్మయు, శరీరము గలసిచేయుచున్నవి ౩ దేహమునందుఁ జేతనమే లేకున్నచోఁ జెప్పవలసిన దేమున్నది. ఆత్మ స్వయముగ నేపదార్థము నేని యెత్తఁజాలదు. ఇప్పుడు పని యిఁకనెట్లు జరుగఁగలదు? ౪ ఈ చమత్కారమును జూడుఁడు. ఆత్మ స్వప్నావస్థయందుఁ బోవుచున్నది. కాని దేహములోమాత్ర మున్నది. ఎట్లన, నది నిద్రావస్థలో గోకుచున్నదిగదా! ౫ అన్నరసమువలన దేహము పెరుగుచున్నది. శరీరము ననుసరించి విచార మతిశయించుచున్నది. వృద్ధావస్థయందు శరీరమున విచారము సన్నగిల్లును. ౬ మత్తుపదార్థములను సేవించునది శరీరమే. కాని శరీరయోగమున ఆత్మభ్రమనొందును. మఱియు విస్మరణకారణమున ఆత్మకుఁగల తెలివితేటలు మరుగుపడును. ౭ విషము తినునది శరీరము. కానిఆత్మలేచిపోవును. కాన వృద్ధిక్షయములుఆత్మవట్లసైత మవశ్యముగనున్నవి. పెరుగుటయు,దరుగుటయు,పోవుటయు,వచ్చుటయు,సుఖదుఃఖములును, నానావిధానుభవములును దేహయోగమువలన ఆత్మకు అనుభవింపవలసియే వచ్చుచున్నది. ౯ చీమలపుట్టలు, చెదలపురుగుల పుట్టలవలె దేహముగూడ అవకాశయుతముగ (లోనలొట్టగ) నిర్మింపఁబడియున్నది ౧౦ శరీరమునందంతటను జిన్నవి, పెద్దవియగు నాడులు నిండియున్నవి. ఆనాడీనివహమునందు లోన (గొట్టములవలె) అవకాశమార్గములు నిర్మింపఁబడియున్నవి ౧౧ ప్రాణి తినుచున్న అన్నోదకములవలన రసము

జనించును. వాయు వాయన్నరసమును శ్వాసోచ్ఛ్వాసములచే శరీరము నందంతటను బరుగెత్తించును ౧౨ నాడులనుండి జలము ప్రవహించును. ఆజలమునందు వాయువు ప్రసరించును. వాయువుతోఁబాటుగ ఆత్మ గూడఁ బరుగెత్తుచుండును. ౧౩ దప్పిగొని శరీరము వాడిపోవుచున్న సంగతి ఆత్మకుఁ దెలియఁగనే అది శరీరమును జలముచెంతకుఁ గొనిపోవును. ౧౪ నీళ్లు కావలయునని యడుగును. శబ్దసహాయమునఁ బిలుచును. మార్గమునుజూచి దేహమును నడిపించును. అవసరము కలిగినపుడు దేహమునంతయుఁ గదలించును. ౧౫ శరీర మాకలిగొన్నసంగతి ఆత్మ గ్రహింపఁగనే దేహసహాయమున నింటివారలను సమీపించి వాచ్యములను అవాచ్యములను అనిపించును. ౧౬ స్త్రీలయందున్న ఆత్మ 'వంటయైనది. వంటయైన'దని పలుకును. అపుడు దేహము నాత్మ స్నానముజేయించి కొనివచ్చును. పాదములలో నాత్మ ప్రసరించి త్వరత్వరగా నడిపించును. ౧౭ భుజించువానిని పళ్లెరము నున్నగువానిచెంతఁ గూర్చుండఁబెట్టును. నేత్రములలోని కేతెంచి పాత్రములను బళ్లెరములను జూచును. చేతితో ఆచమనము జేయించును ౧౮ పిదపఁ జేతితో నాహారకబళము నెత్తించును. ముఖములోనికరిగి నోటిని తెఱపించును. దంతములతోఁ జక్కఁగ నమలించును ౧౯ ఆత్మ స్వయముగ జిహ్వయందుండి సరసపదార్థముల రుచిని గ్రహించును. ఒకవేళ భోజ్యవస్తువులలోఁ బుడక, రాయి కలసియున్నచో వెంటనే యుమియును ౨౦ చప్పగనున్నచో లవణమును యాచింపఁజేయును. స్త్రీని "ఓసీ ఏమే" యని పిలిపించును. కోపముతోఁ గనులనెఱ్ఱఁజేసి చూచునట్లుచేయును ౨౧ భోజనము చక్కఁగ నమరినచో ఆనందమొందును. చక్కఁగనుండనిచో ఖేదమొందును. అంతియ గాక దుర్వచనములఁ బల్కి యెదుటవారలయాత్మలు నొప్పించును. ౨౨ నానావిధములగు అన్నరసములతీయదనము నానావిధరసములమాధుర్యము ఆత్మ గుర్తెఱుంగును. చేదుతగిలినచోఁ దలఁ గదలించును. మఱియు దగ్గ నారంభించును. ౨౩ అట్లే యాత్మ కోపపరవశయై కూరలలో "కారమునెక్కువవైచితివి! ఏమిచేతయిది? బండవని"యని యెదుట వారిని గటువచనములఁ బలికించును ౨౪ ఒకవేళ నెప్పుడేని నేయి యెక్కువ గ్రోలినచో భుజించిన వెంటనే చెంబునుగొని విస్తారముగా జలము

ద్రావ నారంభించును ౨౫

ఈవిధముగ శరీరమునందుండి సుఖదుఃఖముల ననుభవించునది కేవలమాత్మయే. ఆత్మ లేకున్నయెడల దేహము వ్యర్థము. శవమగును. ౨౬ అనంతములగు మనోవృత్తులను ఆత్మస్థితియని గ్రహింపవలెను. ఉభయలోకములలోనున్న అన్నివ్యక్తులయందును ఆత్మయున్నది ౨౭ జగమున జగదాత్మయున్నది. విశ్వమునందు విశ్వాత్మయున్నది. నానారూపములతో సర్వవ్యాపారములను నడుపునది సర్వాత్మ ౨౮ ఆత్మ యాఘ్రాణించును. రుచిఁజూచును. వినును. చూచును. సుకుమారమును గఠినమును గుర్తించును. అది చల్లఁదనమును, వేఁడిని వెంటనే తెలిసికొనును ౨౯ ఆత్మ సావధానియై లీలలనొనర్చును. ఎంతయో ప్రవృత్తి తలకెత్తుకొనును. ఈధూర్తత్వమును (చతురత్వమును) ధూర్తుఁడే తెలిసికొనగలఁడు ౩౦ వాయువుతో మంచిచెడుగులు (సుగంధదుర్గంధములు) రెండును వచ్చును. కానివాయువు సహజముగ నిర్మలమైయుండును ౩౧ శీతము, ఉష్ణము, సువాసన, దుర్వాసన మున్నగునవియెల్ల వాయువువెంటనే యుండును. కాని వాయువులోఁ గలసియుండనేరవు ౩౨ వాయువువలన రోగములు వచ్చును. భూతములు వాయువువెంటఁ బరుగిడును. వాయువుననుసరించి ధూళి, చెత్త, తుపానులు వచ్చును ౩౩ ఇవియేవియు వాయువుతో నిలచియుండవు. ఇట్లే ఆత్మను వెంబడించివాయువుకూడ స్థిరముగ నిలచియుండదు. ఆత్మ వాయువుకంటెను మిగులఁ జపలమైనది ౩౪ వాయువు కఠినపదార్థములు సోఁకఁగనే ఆగిపోవును. ఆత్మ యట్లుగాక యేవస్తువునేని భేదించి లోనికేగును. అట్లేగినను ఆకఠినపదార్థములకు రంధ్రముగాదు ౩౫ వాయువు వీచునప్పుడొకవిధమగు శబ్దమగును. ఆత్మ కాశబ్దాదులేమియు నుండవు. మననముగావించినచో లోలోపలనే, మౌనముగనే ఆత్మజ్ఞాన మభివృద్ధియగును ౩౬ శరీరమునకుఁ జేయు మంచియంతయు నాత్మకుఁ జేరును. ఈవిధముగ శరీరయోగముచే ఆత్మకు సమాధానము కలుగును ౩౭ దేహమును విడిచి యేమిగావించినను అది యాత్మకుఁజెందదు. దేహయోగముననే వాసన తృప్తినొందును ౩౮ దేహమునకును ఆత్మకు నిట్టిసంబంధము లెన్నియో గలవు. కాని దేహములేకున్నచో ఆత్మ కభ్యంతరము గలుగును ౩౯ దేహము, ఆత్మ యేకమగునెడ నెంతయో కార్యము జరుగఁగలదు. వేఱు

గనున్నచో నేమియుఁ గాదు. దేహాత్మసంయోగమువలన, వివేకసహాయమున త్రిలోకజ్ఞానము కలుగును ౪౦

పదియవ సమాసము.
ఉపదేశనిరూపణము.

దారముతోఁ బత్రములను, పుష్పములను, ఫలములను, బీజములను, పాషాణములను, గవ్వలను దండలుగాఁ గ్రుచ్చుదురు ౧ స్ఫటికములు, కాష్ఠములు, చందనములు, ధాతువులు, రత్నములు మున్నగు మాలికలును, వలలును దారముతోనే గ్రుచ్చఁబడుచున్నవి ౨ దారము లేకున్న నీపని జరుగదు. (ఇట్లే ఆత్మచే సంపూర్ణజగత్తు గ్రుచ్చఁబడియున్నది) కాని యిచట ఆత్మకు దారమును దృష్టాంతముగ నిచ్చుట పూర్తిగ నప్పయింపదు ౩ ఏలయన? దారము మాలికలలోని బీజములకు మధ్యనే (రంధ్రములయందే) యుండును. ఆత్మయో సర్వాంగములందును సమానరూపముగ వ్యాపించియున్నది ౪ ఆత్మ స్వాభావికముగాఁ జపలము. దారము జడము నిశ్చలము. కావున నీయుపమానము సరిపడదు ౫ తీఁగెలలో జలభాగము నిండియున్నది. అట్లే చెఱకులోఁ గూడ రసము నిండియున్నది. కాని రసము పై నుండు చెఱకు యొకటి గాదు ౬ ఇట్లే దేహి (ఆత్మ) దేహములు (అనాత్మలు) రెండును భిన్నములుగా నున్నవి. మఱియు నీరెంటికిని భిన్నములుగ నున్నది నిరంజనమును నిరుపమమునగు పరమాత్మ ౭ రాజు మొదలు నిరుపేదగనుక నందఱును మనుష్యులే. కాని యందఱును సమానులెట్లగుదురు? ౮ దేవతలు, దానవులు మానవులు, నీచయోనులు, హీనజీవులు, పాపులు, సుకృతులు, మున్నగువారలెందఱో గలరు. ౯ జగత్తంతయు నొక్క యంశముతోడనే నడచుచున్నది కాని యందఱి సామర్థ్యములు వేఱువేఱుగా నున్నవి. ఒకరి నాశ్రయించినచో ముక్తి లభించును. వేరొకరి నాశ్రయించినచో నరకము లభించును. ౧౦ పంచదార, మన్ను అను నీరెండును పృథివియొక్క యంశములే. కాని మన్ను తినఁదగినది కాదు. విషము జలము కాదా? అది చెడుగు పదార్థము ౧౧ పుణ్యాత్మునియం దాత్మగలదు. పాపాత్మునం దాత్మ గలదు. ఇందొకఁడు సాధువు వేఱొకఁడు దుష్టుఁడు. అందఱిమర్యాద

యొకరీతిగ నుండదు. ఆత్మ వేఱుగ నుండఁజాలదు. ౧౨ అందఱియంతరాత్మలు నొక్కటియే యనుమాట సత్యము. కాని కాకిని వెంటనుంచుకొనరు. పండితుండు, శుంఠ యొక్కటి యెట్లు కాఁగలరు? ౧౩ మనుష్యుఁడు, గాడిద, రాజహంస, కోడి, రాజు, కోఁతి సమానమెట్టులగుదురు? ౧౪ భాగీరథీప్రవాహములోనిది ఉదకమే. జలధారులందును బొందలందును నున్నది యుదకమే. కాని మలినోదకమును గొంచెమేని గ్రోలరు. ౧౫ కావున మానవుఁడు తొలుదొలుత ఆచారశుద్ధుఁడు, విచారశుద్ధుఁడు, వీతరాగి, సుబుద్ధి కావలయును. ౧౬ ఒకవేళ శూరులను విడిచి పిఱికివారలను సైన్యములో నింపుకొన్నయెడల యుద్ధావసరములయం దావశ్యముగఁ బరాజయము కలుగును. శ్రీమంతుని వదలి దరిద్రుని సేవించినచో నేమిస్థితి కలుగఁగలదు? ౧౭ ఒకజలము వలననే సమస్తమును నేర్పడినమాట సత్యమే! కాని జలము విమర్శించి సేవింపవలయును. కావున ఏకపక్షీయముగ నన్నింటిని సేవించుట మూర్ఖత్వముసుమీ! ౧౮ ఉదకమువలననే అన్నమయ్యెను. అన్నము వమనమైనయెడల నా వమనపదార్థమును మఱల భుజింపరుగదా! ౧౯ అట్లే నిందనీయమగు వస్తువును విడువవలెను. ప్రశంసనీయమగు సంశమును హృదయమునం దుంచవలెను. సత్కీర్తితో భూమండలము నించివేయవలెను. ౨౦ ఉత్తమునకు ఉత్తముఁడు రుచించును. నీచునకు ఉత్తముఁడు రుచింపఁడు. కావుననే ఈశ్వరుఁడు నీచుని దరిద్రునిగ నొనరించెను. ౨౧ సమస్తదరిద్రలక్షణములను విడిచివేయవలెను. ఉత్తమలక్షముల గ్రహింపవలెను. హరికథ, పురాణశ్రవణము, నీతి, న్యాయము, మున్నగునవి స్వీకరింపవలెను. ౨౨ వివేకపూర్వకముగ నడువవలెను. జనులనందఱను సుముఖులుగ నుంచవలెను. మెల్లమెల్లగ నెల్లరను బుణ్యాత్ములఁ గావించుచుండవలెను. ౨౩ బాలకుల నడవడిననుసరించి నడిచినగాని వారలు మనకు మచ్చికగారు. వారలకు రుచించునటుల మాటలాడినఁగాని వారితోఁ జెలిమి కుదురదు. అట్లే మెల్లమెల్లగ జనులభావముల ననుసరించి హితము నేర్పి చతురులఁ గావింపవలెను. ౨౪ మనుజు లందఱయెడను మనస్సుంచవలెను. ఇదిసత్యము. ఇవియున్నియుఁ జతురత్వలక్షణములు. చతురుఁడు చతురలక్షణము లెఱుఁగును. అన్యులు పిచ్చివాండ్రు

౨౫ కాని పిచ్చివానిని బిచ్చివాఁడనిగూడ ననరాదు. మర్మమగునంశము నెప్పుడును జెప్పఁదగదు. అట్లువర్తించుచు నిస్పృహపురుషుఁడు దిగ్విజయ మొందఁగలఁడు ౨౬ అనేకస్థలములలో, అనేకావసరములనెఱింగి యథోచితముగ వర్తింపవలెను. ప్రాణిమాత్రులందఱికును అంతరంగముగ (అభిన్నమిత్రుఁడుగ) వర్తింపవలెను. ౨౭ ఒకఁడు రెండవవానిని సంతుష్టునిగావింపనియెడల నందఱికును శ్రమగలుగును. ఒకడు రెండవవానిమనస్సువిఱిచినచోఁ గుశలము గలుగదు ౨౮ అందఱిహృదయములను ప్రసన్నతగ నుంచువాఁడె సత్యమగు మహంతు (లోకోద్ధారకుఁడు). అతఁడందఱిని ఆకర్షింపఁగలఁడు. ౨౯

పదునాలుగవదశకము

మొదటి సమాసము.

నిస్పృహలక్షణము.

నిస్పృహునియుక్తి, బుద్ధి, చతురత్వములనుగూర్చిన వివరము లాలకింపుఁడు. దీని నాలకించుటవలనఁ జిత్తమున కెల్లకాలమును నిలుకడ గలుగును. ౧ సులభము, ఫలదాయకమునగు మంత్రమువలె సాధారణము, గుణదాయకమునగు నౌషధమువలె నావచనములును సరళములు, అనుభవయుక్తములు నైయున్నవి. ౨ ఈయంశమును విన్నచో దుర్గుణములు తొలంగును. సుగుణములు వెంటనే ప్రాప్తించును. కావున తీవ్రౌషధరూపములగు నామాటలను శ్రోతలు ధ్యానపూర్వకముగ వినఁగోరెదను. ౩ తొలుదొలుత నిస్పృహగా నుండనగునను నియమము పెట్టుకొననే కూడదు, ఒకవేళఁ బెట్టుకున్నచో దానిని విడువనే కూడదు. విడిచివైచినచోఁ బరిచితులలోఁ దిరుగనే కూడదు. ౪ స్త్రీలను దృక్పథమునందుంచరాదు. కాంతావిషయికస్వాదును మనస్సుచేతనేని చవిజూడనీయ కూడదు. ఒకవేళ ధైర్యము (చిత్తశుద్ధి) భంగమైనచో జనులకు మఱలఁ దనముఖమునుగూడఁ జూపింపఁదగదు. ౫ నిస్పృహుఁడు ఒకతావుననే యుండఁదగదు. సంకోచము నుంచుకొనఁగూడదు. మోహములోఁ దగు

లోకుని ద్రవ్యమును గన్నెత్తియైనఁ జూడరాదు. ౬ ఆచారభ్రష్టుఁడు కాఁగూడదు. ఎవరేని యొకవేళ ధనమునొసంగుచోఁ గైకొనరాదు. తనపయి నేరోపమునేని రానీయఁదగదు. ౭ భిక్షమడుగుటకు సిగ్గుపడకూడదు భిక్షనెక్కుడుఁ గైకొనఁజనదు. ఎవరెవ రెన్నివిధముల నడిగినను దనజాడల నెఱింగింపరాదు. ౮ ఇతరులుపయోగించినవి, మురికివి యగువస్త్రములను ధరింపఁగూడదు. మృష్టాన్నము భుజింపరాదు. దురాగ్రహము నొందరాదు. సందర్భానుసారముగాఁ బ్రవర్తింపవలెను. ౯ భోగములయందు మనస్సు నుంచఁగూడదు. దేహసంబంధములగు దుఃఖములకు (బాధలకు)భయపడఁజనదు. భవిష్యజ్జీవితముపయి నాశపడరాదు. ౧౦ విరక్తి విడువఁగూడదు. ధైర్యమును భంగపరుపకూడదు. జ్ఞానమును మలినముగాకుండ వివేకముచేఁ గాపాడవలెను. ౧౧ కరుణాకీర్తనముల విడువరాదు. అంతర్ధ్యానము తగ్గిపోనీయఁ జనదు. సగుణమూర్తియొక్క ప్రేమతంతువుఁ ద్రెంపరాదు. ౧౨ (సాధకుఁడా నీవు నిస్పృహుఁడవగుము. నిస్పృహివి కాదలఁతువేని) మనస్సులోఁ జింత నుంచుకొనకుము. కష్టములో ఖేదము నంగీకరింపకుము. ఏమైననుసరియే అదనున ధైర్యమును దొలంగకుము. ౧౩ అవమానమును జెడుగుగా భావింపకుము. ఎవరేని హేళనగావించినచో దుఃఖింపకుము. ఏమైననుసరియే ఇతరులు ధిక్కరించిరని విచారమొందకుము ౧౪ విరక్తుఁడు లోకసంబంధమగు లజ్జ నుంచుకొనరాదు. గాన ఇతరులు లజ్జింపఁజేసిరని లజ్జ నొందకుము. ఇతరులుద్రేకము కలిగించినచో నుద్రేకమొందరాదు. ౧౫ శుద్ధమార్గమును వదలకుము. దుర్జనునితో వాదింపకుము. చండాలునితో సంబంధము కలుఁగజేసికొనకుము. ౧౬ తంపెలమారితనము దరిచేరనీయకుము. కలహించినచోఁ గలహింపకుము. నీయథార్థస్థితిని గోలుపోకుము. ౧౭ నిజమగు నిస్పృహుఁడితరులునవ్వించినచో నవ్వరాదు. చెప్పింపఁదలంచినచో నేదియుఁ జెప్పరాదు. లక్షణమును ఇతరులు నడిపించినవిధమున నడువఁగూడదు. ౧౮ వేషము ధరింపరాదు ఒకేయమరికతో నుండరాదు. ఏకదేశీయుఁడై యుండక అన్నితావులందును భ్రమించుచుండవలెను. ౧౯ ఎవరితోడనైన దృఢసంసర్గముగలిగించుకొనఁదగదు. దానము గ్రహింపఁజనదు. అన్నివేళలందును సభలలోఁ గూర్చుండ

రాదు. ౨౦ శరీరమునెడ నే నియమము నేని పెట్టుకొనఁదగదు. ఎవ్వారికేని నమ్మిక నీయరాదు. మఱియు నేదేని నిశ్చితవిషయము నంగీకరింపఁగూడదు. ౨౧ సత్యనియమముల విడువకూడదు. అభ్యాసములను మునిఁగిపోనీయరాదు. ఏపరిస్థితులయందేని పరతంత్రుఁడుగ నుండరాదు. ౨౨ స్వతంత్రతను దొలంగనీయరాదు. నిరపేక్షత్వము త్రెంచివేయఁగూడదు. క్షణక్షణమునను బరాపేక్షతో నుండరాదు. ౨౩ వైభవదృష్టితోఁ జూడరాదు. ఉపాధిసుఖమున నుండఁగూడదు. స్వరూపస్థితియందలి ధ్యానమును ద్రిప్పివేయఁగూడదు. ౨౪ స్వేచ్ఛానుసారముగ మెలఁగరాదు. లోకలజ్జ నుంచరాదు. ఎప్పుడైన నేతావునందేని యాసక్తి గలిగియుండరాదు. ౨౫ పరంపరను ద్రెంపఁగూడదు. ఉపాసనమార్గోపాధిని జెడనీయరాదు. జ్ఞానమార్గము నెన్నఁడు విడువఁదగదు. ౨౬ కర్మమార్గమును విడువఁజనదు. వైరాగ్యము వీగిపోనీయరాదు. మఱియు నిరంతరముగా సాధనముల భజనముల ఖండింపఁదగదు. ౨౭ వాదవివాదముల విశేషించి చేయఁగూడదు. అనిత్యవిషయమును మనస్సునందుంచరాదు. వ్యర్థమగు క్రోధముతో హఠము చేయఁగూడదు. ౨౮ విశ్వసింపనివాని కేమియుఁ జెప్పఁదగదు. భయము గలుగఁజేయుమాట లాడరాదు. ఒక్కస్థలముననే పెక్కుదినము లుండగూడదు. ౨౯ ఏయుపాధినేని వ్యాపింపఁజేయరాదు. ఒకవేళ వ్యాపింపఁజేయుచో నుంచుకొనఁదగదు. ఒకవేళ నుంచుకొనుచో దానియందుఁ దగుల్కొనఁగూడదు. ౩౦ గొప్పతనముగ నుండఁగూడదు. మహత్త్వము బెట్టుకొని కూర్చుండఁ జనదు. ఎచ్చటనైన నే కోరికయేని గలుగనీయరాదు. ౩౧ సరళత్వము విడువరాదు. కించిత్ జ్ఞత్వము తొలంగిపోనీయఁగూడదు. బలాత్కారముగఁ దనశరీరముపై నభిమానము తెచ్చిపెట్టుకొనఁదగదు. ౩౨ అధికారములేని దాజ్ఞాపింపఁగూడదు. అదలించి ఉపదేశింపరాదు. పరమార్థము నెప్పుడును సంకుచిత పఱుపఁదగదు. ౩౩ కఠినవైరాగ్యమును విడువఁగూడదు. కఠినాభ్యాసమును విసర్జింపఁజనదు. ఎవరివిషయమునందైనఁ గఠినత్వముగా వర్తింపరాదు. ౩౪ కఠోరవాక్యము లాడఁగూడదు. కఠినముగా నాజ్ఞాపింపఁజనదు. కఠినమగు ధైర్యము నేమైనసరియే విడువఁగూడదు. ౩౫ స్వయముగ నాసక్తుఁడగుటయుఁ జేయనిదే చెప్పుటయు శిష్యులను కొద్దిగొప్ప లడుగుటయుఁ దగ

దు. ౩౬ ఉద్ధతశబ్దములతో మాటలాడుటయు, ఇంద్రియములను స్మరించుటయు, స్వచ్ఛందవృత్తితో శాక్తేయమార్గములందుఁ బ్రవర్తించుటయుఁ గూడనివని ౩౭ నీచకార్యమని సిగ్గుపడరాదు. వైభవములను జూచుకొని యున్మత్తుఁడు కాఁగూడదు. ఎఱింగియెఱింగి క్రోధవశుఁడు కాఁగూడదు. ౩౮ గొప్పతనము కలిగినపుడు మఱువు దరిచేరనీయరాదు. న్యాయనీతుల విడువఁదగదు. ఏవిపరీతపరిస్థితులందేని అప్రమాణికముగ వర్తింపఁజనదు ౩౯ ఎఱుఁగనిది చెప్పఁగూడదు. అనుమానముతో నిశ్చయము గావింపఁగూడదు. మూర్ఖత్వముతోఁ జెప్పినదానిని జెడుగుగా భావింపరాదు ౪౦ సావధానత, వ్యాపకత్వము వదలఁజనదు. సోమరితనములో సౌఖ్యముగలదని భ్రమపడఁదగదు ౪౧ మనస్సునందు వికల్ప ముంచఁగూడదు. స్వార్థము నాజ్ఞాపింపరాదు. ఒకవేళ నాజ్ఞాపింపవలసినచోఁ దనకార్యము ముందుగావలెననఁగూడదు ౪౨ ప్రసంగములేనిది చెప్పఁగూడదు. క్రమము విడువఁదగదు. విచారింపకయే అనాలోచితమార్గములలోఁ బ్రవేశింపరాదు ౪౩ పరోపకారము విడువఁగూడదు. పరపీడఁ గావింపఁజనదు. ఎవరిహృదయమునేని మలినపఱుపఁదగదు ౪౪ అమాయికత్వమును, మహంతుధర్మమును విడనాడరాదు. ద్రవ్యముకొఱకుఁ గీర్తనము లొనరించుచుఁ దిరుగఁగూడదు. ౪౫ సంశయాత్మకముగఁ జెప్పుటయు మిక్కిలినిశ్చయ మొనరించుటయు గ్రంథమును దానుదెలిసికొనకయే ఇతరులకు బోధింపఁ జేతికందుకొనుటయుఁ గూడదు ౪౬ ఎఱిఁగియుండి యడుగరాదు. అహంభావము ప్రకటింపఁదగదు. చెప్పెదనని యెవ్వరితోనైన ననరాదు. ౪౭ జ్ఞానగర్వ ముంచరాదు. సాధారణముగ నెవ్వరికిని గష్టముగలిగింపఁజనదు. ఎవరితోడనైన నెచటనైన వాదులాడఁగూడదు ౪౮ స్వార్థబుద్ధి కలిగి యుండఁగూడదు. కార్యభారమునఁ బడిపోవరాదు. రాజద్వారమునందుఁ గార్యకర్తగ నుండఁదగదు ౪౯ ఎవరికేని నమ్మిక నీయఁగూడదు. భిక్షగ నీయఁబడిన పదార్థము నడుగరాదు. భిక్షకొఱకై తనపరంపరను వివరింపఁగూడదు ౫౦ వివాహకార్యములందును, మధ్యవర్తిగనుండు పనులందును బాల్గొనఁజనదు. ప్రపంచోపాధిని శరీరముతో నన్వయింపరాదు ౫౧ ప్రాపంచికనిర్బంధములలోఁ దగుల్కొనరాదు. చెడ్డఅన్నము

తినరాదు. ఆశ్రితునివలె నిమంత్రణము గైకొనఁజనదు ౫౨ నిస్పృహుఁడు శ్రాద్ధ, పక్ష, త్రైమాసిక, షాణ్మాసికాదిపితృకర్మలలోనికిని రోగశాంతులు, వ్రతములు, ఉద్యాపనములు, మున్నగు కామ్యకర్మములలోనికినిఁ బోవఁదగదు. అచటియన్నము తినరాదు. తాను దీనుఁడై వర్తింపరాదు ౫౩, ౫౪ లగ్నప్రసంగమునఁ బాల్గొనఁదగదు. ఉదరపోషణమునకై గానమొనరింపరాదు. ధనమునుగైకొని యెచ్చటనేని హరికీర్తనమొనర్పరాదు ౫౫ భిక్షనుగొనుట విడువఁగూడదు. అన్నము భాగభాగములుగాఁ దినకూడదు. మూల్యముగైకొని యాత్రఁ గావింపరాదు ౫౬ మూల్యమునుగైకొని యెద్దియేని సుకృతము చేయగూడదు. వేతనముదీసికొని పూజారి కాఁగూడదు. ఇనాము, జాగీరు (మాన్యము, అగ్రహారము) ఎవరేని యొసంగనెంచినను నిస్పృహుఁడు గైకొనఁదగదు ౫౭ ఎచ్చటనేని మఠము నిర్మింపఁగూడదు. ఒకవేళ నిర్మించుచో దానినే ఆశ్రయించుకొని యుండరాదు. నిస్పృహుఁడగు మఠాధిపతిగాఁ గూర్చుండియుండఁదగదు ౫౮

శ్రోతలారా! ముఖ్యవిషయము వినుండు. నిస్పృహుఁ డన్నియుఁ జేయవలసినదె కాని స్వయముగా నాకర్మములలోఁ జిక్కుకొనరాదు. ఆకర్మములకు భిన్నుఁడైయుండి లోకమునందుభక్తిమార్గము స్థాపింపవలెను. ౫౯ ప్రయత్నరహితుఁడై యుండఁదగదు. సోమరితనము దృష్టిలోనికి రానీయఁగూడదు. దేహమున్నంతవఱకు ఉపాసనావియోగము సహింపరాదు ౬౦ ఉపాధిలోఁ బడఁగూడదు. ఉపాధిని శరీరమునం దన్వయింపఁదగదు. అవ్యవస్థుఁడై భజనమార్గము నెడ నెన్నఁడును విముఖుఁడుగ నుండఁదగదు ౬౧ మిగుల నుపాధిగావింపఁగూడదు. ఉపాధి లేకున్న యెడలఁగూడఁ బని జరుగదు. సగుణభక్తి విడువరాదు. కాని యీశ్వరునకు విభక్తుఁడుగ నుంటగూడ మంచిదికాదు. (౬౨) మిగులఁ బరుగెత్తకూడదు. ఒక్కస్థలముననే విశేషించి వసింపఁగూడదు. మిగులఁ గష్టమును సహింపరాదు. మిగుల సోమరితనముతో నుంటగూడ మంచిదికాదు (౬౩) మిక్కిలిగ భాషింపరాదు. కాని మాటలాడకున్ననుగూడఁ బనిజరుగదు. అన్నమును మిక్కుటముగాఁ దినరాదు. కాని ఉపవాసముండుటగూడ మంచిదికాదు. (౬౪) విశేషించి నిద్రింపఁగూడదు. బొత్తిగ నిదురబోకయుండుటయుఁ

దగదు. మిక్కుటముగ నియమములు బెట్టుకొనుటకూడదు. బొత్తిగ నియమహీనుఁడై యుండఁజనదు. ౬౫ పెక్కు మందిలో నుండఁగూడదు. విశేషించి వనవాసము గావింపరాదు. దేహము నెక్కుడుగఁ బోషింపఁజనదు. కాని ఆత్మహత్య యొనరించుటగూడ చెడ్డపనియేసుమా ౬౬ సంగమెక్కువగ నొనర్పరాదు. కాని సాధుజనసంగమము విడువఁగూడదు. కేవలకర్మాచరణముతోఁ బనిజరుగదు. కాని అనాచారుఁడుగా నుంటగూడఁ దగదు. ౬౭ లోకాచారమును బూర్తిగ విడువఁగూడదు. కాని జనుల కధీనుఁడుగ నుంటగూడఁ దగదు. ప్రీతి మిక్కుటముగా నుంచఁగూడదు. కాని నిష్ఠురభావముతో నుండుటగూడ మంచిదిగాదు ౬౮ సందేహము నెక్కువగా నుంచుకొనఁదగదు. కాని స్వాచ్ఛందముగాఁగూడ నుండఁదగదు. సాధనములలో విశేషించి మగ్నుఁడు కాఁగూడదు. కాని సాధనరహితుఁడై యుండుటగూడ మంచిదిగాదు ౬౯ విషయముల నెక్కుడుగా ననుభవింపఁగూడదు. కాని విషయత్యాగము పూర్తిగఁ జేయఁదగదు. దేహముపై మోహ ముంచరాదు. కాని మిక్కిలి కష్టమునుగూడ సహింపఁజనదు ౭౦ భిన్నుఁడై అనుభవమును గ్రహింపరాదు. కాని అనుభవమును గ్రహింపకుండ నుండఁగూడదు. ఆత్మస్థితి వివరింపఁజనదు. కాని బొత్తిగ స్తబ్ధత్వము కలిగియుండుటగూడ మంచిదిగాదు ౭౧ మనస్సును లయమొనర్చి యున్మనికావలెను. కాని మనస్సులేనిది పనిజరుగదు. అలక్ష్యమైనవస్తువు లక్ష్యములోనికిరాదు. దానిని జూడకుండుటగూడ మంచిదిగాదు. ౭౨ అది (బ్రహ్మము) మనోబుద్ధుల కగోచరమైనది. కాని మనోబుద్ధులు లేకున్నచో దానిజ్ఞానముగూడఁ గలుగదు. ఎఱుకను మఱవవలెను. కాని యెఱుక లేమిగూడ మంచిదిగాదు. ౭౩ జ్ఞాతృత్వము నుంచఁగూడదు. కాని జ్ఞానము లేకున్నచోఁ బనిజరుగదు. అతర్క్యవస్తువు తర్కములోనికిరాదు గావున తర్కము లేకుండ నుండుటగూడ మంచిదిగాదు ౭౪ దృశ్యము స్మరణచేయుట మంచిదిగాదు కాని విస్మరణము గావించుటగూడఁ దగదు. చర్చలెవ్వియుఁ గావింపఁగూడదు. కాని చర్చలెవ్వియుఁ గావింపకున్నఁగూడఁ బనిజరుగదు ౭౫ లోకులలోఁగల భేదము పాటింపఁగూడదు. కాని వర్ణసంకరముగూడ నొనరింపఁజనదు. స్వధర్మమును విడువఁగూడదు. కాని ధర్మాభిమానముగూడ మంచిదిగాదు. ౭౬ ఆశా

బద్ధమగుమాట నుడువరాదు. వివేకము లేకుండ వర్తింపఁగూడదు. ఏమైనను సరియే శాంతిభంగము గానీయరాదు. ౨౨ అవ్యవస్థితముగఁ బుస్తకము వ్రాయఁగూడదు. కాని పుస్తకము లేకున్నఁగూడఁ బనిజరుగదు. అవ్యవస్థితముగఁ జదువఁగూడదు. కాని చదువకుండుటగూడ మంచిదిగాదు ౨౮ నిస్పృహుఁడు వక్తృత్వము విడువఁజనదు. కాని సందేహము కలిగినపుడు వివాదములోనర్పఁ దగదు. మఱియు శ్రోతలవాక్యములను జెడ్డవిగా భావింపఁగూడదు. ౨౯ ఈ యుపదేశముల నన్నింటిని హృదయమునందుంచుకొన్నచో సమస్తసుఖములును లభించును. మహాంతులక్షణములు తమంతట నవియే కలుగును ౩౦

రెండవసమాసము.

భిక్షానిరూపణము.

భిక్షనడుగుట బ్రాహ్మణుని ముఖ్యదీక్ష. 'ఓంభవతి' పక్షమును బ్రాహ్మణుఁడు రక్షగావింపవలెను ౧ భిక్షనడిగి భుజించువాఁడు నిరాహారి యనఁబడును. భిక్షనడిగినకారణమునఁ బ్రతిగ్రహదోషమును భిక్షుకుఁ డొందఁడు ౨ సజ్జనునుండియైనను దుర్జనునుండియైనను ఏపురుషుఁడు అన్నమును యాచించిభుజించునో వాఁడు ప్రతిదినమును అమృతపానము గావించుచున్నాఁడని గ్రహింపనగును ౩

శ్లో॥ భిక్షాహారీ నిరాహారీ భిక్షా నైవప్రతిగ్రహః
అసంతోవాపి సంతోవా సోమపానం దినేదినే॥

భిక్షామహిమ యిట్టిది. భిక్షమడుగుట సర్వోత్తముఁడగు నీశ్వరునకుఁగూడ సంతోషావహము. గొప్పగొప్పయోగులు, సిద్ధులుగూడ భిక్షనడుగుచున్నారు ౪ దత్తాత్రేయుఁడు, ఘోరనాథుఁడు మున్నగుసిద్ధపురుషులుగూడ జనుల భిక్షమడిగిరి. భిక్షవలన నిస్పృహత్వము వెల్లడియగును ౫ కొందఱు వారి నియతిననుసరించి భిక్షగ్రహింతురు. ఇది పరాధీనత యగును. ఇట్లే ప్రతిదినము నొక్కగృహమునుండియే భిక్షగావించుచుండినను స్వాతంత్ర్యముండదు ౬ ఎనిమిదిదినములకొఱకు అన్నమును బ్రోవుచేసికొనుట మంచిదికాదు. అటులొనరించుచున్నచో నిత్యనూతనత వలనియానందము లభింపఁజాలదు ౮ నిత్యమును గ్రొత్తగ్రొత్తతావు

లలోఁ దిరుగవలెను. బాగుగా దేశాటనము గావింపవలెను, అప్పుడే భిక్షమడుగుటలో శోభగలదు. అప్పుడే భిక్షావృత్తి ప్రశంసాపాత్రమగును. భిక్షనడుగు నలవాటు అఖండముగఁ గలవానికిఁ బరదేశమనునది లేనేలేదు. ఎక్కడఁజూచినను నక్కడ నాతనికి మూఁడులోకములును స్వదేశమగును ౯ భిక్షనడుగుటకు సందేహపడఁగూడదు. లజ్జనొందఁదగదు. విసువఁగూడదు. పరిభ్రమణము చేయుచునే యుండవలెను. ౧౦ అనేక చమత్కారములను జేయుచు నిరంతరము భగవంతుని నభివర్ణించుచు నొంకపురుషుఁడు నిస్పృహతో భిక్షమడుగుచుంటఁజూచి పెద్దపిన్నలెల్లరును జకితులగుచుందురు ౧౧ భిక్ష కామధేనువు. భిక్షవలన నిరంతరమును ఫలము లభించును. అదిసామాన్యమైనది గాదు. భిక్షావృత్తి నగౌరవించు జోగి అభాగ్యుఁడు ౧౨ భిక్షవలన ఎఱుకగలుగును. భిక్షవలన భ్రమ నశించును. మఱియు సాధారణభిక్ష నెల్లరును స్వీకరింతురు ౧౩ భిక్షయొకవిధముగఁజూచినచో నిర్భయస్థితియైయున్నది. భిక్షవలన మహాంతుధర్మము ప్రకటనమగును. భిక్షవలన స్వతంత్రత లభించును. మఱియు ఈశ్వరప్రాప్తి కలుగును ౧౪ భిక్షవలన నేవిధమగునాటంకముగాని బాధగాని కలుగదు. భిక్షాహారి నిరంతరమును స్వతంత్రముగా నుండును. భిక్షవలన విరాగులు సమయమును సార్థకపఱుపఁగల్గుదురు. ౧౫ భిక్ష అమరకల్పవల్లి. ఇది ఫలములతో నిండియున్నది. చెడ్డసమయమునందు లజ్జాహీనుఁడగుపురుషునకు భిక్ష ఫలదాయకమగును. ౧౬ భూమండలమున నెన్నియో దేశములు గలవు. పరిభ్రమించినచో నెవ్వఁడును ఆకలిచేఁ జనిపోవఁడు. పరిభ్రమించి భిక్షగ్రహించుభిక్షుకుఁడు జనులను బాధింపఁడు ౧౭ గోరక్షణ వాణిజ్య కృషులన్నిటికంటె నుత్తమమైనదిసుమా భిక్షాప్రతిష్ఠ. జోలె నెప్పుడును విడువఁగూడదు. ౧౮ భిక్షతో సమానమగు వైరాగ్యమింకొకటిలేదు. వైరాగ్యమునకు సమానమగు నితరసౌభాగ్యమెద్దియు లేదు. వైరాగ్యములేకున్నను, ఏకదేశీయముగానున్నను మానవుఁడభాగ్యుఁడగును. ౧౯ కొంచెము భిక్షగలదాయని యడిగినయెడల నొకవేళ నవరేని యధికభిక్ష నొసంగనెంచి తెచ్చినచో అల్పసంతోషిగా నుండి అందొకపిడికెడుమాత్రమే గైకొనవలెను ౨౦ ఆనందపూర్వముగా భిక్ష నడుగవలెను. ఇదియే నిస్పృహత్వలక్షణము. మధురముగా మాట

లాడుచో నెల్లరకును సుఖము గలుగును ౨౧ భిక్షావిషయమును స్వల్ప ముగ యథామతి వివరించితిని. భిక్ష సమయాసమయములలోఁ గలుగు నాపదలను దొలంగించును ౨౨

మూఁడవసమాసము.

కావ్యకళ.

శబ్దకుసుమమాలారూపమగు కవిత్వముయొక్క సుందరసుగంధిత పరిమళరూపమైన అర్థముచే సాధుసజ్జనరూపములగు భ్రమరసమూహ మున కానందము కలుగుచున్నది ౧ ఇట్టిమాలికలు అంతఃకరణమునందు గ్రుచ్చి శ్రీరామునిచరణములను బూజింపుము. ఓంకారతంతువు నఖండిత ముగ నుంచుము. దానినెప్పుడును ఖండితము గావింపకుము ౨ పరోప కారమునకొఱకుఁ గవిత్వము వ్రాయుట ఆవశ్యకము. ఇట్టి కవితాలక్షణ ములను వివరించెదను. ౩ ఎయ్యది యాలించిన భగవద్భక్తియు, విరక్తి నుదయించునో యట్టి కవిత్వాభ్యాసమును వృద్ధినొందింపవలెను. ౪ ఆచర ణరహితమగు శుష్కశబ్దజ్ఞానమును సజ్జనులగు పురుషు లెప్పుడును మెచ్చు కొనరు. కావున (కవిత్వము నభ్యసించుటకుముందు) అనుతాపసహాయ మునఁ గరుణార్ద్రహృదయముతోఁ బరమాత్ముని బ్రసన్నముగావించు కొనవలెను ౫ ఏలయన? పరమాత్ముఁడు ప్రసన్నుఁడైన పిమ్మట (ఈశ్వ రీయస్ఫూర్తితో) ముఖమునుండి వెలువడువాక్కు శ్లాఘనీయమైనది. మఱియు దానినే ప్రాసాదికమని చెప్పనొప్పును ౬

జనులు కవిత్వమును మూఁడుతెఱంగులుగ విభజించిరి. ౧ ధృష్ట ము ౨ పాఠము ౩ ప్రాసాదికము. ఇఁక నీ మూఁడువిధములను గ్రమ ముగా విచారింపుదము ౭ కొందఱు విచ్చలవిడిగాఁ దమమనస్సులోనికి వచ్చినదానిపై నెల్ల బలాత్కారముఁ గవిత్వము నల్లుదురు. దానిని జల్లి కవిత్వమందురు ౮ కావ్యగ్రంథములను విశేషించి చదువుటచే నొక్కొ క్కని కాయాగ్రంథములన్నియుఁ గంఠస్థము లగును. దానినే కొంచెము మార్పుగావించి వారలు కవిత రచింతురు. ఇట్టి కవిత్వమును పాఠకవిత్వ మందురు ౯ కొందఱు శీఘ్రముగా (ఆశువుగా)ఁ గవిత్వము చెప్పుదురు. ఎదుటఁ గనఁబడినదానినెల్ల వర్ణింతురు. భక్తిరహితములగు పదములను

జేర్చి గణములఁ గూర్తురు. ఇట్టి కవిత్వమునుగూడ (జల్లిపొల్లు) పాఠకవిత్వ మనియే చెప్పనగును ౧౦ కామిక, రసిక, శృంగార, వీర, హాస్య, ప్రస్తా వన, కౌతుక, వినోదాది విషయములలోఁ జెప్పు కవిత్వమునుగూడ జల్లిపా ఠమనియే చెప్పవచ్చును ౧౧ మనస్సు కామాతురమైనప్పుడు ఉద్గారము గూడ (పలుకుబడియంతయు) నట్లేయుండును. కాని యీజల్లికవిత్వముల వలన జన్మము సఫలము కాఁజాలదు ౧౨ ఉదరశాంతికై నరస్తుతి చేయ వలసివచ్చును. ఇట్టి నరస్తుతులలోఁ జూపించు కావ్యకౌశలమునుగూడఁ బొల్లుకవిత్వమందురు ౧౩ కాని కవిత్వము ధృష్టపాఠముగ (పొల్లుగ) నుండఁగూడదు. కవిత్వములోఁ గష్టముకూడదు. మఱియుఁ బాషండ మతపూర్ణముగను, ఉద్ధతముగను నుండుకవిత్వము నిరుపయోగము ౧౪ కవిత్వము వాదపూర్ణముగను, రసహీనముగను, కర్కశముగను, దృష్టాంతహీనముగను నుండఁగూడదు ౧౫ కవిత్వ మునందు అనావశ్యకవిస్తారముగాని, సారహీనవిషయములుగాని యుండఁగూడదు. కుటిలునిసంబోధించి గూడ కవిత్వము వ్రాయఁగూడదు. ౧౬ కవిత్వము హీనముగ నుండరాదు. నుడివినదానిని మఱల నుడువ రాదు. ఛందోభంగము గావింపఁజనదు. మఱియుఁ గవిత్వము లక్షణర హితముగ నుండఁగూడదు. ౧౭ వ్యుత్పత్తిహీనముగను, తర్కహీనము గను, కళాహీనముగను, శబ్దహీనముగను, భక్తిజ్ఞానవైరాగ్యహీనముగ ను గవిత్వముండఁగూడదు. ౧౮ భక్తిహీనమగుకవిత్వమును మోసపుఁదడి కయని గ్రహింపవలెను. నీరసమగు వక్తృత్వము భయము నుదయింపఁ జేయును. ౧౯ భక్తిహీనముగఁ జెప్పబడునదెల్ల నొకవిధమగు జంత్రవా ద్యము. ప్రీతిలేనిసంవాద మెచటనైన నుండునా? ౨౦ ఈజల్లికవిత్వ ములు, పాఠకవిత్వములు రచించుటమిథ్యయు, అహంకారము, వెట్టిత నము మాత్రమేసుమా! ఇఁకఁ ప్రాసాదికకావ్యలక్షణము నెఱింగించె దను. ౨౧

స్త్రీలపట్లను, ధనమునందును నసహ్యాభావముగలవాడును, అంతః కరణమునందు బరమాత్మధ్యానము పాదుకొల్పువాఁడును, ౨౨ నిరంత రము భవగ్రస్తేమముందు మగ్నుఁడైయుండువాడును, పగలు రెండురెట్లుగ రాత్రులందునాలుగురెట్లుగ భగవద్భజనము నందు వృద్ధినొందు నుత్సా

హాముగలవాఁడును. ౨౩ భగవద్భజనము లేకుండ క్షణమునేని గడుపలేనివాఁడును, అంతఃకరణము నిరంతరము భక్తిరంగమునఁ దాండవమాడువాఁడును ౨౪ అంతఃకరణమునం దచలుఁడు, శాంతస్వరూపుఁడు నగు భగవంతునకు నివాసస్థానముగనున్నవాఁడు, నగు పురుషుఁడు స్వాభావికముగా నుడువునదియెల్ల బ్రహ్మనిరూపణమై యుండును ౨౫ హృదయమున గోవిందుఁడు నిలిచియున్న కారణమున భక్తునకు భక్తియందె రుచి లభించును. ఆతఁడు భక్తిని విడిచి యన్యమేదియును జెప్పఁ జాలఁడు ౨౬ హృదయమునం దేవిషయమునఁ బ్రీతిగలదో దానినే యాతనివాణి నుడువును. ఆతఁడు భక్తిభావముతోఁ గరుణాకీర్తనము గావించును. మఱియుఁ బ్రేమమగ్నుఁడై నృత్యము గావించును. ౨౭ భక్తునకు భగవంతునియందు మనస్సు లీనమగును. అందుచే దేహాభిమాన ముండదు. ఇట్లే శంకాలజ్జలుగూడ దూరముగఁ బారిపోవును ౨౮ భక్తుఁడు ప్రేమయను రంగులో మునిఁగిపోవును. భక్తిమదమున నున్మత్తుఁడగును. మఱియు నహంకారమును గాళ్ళక్రిందఁ బడవేయును ౨౯ భక్తుఁడు నిశ్శంకగ గానము చేయును. నృత్యము గావించును. అతనికి జనులెచటఁ గాన్పింతురు? ఆతనిదృష్టిలోఁ ద్రైలోక్యనాయకుఁడే నివసించును ౩౦ ఇట్లు భగవంతునియందు లీనుఁడైపోవు భక్తున కేవిషయమునందును నవసరముండదు. ఆతఁడు తనయిచ్ఛకొలంది భగవంతుని రూపకీర్తిప్రతాపముల వర్ణించుచుండును ౩౧ భక్తుఁడు భగవంతుని నానారూపములను, మూర్తిప్రతాపములను, అనంతకీర్తిని వర్ణించుచుండును. వానికి నరస్తుతియన్నఁ దృణసమానముగను, దుచ్ఛముగను దోఁచును ౩౨ ఈవిధముగ విరక్తుఁడై సంసారమునందున్న భగవద్భక్తుని సాధుజనులు ముక్తునిగ భావించుచున్నారు. ౩౩ ఆతఁడు భక్తివశమునఁ గావించు రసవంతమగు వర్ణనమునే ప్రాసాదికకవిత్వ మందురు. ఆతఁడు సాధారణముగాఁ జెప్పు ప్రత్యక్షరమునను వివేకము నిండియుండును. ౩౪

ఇఁక సాధారణరీతిగఁ గవితాలక్షణములను మఱలఁ జెప్పెదను వినుండు. దీని నాలించినచో శ్రోతల హృదయములలో నానంద మతిశయింపఁగలదు ౩౫ కవిత్వము, నిర్మలముగను, సరళముగను, స్పష్టముగను, క్రమానుసారముగను నుండవలెను ౩౬ కవిత్వము

భక్తిబలయుక్తముగను, అర్థప్రచురముగను, అహంకారరహితముగను, నుండవలెను ౩౭ కవిత్వము కీర్తితో నిండియుండి రమ్యముగను, మధురముగను, విస్తృతప్రతాపయుతముగను నుండవలెను ౩౮ కవిత్వము సరళముగను, సంక్షిప్తముగను, సులభముగను, పద్యాత్మకముగను, నుండవలెను. ౩౯ కవిత్వము మృదువుగను, మంజులముగను, కోమలముగను, భవ్యముగను, అద్భుతముగను, విశాలముగను, ఆనందదాయకముగను, మధురముగను, భక్తిరసయుక్తమై రుచిరముగను నుండవలెను ౪౦ అక్షరబంధము, పదబంధము, నానాచాతుర్యప్రబంధము, నానాప్రకారకౌశల్యము, ఛందోబంధము, ఘాటి, ముద్ర మున్నగునవి యెన్నియోని కావ్యములయం దుండవలెను ౪౧ నానావిధయుక్తులు, బుద్ధులు, కళ, సిద్ధి, అన్వయము మున్నగు కావ్యధర్మముల నిర్వహించి నానావిధములగు కవిత్వములను నిర్మింపవలెను ౪౨ కవిత్వమునందు నానావిధములగు సాహిత్యవిషయికదృష్టాంతములు తర్కము, యుక్తి, ఉక్తి, సమ్మతి, సిద్ధాంతము, పూర్వపక్షము సహిత ముండవలెను ౪౩ నానావిధగతులు, విద్వత్త, మతి, స్ఫూర్తి, ధారణ, ధృతి, శాస్త్రాధారములతోఁగూడిన శంకాసమాధానవిషయములు (నిశ్చయముకలుగుటకు సందేహముతొలఁగిపోవుటకుఁ దగినయంశములు) గూడ కవిత్వమునం దుండవలెను ౪౪-౪౫ నానావిధప్రసంగములు, విచారయోగవివరణములు, తత్త్వచర్చాసారము గలదియే కావ్యమనఁబడును. ౪౬ నానావిధసాధనములు, పురశ్చరణము, తపస్సు, తీర్థాటనము, మున్నగు వాని వర్ణనము గలదియు, నానావిధసందేహములఁ దొలఁగించునదియుఁ గవిత్వమనఁబడును. ౪౭ పశ్చాత్తాపము జనింపఁజేయునదియు, లౌకికవిషయములను లజ్జితమొనర్చునదియు, జ్ఞానబోధ చేయునదియు, ౪౮ జ్ఞానము నభివృద్ధిచేయునదియు, వృత్తి నస్తమింపఁజేయునదియు, భక్తిమార్గమును విశదముచేయునదియు, నేదియో అదియే కవిత్వము. ౪౯ దేహాభిమానము దొలఁగించునదియు భవసాగరమును ఇంకించునదియు, భగవంతుని హృదయమునందు స్పష్టపఱచునదియు, నేదియో యదియే కవిత్వము ౫౦ సద్బుద్ధిప్రసాదించునదియు, పాషండము నశింపఁజేయునదియు వివేకమును వృద్ధిసేయునదియు, సత్యముగు కావ్యమనఁబడును. ౫౧ సద్వ

స్తువును భాసింపఁజేయునదియు, భాసము నిరసనముగావించునదియు, భిన్నత్వము నశింపఁజేయునదియు, సమాధానము గలిగించునదియు, సంసారబంధములను ద్రెంచునదియు సజ్జనులచే మన్నింపఁబడునదియు, నేదియో అదియే కవిత్వము ౫౨-౫౩ ఈవిధముగాఁ గావ్యలక్షణముల నింకను జెప్పఁబూనినచోఁ జాలగలవు. సాధారణరీతిగ నెఱుంగుటకై సంక్షిప్తముగా నిట వివరించితిని. ౫౪

నాలుగవసమాసము.

కీర్తనలక్షణము.

కలియుగమున (దరింపఁగోరువారు) కీర్తనము గావింపవలెను. భగవంతుని గుణములను మధురశబ్దములతో నేర్పుగా గానము చేయవలెను. కీర్తనమునందుఁ గఠినములు, కర్కశములు నగువచనము లుపయోగింపఁ దగదు. ౧ కీర్తనములవలన సంసారబంధములగు చిక్కులను దూరపఱుపవలెను. దుష్టులతోఁ దగవులాడఁగూడదు. సత్యాసత్యములవలనఁ దనశాంతికి భంగము కలుగనీయరాదు. ౨ గర్వగీతములను బాడరాదు. పాడుచుఁ బాడుచు అలసిపోవఁగూడదు. గోప్యమును బ్రకటనము జేయఁదగదు. భగవంతుని గుణములను గానముచేయవలెను ౩ కీర్తనము గావించుతఱి మిగులఁ గదలుట, ఊగుట, దగ్గుట కూడదు. ౪ కీర్తనమునందు భగవంతుని యనంతనామములను, సగుణేశ్వరుని బహువిధధ్యానములను, భగవత్కీర్తికి సంబంధించిన అనేకాద్భుతచమత్కారములను బ్రకటింపవలెను ౫ కీర్తనమునందు మంచివిషయమునుగాని చెడ్డవిషయమునుగాని విడువఁగూడదు. ఎవరిమనస్సునకేని భిన్నభావము గలుగఁజేయుమాట లుండఁదగదు ౬ కీర్తనమునం దెవరితోనేని పందెము వేయఁదగదు. ఒకవేళ నెవరేని తనతోఁ బందెము వైచినచో సహనము గలిగియుండవలెను. ౭ కీర్తనము గావించుతఱి యెవరినిగూర్చి యేని వ్యర్థప్రసంగములు చేయఁదగదు. జాగరూకులుగ నుండువారలు పవిత్రులగుదురు. మిగులవైభవముతో జనరూపుఁడగు జనార్దనుని (శ్రోతృగణస్వరూపుఁడగు నీశ్వరుని) సంతోషపఱుపవలెను ౮ దప్పిగొన్న మానవుఁడు చల్లనినీటియొద్దకు స్వయముగా నేగువిధముగాఁ బ్రేమయుఁడగు శ్రోత తనంతన భగవత్కీర్తనమునకు వచ్చును ౯ ఇట్టి శ్రోతలఁ బిలువవలసినపనిగాని రప్పించుటకుఁ బ్రయత్నింపవలసినపనిగాని యుండదు. ౧౦ కీర్తనముజేయుట కేదేనిమిష కల్పింపఁగూడదు. అనాసక్తిగ నుండఁజనదు. లజ్జ నొందరాదు. ౧౧ కీర్తనమునకు ఆటంకము గలుగఁజేయు దుష్టులను దగ్గఱకుఁ జేరనీయఁజనదు. మధ్య కలహములు జరుగనీయఁగూడదు. కలహములవలన ధ్యానము భంగమగునను భయము కలుగును ౧౨ కీర్తనముచేయునపు డభిమానముతో మఱుపును దరి జేరనీయఁగూడదు ౧౩ కీర్తన మొనరించుచు మెల్లమెల్లగఁ గదలుచుఁ బరమాత్మునిపైఁ గల ప్రేమతో నృత్యము చేయవలెను. బొత్తిగ స్తబ్ధుఁడై యుండఁగూడదు ౧౪ సుందరమగురీతితో, నమ్రతాపూర్వకముగ మధురస్వరముతో గానము చేయవలెను. ౧౫ కరతాళము, తాంబుర, తానమానము, తాళబద్ధమగు కంఠగానము మున్నగునవి విని బుద్ధిమంతులగుమనుజులు తత్కాలముననే తనుమనములతో భక్తియందు లీనమగుదురు ౧౬ ప్రేమాన్వితులగు భక్తులు వివిధపద్ధతులతోఁ గావించు నృత్యమునుజూచియు వారలొనర్చు సుస్వరయుక్తమగు గానమును వినియు జనులు ప్రసన్నులగుదురు ౧౭ దక్షుఁడగు కీర్తనకారుఁ డొనరించు కౌశలయుక్తములగు కథాప్రబంధముల నాలించిన శ్రోతలయంతఃకరణములు కరుణతో నిండును. ౧౮ అతని కీర్తనము వినుటకుఁ జతురపురుషులు వేగముగాఁ బరుగెత్తుకొని వత్తురు. అతని బుద్ధివిలక్షణతను గాంచి వార లాశ్చర్యము నొందుదురు. ఈవిధమగు తూడికచే రానురాను సభలో రక్తి యతిశయించును. ౧౯ నానావిధపాండిత్యాతిశయముచేఁ బూర్ణములగు హావభావములు, కౌతుకము కీర్తనమునందుఁ జూపవలెను. ౨౦ కీర్తనము పాపము నశింపఁజేయునదిగను, బుణ్యమును ప్రకాశింపఁజేయునదిగను నుండవలెను. కథకుఁడు జెప్పు కథాంశము శ్రోతలు శ్రద్ధాభక్తులతో మననము చేయఁదగినదిగ నుండవలెను. ౨౧ కీర్తనమునందు వ్యర్థముగా మాటలాడఁగూడదు. ఎవరినేని నిందింపరాదు. ౨౨ ఉత్తమభక్తిపూర్ణమగు కథ నాలించుటకై జనులందఱును ఉత్సాహముతోఁ బరుగెత్తుదురు. ౨౩ పరోపకారవ్రతముచే నలంకృతుండగు భక్తుని ప్రజలందఱును బ్రశంసింతురు. ౨౪ కీర్తనకారుని

యుక్తమోపదేశములను శ్రోతలాదరింపవలెను. మోహముచే నున్మత్తులు కాఁజనదు. అభిమానపడుటవలన హాని గలుగును ౨౫ శిక్షాపూర్ణమగు వక్తృత్వము నాలించుటకై జనులు తమంతఁ దామె గుమిగూడుదురు, పిలువవలసిన యవసరముండదు ౨౬ రాగరంగయుక్తమును, రసవంతమును, సుందరమును నగుమనోహరసంగీతము నాలకించినంతన శ్రోతలయంతఃకరణములు అందు లీనమగును. రత్నపరీక్షకులు రత్నములవెంటఁ బరుగెత్తునట్లు ఉత్తమకీర్తనపరీక్షకులు కీర్తనములు వినుటకై పరుగెత్తుదురు ౨౭ భక్తిపూర్ణమగు కీర్తనము నాలించినయెడల జనులయం దీశ్వరప్రేమ వృద్ధియగును. మనస్సు నిర్మలమగును. మఱియు హృదయమున భూతదయ వృద్ధినొందును ౨౮ కీర్తనములందు వ్యర్థవచనముల నుడువఁగూడదు. వ్యర్థవివరణము గావింపరాదు. వినీతుఁడై మంచివక్తృత్వముచే జనుల నానందపఱుపవలెను. ౨౯ జనులందఱకును సారాసారము నేర్పవలెను. సజ్జనులగుపురుషులకు సంగీతసాహిత్యములు రెండును రుచికరముగా నుండును. ౩౦ సత్యాసత్యములు భాషించుతఱి సత్యమగుమాట విశదమైనంతన లోకు లానందింతురు. అనృతము నెవ్వఁడుగాని గౌరవింపఁడు ౩౧ వేదశాస్త్రములు విద్వాంసులు అనుకూలించునట్లు భాషింపవలెను. లేకున్నచో నెవ్వఁడును నభిమానింపఁడు ౩౨ ఆనందపరవశుఁడై పొంగిపోవుచు నవ్వులు, హేళనములలో మునిఁగితేలు కీర్తనకారునకు హితము గలుగదు ౩౩ బ్రహ్మమువైపు లక్ష్యమును నెలకొల్పి దానిని లక్షింపవలెను. స్వయముగ ద్రష్టలగు లోచనములనుగూడఁ జూడవలెను. అట్లు గావించినచో తనంతన అలక్ష్యమునందు లక్ష్యము లగ్నమగును ౩౪ క్షేత్రజ్ఞుఁడు క్షేత్రమును (ఆత్మదేహమును) క్షుబ్ధపఱచుచున్నాఁడు. మఱియు క్షమతో క్షమించి క్షేత్రమునకు శాంతిని గలిగించుచున్నాఁడు. ఆసర్వవ్యాపియగు క్షేత్రజ్ఞుని (ఆత్మయందు) క్షమాక్షోభలు రెండును నున్నవి ౩౫.

ఐదవసమాసము.

హరికథారీతి.

ఇఁక బుద్ధిమంతులగుశ్రోతలు హరికథారీతిని సావధానులరై వినవలెను ౧ హరికథ నేవిధముగఁ జెప్పవలయునో రఘునాథునికృపాపదవి లభించునట్లు దాని నేవిధముగ రక్తికిఁ దేవలెనో వినఁగోరెద ౨ బంగారమునకుఁ దావియుఁ, జెఱుకునకు సుందరమును, మధురమును, రసవంతమును నగుఫలమును నుండుట యపూర్వవిషయము ౩ అట్లే హరిదాసు విరక్తుఁడు జ్ఞాతప్రేమతోఁ గూడిన హరిభక్తుఁడు వ్యుత్పన్నుఁడు, వాదరహితుఁడునై యుంటగూడ అపూర్వవిషయమే! ౪ ఇన్నిసులక్షణములుండి హరిదాసుఁ డొకవేళ రాగజ్ఞానియు, తాళజ్ఞానియు, సకలకళాయుక్తుఁడును, బ్రహ్మజ్ఞానియు, నిరభిమానియునై జనులలోఁ గలసిమెలసియున్నచో నిఁక జెప్పవలసిన దేమున్నది? ౫ మత్సరరహితుఁడు, సజ్జనులకు మిగులఁ బ్రియుఁడు, చతురత్వలక్షణముల నెఱింగినవాఁడు,, ఆత్మనిష్ఠుఁడు నగువాఁ డెవఁడో యాతఁడె ఉత్తమ హరిదాసు ౬ జయంతి మున్నగు పర్వదినములఁగో భక్తితో నుపవసింపక దేవాధిదేవుఁడగు పరాత్పరుఁడువర్తించు క్షేత్రరాజములను విశ్వసింపక కేవలముగ దమకుఁగల శబ్దజ్ఞానమాత్రమున సమస్తమును మిథ్యయని చెప్పుపామరులకు శ్రీపతియగుభగవానుఁ డెట్లులభింపఁగలఁడో యోజింపుఁడు ౭-౮. పామరులకు సందేహకారణమున నిర్గుణమునందు మనస్సు లగ్నముకాదు. బ్రహ్మజ్ఞానమునందలి యభిమానమున నిర్గుణము రుచింపదు. ఈవిధముగా వారలు రెంటికిఁ జెడుదురు. ౯ ముందు సగుణమూర్తినుంచుకొని నిర్గుణమును గూర్చినకథలఁ జెప్పువాఁడును, నిర్గుణమును బ్రతిపాదించి సగుణము నుచ్ఛేదనము గావించువాఁడును జదివినమూర్ఖుఁడు ౧౦ వాస్తవమున కీరెండు పంథలును (సగుణ నిర్గుణమార్గములు) చేతికిఁ జిక్కకుండునట్లు హరికథ గావింపఁగూడదు. ఇఁక హరికథాలక్షణముల వినుఁడు. ౧౧

సగుణమూర్తిసమ్ముఖమున భావపూర్వకమగు కరుణాకీర్తన మొనరింపవలెను. మఱియు నీశ్వరునికీర్తి ప్రతాపయుక్తములగు నానాధ్యానములను వర్ణింపవలెను. ౧౨ ఇట్లు గానము చేయుచున్నయెడల రసయుక్తముగాఁ గథ నోటినుండి సహజముగా బయలువెడలును. అప్పుడు శ్రోతలందఱిహృదయములందును బ్రేమసుఖ ముప్పతిల్లును ౧౩ సగుణములో నిర్గుణమును దేఁగూడదు. శ్రోతలగుణదోషములు నుడువఁగూడదు. ఇదియే కథాకల్పనమునందుఁ బ్రధానయుక్తి ౧౪ భగవంతుని వైభవమును

మహత్త్వమును నానావిధములవర్ణించుచు సగుణమునందు శ్రద్ధయుంచి కథ నుడువవలెను. ౧౫ లోకలజ్జవిడిచి ధనముపై నాశతొలంగి నిత్యనూతనములగు కీర్తనములపై ప్రేమనుంచవలెను. ౧౬ దేవమందిరపు రాజాంగణములందు నిశ్శంకుఁడై పొరలవలెను. కరతాళములు ప్రయోగించుచు, నృత్యముజేయుచు భగవానునినామమును ఘోషింపవలెను. ౧౭ ఒక దేవతకీర్తిని రెండవదేవతముందు వర్ణించుట మంచిదిగ నుండదు. కావున నే దేవతకీర్తి నా దేవతముందె ప్రశంసింపవలెను. ౧౮ ఎదుట సగుణమూర్తి లేకున్న తరుణమునందును సాధువులగు శ్రోతలముందును నవశ్యముగా నద్వైత నిరూపణము గావింపనగును. ౧౯ విగ్రహము లేని తావునను సాధుసజ్జనులు లేని తావునను భావికజనులు శ్రోతలుగనున్న ప్రదేశమునను పశ్చాత్తాపయుక్తమగు (కరుణాపూర్ణమగు) వైరాగ్యమును గీర్తింపవలెను. ౨౦ శృంగారాదినవరసములలో శృంగారవర్ణనము విడిచిపెట్టవలెను. స్త్రీలయిన్నగువారి వినోదములను వర్ణింపఁదగదు. ౨౧ సుందరీమణుల లావణ్యవర్ణనముల నాలించినంతన సులభముగా హృదయమునందు వికార ముదయించును. అంతదనుకనేల! తత్కాలముననే శ్రోతలధైర్యము భంగమగును. ౨౨ కాన శృంగారవర్ణనమును విడువవలెను. శృంగారవర్ణనము సాధువులకు సహజముగా బాధకరముసుమా! ఇట్టివర్ణనముల నాలించుచున్న యెడల అంతఃకరణమునందు స్త్రీలపయి ధ్యానము పాదుకొనును. ౨౩ స్త్రీలావణ్యము నాలకించుటవలనను, ధ్యానించుటవలనను మనస్సు కామాతురమగును. అందుచే నీశ్వరధ్యానస్మరణములు జరుగఁజాలవు. ౨౪ స్త్రీవర్ణనము నాలించి యానందించువాఁడును స్త్రీలావణ్యానందమున మగ్నుఁడగువాఁడును నగు పురుషుఁడు ఈశ్వరునిచే వంచితుఁడగును. ౨౫ ఒకక్షణమాత్రమేని పరమాత్ముఁడు ధ్యానములోనికి రాఁగలిగినచో కథయందు బాగుగా మనస్సు లీనమగును. ౨౬ ఈశ్వరధ్యానమునందు మనస్సు లీనమైనపిదప నిఁక సంసార మెట్లుజ్ఞాపకమునకువచ్చును? నిశ్శంకముగ నిర్లజ్జగనుండి కీర్తనము గావించుచున్నచో ఆనందము కలుగును. ౨౭ కథనుడువునాతఁడు రాగజ్ఞాన, తాళజ్ఞాన స్వరజ్ఞానముల నెఱింగియుండవలెను. అట్లే యుపదేశపూర్ణమగు కీర్తనము గావింపవలెను. ౨౮ ఏఁబదియాఱుభాషలు, నానాకళలు, కోకిల

కంఠమువంటి మధురగాత్రముగూడ హరిదాసునకు అలవడియుండవలెను. ఇవి గౌణవిషయములు. భక్తిమార్గము వీనికంటె వేఱుగనున్నది. దానిని భక్తులే యెఱుంగుదురు ౨౯ భక్తులకీశ్వరధ్యానమే యుండును. ఈశ్వరుఁడుదక్కఁ దదితరము వారెఱుంగనే యెఱుంగరు. కళావిదులహృదయము కళలయందే నిమగ్నమైయుండును ౩౦ శ్రీహరిసంబంధము లేని కళలన్నియు వ్యర్థములు. భక్తిరహితములగు కళలయందు మగ్నుఁడగుపురుషుఁ డీశ్వరునిచేఁ బ్రత్యక్షముగ వంచితుఁడగును ౩౧ సర్పములచే నావరింపఁబడిన కారణమునఁ జందనవృక్ష మెట్టు దరిజేర రానిదిగనున్నదో, భూతప్రేతములభయమువలన ద్రవ్యభాండార మెట్లు అంటరానిదగుచున్నదో అట్లే నానావిధకళలవలన నీశ్వరుఁడుగూడ దుర్లభుఁడగుచున్నాఁడు. ౩౨ సర్వజ్ఞుఁడగు పరమాత్మునివదలి కేవలనాదమునందు మగ్నుఁడగుట విఘ్నమును మధ్య ప్రత్యక్షముగా సమకూర్చికొనుటవంటిది ౩౩ మనస్సు స్వరమునందుఁ జిక్కువడియున్నయెడ శ్రీహరిచింతన మెట్లు జరుగును? ఇది చోరుఁడు బలాత్కారముగ నెవనినేనిబట్టికొని వానిచే సేవచేయించుకొనుటవంటిది ౩౪ పరమాత్మప్రాప్తికి రాగజ్ఞానము విఘ్నము కలిగించును. మనస్సును బట్టికొని స్వరము వెనుకకు లాగికొనిపోవును ౩౫ రాజును దర్శింపఁబోవువానిని గూలికిలాగుకొనిపోవుచోఁ గలుగుదుర్గతి కళవలనఁ గళావంతునకుఁ గలుగును ౩౬ ఈశ్వరుని హృదయమందుంచి హరికథను జెప్పువారలనే ధన్యులనుగా భావింపనగును ౩౭ హరికథయెడఁ బ్రీతియు నిత్యాభివర్ధనమగు నభిమానము గలవానికిఁ బరమాత్ముఁడు లభించును ౩౮ హరికథ జరుగుచోటికన్నింటినివిడిచి పరుగెత్తువాఁడును, సోమరితనము, నిద్ర, స్వార్థము వదలి హరికథయందుఁ దత్పరుఁడగువాఁడును ౩౯ హరిభక్తులగృహమునందు నీచకృత్యమునకుఁగూడ నంగీకరించువాఁడును, స్వయముగ నన్నివిధముల హరిభక్తునకు సహాయభూతుఁడగువాఁడును ౪౦ నామస్మరణమునందు మిగుల విశ్వాసముగలవాఁడును హరిదాసుఁ డనఁబడును. ఇంతతో నీసమాసము ముగియుచున్నది ౪౧.

—

ఆఱవసమాసము

చాతుర్యలక్షణము.

రూపలావణ్యము లభ్యాసముచే సాధ్యమగునవి కావు. స్వాభావిక
గుణము ఉపాయములచే సిద్ధింపదు. ఆగంతుకగుణములకొఱకుఁ గొంత
కొంత ప్రయత్నము చేయవలసియున్నది. ౧ నల్లని మనుజుఁ డెఱ్ఱనివాఁడు
కాఁజాలఁడు. మరుగుజ్జు పొడవరి కాఁజాలఁడు. మూగవాఁడు మాటలాడ
నేరఁడు. ౨ గ్రుడ్డివాఁడు దృష్టిగలవాఁడు కాలేఁడు. చెవిటివాఁడు వినఁ
జాలఁడు. కుంటివాఁడు మఱలఁ బాదముల నొందఁజాలఁడు. ఇవి స్వాభా
వికవిషయములు. ౩ కురూపత్వలక్షణముల నెంతదనుక వర్ణింపఁగలను?
స్వాభావికగుణములు మార్పునొందవు. ౪ కాని అవగుణములు విడిచిపెట్టి
నచో వెడలిపోవును. అభ్యాసముగావించినచో ఉత్తమగుణము లలవడును.
కాన చతురపురుషులు దుర్విద్యను విడిచి సద్విద్య నభ్యసింతురు. ౫
మూర్ఖత్వము విడిచినచో విడిపోవును. చతురత్వము నేర్చుకొన్నచో నల
వడును. ప్రయత్నము గావించినచో అన్నియు బోధపడును. ౬ ప్రతిష్ఠ
నొందఁ గోర్కెయున్నచో దాని నేల యుపేక్షింప వలెను. చతు
రత్వము లేనిచో ఉచ్చపదవి యెప్పుడును లభింపదు.
౭ ఒకవేళ నీవిషయమున విశ్వాసమున్నచో నిఁక జనులు స్వహితము
నేలగావించుకొనరు? సన్మార్గులగుమనుజులను సత్పురుషులెమన్నింతురు. ౮
దేహము నెంతశృంగారించినను ఒకవేళ చతురతయెలేనిచో ఆశృంగార
మంతయు వ్యర్థమే. గుణములేనికావునఁ బయిపై మెఱుంగులతో రూప
ము నేర్పరచుటగూడ వ్యర్థమె. ౯ అంతఃకరణమును శృంగారింపవలెను.
నానావిధజ్ఞానముల నార్జింపవలెను. సంపదలనొంది సుఖముగా ననుభవిం
పవలెను. ౧౦ ప్రయత్నము చేయక, అభ్యసింపక, దేహశ్రమయొనర్పక,
ఉత్తమగుణములు నేర్చుకొనక నిరంతరము క్రోధిగానుండువానికి సౌఖ్య
ము లభింపదు ౧౧ మన మితరులవట్ల చేయుపనిననుసరించియే వారలుచే
యుబదులుపనిగూడ నుండును. జనులకుఁ గష్టముగలుగఁజేసినచో మన
ముగూడ మిగులఁ గష్టము లనుభవింపవలసివచ్చును ౧౨ న్యాయముగ
నడచువాఁడె చతురుఁడు. అన్యాయిగ నుండువాఁడె నీచుఁడు. బహువిధ
చాతుర్యలక్షణములను చతురుఁడె యెఱుంగును ౧౩ సర్వజనులచే నభి

మానింపఁదగు విషయము నందఱును గ్రహింతురు. నిందనీయమగు నంశ
మెవ్వరు నంగీకరింపరు. ౧౪ జనులు నీయెడఁ బ్రసన్నభావులైయుండుట
లేక యెల్లరును నీపయి విసుచుకొనిపడుట (అనునీ రెంటిలో నీకేదియిష్టము)
వీనిలో నీకేదియనుకూలమొ దానిననుష్ఠింపుము ౧౫ సమాధానము
వలన సమాధానము పెంపొందును. మైత్రివలన మైత్రి మిగులగాఢమగు
ను. నాశన మొందించినచో నుంచియంతయు క్షణమాత్రముననే నాశన
మొందును ౧౬ అన్యాయనిపించినచో ఏమండీయనియు ఓరీయనిపిలిచి
నచో ఏమిరాయనియుఁ బ్రత్యుత్తరము వచ్చుట మనము నిత్యమును వినుచు
న్నారము. ఇది ప్రత్యక్షముగా నెఱింగియుండియు అవివేకమునకుఁ బాల్ప
డనేల? ౧౭ చాతుర్యమువలన హృదయమునకు శోభగలుగును. వస్త్ర
మునను దేహమునకు శోభయేర్పడును. ఈరెంటిలో నేది శ్రేష్ఠమగు
శృంగారమో యోచింపుఁడు(లోపలి శృంగారమా లేక బయటిశృంగారమా)
౧౮ బాహ్యశృంగారమువలనఁ బ్రజలకేమియు లాభములేదు. చాతుర్య
మువలనఁ బలువురకుఁ బలువిధముల రక్షణముగలుగును. ౧౯ బాగుగాఁ
దినుట, బాగుగాఁ ద్రావుట, మంచివస్త్రములుధరించుట, అందఱిలో మంచి
వాఁడనిపించుకొనుట అందఱునుగోరునదియె ౨౦ కాని తనువుతో, మన
స్సుతోఁ బరిశ్రమ గావింపనంతదనుక నెవ్వరుఁ బ్రశంసింపరు. వ్యర్థములగు
సంకల్పవికల్పములలోఁ బడుటవలనఁ గష్టమే కలుగును. ౨౧ ప్రజలు తా
మునిర్వహింపఁజాలక ఆపిన కార్యము నెవ్వఁడునిర్వహింపఁగలఁడో అతని
యొద్దకు జనులు తమంత నేగుదురు ౨౨ కావునఁ బ్రజలను సుఖమునొం
దించి తానుస్వయముగా సుఖములను బడయవలెను. ఇతరులకు దుఃఖము
నుగలిగించినచో దానుగూడఁ గష్టముల ననుభవింపవలసివచ్చును ౨౩
ఈవిషయ మందఱు నెఱింగినదే. బాగుగా యోచింపనిచోఁ గార్యము
జరుగదు. తెలిసికొనుటయే ప్రాణిమాత్రులకుఁ జక్కని యుపాయము
౨౪ చక్కఁగఁ దెలిసికొనివర్తింపుపురుషులే భాగ్యవంతులు. అట్టివార
లను విడిచినచోఁ దక్కినవారలెల్లరు నభాగ్యులే. ౨౫ ప్రయత్నానుసార
ముగా వైభవము లభించును. వైభవమునుబట్టి సౌఖ్యముగూడ సమకూ
రును. ఈయుపాయము ప్రసిద్ధముగనేయున్నది. తెలిసికొనవలయును ౨౬
అలసత్వమువలనఁ గార్యము భంగమగును. ప్రయత్నము సోమరితనము

వలన మెల్లమెల్లగ నగును. ప్రత్యక్షవిషయము దెలియనివాఁడవివేకి యనిపించుకొనును ౨౭ మైత్రివలనఁ గార్యము సమకూరును, వైరమువలన మృత్యువు గలుగును. ఈవిషయము సత్యమో, అసత్యమో గుర్తెఱుంగ వలెను ౨౮ తానునేర్పరియగుట నెఱుఁగనివాఁడు, స్వహితము నెఱుంగని వాఁడు, జనులతో స్నేహముగానుంట యెఱుఁగనివాఁడు, పిరాదుమిక్కిలి వైరముగావించుకొనువాఁడు అజ్ఞాని యనఁబడును. ఇట్టి యజ్ఞానులకడ నెవరు సమాధానమొందఁగలుగుదురు. ౨౯, ౩౦ ఎవఁడేని యొకవేళ ఆకస్మికముగాఁ బ్రపంచముతో నొంటరిగాఁ బోరాడఁ బ్రయత్నించిన యెడల బలువురిముందా యొంటరికాఁడు విజయము గెల్లుబడయగలఁడు? ౩౧ నిజమగు హరిభక్తుఁడు పలువురినోటియం దుండవలెను. పలువురి యంతఃకరణములందుఁ బాదుకొనవలెను. ప్రాణిమాత్రులకు ఉత్తమగుణములు నేర్పవలెను. ౩౨ లోకులను జతురులుగఁ జేయవలెను. పతితులను బావనము జేయవలెను. సృష్టియందు భగవద్భజనమును వృద్ధినొందింపవలయును ౩౩.

ఏడవ సమాసము.

కలియుగ ధర్మములు.

నానావిధ వేషములు, నానావిధాశ్రమములు మున్నగువానికన్నింటికిని మూలము గృహస్థాశ్రమము. ఈఆశ్రమమునందు అన్నివిధములగు మనుజులును విశ్రాంతినొందుదురు. ౧ దేవతలు, ఋషులు, మునులు, యోగులు, నానాతాపసులు, వీతరాగులు, పితరులు మున్నగునధికారులు అతిథిఅభ్యాగతులు మున్నగువారలందఱును గృహస్థాశ్రమమునం దుత్పత్తియగుచున్నారు. వీరలెల్లరుఁ దమతమయాశ్రమములువదలి వేయుచున్నను గీర్తిరూపముతో గృహస్థునియింటియందు నిరంతరము తిరుగుచున్నారు ౨, ౩ కావునగృహస్థాశ్రమమన్నియాశ్రమములకంటెను శ్రేష్ఠమైనది. కానిస్వధర్మము, భూతదయ ఆవశ్యకము. (ఈరెండుగుణములు గృహస్థునందు అవశ్యకముగనుండవలెను). అప్పుడే గృహస్థాశ్రమమునకు శోభ ౪ వేదవిహితములగుకర్మములాచరింపవలెను. అందఱితో మధురముగా భాషింపవలయును ౫ అన్నివిధములను నుచితముగాఁ బ్రవర్తింపవలెను. అన్నిపనులను శాస్త్రో

నుకూలముగ నొనర్పవలెను. భక్తిమార్గముతో నడువవలెను ౬ పురశ్చరణయు, కాయక్లేశియు, దృఢవ్రతుఁడును, పరమోద్యోగియు, జగదీశ్వరునిదక్క నితరుని గొప్పవానిగఁ దలంపనివాఁడును ౭ కాయవాగ్జీవములతో భగవంతునికొఱకుఁ గష్టించువాఁడును, భజనమార్గమునందు దృఢభావముగలవాఁడును, ౮ సత్యమగు భక్తుఁడు. ఆతఁడు విశేషించి హృదయమునందు విరక్తుఁడైయుండును. ఆతఁడు సంసారచింత విడిచి ముక్తుఁడగును. ౯ హృదయమునందు వైరాగ్యభావముగలవాఁడే మహాభాగ్యశాలి. సంసారాసక్తికి సమానమగు దౌర్భాగ్యమింకొకటి లేదు ౧౦ ఎందఱో రాజులు రాజ్యములను వదలి భగవంతునికొఱకు వంతటను దిరిగిరి. భూమండలమునందుఁ గీర్తిరూపముతోఁ బవిత్రులైరి ౧౧ ఇట్టియోగీశ్వరులే అనుభవశాలురు. వారలు తమసదుపదేశమహాత్మ్యమున లోకమును పావనముచేయుచున్నారు. ౧౨ ఉదాసీన వృత్తియుతులగు నిట్టియాత్మజ్ఞానులను దర్శించినంతన మానవులు పవిత్రులగుదురు ౧౩ వారలవలన మనుష్యమాత్రులకుఁ గళ్యాణములు గలుగును. వారలవలన నెవ్వరికిని జెఱుపుగలుగదు. అఖండరీతిగ వారలహృదయములు భగవంతునియందు లగ్నమైయుండును ౧౪ జనులకిట్టియోగి దుశ్చిత్తునివలె గోచరించును. వాస్తవమున కాతఁడే సావధానుఁడు. ఏలయన! ఆతనిచిత్తము పరమేశ్వరునియందు లగ్నమై యుండును. ౧౫ ఉపాస్యమూర్తిని ధ్యానించుటలో నాతనిచిత్తము మగ్నమైయుండును. ఆత్మానుసంధానమునందుఁ దగిలియుండును. శ్రవణమననములలో నాతనిహృదయ మన్వయించియుండును. ౧౬ పూర్వజన్మసుకృతాతిశయము కోట్లకొలఁదిగ సంగ్రహమైన యెడల నిట్టిపుణ్యపురుషులతోడి సమాగమము లభించును. ౧౭

ప్రతీతిరహితమగు జ్ఞానమంతయుఁ బ్రాయికముగ ననుమానమాత్రము. అనుమానజ్ఞానమువలన మనుజులకెన్నఁటికిని ముక్తి లభింపదు. ౧౮ కావునఁ బ్రతీతియే ముఖ్యమైనది. ప్రతీతిలేకున్నచోఁ బనినడువదు. చతురపురుషులు ఉపాయాపాయములను రెంటి నెఱుంగుదురు. ౧౯ కొందఱు బుద్ధిహీనులు సుఖముకొఱకు గృహస్థాశ్రమమును విడిచివేయుదురు. ఐనను వారలు ఇహపరలోకములు రెంటికి వంచితులై దుఃఖముతో మరణింతురు. ౨౦ క్రోధపడి గృహత్యాగము గావిం

చినమనుజుఁడు కలహించుచు మరణించును. అంతియగాదు. పలువురను దుఃఖములపాలు చేయును. స్వయముగఁ దానుగూడ దుఃఖము లనుభవించును. ౨౧ వైరాగ్యమున నిల్లువిడిచి వెడలిపోవునుగాని చిత్తమునం దజ్ఞానము తొలఁగకయుండును. శిష్యులుగా నేర్పడిజను లాతని వెంబడింతురు. గురుశిష్యు లిరువురును సమానముగ నజ్ఞానయుక్తులై యుందురు. ౨౨ ఇట్టి యాశాబద్ధుఁడును అనాచారియు నగుపురుషుఁ డొకవేళ గృహమును విడిచి (గార్హస్థ్యమును వదలి) వెళ్ళిపోయినచో నాతఁడు జనులలో ననాచారమును వ్యాపింపఁజేయును. ౨౩ ఇంట నిత్యోపవాసము లోనరింపలేక యాయాసపడి విరాగియైనజనుఁడు ప్రతిస్థలమునను దొంగతనము జేయుటఁజూచి చావఁజితుకఁ గొట్టుదురు. ౨౪ సంసారమును మిథ్యగా నెఱింగి జ్ఞానప్రాప్తి నొంది వెడలిపోవుయోగ్యుఁడు తనకు సమానులగు జనులనందఱను పావనమొనర్చును. ౨౫ ఒకనిసాంగత్యమువలన జనులు తరింతురు. ఒకనిసాంగత్యమువలన మునిఁగిపోవుదురు. కావున (సాంగత్యమునకు) ముందుగ నెదుటివానిని బాగుగఁ బరీక్షింపవలెను. ౨౬ వివేకహీనుఁడు ఇతరులకేమి యుపదేశింపఁగలఁడు? ఇట్టి యవివేకికి అడిగినచో భిక్షసైతము దొరుకదు. ౨౭ ఇతరుల హృదయములలోని భావము నెఱింగి దేశకాలోచితముగఁ బ్రసంగింప నేర్చినవాని కీప్రపంచమునం దేవిషయమునను గొఱంతయుండదు. ౨౮

నీచప్రాణి గురుత్వము నొందినతావున ఆచారమే మునిఁగిపోవును. ఈదశలో వేదశాస్త్రములను బ్రాహ్మణులను నెవ్వఁడడుగును? ౨౯ బ్రహ్మజ్ఞానమును విచారించు నధికారము బ్రాహ్మణునకే కలదు. వర్ణానాం బ్రాహ్మణోగురుః (అన్నివర్ణములకు బ్రాహ్మణుఁడే గురువు) అని శాస్త్రములందుఁగలదు. ౩౦ కాని బ్రాహ్మణులు బుద్ధిచ్యుతులైరి. వారియాచారములు భ్రష్టములైనవి. వారలు గురుత్వమును వదలి శిష్యులకుఁ గూడ శిష్యులైరి. ౩౧ ఎందఱో బ్రాహ్మణులు, దావలమల్లకునకు (ఒకమహమ్మదీయతీర్థమునకుఁ) బోవుచున్నారు. ఎందఱో పీర్లను భజించుచున్నారు. ఎందఱో బుద్ధిపూర్వకముగాఁ దురుష్కు లగుచున్నారు. ౩౨ ఇదియే కలియుగాచారస్థితి. విచారపు జాడపోడ లెచ్చటను గనుపించుట లేదు. ఇఁక దీనికిముందు సాంకర్యమే జరుగనున్నది. ౩౩ నీచజాతికి గురుత్వము ప్రాప్తించినది. కొంచెము స్వల్పసాధువృత్తి (మహంతుతనము) పెంపొందఁజేసి శూద్రులు బ్రాహ్మణాచారములను ముంచివేయుచున్నారు. ౩౪ బ్రాహ్మణుల కిది తెలియదు. వారివృత్తియే మాఱకున్నది. వారలకు మూర్ఖత్వజన్యమగు మిథ్యాభిమానము నశింపకున్నది. ౩౫ మనరాజ్యము మ్లేచ్ఛులయింటిలోనికి వెళ్ళిపోయినది. గురుత్వము అపాత్రులపాలైనది. మనము మనలో లేము పరులలోనున్నాము. ఏమియు లేకుండఁబోయినది. ౩౬ బ్రాహ్మణులను గ్రామణ్యము (గ్రామాధికారము) ముంచివైచినది. భృగుమహర్షి పాదఘాతమును ఆదరపూర్వకముగ ధరించిన విష్ణుమూర్తియే పరశురామావతారమున బ్రాహ్మణజాతికి శాపమొసంగెను. ౩౭ మేమును ఆబ్రాహ్మణులమే. మాపూర్వులు మాకు గ్రామణ్యమనుదానిని దగిలించిపోయిరని దుఃఖముతోఁ జెప్పవలసివచ్చినది. ౩౮ ఇప్పటిబ్రాహ్మణు లేమియొనరించిరి! అన్నముగూడ లభింపనివారైరి. ఈవిషయము విచారులందఱు నెఱుంగుదురు. ౩౯ మంచిది. పూర్వుల నేమందము? బ్రాహ్మణుల భాగ్యమే యిట్లున్నదని యెఱుంగవలయును. ప్రసంగము ఘటిల్లినందున సాధారణరీతిగ నింతదనుకఁ జెప్పివైచితిని. శ్రోతలు క్షమింపవలయును. ౪౦

ఎనిమిదవ సమాసము.

అఖండధ్యానము.

మంచిది. అయినదేమో అయిపోయినది. ఇఁక నిప్పుడు బ్రాహ్మణులను మేల్కొలుపవలయును. ౧ నిర్మలహస్తములతోఁ బరమాత్మునిఁ బూజింపవలెను. అట్లు పూజించినచో వైభవములన్నియును లభింపఁగలవు. మూర్ఖులు, భక్తిరహితులు, వ్యసనులు నగుమనుజులు దారిద్ర్యమనుభవింతురు. ౨ మొదట నీశ్వరుని గుర్తింపవలెను. పిదప ననన్యభావముతో నాతని భజింపవలెను. ఆసర్వోత్తముని అఖండరూపమునందు ధ్యానముంచవలెను. ౩ అందఱియందు నుత్తముఁడగువాఁడు సర్వోత్తముఁడు. ఆత్మానాత్మవివేక మొనరించి యాసర్వేశ్వరునిమర్మము నెఱుంగవలెను. ౪ ఎఱుకవలన నాత్మ దేహమును రక్షించును. ఆత్మ ద్రష్టయు, నంతస్సాక్షియు నైయున్నది. అది యెఱుకవలనఁ బదార్థమును బరీక్షిం

చును. ౫ ఆత్మ అన్ని దేహములందును వర్తించును. ఇంద్రియగణమున కాత్మయే చేష్టలొసంగును. అనుభవమువలనఁ బ్రాణిమాత్రుల ప్రత్యయములోనికి వచ్చును. ౬ ప్రాణిమాత్రుల యంతఃకరణములయందుఁ బరమాత్ముఁ డున్నాఁడు. కావున నెల్లరియంతఃకరణములను సంతుష్టిగా నుంచవలెను. ఆపరమాత్ముఁ డొకఁడె దాతయు, భోక్తయు, నన్నియు నై యున్నాఁడు. ౭ సంపూర్ణముగనున్న జగత్తుయొక్క అంతఃకరణము నందుఁ బరమాత్ముఁడు వర్తించుచున్నాఁడు. ఆతఁడు మనయంతఃకరణము నందు త్రిలోకములలోని ప్రాణులయంతఃకరణమునందు నున్నాఁడు. చక్కఁగ యోచించిచూడుఁడు. ౮ వాస్తవమునకుఁ జూచెనేవాఁ డాతఁ డొక్కఁడే. కాని యాతఁ డన్ని తావులయందును వ్యాపించియున్నాఁడు. దేహప్రకృతిననుసరించి యాతఁడు భిన్నభిన్నముగ నున్నాఁడు. ౯ పరమాత్ముఁడు దేహమును ఉపాధికారణమున భిన్నముగ భాసించుచున్నాఁడు. సంపూర్ణజగత్తుయొక్క అంతఃకరణమునం దాతఁడొక్కఁడే వ్యాప్తుఁడై యున్నాఁడు. భాషించుట, నడచుట మున్నగునవియెల్ల నాతనివలననే జరుగుచున్నవి. ఇందు సందేహములేదు. ౧౦ నావారు, పెరవారు అని మనమనుకొనుసమస్తజనులు, పక్షులు, శ్వాపదములు, పశువులు మున్నగు నవియు, కీటకములు చీమలు మొదలగుదేహధారులగు సమస్తప్రాణులు ఖేచరభూచరవనచరములు, నానావిధజలచరములు, చతుర్విధసృష్టికి సంబంధించిన జీవవ్రాతము మొదలగుజంతువుల నెంతదనుకఁ జెప్పఁగలను ? సమస్తప్రాణులును చేతనశక్తివలననే వర్తించుచున్నవి. దీనినిఁ బ్రత్యక్ష ప్రతీతిగఁ జూచుకొనుము. ఆచేతనశక్తికిని మనకును సాంగత్యము అఖండ రీతిగ నేర్పడియున్నది. ౧౧, ౧౨, ౧౩ జగత్తుయొక్క అంతఃకరణము నందు వ్యాప్తుఁడై యున్నపరమాత్ముఁడు ప్రసన్నుఁడై నపిదప (మనుజులందఱును ప్రసన్నులైనపిదప) అనంతమగు మనుష్యసమూహమంతయు మనవద్దనే ప్రోవగును. జగద్రూపుఁడగు పరమాత్మనిఁ బ్రసన్ననిఁ గావింపదగిన యుపాయము మనవద్దనే యున్నది. ౧౪ ప్రజలనందఱిని సుఖులనుగ నుంచవలెను. ఏలయన? దేహమునకుఁ గావించుమేలు ఆత్మకుఁగూడఁ జేకూరును. ౧౫ దుర్జనులగు ప్రాణులయందుండెడి ఈశ్వరాంశముయొక్క స్వభావముగూడ నిట్టిదె. కావున

దుర్జనుఁడొకవేళఁ గ్రోధవశుఁడగుచో వానితోఁ గలహింపఁ దగదు ౧౬ తొలుత వానిని విడిచి పెట్టవలెను. తరువాత వానినిగూర్చి యోచింపవలెను. వివేకముతో నెల్లరను సజ్జనులఁ జేయవలెను ౧౭ ఔషధభేదము వలన జలమునందు నానావిధములగు రుచులు గలుగును. అటులే దేహసంబంధమువలన ఆత్మత్వమునందుసైతము భేదములు కలుగును. ౧౮ విషమైనగానిమ్ము అమృతమైనగానిమ్ము. అందలి జలతత్త్వము పోదు. ఇట్లే సాక్షిత్వముతో ఆత్మను గుర్తెఱుంగవలయును. ౧౯ అంతర్నిష్ఠగల పురుషుఁడు అంతర్నిష్ఠాకారణమున అందఱికంటె నుత్తముఁడు. ఆతఁడు జగదంతర్యామియగు జగదీశ్వరుని గుర్తెఱుంగఁగలఁడు ౨౦ కంటితోఁ గంటిని గాంచునట్లును, మనస్సుతో మనస్సును వెదకునట్లును (ఘటసహాయమున) భగవంతుని ఘటఘటమున వ్యాపకునిగా నెఱుంగవలెను * ౨౧ ఆతఁడు లేకున్నచోఁ గార్యమాగిపోవును. అంతయు నాతనివలననే జరుగుచున్నది. అతని సంయోగమువలననే ప్రాణికి వివేకము ప్రాప్తించును ౨౨ జాగరూకతవలన జరుగు వ్యాపారసంబంధమంతయు నీశ్వరసంబంధముననే జరుగుచున్నది. అట్లే స్వప్నమునందు జరిగెడి దంతయు నాతనిసంబంధముననే జరుగుచున్నది ౨౩ ఈవిషయమును బాగుగా విచారించినచో అఖండధ్యానలక్షణము విశదమగును. పరాత్పరుని యఖండస్మరణము సులభముగ నెరవేరును ౨౪ జనులలోఁ దఱచుగ నొకలోపము కనఁబడుచున్నది. అదియేదన? సులభమునువిడచి కఠినమును బట్టుకొనుటయే. జనులు ఆత్మనువిడిచి అనాత్మను ధ్యానింతురు ౨౫ కాని యనాత్మధ్యానము కడముట్టదు. అనాత్మధ్యానమారంభించినచో నానావ్యక్తులు ధ్యానములోనికివచ్చును. వ్యర్థముగా శ్రమగలుగును ౨౬ ప్రయత్నపూర్వకముగ మూర్తిని ధ్యానించినచో నచట ఒకటికి మఱియొకటి గానవచ్చును. (భాసింపఁగూడనిది భాసించును) ఇట్లే కొంతవిలక్షణముగ భాసించును ౨౭ దేవునిగూర్చియా ధ్యానము చేయవలసినది? లేక దేవాలయమునుగూర్చియా? అనునీయంశమును మునుముందుజక్కఁగా

* సమస్తప్రాణులం దెట్లున్నాఁడో యట్లే మనలోఁగూడఁ బరమాత్ముఁడున్నాఁడు. దీనితో నితరుల యంతఃకరణము నెఱుంగుట సర్వఘటవ్యాపకుఁడగు భగవంతుని భగవంతునిమూలమునఁ జూడుటయేయని యెఱుంగవలయును.

విచారింపవలెను. ౨౯ దేహము దేవాలయము. అందలి యాత్మ దేవుఁడు. ఈ రెంటిలో నీవు దేనియందు భక్తియుంచెదవు? దేవునిగుర్తించి యాతని యందుహృదయమును లగ్నపరుపవలెను ఇదిసత్యమగు ధ్యానమిది. జనరూఢిజ్ఞానము అన్యము. అనుభవము లేనిదంతయువ్యర్థము. ఇదిసత్యము ౩౦ సందేహమువలన సందేహమే వృద్ధినొందును. ఈసందేహదశలోఁగావించెడి ధ్యానముతత్క్షణమే భంగమగును. పాపమువ్యర్థముగాఁ బ్రజలు స్థూల ధ్యానమొనరించుచుఁ గష్టములను సహించుచున్నారు ౩౧ పరమాత్మని దేహధారిగ విశ్వసించుటచే వీరలహృదయమునందు నానావికల్పము లుప్పతిల్లును. మానవునకు భోగత్యాగాది విపత్తులు దేహయోగమువలననే కలుగుచున్నవి ౩౨ (అనాత్మధ్యానమువలన) నానాప్రకారములగు విషయములు మనస్సులోనికి వచ్చును. వానిని విచారించుట మిగుల గఠినము. స్వప్నమునందేని గాన్పింపనిదృశ్యములు అనాత్మధ్యానమున గనుపించును. ౩౩ కనిపించువానినెల్ల వివరించుట యసాధ్యము. బలాత్కారముగ దాని యందువిశ్వాసముంచుట గూడ యసాధ్యమె. ఈకారణమున సాధకుని యంతఃకరణమునందు ౩౪ ధ్యానము సాంగోపాంగముగా సమరినదనుటకు సాక్షి తనమనస్సె. మనస్సునందు వికల్పదర్శనము గావింపఁదగదు. ౩౫ చంచలముగనుండు మనస్సును స్థిరపరచి యఖండధ్యానమొనరించుటవలనఁ గలుగుఫల మేది యో జనులు చూడకున్నారు ౩౬ అఖండధ్యానమునందొకవేళ నేవని కేని హితముగలుగనిచో నట్టివానినిఁ బతితునిగ భావింపవలెను, ఈవిషయమును సుచిత్తుఁడై చక్కఁగ విచారింపవలెను ౩౭ ధ్యానమొనరించు వాడెవ్వఁడో? ధ్యానములోనికి వచ్చువాఁడెవ్వఁడో యాయిరువురియందును అనన్యలక్షణము లుండవలెను. ౩౮ వాస్తవమున కనన్యత స్వాభావికమే. సాధకుఁడు శోధించిచూడమియే అభ్యంతరము. జ్ఞానియగుపురుషుఁడు మననము గావించు సమాధానమునందు మగ్నుఁడగును ౩౯ ఇవి యనుభవకార్యములు. అనుభవము లేకున్నచో భ్రమతో బాధ లొందవలసివచ్చును. సాధారణజనులు జనరూఢి ననుసరించి వర్తింతురు ౪౦ అవలక్షణులు, అభాగ్యులు నగుమనుజులు జనరూఢిననుసరించి ధ్యానలక్షణములనే పట్టుకొనియుందురు. సాధారణజనులు సత్యాసత్యము లెఱుం

గరు ౪౧ వారు డాంబికములాడుచు ఆర్భాటములను జేయుదురు. కాని మనస్సులో యోచించినపిమ్మట అంతయు మిథ్యగ గోచరించును ౪౨ ఒకానొకమనుష్యుడు (స్థూలమూర్తిని ధ్యానములోనికిఁ దెచ్చుకొని) మానసపూజ గావించుచుండెను. (కిరీటమున్నందునఁ బూలదండ విగ్రహము కంఠమునఁ బడకుండెను) రెండవమనుష్యుడు (అంతస్సాక్షిత్వశక్తివలన నీవిషయము నెఱింగి) వానితోఁ గిరీటముదించి పూలదండ వేసినచోఁ జక్కఁగ విగ్రహకంఠమున నిముడునని యనెను ౪౩ ఓసోదరా! మనస్సున కేమిపోవు కాలమువచ్చినదని పుష్పమాల కల్పించితివి? (దేశీయదశయందు బూలదండఁ గల్పించువాఁడును గిరీటమునుదించి మాలికను వేయుమని యుక్తినిదెలిపినవాఁడును) ఈయిరువురును బరమమూర్ఖులని యెఱుంగవలెను ౪౪ ప్రత్యక్షముగ నేమియుఁ గష్టపడవలసిన యగత్యము లేదు. దారముతోఁ బూవులను గ్రుచ్చవలసిన పని లేదు. ఈస్థితిలోఁ గల్పితపుష్పమాలల నేల యింకను జేయుచున్నారు ౪౫ బుద్ధిహీనులగు ప్రాణులందఱును మూర్ఖులు. వారితో (రాద్ధాంతసిద్ధాంతముల) గోల కెవరు సిద్ధముగనున్నారు? ౪౬ ఎవరెట్లు పరమార్థముగావింతురో వారి కట్టిరీతియే పృథ్విపై గలుగును. మఱియు సప్తకముపైనను పంచకముపైనను వారి కభిమానము వృద్ధినొందును * ౪౭ ప్రత్యయము లేకుండ నభిమానపడుట మోసగించి రోగిని జంపుటవంటిది. ప్రత్యయము లేకున్నవు డంతయు ననుమానమే! జ్ఞానమునకుఁ దావెక్కడిది? ౪౮ కావున సంపూర్ణాభిమానమును విడిచివేయవలెను. ప్రతీతిపూర్వకమగు వివేకము నార్జింపవలెను. అంతియగాక మాయారూపమగు పూర్వపక్షమును వివేకముచే ఖండనము గావింపవలయును ౪౯

తొమ్మిదవ సమాసము
శాశ్వత నిరూపణము.

ఇంతకుమున్ను పిండమునుగూర్చియు ఆత్మానాత్మవివేకమును

* ఈసప్తకము సప్తవ్యసనములనియు, ఈపంచకము పంచేంద్రియాసక్తులనియుఁ దోఁచుచున్నది.

గూర్చియుఁ జర్చించితిని. దీనివలనఁ బిండ మనాత్మయనియు అన్నిటికిఁ గర్తయగు నాత్మ పిండముకంటె భిన్నమనియు విదితమైనది ౧ ఇంతియ గాక యాత్మపట్ల యనన్యత గలిగియుండవలయుననుసంగతిగూడ విశద మైనది. ఇఁక బ్రహ్మాండరచనమునుగూర్చి విచారింపవలెను. ౨ ఆత్మా నాత్మవివేకము పిండమునందున్నది. సారాసార వివేకము బ్రహ్మాండమునందున్నది. రెంటివివరణమును బాగుగా నొసర్చు యందలిరుచి గ్రహింపవలెను ౩ పిండకార్యమునకు బ్రహ్మాండము (పంచభూతములు) కారణము. దీనివివరణము గావించువిధము ముందుఁ దెలుపుదును. ౪ నాశవంతమగుదాని నసారమనియు శాశ్వతమగుదానిని సారమనియుఁ జెప్పుదురు. కల్పాంతమునందు నాశమొందునది సారము గాదు. ౫ పృథివి జలమువలన నేర్పడెను. అంత్యమున నది జలమునందే లయమగును. జలము తేజమువలన నుత్పత్తియయ్యెను. ౬ ఆజలమును తేజ మింకించును. మహాత్తేజమువలన జలము లయమగును. జలము లయ మైనపిదప తేజము మిగులును. ౭ వాయువువలనఁ దేజము కలుగును. కావున వాయువే తేజమును లయమొందించును. తేజ మీవిధముగా లయమై పోయినపిదప వాయువే మిగులును. ౮ వాయువు ఆకాశమునుండి జనించును. కాన అంత్యమునందు ఆకాశమునందే వాయువు లయ మగును. ఈకల్పాంతవర్ణనము వేదాంతశాస్త్రమునం దున్నది. ౯ గుణ మాయయు, మూలమాయయు సైత మంత్యమునఁ బరబ్రహ్మమునందు లయమగును, ఇఁక నాపరబ్రహ్మమును వివరించుటకు స్వపవివేకము గావలసి యున్నది. ౧౦ అన్నియుపాధులకు నంత్యముగనున్నదియు దృశ్యమున కతీతముగనున్నదియు నగు నిర్గుణపరబ్రహ్మము అన్నింటియందును వ్యాప్తమైయున్నది. ౧౧ ఎన్నికల్పాంతములకైనఁ బరబ్రహ్మమునకు నాశన ములేదు. మాయను త్యాగమొనరించి శాశ్వతమును గుర్తెఱుంగవలెను. ౧౨ ఈశ్వరరూపమగు అంతరాత్మ సగుణము. ఈసగుణమునుండియే నిర్గుణము లభించును. నిర్గుణజ్ఞానమువలన అనుభవాత్మకమగుజ్ఞానము కలుగును. ౧౩ కల్పనాతీతమై నిర్మలముగనున్నవస్తువునకు మాయామల మెప్పుడును సోకఁజాలదు. మిథ్యాత్వమునుండి (మాయనుండి) యీసమస్తదృశ్యము కలుగుట నశించుట జరుగుచున్నది. ౧౪ ఎయ్యది యుత్పత్తి

యగునో యది మఱియొకక్షణమున నశించుచున్నది. ఇది ప్రత్యక్షముగ గనుపించుచున్నసంగతి. ఉత్పత్తినాశనములులేని పరబ్రహ్మమును వివేక బలముతో గుర్తెఱుంగవలెను. ౧౫ జ్ఞానము, అజ్ఞానము, విపరీతజ్ఞానము అనునీమూఁడును (ఈత్రిపుటి) లయమగుటయే విజ్ఞానము (అద్వైతానుభవ జ్ఞానము) ౧౬ వేదాంతసిద్ధాంతరాద్ధాంత (స్వానుభవము) ములయొక్క ప్రతీతిని గడింపవలెను. ఆనిర్వికారపరబ్రహ్మము నిరంతరము అన్నింటియం దును ప్రకాశించుచున్నది. ౧౭ ఆసదోదిత నిర్వికారపరబ్రహ్మమును జ్ఞానదృష్టితోఁ గాంచవలెను. చూచి దానియందే లీనుఁడై యుండవలెను. దీనినే ముఖ్యమగు ఆత్మనివేదన మందురు. ౧౮ దృష్టికి దృశ్యము గాన్పిం చుచున్నది. మనస్సునకు భాస భాసించుచున్నది. కాని అవినాశియగు పరబ్రహ్మము దృశ్యభాసలు రెంటికవ్వలనున్నది. * ౧౯ విచారము గావించినచోఁ బరబ్రహ్మ మెంతయోదూరమున నున్నట్లు గోచరించును. యథార్థమునకది లోపలను, వెలుపలను, అంతటను వ్యాప్తమైయున్నది. దాని కంత్యమే లేదు. అది యనంతము. ఆపరబ్రహ్మమున కుపమానమే లేదు. ౨౦ చంచలము స్థిరముగాదు. నిశ్చలమెప్పుడును చలము గాదు. మేఘములు వచ్చుచుఁబోవుచున్నను ఆకాశ మచలముగానున్నది. ౨౧ వికారమువలన బెరుగుచు క్షీణించుచు నుండుదానికి శాశ్వతత్వ మెట్లుకలు గును ? సమస్తమును గల్పాంతమునందు లయమగును. ౨౨ అంతఃకరణ మునందు భ్రాంతినొందుచు మాయాసంభ్రమమున భ్రమనొందుచునుండు వానికి యపారప్రపంచచక్ర మెటులబోధగాఁగలదు? ౨౩ సంకోచమువలన వ్యవహారము కొనసాగదు. సంకోచమువలన సిద్ధాంతము విదితముగాదు. సంకోచమువలన అంతఃకరణమునందుఁ బరమాత్ముఁడు గోచరింపఁడు. వైద్యునియెడనొకవేళ నమ్మకము కుదురకున్నను సంకోచమును విడువకున్నను

---

* దృష్టితో (చర్మచక్షువులతో) పరబ్రహ్మము గనుపింపదు. ఏలయన ? నది దృశ్యముకంటె నావలనున్నది. ఇట్లే భాసతో (మనస్సుతో) అపరబ్రహ్మము భాసిం పదు. ఏలయన, నది భాసకంటె నావలనున్నది. కాన దృశ్యాత్మకమగు చక్షువులుగాని, భాసాత్మకమగు మనస్సుగాని యెచటలేవో, ఎపుడు దృశ్యముఅదృశ్యముఅవునో, ఎపు డు మనస్సు ఉన్మనమగునో అప్పుడే ఆయనిర్వాచ్యదశయందే పరబ్రహ్మము గోచరించు నని భావము.

రోగి బ్రతుకఁజాలఁడు. ౨౫ రాజును గుర్తెఱింగినవాఁడు సాధారణ రాజకీయోద్యోగిని గణింపఁడు. పరమాత్ముని గురుతెఱింగినవానిని బరమాత్మస్వరూపునిగఁ దలంపుఁడు (ఏలయన? పరమాత్మస్వరూపుఁడుగానిది మానవుండు పరమాత్ముని గుర్తింపఁజాలఁడు) ౨౬ మాయనుగూర్చి భయపడు నీచ మానవుఁ డెవరి కేమిచెప్పఁగలఁడు? విచారించిచూచినచో నిదియంతయు స్పష్టముగా నున్నది. ౨౭ మాయకేవల సంకోచము, ఆవల పరబ్రహ్మము నున్నది. మాయ సంకోచపరబ్రహ్మములకు మధ్య సదోదితముగా నున్నది. ౨౮ మిథ్యను సంకోచించుటయు భ్రమవలన నొకదానికి మఱియొకటి చేయుటయు వివేకలక్షణముగాదు. ౨౯ అసత్యమంతయు విడువవలెను. సత్యయమును విశ్వాసపూర్వకముగా గుర్తింపవలెను. మాయను బరిత్యజించి పరబ్రహ్మమును గుర్తింపవలెను. ౩౦ మాయాస్వరూపము నింతకు మున్నె వివరించితిని. సుచిత్తతతో మాయను విచారింపవలెను. ౩౧

పదియవసమాసము.

మాయ మిథ్యమైయున్నది.

మాయ కాన్పించుచున్నది. కాని నాశమగుచున్నది. వస్తువు కాన్పించుటగాని నాశమగుటగాని లేదు. మాయ సత్యముగఁ దోఁచును. కాని యది పూర్తిగ మిథ్య. ౧ దరిద్రుఁడు చిక్కులపాలై నానావిధయత్నము లొనరించినను అతఁడు కోరిననొక్కటియు నెరవేరదు. అట్లే మాయయు నైయున్నది. ౨ ద్రవ్యముయొక్కయు, దారలయొక్కయు స్వప్న విభవములు నానావిధములగు విలాసయుక్తహావభావములు, క్షణములో గోచరించి యంతలో నడంగును. వాస్తవమున నవి మిథ్యలు. మాయయు నట్లే మిథ్య ౩ ఆకాశమునందు నానావిధములగు గంధర్వనగరములు (మేఘములు మొదలగువాని మిథ్యాదృశ్యములు) కనిపించునట్లు మాయ నానారూపములతో, నానావికారములతో గోచరించుచున్నది. ౪ బహురూపి (పగటివేషధారి) వైభవమెంత సత్యముగా గోచరించినను కడకది మిథ్యయే. అట్లే మాయయు మిథ్యమై యున్నది. ౫ దసరాదినమున జమ్మియాకులను ధరించుటను జనులు బంగారమనియందురు. కాని యవి జమ్మియాకులే. ఈ ఆచార మన్నితావులందును గలదు. మాయయు

నిట్టిదే. ౬ మృతపురుషునకు మహోత్సవము లొనర్చుటయు, సతి సహగమనము గావించిన స్త్రీకి కీర్తిని పెంపొందించుటయు, శ్మశానమున కరిగి యేడ్చుటయు మిథ్య. అట్లే మాయయు మిథ్య ౭ విభూతిని (భూతి=సంపద) లక్ష్మియందురు. మఱియొక లక్ష్మి గలదు. (స్త్రీలు గర్భరక్షణము నకై మంత్రితమగు దారమును నడుమునకు గట్టికొందురు. ఆదారము పేరు లక్ష్మి) మూఁడవది నామమాత్రపు లక్ష్మి. ఇదియెట్టిదో మాయయు నట్టిదే ౮ బాలవిధవయొక్క నామము జన్మసావిత్రియని యుంటయు ఇంటింటఁ దిరిపెమెత్తుకొని బ్రతుకువానికిఁ గుబేరుఁడను నామముంటయు నెట్టిదో మాయయు నట్టిదే ౯ నాటకమునందు ద్రౌపదిపాత్రమును ధరించినవానికి జీర్ణవస్త్రములపై నాశగలుగుటయు, ఏదేనినదినామము పయోష్ణియని యుంటయు నెట్టిదో మాయయు నట్టిదె. ౧౦ రామవేషధారి (కల్పితరాముఁడు) గ్రామవాసులకుఁ దనవేషముఁ జూపించుచుఁ బ్రేక్షకులను మహారాజా! అయ్యా! యని సంబోధించుచుఁ దనలఘుత్వమును బ్రకటించుట యెట్టిదియో మాయయు నట్టిదె ౧౧ పేరుమాత్రమన్నపూర్ణాదేవి. కాని యింటియందన్నము దొరుకదు. పేరు సరస్వతి. కాని విద్యయన్న నేదియో యెఱుంగక యెల్లప్పుడు పేడఁబ్రోగుచేయుచుండును. ౧౨ కుక్కకు వ్యాఘ్రమని పేరిడిరి. పుత్రునకింద్రుఁడని పేరుపెట్టిరి. కురూపుని సుందరా యనిపిలుచుచుండిరి. ౧౩ మూర్ఖునకు సకలకళావిశారదుండని పేరిడిరి. గాడిదకుఁ గోకిలయని పేరిడిరి. లొట్టకన్నులుగలవానికి నయనసుందరుఁడని పేరిడిరి ౧౪ పరమలోభికిఁ దులసీదేవి (విష్ణుప్రియ) యని పేరిడిరి. చండాలినికిఁ గాశియని పేరిడిరి. ఆదిశూద్రిణికి భాగీరథి యని పేరుబెట్టిరి ౧౫ ఇదియంతయు నెట్టిదియో మాయయు నట్టిది. అంధకారచ్ఛాయ యెట్టిదియో మాయయు నట్టిది. ౧౬ చెవి, వ్రేళ్లు, సంధులు, కరతలము మున్నగు శరీరములోనియే భాగములైనను రవికిరణములు సోకినంతన రమ్యమగు నరుణవర్ణముతో మెఱయుచు నగ్నిహోత్రమువలెఁ గాన్పించుట యెట్టిదో మాయయు నట్టిది ౧౭ కాషాయవర్ణముతోనున్న వస్త్రమును జూచినచో అగ్నియంటియున్నటులఁ గాన్పించును. విచారించిచూచినచో నిశ్చయమెద్దియో విశదమగును. మాయయు నట్టిదె. ౧౮ నీటియందుఁ జేతులు, కాళ్లు, వ్రేళ్లు, మిగులఁ

చిన్నవిగను బెద్దవిగను వంకరగను గానిపించును. మాయయును నిట్టిదే. ౧౯ గుండ్రముగా కవాయితిరిగినప్పుడు పృథ్వియంతయుఁ జీకటిగా నున్నట్లును, తిరుగుచున్నట్లును దోఁచును. కామెలలగుటవలన సమస్త వస్తువులును బచ్చగాఁ గనుపించును. సన్నిపాతరోగికి సర్వవస్తువులును క్రిందుమీఁదగుచున్నట్లు గోచరించును. మాయగూడ నిట్టిదియే ౨౦ వికారకారణమునఁ గొన్నికొన్నిపదార్థములు సాధారణముగ భాసమాత్రములై కాన్పించును. ఒకటి మఱియొకటిగ గోచరించును. మాయగూడ నిట్టిదేసుమా ౨౧.

పదునేనవదశకము.

మొదటిసమాసము.

చతురుని ప్రవర్తనము.

అస్థిమాంసమయమగు నీశరీరమునందు జీవాత్మ వసించుచున్నది. మఱియు నది నానావిధవికారము లొందుచున్నది ౧ పొల్లెద్దియో, పొట్టయేదియో, ఏదివలయునో, ఏదివలదో జీవుఁడు విచారించి తెలిసికొనుచున్నాఁడు ౨ ఒకనికి యాచించినచో నిత్తురు. ఒకఁడడుగనిదే యొసంగుదురు. ప్రతీతివలన స్పష్టసులక్షణములను గుర్తెఱుంగవలెను. ౩ తనజీవుని నన్యజీవుల జీవులయందుఁ జేర్పవలెను. ఆత్మను అనాత్మయందుఁ గలుపవలెను. ఇతరుల యంతఃకరణములలోఁ బ్రవేశించి వారల యంతర్భావముల నెఱుంగవలెను ౪ జన్నిదము వదులుగనున్నచో జాఱిపోవును. బిగుదుగనున్నచోఁ జక్కగ నిమిడియుండును. అట్లే మనస్సుగూడ వదులుగనున్నచో జారిపోవును. వివేకమున్నచో యథావిధిగ నుండును. ఇట్టి మనస్సును ఇతరుల మనస్సులలోఁ గలుపవలెను ౫, ౬ సందేహము వలన సందేహమే వృద్ధియగును. సంకోచమువలనఁ గార్యనాశనమగును. కావున మొట్టమొదటనే ఎఱుకగలిగి యుండవలెను ౭ ఇతరుల యంతఃకరణములను గ్రహింపనేరక ఇతరులహృదయములలోని భావములను

దెలిసికొనఁజాలక నానావిధములుగనున్న జనులు వశులుకావలయునన్న నెటులగుదురు? ౮ బుద్ధిసహాయముగ లేనిజనులు తాత్కాలికముగ నితరులను వశీకరణము గావించుకొందురు. వారలవలనఁ బ్రయోజనము లేదని తెలిసికొన్నంతన జనులు వారల నుపేక్షింతురు ౯ సంపూర్ణవిశ్వమునందు జగదీశ్వరుఁడు వ్యాప్తుఁడై యున్నాఁడు. ఇఁక బుద్ధిహీనులవలని యుపయోగ మెవరికిఁగలదు? వివేకముతో విచారించువాఁడే శ్రేష్ఠుఁడు ౧౦ శ్రేష్ఠుఁడగుపురుషుఁ డెప్పుడును శ్రేష్ఠమగుకార్యము జేయును. కృత్రిమకార్యము లొనరించువాఁడు నీచుఁడు. మనుజులు కర్మానుసారముగ మంచివారలు, చెడ్డవారలు నగుచున్నారు ౧౧ రాజులు రాజమార్గమునను, చోరులుచోరమార్గమునను నడుతురు. మూర్ఖతవలనను, అల్పస్వార్థమువలనను బిచ్చివాండ్రు మోసగింపఁబడుదురు ౧౨ నేను గొప్పజాణతనముగలవాఁడనని మూర్ఖుఁ డనుకొనును. అట్లనుకొనువాఁడు వాస్తవమునకుఁ బిచ్చివాఁడును దీనుఁడునని గ్రహింపనగును. నానావిధములగు చాతుర్యచిహ్నములను జతురుఁడె యెఱుంగును. ౧౩ జగత్తుయొక్క అంతఃకరణమునందుఁ గలసిపోవు పురుషుఁడు జగదంతఃకరణుఁడే యగును. వానికి లోకమునందుఁగాని పరలోకమునందుఁగాని యేవిషమునందేని కొఱంతయుండదు ౧౪ బుద్ధి భగవంతుఁ డనుగ్రహించినది. బుద్ధిలేనిమనుజుఁడు పచ్చికాయవంటివాఁడు. బుద్ధివిహీనుఁడగు పురుషుఁడు అమూల్యమగురాజ్యమునువిడిచి బిచ్చమెత్తుకొనును ౧౫ ఎవ్వఁ డెక్కడ నుత్పన్నమయ్యెనో వానికాతావు రుచించును. అభిమానకారణమున జనులు ప్రతిష్ఠలయందును మోసగింపఁబడుదురు. ౧౬ జగత్తులోనిమానవులందఱు మేము పెద్దలము మేము పెద్దల మందురు. అందఱును మేము సుందరాకారులమందురు. అందఱును మేముచతురులమని చెప్పుకొందురు. ౧౭ ఈదృష్టితోఁ జూచినచోఁ గొద్దివాఁడే లేఁడు. జ్ఞాత సర్వమెఱుంగును. ౧౮ తమతమ యభిమానములతో జను లనుమానించి వర్తించుచున్నారు. ఈయంశమును వివేకముతో విచారింపవలెను. ౧౯ మిథ్యనభిమానించుటయు సత్యమును బూర్తిగా విడిచివేయుటయు మూర్ఖత్వలక్షణములు ౨౦ సత్యమునం దభిమానముగలవాఁడే నిరభిమాని. న్యాయాన్యాయము లెప్పుడును సమముగావు. ౨౧ శాశ్వతమును న్యాయమునియు, అశాశ్వత

మును అన్యాయమనియు నందురు. మూర్ఖులు సజ్జనులు నెట్లు సమాన
ముగుదురు. ౨౨ ప్రజలలోఁ గొందఱు నిశ్చింతులై సుఖభోగు లగుచు
న్నారు. కొందఱు చోరులై పాఱిపోవుచున్నారు. కొందఱియందు సాధు
త్వము ప్రశంసనీయముగా నుండును. కొందఱివర్తనము నిందనీయముగా
నుండును. ౨౩ ఆచారవిచార శూన్యముగా నొనర్చుపనియంతయు నిష్ఫ
లము. చతురులు విచక్షణులు నగు వారలె యీవిషయమును విచా
రింపసమర్థులు. ౨౪ చతురపురుషుఁడు సర్వసాధారణులగు మానవులను
దనస్వాధీనములో నుంచుకొనఁగల్గును. చతురులయెదుట సర్వసాధారణుల
యత్న మేదియు నడువదు ౨౫ కావున ముఖ్యులతో మైత్రిగావింపవ
లెను. ఇట్లొనరించినచో నసంఖ్యాకులుగా జనులు వచ్చి కలసి కొనుచుం
దురు. ౨౬ చతురునకుఁ జతురుఁడే రుచించును. చతురుఁడు చతురుల
తోడనే కలసికొనును వెఱ్ఱివాండ్రెవరితోఁ బనిలేక తిరుగుచుందురు. ౨౭
ఎదుటివాఁడు చతురుఁడని గ్రహించినంతన చతురుని మానసము ఆచతు
రునిమానసముతోఁ గలసిపోవును. కాని యీవ్యాపారమంతయు గుప్తరూ
పముగా జరుపవలెను. ౨౮ సామర్థ్యశాలియగు పురుషునిహృదయ
మునకు సంతుష్టియగునట్లు వర్తించినను లేక వానియిష్టానుసారముగా
సంచరించినను బెక్కుమందిజనులు తనతోఁ గలియుదురు. సర్వసాధారణు
లగు జనులు, సజ్జనులుమున్నగువారెల్ల వినతులొనర్తురు. ౨౯ పరిచ
యముతోఁ బరిచయమును వెల్లడింపవలెను. బుద్ధితో బుద్ధిని వికసింపఁ
జేయవలెను. నీతిన్యాయములతోఁ బాషండమార్గముల నాటంకపఱుప
వలెను. ౩౦ పైకివెఱ్ఱివానివలె వేషముధరించి యుండవలెను. అంతియ
గాదు. హృదయమునందు నానావిధకళ లుండవలెను. ఎవ్వరిహృదయము
నేని త్రెంపివేయఁగూడదు. ౩౧ నిస్పృహుఁడై నిత్యమును నూతనస్థల
ములలో, దిరుగువాఁడును, ప్రత్యయాత్మకమగు బ్రహ్మజ్ఞానము గలవాఁ
డును, ప్రసిద్ధజ్ఞాతయు, నగుసజ్జనుఁడు లోకమునందు దుర్లభుఁడు. ౩౨
బహువిధములగు సుభాషితములవలన జనులందఱిహృదయమును ప్రస
న్నము లగును. కాన నలుదిక్కులను భ్రమణ మొనరించి ప్రజలందఱును
దనవైపునకుఁ జేరునట్లాకర్షింపవలెను. ౩౩ ఒక్కస్థలముననే కూర్చుండి
యున్నచోఁ బనిజరుగదు. కావున సావధానముగా నందఱితోఁ గలియుచుం

డవలెను. ౩౪ లోకులతోఁ బలుమాఱు గలిసికొని వారలను సంతుష్టిపఱ
చుటయు, సంచరించుచుఁ గలియుటకు ఉత్సుకుఁడైయుంటయుఁ జాతుర్య
లక్షణములు. ఉత్తమగుణములవలన మనుజులందఱును సమాధానము
నొందుదురు ౩౫

రెండవసమాసము.

నిస్పృహునిపని.

ఈపృథ్వీమండలమునందుఁ జిన్నవియుఁ బెద్దవియునగు మాన
వదేహము లెన్నియో నిండియున్నవి. అవి ప్రతిక్షణమునందును దమ
మనోవికారమును మార్చుకొనుచుండును. ౧ ఎన్నిమూర్తులుగలవో
అన్నిస్వభావములు గలవు. అవియెప్పుడును నొక్కవిధముగ నుండవు.
నియమమే లేదు. ఎంతదనుక నింక నేమిచూతము ౨ ఎందఱో మ్లేచ్ఛు
లైరి. ఎందఱో ఫరంగులలోఁ గలసిరి. మఱియు నెందఱో దేశభాషల
కారణమున నభ్యంతరముగలిగి పడియున్నారు * ౩ ఈవిధముగ మహా
రాష్ట్రులు మిగుల స్వల్పసంఖ్యాకులుగా నున్నారు. వీరలుగూడ రాజకీయ
విషయములందుఁ దగుల్కొనియున్నారు. పాపము వారికిఁ దిండితినుట
కైన నవకాశములేదు. అనేకకార్యభారములు వెన్నంటియున్నవి ౪
ఎందఱో యుద్ధప్రసంగములలోఁ దగుల్కొని యుంటవలన నున్మత్తులై
రాత్రింబవళ్లు యుద్ధచర్చలనే యొనరించుచున్నారు. ౫ ఉద్యమపురుషులు
తమతమవ్యాపారముల యందే చిక్కుకొనియున్నారు వారికిఁగూడ
విశ్రాంతిలేదు. వారలు నిరంతరము తమయుదరములను బోషించుకొ
నుట మున్నగుచిక్కులలోఁ దగుల్కొనియున్నారు ౬ షడ్దర్శనములు
నానామతములు చాల వఱకు వృద్ధినొందినవి. ఎక్కడ
జూచిన నక్కడ జను లివిషయమునే యుపదేశించుచుఁ దిరుగుచున్నారు
౭ ఇందుమీఁదఁగూడ మిగిలినజనుల నందఱిని స్మార్తులు, వైష్ణవులు
తమతమమతములలోఁ గలుపుకొనుచున్నారు. ఈవిధముగా దేశమునందుఁ
బెద్దకోలాహలము వ్యాపించినది ౮ ఎందఱో కామ్యభక్తు లన్నితావులం

---

* దేశమునంతటికిని ఒక్కభాషలేకపోవుటచేఁ బరస్పర మొకరిభావ మొకరు గ్రహింపఁజాలకున్నారని భావము.

దును నాసక్తులై తిరుగుచున్నారు. యుక్తాయుక్తవిచారము గావించు
వాఁడే కనుపట్టఁడు ౯ ఈకోలాహలములో నింక నెవరేని రెండవకోలా
హలమును సాగించినచో దానినిజూచి వైదికజనులు సహింపఁజాలకు
న్నారు. అది వారలకన్నులలో ముల్లువలె గ్రుచ్చుకొనుచున్నది ౧౦
హరికీర్తనమునం దెందఱిహృదయములో లగ్నములై యున్నవి. ప్రత్య
యాత్మికమగు బ్రహ్మజ్ఞానము నెవ్వఁడును జూడకున్నాఁడు. ౧౧
జ్ఞానము మిగుల దుర్లభము. ఈయలభ్యలాభము పుణ్యమువలన
లభించును. కాని విచారశీలురగు పురుషుల కంతయు సులభముగనున్నది
౧౨ తెలిసినవాఁడు విచారమును దెలుపఁబూనినచో నది నెరవేరదు.
ఎన్నియో విఘ్నములు కలుగును. ఉపాయములొనర్చినను అనేకవిఘ్నము
లుపస్థితమగును ౧౩ తీక్ష్ణముగాఁ గార్యములనొనర్చు ప్రయత్నశీలుఁ
డొకక్షణమాత్రమేని వ్యర్థముగా గడుపఁజాలఁడు. చతురుఁడు, తార్కి
కుఁడు, విచక్షణుఁడు నగునిట్టి పురుషుఁడు సర్వజనమాన్యుఁ డగును ౧౪
వానికి నానావిధములగు నీతులు, లోకోక్తులు జిహ్వాగ్రమునం దుండును.
సమయోచితముగ వానిని లోకులముందు నుడువును. తనసామర్థ్యబలముచే
నీతిమార్గమును స్వచ్ఛముగఁ బ్రశస్తముగ నొనర్చును ౧౫ ప్రయత్న
శీలుఁడు ప్రబోధశక్తికి వలయు ననంతమార్గముల నెఱింగియుండును.
అందఱి యంతఃకరణములలోని విషయముల నెఱింగియుండును.
అందుచే నాతనినిరూపణముల నెల్లరు నాసక్తితో నాలింతురు ౧౬ అనుభవ
యుక్తములగు మాటలవలన సమస్తమతాంతరములును బటాపంచ
లగును. ప్రయత్నశీలుఁడు లోకరీతిని లక్ష్యపెట్టక లోకులహృదయము
లను దనవైపునకు నాకర్షించుకొనును ౧౭ ఆతఁడు ప్రసంగానుసారముగ
నీతిపూర్ణములు, ప్రభావయుతములు నగుమాటల నుడువును. ఉదాసీన
వృత్తియందలి యభిమానముతో లేచిపోవును. ౧౮ అనుభవవాక్యముల
వివరించి యెచటికేని యరుగును. ఈ కారణమున నచటిజనుల కాతని
గలసికొనవలయునను కోర్కె తీవ్రముగ నుదయించును. ప్రజలు నానా
మార్గములను వదలి యామహాత్ముని శరణములోనికే యరుగుదురు
౧౯ ఆతఁ డెచ్చటను దొరుకఁడు. ఏస్థలమునందైనఁ గనిపింపఁడు.
వేషము గాంచినచో హీనునివలె, దీనునివలె నుండును ౨౦ భిక్షుకునివలె

వేషభాషల దిద్దుకొని ప్రయత్నశీలుఁడు గుప్తరూపముతో నెన్నియో
పనులఁ జేయును. అందుచే నాపురుషుని యశఃకీర్తిప్రతాపములు మేర
లేకుండ వృద్ధినొందును ౨౧ ఆతఁ డన్నితావులయందును భజనల వృద్ధి
నొందించును. తాను స్వయముగ నచ్చటనుండక వెడలిపోవును. మత్సర
యుక్తములగు మతకల్లోలముల నడంచివేయును ౨౨ దుర్గమస్థలముల
(పర్వతకందరముల) కుఁ బోయి నివసించును. అచట నాతని నెవ్వరుఁ
జూడరు. ఆతఁ డచ్చటనేయుండి సర్వజనులనుగూర్చి చింతించును (అచట
నుండియే జనోద్ధరణమునకై వలయు ప్రయత్నములు గావించును) ౨౩
జనులువచ్చుట కవకాశములేని కఠినములు, నగమ్యములునగు స్థలముల
యం దాతఁడు సావధానిగ నుండును. జగత్తులోని జనులందఱు నాతఁ
డెందుండెనో యని వెదుకుకొనుచు వచ్చుచుందురు ౨౪ ఆత్యాగశీలుని
ముం దెవరిమాటయుఁ జెల్లదు. ఆతనిముం దెవనికిని అణుమాత్రమేని
యనుమానమున కవకాశముండదు. ఆతఁడు సంఘశక్తి నభివృద్ధినొందించి
జనులను రాజకీయవిషయములయందు లగ్నపఱచును ౨౫ ఆమనుష్యులు
(నిస్పృహునివలన నుపదేశమొందినవారు) ఇతరులను దమసముదాయ
ములోఁ గలుపుకొందురు. ఈ విధముగ జనసముదాయ మసంఖ్యాకముగ
వృద్ధినొందును. గుప్తరూపముగ సమస్తభూమండలమునందును నిస్పృ
హునిశక్తి వ్యాపించును ౨౬ ప్రతిస్థలమునందును నాతని సంఘము
లెన్నియో నిర్మాణమగును, మనుష్యులందఱు నాతనిచే నాకర్షింపఁబడు
దురు. ఈవిధముగ నలుదెసలను బరమార్థబుద్ధికిఁ జక్కని ప్రచారము
కలుగును ౨౭ నిస్పృహుఁ డన్నిస్థలములందును (భక్తసముదాయమును
సమావేశపఱచి) ఉపాసనము నభివృద్ధినొందించును. తన యనుభవసహా
యమునఁ బ్రాణిమాత్రుల నందఱ నుద్ధరించును ౨౮ ఈవిధముగా
నిస్పృహుఁడగు ప్రయత్నశీలుఁడు పెక్కుయుక్తుల నెఱుంగును. ఆతని
వలన నితరులు చతురులగుదురు. అన్నితావులందును బ్రాణిమాత్రుల
కనుభవము ప్రాప్తించును ౨౯ ఇట్లు తనకీర్తిని బ్రపంచమునందు
వ్యాపింపఁజేసి పోయినవానిదే సార్థకజన్మము. ఈవిధముగ దాసు నుడువు
చున్నాఁడు. ఈవిషయము స్వాభావికముగానే సంక్షేపముగాఁ జెప్పఁబడి
నది ౩౦.

మూడవసమాసము.

జ్ఞానియొక్క గొప్పతనము

మూలమాయ మొదలుకొని యనర్గళరూపముగ వ్యాపించియున్న సృష్టియంతయును బంచభూతాత్మకము. దానియందలి సాక్షిత్వతత్త్వము గూడఁ దత్త్వరూపమే (పంచభూతాత్మకమే) ౧ ఉన్నతమగు సింహాసనముపై రాజు కూర్చుండియున్నాఁడు. రాజున కిరుదెసల సన్నిధానవర్తులగు కార్యదర్శులు, సైనికోద్యోగులు ఆజ్ఞకు వేచి సిద్ధముగానున్నారు. ఇందలి సారమెద్దియో మీహృదయములందుఁ దెలిసికొనుఁడు * ౨ దేహమాత్రులందఱును అస్థిమాంసములతో నిండియున్నారు. అట్లే రాజుదేహము గూడ అస్థిమాంసమయమే! అనఁగా మూలమాయ మొదలుకొని యీసృష్టి యంతయుఁ బంచభూతాత్మకమే + ౩ రాజుయొక్క సత్తచే నంతయు నడచుచున్నది. కాని యున్నదెల్లఁ బంచభూతములే. మూలమాయయందు జ్ఞాతృత్వశక్తి విస్తారముగానున్నది. అంతరమింతియసుమా ౪ వివేకమువలన వ్యాపకత్వ మతిశయించును. కావుననే అవతారములను సన్మానించుచున్నారు. చక్రవర్తులు, మనువులు మున్నగువారలు వివేకకారణముననే అవతారపురుషులని పేరొందిరి ౫ జ్ఞాతృత్వశక్తి యెవరియందెంత యతిశయముగానుండునో వారియందంత యతిశయముగ సదైవత్వముండును. జ్ఞాతృత్వశక్తి స్వల్పముగ నుండుటవలననే జనులు నిర్దైవతములుగ, దరిద్రులుగ మారిపోవుచున్నారు ౬ నిత్యమును బ్రయత్నదీక్షాతత్పరులై వర్తించుచుఁ దన్నులు, జీవాట్లు సహించువారలు మనము చూచుచుండఁగనే భాగ్యవంతులగుదురు. ౭ ఈకాలమున నీవిధము తప్పనిసరిగ జరుగుచున్నది. కానిమూర్ఖుల కిది తెలియదు. (ఇది యెంతయు విచారకరమగు నంశము) వివేకవంతులు సమస్తము గ్రహింపఁగల్గుదురు ౮ చిన్న పెద్ద యనునంతరములు ఏర్పడుటకు బుద్ధియే కారణమనునంశము

---

* మధ్యరాజు, రెండు ప్రక్కల సన్నిధివర్తులు కూర్చుండిరనుటకు భావము మధ్య జ్ఞాతృత్వశక్తి (సాక్షి) ఇరుదెసల జగద్రూపమగు సైనికవిస్తారము వ్యాపించియున్నదనుట.

+ దేహధారులయొక్కయు రాజుయొక్కయు దేహములు అస్థిమాంసమయములనుటకు భావము సమస్తజగత్తు, సాక్షితత్త్వరూపము అనుట.

జనులకు బొత్తిగఁ దెలియకున్నది. (జనులజ్ఞానకారణమున) ముందుపుట్టినవానినే పెద్దయనుచున్నారు. ౯ రాజు వయస్సునఁ జిన్నయైనను వృద్ధులాతనికి నమస్కరింతురు. దీనికిఁ గారణమేమి? వివేకస్థితి మిగులఁ జిత్రమైనది. ఇది జను లెఱుంగవలెను ౧౦ సాధారణజను లజ్ఞానమున దఱుచుగ అనుమానరూపముగ నుండును. అదిలోకరూఢి లక్షణము ౧౧ ఎవ్వరి నాపఁగలము? సాధారణజనుల కేమి తెలియును? ఎవ్వరి కెంతదనుకఁ జెప్పఁగలము? ౧౨ హీనుఁడొకానొకప్పుడు భాగ్యవంతుఁడగుచో నప్పుడుకూడ జను లాతని దుచ్ఛుఁడని యందురు. కావున నీవక్రపథగాములగు మనుజులను దూరముగనే యుంచవలెను ౧౩ అవివేకులు చక్కఁగ నేవిషయము నేని తెలిసికొనఁజాలరు. ఉచితరీతితో రాజసైనికముల నెఱుంగరు. మూర్ఖత్వకారణము నవ్యర్థముగ గొప్పదనము ప్రదర్శించుచుందురు ౧౪ నిశ్చయాత్మకమగు జ్ఞానమావంతయు లేక యెవ్వరిచే గౌరవింపఁబడక యుండు వయోవృద్ధులను పెద్దలని యెవరందురు? ౧౫ పెద్దలలోఁ బెద్దతనము లేదనియుఁ జిన్నలలోఁ జిన్నతనము లేదనియుఁ జెప్పువారలు చతురులుగారు. వారల మూర్ఖులనిగూడ ననువచ్చును. * ౧౬ గుణములేని పెద్దతనము వ్యర్థము. పెద్దతనమువలన గణించిన అనుభవమే యోగ్యమైనది. (దానికే గౌరవముకలదు.) ౧౭ ఒకవేళ పెద్దలను మాన్యతగావింపవే యున్నచోఁ బెద్దలు తమపెద్దరికమునుగూడ గుర్తెఱుంగవలెను. ఇట్లు చేయకున్నచో ముందుముందుఁ బెద్దరికపుటభిమానమువలనఁ గష్టములను భరింపవలసివచ్చును ౧౮ అన్నింటికంటెను గొప్పదగు నంతరాత్మ యేపురుషుని హృదయమునందుఁ బ్రకాశించుచున్నదో యాతనిదే మహిమయని వేఱుగఁ జెప్పవలసినపనిలేదు. ౧౯ కావున నెల్లరును వివేకముతోఁ జతురత్వము నలవఱచికొనవలెను. వివేకము నభ్యసింపనిచోఁ బ్రతిష్ఠ యుండదు ౨౦ ప్రతిష్ఠయె లేకపోయినచో సమస్తము తొలంగెనని భావింపనగును. ఇఁక

---

* వయస్సునఁ జిన్నయగు జ్ఞానవంతుఁడగు బాలుఁడు వయోవృద్ధునికన్న నేదేని జ్ఞానవిషయము వివరించుచో "కలియుగమే తెంచినది. పెద్దలయఁ బెద్దతనము, జిన్నలయఁ జిన్నతనము లేకుండఁబోయినది. చిన్ననోటికి పెద్దమాటలు వచ్చుచున్నవే" యనిపలుకుదురు. ఇట్లనుకొను వృద్ధులు మూర్ఖులని శ్రీరామదాసస్వామి చెప్పుచున్నాఁడు.

జన్మమెత్తి యాతఁడేమిగావించినాఁడు? మీఁదుమిక్కిలి యెఱిఁగియెఱింగి తననెత్తిపైఁ దానే యవమానమును బెట్టుకొనెను ౨౧ ఇట్టిపురుషుని స్త్రీలుసహితము దూషింతురు. చూడుఁడు. ఎట్లు చిక్కులపాలయ్యెనో యని లోకులు సైతమందురు. ఈవిధముగా నాతని మూర్ఖత్వము వెల్లడియగును ౨౨ ఇట్లు ఎవ్వరును గావింపతగదు. అందఱును దమజీవితమును సార్థకపఱుపవలెను (ఒకవేళ సార్థకపఱుచునుపాయము) తెలియకపోయినచో గ్రంథములను జదివి మననమొనర్పవలెను. (గ్రంథపఠనమువలన జీవితసార్థకమగునుపాయము లభించును) ౨౩ చతురపురుషుని జనులందఱు గౌరవింతురు. మూర్ఖునినందఱు నిందింతురు. సంపదలను బడయ మనస్సునఁ గోరికయున్నచోఁ జతురుఁడు కావలయును ౨౪ చతురత్వము నలవఱచికొనుట కెంతటికష్టములుభరింపవలసివచ్చినను సహించి యవశ్యముగ నలవఱచికొనవలెను. కష్టములకోర్చి పలువురికి సేవగావించినయైనఁ జతురత్వమునేర్చుకొనవలెను. ౨౫ పలువురిచే గౌరవింపఁబడువాఁడే చతురుఁడు. చతురపురుషునకుఁ బ్రపంచమునందుఁ గొఱంతయే లేదు ౨౬ ప్రపంచమునం దాత్మహితముగావించుకొననిమనుజుని ఆత్మఘాతియననగును. ఆమూర్ఖునితో సమానుఁడగు పాపి యెవడునుండఁడు ౨౭ చతురపురుషుఁ డెన్నఁడును, బ్రపంచమునఁ దాను శ్రమపొందఁదగినవియు నితరులకుఁ గ్రోధముగలుగఁజేసి వారియాగ్రహమును సహించునదియు నగుపనులెన్నఁడును నొనర్పఁడు ౨౮ సహజస్వభావముతో నిదిసాధకుల కెఱింగించితిని. చక్కఁగ రుచించినచో గ్రహింపుఁడు. రుచింపకున్నచో విసర్జింపుఁడు ౨౯ శ్రోతలారా! మీరలు పరమదక్షులు మీర లలక్ష్యమగు వస్తువుయెడల లక్ష్యముంచుచున్నారు. ఇది ప్రత్యక్షమగు సామాన్యవిషయము. మీర లెఱింగియేయుంటిరిగదా ౩౦.

నాలుగవ సమాసము
బ్రహ్మనిరూపణము.

పృథ్వినుండి వృక్షములు జనించుచున్నవి. వృక్షములవలనఁ గట్టెలు జనించుచున్నవి. ఆకట్టెలుభస్మమై మఱలఁ బృథ్వియగుచున్నవి ౧ పృథ్వినుండి తీగలు జనించుచున్నవి. అవి నానావిధముల నల్లుకొనుచున్నవి.

అంత్యమునం దవి క్రుళ్లి చివికి మఱలఁ బృథ్వి యగుచున్నవి. ౨ నానావిధధాన్యములతో వంటకములొనరించి మనుజులు భుజించుచున్నారు. మఱలనవి నానావిధములుగ మలరూపమునను, వాంతిరూపముగను మాఱి పృథ్వియే యగుచున్నవి ౩ ఇతరపదార్థములను భుజించు పశుపక్ష్యాదులు సైతమిట్లె యగుచున్నవి. వానిమలముగూడ నెండి పృథ్వియందుఁ గలసిపోవుచున్నది. ౪ మనుజుఁడు మొదలగు ప్రాణిసమూహమంతయు గూడఁ జనిపోయినపిమ్మట పృథ్వియే యగును. ౫ అనేకవిధములగు తృణాదిపదార్థములు సైతము కుళ్లి మట్టియగుచున్నవి. అనేకకీటకములు సైతము మరణించి పృథ్వియందుఁ గలసిపోవుచున్నవి, ౬ పదార్థములసంఖ్యాకములుగ నున్నవి. వానివిస్తారము నెంతదనుక వివరింపఁగలను? వానికన్నింటికిని ఈపృథ్వి విడిచినచో నింకఁ దావెక్కడఁగలదు? ౭ చెట్లు ఆకులు, తృణములు మున్నగునవి పశువులు దిన్నపిదప పేడగా మాఱును. పేడ, మూత్రము, భస్మము సైతము మఱలఁ బృథ్వివిగా మాఱుచున్నవి. ౮ ఉత్పత్తిస్థితి సంహార చక్రపరిభ్రమణములోనికి వచ్చినవన్నియుఁ బృథ్వియందుఁ గలియును. జనించునవియు, మరణించునవియు మఱలఁ బృథ్వియే యగును. ౯ నానావిధధాన్యములు రాసులుగఁ బెరిగి పెరిగి ఆకాశమున కంటిపోవును. కాని యంతమునం దవియన్నియును బృథివిలోఁ గలియును. ౧౦ జనులు నానావిధధాతువులను బ్రాతిపెట్టుదురు. చాలకాలముజరిగినమీఁద నవిమట్టియైపోవును. బంగారమునకును ఱాళ్లకును తుద కీగతియే పట్టును. ౧౧ మట్టియే సువర్ణముగను, ఱాళ్లుగను మాఱును. కాని పృథ్వీగర్భమునందలి తీక్ష్ణాగ్నిచే నవి భస్మరూపము నొంది మఱలఁ బృథ్వియే యగును. ౧౨ బంగారముతో జరీచేయుదురు. అది యంత్యమునఁ జిఱిఁగి రసరూపమున నంతట వ్యాపించును. అది మఱలఁ బృథ్వియే యగును. ౧౩ పృథ్వివలన ధాతువులు జనించి యగ్నిచే గఱఁగి రసమగుచున్నవి. తరువాత నారసము కఠినరూపమై పృథివి యగుచున్నది. ౧౪ నానావిధజలములనుండి గంధము వెలువ[illegible] పృథ్వి[illegible] మొందును. దినదినక్రమమున జలమెండిపోవును. పి[illegible] పృథివిగనే శేషించును. ౧౫ పత్రపుష్పఫలాదు లుద[illegible]చున్నవి. వాని

ననేక జీవులు మెసవుచున్నవి. ఆజీవులు మరణించినపిమ్మట పృథ్విగ మాఱుచున్నవి. ౧౬ ఆకారసహితముగ నుండుదానికెల్ల పృథ్వియే యాధారమైయున్నది. ప్రాణిమాత్రు లుదయించుచున్నారు. మరణించుచున్నారు. అంతయు నంత్యమునఁ బృథివియే యగుచున్నది. ౧౭ ఎంతదనుక నీయంశము దెలుపఁగలను? వివేకమువలన నిల్లి సమస్తము నెఱుంగవలెను. మఱియు నుత్పత్తిసంహారములమూలముగూడ నెఱుంగవలెను. ౧౮ జలమెంచి పృథ్వియగును. మఱల నాపృథ్వి జలమునందె లయమగును. ఏలయన ? అగ్నిసంయోగముచే భస్మమగును. ౧౯ జలము తేజమువలనఁ గలుగును. మఱలఁ దేజమే జలము నెండించును. ఆతేజము వాయువుచే జనించును. తేజము మఱల వాయువే లయమొందించును. ౨౦ వాయువు గగనమందు జనించి గగనమందే లయమొందును. ఈ విధముగా నుత్పత్తి, లయములను బాగుగా విచారింపవలెను. ౨౧ ఏది యెక్కడజనించునో యదియచ్చటనే నశించును. ఈవిధముగఁ బంచభూతములు నాశనమగును. ౨౨ ఎయ్యది నిర్మాణమగుచున్నదో అదియే భూతము. అదియే పిమ్మట నాశనమొందుచున్నది. అటుపిమ్మట నాశాశ్వతపరబ్రహ్మమే శేషించియుండును. ౨౩ ఆపరబ్రహ్మమును దెలిసికొననంతవఱకు జన్మమృత్యువులు నశింపవు. జన్మమృత్యువులు నశింపకున్నచో నాలుగువిధములగు (అండజజరాయుజాది) రూపములతో నానావిధజీవములుగ జన్మింపవలసియున్నది. ౨౪ జడమునకు మూలము చంచలము. చంచలమునకు మూలము నిశ్చలము. కాని నిశ్చలమునకు మూలమే లేదు. ఈవిషయమును జక్కఁగా నెఱుంగుఁడు. ౨౫ జనించుదానిని బూర్వపక్షమనియు, నశించుదానిని సిద్ధాంతమనియు నందురు. (ఈరెండుపక్షములకును భిన్నముగ) పక్షాతీతముగా నిలిచియున్నదే పరబ్రహ్మము ౨౬ అనుభవముతో నీయంశము నెఱుంగవలెను. విచారముతో గ్రహింపవలెను. విచారింపకయే వ్యర్థపరిశ్రమ యొనరించుట మూర్ఖత్వము. ౨౭ లజ్జాసంకోచములచే నావరింపఁబడిన జ్ఞానికిఁ బరబ్రహ్మము లభింపఁజాలదు. వాఁడు వ్యర్థముగ మాయయందుఁబడి యార్భాటించుచుండును ౨౮ మాయ పూర్తిగ నశించినపిమ్మట నెట్టి స్థితినిలిచియుండునో యాస్థితిని విచక్షణులగుపురుషులు స్వయముగా

యోజింపవలెను. ౨౯ మాయ పూర్తిగ నిరసనమైనపిదప ఆత్మనివేదనమగును. ఆస్థితియందు వాచ్యాంశముండదు. ఆవిజ్ఞానము నేవిధముగా నెఱుంగవలెను? ౩౦ జనులు చెప్పినదాని ననుసరించి నడుచుకొనువాఁడు సందేహములలో మునిఁగిపోవును. కావుననే అనుభవమును మాటిమాటికి సమకూర్పవలయును ౩౧.

ఐదవసమాసము

చంచలలక్షణము.

రెంటి (ప్రకృతిని,పురుషుని) ననుసరించి మూఁడు (త్రిగుణములు) నడుచుచున్నవి. నిర్గుణము (బ్రహ్మము) నందు అష్టధాప్రకృతి యుత్పన్నమయ్యెను. అది పైనను గ్రిందను విడిచి (అంతరిక్షమునందు) ఇంద్రధనుస్సువలె వర్తించుచున్నది. ౧ బిడ్డ (అగ్ని) తల్లిని (దేహమును) దినివేయుచున్నది. పుత్రుఁడు (ప్రత్యేకతత్త్వము) మిగులఁ జతురత్వముతోఁ దండ్రిని (తానుజనించిన తత్త్వమును) జంపివేయుచున్నాఁడు. నలుగురు జనులకును (నాలుగుతత్త్వములకును) రాజగునాతఁడు (ఆకాశము) మఱచియున్నాఁడు. (అదృశ్యముగజాడలేకున్నాఁడు)* ౨ దేవుఁడు (ఆత్మ) దేవాలయమునందు (శరీరములో) దాఁగికూర్చుండియున్నాఁడు. దేవాలయమును బూజించినచో (దేహమునకు భోగమొసంగినచో) నాతనికిఁ జెందును. (సంతోషముకలుగును) సృష్టిలోని దేహధారులందఱి కిదియే నియమము. ౩ ప్రకృతి, పురుషుఁడు అనురెండు పేరులను జనులు విశ్వసించియున్నారు. కాని వాస్తవమున కారెండును నొక్కటియే. ఈయంశము అనుభవముతోడను వివేకముతోడను జూచినయెడల విశదమగును ౪ అది స్త్రీయును గాదు. పురుషుఁడునుగాఁడు. వాస్తవమున కది మనుజులు గావించిన కల్పనము, చక్కఁగ విమర్శించిచూచినచో నేమియు లేదని తెలియును ౫ అందఱును నదిని స్త్రీయనియుఁ, గాలువను పురుషుఁడనియు నుడువుదురు. యోచించినచో నచట స్త్రీ పురుష దేహములలో నెవ్వియు లేవు. రెంటి

* పృథ్వి జలము నెండించును. జలము అగ్నిని జల్లార్చును. అగ్ని వాయువును బ్రళయకాలమునఁ జల్లార్చును. పిదప నగ్నియు స్వయముగ లయమగును. ఆకాశము అనఁగా అంతరాత్మగూడ నుండియు మఱచిపోవుచున్నది. లేక యది పరబ్రహ్మమునందు లీనమగుచున్నదనియైనఁ జెప్పవచ్చును.

యందును కేవల జలమే ప్రవహించుచున్నది ౬ తనది తనకెఱుంగఁబడదు. చూచినను ఆకలనముగాదు. ఎక్కువయైయున్నను నెవ్వరికేమియుదోరు కదు ౭ ఒక్కఁడయ్యును బెక్కులయ్యెను. పెక్కులుగనయ్యు నొక్కఁడె మిగిలెను. తనయార్భాటమును దానే సహింపఁడు ౮ ఆవిచిత్రచేత నశక్తియొక్కటయ్యును జెదరియున్నది. మఱియుఁ జెడటి యుండియు నొకటిగ నున్నది. అది ప్రాణిమాత్రులందఱియందును వ్యాప్తమైయున్నది * ౯ దీఁగయందు జలము మనకుఁ దెలియనట్లు సంచరించుచున్నది. ఏమిచేసినను దీఁగ తడిలేనిచోఁ బ్రదికియుండఁజాలదు ౧౦ వృక్షమునకుఁ ద్రాళ్లుగట్టి బిగించినను అవి తమయిష్టానుసారముగఁ బెరుగుచుండును. కొన్నివృక్షములన్నచో ఆకాశమున కెగిరిపోవుచున్నటు లుండును ౧౧ ఈ వృక్షములు భూమికంటె వేఱుగనున్నను అవి యెండి పోవు. ఎచ్చటనుండునో యచ్చటనే యవి చక్కఁగ వృద్ధినొందును ౧౨ అంతరాత్మతోడ్పాటుచే వృక్షములు వృద్ధినొందుచున్నవి. అంతరాత్మ లేకున్నచో నావృక్షములు జడములగు కట్టెలగును. ఇది ప్రత్యక్షముగఁ జూచుచున్నవిషయము. ఇందు గూఢముగురహస్యమించుకేనియులేదు. ౧౩ ఒకానొకప్పుడు వృక్షములనుండిగూడ వృక్షములు కలుగును. అవి గూడ నాకాశమునంటునట్లు పెరుగును. వానివేళ్లు పృథివియందు నుండవు. ౧౪ వృక్షములనుండి లభించు మేఁత, నీరువలననే శాఖావృక్షములు బ్రదుకుచున్నవి. వృక్షముల శబ్దసంఘర్షణమువలనఁ జెప్పెడివారలు విచారమొనర్తురు. ౧౫ కావలసినదంతయు మొదటనే యయ్యెను. ఆపిమ్మట కల్పనముజేసి చేసి జనులు తమయిష్టానుసారముఁ జెప్పుచుందురు. జ్ఞానులగు పురుషులు సమస్తము నెఱుంగుదురు ౧౬ తెలిసికొన్నచో వెదుకవలసిన పనియుండదు. వెదకవలసివచ్చినచోఁ దెలిసికొనుట యుండదు. అనుభవరహితమగు సంశయమెద్దియు ననుభవమునకురాదు ౧౭ తొలుదొలుత, అంతటికిని ఉత్పత్తికర్తయెవఁడో విచారింపవలెను. ఇదియంతయు నెఱింగినపిదప ఆ జగదంతరాత్మ నెఱుంగుటవలనఁ దనకుఁ

* పరబ్రహ్మము ఒక్కటయ్యు సర్వవ్యాపిగ నున్నది. మఱియు నది సర్వవ్యాపియయ్యు నొక్కటిగ నున్నది. మాయయొక్క యుపాధి దానిదే. ఇట్లయ్యు మాయ నదిసహింపదు.

దనది లభించును ౧౮ అంతర్నిష్ఠయొక్క ప్రశస్తి మిగులగొప్పది. బహిర్ముఖ (పైపైవిచారము గావించువారు లేక అంతరాత్మనుగూర్చి విచారింపనివారు) జనులసాంగత్యము వ్యర్థము. ఈవిషయమును జతురపురుషులే యెఱుంగుదురు. ఇతరులకేమి తెలియును. ౧౯ ఎల్లరిమనస్సులను సంతుష్టిగా నుంచుచో నెవరెవరికేమి సహాయముచేయుదురో తెలియదుగాని ఎల్లరి మనస్సులను సంతుష్టిగా నుంచకుండుటవలన మాత్రము తోటకూరకట్టతో సమానమగు క్షుద్రపదార్థముగూడ లభింపదు. ౨౦ ఇదిప్రత్యక్షముగా అనుభవసిద్ధము. పైనిజెప్పినటుల అలక్ష్యమునందు లక్ష్యము నను సంధింపవలెను. దక్షునితోఁ గలసికొనుటవలన దక్షునకు సమాధానము కలుగును. ౨౧ మనస్సుతో మనస్సుగలసినపిదప (అనన్యమైనపిదప) పరబ్రహ్మమును జూడఁగలుగుదురు. మఱియు మాయారూపమగు చంచలచక్రమును దాటిపోవుదురు. ౨౨ ఒకసారి చంచలచక్రమునుదాటి పరబ్రహ్మమును జ్ఞానచక్షువులతోఁజూచి వచ్చినచో నదిమొదలుకొని నిరంతరము సర్వస్థలములందు నదియే (పరబ్రహ్మమే) గోచరించును. (పరబ్రహ్మరహితమగు స్థలమెద్దియుఁ గాన్పింపదు) కాని మనుజులు దానిని జర్మచక్షువులతోఁ దక్కఁజూడఁజాలరు. ౨౩ ఈ చంచలము (మాయ) అన్నిశరీరములయందును నిరంతరముగఁ గదలికను గలిగించుచునే యుండును. కాని పరబ్రహ్మము (మాయవలెఁగాక) సర్వస్థలములందును నెల్లప్పుడును నిశ్చలముగ నున్నది. ౨౪ చంచలము యెప్పుడొకప్రక్కకుఁ బరుగెత్తునో యప్పుడు రెండవప్రక్క నేమియునుండదు. చంచలము అన్నిప్రక్కల వ్యాపించియుండుట యెప్పుడును బొసఁగదు. ౨౫ చంచలమువలనఁ జంచలముయొక్క పనియే నెరవేరదు. చంచలము వలన సమస్తచంచల విచారమే జరుగదు. ఇఁకనిశ్చలమును, అపారమునగు పరబ్రహ్మము చంచలమువలన నెట్లుఅనుమానములోనికి రాఁగలదు * ౨౬ ఆగ్నేయబాణము (అవ్వాయిచువ్వ) కాల్చి విసరినచో నాకాశమునకుఁబోవును. అంతియగాని యది యెన్నఁటికిని ఆకాశపుఁగొనను దాటి పోవఁజాలదు. మధ్యనే చల్లారిపోవుట దానికి స్వ

* మనస్సు చంచలముగ నుంచుకొన్నచో మాయావివరణము కాఁజాలదు. ఇఁక నిశ్చలము, అపారమునగు పరబ్రహ్మమెట్లు అనుమానమునకు వచ్చును?

భావగుణము ౨౭ మనోధర్మ మేకదేశీయముగనున్నప్పుడు వస్తువెట్లు అకలనమగును. ఇట్టియుపయశనుక్కలఁగు పురుషులు (ఏకదేశీయమగు మనోవృత్తిగలవారలు) నిర్గుణమునువిడిచి సర్వబ్రహ్మమని నుడువుదురు ౨౮ సారాసారములులేని తావునవంతయు నంధకారమే యెఱుంగనగును. తెలియనిబాలుఁడు సత్యమునువిడిచి మిథ్యనే గ్రహించును ౨౯ బ్రహ్మాండము యొక్క మహాకారణ (మూలమాయ) వలన నీపంచమహాభూత సముదాయ ముత్పన్నమయ్యెను. కాని యీమహావాక్య వివరణము వేఱుగ నున్నది ౩౦ మహత్తత్త్వమునే మహాభూతమందురు. దానినే భగవంతుఁడని యెఱుంగవగును. ఆభగవంతునికడ నుపాసనమంతమగును * ౩౧ కర్మోపాసనజ్ఞానములయొక్క త్రికాండజ్ఞానము వేదములయందుఁ జేర్కొనఁబడెను. కాని పరబ్రహ్మమునెడ జ్ఞానము విజ్ఞానమగును. (జ్ఞానము కూడ లయమగుననియే నుడువవచ్చును) ౩౨

ఆఱవ సమాసము.

విశిష్టచాతుర్యము.

శీతము (దీపము) వలనఁ గృష్ణము (కాటుక) ఉత్పత్తియయ్యెను. మఱియు నాకాటుకయే అక్షరరూపముతో సంపూర్ణభూమండలమునందు వ్యాపించియున్నది. ఆకాటుకయే లేకున్నచో మనుజులకు జ్ఞానప్రాప్తియగుటయే యసంభవము ♦ ౧ కాటుకచూచుటకు స్వరూపలక్షణాయుక్తముగఁ గనిపించును. వాస్తవమున కాకాటుక యందె యన్నియుఁ గలవు (అధమోత్తమగుణములు దానియందున్నవి) ౨ మహీసుతను (పృథ్వినుండి జనించు దంటును) దీసి లేఖినిగాఁ జేసి మధ్యనుండి చీల్చెదరు. ఈరెంటితో (సిరా, కలములతో) పని గడుచుచున్నది ౩ శ్వేతము, అశ్వేతము (కాగితము, కలము) కలియుటవలనను, మఱియుమధ్యను కృష్ణము (సిరా) కలియుట వలనను, లోకమునకు*సార్థకత్వముకలుఁగుచున్నదిర ఈ విషయమును యోచించినచో మూర్ఖులుసైతము చతురులగుదురు. తత్కాలముననే ప్రతీతికలుగును. మఱియుఁ బరలోకముగూడ సాక్షాత్కారమగును ౪ ఎల్లరకు మాన్యమగు పరబ్రహ్మమునే సామాన్యముగ నెంచి జనులు ఆ పరబ్రహ్మమునం దనన్యులుఁగాకున్నారు ౫ హస్తరేఖలు ఉత్తమము, మధ్యమము, కనిష్ఠము అనిమూఁడువిధములుఁగ నుండును. లలాటమునందుగూడ నదృష్టరేఖలుండును. కాని యీనాలుగింటి యనుభవము నొక్కటి కాఁజాలదు ౬ తమపూర్వులగు పదునాలుగు తరముల వారి గొప్పతనమును నిరంతరమును గానముజేయువారి నేమనవలెను? నెట్టివారలని యందమా? చతురులని యందమా? ఇపుడుమనవలనఁ (ఆతని పెద్దలుగావించినపనిలో) గొంచెమేనియుఁగునా? కాదా? యనుయంశమును శ్రోతలు యోజింపవలెను ౭ రేఖలన్నింటిని (హస్తరేఖలనుఫాలరేఖలను) దుడిచివేయవచ్చు ననుసంగతి ప్రత్యక్షముగాఁ దెలిసియున్నప్పుడు భాగ్యముకలుగునను విశ్వాసముతో నేల యుండవలెను! ౯ పెక్కండ్రమాటలనుజెవిజేర్చుమనుజులు సందేహములలో మునుఁగుదురు. వారలనుభవాత్మకమగు నిశ్చయమును మఱచిపోవుదురు ౧౦ పెక్కండ్రు తెలుపు పెక్కుమాటల నాలింపవలెను. అనుభవముతో నందఱు చెప్పునదియు విచారింపవలెను. అంతియగాక తనహృదయమున సత్యాసత్యనిర్ధారణ మొనరింపవలెను ౧౧ ఎవరితోడనైనఁ దన యనంగీకారమును వెల్లడింపఁదగదు. ఉపాయమునుగాని అపాయమునుగాని, తెలిసికొని యనుభవమునకుఁ దెచ్చుకొనవలెను. ఎక్కువగా వదరుటవలన నేమిలాభము? ౧౨ హ డైనఁ గానిమ్ము. దురాగ్రహియైనఁగానిమ్ము. వ్యర్థుడైన గానిమ్ము. అట్టివాఁడు దెలుపుమాటలనుగూడ సాదరముగ నాలింపవలెను. ఈ విధముగఁ దనప్రవర్తనవలన అందఱిహృదయములను ప్రసన్నతగా నుంచవలెను. ౧౩ హారము, ద్వేషము, కల్మషము, హృదయమున నుంచుకొనువాఁడును, ఈ దుర్గుణములను మిగులఁ బెంపొందించు వాఁడును నగుచంచలుని చతురుఁడని యెట్లనఁగలను? ఇట్టిపురుషుఁడితరుల నేమిసంతోషపఱుపఁగలఁడు? ౧౪ మూర్ఖులను జతురుల నొనర్చు వారిజీవితమే సార్థకము.

* "ఏకోవిష్ణుర్మహద్భూతమ్" అనిచెప్పఁబడెను: ఉపాసనము (ద్వైతము నుంచుకొని భగవద్భజనము గావించుట) ఇంతదనుకనే మహద్భూతమున కావల నద్వైతముండదు. అచట ననన్యమైపోవలసివచ్చును.

♦ కాటుకతో సిరాచేయుదురు. ఆసిరాతో సమస్త గ్రంథములు వ్రాయుదురు. వానిమూలమున నెల్లరకును జ్ఞానము కలుగును.

*వ్రాయుట, చదువుట నేర్చివిద్వాంసుఁడైనచో ఇహలోకము సార్థకమగును.

వ్యర్థముగా వాదమును బెంచుట మూర్ఖతయేసుమా ౧౫ జనుల లోఁ గలియవలెను. వారలను దనలోఁ గలుపుకొనవలెను. (వారలఁ దన విచారమున కనుకూలురుగఁ జేయవలెను) వారలలోఁ గలసిమెలసి యుండి వారల యభిప్రాయములను మార్పవలెను. వివేకబలముచేఁ దన మనోమర్మము నితరులకు వెల్లడింప కుండవలెను ౧౬ రెండవవాని నడవడి ననుసరించి వర్తింపనగును. రెండవవాఁడు చెప్పిన విధముగాఁ జెప్పవల యును. రెండవవానిమనోగతమునందుఁ గలసిపోవలెను ౧౭ ఇతరుల హితము గోరువాఁ డెన్నఁడును ఇతరులకు విరుద్ధము గావింపఁజాలఁడు. ఆతఁడు సంతోషపూర్వకముగ ఇతరులహృదయములు తన కనుకూలము లుగ నొనర్చుకొనును ౧౮ మొట్టమొదట నితరులను దన యభిప్రాయ ములోనికిఁ దెచ్చుకొనవలెను. మెల్ల మెల్లగఁ దన యుద్దేశమును ఇతరుల హృదయములయందు నింపవలెను. ఈవిధముగ నానాప్రయత్నములచే నితరులనందఱిని దనచేతిలోనికిఁ దెచ్చుకొనవలెను ౧౯ హాతముగావించు వానికి హాతముగావించువాఁడె తటస్థమగుచో గోలయగును. తరువాతఁ గలహములోనికి దిగును. అపుడు నేర్పరితనముపకరింపదు ౨౦ వ్యర్థము గా నార్భాటముజేయువారలేగాని చేసిచూపువారలు పూజ్యము. ఇతరుల హృదయములను దన కనుకూలము గావించుకొనుట మహాకఠినము ౨౧ ఇతరులను దనవైపు ద్రిప్పుకొనఁ బ్రయత్నించునెడ ద్రోహిఁలు, దెబ్బలు సహింపవలెను. నీచశబ్దముల నోర్పుగ వినవలెను. ఇంత సహించినపిదపఁ బశ్చాత్తాపమునొంది యితరులు తనవార లగుదురు ౨౨ ప్రసంగమును గనిపెట్టి భాషింపవలెను. జ్ఞాతృత్వాభిమాన మించుకేని యుంచుకొనఁదగ దు. ఎచ్చటికేగిన నచ్చటఁ గలుపుగోలు తనముతోఁ బ్రేమపూర్వకముగ మెలఁగవలెను ౨౩ కుగ్రామములను (దుర్గమవాసస్థలములను) నగరము లను, ఇండ్లలోనుండు చిన్నయిండ్లను, అవియివి యననేల? చిన్నయిండ్లను పెద్దయిండ్లను నొక్కటియేని మిగులకుండ బిచ్చమను నెపముతో గాలించి వేయవలెను ౨౪ (తిరుగుటవలన) పెక్కుమందిలో నేదియేని లభించి తీరును. విచక్షణులగు పురుషులస్నేహము లభించును. కాని రిత్తగఁ గూర్చున్నయెడలఁ దిరుగుటకాని జ్ఞానప్రాప్తియగుటగాని జరుగదు ౨౫ సమస్తమును సావధానముగా నెఱుంగవలెను. అన్నివిధములగు వార్త

లను దొలుతో త్తనే గ్రహింపవలెను. తానేగవలసిన తావునకు వివేక పూర్వకముగా నేగవలయును ౨౬ నానావిధములగు యుక్తులనెఱింగినచో మనుజులందఱి హృదయములను బ్రసన్నత గావింపవచ్చును. ఆయుక్తులను ఇతరులకు వ్రాసియిచ్చినచోనిఁకఁ జెప్పవలసిన దేమున్నది? వ్రాసియిచ్చుట జనులపై మేరలేని పరోపకారమును గావించుటయే ౨౭ ఎవని కేదివలయునో వానికది ప్రసా దించుమానవుఁడు సర్వమాన్యుఁడును శ్రేష్ఠుఁడునగును ౨౮ భూమండల మునందు సర్వమాన్యుఁడుగ నున్నవానిని సామాన్యపురుషునిగ భావిం పఁదగదు. ఆమానవునిచెంతనెందఱో పురుషు లనన్యులై యుందురు. సర్వ మాన్యుఁడగుపురుషుఁడు లోకసంగ్రహమును జక్కఁగఁ జేయఁజాలియుం డును ౨౯ చాతుర్యలక్షణము లిట్టివి. చాతుర్యముతో దిగ్విజయము గా వించుపురుషున కేమిలోపముండును? ఆతఁ డెచ్చటికరిగిన నచ్చట సమ స్తమును సిద్ధముగానుండును. ౩౦.

ఏడవసమాసము.

అధోర్ధ్వలక్షణము.

నానావికారములకు మూలమెద్దియో యదియే మూలమాయ. అది సూక్ష్మరూపముతో అచంచలము (పరబ్రహ్మము) నందుఁ జంచల రూపముగ నున్నది. ౧ మూలమాయ జ్ఞాతృత్వరూపముగ గలద. అది పరబ్రహ్మమునకు ఆదిసంకల్పరూపము. దానిని షడ్గుణైశ్వర్యుఁడగు భగ వంతుఁడని యెఱుంగవలెను. ౨ ప్రకృతిపురుషులనియు, శివశక్తియనియు నర్ధనారీనటేశ్వరుడనియు దానినే చెప్పుదురు కాని యాజగజ్జ్యోతియే వీని కన్నింటికిని మూలము ౩ సంకల్పముయొక్క చలనమే వాయు (మాయ) లక్షణము. వాయువునందుఁ ద్రిగుణములును బంచభూతములును గలవు. ౪ ఏతీఁగనైనఁ జూడుఁడు. దానిమూల మెంతయో లోతునకుఁబోవును. మఱియుఁ బత్రపుష్పఫలాదులుగూడ మూలమునందే యుండును. ౫ ఇం తియగాక నానావిధవర్ణములు, ఆకారవికారములు, తరంగములు, స్వా దువులు మున్నగునవియెల్ల లోపల మూలమునందే యుండును ౬ ఆమూ లమును ఛేదించిచూచినచో నందేమియుఁ గాన్పింపదు. కాని యనంతర

మామూలము పెరుగఁగాఁ బెరుగఁగా దానినుండి సమస్తమును గాన్పించును. ౭ ఎత్తైనదిబ్బమీఁద నేదేనితీఁగ మొలచినచో నది క్రిందివైపునకు బలముగా వృద్ధినొందును. తరువాత నది భూతలముపై వ్యాపించును. ౮ మూలమాయగూడ నిట్టిదేయని గ్రహింపుఁడు. మూలమాయయందు మొదటినుండియుఁ బంచభూతములు, త్రిగుణములు గలవను నీసత్యవిషయమును అనుభవమువలన నెఱుంగవలెను, ౯ తీఁగ తప్పక నలుగడల నల్లుకొనును. నానావిధములగు మార్పులతో శోభించును. ఆమార్పులవలన నితరములగుమార్పులుగూడఁ జక్కఁగ వృద్ధినొందును. ౧౦ నానాశాఖ లుత్పన్నమగుచున్నవి. నానావృక్షములు పెరుగుచున్నవి. ఈవిధముగనే భూమిపై ననంతములగు తీఁగలు పెరుగుచున్నవి. ౧౧ ఎన్నియోఫలములు క్రుళ్ళిపడుచున్నవి. వెంటనే మఱలఁ గ్రొత్తకాయలు కాచుచున్నవి. ఇట్లే యెల్లప్పుడును జరుగుచుండును ౧౨ కొన్నితీగలెండిపోవును. మఱల నచ్చటనే క్రొత్తతీఁగలు మొలచును. ఈవిధముగా నెన్నితీఁగలు జనించెనో, యెన్నిగతించెనో యెవ్వరెఱుంగుదురు. ౧౩ ఆకులురాలిపోవును. మఱలఁ జిగుర్చును. ఫలపుష్పములస్థితియు నిట్టిదె. ఈఫలపుష్పపత్రములలో నానావిధజీవములుగూడ నేర్పడియుండును. ౧౪ ఒకప్పుడు తీఁగయంతయు నెండిపోవును. మూలమునుండి మఱలఁ జిగుర్చును. ఇట్లే యీయంశమును ప్రత్యక్షానుభవమువలన గ్రహింపవలెను. ౧౫ మూలమును ద్రవ్వి తీసిపాఱవేసినయెడల (ప్రత్యయజ్ఞానముచే నిర్మూలముగావించినప్పుడు) అన్నివిధములగు వృద్ధులును ఆగిపోవును. ౧౬ మూలమునందు (ఆదిలో) బీజముండును. అంత్యమునందు బీజముండును. మధ్యను జలరూపమున బీజముండును. ఇదేవిధముగా బీజములంతటను స్వాభావికముగా వ్యాపించియున్నవి. ౧౭ ఈబీజసృష్టి (బీజమునుండి ఉత్పన్నమైన ఫలపుష్పపత్రాదులగు సమస్తవిస్తారము) మూలమునందిమిడియున్న అన్నివిషయములను బ్రకటించుచున్నది. అనంతరము ఏది దేనియంశమో యది దానియందు స్వాభావికముగ లయమగును. ౧౮ పోవుట, వచ్చుట, మఱలఁబోవుట మున్నగు ప్రత్యావృత్తి యథావిధముగ జరుగుచున్నది. ఆత్మజ్ఞానియగు యోగ్యునకీప్రత్యావృత్తివలని కష్టములు గలుగవు ౧౯ ప్రత్యావృత్తికష్టములు

కలిగినను, కలుగకపోయినను మానవుఁడేదేని కొంత యెఱుఁగవలసియున్నదని పెద్దలందురు. ఆత్మ తనహృదయమునందే యున్నను అది యెల్లరకచ్చటఁ దెలియును? ౨౦ ఆత్మవలననే కార్యములు నెరవేరుచున్నవి. దాని నెఱుంగరు. అది కనుపింపనే కనుపింపదు. ఈస్థితియందుఁ బాపము జన్ములేమిచేయుదురు? ౨౧ విషయభోగముసైతము ఆత్మవలననే జరుగుచున్నది. అది లేనిచో నేదియు జరుగదు. వాస్తవమునకు స్థూలమును విడిచి సూక్ష్మమునందుఁ బ్రవేశము గడింపవలెను. ౨౨ తనయొక్కయు జగత్తుయొక్కయు అంతఃకరణ మొక్కటియే. కాని శరీరభేదవికారముమాత్రము వేఱుగనున్నది. ౨౩ ఒకవ్రేలివేదన రెండవవ్రేలికిఁ దెలియదు. కాళ్ళు చేతులు మున్నగు నవయవములస్థితిగూడ నిట్టిదె. ౨౪ ఒకశరీరమునందున్న యొకయవయవము సంగతి మఱియొకయవయవము యెఱుంగనప్పుడు ఒకఁడితరులస్థితి నెట్లెఱుంగఁగలఁడు? కాన రెండవవానియంతఃకరణము తెలియఁబడదు. ౨౫ ఒకేజలముచే నానావిధములగు వనస్పతులు కలుగుచున్నవి. కాని వానిలో నానావిధములగు భేదములు కనుపించుచున్నవి. ఎంతవిరిగిపోవునో అంతియ యెండిపోవుచున్నది, తక్కిన దంతయుఁ బచ్చదనము గలిగియుండును. ౨౬ ఇట్లే భేదమన్నింటియందును గలదు. ఒకదాని భేదము రెండవదానికిఁ దెలియదు. కాని జ్ఞానము గలిగిన పిమ్మట నీయాత్మ భేదముండదు. (జ్ఞానియగు పురుషుఁడు సమస్తజగత్తునందు నొకేయాత్మను గాంచుచున్నాఁడు.) ౨౭ దేహప్రకృతికారణమున ఆత్మత్వమునందు భేదము భాసించుచున్నను ఈ విషయమును (సహజముగ భేదములేదని) జాలమంది యెఱుంగుదురు. ౨౮ (సామాన్యులు) చూచి కని యెఱుక గావించుకొందురు. చతురులు మనస్సును బరీక్షించెదరు, విచక్షణచణులగు వారలు గుప్తరూపముతో (సూక్ష్మరూపముతో) నంతయుఁ దెలిసికొందురు. ౨౯ పెక్కుమందిని బరిపాలించువాఁడు పెక్కుండ్రయంతఃకరణముల నెఱుంగును. అంతియగాక విచక్షణతచే సమస్తము గ్రహించును. ౩౦ మొదట మనస్సును బరీక్షించును. అప్పుడు విశ్వసించును. ఈవిధముగనే ప్రాణిమాత్రులు ప్రవర్తించుచున్నారు. ౩౧ యుక్తమును బ్రత్యక్షానుభవమును నగు నీవిషయము స్మరణకుఁ బిదప విస్మరణకు వచ్చుచున్నది. తాను పెట్టిన

పదార్థమునే మనుజుఁడు స్వయముగా మఱచుచున్నాఁడు. ౩౨ తనసంగతియే తనకు జ్ఞాపకముండదు. తాను జెప్పిన సంగతియే తనకు జ్ఞాపకముండదు. అనంతములగు కల్పనములు దొరలుచుండును. ధ్యానమునం దెంతదనుక నుంచుకొనుటకు సాధ్యపడును? ౩౩ ఈచంచలచక్రమిట్టిది. ఇది కొంతసరిగను గొంతవక్రముగను నున్నది. పురుషుఁడు అత్యల్పుఁడైనను ప్రత్యక్షదేవేంద్రుఁడైనను అందఱకును, స్మరణ, విస్మరణములు రెన్నంటియే యుండును. ౩౪ స్మరణము (చైతన్యము) దేవగుణమనియు విస్మరణము (మూఢత) దానవగుణమనియుఁ జెప్పుదురు. మానవుఁడు స్మరణ,విస్మరణములు రెంటియందును వర్తించుచున్నాఁడు. ౩౫ ఇందువలననే, దైవ,దానవములను రెండువిధములగు సంపదలు గలవని తెలియును. ఈ విషయమునఁ బ్రతీతిని వివేకసహితముగ మనస్సులోనికిఁ దేవలెను. ౩౬ అద్దమునందు నేత్రముల సాయమున నెట్లు నేత్రములను గాంచుచుంటిమో యట్లు వివేకమువలన వివేకము నెఱుంగవలయును. మఱియు నాత్మవలన నాత్మను గుఱుతెఱుంగవలెను. ౩౭ స్థూలదేహముతో స్థూలదేహము నెట్లుగోకుకొనుచుంటిమో యట్లు సూక్ష్మమువలన సూక్ష్మమును గుర్తెఱుఁగవలెను. మఱియు సంకేతమువలన సంకేతమును మనస్సులోనికిఁ దేవలెను. ౩౮ విచారమువలన విచారము నెఱుంగవలెను. అంతరాత్మవలన నంతరాత్మ నెఱుంగవలెను. రెండవవాని యంతఃకరణమునందు ప్రవేశించి వాని యంతఃకరణముగూడ నెఱుంగవలెను. ౩౯ స్మరణమునందు విస్మరణము గొందుటయే భేదముయొక్క లక్షణము. ఎవరైనగానిమ్ము. ఏకదేశీయుఁడగు (సంకుచితుఁడగు) వాఁడు పరిపూర్ణుఁడు కాఁజాలఁడు ౪౦ ముందు నేర్చుకొనును. వెనుక మఱచి పోవును. ముందఱ వెలుతురు, వెనుక చీఁకటి. అంతయు మొదట జ్ఞాపకమునకువచ్చును. తరువాత మఱచిపోవును ౪౧ తురీయమును స్మరణమని యెఱుంగవలయును. సుషుప్తిని విస్మరణమని యెఱుంగవలయును. ఈరెండును సరిసమానముగ శరీరమునందు వర్తించుచుండును ౪౨.

ఎనిమిదవ సమాసము.

సూక్ష్మజీవ నిరూపణము.

కొన్నికొన్ని కీటకములు రేణువులకంటెనుగూడ సూక్ష్మములై యుండును. వానియాయువుగూడ మిగుల స్వల్పముగా నుండును. అట్లే యుక్తి, బుద్ధిసైతము వానియందుఁ దక్కువగానుండును ౧ ఇట్లే నానావిధప్రాణులు గలవు. అవి చూచిన గోచరింపవు. కాని వానియందుఁగూడ అంతఃకరణపంచకస్థితి గలదు. ౨ వానికిఁ దగినట్లు వానికిఁగల జ్ఞానము చాలియున్నది. వానివిషయములకు వలయు నింద్రియములుగూడ వానికమరియున్నవి. వానిసూక్ష్మశరీరము నెవఁడు విచారించిచూచుచున్నాఁడు? ౩ సూక్ష్మాతిసూక్ష్మములగు నీకీటకములలోఁ జీమయే మిక్కిలిగొప్పదియగు. చీమకు మూత్రమే సముద్రమని జనులందురు. ౪ సారాంశమేమన చీమలవలెఁ జిన్నవియుఁ, బెద్దవియు నగుశరీరము లనంతములు గలవు. వానియన్నింటిలోనను జీవేశ్వరుఁడు వసించుచున్నాఁడు. ౫ ఈవిధముగ పృథ్విపై గీటకము లనంతములుగ నిండియున్నవి. అత్యంతోద్యోగియగుపురుషుఁడే వీనినన్నిఁటిని విచారించి గ్రహించుచున్నాఁడు ౬ అనేక నక్షత్రకమండలములలోఁగల జీవులుసైతము ఉద్యోగియగు పురుషునకుఁ బర్వతసమానముగ (దూరదర్శయంత్రసహాయమున) గోచరించును. వారలాజీవులగొప్పగొప్పయవస్థల జాడలనుగూడఁ గనిపెట్టుదురు ౭ పక్షులయంత చిన్నజీవము లెవ్వియు లేవు. మఱియుఁ బక్షులతో సమానమగు పెద్దజీవము లెవ్వియులేవు. సర్పములయొక్కయుఁ, జేపలయొక్కయు స్థితిగూడ నిట్టిదిగనే తెలిసికొనుఁడు ౮ చీమమొదలుకొని యేనుఁగుదనుకఁ బెద్దపెద్దశరీరము లెన్నియో గలవు. ఆయాజంతువులనుగూర్చి యోచించినచో వానిలోపలి తత్త్వసారము విశదమగును. ౯ జంతువు లనేకవర్ణములుగ అనేకజాతులుగ నున్నవి. జంతుసముదాయ మనేకరూపములుగ నున్నవి. అందుఁగొన్ని మంచివర్ణము కొన్ని చెడ్డవర్ణములు గలవి. ఎంతదనుకనని చెప్పగలను ౧౦ కొన్ని జంతువులను జగదీశ్వరుఁడు సుకుమారులుగ నొనరించెను. కొన్నింటిని గఠోరములుగ నొనరించెను. కొన్నింటిశరీరమును బంగారమువలె దేదీప్యమానముగ నొనరించెను. ౧౧ ఈ విధముగా జీవులయందు శరీరభేదము,

ఆహారభేదము, వాచాభేదము, గుణభేదముగలదు. కాని యన్నింటి యంతఃకరణములు అభేదములుగను, ఏకరూపములుగను నున్నవి. ఆత్మ యన్నింటికి నొక్కటియే ౧౨ ఆజీవులలోఁ గొన్ని కష్టదాయకములు. కొన్ని ఘాతుకములు. ఈవిధముగా యోచించి చూచినచో నీసృష్టియందు ఎన్నియో యమూల్యములగు కౌతుకములు గోచరించును ౧౩ ఈరీతిగ సమస్తమును ఏప్రాణి విచారించిచూడఁగలఁడు? తమతమ స్వార్థపూరణమునకుఁ జాలినంతవరకుఁ గించిన్మాత్రముగ నందఱును దెలిసికొనుచుందురు ౧౪ భూమండలము నవఖండములుగ నున్నది. దీనికి నాలుగుదిశలు సప్తసాగరములావరించియున్నవి. బ్రహ్మాండమునకు వెలుపలఁగూడ జలమావరించియున్నది. కాని దీనినంతను జూచెడివాఁ డెవ్వఁడు? ౧౫ ఆనీటియందనంతములగు జీవములు నివసించుచున్నవి. ఈయసంఖ్యాకములగు జీవులస్థితి నెవ్వఁడెఱుంగును? ౧౬ జలమున్నతావున జీవులుండును. ఇది యుత్పత్తిస్వభావము. విచార మొనరించినచో నిందలియభిప్రాయము విస్తృతముగ విశదమగును ౧౭ భూగర్భమునందు నానావిధజలము గలదు. ఆజలమున శరీరములు గలవు. అందు బహువిధములగు పెద్దజీవములు, చిన్నజీవములు నున్నవి. వాని నెవ్వఁడెఱుంగును! ౧౮ కొన్నికొన్ని ప్రాణు లాకాశమున వసించుచుండును. అవి భూమిని నెప్పుడును కనులనైనఁ జూడవు. ఱెక్కలు వచ్చినమీఁదఁగూడ నవి పైపైననే యెగిరిపోవుచుండును ౧౯ నానావిధములగు ఖేచరములు, భూచరములు, వనచరములు, జలచరములు మున్నగు నెనుబదినాలుగు లక్షల జీవయోను లీప్రపంచమునందుఁ గలవు. వాని నెవ్వఁడెఱుంగును? ౨౦ ఉష్ణము, తేజముదక్క మిగిలినసమస్తస్థలములును జీవులకు వాసస్థలములు. కల్పనమువలనఁ బ్రాణులు జనించుచున్నవి. వీనినన్నింటిని ఎవ్వఁడెఱుంగును? ౨౧ కొన్ని నానాప్రకారములగు సామర్థ్యములచే నిర్మింపఁబడుచున్నవి. కొన్ని ఇచ్ఛామాత్రమున నుత్పన్నమగుచున్నవి. కొన్ని మాటవెడలఁగనే శాపదేహమునొంది నశించుచున్నవి ౨౨ కొన్ని గాంధర్వదేహములు, కొన్నిగారుడదేహములు, కొన్ని దేవతాదేహములు నగుచున్నవి. ౨౩ కొన్నిదేహములు క్రోధమువలనను గొన్నిదేహములు తపమువలనను జనించుచున్నవి. కొన్ని శాపమోక్షమువలనఁ

బూర్వదేహమును బడయుచున్నవి ౨౪ భగవంతుని కృత్యములిట్లుండును. ఎంతదనుక నని చెప్పఁగలను? విచిత్రమగు మాయాకారణమున నీజీవజాలమేర్పడుటయు నశించుటయు జరుగుచున్నది ౨౫ ఈమాయ(ప్రకృతి)ఎప్పుడును, నెవ్వరుచూడనివియు, విననివియు నగు, నడ్డదిడ్డములనుగావించును. అది యొనరించు సమస్తచిత్రకళలనుదెలిసికొనవలెను ౨౬ జను లేకొంచెమో విద్య నేర్చికొందురు. ఉదరపూరణమున కుపకరించు చదువులనుజదువుదురు. ఇంతమాత్రముననే వ్యర్థముగా మేముజ్ఞానులమైతిమని గరువించి నష్టులగుదురు ౨౭ ఎవనియంతరాత్మ సర్వజనులయందును వ్యాపించియున్నదో వాఁడే సర్వాత్ముఁడగు జ్ఞాని. ఆతని మహిమను గ్రహించుటకు బుద్ధి యెంతదనుకఁ బనిచేయఁగలదు? ౨౮ సప్తకంచుకము బ్రహ్మాండము. దానిలో సప్తకంచుకము పిండము. ఆపిండములోఁగూడ నెన్నిప్రాణులువసించుచున్నవో యెవ్వరెఱుంగుదురు? ౨౯ తనదేహస్థితియే తనకుఁ దెలియని మానవునకు సమస్తము నెట్లు తెలియఁగలదు! కాని జనులు అల్పజ్ఞానమువలననే (సర్వజ్ఞులమని) గర్వించిపోవుదురు ౩౦ అణురేణువునకుసమానముగ నుండుస్వల్పప్రాణులపాలిటికి మనము విరాట్పురుషులము. ఆస్వల్పజీవులతోఁ బోల్చిజూచినయెడల మనయాయువు మిగుల గొప్పదిగదా! ౩౧ స్వల్పజీవుల ప్రవర్తనమనేకరీతులుగ, అనేకపద్ధతులుగ నుండును. వీనియన్నింటిస్థితిగతులను సమగ్రముగా నెఱింగినవాఁడెవడు? ౩౨ పరమేశ్వరుని కృత్యమునకనేకవందనములు. అంతఃకరణమునందాతనిగూర్చి యనుమానముగూడఁ గలుగదు. పాపియగు అహంకర్తృత్వాభిమానము మానవులను వ్యర్థముగా నావరించుచున్నది. ౩౩ అహంభావమును దొలంగించి పరమేశ్వరుని యగాధకృత్యములను విచారింపవలయును. కాని యీ మహత్కార్యము నెదుటనుంచుకొని చూచినచో మానవజీవితము మిగుల కొద్దిది. అతఁడీపనికిఁ జాలఁడు. ౩౪ జీవితము స్వల్పము. దేహము క్షణభంగురము. శరీరము పతనమగుట కాలస్యముపట్టదు. ఐనను జనులు నిష్కారణముగ గర్వపడుచుందురు. ౩౫ ఈదేహము మలినమగుతావున జన్మించినది. అంతియగాక మలినరసమువలననే పెంపొందినది. ఈస్థితిలో జనులు దీనిని గొప్పదని యెట్లునుడువుచున్నారోగదా! ౩౬ ఈదేహము మలినము, క్షణభంగురము నైయున్నది. దీనిని వ్యథ లావరించి యున్నవి.

చింత నిరంతరము వెన్నంటియున్నది. ఈ స్థితియందుఁగూడ జనులు ఆలోచనారహితులై వ్యర్థముగా నీదేహము గొప్పదని నుడువుచున్నారు. ౩౭ ఈశరీరసంపత్తి రెండుదినముల బండారము. జీవితమునందు ఆదినుండి యంత్యముదనుక నెన్నియో చిక్కులంటుకొని యున్నవి. ఈస్థితి యందుఁగూడ జనులు డాంబికవేషములను ధరించి వ్యర్థముగ గొప్పతనము జూపుదురు. ౩౮ ఎన్ని మోసములు గావించినను జివరకవియెల్ల బయటఁబడును. బయటఁబడినపిదప నలుముఖములను దుర్గంధము బయలువెడలును. (అపయశస్సు వ్యాపించును.) కావున వివేకముతో సత్కార్యము లొనరించు పురుషుఁడే ధన్యుఁడు. ౩౯ వ్యర్థముగా డాంబికములను మోసములను నేలచేయవలెను? అహంభావపుఁ గల్లోలము నాపివేయుము. వివేకముతోఁ బరమేశ్వరు నన్వేషించుట యన్నింటికంటెను మిగులమంచిపని. ౪౦

తొమ్మిదవసమాసము.

పిండోత్పత్తి.

నాలుగు విధములగు సృష్టులలోని (జరాయుజాదులు) సమస్తప్రాణులును నీటివలననే వృద్ధినొందుచున్నవి. ఇవి యసంఖ్యాకముగ జనించి గతించుచున్నవి. ౧ పంచతత్త్వములచే నీశరీరము నిర్మింపఁబడినది. దేహము ఆత్మననుసరించి వర్తించును. వాస్తవమున కీశరీరమునకు మూలము విచారించితిమేని జలరూపము ౨ స్త్రీపురుషుల శరీరమునుండి జలరూపమగు వీర్యము వెడలి పరస్పరము గలియును. ౩ తరువాత అన్నరసము, దేహరసము, రక్తము, శుక్రము మున్నగువానివలన ఉండగట్టును. అనంతర మాహారసద్వ్యయపు టుండఁ జిక్కఁగ వృద్ధినొందును. ౫ గర్భము పెరిగి దినక్రమమ్మున వృద్ధినొందును. అది కోమలత్వము వదలి కఠినమగును. పిమ్మట సమస్తావయవము లందును జలము ప్రవేశించును. గర్భము సంపూర్ణమైన పిదప శిశువు వెలుపలకు వెడలును. భూమిమీఁదఁ బడఁగనే శిశువేడ్చును. ఇంతియే! అంతటి శరీరములు అన్నిశరీరములు ఇట్లే నిర్మింపఁబడెను. ౬ దేహము వృద్ధినొందును. కుబుద్ధి వృద్ధినొందును. ప్రారంభమునుండి యంత్యముదనుక సంతతము జరుగుచుండును. చూచు

చుండఁగనే దేహము పెరిగి పెరిగి నష్టమొందును. ౭ ఈవిధముగ శరీరములు దినక్రమమునఁ బెద్దవియైనకొలఁది కొంతకొంత యోచనశక్తికూడ గలుగును. ౮ ఫలములోనికి బీజమువచ్చినట్లు మనుజులను జూచుచు వారి మాటల నాలించుచు నున్నకొలఁది సమస్తము నెఱుకలోనికివచ్చును ౯ జలమువలన బీజము లంకురించును. జలము లేకున్నచో బీజములు నష్టమగును. మన్ను, జలము గలసినచో బీజము లంకురదశకువచ్చును ౧౦ రెంటిలో బీజములుండుటవలన సహజముగఁ దడిసిన విత్తనమునుండి యంకురము వెలికివచ్చును. ఆయంకురము పెరిఁగినకొలఁది యానందకరముగా నుండును. ౧౧ వేళ్లు నేలలోనికిఁ బరుగిడును. చివరలు అంతరాళమునకును వ్యాప్తినొందును. మూలము, చివర బీజమువలన నేర్పడినవే ౧౨ మూలము పాతాళమునకును, చివరలు అంతరాళమునకుఁ బ్రసరించినకొలఁది వృక్షమునకు ఆకులు, పూవులు, పండ్లు విస్తరించును ౧౩ ఫలముల జనకస్థానము పుష్పములు. పుష్పముల జనకస్థానము పత్రములు. పత్రములకు జనకస్థానము వృక్షములు ౧౪ వృక్షముల జనకస్థానము సన్నని మూలములు [వేళ్లు]. మూలమునకు జనకస్థానము జలము. జలమింకి పోయినపిదపఁ బృథ్వియే శేషించును ౧౫ ఇదియే యనుభవము. కావునఁ బృథ్వియే అన్నింటికిని జనని. పృథ్వికి జనకస్థానము "ఆపోనారాయణ స్వరూపము" ౧౬ దానికి (ఆపోనారాయణ స్వరూపమునకుఁ) దండ్రి అగ్నిదేవుఁడు. అగ్నికి తండ్రి వాయువు. వాయువునకు జనకస్థానము స్వాభావికముగా అంతరాత్మ ౧౭ ఈవిధముగ నన్నింటికి జనకస్థాన మంతరాత్మ. ఆయంతరాత్మ నెఱుంగనివాఁడు దురాత్ముఁడు. అనగా వాఁడు ఆత్మకు దూరముగా నుండును ౧౮ ఇట్టి పురుషుఁడు దగ్గఱనున్నను గూడ ఆత్మను మఱచియుండును. ఆతఁ డనుభవమును గడింపఁడు. ఆతఁ డంతరాత్మ కారణముననే వచ్చును. అంతరాత్మ కారణముననే వెడలిపోవును ౧౯ అన్నింటికిని జనకుఁడగు పరమాత్మునియెడ ననన్యభావము గలిగియుండినచో నీ ప్రకృతియొక్క స్వభావము మార్పునొందును ౨౦ (స్వభావము మార్పునొందినపిదప) తన వ్యాసంగమును దానొనర్చును. ధ్యానభంగ మెప్పుడును గలుగదు. మాటలాడుటయందుఁగాని, నడుచుటయందుగాని వ్యంగ్యము రానీయఁడు ౨౧ జనకునిచే నిర్మింపఁబడినదానినెల్లఁ దిలకింప

వలెను. కాని యాతఁడు (జనకుఁడు) ఏమేమి నిర్మించునో వాని నెంతని చూడఁగలము ౨౨ ఏపురుషునియందు ఆపరమపిత (అంతరాత్మ) ప్రకాశించునో యతఁడే భాగ్యశాలి. ఆపరమపిత యెవనియం దల్పముగాఁ బ్రకాశించునో యతఁడే అల్పభాగ్యశాలి ౨౩ ఆనారాయణమూర్తిని హృదయమునందిడి అఖండముగ ధ్యానము గావింపవలెను. ఇట్లొనరించినచో లక్ష్మి వానికడనుండి యెక్కడికిఁ బోవఁగలదు? ౨౪ నారాయణుఁడు విశ్వమునందంతటను వ్యాప్తమైయున్నాఁడు. ఆతనిని బూజింపవలెను. అనఁగా అందఱిని సంతుష్టి పఱుపవలెను. అందఱిని సంతుష్టిపఱచుట యన నారాయణమూర్తిని సంతుష్టిపఱచుటయే యని భావింపుఁడు ౨౫ మనము ఉపాసనయొక్క యోగ్యత విచారించితిమేని ఉపాసనయన విశ్వపాలినియని తెలియవచ్చును. దానిలీల లగమ్యములు, ఎవ్వఁడు దానిని బరీక్షింపఁగలడు * ౨౬ పరమాత్మునిలీలలు పరమాత్ముఁడు దక్కనితరుఁ డెట్లెఱుంగఁగలడు? మన మెంతదనుకఁ జూచుచుంటిమో యది యంతయు మనకుఁ బరమాత్ముఁడుగనే గోచరించును ౨౭ ఉపాసన అన్నితావులయం దున్నది. ఆత్మారాముఁ డెచ్చట లేఁడు? రాముఁడు ప్రతిస్థలమునందును నిండియున్నాఁడు. ఉపాసన, ఆత్మారాముఁడు, రాముఁడుఅను నీమూఁడును నొక్కటియే. ఇదిసర్వ వ్యాపకమైయున్నది. ౨౮ నాయుపాసన యిట్టిది. ఇది యనుమానములోనికి రాఁజాలదు. ఇది నిరంజనమునకుఁగూడ నావలితట్టునకుఁ గొనిపోవును. ౨౯ అంతరాత్మసంయోగముచేఁ గర్మలు జరుగును: అంతరాత్మసంయోగముచే ఉపాసకు లేర్పడుదురు. అంతరాత్మసంయోగమువలననే యెందఱో జనులు జ్ఞానులగుచున్నారు. ౩౦ నానాశాస్త్రములు, నానామతములు అనునవి పరమేశ్వరునిచేఁ జెప్పబడినవె. నియమములు, అనియమములు, వ్యస్తములు, అవ్యస్తములు కర్మానుసారముగా నగును. ౩౧ పరమేశ్వరున కన్నియుఁ జేయవలెను. వానినుండి యెంతదీసికొనఁగలరో అంతియ తీసికొనవలెను. అధికారము ననుసరించి నడువవలెను. ౩౨ ఉపాసనయందు ఆవాహన, విసర్జన విధానములు మాత్రమె గలవు. (మా

* పరమాత్మునిసేవయే విశ్వసేవ. ఈరెండు నొక్కటియే. పరమాత్మునిసేవను ఉపాసన మందురు. కావుననే ఉపాసన విశ్వపాలిని యైనది.

యయొక్క ఉద్భవసంహారముల విచారముమాత్రమె కలదు.) ఇంతదనుక పూర్వపక్షమే యైనది. ఉత్తరపక్షము (సిద్ధాంతము) దీనికిముం దున్నది. ౩౩ వేదాంతము, సిద్ధాంతము, రాద్ధాంతము (శాస్త్రప్రతీతి, గురుప్రతీతి, ఆత్మప్రతీతి) ఈమూఁడింటిలో ఆత్మప్రతీతియొక్క ప్రమాణము ముఖ్యమైనది. పంచీకరణమును విడిచి హితకారకములగు మహావాక్యములను వానియర్థమును యోజింపవలెను. ౩౪

పదియవసమాసము.

సిద్ధాంతనిరూపణము.

ఆకాశమునం దంతయు జనించుచున్నది. నశించుచున్నది. కాని యాజనించునవియు, నశించునవియు నాకాశమువలె నిశ్చియుండుట లేదు. ఇట్లే నిశ్చలము (పరబ్రహ్మము) నందు చంచలము (మాయ) నానావిధములుగఁ గలిగి నశించుచున్నది. కాని యామాయ పరబ్రహ్మమువలె నిశ్చలముగాదు. ౧ గాఢాంధకారము వ్యాపించి నపు డాకాశము నల్లగ గాన్పించును. సూర్యకిరణములు వ్యాపించి నపుడది పింగళవర్ణముగఁ గాన్పించును. ౨ మిక్కిలి చలిగా నున్నప్పు డాకాశము చల్లగానున్నట్లును, వేఁడిగాలి వీచునపు డాకాశ మెండిపోవునట్లును తోఁచును. ౩ ఇట్లు కనిపించుమార్పంతయు నిలుకడగా నుండదు. ఆకాశమువలె అమార్పు నిలుకడగా నుండుట యెప్పుడును సంభవముకాదు ౪ ఉత్తమమగు జ్ఞాతృత్వవిషయమును జక్కఁగఁ దెలిసికొని చూడవలెను. ఆకాశము నిరాభాసము. భాసము మిథ్య ౫ ఉదకము వ్యాప్తినొందుచున్నది. వాయువు వ్యాప్తినొందుచున్నది. ఆత్మగూడ నత్యంతముగా వ్యాప్తి నొందుచున్నది. ఇంతయేల! సకలతత్త్వములును వ్యాప్తినొందుచున్నవి. ౬ చంచలనిశ్చలము లన్నియు అంతఃకరణమునకుఁ దెలియును. విచారము చేయుటవలననే సమస్తము ప్రాణిమాత్రులకు విశదమగును. ౭ విచారమును జేయఁజేయ (మననము జేయుటవలన) సాధకు లంత్యమున నివృత్తిపదమునందు లీనులగుదురు. మఱల వియోగము గలుగదు. ౮ నివృత్తిపదమునందు జ్ఞానము విజ్ఞానమగును. మనస్సు ఉన్మనమగును. ఈవిధముగా వివేకముతోఁ దత్త్వనిరసన మొనరించిన పిమ్మట సాధకు లనన్యులగు

దురు. ౯ జనకుని (అంతరాత్మను) శోధించి చూచినచోఁ జంచలము నిశ్చలమగును. ఆస్థితియందు దేవుఁడు, భక్తియనునది (ద్వైతోపాసన యనునది) వెడలిపోవును. అనన్యత కలుగును. ౧౦ అచ్చట తావు, నిశ్చలస్థానము (ఠికానా) మున్నగు పదార్థము లెవ్వియు లేవు. పదార్థ మనునది లేనేలేదు. అందఱు నెఱుంగుటకై ఎద్దియో యొకదానిని చెప్పుదురు. ౧౧ అజ్ఞానశక్తి నిరసనమైనంతనే జ్ఞానశక్తిగూడ లయమగును. వృత్తిశూన్యమైనపిదప నట్టిస్థితికలుగునో అప్పుడు చూడుఁడు ౧౨ చంచలము (మాయ) యొక్క కోలాహలములేని స్థితికి ముఖ్య నిర్వికల్ప సమాధియని పేరు. మాయయొక్క భ్రమ నాశనమైనపిమ్మట శాంతపురుషుఁడు నిర్వికారమగు శాంతము (పరబ్రహ్మము) నందు లీనమగును. ౧౩ వాస్తవమునకుఁ జంచలము వికారయుతము. కాని యీ చంచలము అచ్చట నుండఁజాలదు. నిశ్చలముతోఁ జంచలము కలిసియుండఁజాలదు. ౧౪ మహావాక్యములను విచారించుటకు సన్న్యాసియే యధికారి. ఏపురుషునిపై దైవమునకుఁ గృపగలదో యాతఁడుగూడ మహావాక్యములను విచారించును. ౧౫ సమ్యక్ప్రకారముగఁ ద్యాగముగావించు వానిని సన్న్యాసి యందురు. విచారవంతులగు పురుషులందఱును సన్న్యాసులే. మన విహితకృత్యములన్నియు నిశ్చయముగ మనవద్దనే యున్నవి. ౧౬ జగదీశ్వరుఁడు ప్రసన్నుఁడైన పిదప సందేహ మింక నెక్కడనుండఁ గలదు? ఈవిచారమును విచారశాలియగు పురుషుఁడే యెఱుంగును. ౧౭ (పరమార్థమును) దెలిసికొనిన విచారవంతులు నిస్సంశయ లగుదురు. దేహాభిమానులై యుండువారలు దేహాభిమానమునే రక్షగావింతురు. ౧౮ అలక్ష్య (పరబ్రహ్మము) ధ్యానము నందుఁ గూర్చుండియున్నచోఁ బూర్వపక్షము (సందేహము) ఎగిరిపోవును. అంతియగాక హేతురూపమును, అంతస్సాక్షియునగు ఆత్మగూడఁ బరమాత్మయందు లయమగును. ౧౯ ఆకాశము, పాతాళము అనునవి ఉభయాంతరాళముల పేర్లు. దృశ్యమును (పృథ్వియను తెఱను) మధ్యనుండి లాగివైచిన పిదప రెండునుగలసి యొకటియగును. ౨౦ ఆకాశపాతాళములు రెండును గలసి యొకటియే. కాని మనస్సు ఉపాధిప్రక్కకు ధ్యానమునుంచి చూచును. ఉపాధిని నిరసనముగావించిన పిదప భేదమెట్లుండగలదు? ౨౧ అది (పరబ్ర

హ్మము) శబ్దమున కావలనున్నది. కల్పనమునకుఁగూడ నావలనున్నది. మఱియు మనోబుద్ధుల కగోచరముగా నున్నది. మనస్సునందు దీనిని విచారపూర్వకముగా బోధగావించుకొనవలెను. ౨౨ విచారము చేయఁ జేయ విదితమగునుగాని విదితమగునదంతయు వ్యర్థముగఁ బోవును. (తెలిసెను అను నీభేదజ్ఞానముండఁగాఁ దెలియుట వ్యర్థము.) ఇది యెన్నియో అడ్డదిడ్డములతోఁ గూడిన విషయము. దీని నెట్లు వివరించి చెప్ప శక్యమగును? ౨౩ మహావాక్యముల కర్థము, వాచ్యాంశ విచారము, ముగిసినపిదప వెడలు లక్ష్యాంశముగూడ అలక్ష్యమునందు (పరబ్రహ్మమునందు) లీనమగును. దానికిఁ దరువాతఁ జెప్పుటయనునది ఆగిపోవును. ౨౪ శాశ్వతమును శోధించుచుఁ బోవుచుండువాఁడు సత్యమగు జ్ఞానియగును. ఆతఁడు వికారమును విడిచి నిర్వికార (బ్రహ్మ) ము నందుఁ గలిసిపోవును. ౨౫ సుషుప్త్యవస్థయందుఁ బెక్కు దుస్స్వప్నములు గలుగును. మేల్కొనిన పిమ్మట నవియన్నియు మిథ్యలగును. మఱల నవి జ్ఞప్తికివచ్చినను మిథ్యలే. ౨౬ (ఒకసారి జ్ఞానముగలిగిన పిమ్మట మఱల దేహమహత్త్వ ముండదు.) ప్రారబ్ధయోగానుసారముగ మఱల దేహముండినను లేకున్నను అంతఃకరణవిచారము అవశ్యముగ అచలమును స్థిరమును నై యుండును. ౨౭ బీజమును గాల్చినచో నది యింక మొలువఁజాలదు. అట్లే జ్ఞానియొక్క వాసనారూపమగు బీజముగూడ జ్ఞానాగ్నివలన దగ్ధమగును. ౨౮ విచారమువలన బుద్ధి నిశ్చల మగును. బుద్ధివలననే కార్యసిద్ధియగును. పెద్దల బుద్ధిని విచారించి చూచినచో నది నిశ్చలత్వము దనుకఁ బ్రవేశించెనని విదితమగును. ౨౯ నిశ్చలమును ధ్యానించువాఁడు నిశ్చలుఁ డగును. చంచలమును ధ్యానించువాఁడు చంచలుఁడగును. పంచభూతములను ధ్యానించువాఁడు భూతమగును. ౩౦ అంతమును బొందిన (బ్రహ్మప్రాప్తియైన) వానిని మాయ యేమియుఁ జేయఁజాలదు. అంతర్నిష్ఠుల పాలికి మాయ యొకవిధమగు నింద్రజాలము ౩౧ మాయ మిథ్యయను నంశ మెప్పుడు విదితమగునో మఱియు నెప్పుడు దాని మిథ్యాత్వభావన విచారము వలన దృఢమగునో అప్పుడు ఆకస్మికముగా భయమంతయు దూరమగును. ౩౨ మనము ఉపాసనపట్లఁ గృతజ్ఞత గలిగియుండవలెను. భక్తినిగూర్చి ప్రచారము గావించుచుండ

వలెను. అంతఃకరణమునందు వివేకము గలిగి సమస్తమును దెలిసికొన వలెను. ౩౩

పదునాలవదశకము.

మొదటి సమాసము

వాల్మీకిస్తుతి.

ఋషులలోఁ బుణ్యశ్లోకుఁడని పేరొందిన వాల్మీకిమహర్షికి నమస్కరించెదను. ఈముల్లోకములను బావనమొనరించిన యామహానుభావునికి సాష్టాంగపడెదను ౧ జరుగనున్న శ్రీరామజీవితమును (ఒకటి రెండుమాటలలోఁగాక) శతకోటిశ్లోకపరిమితిగల గ్రంథముగ రచించిన యిట్టిమహానుభావుఁ డీప్రపంచమున వేఱొక్కఁడులేఁడు. ఈ సృష్టినంతయుఁ గాలించి చూచినను వాల్మీకి మహర్షివలె భవిష్యత్తును గ్రంథమున సమకూర్చిన వాఁ డింకొకఁడు గనుపింపఁడు ౨ భవిష్యత్తును జెప్పినదానిలో నొక్కమాటయేని యొకవేళ నెప్పుడేని సత్యముగా జరిగినచోఁ బృథ్వీమండలములోని జనులందఱును నాశ్చర్యపడుదురు ౩ రఘునాథునియవతారము కలుగకమున్నె వాల్మీకిమహర్షి శాస్త్రాధారములను గైకొనకయే రామకథను మహాగ్రంథముగ నొనరించెను. ౪ అతని వాగ్విలాసముల నాలించి మహేశ్వరుఁడుసైత మానందించెను. అనంతర మాజడదారి శతకోటిశ్లోకయుక్తమగు రామాయణము నీముల్లోకములోఁ బంచిపెట్టెను. ౫ శంకరుఁడు వాల్మీకిమహర్షికవిత్వమున కక్కజపడెను. సామాన్యులగు నితరమానవు లాతనికవిత్వమునుగూర్చి యనుమానింప నేర్తురా? రామాయణము పఠించుకతన శ్రీ రామోపాసకులకుఁ బరమసమాధానము గలిగెను. ౬ ఎందఱెందఱో ఋషులు గతించిరి. పలువురు గ్రంథములను రచించిరి. కాని వాల్మీకికిసమానుఁడగు కవీశ్వరుఁ డింతదనుకఁ గలుగలేదు. ఇంకఁ గలుగఁడు ౭ వాల్మీకి తొలుత దుష్కర్మము లాచరించుచుండి యనంతరము శ్రీరామనామమును స్మరించి పావనుఁడయ్యెను. అతఁడు దృఢముగను, నియమపూర్వకముగను శ్రీరామనామమును జపించుటచే మేరలేని

పుణ్యమును గడించెను ౮ తలక్రిందుగ రామనామము జపించినందున నాతని పాపపర్వతములు చూర్ణమయ్యెను. మఱియుఁ బుణ్యధ్వజము బ్రహ్మాండముపై రాజిల్లెను ౯ వాల్మీకిమహర్షి తపముగావించిన యరణ్యముగూడఁ బుణ్యాతిశయముచేఁ బావనమయ్యెను. ఆతని తపోబలముచే ఎండిపోయిన కొయ్యగూడఁ జిగిర్చెను. ౧౦ తొలుదొలుత వాల్మీకి విఖ్యాతజీవఘాతుకుఁడగు "వాల్హా" యనుపేరుగల కిరాతుఁడుగ నుండెను. ఆతని కిపుడు మహాపండితులు, ఋషీశ్వరులు నగువారలెల్లరు నమస్కరించుచున్నారు. ౧౧ నిగ్రహశక్తియు, ననుతాపముగల మానవుని కడఁ బాప మెట్లు నివసింపఁగలదు? దేహాంతమువరకుఁ దపముగావించుటచే వాల్మీకిమహర్షికిఁ బుణ్యరూపమగు ద్వితీయజన్మ ప్రాప్తించెను. ౧౨ అనుతాపతప్తుఁడై సుస్థిరాసనాసీనుఁడై యున్నందున ఆతని దేహము నిండఁ బుట్టలు పెరిగెను. కావనే యాతనికి వాల్మీకియను పేరుగలిగెను. ౧౩ సంస్కృతమునందుఁ బుట్టను వల్మీకమని యందురు. తనపైఁ బుట్టలు పెరిగినందుననే వాల్మీకియనుపే రేర్పడెను. ఆతని తీవ్రతపస్థితి విన్నంతన మహాత్ములగు ఋషులహృదయములు కంపించెను. ౧౪ ఋషిగణమునందు వాల్మీకి ఉత్తముఁడు. అంతియగాదు. ఆతఁడు కవులయందు గూడ నుత్తముఁడె. ఆతఁడు చెప్పినది స్పష్టమును, నిశ్చయాత్మకమును నైయున్నది ౧౫ వాల్మీకిమహర్షి నిష్ఠావంతులకు మండనుఁడు. రఘునాథునిభక్తికి భూషణము. ఆతని ధారణాశక్తి యసాధారణమైనది. సాధకుల నామహాత్ముఁడు దృఢాత్ముల నొనర్చును. ౧౬ శ్రీ రఘువీరసమర్థుని (యాస్థాన) కవీశ్వరుఁడగు వాల్మీకిమహర్షికి ధన్యవాదములు. ఆతనికి సాష్టాంగభావముతో నమస్కారములు ౧౭ ఒకవేళ వాల్మీకిమహర్షి రచించి ప్రకటింపకపోయినచో మనకు రామకథ యెట్లుతెలియును? భక్తబృందమునకు రామకథప్రసాదించిన సమర్థుఁడగు నీమహాత్ముని యెంతదనుకఁ గొనియాడఁగలము? ౧౮ వాల్మీకి రఘునాథునికీర్తిని ప్రకటించెను. అందుచే నాతనిమహత్త్వముసైతము వృద్ధినొందెను. అంతియగాక రామకథాశ్రవణమాత్రమున భక్తమండలి సుఖియయ్యెను. ౧౯ వాల్మీకిమహర్షి తనకాలమును సార్థకముగావించెను. రఘునాథునికీర్తియందు మగ్న

మయ్యెను. ఆతనివలన భూమండలమునందలి జనులెందఱెందఱో యుద్ధరింపఁబడిరి. ౨౦ రఘునాథస్వామి భక్తులెందఱెందఱో జనించిరి. నశించిరి. వారలమహిమ యపారము. నేను వారలందఱకుఁ గింకరుఁడనని రామదాసు నుడువుచున్నాఁడు ౨౧.

ద్వితీయసమాసము.

సూర్యస్తుతి.

ఈసూర్యవంశమునకు నమస్కరింతును. అన్నివంశములలో నీ సూర్యవంశము ప్రశస్తమైనది. సూర్యమండలప్రకాశము సమస్తభూమండలములందును వ్యాపించినది ౧ చంద్రుని దేహమునందు లాంఛనము గలదు. అతఁడొకపక్షమున క్షీణించును. సూర్యకిరణములు తనపయి సోఁకినంతన కళాహీనుఁడగును. ౨ ఇందుచేఁ జంద్రుఁడు సూర్యునకు సమానము గానేరఁడు. సూర్యప్రకాశముననే ప్రాణిమాత్రులకు వెలుతురు లభించుచున్నది ౩ ఈసృష్టియందలి ఉత్తమమధ్యమాధమములు సుగమదుర్గములు, ధర్మకర్మములు, నిత్యనియమములు మున్నగునవియెల్ల సూర్యునివలననే కలుగుచున్నవి ౪ వేదశాస్త్రపురాణమంత్రయంత్రములు, నానాసాధనములు, సంధ్యాస్నానపూజలు, విధివిధానములు మున్నగు నేకర్మధర్మములైనను సూర్యభగవానుఁడు లేకున్నచో నెరవేరవు ౫ అసంఖ్యాకములగు నానాయోగములు, నానామతములు, సూర్యోదయానంతరము యథావిధిగ జరుగును. ౬ ప్రాపంచికమునకుగాని, పరమార్థమునకుఁగాని సంబంధించిన యేకార్యమైనను దినము లేనిచో సార్థకముగాదు. ౭ సూర్యుని యధిష్ఠానస్థానము నేత్రములు. నేత్రములు లేనిచోఁ బ్రజలందఱును గ్రుడ్డివారె. కావున సూర్యుఁడు లేకున్నచో నేకార్యమైనను జరుగదు ౮ సూర్యుఁడు లేకున్న కార్యములు జరుగుటలేవా! గ్రుడ్డివాండ్రు కవిత్వము చెప్పుచుండిరిగదాయని మా శ్రోతలందురేమో? ఇందులకుఁగూడ సూర్యుఁడే కారణము. ఏలయన! మనస్సు చల్లఁబడినచో నిఁక నెట్లు ప్రకాశించును? ౯ ఉష్ణప్రకాశము సూర్యునిది. శీతప్రకాశము చంద్రునిది. ఉష్ణములేకున్నచో దేహము మరణించును. ౧౦ కావున సూర్యుఁడులేకున్నచో సులభముగ నేకార్య

మైనను నడువదు. మీరలు విచక్షణులగు శ్రోతలు. యోచించి చూడుఁడు. ౧౧ హరిహరులకు, అనేకావతారములకును, శివశక్తికి, అనంతవ్యక్తులకుఁ బూర్వమునఁగూడ సూర్యుఁడుండెను. ఇప్పుడును నున్నాఁడు ౧౨ ఎంతమంది యీలోకములోనికి వచ్చుచున్నారలో వారలందఱును సూర్యునిక్రిందనే వర్తించుచున్నారు. అంత్యమునందుసూర్యుని యెదుటనే దేహత్యాగ మొనర్చుచున్నారు ౧౩ చంద్రుఁడు సూర్యునకుఁ జాలవెనుక జనించెను. క్షీరసాగరమునుండి మథించితీయఁబడిన పదునాలుగు రత్నములలోఁ జంద్రుఁడొకఁడు. చంద్రుఁడు లక్ష్మికిఁ జుట్టము. ౧౪ ఈభాస్కరుఁడు విశ్వచక్షువని పెద్దలు, పిన్నలు అందఱునెఱుంగుదురు. కావున దివాకరుఁడు ఉత్తములందఱికంటె మిగులనుత్తముఁడు ౧౫ సూర్యుఁడు లోకోపకారార్థమై యపారమగు నభోమార్గభ్రమణము గావించుటకును నిత్యము వచ్చుచుఁ బోవుటకును సమర్థుఁడు (భగవంతుఁడు) కట్టడి చేసియున్నాఁడు. ౧౬ పగలేలేనియెడల విశ్వమంతయు నంధకారబంధురమగును. సారాసార మెవరికిని స్ఫురింపదు. పగలేలేకున్నచో దొంగలు, గ్రుడ్లగూబలు చేయుప్రచారము యథావిధిగ సాగును ౧౭ సూర్యునకు సాటి యెవ్వరునుగారు. ఈతేజోరాశి అవశ్యముగా నుపమానరహితుఁడు. ౧౮ సూర్యుఁడు రఘునాథునకుఁ బూర్వుఁడగుటవలన మనయందఱకుఁగూడ మిగులఁ బూర్వుఁడు. ఈతనిమహిమ యగాధము. మానవవాక్కుతో నీసూర్యభగవానుని నెంతని కొనియాడగలము? ౧౯ రఘునాథుని వంశమునందును (రామునకు) ముందును వెనుకను జనించినరాజులందఱును ఒకరినొకరు మించినవారుగఁ బేరొంది గతించిరి. మందమతినగు నాకీ విచార మెట్లు తెలియును? ౨౦ రఘునాథుని సముదాయమునందు నా యంతఃకరణము చిక్కుకొనియున్నది. కావున నాతనిమహత్త్వము వర్ణించుటకు నేను వాగ్దుర్బలుఁడను, అసమర్థుడనునునై యున్నాను ౨౧ సూర్యునకు నమస్కరించుటవలన దోషములన్నియుఁ దొలంగును. నిరంతరము సూర్యదర్శనము గావించుటవలనఁ దేజోబలములు పెంపొందును. ౨౨

మూండవ సమాసము

పృథ్వీస్తుతి.

ఈ వసుమతికి వందనములు. అనేకవందనములు. దీనిమహిమ నెంతదనుక గానముచేయంగలను? ప్రాణిమాత్రులు దీనియాధారముననే వసించుచున్నారు. ౧ అంతరిక్షమునందుండు జీవులుసైతము పృథ్వీకారణముననే నిల్చియున్నవి. ఏలయున, జడదేహములేనిచో జీవుం డెట్లుండఁగలండు? (జడత్వము పృథ్వీలక్షణము) ౨ జనులు పృథ్విని కాల్చుచున్నారు, దోకుచున్నారు, పొడుచుచున్నారు, దున్నుచున్నారు, చీల్చుచున్నారు, త్రవ్వుచున్నారు. మఱియు నీపృథ్విపై మలమూత్రములు, వమనము విడచుచున్నారు ౩ క్రుళ్ళిన, పాసిన, జీర్ణించిన పదార్థములకుఁ బృథ్విపైఁ దక్క మఱియెక్కడ సహాయముగలదు? దేహాంతకాలమునందు శరీరముగూడ భూమిమీదనే పడును ౪ మంచిచెడ్డల కన్నిఁటికిని బృథ్విదక్క సహాయస్థానము వేఱొకటి లేదు. నానావిధధాతువులు, ద్రవ్యములుగూడ నీపృథ్వీగర్భమునందే యున్నవి ౫ ఒకప్రాణి నింకొకప్రాణి యీపృథ్విమీఁదనుండియే సంహరించుచున్నది. భూమిని విడిచినచోఁ బోవఁదగినతా వెచటనున్నది? ౬ ఈయంశము * గడములు, కోటలు, పురములు, పట్టణములు, నానాదేశాదిస్థానములు పర్యటనము గావించినచో విశదమగును. దేవతలు, దానవులు, మానవులు మున్నగు వారలందఱును బృథ్విమీదనే వసించుచున్నారు. ౭ నానారత్నములు, వజ్రములు, స్పర్శవేధి, నానావిధ ధాతువులు, ద్రవ్యములు మున్నగునవి పృథ్విలేకున్నచో గుప్తములు ప్రచురములు కాఁజాలవు. ౮ మేరుమందర హిమాలయాదులగు అష్టకులాచలములును, మఱియుఁ బక్షి మత్స్య సర్పాది జీవులును భూతలమునందే వసించుచున్నవి. ౯ నాలుగు దిశలను ఆవరణ జలముతో నిండిన నాలుగుసముద్రము లావరించి యున్నవి. వానికవ్వలి గట్టునఁగల భూమిపై నత్యద్భుతములగు మహాపర్వతములు పగిలియున్నవి. ౧౦ ఆశైలములయందుఁ

---

* గడములు, సింహగడము, రాయగడము మొదలగునవి. కోటలు అకలుకోట, రాజకోట మున్నగునవి. పాలెము, పల్లె, పాడు మున్నగుగ్రామనామముల కివి మహారాష్ట్రమునఁ బర్యాయపదములు.

జిన్నవి, పెద్దవియగు గుహ లపారముగా నున్నవి. ఆగుహలు నిబిడాంధకారబంధురములుగ నున్నవి. ౧౧ ఆవరణ జలపార మెవ్వఁడెఱుంగును? అద్భుతములు, మహత్తరములు నగు జలచరము లందు నిండియున్నవి. ౧౨ ఆజలమునకు వాయువాధారము. నిబిడమును, గాఢమునై పేరుకొన్న యాజలము ఏదిశనుండియు భేదింప వీలుగాదు. ౧౩ కఠినత్వరూపమగు నహంకారము ప్రభంజనకు ఆధారముగ నున్నది. ఈవిధముగ నున్న విచిత్రతరమగు భూగోళపుమేర నెవఁడు దాటగలఁడు? ౧౪ నానా పదార్థవంతములగు గనులు, ధాతురత్న కలితములగు స్థలములు, కల్పతరువు, చింతామణి, అమృత కుండము, నానాద్వీపములు, నానాఖండములు, పెక్కు నగరములు, మఱియు నానాప్రకారములగు జీవులు, ప్రత్యేక జీవిత వ్యతీతపద్ధతిలో నివసించు ఊషర క్షేత్రములు, ఆసముద్ర ప్రాంతములఁ గలవు ౧౫, ౧౬ మేరువునకుఁ జుట్టుప్రక్కలఁ బర్వతములు పగిలియున్నవి. అచట నద్భుతముగాఁ జీఁకటి వ్యాపించియున్నది. నానావిధములు, నిబిడములునగు వృక్షము లచట నెన్నియో గలవు. ౧౭ అచటనే లోకాలోకపర్వతము గలదు. అచట సూర్యుని చక్రము తిరుగుచుండును. చంద్రాద్రి, ద్రోణాద్రి, మైనాకము లను పేరులుగల మహాగిరులుసైత మచటనే యున్నవి; ౧౮ అనేక దేశజములగు నానాపాషాణభేదములు, నానావిధములగు వృత్తిభేదములు, నానాగుప్త నిధానములు విభూతులు, నానాఖనులు మున్నగునవియెల్ల నీభూమండలమునందె గలవు. ౧౯ వసుంధర బహురత్నమయి భూమికి సమానమగు పదార్థ మెద్దియు లేదు. నాలుగు దిశలను మేర లేక యీభూమండలము వ్యాపించియున్నది ౨౦ ఈసమస్త ధరణీతలమునందంతటను జరింపఁగలప్రాణి యెవ్వఁడు? ఈపృథ్వి కెద్దియుఁ దుల్యముగాదు. ౨౧ బహువిధములగు నిరుపమాన లతలు, నానావిధములగు సస్యాదులు ఈపృథ్విమీదనే యున్నవి. ౨౨ స్వర్గమర్త్య పాతాళములను నీమూఁడులోకములు సృష్టికర్తచే నత్యద్భుతముగ సృజింపఁబడెను. పాతాళలోకమునందు గొప్పగొప్ప నాగములు, సర్పములు వసించుచున్నవి. ౨౩ ఈవిశాలమగు భూమండలమే నానాలతలకును, బీజములకును గనియైయున్నది. కర్తయగు భగవానునికృత్యము మిగులఁ జిత్రమైనది. ౨౪ మనోహర దుర్గములు, కోటలు, బహువిధ

నగరములు, పురములు, పత్తనములు, మున్నగు నన్నిస్థానములందును జగదీశ్వరుఁడు వసించుచున్నాఁడు. ౨౫ ఎందఱో బలవంతులు జనించి గతించిరి. వారలీ పృథ్విపై మిగులఁ గ్రోధకర్మము లొనరించిరి. కాని వారలు తమశక్తి సామర్థ్యములచే నీపృథ్వికి వేఱుగ నుండలేకపోయిరి. ౨౬ ఈ పృథ్వి మిగుల విశాలమైనది. బహువిధ జాతులుగల జీవు లీభూమిపై వసియించుచున్నవి. భూమండలమునందలి యవతారములకు నానాభేదములు గలవు. ౨౭ ఈయంశము ప్రత్యక్షముగా నిపుడుసైతము కనిపించుచున్నది. అనుమానింపవలసిన యావశ్యకము లేదు. నానాప్రకారములగు జీవితము లీపృథ్వి యాధారముననే గడచుచున్నవి. ౨౮ ఈభూమి నాయదియని ఎందఱో యనుచుందురు. కాని యంత్యమునందు నాదియనువారె గతింతురు. పృథ్వీమాత్ర మనంతకాలము నుండి యథావిధముగ నున్నది. ౨౯ పృథ్వీమహిమ యిట్టిది. దీని కెద్దియును సాటిగాదు. బ్రహ్మాదిదేవతలు మొదలు మనుష్యులు దనుక నీభూమండలమే యాశ్రయస్థానముగా నున్నది.

నాలుగవ సమాసము.

జలస్తుతి.

ఇఁక నిపుడు సమస్తమునకు జన్మస్థానమును సమస్తజీవులకు, జీవనమును "ఆపోనారాయణస్వరూప" మనఁబడు నదియు నగు జలమును గూర్చి చెప్పెదను. ౧ పృథ్వి కావరణోదక మాధారము. సప్తసముద్రముల జలము, నానామేఘోదకము ఈపృథ్వియందుఁ బ్రవహించుచుండును. ౨ అనేక దేశములం దెన్నెన్నియో నదులు ప్రవహించి సముద్రముతోఁ గలియుచున్నవి. కొన్ని నదులు పెద్దవి. కొన్ని నదులు చిన్నవి. కొన్ని పవిత్రములు. వానిమహిమ యగాధము. ౩ నదులు పర్వతములనుండి బయలుదేరి నానాదరీకుహరములలోఁ బ్రవహించుచు హార్ హార్, ఖడ్ ఖడ్ యని ధ్వనిమొనర్చుచు నెంతయో దూరము బోవుచున్నవి. ౪ కూపములు, బావులు, నీటిబుగ్గలు, గొప్పతటాకములు, మున్నగు ననేక జలస్థానము లన్నిచోటులందును గలవు. వానిలో నిర్మలమగుజలము నిండియున్నది. ౫ తుంపురు లాకాశమునకు బల్లుముగా నెగయుచున్నవి. ఎన్నియో కాలువలు బారుచున్నవి. మఱియుఁ దనంత నీరు పైకుబుకు నీటిబుగ్గలనుండి జలము ప్రవహించుచున్నది. ౬ కొన్ని తావులఁ గూపములనుండియు నీరు వెల్లివిరియుచున్నది. పర్వతములను బగులగొట్టుకొని నీరు ప్రవహించుచున్నది. ఇట్లు భూమండలమునందు జలమున కనేక భేదములు గలవు. ౭ అనేక పర్వతములనుండి యెన్నియో జలధారలు శిలలను జీల్చుకొని బయలుదేరుచున్నవి. వానితో బుగ్గలు, నదులు, కాలువలుగూడ వెడలుచున్నవి. ౮ భూమండలమునందలి జలము నెంతని వర్ణింపగలను? నానావిధములగు తుంపురుల నెగఁజల్లు నీటిగొట్టములలోనికిఁగూడ నీటిని బంధించి కొని తెచ్చుచున్నారు. ౯ (జలాశయములు) మడుగులు, గుంటలు, గాబులు, గంగాళములు మున్నవానియందేగాక నానాగిరి కందరములయందుగూడ జలము నిండియున్నది. అనేకలోకములలో నానావిధములగు జలములుండును౧౦ ఒకదానికంటె నొకటి యెక్కుడుగఁ బవిత్రములగు పుణ్యతీర్థము లీపృథ్విపై నెన్నియో గలవు. శాస్త్రకారు లాయాతీర్థముల యగాధమహిమలను బ్రశంసించి యున్నారు. ౧౧ నానాతీర్థములలోని పుణ్యోదకములు, నానాస్థలములయందలి శీతలోదకములు, నానాక్షేత్రములయందలి ఉష్ణోదకములు ప్రతిస్థలమునందును గలవు. ౧౨ పలుతెఱంగులుగఁ గనుపించు తీఁగలలో జలమున్నది. పలుతెఱంగులుగ నున్న ఫలములందును కుసుమములందును జలమున్నది. ఇంతయేల! నానావిధములగు కందమూలములలో సైతము జలమున్నది. ఈజలములన్నియు గుణకారకములై యున్నవి. ౧౩ క్షారోదకము, సింధూదకము, విషోదకము, అమృతోదకము మున్నగు నుదకములు నానాస్థలములలో నానాగుణయుక్తములుగ నున్నవి. ౧౪ నానావిధములగు ఇక్షురసము, నానావిధములగు ఫలరసము, నానావిధములగు గోరసము, మదము, పాదరసము, గుడరసము మున్నగురసములన్నియు నుదకమే ౧౫ నానాముక్తాఫలము లందలి జలము నానారత్నములందు మెఱయుజలము, నానాశస్త్ర జలము మున్నగు జలములు నానాగుణయుక్తములుగ నుండును. ౧౬ వీర్యము, రక్తము, చీము, మూత్రము, స్వేదము మున్నగునవిగూడ ఉదకభేదములే. ఈ యంశము యోచించిచూచినచో బాగుగ విశదమగును. ౧౭ ఈదేహ

ముదకముతో నిండియున్నది. భూమండలముగూడ నుదకమయమే. చంద్రమండలము, సూర్యమండలము ఉదకముతో నిండియున్నవి. ౧౭ క్షారసముద్రము, క్షీరసముద్రము, సురసముద్రము, ఘృతసముద్రము, దధిసముద్రము, ఇక్షురససముద్రము, శుద్ధోదకసముద్రములుగూడ జలమయములే. ౧౮ ఇట్లు మొదటినుండి తుదిదనుక జలము వ్యాపించియున్నది. మఱియు మధ్యమునందు సైతము జలముగలదు. కొన్నితావుల గుప్తముగనున్నది. ౨౦ నీ రేబీజములందు మిశ్రితమగునో యాబీజముల స్వాదునే గ్రహించి ప్రసిద్ధమగును. చూడుఁడు. చెఱకులోనుండి రుచ్యమగురసము జలముగ్గైకొనుచున్నది. ౨౧ ఈ దేహ ముదకముచే నిర్మింపఁబడెను. నిరంతర మీదేహమునకు ఉదకమే గావలయును. ఉదకమునకు సంబంధించిన ఉత్పత్తివిస్తారములనెంతదనుక వివరింపఁగలను ౨౨ ఉదకము తారకము. ఉదకము మారకము. ఉదకము నానాసుఖదాయకము. విచారించి చూచినచో నది లోకాతీతమని (అలౌకికమని) విదితమగును. ౨౩ ఉదకము భూస్థలమునఁ బరుగులిడును. దానినుండి నానావిధములగు మహోహారధ్వనులు వెడలును. పెద్దపెద్దజలధారలు హాహార్, హాహార్ అనుధ్వనితోఁ బడుచుండును. ౨౪ ప్రతిస్థలమునందలి జలమును బరస్పరము గలిసికొని తటాకములలో నిండును. అంతియగాక నదులు, కాలువలు మర్మరధ్వనితోఁ బ్రవహించును. ౨౫ ఒకానొకచోట గుప్తగంగఁ బ్రవహించును. ఉదక మన్నితావులందును బ్రత్యక్షముగ నున్నది. ఒకానొకయెడ భూగర్భమున నున్న జలము ఘుట్ ఘుట్ అనుధ్వనితో బుగ్గలనుండి ప్రవహించును. ౨౬ భూగర్భమునందు బుగ్గ లెన్నియో గలవు. వానివృత్తాంతము విన్నవారుగాని, కన్నవారుగాని లేరు. కొన్ని తావులలోఁ బిడుగులుపడుటచే బుగ్గ లేర్పడెను. ౨౭ భూమినిండను, భూమిలోనను జలము నిండియున్నది. పృథ్వికిఁ బైభాగమునఁగూడ జలము వాయురూపముతో వ్యాపించియున్నది. ౨౮ స్వర్గమర్త్యపాతాళములలో నొక్కనది యున్నది. మేఘసముదాయము ఆకాశమునుండి జలము వర్షించుచుండును. ౨౯ పృథ్వికి మూలము జలమె. జలమునకుమూలము అగ్ని. అగ్నికిమూలము వాయువు. వాయువు భూతములలో మిగుల

గొప్పది. ౩౦ వాయువుకంటెను గొప్పవాఁడు పరమేశ్వరుఁడు. పరమేశ్వరునుండియే మహద్భూతవిచార ముత్పన్నమయ్యెను. పరమేశ్వరునికంటెను, అన్నింటికంటెను గొప్పవాఁడు పరాత్పరుఁడగు పరబ్రహ్మము. ౩౧

ఐదవసమాసము.

అగ్నిస్తుతి.

అగ్నిహోత్రునకు వందనములు. ఈతఁడు రఘునాథునకుఁ గన్యాదాత యగుమామ. అగ్నిదేవుఁడు విశ్వవ్యాపకుఁడు. విశ్వంభరుఁడు నైయున్నాఁడు. జానకీదేవి యగ్నిహోత్రుఁడు తండ్రి. ౧ భగవానుఁ డీయగ్నిముఖమునుండియే ఆహారమును గ్రహించును. ఋషులు కీతఁడే ఫలదాయకుఁడు. ఈ యగ్నిభట్టారకునివలననే అంధకారము, శీతము, రోగము వారించును. జగత్తులోని మానవులు నీయగ్నిహోత్రుఁడే భరించుచున్నాఁడు. మఱియుఁ బోషించుచున్నాఁడు. ౨ లోకములో నానావర్ణములు, నానాభేదములుగలవు కాని యగ్ని జీవమాత్రులకెల్లరకు సమానుఁడై యున్నాఁడు. బ్రహ్మాదులకుఁగూడ నాతఁడు భేదరహితుఁడుగఁ బరమశుద్ధుఁడుగ నున్నాఁడు. ౩ ఈసృష్టి యగ్నివలననే నడుచుచున్నది. అగ్నివలననే జను లన్నమును వండుచున్నారు. అగ్నివలననే చిన్నపెద్దలందఱును జీవించుచున్నారు. ౪ అగ్నిహోత్రుఁడే యీభూగుండలమును నివాసయోగ్యముగ సృజించెను. ప్రతిస్థలమునందును, దీపములు, దీపికలు నానావిధజ్వాలలు, అగ్నిహోత్రునివలననే యేర్పడెను ౫ గర్భమునందున్న జఠరాగ్నివలననే జనుల కాకలికలుగును. అగ్నివలననే భోజనమునందలి రుచి తెలియును ౬ అగ్నిసర్వాంగములందును వ్యాపించియున్నది. జనులందఱును ఉష్ణమువలననే జీవించుచున్నారు. ఉష్ణతలేకున్నచో జనులు మరణించుదురు ౭ అగ్నిమందమైనంతన ప్రాణులు మరణింతురను నంశము లోకులందఱెఱింగినదె ౮ అగ్నిబలమున్నచోఁ దత్కాలముననే శాస్త్రవాదములందు జయము లభించును. ఎంతదనుక నగ్నియుండునో అంతదనుకనే జీవితము ౯ నానావిధరసము లగ్నివలన నిర్మింపఁబడుచున్నవి. ఆరసములను బుచ్చుకొనుటచే మహారోగు లారోగ్యవంతు లగుచున్నారు ౧౦ సూర్యుఁ డన్నింటికంటెను గొప్పవాఁడు. కాని యగ్ని

దేవుని ప్రకాశమహిమ సూర్యప్రకాశముకంటె నధికమైనది. రాత్రు
లందు జను లగ్నిసహాయముగఁ గైకొనుట మనము ప్రత్యక్షముగఁ జూచు
చున్నారముగదా! ౧౧ శూద్రునియింటియగ్నిని దెచ్చికొనినను దోసము
లేదని పెద్దలు చెప్పిరి. అందఱిగృహములలోని యగ్నియుఁ బవిత్రమైనదె
౧౨ నానాయాగములు, అగ్నిహోత్రములు విధిపూర్వకముగ నగ్నివల
ననే జరుగుచున్నవి. అగ్ని తృప్తినొంది సుప్రసన్నుఁడగును ౧౩ దేవతలు
దానవులు, మానవులు అగ్నిసహాయముననే వర్తించుచున్నారు. అగ్ని
యందఱకును సహాయమైనది౧౪ గొప్పగొప్పవారలు వివాహము చేయు
తఱి నానాప్రకారములగు అగ్నికౌతుకులను (బాణసంచాకాల్చువారిని)
గొనిపోవుదురు. అగ్నిక్రీడలవలననే మహోత్సవములకు శోభవచ్చును.
౧౫ రోగు లుష్ణౌషధములను సేవించి యగ్నివలన సౌఖ్యములు
బడయుదురు ౧౬ బ్రాహ్మణులకు ముఖ్యులగు పూజనీయులు సూర్య
భగవానుఁడు, హుతాశనుఁడే. ఇందు సందియము లేదు. ౧౭ జనులలో
జఠరానలముగలదు. సాగరమునందు బడబానలము గలదు. భూగోళమునకు
నలుదిక్కులందును ఆవరణానల మున్నది. శివునినేత్రమునందును విద్యు
ల్లతలయందును అగ్నికలదు. ౧౮ కాంస్యపాత్రమునుండియు ఆగ్నేయ
దర్పణమునుండియుఁ గట్టెలను ఒరయుటవలనను చెకముకిరాతినుండియు
అగ్నిజనించును ౧౯ అగ్ని యున్నితావులను గలదు. కఠినముగ రాపిడియొ
నర్చినచో అగ్నిజనించును. అగ్నిసర్పములవలన గిరికందరములుగూడ
భస్మమగును. ౨౦ అగ్నితో నెన్నియో ఉపాయములు గావించుచున్నా
రు. అంతియగాక బహువిధములగు హానులుసైతము కలుగును. వివేకము
లేనిచో అంతయు నిరర్థకము ౨౧ భూమండలమునందలి పిన్నపెద్దలంద
ఱకును అగ్నియే యాధారము. పరమేశ్వరుఁ డగ్నిముఖముననే సంతుష్టి
నొందును. ౨౨ అగ్నిహోత్రుని మహత్త్వమిట్టిది. దీని నెంతదనుక
వర్ణించినను అసమగ్రమె. అగ్నిపురుషునిమహిమ లోతునకుదిగినకొలఁది
అగాధముగా నుండును. ౨౩ అగ్ని జీవితకాలమున సుఖమునొసంగును.
చనిపోయినపిదప శవమును భస్మమొనరించును. అది సర్వభక్షకము. దా
నిఘనత నెంతదనుక వర్ణింపగలము? ౨౪ సమస్తసృష్టిని ప్రళయకాలము
నం దగ్ని సంహరించును. అగ్నిహోత్రునిబారిని బడిన పదార్థమేదియు

దక్కదు. ౨౫ అనేకు లనేకవిధముల హోమమొనర్తురు. ఇంటింటను
బలియు, వైశ్వదేవము జరుగుచుండును. క్షేత్రములలో దేవతావిగ్రహ
ములముందు దీపముల వెలిగింతురు. ౨౬ దీపారాధనముతో, నీరాజనము
తో భక్తులు భగవంతునకు హారతులిత్తురు. కాఁగుచున్నగంగాళములోని
చమురునందు చేయియుంచి జనులు సత్యాసత్యములు వెల్లడింతురు. ౨౭ అ
ష్టధాప్రకృతి, ముల్లోకములు, మున్నగువాన్నియన్నింటియందును అగ్నివ్యా
ప్తమైయున్నది. అగ్నిదేవుని యగాధమహిమ నెంతదనుక వర్ణింపఁగలను?
౨౮ అగ్నికి నాలుగు శృంగములు, మూఁడుపాదములు, రెండుతలలు,
ఏడుచేతులు ఉన్నవని శాస్త్రములందుఁ జెప్పఁబడినది. ఇది యనుభవము
లేకే చెప్పఁబడినదా ? ౨౯ ఉష్ణమూర్తియగు నగ్నిదేవుని నేను యథా
మతిని వర్ణించితిని. న్యూనాధిక్యములకు శ్రోతలు క్షమింపఁగోరెదను. ౩౦

ఆఱవ సమాసము.

వాయు స్తుతి.

వాయుదేవున కనేకవందనములు. వాయుదేవుని స్వభావము
మిగులఁ జిత్రమైనది. వాయువువలననే జగమునందు సమస్తజీవులు వర్తిం
చుచున్నారు. ౧ శ్వాసోచ్ఛ్వాసములు వాయువువలననే జరుగుచున్నవి.
నానావిద్యలు వాయువు వల్లనే అభ్యసింపఁబడుచున్నవి. శరీరములందు
జలనము (చేతనము) వాయువువలననే కలుగుచున్నది. ౨ చలనము,
వలనము, ప్రసారణము, నిరోధనము, అకుంచనములు. ప్రాణము, అపా
నము, వ్యానము, ఉదానము, సమానములు, నాగకూర్మ కృకర దేవదత్త
ధనంజయములు మున్నగునవి వాయువునకుఁగల స్వభావభేదములు. ౩,
౪ తొలుత వాయువు బ్రహ్మాండమునఁ బ్రకటమయ్యెను. తరువాత
బ్రహ్మాండమునందును దేవతలయందును నిండి నానాగుణములనొంది
పిండమునందుఁ బ్రకటమయ్యెను. ౫ స్వర్గమునందలి దేవతలందఱును,
పురుషార్థులగు దానవులును, మర్త్యలోకములోని మానవులును, విఖ్యా
తులగు రాజులును ఇట్టివేయగు నరదేహభేదములును, అనంత
ప్రకారములగు శ్వాపదములును, వనచర, జల చరాదులును వాయు
వువలననే ఆనందముగాఁ గ్రీడించుట తటస్థించినది. ౬, ౭

వానియన్నిటియందును గాలి యాడుచున్నది. పక్షులన్నియు వాయువువలననే యెగురుచున్నవి అగ్నిజ్వాలలు వాయువువలననే హెచ్చుచున్నవి. ౮ ఆకాశమునందున్న మేఘములనన్నింటిని వాయు వొకతావునకుఁ జేర్చుచున్నది. మఱలఁ దత్క్షణమె వేఱువేఱుగావించి తొలంగఁద్రోయుచున్నది. వాయువుతో సమానమగు కార్యదక్షతగలది వేఱొండు లేదు. ౯ వాయువు ఆత్మయొక్క సత్త. అది దేహమునందు వర్తించుచున్నది. వ్యాపకత్వమున వాయువునకు సమానమైనది ప్రపంచమున లేదు. ౧౦ వాయువు బలమువలననే పర్వతములమీఁదనుండి దట్టమగు మేఘసైన్యము లోకహితార్థమై యుదయించుచున్నది. మఱియు వాయుబలముననే ఉరుము లురిమి పిడుగులు పడుచున్నవి. ౧౧ ఈ బ్రహ్మాండమునందుఁ జంద్రుఁడు సూర్యుఁడు నక్షత్రమాల గ్రహమండలము మేఘమాల, నానాకళలు వాయువువలననే నెలకొని యున్నవి. ౧౨ ఎన్నియో కలిసియున్న పదార్థము లొక్కటిగ నున్నచో విభజింప వీలు చిక్కదు. అట్లే పంచభౌతికపరిణామముగూడ భేదింప నవకాశము గలుగదు. ౧౩ వాయువు సరసర వీచుచుండును. వడగండ్లు పడుచుండును. మఱియు వర్షమువెంట నెన్నియో జీవములు పడుచుండును. ౧౪ వాయురూపమగు కమలకళయే జలమున కాధారము. జలాధారమువలననే శేషువు భూమండలము ధరించియున్నాఁడు. ౧౫ శేషుని కాహారము వాయువు. వాయుభోజనముచే దేహముబ్బియున్నప్పుడు భూమండలము నాతఁడు తనపై ధరించుచున్నాఁడు. ౧౬ మహాకూర్మదేహము బొరగిలఁబడిన బ్రహ్మాండమువలె నుండును. దీనివలన మహాకూర్మదేహ మెంతగొప్పదో తెలిసికొనవచ్చును. అదిగూడ వాయుసంయోగముననే నిల్చియున్నది. ౧౭ భూమండలమును ఆదివరాహము తనకోఱపై ధరించెను. ఆశక్తి వాయుకారణముననే దానికి లభించెను. ౧౮ బ్రహ్మవిష్ణుమహేశ్వరులు జగదీశ్వరుఁడుగూడ వాయుస్వరూపములయందె యున్నారు. ఈవిచారమును వివేకులే యెఱుంగుదురు. ౧౯ ముప్పదిమూఁడుకోటుల దేవతలు, ఎనుబదినాలుగువేలఋషులు, అసంఖ్యాకులగు సిద్ధయోగులు మున్నగువారలందఱును వాయువువలననే నిలిచియున్నారు ౨౦ తొమ్మిదికోటుల కాత్యాయనీదేవతలు, ఏఁబదియాఱుకోటుల చాముండీశక్తులు, మూఁడున్నరకోటుల భూత

గణము వాయురూపముననే యున్నవి ౨౧ భూతములు, దైవతములు, నానాశక్తుల వ్యక్తివిశేషములు వాయురూపములే. మఱియు భూమండలమునందలి నానావిధజీవులు వాయువువలన నెన్నికలుగుచున్నవో యెవ్వరెఱుంగుదురు? ౨౨ వాయువు పిండబ్రహ్మాండములలో నిండియున్నది. బ్రహ్మాండమునకు వెలుపలఁగూడ నది వ్యాపించియున్నది. సామర్థ్యవంతమగు నీవాయువు అన్నితావులందును బరిపూర్ణముగా నున్నది ౨౩ వాయువు మిగుల సమర్థమైనది. తనతనువును, మనమును రఘునాథస్వామిశరణమునందు మగ్నమొనరించిన హనుమంతుఁ డీవాయుదేవుని పుత్రుఁడే ౨౪ హనుమంతుఁడు వాయుదేవునకుఁ బ్రసిద్ధకుమారుఁడు. తండ్రికుమారులలో భేదము లేదు. ఈయుభయుల పురుషార్థములును సమముగా నున్నవి ౨౫ హనుమంతునిఁ బ్రాణనాథుఁ డందురు. వాయుకారణముననే యాతఁడు సమర్థుఁ డయ్యెను. వాయువులేనిచో నంతయు వ్యర్థమే. ౨౬ పూర్వకాలమున హనుమంతునకు మృత్యు వాసన్నమయ్యెను. వాయు వపుడు రుద్ధమయ్యెను. అందుచే దేవతలందఱికిఁ బ్రాణాంతకావస్థ గలిగెను ౨౭ దేవత లందఱును గలిసి వాయుదేవుని స్తుతింపఁగా వాయుదేవుఁడు ప్రసన్నుఁడై యందఱను రక్షించెను ౨౮ మహాప్రతాపశాలియగు హనుమంతుఁ డీశ్వరావతారము. దేవగణ మాతని బురుషార్థమును జూచుచుండును. ౨౯ దేవతలు కారాగృహమున నిర్బంధింపఁబడుట హనుమంతుఁడు ఆకస్మికముగఁ జూచి లంకకుఁ జుట్టుప్రక్కల సంహారక్రీడ విజృంభింపఁజేసి రాక్షసులకు దుర్దశ గలిగించెను ౩౦ దేవతలకుఁ బ్రతికారము రాక్షసులనుండి గైకొనెను. రాక్షసకులమును మూలమట్టముగా నాశనమొనరించెను. ఆపుచ్ఛకేతుని లీలలు మిగుల నాశ్చర్యకరములుగ నుండును. ౩౧ రావణుఁడు సింహాసనము నధిష్ఠించియున్నపుడు అచటికేగి హనుమంతుఁడు నిందించెను. లంకకుఁ బోవునపు డాతనిని సముద్రముసైత మాటంకపఱుపలేక పోయెను ౩౨ దేవతలకు ఆంజనేయుఁ డాధారమయ్యెను. ఆతని మహాపరాక్రమమును గాంచి దేవతలు రఘునాథుని స్తుతించిరి. ౩౩ సమస్తదైత్యులను హనుమంతుఁడు సంహార మొనర్చెను. తత్కాలముననే దేవతల నుద్ధరించెను. త్రిలోకములందలి ప్రాణివర్గము ఇందుచే సుఖమొందెను ౩౪.

ఏడవసమాసము.

మహద్భూతనిరూపణము.

పృథ్వికి మూలము జలము. జలమునకు మూలము అగ్ని. అగ్నికి మూలము వాయువు. ఈ విషయమునగు వర్ణన మింతకుము న్నొనర్చితిని. ౧ ఇపుడు పవనమునకు మూలమును, అన్నింటియం దత్యంతచంచలముగ వర్తించునదియు నగు అంతరాత్మవర్ణనము నాలింపుఁడు. ౨ అంతరాత్మ వచ్చుచున్నపుడు గోచరింపదు. ఒకచో స్థిరముగాఁ గూర్చుండియుండదు. దానిస్వరూప మిట్లుండునని వేదశ్రుతులుసైతము అనుమానింపలేకున్నవి. ౩ బ్రహ్మమునందుఁ దొలుత గలుగుస్ఫురణమే అంతరాత్మలక్షణము. అదియే జగదీశ్వరుఁడు. త్రిగుణములు దానివలననే కలిగెను. ౪ త్రిగుణములనుండి పంచభూతము లేర్పడెను. పిదప నవి సృష్టిరూపముతో విస్తృతమయ్యెను. వివేకముతో నాభూతముల స్వరూపమెఱుంగవలెను. ౫ ఈ పంచభూతములలో ముఖ్యమైన దాకాశము. ఇది తక్కిన నాలుగుభూతములకంటెను శ్రేష్ఠమైనది. దీనిప్రకాశముననే అన్నియుఁ బ్రకాశించుచున్నవి. ౬ విష్ణువే యొకమహద్భూతము. ఇదియే భూతముల రహస్యము. కాని యీయంశము ననుభవములోనికిఁ దేవలెను. ౭ ఈ భూతములవివరము విస్తరించి వివరించితిని. ఈభూతములయం దెయ్యది వ్యాప్తమైయున్నదో యది విచారపూర్వకముగఁ జూచినయెడల ననుమానములోనికి వచ్చును. ౮ ఆత్మకుఁగల చపలత్వముముందుఁ బాపము వాయు వెంతటిది. ఆత్మచాపల్యము ప్రత్యక్షముగ విచారించి చూడవలెను. ౯ ఆత్మలేనిది కార్యము నడువదు. ఆత్మ కనుపింపదు. దొరుకదు. అది గుప్తరూపముతో నానావిచారములఁ దిలకించును. ౧౦ ఆత్మ పిండబ్రహ్మాండములందు వ్యాప్తమైయున్నది. నానావిధదేహములలో విరాజిల్లుచున్నది. అది జగత్తులోని సకలప్రాణుల యంతఃకరణములందును నున్నది. ఈయంశము వివేకశాలురగుజనులంద ఱెఱుంగుదురు. ౧౧ ఆత్మ లేకుండ దేహము వర్తించుటయనునది కల్పాంతమునందేని జరుగదు. ఆత్మయోగముననే అష్టధాప్రకృతి యొక్కవ్యక్తులు రూపమునొందెను. ౧౨ ఆదిమొదలు అంత్యముదనుక సమస్తము నాత్మయే చేయుచున్నది. ఆత్మకుఁ బిదప నిర్వికారమగు పరబ్రహ్మమున్నది ౧౩ ఆత్మ శరీరమునందు వర్తించుచు ఇంద్రియగణమునకుఁ జేష్టలొసంగుచున్నది. దేహరూపమగు నుపాధితో నదిసుఖదుఃఖసంబంధములగు నానాభోగముల ననుభవించుచున్నది. ౧౪ ఈబ్రహ్మాండము సప్తకంచకము. దానిలో మఱల సప్తకంచకము పిండము. ఆపిండమునందలి యాత్మను దృఢమగు వివేకముతో గురుతెఱుంగవలెను. ౧౫ ఆత్మ శబ్దమునువిని తెలిసికొనుచున్నది. తెలిసికొని ప్రత్యుత్తరమొసంగుచున్నది. మఱియు చర్మముతో డ్సాటుచేఁ గఠిన, మృదు, శీతోష్ణములను గ్రహించుచున్నది. ౧౬ అదినేత్రములలో నిండి పదార్థమును గాంచుచున్నది. నానాపదార్థములఁ బరీక్షించుచున్నది. మనస్సులోని ఉచ్చనీచములను దెలిసికొనుచున్నది. ౧౭ ఆత్మ క్రూరదృష్టి, సౌమ్యదృష్టి, కృపాదృష్టి మొదలగు నానావిధదృష్టిభేదములను దెలిసికొనుచున్నది. ౧౮ అది జిహ్వలోని నానావిధ రుచులను గ్రహించి వాని భేదాభేదములను విమర్శింప నేర్చియున్నది. ౧౯ ఉత్తమభోజనములపరిమళము, నానాసుగంధవస్తువులపరిమళము, నానాఫలముల పరిమళము, ఆత్మఘ్రాణేంద్రియసహాయమునఁ దెలిసికొనుచున్నది ౨౦ జిహ్వతో రుచినెఱుంగుటయు, మాటలాడుటయు, హస్తేంద్రియములతో నిచ్చిపుచ్చుకొనుటయుఁ, బాదేంద్రియములతో వచ్చుట పోవుటయు ఇంక నిట్టి యితరక్రియలు నిరంతర మాత్మయే చేయుచుండును. ౨౧ శిశ్నేంద్రియముతో సురతభోగము, గుదేంద్రియముతో మలోత్సర్జనము, మనస్సుతో సమస్త కల్పనము, ఆత్మయే గావించుచున్నది. ౨౨ ఆత్మ యీత్రిలోకములయందును నీవిధముగా ననేకవ్యాపారములను ఒంటరిగనే యొనర్చుచున్నది. దాని గొప్పతనము నెవరు వివరింపఁగలరు ! ౨౩ దానిమహిమను అదిదక్క నితరులు ప్రశంసింపలేరు. ఆత్మవంటి వ్యాపారము, విస్తారము, ఇంతకుమున్ను గాలేదు. ఇఁకముందుఁ గాబోదు. ౨౪ పదునాలుగు విద్యలు, అఱువదినాలుగు కళలు- చతురత్వమునకు సంబంధించిన నానాకళలు, వేదశాస్త్ర పురాణములు, అంతఃకరణము ఆత్మయందుఁదక్క నెక్కడనున్నవి ? ౨౫ ఈలోకపు ఆచారము, పరలోకపు సారాచార విచారము, ఉభయలోకముల నిర్ధారణము ఆత్మయే చేయుచున్నది. ౨౬ నానామతములు, నానావిధసంవాద వివాదములు, నానానిశ్చయములు, ఆత్మయే చేయుచున్నది. ౨౭ ముఖ్యతత్వ మంతటను వ్యాపించియున్నది. అది సమస్త

పదార్థములకును స్వరూపమొసంగినది. ఆత్మసంయోగముచే నంతయు సార్థకమైనది. ౨౮ వ్రాయుట, చదువుట, వర్ణించుట, అడుగుట, వివరించుట, అర్థము నెఱుంగుట, పాడుట, వాయించుట, ఆడుట ఆత్మవలననే జరుగుచున్నవి. ౨౯ ఆత్మ నానాసుఖములతో నానందించుచున్నది. నానాదుఃఖములతో దుఃఖించుచున్నది. నానావిధములగు దేహములను ధరించుచున్నది. విసర్జించుచున్నది. ౩౦ ఆత్మయొక్కటియే నానాదేహములనుధరించి (యొక్కటియే) నానాప్రకారముల నటించుచున్నది. నటనాట్యములు, కలాకౌశలములు ఆత్మలేకున్నచో జరుగఁజాలవు. ౩౧ ఆత్మ యొంటిరిగనేయుండి బహురూపియగుచున్నది. అది పలుతెఱంగుల మహోద్యోగిగను, మహాప్రతాపిగను వలరారుచున్నది. మఱియుఁ బిఱికిగఁగూడ నగుచున్నది. ౩౨ ఆత్మ యొక్కటియేగదా! ఎట్లు విస్తృతమైనది? అది బహువిధములగు వినోదములు గావించుచున్నది. దాంపత్యములేకయే యది సర్వత్ర యెట్లు వ్యాపించినదో చూడరాదా ౩౩ స్త్రీలకుఁ బురుషుఁడును, బురుషునకు స్త్రీయును గావలయును. ఇట్లు పరస్పరముగఁ గలిసికొందురేని వారల కానందముగలుగును. ౩౪ స్థూలము (పదార్థభేదము) నకు మూలము (కారణము) లింగము (స్త్రీలింగపుంలింగాదులు) గుఱుతులుగ నుండి [illegible] గలవు. ఈవిధముగనే మనుజులకు [illegible] గలుగుచున్నవి. ౩౫ లింగభేదము నానావిధ పురుషజీవుఁడు జీవుఁడనియు, స్త్రీజీవి జీవియనియును నుడువబడి జంజాటము కలుగుచున్నది. ఈ సూక్ష్మ నాటకము (మోసము) తెలిసికొనవలయును. ౩౬ స్థూల యోగమువలన భేదము తెలియుచున్నది. కాని వాస్తవమునకు సూక్ష్మమునం దంతయు నభేదమే. ఈవాక్యము నిశ్చితము, అనుభవయుక్తము నని విశ్వసింపఁదగును. ౩౭ స్త్రీ స్త్రీతోడ సంభోగించుట యెప్పుడును జరిగియుండలేదు. స్త్రీ తన యంతఃకరణమునందుఁ బురుషుని గోరుచుండును. ౩౮ స్త్రీకిఁ బురుషుఁడును, బురుషునకు స్త్రీయును గావలయును. ఈసంబంధ మిట్టిది. ఇది సూక్ష్మమునందుఁ గూడఁ గలదు. ౩౯ పురుషునిభావమందుఁ బ్రకృతియుఁ, బ్రకృతిభావమునందుఁ బురుషుఁడు నుందురు. కావుననే వానిని "ప్రకృతిపురుషులని" యందురు. ౪౦ పిండమునందు బ్రహ్మాండమును

విచారింపవలెను. ప్రతీతిని బ్రాప్తింపఁ జేసికొనవలెను. ఒకవేళఁ దెలియకున్నచో మాటమాటికి విచారించి తెలిసికొనవలెను. ౪౧ ద్వైతేచ్ఛ మొదటినుండియు నుండెను. కాననే యది భూమండలములోనికి వచ్చినది. భూమండలమును ఆదిస్థానమును (మూలమాయను) మిళితముగావించి చూడవలెను. ౪౨ ఇప్పటికొక మహత్కార్యము నెరవేరినది. ఏమన? శ్రోతలయాక్షేపణము నివారణమైనది. అంతియగాక ప్రకృతి పురుషుల రూపముగూడ నిశ్చయమైనది. ౪౩

ఎనిమిదవ సమాసము.

ఆత్మారామనిరూపణము.

గణపతీ! నీయనుగ్రహమువలననే హృదయమునకు బలము కలుగుచున్నది. కాన నీమంగళమూర్తికి వందనములు. జనులు ఆత్మనే భజించుచు ఆత్మనే స్తుతించుచున్నారు. (ఆత్మవలన మతిస్ఫూర్తి కలుగుచున్నది. అట్లే గణపతివలనఁగూడఁ గలుగుచున్నది. కావున గణపతియే ఆత్మ) ౧ తల్లీ సరస్వతీదేవీ! నీవు అంతఃకరణమునకుఁ బ్రకాశమును బ్రసాదించుచున్నావు. నానావిధములగు విద్యలను బూర్ణరూపముతో నీవె వివరణము గావించుచున్నావు. నీవు జగదీశ్వరివి, నైష్కర్మ్యరూపవు. నిన్నాశ్రయించెదను. ౨ రామనామము శ్రేష్ఠమైనది. శంకరుని శ్రీరామనామస్మరణమువలననే కష్టము లోకమునకుఁ దొలంగి విశ్రాంతిలభించెను. ౩ రామనామము మిగుల సత్యమైనది. ఆపరాత్పరుని, పరమేశ్వరుని, త్రైలోక్యధారుని నామము రానురాను మహత్త్వము నొందుచున్నది ౪ ఆత్మారాముఁడు నలుదిక్కులను నిండియున్నాఁడు. ఆతనివలననే జనులు ఇటునటు తిరుగుచున్నారు. ఆత్మలేనియెడల దేహము పడిపోవును. మరణించును. ౫ ఆజీవాత్మ, విశ్వాత్మ, పరమాత్మ, జగదాత్మ, శివాత్మ, గుప్తాత్మ, ఆత్మ, అంతరాత్మ, సూక్ష్మాత్మ యనునామములతో దేవదానవమానవజాతులం దంతటను నిండియున్నది ౬ ఆత్మయోగమున నెల్లరు నడచుచు, మాటలాడుచు వ్యవహరించుచున్నారు. అవతారములాత్మయోగముననే కలుగుచున్నవి. బ్రహ్మాదిదేవతలుగూడ ఆత్మయోగమువలననే జననమరణము

లొందుచున్నారు ౭ దానిని నాదరూపమనియు, జ్యోతీరూపమనియు, సాక్షిరూపమనియు, సత్తారూపమనియు, చైతన్యరూపమనియు, సత్స్వరూపమనియు, ద్రష్టృరూపమనియు నెఱుంగనగును ౮ అది నరోత్తమము, వీరోత్తమము, పురుషోత్తమము, రఘూత్తమము, సర్వోత్తమము ఉత్తమోత్తమము, త్రైలోక్యవాసియునై యున్నది. ౯ నానావిధములగు కోలాహలములు, కలహములు ఆత్మవలననే జరుగుచుండును. ఆత్మ లేని పక్షమున నలుదిశలును ప్రపంచమును జడరమై శూన్యమై పోఁగలదు. ౧౦ ఆత్మ లేనియెడల శరీరము వ్యర్థము. ఆత్మలేనిశరీరము మృతినొందును. ఆత్మలేని శరీరమును ప్రత్యక్షప్రేతముగనే భావింపనగును. ౧౧ ఆత్మజ్ఞాని యీవిషయము తన మనస్సున గ్రహించును. అతఁడు మనుష్యమాత్రులందు ఆత్మవ్యాప్తిని దిలకించుచున్నాఁడు. ఆత్మలేనియెడల భువనములు త్రిభువనములు పాడువడును. ౧౨ ఆత్మయోగముననే పురుషుఁడు పరమ సుందరుఁడు చతురుఁడునునై సారాసారముల నన్నింటిని దెలిసికొనుచున్నాఁడు. ఆత్మలేనిచో ఇహలోకము, పరలోకము అంధకార బంధురమని గ్రహింపుఁడు ౧౩ సమస్తవిధసిద్ధులు, సావధానములు, నానా భేదములు, ఆనందములు, మున్నగునవియెల్ల ఆత్మవలననే కలుగుచున్నవి. ౧౪ అల్పునైనఁ గానిమ్ము. బ్రహ్మాండదేవతలనైనగానిమ్ము. అందఱిని నడుపునది ఆత్మయొక్కటియే. నిత్యానిత్యవివేచన మందఱును నొనరింపవలెను ౧౫ పద్మినీజాతి స్త్రీయైనఁ గానిమ్ము. ఆత్మ దేహమునం దున్నంతవఱకు మాత్రమె పురుషుఁడు ఆపద్మినీజాతిస్త్రీని ప్రేమించును. ఆత్మ వెడలిపోయినపిదప దేహమునఁ దేజ మెక్కడనుండును? ఆత్మతోఁబాటుగ దేహసౌందర్యముగూడ వెడలిపోవును ౧౬ ఆత్మ కనిపింపదు. భాసింపదు, ఇతరు లదియున్నదనిగాని లేదనిగాని యనుమానించుటకుఁగూడ వీలులేదు. మనస్సంబంధములగు నానావిధకల్పనలన్నియును ఆత్మయోగమువలననే కలుగును ౧౭ ఆత్మశరీరమునం దుండును. అది సమస్త బ్రహ్మాండముయొక్క సంపూర్ణవివరణ మొనరించును. నానావిధవాసనలను, భావనలను ఎంతదనుక వివరింపశక్యమగును? ౧౮ మనోవృత్తు లనంతములు. అనంతములగుప్రాణులు అనంతప్రకారములగు కల్పనము లొనరించుచుండును. వాని యంతఃకరణములనెంతదనుక వర్ణింపఁగలను? ౧౯ అనంతవిధములగు రాజనీతి యుక్తులను బన్నుటయు, కుబుద్ధితోఁగాని సుబుద్ధితోఁగాని వివరించుటయు, మర్మము తెలియనీయకుండుటయు, ప్రాణిమాత్రుల మఱపించుటయు, ఆత్మయోగముననే యగుచున్నది ౨౦ ఒకఁడు రెండవవానిని వంచింపఁ బొంచియుండును. ఒకఁడు రెండవవానికై మరణించును. దాఁగికొనును. ఇట్లె నలుయుగములను శత్రుత్వస్థితిగతులు వర్తించుచున్నవి ౨౧ పృథ్వియందలి జనులు ఒకఁడు రెండవవానిని బరస్పరము బంధించుచున్నాఁడు. ఎందఱో భక్తు లొకరికొక రుపకారములు గావించుకొనుచున్నారు ౨౨ ఆత్మ యొకటియేగాని భేదములనంతములు. అన్నియు దేహానుసారముగా స్వాదువును గ్రహించును. వాస్తవమున కాత్మకుభేదము లేదు. కానియది భేదమునుగూడ ధారణ మొనర్చుచున్నది ౨౩ పురుషునకు స్త్రీయును, స్త్రీకిఁ బురుషుఁడును గావలయును. స్త్రీకి స్త్రీయావశ్యకమగుట యెప్పుడును జరుగఁజాలదు. ౨౪ పురుషుని యాత్మను జీవుఁడనియు, స్త్రీయొక్క ఆత్మను జీవియనియు నుడువవలసినయవస్థ యాత్మకు లేదు. విషయసుఖములకు సంబంధించినగోల గలతావుననే యిట్టిభేదమున కవకాశము గలదు. ౨౫ ఏప్రాణి కెయ్యది యాహారమో దాని నాప్రాణి కోరుచుండును. పశువులు తినుగడ్డిగాదములను మనుజుఁడు భుజింపఁడు ౨౬ ఆహారదేహాదులయందు జీవులకిట్లు గుప్తము, ప్రకటనము లగుభేదములుగలవో యట్లు ఆనందమునందుఁ గూడ భేదము గలదు ౨౭ సముద్రమునందును భూగర్భమునందును గలజలములో సైతము ప్రాణులు గలవు. ఆ వరణోదకమునందుఁగల జలచరములు మిగులఁబెద్దవి. ౨౮ సూక్ష్మదృష్టితో విచారించిచూచినచో శరీరముల కంతము దొరుకనేరదని విశదమగును. ఈస్థితిలో అంతరాత్మ యెట్లనుమానములోనికి రాఁగలదు? ౨౯ దేహముయొక్కయు ఆత్మయొక్కయు, సంయోగమును విచారించినచో ఆత్మనుగుఱించి కొంతకొంత యనుమానములోనికి వచ్చును ౩౦ ఈ కల్లోలమును సవరించుటకు నానావిధములగు నిరూపణము లొనర్పఁబడినవి. అంతరాత్మ కృపతో అనేకముఖములతోఁ దత్త్వమును వివరించినది ౩౧.

తొమ్మిదవ సమాసము

ఉ పా స న ని రూ ప ణ ము.

(ప్రశ్న) భూమిలో బహువిధమానవులున్నారు. వారలకు నానావిధములగు ఉపాసనలుగూడ నున్నవి. ప్రతిస్థలమునందును మానవులు తమ తమభావముల ననుసరించి భజనమునందు మగ్నమైయున్నారు. ౧ మానవుఁడు తన దేవతల భజించుచు, నానా స్తవములు స్తుతులు నొనర్చును. కాని యెవఁడైనఁ గానిమ్ము. తన యుపాసనము నిర్గుణమనియే చెప్పును. ౨ దీని యభిప్రాయమును మాకు వివరింపుఁడు, (ఉత్తరము) ఓరీ ! ఇది స్తుతి యొక్క స్వభావము సుమా ! ౩ నిర్గుణ మనుదానికి బహుగుణమని యర్థముగలదు. బహుగుణి యంతరాత్మ. సర్వమును ఆయంతరాత్మ యంశలే. ఇది కేవలసత్యము. ప్రతీతిని గావించుకొనుఁడు. ౪ సమస్త జనులను అభిమానించిన మానవుఁ డంతరాత్మను బ్రాప్తించును. కాని అధికారమునుజూచియే యభిమానింపవలయును. ౫ (ప్రశ్న) ఇది యుక్తి యుక్తముగా లేదు. మూలమునందు నీరుపోసినచో నది అన్నియాకులకు లభించును. ఇది ప్రత్యక్షానుభవ విషయము. ౬ (ఉత్తరము) తులసిచెట్టుపై నొక చెంబెడునీరు పోసినయెడలఁ బైన నొకక్షణమాత్రమేని నిలువక భూమిలోనికి దిగిపోవును. ౭ (ప్రశ్న) పెద్దవృక్షముపై నెట్లు నీరు పోయఁగలము ? చివరకొమ్మలపైకిఁ బాత్రము జలముగొని యెట్లుపోవగలము ? దేవా ! ఈవిషయమును సవిస్తరముగాఁ దెలుపుఁడు. ౮ (ఉత్తరము) వర్షముచేవలనఁ బడుజలమంతయుఁ జెట్టుపైనుండక మూలమునకుఁజేరును. వృక్షాగ్రమున నీరు బోయుదమన్న చేయియే యందదు. ఏమిచేయనగును ? ౯ అందఱికిని మూలము లభింపఁదగినంత పుణ్యమెట్లు సమకూడును ? వివేకమువలన సాధువుల హృదయ మంతదనుకఁ జేరును. ౧౦ వృక్షముమీఁద బోయునీరు మూలమునకుఁ జేరునట్లు సమస్తజగత్తునకు సేవఁ గావించినచోఁ బరమాత్మునకుఁ బ్రాప్తించును. ౧౧

(ప్రశ్న) గురువర్యా ! వెనుకటి శంక నివారణమయ్యెను. ఇఁక సగుణమును నిర్గుణమని యెట్లు చెప్పనగునో వివరింపఁగోరెదము. ౧౨ ఏలయన! చంచలము,వికారయుక్తము నైయున్నదెల్ల సగుణము. తక్కినది గుణాతీతము అనఁగా నిర్గుణము. ౧౩ (ఉత్తరము) ఈ విషయము

నెఱుంగవలయునన్న సారాసారముల విచారింపవలయును. అంతఃకరణమునందు నిర్ధారణమైనపిదప మఱల నామముగూడ నుండదు. ౧౪ రాజునకు సమానుఁడగు నొక వివేకశాలియగు పురుషుఁడుండె ననుకొనుము. రెండవవాఁడు (నామమాత్రమునకు) రాజు అను పేరుగల సేవకుఁడు గలఁడని యనుకొనుము. ఈయిర్వురి తారతమ్యము నిపుడు విచారింపుఁడు. వివాదము గావించుట వ్యర్థము ౧౫ కల్పాంతప్రళయమునందు నాశనమొందక నిలిచియుండుదానినే నిర్గుణమందురు. మిగిలినదంతయు మాయలోనికి చేరును ౧౬ సేనయందును, బట్టణమునందును, అంగడివీధియందును, నానావిధయాత్రలందును అపారమగు ధ్వనికలుగుచుండును. ఆధ్వని నెట్లు వేఱుచేయఁగలము? ౧౭ వర్షర్తువు నందు సరిగ నర్ధరాత్రమున నానావిధజీవు ల ఱ చు చు ం డు ను. వా ని య న్ని ం టి శబ్దముల వేఱువేఱుగా నెట్లెఱుంగ వీలగును? ౧౮ భూమండలమునందసంఖ్యాకములు, నానావిధములు నగు దేశములు, భాషలు, మతములు గలవు. ఎంతో ఋషులు గలరు. ఋషినిర్మితములగు మతములుగూడ నెన్నియో గలవు. వానినన్నిఁటి నెట్లెఱుంగనగును? ౧౯ వానగురిసినపిదప నేలపై నెన్నియో మొలకలు మొలుచును. చిన్నవిగఁ బెద్దవిగనుండి నానావిధముల నున్న యామొక్కల నెట్లు వేఱువేఱు గావింపనగును? ౨౦ ఖేచరములు, భూచరములు, జలచరములు, మున్నగు జీవముల దేహములు నానావర్ణయుక్తములై చిత్రవిచిత్రములుగా నుండును. వానినన్నింటి నెట్లెఱుంగనగును? ౨౧ దృశ్యమెట్లుప్రకటనమయ్యెను? నానావిధములచే నెట్లువికృతమయ్యెను? అనంతర మేవిధముగా వ్యాపించియున్నది? ఇవియన్నియు నెట్లెఱుంగనగును ? ౨౨ ఆకాశమునందు గంధర్వ నగరములు గలవు. అందు నానావర్ణములుగల పెద్దచిన్నవ్యక్తులు లెక్కకు మించినన్ని బహువిధముల నలరారుచున్నవి. వాని నెఱుంగుట యెట్లు ? ౨౩ రాత్రి, పగలు, వెన్నెల చీకటి, విచారము అవిచారము, నెట్లెఱుంగనగును ? ౨౪ స్మరణ, విస్మరణములయొక్కయు వ్యస్తత, అవ్యస్తతలయొక్కయు, బ్రతీతి అనుమానములయొక్కయు స్థితి సైత మిట్టిదె ! ౨౫ వివేకములేనిచో న్యాయాన్యాయములు, యుక్తాయుక్తములు, మున్నగునవియెల్ల నెట్లెఱుంగనగును? ౨౬ కార్యకర్తను

వ్యర్థుని, శూరుని పిఱికిపందను, ధర్మిని అధర్మిని, తెలిసికొనవలెను. ౨౭ ధనాఢ్యుని దరిద్రుని, వర్తకుని దొంగను, సత్యమును అసత్యమును తెలిసికొనవలెను. ౨౮ శ్రేష్ఠుని కనిష్ఠుని, భ్రష్టుని అంతర్నిష్ఠుని, సారాసారవిచారమును స్పష్టముగాఁ దెలిసికొనవలయును. ౨౯

పదియవ సమాసము.

త్రి గు ణ ము లు – పం చ భూ త ము లు.

పంచభూతములచే నీజగత్తు నడుచుచున్నది. ఇదియంతయుఁ బంచభూతవ్యాపకమే. పంచభూతములు వెడలిపోయిన పిదప నుండునది యెద్ది ? ౧ (ప్రశ్న) భూతములమహిమ నింతగొప్పగాఁ జెప్పితిరి. కాని త్రిగుణము లెచ్చట జనించినవి ? దయచేసి తెలుపుఁడు ? ౨ (ఉత్తరము) అంతరాత్మ ఐదవభూతము. త్రిగుణములు దానికంగభూతములు. ఈవిషయమును సావధానచిత్తముతో విచారింపుము. ౩ జరిగిపోయిన దానినెల్ల భూతమందురు. ఆ జరిగిపోయిన దానియందే త్రిగుణములుగూడ వచ్చిపోయెను. ఇంతటితో సంశయమూలము తెగిపోవును. ౪ భూతములకంటె భిన్నమైన దెద్దియు లేదు. సమస్తమును భూతములవలననే యుత్పన్నమయ్యెను. ఒకటిలేనిచో మఱియొకటి యెప్పుడును కాఁజాలదు. ౫ ఆత్మవలనఁ బవనము, పవనమువలన అగ్ని, అగ్నివలనజలము కలుగునని చెప్పుదురు. ౬ జలమంతయు సూర్యకిరణముల వేడిచేఁ బేరుకొన్నపిదప అగ్నివాయుసంయోగమువలన భూమండలమేర్పడెను. ౭ అగ్నియు, వాయువు, సూర్యుఁడు లేకున్నయెడల నీప్రపంచము మిగులఁ జల్లగనుండెడిది. కాని శీతలత్వమునందుఁగూడ నుష్ణత్వముండును. ౮ ఈవిచిత్రమయు ప్రపంచమును బరమాత్ముఁడు సృజించెను. సంపూర్ణ దేహధారులందఱిని నాతఁడే సృజించెను. ౯ ఒకవేళ నీలోకమంతయు శీతలముగనున్నచో సమస్తప్రాణులు చనిపోయియుందురు. లేక యంతయుఁ నుష్ణముగానున్ననుగూడ లోకమంతయు మాడిపోయెడిది. ౧౦ భూమండలము సూర్యకిరణములవలన నేర్పడినపిదప నింకను గొన్నియుపాయములు భగవానుఁడొనరించెను. ౧౧ వర్షరుతువు నేర్పఱిచెను. దానివలన నుష్ణముగనున్న భూమండలము చల్లఁబడెను. పిమ్మటఁ

గొంచెముష్ణము, గొంచెముశీతలమునగు శీతకాలమును నిర్మించెను. ౧౨ శీతకాలమున జనులు కష్టములొందుచుందురనియు వృక్షాదు లెండిపోవుననియు భగవంతుఁ డుష్ణకాలమును నిర్మించెను. ౧౩ ఆయుష్ణకాలమునఁ గూడఁ బ్రాతఃకాలమును, మధ్యాహ్నకాలమును, సాయంకాలమును నేర్పఱిచి శీతము, ఉష్ణము నిర్మించెను. ౧౪ ఈవిధముగ భగవంతుఁ డొకదానివెంట నొకటి సృజించెను. క్రమముగ నన్నింటికి నియమబంధము లేర్పడెను. ఈ నియమ బంధములవలననే ప్రాణిమాత్రుల జీవితము స్థిరపడెను. ౧౫ నానావిధములు, కఠినములు నగురోగములు ప్రాణులను బీడించుచుండుటఁజూచి భగవంతుఁడు ఓషధుల సృజించెను. (ఇదియంతయు జరిగెను) ఇఁక సృష్టివివరణము నెఱుంగవలసియున్నది. ౧౬ రక్తరేతస్సులే దేహమూలములు. ఆజలముతోనే దంతములేర్పడెను. ఇట్లే భూమండలమునఁగల నానారత్నములుగూడ నేర్పడెను ౧౭ అన్నింటికిని మూలము జలమేయని గ్రహింపుఁడు. జలమువలననే యీజంజాటములన్నియు నడుచుచున్నవి. జలములేకపోయినచో నంతయు శూన్యమేయని భావింపుము. జలమే లేనిచోఁ బ్రాణిలోక మెచ్చటినుండి గలుగును? ౧౮ ముక్తాఫలములు, శుక్రగ్రహమువలెఁ బ్రకాశించువజ్రములు, మాణిక్యములు, ఇంద్రనీలములు, మొదలగునవియెల్ల జలమువలననే కలిగెను. ౧౯ దేని మహిమ వర్ణింప సాధ్యమగును? అంతయు మిశ్రణమయ్యెను. వేఱువేఱుగ నెట్లుగావింపఁగలము? ౨౦ హృదయమున వివేకముగలుగుటకై యేదియో కొంచెము చెప్పితిని. వివేకపురుషులు సర్వమును గ్రహింపఁగలుగుదురు. ౨౧ అన్నింటిని గ్రహింపఁగల్గుట యసంభవము. శాస్త్రములకుఁ బరస్పరముగ ఐక్యము కుదురదు. అనుమానముచే నేదియు నిశ్చయము కాదు. ౨౨ భగవంతుని గుణము లగాధములు, శేషుఁడుసైతము తన నోటితో భగవన్మహిమలను వర్ణింపఁజాలఁడు. పరమాత్ముఁడు లేని వేదవిధినిగూడ నవశ్యముగనే భావింపుఁడు ౨౩ ఆత్మారాముఁ డందఱిని బాలించుచున్నాఁడు. ఆతఁడీసమస్తత్రిలోకములను నిర్వహించుచున్నాఁడు. ఆతఁడొక్కఁడు లేనిచో నీలోకమంతయు మట్టిలోఁ గలిసిపోవును ౨౪ ఆత్మారాముఁడు లేనితావున నేదియు నుండఁజాలదు. ఆపరమాత్ముఁడె లేనిచోఁ ద్రిలోకములందలి సమస్తప్రాణులును మృతతుల్యములు,

౨౫ ఆత్మ లేకపోయినచో మరణము గలుగును. ఆత్మలేకున్నచో నెవఁడు జీవింపఁగలఁడు? ఈయంశమును అంతఃకరణమునందుఁ జక్కఁగా వివేచింపవలయును. ౨౬ ఆత్మలేకున్నచో వివేకపూర్వకముగాఁ దెలిసికొనుటగూడ జరుగదు. అందఱును జగదీశ్వరుని భజింపవలయును. ౨౭ ఉపాసన ప్రకటనమగుటవలననే యీవిచారము విదితమయ్యెను. కావునఁ బరమాత్మని నుపాసనము గావింపవలెను. ౨౮ ఉపాసన మానవునకు గొప్ప ఆశ్రయము. ఉపాసన లేకున్నచోఁ గార్యము నడునదు. ఉపాసనమును మాని యెన్ని యుపాయములనైనఁ గావింపనిమ్ము. అవి సఫలములుగావు. ౨౯ సమర్థుని యాశ్రయము గడింపనివాని నెవఁడైన నులిమివేయును. కావున లేచినపుడు, కూర్చుండి యున్నప్పుడు నిరంతరము భగవంతుని భజించుచుండవలెను. ౩౦ భజనము, సాధనము, అభ్యాసమువలననే పరలోకము లభించును. ఈయంశమునందు విశ్వాసముంచవలయునని రామదాసు నుడువుచున్నాఁడు. ౩౧

పదునేడవదశకము.

మొదటి సమాసము.

అంతరాత్మసేవ.

నిశ్చల బ్రహ్మమునందుఁ జంచలమగు ఆత్మయున్నది. అన్నింటి కంటెను నావలనున్న పరమాత్ముఁడే చైతన్యుఁడును, సాక్షియు, జ్ఞానాత్ముఁడును, షడ్గుణేశ్వరుఁడును నైయున్నాఁడు. ౧ అతఁడే సర్వజగత్తుల కీశ్వరుఁడు. కావనే జగదీశ్వరుఁడని యాతని నందురు. ఆతనివలననే యీ సృష్టివిస్తారమంతయు నేర్పడెను. ౨ శివశక్తి, జగదీశ్వరి, ప్రకృతిపురుషుఁడు, పరమేశ్వరి, మూలమాయ, గుణేశ్వరి, గుణక్షోభిణి, ౩ క్షేత్రజ్ఞుఁడు, ద్రష్ట, కూటస్థుఁడు, సాక్షి, అంతరాత్మ, సర్వద్రష్ట, శుద్ధసత్త్వము, మహత్తత్త్వము, పరీక్షించువాఁడు, జీవేశ్వరుఁడు, సాధువు ఆజగదీశ్వరుఁడె యైయున్నాఁడు. ౪ బ్రహ్మవిష్ణుమహేశ్వరులు, నానాపిండములలోని జీవేశ్వరుఁడు, ఇంకను జిన్నవియుఁ బెద్దవియునగు ప్రాణిమాత్రులును నాజగదీశ్వరుని భాసింపఁ జేయుచున్నవి. ౫ అంతరాత్మ దేహరూపమగు దేవాలయమునఁ గూర్చుండి యున్నాఁడు. భజనముగావింపనిచో దేహమును దండించును. కావనే భయవశమున నాయంతరాత్మను భజించుచున్నారు. ౬ సమయమునకు భజనము గావింపని వానిని ఆసమయమున భగవానుఁడు త్రోసివేయును. కావనే సమస్తజనులాతని భజించుచున్నారు. ౭ అంతరాత్మ యెప్పు డేవిషయము నపేక్షించునో యపుడె జనులు దాని నొసంగుచున్నారు. ఇట్లె జనులందఱు అంతరాత్మను భజించుచున్నారు. ౮ పంచవిషయిక నైవేద్యములు అంతరాత్మ కెపుడువలయునో యపుడె యమర్పవలయును. అట్లు గావింపనిచో నాక్షణముననే రోగములు కలుగును. ౯ నైవేద్యము సకాలమున లభింపకున్నచో నంతరాత్మయుండడు. అతఁడు బహువిధభాగ్యములు వైభవములను బదార్థములను విడిచివెళ్ళిపోవును. ౧౦ వచ్చెడిసమయమునం దితఁడు (అంతరాత్మ) ఎవరికైనఁ దెలియనీయఁడు. ఎవరికిని యీ జాడపోడలు తెలియవు. అతఁడు (అంతరాత్మ) దక్క నెవ్వరు నాతనిగూర్చి యనుమానింపఁ జాలరు. ౧౧ దేవునిగాంచుటకు దేవాలయమును వెదకవలయును. ఎచటనైన నొకచోట దేవాలయ గుణమున దేవుఁడు ప్రకటనమగును. ౧౨ ఈ నానాదేహములే దేవాలయములు. వీనియందే జీవేశ్వరుఁడు నివసించుచున్నాఁడు. నానావిధదేహములు గలవు. వానిలో భేదము లనంతములుగ నున్నవి. ౧౩ ఈనడుమచుఁ, దిరుగుచు నున్న దేవాలయములలో దేవుఁడు నివసించుచుండును. ఎన్ని దేవాలయములు గలవో వానినన్నింటి నెఱుంగవలయును. ౧౪ మత్స్యము, కూర్మము, బహుకాలము భూమండలము ధరించిన వరాహము మొదలగు ననేక కరాళ వికరాళనిర్మలదేవాలయము లెన్నియొ గలిగి నశించినవి ౧౫ అనేకదేవాలయములలో నాతఁడు సుఖించుచున్నాఁడు. సముద్రమువలె నాతఁడు సుఖముచే నిండి పూర్ణుఁడగుచున్నాఁడు. కాని యీసుఖమెల్లకాల ముండదు. సుఖ మశాశ్వతము (అతఁడు సుఖముతో లిప్తుఁడుకాఁడు) ౧౬ అగాధకృత్యముల నొనరించు నా యశాశ్వతశిరోమణి కనుపింపకున్న నేమి? వాస్తమునకు ధనియనియూ

ధనాఢ్యుఁడనియు నాతనినే ప్రశంసింతురు. ౧౭ ఆదేవునియెడ లక్ష్య ముంచినచో అభేదత్వము కలుగును. ఆతనికి విముఖుఁడుగనున్నచో భేదము కలుగును. ౧౮ అన్నింటికి నాతఁడు మూలమెగాని కాన్పింపఁడు. భవ్యుఁడును, భారవహుఁడును నైయుండియు నాతఁడు భాసింపఁడు. ఒకక్షణమాత్రమేని యొకతావున నుండఁడు. ౧౯ ఆపరమాత్ముని స్థితి యిట్లగాధముగనున్నది. ఆతనిమహిమ లెవ్వరెఱుంగఁదురు? ఓ సర్వోత్తమా! నీ లీలలను నీవేయెఱుంగుదువు. ౨౦ నిత్యానిత్యవివేకశాలియగు పురుషుని జన్మమే సార్థకము. ఇట్టి పురుషుఁడు ఇహలోక పరలోకములను రెంటిని సాధింపఁగలఁడు. ౨౧ మననశీలుఁడగు జనులకడఁ బరమాత్ముఁ డఖండరీతిగఁ జెదరక యుండును. విచారించిచూచినచో ఇట్టిపురుషుల పూర్వసంచితపుణ్య మనుపమానమని విదితమగును. ౨౨ (పరమాత్ముని కిట్టి పురుషులతో) అఖండ (సం) యోగము గలిగియుండును. కావనే వారల యోగు లందురు. (పరమాత్ముని కెవనితో సం) యోగము లేకుండునో వాఁడు వియోగి (దుఃఖి). కాని వియోగికూడ యోగబలమువలన యోగియగును. ౨౩ జ్ఞానులగువారలు జనులను సన్మార్గమునందుఁ బ్రవేశపెట్టుదురు. వారలమహిమ యట్టిది. ఈఁతనేర్చినవాఁ డెనుటనున్నచో మునిఁగిపోనున్న వాని నుద్ధరించుట కర్తవ్య ధర్మమని తలంచును. ౨౩ స్థూలసూక్ష్మతత్త్వవివరణ మెఱింగి పిండ బ్రహ్మాండముల స్వరూపము గ్రహించి అనుభవముగడించిన పురుషులు భూమండలమున మిగుల నరుదుగనున్నారు. ౨౫ అఖండవివరణముతో వేదాంతపంచీకరణమును దెలిసికొనవలెను. మహావాక్యముల తో సంతఃకరణరహస్యము గ్రహింపవలెను. ౨౬ పృథ్వియందలి వివేకశాలుర పరిచయము ధన్యత్వము గలిగించును. వారల యుపదేశముల నాలించి ప్రాణిమాత్రులు సద్గతి నొందుదురు. ౨౭ సత్సంగము, సచ్ఛాస్త్రశ్రవణవివరణము తెంపులేనట్లు జరుగుతావున సత్సంగపరోపకారములకు సంబంధించిన ఉత్తమగుణములు లభించును. ౨౮ సత్క్రియాయుతుఁడగు పురుషుఁడు పరమేశ్వరాంశసంభూతుఁడు. ధర్మసంస్థాపనమునకు వలయు నుత్సాహము వారలయందే కనిపించును. ౨౯ సారాసారవిచారము

శ్రేష్ఠమైనది. దానివలన జగ ముద్ధరింపఁబడును. సంగత్యాగమువలన నెందఱో పురుషు లనన్యులైరి. ౩౦

రెండవ సమాసము.

శివశక్తి నిరూపణము.

బ్రహ్మము ఆకాశమువలె నిర్మలము, నిశ్చలము నైయున్నది. అది నిరాకారమును, కేవలమును నిర్వికారమును నైయున్నది. ౧ దాని కంతమే లేదు. అనంతమును శాశ్వతమును సదోదితము నైయున్నది. అది యశాంతమైనది కాదు. నిరంతరము శాంతముగ నుండును. ౨ పరబ్రహ్మ మవినాశి. అది ఆకాశమువలె వ్యాప్తముగ నున్నది. విఱుగదు. తెగదు, పగులదు, నిరంతరము యథావిధముగ నున్నది. ౩ పరబ్రహ్మమునందు జ్ఞానము లేదు. అజ్ఞానము లేదు. స్మరణము లేదు విస్మరణము లేదు. అది యఖండమును, నిర్గుణమును, నిరావలంబనము నైయున్నది ౪ అచట చంద్రుఁడు, సూర్యుఁడు, అగ్ని, చీఁకటి, వెలుతురు మున్నగునవి యెవ్వియును లేవు. ఉపాధికంటె వేఱుగ నొక్క నిరుపాధి బ్రహ్మమేయున్నదిగి నిశ్చలమునందు జాగరూకమగు స్మరణమును చైతన్యమందురు. గుణములసమానత్వకారణమున దానిని గుణసామ్యమందురు. ౬ ఆకాశమునందు మేఘచ్ఛాయవచ్చువిధముననే (పరబ్రహ్మమునందు) మూలమాయయున్నది. (ఆకాశమునందు మేఘముల రాకపోకలకెట్టుల నాలస్యముకలుగదో అట్లే) మూలమాయయొక్క ఉద్భవలయముల కాలస్యము పట్టదు ౭ నిర్గుణమునందు గల గుణవికారమే షడ్గుణైశ్వర్యుఁడు, దాని నర్ధనారీనటేశ్వరుఁ డందురు. ౮ మఱియు ఆదిశక్తియనియు, శివశక్తియనికూడ దానినే చెప్పుదురు. అన్నిఁటికి నదియే మూలశక్తి. నానావ్యక్తులు దానివలననే నిర్మాణమయ్యెను. ౯ శుద్ధసత్త్వమును, రజస్తమములును దానివలననే యుత్పత్తియయ్యెను. వీనిని మహత్త్వము లనియు, గుణక్షోభినియనియు మాయయనియు నందురు. ౧౦ మూలమునందు వ్యక్తియే లేనపుడచటికి శివశక్తి యెక్కడనుండి రాఁగలదు? అని యీయంశమున నొకసంశయము గలుగవచ్చును. సావధానులరై యీశంకకు సమాధానము వినుండు. ౧౧ బ్రహ్మాండము మొదలు పిండముదనుకను, పిండమునుండి బ్రహ్మాండము

దనుకను విచారమొనర్చినయెడల నీయంశమున నిశ్చయము తెలియును.
౧౨ విత్తును బగులగొట్టిచూచినచో దానియందు ఫలము గన్పింపదు.
విత్తునుండి వృక్షము వృద్ధినొందినపిమ్మట నావృక్షమునం దనేకఫలములు
గలుగును. ౧౩ ఫలమును బగులఁగొట్టినచో దానియందు విత్తులుగాన్పిం
చును. పిండబ్రహ్మాండములస్థితి సైత మిట్టిదియే. ౧౪ పిండమునందు నర
నారీభేదములు రెండును స్పష్టముగా నున్నవి. మూలమందే యీభేదము
లేకున్నచో ననంతర మెట్లు స్పష్టముకాఁగలఁదు? (నరనారీభేదములు రెం
డును మూలమాయయందే (ప్రకృతి పురుషరూపమున నున్నవి.) ౧౫
నానా బీజరూపములుగ నున్న బీజములయం దేమియుండదు? అంతయు
నుండును. కాని సూక్ష్మరూపముతో నుండును. ఇందువలననే భేద మొ
క్కమాఱుగ భాసించుట లేదు. ౧౬ స్థూలమునకు మూలము వాసన.
ఆవాసన తొలుత కనిపింపదు. స్థూలము లేకున్నచో నేవిషయముననేని
యనుమానము కలుగఁజాలదు. ౧౭ కల్పనమువలన సృష్టియేర్పడెనని
వేదశాస్త్రములు వాకొనుచున్నవి. కాని కల్పనము కనిపించుట లేదు.
ఇంతమాత్రమున దానిని మిథ్యయని చెప్పఁగూడదు. ౧౮ ఒక్కొక్క
జన్మ మొక్కొక్కతెఱవలె నడ్డుపడియున్నప్పుడు (ఎన్నిజన్మము లిదివఱ
కులభించెనో అన్నితెఱ లడ్డుపడినప్పుడు) సత్యవిచార మెట్లు విశదమగును?
నిశ్చితవిషయములు అట్లె గూఢములుగ నుండును. గూఢత్వమే నిశ్చయ
మునకుఁ దావు. ౧౯ పురుషులందును స్త్రీలయందును వసించు జీవులంద
ఱునొక్కటియే. కాని దేహస్వభావములు వేఱువేఱుగనుండును. ౨౦
కావుననే స్త్రీకి స్త్రీవలన నావశ్యకము లేదు. పిండమువలన బ్రహ్మాండ
బీజమును నిశ్చయింపవలెను. ౨౧ స్త్రీహృదయము పురుషునిమీఁదికిని
పురుషుని హృదయము స్త్రీమీఁదికిని బ్రసరించును. మూలమునుండియే
యీవాసనాస్థితి వచ్చుచున్నది. ౨౨ ఆదినుండి వాసన అభేదముగ
నున్నది. దేహసంబంధమున నది భేదమొందుచున్నది. దేహసంబంధము
విడిపోవఁగనే భేదముగూడ విడిపోవును. ౨౩ నరనారీమూలము శివశక్తి
యం దున్నది. జన్మములను గైకొనుటవలన నీవిషయము చక్కఁగ విశద
మగుచున్నది. ౨౪ నానావిధములగు ప్రేమవాసన లొకరివి వేఱొకరికి
తెలియవు. తీక్ష్ణమగు దృష్టివలనఁ గొంచెముగ ననుమానముమాత్రము

కలుగును. ౨౫ బాలకుని వానితల్లి పాలించుచున్నది. పోషించుచున్నది.
పురుషునివలన నీపని కాఁజాలదు. వనితవలననే ఉపాధి వృద్ధినొందుచున్న
ది. ౨౬ (తల్లికి బాలుని పోషించుటయందు) రోత, శ్రమ, అలసత,
విసుగుదల కలుగదు. తల్లికిఁదప్ప (బాలునిపై) ఇంతమోహ మిత
రుల కుండదు. ౨౭ నానావిధములగు ఉపాధుల వృద్ధినొం
దించుటయు, నానావిధమోహములతో శిశువును వశపరచుకొనుటయు
నామె యెఱుంగును. నానావిధములగు ప్రాపంచక ప్రీతుల ననుసంధింపఁ
జేయుటనుగూడ నామెయే యెఱుంగును. ౨౮ పురుషునకు స్త్రీయెడ వి
శ్వాస ముదయించును. స్త్రీకిఁ బురుషునియెడ నానంద ముదయించును.
ఉభయులను బరస్పరవాసనలు బంధించివైచినవి. ౨౯ ఈశ్వరుఁ డొకగొప్ప
జాలమును నిర్మించెను. దానిలో మనుజులు చిక్కుకొందురు. ఎవరికంటుకొ
నినను వదలించుకొనవీలుగాని జిగటను నిర్మించెను. ౩౦ స్త్రీపురుషుల కీవి
ధముగాఁ బరస్పరము మహాప్రీతి కలుగుచున్నది. ప్రీతి సనాతనముగ (మూల
మాయవలన) ఆదినుండియే వచ్చుచున్నది. ఇది వివేకముతోఁ బ్రత్యక్ష
ముగాఁ జూడవలెను. ౩౧ ఆదియందు సూక్ష్మ ముత్పన్నమయ్యెను. పిమ్మ
ట నాసూక్ష్మము స్పష్టమైకాన్పించెను. ఈరెంటివలన నుత్పత్తికార్యము
నడుచుచున్నది. ౩౨ వాస్తవమునకు శివశక్తియే మూలమునందుండెను.
తరువాత వధూవరులైరి. పిదప నెనుబదినాలుగులక్షల యోనివిస్తారము
లుగ వ్యాపించిరి. ౩౩ ఇచ్చటఁ బ్రత్యక్షముగఁ జూపిన శివశక్తిరూపమును
శ్రోతలు హృదయములోనికిఁ దెచ్చుకొనవలెను. విచారము లేకుండ నుడి
వినవాక్యము వ్యర్థమని గ్రహింపనగును. ౩౪

మూఁడవసమాసము.

అధ్యాత్మశ్రవణము.

ఆగుమాగుము! వినుమువినుము! తొలుదొలుతనే గ్రంథమును
విడిచివేయకుము. చెప్పినదానిని సావధానముగా నాలింపుము. ౧ అన్ని
శ్రవణములలో ముఖ్యమైనది ఈ అధ్యాత్మనిరూపణశ్రవణము. కావున
ఈవిషయమును సుచిత్తాంతఃకరణమున విచారింపవలయును. ౨ శ్రవణ
మననములను విచారించినచో నిదిధ్యాసముచే నిశ్చయముగ మోక్షము

సాక్షాత్కారమగును. అదిగుణరూపమున నుండదు. గుణమను పేరునే యెత్తుకొనకుము. ౩ నానావిధములగు రత్నములఁ బరీక్షించునపుడును బదార్థములను దూచునపుడును ఉత్తమమగు బంగారమును వెండినిగలుగు నపుడును సావధానముగ నుండవలయును. ౪ నానావిధములగు నాణెములను లెక్కించునపుడును నానాప్రకారములగు పరీక్షల నొనర్చునపుడును, వివేకశాలితో మాటముచ్చటలు గావించునపుడును, మనుజుడు సావధానిగ నుండవలయును. ౫ ఎట్లనగా లభాహార (శివపూజావిశేషము) యందు ధాన్యమును ఏరిఏరి పూజించినయెడల దేవతతృప్తినొందును. ఒక ప్రక్కనుండి మంచివి, చెడ్డవి పాటింపకపూజించినచో దేవతకమాన్యతకలుగును. అది తనహృదయమున క్షోభించును. ౬ ఎవ్వడైన నేకాంతమునందు సూక్ష్మాంశమును యోచింపవలసి వచ్చినచో మిగులజాగరూకతయుఁ దెలివియుఁ గలిగియుండవలెను. అధ్యాత్మవిచారణమునం దంతకుఁ గోటిరెట్లు అధికముగా సావధానత గలిగియుండవలెను. ౭ అధ్యాత్మవిద్య మిగులఁ గఠినమైనది. అదివృత్తాంతములు, కథలు, వార్తలు, నాటకములు, గొప్పవగునవతారచరిత్రములకంటెను మిగుల గాఢస్య మైనది ౮ గతించినవిషయముల (కథలను) వినుటవలనఁ జేతికేమిలభించును ? పుణ్యప్రాప్తియగునని కొందఱందురు. కాని యది యేమియు గనుపించుటలేదు. ౯ అధ్యాత్మ నిరూపణస్థితి యట్టిదికాదు. దీనివిచారము ప్రతీతిపూర్ణము. దీనినెఱుంగుటవలన సందేహములు నశించును. ౧౦ అనేకులు మహానుభావులు జనించి మరణించిరి. వారలందఱు ఆత్మమూలముననే వర్తించిరికాని ఆత్మ మహిమను దెలిసికొనఁదగినవా డింతవఱకు జనింపలేదు. ౧౧ యుగానుయుగములనుండి ఈత్రిలోకములను ఆత్మయొక్కటియే నడుపుచున్నది. కావున ఆత్మవిచారమును మాటిమాటి కొనర్పవలయును. ౧౨ ప్రాణు లనేకములు జనించుచున్నవి. అనేకములు మరణించుచున్నవి. తమతమ కార్యములను ఇష్టానుసారముగా వర్తించుకొనుచున్నవి. ౧౩ దేనియందలి యాత్మ యఖండరూపముగఁ బ్రకాశింపకున్నదో యా దేహము వ్యర్థమే . పాపము ! ఆత్మవిచారములేని కష్టదేహము ఏమి ఎఱుంగఁగలదు? ౧౪ ఇట్టి యాత్మజ్ఞానియే శ్రేష్ఠుఁడు. ఆతనికి సమానుఁ డెవ్వఁడును లేఁడు లోకములోని వివేకవంతులే యీయంశము

నెఱుంగుదురు. ౧౫ పృథ్వి వ్యాప స్తేజముల విచార మీభూమియందే లభించును. కాని యన్నితత్త్వములకును బీజమగు అంతరాత్మ వేఱుగ నున్నది. ౧౬ వాయువునకు ముందుఁగూడ వివేకము గావించు పురుషునకు ఆత్మ సమీపముననే లభించును. ౧౭ క్రమముగా సూక్ష్మరూపమునుండి వాయువు, ఆకాశము, గుణమాయ, ప్రకృతి పురుషులు, మూలమాయ, మున్నగువానిని విచారమొనరించి ప్రతీతిని గడించుట మిగులఁ గఠినము. ౧౮ మాయాదేవి జంజాటమునందుఁ దగుల్కొనిన పిదప నెవ్వఁడు సూక్ష్మమునందు మనస్సు లగ్నముచేయగలఁడు? సూక్ష్మమునందు మనస్సు లగ్నము గావించువానికి సందేహవృత్తి నశించును. ౧౯ మూలమాయ (బ్రహ్మాండమునకు) నాలుగవదేహము. విదేహుఁడు కావలెను. విదేహుఁడు (దేహాతీతుఁడు)అగు సాధువే ధన్యుఁడు. ౨౦ సారమువలన ఉన్నతస్థానమున కెక్కువారికి ఊర్ధ్వగతి లభించును. (మోక్షము లభించును) పదార్థమునందే పడియుండువారల కధోగతి కలుగును. ౨౧ పదార్థములు చూచుటకు మిగుల యోగ్యములుగా నుండును. కాని యవి క్షణమాత్రముననే నాశన మొందుచుండును. ఈకారణమున జనులు రెండువిధములను భ్రష్టులగుచున్నారు. ౨౨ కావునఁ బదార్థజ్ఞానము, మఱియు నానావిధానుమానము మున్నగువాని నన్నింటిని దొలంగి నిరంజన(పరబ్రహ్మ)మును శోధించుచుండవలెను. ౨౩ అష్టాంగయోగమును, పిండజ్ఞానమును, అంతకంటెను గొప్పదగు తత్త్వజ్ఞానమును, దానికంటెను బెద్దదియగు ఆత్మజ్ఞానమును విచారింపవలెను. ౨౪ మూలమాయ కావలితావును మూలమునందు (ఆదిలో) హరిసంకల్పము (అహం బ్రహ్మాస్మిఅను దాని స్ఫురణము) కలుగు ప్రదేశమును నేదియో యటకు ఉపాసనయోగముతోఁ జేరవలెను. ౨౫ దానికావల నిఖిలమును, నిర్గుణమును నగు బ్రహ్మముగలదు. అది నిర్మలముగను, నిశ్చలముగ నున్నది. దాని నాకాశముతోఁ బోల్పవచ్చును. ౨౬ అది యిచ్చటనుండి యచ్చటివఱకు నిండియున్నది. అంతియగాదు. ప్రాణిమాత్రులతోఁ గలిసియున్నది. పదార్థముల నంటియున్నది. అన్నింటియందును వ్యాప్తమైయున్నది. ౨౭ దీనికి సమానమగు గొప్పది వేఱొకటిలేదు. దానివిచారము పిండబ్రహ్మాండములు సంహారమైన పిదప విదితమగును,

అది యంత సూక్ష్మాతి సూక్ష్మముగ నున్నది. ఈ పిండబ్రహ్మాండము లున్నను ఒకవేళ వివేక ప్రళయమును జూచినపక్షమున నైనను వాస్తవములో శాశ్వత మెద్దియను సంశయము విదితము గాఁగలదు. ౨౯ సమస్త తత్త్వములను వివేచించి, సారాసార విచారమొనరించి పిదప సావధానముననుసరించి సుఖపూర్వకముగా గ్రంథమును విడిచివేసిన యెడల హాని యేదియు నుండదు సుమా. ౩౦

నాలుగవ సమాసము.

సంశయము నశింపఁజేయుము.

పలువురి కుపకరించు నుపయోగమును దెలుపుమని ప్రార్థించినచో వక్త శ్రోతను కలఁతబెట్టఁజనదు. మఱియుఁ జెప్పుచుఁజెప్పుచుఁ గ్రమమును విడువఁదగదు. ౧ శ్రోత యేదేని సందియమును దొలంగింపుమని కోరినచో దానిని వెంటనే నివారింపవలయును. తానునుడివిన మాటవలనఁ దనమాటయే ఖండనమగునట్లు భాషింపఁజనదు. ౨ ముందు జెప్పఁబోవుదానిపయి ధ్యానముంచుటవలన వెనుకఁజెప్పిన విషయము (అసంపూర్ణముగ) దిగఁబడునట్లు భాషింపఁదగదు. అంతియగాదు. వెనుకఁ జెప్పినయంశముపై ధ్యాసయుంచుటవలనఁ జెప్పఁబోవుసంగతి మనస్సున కంటనట్లును భాషింపఁజనదు. ఈపరిస్థితు లన్నితావులందును గలుగుతెఱుంగునసైతము మాటలాడరాదు. ౩ స్వయముగాఁ దాను మునిఁగి పోవుఈఁతకాఁడు ఇతరుల నెటుల వెలికితీయఁగలఁడు? ఇట్లు సందేహమగ్నుఁడై జనులసందేహముల హరింపలేనివాఁడు జనుల నేమి యుద్ధరింపఁగలడు? ౪ ఒకవేళ మనము సంహారమును వర్ణింపవలసియున్నయెడల అన్నిఁటిసారమునుగూడ వివరించుట ఆవశ్యకము. మఱియు దుస్తరమగు మాయానదియొక్క యావలితీరమును జేరఁగల్గువిధముగూడఁ జూపింపవలెను. ౫ (ప్రసంగమున) ఎన్నిసూక్ష్మనామములను గైకొందురో వాని యన్నింటి రూపములను బ్రకటన మొనర్చి శ్రోతలకుఁ జూపింపవలెను. అప్పుడే విచారశీలుఁడురా ఈవక్తయని లోకులు ప్రశంసింతురు. ౬ బ్రహ్మమనెట్టిది? మూలమాయ యెట్లున్నది? అష్టధాప్రకృతియు శివశక్తియు నేవిధముగనున్నవి? అట్లే షడ్గుణేశ్వరునియొక్కయు గుణసామ్యము (గుణమాయ) యొక్కయు స్థితిగతు లెట్టివి? ౭ అర్ధనారీనటేశ్వరుఁడు, ప్రకృతిపురుషుల విచారము, గుణక్షోభిణి, ఆపిమ్మటఁ ద్రిగుణములు ఎట్లుండును? ౮ పూర్వపక్షమున కాదియేది? అంతమెద్ది? వాచ్యాంశ, లక్ష్యాంశములకు భేదమెద్ది? మున్నగు నానాసూక్ష్మాంశముల విచారించు సాధుపురుషుఁడు ధన్యుఁడు. ౯ అట్టిసాధుపురుషుఁ డెన్నఁడును నానావిధములగు వ్యర్థవిస్తారములలోఁ దగుల్కొనఁడు. చెప్పిన దానినే మఱలఁ జెప్పఁడు. పరమేశ్వరుని మనస్సులోనికిఁ గొనివచ్చును. ౧౦ పరబ్రహ్మము విశుద్ధము, ఏకము నైయున్నదని యొక్కమాఱును, కాదు జగత్తంతయుఁ బరబ్రహ్మమేయని యొక్కమాఱును, ద్రష్టయును సాక్షియును, అన్నింటి కావలనున్న సత్తామాత్రమునునై యీపరబ్రహ్మమున్నదని యొక్కమాఱును జెప్పువక్త సరియగువక్త గాఁడు. ౧౧ అతడు (ఆవక్త) నిశ్చలమును జంచలముగను, జంచలమును నిశ్చల పరబ్రహ్మముగను జెప్పును. ఇట్లే పరస్పరభిన్న భావములను శ్రోతలకుఁ గలుగఁజేయును. ఒకదానినేని నిశ్చయము గావింపఁడు. ౧౨ అతఁడు చంచల, నిశ్చలముల నన్నిఁటిని గేవలచైతన్యమనియే విశదీకరించును. అంతియగాక భిన్నభిన్నరూపములను స్పష్టపఱచి వివరింపఁజాలఁడు. ౧౩ ఈవిధగ వ్యర్థమాయాజాలమునందు స్వయమునఁ బడియున్నవాఁడు ఇతరులకు నెట్లుబోధింపఁగలఁడు! నానావిధములగు నిశ్చయములను గావించుటవలన (అస్థిరములను నిశ్చయములని వివరించుటవలన) వ్యర్థములగుసందేహములు పెరిగిపోవును. ౧౪ భ్రమను పరబ్రహ్మముగను, బరబ్రహ్మమును భ్రమగను వివరించుచు అసమర్థుఁడగువక్త తన జ్ఞాతృత్వమిమను బ్రకటించును. ౧౫ ఆతఁడు శాస్త్రము లాధారముగాఁ జూపుచు అనుభవము లేని నిరూపణము లొనరించుచు సందియముల దీర్పమన్నఁ గోపగించుచు నుండును. ౧౬ జ్ఞాతయయ్యును బదార్థాపేక్షయు నిస్పృహారహితుఁడును నగువాఁడు పాపము ఇతరుల కేమి బోధింపగలఁడు? సారాసార నిశ్చయము జరుగవలెను. ౧౭ వైద్యుఁడు తన మాత్రలమహత్త్వమును మిగులఁ బ్రశంసించును. కాని మాత్రలు కొంచమేని గుణమీయవు. అనుభవములేని జ్ఞానస్థితి గూడ నిట్టిదే. ౧౮ సారాసార విచారములేని తావున సమస్తమును అంధ

కారమే. అచట నానావిధ పరీక్షలను గూర్చిన విచారము జరుగఁజాలదు. ౧౯ అవివేకియగువక్త పాపపుణ్యములను, నరకస్వర్గములను వివేకావివేకములను అన్నింటిని సర్వబ్రహ్మమని చెప్పును. ౨౦ అతఁడు పతితమును, పావనమును, నిశ్చయమును, అనుమానమును గూడ బ్రహ్మరూపమని విశ్వసించును. ౨౧ సమస్తమును బ్రహ్మరూపముగ నున్నతావున బ్రహ్మమునకంటె వేఱగుదానిని నెవఁడు విడదీయఁగలఁడు? శర్కరామయముగ నున్నతావున వేఱువస్తువు నెట్లు సమకూర్పఁగలుగుదుము. ౨౨ ఇట్లే సారాసారము లేకాకారమగు తావున అవిచారములు ప్రబలును. విచారమనునది నామమాత్రమునకుఁగూడనుండదు. ౨౩ వంద్యమును, నింద్యమును నేకమగు తావున చేతికబ్బునది యేమున్నది? మత్తుపదార్థములు సేవించి మతిచెడి కూర్చుండిన యాతఁడు అవకతవకలుగ నేదియో వదరుచునే యుండును. ౨౪ ఇట్లే అసమర్థుఁడగు వక్త అజ్ఞానరూపమగు భ్రమతో సర్వమును మఱచియున్నాఁడు. “సర్వబ్రహ్మ” యనియే నిశ్చింతముగఁ గూర్చుండి యున్నాఁడు. ఆతఁడు మహాపాపాత్ముని సత్పురుషుని సమముగా భావించుచున్నాఁడు. ౨౫ సర్వసంగపరిత్యాగమును, ఇచ్ఛకు వచ్చినటు లొనరించు విషయభోగమును, ఒకవేళ నొక్కటిగనే భావించునెడ నిఁక శేషించిన దేమున్నది? ౨౬ భేదము నీశ్వరుఁడే కల్పించెను. భేదము నిప్పుడు ఆయజ్ఞాని కాదు. ఆతని యబ్బసైతమును దుడిచివేయలేఁడు. ఈశ్వర నియమమునకు విరుద్ధముగ నెవ్వఁడేవిధముగ నొనర్పఁగలఁడు? నోటిలో వేసికొన్నదగు పదార్థమును అపానద్వారమున వేసికొమ్ము. (చూతము) ౨౭ ఏవిషయోపభోగముల కేయేయింద్రియములు నిర్వచింపఁబడెనో అవియే యా సౌఖ్యములను సాంగోపాంగముగ ననుభవించును. ఈసమస్తజగ మీశ్వర విరచితము. దీని నియమములని తరులు ద్రిప్పఁ జాలరు. ౨౮ ఇవియన్నియు భ్రాంతివలనఁ గలుగు ప్రమాదములు. ప్రతీతిలేని సమస్తవిషయము మిథ్య. వెఱ్ఱియెత్తినవాఁడు వెఱ్ఱిగ నేదేని భాషించుచుండును ౨౯ కావున సావధానియు, అనుభవశీయుఁడును, జ్ఞాతయు నగువాని నిరూపణముల నాలింపవలెను. ఇట్లొనరించినయెడల ఆత్మ సాక్షాత్కారమగును. ఎటుల తత్క్షణమే లభించును. ౩౦ వెనుకముందుల బాగుగా గుర్తెఱుంగ

వలెను. పాదములనుజూచి వీఁడు గ్రుడ్డివాఁడని నిశ్చయింపవలెను. వ్యర్థభాషణమును వమనప్రాయముగఁ బరిత్యజింపవలెను ౩౧.

ఐదవ సమాసము.

అజపానిరూపణము.

అజపాజపసంఖ్య ఇఱువదియొక్కవేయి ఆఱునూఱులని పెద్దలు నిర్ణయించిరి. విచారమొనరించినచో అంతయు సులభమే. ౧ ప్రాణము ముఖమునుండియు, నాసికనుండియు అఖండముగా వచ్చుచుఁ బోవుచున్నది. సూక్ష్మదృష్టితో నీయంశము విచారింపనగును. ౨ మొట్టమొదటఁ జూచినపుడు స్వరమొక్కటిగనే గోచరించును. వాస్తవమున కాస్వరమునకు మూఁడు భేదములుగలవు. ౧ తార=నిషాదము ౨ మంద్రము=మధ్యమము ౩ ఘోరము=ఖర్జము. అజపావిచారము ఘోరమునకంటెను మిగుల సూక్ష్మమైనది. ౩ స, రి, గ, మ, ప, ధ, ని, అను నీయేడుఅక్షరములను నుడివిచూడుము. ఈ గుప్తస్వరములలో నేదైన నొకదానిని మూలముగ భావించి (శ్రుతిస్థానముగఁ జేసికొని) క్రమముగఁ బైకిపొమ్ము. ౪ పర వాచలకుఁ బైనను పశ్యంతికిక్రిందను (నాభికి హృదయమునకు మధ్య) స్వరమునకు జన్మస్థానము గలదు. స్వరస్ఫురణ మచటినుండియే కలుగుచున్నది. ౫ ఏకాంతమున స్వస్థుఁడై కూర్చుండవలెను. అచట దీనినంతయు గ్రహింపవలెను. ప్రయోగము నొనర్పవలెను. పవనమును అఖండముగా లాగికొనవలెను. విడువవలెను. ౬ ఏకాంతమునందు మౌనముగాఁ గూర్చుండవలెను. సావధానిగనో, సుఖిగనో యుండి చూచినచో శ్వాసము పైకిలాగునపుడు సోయనియు, వెలుపలికి శ్వాసమువిడుచునపుడు హంఅనియు నిట్లే నిరంతరము సోహం సోహం అను శబ్దము కలుగుచున్నట్లు విశదమగును. ౭ ఉచ్చారణము లేక కలుగు శబ్దములను నైసర్గికశబ్దములని గ్రహింపవలెను. ఆశబ్దము లనుభవములోనికి వచ్చుచుండును గాని వానికిఁ బేరులుమాత్రము లేవు. ౮ ఆశబ్దములను గూడ విడిచి కూర్చుండువానిని మహామౌనియని నుడువనగును. యోగాభ్యాసపు జంజాటమంతయు నిటులే యున్నది. ౯ ఏకాంతస్థలమున మౌనముగాఁగూర్చుండి బయలువెడలుశబ్దమును విచారించినచో అంత

రమునందు "సోహం" అను శబ్దములె భాసమగును. ౧౦. శ్వాసము దీసికొనుతఱి సోయనియు విడుచునపుడు హంఅనియు నీవిధముగా అఖండముగా సోహం సోహంఅను నీశబ్దము జరుగుచుండును. దీనివిచారము మిగుల విస్తృతము. ౧౧ సమస్తదేహధారులగు ప్రాణులు స్వేదజోద్భిజ్జాదియోనులు, మన్నగుప్రాణులన్నియు శ్వాసోచ్ఛ్వాసాదులులేనిచో నెట్లు బ్రదుకఁగలవు? ౧౨ అజప ఈవిధముగ నెల్లరికడ నున్నది. ఈయంశము జ్ఞాతకె తెలియును. (అజ్ఞానికిఁదెలియదు) సహజమును (నైసర్గికమును) విడిచి కల్పితవిషయమునఁ బడఁగూడదు. ౧౩ సహజదేవుఁడు చెదరకయే యున్నాఁడు. అతఁడవినాశి. కల్పితదేవుఁడు (విగ్రహాదులు) పగిలిపోవును. వినాశనమగును. కాన నాశవంతమగు దేవునిపై విశ్వాస మెవ్వఁడుంచును? ౧౪ జగదంతరాత్ముని (రాముని) దర్శించినచో స్వయముగ సులభముగ అఖండధ్యాన మలవడును. సమస్తజనులును ఆత్మారాముని యభీష్టానుసారముగ వర్తించుచున్నారు ౧౫ ఆత్మారామునకు సమాధానమగు విధముగ భోజనము మానవునకు లభించును. విడిచి వేసినవి, నాశన మొందినవి నగునవెల్ల నాతనికే యర్పణమగును. ౧౬ అగ్నిదేవత లుదరమున వసింతురు. వారికిఁగూడఁ బ్రాణులు అవదానము నొసంగుచుందురు. ఈవిధముగా సమస్తప్రాణులు ఆత్మారాముని ఆజ్ఞానుసారముగా మెలఁగుచుందురు. ౧౭ పరమాత్ముని జపధ్యానస్తవాదులు ఈవిధముగా స్వభావసిద్ధమగురీతితో జరుగుచున్నవి. ఆత్మారాముఁడు వానిని స్వీకరించుచునే యున్నాఁడు (కాని ఈవిషయ మెఱుంగవలెను) ౧౮ ఈనైసర్గికవిషయమును గ్రహించుటకు జనులు నానావిధములగు హఠయోగము లొనర్చుచున్నారు. ౧౯ పాతిపెట్టినధనము మఱచినచో దరిద్రముకలుగును. ఒకప్పుడు నిధినిక్షేపాదులపై మనుజులు తిరుగుచుందురు. కాని యాదరిద్రప్రాణు లేమిచేయుదురు? తాము నిధినిక్షేపాదులపైఁ దిరుగుచున్నసంగతియే యెఱుఁగరు. ౨౦ భూగర్భమునం దనంతముగా ద్రవ్యమున్నది. గోడలలో ద్రవ్యముంతురు. స్తంభములందును దూలములందును ధనముదాచుదురు. దరిద్రులా ద్రవ్యమునకు మధ్య కాపురముజేయుచుందురు. ౨౧ అభాగ్యుఁ డీవిధముగ లక్ష్మిమధ్యమున నాట్యమాడుచుండును. కాని వానిదరిద్రము క్రమక్రమముగాఁ బెరిగి

పోవుచుండును. ఇఁకఁ బరమానందులగు పరమపురుషుల ఆశ్చర్యస్థితిని జూడుఁడు. ౨౨ ఒకఁడు కూర్చుండియున్నాఁడు. ఒకఁడు తినుచున్నాఁడు. ఇది వివేకగమనము. ప్రవృత్తినివృత్తులస్థితి సైత మిట్టిదియే. ౨౩ అంతఃకరణమునందు శ్రీమన్నారాయణమూర్తి వసించియున్నప్పుడిఁక లక్ష్మికేమికొదువ! లక్ష్మిగలవానిని (లక్ష్మిగృహమును=పరమాత్ముని) బాగుగా దృఢముగా నాశ్రయింపవలెను. ౨౪

ఆఱవసమాసము.

దే హి, దే హ ము.

దేహి (ఆత్మ) దేహమునం దుండును. నానావిధసుఖదుఃఖముల భోగించుచుండును. మఱియు నంత్యమునం దొక్కమాఱుగ ఆత్మ దేహమును విడిచివేయును. ౧ తరుణత్వమునందు దేహము పుష్టిగానుండును. అందుచేఁ బ్రాణి నానాసుఖభోగముల ననుభవించును. వృద్ధావస్థయందు అశక్తస్థితినొంది దుఃఖముల ననుభవించును. ౨ చావవలదను కోరిక మాత్రముండును. అంత్యమునందుఁ గాళ్లుచేతులు గుంజుకొని ప్రాణములను విడుచును. వృద్ధత్వమునం దెన్నియేని కఠినదుఃఖములను సహించును. ౩ దేహము ఆత్మల సాంగత్యమున స్వల్పముగా సుఖము ననుభవించును. అంత్యకాలమున గిలగిల తన్నుకొని మరణించును. ౪ ఇట్టి యాత్మ దుఃఖదాయకమైనది. ప్రపంచమునం దొకజంతువు రెండవజంతువును జంపి దానినుసురు గొనును. అంత్యమునందు ఏయుద్దేశమేని వెలువడదు. ౫ ఇది యీవిధముగ రెన్నాళ్ళభ్రమ. దీనినే జనులు పరబ్రహ్మమందురు. నానాదుఃఖములగోల దీనియందె యున్నది. జనులు దీనినే సుఖమని విశ్వసించుచున్నారు. ౬ దుఃఖమై గిలగిల తన్నుకొనుటలో నేమి సమాధానమున్నది? ఒకానొకప్పుడు గొప్పగనో కొద్దిగనో సుఖము లభించినను దుఃఖము తత్క్షణముననే సిద్ధముగ నున్నది. ౭ పుట్టినది మొదలుకొని కలుగు దుఃఖములన్నింటిని దలంచికొన్నచో సర్వము విదితమగును. ఈజన్మమున దుఃఖములెన్నియో నిండియున్నవి. ఈదుఃఖముల నెంతదనుక లెక్కింపఁగలను? ౮ ఆత్మల సాంగత్యస్థితి యిట్టిది. ఏమన! నానాదుఃఖములు కలుగుచున్నవి.

ప్రాణులందఱు దుఃఖముచేతో విసిగి వేసారిపోవుచున్నారు. ౯ జన్మము నందంతటను గొంత యానందమున్నచోఁ గొంతదుఃఖముకూడ దాని వెంటనే యున్నది. పలుతెఱంగులగు విరుద్ధపరిస్థితు లుత్పన్నమై ప్రాణుల కనేకదుఃఖములు ప్రాప్తించును. ౧౦ నిద్రాకాలమున నల్లులును, దోమలును మానవునిబలుతెఱంగుల బాధించును. వానిబాధ తొలంగుటకే దేని యుపాయము గావింతమేని యాప్రాణులకు దుఃఖము గలుగును. ౧౧ భోజన కాలమునం దీఁగలు ప్రాలును. ఆహారవస్తువులను ఎలుకలు గొనిపోవును. ఇంతలోఁ బిల్లులువచ్చి యాయెలుకలను జంపితినును. ౧౨ పేలు, మిణ్ణల్లులు, జెఱ్ఱులు, మానాపతులు మున్నగు ననేక జంతువులు పరులను శ్రమపెట్టి జీవించుచున్నవి. స్వయముగఁ దాముగూడఁ గష్టము లొందుచున్నవి. ౧౩ తేలు, పాము, పులి, ఎలుగుబంటి, మొసలి, తోఁడేలు, మనుష్యుఁడు మున్నగునవి దమలోఁదాము (ఒకటి రెండవదానికి) దుఃఖదాయకములుగా నున్నవి. అన్నియు దుఃఖమయములే. సుఖసంతోషములు దేనికిని లేవు. ౧౪ ఈ యెనుబదినాలుగు లక్షల జీవయోనులలో నొకటి రెండవదానిని భక్షించుచునే యున్నది. నానాపీడలు, నానాదుఃఖములు గలవు. ఎంతదనుకఁ జెప్పఁగలము? ౧౫ అంతరాత్మ కృత్యము లిట్టివి. ఈభూమిపై నిండియున్న సమస్తజీవులలో నొకటి రెండవదానిని సంహరించుచున్నది. జీవజాలమంతయు నెల్లప్పుడు నేడ్చుచునే యుండును. ౧౬ గిలగిల కొట్టుకొనును. గుంజుకొని గుంజుకొని ప్రాణములు విడచును. ఇట్టియాత్మను మూర్ఖులు పరబ్రహ్మమని యేలయందురో తెలియకున్నది. ౧౭ పరబ్రహ్మ మొకతావునుండి వేరొకతావునకుఁ బోవదు. ఎవరికేని దుఃఖము గలిగింపదు. పరబ్రహ్మమునకు స్తుతి నిందలలో నేదియుఁ దగులదు. ౧౮ ఎన్నితిట్టులైనఁ దిట్టుము. అవి యన్నియు అంతరాత్మకే తగులును. యోచించినచో అంతయు యథా తథ్యముగఁ బ్రత్యయము లోనికి వచ్చును. ౧౯ తిట్లు పలుతెఱంగుల నుండును. వాని నెంతదనుక వివరింపఁ గలను? ౨౦ తిట్లు పరబ్రహ్మమునకుఁ దగులవు. కల్పనమే నడువదు. అసంబద్ధమగు జ్ఞాన మెవ్వనికిని మాన్యము గాదు. ౨౧ సృష్టియందు జీవసముదాయమంతయు గాఁగలదు. అన్నింటికిని వైభవ మెక్కడినుండి వచ్చెను? ఈశ్వరుఁ

డు ఆయాజీవులకు యోగ్యతానుసారముగ వైభవము పంచిపెట్టెను. సర్వసాధారణుల్లగు మానవు లెందఱో గలరు. కాని వారిలో ఉత్తమోత్తమవిషయములను భాగ్యవంతులగు పురుషులే పొందుదురు. ౨౩ ఇట్టే భోజనము, పాత్రములు, దేవతార్చనము, బ్రహ్మజ్ఞానము సైతము ప్రారబ్ధానుసారముగా లభించుచుండును. ౨౪ సర్వసాధారణముగా జనులందఱును సుఖులుగనే యుందురు. ప్రపంచమును సుఖపూర్ణమనియే భావింతురు. కాని మహారాజు లనుభవించు మహావైభవములు అభాగ్యపురుషున కెట్లులభ్యమగును? ౨౫ కాని అంత్యమునం దందఱికిని నానావిధదుఃఖములు గలుగును. ఆకష్టసమయమున రాజు, దరిద్రుఁడు మున్నగువారలందఱును సమానమగుదురు. కాని మొదటినుండి నానాసుఖముల ననుభవింప నలవాటుపడినవారలు మాత్రము అంత్యమున దుఃఖమును సహింపఁజాలరు. ౨౬ కఠినదుఃఖమును సహించుట చాలకష్టము. శరీరమును ప్రాణములు త్వరత్వరగా వీడవు. మృత్యుదుఃఖ మీవిధముగా సమస్తజనులను బీడించును. ౨౭ జను లనేకులు అవయవహీనులై యుందురు. ఈవిధముగ నంత్యకాలమునందు దుఃఖములొందిన పిదపఁ బ్రాణములు వెడలిపోవును. ౨౮ సమస్తరూపలావణ్యములు, శారీరక సామర్థ్యముగూడ నొకప్రక్కనుండి తొలంగిపోవును. ఒకవేళ నెవరేని చుట్టుప్రక్కల లేకపోయినచోఁ బ్రాణియింకను దుర్దశకుఁబాలై వెడలిపోవును. ౨౯ అంత్యకాలపుబాధ అందఱికి సమానముగ నుండును. ఈ విధముగ నీయాత్మ చంచలమును, అవలక్షణమును, దుఃఖకారకము నై యున్నది. ౩౦ ఇట్లయ్యుగూడ దీనిని (ఆత్మను) భోగించినను అభోక్త యందురు. ఇదియంతయు అజ్ఞాతభావనవలన జరుగుచున్నది జనులు విచారింపకయే యిట్లు (ఆత్మను అభోక్తయని) నుడివి యూరకుందురు. ౩౧ అంత్యకాలము మిగులఁ గఠినమైనది. ప్రాణములు శరీరమును సులభముగా విడువవు. అంతియగాక ఆశాతృష్ణలుగూడ దృఢముగా నావరించుకొనును ౩౨.

ఏడవసమాసము

సంసారగతి.

ఆదియందు జలము నిర్మలముగా నుండును. కాని యది పలు తెఱంగులగు తీఁగెలలో బ్రవేశించినంతన సంగదోషముచేఁ బులుపు, కారము, చేదు మున్నగు రుచులొందును. ౧ ఆత్మ ఆత్మత్వముతో నుండును. దేహసంగమువలన వికృతమగును. మరియు నభిమానవశమున నిచ్చకు వచ్చినరూపము నొందును. ౨ మంచిసాంగత్యము లభించినచో ఆత్మస్థితి చెఱుకులోనికి మధురత్వమువచ్చినట్లగును. (చెడ్డసాంగత్యమువలన) ఆత్మస్థితి ప్రాణఘాత గావించు విషవల్లికిఁ దుల్యమగును. ౩ పదునెనిమిది తెఱంగులగు వనస్పతులు గలవు. వానివానిగుణములను వేఱువేఱుగ నెంతదనుక వర్ణింపఁగలను? నానాదేశములందున్నకతన ఆత్మస్థితియు నిట్టిదె. ౪ మంచివగు నాత్మలు సత్సంగమువలన దరికిఁ జేరుచున్నవి. వివేకబలమున ఆత్మలు దేహాభిమానమును వదలుచున్నవి. ౫ ఉదకమునకు వినాశనమే యగును. కాని యాత్మ వివేకమువలన దరిజేరును. ఆత్మప్రత్యయ మిట్టిది. వివేకముతోఁ జూడుఁడు. ౬ స్వహితము గావించుకొననివాని కెంతదనుకఁ జెప్పవలయును? ఇదియంతయుఁ బ్రతిమానవుఁడును స్వవిషమునఁ దెలిసికొనవలెను. ౭ తన్నుఁదాఁ గాపాడుకొనువానిని మనకుమిత్రునిగను దనకుఁదాను స్వయముగా నాశనము గావించుకొనువానిని వైరిగను దలంపనగును. ౮ తనకుఁ దాను అహితము గావించుకొనఁదలఁచినవానినెవ్వఁ డభ్యంతరపెట్టఁగలఁడు? ఇట్టిపురుషుఁడే కాంతమునకరిగి తనజీవుని దానుజంపుకొనును. ౯ తనకుఁదా నపాయము గలుగఁజేసికొనువాఁ డాత్మహత్యాపాతకుఁడని నమ్ముఁడు. వివేకశాలియగు సాధువే ధన్యుఁడు. ౧౦ మానవులు సత్సంగతివలనఁ బుణ్యాత్ములు, అసత్సంగతివలనఁ బాపాత్ములు నగుదురు. సుగతియు, దుర్గతియు సహవాసయోగమునఁ గలుగును. ౧౧ కావున ఉత్తమ సాంగత్యము గావింపవలెను. తనచింతను దానే స్వయముగాఁ జేసికొనవలెను. మఱియు జ్ఞాతయగువాఁడు తనబుద్ధి నంతఃకరణమునందుఁ జక్కఁగా మననము గావింపవలెను. ౧౨ జ్ఞాతయగువానికిహలోకము, పరలోకము సౌఖ్యకరమగును. అజ్ఞాని కవివేక కారణమున ఇహపరలోకములు దుఃఖదాయకము లగును. ౧౩ జ్ఞాని దేవాంశసంభూ

తుఁడు. అజ్ఞాని రాక్షసాంశ సంభూతుఁడు. ఇఁక నీయిరువురిలో నెవరు గొప్పవారలో తెలిసికొనవలెను. ౧౪ జ్ఞాత సర్వమాన్యుఁడుగను అజ్ఞాత అమాన్యుఁడుగను నుండును. ఈయిరువురిలో నెవరినాశ్రయించినచో మనము కృతార్థులమగుదుమో వారినే యాశ్రయింపవలెను. ౧౫ ఉద్యోగియుఁ, జతురుఁడు నగువానిస్నేహము జేసినవాఁడు ఉద్యోగియుఁ, జతురుఁడు నగును. ఇట్లే సోమరితోడను మూర్ఖునితోడను జెలిమిచేయువాఁడు సోమరిగను మూర్ఖుఁడుగను మాఱును. ౧౬ ఉత్తమసాంగత్యఫలితము సుఖము. అధమసాంగత్యఫలము దుఃఖము. ఆనందమును విడిచి దుఃఖము నెవఁడుగైకొనును? ౧౭ విషయము స్పష్టముగనేయున్నది. మనుష్యమాత్రులందఱు నీరెండుసాంగత్యములలోనే వర్తించుచున్నారుగావున నీవిషయమునఁ బ్రపంచమున కనుభవముగూడఁ గలుగుచున్నది. ౧౮ సత్సంగతివలన సమస్తసుఖములు లభించును. అసత్సంగతివలన సమస్తదుఃఖములు గలుగును. సంపూర్ణకార్యములను వివేకముతో నొనరింపవలెను. ౧౯ ఆకస్మికమున నేదేని చిక్కులలోఁ దగుల్కొన్న యెడల నా చిక్కులలో నుండి వెలువడుటకు యత్నింపవలెను. వెలువడిన పిమ్మట సావధానత యెంతయేని గలుగును. ౨౦ నానావిధముల వర్తించు దుర్జనుల సంసర్గమువలన క్షణక్షణమునకును మనోభంగము గలుగును. కీర్తికాముఁడిహలోకమునఁ దనప్రతిష్ఠనుంచి వెళ్ళనగును. ౨౧ ప్రయత్నకారణమునఁ జతురునకేయంశమునందును లోపముండదు. ఆతఁడు సుఖసంతోషముల ననుభవించును. ఆతనిగుణగణమును లోకులు నానావిధములఁ బ్రశంసింతురు. ౨౨ జను లీస్థితిలో నిప్పుడున్నారు. (మఱియుఁ బ్రత్యక్షముగా) నీస్థితిలో వర్తించుచున్నారు. కాని యెవ్వఁడు (దీనిని) తెలిసికొని చూచునో వానివలనఁ బ్రయత్నములు నెరవేరును. ౨౩ ఈవసుంధర బహురత్నఖనియైయున్నది. బాగుగా నెఱింగి యోచింపుము. ఏలయన! తెలిసికొనుటవలన అంతఃకరణమునకు నమ్మకము గలుగును. ౨౪ మానవుఁడు దుర్బలుఁడును, సంపన్నుఁడును, బిచ్చవాఁడును, వ్యుత్పన్నుఁడును అగుట అఖండరీతిగ (సృష్ట్యాదినుండియే) వచ్చుచున్నది. ౨౫ ఒక భాగ్యవంతుఁడు చెడిపోయినచో రెండవవాఁడు భాగ్యవంతుఁడగుచుండును. ఇట్లే విద్యయు, ఉత్పత్తియు గలుగుచుఁ బోవు

చున్నవి. ౨౬ ఒకఁడు సంపన్నుఁడగు చున్నాఁడు. వేఱొకఁడు రిక్తహస్తుఁడు అగుచున్నాఁడు. రిక్తహస్తుఁడు మఱల సంపన్నుఁడగుచున్నాఁడు. సంపన్నుఁడుగూడఁ గొంతకాలము జరిగిన పిదప రిక్తుఁడగును. ౨౭ ఇది సంసారస్థితి. సంపద రెండుజాములవేళయం దగుపించు నీడవంటిది. వయఃపరిమితిగూడ మెల్లమెల్లఁగాఁ బూర్తికావచ్చినది. ౨౮ బాలతారుణ్యవార్ధకాది దశలను మానవులు స్వయముగా నెఱింగియే యున్నారు. కావున నెల్లరును దమజీవితమును సార్థకము గావింపవలెను. ౨౯ దేహమెట్లు చేసిన నట్లుపకరించును. యత్న మొనరించిన యెడలఁ గార్యము సిద్ధించును. అట్టియెడ మానవుఁడు దుఃఖయేలకావలయునో నాకుఁ దోఁచకున్నది. ౩౦

ఎనిమిదవ సమాసము.

పంచీకరణము, దేహచతుష్టయము.

నాభినుండి స్ఫురణరూపమున బయలు వెడలు వాణిని పరావాణి యందురు. ధ్వనిరూపమున పశ్యంతివాణి యందురు. ఈపశ్యంతివాణి హృదయమునందుండును. ౧ నాదము కంఠమునుండి జనించును. ఆనాదమును మధ్యమవాణి యందురు. అక్షరముల యుచ్చారణ జరిగినపుడు బయలు వెడలు వాణిని వైఖరియందురు. ౨ పరావాక్కునకు నెలవగు నాభిస్థానమే అంతఃకరణమునకు ఉనికిపట్టు. ఇఁక నంతఃకరణ పంచకము యొక్క నిశ్చయము నాలకింపుఁడు. ౩ నిర్వికల్పావస్థయందు (శూన్యాకారవృత్తి గలిగిన పిమ్మటఁ) గలుగు స్ఫురణము (ఒకవిధమగు స్మరణము)నే అంతఃకరణమనియు లేక చేతనశక్తియనియు నెఱుంగవలయును. ౪ అంతఃకరణలక్షణము స్మరణము. ఆపిమ్మట అగును కాదు. చేయుదునా? చేయకుందునా? అని కలుగు భావనయే మనస్సు. ౫ అనఁగా సంకల్పవికల్పములు గలుగుటయే మనోధర్మము. ఇదియే మనస్సుయొక్క చిహ్నము. ఈమనస్సునుండియే సందేహ ముత్పన్నమగుచున్నది. తరువాత అంత్యమునఁగలుగు నిశ్చయమే బుద్ధిరూపము. అనఁగా నిశ్చయము గావించుట బుద్ధిధర్మము. ౬ చేసియే తీరెదననిగాని, చేయనేచేయను అనిగాని నిశ్చయించుటయే బుద్ధిధర్మము. వివేకముతో నీవిషయము నాంత

ర్యముసందెఱుంగవలెను. ౭ నిశ్చితమగు వస్తువును జింతన మొనరించుట చిత్తలక్షణము. ఇవ్విషయమున సందియము లేదు. ౮ "ఈకార్యము నవశ్యము చేయవలెను." అను నభిమాన ముంచుటగాని, అట్టి కార్యమునకుఁ బూనుకొనుటగాని అహంకారము ౯ ఇదియే అంతఃకరణపంచకము. ఐదువృత్తులును గలిసి ఒక్కటిగ నున్నవి. కార్యవిభాగమువలన అయిదువిధములుగ వేఱువేఱైనవి ౧౦ ఇట్లే కార్యవిభాగమునుబట్టి ఐదుప్రాణములును వేఱువేఱుగాఁ జెప్పఁబడుచున్నవి. అట్లుకాకున్నచో వాయురూప మొక్కటియేగదా! ౧౧ వ్యానము సర్వాంగములందును, సమానము నాభియందును, ఉదానము కంఠమునందును, అపానము గుదమందును, ప్రాణము ముఖనాసికములందును నుండును. ఇది నిశ్చయమని యెఱుంగవలయును. ౧౨

ప్రాణపంచకము నిప్పుడు చెప్పితిని. ఇఁక జ్ఞానేంద్రియ పంచకమును వినుండు. చెవులు, చర్మము, కన్నులు, నాలుక, ముక్కు అనునీయైదును జ్ఞానేంద్రియములు. ౧౩ వాణి, చేతులు, పాదములు, శిశ్నము, గుదము, అను నీయైదును కర్మేంద్రియములు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము లనునీయైదును (ఐదుజ్ఞానేంద్రియముల) విషయములు ౧౪ అంతఃకరణపంచకము, ప్రాణపంచకము, జ్ఞానేంద్రియపంచకము, కర్మేంద్రియపంచకము, విషయపంచకము అనునివి యైదుపంచకములు ౧౫ ఈవిధముగ నీయిరువదియైదుగుణములు గలిసి సూక్ష్మదేహమగును. దీనివివరముల నాలింపుఁడు. ౧౬ అంతఃకరణము, వ్యానము, శ్రవణము, వాక్కు, శబ్దవిషయము. ఆకాశరూపము. ఇఁకముందు వాయువిస్తారమును జెప్పెదను ౧౭ మనస్సు, సమానము, త్వక్కు, పాణి, స్పర్శవిషయము. పవనరూపము. ఇది యంతయు రేఖలుగగీసి యందువ్రాసి బాగుగాఁ దెలిసికొనవలెను ౧౮ బుద్ధి, ఉదానము, నయనము, చరణము, రూపవిషయము. అగ్నిరూపము. వీనినన్నింటిని నేను సాంకేతికముగఁ దెల్పుచున్నాఁడను. మనస్సుంచి యోచింపవలెను. ౧౯ చిత్తము, అపానము, జిహ్వ, శిశ్నము, రసవిషయము. జలరూపము. ఇఁకముందుఁ బృథ్వీరూపమును సావధానమనస్కులరై వినుండు ౨౦ అహంకారము, ప్రాణము, ఘ్రాణము, గుదము గంధవిషయము. పృథ్వీరూపము. ఇది శాస్త్రమతానుసారముగ

నొనర్పఁబడిన నిరూపణము ౨౧ సూక్ష్మదేహమిట్టిది. దీనిని మననమొన రించినచో సందేహములు నశించును. ఇదియందఱికిఁ దెలియునంశము గాదు. దీనియందు హృదయముంచి తెలిసికొనువానికే యీయంశము బోధపడును ౨౨

ఈవిధముగా సూక్ష్మదేహస్థితిఁ జెప్పితిని. ఇఁకముందు స్థూల దేహమును వర్ణింతును. పంచగుణములతో నాకాశము స్థూల దేహమునందేవిధముగ వర్తించుచున్నదో వినుండు ౨౩ కామక్రోధ శోకమోహభయములను నైదుభేదములును ఆకాశగుణములు. ఇఁకఁ బంచవాయువులఁ జెప్పెదను ౨౪ చలనము, వలనము, ప్రసరణము, నిరోధనము, అకుంచము అను నైదులక్షణములు వాయుగుణములు. ౨౫ ఆఁకలి, దప్పిక, ఆలస్యము, నిద్ర, మైథునము అనునైదును దేజో గుణములు. ఇఁకముందు జలలక్షణములు వినుండు. ౨౬ వీర్యము, రక్తము, లాల, మూత్రము, స్వేదము అను నైదును జలభేదములు. ముందు బృథ్వీలక్షణములఁ దెలుపుదును. ౨౭ అస్థి, మాంసము, త్వక్కు, నాడి, రోమము లనునైదును పృథ్వీధర్మములు. స్థూలదేహమర్మ మీవిధ ముగ గ్రంథములలోఁ జెప్పఁబడెను ౨౮ పృథివ్యాప స్తేజోవాయ్వాకాశ ములను నైదుభూతముల యిరువదియైదు తత్త్వములు గలిసి స్థూల దేహముగ నయ్యెను. ౨౯

మూఁడవదేహమగు కారణము, అజ్ఞానము, నాలుగవదేహమగు మహాకారణము, జ్ఞానము అను నీనాలుగు దేహములు నిరసనమైనపిదప విజ్ఞానరూపమగు పరబ్రహ్మము మిగిలి యుండును. ౩౦ విచారముతో నాలుగు దేహములను వేఱుపఱచిన యెడల అహంత్వము (నేనను భావము) తత్త్వములతోఁ బాటుగఁ దొలఁగిపోవును. మఱియు నీవిధముగఁ బరబ్రహ్మమునందు అనన్యమగు ఆత్మనివేదనము జరుగును. ౩౧ ప్రాణి వివేకమువలన జన్మమృత్యువుల నుండి విముక్తుఁ డగును. నరదేహమున మహత్కృత్యము సాధించుచు న్నాఁడు. భక్తియోగ సహాయమునఁ గృతకృత్యుఁడు, సార్థకుఁడు నగు చున్నాఁడు. ౩౨ ఈపంచీకరణ వర్ణనము ముగిసినది. ఈవిషయమును దప్పక విచారింపవలెను. స్పర్శవేధి సోకుటవలన నినుము బంగారమగును.

౩౩ ఈదృష్టాంతము సరిగా లేదు. ఏలయన ! స్పర్శవేధి రాయి. అది స్పర్శవేధిని నిర్మింపఁజాలదు. కాని సాధుజనుల శరణ్యములోని కరుగుట వలన మానవుఁడు స్వయముగా సాధువేయగును. ౩౪

తొమ్మిదవ సమాసము.

తనుచతుష్టయము.

స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణములను నీనాలుగును దేహములు. జాగ్రత, స్వప్నము, సుషుప్తి, తురీయము లను నీనాలు గును అవస్థలు. ౧ విశ్వము, తైజసము, ప్రాజ్ఞము, ప్రత్యగాత్మ అను నీనాలుగును అభిమానములు. నేత్రము, కంఠము, హృదయము, శిర స్సు అను నీనాలుగును స్థానములు. ౨ స్థూలభోగము, వివిక్తాభోగము, ఆనందభోగము, ఆనందావభాసభోగము అను నీనాలుగు భోగములును నాలుగు దేహములవి. ౩ అకారము, ఉకారము, మకారము, అర్ధ మాత్ర. ఈనాలుగుమాత్రలు నాలుగు దేహములవి. ౪ తమము, రజస్సు, సత్త్వము, శుద్ధసత్త్వము అను నీనాలుగు గుణములు నాలుగు దేహములవి. ౫ క్రియాశక్తి, ద్రవ్యశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి అను నీనాలుగు శక్తులు నాలుగుదేహములవి. ౬ ఈవిధముగా నివి ముప్పదిరెండుతత్త్వ ములు. సూక్ష్మదేహతత్త్వములు, స్థూలదేహతత్త్వములు గలిసి యేఁబ దితత్త్వములు. అన్నియుఁ గలిసి ఎనుబదిరెండుతత్త్వములు. ఇవిగాక అజ్ఞాన (కారణదేహ) జ్ఞానము (మహాకారణదేహము) లున్నవి. ౭ ఈవిధముగా నీతత్త్వము లన్నింటి నెఱిఁగి యీతత్త్వములను మాయిక ములని భావింపవలెను. మఱియుఁ దన్ను సాక్షిగా భావించి యీరీతిగ దత్త్వములను నిరసింపవలెను. ౮ జ్ఞానమును సాక్షియందురు. జ్ఞానమును సాయముగాఁగొని అజ్ఞానమును గుర్తెఱుంగవలెను. దేహముతో బాటుగాఁ జ్ఞానాజ్ఞానములను నిరసింపవలెను. ౯ బ్రహ్మాండమునందు గల్పనము గావింపఁ బడిన దేహములు విరాట్టు, హిరణ్యగర్భుఁడు అని పిలువఁబ డును. ఆత్మజ్ఞానమువలనను వివేకమువలనను అవిగూడ నిరసనమగును. ౧౦ ఆత్మానాత్మ వివేచనము, సారాసారవిచారము నొనరించినచోఁ బంచభూతముల మాయికవార్త విశదమగును. ౧౧ అస్థి, మాంస,

చర్మ, నాడీ, రోమములు ఐదును పృథ్వియొక్క గుణధర్మములు. వీని నన్నింటిని ప్రత్యక్షముగఁ దనశరీరమునందే శోధించి చూచుకొనవలెను. ౧౨ శుక్ల, శోణిత, లాలా, మూత్ర, స్వేదము లను నీయైదును జల భేదములు. తత్త్వములను దెలిసికొని వీనిని స్పష్టపఱచుకొనవలెను. ౧౩ క్షుధాతృష్ణా లస్య నిద్రా మైథునము లను నీయైదును తేజోగుణములు. ఈతత్త్వములను జక్కఁగ నిరూపణము గావింపవలెను. ౧౪ చలన, వలన, ప్రసరణ, నిరోధనాకుంచనము లను నీయైదును వాయుగుణములు. శ్రోతలు వీని నెఱుంగవలెను. ౧౫ కామ క్రోధ శోక మోహ భయము లను నీయైదును ఆకాశగుణములు. వివరణముగావింపకున్నచో నివి యెవ్వియు గ్రాహ్యములోనికి రాఁజాలవు. ౧౬.

స్థూలశరీర మీవిధముగా నిరువదియైదుతత్త్వములతో నిండి యున్నది. సూక్ష్మదేహమునుగూర్చిన వివరముల నిఁక వివరించెదను. ౧౭ అంతఃకరణము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అను నీయైదును ఆకాశభేదములు. ముందు సావధానమనస్కులరై వాయుభేదముల వినుఁడు ౧౮ వ్యానము, సమానము, ఉదానము, ప్రాణము, అపానము అనునీయైదును వాయుతత్త్వభేదములు. ౧౯ శ్రోత్ర చర్మ చక్షుజిహ్వాఘ్రాణము లనునీయైదును తేజోభేదములు. ఇఁక సావధానులరై ఆపోభేదముల వినుండు. ౨౦ వాక్కు, పాణి, పాదము, శిశ్నము, గుదము అనునీయైదును జలభేదములు. ఇఁకఁ బృథ్వీభేదములను జెప్పెదను. శబ్దస్పర్శరూపరసగంధము లనునవి పృథ్వీభేదములు. ఈవిధముగా నీయిరువదియైదును సూక్ష్మదేహభేదములు ౨౧.

పదియవ సమాసము

సాధువులు — మూర్ఖులు.

పృథ్వికిఁ జుట్టుప్రక్కలనున్న ఆవరణోదకమునందు హాటకేశ్వరుఁ డను పాతాళలింగము గలదు. దాని మహిమ మిగుల గొప్పది. ఆలింగమునకు నమస్కరింపవలయును ౧ కాని యచ్చటికిఁబోవ వీలులేదు. శరీరమున్నంతడనుక నది గనిపింపదు. కావున నాయీశ్వరుని వివేక

సహాయమున ననుమానములోనికిఁ దెచ్చుకొనవలెను ౨ సప్తసముద్రములును అత్యంతవిశాలమగు నీ భూమండలము నావరించియున్నవి ఆ సముద్రములచెంత మహత్తరములగు పర్వతపంక్తులు గలవు. ౩ సప్త సముద్రములను లంఘించి యచటికెట్లుపోవ వీలగును? కావున సాధుజనులు హాటకేశ్వరునిగాంచుటకు వివేకులు గావలెను ౪ తమకుఁ దెలియని యంశములను జ్ఞాతలగువారి నడిగి గ్రహింపవలెను. మనోవేగము ననుసరించి దేహముతో నడుచుట సాధ్యముగాదుగదా! ౫ చర్మదృష్టికిఁ దెలియనిదానిని జ్ఞానదృష్టితోఁ జూడవలెను. మఱియు బ్రహ్మాండమును మననముగావించి మనస్సులో సమాధాన ముంచవలెను ౬ మధ్యను పృథ్వి తెఱవలెనున్నది. ఇందువలననే ఆకాశ పాతాళము లేర్పడెను. ఒక వేళ నీతెఱయే లేకున్నచో (పాతాళనామము నశించును. మఱియు) నాలుగుదిశలను ఆకాశమే ఆకాశమయ్యెడిది ౭ స్వాభావికముగా నుపాధి రహితముగ నున్నదానిని పరబ్రహ్మమందురు. ఆపరబ్రహ్మమునందు దృశ్యమాయయొక్కనామము శూన్యాకారము (దృశ్యమచ్చటలేదు) ౮ దృష్టికిఁ గాన్పించునది దృశ్యము. మనస్సునకు గోచరించునది భాసము. మనస్సునకంటె నావలనున్న నిరాభాసమును వివేకదృష్టితోఁ గనవలెను. ౯ దృశ్యమునకును, భాసమునకును నెచట తావులేదో యచటికి వివేకము ప్రవేశింపఁజాలియుండును. కాని యీ భూమండలమున సూక్ష్మదృష్టిగల జ్ఞాతలు మిగుల స్వల్పసంఖ్యాకులుగా నున్నారు ౧౦ వాక్కుతోఁ జెప్పఁబడునది వాచ్యాంశము. చెప్పనవకాశములేనిదానిని లక్ష్యాంశమని యెఱుంగనగును. గుణయోగమువలననే నిర్గుణమును అనుభవములోనికిఁ దెచ్చుకొనవలెను ౧౧ గుణములకు నాశనముగలదు. కాని నిర్గుణ మవినాశియైయున్నది. సూక్ష్మమును జూచుటలో స్థూలమునుజూచుటకంటె విశేషత్వముగలదు. ౧౨ దృష్టికి గోచరింపనిదానిని విని గ్రహింపవలెను. శ్రవణ మననములవలన నన్నియు విదితమగును. ౧౩ అష్టధాప్రకృతికి నానాదృశ్యపదార్థములు గలవు. అవియన్నియు విదితముగావు. ఎవ్వరుఁ గూడ నెఱుంగఁజాలరు. ౧౪ ఒకవేళ నంతయు సమానస్థితియైపోయిన యెడలఁ బరీక్షయు మునిఁగిపోవును. రుచియెఱుంగని పురుషునిభోజనము ఒకదానిలోనొకటిగ నంతయుఁ గలిపికొని యంతయుఁ దినినట్టులగును.

గగి మూఢుఁడు ఎన్నఁటికిని గుణగ్రాహి కాఁజాలఁడు. మూర్ఖునకు వివేకము కలుగఁజాలదు. అవివేకమును వివేకమును మూర్ఖులొకటియనియే చెప్పుదురు ౧౬ ఉచ్చనీచము లెఱుంగని వానియభ్యాస మంతయు నిష్ఫలము. అభ్యాసము లేనిచో గతియే యుండదు ౧౭ ఉన్మత్తుఁడు, పిచ్చివాఁడు నగుమానవునకు సమస్తమునుసమానముగా గోచరించును. అట్లు జూచువారలు మూర్ఖులని, యవివేకులని యెఱుంగవలెను ౧౮ అఖండరీతిగ నెద్ది నాశనమగుచున్నదో దానినే మూర్ఖులవినాశియందురు. ఇట్టివదరుబోతుల నేమన్న నేమిలాభము? ౧౯ ఈశ్వరుఁడు నానాభేదముల నొనరించెను. సమస్తసృష్టియు భేదముతోఁ బ్రవర్తించుచున్నది. గ్రుడ్డివారలు పరీక్షకులుగా నున్నచో నిఁకఁ బరీక్ష యెక్కడిది? ౨౦ మఱియుఁ బరీక్షానుభావముగల జనసముదాయము మోసముతో నిండినది. గుణములేనితావున గౌరవ మెక్కడినుండివచ్చును? ౨౧ అసత్యమును సత్యమును సమానమొనరించినచో నిఁక వివేకమెక్కడనున్నది? సాధుజనులు అసారమును విడిచి సారమును గ్రహింతురు ౨౨ దరిద్రుఁడగు పురుషుఁడుత్తమవస్తువు నెట్లు పరీక్షింపఁగలఁడు? దీక్షాహీనునకు దీక్ష యెక్కడినుండివచ్చును? ౨౩ బాహ్యమున కరిగి శౌచముగావించుకొనుట యెఱుంగని మూరికితనపుసోమఱికి వేదశాస్త్రములు, పురాణము లేమి యుపకరించును? ౨౪ తొలుదొలుత మానవుఁ డాచారమును రక్షింపవలెను. పిదప విచారమునకుఁ బూనవలెను. (అట్లొనరించినచో) ఆచారవిచారములనుండి (భవసాగరమును) ఉత్తీర్ణులగుదురు. ౨౫ నియమబద్ధుఁడగు సాధకునికిఁగూడఁ దెలియఁబడనియంశము బుద్ధిహీనున కెట్లు తెలియును? కన్నులుగలవారలే మోసపోవుతావున గ్రుడ్డివారలెందులకుఁ బనికివత్తురు? ౨౬ పాపపుణ్యములను స్వర్గనరకములను సమానముగా భావించునెడ నిఁక వివేకావివేకములతో నావశ్యకమేమున్నది? ౨౭ (ఒకవేళ మీరలనఁ దలంచిన యెడల) అమృతమును విషమును నొకటియే యనుఁడు. కాని విషమును భుజించినచోఁ బ్రాణములు పోవును. కుకర్మములొనరించినచో నిందగలుగును. సత్కర్మములొనరించుటవలనఁ గీర్తి వృద్ధినొందును ౨౮ ఇహలోక పరలోకములను సంపూర్ణముగా విచారింపనియెడల నంతయు నిరర్థకము. ౨౯ కావున సాధుసజ్జనసాంగత్యము గావింపవలెను. సత్ శాస్త్రము

లనే ఆలకింపవలెను. నానాప్రయత్నములతో ఉత్తమగుణముల నభ్యసింపవలెను.

పదునెనిమిదవదశకము

మొదటిసమాసము

దేవతాస్తుతి.

ఓగజాననా! నీకు నమస్కరించెదను. ఎవ్వరును నీమహిమ నెఱుంగరు. చిన్నలకుఁ బెద్దలకు ఇంతయేల అందఱికిని నీవువిద్యాబుద్ధులను బ్రసాదించుచున్నాఁడవు ౧ తల్లీ! ఓసరస్వతీ! నీకుఁ గేలుగవమోడ్చెదను. నాలుగువాణులకును నీవె కారణమవు. నీప్రధానస్వరూపము నెఱింగినపురుషులు మిగుల నరుదుగానున్నారు. ౨ ఓచతురానన! నీకుఁ బ్రణామసహస్రము. ప్రణామసహస్రము సృష్టిరచనమును నీవ యొనర్చితివి! వేదశాస్త్రములను నానాభేదములను నీవె నెలకొల్పితివి ౩ విష్ణూ! నీకువందనములు. నీవు పాలనమునకుఁ గర్తవు. ఏకాంశమాత్రమున నీ వెఱిఁగి యెఱిఁగి జీవులను వృద్ధినొందించుచు వానితోఁ గలిసిమెలసి వర్తించుచున్నాఁడవు. ౪ ఓ (భోళా) శంకరా! నీ కనేకప్రణతులు. నీయనుగ్రహమునకు మేరయే లేదు. నిరంతరమును నీవు రామనామమును జపముగావించు సుకృతివి ౫ ఓయింద్రదేవా! నీకు అనేకధన్యవాదములు. ధన్యవాదములు. నీవు వేల్పులందఱికును వేల్పువు. ఇంద్రలోకవైభవము నెంతయసివర్ణింపఁగలను; ౬ ధర్మస్వరూపా! యమదేవా! నీకు నొసట నంజలిగీలించెద. ధర్మాధర్మముల నన్నింటిని నీవెఱుంగుదువు! మఱియు నీవు ప్రాణిమాత్రుల మర్మపుజాడలుగూడఁ దెలిసికొందువు ౭ ఓవేంకటేశ్వరా! నీమహిమ కంతము లేదు. గొప్పగొప్పమనుజులుగూడ నీయాస్థానము నందు నిలువఁబడి ప్రసాదమును గైగొందురు. (దధ్యోదనము, పొంగలి, పులిహోరమున్నగు ననేకపక్వాన్నముల స్వాదును గైకొందురు) ౮ ఓ వనశంకరీ! నీకు సాష్టాంగప్రణతులు. నీ వనేకశాకములను భుజింతువు. ఈవిధముగా వెదకి వెదకి భుజించెడివారలు ఈధరణిపై నీవుదప్ప మఱియెవరు గలరు? ౯ ఓబలభీమా! హనుమాఁతుఁడా! నీకు వందనముల నర్పించెద. పచ్చితులసి

దండలను వైకుంఠుని నీవు వక్షమునధరించితివి! తులసియాకును దినుట వలన జనులందఱకును నానందముకలుగును ౧౦ ఓఖండేరాయా! నీకు జోహారులొనరించెద. నీమేనుపసుపుననిండియున్నకతనఁ బచ్చఁగానుండును. నీసన్నిధిలో ఉల్లిగడ్డలతో నిండిన పిండివంటకముల దినుటకు జనులందఱును సిద్ధముగా నుందురు. ౧౧ ఓతుళజాభవానీ! నీకు ప్రమొక్కెదను. నీ వెల్లప్పుడును భక్తులయెడఁ బ్రసన్నభావముతో వర్తింతువు. నీసుగుణసంపద నెన్నఁగల నేర్పరి యీప్రపంచముననే లేఁడు ౧౨ ఓపాండురంగా! నీకు నొసట నంజలిగీలించెద.నీసన్నిధిలో హరికథలు ముమ్మరముగా నిరంతరము జరుగుచుండును.నానావిధతానమానములు, రాగరంగములునీసన్నిధిలో మిగుల వ్యాప్తినొందియుండును. ౧౩ క్షేత్రపాలా!నీకు దండప్రణామములు. పలువురు జనులను నీవు భక్తిభావమున లగ్నమొనరించితివి. హృదయపూర్వకముగా నీయెడ భక్తులై యున్నవారలకుఁ గామితఫలములు వెంటనే లభించును ౧౪.

ఇఁక రామకృష్ణాద్యవతారముల మహిమలన్ననో! వానికిఁ బారమే లేదు. వారలవలననే పలువురు మానవులు (భక్తియందును) ఉపాసనయందును దత్పరులైరి.౧౫ కాని యీసమస్తదేవతలకును మూలము కేవల మీయంతరాత్మయే. భూమండలమునందు సమస్తభోగములును దీనికే లభించుచున్నవి! ౧౬ అంతరాత్మయే నానావిధములగు దేవతారూపములతోఁ గూర్చుండియున్నది. మఱియు నానాశక్తిరూపములతో నిదియే ప్రసిద్ధముగా నున్నది. సమస్తవైభవములకు భోక్తసైతమిదియేసుమా!౧౭ అంతరాత్మనుగూర్చి విచారించినకొలఁది దానివిస్తారము మిగులగొప్పదని విశదమగును. ఈయంతరాత్మయే స్వయముగ ననేకదేవతలు, మనుష్యులు నగును. ౧౮ యశము, అపయశము, అతినింద, అతిప్రశంస, సమస్తభోగప్రాప్తిమున్నగునవియెల్ల నంతరాత్మకే కలుగును. ౧౯ అంతరాత్మయే దేహమునందుండి యేమిచేయుచున్నదో, ఏదేహమునందుండి యేమిభోగించుచున్నదో యెవ్వ రెఱుంగుదురు? భోగి, త్యాగి, వీతరాగి, మున్నగునవన్నియు నీయంతరాత్మయే. ౨౦ ప్రాణులు తమతమ యభిమానమునఁ దన్మయులై యుందురు. దేహమువైపుననే చూచుచుందురు. లోపలనుండియున్నను ముఖ్యమగు నంతరాత్మను బొందఁజాలరు ౨౧ ఓరీసోదరా! ఈయాత్మకృత్యములను బాగుగాఁ బూర్ణముగా నెవ్వఁడు విచారింపఁగలఁడు? మానవునకుఁ బుణ్య మగాధమైనంతన కొంచెముగనో, గొప్పగనో ఆత్మానుసంధాన మలవడును ౨౨ ఆత్మానుసంధానమైనంతనే పాపములు కాలిపోవును. అంతర్నిష్ఠులగు జ్ఞానులీయంశమును మననము గావించిచూచుచుందురు ౨౩ అంతర్నిష్ఠులగు వారలు తరింతురు. అంతర్భ్రష్టులగువారలు నశింతురు. ఏలయన? పాపము! అంతర్భ్రష్టులు పైపై లోకాచారములయందే (మగ్నులై ముఖ్యవిషయమును) మఱచియుందురు. ౨౪

రెండవ సమాసము

జ్ఞాతల సమాగమము

ఎఱుకలేనికారణమున జరిగినదేమో జరిగిపోయినది. ఇఁక నియమపూర్వకముగా నెఱుకగలిగి ప్రవర్తింపవలయును ౧ జ్ఞాతయగువానితో స్నేహమొనరింపవలెను. జ్ఞాతకు సేవయొనరింపవలెను. మెల్లమెల్లఁగ జ్ఞాతయగుపురుషుని సుబుద్ధినిగూడ నేర్చుకొనవలెను. ౨ జ్ఞాతకడఁ జదువుటయు, వ్రాయుటయు నేర్చుకొనవలెను. ఇంతయేల! అన్నివిషయముల నడుగవలెను ౩ జ్ఞాతకుపకారము గావింపనగును. జ్ఞాతకొఱకుఁ దన దేహమునేని వ్యయపెట్టవలెను. మఱియు సాధకుఁడు జ్ఞాతగావించు విచారమెద్దియో యెఱుంగవలెను ౪ జ్ఞాతసాంగత్యమునందుండి భజనము గావింపవలెను. ఆతనిసాంగత్యముతోఁ గష్టములను సహింపవలెను. ఆతనిసాంగత్యము ననుభవపూర్వకముగాఁ దెలిసికొని మానవుఁ డనుభవనీయుఁడుకావలెను ౫ జ్ఞాతచెంత గీతములనుగానము చేయవలెను. ఆయనయొద్ద వాద్యములను ప్రయోగింపవలెను. నానావిధములగు వాద్యములను వాయింపవలెను. నానావిధాలాపములు నేర్చుకొనవలెను. ౬ జ్ఞాతను అండగా నుంచుకొనవలెను. జ్ఞాతచెంత ఓషధులను గ్రహింపవలెను. మఱియు జ్ఞాతతెలుపు పథ్యమునే ముందుగ నాచరింపవలెను. ౭ జ్ఞాతవలనఁ బరీక్ష నేర్చుకొనవలెను. జ్ఞాతకడ వ్యాయామము నొనరింపవలెను. ఆయనయెదుటనే యీఁతగొట్టుట నేర్చుకొనవలెను. ౮ జ్ఞాతచెప్పినట్లు

మాటలాడవలెను. ఆయన చెప్పినట్లు నడుచుకొనవలెను. నానావిధములుగ జ్ఞాతయెట్లుధ్యానముగావించునోయట్లుధ్యాన మొనరింపవలెను ౯ జ్ఞాతచెంత కథలను నేర్చుకొనవలెను. జ్ఞాతయొక్క యుక్తుల నెఱుంగవలెను. మఱియు నాతఁడెఱింగిన ప్రతివిషయమును మననము గావింపవలెను ౧౦ జ్ఞాతపన్నుచున్నవ్యూహములను, జ్ఞాతకల్పించుచున్నయుక్తిని నెఱుంగవలెను. ఆతఁడేవిధముగా నన్యులను సంతుష్టిపరచునో యట్లే తానును స్వయముగా నెల్లరను సంతుష్టులుగా నుంచవలెను ౧౧ జ్ఞాతప్రసంగము నెఱుంగవలెను. జ్ఞాతలవర్ణమును గైకొనవలెను. జ్ఞాతయొక్క స్ఫూర్తితరంగముల నభ్యసింపవలెను. ౧౨ జ్ఞాతయొక్క యుద్యోగమును గ్రహింపవలెను. జ్ఞాతయొక్క తర్కము నెఱుంగవలెను. జ్ఞాతచెప్పకున్నను నాతనిసంకేతమును దెలిసికొనవలెను ౧౩ జ్ఞాతయొక్కవిశిష్టప్రకారచాతుర్యమును, నాతని రాజనీతిని, ఆతనినిరూపణమును వినుచుండవలెను ౧౪ జ్ఞాతయొద్ద కవిత్వమును నేర్చుకొనవలెను. గద్యపద్యముల గుర్తెఱుంగవలెను. అంతఃకరణమునం దాతనిమధురవచనములభావమును యోచింపవలెను. ౧౫ జ్ఞాతయొక్క ప్రబంధమును గాంచవలెను. ఆతని వచనభేదములు, నాతని నానావిధసంవాదములు చక్కఁగా విచారింపవలెను ౧౬ జ్ఞాతయొక్కతీక్ష్ణత, సహిష్ణుత, ఉదారత తెలిసికొనవలెను ౧౭ జ్ఞాతయొక్క నానావిధకల్పనములు, అతని దూరదర్శిత్వము, మఱియు వివంచనముఁగూడఁ దెలిసికొనవలెను ౧౮ జ్ఞాత తనకాలము నెట్లుసార్థకముచేయుచున్నదియు, ఆతని యాధ్యాత్మికవివేకమును, ఆతని గుణగణములును సంపూర్తిగా గ్రహింపవలెను ౧౯ జ్ఞాతయొక్క భక్తిమార్గమును, వైరాగ్యయోగమును, నాతని సమస్తప్రసంగమును దెలిసికొనవలెను ౨౦ జ్ఞాతయొక్క జ్ఞానమును దెలియవలెను. ఆతనిధ్యానము నభ్యసింపవలెను. జ్ఞాతయొక్కసూక్ష్మచిహ్నమును గ్రహింపవలెను ౨౧ జ్ఞాతయొక్కఅలిప్తతను, విదేహలక్షణమును, బ్రహ్మవివరణమును, దెలిసికొనవలెను ౨౨ జ్ఞాతగూడ నొకయంతరాత్ముఁడు. అతనిమహిమల నెంతదనుకఁ జెప్పశక్యమగును? ఆతనివిద్యకును, కళలకును, గుణములకును మేర నెవ్వఁడు నిశ్చయింపఁగలఁడు? ౨౧ పరమేశ్వరుని గుణానువాద మొనరించి అఖండ సంవాదము గావింపవలెను. అటు లొనరించుటవలన నఖండమగు నానం

దము లభించును ౨౪ పరమేశ్వరునిచే నిర్మింపఁబడిన దెల్ల అఖండదర్శితిగా దృష్టికిముందున్నది. కాని మాటిమాటికి విచారమొనరించి దానినెఱుంగుట వివేకవంతుల కర్తవ్యము ౨౫ నిర్మితమైన సమస్తమును భగవంతుఁడే సృజించినాఁడు. తొలుదొలుత నిర్మాణమును (దృశ్యపదార్థమును) వేఱు గావింపవలెను. (తరువాత ఈశ్వరస్వరూపమును గాంచవలెను) ౨౬ భగవంతుఁ డన్నింటిని సృజించుచున్నాఁడు. చూచినచో నాతఁడు స్వయముగా గోచరింపఁడు. కావున నాతని వివేకబలముచేఁ గనుఁగొనవలెను ౨౭ భగవంతునిపయి నఖండముగా ధ్యాన ముంచినచోఁ గృపాయుతుఁడై దర్శనము నొసంగును. నిరంతరము ఆతనియంశతో భాషింపవలెను ౨౮ ధ్యానరహితుఁడగు భక్తుఁడు, ధ్యానధారిభక్తుఁడు, భగవంతుఁడు (ఆత్మారాములగు) భక్తులను సంసారముక్తుల నొనర్చును ౨౯ ఉపాసన సమాప్తమైనపిదప ద్వైపమునకును భక్తునకును అఖండసమావేశము గలుగును. ఇది యనుభవపూర్వక విషయము. ఈ విషయమనుభవనీయుఁడై గ్రహింపఁదగియున్నాఁడు. ౩౦

మూఁడవసమాసము

సదుపదేశము.

ఈనరజన్మమే దుర్లభము. అందుఁ బూర్ణాయువింకను దుర్లభముకాన నీ నరజన్మమును వ్యర్థముగా నాశనము గావింపఁదగదు. చక్కగ వివేకము నార్జింపవలయునని "దాసు" నుడువుచున్నాఁడు ౧ ఉత్తమవిధముగా వివేకము నభ్యసింపనిచో జీవితమునం దంకటను అవివేక వర్తనమే జరుగుచుండును. మఱియుఁ బ్రాణి దరిద్రునివలెఁ గాన్పించును ౨ ఈదురవస్థను మానవుఁడు తనకుఁదానే కల్పించుకొనును. సోమరితనమే మానవులను దరిద్రులఁ జేయుచున్నది. చెడ్డవారలచెలిమి చూచుచుండగనే మానవుని ముంచివేయును ౩ మూర్ఖత్వమభ్యాసమైనచో బుద్ధిహీనతయనునది తలపై కెక్కికూర్చుండును. మఱియు నది తరుణత్వమునందుఁ జండాలవుఁబనులను జేయించును ౪ పదుచుతనమునం దొకవేళ మూర్ఖుఁడును సోమరియు నగునాతఁడు అన్నివిధములగు దుఃఖములను దరిద్రములను అనుభవించును. ఆతనికేమియు లభింపదు. ఇట్టిదశయం

దెవ్వరి సేమననగును? ౫ వానికడ ఆవశ్యకపదార్థము లుండవు. అన్న వస్త్రములుగూడ నుండవు. మఱియు నంతఃకరణమునందు ఉత్తమగుణములెవ్వియు నుండవు. ౬ ఆతనికిఁ జెప్పుటయు సిలుకడగాఁ గొంచెము సేపుగూర్చుండుటయుఁ జేతగాదు. అవసరము కొంచెమేని తెలియదు. అభ్యాసముపైవు శరీరముగాని హృదయముగాని అన్వయింపదు ౭ వ్రాయుట, చదువుట, అడుగుట, చెప్పుటమున్నగునవి యాతఁడెఱుంగఁడు. మఱియు బుద్ధిహీనతవలన నాతనికి నిశ్చయమునుగూర్చిన అభ్యాసము గూడఁ గలుగదు. ౮ ఆతఁడుస్వయముగా నేమియు నెఱుంగఁడు. అంతియగాదు ఇతరులు చెప్పునదిగూడ నంగీకరింపఁడు. స్వయముగా నాతఁడు సిచ్చివాఁడేగదా ? అట్లయ్యును సజ్జనులనుగూడ నిందజేయును. ౯ లోపలనున్నదొకటి. వెలుపలికి వెలువరించునది యొకటి. ఇట్టివివేకముగల పురుషునకుఁ బరలోక మెట్లు లభించును? ౧౦ ఇట్టిపురుషుని గార్హస్థ్య ధర్మము నాశనమగును. తరువాత నాతఁడు హృదయమునందుఁ బశ్చాత్తాపము నొందును. కావున వివేకము నభ్యసింపవలెను. ౧౧ మనస్సునేకాగ్రమొనరించి దృఢదీక్షతో సాధనము గావింపవలెను. మఱియుఁ బ్రయత్నముచేయుటలోఁ గొంచెమేని సోమరితనము రానీయరాదు. ౧౨ దుర్గుణములనన్నిఁటిని విడిచివేయవలెను. ఉత్తమగుణముల నభ్యసింపవలెను. మఱియు గహనార్థములగు ప్రబంధములను బఠించుచుండవలెను. ౧౩ పదప్రబంధములు, శ్లోకప్రబంధములు, నానావిధకవిత్వములు, ముద్రలు, ఛందస్సులు కంఠపాఠము గావింపవలెను. ఏలయన? నానావిధ ప్రసంగజ్ఞానమువలననే ఆనందము కలుగును. ౧౪ ఏప్రసంగముపై నేమినుడువుట యుచితమో యావిషయమును జక్కఁగాఁ దెలిసికొనవలెను. వ్యర్థముగ నితరుల కష్టమును భరింపవలెను? ౧౫ ఇతరుల హృదయ మెఱుంగవలెను. అభిరుచి నెఱింగ యేదేని నుడువవలెను. జ్ఞప్తికి వచ్చినదానిని బఠించి కూర్చుండుట మూర్ఖత్వము. ౧౬ ఎదుటివాని యుపాసన నెఱింగి తదనుసారముగా గానము గావింపవలెను. మఱచిపోఁదగదు. మఱియు రాగజ్ఞానమును దాళజ్ఞానమును అభ్యసించుచుండవలెను. ౧౭ సంగీత సాహిత్యముల సహాయముతోఁ బ్రసంగానుసారములగు కథలను ముమ్మరముగా వ్యాపింపఁజేయవలెను. శ్రవణమననముల సహాయమున గూఢార్థమును వెలికిఁదీయవలెను. ౧౮ చక్కఁగాఁ బాఠములు జరుగవలయును. సర్వకాల సర్వావస్థలయందును నల్లైవేయుచుండవలెను. మఱియుఁ జెప్పిన యంశమును జ్ఞాపక ముంచుకొనవలెను. ౧౯ అఖండరీతిగా నేకాంతసేవనము గావింపవలెను. సమస్తగ్రంథములను గాలించివేయవలెను. తనమున నేయర్థము నంగీకరించునో దానినే గైకొనవలెను. ౨౦

నాలుగవ సమాసము.

నరదేహమహత్త్వము.

గణేశ్వర పూజయు, శారదావందనము ఈదేహమువలననే జరుగుచున్నది. దేహమువలననేగదా గురువులు, సజ్జనులు, సాధువులు, శ్రోతలు మున్నగు వారలపనులు నెఱవేఱుచున్నవి. ౧ దేహముండుట వలననే కవితారచనము, అభ్యాసము, నానావిధ విద్యలు అలవడుచున్నవి. ౨ గ్రంథలేఖనము, నానావిధములగు లిపులను గురుతెఱుంగుట, నానా పదార్థములను విమర్శించుట దేహమువలననే కలుగుచున్నవి. ౩ మహాజ్ఞానులు, సిద్ధులు, సాధులు, ఋషులు, మునులు, మున్నగువార లనేకులు దేహమువలననే పేరొందుచున్నారు. మఱియు నీదేహమువలననే మనుజులు తీర్థాటనము గావించుచున్నారు. ౪ పురుషుఁడు శ్రవణమననములయందు మగ్నుఁడగుటయు ముఖ్యపరమాత్మను బ్రాప్తించుటయు దేహమువలననే జరుగుచున్నది. ౫ కర్మమార్గము, ఉపాసనామార్గము, జ్ఞానమార్గము మొదలగునవన్నియు దేహమువలననే సమకూరుచున్నవి. ౬ యోగులు, వీతరాగులు, తాపసులు,మున్నగువారలు నానావిధపరిశ్రమలు దేహమువలననే గావించుచున్నారు. దేహకారణముననే ఆత్మ ప్రకటనమగుచున్నది. ౭ ఇహలోకము, పరలోకము మున్నగునవి దేహమువలననే అమరుచున్నవి. దేహము లేకున్నచో అన్నియు నిరర్థకములే యగును. ౮ పురశ్చరణము, అనుష్ఠానము, ధూమపానము, శీతోష్ణసహనము, గోరాంజనము, (వాతలువేసికొనుట) పంచాగ్ని సాధనములు దేహమువలననే మానవున కేర్పడుచున్నవి. ౯ మానవులు దేహమువలననే

పుణ్యాత్ములుగను, పాపాత్ములుగను, స్వేచ్ఛాచారులుగను, పవిత్రులు
గను నగుచున్నారు. ౧౦ అవతారపురుషులు, వేషధారులు దేహము
వలననే యగుచున్నారు. నానావిధములగు దురాచారపాషండములు
దేహమువలననే యగుచున్నవి. ౧౧ విషయభోగము, సర్వత్యాగము,
నానావిధరోగములు గలుగుట,నశించుట దేహమువలననే జరుగుచున్నవి.
౧౨ దేహమువలననే నవవిధభక్తిమార్గములును, నాలుగు విధములగు
ముక్తిమార్గములును, నానావిధములగు యుక్తులును, నానామతము
లును గలుగుచున్నవి. ౧౩ దానధర్మములు జరుగుటయు నానారహస్య
ములు వెల్లడియగుటయుఁ బూర్వకర్మఫలములు లభించుటయు దేహకా
రణముననే యని జనులు నుడువుచున్నారు. ౧౪ నానాస్వార్థములు,
అర్థవ్యర్థములు, ధన్యతలు,నానాకళలు,న్యూనాధిక్యములు,భక్తిమార్గము
నందలి ప్రేమ నానావిధ సన్మార్గసాధనలు దేహమువలననే కలుగుచున్నవి.
బంధనములు దేహమువలననే తెగిపోవుచున్నవి. దేహమువలననే ఆత్మనివే
దనమై మోక్షము లభించుచున్నది.౧౫-౧౬ అన్నింటిలో దేహము ఉత్త
మమైనది. దేహమునం దంతరాత్ముఁడు వసించుచున్నాఁడు. పురుషోత్త
ముఁ డన్ని గృహములలో నున్నాఁడు. వివేకులందరి యంశము నెఱుం
గుదురు. ౧౭ దేహమువలననే నానావిధములగు కీర్తులు లభించుచు
న్నవి. మఱియు నానావిధాపకీర్తులుగూడ దేహమువలననే లభించు
చున్నవి. దేహకారణముననే అవతారపంక్తులు కలుగుట, పోవుట జరు
గుచున్నది. ౧౯ నానావిధభ్రమసంభ్రమము లీదేహమువలననే కలుగు
చున్నవి. మఱియు నీదేహమువలననే ఉత్తమోత్తమపదవులు జను లను
భవించుచున్నారు. ౨౦ దేహమువలననే సమస్తము జరుగుచున్నది.
దేహము లేకున్నచో నేమియు లేదు. దేహము లేకున్నయెడల ఆత్మకలు
గుటయుఁ గలుగకుండుటయు సమానమే. ౨౧ దేహము పరలోక నౌక.
నానాగుణనిలయము. దేహమువలననే నానాగుణరత్నవిచారము నెరవేరుచు
న్నది. ౨౨ దేహమువలననే గాయనకళయు, సంగీతకళయు నెఱుకపడు
చున్నవి. దేహయోగమువలననే అంతఃకళప్రాప్తి యగుచున్నది ౨౩ దేహ
ము బ్రహ్మాండముయొక్క ఫలము. అది మిగుల దుర్లభమైనది. ఐనను
దీనికి శుద్ధమగు బోధము నొసంగవలయును ౨౪ దేహమూలముననే పెద్ద

లు, పిన్నలు, నగు జనులెల్లరును దమతమవ్యాపారముల నొనరించుచు
న్నారు. దేహకారణముననే మానవులలో పెద్దలు, పిన్నలు అను భేద
మేర్పడుచున్నది ౨౫ దేహమును ధరించి ఈలోకమున నుదయించు
చున్న జీవులందఱును నెద్దియో కొంతపని చేసిపోవుచున్నారు. హరిభజ
నమువలన నెందఱో పావనులైరి. ౨౬ అష్టధా ప్రకృతికిమూలము కేవల
సంకల్పమే. నానాసంకల్పములే దేహరూపములగు ఫలములనుగా గొని
ప్రకటితమయ్యెను. ౨౭ హరిసంకల్పము తొలుతనుండియు నుండెను.
ఫలరూపముగా నిపుడు దానినే కాంచవలెను. వాస్తవమున కది నానా
దేహములయం దన్వేషించినచో విదితమగును. ౨౮ తీగమూలమున
బీజముండును. తీగయంతయు సంపూర్ణముగ నుదకరూపకముగ నుండును.
పిదప ఫలమునందు సైతము మూలముయొక్క యంశతో బీజముండును.
౨౯ మూలకారణమున ఫలముదయించును. ఫలకారణమున మూలము
కలుగును. సంపూర్ణబ్రహ్మాండస్థితియు నిట్టిదే. ౩౦ ఏపనియైనను దేహ
ము లేకున్నచో నెరవేరదు. దేహమును సార్థకము గావించుట
మంచిది. ౩౧ ఆత్మకారణమున దేహమేర్పడెను.
మఱియు దేహకారణమున ఆత్మ వర్తించుచున్నది. ఈరెంటిసంయో
గముచే సంపూర్ణకార్యములు జరుగుచున్నవి ౩౨ దాగియుండి మాన
వుఁడు గుప్తరూపముగాఁ గావించుపనులన్నియు నాత్మకు విశదమగును.
ఏలయున? కర్తృత్వమంతయు నాత్మదేగదా! ౩౩ దేహమునం దాత్మ
నివసించుచున్నది. దేహము పూజింపఁబడుచో నాత్మ సంతోషించును.
దేహమునకు బాధకలిగించినచో ఆత్మ క్షోభించును. ఇది ప్రత్యక్షవిష
యమేగదా ౩౪ దేహము లేకున్నచోఁ బూజ లభింపదు. దేహము
లేకున్నచోఁ బూజ అంటదు. జనులలోననే జనార్దనుఁడు వసించు
చున్నాఁడు. కావున జనులను సంతుష్టుల నొనర్పవలెను ౩౫ అత్యంత
వివేకశాలియగు మానవుఁడె ధర్మమును స్థాపింపఁ దగినవాఁడు. ఆతని
పుణ్యశరీరమే పూజనీయమైనది ౩౬ అందఱికిని సమానముగాఁ బూజిం
చుట మూర్ఖతయగును. గాడిదను పూజించుటవలన నించుకేని ఫలము
గలుగునా? ౩౭ కావున వాస్తవమున కెవ్వఁడు పూజనీయుఁడో వానిని
బూజింపవలెను. అట్లని యుపేక్షింపక యితరజనులనుగూడ సాధారణ

రీతిగాఁ బ్రసన్నులఁ జేసికొనవలెను ౩౮ సమస్తజగత్తుయొక్క హృదయము నందలి దైవము (సంపూర్ణ జనసమాజము) క్షుబ్ధమైపోయినచో నిఁక నివసించుటకుఁ దావెక్కడదొరుకును? జనులను విడిచినచో జనుల కన్య గతియేలేదు. ౩౯ పరమేశ్వరున కనంతగుణములు గలవు. పాపము! మనుష్యమాత్రుఁ డాగుణచిహ్నముల నెంతదనుక విశదపఱుపఁగలఁడు? కాని యధ్యాత్మగ్రంథముల నాలించినచో నంతయు సుబోధమగును ౪౦.

ఐదవ సమాసము

సమాధానయుక్తి.

ఏపదార్థమునైన నేకొలపాత్రముతో నేని కొలువుదురు. కాని యా కొలపాత్ర మాపదార్థమును దినదు. ఇట్లే యనేకజనులు అనేక గ్రంథములను జదివివేయుదురు. కాని వారలహృదయములయం దాగ్రంథములలోని విచార మొకటిగూడ నిలిచియుండదు ౧ పాఠమున్ననో ధారాప్రవాహముగాఁ జెప్పుకొనిపోవుదురు. అడిగినచోఁ జెప్పఁగలిగిన దెద్దియు లేదు. అనుభవవిషయము దెలుపుమనినచో వారలు గందరగోళమునఁ బడిపోవుదురు. ౨ (కాన యిట్లు కాఁదగదు) శబ్దరత్నములను బరీక్షింపవలెను. అనుభవాత్మకమగు శబ్దములను గ్రహింపవలెను. ఇతరమగు తుక్కునంతను నొకప్రక్కను విడిచివేయవలెను ౩ నామరూపములన్నింటిని గడచి పిదప అనుభవమును బ్రాప్తిగావించుకొనవలెను. సారాసారముల నొక్కటిగావించుట మూర్ఖత్వమగును ౪ చదువువాఁడు పుస్తకము నొకేవిధముగా జదువుకొనిపోవలయునా? లేక తెలిసికొని చదువవలయునా? ఈ విషయమును బాగుగా యోజింపుము. ౫ సత్యమేమన? ఎచ్చటఁ దెలిసికొనుట లేదో యచ్చట నంతయు అధ్వాన్నముగ నుండును. తెలిసికొనఁజాలనివక్త యితరు లేవిషయమున నేని సందియము తీర్పుమనినచో సమాధాన మొసంగఁజాలఁడు ౬ తెలిసికొనక విషయము గ్రహింపక కేవలము పెక్కుశబ్దములనుమాత్రము క్షుణ్ణముగాఁ గంఠస్థము గావించుకొన్నవాఁడు సభాసమాజమునందు శాస్త్రార్థప్రసంగము వచ్చినచో నోరుమెదల్పఁజాలఁడు. ఆతఁడు నేర్చిన విద్యవలని యుపయోగముగూడ నుండదు ౭ తిరుగలియందుఁ ద్వరత్వరగాఁ బిడికిళ్ళఁ గొలఁది

ధాన్యమును బోసి విసరుచున్నచో మెత్తనిపిండి యెట్లుపడఁగలదు? ౮ నోటినిండ త్వరత్వరగా నొకదానివెంట నొకటిగా ముద్దలు పెట్టుకొనెను. నమలుట కవకాశము కలుగలేదు. నోరంతయు నిండిపోయెను. త్రిప్పినఁ దిరుగదు. ఇఁక సప్పు డెట్లు జరుగవలయును? ౯

శ్రోతలారా! ఇపు డీవిషయమును శ్రద్ధతో వినుండు. సభయందు వ్యాఖ్యాత కర్తవ్య మేదియో తెలుపుదు. వ్యాఖ్యాత యొక క్షణమాత్రమేని శ్రోతలకు రసహీనముగా నుండున ట్లుపన్యసింపఁగూడదు. అందరియంతఃకరణములను సంభాళించుచుండవలెను. ౧౦ సూక్ష్మవిషయముల నవశ్యముగాఁ బ్రకటింపవలెను. కాని వానినన్నింటి నంతకుమున్న స్వయముగాఁ దెలిసికొనియుండవలెను. అట్లు తెలిసికొన్న యంశములనే శ్రోతకులకు బోధింపవలెను ౧౧ వక్త సభలో గొప్ప గొప్ప కఠినప్రశ్నలకు సమాధానము చెప్పుచున్నచో శ్రోతలకు మిగుల నానందము కలుగును. మఱియు వార లావక్తను మిగులఁ బ్రశంసింతురు ౧౨ కఠినసమస్యలను సాధించిన పిదప వక్తను సభ్యులు మిగుల బ్రశంసింతురు. కాని యొకవేళ నేదేని ప్రసంగమునందలి సమస్యను సాధింపలేక పోయినచో (భయపడినచో) నప్పుడు శ్రోతలు నిందఁగూడఁ జేయుదురు. ఆపరిస్థితులలో శ్రోతలపై వక్త అనిష్టపడవలసిన యవసరమేమున్నది? ౧౩ ఒఱపిడిఱాతివయి నరుగదీసిచూచియుఁ, గొలిమిలోఁ గాచియు బంగారమును బరీక్షించి గైకొను విధమున వక్తయొక్క శ్రవణమననముల ముఖ్యానుభవము నెఱింగి యాతనివాక్కులఁ బరిగ్రహింపవలెను ౧౪ వైద్యునిమీఁద విశ్వాసము గలుగదు. వ్యాధి నివారణముగాదు. ఈస్థితిలోఁ గ్రోధపడుటవలన లాభమేమి? ౧౫ అసత్యము నెరవేరునది కాదు. దాని నెవ్వరును నంగీకరింపరు. కావున సత్యమును గ్రహింపవలెను ౧౬ వ్రాయుట, చదువుట నేర్చుకొనక వ్యాపారముగావించుచో నది కొలఁది దినములు మాత్రము నడచును. ఎచటనైన నెవరేని లెక్కనెఱింగినవారలు తటస్థమైరా వెంటనే యసత్యము వెల్లడియగును. ౧౭ ప్రమాణసాక్ష్యసహితముగా లెక్కనంతయు శుభ్రముగ నుంచవలెను. ఇట్లుంచినచో లెక్కనెఱింగినవాఁ డేమియుఁ జేయజాలఁడు. ౧౮ స్వయముగా నజ్ఞానమునమగ్నుఁడైనవాఁడు అన్యుల కెట్లు బోధింపఁ గలఁడు? ఎవ

కైనఁగానిమ్ము అజ్ఞానమువలన సంకటములలోఁ బడుచునేయున్నారు ౧౯
బలములేదు. యుద్ధములోని కరిగినాఁడు. అతఁడు దప్పక పరాజయ
మొందితీరును. ఈదోష మెవ్వరిది? ౨౦ అనుభవములోనికి వచ్చుసత్యవిష
యమును ఆదరపూర్వకముగా గ్రహింపవలెను. అనుభవరహితమగుమాట
పొల్లువంటిదని యెఱుంగవలెను ౨౧ (అనుభవరహితముగా) నేర్పుటవ
లన (ప్రోత్సహించుటవలన) క్రోధముగలుగును. కాని వెనుకనుండి
పశ్చాత్తాపము గలుగును. ఏలయన! మిథ్యానిశ్చయము తత్కాలమున
నే యెగిరిపోవును ౨౨ సత్యమునువిడిచి మిథ్యాగ్రహణ మొనరించినచో
హానికలుగును. పరమాత్మని న్యాయానుసారముగా నడువవలెను. ౨౩
న్యాయమునుదొలంగినచోఁ బ్రపంచమంతయు నిందఁగావించును. ఎంత
మందితోనని పోరాడి కష్టములను సహింపశక్యమగును? ౨౪ అన్యాయ
మువలన నెప్పుడును నెవ్వరికిని మేలుగలుగదు. అసత్యమునం దభిమాన
ముంచుట వెఱ్ఱితనము ౨౫ అసత్యము పాపము. సత్యము పరమాత్మస్వరూ
పము. ఈరెంటిలో నెయ్యది గ్రాహ్యమో యిఁక యోచింపుఁడు ౨౬ చె
ప్పుట, నడుచుట మున్నగునదంతయు మాయయందున్నది. మాయలేకు
న్నచో మాటలాడుటయే యసంభవము. కావున నిశ్శబ్దము నన్వేషింప
వలెను ౨౭ వాచ్యాంశము నెఱింగి త్యజింపవలెను. లక్ష్యాంశమును వివరణ
మొనర్చి గ్రహింపవలెను. ఇట్లొనరించినచో నిశ్శబ్దపుజాడ తెలియును.
౨౮ పూర్వపక్షమగు అష్టధాప్రకృతినివిడిచి అలక్ష్యమునందు లక్ష్యముం
చవలెను, మననశీలుఁడును బరమదక్షుఁడును నగునాతఁడే యీవిషయ
మును నెఱిఁగియుండును ౨౯ పైనుండు నానావిధములగు
పొట్టును ధాన్యమును నొకటియే యనుటయనృతము.
నీరసమును రసమును నొకటిగాఁ దలఁచి చతురుఁడగువాఁ
డెన్నఁడును నీరసమును సేవింపఁడు. ౩౦ పిండమునందు నిత్యానిత్యవిచార
మును, బహుప్రకారములతో బ్రహ్మాండమునందు, సారాసారవిచార
మును గావించి అన్నింటిని శోధించి సారమునుమాత్రము గ్రహింప
వలెను ౩౧ అన్వయము, వ్యతిరేకము మున్నగునవియెల్ల మాయాకారణ
ములుగ నున్నవి. ఒకవేళ మాయయే లేకున్నచో వివేక మెట్లుసాధ్య
మగును? ౩౨ సంపూర్ణతత్త్వములను శోధింపవలయును. మఱియు మహా

వాక్యములయందుఁ బ్రవేశ మొనరించి ఆత్మనివేదనమువలన సమాధా
నము గడింపవలెను. ౩౩

ఆఱవ సమాసము.

* దివ్య గురూపదేశము.

శరీరమును నానావిధములగు వస్త్రములచేతను భూషణములచేతను
ఎట్లలంకరింతుమో యట్లే వివేకముతో, విచారము
తో, రాజనీతితో అంతఃకరణమునుగూడ నలంకరింపవలెను ౧ శరీరము
మిగులసుందరముగను తేజోయుక్తముగను వస్త్రభూషణములతో సజ్జితము
గను నున్నను అంతఃకరణమునందుఁ జాతుర్యబీజములు లేకున్నచో నది
యెప్పుడును శోభనొందఁజాలదు ౨ నోటిదురుసుదనము గలవాఁడును, నీచుఁ
డును, కఠోరవచనుఁడును, అభిమానమగ్నుఁడును న్యాయనీతులను గ్రహిం
పఁజాలనివాఁడును ౩ దుష్టుఁడును నిరంతరము శీఘ్రకోపియు, మర్యాదా
హీనుఁడును రాజనైతికయుక్తుల యోజించుటలోఁ బాల్గొననివాఁడును ౪
నగుఉద్దండుఁడు, అప్రమాణికుఁడునైనవాని మాటలలో సత్యస్పర్శ మెప్పుడు
ను నుండదు. వానిని పాపియని, మూర్ఖుఁడని యనవచ్చును. ఇట్టిమనుజులు
రాక్షసులు సుమా ౫ ఎప్పుడును నొకవిధమగు నవసరము రాదు.
నియమములుగూడ నొకవిధమగు పని నొసంగవు. నియమములు బెట్టు
కొని కూర్చున్నచో రాజనైతికయుక్తి ప్రయుక్తులందు మోసము వాటి
ల్లును ౬ (కావున మిత్రుల నియమవంతుఁడు కాఁగూడదు) అతియనుదా
నిని అన్నివిషయములందును రానీయఁదగదు. (అతిసర్వత్రవర్జయేత్)
చూచి నడువవలయును. వివేకశాలియగు పురుషుఁడు దురాగ్రహమునకు
లోనుగాఁ జనదు ౭ మిక్కిలిగా హఠముగావించినచో వ్యవహారము చెడి
పోవును ౮ ఈశ్వరుఁడు తన భక్తులయెడ నభిమానముంచును. మఱియు
"తులజాభవాని"కిఁగూడ మనయం దనుగ్రహముగలదు. కాని ప్రతి
కార్యమును విచారించి చేయవలెను ౯ అఖండమగు జాగరూకతతో
నుండవలెను. ఇంతకంటె నధికముగా సూచనగావింపవలసిన దేద్దియున్న

---

* అఫ్జల్‌ఖానుని వధించినప్పుడు శ్రీఛత్రపతి శివాజీ మహారాజునకు శ్రీసమర్థరామ
దాసస్వామి ఈసమాసము నుపదేశించెనని చెప్పుదురు.

ది. ఐనను అన్నివిషయములను జక్కఁగఁ దెలిసికొనవలెను ౧౦ సమర్థుఁ
డగుపురుషునికడఁ బలువురుజనులుండురు. ఆజనులందఱియెడ నభిమాన
ముంచవలెను. ఇట్లుచేయుటవలన జనులు నిశ్చలమనస్కులై యుందురు ౧౧
ఇప్పుడిచట దుష్టులు మిగుల వృద్ధినొందిరి. చాలదినములనుండి వారల
వలని యుపద్రవ మతిశయించుచున్నది. కావున అఖండరీతిగా సావధాన
ముతో నుండవలయును ౧౨ ఈశ్వరుఁడు సమస్తమునకును కర్త. ఎవ్వని
నీశ్వరుఁడు తనవానిగాఁగైకొనునో ఆపురుషుని విచారమును బ్రత్యేక
ముగా గ్రహించును ౧౩ న్యాయము, నీతి, వివేకము, విచారము,నానా
విధప్రసంగములు, మఱియు నితరులమనస్సులను బరీక్షించుశక్తి ఈశ్వ
రుఁ డనుగ్రహింపవలసినవి ౧౪ మహాయత్నములు, హెచ్చరిక, సమయ
మునకు ధైర్యముగలిగియుండుట, అద్భుతకార్యములనొనర్చుట, ఇవి
యీశ్వరుఁడు బ్రసాదింపవలసిన గుణములు ౧౫ యశము, కీర్తి, ప్రతా
పము, మహిమ, అపరిమితములగు నుత్తమగుణములు, అను సమత్వము
ఈశ్వరుఁ డనుగ్రహింపవలసిన గుణములు ౧౬ దేవబ్రాహ్మణులపై శ్రద్ధనుం
చుట, ఆచారవిచారములతో సంచరించుట, ఎందఱోజనుల కాశ్రయ
మొసంగుట, పరులకుఁ జేతిమీఁదుగా నుపకారము జరుపుట, ఈశ్వర
దత్త విషయములు ౧౭ ఇహలోకపరలోకములను సంభాళించుకొనుట,
అఖండమగు సావధానతతో వర్తించుట, పెక్కుమందిని సహించుట ఈ
శ్వరదత్తగుణములు ౧౮ పరమాత్మపక్షమును గ్రహించుట, బ్రాహ్మ
ణునిగూర్చి చింతించుట, పెక్కండ్రను బరిపాలించుట, ఈశ్వరుఁ డనుగ్ర
హించినచో జరుగును ౧౯ ధర్మస్థాపనముగావించునరులు ఈశ్వరావతార
ములు. ఇట్టిమనుజు లిదివఱ కెందఱో జనించిరి. ఇఁకముందు జనింప
నున్నారు. ఈస్థితి గల్పించువాఁ డీశ్వరుఁడు. ౨౦ ఉత్తమగుణగ్రాహకత్వ
ము, తీక్ష్ణమగుతర్కము, వివేకము, ధర్మవాసన, మఱియుఁ బుణ్యశ్లోక
త్వము, ఈశ్వరుఁ డనుగ్రహింపవలసినవి. ౨౧ ఎప్పుడును దీరుమానము
లను యోచించుచుండవలెను. వివేకముతోఁ బ్రవర్తింపవలెను. ఇదియే
సకలగుణసారము. దీనివలన ఇహలోక పరలోకములను రెంటిని సాధింప
వచ్చును. ౨౨

ఏడవసమాసము

లోకులస్వభావము.

లోకులస్వభావము దురాశాయుతముగా నుండును. ఆరంభము
నందే "తెమ్ము తెమ్ము" అందురు. వారలకు "మాకేమైననిమ్ము" అనువా
సనవిడివిగా నుండును ౧ భక్తితోనుండకయే లోకులు ఈశ్వరప్రసన్నత్వ
మును గోరుదురు. ఇది యజమానునికి సేవ గావింపకయే
వేతనమునిమ్మని కోరుటవంటిది ౨ కష్టపడనియె
డల ఫలము లభింపదు. శ్రమపడకున్నచో రాజ్యము లభింపదు. మఱియుఁ
బ్రయత్నము గావింపకున్నయెడల లోకమునందు సాధ్యమగునదిగూడఁ
బూర్ణముగ నెరవేరఁజాలదు. ౩ సోమరితనమువలనఁ గార్యము నాశన
మగుట మనము ప్రత్యక్షముగాఁ జూచుచున్నారము. ఈయంశము
నెఱింగియు హీనజనులు పరిశ్రమ గావింపవలసినచో దేహము దాచు
కొందురు. ౪ తొలుదొలుత పరిశ్రమదుఃఖము సహించువారలే యనం
తరము సుఖఫలము ననుభవింతురు. తొలుదొలుత సోమరులై కూర్చుం
డువారలు ముందుముందు దుఃఖముల ననుభవింపవలసి యుందురు. ౫
ఇహలోకమైన (స్వార్థము) గానిమ్ము. పరలోకమైన (పరమార్థమైన)
గానిమ్ము, ఈరెంటికిని బ్రయత్నము చేయవలసియేయున్నది. దూరదర్శి
త్వము మిక్కిలి యావశ్యము. ౬ సంపాదించినదంతయు నెప్పటిదప్పుడు
తినివేయుమానవులు కఠినసమయమేతెంచినపుడు క్షుధార్తులై మరణిం
తురు. కావున దూరదర్శిత్వము గలిగి వర్తించువారలే సుఖులైయుం
దురు. ౭ ఇహలోకముకొఱకు ధనమును, బరలోకము కొఱకుఁ బరమా
ర్థమును సంచితము గావింపనిచో జీవితమంతయు వ్యర్థమే! ఇట్లు గావిం
పనిమనుజులు బ్రతికియున్నను జచ్చినవారలేయని నమ్ముము. ౮ ఒకసారి
మరణించినంతమాత్రమున బంధములు విడిపోవఁజాలవు. అనేకజన్మము
లెత్తి యాతనల ననుభవింపవలసియున్నది. ఈవిధముగాఁ దన్నెవఁడు
చంపుకొనుచున్నాఁడో (విముక్తి నొందింపకున్నాఁడో) యాతఁ డాత్మ
హంతకుఁడు. ౯ ప్రతిజన్మమునందును ఆత్మఘాత జరుగుచున్నది. ఆజన్మ
ముల నెవ్వఁడు లెక్కింపఁగలఁడు? ఈప్రకారముగనున్న జన్మమృత్యువు
లెప్పు డాగిపోఁగలవు? ౧౦ ఈశ్వరుఁ డంతయుఁ జేయుచున్నాఁడని

ప్రాణిమాత్రులెల్లరును నుడువుచున్నారు. కాని యాతని సమావేశలాభము మిగులఁగొలఁదిగ (ఒకానొకనికి మాత్రమే) కలుగును. ౧౧ వివేకలాభమువలనఁ బ్రహ్మాత్ముఁడు లభించును. వివేకులగు పురుషులకే వివేకము లభించును. ౧౨ పరమాత్ముఁ డొక్కఁడు. కాని యాతఁడు చేయుచున్న వనేకములు. ఆయనేకములను (దృశ్యములను) ఒకటియని (పరమాత్మయని) చెప్పఁగూడదు. ౧౩ దైవకర్తృత్వము, దైవము, అను నీరెంటి యభిప్రాయమును దెలిసికొనవలెను. ఎందఱో మనుష్యులీయంశమును దెలిసికొనక వ్యర్థముగా నేదియో వదరుచుందురు. ౧౪ అవివేకులు మూర్ఖత్వకారణమున వ్యర్థముగా నేదియో భాషింతురు. ఇంకేమియు లేదు. తాము చతురులమని వెల్లడించుటకే యట్లు చెప్పుదురు. వాస్తవమునకు సత్యమగు చాతుర్యమును ప్రకటింపవలసిన యావశ్యకమే యుండదు. అది (చాతుర్యము) స్వయంప్రకాశమై యున్నది. ౧౫ మిగుల శ్రమనొంది కష్టములనుసహించి ప్రయత్నించు మానవుఁడు భాగ్యవంతుఁడై సుఖముల ననుభవించును. అభాగ్యులగు జనులు నోటికి వచ్చినట్లు చెప్పుచునే యుందురు. (కానిచేయురు) ౧౬ అభాగ్యుని దరిద్రలక్షణములను విచక్షణపురుషులు తెలిసికొందురు. కాని యోగ్యుని యుత్తమగుణము లభాగ్యున కెన్నఁటికిని దెలియవు. ౧౭ అభాగ్యునకు దుర్బుద్ధి పెంపొందును. వానికి జ్ఞానస్మృతి యెక్కడనుండును? వానికిఁ గుబుద్ధియే సుబుద్ధిగాఁ దోఁచును. ౧౮ స్మృతిదప్పినమనుజుఁడు భాషించు ప్రసంగమున దేనిని సత్యమని విశ్వసింపవీలగును? స్మృతిహీనునికడ యోచనయనునది నామమాత్రమునకైన నుండదుగదా? ౧౯ విచారము (యోచన) వలన ఇహపరలోకములు రెండును లభించును. జన్మము సార్థకమగును. కావున యోచించి నిత్యానిత్య వివేచనము గావింపవలెను. ౨౦

ఎనిమిదవ సమాసము.

అంతర్దైవనిరూపణము.

బ్రహ్మము నిరాకారము, నిశ్చలము. ఆత్మ వికారయుతము,

చంచలము. కాని జనులెల్లరును దానినే (ఆత్మనే) దైవమని నుడువుచున్నారు. ౧ దైవముయొక్క జాడపోడలే చిక్కకున్నవి. ఒక్కదైవమేని నిశ్చయముగా విశదమగుటలేదు. ఎందఱో దైవములు గలరుగదా? అందొక్క దైవమేని యనుమానములోనికి రాకున్నది. ౨ కావున సారాసారవిచారము గావింపవలసిన యావశ్యకము కలదు. విచారసహాయమున దైవమును శోధింపవలెను. పెక్కుదైవములను తలంపునకుఁ దెచ్చుకొని తికమక పడఁదగదు. ౩ జనులు తీర్థక్షేత్రములకేగి యచటఁగల దైవప్రతిమలనుగాంచి వానికి సమానముగా ధాతువులతో దైవప్రతిమల నిర్మించుచున్నారు. ఇట్లే యీవాడుక భూమండలమునందంతట నెగఁబ్రాకినది. ౪ కేవలక్షేత్రదైవమే నానావిధక్షేత్రదైవములకు మూలము. ఈభూమండలమున నున్న నానావిధక్షేత్రములను శోధించిచూడవలెను. ౫ క్షేత్రదైవము పాషాణముతో నిర్మింపఁబడినదిగా నుండును. దానిగూర్చి యోచించినచో దానిమూలతంతువు (అవిగ్రహరూపము) అవతారము ననుసరించియున్నట్లు విశదమగును. ౬ అవతారములైకొని (దేహధారణ మొనరించి) దైవతములు వర్తింతురు. అంత్యమునందు వారల యవతారములు సమాప్తమగును. బ్రహ్మవిష్ణుమహేశ్వరు లాయవతారమూర్తులకంటెను గొప్పవారలుగ గణింపఁబడుదురు. ౭ కాని యీత్రిమూర్తులపైని సత్త (అధికారము) గలది అంతరాత్మయే. వాస్తవమునకుఁ బ్రత్యక్షముగఁ గర్తయు, భోక్తయు నంతరాత్మయే. ౮ అనేకయుగములదనుక నంతరాత్మయే యీమూఁడులోకముల వ్యాపారమును నడుపుచుండును. ఈనిశ్చయవివేకమును వేదశాస్త్రములయందుఁ జూడవలయును. ౯ అంతరాత్మయే చేతనరూపముతో వివేకవశమున సమస్తశరీరవ్యాపారమును నడుపుచున్నది. ౧౦ ఈయంతర్దైవతమును జనులు మఱచిపోవుచున్నారు. మఱియుఁ బరుగులెత్తి తీర్థస్థానముల కరుగుచున్నారు. పాపము! ప్రాణులెల్ల రీవిధముగా దేవుని గుర్తెఱుంగజాలక కష్టములను భరించుచుందురు. ౧౧ అనంతరము మనస్సులం దిట్లు విచారింతురు. "ఎచ్చటఁ జూచిన నచ్చట (తీర్థస్థానములయందు) జలము, రాళ్ళు నిండియున్నవి. వ్యర్థముగ నడవులనుబట్టుకొని తిరుగుటవలన నేమిలాభము గలుగును?"

ఇట్టి యోచన కలిగినవాఁడు సత్సాంగత్యము గావించును. సత్సంగము వలన బెక్కండ్రకు దైవము లభించెను. ౧౩ ఇట్టి వివేకసంబంధములగు నీవిషయములను వివేకులగుపురుషులు నిశ్చయముగా నెఱుంగఁగలరు. అవివేకులు భ్రమలోఁబడి మఱచియుందురు. అవివేకుల కిట్టివిషయములు తెలియవు. ౧౪ ఎవుట వానియంతఃకరణమునందుఁ బ్రవేశముగావింపఁగల పురుషుఁడే లోపలిస్థితి గ్రహించును. కేవలము పైపై మెరుంగులఁ గాంచువాఁడెద్దియు నెఱుంగఁజాలఁడు. కావుననే వివేకులు చతురులు సగుమనుజులు అంతఃకరణమును శోధింతురు. ౧౫ వివేకరహితముగు భక్తియున్నను లేకున్నను నొక్కటియే. ప్రతిమాదైవతము మూర్ఖునికొఱకని చెప్పుచున్నారు. (ప్రతిమాస్వల్పబుద్ధీనాం) ౧౬ విచారముగావించుచుఁ దెలిసికొనుచుఁ దనజీవితమును గడపుమానవుఁడే యుత్తమవివేకి. వాఁడే తత్త్వములను (స్థూలదృశ్యమును) విడిచి నిరంజనమును (పరబ్రహ్మమును) బడయును ౧౭ ఆకారమునకు సంబంధించిన దంతయు నాశనమగును. వాస్తవమునకు ఈజంజాటములన్నిఁటికంటెను వేఱుగానున్నదానినే పరబ్రహ్మమని యెఱుంగవలెను. ౧౮ దైవతము చంచలము, పరబ్రహ్మము నిశ్చలము. పరబ్రహ్మమునందు భ్రమలేదు. ప్రత్యయజ్ఞానము వలన (అనుభవజన్యజ్ఞానముచే) భ్రమ దూరమగును. ౧౯ ప్రతీతిలేక చేయునదియెల్ల వ్యర్థమగును. మఱియుఁ బ్రతీతిరహితులగుప్రాణులు కష్టము లనుభవించి కష్టములలోనుండి కర్మబంధములలోఁ దగుల్కొని మరణింతురు ౨౦ ఒకవేళ కర్మనుండి వేఱుగాకున్నచో (ఒకవేళఁ గర్మఫలమునే కోరవలసినచో) ఇఁక నీశ్వరభజనము నేలకావింపవలయును? ఈవిషయమును వివేకశాలురగుపురుషులు స్వాభావికముగనే యెఱుంగుదురు. మూర్ఖులెఱుంగరు ౨౧ కొంచెము యోచించినచో జగత్తులోఁ బరమేశ్వరుఁడున్నాఁడని విశదమగును. సగుణమువలననే నిశ్చయముగ నిర్గుణము లభించును. ౨౨ సగుణమును యోచించుచు దానిమూలము దనుక నరిగినపిదప సులభముగనే నిర్గుణము లభించును. మఱియు సంగత్యాగమువలనఁ బ్రాణి స్వయముగా బ్రహ్మరూపమై ముక్తినొందును. ౨౩ పరమేశ్వరు ననుసంధానముగావించుమానవులు పావనులగుదురు. ముఖ్యముగా జ్ఞానమువలననే విజ్ఞానము (మోక్షము) లభించును ౨౪

ఈ వివేకాంశములను సుచిత్తముతో అంతఃకరణమునందు యోచింపవలెను. నిత్యానిత్యవివేకము నాలించుటవలన జగత్తున కుద్ధారణమగును ౨౫.

తొమ్మిదవ సమాసము
నిద్రానిరూపణము.

ఆదిపురుషునకు నమస్కరించి నిద్రావిలాసమును (సుఖనిద్రను) వర్ణించెదను. గాఢనిద్రవచ్చినచో నెంతపోఁగొట్టుకొన్నను బోదు. ౧ శరీరమునందు నిద్ర వ్యాప్తముకాఁగానే సోమరితనము, ఆవలింతలు, ఒడలువిఱుపు జనించును. అందుచే నిముసమేని కూర్చుండఁజాలరు. ౨ (నిదురకుముందు) త్వరత్వరగా ఆవులింతలు వచ్చును. అందుచే జనులు చటచట చిటికెలు ప్రయోగింతురు. మఱియు వంగివంగి మిగుల గునికిపాట్లు బడుదురు ౩ కొందఱుకొందఱు నిదురవచ్చినప్పుడు మందగతిగానుందురు. కొందఱికిఁ గన్నులు మూఁతబడును. కొందఱులికిపడి నలుదెసలు గాంతురు ౪ కొందఱు బోరగిల పడిపోవుదురు. బ్రహ్మవీణను బగులఁగొట్టుదురు. డమరు (వాద్యవిశేషము) ముక్కలుముక్కలగును. అప్పటికిని దెలివిరాదు. ౫ ఆనుకొని కూర్చుండి కొందఱు గురకఁబెట్టుట కారంభింతురు. కొందఱుత్తానులై సాచుకొనిపరుందురు ౬ ముడుచుకొని కొందఱు, పొరలుచుఁ గొందఱు, నలువైపులఁ జక్రాకారముగాఁ దిరుగుచుఁ గొందఱు బరుందురు. ౭ కొందఱు చేతులను గదుల్తురు. కొందఱు పాదములు గదుల్తురు. కొందఱు కట్టుకఱుమని దంతములతోఁ గొఱుకుకొందురు ౮ కొందఱు కట్టుబట్టలు వీడిపోవుటచే దిస్సమొలతోఁ బొరలుదురు. కొందఱు వెండ్రుకలముడివీడి నలుమొగములనావరించుకొనఁ బడియుందురు ౯ కొందఱస్తవ్యస్తముగఁ బొరలుచుందురు. కొందఱు పీనుఁగులవలెఁ గనిపింతురు. కొందఱు నోరుతెఱచుకొని దంతముగనిపించునట్లు పడియుంటచే భూతములవలె వికారముగ గనిపింతురు ౧౦ కొందఱు గుబులిడుచుఁ బ్రక్కమీఁదినుండి లేతురు. కొందఱు చీఁకటిలోఁ జేతులుజాడింతురు. కొందఱు ప్రక్కచివర నొదిగి పరుందురు ౧౧ కొందఱు వుణికిరింత లొనర్తురు. కొందఱు భూమిని

దేవులాడుదురు. కొందఱు లేచి (నిద్రమత్తుచే) దారితెన్నుఁ యోచింపక యేదేని యొకదిక్కున కరుగుదురు ౧౨ కొందఱు గుఱ్ఱుపెట్టుదురు. కొందఱు వెక్కి-వెక్కి యేడ్తురు. కొందఱు మిగులసంతోషముతోఁ గిలకిలమని నవ్వుదురు ౧౩ కొందఱు ప్రలాపింప నారంభింతురు. కొంద ఱఱితురు. కొంద ఱులికిపడి తమస్థానముననే పడియుందురు ౧౪ కొందఱు క్షణక్షణమునకును గుఱ్ఱుగుఱ్ఱుమని దగ్గుదురు. కొందఱు తలగోకుకుందురు. మఱియు నెక్కువగాఁ గాండ్రింతురు ౧౫ కొందఱికి (పెదవిచివరనుండి) లాలాజలము కారుచుండును. ఒకానొకఁడు తాంబూలము నమలి రసమును విడుచుచుండును. ఒకఁడు ప్రక్కలోనే హాయిగా లఘుశంకను విడుచును ౧౬ కొంద ఱపానవాయువులు విడుతురు. కొంద ఱజీర్ణముచేఁ ద్రేన్పులు విడుతురు. కొందఱు దగ్గిదగ్గి పరున్నస్థలమునకుఁ జేరువనే (మంచిచెడ్డలుగమనింపక) ఉమ్మివేయుదురు ౧౭ కొందఱు మలమువిడుతురు. కొందఱు వాంతిగావించుకొందురు. కొందఱు కాండ్రింతురు. కొందఱు తుమ్ముదురు. కొంద ఱస్పష్టస్వరముతో మంచితీర్థము కావలయునందురు ౧౮ కొందఱు స్వప్నములచే వ్యాకులు లగుదురు. కొందఱు మంచిస్వప్నములుగాంచి యానందింతురు. కొందఱు సుషుప్తికారణమున గాఢనిద్రామత్తులై యొడలెఱుంగక పడియుందురు ౧౯ తెల్లవారు జామైనది. ఒకఁడు చదువుట కారంభించుచున్నాఁడు. ఒకఁడు ప్రాతస్స్మరణమునకో, హరికీర్తనమునకో పాల్గొనుచున్నాఁడు ౨౦ కొందఱు ధ్యానమూర్తిని స్మరింతురు. కొంద ఱేకాంతమున జపముచేయుదురు. కొందఱు తాము కంఠస్థమొనరించినదానిని వల్లెవేయుదురు ౨౧ కొందఱు తమతమయభిరుచుల ననుసరించి నానావిద్యలను నానాకళలను నేర్చుకొందురు. కొందఱు తానమానములతో గాయనకళ లభ్యసించుచు గానమొనరింతురు ౨౨ వెనుకటినిద్ర సమాప్తియగును. మెలకువగలుగును. కావున మనుజులు తమతమప్రయత్నములలోఁ బాల్గొందురు. ౨౩ జ్ఞాతయగుపురుషుఁడు తత్త్వమును (దృశ్యమును) లంఘించివేయును. తురీయదశ కావలిప్రక్కకు వెడలిపోవును. మఱియు నాత్మనివేదనమువలన బ్రహ్మరూపుఁడగును ౨౪.

పదియవసమాసము

శ్రవణవిశేషము.

ఏదేని యొకకార్యమును నిర్వహింపనెంచినచో మధ్యమధ్య నేదేని విఘ్నము వచ్చుచుండును. కాని సమయము సహాయమైనపక్షమున (కాలమనుకూలించినచో) ఆకార్యము దానికదియే నెఱవేరును ౧ కార్యము నెఱవేరినచో మానవునకు సుఖముగలుగును. దినదినమును (ముందుగావలసిన) ఆలోచన స్ఫురించుచుండును. ౨ ప్రాణి యెవ్వఁ డవతీర్ణుఁడగునో యప్పుడు కాల మేమాత్రముగానైన ననుకూలమేయగును. పరమేశ్వరుఁ డనుగ్రహశాలియై దుఃఖాంతరమున సుఖమునే యిచ్చుచుండును. ౩ కాలమంతయు సాధారణముగా ననుకూలముగా నమరియున్నచో జనులందఱును రాజులై యుండెడివారలే! సారాంశమేమన! కాలము కొంతకాల మనుకూలముగనుండును. కొంతకాలము ప్రతికూలముగనుండును ౪ ఇహలోకము పరలోకము అనునీరెంటిలో నేవిషయము నేని సాధింపవలయునన్న ఈశ్వరదత్తమైన స్వాభావికము, అద్భుతము నగువివేకము గావలయును. ౫ వినక యే విషయ మవగాహనమగుటయు నేర్వక యే చతురత్వములవడుటయు విన్నదిగాదు కన్నదిగాదు. ౬ వినుటవలన విషయము విదితమగును. విశదమైనకొలది వృత్తిశుద్ధమగును. దానిచే సారాసారనిర్ణయము మనస్సున స్థిరముగాఁ బాదుకొనును ౭ వినుటను శ్రవణమందురు. విన్నవిషయమును హృదయమున మాటిమాటికి యోచించుట మననమందురు. ఈరెండుపాయములవలననే త్రిలోకవ్యాపారము జరుగుచున్నది ౮ శ్రవణమునఁ గలుగు బహువిధవిఘ్నములనెంతదనుక లెక్కింపఁగలము? కాని సావధానహృదయులైయున్నచో నవిఅన్నియు ననుభవములోనికి వచ్చును. ౯ శ్రవణమునందు (మొదటినుండియు) గూర్చుండియున్నవారలు వ్యాఖ్యాతచెప్పఁగాఁ జెప్పఁగా ఏకాగ్రచిత్తులగుదురు వెనుకనుండి శ్రవణమునఁ బ్రవేశించినవారలు ఏకాగ్రచిత్తులు కాఁజాలరు ౧౦ వెలుపల దిరిగివచ్చినమనుజుఁడు నానావిధవిషయములను వినవచ్చును. కావున నాతఁ డంతయో యింతయో కదలిక గలిగించితీరును. మౌనముగాఁ గూర్చుని యుండఁడు ౧౧ సందర్భమును బరికించి నడచుమనుజులు మిగులఁ దక్కు-

వగా నున్నారు. ఇఁక శ్రవణమునందుఁ గలుగు విఘ్నముల నాలింపఁ గోరెదను ౧౨.

శ్రవణమునఁ గూర్చున్నంతనే తొలుత ఒడలు విఱువు వచ్చును. తరువాత నిద్రాకారమునఁ ద్వరత్వరగా ఆవలింత లారంభించును ౧౩ కొందఱు సుచిత్తులై కూర్చుందురు. గాని విషయము వారిహృదయమున కంటదు. వారలు వెనుక విని యున్న యంశములనే మనస్సులోఁ బెట్టుకొందురు. ౧౪ శరీరమును మాత్రము వినుటకుఁ దత్పరముగా వింతురుగాని మనస్సులోని కితరవిషయములే వచ్చును. మనస్సులోనికి వచ్చు తలంపుల నెంతదనుక వర్ణింపగలను ? ౧౫ విన్నయంశములను మననముగావించినప్పుడే విషయము కొంతకొంత బోధపడును ౧౬ పట్టుకొందమాయన్న మనస్సు కొంచెమేనియుఁ గనుపించునది కాదు. కావునఁ బ్రతిమనుజుఁడును దనహృదయము నరికట్టవలయును. అరికట్టిన పిదప హృదయమును అర్థమునందు బ్రవేశపెట్టవలయును ౧౭ మిక్కిలిగ భుజించి నిరూపణమునందుఁ బెద్దలకడఁ గూర్చున్నచోఁ గూర్చున్నంతనే దప్పివలన వ్యాకులుఁడగును. ౧౮ వెంటనే నీరుకావలయునని యడుగును. పిదప గటగట గట నీరు విశేషించి త్రాగును. ఈ కారణమున మనస్సు చెదిరి యాతఁడు లేచిపోవును. ౧౯ పుల్లని త్రేనుపులు, వెక్కిళ్ళు వచ్చును. ఒకవేళ నెక్కడనేని కొంచెము వాయువుజారినచో నిఁక నడుగవలసినపనియే లేదు. అనేకజనులు మాటిమాటికి లఘుశంకకు లేవవలసివచ్చును. ౨౦ ఒకానొకఁడు తొందరపడి యంతయువిడిచి నిరూపణసమయముననే అధికశంకకుఁ (విరేచనమునకు) బోవును. ౨౧ ఒకానొకని హృదయము దృష్టాంతముగాఁ నుడువఁబడిన యపూర్వాంశమునందే లగ్నమైయుండును. ముందురాఁబోవు నంశముల నాతఁడు విననే వినఁడు. ౨౨ ఒకఁడు నిరూపణములోని కేతెంచి కూర్చున్నంతన వానిని దేలుకుట్టును. ఈయవస్థలో నిఁక నిరూపణ మెక్కడిది? పాపము ! వాఁడు వ్యాకులుఁడైపోవును. ౨౩ ఒకనికిఁ బొట్టలో బాధగలిగి వీపులోనికి వెళ్ళివచ్చును. దగ్గు, చీదర, నసిమిరి, గడ్డ, పుండు మున్నగువానివలని బాధచే స్థిరముగాఁ గూర్చుండ వీలుకలుగదు. ౨౪ ఒకఁడు జెట్టికఱచుటవలన దుశ్చిత్తుఁడగును. ఒకఁడు వెలుపలజరుగు గోలనాలకించి యచటికిఁ బరుగెత్తుకొనిపోవును. ౨౫ కొందఱు విషయాసక్తులు కథ నాలించు సమయమున స్త్రీలవైపే చూచుచుందురు. దొంగ లితరుణమునఁ బాదరక్షలను దొంగిలించుకొని పోవుదురు. ౨౬ ఒకొక్కప్పుడు "ఔను కాదు" అని యేదేని వివాదము కలుగును. అప్పుడు జరుగు గల్లంతులవలన హృదయమునకు మిగుల ఖేదము కలుగును. ౨౭ కొందఱు నిరూపణసమయమునఁ గూర్చుండి చక్కఁగ భాషించుకొందురు. హరిదాసులు పొట్టకొఱకు రేరేయని రాగము లాలాపనము చేయుదురు. ౨౮ జ్ఞాత లెక్కువమంది యొకచోఁ బ్రోవైనయెడల నొకనివెనుక నొకఁడు మాటలాడ నారంభించును. అచట శ్రోతల యాశయ మొకప్రక్కనే యుండును. ౨౯ "ఇది నాది నీదికాదు." అని యెల్లప్పుడును నుడువుట కలవాటుపడిన వాఁడు న్యాయనీతులను విడిచి యన్యాయపక్షమునఁ జేరును. ౩౦ ఒకఁడు గొప్పతనమునకై వాచ్యములను, అవాచ్యములను నుడువును. న్యాయరహితుఁడగు వాని నిప్పుడుగాకున్నఁ జివరకేని లోకులు "వీఁడు పరమాన్యాయస్థుఁడు రాయని" యనితీరుదురు. ౩౧ అభిమానగ్రస్తులై సంతప్తహృదయులుగనుండు శ్రోతలను సత్యవంతులని నుడువవలయునో అనృతవాదులని యనవలయునో నేను నిర్ణయింపఁజాలను. ౩౨ కావుననే విచక్షణులు, బుద్ధిమంతులు నగువారు తొలుదొలుతనే "మేము తెలియనివారము" అను భావముతో నుందురు. మఱియు వారలితరులతో అన్నా! మేము మూర్ఖులము. నిరక్షరులము. ఏమియు నెఱుంగము అని నుడువుదురు ౩౩ పరమాత్ముఁడు తనకంటె గొప్పవాఁడని తలంచువాఁడు ప్రపంచమునందలి జనులందఱను సంతుష్టిపఱచును. ఏలయన! సంపూర్ణ ప్రపంచమునందుఁ బరమాత్ముఁడు నిండియున్నాఁడు ౩౪ సభయం దొకవేళ కలహ ముప్పతిల్లినచో జనులు జ్ఞాతయందే దోషము నారోపింతురు. "జనులహృదయములు వశపఱచుకొనఁజాలని వీఁడెట్టి యోగి" యని యందురు ౩౫ వైరముగావించినచో వైరమే వృద్ధియగును. తాను దుఃఖము సహింపవలసివచ్చును. కావునఁ జతురపురుషుని గూఢవిచారమును దెలిసికొనవలెను ౩౬ ఉత్తమపురుషులు లోపాలోపములు సవరించుకొనుచు నడుచుకొందురు. తమమీఁది కేవిధమగు దోషమునేని రానీయరు. వారలు క్షమను, శాంతిని అవశ్యముగా నాచరింతురు. ౩౭

మర్గుణునియొడఁగల దుష్టగుణములను సుగుణవంతులగు పురుషులు వెంటనే తెలిసికొందురు. వివేకులగువారలు తమతమ పనులన్నింటిని వివేకముతో నొనరింతురు. ౩౮ వివేకబలముతో బహువిధోపాయములు దీర్ఘప్రయత్నములు గావించుచుండువాఁడు తనమహిమ తానే యెఱుంగఁగలఁడు. ౩౯ వివేకరహితుని దుర్జనులు తమవలలో వేసికొందురు. బుద్ధిహీనులుగూడ నాతని మఱింతబుద్ధిహీనుని జేయుదురు ౪౦ న్యాయము, పర్యాయము (అవసరము) ఉపాయములకు సంబంధించిన అనేకయుక్తులు మూర్ఖున కెట్లు తెలియును? ౪౧ కాని చెడిపోయినపరిస్థితులనుగూడఁ జతురులు సవరింపఁగలరు. చతురులు స్వయముగా ఆత్మయజ్ఞము చేయుదురు. ఇతరులచేఁ జేయింతురు. అట్లే స్వయముగాఁ బ్రయత్నము చేయుదురు, ఇతరులచేఁ జేయింతురు ౪౨ సాధారణముగా జగత్తునందంతటను మనుజులు నిండియున్నారు. కాని వారలలో నెవరు మనుజమాత్రులకు సమాధానమును బ్రసాదింతురో అట్టిసత్పురుషులు ధన్యులు ౪౩ ఇట్టిసత్పురుషులు జనులకోర్కెలను నానావిధములఁ బరీక్షించును. మర్యాదను బ్రసంగమును, సమయమును గుఱుతెఱుంగును. మఱియు సంతప్తులగు జనుల ననేకవిధముల శాంతులను గావించుటగూడ నెఱుంగును ౪౪ ఇట్లే యాతఁడు సంపూర్ణప్రపంచవిషయములుగూడ నెఱుంగును. ఆతఁడు వివేకముతో సమస్తకార్యములను గావించుటయందు సమర్థుఁడై యుండును. ఆతఁడు ఎట్లు ఏమిచేయుచున్నాఁడో యది లోకులకేమియుఁ దెలియనే దెలియదు ౪౫ సత్పురుషుఁడగు వివేకశాలి పలువురు జనులను గార్యమునఁ బ్రవేశపెట్టును. జనసముదాయపుఁగదలిక తనచేతిలో నుంచుకొనును. ఇట్టియోగ్యుఁడే వివేకమువలన* సమర్థపదవి నొందును ౪౬ కాని వివేచనము నేకాంతమున నొనర్పవలెను. తన ధారణాశక్తిసహాయమునఁ బరమాత్ముని ధారణగావింపవలెను. మఱియు మనుష్యమాత్రునిఁ దనవానిగఁ దెలిసికొనవలెను ౪౭ ఏకాంతప్రదేశమునందు వివేకము స్ఫురించును. ఏకాంతమునందు యత్నము లభించును. మఱియు నేకాంతమునందుఁ దర్కశక్తి సమస్తబ్రహ్మాండ

* ఈపద్యమును శ్రీసమర్థరామదాసస్వామియొక్క ఆత్మచరిత్రముగనే భావింపవలయును.

ముపై విరాజిల్లును. ౪౮ ఏకాంతమునందు స్మరణగావించుటవలన మఱచిపోయిన ద్రవ్యభాండారముసైతము లభించును. ఏకాంతమునందుఁ గూర్చుండి యాత్మతో నంతయో యింతయో విచారము గావింపవలెను ౪౯ ఏకాంతవాసమున కలవాటుపడినవానికార్యము అందఱికార్యముల కంటెముందు నెఱవేరును. ఏకాంతములేనిచో మహత్త్వము లభింపఁజాలదు. ౫౦

పందొమ్మిదవ దశకము.

మొదటిసమాసము

లేఖనకౌశల్యము.

బ్రాహ్మణులు బాలబోధ (హిందీ లేక నాగరి) అక్షరముల నభ్యసించి చతురులుచూచినంతనే యానందించునట్లు సుందరముగా వ్రాయవలెను ౧ గుండ్రముగను, సరళముగను, విడివిడిగను, జక్కనిసిరాతో ముత్తెపుసరములవలె అక్షరపంక్తులను వ్రాయవలెను ౨ ప్రతియక్షరము స్పష్టముగనుండవలెను. మధ్యనుస్థలము, వాక్యాంతమున మాత్ర రేఫ, అసంపూర్ణవాక్యముల కంతమున (కామా) గుర్తుమున్నగు నక్షరములకు వలయు సర్వాంగములు చక్కఁగ నుండవలెను ౩ మొదటిఅక్షర మెట్లుండునో గ్రంథములోనియక్షరములన్నియు నట్లుండవలెను. అథ మొదలు ఇతివఱకు (మొదటినుండి చివరవఱకు) గ్రంథమంతయు నొక్కకలముతో ఒక్కపట్టుదలతో వ్రాయఁబడినట్లు కనఁబడవలెను ౪ అక్షరముల నలుపుదనము, కలముయొక్క లావువంపులు, మున్నగునవి యెల్ల సరళముగనుండవలెను. ౫ పంక్తితోఁ బంక్తి గలియఁగూడదు. మాత్ర, రేఫ, బిందు మున్నగునవి యొకదానితో నొకటి కలిసిపోవరాదు. అట్లే యొకదానితో నొకటి తగులునట్లు అక్షరములను బొడవుగా లాగి వ్రాయఁగూడదు ౬ కాగితపుఁబుటలపై ముందుగా సీసముతో గీతలుగీచి స్ఫుటముగా నక్షరములు వ్రాయవలెను. పంక్తులకుమధ్యనుండుస్థలము మిగులదగ్గరగాఁగాని మిగుల

దూరముగాఁగాని యుండఁగూడదు. సమానముగా నుండవలయును ౭ వ్రాసినదానిని మఱల శోధింపవలసినయవసరము లేనివిధముగా వ్రాయవలెను. పొరబాటులు వెదకినను గనుపింపనివిధమునను మఱల లేఖకు నేదేనిసందియము నడుగవలసినపని లేనట్లుగను వ్రాయవలెను ౮ నూతన లేఖకులు (బాలకులు) జాగరూకతతోఁ గనిపెట్టియు మిగుల గుదిరికగా నుండునట్లును లేఖనపద్ధతిగాంచినంతన యెదుటివారు మోహితులగునట్లును వ్రాయవలెను ౯ పెక్కండ్రు యౌవనదశలో మిగులఁ జిన్నయక్షరములు వ్రాయుదురు. వారలు వార్ధకమునందు దాము వ్రాసిన దానినే తాము చదువఁజాలరు. కావున మిగులసన్నగాఁగాని, మిగులబెద్దగాఁగాని కాక మధ్యమతరగతిగల యక్షరములను వ్రాయవలెను. ౧౦ కాగితమునకుఁ జుట్టు ప్రక్కలస్థలము విడువవలెను. మధ్యసుందరముగను స్పష్టముగను వ్రాయవలెను. కాగితము వాడుకవలనఁ జినిగిపోవనున్నను అక్షరములుమాత్ర మట్లే చెదరనివిగా నుండవలెను ౧౧ ఈవిధముగా వ్రాయవలయునను కోర్కి మనుష్య మాత్రునకుఁ గలుగునట్లును "ఔరా! ఈలేఖకుని జూడవలయునురా"యని జను లనుకొనునట్లును గ్రంథమును చక్కఁగ నిర్మించి వ్రాయవలెను ౧౨ శరీరముతో బాగుగాఁ బరిశ్రమ చేయవలెను. తన యుత్కట కీర్తిని బ్రపంచమునందు విడువవలెను. ఏదేని యుత్తమగుణమును జూపి లోకులను మోహితులఁ గావింపవలెను. ౧౩ గట్టికాగితమును దెచ్చి మిగుల జాగరూకతగా దానిని గ్రంథమునకుఁ దగినట్లు చింపవలెను. వివిధములగు వ్రాతపనిముట్లులను జాగ్రత్తజేసికొనవలెను ౧౪ చాకు, కత్తెర, గీతలుగీయుయంత్రము, సీసము, గొట్టము, పలు తెఱంగులనుండు మంచిమంచి రంగులు, మఱియు నితర సాధనములు సేకరించి యుంచుకొనవలెను ౧౫ దేశదేశాంతరములలోఁ గల గాఢములు, సూక్ష్మములు, సుందరములు నగు రంగు పాత్రములు (సిరాబుడ్లు) ప్రోవుచేయవలెను. ౧౬ కలమునుజెక్కెడి యంత్రము, గీతలుగీయు యంత్రము, సీసపుటుండలు మున్నగు చిత్రవిచిత్రములగు సాధనములు సంపాదించుకొనవలెను ౧౭ ఎండినదియుఁ బచ్చిదియు నగునలుపురంగు దగ్గఱ నుంచుకొనవలయును. ఇంతియగాక నానావిధవర్ణములు వేఱువేఱుగా దూదితోఁ దడిపి జాగ్రత్తజేసికొనవలెను ౧౮ గ్రంథమునందు ఇతిశ్రీ (సమాప్తి)ని

నానావిధములగు సుందరచిత్రములతో లిఖింపవలెను. దేశదేశాంతరములలో నుపయోగించు చిత్రలేఖనపరికరములు సిద్ధముగానుంచుకొనవలెను. ౧౯ నానావిధములగు నవారు, వేష్టనము, ఎఱ్ఱనిరంగు, మైనపుగుడ్డ, పెట్టెలు, తాళములు మున్నగు నెన్నేనిసామానులు, పుస్తకములను సురక్షితముగా నుంచుకొనుటకు గావలయును. * ౨౦

రెండవసమాసము

చతురత్వప్రవర్తనము.

గతసమాసమందు వ్రాయువిధము వివరించితిని. ఇఁకనిప్పుడు అనేకప్రకారములగు అర్థముల నెఱుంగురీతుల వినుండు. అన్నివిధములగు విషయములను దెలిసికొనవలెను. ౧ శబ్దభేదము, అర్థభేదము, ముద్రాభేదము, ప్రబంధభేదము, నానాధ్వనుల ధ్వనిభేదము నెఱుంగవలెను. ౨ నానాసందేహములు, ఉత్తరప్రత్యుత్తరములు, ప్రతీతిసాక్షాత్కారము మున్నగువాని నెఱుంగవలెను. ఏలయన! ఈవిషయముల నెఱింగినచో జనుల యంతఃకరణములు ప్రసన్నములగును. ౩ నానావిధములగు పూర్వపక్షసిద్ధాంతానుభవములను జక్కఁగ నెఱుంగవలెను. సందేహపూర్ణములగు నస్తవ్యస్తవిషయములఁ జెప్పఁగూడదు. ౪ ప్రవృత్తియైనఁ గాని ముమ్మ. నివృత్తియైనఁగాని ముమ్మ. ప్రతీతి (అనుభవము) లేనిచో నంతయు భ్రాంతియే! అనుభవరహితుఁడగు మానవుఁడు మట్టిప్రమిదవంటివాఁడు. (అనుభవతైలము లేనిచో) దానిలో నేజ్యోతి యెట్లు వెలుంగఁగలదు? ౫ హేతువును దెలిసికొని యుత్తరమీయవలెను. రెండవవాని మనస్సులోని యంశమును గ్రహింపవలెను. ఇదియే ముఖ్యమగు చాతుర్యలక్షణము ౬ చతురత్వము లేనిచో నే ప్రయత్నమైనను సిద్ధినొందఁజాలదు. చాతుర్యము లేనిచో సమస్తవిద్యలును వ్యర్థము. చతురత్వము లేని సమాజమునందు మిగుల గొప్పగొప్ప విషమపరిస్థితులు తటస్థించును. జనులకు సమాధానమే కలుగదు. ౭ ఇతరులు నుడువు మాటల నన్నింటిని మౌనముగ వినుచుండవలెను. స్వయముగా నేమియుఁ జెప్పఁజనదు. కాని యందఱిమనోభావములను దన

---

* ఈసమాసము వలన శ్రీసమర్థ రామదాసస్వామి వారికాలమున గల లేఖనప్రణాళిక తెలియును.

చతురత్వముతోఁ గొద్దిలోనే తెలిసికొనవలెను. ౮ బుద్ధిహీనులతోఁ గూర్చుండఁదగదు. ఉద్ధతుఁడగు మనుజునితో విశేషించి భాషింపరాదు. తనకొఱకై యెవరిచిత్తసమాధానము నేని భంగము గావింపఁజనదు. ౯ ఎఱుకలేమిని (దీనత్వమును) విడువరాదు. ఎఱుకకలదని గర్వపడఁగూడదు. సమస్తజనులహృదయములను మృదుశబ్దములతోఁ బ్రసన్నముగా నుంచుకొనవలెను. ౧౦ ప్రసంగమును జక్కఁగఁ బరిశోధింపవలెను. పలువురి నప్రసన్నులుగ నొనరింపఁదగదు. సత్యమునుడివియేని సభ్యుల మనోభంగము గానీయరాదు. ౧౧ జాడదీయుటయుం దాలస్యము కూడదు. భ్రష్టజనులలోఁ గూర్చుండరాదు. ఒకవేళఁ గూర్చున్నచో మిథ్యాదోషములు నుడువరాదు. ౧౨ ఆర్తుఁడగు మనుజుని యంతఃకరణమును బరికింపవలెను. చదివినది యేకొద్దియైనను దెలిసికొనునది విశేషముగ నుండవలెను. శ్రేష్ఠుఁడగుపురుషుని దనగుణములచే లోఁబఱచుకొనవలెను. ౧౩ జల్సా, మేజువాణి మున్నగువినోదములలోఁ బాల్గొనరాదు. భోజనప్రసంగములోనికిఁ బోవఁదగదు. ఏలయన! అచ్చటి కేగినచో ఆత్మగౌరవమునకుఁ గొఱంతగలుగును. ౧౪ ఉత్తమగుణములను వెల్లడించుచు అందఱితోఁ గలిసియుండుటలో నానందముగలదు. యోగ్యులగు మనుజులను జూడఁగనే వానిని బాగుగాఁ బరిశీలించి పిదపఁ దనమిత్రులను గావించుకొనవలెను. ౧౫ ఉపాసనమున ననుసరించి భాషింపవలెను. అందఱిను సంతుష్టిపఱుపవలెను. మఱియు నెల్లరిపట్లను సకలవిధములఁ బ్రతిష్ఠనుంచవలెను. ౧౬ తొలుదొలుత అన్నితావులందును అన్నివిషయములలోను జాడనెఱింగి పిమ్మట గ్రామములలో బ్రవేశింపవలెను. మనుష్యమాత్రునియెడ సోదరప్రేమయుంచి సాదరముగా భాషింపవలెను. ౧౭ ఎవ్వరినిగాని ఉచ్చనీచములాడఁదగదు. అందఱిహృదయములను జల్లఁగ నుంచవలెను. సూర్యాస్తమానకాలమునం దెచటికిని బోవఁదగదు. ౧౮ మనుజునియందుఁగల వాణి యొక యుత్కృష్టపదార్థము. దానివలనఁ బ్రపంచమంతటితోఁ జెలిమికుదురును. అన్నితావులందును సత్పాత్రుని వెదకి కనుఁగొనవలెను. ౧౯ హరికథాప్రచారము జరుగుతావున కరుగవలెను. అందఱికంటె దూరముగా దీనుని వలెఁ గూర్చుండవలెను. ఇట్లే దూరముగనుండియే హరికథాభావము

గ్రహింపవలెను ౨౦ హరికథాకాలక్షేపములలో సజ్జనులు లభింతురు. గొప్పగొప్పప్రభావశాలురగు జనులతోఁ బరిచయము కలుగును. ఈవిధముగా సమస్తమును నెఱింగి తెలిసికొని పిదప మెల్లమెల్లఁగా జనసముదాయములోఁ గలియుటకుఁ బ్రయత్నింపవలెను ౨౧ అన్నిఁటిలో శ్రేష్ఠమైనది శ్రవణము. శ్రవణముకంటెను గొప్పది మననము. మననమువలనఁ బెక్కుమందికి సమాధానముకలుగును ౨౨ ధూర్తతవలన (విశిష్టచాతుర్యమువలన) అన్నింటి నెఱుంగవలెను. లోలోపల నంతయు మనస్సునందే నిశ్చయము గావించుకొనవలెను. తెలిసికొనకయే యేశ్రమను భరింపవలయును. ౨౩

మూఁడవసమాసము

అభాగ్యునిలక్షణములు.

అంతఃకరణమును పదిలపరచి అభాగ్యునిలక్షణములు వినుఁడు. ఈయవలక్షణములను విడిచినచో భాగ్యలక్షణము లలవడును. ౧ పాపము దరిద్రమువలనఁ గలుగును. పాపము దరిద్రమువలననే సంచిత మగుచున్నది. నిరంతర మిట్లే జరుగుచుండును ౨ కావున అభాగ్యలక్షణములను విని వానిని ద్యజించుట యావశ్యకము. ఇట్లు గావించుటవలనఁ గొన్నికొన్ని భాగ్యలక్షణము లలవడును ౩ అభాగ్యునకు సోమఱితనము రుచించును. వానికెప్పుడును బ్రయత్నముగావింపవలయునను తలంపే కలుగదు. మఱియు వానివాసన నిరంతరమును అధర్మమునందే లగ్నమైయుండును ౪ అభాగ్యుఁడు సర్వకాలసర్వావస్థలయందు భ్రమాకులుఁడుగను నిద్రాప్రియుఁడుగను నుండును. ఎవరికిని రుచింపనివిధముగా నాతఁ డడ్డదిడ్డములాడుచుండును౫ అభాగ్యుఁడు చదువుటయు, వ్రాయుటయు నెఱుంగఁడు. వ్యాపారముగాని వ్యవహారముగాని చేయఁజాలఁడు. లెక్కడొక్కల వ్రాయనొల్లఁడు. ఆతనికిధారణాశక్తి గూడనుండదు౬ ఆతఁడు(తనవస్తువులను) బోగొట్టుకొనును. విడిచివేయును. ఎందోపడవేయును. పగులఁ గొట్టుకొనును. మఱివిపోవును. పొరపాటుబడును. ఎన్నిదుర్గుణములుగలవో యన్నియు వానికడనే యుండును. యోగ్యులసాంగత్య మాతని కించుకేని రుచింపదు ౭ అభాగ్యుఁడు దుష్ప్రవర్తనులను జతగాండ్రనుగఁ జేసికొను దుష్క

ర్ములను మిత్రులుగఁ జేసికొనును. చోరులను పాపులను దుష్టులను సమకూర్చును ౭ చూచినవారితోఁ గలహించును. నిరంతరము దొంగతనము చేయును. నకుల కపాయము చేయుటలో అభాగ్యుఁడు మిగుల నేర్పరి. మార్గమునందుండి బాటసారులను దోచుకొనును ౯ ఆతనికి దూరదర్శిత్వముండదు. న్యాయముగాని, నీతిగాని రుచింపదు. నిరంతర మితరులవస్తువులను దొంగిలింప నువ్విళులూరుచుండును. ౧౦ అభాగ్యుఁడు సోమరితనముతోఁ గొన్నిదినములు దేహమును బోషించుకొనును. కాని, పొట్టకులేనప్పుడు ఏమియుఁ జేయఁజాలఁడు. వానికిఁ గట్టుకొనుటకుఁ, గప్పుకొనుటకుఁ జింపిరిగుడ్డలైన దొరుకవు ౧౧ సోమరితనముతో దేహమును గాపాడుకొనును. ఎల్లప్పుడు తలగోకుకొనును. రాత్రింబగళ్లు నిదురించుచుండును. ౧౨ జనులతోఁ జెలిమిచేయఁడు. కఠినవాక్యము లాడును. మూర్ఖత్వాకారణమున నెవరాటంకపరచినను వినఁడు. ౧౩ పవిత్రులతోఁ గలియుటకు సంకోచించును. అపవిత్రులగు జనులలోనికి నిశ్శంకముగాఁ బోవును. జనులందఱు నిందించు దుష్కర్మము లభాగ్యునకు మంచిపనులని తోఁచును ౧౪ ఆతనికిఁ బరోపకారమన నేమియో తెలియదు. అనేకుల సంహరించును. ఆతఁ డన్నివిధముల నిరంకుశుఁడును పాపియుఁ, అనర్థియు, మూర్ఖుఁడునై యుండును. ౧౫ అభాగ్యుఁడు శబ్దములను గనిపెట్టి మాటలాడఁడు. అడ్డుపఱచినచో నాగఁడు. ఆతనిభాషణ మెవనికిని రుచింపదు ౧౬ ఎవరివిశ్వాసము లేదు. ఎవరితో మైత్రియు లేదు. విద్యావైభవ మేమాత్రము లేదు. ఐనను మిడిసిపడుచునే యుండును ౧౭ పెక్కండ్రమానసములను బ్రసన్నము గావించుకొనఁగలిగినపుడే సౌభాగ్యము ప్రాప్తించునని యెవరేని యభాగ్యునితోఁ జెప్పినచో నిట్టివివేకవాక్యముల నాలింపఁడు ౧౮ స్వయముగా నాతనికిఁ దెలియదు. ఇతరులు నేర్పఁజూచినచోఁ దేసికొనఁడు. ఇట్టిపురుషునికొఱ కేమియుపాయములఁ జేయఁగలము? ౧౯ అభాగ్యుఁ డెన్నియో యోచనలఁ గావించును. మనోరాజ్యమును బరిపాలించును. కాని యేమియుఁ బ్రాప్తింపదు. ఈవిధముగ నాతఁడు నిరంతరము సందేహములలోఁ బడియుండును. ౨౦ పుణ్యమార్గమును విడిచివేయును. ఇఁక నాతనికిఁ బాప మెట్లుతొలఁగును? నిశ్చయ మేమియు నొనర్పఁడు. ఎల్లప్పుడు సందేహములలో మునిఁగి తేలుచు సర్వమును నాశనము గావించును ౨౧ చక్కఁగ నేవిషయము నెఱుంగఁడు. అట్లయ్యు సభలో నేదియో మాటలాడఁబోవును. ఆతఁ డేమియు నెఱుంగనివాఁడుగావున సభలో మాటలాడునపుడు లోకులసమ్ముఖమున బుద్ధిహీనుఁడు, వ్యర్థుడునై కూర్చుండును ౨౨ ఎవ్వనినిశ్చయభావము (కొంతయైనను) పెక్కుమందికి విశదమగునో యాతఁడు ప్రపంచమున మాన్యుఁడగును ౨౩ కష్టమును సహింపకున్నచోఁ గీర్తి యెట్లు లభించును? గౌరవ మూరక లభింపదు. మీఁదుమిక్కిలి అవలక్షణమువలన నలుదిక్కులందును నిందగలుగును. ౨౪ యోగ్యులస్నేహము గావింపక చతురత్వము గడింపక యుండువాఁడు తనకుఁ దానె వైరి. స్వహితము నాతఁ డెఱుంగఁడు. ౨౫ జనుల కొనరించు ఉపకృతికిఁ బ్రతిఫలము తనకు తత్క్షణమే లభించును. ఈ విషయ మభాగ్యునకుఁ దెలియదు. ౨౬ ఉత్తమగుణములు లేకుండుటయే అభాగ్యతాలక్షణము. బహుజనులకు రుచింపనివేవియో యవియే స్వాభావికముగా అవలక్షణములు ౨౭ చేయని దేపనియుఁ గాదు. పనికిమాలినవాఁడు దుఃఖప్రవాహమునందుఁ గొట్టుకొనిపోవును. ౨౮ బహుజనులకు మాన్యుఁడుగ నెవ్వఁడుండఁడో యాతనికి సమానుఁడగు పాపాత్ముఁ డింకొకఁ డుండఁబోఁడు. అభాగ్యుఁ డన్నితావులందును నిరాశ్రయుఁడై దీనరూపుఁడై యుండును. ౨౯ కావున అవగుణములను విడిచిపెట్టవలెను. ఉత్తమగుణముల నెఱింగి గ్రహింపవలెను. ఇట్లొనరించినచో సమస్తవిషయములును దన కనుకూలమగును ౩౦.

నాలుగవ సమాసము.

భాగ్యవంతుని లక్షణములు.

ఇంతకుముందు మీ కభాగ్యునిలక్షణములు నివేదించితిని. వాని నన్నింటిని వివేకముతో నెఱింగి విడువవలెను. ఇఁకఁ బరమసుఖదాయకములగు భాగ్యలక్షణములను వినుండు ౧ భాగ్యవంతుఁడగు సుపురుషుఁడు స్వాభావికముగనే గుణవంతుఁ డగును. ఆతఁడు నానావిధములఁ బరోపకారమొనరించును. మఱియు నిరంతర మెల్లరకును బ్రియుఁడై యుండును [illegible] భాగ్యశాలి సుందరములగు అక్షరముల వ్రాయుట [illegible] వేగము

గను శుద్ధముగను జదువఁగలఁడు. అంతియగాక యనేకవిధముల అర్థాదులు వివరించిచెప్పుట నేర్చియుండును ౩ ఎవరిమనస్సునేని త్రెంచివేయఁడు. యోగ్యుల సాంగత్యము విడువఁడు. మఱియు నితర భాగ్యవంతుల లక్షణములను ఆలోచనలోనికిఁ దెచ్చును. ౪ భాగ్యశాలియందఱకును బ్రియుఁడు. తానేగినతావున జనులకాతఁడు నిత్యనూతనుఁడుగఁ గన్పట్టును. మూర్ఖత్వకారణమున నెన్నఁడును సందేహములలోఁ దగుల్కొనఁడు. ౫ నానావిధములగు నుత్తమగుణములు గలవారును, సత్పాత్రులును నగువారే జగన్మిత్రులు. వారల కీర్తి లోకమంతటను నావరించుకొనును. వారలు పరాధీనులుగ నుండరు. నిరంతరము స్వతంత్రులుగ నుందురు ౬ భాగ్యశాలి జనులందఱిహృదయముల నానందపఱచును. పెక్కుగ్రంథముల నవలోకించును. తననిశ్చయము నెన్నఁడును వదలఁడు ౭ నమ్రతతో నడుగుటయుఁ, జక్కఁగ నర్థమును వివరించుటయుఁ జెప్పినవిధముగా నుత్తమకార్యము లొనరించుటయుఁ గూడ నాతఁడెఱుంగును ౮ బహుజనప్రియుఁడై వర్తించుభాగ్యశాలి నవరేని 'యిదియేమి' యనఁజాలరు. ఆమహాపురుషుఁడు దేదీప్యమానపుణ్యరాశియైయుండును. ౯ ఆతఁడు పరోపకారము జేయుచుండును. అందఱికి నాతనితో నవసరముండును. ఈస్థితిలో నాతనికి భూమండలమం దేవిషయముననేని కొఱంతయుండదు ౧౦ పలువు రాతనికై నిరీక్షింతురు. అందఱికడ కాతఁడు తత్కాలముననే సకాలమునకు వచ్చును. ఎవరికి హీనత్వముగలిగినను ఆతఁడు సహింపఁడు ౧౧ భాగ్యశాలి పదునాలుగు విద్యలు, అఱువదినాలుగు కళలు, సంగీతము, గాయనకళ, నెఱుంగును. ఆత్మవిద్యాశక్తిగూడ నాతనికిఁ జాలినంత యుండును ౧౨ అందఱితో నమ్రతగ భాషించును. అందఱియెడ హృదయముంచి వర్తించును. ఎవ్వరికైన నేవిధమగుహీనత్వమును గలుగనీయఁడు. ౧౩ భాగ్యశాలి న్యాయము, నీతి, భజన, మర్యాద, జవదాటక సమయమును నిరంతరమును సార్థకముజేయును. దరిద్రజన్యములగు ఆపద లాతనికడ కెట్లువచ్చును ౧౪ ఆతఁ డుత్తమగుణభూషితుఁడు. బహుజనశోభితుఁడు. అంతియగాక ప్రకట ప్రతాపమున మార్తాండునివలె నుదితుఁడై యుండును. ౧౫ అనుభవ నీయుఁడే పురుషుఁ డరిగినతావునఁ దగ వెట్లుకలుగును ?

౧౬ భాగ్యశాలి ప్రాపంచికసుఖార్థమై రాజనైతికయుక్తిప్రయుక్తుల నెఱుంగును. పరమార్థప్రాప్తినొందుటకై ఆధ్యాత్మికవివరణముగూడ నెఱుంగును. ఆతఁడన్నింటియందు నెద్దియుత్తమగుణమో దానికి భోక్తయైయుండును ౧౭ ఎదుట నొకటిజెప్పుట, చాటున మఱియొకవిధముగా వర్తించుట, యాతఁడెన్నఁడు నెఱుంగఁడు. ఆతనితో నందఱకు నవసరము కలిగియుండును ౧౮ ఎవరిహృదయమునకేని బాధకలుగునట్లు భాగ్యశాలియగు పురుషుఁ డెన్నఁడును వర్తింపఁడు. ఆతఁ డన్నివిధముల వివేకమును బ్రకటించును ౧౯ కర్మవిధి, ఉపాసనావిధి, జ్ఞానవిధి, వైరాగ్యవిధి, విశాలమగు జ్ఞాతృత్వబుద్ధి యెన్నఁడును భాగ్యశాలిని దొలంగిపోవు ౨౦ వానియొద్ద నున్నవన్నియు నుత్తమోత్తమగుణములె; ఈస్థితియం దాతనినెవఁడేని యయోగ్యుఁడనియనఁ గలఁడా! ఆత్మవలె నాతఁ డన్నిఘటములలో సంపూర్ణముగా వ్యాపకుఁడై యుండును. ౨౧ చిన్నపెద్దలందఱును దమ తమకార్యములలో నెట్లుతత్పరులై యుందురో యట్లు భాగ్యశాలి మనఃపూర్వకముగా నెల్లరికి ఉపకారముగావించుచుండును. ౨౨ ఇతరుల దుఃఖమునఁ గాంచి దుఃఖియగును. ఇతరులసుఖముగాంచి సుఖియగును. నిరంతరము జనులందఱును సుఖముగానుండవలయునని తలంచును. ౨౩ చిన్నపెద్దపిల్లలందఱిపట్ల తండ్రిమనస్సు ప్రేమాన్వితముగా నుండునట్లు మహాపురుషునిహృదయము ప్రజలందఱియెడ సమానచింతగలిగియుండును ౨౪ మహాపురుషుఁడు పరులదుఃఖమును జూడలేఁడు. ఎల్లప్పుడును నిస్పృహుఁడైయుండును. ధిక్కరించినను వేఱుగఁ దలంపఁడు ౨౫ మిథ్యాశరీరము నెవఁడేని దూషించినచో అందువలన నాతని దేమిపోవును? జ్ఞాతయగువాని నెందేని దేహబుద్ధి జయింపగలదా ౨౬ ఎన్నఁటికిని, జయింపదు. జ్ఞాత దేహముకంటెభిన్నుఁడు. ఉత్తముఁడు కొన్నియైన నుత్తమగుణములను బ్రపంచమునకుఁ జూపవలెను ౨౭ ఉత్తమగుణములు మనుజు నాకర్షించును. చెడ్డగుణములు మనుజునికి ఖేదము గలిగించును. సాధారణమానవులకుఁ దీక్ష్ణబుద్ధివిషయ మేమి తెలియును? ౨౮ ఈతఁడుజనులయెడ నత్యంతక్షమ జూపుచున్నాఁడని గ్రహింపకనే జనులు ఆపురుషున కనేకవిధములసహాయము జేయుదురు ౨౯ పలువురు తమ్ముదాము గొప్పవారలమని భావింతురు, లోకులు తన్నుగొప్పవానిగఁ దలంపనంతవ

యుండుఁ దనకై తాను గొప్పవాఁడనని చెప్పుకొనుటవలనఁ గలుగుఫలమేది? మహాపురుషుఁడు ధీరుడుగను, ఉదారుఁడుగను, గంభీరుఁడుగను నుండును. ౩౦ "ఉత్తమగుణములన్నియు సమర్థునిలక్షణములు, అవగుణములన్నియు అభాగ్యుని లక్షణములు" అని తెలిసికొనవలెను ౩౧.

ఐదవసమాసము

దేహమువలని యుపయోగము

మన్ను, ఱాయి, బంగారము, వెండి, కంచు, ఇత్తడి, రాగి, మున్నగులోహములతో నిర్మింపఁబడిన దేవతావిగ్రహములను, చిత్రపటములను మానవులు పూజించుచున్నారు ౧ దూదితోఁ, గుట్టతోఁ జేసినదైవతములు, ప్రవాళదైవతములు, బాణములు, తాండలములు, నర్మదేశ్వరములు, సాలిగ్రామములు, కాశ్మీరిదైవతములు, సూర్యకాంత చంద్రకాంతములు గూడఁ బూజింపఁ బడుచున్నవి ౨ కొందఱు దేవతార్చనమునందు రాగినాణెములను, బంగారునాణెములను బూజింతురు. చక్రాంకితములగు నాణెములను జక్రతీర్థమునుండి తెచ్చుకొందురు. ౩ ఉపాసన పలుతెఱంగుల నుండును. ఎంతదనుకఁ జెప్పఁగలను! శ్రద్ధానుసారముగ నెల్లరును ఉపాసన గావించుచున్నారు ౪ తొలుదొలుత నన్నింటికిని గారణమగు స్మరణమును విచారింపవలెను. దైవతములన్నియు దాని యంశలే ౫ ఆదియందు ద్రష్టయు, దైవము నొక్కటియే. అదియే యనేకమయ్యెను. వివేకమువలన నీయంశము ధ్యానములోనికి వచ్చును ౬ దేహములేకున్నచో భక్తి జరుగదు. ఇంతియగాక పరమేశ్వరుఁడు ప్రసన్నుఁడుగాఁడు. కావున భజనకుమూలము దేహమే ౭ మొదటినుండి దేహమును వ్యర్థమనితలంచినచో భజన మెట్లు జరుగఁగలదు? సారాంశమేమన, దేహాత్మసంయోగమువలననే భజనము జరుగును ౮ దేహములేకున్నచో ఈశ్వరభజనము, పూజనము, మహోత్సవము మున్నగునవి యెట్లు జరుగఁగలవు? ౯ దేహములేకున్నచో, అత్తరు, గంధము, పత్రపుష్పఫలతాంబూలములు, ధూపదీపనైవేద్యములు మున్నగుపూజ లెట్లు జరుగఁగలవు? ౧౦ దేవునితీర్థము గైకొనుట, దేవునిచందనము నలఁదుకొనుట, దేవుని పయిపూవులుంచుట మున్నగువిషయములు దేహములేకున్నచో

జరుగుటయెట్లు? ౧౧ ఇంతయేల! దేహములేకున్నచో సేవనియు జరుగదు. దేహమువలననే భజన జరుగును. ౧౨ దేవుఁడు, దేవత, భూతము (ప్రాణిమాత్రులు) దైవతము మొదలగు నన్నింటియందును బరమాత్ముఁడు నిండియున్నాఁడు. కావున యోగ్యతానుసారముగా నందఱను బ్రసన్నులఁ గావింపవలెను. ౧౩ అందఱికిఁ గావించుసన్మానము మూలమునకె (పరమాత్మునకె) ప్రాప్తించును. ౧౪ మాయాలత యల్లుకొనియున్నది. నానావిధములగు దేహఫలములతో నిండియున్నది. ఫలములలో మూలమునందలి చైతన్యము విదితమగుచుండును ౧౫ కావున ఉదాసీనతను జూపనక్కఱలేదు. చూడఁదలఁచినవాఁడిక్కడనే చూడవలెను. మఱియు విశ్వాసముకలిగిన పిమ్మట సమాధాని యై యుండవలెను. ౧౬ ఎందఱో మనుజులు సంసారమునువిడిచి దేవునివెదకుచుఁ దిరుగుచుందురు. వారు పోయినతావునన్ల బహువిధ సందేహములలోఁ బడుదురు. ౧౭ సర్వసాధారణులగు జనులలోఁ గొందఱు గృహమునందే దేవతార్చనము గావింతురు. మఱియు నిటునటు భ్రమణమొనరించి క్షేత్రములలోని దేవతలను దర్శింతురు ౧౮ లేదా! బహువిధములగు నవతారకథల నాలించి (యేదేనియొకయవతారమునందె తమహృదయమును) నిశ్చయము గావించుకొందురు. కాని దానికి గొప్పవిస్తరము గలదు ౧౯ కొందఱు బ్రహ్మవిష్ణుమహేశ్వరులకథ లాలించి వారలనే గొప్పవారినిగ భావింతురు. కాని యన్నింటికంటెను ముందుగా నాగుణాతీతుఁడగు జగదీశ్వరుని గాంచవలెను ౨౦ కాని యాజగదీశ్వరుని కెచ్చటను నెలవులేదు. ఎచ్చట భజన చేయవలెను? ఇది మిగుల సందేహమగు నంశము ౨౧ ఆ పరమాత్ముని సందర్శింపఁ జాలకున్నచోఁ బవిత్రుల మెట్లగుదుము? కావున నన్నింటినెఱింగిన సాధుపుంగవులకు వందనములు ౨౨ పృథ్వీమండలము నందెందఱో వేల్పులున్నారు. వారలయెడ విశ్వాసము తొలంగ వీలులేదు. ముఖ్యదైవతము (పరమాత్మ) అనేకప్రయత్నములు గావించినపిదపఁ గూడ విశదముగాదు ౨౩ కావునఁ గార్యమును వేఱుపఱచి (మాయను=దృశ్యమును వేఱుజేసి) పిదప నాపరమాత్ముని జూడవలెను. అప్పుడే కొంత గోప్యము విశదమగును ౨౪ అది కానిపింపదు. భాసింపదు. కల్పాంతమునందు సైతము నదినశింపదు.

మఱియు సుకృతము లేకున్నచో దానిమీఁద మనస్సు విశ్వాసముంచదు. ౨౫ కల్పనము మిగులఁ దర్కము చేయును. వాసన మిగులఁ గోరును. మఱియు నంతఃకరణమునందు నానావిధతరంగము లుత్పన్నమగుచుండును. ౨౬ కావునఁ గల్పనారహితమగు వస్తువే శాశ్వతమైనది. దాని కంత్యము లేదు. కాన దాని ననంతమందురు ౨౭ జ్ఞానదృష్టితో దానిని జూడవలెను. చూచియచ్చటనే యుండవలెను. నిదిధ్యాసము సంగత్యాగములతోఁ దద్రూపము కావలెను ౨౮ పాపము! ఈక్షుద్రజీవునకు దానియానందలీలలు దాని చిత్రవిచిత్రము లేమి తెలియును! ఆస్థితి సాధుసమాగమమువలన స్వానుభవమైనపిమ్మట సిద్ధించును. ౨౯ ఆస్థితి సిద్ధించినపిదప అధోగతి నశించును. ఈవిధముగా సద్గురునిసేవవలనఁ దత్కాలముననే సద్గతి లభించును.

ఆఱవసమాసము.

బుద్ధివాదము.

పరమార్థియు, వివేకియు నగుపురుషుని కార్యము అందఱకు రుచించును. ఏలయన! ఆతఁ డన్నిపనులను ఆలోచనాపూర్వకముగా నొనరించును. మఱపును దరిచేరనీయఁడు ౧ జనులకు రుచింపనిపని నాతఁ డెన్నఁడును జేయఁడు. ఆదినుండి యంతమువఱకు నాతఁ డన్నిసంగతులు దెలిసికొనును. ౨ స్వయముగా నిస్పృహత్వము నాచరింపని వానిమాట నెవ్వరు నామోదింపరు. ముఖ్యవిషయ మేమన! ఆజగదాత్రిపుఁడగు పరమాత్ముని సంతుష్టుని నొనరించుట కఠినతరము ౩ కొందఱు బలవంతముగ మంత్ర ముపదేశించి గురువులగుటకుఁ దలంతురు. కొందఱు ఎవరినేని మధ్యవర్తిగ నేర్పఱచికొని గురువగుటకు యత్నింతురు. కాని యిట్టివారలు దురాశాకారణమున స్వాభావికముగనే లోకులకడఁ దమగౌరవమును గోల్పోవుదురు ౪ వివేకమును బడయఁదగినవారలే ప్రతికూలురగుచో నిఁక ముందటివ్యవహార మెట్లు జరుగఁగలదు? ౫ కొన్నితావులలో సోదరునకు సోదరుఁడె గురువుగా నుండును. దీనిచేఁ బోనుపోను గొప్పచెఱుగు సంభవించును. కావునఁ బరిచయులచెంత గురుత్వము (మహంతుధర్మము) ప్రకటింపఁ దగదు ౬.

ఇట్లొనరించుట తొలుత బాగుగానున్నట్లు కనిపించినను క్రమముగా గోల యారంభమగును. ఔను. విచారరహితులగు మానవు లెంతసంతోషమున గుమిగూడియుండినను నుందురుగాక! వివేకి కిదియెట్లు రుచించును? ౭ పతి శిష్యుఁడు. పత్ని గురువు. ఇదిగూడ నొకవిచిత్రమగు విషయమే! నానాప్రకారులగు భ్రష్టాకారులలో నీభర్తయు నొకఁడు ౮ వివేకము నుప్రకటింపక గుప్తముగనుంచుఁడును; సత్యము నను మానములోనికేని రానీయనివాఁడును. ౯ అభిమానమగ్నుఁడైయుండువాఁడును, ఇతరులు వివేకమొఱంగినచో దానిని గ్రహింపనివాఁడును నగుపురుషుఁడు దూరదర్శి కాఁజాలఁడు ౧౦ నాయభిప్రాయ మేమన! ఎవ్వారి నేమియు నడుగక భగవద్భజనము నభివృద్ధిచేయవలెను. వివేకబలముతో జనులను భజనమునం దన్వయింపఁజేయవలెను ౧౧ వివేకముతో నితరులమనస్సులఁ జెదరనీయక తనకోర్కెని స్వధర్మమును లోకాచారమును ననుసరించి (ఈమూఁడింటిని గాపాడుకొనుచు) పనిచేయుట మిగులఁగఠినము ౧౨ తాను స్వయముగా మ్లేచ్ఛుని గురువుగఁ జేసికొని చండాలురను శిష్యులగఁ జేసికొని తిరుగుచున్నచో జనసముదాయము భ్రష్టమగును ౧౩ కావున నిట్లొనరింపక బ్రాహ్మణమండలుల నేకత్రగావింపవలెను. భక్తమండలులను గౌరవింపవలెను ౧౪ ఉత్కటమును, భవ్యమును నగువిషయమునే గ్రహింపవలెను. ఇతరవిషయముల నన్నింటిని ద్యజింపవలెను. నిస్పృహత్వముతో భూమండలమునందు విఖ్యాతి నొందవలెను ౧౫ వ్రాయుట, చదువుట, అర్థమును జెప్పుట, పాడుట, ఆడుట, పఠించుట మున్నగుసమస్తవిషయములును జక్కఁగ నుండవలెను ౧౬ దీక్షయు, మైత్రియు మంచివిగ నుండవలెను. ఇంతియగాదు. రాజనీతివిషయికమగు తీక్ష్ణబుద్ధిగూడ కావలెను. కాని తాను మాత్ర మన్నివిధముల నలిప్తుఁడుగ నుండవలెను ౧౭ హరికథలయెడ నిరంతరము ప్రేమయుంచవలెను. ఇందుచే జనులందఱకును హరికథయందుఁ బ్రేమ యుదయించును. సూర్యునివలె ప్రభావయుతమగు నుపదేశమొనరింపవలెను. ౧౮ దుర్జనులను సంభాళించుటయు, సజ్జనులను ప్రసన్నులఁగావించుటయు, నెల్లరిమనోభావములు గ్రహించుటయు బుద్ధిమంతుని ధర్మము. ౧౯ ఇట్టిసా

ధుపురుషుని సాంగత్యము వలన జనులు సదాచరణు లగుదురు. తత్కాలమునందే వారలయం దుత్తమగుణము లుపొడసూపును. జనసముదాయమంతయు నఖండరీతిగ నభ్యాసమునకు యత్నించును. ౨౦ ఆపురుషుఁ డెచటి కేగిన నచట నిత్యనూతనుఁడుగఁ గనిపించును ఈతఁడిచ్చటనే నిలిచియుండవలెనని జనులు తలంతురు. కాని దురాశ నీతఁడించుకేని దరికిరానీయఁడు ౨౧ ఉత్కటభక్తి, ఉత్కటజ్ఞానము, ఉత్కటచాతుర్యము, ఉత్కటభజనము, ఉత్కటయోగానుష్ఠానము, మున్నగు నుత్కటగుణము లనే యాతఁ డన్నితావులఁ బ్రచారము గావించును ౨౨ ఉత్కటమగు నిస్పృహత్వముగల వానికీర్తి దిగ్దిగంతములలో వ్యాపించును. నుత్కటభక్తివలన సమస్తదేశములందలి జనసముదాయము శాంతినొందును. ౨౩ ఉత్కటవిషయ మేదేని యాచరణమునం దుండనంతవఱకుఁ, గీర్తి వ్యాపింపదు. వ్యర్థుఁడై తిరుగుటవలన నేమి లాభము? ౨౪ దేహము నమ్మదగినది కాదు. ప్రాణము లెప్పుడు పోవునో యెవ్వరికిఁ దెలియదు. ముం దీశరీరమున కేపరిస్థితులుసంభవించునో యెవ్వఁడెఱుంగును? ౨౫ కావున సావధానియై యుండవలెను. తనవలనఁ గాఁదగినంతలో మనఃప్రాణములకుఁ దెగించి పరోపకార మొనరింపవలెను. భగవత్కీర్తితో భూమండలమును నింపివేయవలెను ౨౬ తన కనుకూలమగునది యెల్లఁ దత్క్షణమె చేయవలెను. తనవలనఁ గాఁజాలనివిషయమును నిర్మలవివేకముతో యోచింపవలెను ౨౭ ఏలయన? వివేకము వలన సాధ్యముగాని దెద్దియు లేదు. ఏకాంతమున నున్నప్పుడు ప్రతివిషయమును వివేకము అనుమానములోనికిఁ గొనివచ్చును ౨౮ అఖండరీతిగఁ బెక్కుతీర్మానములు, చేష్టలు, (క్రియలు) జరుగుతావున కొఱంత యేవిషయమున నేని యుండదు. ఏకాంతము లేనియెడల మానవునిబుద్ధి యుపయోగములోనికెట్లువచ్చును? ౨౯ కావున ఏకాంతమునందు వివేకము (వివేచనము) గావింపవలెను. ఆత్మారాముని గుర్తింపవలెను. ఇచ్చటినుండి యచ్చటిదనుక నేవిధమగు గోలయును లేదు ౩౦.

ఏడవ సమాసము

ప్రయత్నవాదము.

హరికథను జనులలో నాందోళము గావింపవలెను. మఱియు అధ్యాత్మనిరూపణమును వ్యాఖ్యానము చేయవలెను. ఏవిషయమునం దేని కొఱంత గలిగింపరాదు ౧ ఉపదేశకుఁ డొకవేళ నేదేని యంశము మఱచినచో దాని నుపదేశకుఁడే యెఱుంగఁగలఁడు. అజ్ఞానులగు నితరులు కనులార్పుచుఁ జూచుచుందురు ౨ ఏవిషయమున నేని సమాధానము చెప్పుటలో వక్త యాలసించినచో శ్రోతల కాతనియెడ గౌరవముండదు ౩ వ్యర్థవాక్యముల నెక్కువగా వదరక కొద్దిలో సమాధానము చెప్పవలెను. ఒకానొకప్పుడు వారలహృదయమున కంటునట్లుగూడ బోధింపవలెను. మనుజుల మనస్సులనుగూడ హరింపవలెను ౪ సహనశీలము లేక వ్యర్థక్రోధము జూపునాతని తామసవృత్తి లోకమునకు వెల్లడియగును. శ్రోతలు తామసుఁడగు నాయుపదేశకుని బ్రేమింపరు ౫ సాధుపురుషుఁడు తానెందఱిని సంతుష్టిపఱచినది యెవరెవరికి మనోభంగ మొనరించినది పరీక్షించుకొనవలెను ౬ శిష్యుఁడు వికల్పకారణమున దుర్మార్గమున బ్రవేశించును. దురాశవలన గురువు శిష్యుననుసరించును. ఇదియంతయు వికల్పమనియే తలంపుఁడు ౭ ఆశాబద్ధుఁడును, క్రియాహీనుఁడును, చాతుర్యహీనుఁడును నగు సాధుపురుషుని సాధుత్వమునకు మిక్కిలి దుర్దశగలుగును ౮ ఇట్టి గోస్వాములకు (సాధువులకు) గౌరవముండదు. అన్నితావులందును వారలు శ్రమపడుదురు. ఈవిధముగాఁ వారలే కష్టములుపడుచుండ వారియనుచరులకు సుఖమెక్కడినుండివచ్చును? ౯ జనుల నానందపఱచి నలుదిక్కులఁ గీర్తి వ్యాపించునట్లును అందఱికి నుత్సాహ మతిశయించునట్లును సర్వకార్యము లొనరింపవలెను ౧౦ పరకీయజనులయందుండియు నలిప్తుఁడై సముదాయముపై దృష్టినుంచవలెను. ఎవ్వరి నేమియు యాచింపఁగూడదు. పూర్ణనిస్పృహత్వము కావలెను ౧౧ జగత్తు (బహుజనాభిప్రాయము) ఏవైపుందునో ఆవైపుననే జగన్నాయకుఁడు (పరమేశ్వరుఁడు) ఉండును. ఈవివేకము తెలిసికొనియుండవలెను. వివేకియగుపురుషుఁడు రాత్రింబవళ్లు జనసముదాయమును సంస్కరించుచుండును ౧౨ తానొక్కఁడు కేవలము మంచివాఁడగుటయుఁ దక్కినజనులందఱు చెడ్డవారగుటయు నెట్లుసంభవము

గును? ౧౩ పాడుబడియున్న దేశములోఁ జూడవలసిన దేమున్నది? మనుజులను విడిచినచో నుండవలసిన తావెద్ది? వ్యర్థమును మిథ్యను విడిచి సత్యమును గ్రహింపవలెను ౧౪ జనులలోఁ గలిసిమెలసి యుండువిధము తెలియంగనివానికి సాధువృత్తితో (మహంతుతనముతో) నేమిపనియున్నది? అట్టివాఁడు పరసాధనములను నాశించి యడఁకువతో నుండవలెను ౧౫ చక్కఁగ నీఁదుట నెఱుంగనివాఁ డితరుల ముంచినచో నేమిలాభించును? ఆస్థితిలో మీఁదుమిక్కిలి ప్రేమప్రీతులు వ్యర్థములగును. అంతయు వికల్పమే నిలుచును ౧౬ జనులను సంబాళించు సామర్థ్యమున్నచో సాధుపురుషుఁడని (మహంతని) ప్రసిద్ధినొందవలెను. లేనిచో నూరకుండుటయే మంచిది. ప్రసిద్ధిని గడించి యితరులకార్యములు పాడుచేయుట మంచిదికాదు. ౧౭ మందమందముగ నడచువాఁడు, చపలుఁడును, తీవ్రబుద్ధిగలవాఁడును నగువాని నెట్లుసంబాళింపఁగలఁడు? అరబ్బీదేశపు గుఱ్ఱమును ద్రిప్పువాఁ డెట్టివాఁడుగ నుండవలయునో యోచింపుఁడు ౧౮ ఈకార్యము మిగులఁ గఠినమైనది. ఈతీక్ష్ణబుద్ధిరహస్యము సాధారణములగు నమాయికభావములచేఁ దేటపడదు ౧౯ పైరునువేసి కావలిగా యనిచో, వ్యాపారమొనరించి తిరుగనిచో, జనులను గుమిగూర్చి సవరించుకొనఁజాలనిచో పని యెట్లుజరుగును? ౨౦ పగలు రెండురెట్లుగను రాత్రులందు నాలుగురెట్లుగను ఉత్సాహ మతిశయించునపుడే పరమార్థము లభించును. అయోగ్యత వెల్లడియైనచో జనసముదాయము చెదరిపోవును ౨౧ తనమాట లోకులకును, లోకులమాట తనకును రుచింపనిచో నంతయు వికల్పమే! ఈస్థితిలో సమాధానమున కవకాశమే లేదు. ౨౨ సర్వనాశనకరమగు దీక్షనొసంగువాఁడు గురువుగను మోసగాండ్రు శిష్యులుగను ప్రోగైనతావున వివేక మెట్లుండఁగలదు? అవివేకము రాజ్యముచేయుతావున నుండుట యుచితముగాదు ౨౩ కొందఱు చాలకాలము శ్రమచేయుదురు. కాని యంత్యమున నందంతయు వ్యర్థమగును. తనవలన నేదియుఁ గానితఱి మఱల నుపాధి నేలవృద్ధినొందింపవలెను? ౨౪ నియమముగా నడువఁగలిగినయెడలనే ఆయుద్యోగము (గురుశిష్యధర్మము) యుక్తముగ నుండును. లేనియెడల నంతయు సంతాపమే! క్షణక్షణమునకు ఆటంకములు గలుగుచుండును. ఎంతదనుక వివరింప

శక్యమగును? ౨౫ మూర్ఖులు ప్రపంచమున మూర్ఖత్వముతోఁ బొరలాడుచుందురు. జ్ఞాతలగువారలుగూడ వాదోపవాదములు గావించుచుఁ గలహములను వ్యాపింపఁజేయుదురు. కావున నీయిరువురును నిందార్హులే! ౨౬ వీరలు వ్యవహారమును సంబాళింపలేరు సరిగదా ఊఱకయైనఁ గూర్చుండఁజాలరు. ఇం దితరులదోష మేమున్నది? ౨౭ సత్యమేమన్న! నష్టమగు నుపాధిని విడువవలెను. అన్నిస్థలములయందును దిరుగుచుఁ దనజీవితమును సార్థకముగావింపవలెను. ౨౮ స్వయముగాఁ బరిభ్రమణము గావింపఁజాలక ఇతరులపరిభ్రమణము సహింపఁజాలక యుండునాతఁడు వికల్పయాతన లనేక మనుభవింపవలసియుండును. ౨౯ తనమేలు తనచేతిలోనున్నది. తనమనస్సులో బాగుగా యోచించి యుక్తమనితోఁచినవిధముగాఁ బ్రవర్తింపవలయును ౩౦.

ఎనిమిదవ సమాసము

ఉపాధినిరూపణము.

సృష్టియం దనేకవిధములగు మనుజులున్నారు. పరిభ్రమణము గావించినచోఁ బ్రపంచస్థితిగతులు విదితమగును. అంతియగాక బహువిధములగు యోచనలుగూడఁ గలుగును ౧ పరిభ్రమణమువలన ఉదాసీనవృత్తిగలవారును సుఖదుఃఖములను బాటింపనివారును నగు సాంసారికులపరిచయభాగ్యము లభించును ౨ వారలు స్వాభావికముగనే మితముగా భాషింతురు. నిశ్చయపూర్వకముగా వర్తింతురు. వారలు మాటలాడువిధము నలువురిచే నాదరింపఁదగినదిగ నుండును. ౩ తాళజ్ఞానము, రాగజ్ఞానము, నీతిన్యాయములు మున్నగునంశములు వారలకు స్వాభావికముగాఁ దెలిసియుండును ౪ సమస్తజనులను సంతుష్టిపఱుపఁగలవాఁడును ప్రాణిమాత్రులందఱకును నిత్యనూతనముగాఁ బ్రీతిగూర్చువాఁడును నగుశూరపురుషుఁడు దేశభ్రమణము గావించినచో నొకఁడో, అరయో లభించును ౫ ఆకస్మికముగఁ గొన్నివిశేషములు తటస్థించును. ఎందేని యొకమహాపురుషుని దర్శన మబ్బును. ఆతనియందు ఆకస్మికముగ మహాత్మునకుండవలసిన సమస్తలక్షణములు గోచరించును. ౬ ఇట్టి పురుషుఁడు లభించినంతన నాతని చమత్కార

ముచే గుణగ్రాహులగుపురుషులు మోహితులగుదురు. ఏలయన ? ఆతని యాచారోపదేశములు అనుభయువ్యక్తములుగ నిశ్చితములుగ నుండును ౭ తన దుర్గుణములను సుగుణములనుగఁ బ్రదర్శించుట దుర్గుణములన్నిటికంటెను దుర్గుణము. ఇది మిగుల ఘోరపాపము. ఈపాపమువలన దరిద్రము నశింపదు ౮ మిగుల ధ్యానముగావించినను (యోచించినను) నెగవేరనికార్య మొకానొకప్పుడు సహజముగా నెరవేరును. యుక్తిప్రయుక్తులుగాని, ఆపదలుగాని, పొందఁబడియుండదు ౯ (కార్యకౌశలము)ఒకానొకని కభ్యాస మొనరించినను బట్టువడదు. ఒకానొకనికి సహజముగనే యభ్యాసమగును. భగవంతుని మహిమ యెట్టిదియో తెలియకున్నది. ౧౦ గొప్పగొప్ప రాజనీతులలో మతిమఱవు గలుగును. విఘ్నములు వచ్చును. ఇట్లే యనేకలోపములవలన నలుగెలంకుల నిందగలుగును. ౧౧ కావున మఱుపును గొంచెమేని రానీయఁదగదు. మఱపులేకున్నచో సమస్తోపాయములును జక్కఁగ నెఱవేరును. కాని మఱపువలన నుపాయములు గూడ నపాయములగును. ౧౨ ఒక్కొక్కప్పుడు జరిగిన పొరపాటే గోచరింపదు. మానవునిహృదయమే వంగదు. అభిమానము వీడనికారణమున ఉభయలోకములయందును దుర్దశ కలుగును. ౧౩ సమస్తసంస్థలును నాశనమగును. జనులమనస్సులు విరిగిపోవునేగాని యుక్తియందు మఱపెచటవచ్చునో తెలియదు ౧౪ ప్రయత్నములేకుండఁ జేయుపనులన్నియు భంగములగును. దూరదర్శకత్వము, బుద్ధిసంయమము లేకపోవుటవలననే యీపరిస్థితు లేర్పడును ౧౫ ఒక్కొక్కఁడు మిగుల మూఢుఁడుగ నుండును. వానిపనులన్నియు వెఱ్ఱివాని పనులవలెనుండును. ఇట్టిపురుషుఁడు నానావికల్పములను వ్యాప్తినొందించును. ౧౬ ఆవికల్పములను దాను సవరించుకొనఁజాలఁడు. ఇతరులకుఁ దెలియవు. వికల్పములనుండి కల్పనము బయలువెడలి యన్నితావులఁ బెంపొందును ౧౭ ఆగుప్తకల్పనము తెలియుంగువాఁ డెవఁడు? ఎవరువానిని సవరింపవలెను ? కల్పనములందు జిక్కినవాఁడె తనబుద్ధిని దాను దిద్దుకొనవలెను. ౧౮ ఉపాధిని సవరింపఁజాలనివాఁడుఉపాధిని బెంపొందింపఁగూడదు. చిత్తమును సావధానపఱచి సమాధానపూర్వకముగా నుండవలెను౧౯ ఉపాధిని కౌఁగలించుకొనుటయు, స్వయముగాఁ గష్టములను సహించి లోకులనుగష్టపెట్టుటయు వ్యర్

థములు. ఇవి తగవు ౨౦ జనసముదాయమును మిగుల గష్టపెట్టుటయుఁ, దాను గష్టములొందుటయు నిరర్థకము. ఈజంజాటము నిరుపయోగకరము ౨౧ ఉపాధికార్య మిట్లుండును. కొంతమంచిదిగఁ గొంతవక్రముగా నుండును. అన్నింటి నతిక్రమించి వర్తించుట యుక్తముగా నుండును ౨౨ అందఱి హృదయములందును భక్తియుండదు. కావున మనము జనుల విషయమున శ్రద్ధదీసికొనవలెను. కాని యంత్యమునం దెవరిమీఁదను దోషము నారోపింపఁగూడదు ౨౩ అంతరాత్మయే మంచిచెడుగుల నన్నింటిని చేయుచున్నది. నిర్గుణ మలిప్తముగానున్నది. సమస్తగుణాగుణములు చంచలమునందు (అంతరాత్మయందు) కలుగుచున్నవి ౨౪ శుద్ధవిశ్రాంతియగుస్థలము నిర్మలము, నిశ్చలము మాత్రమే! అచట సమస్తవికారములును నిర్వికారములగును. ౨౫ అచట సమాస్తోద్వేగములును నష్టమగును. మనస్సునకు విశ్రాంతిలభించును. ఇట్టి దుర్లభమగు పరబ్రహ్మస్థితిని వివేకసహాయమునఁ బడయవలెను ౨౬ మనయెడ ఉపాధి బొత్తిగ లేదనియు, కర్మయోగముతో నివియన్నియుఁ గూడినవనియు వీనిసంయోగము వలనఁగాని, వియోగమువలనఁగాని హాని లేదనియు బాగుగా నెఱుఁగనగును. ౨౭ ఉపాధికి భయపడువాఁడు శాంతముగఁ గూర్చుండవలెను. తనచేతగానిదానిని దలఁచుకొని యేల కలవరపడవలెను! ౨౮ మనకు అవకాశము, విశ్రాంతి లభించుటకై కలవరములోఁ గొంతయు, శాంతిలోఁగొంతయుఁ గాలము గడుపవలెను. ౨౯ ఉపాధి యెల్లప్పుడే మాత్రమునుండునదిగాదు. సమాధానముకంటె శ్రేష్ఠమైన దింకొకటి లేదు. అట్లే నరదేహము మాటమాటికిని దొరుకదు. ౩౦

తొమ్మిదవ సమాసము
రాజనీతి వ్యవహారము.

జ్ఞానియు, ఉదాసియు, జనసముదాయమును సమావేశపరుపవలయునను నుత్సాహముగలవాఁడును నగు మానవుఁ డఖండముగా నేకాంతసేవనము గావింపవలెను ౧ ఏలయన! ఏకాంతమున యోచనలు బాగుగా స్ఫురించును. అఖండక్రియలు తెలియును. మఱియుఁ

ప్రాణిమాత్రుల స్థితిగతులవగతమగుచుండును. ౨ మానవుఁ డొకవేళ క్రియాశూన్యుఁడైనచో నాతని కేమియుఁ దెలియదు. ఔను. ౧ వాలతీయువానికి ఆదాయవ్యయము లేమి తెలియును? ౩ కొందఱు ధనద్రవ్యముల నార్జింతురు. కొందఱు తమవద్దనున్న ఆస్తినిగూడఁ గోలుపోవుదురు. ఇవియన్నియు ఉద్యోగవిషయములు ౪ ఎదుటివాని మనస్సులోనియంశమును దొలుతొల్తనే తెలిసికొన్నచో అనిష్టముగలుగవలసిన యవసరమేయుండదు. ౫ ఒక్కచోట విశేషకాలమున్నచో జనులు పరిహసింతురు. అతిపరిచయమువలన నవమానము కలుగును. కావునఁ జిరకాల మొకతావుననుండి విశ్రాంతి నొందరాదు ౬ సోమరితనమువలనఁ బనిపాటులన్నియుఁ జెడును. మఱియు సముదాయముయొక్క సంకల్పము పూర్ణము కాదు. ౭ కావున ఉపాసనకు సంబంధించిన సమస్తకార్యములను నిత్యనియమముగా జనుల కభ్యాసముచేయవలెను. ఇట్లాచరించినచో జనుల కితరకృత్రిమకార్యము లొనరించుట కవకాశమే లభింపదు ౮ ఎఱిఁగి బాగుగాఁ దెలిసికొని దొంగను భాండాగారమున కధికారిని జేయవలెను. దోషము కనబడఁగనే వానిని మందలించి సవరించుకొనవలెను. మెల్లమెల్లఁగ నాతని మూర్ఖత్వమును దూరపఱుపవలెను. ౯ ఇవియన్నియు ననుభవముతోఁ జెప్పు మాటలు. ఏప్రాణికైనఁ గానిమ్ము; దుఃఖము కలిగింపఁగూడదు. కాని రాజనీతితో జనులందఱిని లోఁబఱుచుకొనవలెను ౧౦ నష్టము నొందినపురుషుని నష్టమునకై విచారింపవలెను. వాచాలురిలో వాచాలురగువారిని లోఁబఱుచుకొనవలెను. తరువాఁత దికి వికల్పజాలమును రానీయఁదగదు. ౧౧ ముంటితో ముంటిని వెలికిఁ దీయవలెను. వెలికిఁ దీయవలయునే గాని తెలియనీయరాదు. కలహకర్తృత్వపదవిని రానీయఁజనదు ౧౨ గుప్తముగా నెవరికిఁ దెలియనిరీతిగా నొనర్చుపట్టు తత్కాలముననే సిద్ధినొందును. గజిబిజిపడినచోఁ గార్యమేమియు యోగ్యముగ నెరవేరదు. ౧౩ ఎవరికీర్తినేని విన్నయెడల మిగులఁ బ్రీతినొందవలెను. ఆతనినిజూచినపిదప నాప్రీతి మిగులదృఢము గావలెను. అట్లే అతిపరిచయమైనపిదప నాతనిసేవ గావింపవలెను. ౧౪ ఏపనియైనఁ గానిమ్ము. చేసినచో నెరవేరును. లేకున్నఁ జెదరిపోవును. కావున సోమరితనముతో వర్తింపఁదగదు. ౧౫ ఇతరునిపై విశ్వాసముంచువాని వ్యవహారము భంగమగును. కావున స్వయముగాఁ గష్టమునుసైరించుచు ఆత్మవిశ్వాసముగలిగి తనకార్యమును దిద్దుకొనువాఁడే వాస్తవమునకు యోగ్యుఁడు ౧౬ అందఱకు నన్నివిషయములు తెలియనీయఁదగదు. ఏలయన? అట్లొఱింగించినచో నావిషయముఁయందలి మహత్త్వము తొలంగును. ౧౭ ముఖ్యసూత్రమును జేతిలోనికిఁ దీసికొనవలెను. చేయవలసిన దెల్ల జనసముదాయముచేఁ జేయింపవలెను. రాజనైతికములకు ననేకసహస్రలను సాధింపవలెను. ౧౮ వాచాలుని, బలశాలిని, కలహకర్తను గూడఁ దనచేతిలో నుంచుకొనవలెను. కాని రాజనీతిని బురస్కరించుకొని దుర్జనులతో దుర్జనులఁ గలియనీయరాదు ౧౯ విరోధులను భేదనీతితోఁ బట్టుకొనవలెను. వారలను బిండిగా నూరివేయవలెను. కాని తరువాత (విజయానంతమున) వారలను గాపాడవలెను. నష్టమేమాత్రమును గలుగనీయఁదగదు. ౨౦ దుష్టులకు దుర్జనులకు భయపడునెడ రాజనీతి మహత్త్వముండదు. మీదుమిక్కిలి మంచిచెడ్డలన్నియు వెల్లడియగును ౨౧ మనుష్యసముదాయము నభివృద్ధిచేయవలెను. ఆక్రమణశక్తిగూడ దృఢముగ నుండవలెను. మఠమునిర్మించి జనసముదాయమును బ్రోగుజేసి పిదప నున్మత్తకార్యములఁ గావింపఁదగదు ౨౨ దుర్జనులను దనమనస్సుననే యెఱింగియుండవలెను. వారలకేమియు వెల్లడింపఁదగదు. దీనికి విరుద్ధముగా వారికి మహత్త్వమొసంగి సజ్జనులకువలె వారికిని వినతి యొనర్పవలెను. మఱియు నవకాశముజూచి ప్రతిక్రియ గావింపవలెను. ౨౩ దుర్జనుఁడు వెల్లడియైనపిదప జనులలో గొప్పకల్లోల ముదయించును. కావున దుష్టపథమునే తొలుత నిర్మూలము జేయవలెను. ౨౪ శత్రుసైన్యమును గాంచఁగనే రణశూరులభుజము లుప్పొంగునట్లు గావించు పరమార్థపక్షపాతియు, ధర్మాత్ముఁడు నగువాఁడె రాజు. ౨౫ అట్టి రాజును గాంచఁగనే దుర్జనులహృదయములు వికలము లగును. ఆతఁడు అనుభవశృంఖలలతోఁ బ్రజలను నడుపును. ఉపద్రవము, పాషండత్వము సులభముగా నాతనికతన నాశనమగును ౨౬ ఇవియన్నియు ధూర్తకార్యములు. రాజనైతికవిషయములలో దృఢత్వ ముండవలెను. మెత్తదనంపు భ్రమకు లోనుగాఁగూడదు. ౨౭ రాజనీతిచతురుఁడగు పురుషుఁడు అన్నితావులను గనిపింపఁడు. ప్రతిస్థలమునందును నాతనిని బ్రశంసించు

చుందురు. తనవాగ్విలాసముచే నాతఁడు సృష్టినంతయు సమ్మోహితము గావించును ౨౮ ప్రబల బలోపేతుని యెడఁ బ్రబలబలము నుపయోగింప వలెను. సాధారణునెడ సాధారణపద్ధతి నవలంబింపవలెను. మూఢుని యెదుట రెండవమూఢుని నిలువఁబెట్టవలెను. ౨౯ లాటిని లాటితోనే యెదుర్కొనఁజేయవలెను. ఉద్ధతునెదిరించుట కుద్ధతుఁడె గావలెను. కపటునికిఁ గాపట్యమే (కపటియే) కావలెను ౩౦ ఎట్టివానిని నెదిరించుట కట్టివాఁడే కావలెను. అప్పుడే సంస్థయొక్క రుచి తెలియవచ్చును. ఇదియంతయు జరుగుచున్నను జరుపువాఁ డెచటనున్నాఁడో యాజాడపోడ లెవరికిని దెలియనీయఁ దగదు. ౩౧

పదియవసమాసము.

వి వే కి వ ర్త న ము

అఖండరీతిగ నానాక్రియల నాచరించుచు, అఖండధారణా శక్తితో రాజనైతిక యుక్తిప్రయుక్తుల యోజించుచు నుండు వాఁడె నేర్పరి. ౧ ఆతఁడు సమస్త ప్రపంచముయొక్క ఉత్తమగుణములను నిరూపణ మొనరించును. ఒకక్షణమేని వ్యర్థముగా గడుపఁడు. ౨ వివేకి తనవక్తృత్వ సామర్థ్యముచే శాస్త్రాధారములతో సమాధానములను జెప్పి సాధకుల నానందపఱచును. సత్యాసత్యముల నిర్ణయించును. ఎల్లప్పుడు చర్చయొనరించును. ౩ భక్తిమార్గము వివేకికి బాగుగాఁ దెలిసియుండును. ఉపాసనమార్గ మతనికవగతమై యుండును. మఱియు నాతఁ డంతఃకరణమునందు జ్ఞానవిచారము మననము గావించును. ౪ వైరాగ్య మాతనికి మిగులఁ బ్రియమైనది. ఉదాసవృత్తి యాతనికి మిగుల నిష్టముగనుండును. అతఁడు విస్తృతమగు నుపాధిలోఁ బడియుండియు నలిప్తుఁడగును. ౫ అనేకప్రబంధములు వివేకికిఁ గంఠాగ్రమునం దుండును, ప్రశ్నలకు ననుకూలమగు నుత్తరములనిచ్చును. ఉచితభాషణములచే నందఱి యంతఃకరణములను శీతల మొనరించును. ౬ జనుల కతనిపైఁ బ్రేమ మెండు. ఎవరేని యాతనిముం దేమియు నుడువరు. ఆతనికడ కనేకులేతెంతురుగాని వానియంతరంగ స్వరూప మిట్టిదని యెవరేని యనుమానింపఁజాలరు. ౭ ఉపాసనమును ముందుంచుకొని

వివేకి సమస్తదేశములందును వ్యాప్తిగావించును. భూమండలమునందలి సమస్త జనుల నాతఁ డెఱుంగును. ౮ ఆతని నందఱెఱుంగుదురు. కాని యెవ్వరికిని లభింపఁడు. ఆతఁ డేమి చేయుచున్నదియు జనుల కెఱుకపడదు. సమస్తదేశవాసులగు వివిధమానవు లాతని వెదకుచుఁ దిరుగుదురు ౯ వారలందఱి మానసములను వివేకి తనచేతిలో నుంచుకొనును. వారల హృదయములను వివేకవిచారములతో నించును. ప్రజల యనిశ్చితహృదయములను మననమువైపు మఱలించును. ౧౦ వివేకి యెందఱు మనుజులఁ బ్రోవుగావించెనో యెంతజనసముదాయమును దనచేతిక్రింద నుంచుకొనెనో యెవ్వరికిని దెలియదు. అందఱ నాతఁడు శ్రవణమననములందు మగ్నులఁ గావించును, ౧౧ వివేకి తనసమాజమునకు హితముబోధించును. గద్యపద్యములు వివరించును. నిరంతర మితరుల హృదయములను సన్మార్గమునఁ బ్రవేశపెట్టును. ౧౨ ఇటు లఖండరీతిగా వర్తించుచు సావధానిగనుండు వివేకిని నెవ్వరును నేమియుఁ జేయఁజాలరు. ౧౩ ఎంత తనకుఁ దెలిసియున్నదో యదియంతయు మెల్లమెల్లఁగా జనులకుఁ జూపింపవలెను. ఈవిధముగా జనులనందఱను జతురులఁ గావింపవలెను. ౧౪ నానావిధములుగ బోధింపవలెను. అభ్యంతరముల నెఱింగింపవలెను. నిస్పృహులు నేరియేరి తనకడ నుంచుకొనవలెను. ౧౫ చేతనైనంతవఱకు స్వయముగాఁ జేయవలెను. తన చేతకానిదానిని లోకులచేఁ జేయించవలెను. కాని భగవద్భజనముమాత్రము తానుచేయక యితరులచేఁ జేయించుట ధర్మము కాదు. ౧౬ భగవద్భజనము స్వయముగఁ జేయవలెను. ఇతరులచేఁ జేయింపవలెను. స్వయముగా వివరణము గావింపవలెను. ఇతరులచే వివరణము జేయింపవలెను. మఱియు స్వయముగా భజనమార్గమును బట్టుకొనియుండి యితరుల నామార్గములోనికిఁ దీసికొని రావలెను. ౧౭ ఒకవేళఁ బ్రాతజనులకడ చిరకాలముండుటవలన విసుగుజనించినచో నూతనప్రాంతములకేగవలెను. తనచేఁ గాఁదగినపను లొనరించుటకించుకేని యాలసింపరాదు. ౧౮ దేహాభ్యాసముల కొకవేళ విడివడినచో నాసాధుపురుషుఁడు చెడిపోయినాఁడని తలంపనగును. నూతనులను నిత్యమును మిగుల నుద్వేగముతోఁ జతురులఁ గావింపవలెను. ౧౯ ఉపాధిలోఁ దగుల్కొనరాదు. ఉపాధికి భయపడుటయుఁ దగదు, నిర్లిప్తమ్యముగా

నున్నచో నేపనియేని నెరవేరదు. ౨౦ చెడిపోవలసియున్నపని చెడిపోయి తీరును. జనులు పిచ్చివాండ్రవలె నట్టిచూచుచుందురు. సోమరియు, హృదయశూన్యుఁడు నగుమానవుఁడు పనిచేయుటన నేమియో యెఱుంగఁడు. ౨౧ ఇది వెనుకముందు త్రోసికొనవలసిన (ధక్కాధక్కీ) వ్యవహారము. అశక్తునివలన నేమగును? కావుననే శక్తిగల (బలవంతుఁడగు) పురుషునకు నానావిధములగు బుద్ధులను, యుక్తులను నేర్పవలయును. ౨౨ తన ప్రయత్నమెంతదనుక నెరవేరునో అంతదనుక కార్యభారము వహింపవలెను. నెరవేరనప్పుడాస్థానమును వదలి యటకేని వెడలిపోవలెను. ఆపిదప నానందస్వరూపుఁడై కోరినతావునల్లఁ దిరుగవలెను ౨౩ ఉపాధిని తొలగించుకొన్నవానికి నిస్పృహత్వ మింకను దృఢమగును. మఱియు నాతఁ డానందపూర్వకముగఁ దఁచినతావునకు వెడలిపోవును ౨౪ కీర్తికాశించినచో సుఖములేదు. సుఖమునాశించినచోఁ గీర్తిలేదు. మఱియు నేమిచేయక యూరకఁ గూర్చున్నచో నెచ్చటను నేమియుఁగాదు ౨౫ ఈవిధముగా నుండునది యొద్దియులేదు. జరుగవలసినపని జరుగుచునేయున్నది. అవును. మానవుఁడు కేవలము తనదుర్బలత్వముపై దోష మాపాదించుకొని కూర్చుండియున్నాఁడు ౨౬ తొలుదొలుతనె ధైర్యమునుగోలుపోయినను లేక మధ్యనే ధైర్యమును గోలుపోయినను నిఁక నీసంసారపారము నెట్లు గాంచఁగలుగుదుము? ౨౭ సంసారము మొదటినుండియుఁ జెడ్డది. వివేకముతో దానిని బాగుచేయవలెను. బాగుజేసినచో నది యింకను జప్పఁబడును. ౨౮ యోచించినచో నీసంసారపుదశ యిట్టిదని మనస్సునకుఁ దెలియును. కాని యెవ్వరును ధైర్యమునువిడువఁగూడదు. ౨౯ ఏలయన? ధైర్యమును విడుచుటవలన నయ్యెడిదేమున్నది! అంతయు సహింపవలసియేయున్నది. చతురుఁడగుపురుషుఁడు నానావిధములగు బుద్ధులను నానామతములను గ్రహించుచున్నాఁడు ౩౦.

ఇరువదవదశకము.

మొదటిసమాసము

పూర్ణము - అపూర్ణము

జీవుఁడు, మనస్సు, పృథివి, జలము, తేజము, వాయువు, ఆకాశము, త్రిగుణములు, అంతరాత్మ, మూలమాయ మున్నగునవి వ్యాపకములుగ నున్నవి ౧ నిర్గుణబ్రహ్మముగూడ వ్యాపకముగ నున్నది. అన్నియు నీవిధముగా వ్యాపకములే. అట్లయినచో నివియన్నియు సమానములా? లేక యేమేనిభేదములు గలవా? ౨ ఇంకొక సందియము గలదు. ఏమన? జను లాత్మను నిరంజనమందురు. ఆత్మ సగుణమా? నిర్గుణమా? నిరంజనమా? ౩ శ్రోత యీవిధముగాఁ దనసందియమును దెలిపెను. ౪ మంచిది. ఇఁక నీసందేహమునకు ఉత్తరమును వినుము. అంతయు గజిబిజి గావింపకుము. వివేకమును బ్రకటించి యనుభవప్రాప్తి గావింపుము ౫ శరీరమును సామర్థ్యమును ననుసరించి జీవునకు వ్యాపకత్వముగలుగును. కాని మనస్సునకుసమానమగు చపలము (జీవునకు) లేదు. ౬ చపలత్వ మేకదేశీయము. దానియందుఁ బూర్ణవ్యాపకత్వములేదు. పృథివికిఁగూడ మర్యాద(మేర)లేదు. ౭ అట్లే ఆపస్తేజములుగూడ స్వాభావికముగనే అపూర్ణములుగనున్నవి. వాయువునుగూడఁ జపలము, ఏకదేశీయమునని తెలిసికొనుము ౮ ఆకాశము, నిరాకారపరబ్రహ్మము, నిస్సందేహముగాఁ బూర్ణవ్యాపకములు ౯ త్రిగుణములు మాయగూడ నాశనమగును. కావున నవియు నపూర్ణములు, ఏకదేశీయములు సుమా! అవి పూర్ణములు, వ్యాపకములుగావు. ౧౦ ఆత్మయు నిరంజనమును వేఱువేఱుగ నున్నవి. ఇఁక వీనిభేదమును జక్కఁగ వివరింతును ౧౧ ఆత్మ (మనస్సు) అత్యంతచపలమైనది. కావున నిది వ్యాపకముగాదు. ఈవిషయము నంతఃకరణమును విమలమును సుచిత్తమును గావించి తెలిసికొనవలెను ౧౨ అది (ఆత్మలేకమనస్సు) యొకవేళ నాకాశమునందున్నచోఁ బాతాళమునం దుండదు. ఒకవేళఁ బాతాళమునందున్నచో నాకాశము

నం దుండదు. అనఁగా నది నాలుగుదిక్కులను బూర్ణముగా నుండదు ౧౩ దానిని ముందుంచినచో వెనుకనుండదు. ఎడమవైపుననుంచినచోఁ గుడివైపున నుండదు. ఏదిక్కుననుంచిన నాదిక్కుననే యుండును; దశదిశలలో నది వ్యాపకముగా లేదు. ౧౪ మనస్సన్నితావులయందును సమానముగా నుండదు. దీనివలన మనస్సుయొక్క అపరిపూర్ణత యనుభవమునఁగలదు. ౧౫ పరబ్రహ్మమునకు సూర్యుని దృష్టాంతముగ నీయఁదగదు. ఏలయన? సూర్యునకు ఉదయాస్తమానములు రెండును గలవు. పరబ్రహ్మ మట్లుగాదు. సదోదితము, నిర్గుణము. ౧౬ ఘటాకాశ, మఠాకాశ, మహదాకాశముల దృష్టాంతములు అవశ్యము నిర్గుణపరబ్రహ్మమున కన్వయింపఁగలవు ౧౭ బ్రహ్మాంశ మవకాశము. ఆత్మాంశము మనస్సు. ఈరెంటిని జక్కఁగ నెఱుంగవలెను. ౧౮ ఇఁక నాకాశము, మనస్సు సమ మెట్లగును? మనన శీలురగు మహాపురుషులంతయు నెఱుంగుదురు ౧౯ ఒకవేళ మనస్సు ముందువిరాజిల్లుచున్నచో వెనుకనేమియు నుండదు. ఇఁక దానిని బూర్ణాకాశముతో సమానమని యెట్లుచెప్పఁగలను? ౨౦ పరబ్రహ్మము నచలమందురు. పర్వతమునుగూడ నచలమందురు. కాని యీరెంటి నొకటియని నుడువనగునా? ౨౧ జ్ఞానము, అజ్ఞానము, విపరీతజ్ఞానము ననునీమూఁడును సమాన మెట్లగును? మననముచేసి యిందనుభవము గడింపవలెను ౨౨ ఎఱుంగుటను జ్ఞానమందురు. ఎఱుకలేమి నజ్ఞానమందురు. ఒకదానిని మఱియొకటిగఁ దెలిసికొనుటను విపరీతజ్ఞానమందురు. ౨౩ జ్ఞానమును అజ్ఞానమును వేరుపఱచినచో స్థూలపాంచభౌతికము మిగులును. దానినే విపరీతజ్ఞానమని యెఱుంగవలెను * ౨౪ ద్రష్టయు, సాక్షియు నగునంతరాత్మయే జీవాత్మ. జీవాత్మయే శివాత్మ. పిదప శివాత్మయె జీవాత్మయై జన్మమును గైకొనుచున్నది ౨౫ ఆత్మత్వమునందు జననమరణము లంటుకొనుచున్నవి. జననమరణభంగ మాత్మత్వమునఁగలుగదు. (కృష్ణభగవానుఁ డీయర్థముననే) సంభవామియుగే యుగే యని వచించెను. ౨౬ ఏకదేశీయుఁడగు జీవుఁడు విచారమువలన విశ్వంభరుఁడగుచున్నాఁడు.

* ఈపాంచభౌతికవ్యాప్తము విపరీతజ్ఞానము. ఇది జ్ఞానమునుగాదు. అజ్ఞానమునుగాదు. కేవలభ్రమ. అనఁగా విపరీతజ్ఞానము.

కాని విశ్వంభరునుండి సంసారము (ప్రపంచము) ఎట్లువిడిపోవఁగలదు? ౨౭ వృత్తిరూపమున జ్ఞానాజ్ఞానములు రెండును సమానములే. నివృత్తిరూపమున విజ్ఞానుఁడు కావలెను ౨౮ జ్ఞాన మీబ్రహ్మాండమును నిర్మించెను. దీని నిదియే వృద్ధిగావించెను. అది నానాప్రకారములగు వికారముల సమూహమైయున్నది. ౨౯ బ్రహ్మాండముయొక్క యెనిమిదవదేహము (మూలమాయ) వాస్తవమునకు జ్ఞానమే. దానికంటెను నావలనున్న విజ్ఞానరూపమగు విదేహావస్థను బ్రాపింపవలయును. ౩౦

రెండవసమాసము.

త్రివిధసృష్టి.

ఒకవేళఁ జంచలమగు మూలమాయయే లేకున్నచో నిర్గుణబ్రహ్మము, గగనాంతరాళములు, నలుదిక్కులవలె నిశ్చలముగ నుండెడిది. ౧ దృశ్యము వచ్చుచున్నది. పోవుచున్నది. కాని యాబ్రహ్మము గగనమువలె నలుదిక్కులనిండి నిశ్చలముగా నున్నది. ౨ బ్రహ్మ మెటుజూచిననటే యపారముగ నున్నది. ఏదిక్కునను దానికిఁ బారములేదు. అది యొకవిధమైనదిగను స్వతంత్రమైనదిగను నున్నది. దానియందు ద్వైతములేదు ౩ బ్రహ్మాండమునకుఁ బైనఁగూర్చుండి (బ్రహ్మాండమున దృశ్యముగా భావించి) ఆకాశముయొక్క యవకాశమును మఱియు దాని శూన్యాకారమును నవలోకింపవలెను. ఇటులొనరించినచో నందు చంచలవ్యాపకములవేరిట శూన్యాకారము గలదని విదితమగును ౪ దృశ్యమును వివేకముతో వేఱుచేసినచో నలుదిక్కులను పరబ్రహ్మమే నిండియుండును. కాని యది యెప్పుడును నెవ్వరి యనుమానములోనికిని రాదు. ౫ క్రిందను బైనను నలుదిక్కులను అన్నితావులను నిర్గుణపరబ్రహ్మమే కనిపించుచున్నది. దృశ్యము నడచుచున్నది. బ్రహ్మ మచలముగనున్నది. దృశ్యముకాన్పించును. బ్రహ్మము కాన్పింపదు. దృశ్యకల్పన మాకలనమగును పరబ్రహ్మకల్పన మాకలనముకాదు. ౬ కల్పన మేదియొ యొకపదార్థముగాదు. బ్రహ్మము సర్వస్థలములందును నిండియున్నది. మహావాక్యార్థమును మననము గావింపవలెను. ౭ పరబ్రహ్మమునకు సమానమగు శ్రేష్ఠవస్తు వింకొకటి లేదు. శ్రవణమును విడిచినచో నింక సాధనమే

లేదు. ఎఱుఁగకున్నచో నేమియు సమాధానముకలుగదు ౯ పరబ్రహ్మము పిపీలికామార్గమువలన మెల్లమెల్లఁగ విదితమగును. విహంగమ మార్గమువలన శీఘ్రముగ ఫలములభించును. సాధకజనులు మననము నందుఁ బ్రవేశించినచోఁ గళ్యాణము కలుగును ౧౦ పరబ్రహ్మమునకు సమానమగు రెండవసత్య మెద్దియులేదు. పరబ్రహ్మమునకు నిందాస్తుతులు లేవు. ౧౧ పరబ్రహ్మ మీవిధముగ ననుపమము. దానికి సమానము నెవ్వఁడును గల్పింపఁజాలఁడు. మహానుభావులు పుణ్యరాసులు నగు వారికే యాపరబ్రహ్మమునందు బ్రవేశముకలుగును ౧౨ చంచలము వలన దుఃఖము ప్రాప్తించును. నిశ్చలమునకు సమానమగువిశ్రాంతి యెచ్చటను లేదు. మహానుభావులగు పురుషులు నిశ్చలము ననుభవముతోఁ గాంతురు. ౧౩ ఆదినుండి యంత్యముదనుక విచారముగావించు వానికే అనుభవముయొక్క నిశ్చయము లభించును. ౧౪ ఈకల్పనసృష్టి మూఁడువిధములుగా భాసించుచున్నది. తీక్ష్ణబుద్ధితో దీనిని మనస్సులోనికిఁ దేవలెను ౧౫ మూలమాయనుండి త్రిగుణములు కలిగెను. అవి యన్నియు నేకదేశీయములు. మఱియుఁ బంచభూతములస్థూలగుణము ప్రత్యక్షముగఁ గాన్పించుచున్నది ౧౬ పృథ్వినుండి నాలుగువిధములగు నుత్పత్తులగుచున్నవి. వాని నాలుగు విధముల కృత్యములును వేఱువేఱుగా నున్నవి. సృష్టియొక్క గమనిక యిచ్చటినుండియే యారంభమయ్యెను. ౧౭ ఇఁక సృష్టియొక్క త్రివిధలక్షణములను విశదీకరించెదను. శ్రోతలు తమయంతఃకరణములను సావధానము గావింతురుగాక ౧౮ ఆదినుండియుఁ జేతనరూపమగు మూలమాయ సూక్ష్మకల్పనారూపముగ నుండెను. పరావాక్కీవిధముగ స్ఫురణరూపముగ నున్నదో యట్లే మూలమాయయుఁ గూడ వలరారుచున్నది. ౧౯ అష్టధాప్రకృతికిమూలము కేవల మీమూలమాయయే. అన్నిబీజములును సూక్ష్మరూపముతో నాదినుండియు మూలమాయయం దున్నవి. ౨౦ అది జడపదార్థములకుఁ జేతనము నొసంగుచున్నది. కావనే దానిని జైతన్యమందురు. సూక్ష్మరూపముతో సకలలక్షణములను గ్రహింపవలెను. ౨౧ ప్రకృతిపురుషులు, అర్ధనారీనటేశ్వరుఁడు, అష్టధాప్రకృతి మున్నగునవియెల్ల నదియే ౨౨ త్రిగుణములు గుప్తరూపముతో మూల

మాయయం దున్నవి. ఇందువలననే మూలమాయ మహత్తత్త్వ మనుచున్నారు. శుద్ధ సత్త్వగుణము సైతము గుప్తరూపమున దానియందే యున్నది. ౨౩ మూలమాయవలన మూఁడుగుణములును బ్రకటనమగుచున్నవి. కావున దానిని గుణక్షోభిణి యందురు. త్రిగుణముల రూపము నెఱిసికొనుచున్న సాధువులకు వందనములు. ౨౪ మూలమాయయందు గుణములు సమానముగ నున్నవి. కాన దానిని గుణసామ్య మందురు. ఈసూక్ష్మవిచారమును బహుస్వల్ప సంఖ్యాకులే యెఱుంగుదురు. ౨౫ త్రిగుణము లీవిధముగా మూలమాయనుండి కలిగెను. కాని యవి చంచలములు, నేకదేశీయములు నైయున్నవి. ఈవిషయ మనుభవమువలనఁ దెలియును, ౨౬ దీనికిఁబిమ్మటఁ బంచభూతముల విస్తారము కలిగెను. సప్తద్వీపములు, నవఖండములతోఁ గూడిన వసుంధర, యంతయు నీవిస్తారమునందే యున్నది. ౨౭ ఈప్రకారముగా సృష్టి రెండు విధములు. (త్రిగుణములు, పంచభూతములు) గలదయ్యెను. ఇఁక మూఁడవవిధము వినుఁడు. ౨౮ పృథివి నానాపదార్థములకును బీజము. అండజజరాయుజస్వేదజోద్భిజ్జములను జతుర్విధోత్పత్తులు, చతుర్వాక్కులు, స్వాభావికముగా దీనినుండియే నిర్మాణము లయ్యెను ౨౯ చతుర్విధోత్పత్తులు, చతుర్వాక్కులు కలుగుచున్నవి. పోవుచున్నవి. కాని పృథివిమాత్ర మట్లే చెక్కుచెదరకున్నది. ఈవిధముగా నెన్నియో ప్రాణులు కలుగుచున్నవి. మరణించుచున్నవి. ౩౦

మూఁడవసమాసము
సూక్ష్మవిచారము.

ఆదినుండి యత్యంతముదనుక నానావిధమగు విస్తారమును నెఱింగించితిని. దానిని మననముగావించుచు గావించుచు మఱల వృత్తిని వెనుకకు మరల్పవలయును ౧ నాలుగుఉత్పత్తులు, నాలుగువాక్కులు, ఎనుబదినాలుగులక్షల జీవయోనులు మఱియు నానాప్రకారములగు ప్రాణులు జన్మించియున్నవి. ౨ అన్నియుఁ బృథివినుండియే కలిగినవి. పృథివియందే కలిసిపోవుచున్నవి. ఈప్రకారముగ నెన్నియో పుట్టు

మున్నవి. గిట్టుచున్నవి. కాని పృథివి యటులేయున్నది ౩ ఇది శిఖరము వైపుభాగము, రెండవభాగము భూతములగోల, మూఁడవభాగములో ననేకసూక్ష్మనామరూపములు గలవు ౪ స్థూలము నంతయువిడిచి సూక్ష్మమును గుర్తింపవలెను. త్రిగుణములకు మొదటిదెద్దియో దానిని సూక్ష్మదృష్టితోఁ జక్కఁగ విచారింపవలెను. ౫ చేతనాచేతనములను గుణరూపములను మాటిమాటికి విచారమొనర్పవలెను. కాని సూక్ష్మదృష్టియొక్క చమత్కారము దీనికంటె ముందున్నది ౬ శుద్ధాచేతనము, తమోగుణము, శుద్ధచేతనము, సత్త్వగుణము, మఱియుఁ జేతనాచేతనము, మిశ్రితమై రజోగుణకార్యము జరుగుచున్నది ౭ ఇదియే త్రిగుణములరూపము. త్రిగుణముల ముందటికర్దమమును గుణక్షోభిణి యందురు ౮ రజస్సత్త్వతమోగుణములు మూఁడింటి కర్దమము గుప్తరూపముగ నెచటనుండునో దానిని మహత్తత్త్వమందురు. ౯ ప్రకృతిపురుషులనియు, శివశక్తులనియు, అర్ధనారీనటేశ్వరులనియు దానినే నుడువుదురు. అది త్రిగుణకర్దమరూపము ౧౦ సూక్ష్మరూపముతో గుణములకు సమానత్వముగలదానిని గుణసామ్య మందురు. మఱియుఁ జైతన్యరూపమగు మూలమాయగూడ సూక్ష్మముగ నున్నది. ౧౧ ఆసూక్ష్మకర్దమరూపమగు మూలమాయయే బ్రహ్మాండముయొక్క మహాకారణ (ఎనిమిదవ) కాయము. ఈవిధముగ సూక్ష్మాన్వయములను మాటిమాటికి విచారింపవలెను ౧౨ చతుర్విధోత్పత్తులు, పంచభూతములు, పదునాలుగు సూక్ష్మసంకేతములు, వీనిలో నన్నియు వచ్చును. ౧౩ పైపైనిజూచినచో నేమియుఁ దెలియదు. ప్రయత్నముగావించినను బోధకాదు. నానావిధములగు జనుల హృదయములందు సందియములు వృద్ధినొందును ౧౪ మూలమాయయొక్క పదునాలుగునామములు, పంచభూతములుగలిగి పందొమ్మిదియయ్యెను. వీనిలోఁ జతుర్విధోత్పత్తులు గలియగనే యిరువదిమూఁడయ్యెను. వీనిలో మూలమునకు సంబంధించిన పదునాలిగింటిని మాటిమాటికిఁ జూడవలెను. ౧౫ మననమొనరించి తెలిసికొనువానికి సందియ ముండదు. తెలియకయే పెట్టుకొను జంజాటమంతయు వ్యర్థము ౧౬ సమస్తసృష్టిబీజమును స్వాభావికముగనే మూలమాయయందుండును. దీనినంతయుఁ దెలిసికొన్నచోఁ బరమార్థసిద్ధి యగును ౧౭ తెలిసి

కొన్నవాఁడు వ్యర్థప్రలాపనలు గావింపఁడు. నిశ్చయభావయుక్తుఁడగు పురుషుఁడు సందేహమునఁ బడఁడు. అతఁడు తనపరమార్థము నెప్పుడును జెడనీయఁడు ౧౮ చెప్పఁదగిన శబ్దాతీతవిషయములను వాచ్యాంశము లందురు. శుద్ధలక్ష్యాంశమును వివేకముతోఁ గాంచవలెను. ౧౯ మాయను బూర్వమందురు. అది సిద్ధాంతముతో లయమగును. మాయ లేకున్న మీఁదట నిఁక నాస్థితి నేనని నుడువవలెను! ౨౦ అన్వయవ్యతిరేకములు, పూర్వపక్షవిచారములు (మాయావిచారములు); సిద్ధాంతమునందు శుద్ధమొక్కటియేయుండును. దానిలో రెండవదెద్దియు లేదు. ౨౧ అధోముఖమువలన (మాయవైపుదృష్టినిడుటవలన) భేదము వృద్ధినొందును. ఊర్ధ్వముఖమువలన (పరబ్రహ్మమువైపు దృష్టినిడుటవలన) భేదము విడిపోవును. నిస్సంగముతోఁ బాటుగ నిర్గుణిగనున్నవాఁడే మహాయోగి. ౨౨ మాయయొక్క మిథ్యాత్వము విదితమైనవు డిఁక దానికేల భయపడవలెను? దానికి భయపడుటవలననే స్వరూపస్థితి లభింపకున్నది ౨౩ మిథ్యయగు మాయకుభయపడి సత్యపరబ్రహ్మమును విడుచుట యుక్తము కాదు. ముఖ్యనిశ్చయమును బొంది భయపడనేల? ౨౪ పృథివియందుఁ బెక్కండ్రుజను లున్నారు. వారిలోఁ బెక్కుమంది సజ్జనులుగూడ నుందురు. కాని సాధువునువిడిచినచో నింక నెవరు సాధువును గుర్తింతురు? ౨౫ కావున గార్హస్థ్యమును విడిచినపిదప సాధువును వెదుకవలెను. తిరిగి సాధువును గనుఁగొనవలెను ౨౬ పలువురుసాధువులతోఁ గలియవలెను. వారలయందెచటనో యొక యనుభవశాలియగు సాధుసత్తముఁడు లభించును. ఏలయన్న! అనుభవము లేనిచో స్వహితము జరుగదు. ౨౭ ప్రపంచమైనఁ గానిమ్ము! పరమార్థమైనఁ గానిమ్ము. అనుభవము లేనిచో నంతయు వ్యర్థమే. అనుభవజ్ఞానము గలవాఁడెందఱికంటెను సమర్థుఁడు. ౨౮ రాత్రింబవళ్లు అర్థవిచారము గావింపవలెను. అర్థవిచారము గావించువాఁడే సమర్థుఁడు. వానివలననే పరలోక సంబంధమగు సత్యస్వార్థము లభించును. ౨౯ కావునఁ జూచినదానినే మఱలఁ జూడవలెను. శోధించినదానినే మఱల శోధింపవలెను. అంతయు విదితమైనప్పుడు సహజముగనే (సులభముగనే) సందేహము నశించిపోఁగలదు. ౩౦

నాలుగవసమాసము

ఆత్మనిరూపణము.

ఏదియో యొకరీతిగ మనస్సు నుదాసపఱుపవలదనియు అనుభవపూర్ణమగు నిరూపణమును హృదయమునం దుంచవలెననియు నందఱిని బ్రార్థించుచున్నాఁడను ౧ అనుభవ మొకవైపుననుంచి తనయిచ్చవచ్చినట్లు తానుపరుగెత్తినచోఁ నిఁక సారాసారవిచార మెట్లగును? ౨ సాధారణదృష్టితో సృష్టినిగాంతుమేని యంతయు నొకగందరగోళముగాఁ గాన్పించును. కాని యీరాజసత్తావిషయము వేఱుగనున్నది ౩ పృథ్వియందలి శరీరములన్నియు భగవంతునిగృహములు. ఆగృహములవలననే నానాసుఖము లాతనికిఁ బ్రాప్తించుచున్నవి ౪ ఆతనిమహిమ యెవనికిఁ దెలియఁగలదు? కృపాళుఁడగు నా జగదీశ్వరుఁడు మాతృరూపముతోఁ బ్రత్యేకజగత్తును రక్షించుచున్నాఁడు ౫ ఆతనిసత్తయంతయు నీసంపూర్ణజగత్తునందు విరాజిల్లుచున్నది. భగవంతుని కళవలననే సృష్టివర్తించుచున్నది. ౬ మూలజ్ఞాతయగు పురుషుని (పరమాత్ముని) సత్త శరీరమునందు విభాజితమైయున్నది. కళయుఁ, జతురత్వము నందేయున్నవి ౭ అన్నిపురములకును నీశుఁడగు జగదీశుఁడు జగత్తునందు వ్యాపించియున్నాఁడు. నానాశరీరములయందునిండి యాతఁడే యానందముతో నీసృష్టిని నడుపుచున్నాఁడు ౮ పైపైనిజూచినచో నీసృష్టియొక్క సమస్తరచన యొకనివలన నడువఁజాలదని తోఁచును. కాని యాతఁడొక్కఁడే నానాదేహములు ధరించి దీనిని నడుపుచున్నాఁడు. ౯ ఆతఁ డీకార్యములయందు చ్చనీచముల విచారింపఁడు. మంచిచెడుగులఁ జూడఁడు. పని జరుగుచుండుటమాత్రమే భగవంతుని యభిప్రాయము ౧౦ భగవంతుఁడు అజ్ఞానులనుసృజించి లోకుల కాటంకముఁగలుగఁజేసెనో లేక యభ్యాసమునందుఁ బడవైచెనో తెలియదు. ఎందుల కాతఁడు దేనినినిర్మించెనో యాతనికే తెలియును ౧౧ జగదాంతర్యము (జనులందలి యంతఃకరణము) చక్కఁగ ననుసంధానముగావించుటయే ధ్యానము. ఈధ్యానజ్ఞానము లోకేరూపముగలవి ౧౨ ప్రాణి ప్రపంచములోని కేతెంచి కొంతచతురుఁడై సపిదప భూమండలములోని విషయముల నెన్నిఁటినేని మననము విచారము గావించును ౧౩ శ్రీరాముని

పతాకము ప్రసిద్ధముగాఁ బ్రకాశించుచున్నది. ఆయాత్మారాముఁడు జ్ఞానధనుఁడు. ఆవిశ్వంభరుఁడు సర్వస్థలములందును వెలుఁగుచున్నాఁడు. కాని గొప్పభాగ్యమువలనఁగాని యాతఁడు ప్రాప్తింపఁడు ౧౪ ఉపాసనమును మనము విరళించినకొలఁది విస్తరమగును. సత్యము. దానిమహిమ వర్ణింప నేరితరము? ౧౫ చూచెడివానిని ద్రష్టయందురు. ఎఱింగినవానిని సాక్షియందురు. ఆయనంతరూపమగు ననంతమును గురుతెఱుంగవలెను. ౧౬ యోగ్యులతోఁ జెలిమియుఁ, బరమాత్మునికథలందును, అధ్యాత్మనిరూపణమునందును బ్రీతియుఁ గలుగఁగానే మనస్సునకుఁ గొంతవిశ్రాంతి లభించును ౧౭ ఇంతయైనను సందేహనాశనము గావించు అనుభవజ్ఞాన ముండితీరవలెను. ఏలయన! అనుభవములేనిచో సమాధాన మెట్లులభించును? ౧౮ మూలసంకల్పమే హరిసంకల్పము. మఱియు మూలమాయయొక్క వ్యాపారరూపమే జగదంతఃకరణమునందుఁ గాన్పించుచున్నది. ౧౯ ఉపాసన జ్ఞానస్వరూపము. కాని జ్ఞానముయొక్క యునికియందు నాలుగవదేహపుఆరోపణ గలదు. ఇందుచే సంకల్పములన్నింటిని విడిచి విజ్ఞానరూపమగు విదేహావస్థ నొందవలయును ౨౦ అదియే విశాలపరబ్రహ్మము. అది యాకాశమువలె సర్వవ్యాపియు, సఘనము నైయున్నది. అది పలుచనిదనిగాని కోమలమైనదనిగాని యెట్లుచెప్పఁగలము? ౨౧ జ్ఞానమును ఉపాసనమందురు. జ్ఞానమువలనఁ బరమేశ్వరుఁడు లభించును. జ్ఞానమువలననే యోగులకు సమాధానము కలుగుచున్నది ౨౨ బాగుగా విచారించినచో తానే యుపాసనయని విశదమగును. ఒకఁడు గతించుచున్నాఁడు. మఱియొకఁడు దేహమును ధరించివచ్చుచున్నాఁడు ౨౩ పరంపరగ నీవిధముగనే చక్రగతి జరుగుచువచ్చినది. మఱియు నిప్పటికిని సృష్టిస్థితి యద్దియే ౨౪ అరణ్యముపై నరణ్యచరములకు (జంతువులకు) సత్తు గలదు. జలముపై జలచరములకు సత్త గలదు. భూమండలముపై భూపాలురకు సత్త గలదు. అన్నింటస్థితియు నిటులేయున్నది. ౨౫ ఆందోళనము గావించువాని కావశ్యకముగా సామర్థ్యము కలుగును. కాని దానికి భగవంతుని యధిష్ఠానము కావలెను. ౨౬ కర్త జగదీశ్వరుఁడే. అదిసత్యమే కాని యాతనికృత్యములు వేఱువేఱుగా విభాగములైనవి. ఐనను అహంతాభ్రమ (అహంకర్తృత్వాభిమానభ్రమ) యందుఁ జిక్కుకొనఁ జనదు.

౨౭ "హరిర్దాతా హరిర్భోక్తా" యను సిద్ధాంతము జగత్తునందంతటను వర్తించుచున్నది. కాని దీనిని బాగుగా యోచింపవలెను. ౨౮ సర్వమునకు గర్త పరమేశ్వరుఁడు "నేను" అనునది యేదేని యొకపదార్థము గాదు. దానికి స్ఫూర్తియుండు ప్రసంగమును జగదంతఃకరణములో గలిపి యొనర్పవలెను. ౨౯ ఆత్మతో సరియగు చంచలమైన దింకొకటిలేదు. అట్లే పరబ్రహ్మముతో సమానమగు నిశ్చల మెద్దియులేదు. సోపానపరంపరపై మూలముదనుక నెక్కి అనుభవము గడింపవలెను. ౩౦

ఐదవ సమాసము

పదార్థ చతుష్టయము

ఇచ్చటనుండి యచ్చటిదనుకఁ జూచినచో మొత్తము నాలుగు పదార్థము లున్నట్లు విశదపడును. ఒకటి (పరబ్రహ్మము) పదునాలుగు (మూలమాయ) ఐదు (భూతములు) నాలుగు (ఉత్పత్తులు) ౧ కాని పరబ్రహ్మ మన్నింటికంటెను వేఱుగనున్నది. అది యన్నింటికంటెను శ్రేష్ఠముగను నానా కల్పనములకంటె భిన్నముగను నున్నది. ౨ పరబ్రహ్మవిచారము నానాకల్పనముల కావలనున్నది. అదినిర్మలము, నిశ్చలము, నిర్వికారము, అఖండము నై యున్నది. ౩ ఇఁక నన్యములగు పదార్థములు మూఁడు. అవి నానాకల్పనారూపమగు మూలమాయ కంతర్గతములుగ నున్నవి. ౪ మూలమాయ నానావిధములతో సూక్ష్మరూపముగ నున్నది. అది సూక్ష్మరూపమయ్యుఁ గర్దమరూపమై యున్నది. మూలముయొక్క సంకల్పారోపణము దానిమీఁదికి వచ్చుచున్నది. ౫ మూలముయొక్క హరిసంకల్పమే యందఱికి ఆత్మారాముఁడు. ఇఁక భిన్నభిన్ననామముల వివరణము వినుండు, ౬ నిశ్చలమునందు చంచలముయొక్క చేతనము కలుగును. కావున దానిని చైతన్యమందురు. మఱియు నది గుణసమానత్వ కారణమున గుణసామ్యమనఁబడుచున్నది. ౭ అర్ధనారీనటేశ్వరుఁడని షడ్గుణేశ్వరుఁడని, ప్రకృతిపురుషులని, శివశక్తియనిగూడ దానికే చెప్పుదురు, ౮ శుద్ధసత్త్వగుణము, అర్ధమాత్ర, గుణక్షోభిణి మఱియు నాతర్వాత మూఁడుగుణములు ప్రకటనము లగుచున్నవి. ౯ మనస్సు, మాయ, అంతరాత్మదనుక నీపదునాలుగు నామములు లెక్కింపఁబడుచున్నవి. అన్నింటిలోను జ్ఞానాత్మ విద్యమానమై యున్నది. ౧౦ మొదటిది పరబ్రహ్మము. రెండవది పదునాలుగు పేరులు గల మూలమాయ. ఇఁక మూఁడవవిధమగు పంచమహాభూతముల విధము జెప్పెదను. ౧౧ పంచమహాభూతముల జ్ఞాతృత్వశక్తి స్వల్పము. వానియాద్యంతము లు ప్రత్యక్షములు. ఇఁక నాలుగవవిధ ముత్పత్తులఁ గూర్చినది. దానినిగూడఁ దెలుపుదును. ౧౨ చతుర్విధోత్పత్తులలో ననంతప్రాణులుగలవు. వానియన్నింటిలో జ్ఞాతృత్వశక్తి బాగుగా నిండి యున్నది. ఈవిధముగా మొదటిది బ్రహ్మము, రెండవది మాయ. మూఁడవది పంచభూతములు, నాలుగవది చతుర్విధోత్పత్తి. నాలుగు పదార్థములయ్యెను. ౧౩

బీజము కొంచెము నాటఁబడును. కాని తరువాత మిగులనుత్పత్తియగును. చతుర్విధోత్పత్తులు, చతుర్విధవాక్కులు ప్రకటనమైన పిదప ఆత్మకుఁగలిగెడి స్థితిగూడ నిట్టిదె. ౧౪ ఈవిధముగ సత్త ప్రబలమైనది. స్వల్పసత్త మిక్కుటమయ్యెను. మఱియు నది మనుష్యవేషముతో నానాప్రకారములుగా సృష్టిని భోగించుచున్నది. ౧౫ శ్వాపద జంతువులు అన్యజంతువులను జంపి తినుచున్నవి. ఇంతియే. ఇంతకుఁదప్ప నవియేమియు నెఱుంగవు. కాని మనుష్యప్రాణులు నానావిధములగు భోగములను భోగించుచున్నవి. ౧౬ నానావిధశబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను విశేషరూపముగ నరదేహమే తెలిసికొనుచున్నది. ౧౭ అమూల్యరత్నములు, నానావిధ వస్త్రములు, యానములు, శస్త్రములు విద్యలు, కళలు, శాస్త్రములు, నరదేహమే గ్రహించుచున్నది. ౧౮ పృథివి యీశ్వరసత్తతో వ్యాప్తమైయున్నది. ప్రతిస్థలమునను ఆసత్త సంపూర్ణరూపముగ నిండియున్నది. దానివలననే నానావిద్యలు, కళలు, ధారణాదులు ఉత్పన్నమయ్యెను. ౧౯ నరదేహమునొంది సమస్తదృశ్యములను జూడవలెను. స్థానమానముల నవరించుకొనవలెను. సారాసారముల విచారింపవలెను. ౨౦ ఇహపరలోకములను, నానావిధ వివేకావివేకములను మనుజుఁడే గ్రహించుచున్నాఁడు. ౨౧ నానావిధ పిండబ్రహ్మాండరచనము, నానామూలములగు బహువిధకల్పనములు, నానావిధ ధారణలు, మనుజుఁడే గ్రహించుచున్నాఁడు. ౨౨ అష్టభోగములు,

నవరసములు, నానావిధ విలాసములు, వాచ్యాంశ లక్ష్యాంశ సారాంశములు మనుజుఁడే గ్రహించుచున్నాఁడు. ౨౩ మనుజుఁ డన్నింటిని దెలిసి కొనును. ఆమనుజుని నీశ్వరుఁడు పోషించుచున్నాఁడు. ఇదియంతయు నరదేహయోగమువలననే విదిత మగుచున్నది. ౨౪ నరదేహము పరమ దుర్లభము. దీనివలన నలభ్యములగు లాభములు లభించుచున్నవి. దీని యోగముననే దుర్లభము సులభమగుచున్నది. ౨౫ రెండవ (ఇతర) దేహము చిత్త్ర చెదారములవంటిది. నరదేహ మొకగొప్ప ద్రవ్యభాండారమువంటిది. కాని నరదేహమునొందినందులకు, ఉత్తమ వివేకమును గ్రహింపవలెను. ౨౬ నరదేహమునొంది వివేకబలముతోఁ బరమాత్మని గుర్తింపనివాఁడు అన్నివిధముల మునిఁగిపోవును. ౨౭ విశ్వాస పూర్వకముగ శ్రవణ మొనరించుచు నిరంతమును మననశీలమగు నంతఃకరణముతో వర్తించుచునుండు నరుఁడే నారాయణుఁడు ౨౮ స్వయముగా నీఁదనేర్చినవాఁడు రెండవవాని నడుముపట్టుకొని సహాయము బడయవలసిన యవసరముండదు. స్వతంత్రముగ నంతయు శోధింపవలెను. ౨౯ పదార్థమాత్రమును శోధించువానికి సందేహముండదు. దీనికిఁబిమ్మట (నిస్సందేహావస్థయందు) నాతఁ డెట్లుండునో యాతఁడెఱుంగును. ౩౦

ఆఱవ సమాసము.

ఆత్మయొక్క గుణములు.

ఈ పృథ్వీమండలముపై నొకొక్కక్కతావున మిగులజలము, నొక్కొక్కతావున పేరునకైన నీటిగుర్తులులేని మిగులవిశాలములగు నిసుకమైదానములు గలవు. ౧ ఈదృశ్యమంతయు నిటులె వ్యాపించియున్నది. దీనియం దొకచోట చేతనశక్తి వెలుంగుచున్నది. ఒకానొకచో దాని యభావము గాన్పించుచున్నది. ౨ నాలుగుత్పత్తులు, నాలుగువాణులు, ఎనుబదినాలుగులక్షల జీవయోనులు గలవు. శాస్త్రములయందివియన్నియు నీక్రిందివిధముగా నిశ్చయింపఁబడెను. ౩ మనుజులు నాలుగులక్షలు, పశువులు ఇరువదిలక్షలు, క్రిములు పదునొకండులక్షలు, ఖేచరములు పదిలక్షలు, జలచరములు తొమ్మిదిలక్షలు, స్థావరములు ముప్పదిలక్షలు అని శాస్త్రమునందుఁజెప్పఁబడెను. ౪, ౫ ఈవిధముగా నెనుబదినాలుగులక్షల యోనులు గలవు. ఏప్రాణి యేయోనియందలిదో యంతయు యాప్రాణి యెఱుంగును. ఈయోనులలో ననంత దేహములు నిండియున్నవి. వానివాని మేరలు వివరించుట కష్టము. ౬ ప్రాణము లనంతములుగాఁ బుట్టుచున్నవి. గిట్టుచున్నవి. వాని కధిష్ఠానము పృథివి. పృథ్వి లేకున్నచో నవియెట్లు మొలఁగఁగలవు? ౭ ప్రకటన మగుచున్న పంచభూతములలోఁ గొన్ని యాకృతిని ధరించుచున్నవి. కొన్ని యట్లే యున్నవి ౮ చపలత్వమే యంతరాత్మగురుతు. ఇఁక జ్ఞాతృత్వముయొక్క యధిష్ఠానమును సావధానులరై వినుండు. ౯ సుఖదుఃఖముల నెఱుంగువాఁడు జీవుఁడు. అట్లే శివుఁడనిగూడ నెఱుంగుము. మఱియు నంతఃకరణ పంచక మాత్మాంశము ౧౦ స్థూలమునందుఁగల యాకాశగుణము లాత్మాంశములు. సత్త్వరజస్తమోగుణము లాత్మగుణములు. ౧౧ నానావిధచేష్టలు, ధృతి, నవవిధభక్తులు, చతుర్విధముక్తులు, అలిప్తత, సహజస్థితి, ఆత్మగుణములు, ౧౨ ద్రష్ట, సాక్షి, జ్ఞానధనము, సత్త, చైతన్యము, పురాతనము, శ్రవణము, మననము, వివరణములు ఆత్మగుణములు. ౧౩ దృశ్యము, ద్రష్ట, దర్శనము, ధ్యేయము, ధ్యాత, ధ్యానము, జ్ఞేయము, జ్ఞాత, జ్ఞానము ఆత్మాంశములు ౧౪ వేదశాస్త్రపురాణాదులయర్థము, గుప్తముగానడుచు పరమార్థము, సర్వజ్ఞతతోఁగూడిన సామర్థ్యము, బద్ధత, ముముక్షుత్వము, సాధకత్వము, సిద్ధత, శుద్ధవిచారము, బోధప్రబోధములు ఆత్మగుణములు ౧౫-౧౬ జాగ్రత్ స్వప్నసుషుప్తితురీయములు, ప్రకృతిపురుషుల్కు, మూలమాయ, పిండబ్రహ్మాండములు, అష్టకాయములు, పరమాత్మ, పరమేశ్వరి, జగదాత్మ, జగదీశ్వరి, మహేశుఁడు, మహేశ్వరి, ఆత్మగుణములు ౧౭-౧౮ సూక్ష్మనామరూపములన్నియు నాత్మస్వరూపములు. దాని కనంతములగు నామములు, చిహ్నములు గలవు ౧౯ ఆదిశక్తి, శివశక్తి, ముఖ్యశివశక్తి, మూలమాయ, నానాపదార్థముల యుత్పత్తిస్థితులు, పూర్వపక్షము, సిద్ధాంతము, పాడుట, వాయించుట, సంగీతము, నానావిధాద్భుతచర్యలు, జ్ఞానము, అజ్ఞానము, విపరీతజ్ఞానము, అసద్వృత్తి, సద్వృత్తి, జ్ఞప్తి, మాత్రము, అలిప్తత్వము ఆత్మగుణములు ౨౦, ౨౧ పిండము, బ్రహ్మాండము, తత్త్వవివరణము, నానాతత్త్వనిశ్చయము, స్పష్టమగు విచారముగావించుట,

నానాధ్యానములు, అనుసంధానము, నానాస్థితులు, నానాజ్ఞానములు, అనన్యమగు నాత్మనివేదనము, ముప్పదిమూఁడుకోటుల దేవతలు, ఎనుబదివేల ఋషీశ్వరులు, అనంతవిధప్రాణులు, మున్నగునవన్నియు నాత్మగుణములు ౨౩, ౨౪ మూఁడుకోటుల యేబదిలక్షల భూతములు, ఏఁబదియాఱుకోటుల చాముండీ దేవతలు, తొమ్మిదికోటుల కాత్యాయనులు, చంద్రుఁడు, సూర్యుఁడు, తారామండలము, నానానక్షత్రములు, గ్రహమండలి, శేషుఁడు, కూర్మము, మేఘమండలము ఆత్మగుణములు ౨౫, ౨౬ దేవతలు, దానవులు, మానవులు, నానావిధజీవులు, భావాభావము, మున్నగునవి యెల్ల నాత్మగుణములు. ౨౭ ఈవిధముగా నాత్మకు నానాగుణములు గలవు. బ్రహ్మము నిర్వికారము, నిర్గుణమునై యున్నది. ఏకదేశీయమగుటయు, బూర్ణజ్ఞానము కలుగుటయుఁగూడ నాత్మగుణములు ౨౯ ఆత్మారాముని యుపాసనమువలన నిరంజనపరబ్రహ్మ లభించును. మఱియు మనుజుఁడు నిస్సందేహి యగును. సంశయ ముండదు. ౩౦

ఏడవ సమాసము.

ఆత్మవివేకము.

సమాధాన మనిర్వాచ్యముగనున్నను దానిని వివరింపవలెను. వివరించుటవలన సమాధానము లేచిపోవనేరదు ౧ కొంతవిడుచుటగాని కొంతగ్రహించుటగాని తటస్థింపదు. విచారమాత్రముననే యంతయు విశదమగును. ౨ ముఖ్యుఁడగు కాశీవిశ్వేశ్వరుఁడు, సేతుబంధనరామేశ్వరుఁడు, మల్లికార్జునుఁడు, భీమశంకరుఁడు, మున్నగు వేల్పులందఱును నాత్మగుణములు. ౩ ముఖ్యములగు ద్వాదశలింగములవలె నింక నెన్ని యోలింగములు గలవు. ఇవియన్నియు నాత్మగుణములు. వీనియనుభవమును జగత్తెఱుంగును ౪ భూమండలమునం దనంతములగు శక్తులుగలవు. సాక్షాత్కారములు, చమత్కారము లనేకములు జరుగుచుండును. మఱియు వివిధములగు సామర్థ్యయుత దేవతామూర్తులెన్నియోగలవు. ఇవియన్నియునాత్మగుణములుగ సిద్ధులయు, నానామంత్రములయు, యంత్రములయు, లతలయు, తీర్థములయు, క్షేత్రములయు, నింకయేల? భూమండలమునందలి నానావస్తువులయు సామర్థ్యము లాత్మగుణములు ౬, ఉత్తమగుణములన్నియు నాత్మలక్షణములు. మంచిచెడుగులన్నియు నాత్మయోగమువలననే జరుగుచున్నవి ౭ శుద్ధాత్మ యుత్తమగుణిగను శబలాత్మ (ఉపాధియుక్తమైనది) అవలక్షిణిగను నుండును. ఈవిధముగా మంచిచెడుగులకు సంబంధించిన కృత్యములన్నియు నాత్మవే ౮ నానావిధములగు నభిమానముల నుంచుకొనుటయు, నానావిధములగు ప్రతిసృష్టులఁ గావించుటయు, నానావిధములుగ శాపోపశాపములొసంగుకొనుటయునాత్మయోగముననే జరుగుచున్నది ౧౦ పిండమును జక్కఁగ శోధింపవలెను. తత్త్వముల పిండములనుగూడ బాగుగా శోధింపవలెను. తత్త్వములను శోధించినచో బిండమునకు సంబంధించిన విషయమంతయు విశదమగును ౧౧ జడదేహము భూతములది. దానిలోని చంచలగుణ మాత్మది. నిశ్చలబ్రహ్మము లేనితా వెంమను నెచ్చటను లేదు ౧౨ పిండమునందు నిశ్చల చంచల జడము (బ్రహ్మము, ఆత్మ, భూతము) లను నిర్ణయింపవలెను. అనుభవరహితముగాఁ జెప్పునది దృఢముగాదు ౧౩ పిండమునుండి యాత్మ తొలంగిపోవఁగనే యీనిర్ణయములన్నియు ముగియును. చూచుచుండఁగనే యీజడదేహము పతనమగును ౧౪ ఇట్లే జడమంతయుఁ బతనమగును. మఱియుఁ జంచలమంతయు ధ్యానములోని కేతెంచును ౧౫ ఇదిగాక ఆనిశ్చలము జగత్తునందంతటను వ్యాప్తమైయున్నదనియు, దానిలో గుణము, వికారము మున్నగునవెవ్వియు లేవనియు, స్పష్టముగా దెలిసియే యున్నది ౧౬ పిండమెట్లో బ్రహ్మాండ మట్లేయనియు జడచంచలములు వెళ్ళినపోయినపిదప శ్రేష్ఠమగు నాపరబ్రహ్మము శేషించియుండుననియు స్పష్టమేగదా ౧౭ మహాభూతములతో విగ్రహము ను నిర్మించి దానిలో నాత్మనుంచి ప్రాణిగ నొనరింపఁబడుచున్నది. ఇట్లే సృష్టివర్తనముగూడ నడుచుచున్నది ౧౮ వాస్తవమున నాత్మయు, మాయయుఁ గలిసి వికారము గావించుచున్నవి. కాని యీవికారమును బ్రహ్మముపై నారోపింతురు. ఈవిషయమునం దనుభవము వివరణము గావించువాఁడే శ్రేష్ఠుఁడు ౧౯ బ్రహ్మ మఖండవ్యాపకముగలది. బ్రహ్మమునకుఁదక్క నితర పదార్థముల కఖండవ్యాపకత్వము లేదు. పరిశోధించినచో నంతయుఁ దెలియును ౨౦ ఆకాశము ఖండఖండములు జేయఁజాలము. మహాప్రళ

యమునందున్నైతము ఆకాశమునందలి యొకభాగమేని నాశనముగాదు ౨౧ ఏది సంహారమొందుచున్నదో దానినే వాస్తవమునకు నాశవంతమని యెఱుంగవలెను. ఈసమస్యను జ్ఞాతలగు పురుషులే సాధింపఁగలరు ౨౨ ఎఱుకలేమిచే నన్నియు గహనసమస్యలుగఁ గాన్పించును. కావున నేకాంతమునందు నిశ్చయపూర్వకముగా యోచింపవలెను ౨౩ అనుభవనీయులగు సత్పురుషులతో సమాగమముగలుగుట యేకాంతముకంటెను ప్రశస్తమైనది. సాధకుఁడు సుచిత్తుఁడై సత్పురుషులతోఁగలిసి నానావిధ చర్చలొనర్పవలెను ౨౪ విచారమొనర్పనిచో నేదియు బోధగాదు. తెలిసినపిదప సందేహ ముండదు. వివేచనమొనరించినపిదప మాయాజాలమించుకేని యుండదు. ౨౫ ఆకాశమును మేఘము లావరించుకొని త్వరలో తొలగిపోవునట్లు ఆత్మయోగమువలన నుత్పన్నమగు దృశ్యముగూడ వివేకమువలనఁ దత్క్షణమే నశించును ౨౬ ఆదినుండి యంతముదనుక నన్నింటిని వివేకియగుపురుషుఁడు వివేకముతో వివరణముగావించును. ఇందువలన నాతనినిశ్చయ మచలముగ నుండును ౨౭ ఇతరులనిశ్చయము సందేహయుక్తముగ నుండును. అనుమానముతోఁ జెప్పుటవలన నేమి లభించును? కానియనుభవనీయులగు జ్ఞాతలాయనుమానము నంగీకరింపరు. ౨౮ ఎట్లో చెప్పుట యనుమానముతోఁగూడినది. అనుమానయుక్తమగు విషయ మెందులకుఁ బనికివచ్చును? బ్రహ్మనిరూపణమునందు నిశ్చయరహితమగు విచార ముపకరింపదు. ౨౯ నిశ్చయరహితమగు విచారము అవిచారము. దానిని ఏకంకారమందురు. ఏకంకారమును భ్రష్టాకారము గావింపఁదగదు. ౩౦ కృత్రిమములు వదలవలెను. శుద్ధమగుదానినే గైకొనవలెను. అట్లే యెఱిఁగి యెఱిఁగి సారాసారనిర్ణయ మొనరింపవలెను ౩౧.

ఎనిమిదవ సమాసము

శరీరరూపక్షేత్రము.

బ్రహ్మముయొక్క సంసారరూపమగు వృక్షము పెరుగుచున్నది. పెరిగిపెరిగి విస్తీర్ణ మగుచున్నది, మఱియు ఫలములు కలిగినపిమ్మటఁ బెక్కుప్రాణులు విశ్రాంతి నొందుచున్నవి. ౧ రమణీయములగు పూవులు

బూయుచున్నవి. నానాపదార్థములందును దీయదన ముదయించుచున్నది. ఆతీయదనమును జవిజూచుటకై నానాశరీరములు నిర్మింపఁబడుచున్నవి. ౨ ఉత్తమవిషయము లెన్నియో నిర్మింపఁబడుచున్నవి. కాని శరీరము లేనిచో భోగింప నవకాశమే లేదు. కావుననే నానాశరీరములు నిర్మింపఁబడెను. ౩ భిన్నభిన్నగుణములుగల జ్ఞానేంద్రియములు నిర్మింపఁబడెను. అవియన్నియు నొకశరీరమునందున్నను వేఱువేఱుగానున్నవి ౪ శ్రోత్రేంద్రియమువలన శబ్దజ్ఞానము నెఱుంగ నవకాశము గలదు. ౫ త్వగింద్రియమువలన శీతోష్ణములు గ్రహింప నవకాశము గలదు. చక్షురింద్రియమువలన సమస్తమును గనిపించును. ఈవిధముగా నింద్రియములకు భిన్నభిన్నములగు గుణములు గలవు ౬ నాలుకయందు రసమును జవిగొనుగుణము, ఘ్రాణమునందు గంధమును గైకొనుగుణము నిర్మింపఁబడెను. ఈవిధముగా నింద్రియములలో భిన్నభిన్నగుణములు గలవు ౭ ప్రాణపంచకమునం దంతఃకరణపంచకముగలిసి దేహమునం దంతటను నిశ్శంకముగాఁ దిరుగుచున్నవి మఱియు జ్ఞానేంద్రియ కర్మేంద్రియముల నానందముతోఁ జూచుచున్నవి ౮ కర్మేంద్రియములవలన జీవుఁడు విషయముల నుపభోగించును. లోకమునం దీయుపాయము నీశ్వరుఁడే నిర్మించెను. ౯ విషయములు చక్కఁగనే నిర్మింపఁబడెను. కాని యవి శరీరము లేనిచో నెట్లు భోగింపఁగలవు? కావుననే యెన్నియో శరీరములు సృజింపఁబడెను ౧౦ శరీరము లస్థిమాంసమయములు. కాని దానియందలి గుణములుమాత్ర మనేకవిధములుగ నున్నవి. ఈశరీరమునకు సమానమగు యంత్ర మింకొకటిలేదు. ౧౧ చిన్నపెద్ద శరీరము లుత్పన్నమై విషయభోగములచేఁ బోషింపఁబడుచున్నవి. ౧౨ జగదీశ్వరుఁడు అస్థిమాంసమయములుగా శరీరములను సృజించి వానిలో వివేకమును, విచారమును నెలకొల్పెను ౧౩ ఈయస్థిమాంసపుబొమ్మలు జ్ఞానమువలన సకలకళలందును ప్రవీణము లగుచున్నవి. కాని శరీరభేదములుగూడ ననేకములుగలవు ౧౪ కార్యకారణముల కొఱకై యీ భేదము శరీరములయందుఁ గావింపఁబడెను. ఈ భేదమునందు పెక్కుగుణములు గలవు. అవియన్నియుఁ దీక్ష్ణబుద్ధిలేనిచో నెట్లు తెలియఁగలవు? ౧౫ అంతయు నీశ్వరుడనే చేయవలసియున్నది. ఇందువలననే భేదము నిర్మింపఁబడెను.

ఊర్ధ్వముఖమగుటతోడనే (పరబ్రహ్మమువైపు లక్ష్యముంచఁగనే) భేదముండదు ౧౬ సృష్టిరచనమునం దవశ్యముగా భేదముగలుగును. కాని సంహారమువలన సహజముగనే యభేదమగును. భేదాభేద సంవాదము మాయాకారణము ౧౭ మాయయం దంతరాత్మగలదు. దాని మహిమ తెలియదు. చతుర్ముఖములుగల బ్రహ్మయైనను సందేహములోఁ బడఁగలఁడు. ౧౮ అంతరాత్మను వివరణము గావించుతఱి గడియగడియకును మనస్సునకు మిగులఁ దొందరగలుగును. మఱియు యుక్తిప్రయుక్తులను దీక్ష్ణతర్కమును జేయఁగఁ జేయఁగ మనస్సు విభ్రాంతమగును. ౧౯ ఆత్మత్వమునంతయు సంబంధించును. కాని నిరంజనమునం దివియేమియు నంటవు. ఏకాంతకాలమునం దిదియంతయుఁ దెలిసికొని చూచినచో యుక్తముగనుండును ౨౦ దేహసామర్థ్యానుసారముగా జగదీశ్వరుఁ డంతయుఁ జేయుచుండును. సామర్థ్య మధికముగానున్న దేహమును అవతారమని యందురు ౨౧ శేషకూర్మవరాహాదులగు గొప్పగొప్ప యవతారపురుషులైన దేహధారులు దాటిపోయిరి. ఇదేవిధముగా సృష్టిరచనము జరుగుచుండును ౨౨ ఈశ్వరుఁడు తన విచిత్రరూపముతో సూర్యమండలమును బరుగెత్తించుచున్నాఁడు. మఱియు మేఘములచే జలమును ధారణము జేయించుచున్నాఁడు ౨౩ పర్వతములవలెఁ బెద్దవగు మేఘములు బయలుదేరి సూర్యమండలమును గప్పివేయుచున్నవి. కాని తత్క్షణముననే యచట వాయువుదయించి విజృంభించుచున్నది ౨౪ కాలమను అధికారియొక్క భృత్యునివలె గాలి వీచివీచి యామేఘమునుదొలగించి సూర్యుని ప్రకటనము గావించుచున్నది ౨౫ పిడుగువలనఁగలుగు భయానకధ్వని విని ప్రాణులు భయపడుదురు. మేఘము లురుమఁగనే యాకాశము పగిలిపడునట్లు తోఁచును ౨౬ ఒకమర్మముకొఱకు వేఱొకమర్మము నిర్మింపఁబడెను. ఎటులన? మహాద్భూతములవలననే మహాద్భూతములు లయమగుచున్నవి. సృష్టిరచనమంతయు సమభాగములుగా నడుచుచున్నది ౨౭ ఈవిధముగా నాత్మకనంత భేదములు గలవు. అన్నింటి నెవ్వఁడెఱుంగును? వివరణము చేయఁగాఁ జేయఁగ మనస్సునకు శక్తిసామర్థ్యము లిగిరిపోవును. ౧౮ నా యుపాసన మిట్టిది. ఉపాసకులు దీనిని మనస్సులోనికిఁ దేవలెను. ఉపాసనమహిమ

చతురాననునకుఁగూడఁ దెలియదు. ౨౯ ఆవాహన విసర్జనములే భజన లక్షణములు. సజ్జను లన్నింటిని నెఱుంగుదురు. నే నేమిచెప్పుదును? ౩౦.

తొమ్మిదవ సమాసము.
సూక్ష్మ నిరూపణము.

మృత్తికా పూజన మొనరించి వెంటనే విసర్జించుట స్వాభావికముగఁ జూచినచో యుక్తముగఁ గనిపింపదు. ౧ దేవతలను బూజించుటయుఁ దరువాతఁ బారవేయుటయు మనస్సునకుఁ బ్రశస్తముగాఁ దోఁచదు. ఈవిషయము నంతఃకరణమున బాగుగా యోచింపవలెను. ౨ దేవుఁ డొకనిచే నిర్మింపఁబడువాఁడు కాఁడు. పారవేయఁ దగినవాఁడు గూడఁ గాఁడు. కావున నీవిషయములోఁ గొంత యోచింపవలసియున్నది. ౩ దేవుఁడు నానాదేహములుధరించి మఱల విసిచివేయుచున్నాఁడు. ఈతఁ డెట్టిదేవుఁడో వివేకముతో నెఱుంగవలెను. ౪ నానాసాధనములు, నిరూపణములు, ఆదేవుని శోధించుటకే యేర్పడియున్నవి. అంతయుఁ దనయంతఃకరణమువలననే తెలిసికొనవలెను. ౫ బ్రహ్మజ్ఞానము తెలిసికొనుటవలననే లభించును. దాని నెవ్వరు నొసంగఁజాలరు. "ఇదిగో తీసికొమ్ము. పొమ్ము" అని చెప్పుట కదియొక పదార్థమా? ౬ నాకు దేవునితోఁ బ్రత్యక్ష సమావేశము కలుగవలయునని జనులందఱును దలంచుచుందురు. కాని (యిందులకుఁ దగిన) వివేకయుక్తమగు నుపాయము వేఱుగనున్నది. ౭ విచారము గావించి చూచినచో తూఁగని వానిని (గ్రహింపరానివానిని) దేవుఁడని చెప్పఁజాలము. కాని జనులొప్పుకొనరు. ఏమిచేయవలెను? ౮ మహాపురుషులు గతించిన పిమ్మట వారి మూర్తులను నిర్మించి జనులు సాదరముగా దర్శింతురు. ఇదియే యుపాసనస్థితి. ౯ గొప్పగొప్ప వ్యాపారములను విడిచి యెవరేని క్షుద్రవ్యాపారము లొనరించినచో రాజ్యసంపద యెట్లు ప్రాప్తించును? ౧౦ కావున మూఢభక్తిలోఁ బడియుండుట అజ్ఞానలక్షణము. అజ్ఞానమువలన దేవాధిదేవుఁ డెట్లులభించును? ౧౧ అజ్ఞానమునకు జ్ఞానము రుచింపదు. మఱియు జ్ఞాత కనుమానము రుచింపదు. కావున సిద్ధులలక్షణములను గ్రహింపవలెను. ౧౨ మాయనువిడిచి యాదిపురుషునివైపున కరుగవలెను.

అప్పుడే సమాధానము లభించును. ఇట్లొనరింపనిచో నిటునటు భ్రమింపవలసివచ్చును. ౧౩ మాయను దాటుటకొఱ కీశ్వరుఁ డనేకములగు నుపాయములను నిర్మించెను. ప్రతీతిపూర్వకమగు నధ్యాత్మశ్రవణమార్గమువలననే పరమాత్మను బ్రాప్తింపఁగల్గుదురు. ౧౪ ఇట్లు గావింపనిచో లోకమునందంతటను మఱుపు కలుగును. సత్యాసత్యదశను గుర్తింపవలెను. ౧౫ అసత్యమార్గమునఁ బోవఁదగదు. అనృతవాదులతోఁ జెలిమి చేయరాదు. తనయందే మాత్రమైనను గృత్రిమ ముంచుకొనరాదు. ౧౬ కృత్రిమ మెన్నఁటికైనఁ గృత్రిమమే. సత్యమందుఁ గృత్రిమము నిలువఁజాలదు. తన యధోముఖ మానసమును (మాయవైపున కరుగు హృదయమును) ఊర్ధ్వముగ నొనరింపవలెను. ౧౭ అధ్యాత్మశ్రవణము గావించుచుండవలెను. ఇట్లు చేయుచున్నచో నంతయు లభించును. నానావిధజాలములు తెగిపోవును. ౧౮ చిక్కులుపడిన దారమును సరిగఁదీయునట్లు మనస్సును సరిపఱచి యనుకూలము గావింపవలెను. మఱియు మెల్లమెల్లఁగా మూలపురుషుఁడగు పరబ్రహ్మము ప్రక్కకు మనస్సును సంధింపఁజేయవలెను ౧౯ ఈసృష్టియంతయుఁ గర్దమరూపము. ఆకర్దమము నానాప్రకారములగు శరీరములయందు విభాజితమై యున్నది ౨౦ చూడవలసినదానినెల్ల నీశరీరమునందే చూడవలెను. ఇదియేమి? ఇదియెట్టిది? అనుదాని నిందే శోధింపవలెను. మఱియు మూలమాయ యొక్క పదునాలుగునామములను దీనియందే తెలిసికొనవలెను. ౨౧ నిర్గుణ నిర్వికార మొకటియే యన్నితావులందును వ్యాపకమైయున్నది. ఆ నిష్కళంక మీదేహమునందున్నదో లేదో చూడవలెను. ౨౨ సంకల్పరూపమగు మూలమాయ యంతఃకరణస్వరూపము. జడమునకుఁ జేతనము నొసంగెడి చైతన్యరూపముగూడ శరీరమునం దున్నది. ౨౩ సమానగుణములుగలుగుట (ఈశరీరముయొక్క) గుణసామ్యము. మఱియు సూక్ష్మవిచారము అగమ్యము. సూక్ష్మము నెఱుంగు సాధుపురుషు లందఱకును బ్రణామములు ౨౪ వామాంగము, దక్షిణాంగము అనునవి శరీరమునందలి రెండుభాగములు. దీనినే పిండమునందలి యర్ధనారీనటేశ్వరునిగ నెఱుంగవలెను. ౨౫ ప్రకృతిపురుషులు, శివభక్తులు, షడ్గుణైశ్వర్యసంపన్నుఁడగు భగవంతుఁడుగూడ నదియే ౨౬ దానినే మహత్తత్త్వ మందురు. త్రిగుణ

ముల గూఢత్వము దానియందే గలదు. అర్ధమాత్రయు, శుద్ధసత్వమును గుణక్షోభిణియు నదియే! ౨౭ త్రిగుణమువలన శరీరము ప్రవర్తించుట ప్రత్యక్షవిషయమేగదా! సరియే చాలును. మూలమాయాశరీరముగూడ నిట్టిదియే! కర్దమరూపమని యెఱుంగవలెను. ౨౮ మనస్సు, మాయ, జీవుఁడు, శరీరమునందు స్వాభావికముగనే యున్నది. ఈవిధముగాఁ బదు నాలుగునామములయభిప్రాయమును బిండమునందు గ్రహింపవలెను. ౨౯ పిండము పతనమైనంతన యంతయు విడలిపోవును. కాని పరబ్రహ్మము మాత్రము శేషించియుండును. దానినే శాశ్వతమని తెలిసికొని గ్రహింపవలెను. ౩౦

పదియవ సమాసము

పూర్ణబ్రహ్మనిరూపణము.

పరబ్రహ్మమును బట్టుకొనఁజాలము. పారవేయఁజాలము. అదియన్నితావులందును బూర్ణముగ నున్నది ౧ ఎటుజూచిన నది యటు నిలిచియున్నది. దానికి మనము విముఖులము కాఁదలంచినను నదిమాత్రము సమ్ముఖముననే యుండును. మీ రేమైనఁ జేయుఁడు. అదిసమ్ముఖముగుట తొలంగిపోఁజాలదు. ౨ కూర్చున్నమనుజుఁ డొకవేళ లేచిపోయినను అక్కడఁగూడ నాకాశముండును. మీ రేదిక్కునైనఁ జూడుఁడు. నిరంతర మాకాశము సమ్ముఖముగనే యుండును ౩ మనుజుఁ డెక్కడికిఁ బారిపోయినను నాకాశము వానికి నలుదిక్కుల నమరియే యుండును. ఎంతబలము ప్రయోగించినను మీ రాకాశమును దాటిపోఁజాలరు. ౪ మీ రెచటనైనఁ జూడుఁడు. ఆకాశమెదురుగనే యుండును. రెండుజాములవేళ సూర్యునివలె నాకాశము మస్తకముపైననే యుండును ౫ కాని సూర్యుఁ డేకదేశీయము. పరబ్రహ్మమున కాదృష్టాంత మన్వయింపదు. ఇచట వినోదార్థ మాదృష్టాంతము నిచ్చితిని ౬ అనేకతీర్థములు, నానావిధదేశములు జూడవలయునన్న మిగులఁ గష్టపడి పోవలెను. కాని పరబ్రహ్మముకొఱ కంతకష్టపడి పోవఁబనిలేదు. అది మన మెచ్చటగూర్చుండియుంటిమో యచ్చటనే సిద్ధముగా నున్నది. ౭ మీ రొక్కతావుననే కూర్చుండియుండుడు లేదా పరుగెత్తుచుఁ దిరుగుఁడు. కాని వాస్తవమునకుఁ బరబ్ర

హ్మము మీవెంటనే యున్నది. ౮ ఆకాశమునం దెగురుచున్న పక్షి కెటుజూచిన నటు ఆకాశమే గాన్పించును. ఇదేవిధముగా మీరును బర బ్రహ్మమునం దున్నారు. ౯ పరబ్రహ్మము పూర్ణముగను సఘనముగను నిండియున్నది. అది యంత్యమునకుఁగూడ నంత్యము. నిరంతర మది యందఱియొద్దను నమరియున్నది. ౧౦ దృశ్యమునకు లోపలను వెలుప లను బరబ్రహ్మము వ్యాప్తమై యున్నది. అది బ్రహ్మాండముయొక్క యు దరమున నిండియున్నది. ఓరీ! ఆవిమలమును దేనితో నుపమింపనగును? ౧౧ వైకుంఠమునందును, కైలాసమునందును, రుద్రలోకమునందును స్వర్గలోకమునందును, బదునాలుగు లోకములందును, మఱియుఁ బాతాళ లోకమునందును నది నిండియున్నది. ౧౨ కాశిమొదలు రామేశ్వరము వఱకు నది భరతఖండమునందంతటను నపారముగ నిండియున్నది. దీని కిటుప్రక్కను దానికటుప్రక్కను నింక నేతావున నైనను బరంపరగఁ జూడుము. కాని పరబ్రహ్మమునకుఁ బారావారము (అంతు) లేదు. ౧౩ ఏక దేశమగు నాపరబ్రహ్మ మొక్కమాఱుగా నంతటిని వ్యాప్తిగావించుకొ నెను. మఱియు నది యన్నింటిని నన్నిస్థలములందును స్పృశించుచున్నది. ౧౪ పరబ్రహ్మము వానకుఁ దడియదు. బురదలోఁ గూరుకొనిపోదు. ప్రవాహాతిరమునసున్నను నందుఁ గొట్టుకొనిపోదు ౧౫ ముందువెనుకలను, కుడియెడమలను, క్రిందమీఁదను నది సమానరూపముతో నన్నింటియం దును వ్యాప్తమైయున్నది ౧౬ ఆకాశము జలాశయమున నిండియున్నది. అది యెప్పుడును దరుగదు. నలుదిక్కుల నది యపారముగా వ్యాపించి యున్నది. ౧౭ కాని యాకాశ మొకదేశీయమును శూన్యాకారమును నైయున్నది. ఆపరబ్రహ్మమునందన్ననో దృశ్యభాసము లేనేలేదు. అది నిరాభాసము ౧౮ సత్పురుషులు, సాధువులు, మహానుభావులుఁ, దేవతలు, దానవులు, మానవులు మున్నగువారలరందఱికిని బ్రహ్మ మొక్కటియే విశ్రాంతిస్థలము ౧౯ దానియంత్యమేమైపునఁ గను గొననగును? దేనికిఁ బారావారము (అంత్యము) లేదో దానిమర్యాద యెట్లు నిశ్చితము గావింపనగును? ౨౦ పరబ్రహ్మము స్థూలముకాదు. సూక్ష్మముగాదు. దేనితోనేని సమానమైనదియుఁ గాదు. జ్ఞానదృష్టికిఁ దప్ప (దానివిషయమున) సమాధానమే లేదు. ౨౧ పిండబ్రహ్మాండము

లు నిరసనమైనపిదప నిరాభాసబ్రహ్మ మొక్కటియే గాదు. ఇక్కడి నుండి యక్కడిదనుక అవకాశమే యవకాశముగ వ్యాపించియున్నది. ౨౨ బ్రహ్మము వ్యాపకమైయున్నస్థితి సత్యమే! కాని యీవిషయములు (మాటలు) దృశ్య మున్నంతమట్టునకే యుండును. దృశ్యమే లేకపోయి నచో (వ్యాప్యము=దృశ్యము లేనిది) వ్యాపకమని యెట్లు నుడువఁగలము? ౨౩ కావున బ్రహ్మమునందు శబ్ద మంటఁజాలదు. కల్పన కచ్చటికిదనుక నడకయే లేదు. ఆకల్పనాతీతమగు నిరంజన పరబ్రహ్మమును వివేకముతో గుర్తెఱుంగవలెను ౨౪.

శుద్ధము, సారము నగుదానిని శ్రవణము గావించుటవలనను, శుద్ధ ము ప్రత్యయాత్మికము నగుదానిని మననముగావించుటవలనను విజ్ఞాన ప్రాప్తియైనంతన స్వాభావికముగనే మనస్సు లయమగును. (ఉన్మనీదశ కలుగును) ౨౫ (ఇప్పటికి) సాధనఫలము లభించెను. సంసారము (ప్రపం చము) సఫలమయ్యెను. నిశ్చలము, నిర్గుణము నగు బ్రహ్మము అంతఃకర ణమునం దావరించెను ౨౬ మాయయొక్క లెక్కలపుస్తకము ముగిసి నది. పంచభూతము లనిర్వాకములైనవి. సాధ్యము సిద్ధించినది. కావున నిఁక సాధనము (సి[illegible]) లేదు. ౨౭ స్వప్నములం[illegible] గాంచినదెల్ల జాగ్ర దవస్థలో న[illegible]రిపోయినది. కావున స్వా[illegible]భావికము గనే యని[illegible] చ్యదశయే తెం[illegible] [illegible]క జెప్పవలసి న యవసరము [illegible]. ౨౮ దీనిసంతను వి[illegible] [illegible]నెఱుంగవలెను. ఆస్థితి ననుభవము [illegible]ంపవలెను. చాలున దీనితో జన్మమృత్యు చక్రము నశించితీరును ౨౯.

భక్తాభిమానియగు దాశరథి నాయం దనుగ్రహము చూపినాఁడు. ఆసమర్థుని కృపావచనములే యీదాసబోధయం దున్నవి ౩౦ ఇఱువది దశకములుగానున్న యీదాసబోధను శ్రవణమననములు గావించువానికి పరమార్థము ప్రాప్తించును. ౩౧ ఇందలి యిరువదిదశకములను (రెండు వందలసమాసములను) సాధకులు చక్కఁగ నధ్యయనము గావింప వలెను. మాటిమాటికి మననముగావించినచో దీనియందలి విశేషత్వము విశదమగును ౩౨ గ్రంథమును బ్రశంసచేయుట సహజము. కాని యట్లు ప్రశంసించుటవలనఁ బ్రయోజనము లేదు. ఈగ్రంథమునసున్నది యను

భవవిషయము. కావున అనుభవమునే గావించుకొనవలెను ౩౩ దేహము పంచభూతములది. దీనిలో కర్త యాత్మ. ఈస్థితిలో గ్రంథరచనము మనుజుని కెట్లులగును ? ౩౪ కావున నెప్పుడంతయు జగదీశ్వరుఁడే (కర్తయై) చేయుచున్నాఁడో యప్పుడు మఱల గ్రంథరచనము మనుష్యకృతమని చెప్పుటమిథ్య. ౩౫ సంపూర్ణదేహమునందలి యొక్కొక్క తత్త్వమును వేఱుగావింపుఁడు. ఏమియును శేషించియుండదు. ఆస్థితిలో మఱల నేపదార్థమును "మనది" యని యందము ? ౩౬ ఇవియన్నియు వివేకకార్యములు. కావున నీవిధముగనే భవయందుఁ దగులొకని యుండఁదగదు. జగదీశ్వరుఁడే సమస్తమును రచించెను ౩౭.

స మా ప్తి.

శ్రీ రామదాసార్పణమస్తు.

1 వ పుటలో ముఖ్యదైవమనుకావున ముఖ్యభక్తులనియు,

13 వ పుటలో జమయగుననుటను జయమగుననియు,

90 వ పుటలో భక్తికలవాఁడనుటను భక్తికల్గనివాఁడనియు

సవరించుకొనవలెను.

కాకతీయ గ్రంథమాల

ప్రధానస్థలము వరంగల్. నైజాం. బ్రాంచి నందిగామ (కృష్ణా). ఆంధ్రదేశమున సమగ్రమగు భాషాసేవజేసి జనసామాన్యమునకు విజ్ఞానము కలుగఁజేయ నుద్దేశించి యీ గ్రంథమాలను నెలకొల్పితిమి. ఇందు మోత్తమములగు గ్రంథములు సకాలమున సులభక్రయమునకుఁ బాఠకుల కందించెదము. మొదటి సంవత్సరము మూఁడు గ్రంథములను వెలువరించితిమి. 1. ఆంధ్రమంత్రులు. 2 విక్రమోర్వశీయము (ప్రబంధము) 3 వసుంధర (నవల).

మొదటి సంవత్సరపుఁ బ్రచురణములు మూఁడును ప్రవేశపురుసుముతోఁ గలిసి మాచందాదారులకు రు 3 లు. రెండవసంవత్సరపుఁ బ్రచురణ గ్రంథమగు దాసబోధ చందాదారులకు రు 4-0-0. ఇతరులకు రు 5-0-0 లు.

చందాదారులకు 100 పేజిలు 0-8-0 చొ॥ ఒసంగుదుము. రాజపోషకులచందా సం॥ రు 25-0-0. పోషకులు రు 12-0-0, సహాయుల చందా రు 6-0-0 లు మాత్రమే. ఈమూఁడుతరగతులవారిపేరులు మా గ్రంథములలోఁ బ్రచురింతుము.

గ్రంథమాల విషయమై ఉత్తరప్రత్యుత్తరములు సంపాదకులగు శేషాద్రి రమణకవులు, నందిగామ, కృష్ణాజిల్లా అను చిరునామకు జరుపగోరెదము.

ముందు సంవత్సరము వెలువడనున్న గ్రంథములు.

1. బర్మాదేశచరిత్రము. లాలా లజపతిరాయి గ్రంథమునకు ఆంధ్రానువాదము.
2. ఆంధ్రసామ్రాజ్యము. ఒరంగల్లురాజులచరిత్ర.ము
3. ప్రణయిని. అద్భుతకల్పనములు గల ఖండకావ్యము.

అనుబంధము

రుద్రదేవుని హనుమకొండ శాసనము.

కాకతీయ గ్రంథమాలా పోషకవర్గము.

రాజపోషకులు

1. రాజా శ్రీనాయని వేంకటరంగారావు బహద్దరువారు
మునగాల సంస్థానము, కృష్ణాజిల్లా.
2. కొలిపాక శ్రీరామరావుగారు, హైకోర్టువకీలు, హనుమకొండ.
3. శ్రీరాజా రాఘవరాజు వెంకటరామకృష్ణంరాజుగారు
నూగూరు ష్టేటుజమీందారు.
4. మాదిరాజు రామకోటీశ్వరరావుగారు, హైకోర్టువకీలు, హనుమకొండ.
5. జములాపురము గోపాలరావుగారు, హైకోర్టువకీలు హనుమకొండ.
6. కాళ్లూరి రాజేశ్వరరావుగారు, జమీందారు, అమ్మపాలెము.
7. వరదారెడ్డి దేశముఖుగారు, తల్లంపాడు.
8. మహమ్మద్ ఆజంగోరీగారు, దేశముఖు, క్రొత్తపల్లి, పరకాలపోష్టు.
9. సి. వేంకటరావుగారు, సర్ దేశాయి సిరిసిల్లా.
10. గంగవల్లి వేంకటమాధవరావుగారు, జమీందారు, కందుకూరు.
11. మాదిరాజు వేంకటేశ్వరరావుపంతులుగారు,
వెంకటాపురం, వేంసూరుపోష్టు.

పోషకులు

1. అక్కినేపల్లి జానకిరామరావుగారు (యావత్కాలపోషకులు)
జమీందారు, కొండగడప.
2. అమరము శివలింగయ్యగారు, సికింద్రాబాదు.
3. గుండవరం జగన్నాథరావుగారు, నరసింగాపురము.
4 డాక్టరు వెలిదిండ్ల రామమోహన్‌రావుగారు హనుమకొండ.
5 డాక్టరు శివలెంక రామలింగయ్యగారు. ,,
6 కొండపల్లి గోపాలరావుగారు, వకీలు, ,,
7 పింగలి వెంకటరంగారావుగారు, హైకోర్టువకీలు ,,
8 మెట్ట లక్ష్మీనరసయ్యగారు, హైకోర్టువకీలు, హైద్రాబాదు.
9 కఠారి రామచంద్రరావుగారు, రామవరము.
10 అన్నమనేని నరసింగారావుగారు, కనుపర్తి.

11 తక్కెళ్ళపల్లి ధర్మదొక్కారావుగారు, అక్కన్నపేట.
12 చిదిరేల రాజశేఖరముగారు, వరంగల్లు.
13 కొండపల్లి లక్ష్మీనరసింహారావుగారు, వకీలు, మధిర.
14 దేవులపల్లి వేంకటాచలపతిరావుగారు, వరంగల్లు.
15 తూము వరదరాజులు, వకీలు, వరంగల్లు.

అభిమానులు.

1 తూము రంగయ్యగారు, వకీలు, వరంగల్లు.
2 మల్లెలజీడికంటి రామారావుగారు, రాయపర్తి.
3 ఐనవోలు సత్యనారాయణరావుగారు, ఐనవోలు.
4 కొండపల్లి సీతారాంరావు, వకీలు, హనుమకొండ.
5 తాడికొండ తిమ్మారెడ్డి దేశాయిగారు, తాడికొండ.
6 రాజా వేంకటేశ్వరరావు, బహద్దరువారు, దోమకొండష్టేటు.
7 వద్దిరాజు లక్ష్మీనరసింహారావుగారు, అలంకానిపేట.
8 నెల్లుట్ల నరసింహారావుగారు, కూనూరు.
9 కాశీకంటి నారాయణరావుగారు, ముత్తెంపేట.
10 ముత్తినేని బుచ్చయ్యగారు, కేశవాపురము.
11 తన్నీరు వెంకటరామారావుగారు, పోతుగల్లు.
12 కలకొండ బుచ్చిరామారావుగారు, ఎల్లమద్ది.
13 నెల్లుట్ల కేశవరావుగారు, పెదపెండేల.
14 వద్దిరాజు సీతారామచంద్రరావుగారు, ఇనుగుర్తి.
15 నెల్లుట్ల తిరుమలరావుగారు, కూనూరు.
16 టి. చక్రపాణిగారు, వకీలు, వరంగల్లు.
17 పింగిలి వెంకటజోగారెడ్డిగారు, ధర్మవరము.
18 అయితా రామనాథముగారు, వరంగల్లు.
19 ముసిపట్ల పట్టాభిరామరావుగారు, తిరుమలగిరి.
20 వనం రాఘవరావుగారు, రాయపర్తి.
21 వనం నరసింహారావుగారు, గువ్వలగూడెము.
22 కోగంటి నారాయణరావుగారు, ముత్తెంపేట.

శేషాద్రిరమణకవుల గ్రంథములు.

ఆంధ్ర మంత్రులు. వెల రు 0-12-0

విఖ్యాత కీర్తిసంపన్నులును, మహాత్ములును, ఉదారశీలురునగు తిక్కనసోమయాజి, బసవేశ్వరుఁడు, శీలము బ్రహ్మనాయకుఁడు మున్నగు వీరాధివీరులు మంత్రులుగనుండి ఆంధ్రదేశమునకుఁ గావించిన మహోపకారము, చూపిన అద్భుతపరాక్రమము మనోహరముగఁ జరిత్రానుకూలముగ వర్ణించు అద్భుత గ్రంథరాజము. మృదుమధుర పద్యములు పెక్కులుగలవు. ప్రత్యాంధ్రుఁడు జదివి ఆనందింపఁదగిన యుత్తమ గ్రంథము.

---

2 వసుంధర (నవల) రు 1-0-0

ఓరుగల్లురాజ్యమేలిన రుద్రదేవుఁడు వసుంధరను బెండ్లాడిన చరిత్రాత్మికకథ. ఆకాలపుఁబరిస్థితులు, శైవులత్యాగము, జైనుల శాంతవ్రతము, ఆంధ్రవీరుల పరాక్రమజీవితము, ఆంధ్రసాధ్వుల పవిత్రాచరణము ఇందుఁ గనుఁగట్టును. ఇందలి భావగీతములు రసవత్తరములు. ఆంధ్రుల విక్రమముఁదెలుపు నవలలలో నిది అగ్రగణ్యము. మృదుమధురశైలి.

---

3 విక్రమోర్వశీయము ప్రబంధము రు 0-12-0

కాళిదాసమహాకవి వ్రాసిన సంస్కృతనాటకము ననుసరించి వ్రాయఁబడిన యైదాశ్వాసముల కావ్యము. ప్రతిపద్యము రసాస్పదము. మనోహరమగు శృంగారరసము. ప్రకృతివర్ణనలు చవులూరుచుండును. నూతన భావములు. రసవత్తరమగు శైలి. విపులమగు గ్రంథవిమర్శము గలదు. ఆధునికవాఙ్మయమున నిది మిగుల గణనీయమగు గ్రంథము.

---

4 పాపారాయనిర్యాణము (బొబ్బిలినాటకం) రు 1-0-0

ఇందలి ప్రతిపద్యము దేశభక్తి, మాతృదేశాభిమానము పురికొల్పును. కథాకల్పన మపూర్వము. ప్రదర్శనము కన్నివిధముల దగియున్నది. కథాంశము సత్యమగు చరిత్రము. వెలమవీరులత్యాగము, పాశ్చాత్యుల దుస్తంత్రములు, రాజభక్తుల పరాక్రమము ఆంధ్రసాధ్వుల విక్రమము ఈనాటకమున సమగ్రముగ వర్ణింపఁబడెను. ఆంధ్రదేశమునందలి రంగస్థలములన్నింటిలో నిందలి పద్యములు పఠనీయములుగ నున్నవి. విషాదాంతము.

---

5 నిజామురాష్ట్ర ప్రశంస వెల రు 0-8-0

నిజామురాష్ట్రములోని ఆంధ్రనగరములు శిల్పములు కవులు వీరచరిత్రములు దృశ్యములు ప్రకృతి వర్ణనములను వర్ణించు నూఱుపద్యములు. కొన్ని భావగీతములుగల చిత్రగ్రంథము. ఆంధ్రుల హృదయము నుఱ్ఱూత లూపు పద్యరత్నములు. అనుబంధము ఆంధ్రనగరముల ప్రశస్తిచరిత్రానుకూలముగఁ దెలుపు విషయ వివరణము గలదు. నిజాము రాష్ట్రమునందలి ఆంధ్రదేశచరిత్ర నెఱుంగువారలకు ఆంధ్రవ్యక్తిత్వము పై నభిమానము గలవారలకు నిది అవశ్య పఠనీయము.

---

6 భక్తవత్సలశతకము వెల రు 0-2-0

భగవంతుల సృష్టి నైపుణ్యము, ప్రకృతి సౌందర్యము వర్ణించు మృదు మధుర పద్యశతకము. అన్నిమతములవారి కనుకూలించును. ఆంధ్రదేశము నందంతటను బఠనీయముగ నాదరింపబడుచున్న యీశతకము ప్రత్యాంధ్రుఁడు చదివి తీరవలెను.

---

7 అర్జునపరాభవము (నాటకము) రు 0-12-0

మహారాష్ట్రవాఙ్మయమునఁగల చిత్రకథ ననుసరించి వ్రాయబడిన మనోహరమగు నాటకము. పాండవులగర్వ విజృంభణము, శ్రీకృష్ణుని కార్యకౌశలము, రాక్షసుల మాయానటన చాతుర్యము, భారతసంగ్రామానంతరమున ఆర్యావర్తస్థితి. ఇంక ననేక చిత్రకథాకల్పనములుగల నాటకము 60 ప్రతులె కలవు.

---

8 కాకతీయ సామ్రాజ్యము వెల రు 0-3-0

ఒరంగల్లు రాజ్యము పాలించిన కాకతీయరాజుల పరాక్రమము మహమ్మదీయులదండయాత్రలు. ఓరుగల్లునగర ప్రాచీనవైభవము. ఆంధ్ర సామ్రాజ్యపతనము దెలుపు అద్భుతచరిత్రము. హృదయము కఱగించు ఉద్రేకకరమగుశైలి. రెండవకూర్పు 60 ప్రతులుమాత్రమె కలవు.

---

9 ఆంధ్రవీరులు మొదటిభాగము 0-8-0

రెండవభాగము 0-10-0

ఆంధ్రులలో వీరాధివీరులగు రాజులు,కవులు,మంత్రులు, భటులు మున్నగు వీరవతంసుల చరిత్రము లిందుఁగలవు. ఆంధ్రులచరిత్ర మీగ్రంథములవలన సంపూర్ణముగఁ దెలియును. నవలలకు నాటకములకు నుపకరించు కథలిందెన్నియోగలవు. ఆంధ్రు లీగ్రంథమును బఠించినచోఁ దాముత్తమోత్తమమగు వీరజాతిలో జనించినవారమని సగర్వముగఁ దలంపనగు నీరెండుభాగములు నిరంతర పఠనీయములు.

---

10 ఆంధ్రపదనిధానము 1-8-0

తూము రామదాసకవి ప్రణీతము. అమరమునుబోలిన తెనుఁగు నిఘంటువు. నేటివఱకు గ్రంథములైన తెనుఁగుపదములన్నియు నిండు సమకూర్పఁబడెను. 600 పుటలగ్రంథము. ప్రతిపద్యమునకు అర్థముగల

దు. అన్నివిధములనిది ఆంధ్రనామ సంగ్రహమును బోలి దానికి నాలుగు రెట్లుండును. శుద్ధాంధ్రపదము లాంధ్రదేశమువ వాడుకలోఁగల వన్నియు నిందుగ్రంథస్థములయ్యెఁగాన భాషాస్వరూప మెఱుంగువారలకీగ్రంథ మత్యంతోపయోగకరము. నిఘంటువులలో నిట్టి సమగ్రగ్రంథ మింత దనుక ఆంధ్రమున ప్రకటింపఁబడలేదు. రెండుమూడు మాసములలో వెలువడఁగలదు.

---

11 దాసబోధ వెల రు 5-0-0

అత్యద్భుతమగు వేదాంతగ్రంథము. రాజకీయ రహస్యములు, నీతులు, సమయోచితధర్మములు, మానవుఁడు కడతేరువిధము మున్నగు నపూర్వాంశములు రెండువందలు చర్చింపఁబడినవి. ఈ గ్రంథరాజము శివాజిచక్రవర్తి గురువగు సమర్థ రామదాసస్వామి మహారాష్ట్రమున రచించినదాని కాంధ్రీకరణము. వేదాంతరహస్యములకు రాజకీయములకు నెలవగు నీ గ్రంథరాజము ఇంతవఱ కెన్నిభాషలలోనో యనువదింపఁబడినది. ముద్రణముకాకముందె వందలకొలఁదిప్రతులకు అర్డరులు వచ్చినవి. దాదాపు 900 పుటలు. చిత్రపటములు. కాలికోబైండుగల గ్రంథము. మధురతరమగు వచనము గాన అందఱకు బాగుగా బోధయగును. ప్రత్యాంధ్రుఁడు చదువఁదగిన గ్రంథరాజము.

ముద్రణమునందున్న గ్రంథములు

సర్వలోకేశ్వరశతకము. నీతిగీతావళి. ప్రస్తావనశ్లోక రత్నావళి. ఋతుసంహారము. ప్రణయిని. ఆంధ్రబ్రహ్మవైవర్తపురాణము మున్నగునవి.

చిరునామా:—

శేషాద్రిరమణకవులు, శతావధానులు,

నందిగామ, కృష్ణాజిల్లా.

ప్రకటనము.

చరిత్రాంశములు, శాసనముల వృత్తాంతములు, ప్రాచీనకవుల గ్రంథములనుగూర్చిన విషయములు, గ్రంథపరిష్కరణము, గ్రంథముద్రణమునుగూర్చి విషయములు ఎఱుంగఁదలఁచువారికి ఉపయుక్తమగు ప్రత్యుత్తరములొసంగుదుము. నిజామురాష్ట్రీయులగు ఆంధ్రులకు వలయు పుస్తకములు సకాలమున కందింపఁగలము. బ్రిటిషుప్రాంతములలో నుండు ఆంధ్రులకు నిజామురాష్ట్రమునఁగల గ్రంథములు వలయుచోఁ బ్రయత్నించి పంపఁగలము. ఈవిషయములు, ఇంకను నితరవాఙ్మయవిషయముల నెఱుంగఁగోరువారలు ఇట్లు వ్రాయనగును.

సంపాదకులు:—

కాకతీయగ్రంథమాల.

సందిగామ, కృష్ణాజిల్లా.

END OF
TITLE